శ్రీవేదవ్యాస విరచితం

శివ మహాపురాణం

తృతీయ భాగం

(తెలుగు అనువాదం)

అనువాదకులు

డా॥ బేతవోలు రామబ్రహ్మం

సంపాదకులు

డా॥ ఆకెళ్ల విభీషణ శర్మ

ఎమ్.ఎ.(సంస్కృతం), ఎమ్.ఎ.(తెలుగు), పిహెచ్.డి.,

ప్రత్యేకాధికారి

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2024

SIVAMAHAPURANAM
THIRD PART
(with Telugu Translation)

Translated by:
Dr. Bethavolu Ramabrahmam

Editor:
Dr. Akella Vibheeshana Sharma
M.A.(Sanskrit) M.A.(Telugu) Ph.D.,
Special Officer, Purana Itihasa Project
T.T.Devasthanams, Tirupati.

T.T.D. Religious Publications Series No.1489

© All Rights Reserved

First Print : 2024

Copies: 500

Published by:
J.Shyamala Rao, **I.A.S.**,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Cover Design & D.T.P. Type Setting:
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

Printed at:
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతిఅమ్మవారు

శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు
పురాణ ఇతిహాస ప్రాజెక్టు
పండితపరిషత్తు - సలహామండలి

అధ్యక్షులు

శ్రీ జె.శ్యామల రావు గారు ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

సభ్యులు

శ్రీమతి ఎం.గౌతమి గారు ఐ.ఏ.ఎస్.,
సంయుక్త కార్యనిర్వహణాధికారి,
తి.తి.దే., తిరుపతి.

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం – తిరుపతి.

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ,
హైదరాబాద్.

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

సంచాలకులు

డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ
ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

పరిష్కరణ పరిషత్తు

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ సూరం శ్రీనివాసులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు,
శ్రీ గోరంట్లవెంకన్న ఓరియంటల్ కళాశాల,
తిమ్మసముద్రం.

డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారు
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్,
నిడదవోలు.

డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు.

శ్రీ గార్లపాటి ప్రభాకరశర్మగారు
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల,
హిందూ ధర్మప్రచార పరిషత్, తి.తి.దే., తిరుపతి.

ఆచార్య డి.వి.జి.ఎ.సోమయాజులుగారు
విశ్రాంత సహప్రాచార్యుడు (తెలుగు)
ఎ.యమ్.ఎ.యల్.కళాశాల, అనకాపల్లి.

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ, హైదరాబాద్.

డా॥ ధూళిపాళ మహాదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

ఆచార్య ఆర్.వెంకటరామకృష్ణశాస్త్రిగారు
విశ్రాంత ఆచార్యులు (సంస్కృతం&తెలుగు),
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

డా॥ కె.లక్ష్మీనారాయణగారు
విశ్రాంత రీడర్(సంస్కృతం),
వేదసంస్కృత కళాశాల, నెల్లూరు.

ఆచార్య జానమద్ది రామకృష్ణగారు
విశ్రాంత వ్యాకరణాచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ కడిమిళ్ళ వరప్రసాద్‌గారు
విశ్రాంత ఆంధ్రోపాధ్యాయుడు,
టేలర్ హైస్కూల్, నరసాపురం.

డా॥ సి.హెచ్.రమాదేవిగారు
విశ్రాంత కళాశాల అధ్యక్షురాలు (FAC),
యస్.వి.జె.వి.సంస్కృత కళాశాల, కొవ్వూరు.

డా॥ ఓరుగంటి సీతగారు
విశ్రాంత సహప్రాచార్యురాలు,
ఎ.వి.ఎన్.కళాశాల, విశాఖపట్నం.

సంచాలకులు

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

విషయానుక్రమణిక

విషయం	పుటసంఖ్య
ముందుమాట	1
నివేదన	3
పురాణపురుషుడు శ్రీమన్నారాయణుడు	12
పురాణాల పురాణం	13
శివమహాపురాణం – రుద్రసంహిత చతుర్థకుమారఖండం	
1. శివవిహారవర్ణనం	1
2. శివపుత్రజనన వర్ణనం	12
3. కార్తికేయ లీలావర్ణనం	23
4. కార్తికేయాన్వేషణ నందిసంవాదవర్ణనం	30
5. కుమారాభిషేకం వర్ణనం	42
6. కుమారాద్భుతచరిత వర్ణనం	52
7. యుద్ధప్రారంభవర్ణనం	58
8. దేవదైత్యసామాన్య యుద్ధవర్ణనం	64
9. తారకవాక్యం ఇంద్రవిష్ణువీరభద్రయుద్ధ వర్ణనం	71
10. తారకాసురవధ దేవోత్సవ వర్ణనం	79
11. బాణప్రలంబవధ కుమారవిజయవర్ణనం	86
12. స్వామికార్తికచరిత్రతో కూడిన శివాశివచరిత వర్ణనం	91
13. గణేశోత్పత్తి వర్ణనం	99
14. గణవివాదవర్ణనం	105
15. గణేశ యుద్ధవర్ణనం	115
16. గణేశయుద్ధ గణేశశిరచ్ఛేద వర్ణనం	125
17. గణేశజీవన వర్ణనం	130
18. గణేశగణాధిప పదవీ వర్ణనం	138

19. గణేశవివాహూపక్రమం 148
20. గణేశవివాహ వర్ణనం 156

శివమహాపురాణం – రుద్రసంహిత యుద్ధఖండం

1. త్రిపురవర్ణనం 162
2. దేవస్తుతి 173
3. త్రిపుర వధోపాఖ్యానం – భూత త్రిపుర ధర్మవర్ణనం 181
4. సనత్కుమార పారాశర్య సంవాదంలో త్రిపురదీక్షా విధానం 189
5. త్రిపురమోహనం 198
6. శివస్తుతి వర్ణనం 206
7. దేవస్తుతి వర్ణనం 214
8. రథాదియుద్ధ ప్రకారవర్ణనం 221
9. శివయాత్రావర్ణనం 226
10. త్రిపురదాహవర్ణనం 232
11. దేవస్తుతి వర్ణన 238
12. త్రిపురవధానంతరం దేవతాస్తుతి, మయుడు చేసిన స్తుతి, ముండినివేశనం,దేవతల స్వస్థానగమనవర్ణనం 244
13. జలంధరవధోపాఖ్యానంలో శక్రజీవనం 250
14. జలంధరోత్పత్తి వివాహ వర్ణనం 258
15. దేవజలంధరయుద్ధ వర్ణనం 264
16. దేవయుద్ధవర్ణనం 273
17. విష్ణుజలంధరయుద్ధ వర్ణనం 279
18. దేవర్షి (నారద) జలంధర సంవాదం 286
19. దూతసంవాదం 294
20. సామాన్యగణాసురయుద్ధవర్ణనం 302
21. విశేషయుద్ధవర్ణనం 311
22. జలంధరయుద్ధవర్ణనం 318
23. బృందాపాతివ్రత్యభంగమూ దేహత్యాగవర్ణనం 325

24. జలంధరవధ వర్ణనం 332
25. దేవస్తుతి వర్ణనం 340
26. దేవీస్తుతి-విష్ణుమోహవిధ్వంసవర్ణనం 345
27. శంఖచూడోత్పత్తి వర్ణనం 354
28. శంఖచూడిడి తపస్సు, వివాహం వర్ణన 359
29. శంఖచూడరాజ్యపాలనా వర్ణన, అతడి పూర్వజన్మచరిత్ర వర్ణన 365
30. దేవదేవ స్తుతి 373
31. శివోపదేశం 378
32. దూతగమనం 385
33. మహాదేవయుద్ధయాత్రా వర్ణనం 390
34. శంఖచూడయుద్ధయాత్రావర్ణనం 396
35. శివదూతసంవాదం 400
36. పరస్పరయుద్ధవర్ణనం 407
37. ససైన్యశంఖచూడయుద్ధవర్ణనం 412
38. కాళీయుద్ధవర్ణనం 418
39. శంఖచూడసైన్యవధ వర్ణనం 423
40. శంఖచూడ వధోపాఖ్యానం 429
41. తులసీశాపవర్ణనం 434
42. హిరణ్యాక్ష్యవధ 442
43. హిరణ్యకశిపువధవర్ణనం 450
44. దూతసంవాదం 456
45. దూతసంవాదవర్ణనం 467
46. అంధకయుద్ధవర్ణనం 475
47. శుక్రనిగీర్ణన వర్ణనం 484
48. శుక్రనిగీర్ణనం 492
49. అంధక గణజీవితప్రాప్తి వర్ణనం 499
50. మృతసంజీవనీ విద్యాప్రాప్తివర్ణనం 506

51. ఉషాచరిత్రవర్ణనం, శివశివా వివాహవర్ణనం 513
52. ఉషాచరిత్ర వర్ణనం 522
53. అనిరుద్ధ-ఉషా విహార వర్ణనం 531
54. బాణాసుర-రుద్ర-కృష్ణాదియుద్ధ వర్ణనం 538
55. బాణభుజకృంతన గర్వాపహార వర్ణనం 547
56. బాణాసురగణపతిత్వ ప్రాప్తివర్ణనం 553
57. గజాసురవధ 558
58. దుందుభినిర్హ్రాదదైత్యసంహార వర్ణనం 568
59. విదళోత్పలదైత్యవధవర్ణనం 575

అనుబంధం

60. పురాణప్రశస్తి -(అష్టాదశపురాణాలు) 581
61. అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం 595

ముందుమాట

శ్రీశివం జగదాధారం, సర్వవిద్యాప్రదాయినం ।
సంగీతజ్ఞం వేదవిజ్ఞం మహాశంభుముపాస్మహే ॥

సకల మంగళ స్వరూపుడూ, ఈ విశ్వానికంతకీ మూలమైనవాడూ, అన్నిలోకాలకూ సకల విద్యల్నీ ప్రసాదించినవాడూ సంగీతశాస్త్రానికి నిధీ, సర్వవేద, వేదాంత వేద్యుడు అయిన శ్రీమహాదేవుణ్ణి మనం ఉపాసిస్తున్నాం.

ఈ లోకానికి వివేకదీపమైన ఏ విద్య అయినా శ్రీశంకర మహాదేవుని వల్లనే లభించింది. సంగీతశాస్త్రంలో శివభగవానునికి మించిన మహాపండితుడు మరేదేవుడూ లేడు. ఈ పురాణ వాఙ్మయం కూడా ఆ స్వామి వల్లనే ఈ విశ్వానికి లభించింది అందుకే పరమశివుడయ్యాడు.

"పురాణం పంచమం శీర్షమ్." అని జగత్ప్రసిద్ధి. పూర్వం చతుర్ముఖ బ్రహ్మ ఐదు శీర్షాలుండేవి. శివపార్వతుల వివాహసమయంలో ఒక శీర్షం పార్వతీ సౌందర్యానికి వివశం అయ్యింది. వెంటనే శివుడు ఆ తలను తొలగింపవలసివచ్చింది. దాన్ని చివరికి భూమిపై విడిచిపెట్టాడు. నాలుగువేదాలూ, పురాణసముచ్చయమూ బ్రహ్మకు ఐదు తలలుగా ఉండగా భూలోకవాసుల కోసం ఆ ఐదవ శీర్షం శివునిచే అందింపబడింది. అంటే వేద విజ్ఞానం అంతా మరింతసులభంగా అందించే శీర్షం కనుక 'పురాణం పంచమం శీర్షమ్' అన్నది ప్రసిద్ధమైంది.

ఆ పురాణాలు మహాపురాణాలు 18గా ప్రసిద్ధి పొందాయి. అందులో వాయుప్రోక్తమైన శివపురాణం ఒకటి. దీన్ని వాయుపురాణంగానే అష్టాదశ పురాణాల్లో గణించినా **"వాయుర్వైశివః"** అని పెద్దల వచనం ప్రకారం ఇది శివపురాణమే. అందులో రుద్రసంహిత విశేషించి కుమారఖండం చాలా విశిష్టమైనది.

శివమహాపురాణాన్ని సాక్షాత్తు సదాశివుడే సంహితలుగా వర్గీకరించాడని పౌరాణికుల విశ్వాసం. ఏడేడు లోకాల్లో అధ్యయనం చేసే పురాణమని, చదివినా, చదివించినా శాశ్వత కైలాసప్రాప్తి కలుగుతుందని ఆస్తికుల విశ్వాసం. సద్యోజాతాదిమూర్తులతో విరాజిల్లే శివకథామృతం పరమపవిత్రమైనది, పాపలవిత్రమైనది.

త్రిమూర్తుల్లో శివపరమాత్మే ప్రధానపురుషునిగా చిత్రించింది ఈ శివపురాణం. అందుకే మిగిలిన శ్రీహరిబ్రహ్మాదులు ఆయాచోటులలో వర్ణింపబడినా శివపరమాత్మనే అందరూ శరణువేడి, తమతమ దుఃఖావస్థలు

దాటగలిగినట్లుగా ఈ పురాణంలో పెక్కువృత్తాంతాలు కనబడతాయి. సప్త సంహితలతో కూడిన శివపురాణం పరమ పవిత్రమైనది. వేదసారమైనది. పరమాత్మతత్త్వము, మహత్త్వమును చక్కగా వివరిస్తున్నది. అనంతమైన ఈశ్వర విభూతి, పావనమైన పార్వతీశివుల లీలాచరిత్ర చక్కగా వివరించింది. లింగ మహిమను, బిల్వమహిమను, దీపదానమహిమను, శివభక్తుల గొప్పదనాన్ని విస్తారముగా విశ్లేషించింది.

మానవుడు ఎలాజీవించాలో, ఏది ప్రగతిమార్గమో ఏది ధర్మాచరణమో! సమాజంకోసం మనుష్యులు ఎలా ఉండాలో ప్రజలు ఏవిధమైన పనులు చేస్తే సంతోషయుక్తులవుతారో! ఏఏ కృత్యాలతో దుఃఖాల్లోకూరుకుపోతారో! మొదలైన లోక శ్రేయో మార్గాలను ఉపదేశిస్తోంది ఈ పురాణం. ఈశ్వరపూజ తెలిసి చేసినా, తెలియక చేసినా మహాఫలితాలను అనుగ్రహిస్తుందని ఈ పురాణం ప్రబోధిస్తోంది.

ఈ భాగాన్ని అనువదించిన వారు ప్రసిద్ధ పండితులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి ధన్యవాదములు తెలియజేస్తున్నాను. ఈ అనువాద రచనను, పరిశీలించిన ఉద్దండపండితుల పరిష్కరణ కూడా వెలలేనిది. అష్టాదశ పురాణాల అనువాదాలను శరవేగంతో సాగేలా కృషిచేస్తున్న పురాణఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ కృషిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఈ పురాణం సరళంగా శ్రీశ్రీనివాసస్వామి వారి అనుగ్రహంతో ప్రచురింపబడి ప్రకాశితం అవుతోంది. ఇందుకు సహకరించిన వారందరికీ సంపూర్ణంగా శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం సిద్ధించాలని కోరుకుంటున్నాను. అష్టాదశపురాణాల పరిష్కరణ స్వామి వారి పరిపూర్ణకృపతో మరింత వేగంగా కొనసాగాలని, సంపూర్ణంకావాలని ఆకాంక్షిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో....

జె.శ్యామలరావు ఐ.ఏ.ఎస్
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

నివేదన

సదసద్వివేకాన్ని ప్రసాదించే సకల విద్యాస్వరూపిణి సరస్వతీదేవి అంటే సకలవాఙ్మయస్వరూపమే. ఇది నిర్గుణ తేజస్సు. ఇందులో వేదోపనిషత్తులు అమ్మవారి హృదయస్థానీయాలు. ధర్మశాస్త్రాలు సుధాభరితమైన మేధ. శాస్త్రాలు అమ్మవారి నయనాలు. పురాణాలు వాగ్దేవి నాసికాశ్వాసలు. కావ్యాలు అమ్మవారి తిలకం. కవులూ, పండితులూ సరస్వతికి నాలుకలే. రసనాగ్రం ద్వారానే వాఙ్మయం ధ్వనిప్రసరణ పొందుతోంది. ఇక సంగీత శాస్త్రమంటారా! అమ్మవారి నఖశిఖ పర్యంతమైన దేహం. ఇలా అమ్మవారి అంగాల స్థానాల్లో వాఙ్మయవర్గాన్ని నిక్షేపం చేసుకొంటే పురాణాలది నాసికాస్థానం అవుతోంది. ఏ అవయవం పనితీరు ఎలా ఉన్నా ఆలస్యంగా జరిగినా పరవాలేదు. కానీ శ్వాసప్రక్రియ సకాలంలో జరక్కపోతే జీవనమే అసాధ్యం. కనుక విశ్వశ్రేయస్సుకి చైతన్య సౌరభాన్ని అందించేవే పురాణాలు. అట్టి మహాపురాణాలు 18 అయితే, అందులో పెక్కు సంహితల విభాగాలతో కూడిన ఈ శివపురాణం (వాయు) ఒకటి. మంగళ స్వరూపుడైన పరమశివుని విశ్వశ్రేయోదాయకమైన కారక మహాకృత్యాన్ని ప్రధానంగా వర్ణించేదే ఈ శివమహాపురాణం.

వైష్ణవం దక్షిణోబాహుః వాయుర్వామో మహేశితుః ।

విష్ణుపురాణం స్వామికి కుడిభుజం అయితే వాయు(శివ) పురాణం పరమాత్మ ఎడమ భుజంగా కీర్తిపొందింది. యజ్ఞోపవీతానికీ, పార్వతీదేవికీ స్వామి ఎడమ భాగమే ఆధారాలు. శివపురాణం కూడా పురాణవాఙ్మయంలో ప్రధానస్థానాన్ని వహిస్తోంది. ఏ పురాణమైనా సమాజాభివృద్ధికీ, సర్వజీవనచైతన్యానికీ సందేశ, ఉపదేశాలు అందిస్తాయి. అందులో ఈ శివపురాణం కూడా అనేక ఉపదేశాలకు నిలయం అవుతోంది. పార్వతీదేవి శివతేజస్సు తనలో కాకుండా భూమిపై పడేలాచేసిన దేవతల మాయోపాయానికి కోపగించింది. **అద్యప్రభృతి దేవానాం వంధ్యా భార్యా భవంత్వితి –** అని శపించింది. ఎవరైనా భార్యాభర్తల్ని విడతీసినా, వారి మధ్యలో వైరాన్ని సృష్టించినా, ఎలాంటి అకృత్యాలకు ఫలం సంతానం లేకపోవడం అనేది శిక్ష. **త్రిపురాసురులు** 'ఎన్నెన్నో గొంతెమ్మ కోరికలు కోరారు. ఎలాగో అలా చావు తప్పించుకోవాలనుకొన్నారు. ఎంత తపస్సు చేసినా శాశ్వత జీవనం సాధ్యం కాలేదు. **అసంభావ్యైకకాండేన నగరాణి భినత్తు నః –** అనివారు చావుతెలివితో కోరిక వెలిబుచ్చారు. ఊహకందని బాణంతో, అసాధారణ రథంతో, వెయ్యి సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే సూర్య, చంద్రుల సమకక్ష్యలోకి రావాలి, అప్పుడు శివుడు మాత్రమే, మమ్మల్ని సంహరించాలి. ఒకవేళ ఆ ముహూర్తందాటిపోతే తిరిగి వెయ్యి సంవత్సరాలవరకూ తమకు చావు రాకూడదన్నారు. **'జాతస్య హిధ్రువో మృత్యుః'** అన్న బ్రహ్మవాక్కును "అసత్యం చెయ్యడం ఎవ్వరికీ సాధ్యం కాదు కదా!". ఇలాంటి వృత్తాంతాలు నిరూపిస్తున్నా, ఇంకా మరణంలేని జీవనం పట్ల మానవాళికి ఆశలు చిగిరిస్తూనే ఉంటాయి.

శివపరమాత్మ అనూహ్యంగా భూమిని రథంగా చేసికొని, బ్రహ్మను సారథిగా, విష్ణువును బాణంగా, బంగరు కొండను విల్లుగా, ఇలా ఏమాత్రం ఊహకందని సాధనాలతో త్రిపురాసుర సంహారం చేసాడు.

ఈ వృత్తాంతం ఈ సమాజానికి మంచి ఉపదేశం. మనం పుట్టాం కనుక, చావు తప్పదు. బ్రతికినంతకాలం మంచిగా ఉండడమే సమంజసం, మనవల్ల ఎవ్వరికీ హాని కలుగకుండా ఉండడమే, సరైన జీవనవిధానం సుమా! అన్న ఎరుక వహించాలి. **కుమారగణపతులకు –** శివుడు పెట్టిన పరీక్ష మనకందరికీ జ్ఞానోపదేశం. దేహబలంతో, మయూర వాహనంతో భూప్రదక్షిణం చెయ్యడానికి వెళ్లిన కుమారస్వామి కంటే; బుద్ధిబలంతో తల్లిదండ్రుల్ని భక్తిగా సేవించి, వారికి 7సార్లు ప్రదక్షిణం చేసి ఏమాత్రమూ శ్రమలేకుండా గణాధిపత్యాన్ని పొందిన గణపతి దీక్ష మనకందరికీ ఆదర్శం కావాలని ఈ వృత్తాంతం నిరూపిస్తోంది. ఇలా ఈ పురాణంలో అనేక ఉపదేశాలు; ఆదర్శాలు, సందేశాలు, ముఖ్యంగా యువతకు ఏ కాలం వారికయినా మార్గదర్శకాలు. సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ శివపురాణంలో శివమాహాత్మ్యం, గణపతి ప్రశస్తి, కుమారస్వామి మిశ్రమస్ఫూర్తి, మెరపుల్లా కనిపించే అంశాలు. అంతేకాక కౌటంబిక వాతావరణం ఈ శివపురాణ కథాంశాలలో సుస్పష్టం మాతాపితరుల పట్ల భక్తి. మాతపితరుల ఆజ్ఞాపాలనం ఆర్తత్రాణ పరాయణత్వాది సద్గుణముల వల్ల కలిగే ఫలసిద్ధి మొదలగు అంశాలు ఈ వృత్తాంతాలలో ఉన్నాయి. కనుకనే తెలుగు కవులు ఈ శివపురాణం ఆధారంగా కుమారసంభవం, జలంధరోపాఖ్యామున ఉషాపరిణయాది ప్రబంధలు వ్రాశారు.

నారదమహర్షి తన తండ్రియైన బ్రహ్మను అడుగుతున్నట్లుగా కుమారఖండంలోని విషయారంభం అయ్యింది. దానికి చతుర్ముఖ బ్రహ్మ చెబుతున్న శివవిహారవర్ణనం తరువాత శివపార్వతుల కళ్యాణం అయ్యింది. శివపార్వతులు 1000 సంవత్సరాలు ఏకాంతమందిరంలో శృంగారంలో ఉన్నారు. శివవీర్యం పార్వతిలోకాక క్రిందకు పడేలాచేయాలి. అట్టి వీర్యోత్పన్నుడైన కుమారుడు మాత్రమే తారకసంహారం చేస్తాడని నిర్ణయం. ఆ ఆదిదంపతుల శృంగారం మధ్యలో భంగం చెయ్యాలి. అలాచేస్తే మహాపాపం. అలా ఎవరు చేస్తారో! వారు కష్టాలపాలు కాక తప్పదు వారికి జన్మజన్మలకీ భార్యావియోగం కలుగుతుంది. పూర్వం దుర్వాసుడు ఇంద్రునికీ, ఘృతాచీ చంద్రులకు గౌతముడూ ఇలా చాలామంది శృంగార భంగం చేసి భార్యావియోగాలు పొందారు. కనుక శివపార్వతుల రత్యవస్థను ఎవరు మాత్రం భంగం కలిగిస్తారు? అన్న మీమాంస వచ్చింది. చివరికి అందరూ ఉపాయంగా శ్రీహరిని ముందు పెట్టుకొని పరమేశ్వరుడున్న ప్రాంతానికి వెళ్లి బహుస్తోత్రాలు చేస్తూ తారకాసుర బాధను తలచుకొంటూ పెద్దగా విలపించారు. ఎట్టకేలకు దేవతల ప్రార్థనను శివుడు విని దయ వహించాడు. వారి అంతరంగం విని శృంగారక్రీడ విరమింపగా జారిపడిన శివవీర్యాన్ని అగ్నిహోత్రుడు పావురంగా మారి భక్షించాడు. జరిగిందంతా తెలిసికొన్న పార్వతి మహాకోపంతో "దేవతలారా! మీరంతా నాకు దుఃఖం కలిగించారు కావున

అద్యప్రభృతి దేవానాం వంధ్యా భార్యా భవంత్వితి 20-17శ్లో

"మీకూ దుఃఖాలు వస్తూనే ఉంటాయి." "మీకు మీభార్యల యందు సంతానములేకుండుగాక!" అని శపించింది. అగ్నిని సర్వభక్షకునిగా శపించింది.

శివతేజం భరింపలేక అగ్ని నారదోపాయంతో సప్తర్షుల భార్యలు నదీస్నానానికి వచ్చినప్పుడు వారికి సంక్రమింపజేసాడు. వారుకూడా హిమవత్పర్వత సానువుల్లో ఆ శివవీర్యం విడిచి పెట్టారు. ఆ హిమగిరికూడా భరింపలేక ఆ రేతస్సు గంగలో విడిచాడు. గంగకు కూడా అది దుస్సహమై గట్టుపై ఉన్న రెల్లుపొదలో విడవడం జరిగింది. ఆ శరవణం నుండి కుమారుడు పుట్టాడు. ఆ పుట్టిన కుమారునికి విశ్వామిత్రుడు జాతకర్మ చేసాడు. అలా విశ్వామిత్రుడు కుమారునికి పురోహితుడయ్యాడు. అగ్ని ఆ బాలుణ్ణి తన కుమారునిగా గుర్తించి 'శక్తి'ని ఆయుధం చేసాడు. ఇంద్రుడు తన శత్రువుగా భావించి కుమారునిపై వజ్రాయుధం వేయగా అది బాలుని కుడివైపుతగిలి 'శాఖుడనే' ఒక బలవంతుడు పుట్టాడు. మళ్లీ ఎడమభాగంలో కొట్టగా **విశాఖుడు** పుట్టాడు. తిరిగి హృదయాన్ని కొట్టగా **నైగముడు** పుట్టాడు. చివరికి అజ్ఞానం తొలిగి ఇంద్రుడు కుమారస్వామిని శరణన్నాడు. ఆరుగురు కృత్తికలు వచ్చి కుమారస్వామికి స్తన్యం ఇచ్చి పెంచారు. పార్వతి తన గర్భం భంగం అయినా శివుణ్ణి ప్రసన్నం చేసికొని నామూలంగా మీరు వదిలిన రేతస్సు ఏమైంది? అని వివరాలు అడిగింది. దేవతలంతా ఆలోచించి ఆ రేతస్సును భూమి భరిస్తుందని చెప్పారు. చివరికి భూమి తాను భరింపలేకపోతే అగ్నికిచ్చానంది. అలా అందరూ క్రమంగా చెప్పగా ఇపుడావీర్యోత్పన్నుడైన బాలుణ్ణి కృత్తికలు పెంచుతున్నారని తెలిసింది. శివపార్వతులు సంతోషించి బ్రాహ్మణులకు భూరిదక్షిణలిచ్చి కుమారుణ్ణి కలుసుకోవాలని సిద్ధపడ్డారు. శివాజ్ఞతో నందికేశ్వరుడు కార్తికేయుణ్ణి కలిసి కుమారజన్మవృత్తాంతమంతాచెప్పి నీవు శివపార్వతుల కుమారుడవని స్పష్టపరచాడు. దానికి సంతసించిన గుహుడు నందీశ్వరునితో తల్లిదండ్రుల్ని చేరడానికి బయల్దేరాడు. అలా వెడుతున్న కుమారునికి సకలదేవతా గణమూ నమస్కరించి స్వామివెంటే బయలుదేరారు. అల్లంతదూరాన మేలిమి బంగారుఛాయతో మెరిసిపోతున్న కుమారుణ్ణి చూసి శివపార్వతులు పరమసంతోషంతో పుత్రప్రేమతో ఎదురువచ్చారు. కుమారుడు రథం దిగివచ్చి తల్లిదండ్రుల్ని నమస్కరించాడు. వారు తమ పుత్రుణ్ణి ప్రేమగా కౌగలించుకొని ముద్దాడి ఒడిలో కూర్చోబెట్టుకొన్నారు. గుహుడు శివుని ఒడిలో కూర్చుని శివుని మెడలోని వాసుకితో ఆడుకొంటున్నాడు. శివపార్వతులు పిల్లవాని ఆటలు చూసి తన్మయులైపోతున్నారు. తుదకు కుమారుణ్ణి రత్నసింహాసనంపై కూర్చోబెట్టి సర్వతీర్థాలతో అభిషేకించారు. అందరూ కుమారునికి పలుబహుమతు లందించారు. కుమారునికి బ్రహ్మాండాధిపత్యపదవి ఈయబడింది. కుమారస్వామి లీలలు. విప్రకృత కుమారస్తుతి. యజ్ఞార్థం ఒక మేకను ఇమ్మని విప్రుడు అడగ్గా మేకను బలి ఇవ్వనవసరంలేదు. నీ యజ్ఞం నామాటగా సఫలమైంది. నువ్వు హాయిగా వెళ్లు అని స్వామి విప్రుణ్ణి సంతోషపెట్టాడు. కుమారుడు తారకాసురుణ్ణి చంపనుద్యోగించాడు. దేవసైన్యం అంతా కుమారస్వామి వెన్నంటి వెళ్లింది. తారకాసురుడు మహాసైన్యంతో కుమారునికి ఎదురు వచ్చాడు. యుద్ధం మహాభయంకరంగా సాగింది. తారకాసురధాటికి తట్టుకోలేక విష్ణువుకూడా కలత చెందాడు. బ్రహ్మతోబాటు దేవతలంతా కుమారస్వామిని శరణు వేడారు. తారకుడు శ్రీహరిని గత అవతారాల కృత్యాన్ని నిందించాడు.

అలాగే వీరభద్రుణ్ణీ, తూలనాడాడు. వీరభద్రుడు మహాక్రోధంతో విజృంభించి తారకుణ్ణి చంపడానికి సిద్ధమయ్యాడు అది గమనించి కుమారుడు ఇది తాను చేయవలసిన పని అంటూ వీరభద్రుణ్ణి వారించాడు. కుమారుడు తీవ్రంగా విజృంభించాడు. తారకకుమారుల యుద్ధం లోకభీకరంగా సాగింది. సముద్ర పర్వతసమేతంగా భూమికంపించింది. చివరికి కుమారుడు తన శక్త్యాయుధం ప్రయోగించి తారకుణ్ణి వధించాడు. క్రౌంచపర్వతం కుమారుణ్ణి శరణువేడి బాణాసురునివల్ల కలుగుతున్న బాధలు చెప్పి ఆ దైత్యుణ్ణి సంహరించమని ప్రార్థించింది. వెంటనే స్కందుడు తన తండ్రిని మనసా ధ్యానించి శక్త్యాయుధంతో బాణాసురుణ్ణి ససైన్యంగా నాశనం చేసాడు. అంతేకాదు ఆ ప్రదేశంలో కుమారుడు మూడు శివలింగాల్ని ప్రతిష్ఠించాడు. అలాగే ఆదిశేషుని తనయుడైన కుముదుడు ప్రలంబాసురబాధతో కుమారుణ్ణి శరణువేడగా, శక్త్యాయుధంతో కుమారస్వామి ఆ దైత్యుణ్ణి సంహరించాడు. ఇలా కుమారస్వామి దుష్టరాక్షసుల్ని సంహరించి శిష్టుల్ని ఆదుకొన్నాడు.

అసురసంహారం జరిగినందుకు దేవతలు స్వామిని బహుధా ప్రశంసించారు. వారి స్తుతికి స్వామిమెచ్చి ఆ తపస్సులందరికీ తన తాతగారైన హిమవంతుడు నేటినుండి వెంటనే తపః ఫలాలు అందిస్తాడని వరమిచ్చాడు. పిమ్మట దేవేంద్రాది దేవతలు తన వీరకృత్యాల్ని గానం చేస్తూ ఉండగా సపరివారంగా స్వామి తల్లిదండ్రుల్ని చేరి సేవించాడు. శివునంతటివాడు కుమారుణ్ణి లేవనెత్తి ముద్దాడి ఆలింగనం చేసుకొని తని ఒడిలో కూర్చోబెట్టుకొని దేహమంతా ప్రేమగా నిమిరాడు. ఆ వేళ ఆ ఆదిదంపతుల ఆనందం ప్రపంచానికే ఆనందమై పెద్ద ఉత్సవం చేసారు. దేవతలందఱూ శివవైభవాన్ని స్తుతించారు. మాటిమాటికీ నమస్కరించారు.

తరువాత నారద మహర్షి చతుర్ముఖుణ్ణి గణేశవృత్తాంతం వివరించమనికోరాడు బ్రహ్మ అంగీకరించి

గణేశజన్మ కల్పభేదాలతో పలురకాలు. పూర్వం బ్రహ్మకల్పంలో శనిదృష్టిదోషంతో గణపతి శిరస్సు తెగిమాయమయ్యింది. అయితే శ్వేతవరాహ కల్పంలోని గణపతి కథ వేరుగా ఉందని చెప్పసాగాడు.

జయవిజయలు పార్వతితో అమ్మా! నందీశ్వర, భృంగీశ్వరులు మనసేవకులే అయినా శివునికే వశం అయిఉంటారు. మనమాటకు ప్రాధాన్యం ఇవ్వరు. కనుక మనకు అనుకూలుడైన ఒకరిని సృష్టించు, అని కోరారు. పార్వతికి నిజమేకదా! అనిపించింది. అంతలో ఒకరోజు పార్వతి తమమందిరంలో స్నానం చేస్తుండగా, రాకూడని సమయంలో శివుడు లోపలకు వచ్చేశాడు. దాంతో సిగ్గుపడ్డ పార్వతి తప్పకుండా తన మాటవిని ఎవ్వరినీ లోపలకు రానీయకుండా ఉండేవాణ్ణి సృష్టింప సంకల్పించింది. వెంటనే ఒంటికి పెట్టిన నలుగుపిండితో ఒక పురుషుణ్ణి సృష్టించి సకల శక్తుల్నీ ప్రసాదించింది. దివ్యాభరణాలూ వస్త్రాలతో అలంకరించి ఒక దండాన్నిచ్చి తన ద్వారపాలకునిగా పెట్టి, ఎట్టి పరిస్థితిలోనూ తన ఆజ్ఞలేనిదే ఎవ్వరినీ లోపలకు రానీయవద్దంది. దాంతో గణపతి క్రొత్తగా ఉద్యోగంలో చేరిన ఉత్సాహంతో ద్వారం వద్ద కాపలా కాశాడు. కొంతసేపటికి శివుడు తిరిగి

పార్వతీమందిరానికి వచ్చి చరచరా లోపలకు వెళ్లిపోతుండగా గణపతి అడ్డగించాడు. శివుడు తాను పార్వతీపతినని చెప్పినా వినిపించుకోలేదు. చేసేది లేక శివుడు వాకిలిదగ్గర ఉండిపోయాడు.

శివుని ప్రేరణతో శివగణాలన్నీ గణపతితో యుద్ధం చేసి ఓడిపోయారు. తామంతా శివునిసేవకులమని చెప్పినా గణపతి వినలేదు. తనదండంతో చితకబాది మరీ పంపించాడు. శివుడు వారిని కసిరి తిరిగి మరింత బలంతో శివగణాన్ని పంపాడు. వారు తిరిగి తనతో యుద్ధానికి రావడంతో బాలగణపతి దుఃఖం పొందాడు. ఆ సంరంభం విన్న చెలికత్తెలు పార్వతికి జరుగుతున్న విషయం చెప్పారు. పార్వతి **"జరుగవలసిందేదైనా (భవిష్యతి భవత్యేవ) జరిగేతీరుతుంది".** శివగణాన్ని ఏ పరిస్థితుల్లోనూ లోపలికి రానీయవద్దని తిరిగి గణపతికి కబురంపింది. అమ్మ అటువంటి ఆజ్ఞ ఈయడంతో గణపతి మరింత రెచ్చిపోయాడు. "నేను శివా పుత్రుణ్ణి. మీరు శివసేవకులు. మీరేంచేస్తారో! మీ ప్రభువుకోసం చేయండి. నేను నాతల్లికోసం మిమ్మెల్లెవర్నీ లోపలకు రానీయనని తీవ్రంగా చెప్పాడు. గణపతికీ, శివసైన్యానికీ గొప్పయుద్ధం జరిగింది. శివగణాలు దెబ్బలు తిన్నాయి. నంది, భృంగి తన రెండు కాళ్లు పట్టుకు లాగగా గణపతి ఒక్క దెబ్బతో వారిని పడగొట్టాడు. ఒక పరిఘ తీసుకొని అందర్నీ చితకబాదాడు. అందరూ చెల్లాచెదురైపోయారు. శివాజ్ఞతో బ్రహ్మ ఆ కుర్రవాణ్ణి సముదాయించి శివుణ్ణి లోపలకు పంపించాలని వచ్చాడు. అంతే బాలుడు బ్రహ్మ మీసాలు పట్టుకొని గుంజడంతో బ్రహ్మ క్షమించమంటూ పారిపోయాడు. భూత ప్రేతపిశాచాలుకూడా బాలునిముందు నిలువలేకపోయాయి. పార్వతి కాటుకకొండవంటి మహాశక్తిని పుట్టించి గణపతికి సహాయంగా నిలిపింది. చివరకు శివుడు శ్రీహరిని తోడుచేసుకొని మహాశివసైన్యంతో బాలునిపై యుద్ధానికి వచ్చాడు. శివుడు శ్రీహరితో యుద్ధరచన చేయించాడు. చాలాకాలం యుద్ధంచేసినా గణపతిని గెలవలేకపోయారు. చివరికి తిరిగి విజృంభించి శివుడు త్రిశూలంతో బాలుణ్ణి పొడవడానికి వచ్చాడు. బాలునిదెబ్బతో శూలం క్రిందపడిపోయింది. విష్ణువు బాలుణ్ణి యుద్ధం చేస్తూ తన వైపుకి త్రిప్పుకొన్నాడు. అంతలో శివుడు తన శూలంతో బాలుని శిరస్సు చేధించాడు.

పార్వతి అదివిని చండప్రచండురాలై యుద్ధానికి సిద్ధమై శివసైన్యాన్ని సర్వనాశనం చేయసాగింది. వందల వేల దేవీశక్తులు విజృంభించి మహాసంహారానికి పూనుకొన్నాయి. అందరూ గడగడలాడిపోయారు. చివరికు నారదోపదేశంతో అందరూ శివాభగవతిని స్తుతించి శరణమన్నారు. అమ్మవారు శాంతించి తన కుమారుణ్ణి బ్రతికించమంది. అలా ఉత్తరదిక్కుగా వెళ్లి వెతుకుతూ ఉండగా మొట్టమొదట కనిపించే ప్రాణిశిరస్సును ఖండించి తెచ్చి బాలునికి అతికింపగా స్వామి గజాస్యునిగా అవతరించాడు.

మహేశ్వరి అందరికీ వరాలు ప్రసాదించింది. గణపతికి ఎటూ ఆధిపత్యమూ సర్వగణాధ్యక్షమూ దక్కింది శ్రీహరి, శివుడూ మున్నగు దేవతలందరూ కూడా ఆ మహాగణపతిని సేవించారు. భాద్రపదమాసంలో చతుర్థినాడు అమ్మవారి దేహం నుండి ఉద్భవించాడు కనుక గణపతిని ఆ రోజు అందరూ అర్చించాలని నియమం కూడా చెయ్యబడింది.

పార్వతీ పరమేశ్వరులు ఒకనాడు తమ ఇరువురి పుత్రుల యొక్క వివాహం గురించి ఆలోచించారు. అయితే ముందు ఎవరికి వివాహం చెయ్యాలన్న సందేహం వచ్చి వారిద్దరినీ పిలిచి మీ ఇద్దరిలో ఎవరు ఈ సమస్త భూమండలాన్నీ తిరిగిముందుగా వస్తారో! వారికే ముందుగా వివాహం చేస్తామని చెప్పారు. ఆ పందెంలో గణపతి బుద్ధితో తెలివిగా ఆలోచించి తన తల్లిదండ్రుల్ని ఆరాధించి 7సార్లు ప్రదక్షిణాలు చేసాడు. దాంతో ఆ జగత్పితరుల ప్రదక్షిణాలు భూమికి ప్రదక్షిణాలు చేసినట్లే. ముందు గణపతికే వివాహం చేయసంకల్పించారు. విశ్వరూపుడు అనే ప్రజాపతి తనకుమార్తెలైన సకల శుభలక్షణాలూ కల సిద్ధి, బుద్ధి అను కన్యకాద్వయాన్ని గణపతికిచ్చి వివాహం చేసారు. వారిలో సిద్ధివల్ల క్షేముడూ, బుద్ధివల్ల లాభుడూ అనే ఇద్దరు సంతానం గణపతికి గలిగారు. ఇది శివపురాణంలోని కుమారఖండం.

త్రిపురాసురులు బ్రహ్మ గురించి తపస్సు చేసారు. బ్రహ్మ ప్రత్యక్షం కాగా వారు చావులేని వరం కోరారు. అది కుదరదు అని బ్రహ్మ చెప్పడంతో వారిలో తారకాక్షుడు సువర్ణనగరాన్ని కమలాక్షుడు వెండి పట్టణాన్ని కోరగా విద్యున్మాలి ఇనుప పురం సృష్టించి ఇమ్మన్నాడు. అవి వెయ్యి సంవత్సరాలకు ఒకసారి మాత్రమే కలుస్తాయి. ఆ పట్టణాలు ఎవ్వరికీ కనపడకుండా పుష్కలావర్తకాలనే మేఘాలు ఆ సమయంలో దట్టంగా వర్షిస్తూ ఉండాలి. ఆ సమయంలో పరమశివుడు ఊహకందని రథంలో కూర్చుని, ఊహకందని అనేక ఆయుధసాధనాలతో ఒకే ఒక్క బాణంతో తమను సంహరించాలి. అప్పుడే తమకు మృత్యువు రావాలన్నారు. అలా వరాలు పొంది ఆ త్రిపురాసురులు శివోపాసన చేస్తూ హాయిగా ఉన్నారు.

త్రిపురాసురులు పెట్టే బాధలు భరింపలేక దేవతలు బ్రహ్మ వద్ద వాపోయారు. బ్రహ్మ "మనం శివుణ్ణి శరణువేడుకుందాం" అని చెప్పగా శివస్తుతులు చేసారు. స్వామివిభూతుల్ని స్తోత్రం చేసారు. వారి ప్రార్థనలకు సంతసించిన శంకరుడు ప్రత్యక్షంకాగా త్రిపురాసురులు పెట్టే దుఃఖాలు తీర్చమని వేడుకొన్నారు. శివుడు వారు నా భక్తులు. వారిని నేను వధించి మిత్రద్రోహం చెయ్యలేనన్నాడు. దాంతో వారు శ్రీహరిని ప్రార్థించారు. శ్రీహరి చేసేదిలేక యజ్ఞపతిని తలచుకోగా వెంటనే హరి వద్ద యజ్ఞపతి విజయం చేశాడు. ఆ యజ్ఞపతితో దేవకార్యంకోసం ఆ మూడుపురాల్నీ భస్మం చెయ్యమన్నాడు హరి. వారు అనేక భూతగణాలతో ఆ త్రిపురాల్లో ప్రవేశించిన వెంటనే మిడతల్లా మాడిపోయారు. అపుడు శ్రీహరి 'అరిహన్' అనే అవతారాన్ని సృష్టించి త్రిపురాల్లో ప్రవేశించి "అందరికీ నాస్తికమతం బోధిస్తూ అందర్నీ శివభక్తినుండి తప్పించు" అని ఆజ్ఞాపించాడు. ఆ అరిహన్ కుటిలోపాయంతో అలాచేసి త్రిపురాధిపతికి నాస్తికమతదీక్ష ఇచ్చాడు. దాంతో అందరూ శివభక్తి వీడి భ్రష్టులయ్యారు.

దేవతలందరు శివుణ్ణి చేరి "స్వామీ!" త్రిపురవాసులంతా నీ భక్తిని విడిచిపెట్టేశారు. కనుక వారిని సంహరించు" అని ప్రార్థించారు. అపుడు శివుడంతా తెలిసికొని అలావారిని చేసిన శ్రీహరే ఇప్పుడా రాక్షసుల్ని చంపాలి" అన్నాడు. దాంతో అందరూ దుఃఖితులై ఎంతగానో శివుడి దగ్గర దీనాలాపాలు చేసారు. ఎట్టకేలకు శివుడు ప్రసన్నుడై యుద్ధం కోసం అన్నీ సిద్ధం చెయ్యండన్నాడు.

అలా అద్భుతంగా అన్నీ సిద్ధంచేసుకొన్నా విష్ణుం వచ్చి శివుడు విముఖుడయ్యాడు. అపుడు శ్రీహరి అందరిచేతా అష్టాదశాక్షరీ శివమంత్రంతో శివుణ్ణి ప్రసన్నం చేయించాడు. భూమిని రథంగా, కాంచనపర్వతం విల్లుగా ఇలా ఎవ్వరికీ ఊహింపశక్యంకాని విధంగా సన్నాహాలు చేయగా, శివుడు సిద్ధమై యుద్ధయాత్రకు వెళ్లాడు. త్రిపురాసురులు ఏ విధంగా తమ చావు కోరారో! ఆ విధంగానే శివుడు విష్ణువును' బాణంగా చేసికొని, త్రిపురాల్ని భస్మంచేసాడు. దేవతలంతా శివుణ్ణి బహుధా స్తుతించారు. ఒకసారి ఇంద్రుడు దిగంబరవేషంలో ఉన్న శివుణ్ణి అజ్ఞానంతో చంపడానికి రాగా, శివమహిమతో స్తంభంలా అయిపోయాడు. ఆపై బృహస్పతి ప్రార్థనలతో ఇంద్రుడు స్వస్థుడయ్యాడు.

రాక్షసుడైన జలంధరుడు పుట్టాడు. తన పుట్టుకతో బ్రహ్మ కళ్లనుండి జలం కారేలాచేసాడు, కనుక జలంధరుడనే పేరు రావడం జరిగింది. ఆపై జలంధరునికి బృందంతో వివాహం జలంధరుడు ఇంద్రాదుల్ని మట్టుబెట్టాలన్న ఊహతో దేవతలపై దండెత్తాడు. యుద్ధంలో చనిపోయిన దైత్యుల్ని శుక్రుడు మృతసంజీవినితో బ్రతికిస్తున్నాడు. ఇందుకు కలత చెందిన దేవతలందరూ దీనంగా శ్రీహరిని ప్రార్థించారు. శ్రీహరి దైత్యులతో భీకరంగా యుద్ధం చేయడం జరిగింది.

దేవదానవ యుద్ధం, నారదజలంధర సంవాదం చాలా ఆలోచనాత్మమైనవి. ఒకసారి, జలంధరుడు పార్వతీ సౌందర్యానికి మోహపడ్డాడు. దూతను పంపడం శివుడు కీర్తిముఖునికి వరమివ్వడం దేవదానవుల సైన్యాల అసామాన్యయుద్ధం జరిగింది. శివుడు మహోగ్రంగా ఒకకృత్యను రాక్షసులపై ప్రయోగించాడు. తరువాత దేవదానవుల విశేషమైన యుద్ధం జరిగింది. కుమార, గణేశ, వీరభద్రాదులు కూడా దైత్యులతో యుద్ధం చేశారు. శివజలంధరులయుద్ధం దారుణంగా జరిగింది. శివుని ధాటికి తట్టుకోలేక జలంధరుడు 'గాంధర్వీ' మాయను ప్రయోగించాడు. రుద్రునంతటివాడూ ఆ మాయకు లోబడ్డాడు. జలంధరుడు తన మాయతో రుద్రునిగా గౌరిని సమీపించాడు. గౌరి జలంధరుని మాయ తెలుసుకొని మాయం అయ్యింది. ఏ మాయతో గౌరి పాతివ్రత్యాన్ని భంగం చేయ్యాలనుకొన్నాడో! అదే మాయతో జలంధరపత్ని యొక్క పాతివ్రత్యం హరించాలని శివకేశవులు ఉపాయం సంకల్పించారు. శ్రీహరి మాయతో బృందకు పీడకల వచ్చింది. శ్రీహరిమాయా జలంధరునిగా బృందాశీలాన్ని భంగం చేశాడు. తనభార్యయొక్క పాతివ్రత్య భంగంతో జలంధరుడు శక్తిహీనుడు కాగా, శివుడు మహాయుద్ధంలో జలంధరుణ్ణి వధించి దేవతలతో ప్రశంసలందుకొన్నాడు.

భర్తవియోగంతో కాలిబూడిదయ్యాడు కానీ శ్రీహరి మోహంతో ఆ బూడిదను ఒంటికి పూసుకొన్నాడు. ఆ మోహం తొలగడానికి దేవతలు మాయాదేవిని స్తుతించారు. దానికి సంతసించి వాణీలక్ష్మీపార్వతులు మూడు విత్తనాలు దేవతలకిచ్చి నాటమన్నారు. దేవతలు వెళ్లి బృంద చితిపై నాటారు. వానినుండి 1) పెద్ద ఉసిరి 2) జాజి 3) తులసి అనే మూడు మొక్కలు మొలిచాయి. వానిపట్ల అనురాగం వల్ల శ్రీహరికి మోహం దూరమయ్యింది.

శంఖచూడుడనేవాడు బ్రహ్మను గూర్చి తపస్సుచేసి దేవతలకు అజేయుడు కావాలన్నవరం పొందాడు. పూర్వజన్మలో సుదాముడనే కృష్ణభక్తుడే శంఖచూడుడు. రాధాశాపంతో దానవునిగా పుట్టి తపస్సిద్ధితో వరంపొందాడు. మహోన్నతంగా రాజ్యపాలన. దైవరాజ్యాన్ని అధీనం చేసుకొన్నాడు. పూర్వ జన్మవృత్తాంతం తెలుసుకొన్న దేవతలు ఇతనికి రుద్రుని శూలంతోనే మరణం ఏర్పడుతుందని తెలుసుకొన్నారు. బ్రహ్మావిష్ణువులు శివుణ్ణి శంఖచూడ వధార్థం ప్రార్థించారు. శంకరుడు అభయమిచ్చాడు. ఇంక శంఖచూడుడు మరణించినట్లే అని అందరూ తమతమ స్థానాలకు వెళ్లారు. శంఖచూడుని చక్కని భవనానికి. శివదూతయై పుష్పదంతుడు రాయబారిగా వచ్చాడు. శంఖుడు దేవతలతో సామరస్యంగా ఉండనని ప్రకటించాడు. శంఖచూడ, మహాదేవుల యుద్ధం ఘోరంగా జరిగింది. శంఖచూడుడు శివుని వద్దకు రాయబారం పంపాడు. మహేశ్వరుడు దేవకార్యం కోసం యుద్ధం చేస్తానని చెప్పడంతో దేవదైత్యసేనల యుద్ధం తీవ్రంగా జరిగింది. ఆ చిత్ర, విచిత్రయుద్ధం దేవసైన్యానికి ఆపదలు వచ్చాయి అప్పుడు దేవతల పక్షాన కాళీదేవికూడా యుద్ధానికి వచ్చింది. దైత్యుల్నందర్నీ నోటిలో పడవేసుకొని మ్రింగేయడం ప్రారంభించింది. శంఖచూడుడు దానితో మాయాయుద్ధం ప్రారంభించాడు, యుద్ధంలో కుమార స్వామి మూర్ఛపోయాడు. శివుడు చైతన్యమిచ్చి గుహుణ్ణి రక్షించాడు. దానితో కాళికాదేవి మహాభయంకరయుద్ధం చేసింది. సంపూర్ణంగా దైత్యసైన్యవధ జరిగింది.

ఆకాశవాణి శంఖచూడుని వద్ద విష్ణుకవచమూ, అతని భార్య పాతివ్రత్యమూ ఉన్నంతవరకూ జయించడం సాధ్యంకాదని చెప్పింది వెంటనే శివాజ్ఞతో విష్ణువు వృద్ధబ్రాహ్మణ వేషంలో శంఖచూడుణ్ణి విష్ణుకవచం దానంగా ఇమ్మని అడిగాడు. తరువాత 'హరి' శంఖచూడుని వేషంలో తులసీదేవి పాతివ్రత్యాన్ని హరించాడు. వెంటనే శంకరుడు శంఖచూడుణ్ణి వధించడం సులభమయ్యింది.

తాను మోసపోయినట్లు తెలుసుకొన్న తులసీదేవి కోపంతో శ్రీహరిని పాషాణంగా మారమని శపించింది. పాషాణంగా మారిన హరిశక్తియే సాలగ్రామశిల. శివుడు వచ్చి ఇద్దర్నీ ఊరడించి. తులసిని గండకీనదిగా పుట్టించాడు. సాలగ్రామాలను ధరిస్తావు అని వరమిచ్చాడు. అంతేకాక తులసి చెట్టుగా కూడా పుట్టి ఇంటింటా పూజలందు కొంటావని మరో అనుగ్రహాన్ని కూడా ఇచ్చాడు.

(హిరణ్యకశిపులను శ్రీహరి వధించాడు. కోపంతో) రాక్షసుడైన అంధకుడు శ్రీహరినిచంపాలని తపస్సు చేశాడు. హిరణ్యాక్షునికి చావులేని వరం బ్రహ్మ ఇవ్వనన్నాడు. "ఎవ్వరిచేతా పొందశక్యంకాని సౌందర్యవతిని నేను కామించినప్పుడే చావు రావాలని వరంకోరుకున్నాడు. కొంతకాలం తరువాత అంధకుడు శివుని ధర్మపత్నిని కామించి దూతలను పంపించి, ప్రయత్నాలు ఫలింపక శివునితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. యుద్ధంలో అంధకుణ్ణి

శూలంతో పొడిచినా చావలేదు. మంచుబొట్టంతగా మారి శివస్తుతి చేశాడు. శివుని కరుణ పొందాడు. శుక్రాచార్యులు శివకృపతో చనిపోయిన దైత్యవీరుల్ని బ్రతికించాడు. ఆ వార్త నంది ద్వారా తెలుసుకొన్న శివుడు శుక్రుణ్ణి తీసికుని రమ్మని నోటిలో వేసికొని మ్రింగేశాడు. శుక్రుడిలా 100 సంవత్సరాలు శివుని పొట్టలో ఉండిపోయాడు. మళ్ళీ అంధక మహేశ్వరుల మహాయుద్ధం జరిగింది. అప్పుడు శివుని శుక్రంనుండి వెలువడినవాడు కనుక దైత్యగురువుకు శుక్రుడని పేరు వచ్చింది. అంధకుడు శివుని శూలానికి గ్రుచ్చబడి శివుని 108 నామాలతో ప్రార్థన చేసాడు. శివుని కృపతో అమ్మవారి పట్ల చేసిన అపరాధాన్ని మన్నించమని కోరాడు. ఇంతలో శుక్రుడు మృత సంజీవినీ విద్యపొందిన విధం. లోకానికి తెలిసింది.

ఉషాచరిత్ర మనోహరమైనది చిత్రలేఖ అనిరుద్ధుణ్ణి తీసుకురావడంతో ఉషాఅనిరుద్ధుల విహారం శ్రీకారం చుట్టుకొంది. అనిరుద్ధునితో బాణసైన్యం యుద్ధం చేశారు. ఆకాశవాణి బాణునికి అనిరుద్ధుని గూర్చి చెప్పింది. అనిరుద్ధ విజయం. లోకోత్తరమైన అంశం. బాణ–రుద్ర–కృష్ణాదుల యుద్ధవర్ణనం బాణాసురుని చేతుల ఖండనం – బాణాసురగర్వభంగం చివరకు బాణునికి గణాధిపత్యం, శివపరమాత్మ గజాసురుణ్ణి వధించడం. గజాసురకృత శివస్తుతి. ఇవన్నీ శివుని దయను, భక్త వాత్సల్యాన్ని చక్కగా తెలియజేస్తాయి. తన చర్మాన్ని ధరించమని గజాసురుడు శివుని ప్రార్థించాడు. అంగీకరించాడు శివుడు. ఇలా గజాసుర చర్మం ధరించడం కారణంగా శివునికి కృత్తివాసుడని పేరు. కృత్తివాసలింగం ఏర్పడునుగాక! అనికూడా శివుడు వరమిచ్చాడు. ఆ క్షేత్రం కృత్తివాసేశ్వరం అయ్యింది. రుద్రసంహితలోని శివగాథలు వినడం వల్ల స్వర్గమూ, యశస్సు, ఆయువు, ధనధాన్య సమృద్ధీ కలుగుతాయి.

శివపురాణంలోని ఈ రుద్రసంహితా భాగాన్ని అనువదించిన మహనీయులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు. వర్తమానకాలంలో పురాణ, కవిత్వ, అవధాన పండితులలో మేరునగం లాంటివారు. బహుముఖప్రజ్ఞాశాలి. చాలా దీక్షగా ఈ భాగాన్ని అనువదించారు. అలాగే ఈ భాగాన్ని పరిష్కరించిన పండితమండలికి, సహకరించిన కార్యాలయ సిబ్బందికి సాదర ధన్యవాదములు.

డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ
ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధః ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

పురాణాల పురాణం

పురా అపి నవమ్ = పురాణమ్ అని వ్యుత్పత్తి చెప్పారు పెద్దలు. ఏనాటివో పాతవే అయినా ఆ గ్రంథాలు ఏ తరానికి ఆ తరం నూతనంగా కనిపిస్తాయి కనుక అవి పురాణాలు. ఇది ఎలా సాధ్యం అంటే –

మానవస్వభావానికీ మనస్తత్వానికీ ఆయా పాత్రల రూపంలో దర్పణం పట్టాయి కనుక, తరతరాలుగా భారతీయ మేధావులు సమకూర్చిన సకలశాస్త్రాలకూ సారభూతాలై విజ్ఞాన సర్వస్వాలుగా రూపొందాయి కనుక, (ఈ విషయాన్ని పాశ్చాత్య మేధావులు సైతం అంగీకరించారు కనుక), అరవై నాలుగు రకాలుగా ప్రపంచ మేధావుల చేత క్రోడీకరింపబడిన మానవసంబంధాల లోలోపలి పొరలతో సహా విశదీకరించే కథలకూ కళలకూ ఇవి నిలయాలు కనుక, చతుర్విధ పురుషార్థాలనూ సదసద్వివేచనతో జీవితలక్ష్యాలుగా నిరూపించాయి కనుక, ఒక మహాప్రయోజనాన్నీ లోకోపకారాన్నీ సాధించడానికి అత్యవసరమై చేసే క్వాచిత్కమైన అధర్మాచరణను ఆపద్ధర్మంపేర విశాలదృక్పథంతో ఆమోదించాయి కనుక, వంశాలూ. వంశానుచరితల రూపంలో చరిత్రను మనకు స్థూలంగా అందించాయి కనుక, నదీనదారణ్యనగర జనపద సముద్ర తటాకాదికమైన సమస్త ప్రకృతినీ మానవ మానవేతర సమస్త ప్రాణికోటినీ, ఋతువులనూ, వైపరీత్యాలనూ, జీవన విధానాలనూ, పాడిపంటలనూ ఒకటేమిటి సమస్తమూ వర్ణించి కన్నుల ముందు నిలిపాయి కనుక, మనిషి జీవితంలో సత్వరజస్తమోగుణాలూ అరిషడ్వర్గాలూ నిర్వహించే భూమికను ప్రత్యక్షం చేశాయి కనుక, పురుషార్థాలలో మూడవదీ అరిషడ్వర్గంలో మొదటిదీ అయిన కామం తాలూకు ఔగాములనూ ఎప్పుడు ఎలా అది పురుషార్థాలలో చేరుతుంది ఎప్పుడు ఎలా అది అరిషడ్వర్గంలో చేరుతుంది అనే వివేచనలనూ తేటతెల్లంచేసే గాథలను మనముందు ఉంచాయి కనుక, ప్రవృత్తి మార్గాన్నీ నివృత్తి మార్గాన్నీ ఎదుట నిలిపి ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛనిచ్చి మనశ్శాంతిగా మనుగడ సాగించే నేర్పును ఓర్పునూ ప్రబోధించి భవబంధ విమోచనమే మోక్షమని తేల్చిచెప్పాయి కనుక, భక్తిజ్ఞాన వైరాగ్యాలను దాపరికం లేకుండా అందరికీ ఎరుక పరిచాయి కనుక, ఒక్కమాటలో చెప్పాలంటే సమస్త లౌకికాలౌకిక విషయాలకూ పెన్నిధులు కనుక పురాణాలు పురా అపి నవాలు, సార్వకాలికాలు.

ఇంత విస్తృతమైనవి కనుకనే వీటి విషయంలో శతానేక సందేహాలూ సంశయాలూ శంకలూ అభిప్రాయ భేదాలూను. అసలు ఈ పురాణాలు ఎన్ని? ఇక్కడనుంచీ అభిప్రాయ భేదాలు ఆరంభం. 12-13-18-36 ఇలా వీటి పరిగణన కనబడుతోంది. అధిక సంఖ్యాకులు అంగీకరించినదేమిటంటే పద్దెనిమిది మహాపురాణాలనీ మరో పద్దెనిమిది ఉపపురాణాలనీ, కలిపి 36 అని. అయితే – ఏవేవి ఉపపురాణాలు అనే విషయంలో ఏకవాక్యత ఉంది. 1. నారసింహం, 2. స్కాందం, 3. శివధర్మం, 4. దౌర్వాసం, 5. సనత్కుమారోక్తం, 6. నారదోక్తం, 7. కాపిలం, 8. వామనం, 9. ఉశనసోక్తం, 10. బ్రహ్మాండం, 11. వారుణం, 12. కాళికాపురాణం, 13. మహేశ్వరపురాణం, 14. సాంబం, 15.సౌరం, 16.పరాశరోక్తం, 17.మారీచం, 18.భాస్కరం. వీటిలో ఒకటి రెండు మహాపురాణాలలో చేరినవీ ఉన్నాయి. మహాపురాణాల పేర్లను సులువుగా గుర్తుపెట్టుకోడానికి వీలుగా ఎవరో మహానుభావుడు కూర్చిన ఒక అనుష్టుప్పు సుప్రసిద్ధం –

మద్వయం – భద్వయం చైవ
బ్రత్రయం – వచతుష్టయం
అ.నా.ప.లిం.గ.కూ.స్కాని
పురాణాని పృథక్ పృథక్

దీన్ని విస్తరిస్తే మత్స్య–మార్కండేయాలు (2), భవిష్య – భాగవతాలు (2), బ్రహ్మపురాణం – బ్రహ్మాండ పురాణం – బ్రహ్మవైవర్తం (3), వరాహ – విష్ణు – వామన – వాయు (4), అగ్ని – నారద – పద్మ – లింగ – గరుడ – కూర్మ – స్కాందపురాణాలు (7) వెరసి పద్దెనిమిది. వీటిలో భాగవతమంటే – కృష్ణభాగవతమా, దేవీ భాగవతమా అనే చర్చ ఇప్పటికీ సజీవమే.

మొత్తం ఈ ముప్పయ్యారింటిలోనూ మనకు ప్రస్తుతమైన శివమహాపురాణం పరిగణనకు రాలేదు. కానీ శ్రీమద్భాగవతం చెప్పిన జాబితాలో దీనికి చోటు దక్కింది. పాఠకుల సౌకర్యం కోసం ఆ భాగవత శ్లోకాలను ఇస్తున్నాను –

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ
శైవం లైంగం స గారుడమ్
భవిష్యం బ్రహ్మవైవర్తం
మార్కండేయం స వామనమ్
వారాహం మాత్స్యం కౌర్మం చ
బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ (12-07-23 మరియు 24)

ఈ త్రి×షట్ = పద్దెనిమిదింటిలో శైవపురాణం ఉంది. వాయువు ఎగిరిపోయింది. ఉపపురాణాలలో సర్దుకుంది.

ఇంతటితో అయిపోలేదు. వీటిలోనూ గుణత్రయ విభాగం చేశారు. విష్ణు – నారదీయ – భాగవత – వరాహ – గరుడ – పద్మపురాణాలను ఆరింటినీ సాత్త్విక పురాణాలన్నారు. బ్రహ్మాండ – బ్రహ్మవైవర్త – బ్రహ్మ – మార్కండేయ – భవిష్య – వామన పురాణాలారింటినీ రాజసాలన్నారు. మత్స్య – కూర్మ – లింగ – వాయు – స్కాంద – ఆగ్నేయ పురాణాలారింటినీ తామసాలన్నారు. ఈ విభజనలోనూ శైవపురాణం జారిపోయింది. శివుడు తమోగుణ ప్రధానుడన్నారు కనుక అది తామసాలలోనే చేరాలి. చేరిస్తే మహాపురాణాల సంఖ్య పందొమ్మిది అవుతుంది. ఇది మహాపురాణలకు చేసిన గుణత్రయ విభజన కాబట్టి ఉపపురాణమైన వాయుపురాణం ఈ తామసాలలో చేరడం సబబుకాదు. దాన్ని ఈ తామసాల నుంచి తొలగించాలి. అప్పుడు అష్టాదశ పురాణాల ప్రధితికి ఢోకా ఉండదు.

విశాల భారతదేశంలో వేల సంవత్సరాలుగా విశేష ప్రచారంలో ఉండి, ప్రాంతీయ భాషలలోకి అనేకరూపాలలో అనూదితాలైన ఈ పురాణాలు – అవతరించిన కాలంనుంచీ ఇప్పటిదాకా అక్షరం మారకుండా

శిలాశాసనాల్లాగా అలాగే ఉండిపోయాయి అనుకోడానికి వీలు లేదు. చాలా మార్పులూ చేర్పులూ జరిగాయని సంస్కృత పురాణవాఙ్మయం మీద తొలితరం పరిశోధకులైన బలదేవోపాధ్యాయులవారినుంచి ఈ తరం యథామూలాంధ్రీకర్తలైన ఏలూరిపాటి అనంతరామయ్యగారి వరకూ అందరూ అంగీకరించిన విషయం. ఆ మార్పులూ చేర్పులూ ఎవరు ఎప్పుడు ఏ ఉద్దేశంతో చేశారు? మతవైషమ్యాలు కారణమా? ఈ దినుసు చర్చలు తీరుబాటు ఎక్కువ ఉన్నవారు చేసుకుంటారు. ఇది ఇలా ఉండగా –

కొన్ని పాత్రలూ కొన్ని ఘట్టాలూ కొన్ని కథలూ చాలా పురాణాలలో మళ్ళీ మళ్ళీ ఎదురవుతుంటాయి. నదులూ పర్వతాలూ మొదలైనవాటి పేర్లు మారిపోతుంటాయి. ఇలాంటి వాటిలో కొన్ని చిన్న మార్పులూ కొన్ని పెద్ద మార్పులూ కనబడుతుంటాయి. అప్పుడు పాఠకుడు గందరగోళంలో పడిపోతాడు. ఈ పురాణంలో ఇది ఇలా ఉంది. మొన్న చదివిన ఆ పురాణం ఇదే మరోలా ఉంది – అని జుట్టు పీక్కుంటూంటారు. కనపడిన పండితుడినల్లా నిలదీస్తూంటారు. వారేదో చెబుతారు. వీరికి సంతృప్తి కలగదు. కల్పాంతరకథాన్యాయంతో చక్కబెట్టడం చాలావాటికి పండితుల బ్రహ్మాస్త్రం. అదిసరే – ఒకటి రెండు ఉదాహరణలు ప్రస్తావిస్తాను.

గణపతి కథ సుప్రసిద్ధం. గణచతుర్థి నాడు ఆ కథను అందరూ చదువుతారు. వింటారు. ప్రమథగణాలకు నాయకుడిగా ఎవరిని నిలబెట్టాలి? గణపతినా? కుమారస్వామినా? పార్వతీపరమేశ్వరులకు ఇది జటిల సమస్య అయ్యింది. ఒకే పదవికోసం అన్నదమ్ముల పోటీ. ఆదిదంపతులు తమ పుత్రులకు ఒక పరీక్ష పెట్టారు. యుక్తితో గణపతి నెగ్గాడు. ఆ పోటీ ఆ యుక్తీ అందరికీ తెలుసుగాబట్టి నేను చెప్పడం లేదు. ఇది ఇలా కొన్ని పురాణాలలో ఉండగా – మన ప్రస్తుత శైవపురాణంలో చూడండి –

ఇందులో పోటీ ప్రమథగణనాయకత్వంకోసం కాదు. వివాహంకోసం. పెళ్ళి చెయ్యండి అని అన్నదమ్ములిద్దరూ ఆదిదంపతుల్ని అడిగారు. నాకు ముందంటే నాకు ముందన్నారు. అందుకని భూప్రదక్షిణ పరీక్ష. ఇదొక మార్పు.

గణపతికి శివుడే ఆ యుక్తిని చెప్పినట్టు ఇతరగ్రంథాలలో ఉంది. కానీ ఇందులో శివుడు ఆ విధంగా పక్షపాతం చూపలేదు. గణపతికే తోచింది. తల్లిదండ్రిల్ని పిలిచి ఈ గద్దెమీద కూర్చోండి అన్నాడు. ఎందుకో తరవాత చెబుతా – అన్నాడు. వారు కూర్చున్నారు. ఇతడు ముమ్మారు ప్రదక్షిణ చేశాడు. అమ్మా! నాన్నా! మీరు పెట్టిన పోటీ పరీక్షలో నేను గెలిచాను. నాకు పెళ్ళి చెయ్యండి అన్నాడు. ఆదిదంపతులు ఆశ్చర్యపోయారు. అప్పుడు గణపతి – ధర్మశాస్త్రవిషయం చెప్పి జననీజనకులకు అందునా పార్వతీపరమేశ్వరులకు ప్రదక్షిణం చెయ్యడమంటే – భూప్రదక్షిణం చేసినట్టే. నేను గెలిచేశాను – హాహాహా అన్నాడు. తల్లిదండ్రులు కాదనలేక పోయారు. సిద్ధిబుద్ధుల్నిచ్చి ఘనంగా పెళ్ళి జరిపించారు.

ఆనక కుమారస్వామి వచ్చాడు – నిజాయితీగా భూప్రదక్షిణ ముగించుకొని వచ్చాడు. విషయం తెలుసుకొని తల్లిదండ్రులమీద అలిగాడు. మళ్ళీ కైలాసంమీద అడుగు పెట్టను అనీ, జన్మలో పెళ్ళి చేసుకోను అనీ రుసరుసలాడుతూ క్రౌంచాద్రికి తపస్సుకు వెళ్ళిపోయాడు. రసవత్తరంగా సాగిన తరవాత కథ ఈ గ్రంథంలో చదివి ఆనందించండి. ఇంతకీ ఈ తేడాలు చిన్న చిన్నవిగా కనిపించినా ఆలోచిస్తే గుణాత్మకంగా చాలా పెద్దవి.

భాగవతం నుంచి కృష్ణుడి బాల్యక్రీడలు ఒకటి రెండు చూద్దాం. బాలకృష్ణుడు శకటాసురుణ్ణి తన్ని ముక్కలు చేశాడనీ, మద్దిచెట్ల మధ్యనుంచి రోలును లాగి గంధర్వులకు శాపవిముక్తి కలిగించాడనీ, చల్లచిలికి వెన్నలు తీస్తున్న గోపకాంతల వెనక చేరి మగపోడుములు చేశాడనీ, గోపికావస్త్రాపహరణం చేశాడనీ – ఇలా హరివంశ భాగవతాదుల్లో కనిపించే చిలిపి చేష్టలు. ఈ చివరివి రెండూ తీవ్రవిమర్శలకు అవకాశమిచ్చాయి. పండితులు వాస్తవాలు చెప్పి శతవిధాల సమర్థించినా ఇప్పటికీ సన్నాయి నొక్కులు వినిపిస్తూనే ఉన్నాయి.

సాత్వికమహాపురాణాలలో ఒకటైన విష్ణుపురాణంలో వీటి కథ ఎలా ఉన్నదంటే – బాలకృష్ణుడు విరగ్గొట్టినది శకటాసురుణ్ణికాదు. నందయశోదల ఇంటిపెరడులో ఒక బండి ఉంది. దానిమీద పాల బిందెలూ పెరుగు కుండలూ మిద్దెమీద పెట్టిన తీరుగా దానిమీద ఉంచారు. బాలకృష్ణుడు ఆ బండిని ముందుకు నెట్టాడు. అది కాస్తదూరం వెళ్ళి తిరగబడింది. విరగలేదు. అసురుడు కాదు. అలాగే మద్ది చెట్లు విరిగి పడ్డాయేగానీ గంధర్వులూ స్తుతులూ లేవు. మగపోడుములూ వస్త్రాపహరణల ప్రసక్తియే లేదు.

ఇటీవల దుమారం రేపిన ఘట్టం – కృష్ణుడు కంసుడి పనిపట్టడానికి మధురానగరానికి వెళుతూ దారిలో ఎదురైన రజకుణ్ణి పట్టుకొని – కోరిన బట్టలు కట్టుకోడానికి ఇవ్వలేదని చావగొట్టడం. ఈ బట్టలు కంసమహారాజుగారివి, మీకివ్వకూడదు, ఇవ్వను – అని ఊరుకోవలసింది. కానీ ఊరందరికీ వినపడేలాగా బలరామకృష్ణుల్ని తిట్టిపోశాడు.

అయాచేతాం సురూపాణి వాసాంసి రుచిరాణి తౌ (05–19–14). బలరామకృష్ణులు వస్త్రాలు యాచించారు. కంసస్య రజకస్సోఽథ ప్రసాదారూఢవిస్మయః (విస్మయం = గర్వం) బహూని ఆక్షేపవాక్యాని ప్రాహోచ్చైః రామకేశవౌ (5–19–15). ఇక్కడ వెన్నెలకంటి సూరన పద్యం గమనించండి –

మ. వినుమా యేలిక కంసుఁడీ వచనముల్ విన్నన్ నినున్ ప్రాణముల్
గొను గోపాల! మదించి గోధనములన్ గోల్పోయెదో – పోయెదో
యనుచుం బల్కిన శౌరి కోపహృదయుండై తచ్ఛిరం బుద్ధతిన్
దునియంగొట్టె పతాకహస్తనిహతిన్ తోరంపు లీలాగతిన్ (విష్ణుపురాణము 7–379)

తీవ్రతపస్సు చేసి అమోఘవరాలు పొంది అసాధ్యులుగా అవధ్యులుగా మారిన లోకకంటకులను అంతం చేసి ప్రాణికోటిని రక్షించడానికి అగతికంగా ఆచరించిన అధర్మాలకే ఆపద్ధర్మాలని పేరు. శత్రువుని చెట్టు చాటునుంచి చంపడం, రాక్షసబలానికి కారణమైన ఇల్లాంద్ర పాతివ్రత్యాన్ని నిర్దాక్షిణ్యంగా చెరచడం, యజ్ఞయాగాదులు చేస్తూ తమ రాక్షసప్రభువుకు బలం చేకూరుస్తూన్న అతని ప్రజకు నాస్తికత్వానైతికత్వాదులు ప్రబోధించి ధర్మభ్రష్టుల్ని చేసి రాక్షసప్రభువు బలాన్ని క్షీణింపజేయడం, వినిపించీ వినిపించనట్టు అసత్యం పలికించడం – ఇత్యాదులన్నీ సదరు

ఆపద్ధర్మాల కోవలోకే వస్తాయి. విస్తృత ప్రయోజనాల దృష్ట్యానైనా వీటిని అలా ఆమోదించలేని జానపదులూ జ్ఞానపదులూ మనకన్నా చాలా శతాబ్దాల ముందే ఆయా సన్నివేశాలను అన్యథాకరించి కావ్య –నాటక – గేయాదులు రచించారు. దింగ్నాగ మురారి భవభూతి ప్రభృతులు ఆ శ్రేణివారు. ఇక్కడ ఒక ముఖ్యవిషయం గుర్తించాలి. యుద్ధమన్నాక ముందుగా చచ్చేది సత్యమూ ధర్మమే అని లోకానికి ముమ్మొదటగా తెలియపరిచిందీ మనమే.

ఇటీవల దేవీభాగవతం చదువుతున్న ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావుగారు చాలా ఆశ్చర్యం ప్రకటించారు. అన్నింటికీ ఆదిపరాశక్తే అంటాడేమిటి? త్రిమూర్తుల్ని కూడా ఆడవాళ్ళుగా మార్చేసిందా? ఏమిటండీ ఈ అన్యాయం – అన్నారు అమాయికంగా. అవును. అది అంతే. విష్ణుపారమ్యాన్ని ప్రతిపాదించే పురాణాలలో విష్ణువే సర్వోన్నత దేవత. సకలదేవతాధిపతి. శివపారమ్య ప్రతిపాదకాలలో శివుడూ అంతే శాక్తేయ పురాణాలలో ఆదిపరాశక్తి అంతటిదే. ఇలాగే మిగతా దేవతల పురాణాలూను. అయితే వీటిలో ఒక సయోధ్య ఉంది. విష్ణుమూర్తికి శివుడూ శివుడికి విష్ణువూ – భక్తుడో మిత్రుడో కావడం, అలాగే వక్తృ శ్రోత్రనుబంధం ప్రత్యక్షంగానో పరోక్షంగానో కూర్చడం – అనేది వ్యాసభగవానుడు చేసిన గొప్ప సంధి ఒడంబడిక. ప్రపంచశాంతికి మూలసూత్రం. అందుకే ఆ మహానుభావుణ్ణి త్రిమూర్తి స్వరూపునిగా అద్వైతభావనకు సాక్షాత్కారంగా స్తుతించారు.

అచతుర్వదనో బ్రహ్మా ద్విబాహురపరో హరిః
అఫాలలోచనశ్శంభుః భగవాన్ బాదరాయణః

ఇంతకీ సారాంశం ఏమిటంటే – మనం ఏ పురాణం చదువుతున్నప్పుడు ఆ పురాణం పరిధిలోనే మన అధ్యయనమూ ఆస్వాదనమూ సాగాలి. ఇతర పురాణాలతో తెలిపారు వెయ్యడం మొదలు పెడితే గందరగోళంలో పడిపోతామే తప్ప గమ్యం చేరలేం. వ్రతానామ్ ఉత్తమం వ్రతమ్ – అని ఏ వ్రతానికి ఆ వ్రతానికే చెబుతున్నట్టు మనం చదువుతున్నది పురాణానా ముత్తమం పురాణమ్ అనే భక్తితో చదవడమే. అయినా చదువుతున్న దానిలో మన దృష్టికి సబబు కానివి కనిపిస్తే – కః కాలః కో ధర్మః అనే రీతిలో సమన్వయించుకోవడమో, పెద్దలనూ విజ్ఞులనూ అడిగి పరిష్కారాలు తెలుసుకోవడమో – ఇదే మన తక్షణ కర్తవ్యం. ఇదే మనశ్శాంతికి మార్గం.

ప్రస్తుతానికి వస్తే శివమహాపురాణంలోని రుద్రసంహితాంతర్గతమైన కుమారఖండం – యుద్ధఖండాల సమాహారమిది. మొత్తం అయిదువేల శ్లోకాల ఉద్గ్రంధమిది. మూలానికి తు.చ తప్పకుండా సరళసుందరమైన వాడుక తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో ప్రధానంగా లయకారకుడైన రుద్రుడి యుద్ధవీర విలాసగాథలు అద్భుతంగా దర్శనమిస్తాయి.

దీనిలో తొట్టతొలిని కుమారఖండం. బ్రహ్మకల్పోక్త శ్వేతవరాహకల్పోక్త ప్రకారాలుగా గణేశుడి కథ కనిపిస్తుంది. గణేశుడి జననం. శనిదృష్టి సోకి మరణం, పార్వతి గజశిరస్సు అమర్చడం, పార్వతి తన నలుగు పిండితో మరొక గణేశుణ్ణి సృష్టించడం, అతడు తండ్రిని ఎదిరించడం, శివగణేశుల యుద్ధం – ఇలాంటి అపూర్వవిషయాలు

ఇందులో ఉన్నాయి. అటుపైన కుమారస్వామి తారకాసురుడితో చేసినయుద్ధం, తారకాసురసంహారం – ఇది కుమారఖండం సారాంశం.

తదుపరి ఉన్నదంతా యుద్ధఖండమే. త్రిపురాసురుడు – శంఖచూడుడు – అంధకుడు – హిరణ్యకశిపుడు – బాణాసురుడు – ఉషాదేవి గాథ – కడపట విదళోత్పల దైత్యవధతో ఈ యుద్ధఖండం సార్థక నామధేయమై ముగిసింది. దైత్యశక్తులలో వైవిధ్యం, యుద్ధరీతిలో నీతిలో వైవిధ్యం, వారి ఔద్ధత్యంలో వైవిధ్యం – తదితర వివిధ వర్ణనలతో పట్టుగా సాగిన ప్రధాన భాగమిది.

దీనిని ఇలా అనువదించి పాఠకులకు అందించే మహాభాగ్యం నాకు ప్రసాదించిన శ్రీనివాసుడికి శిరసా నమామి. పురాణానువాద మహాయజ్ఞంలో దశాబ్దం క్రితం నన్ను భాగస్వామిని చేసిన అప్పటి తి.తి.దే. అధికారి బృందానికీ, ఇప్పటి అధికారి బృందానికీ, ప్రస్తుతం గ్రంథప్రచురణల విభాగానికి బాధ్యత వహిస్తున్న మిత్రులు కార్యసాధన సమర్థులు ఆకెళ్ళ విభీషణశర్మగారికీ బహుధా ధన్యవాదాలు. పాఠకులకు ప్రణామాలు. సెలవు.

బేతవోలు రామబ్రహ్మం

ఓం శ్రీనివాస పరబ్రహ్మణే నమః

శ్రీవేదవ్యాస విరచితం

శివమహాపురాణమ్

రుద్రసంహితాంతర్గతః చతుర్థకుమారఖండః

రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండం

ప్రథమోఽధ్యాయః – మొదటి అధ్యాయం

శివవిహారవర్ణనమ్ – శివవిహారవర్ణనం

వందే వందనతుష్టమానసమతిప్రేమప్రియం ప్రేమదం
పూర్ణం పూర్ణకరం ప్రపూర్ణ నిఖిలైశ్వర్యైకవాసం శివమ్ ।
సత్యం సత్యమయం త్రిసత్యవిభవం సత్యప్రియం సత్యదం
విష్ణుబ్రహ్మనుతం స్వకీయకృపయోపాత్తాకృతిం శంకరమ్ ॥1॥

వందనాలకు ఆనందించే మనస్సు కలవాడు. గాఢమైన భక్తిని ఇష్టపడేవాడు. భక్తిని కలిగించేవాడు. స్వయంసంపూర్ణుడు. సంపూర్ణతను ప్రసాదించేవాడు. ఏ లోటూలేని సమస్త ఐశ్వర్యాలకూ ఏకైకనిలయమైనవాడు. తానే సత్యమైనవాడు. సత్యమయుడు. త్రికరణసాక్షిగా సత్యవిభవుడు. సత్యప్రియుడు. సత్యప్రదుడు. విష్ణుమూర్తిచేత, బ్రహ్మదేవుని చేత స్తుతులు అందుకొనేవాడు. కేవలం తన ఇచ్ఛతో (కరుణతో) విభిన్నరూపాలు ధరించేవాడు. జీవకోటికి శుభంకరుడు (శమ్+కరుడు) ఇటువంటి శివుణ్ణి నమస్కరిస్తున్నాను.

విశేషాలు: భక్తి అంటే భగవంతుడి పట్ల మనకు ఉండే ప్రేమ. అందుకని ఇక్కడ ప్రేమపదానికి భక్తి అనే అర్థం. త్రిసత్యమ్ – త్రినత్యమ్ అంటే మనో–వాక్–కాయకర్మలా నిజమైనది అని. వీటినే త్రికరణాలు అంటారు. శివుడి వైభవం భావనామయ–వాఙ్మయ–క్రియామయ ప్రపంచాలు మూడింటా సత్యమైనది అని. పరమశివుడు ఏ రూపం ధరించినా దానికి అతడి దయయే–అతడి ఇచ్ఛయే–కారణం. భక్తుణ్ణి కాపాడాలి అనే దయ, ఇచ్ఛ మాత్రమే కారణం. కనుకనే 'స్వకీయ కృపయా ఉపాత్తాకృతిమ్' అన్నారు. శంకరుడు కర్మాధీనుడు కాదనడం తాత్పర్యం. అందుకనే – విష్ణు బ్రహ్మసుతుడు.

నారద ఉవాచ – నారదుడు అడుగుతున్నాడు.

వివాహయిత్వా గిరిజాం శంకరో లోకశంకరః ।
గత్వా స్వపర్వతం బ్రహ్మన్ కిమకార్షీద్ధి తద్వద ॥2॥

తండ్రీ! చతుర్ముఖా! అఖిల లోకాలకూ శుభంకరుడైన శంకరుడు పార్వతీదేవిని వివాహం చేసుకున్నాక, తన నివాసమైన కైలాసపర్వతానికి వెళ్ళి, ఏమి చేశాడు? దయచేసి అది వివరించు.

కథం హి తనయో జజ్ఞే శివస్య పరమాత్మనః ।
యదర్థమాత్మరామోఽపి సమువాహ శివాం ప్రభుః ॥3॥

పరమాత్ముడైన శివుడికి కుమారుడు ఎలా జన్మించాడు? ఆ ప్రభువు తాను ఆత్మారాముడు. ఐనా మరి పార్వతీదేవిని పరిణయమాడాడు, ఎందుకోసం?

తారకస్య కథం బ్రహ్మన్ వధోఽభూద్దేవశంకరః।
ఏతత్సర్వమశేషేణ వద కృత్వా దయాం మయి ॥4॥

బ్రహ్మదేవా! తారకాసురసంహారం ఎలా జరిగింది? అది దేవతలకు ఎలా ఆనందదాయకం అయింది? తండ్రీ! నాపట్ల దయవహించి ఇది అంతా నాకు సంపూర్ణంగా తెలియజెప్పు.

సూత ఉవాచ – సూతుడు చెబుతున్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య నారదస్య ప్రజాపతిః ।
సుప్రసన్నమనాః స్మృత్వా శంకరం ప్రత్యువాచ హ ॥5॥

నారదుడి ఈ అభ్యర్థనను ఆలకించాడు బ్రహ్మదేవుడు. ఆయన మనస్సు ప్రసన్నమయ్యింది. ఒక్కసారి మనస్సులో శంకరుణ్ని తలుచుకుని, బదులు పలికాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు పలుకుతున్నాడు.

చరితం శృణు వక్ష్యామి శశిమౌళేస్తు నారద ।
గుహజన్మ కథాం దివ్యాం తారకాసురసద్వధమ్ ॥6॥

నారదా! విను, చంద్రశేఖరుడి చరితం చెబుతున్నాను. దివ్యమైనది కుమారస్వామి జన్మకథ. అటువంటిదే తారకాసురవధ. వివరిస్తాను ఆలకించు.

శ్రూయతాం కథయామ్యద్య కథం పాపప్రణాశినీమ్ ।
తాం శ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో ధ్రువమ్ ॥7॥

పాపాలను పటాపంచలు చేసే కథ ఇది. ఇప్పుడు చెబుతున్నాను నీకు. శ్రద్ధగా ఆలకించు. దీన్ని వింటే మానవుడు సమస్తపాపాలనుంచీ విముక్తుడవుతాడు. ఇది నిశ్చయం.

ఇదమాఖ్యానమనఘం రహస్యం పరమాద్భుతమ్ ।
పాపసంతాపహరణం సర్వవిఘ్నవినాశనమ్ ॥8॥

ఈ కథ పరమపావనం. అతి గుహ్యం. అత్యద్భుతం. పాపాలనూ, తాపాలనూ హరిస్తుంది. అన్ని విఘ్నాలనూ తొలగిస్తుంది.

సర్వమంగళదం సారం సర్వశ్రుతిమనోహరమ్
సుఖదం మోక్షబీజం చ కర్మమూలనికృంతనమ్ ॥9॥

ఈ వృత్తాంతం సమస్త శుభాలనూ ఇస్తుంది. సారభూతం. అందరి వీనులకూ విందైనది. సుఖప్రదం. మోక్షానికి (విత్తనం) మూలాధారం. పూర్వజన్మల కర్మానుబంధాల వేరులను పూర్తిగా త్రెంచివేస్తుంది.

కైలాసమాగత్య శివాం వివాహ్య శోభాం ప్రపేదే నితరాం శివోఽపి ।
విచారయామాస చ దేవకృత్యం పీడాం జనస్యాపి చ దేవకృత్యే ॥10॥

పరమశివుడు పార్వతీదేవిని పరిణయమాడి, తన కైలాసాద్రికి తిరిగి వచ్చాడు. (పెళ్ళికళతో) మరింత శోభను సంతరించుకున్నాడు. దేవకార్యం గురించి ఆలోచించాడు. (అదే తారకాసురసంహారం). సంహారసమయంలో జనులకు కలిగే పీడను గురించి కూడా యోచించాడు.

శివస్య భగవాన్ సాక్షాత్ కైలాసమగమద్యదా ।
సౌఖ్యం చ వివిధం చక్రుర్గణాస్సర్వే సుహర్షితాః ॥11॥

సాక్షాత్తు భగవంతుడైన శివుడు కైలాసపర్వతానికి చేరుకునేసరికి, అక్కడి ప్రమథగణాలవారందరూ ఎంతగానో సంబరపడ్డారు. రకరకాల సౌఖ్యాలనూ, సౌకర్యాలనూ సన్నద్ధం చేశారు.

మహోత్సవో మహానాసీత్ శివే కైలాసమాగతే ।
దేవాః స్వవిషయం ప్రాప్తా హర్షనిర్భరమానసాః ॥12॥

శివుడి రాకతో కైలాసపర్వతం మీద ఒక గొప్ప మహోత్సవం వెల్లివిరిసింది. దేవతలందరూ ఆనందం నిండిన మనస్సులతో వారి వారి దేశాలకు చేరుకున్నారు.

అథ శంభు ర్మహాదేవో గృహీత్వా గిరిజాం శివామ్ ।
జగామ నిర్జనం స్థానం మహాదివ్యం మనోహరమ్ ॥13॥

అటుపైని మహాదేవుడు శంభుడు శుభకారిణి పార్వతిని తీసుకొని అత్యంతపావనమూ, అత్యంతసుందరమూ అయిన ఒకానొక ఏకాంతప్రదేశానికి వెళ్ళాడు.

శయ్యాం రతికరీం కృత్వా పుష్పచందనచర్చితామ్ ।
అద్భుతం తత్ర పరమాం భోగవస్త్వన్వితాం శుభమ్ ॥14॥

అక్కడ ఒక శయ్యను ఏర్పరుచుకున్నాడు. అది (ఉభయులకూ) ప్రీతివర్ధకమైన శయ్య. దాని మీద పుష్పాలంకరణ. చందన చర్చ. అత్యద్భుతం. ఉత్తమోత్తమం. శుభప్రదమైనశయ్యపై సమస్తభోగవస్తువులూ ఉన్నాయి.

స రేమే తత్ర భగవాన్ శంభుర్గిరిజయా సహ ।
సహస్రవర్షపర్యంతం దేవమానేన మానదః ॥15॥

గౌరవప్రదుడు, మహాదేవుడు ఆ శంభుడు గిరిజాసమేతుడై అక్కడ ఎంతగానో ఆనందించాడు. దేవమానంలో వెయ్యి సంవత్సరాలపాటు ఆనందించాడు.

దుర్గాంగస్పర్శమాత్రేణ లీలయా మూర్ఛితః శివః ।
మూర్ఛితా సా శివస్పర్శాత్ బుబుధే న దివానిశమ్ ॥16॥

పార్వతీదేవి శరీరస్పర్శతో శివుడు సమ్మోహితుడయ్యాడు. అదొక లీల. అలాగే శివుడి స్పర్శతో పార్వతీదేవి కూడా సమ్మోహితురాలయ్యింది. రేయింబవళ్ళ ఎరుక లేకపోయింది.

హరే భోగప్రవృత్తే తు లోకధర్మప్రవర్తిని ।
మహాన్ కాలో వ్యతీయాయ తయోః క్షణ ఇవానఘ ॥17॥

లోకధర్మాన్ని నడిపించవలసిన శివుడు అలా భోగపరాయణుడు కాగా, ఆ దంపతులకు సంవత్సరాల సుదీర్ఘకాలం ఒక్క క్షణంలాగా గడిచిపోయింది.

అథ సర్వే సురాస్తాత! ఏకత్రీభూయ చైకదా ।
మంత్రయాంచక్రురాగత్య మేరౌ శుక్రపురోగమాః ॥18॥

అంతట, నాయనా, ఇంద్రాది దేవతలందరూ ఒకనాడు మేరుపర్వతం మీద సమావేశమయ్యారు. సమాలోచన జరిపారు.

సురా ఊచుః – దేవతలు ఇలా పలికారు.

వివాహం కృతవాన్ శంభురస్మత్కార్యార్థమీశ్వరః ।
యోగీశ్వరో నిర్వికారో స్వాత్మారామో నిరంజనః ॥19॥

పరమేశ్వరుడు మన దేవకార్యార్థం వివాహం చేసుకున్నాడు. ఆయన యోగీశ్వరుడు, వికారరహితుడు, స్వాత్మారాముడు, నిరంజనుడు అయినా దేవకార్యం కోసం వివాహం చేసుకున్నాడు. (సంసారి అయ్యాడు)

నోత్పన్నస్తనయస్తస్య జానామోఽ త్ర కారణమ్ ।
విలంబః క్రియతే తేన కథం దేవేశ్వరేణ హ ॥20॥

కానీ ఇంతవరకూ తనయుడు జన్మించలేదు. కారణమేమిటో మనకు తెలియడం లేదు. సకల దేవతలకూ ప్రభువు ఆ పరమేశ్వరుడు ఎందుకని ఇంత విలంబం చేస్తున్నాడో!

ఏతస్మిన్నంతరే దేవా నారదాద్దేవదర్శనాత్ ।
బుబుధుస్తన్మితం భోగం తయోశ్చ రమమాణయోః ॥21॥

ఇంతలోకి వారి దగ్గరకు నారదుడు వచ్చాడు. ఆయన మహాదేవుణ్ని దర్శించినవాడు. ఏకాంతంలో ఆనందిస్తున్న పార్వతీ పరమేశ్వరులకు ఇప్పటికీ ఆ భోగం నడుస్తోందని దేవతలకు తెలియపరిచాడు.

చిరం జ్ఞాత్వా తయోర్భోగం చింతామాపుస్సురాశ్చ తే ।
బ్రహ్మాణం మాం పురస్కృత్య యయుర్నారాయణాంతికమ్ ॥22॥

పార్వతీపరమేశ్వరుల ఈ చిరకాలభోగవార్త తెలుసుకున్న దేవతలు ఎంతగానో దిగులు చెందారు. నన్ను (బ్రహ్మను) ముందు నిల్పుకుని, నారాయణుడి చెంతకు బయలుదేరారు.

తం నత్వా కథితం సర్వం మయా వృత్తాంతమీప్సితమ్ ।
సంతస్థిరే సర్వదేవా చిత్రే పుత్తలికా యథా ॥23॥

నారాయణుడికి నమస్కరించి, మొత్తం వృత్తాంతాన్ని దేవతల ఈప్సితాన్నీ (ఈప్సితవృత్తాంతాన్ని) నేనే విన్నవించాను. తక్కిన సురలందరూ చిత్రపటంలో బొమ్మల్లాగా మౌనంగా నిలబడ్డారు.

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు ఇలా పలికాడు.

సహస్రవర్షపర్యంతం దేవమానేన శంకరః ।
రతౌ రతశ్చ నిశ్చేష్టో యోగీ విరమతే న హి ॥24॥

తండ్రీ! వాసుదేవా! స్థాణువు (నిశ్చేష్టుడు), మహాయోగి అయిన శంకరుడు పార్వతీసంభోగంలో గాఢానురక్తుడయ్యాడు. దేవమానంలో వెయ్యిసంవత్సరాలు గడిచింది. కానీ ఇప్పటికి ఇంకా ఆయన విరమించలేదు.

భగవానువాచ – నారాయణుడు పలికాడు.

చింతా నాస్తి జగద్ధాతః సర్వం భద్రం భవిష్యతి ।
శరణం వ్రజ దేవేశ! శంకరస్య మహాప్రభోః ॥25॥

జగత్తుల సృష్టికర్తా! దిగులు లేదు. అంతా శుభమే అవుతుంది. దేవనాయకా! మహాప్రభువైన ఆ శంకరుడి శరణుపొందు.

మహేశ శరణాపన్నా యే జనా మనసా ముదా ।
తేషాం ప్రజేశ! భక్తానాం న కుతశ్చిద్భయం క్వచిత్ ॥26॥

ప్రజాపతీ! ఆనందంతో మహేశ్వరుణ్ణి మనస్సులో శరణుజొచ్చిన భక్తజనానికి ఏనాడూ, ఎటునుంచీ ఏ భయమూ ఉండదు.

శృంగారభంగస్సమయే భవితా నాధునా విధే ।
కాలప్రయుక్తం కార్యం చ సిద్ధిం ప్రాప్నోతి నాన్యథా ॥27॥

విధాతా! శివపార్వతుల శృంగారవిరమణ తగినసమయంలో జరుగుతుంది. ఇప్పుడు మాత్రం కాదు. ఏ కార్యమైనా తగినసమయంలో జరిపితే, సిద్ధిని పొందుతుంది తప్ప మరోలా కాదు.

శంభో స్సంభోగమిష్టం కో భేదం కర్తుమిహేశ్వరః ।
పూర్ణే వర్షసహస్రే చ స్వేచ్ఛయా హి విరంస్యతి ॥28॥

అయినా శంకరుడికి అంత ఇష్టమైన సంభోగానికి విఘ్నం కలిగించగల్గిన సమర్థుడు ఎవడిక్కడ? వెయ్యి సంవత్సరాలు పూర్తికాగానే శివుడే తనంతతాను విరమిస్తాడు.

స్త్రీపుంసో రతివిచ్ఛేదముపాయేన కరోతి యః ।
తస్య స్త్రీపుత్రయోర్భేదః భవేజ్జన్మని జన్మని ॥29॥

ఏదయినా ఒక ఉపాయంతో ఎవడయినా ఒకడు స్త్రీపురుషులకు రతిభంగం కలిగిస్తే వాడికి జన్మజన్మలకూ భార్యాపుత్రులవియోగం తప్పదు.

భ్రష్టజ్ఞానో నష్టకీర్తి రలక్ష్మీకో భవేదిహ ।
ప్రయాత్యంతే కాలసూత్రం వర్షలక్షం స పాతకీ ॥30 ॥

అంతేకాదు, వాడు జ్ఞానహీనుడవుతాడు. వాడి కీర్తి నశిస్తుంది. సంపద నశిస్తుంది. కట్టపడపట కాలసూత్రమనే యమలోకానికి పోతాడు. అక్కడ లక్ష సంవత్సరాలు యమబాధలు అనుభవిస్తాడు.

రంభాయుక్తం శక్రమిమం చకార విరతం రతౌ ।
మహామునీంద్రో దుర్వాసాः తత్ స్త్రీభేదో బభూవ హ ॥31॥

వెనకటికి దూర్వాసమహాముని – రంభతో సంభోగిస్తున్న ఈ మన ఇంద్రుడికి రతివిఘ్నం కలిగించాడు. అంతే ఆ మహామునీంద్రుడికి భార్యావియోగం సంభవించింది గదా !

పునరన్యాం స సంప్రాప్య విషేవ్య శుభపాణికామ్ ।
దివ్యం వర్షసహస్రం చ విజహౌ విరహజ్వరమ్ ॥32॥

ఆ దుర్వాసుడు మరోక శుభపాణిని చేపట్టి, దేవమానంలో వెయ్యి సంవత్సరాలు ఆమెను సేవించి, తన విరహజ్వరాన్ని వదిలించుకున్నాడు.

ఘృతాచ్యా సహ సంశ్లిష్టం కామం వారితవాన్ గురుः ।
షణ్మాసాభ్యంతరే చంద్రస్తస్య పత్నీం జహార హ ॥33॥

ఒకప్పుడు ఇలాగే దేవగురువు బృహస్పతి ఘృతాచితో కామక్రీడ సాగిస్తున్న మన్మథుడికి విఘ్నం కలిగించాడు. అంతే ఆరునెలలు తిరగకముందే చంద్రుడు అతడి పత్ని తారను అపహరించాడు.

పునశ్శివం సమారాధ్య కృత్వా తారామయం రణమ్ ।
తారం సగర్భాం సంప్రాప్య విజహౌ విరహజ్వరమ్ ॥34॥

బృహస్పతి ఎంతోకాలం శివుణ్ని ఆరాధించి, తారకోసమని చంద్రుడితో పోరాడి పోరాడి, కడపటికి గర్భిణిగా ఉన్న తారను తిరిగి పొందాడు. విరహార్తిని వదిలించుకున్నాడు.

మోహినీ సహితం చంద్రం చకార విరతం రతౌ ।
మహర్షిర్గౌతమస్తస్య స్త్రీవిచ్ఛేదో బభూవ హ ॥35॥

మోహినితో విహరిస్తున్న చంద్రుడికి గౌతముడు రతిభంగం కలిగించాడు. దాని ఫలితంగా ఆ మహర్షికి భార్యావియోగం సంభవించింది.

హరిశ్చంద్రో హలికం చ వృషల్యా సహ సంయుతమ్ ।
చారయామాస నిశ్చేష్టం నిర్జనం తత్ఫలం శృణు ॥36॥

హరిశ్చంద్రుడు కాపుకన్నెతో ఆనందిస్తున్న ఒక రైతు బిడ్డకు రతివిఘ్నం కలిగించాడు. నిశ్చేష్టుణ్ణి చేసి నిర్జనప్రదేశాలకు పారద్రోలాడు. దాని ఫలితం ఏమిటో విను.

భ్రష్టుః స్త్రీపుత్రరాజ్యేభ్యో విశ్వామిత్రేణ తాడితః ।
తతశ్శివం సమారాధ్య ముక్తో భూతో హి కశ్మలాత్ ॥37॥

భార్యపుత్రులకు దూరమయ్యాడు. రాజ్యం కోల్పోయాడు. విశ్వామిత్రుడి చేతిలో దారుణంగా భంగపడ్డాడు. చివరికి శివుణ్ణి ఆరాధించి ఆ పాపపంకిలం నుంచి విముక్తుడయ్యాడు.

అజామిళం ద్విజశ్రేష్ఠం వృషల్యా సహ సంయుతమ్ ।
న భియా వారయామాసుస్సురాస్తాం చాపి కేచన ॥38॥

అజామీళుడని ఒక బ్రాహ్మణోత్ముడు. ఆయన ఒక కాపుకన్నెతో రతిసౌఖ్యం అనుభవిస్తున్నాడు. దేవతలందరూ చూశారు. కానీ ఎవ్వరూ అతడిని గానీ, ఆమెను గానీ పాప భయంతో వారించలేదు.

సర్వం నిషేకసాధ్యం చ నిషేకో బలవాన్ విధే ।
నిషేకః ఫలదో వై స నిషేకః కేన వార్యతే ॥39॥

చతుర్ముఖా! సృష్టిలో సమస్తమూ గర్భాధానంతోనే సాధ్యమవుతోంది. ఈ నిషేకమనేది (వీర్యనిక్షిప్తి) చాలా బలీయం. అదే కదా ఫలప్రదం! దాన్ని ఎవడు వారిస్తాడు, ఎవడు వారించగలడు?

దివ్యం వర్షసహస్రం చ శంభోస్సంభోగకర్మ తత్ ।
పూర్ణే వర్షసహస్రే చ గత్వా తత్ర సురేశ్వరాః ॥40॥

యేన వీర్యం పతేద్భూమౌ తత్కరిష్యథ నిశ్చితమ్ ।
తత్ర వీర్యే చ భవితా స్కందనామా ప్రభోస్సుతః ॥41॥

పార్వతీదేవితో శివుడి ఆ సంభోగక్రియ దేవమానం ప్రకారం వెయ్యిసంవత్సరాలు సాగుతుంది. వెయ్యి సంవత్సరాలు పూర్తికాగానే దేవతలారా! మీరందరూ వెళ్ళి శివుడి వీర్యం నేలమీద పడేట్టు చేయ్యండి. ఆ వీర్యంనుంచి శివకుమారుడు ఆవిర్భవిస్తాడు. స్కందుడు అతని పేరు.

అధునా స్వగృహం గచ్ఛ విధే సురగణైస్సహ ।
కరోతు శంభు స్సంభోగం పార్వత్యా సహ నిర్జనే ॥42॥

అందుచేత ఓ విధాతా! ప్రస్తుతం నువ్వు ఈ దేవగణాలతో సహా ఇంటికి వెళ్ళిపో. ఆ ఏకాంతప్రదేశంలో శివుడు తన పార్వతీదేవితో రతిక్రీడను నిరాటంకంగా కొనసాగించుగాక!

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు ఇలా పలికాడు.

ఇత్యుక్త్వా కమలాకాంతః శీఘ్రం స్వంతఃపురం యయౌ ।
స్వాలయం ప్రయయుర్దేవాః మయా సహ మునీశ్వర ॥43॥

నారదమునీశ్వరా! ఈ మాట చెప్పి లక్ష్మీవల్లభుడు వేగంగా అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు. నేనూ, దేవతలూ ఎవరి ఇళ్ళకు వాళ్ళు చేరుకున్నాం.

శక్తి శక్తిమతోశ్చాథ విహారేణాతి చ క్షితిః ।
భారాక్రాంతా చకంపే సా సశేషాహి సకచ్ఛపా ॥44॥

శక్తిస్వరూపిణి – పార్వతీ దేవి. శక్తిమంతుడు – పరమశివుడు. ఈ దంపతుల తీవ్ర (అతి) సంభోగవిహారం. ఆ బరువును భరించలేక పోయింది భూమి. శేషుడితో సహా, ఆదికచ్ఛపంతో సహా కంపించిపోయింది.

కచ్ఛపస్య హి భారేణ సర్వాధారస్సమారణః ।
స్తంభితాఽథ త్రిలోకాశ్చ బభూవుర్భయ విహ్వలాః ॥45॥

ఆదికచ్ఛపానికీ ఆదిశేషుడికీ కలిగిన ఈ ఒత్తిడిచేత – సమస్త ప్రాణికోటికి ప్రాణాధారమైన వాయువు స్తంభించిపోయింది. (ఇవి రెండూ పీల్చేశాయని కావచ్చు). ముల్లోకాలూ భయంతో బెగ్గడిల్లాయి.(అదుపు తప్పాయి.)

అథ సర్వే మయా దేవా హరేశ్చ శరణం యయుః ।
సర్వం నివేదయాంచక్రుః తద్వృత్తం దీనమానసాః ॥46॥

అప్పుడు నేనూ, సకలదేవతలూ విష్ణుమూర్తినివాసానికి పరుగుతీశాం. జరుగుతున్న ప్రకృతివైపరీత్యాన్ని అంతటినీ దీనమనస్కులమై నివేదించాం.

దేవా ఊచుః – దేవతలు ఇలా పలికారు.

దేవ దేవ! రమానాథ! సర్వాఽవనకర! ప్రభో! ।
రక్ష నశ్శరణాపన్నాన్ భయవ్యాకులమానసాన్ ॥47॥

స్తంభితః త్రిజగత్ప్రాణో న జానే కేన హేతునా ।
వ్యాకులం మునిభిర్లేఖైః త్రైలోక్యం సచరాచరమ్ ॥48॥

దేవాధిదేవా! రమావల్లభా! సర్వజగద్రక్షా! నీ శరణుజొచ్చినవాళ్ళం. మా మనస్సులు భయంతో వెల వెల పడిపోతున్నాయి. మమ్మల్ని కాపాడు ప్రభూ! ముల్లోకాలకూ ప్రాణమైన వాయువే స్తంభించిపోయింది. కారణమేమిటో తెలియడం లేదు. మునులూ, దేవతలూ, చరాచర జీవరాశితో సహా ముల్లోకాలూ అల్లకల్లోలమైపోయాయి.

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు.

ఇత్యుక్త్వా సకలా దేవా మయా సహ మునీశ్వర ।
దీనాస్తస్థుః పురో విష్ణోః మౌనీభూతాస్సుదుఃఖితాః ॥49॥

నారదా! నాతో సహా దేవతలం అందరం ఈ మాత్రం పలికి విష్ణుమూర్తి ఎదుట దీనంగా దుఃఖిస్తూ మౌనంగా నిలబడ్డాం.

తదాకర్ణ్య సమాదాయ సురాన్సః సకలాన్ హరిః ।
జగామ పర్వతం శీఘ్రం కైలాసం శివవల్లభమ్ ॥50॥

మా మొర ఆలకించాడు విష్ణుమూర్తి. వెంటనే మమ్మల్ని అందరినీ తీసుకుని, కైలాసపర్వతానికి బయలుదేరాడు. కైలాసమంటే శివుడికి ప్రీతిపాత్రమైన పర్వతం.

తత్ర గత్వా హరిర్దేవైర్మయా చ సురవల్లభః ।
యయౌ శివవరస్థానం శంకరం ద్రష్టుకామ్యయా ॥51॥

దేవతానాయకుడైన శ్రీహరి అలా నాతోనూ, దేవతలతోనూ కలిసి కైలాసగిరి చేరుకున్నాడు. అక్కడ శివుడు నివసించే ఉత్తమోత్తమప్రదేశం ఒకటి ఉంది. శివుణ్ని దర్శించాలి అనే కోరికతో ఆ ప్రదేశానికి వెళ్ళాడు.

తత్ర దృష్ట్వా శివం విష్ణుర్న సురైర్విస్మితోఽభవత్ ।
తత్ర స్థితాన్ శివగణాన్ పప్రచ్ఛ వినయాన్వితః ॥52॥

అయితే అక్కడ శివుడు కనిపించలేదు. విష్ణుమూర్తి ఆశ్చర్యపోయాడు. దేవతలూ విస్మితులయ్యారు. అక్కడ ఉన్న ప్రమథగణాలను చూసి విష్ణుమూర్తి సవినయంగా అడిగాడు.

విష్ణురువాచ – విష్ణుమూర్తి ఇలా అడిగాడు.

హే శంకరాః శివః కుత్ర గతస్సర్వప్రభుర్గణాః ।
నివేదయత నః ప్రీత్యా దుఃఖితాన్వై కృపాలవః ॥53॥

శంకరస్వరూపులారా! ఓ ప్రమథగణములారా! సర్వేశ్వరుడు పరమశివుడు ఎక్కడికి వెళ్ళాడు? అతడు కనిపించక దుఃఖిస్తున్న మాపట్ల దయాళురై ప్రేమతో మాకు తెలియజెప్పండి, శివుడు ఎక్కడికి వెళ్ళినట్టు?

బ్రహ్మోవాచ– బ్రహ్మదేవుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య సామరస్య హరేర్గణాః ।
ప్రోచుః ప్రీత్యా గణాస్తే హి శంకరస్య రమాపతిమ్ ॥54॥

దేవతలసమేతుడై శ్రీమహావిష్ణువు చేసిన ఈ అభ్యర్థనను ప్రమథగణాలవారు ఆలకించారు. శంకరుణ్ని గురించి రమాపతికి ఆదరంగా తెలియజెప్పారు.

శివగణా ఊచుః – ప్రమథగణాలవారు ఇలా పలికారు.

హరే! శృణు శివప్రీత్యా యథార్థం బ్రూమహే వయమ్ ।
బ్రహ్మణా నిర్జరైస్సార్ధం వృత్తాంతమఖిలం చ యత్ ॥55॥

బ్రహ్మదేవుడితో సకల దేవతలతో ఇలా వచ్చి అడుగుతున్నావు. విష్ణుమూర్తీ! ఆలకించు. శివప్రీతిగా మేము నిజం చెబుతున్నాం. జరిగినది అంతా చెబుతున్నాం విను.

సర్వేశ్వరో మహాదేవో జగామ గిరిజాలయమ్ ।
సంస్థాప్య నో ఽత్ర సుప్రీత్యా నానా లీలావిశారదః ॥56॥

అనేక దివ్యలీలలు ప్రదర్శించడంలో మిక్కిలి నేర్పరి సర్వేశ్వరుడు, మహాదేవుడు. ఆయన మమ్మల్ని అందరినీ ఇచ్చకంగా ఇక్కడ నిలిపి తానేమో పార్వతీ మందిరానికి వెళ్ళాడు.

తద్గృహాభ్యంతరే శంభుః కిం కరోతి మహేశ్వరః ।
న జానీమో రమానాథ! వ్యతీయుర్బహవస్సమాః ॥57॥

రమానాథా! ఆ పార్వతీమందిరంలో మహేశ్వరుడు ఏమి చేస్తున్నాడో తెలియదు. మేమెరగం. కానీ ఎన్నో ఏళ్ళు గడిచిపోయాయి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలుకుతున్నాడు.

శ్రుత్వేతి వచనం తేషాం స విష్ణుస్సామరో మయా ।
విస్మితో ఽతి మునిశ్రేష్ఠ శివద్వారం జగామ హ ॥58॥

నారదమహర్షీ! దేవతలతో పాటూ, నాతో పాటూ శ్రీమహావిష్ణువు వారు చెప్పిన ఈ మాటలు విన్నాడు. ఎంతగానో విస్తుపోయాడు. శివపార్వతులున్న మందిరం గుమ్మం దగ్గరికి వెళ్ళాడు.

తత్ర గత్వా మయా దేవైస్స హరిర్దేవవల్లభః ।
ఆర్తవాణ్యా మునే ప్రోచే తారస్వరతయా తదా ॥59॥

హరివెంట నేనూ వెళ్ళాను. దేవతలూ వెళ్ళారు. నారదా! వెళ్ళి ఆ గుమ్మం దగ్గర నిలబడి దేవవల్లభుడు శ్రీహరి ఆర్తస్వరంతో బిగ్గరగా పలికాడు.

శంభు మస్తౌ న్మహాప్రీత్యా సామరో హి మయా హరిః ।
తత్ర స్థితో మునిశ్రేష్ఠ సర్వలోకప్రభుం హరమ్ ॥60॥

మునివరా! అలా గుమ్మందగ్గర నిలబడి శ్రీహరి – సర్వలోక ప్రభువైన హరుణ్ణి మహాప్రీతితో స్తుతించాడు. నేనూ దేవతలూ తోడునిలిచాం.

విష్ణురువాచ – విష్ణువు ఇలా పలికాడు.

కిం కరోషి మహాదేవాభ్యంతరే పరమేశ్వర ।
తారకార్తాన్ సురాన్ సర్వాన్ పాహి నః శరణాగతాన్ ॥61॥

పరమేశ్వరా! మహాదేవా! లోపల ఏమి చేస్తున్నావ్? తారకాసురుడి ధాటికి ఆర్తులమై నిన్ను శరణుజొచ్చిన మమ్మల్ని, సకల దేవతలను దయచేసి కాపాడు.

ఇత్యాది సంస్తువన్ శంభుం బహుధా సోఽమరైర్మయా ।
రురోదాతి హరిస్తత్ర తారకార్తైర్మునీశ్వర ॥62॥

మునీశ్వరా! తారకపీడితులైన దేవతలతో, నాతో కలిసి ఈ ప్రకారంగా శ్రీహరి శివుణ్ని బహువిధాల స్తుతించి, అక్కడే నిలిచి విలపించాడు.

దుఃఖకోలాహలస్తత్ర బభూవ త్రిదివౌకసామ్ ।
మిశ్రితశ్శివసంస్తుత్యాఽసురార్తానాం మునీశ్వర ॥63॥

మునిపుంగవా! శ్రీహరి విలపిస్తే మేమూ విలపించాం. అందరూ తారకపీడితులమే. స్వర్లోకవాసుల దుఃఖం అలా శివసంస్తుతులతో సమ్మిశ్రితమై అప్పుడక్కడ పెద్ద కోలాహలమయింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే శివవిహారవర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥1॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు శివవిహారవర్ణనం అనే మొదటి అధ్యాయం సమాప్తం.

ద్వితీయోఽధ్యాయ – రెండవ అధ్యాయం

శివపుత్రజనన వర్ణనమ్ – శివపుత్రజనన వర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు అన్నాడు.

తదాకర్ణ్య మహాదేవో యోగజ్ఞానవిశారదః ।
త్యక్తకామో న తత్యాజ సంభోగం పార్వతీభయాత్ ॥1॥

మహాదేవుడు ఆ స్తుతివిలాపాలను విన్నాడు. ఆయన యోగవిద్యావిశారదుడు. కనక కామ భావనను విడిచిపెట్టాడు గానీ, పార్వతికి భయపడి, సంభోగసారమైన రేతస్సును మాత్రం విడిచిపెట్టలేదు. (త్యక్తుకామో– అని పాఠాంతరం)

అజగామ గృహద్వారి సురాణాం నికటం శివః ।
దైత్యేన పీడితానాం చ శంకరో భక్తవత్సలః ॥2॥

అలాగే శయనమందిరం గుమ్మందగ్గరికి వచ్చాడు. దైత్యపీడితులైన దేవతల చెంతకు తానే వచ్చాడు శంకరుడు, భక్తవత్సలుడు అయిన శివుడు.

దేవాస్సర్వే ప్రభుం దృష్ట్వా హరిణా చ మయా శివమ్ ।
బభూవుస్సుఖినశ్చాతి తదా వై భక్తవత్సలమ్ ॥3॥

నేనూ శ్రీమహావిష్ణువూ సకలదేవతలూ అందరు అప్పుడు భక్తవత్సలుడు, ప్రభువు అయిన శివుణ్ని చూసి ఎంతగానో సంతోషించాం.

ప్రణమ్య సుమహాప్రీత్యా నతస్కంధాశ్చ నిర్జరాః ।
తుష్టువుః శంకరం సర్వే మయా చ హరిణా మునే ॥4॥

నారదమునీ! అలా సంబరపడుతున్న దేవతలందరూ వినయంగా ముందుకు వంగి, శివుడికి నమస్కరించారు. నాతోనూ, శ్రీహరితోనూ సహా నిర్జరులందరూ శంకరుణ్ని స్తుతించాం.

దేవా ఊచుః – దేవతలు ఇలా స్తుతించారు.

దేవ దేవ! మహాదేవ! కరుణాసాగర! ప్రభో ।
అంతర్యామీ చ సర్వేషాం సర్వం జానాసి శంకర ॥5॥

దేవాధిదేవా! మహాదేవా! దయాసముద్రుడా! ప్రభూ! శంకరా! చరాచరజగత్తులో అంతటా నువ్వు ఉన్నావు. అంతర్యామివి. అన్నీ నీకే తెలుసు.

దేవకార్యం కురు విభో! రక్ష దేవాన్ మహేశ్వర! ।
జహి దైత్యాన్ కృపాం కృత్వా తారకాదీన్ మహాప్రభూన్ ॥6॥

విభూ! మహేశ్వరా! దేవకార్యం నిర్వర్తించు. దేవతలను రక్షించు. తారకాదిరాక్షసులు సమస్తలోకాలకూ వ్యాపిస్తున్నారు. మహాప్రభువులు అవుతున్నారు. మాపట్ల దయను వహించి, ఆ రాక్షసులనందరినీ సంహరించు.

ఇత్యాకర్ణ్య వచస్తేషాం సురాణాం భగవాన్ భవః ।
ప్రత్యువాచ విషణ్ణాత్మా దూయమానేన చేతసా ॥7॥

దేవతలందరూ చేస్తున్న విన్నపాలను భగవంతుడు భవుడు ఆలకించాడు. అంతరంగం విషాదభరిత మయ్యింది. మనస్సు కలతపడింది. బదులు పలికాడు.

శివ ఉవాచ – శివుడు ఇలా అన్నాడు.

హే విష్ణో హే విధే దేవా స్సర్వేషాం వో మనోగతిః ।
యద్భావి తద్భవత్యేవ కోఽపి నో తన్నివారకః ॥8॥

విష్ణుమూర్తీ! బ్రహ్మదేవుడా! దేవతలారా! మీ అందరి మనోరథం ఇది. జరుగబోయేదీ ఇదే. అది జరిగితీరుతుంది. ఎవ్వరూ దానిని తప్పించలేరు.

యజ్జాతం తజ్జాతమేవ ప్రస్తుతం శృణుతామరాః ।
శిరస్తః స్ఖలితం వీర్యం కో గ్రహీష్యతి మే ఽధునా ॥9॥

స గృహ్ణీయాదితి ప్రోచ్య పాతయామాస తద్భువి ।
అగ్నిర్భూత్వా కపోతో హి ప్రేరితస్సర్వ నిర్జరైః ॥10॥

అభక్షయచ్ఛంభవం వీర్యం చంచ్వా తు నిఖిలం తదా ।
ఏతస్మిన్నంతరే తత్రాజగామ గిరిజా మునే ॥11॥

అమరులారా! అయిన దేదో అయ్యింది. 'ప్రస్తుతం వినండి. నా శిరస్సునుంచి (మర్మావయావాగ్రభాగం) జారిపడే వీర్యాన్ని మీలో ఎవడు గ్రహిస్తాడో గ్రహించండి' అంటూ తన వీర్యాన్ని నేలమీదకు విడిచిపెట్టాడు. అప్పుడు దేవతల ప్రేరణతో అగ్నిదేవుడు ఒక పావురంగా మారి, తన ముక్కుతో ఆ వీర్యాన్ని మొత్తం తినివేశాడు. నారదమహర్షీ! అంతలో పారతీదేవి అక్కడికి వచ్చింది.

శివాగమవిలంబే చ దదర్శ సురపుంగవాన్ ।
జ్ఞాత్వా తద్ వృత్తాంతమఖిలం మహాక్రోధయుతా శివా ॥
ఉవాచ త్రిదివాన్ సర్వాన్ హరిప్రభృతికాంస్తదా ॥12॥

శయనమందిరం నుంచి బయటికి వెళ్ళిన శివుడు తిరిగిరావడం ఆలస్యమయ్యేసరికి పార్వతీదేవి తానే అక్కడికి వచ్చింది. సకలదేవతలనూ చూసింది. జరిగినదంతా తెలుసుకుంది. క్రోధవివశురాలయ్యింది. శ్రీహరితో మొదలుకొని సకలదేవతలనూ క్రోధంతో పలికింది.

రేరే సురగణాస్సర్వే యూయం దుష్టా విశేషతః ।
స్వార్థసంసాధకా నిత్యం తదర్థం పరదుఃఖదాః ॥13॥

ఓరోరీ దేవతలారా! మీరందరూ దుష్టులు. విశేషించి స్వార్థసాధకులు. ఎప్పుడూ మీ స్వార్థమే మీది. దాన్ని నెరవేర్చుకోవడం కోసం ఎదుటివాళ్ళను దుఃఖాలపాలు చేస్తారు.

స్వార్థహేతోర్మహేశానమారాధ్య పరమం ప్రభుమ్ ।
నష్టం చక్రుర్మద్విహారం వంధ్యాభవమహం సురాః ॥14॥

ఆ స్వార్థం కారణంగానే మీరంతా మహాప్రభువు పరమశివుణ్ణి ఇలా ఆరాధించి, నా కేళీవిహారాన్ని నష్టపరిచారు. సురలారా! మీ వల్ల నేను గొడ్రాలినయ్యాను.

మాం విరోధ్య సుఖం నైవ కేషాంచిదపి నిర్జరాః ।
తస్మాద్దుఃఖం భవేద్వో హి దుష్టానాం త్రిదివౌకసామ్ ॥15॥

నిర్జరులారా! నాతో వైరం పెట్టుకున్న వారికి ఎవ్వరికీ సుఖమనేదే ఉండదు. అందుచేత, దుష్టులారా! స్వర్గనివాసులారా! మీకందరికీ దుఃఖం తప్పదు. కలిగి తీరుతుంది.

ఇత్యుక్త్వా విష్ణుప్రముఖాన్ సురాన్ సర్వాన్ శశాప సా ।
ప్రజ్వలంతీ ప్రకోపేన శైలరాజసుతా శివా ॥16॥

అని పలికి, కోపంతో మండిపోతూ హిమశైలతనయ పార్వతీదేవి– శ్రీహరి ప్రభృతులను సకలదేవతలనూ శపించింది.

అద్యప్రభృతి దేవానాం వంధ్యా భార్యా భవంత్వితి ।
దేవాశ్చ దుఃఖితా స్సంతు నిఖిలా మద్విరోధినః ॥17॥

ఇప్పటినుంచీ దేవతల భార్యలందరూ గొడ్రాళ్ళు అవుతారనీ, తన విరోధులైన నిఖిలదేవతలూ దుఃఖితులవుతారనీ శపించింది.

ఇతి శప్త్వాఖిలాన్ దేవాన్ విష్ణ్వాద్యాన్ సకలేశ్వరీ ।
ఉవాచ పావకం క్రుద్ధా భక్షకం శివరేతసః ॥18॥

సకలేశ్వరి పార్వతీదేవి విష్ణుప్రభృతులను, అఖిలదేవతలనూ ఇలా శపించి, ఇంకా క్రుద్ధురాలై – శివరేతస్సును భక్షించిన అగ్నిదేవుణ్ణి ఇలా నిందించింది.

సర్వభక్షీ భవ శుచే! పీడితాత్మేతి నిత్యశః ।
శివతత్త్వం న జానాసి మూర్ఖో ఽసి సురకార్యకృత్ ॥19॥

ఓరీ అగ్నీ! (శుచీ!) నువ్వు సర్వభక్షకుడివి కమ్ము ! నిరంతరం పీడితుడివి కమ్ము! నువ్వు శివతత్త్వం ఎరగవు. దేవతలకోసం ఈ పని చేసి మూర్ఖుడివయ్యావు.

రేరే శఠ! మహాదుష్ట! దుష్టానాం దుష్టబోధవాన్ ।
అభక్షశ్శివవీర్యం యన్నాకార్షీరుచితం హి తత్ ॥20॥

ఓరోరీ! శఠుడా! మహాదుష్టుడా! దుష్టుల దుష్టబోధనలు విన్నావు. తినకూడని శివవీర్యం తిన్నావు. నువ్వు చేసినపని ఎంతమాత్రమూ ఉచితం కాదు.

ఇతి శప్త్వా శివా వహ్నిం సహేశేనా నగాత్మజా ।
జగామ స్వాలయం శీఘ్రు మసంతుష్టా తతో మునే ॥21॥

నారదా! అగ్నిదేవుణ్ని ఇలా శపించి పార్వతీదేవి, అసంతుష్టురాలై మహేశుడితో కలిసి, తమ శయన మందిరంలోకి విసవిసా వెళ్ళిపోయింది.

గత్వా శివా శివం సమ్యగ్బోధయామాస యత్నతః ।
అజీజనత్పరం పుత్రం గణేశాఖ్యం మునీశ్వర ॥22॥

శయనమందిరంలోకి వెళ్ళాక పార్వతీదేవి పలు ప్రయత్నాలతో శివుణ్ని మళ్ళీ పూర్తిగా మేలుకొల్పింది. నారదమునీ! అటుపైని మరొక పుత్రుడికి జన్మనిచ్చింది. అతడి పేరు గణేశుడు.

తద్వృత్తాంతమశేషం చ వర్ణయిష్యే మునేఽగ్రతః ।
ఇదానీం శృణు సుప్రీత్యా గుహోత్పత్తిం వదామ్యహమ్ ॥23॥

దేవర్షీ! ఆ గణేశుడి వృత్తాంతాన్ని సమగ్రంగా మునుముందు వివరిస్తాను గానీ ఇప్పుడు గుహుడి జన్మకథను చెబుతున్నాను. ఇష్టంతో ఆలకించు.

పావకాదితమన్నాది భుంజతే నిర్జరాః ఖలు ।
వేదవాణ్యేతి సర్వే తే సగర్భా అభవన్ సురాః ॥24॥

పుత్రకా! నారదా! హవిస్సుగానీ, మరేదిగానీ అగ్నిదేవుడు భుజించిన దానినే దేవతలందరూ భుజిస్తారని గదా వేదవాక్కు (అగ్నిభుజిస్తే అందరు దేవతలు భుజించినట్టే). అందుచేత స్వర్గవాసులైన సురలందరూ గర్భం ధరించారు.

తతోఽసహంతస్తద్వీర్యం పీడితా హ్యభవన్ సురాః ।
విష్ణ్వాద్యా నిఖిలాశ్చాపి శివాజ్ఞానష్టబుద్ధయః ॥25॥

నా వీర్యాన్ని ఎవరు గ్రహిస్తారో గ్రహించండి అని శివుడు ఆజ్ఞాపించడంతో అనాలోచితంగా (నష్టబుద్ధులై) అగ్నిని ప్రేరేపించిన దేవతలందరూ విష్ణుమూర్తితో సహా ఇప్పుడు దాన్ని తమ గర్భాలలో భరించలేక చాలా యాతన పడ్డారు.

అథ విష్ణుప్రభృతికాస్సర్వే దేవా విమోహితాః ।
దహ్యమానా యయుః శీఘ్రుం శరణం పార్వతీపతేః ॥26॥

అప్పుడిక ఏమి చేయ్యాలో తోచక (విమోహితులు), దహించి వేస్తున్న శివతేజస్సును తాళలేక, విష్ణుప్రభృతులు దేవతలందరూ పరుగుపరుగున వెళ్ళి, శివుణ్ని శరణువేడారు.

శివాలయస్య తే ద్వారి గత్వా సర్వే వినమ్రకాః ।
తుష్టువుస్సశివం శంభుం ప్రీత్యా సాంజలయస్సురాః ॥27॥

శివాలయం ముంగిట నిలబడ్డారు. వినమ్రులై నిలబడ్డారు. ప్రితితోస్మరిస్తూ నిలబడి సాదరంగా శివుణ్ని స్తుతించారు.

దేవ దేవ మహాదేవ గిరిజేశ మహాప్రభో ।
కిం జాతమధునా నాథ తవ మాయా దురత్యయా ॥28॥

దేవాధిదేవా! మహాదేవా! గిరిజావల్లభా! మహాప్రభూ! ఇప్పుడు ఏమిటి అయ్యింది మాకు? నీ మాయ దురతిక్రమం స్వామీ!

సగర్భాశ్చ వయం జాతా దహ్యమానాశ్చ రేతసా ।
తవ శంభో కురు కృపాం నివారయ దశామిమామ్ ॥29॥

మేమందరం గర్భధారులమయ్యాం. నీ రేతస్సును భరించలేక మాడిపోతున్నాం. శంకరా! శంభో! దయ చూపించు. ఈ అవస్థను వారించు.

ఇత్యాకర్ణ్యామరనుతిం పరమేశశ్శివాపతిః ।
ఆజగామ ద్రుతం ద్వారి యత్ర దేవాః స్థితా మునే ॥30॥

నారదా! దేవతల ఈ ప్రార్థనను ఆలకించిన పార్వతీపతి వారందరూ నిలిచిన ముంగిటికి వేగంగా వచ్చాడు.

ఆగతం శంకరం ద్వారి సర్వే దేవాశ్చ సాచ్యుతాః ।
ప్రణమ్య తుష్టువుః ప్రీత్యా నర్తకా భక్తవత్సలమ్ ॥31॥

అలా ముంగిటికి వచ్చిన శంకరుణ్ని శ్రీహరితో సహా దేవతలందరూ నమస్కరించారు. శిరస్సులు వంచి, ఆ భక్తవత్సలుణ్ని భక్తితో స్తుతించారు.

శంభో శివ మహేశాన త్వాం నతాస్మ విశేషతః ।
రక్ష నశ్శరణాపన్నాన్ దహ్యమానాంశ్చ రేతసా ॥32॥

శంభో! శివా! మహేశా! తలలు వంచి విశేషంగా నీకు నమస్కరిస్తున్నాం. ఆపన్నుల మయ్యాం. నీ రేతస్సుతో మాడిపోతున్నాం. నిన్నే శరణు వేడుతున్నాం. మహాప్రభో! రక్షించు.

ఇదం దుఃఖం హర! హర భవామో హి మృతా ధ్రువమ్ ।
త్వాం వినా కస్సమర్థో ఽద్య దేవదుఃఖనివారణే ॥33॥

హరా! శంకరా! మా ఈ దుఃఖాన్ని తొలగించు. లేదంటే మాకు చావు తప్పదు. ఇది తథ్యం. ఇవ్వేళ నువ్వు తప్ప మా దుఃఖాన్ని వారించగల్గిన సమర్థుడు ఎవడు?

ఇతి దీనతరం వాక్యమాకర్ణ్య సురరాట్ ప్రభుః ।
ప్రత్యువాచ విహస్యాథ స సురాన్ భక్తవత్సలః ॥34॥

ఈ దీనాలాపాలను ఆలకించి, భక్తవత్సలుడూ దేవతల అధిపతి, ప్రభువూ అయిన శంకరుడు అప్పుడు పెద్దగా నవ్వి, ఇలా బదులు పలికాడు.

హే హరే హే విధే దేవాస్సర్వే శృణుత మద్వచః ।
భవిష్యతి సుఖం వోఽద్య సావధానా భవంతు హి ॥35॥

ఓయీ శ్రీహరీ! ఓయీ విరించీ! సకల దేవతలారా! నేను చేప్పేది ఆలకించండి. మీ కందరికీ ఇవ్వేళనే సుఖం కలుగుతుంది. సావధానులు అవ్వండి!

ఏతద్వమత మద్వీర్యం ద్రుతమేవాఖిలాస్సురాః ।
సుఖినస్తద్విశేషేణ శాసనాన్మమ సుప్రభోః ॥36॥

వెంటనే దేవతలందరూ మీమీ గర్భాలలో ఉన్న నా వీర్యాన్ని వెళ్ళగక్కండి. విశేషకృత్యం చేస్తే తక్షణం మీరు సుఖపడతారు. మీరందరూ మెచ్చిన ఏలికను గదా! ఇది నా ఆజ్ఞ.

ఇత్యాజ్ఞాం శిరసాధాయ విష్ణ్వాద్యాస్సకలాస్సురాః ।
అకార్ష్టుర్వమనం శీఘ్రం స్మరంతశ్శివమవ్యయమ్ ॥37॥

ఈ ఆజ్ఞను శిరసావహించి, విష్ణు ప్రభృతులు సకలసురలూ అవ్యయుడైన ఆ పరమశివుణ్నే తలుచుకుంటూ, శీఘ్రంగా వీర్యవమనం చేశారు.

తచ్ఛంభురేతః స్వర్ణాభం పర్వతాకారమద్భుతమ్ ।
అభవత్పతితం భూమౌ స్పృశద్ ద్యామేవ సుప్రభమ్ ॥38॥

బంగారంలాగే ఉన్న ఆ శివరేతస్సు భూమిమీద పడింది. ఆశ్చర్యకరంగా అది ఒక పర్వతమంత అయ్యింది. కాంతులీనుతూ మిన్నుముట్టింది.

అభవన్సుఖినస్సర్వే ఽసురాస్సర్వేఽచ్యుతాదయః ।
అస్తువన్ పరమేశానం శంకరం భక్తవత్సలమ్ ॥39॥

అచ్యుతుడితో సహా దేవతలందరికీ కడుపు బాధ తొలగిపోయింది. సుఖపడ్డారు. భక్తవత్సలుడైన శంకరుణ్ని ఆ పరమేశ్వరుణ్ని మళ్ళీ స్తుతించారు.

పావకస్తుఅభవన్నైవ సుఖీ తత్ర మునీశ్వర ।
తస్యాజ్ఞాం పరమోఽదాద్వై శంకరః పరమేశ్వరః ॥40॥

నారదా! అగ్నిదేవుడికి మాత్రం ఈ బాధ తొలగలేదు. సుఖం కలగలేదు. అతడికోసం పరముడూ, పరమేశ్వరుడు అయిన శంకరుడు ప్రత్యేకంగా ఒక ఆనతి ఇచ్చాడు.

తతస్స వహ్నిర్వికలః సాంజలిర్నతకో మునే ।
అస్తౌచ్ఛివం సుఖీ నాత్మా వచనం చేదమబ్రవీత్ ॥41॥

అందరికీ బాధతొలగింది. సుఖం కలిగింది. తనకే అలా జరగలేదు. వహ్నిదేవుడి మనస్సు వికలమయ్యింది. వినతుడై నమస్కరిస్తూ శివుణ్ని స్తుతించాడు. తాను సుఖి కాలేకపోయి ఇలా పలికాడు.

అగ్నిరువాచ – అగ్ని ఇలా పలికాడు.

దేవ దేవ మహేశాన మూఢోఽహం తవ సేవకః ।
క్షమస్వ మేఽపరాధం హి మమ దాహం నివారయ ॥42॥

త్వం దీనవత్సలః స్వామిన్! శంకరః పరమేశ్వరః
ఇత్యువాచ ప్రసన్నాత్మా పావకో దీనవత్సలమ్ ॥43॥

'దేవదేవా! మహేశా! నేను మూర్ఖుణ్ని కానీ నీ సేవకుణ్ని. నా అపరాధం క్షమించు. నా తాపం చల్చార్చు. స్వామీ! నువ్వు దీనులపట్ల ప్రేమకలవాడివి. సుఖం కరుడవు. పరమేశ్వరుడవు.' శరుణుజొచ్చిన అగ్నిదేవుడు దీనవత్సలుడికి ఇలా మొరపెట్టుకున్నాడు.

బ్రహ్మ ఉవాచ – బ్రహ్మ ఇలా అన్నాడు.

ఇత్యాకర్ణ్య శుచేర్వాణీం స శంభుః పరమేశ్వరః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా పావకం దీనవత్సలః ॥44॥

అగ్నిదేవుడి ఈ మొరను పరమేశ్వరుడు శంభుడు ఆలించాడు. ఆ దీనవత్సలుడు ప్రసన్నుడయ్యాడు. అగ్నికి ఇలా బదులిచ్చాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

కృతం త్వనుచితం కర్మ మద్రేతో భక్షితం హి యత్ ।
అతోఽనిర్వృత్తస్తే దాహః పాపాధిక్యాన్మదాజ్ఞయా ॥45॥

అగ్నీ! నువ్వు తగని పనిచేశావు. నా రేతస్సును భక్షించావు. కనక ఈ మహాపాపం వల్లనూ, నా ఆజ్ఞవల్లనూ నీ తాపం ఉపశమించలేదు.

ఇదానీం త్వం సుఖీ నామ శుచే మచ్ఛరణాగతః ।
అతః ప్రసన్నో జాతోఽహం సర్వం దుఃఖం వినశ్యతి ॥46॥

ఇప్పుడిక సుఖివి అవుతావు. నన్ను శరణు పొందావు కదూ ! అందుకుని నేను ప్రసన్నుణ్ని అయ్యాను. వహ్నిదేవా! నీ దుఃఖమంతా తొలగిపోతుంది.

కస్యాశ్చిత్ సుస్త్రియా యోనౌ మద్రేతస్త్యజ యత్నతః ।
భవిష్యసి సుఖీ త్వం హి నిర్దాహాత్మా విశేషతః ॥47॥

పావకా! ఎవరైనా ఒక పవిత్రురాలి గర్భంలో నా రేతస్సును జాగ్రత్తగా నిక్షేపించు. నువ్వు సుఖివవుతావు. విశేషించి నీ తాపం తీరిపోతుంది.

బ్రహ్మోవాచ – బ్రహ్మ చెప్పాడు.

శంభువాక్యం నిశమ్యేతి ప్రత్యువాచ శనైశ్శుచిః ।
సాంజలిర్నతకః ప్రీత్యా శంకరం భక్తశంకరమ్ ॥48॥

శివుడి మాటను ఆకర్ణించి, అగ్నిదేవుడు మెల్లగా మారుపలికాడు. ముందుకి వంగి శిరస్సువంచి భక్తితో నమస్కరిస్తూ – భక్తులకు శుభంకరుడైన ఆ శంకరుడితో ఇలా అన్నాడు.

దురాసదమిదం తేజస్తవ నాథ మహేశ్వర ।
కాచిన్నాస్తి వినా శక్త్యా ధర్తుం యోనౌ జగత్త్రయే ॥49॥

ప్రభూ! మహేశ్వరా! భరింపరానిది నీ తేజస్సు. ముల్లోకాలలోనూ ఆదిపరాశక్తి పార్వతీదేవి ఒక్కతె తప్ప దీనిని గర్భంలో ధరించగల్గిన భరించగల్గిన పవిత్రురాలు మరొకరు లేనేలేరు.

ఇత్థం యదాఽబ్రవీద్వహ్నిస్తదా త్వం మునిసత్తమ ।
శంకరప్రేరితః ప్రాత్థ హృదాగ్నిముపకారకః ॥50॥

నారదా! మునిశ్రేష్ఠా! అగ్నిదేవుడు ఇలా పలికే సమయానికి సరిగ్గా నువ్వు అక్కడికి వచ్చావు. శంకరప్రేరితుడవై అగ్నికి ఉపకారం చెయ్యాలనే మనస్సుతో అదే సమయానికి వచ్చావు.

నారద ఉవాచ – నారదుడు అన్నాడు.

శృణు మద్వచనం వహ్నే! తవ దాహహరం శుభమ్ ।
పరమానందదం రమ్యం సర్వకష్టనివారకమ్ ॥51॥

వహ్నిదేవా! నేను చేప్పే మాట విను. ఇది నీ తాపాన్ని తొలగిస్తుంది. శుభం కలిగిస్తుంది. ఇది ఆనందదాయకం. అతి సుందరం కూడాను. సర్వకష్టాలను పారద్రోలుతుంది.

కృత్వోపాయమిమం వహ్నే సుఖీ భవ విదాహకః ।
శివేచ్ఛయా మయా సమ్యగుక్తం తాతేదమాదరాత్ ॥52॥

వింటున్నావా పావకా! నేను చేప్పే ఉపాయం ఆచరించి సుఖపడు. తాపం పోగొట్టుకో. ఇది శివుడి కోరిక మీద చెబుతున్నాను. నాయనా! నీ మీద ఆదరంతో చెబుతున్నాను. ఇదిగో విను.

తపోమాస స్నానకర్తృః స్త్రియో యాః స్యుః ప్రగే శుచే ।
తద్దేహేషు స్థాపయ త్వం శివరేతస్త్విదం మహత్ ॥53॥

శుచిదేవా! ఈ మాఘమాసంలో తెల్లవారుజామున నదీస్నానాలు చేసే స్త్రీలను గుర్తించు.వారి (గర్భాలలో) శరీరాలలో మహామహిమాన్వితమైన ఈ శివరేతస్సును నిక్షేపించు.

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు అన్నాడు.

తస్మిన్నవసరే తత్రాగతాస్సప్తమునిస్త్రియః ।
తపో మాసి స్నానకామాః ప్రాతస్స్నాయమా మునే ॥54॥

అదే సమయానికి సప్తమహర్షుల భార్యలు అటువైపు వచ్చారు. అది మాఘమాసం, ప్రాతఃస్నానవ్రతాన్ని వారు పాటిస్తున్నారు. అందుకని నారదమునీ! వారు అటువైపు వచ్చారు.

స్నానం కృత్వా స్త్రియస్తా హి మహాశీతార్దితశ్చ షట్ ।
గంతుకామా మునే యాతా వహ్నిజ్వాలాసమీపతః ॥55॥

గంగానదిలో పవిత్రంగా స్నానాలు చేశారు. వారిలో ఆరుగురు చలితో వణికిపోతున్నారు. నారదా! అయినా అలాగే తిరిగి ఇళ్ళకు వెళ్ళిపోదామనుకుంటూనే (గట్టున ఉన్న) అగ్నిజ్వాలకు చేరువగా నడకసాగించారు.

విమోహితాశ్చ తా దృష్ట్వారుంధతీ గిరిశాజ్ఞయా ।
నిషిషేధ విశేషేణ సుచరిత్రసుబోధినీ ॥56॥

ఇలా ఆరుగురు ఋషిపత్నులూ వివశలు కావడాన్ని గుర్తించింది అరుంధతి. అరుంధతీదేవి ఎప్పుడూ వారందరికీ మేలిమి నడివడికను బోధిస్తూ ఉంటుంది. ఇప్పుడుకూడా అలాగే శివుడి ఆజ్ఞమేరకు వారిని తీవ్రంగానే వారించింది.

తాఃషట్ మునిస్త్రియో మోహాత్ హఠాత్తత్ర గతా మునే ।
స్వశీతవినివృత్త్యర్థం మోహితాః శివమాయయా ॥57॥

కానీ, నారదమునీ! ఆ ఆరుగురు మునిపత్నులు మోహంలో మునిగిపోయారు. దానితో వారిలో ఒక పట్టుదల (హఠం) పొడసూపింది. అరుంధతి మాటలు పెడచెవిని పెట్టారు. తమ చలిని వదిలించుకోవడం కోసం అగ్ని చెంతకే వెళ్ళారు. ఇదంతా శివుడిమాయ. మునిపత్నులైనా మోహంలో మునిగిపోయారు.

తద్రేతఃకణికాస్సద్యస్తద్దేహాన్ వివిశుర్మునే ।
రోమద్వారాఽఖిలా వహ్నిరభూద్దాహవివర్జితః ॥58॥

అప్పుడు – అగ్నిలో ఉన్న శివరేతస్సు అంతా చిన్న చిన్న రవ్వలుగా వారి దేహాలలోకి రోమరంధ్రాల ద్వారా ప్రవేశించింది. దేవర్షీ! అగ్నిదేవుడి తాపం చల్లారింది.

అంతర్ధాయ ద్రుతం వహ్నిః జ్వాలారూపో జగామ హ ।
సుఖీ స్వలోకం మనసా స్మరంస్త్వాం శంకరం చ తమ్ ॥59॥

జ్వాలారూపుడైన వహ్నిదేవుడు చటుక్కున అంతర్ధానం అయ్యాడు. నారదమహర్షీ! మనస్సులో నిన్నూ, ఆ శంకరుణ్ణి తలుచుకుంటూ ఆ పావకుడు సుఖంగా తన నివాసలోకం చేరుకున్నాడు.

సగర్భాస్తాః స్త్రియస్సాధోఽభవన్ దాహప్రపీడితాః ।
జగ్ముః స్వభవనం తాతారుంధతీ దుఃఖితాగ్నినా ॥60॥

సాధుసత్తమా! ఆ మునిపత్నులు ఆరుగురూ అలా గర్భవతులయ్యారు. తాపాన్ని తట్టుకోలేక ఆయాసపడుతూనే తమ తమ ఆశ్రమాలకు చేరుకున్నారు. కానీ, నాయనా! అరుంధతి మాత్రం అగ్నిదేవుడు చేసిన ఈ పనికి చాలా నొచ్చుకుంది. దుఃఖపడింది.

దృష్ట్వా స్వస్త్రీ గతిం తాత నాథాః క్రోధాకులా ద్రుతమ్ ।
తత్యజుస్తాః స్త్రియస్తాత సుసమ్మంత్ర్య పరస్పరమ్ ॥61॥

తనయా! తమ భార్యల దుఃస్థితి తెలిసి వారి భర్తలు క్రోధంతో ఊగిపోయారు. ఆరుగురు ముసులూ సమావేశమై పరస్పరం లోతుగా చర్చించుకున్నారు. తండ్రీ! మరుక్షణంలో భార్యలను విడిచిపెట్టేశారు.

అథ తాః షట్ స్త్రియస్సర్వా దృష్ట్వా స్వవ్యభిచారకమ్ ।
మహాదుఃఖాన్వితాస్తా తాఽభవన్నాకులమానసాః ॥62॥

పుత్రకా! అటుపై ఆ ఆరుగురు మునిపత్నులూ తమకు జరిగిన శీలభంగం ఏమిటో తెలుసుకున్నారు. దారుణంగా విలపించారు. వారి మనస్సులు అతలాకుతలమయ్యాయి.

తత్యజుశ్శివరేతస్తద్గర్భరూపం మునిస్త్రియః ।
తా హిమాచలపృష్ఠేఽథాభవన్ దాహ వివర్జితాః ॥63॥

అటుపై ఆ ఋషిపత్నులు తమ గర్భాలలోని ఆ శివవీర్యాన్ని హిమవత్పర్వతం సానువుల్లో ఒకచోట విడిచిపెట్టేశారు. అంతే, వారి తాపం తొలగిపోయింది.

అసహన్ శివరేతస్తత్ హిమాద్రిః కంపముద్వహన్ ।
గంగాయాం ప్రాక్షిపత్తూర్ణమసహ్యం దాహపీడితః ॥64॥

అవ్వడానికి అతడు మంచుకొండయే కానీ, శివరేతస్సును ఓర్చుకోలేక వణికిపోయాడు. తాపపీడితుడయ్యాడు. ఆలస్యం చెయ్యకుండా ఆ రేతస్సును గంగాలోకి వదిలేశాడు.

గంగయాఽపి చ తద్వీర్యం దుస్సహం పరమాత్మనః ।
నిఃక్షిప్తం హి శరస్తంబే తరంగైః స్వైర్మునీశ్వర ॥65॥

మునీశ్వరా! నారదా! గంగానదికి సైతం ఆ పరమాత్మవీర్యం దుస్సహమయ్యింది. తట్టుకోలేకపోయింది. మెల్లగా తన తరంగాలతో ఆ వీర్యాన్ని గట్టునఉన్న రెల్లుపొదలోకి నెట్టివేసింది.

పతితం తత్ర తద్రేతో ద్రుతం బాలో బభూవ హ ।
సుందరస్సుభగఃశ్రీమాన్ తేజస్వీ ప్రీతివర్ధనః ॥66॥

నాయనా! అలా రెల్లుపొదకు చేరుకున్న ఆ శివరేతస్సు అదే నిముషంలో ఒక బాలుడుగా రూపు దాల్చింది. ఆ బాలుడు చాలా అందంగా ఉన్నాడు. సలక్షణంగా ఉన్నాడు. (అవయవాల పొందిక అమరిక సాముద్రిక శాస్త్రానికి అనుగుణంగా ఉండటం– సుభగత్వం) ఒకానొక దివ్యశోభతో కళకళలాడుతున్నాడు. ఒక దివ్యతేజస్సుతో మిలమిల లాడుతున్నాడు. చూపరులకు ప్రీతిగొల్పుతున్నాడు.

మార్గమాసే సితే పక్షే తిథే షష్ట్యాం మునీశ్వర ।
ప్రాదుర్భవో ఽభవత్తస్య శివపుత్రస్య భూతలే ॥67॥

మునిపుంగవా! ఆ బాలుడు జన్మించిన వేళా విశేషమేమంటే – మార్గశీర్షమాసం శుక్లపక్షం షష్ఠినాడు ఆ శివపుత్రుడు భూమి మీద అవతరించాడు.

తస్మిన్నవసరే బ్రహ్మన్! అకస్మాద్ధిమశైలజా ।
అభూతాం సుఖినౌ తత్ర స్వగిరౌ గిరిశోఽపి చ ॥68॥

శివాకుచాభ్యాం సుస్రావ పయ ఆనందసంభవమ్ ।
తత్ర గత్వా చ సర్వేషాం సుఖమాసీన్మునే ఽధికమ్ ॥69॥

బ్రహ్మదేవా! సరిగ్గా అదే సమయానికి తమ కైలాసపర్వతం మీద నివసిస్తున్న పార్వతీ పరమేశ్వరులకు అకస్మాత్తుగా ఒక ఆనందం పరిమళించింది. ఇద్దరూ సంబరపడ్డారు. పార్వతీదేవికైతే ఆ ఆనందంతో స్తనాలనుంచి పాలు ఊరాయి. మునీశ్వరా! శివపుత్రుడు ప్రాదుర్భవించిన ఆ ప్రవిత్రస్థలానికి వెళ్ళిన వారి కల్లా ఇబ్బడి ముబ్బడిగా సుఖసంతోషాలు వెల్లివిరిశాయి.

మంగళం చా భవత్తాత! త్రిలోక్యాం సుఖదం సతామ్ ।
ఖలానామభవద్విఘ్నో దైత్యానాం చ విశేషతః ॥70॥

తనయా! ఆ సుముహూర్తమూ, ఆ ప్రాదుర్భావమూ ముల్లోకాలలోనూ సజ్జనులకు శుభప్రదమూ, సుఖప్రదమూ అయ్యింది. దుర్జనులకు విఘ్నకారకమయ్యింది. రాక్షసులకైతే మరింత విఘ్నదాయకమయ్యింది.

అకస్మాదభవద్ వ్యోమ్ని పరమో దుందుభిధ్వనిః ।
పుష్పవృష్టిః పపాతాశు బాలకోపరి నారద ॥71॥

నారదా! ఆ శుభవేళ అకస్మాత్తుగా ఆకాశాన దేవదుందుభులు ధ్వనించాయి. వెనువెంటనే బాలకుడి మీద పూలవాన కురిసింది.

విష్ణ్వాదీనాం సమస్తానాం దేవానాం మునిసత్తమ ।
అభవదకస్మాత్పరమ ఆనందః పరమోత్సవః ॥72॥

మునివర్యా! శ్రీహరి ప్రభృతులగు దేవతలకందరికీ ఆక్షణాన ఉన్నట్టుండి ఆనందం కలిగింది. ఒక మహోత్సవం రూపుదాల్చింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయం చతుర్థే కుమారఖండే శివపుత్రజనన వర్ణనం నామ ద్వితీయో ఽధ్యాయస్సమాప్తః ॥2॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు శివపుత్రజనన వర్ణనం అనే రెండవ అధ్యాయం సమాప్తం.

తృతీయోఽధ్యాయః – మూడవ అధ్యాయం

కార్తికేయ లీలావర్ణనమ్ – కార్తికేయ లీలావర్ణనం

నారద ఉవాచ – నారదుడు అడుగుతున్నాడు.

దేవదేవ ప్రజానాథ బ్రహ్మన్ సృష్టికర ప్రభో ।
తతః కిమభవత్తత్ర తద్వదాద్య కృపాం కురు ॥1॥

జీవకోటికి నాథుడా! సృష్టికర్తా! దేవదేవా! తండ్రీ! బ్రహ్మదేవా! అటుపైన అక్కడ ఏమి జరిగిందో దయచేసి ఇప్పుడు తెలియజెప్పు.

తస్మిన్నవసరే తాత విశ్వామిత్రః ప్రతాపవాన్ ।
ప్రేరితో విధినా తత్రాగచ్ఛత్ ప్రీతో యదృచ్ఛయా ॥2॥

బిడ్డా! సరిగ్గా అదే సమయానికి ప్రతాపశాలి విశ్వామిత్రుడు విధిప్రేరితుడై యాదృచ్ఛికంగా అక్కడికి వచ్చాడు. సంప్రీతుడయ్యాడు.

స దృష్ట్వాఽలౌకికం ధామ తత్సుతస్య సుతేజసః ।
అభవత్పూర్ణకామస్తు సుప్రసన్నో ననామ చ ॥3॥

అలా వచ్చిన విశ్వామిత్రుడు అక్కడ దివ్యతేజస్సుతో విరాజిల్లుతున్న ఆ బాలుడి అలౌకిక కాంతి విశేషాన్ని దర్శించాడు. పూర్ణకాముడయ్యాడు. సుప్రసన్నుడయ్యాడు. శిరసు వంచి నమస్కరించాడు.

అకరోత్సునుతిం తస్య సుప్రసన్నేన చేతసా ।
విధి ప్రేరితవాగ్భిశ్చ విశ్వామిత్రః ప్రభావవిత్ ॥4॥

ఆ బాలుడి ప్రభావం తెలుసుకోగలిగాడు. విశ్వామిత్రుడి అంతరంగం మరింత ప్రసన్నమయ్యింది. విధిప్రేరితమైన వాక్కులు వెలవడ్డాయి. బాలుడిని గొప్పగా స్తోత్రం చేశాడు.

తతస్సో ఽభూత్ సుతస్తత్ర సుప్రసన్నో మహాఽతికృత్ ।
సుప్రహస్యాద్భుతమహో విశ్వామిత్రమువాచ హ ॥5॥

ఆ ప్రదేశంలో వెలుగును ద్విగుణితం చేస్తున్న ఆ బాలుడు విశ్వామిత్రుడి స్తోత్రానికి ఎంతగానో ప్రసన్నుడయ్యాడు. అహో! అద్భుతంగా హాయిగా నవ్వాడు. ఆ మహర్షితో ఇలా పలికాడు.

శివసుత ఉవాచ – శివకుమారుడు అన్నాడు.

శివేచ్ఛయా మహాజ్ఞానిన్! అకస్మాత్ త్వమిహాగతః ।
సంస్కారం కురు మే తాత! యథావద్వేదసమ్మితమ్ ॥6॥

సత్యజ్ఞానసంపన్నా! హఠాత్తుగా నీవు ఇప్పుడు ఇక్కడికి రావడం కేవలం శివేచ్ఛ. శివసంకల్పంతో వచ్చావు. కనక వేదసమ్మతంగా నాకు జాతకర్మాది సంస్కారాలు జరిపించు తండ్రీ!

అద్యారభ్య పురోధాస్త్వం భవ మే ప్రీతిమావహన్ ।
భవిష్యసి సదా పూజ్యస్సర్వేషాం నాత్ర సంశయః ॥7॥

ఇప్పటి నుంచి నువ్వు నాకు పురోహితుడిగా వ్యవహరించు. ఆనందం కలిగించు. ఇక అందరికీ నువ్వు పూజ్యుడవవుతావు. సందేహం లేదు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య సుప్రసన్నో హి గాధిజః ।
తమువాచానుదాత్తేన స్వరేణ చ సువిస్మితః ॥8॥

ఆ బాలకుడి ఈ మాటలు ఆలకించి గాధినందనుడు విశ్వామిత్రుడు మరింతగా ప్రసన్నుడయ్యాడు. ఆశ్చర్యచకితుడయ్యాడు. మధ్యమస్థాయి కంఠస్వరంతో బదులు పలికాడు. అనుదాత్త స్వరముతో పలికాడు.

విశ్వామిత్ర ఉవాచ – విశ్వామిత్రుడు అన్నాడు.

శృణు తాత న విప్రోఽహం గాధిక్షత్రియ బాలకః ।
విశ్వామిత్రేతి విఖ్యాతః క్షత్రియో విప్రసేవకః ॥9॥

నాయనా! నేను చెప్పేది కాసింత విను. నేను బ్రాహ్మణుణ్ణి కాను. గాధి అనే క్షత్రియుడి కుమారుణ్ణి. విశ్వామిత్రుడని లోకప్రసిద్ధి. నేను బ్రాహ్మణసేవకుడనై క్షత్రయుణ్ణి.

ఇతి స్వచరితం ఖ్యాతం మయా తే వరబాలక ।
కస్త్వం స్వచరితం బ్రూహి విస్మితాయాఖిలం హి మే ॥10॥

బాలకోత్తమా! ఇదీ నా చరిత్ర. నీకు తెలియపరిచాను. మరి నువ్వు ఎవరు? ఆశ్చర్యచకితుడినైన నాకు నీ చరితం సమగ్రంగా తెలియపరుచు.

బ్రహ్మోవాచ – బ్రహ్మపలికాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య తత్ స్వవృత్తం జగాద హ ।
తతశ్చోవాచ సుప్రీత్యా గాధిజం తం మహౌతికృత్ ॥11॥

ఆ బాలకుడో ఈ అభ్యర్థనను విన్నాడు. తన వృత్తాంతం తెలియజెప్పాడు. అక్కడి వెలుగును తన తేజస్సుతో ద్విగుణితం చేస్తున్న ఆ చిన్నారి మరింత సుప్రీతుడై గాధినందనుడితో ఇంకా ఇలా అన్నాడు.

శివసుత ఉవాచ – శివపుత్రుడు పలికాడు.

విశ్వామిత్ర వరాన్మే త్వం బ్రహ్మర్షిర్నాత్ర సంశయః ।
వశిష్ఠాద్యాశ్చ నిత్యం త్వాం ప్రశంసిష్యంతి చాదరాత్ ॥12॥

విశ్వామిత్రా! నువ్వు బ్రహ్మర్షివి. ఇదినా వరం. ఇందులో ఏ సంశయమూ లేదు. వశిష్ఠుడితో సహా మహర్షులు అందరూ నిన్నిక సగౌరవంగా నిరంతరం మెచ్చుకుంటారు.

అతస్త్వమాజ్ఞయా మే హి సంస్కారం కర్తుమర్హసి ।
ఇదం సర్వం సుగోప్యం తే కథనీయం న కుత్రచిత్ ॥13॥

అందుచేత ఓ బ్రహ్మర్షీ! నువ్వు నాకు జాతకర్మాదిసంస్కారాలు చేయడానికి పూర్తిగా అర్హుడివి. ఇది అంతా చాలా రహస్యం సుమా! ఎక్కడా ఎవరికీ చెప్పకు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

తతోఽకార్షీత్స సంస్కారం తస్య ప్రీత్యాఖిలం యథా ।
శివబాలస్య దేవర్షే! వేదోక్తవిధినా పరమ్ ॥14॥

దేవర్షీ! నారదా! ఆ మీదట విశ్వామిత్రుడు చాలా ప్రేమతో ఆ శివబాలుడికి వేదోక్త విధివిధానాలతో జాతకర్మాది సంస్కారాన్ని ఉత్తమంగా జరిపించాడు.

శివబాలోఽపి సుప్రీతో దివ్యజ్ఞానమదాత్పరమ్ ।
విశ్వామిత్రాయ మునయే మహోఽతికారకః ప్రభుః ॥15॥

అప్పుడు – మహాతేజస్వీ, ప్రభువూ అయిన ఆ శివనందనుడు సంప్రీతుడయ్యాడు. మహర్షి విశ్వామిత్రుడికి దివ్యజ్ఞానాన్ని ప్రసాదించాడు.

పురోహితం చకారాసౌ విశ్వామిత్రం శుచేస్సుతః ।
తదారభ్య ద్విజవరో నానాలీలావిశారదః ॥16॥

అగ్నిపుత్రుడు కూడా అయిన ఆ శివబాలకుడు ఇలా విశ్వామిత్రుణ్ని తనకు పురోహితుణ్ని చేసుకున్నాడు. అది మొదలుకొని ఆ బాలుడు ద్విజవరుడయ్యాడు. అనేక లీలావిశేషాలను ప్రదర్శించడంలో నేర్పరి అయ్యాడు.

విశేషం – విశ్వామిత్రుడు జరిపిన సంస్కారాలలో ఉపనయనసంస్కారంగా కూడా ఉన్నదన్నమాట. కనకనే ఆ బాలుడు ద్విజుడు అయ్యాడు. ఉపనయనమనేది రెండవ జన్మ అంటారు.

ఇత్థం లీలా కృతా తేన కథితా సా మయా మునే ।
తల్లీలామపరాం తాత శృణు ప్రీత్యా వదామ్యహమ్ ॥17॥

నారదమునీ! ఈ ప్రకారంగా ఆ బాలుడు జరిపిన మొట్టమొదటి లీలావిశేషాన్ని నీకు తెలియజెప్పాను. ఇంకొక లీలను చెబుతున్నాను. నాయనా! ఆనందంగా ఆలకించు.

తస్మిన్నవసరే తాత! శ్వేతనామా చ సంప్రతి ।
తత్రాపశ్యత్సుతం దివ్యం నిజం పరమపావనమ్ ॥18॥

పుత్రకా! ఆ తరుణంలో ఒకనాడు శ్వేతనామకుడైన అగ్నిదేవుడు అక్కడికి వచ్చాడు. పరమపావనుడూ, దివ్యుడూ అయిన తన పుత్రుణ్ని తిలకించాడు.

తతస్తం పావకో గత్వా దృష్ట్వాలింగ్య చుచుంబ చ ।
పుత్రేతి చోక్త్వా తస్మై స శస్త్రం శక్తిం దదౌ చ సః ॥19॥

అగ్ని నెమ్మదిగా ఆ బాలుడి చెంతకు వెళ్ళి కన్నులారా దర్శించి, మృదువుగా కౌగిలించుకొని ముద్దాడాడు. 'పుత్రుడా' అని సంబోధించి శక్తి అనే ఆయుధాన్ని అతడికి బహూకరించాడు.

గుహస్తాం శక్తిమాదాయ తచ్ఛృంగం చారురోహ హ ।
తం జఘాన తయా శక్త్యా శృంగో భువి పపాత హ ॥20॥

బాలకుడైన గుహుడు ఆశక్తి ఆయుధాన్ని చేతబట్టి ఆ హిమాలయశిఖరం అధిరోహించాడు. అదే ఆయుధంతో ఆ శిఖరాన్ని కొట్టాడు. ఆ గిరిశృంగం మొత్తంగా విరిగి నేలకూలింది.

దశపద్మమితా వీరా రాక్షసాః పూర్వమాగతాః ।
తద్వధార్థం ద్రుతం నష్టా బభూవు స్తత్ప్రహారతః ॥21॥

గుహుణ్ని సంహరించడం కోసం అంతకుముందే వచ్చి, అక్కడ పొంచి ఉన్న పదికోట్లమంది రాక్షసమహావీరులు (విరిగిపడ్డ ఆ కొండకొమ్ము కింద నలిగి) ఆ శక్తి ప్రహారంతో సర్వనాశనమయ్యారు.

హాహాకరో మహానాసీచ్చకంపే సాచలా మహీ ।
త్రైలోక్యం చ సురేశానస్సదేవస్తత్ర చాగమత్ ॥22॥

హాహాకారాలు మిన్ను ముట్టాయి. మహాపర్వతాలతో సహా భూగోళం కంపించింది. ఇంద్రుడూ, సకలదేవతలూ, ముల్లోకాలూ అక్కడికి చేరుకున్నాయి.

దక్షిణే తస్య పార్శ్వే చ వజ్రేణ స జఘాన చ ।
శాఖానామా తతో జాతః పుమాంశ్చైకో మహాబలః ॥23॥

క్రుద్ధుడై ఇంద్రుడు తన వజ్రాయుధంతో ఆ శివపుత్రుడి కుడిభాగాన్ని కొట్టాడు. ఆ భాగం నుంచి 'శాఖుడు' అనే పేరుగల మహాబలిష్ఠుడు ఆవిర్భవించాడు.

పునశ్శక్రో జఘానాశు వామపార్శ్వే హి తం తదా ।
వజ్రేణాన్యః పుమాన్ జాతో విశాఖాఖ్యోఽపరో బలీ ॥24॥

ఈసారి శక్రుడు మళ్ళీ అదే వజ్రాయుధంతో అతడి ఎడమ పార్శ్వాన్ని కొట్టాడు. ఆ భాగం నుంచి 'విశాఖుడు' అనే పేరుతో మరొక మహాబలశాలి అవతరించాడు.

తతస్తద్ధృదయం శక్రో జఘాన పవినా తదా ।
పరోఽభూన్నైగమోపాఖ్యః పుమాంస్తద్వన్మహాబలః ॥25॥

ఈ సారి దేవేంద్రుడు మళ్ళీ అదే వజ్రాయుధంతో ఆ బాలుడి హృదయభాగాన్ని కొట్టాడు. అప్పుడు ఆ భాగంనుంచి నైగముడు అనే మహాశక్తిసంపన్నుడు మరొకడు అవతరించాడు.

తదా స్కందాదిచత్వారో మహావీర మహాబలాః ।
ఇంద్రం హంతుం ద్రుతం జగ్ముస్సోఽయం తచ్ఛరణం యయౌ ॥26॥

నారదా! అప్పుడు ఆ నలుగురు మహావీరులూ కలిసి ఒక్క ఉదుటున ఇంద్రుణ్ణి సంహరింపబోయారు. అతడు ఆలస్యం చెయ్యకుండా స్కందుణ్ణి శరణువేడాడు.

శక్రస్సామరగణో భయం ప్రాప్య గుహోత్తతః ।
యయౌ స్వలోకం చకితో న భేదం జ్ఞాతవాన్ మునే ॥27॥

అలా గుహుడికి భయపడిన ఇంద్రుడు తన దేవగణాలతో సహా తనలోకం చేరుకున్నాడు. నారదమహర్షీ! శక్రుడు ఆ నలుగురి నడుమ ఉన్న భేదాన్ని తెలసుకోలేకపోయాడు.

స బాలకస్తు తత్రైవ తస్థావానందసంయుతః ।
పూర్వ వన్నిర్భయస్తత నానాలీలాకరః ప్రభుః ॥28॥

నారదర్షీ! ఆ బాలకుడు మాత్రం అక్కడనే ఉండిపోయాడు. మునుపటిలాగానే నిర్భయంగా, ఆనందంగా గడుపుతున్నాడు. అనేక దివ్యలీలలకు ప్రభువు ఆ బాలుడు.

తస్మిన్నవసరే తత్ర కృత్తికాఖ్యాశ్చ షట్ స్త్రియః ।
స్నాతుం సమాగతా బాలం దదృశుస్తం మహాప్రభుమ్ ॥29॥

పుత్రకా! అలా ఉండగా ఒకనాడు అక్కడికి ఆరుగురు మహిళలు వచ్చారు. వారిని కృత్తికలంటారు. గంగానదిలో స్నానానికని వచ్చారు. వచ్చి, అత్యంత సమర్థుడైన ఆ బాలుణ్ణి చూశారు.

గ్రహీతుం తం మనశ్చక్రుః సర్వాస్తాః కృత్తికాః స్త్రియః ।
వాదో బభూవ తాసాం తద్గ్రహణేచ్ఛాపరో మునే ॥30॥

మహర్షీ! ఆ ఆరుగురు మహిళలకూ ఆ బాలుణ్ణి ఎత్తుకోవాలి అనిపించింది. ఎవరు ముందుగా ఎత్తుకోవాలి? దీని మీద వారిలో వారికి వివాదం రగిలింది.

తద్వాదశమనార్థం స షణ్ముఖాని చకార హ ।
పపౌ దుగ్ధం చ సర్వాసాం తుష్టాస్తా అభవన్మునే ॥31॥

ఆ వివాదాన్ని చల్లార్చడం కోసం బాలకుడు తనకు తాను ఆరుముఖాలు సృష్టించుకున్నాడు. ఆరుగురి దగ్గరా పాలు తాగాడు. మునీశ్వరా! దానితో ఆ కృత్తికలు ఆరుగురూ సంతుష్టులయ్యారు.

తన్మనోగతిమాజ్ఞాయ సర్వాస్తాః కృత్తికాస్తదా ।
తమాదాయ యయుర్లోకం స్వకీయం ముదితా మునే ॥32॥

నారదమునీ! ఆ బాలకుడి మనోరథాన్ని గుర్తించి, ఆ కృత్తికలు ఎంతో సంబరపడి, అతణ్ని తమతోపాటు తమలోకానికి తీసుకువెళ్ళారు.

తం బాలకం కుమారాఖ్యం స్తనం దత్త్వా స్తనార్థినే ।
వర్ధయామసురీశస్య సుతం సూర్యాధికప్రభుమ్ ॥33॥

తీసుకువెళ్ళి, ఆకలివేసినప్పుడల్లా పాలు ఇస్తూ ఈశ్వర నందనుడూ, సూర్యాధికతేజస్వీ అయిన ఆ కుమారస్వామిని ఎంతో శ్రద్ధగా పెంచారు.

న చక్రుర్బాలకం యాశ్చ లోచనానామగోచరమ్ ।
ప్రాణేభ్యోఽపి ప్రేమపాత్రం యః పోష్టా తస్య పుత్రక ॥34॥

నాయనా! నారదా! ఆ కృత్తికలు ఎంత శ్రద్ధగా పెంచారంటే – ఆ బాలుణ్ని ఒక్కక్షణమైనా కన్నొరగనివ్వకుండా పెంచారు. వారికి వారి ప్రాణాలకన్నా ప్రీతిపాత్రుడయ్యాడు.

యాని యాని చ వస్త్రాణి త్రైలోక్యే దుర్లభాని చ ।
దదుస్తస్మై చ తాః ప్రేమ్ణా భూషణాని వరాణి వై ॥35॥

ముల్లోకాలలోనూ ఎక్కడో కానీ దొరకని అందమైన దుస్తులు అతడికి సమకూర్చారు. అలాగే విలువైన ఆభరణాలు తెచ్చి ప్రేమతో అలంకరించారు.

దినే దినే తాః పుపుషుర్బాలకం తం మహాప్రభుమ్ ।
ప్రశంసితాని స్వాదూని భోజయిత్వా విశేషతః ॥36॥

ఏపూటకాపూట మంచి మంచి రుచికరమైన పదార్థాలు కొసరి కొసరి తినిపిస్తూ, ఆ బాలమహాప్రభువును ప్రేమగా పెంచారు.

అథైకస్మిన్ దినే తాత స బాలః కృత్తికాత్మజః ।
గత్వా దేవసభాం దివ్యాం సుచరిత్రం చకార హ ॥37॥

కుమారా! నారదా! అలా గడుస్తుండగా, ఆ కృత్తికానందనుడు ఒకనాడు స్వర్గంలోకంలో జరుగుతున్న దేవసభకు వెళ్ళాడు. చరిత్ర సృష్టించాడు.

స్వమహో దర్శయామాస దేవేభ్యో హి మహాద్భుతమ్ ।
సవిష్ణుభ్యోఽఖిలేభ్యశ్చ మహౌతికరబాలకః ॥38॥

అలా వెళ్ళి ఆ మహాతేజస్వి బాలకుడు, అక్కడ ఉన్న శ్రీహరిప్రభృతులకు, సకలదేవతలకూ తన మహాద్భుతతేజస్సును ఒక్కసారి ప్రదర్శించాడు.

తం దృష్ట్వా సకలాస్తే వై సాచ్యుతాస్సర్షయస్సురాః ।
విస్మయం ప్రాపురత్యంతం పప్రచ్ఛుస్తం చ బాలకమ్ ॥39॥

అతడిని చూసి, విష్ణుమూర్తి మొదలుకొని సకలఋషులూ, సకలదేవతలు మిక్కిలి ఆశ్చర్య చకితులయ్యారు. తేరుకుని మెల్లగా అడిగారు.

కో భవానితి తచ్ఛ్రుత్వా న కించిత్స జగాద హ ।
స్వాలయం స జగామాశు గుప్తస్తస్థౌ హి పూర్వవత్ ॥40॥

బాలకా ! నువ్వు ఎవరు? – అని వారడుగగా గుహుడు విని ఊరుకున్నాడు. ఏమీ మారు పలుకలేదు. కానీ వెంటనే బయలుదేరి తన కృత్తికల సన్నిధికి తిరిగివచ్చేశాడు. మునుపటిలాగానే గుట్టుగా ఉండిపోయాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే కార్తికేయలీలా వర్ణనం నామ తృతీయోఽధ్యాయః ॥3॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు కార్తికేయలీలావర్ణనం అనే మూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్థోఽధ్యాయః – నాల్గవ అధ్యాయం

కార్తికేయాన్వేషణ నందిసంవాదవర్ణనమ్ – కార్తికేయాన్వేషణ నందిసంవాదవర్ణనం

నారద ఉవాచ – నారదుడు అడిగాడు.

దేవదేవ ప్రజానాథ తతః కిమభవద్విధే ।
వదేదానీం కృపాతస్తు శివలీలాసమన్వితమ్ ॥1॥

సృష్టికర్తా! దేవదేవా! అటుపైని ఏమి జరిగింది? శివుడి లీలలతో సహా దయచేసి నాకిప్పుడే వివరించు.

బ్రహ్మోవాచ – బ్రహ్మదేవుడు పలికాడు.

కృత్తికాభిర్గృహీతే వై తస్మిన్ శంభుసుతే మునే ।
కశ్చిత్కాలో వ్యతీయాయ బుబుధే న హిమాద్రిజా ॥2॥

నారదమునీ! ఆ శంభుపుత్రుడు గుహుడు అలా కృత్తికల చెంత పెరుగుతున్నాడు. కొంతకాలం గడిచింది. కానీ ఈ విషయం పార్వతీదేవికి ఇంకా తెలియలేదు.

తస్మిన్నవసరే దుర్గా స్మేరాననసరోరుహా ।
ఉవాచ స్వామినం శంభుం దేవదేవేశ్వరం ప్రభుమ్ ॥3॥

అలా ఉండగా, ఒకనాడు దుర్గాదేవి ముఖంలో చిరునవ్వులు చిందిస్తూ; దేవాధిదేవుడూ, సకలలోకేశ్వరుడూ అయిన తన పెనిమిటిని శంభుణ్ని ఇలా అడిగింది.

పార్వత్యువాచ – పార్వతి పలికింది.

దేవదేవ మహాదేవ శృణు మే వచనం శుభమ్ ।
పూర్వపుణ్యాతిభారేణ త్వం మయా ప్రాప్త ఈశ్వర ॥4॥

దేవదేవా! మహాదేవా! శుభప్రదమైన నా మాటను దయచేసి ఆలకించు. నేను పూర్వజన్మల్లో చేసుకొన్న పుణ్యాల పుణ్యమా అని మహేశ్వరా! నువ్వు నాకు భర్తగా లభించావు.

కృపయా యోగిషు శ్రేష్ఠో విహారైస్తత్పరోఽభవః ।
రతిభంగః కృతో దేవైస్తత్ర మే భవతా భవ ॥5॥

భవా! శివా! యోగవిద్యా విశారదుడవైన నువ్వు నా పట్ల దయతో నాతో శృంగార విహారతత్పరుడవయ్యావు. అప్పుడు దేవతల స్వార్థమా అని మనకు ప్రథమరతిభంగం అయ్యింది.

భూమౌ నిపతితం వీర్యం నోదరే మమ తే విభో ।
కుత్ర యాతం చ తద్దేవ కేన దైవేన నిహ్నుతమ్ ॥6॥

ప్రభూ! నా గర్భంలోకి చేరవలసిన నీ రేతస్సు ఆపూట అక్కడ నేలపాలయ్యింది. మహేశ్వరా! అటుపైని అది ఏమయ్యింది? ఎక్కడికి చేరింది? ఏ దైవం దాన్ని దాచేసింది.

కథం మత్స్వామినో వీర్యమమోఘం తే మహేశ్వర ।
మోఘం యాతం చ కిం కిం వా శిశుర్జాతశ్చ కుత్రచిత్ ॥7॥

నాకు తెలుసు నా స్వామివీర్యం అమోఘమని. నాథా! మరి అది వృథా అయ్యిందా? లేదంటే ఎక్కడైనా శిశువు జన్మించాడా?

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా అన్నాడు.

పార్వతీ వచనం శ్రుత్వా ప్రహస్య జగదీశ్వరః ।
ఉవాచ దేవానాహూయ మునీంశ్చాపి మునీశ్వర ॥8॥

నారద మునీశ్వరా! పార్వతి ప్రశ్నకు జగదీశ్వరుడు పెద్దగా నవ్వాడు. వెంటనే సకలదేవతలనూ, సకల మునులనూ ఆహ్వానించాడు. వారితో ఇలా అన్నాడు.

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు అన్నాడు.

దేవాః శృణుత మద్వాక్యం పార్వతీవచనం శ్రుతమ్ ।
అమోఘం కుత్ర మే వీర్యం యాతం కేన చ నిహ్నుతమ్ ॥9॥

దేవతలారా! మునులారా! నేను చేప్పేది వినండి. పార్వతి ప్రశ్నను విన్నారుగదా! అమోఘమైన నా వీర్యం ఏమయ్యింది? ఎవ్వరు దాచారు?

సభయం నాపతత్ క్షిప్రం స చేద్దండం న చార్హతి ।
శక్తో రాజా న శాస్తి యః ప్రజాబాధ్యశ్చ భక్షకః ॥10॥

నా రేతస్సును దాచిన ఆ వ్యక్తి భయవిహ్వలుడై వచ్చి నా పాదాలమీద పడితే అతడింక దండనార్హుడు కాడు. లోక పరిపాలకుడు శాసించగలవాడూ, సమర్థుడూ అయితే అతడు ప్రజాబాధకుడూ, ప్రజాభక్షకుడు కాజాలడు.

శంభోస్తద్వచనం శ్రుత్వా సమాలోచ్య పరస్పరమ్ ।
ఊచుస్సర్వే క్రమేణైవ త్రస్తాస్తు పురతః ప్రభోః ॥11॥

నారదా! శంకరుడి ఈ మాటలు విని మేమందరం పరస్పరం చర్చించుకున్నాం. అసలే భయంతో వణికిపోతున్నాం. మెల్లగా ఒక్కొక్కరమూ ప్రభువు ముందట ఇలా పలికాం.

విష్ణురువాచ – ముందుగా విష్ణుమూర్తి పలికాడు.

తే మిథ్యావాదినస్సంతు భారతే గురుదారికాః ।
గురునిందా రతాః శశ్వత్ త్వద్వీర్యం యైశ్చ నిహ్నుతమ్ ॥12॥

శంకరా! నీ వీర్యాన్ని కాజేసి దాచివేసిన వాళ్ళు ఎవరైనా సరే, వాళ్ళు ఈ భారతదేశంలో అసత్యవాదులుగా, గురుపత్నిని భోగించినవారుగా, మాటిమాటికీ గురునిందకు పాల్పడినవారుగా పరిగణింపబడుదురు గాక!

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా పలికాడు.

త్వద్వీర్యం నిహ్నుతం యేన పుణ్యక్షేత్రే చ భారతే ।
స నాఽన్వితో భవేత్తత్ర సేవనే పూజనే తవ ॥13॥

నీ వీర్యాన్ని దాచినవాడికి ఈ భారతదేశంలో ఏ శివాలయంలోకీ ప్రవేశం ఉండదు గాక! నీ సేవకుగానీ, నీ పూజకుగానీ అతడు అనర్హుడగుగాక!

లోకపాలా ఊచుః – లోకపాలకులు పలికారు.

త్వద్వీర్యం నిహ్నుతం యేన పాపినా పతితభ్రమాత్ ।
భాజనం తస్య సోఽప్నుత్య తత్తాపం కర్మ సంతతమ్ ॥14॥

శంభూ! నీ వీర్యాన్ని దాచేసినవాడు పతితుడు. అతడి తపస్సుగానీ, కర్మాచరణగానీ పతితత్వానికే భాజనమవుతాయి.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

కృత్వా ప్రతిజ్ఞాం యో మూఢో నాపాదయతి పూర్ణతామ్ ।
భాజనం తస్య పాపస్య త్వద్వీర్యం యేన నిహ్నుతమ్ ॥15॥

శివా! నీ వీర్యాన్ని దాచేసిన మూర్ఖుడు ఒక ప్రతిజ్ఞనో ఒక వాగ్దానాన్నో చేసి, దాన్ని పరిపూర్ణంగా నేరవేర్చలేని మూఢుడు మూటగట్టుకునే పాపాన్ని మూటగట్టుకుంటాడు.

దేవపత్న్య ఊచుః – దేవతల భార్యలు పలికారు.

యా నిందతి స్వభర్తారం పరం గచ్ఛతి పూరుషమ్ ।
మాతృబంధువిహీనా చ త్వద్వీర్యం నిహ్నుతం యయా ॥16॥

పరమేశ్వరా! భర్తను దూషించేదీ, పరపురుషుణ్ణి పొందేదీ ఈ కారణంగా తల్లిదండ్రులకూ, బంధువులకూ దూరమయ్యేదీ ఎంతటి పాపాత్మురాలో నీ వీర్యాన్ని దాచేసిన మగువ అంతటి పాపాత్మురాలు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

దేవానాం వచనం శ్రుత్వా దేవదేవేశ్వరో హరః ।
కర్మణాం సాక్షిణశ్చాహ ధర్మాదీన్ సభయాన్ వచః ॥17॥

నారదా! దేవాధిదేవుడు హరుడు దేవతల ఈ స్పందనలు విన్నాడు. కావలసిన సమాచారం అందలేదు. ఇంక మిగిలినవారు కర్మసాక్షులు. యమ ధర్మరాజు, సూర్యచంద్రులు, వాయుదేవుడూను. మాతోపాటు నిలబడ్డారు. అప్పటికే భయంతో వణికిపోతున్నారు. వీళ్ళను అడిగాడు శివుడు.

శ్రీశివ ఉవాచ – శివుడు అన్నాడు.

దేవైర్న నిహ్నుతం కేన తద్వీర్యం నిహ్నుతం ధ్రువమ్ ।
తదమోఘం భగవతో మహేశస్య మమ ప్రభోః ॥18॥

కర్మసాక్షులారా! విన్నారుగదా! దేవతలు దాచలేదు. కానీ ఎవరో ఒకరు నా వీర్యాన్ని దాచే ఉంటారు. ఇది నిశ్చయం. ఎందుకంటే అది అమోఘం. (తిరుగులేనిది –నశించలేనిది) సాక్షాత్తు భగవంతుణ్ణీ, ప్రభువునూ, మహేశ్వరుణ్ణి అయిన నా రేతస్సు అది.

యూయం చ సాక్షిణో విశ్వే సతతం సర్వకర్మణామ్ ।
యుష్మాకం నిహ్నుతం కిం వా కిం జ్ఞాతం వక్తుమర్హథ ॥19॥

ఈ ప్రపంచంలో అన్ని పనులకూ, అన్నివేళలా మీరే సాక్షులు. మీకు కనుచాటైనది అంటూ ఏమి ఉంటుంది? కనుక మీకు తెలిసినది చెప్పండి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఈశ్వరస్య వచః శ్రుత్వా సభాయాం కంపితాశ్చ తే ।
పరస్పరం సమాలోక్య క్రమేణోచుః పురా ప్రభోః ॥20॥

నారదా! అలనాటి ఆ సభలో శివుడు ఇలా ప్రశ్నించేసరికి, అప్పటికే భయంతో కంపించిపోతున్న ఆ కర్మసాక్షులు ఒకసారి ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని, ఒక్కరొక్కరుగా ఆ ప్రభువు ముందు ఇలా విన్నవించారు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

రతే తు తిష్ఠతో వీర్యం పపాత వసుధాతలే ।
మయా జ్ఞాతమమోఘం తత్ శంకరస్య ప్రకోపతః ॥21॥

నాయనా! నారదా! కర్మసాక్షులు నోరువిప్పేలోగా నేను ఇలా అన్నాను. పార్వతితో సంభోగిస్తున్న శివుడు శయనమందిరం నుంచి కోపంగా ఇవతలికి వచ్చాడు. అతడి వీర్యం అప్పుడు నేలమీద పడింది. అది అమోఘమైన వీర్యం. ఇంతవరకూ నాకు తెలుసు. అటు పైని ఏమి జరిగింది...?

క్షితిరువాచ – భూమి పలికింది.

వీర్యం సోఢుమశక్తాహం తద్వహ్నౌ న్యక్షిపం పురా ।
అతోఽత్ర దుర్వహం బ్రహ్మన్! అబలాం క్షంతుమర్హసి ॥22॥

నారదమునీ! నా మాటను అంది పుచ్చుకుని భూదేవి అందికదా– ఆ వీర్యాన్ని భరించలేక నేనప్పుడు దాన్ని అగ్నిలో నిక్షేపించాను. బ్రహ్మదేవుడా! అది అత్యంత దుర్వహం. నేనేమో అబలను. క్షమింతురు గాక!

వహ్నిరువాచ – అగ్నిదేవుడు అన్నాడు.

వీర్యం సోఢుమశక్తోఽహం తవ శంకర! పర్వతే ।
కైలాసే న్యక్షిపం సద్యః కపోతాత్మా సుదుస్సహమ్ ॥23॥

శంకరా! శంభూ! ఆ నీ వీర్యాన్ని నేనూ భరించలేకపోయాను. అది దుస్సహం. వెంటనే కపోత రూపంలో వెళ్ళి, దాన్ని కైలాసపర్వతం మీద విడిచివచ్చాను.

గిరిరువాచ – కైలాసగిరి పలికింది.

వీర్యం సోఢుమశక్తోఽహం తవ శంకర! లోకప ।
గంగాయాం ప్రాక్షిపం సద్యః దుస్సహం పరమేశ్వర ॥24॥

లోకరక్షకా! శంకరా! ఆ నీ వీర్యాన్ని నేనూ భరించలేకపోయాను. అది దుస్సహం. పరమేశ్వరా! దాన్ని వెంటనే నేను గంగానదిలో విడిచిపెట్టాను.

గంగోవాచ – గంగ అన్నది.

వీర్యం సోఢుమశక్తాఽహం తవ శంకర లోకప ।
వ్యాకులాఽతి ప్రభో నాథ న్యక్షిపం శరకాననే ॥25॥

జగద్రక్షకా! శంకరా! ఆ నీ వీర్యాన్ని నేనూ భరించలేకపోయాను. ప్రభూ! అల్లకల్లోలమైపోయాను. నాథా! వెంటనే దాన్ని నా కెరటాల చేతులతో మెల్లగా ఒక రెల్లుపొదలోకి నెట్టాను.

వాయురువాచ – వాయువు పలికాడు.

శరేషు పతితం వీర్యం సద్యో బాలో బభూవ హ ।
అతీవ సుందరశ్శంభో స్వర్నద్యాః పావనే తటే ॥26॥

శంభూ! దేవతల నది ఈ గంగ. దీని పావనతీరంలో ఉన్న ఆ రెల్లుపొదకు అలా చేరుకున్న నీ రేతస్సు తత్క్షణం ఒక బాలుడుగా మారిపోయింది. ప్రభూ! అత్యంతసుందరుడు సుమా ఆ బాలకుడు!

సూర్య ఉవాచ – సూర్యుడు అన్నాడు.

రుదంతం బాలకం దృష్ట్వాఽగమమస్తాచలం ప్రభో ।
ప్రేరితః కాలచక్రేణ నిశాయాం స్థాతుమక్షమః ॥27॥

ప్రభూ! శంభూ! రెల్లుపొదలో జన్మించి, గుక్కపట్టి ఏడుస్తున్న బాలకుణ్ని నేను చూశాను. కానీ సాయం సమయమవ్వడంతో పడమటికొండ చాటుకి వెళ్ళిపోయాను. దేవాధిదేవా! కాలచక్రం నన్ను నడిపిస్తోంది. రాత్రి పూట నేను నింగిలో నిలవలేను గదా !

చంద్ర ఉవాచ – చంద్రుడు అన్నాడు.

రుదంతం బాలకం ప్రాప్య గృహీత్వా కృత్తికా గణః ।
జగామ స్వాలయం శంభో గచ్ఛన్ బదరికాశ్రమమ్ ॥28॥

శంభూ! బదరికాశ్రమానికి వెడుతూ ఆరుమంది కృత్తికల గుంపు ఒకటి అప్పుడు అటువైపు వచ్చింది. రెల్లుపొదలో రోదిస్తున్న ఆ బాలకుణ్ణి చూసింది. ముచ్చటపడి అతణ్ణి ఆ గుంపు తన నివాసానికి తీసుకువెళ్ళింది.

జలమువాచ – నీరు పలికింది.

అముం రుదంతమానీయ స్తన్యపానేన తాః ప్రభో ।
వర్ధయామాసురీశస్య సుతం తవ రవిప్రభమ్ ॥29॥

ప్రభూ! ఏడుస్తున్న ఆ పసికందును అలా తమ నివాసానికి తీసుకువచ్చి, ఆ కృత్తికలు ఆరుగురు కొంగుచాటు చేసి, పాలుకుడిపారు. ఈశ్వరా! వేవెలుగులా వెలుగులు విరజిమ్ముతున్న నీ కుమారుణ్ణి ఆ కృత్తికలు శ్రద్ధగాపెంచారు.

సంధ్యోవాచ – సంధ్య పలికింది.

అధునా కృత్తికానాం చ గణస్తం షోష్య పుత్రకమ్ ।
తన్నామ చక్రుస్తాః ప్రేమ్ణా కార్తికశ్చేతి కౌతుకాత్ ॥30॥

శంకరా! ఆ కృత్తికల బృందం ఆ నిసుగును అలా తన పుత్రుడిగా పోషించింది. వారు అందరూ కలిసి ఎంతో ప్రేమతో, కుతూహలంతో ఆ బిడ్డనికి కార్తికుడు అని నామకరణం చేశారు.

రాత్రిరువాచ – రాత్రి అన్నది.

న చక్రుర్బాలకం తాశ్చ లోచనానామగోచరమ్ ।
ప్రాణేభ్యోఽ పి ప్రీతిపాత్రం యః పోష్టా తస్య పుత్రకః ॥31॥

పార్వతీవల్లభా! సకల జగత్తుకూ పోషకుడైన నీ పుత్రకుణ్ణి వారు అలా పోషించారు. ఆ బాలకుడు వారికి ప్రాణాలకన్నా ప్రీతిపాత్రుడయ్యాడు. అతణ్ణి ఏ నిముషంలో కన్మొరగనివ్వడం లేదు. కంటికి రెప్పలా చూసుకుంటున్నారు.

దినమువాచ – పగలు పలికింది.

యాని యాని చ వస్త్రాని భూషణాని వరాణి చ ।
ప్రశంసితాని స్వాదూని భోజయామాసురేవ తమ్ ॥32॥

శివా! అందమైన వస్త్రాలు, విలువైన భూషణలు ఎక్కడెక్కడినుంచో తెచ్చి, ఆ బాలకుణ్ణి అలంకరించారు. ప్రశస్తమైన ఆహారం రుచికరమైన తినుబండారాలు అతడికి కొసరికొసరి తినిపించారు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

తేషాం తద్వచనం శ్రుత్వా సంతుష్టః పురసూదనః ।
ముదం ప్రాప్య దదౌ ప్రీత్యా విప్రేభ్యో బహుదక్షిణామ్ ॥33॥

నారదా! వీరందరూ చెప్పినది విని త్రిపురాంతకుడైన శివుడు చాలా సంతోషించాడు. ఆ ఆనందంతో బ్రాహ్మణులకు భూరిదక్షిణలు అందించాడు.

పుత్రస్య వార్తాం సంప్రాప్య పార్వతీ హృష్టమానసా ।
కోటిరత్నాని విప్రేభ్యో దదౌ బహుధనాని చ ॥34॥

తన పుత్రుడి క్షేమవార్త తెలిసి, పార్వతికూడా ఎంతో ఆనందించింది. మనస్సు ఊప్పొంగింది. వెంటనే బ్రాహ్మణులకు ఒక కోటి రత్నాలూ, అసంఖ్యాక ధనరాశులూ పంచి పెట్టింది.

లక్ష్మీ సరస్వతీ మేనా సావిత్రీ సర్వయోషితః ।
విష్ణు స్సర్వే చ దేవాశ్చ బ్రాహ్మణేభ్యో దదుర్ధనమ్ ॥35॥

ఈ శుభసందర్భంలో లక్ష్మీనారాయణలూ, సరస్వతీ చతుర్ముఖలు (మేము), సావిత్రీ సూర్యులు ఇంకా సకల దేవతలూ బ్రాహ్మణులకు ధనం బహుకరించారు.

ప్రేరితస్య ప్రభుర్దేవైర్మునిభిః పర్వతైరథ ।
దూతాన్ ప్రస్థాపయామాస స్వపుత్రో యత్ర తాన్ గణాన్ ॥36॥

అటుపైని నారదా! దేవతలూ, మునులూ, పర్వతనాయకులూ చెప్పిన సలహామేరకు – వారి ప్రేరణతో జగత్ప్రభువు శంకరుడు తన పుత్రుడున్న చోటికి ప్రమథగణాలను దూతలుగా పంపించాడు.

వీరభద్రం విశాలాక్షం శంకుకర్ణం పరాక్రమమ్ ।
నందీశ్వరం మహాకాలం వజ్రదంష్ట్రం మహోన్మదమ్ ॥37॥

గోకర్ణాస్యం దధిముఖం జ్వలదగ్నిశిఖోపమమ్ ।
లక్షం చ క్షేత్రపాలానాం భూతానాం చ త్రిలక్షకమ్ ॥38॥

రుద్రాంశ్చ భైరవాంశ్చైవ శివతుల్యపరాక్రమాన్ ।
అన్యాంశ్చ వికృతాకారాన్ అసంఖ్యానపి నారద ॥39॥

నారదా! ఎవరెవరు వెళ్ళారంటే – వీరభద్రుడు, విశాలాక్షుడు, శంకుకర్ణుడు, పరాక్రముడు, నందీశ్వరుడు, మహాకాలుడు, వజ్రదంష్ట్రుడు, మహోన్మదుడు, గోకర్ణాస్యుడు మండుతున్న అగ్నిజ్వాలలాంటి దధిముఖుడు, –వీరంతా వెళ్ళారు. ఇంకా ఒక లక్షమంది క్షేత్రపాలకులు, మూడు లక్షలమంది భూతనాథులు, శివుడితో సాటివచ్చే పరాక్రమవంతులు రుద్రులు, భైరవులూ – ఇలా వికృతాకారులైన అసంఖ్యాకప్రమథగణాలను దూతలుగా పంపించాడు.

తే సర్వే శివదూతాశ్చ నానాశస్త్రాస్త్రపాణయః ।
కృత్తికానాం చ భవనం వేష్టయామాసురుద్ధతాః ॥40॥

ఈ శివదూతలందరూ రకరకాల శస్త్రాలనూ, అస్త్రాలనూ చేతబట్టుకొని అత్యుద్ధతులై వెళ్ళి కృత్తికల నివాసభవనాన్ని చుట్టుముట్టారు.

దృష్ట్వా తాన్ కృత్తికాస్సర్వా భయవిహ్వలమానసాః ।
కార్తికం కథయామాసుః జ్వలంతం బ్రహ్మతేజసా ॥41॥

కుమారా! వీరినందరినీ చూసి, ఆ కృత్తికల మనస్సులు భయంతో వణకిపోయాయి. బ్రహ్మతేజస్సుతో విరాజిల్లుతున్న కార్తికుణ్ణి చూసి ఇలా అన్నారు.

కృత్తికా ఊచుః – కృత్తికలు అన్నారు.

వత్స సైన్యాన్యసంఖ్యాని వేష్టయామాసురాలయమ్ ।
కిం కర్తవ్యం క్వ గంతవ్యం మహాభయముపస్థితమ్ ॥42॥

నాయనా! కార్తికా! మన నివాసభవనాన్ని అసంఖ్యాకంగా వచ్చి సైన్యాలు చుట్టుముట్టాయి. ఏమి చెయ్యాలి. ఎక్కడికి పోవాలి ? మహాభయం వచ్చి పడింది పుత్రకా!

కార్తికేయ ఉవాచ – కార్తికేయుడు అన్నాడు.

భయం త్యజత కల్యాణ్యో భయం కిం వా మయి స్థితే ।
దుర్నివార్యో ఽస్మి బాలశ్చ మాతరః కేన వార్యతే ॥43॥

తల్లులారా! పతివ్రతామతల్లులారా! భయపడకండి. నేనుండగ భయం ఎందుకు? బాలుణ్ణే అయినా నేను దుర్జయుణ్ణి. నన్ను అడ్డగించగలవాడెవ్వడు!

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఏతస్మిన్నంతరే తత్ర సైన్యేంద్రో నందికేశ్వరః ।
పురతః కార్తికేయస్యోపవిష్టస్సమువాచ హ ॥44॥

నారదా! అంతలోకీ సైన్యాధ్యక్షుడు నందికేశ్వరుడు కార్తికేయుడి ఎదుటికి వచ్చాడు. వచ్చి ఇలా పలికాడు.

నందీశ్వర ఉవాచ – నందీశ్వరుడు అన్నాడు.

భ్రాతః ప్రవృత్తిం శృణు మే మాతరశ్చ శుభావహామ్ ।
ప్రేషితోఽహం మహేశేన సంహర్త్రా శంకరేణ ॥45॥

కైలాసే సర్వదేవాశ్చ బ్రహ్మవిష్ణు శివాదయః ।
సభాయాం సంస్థితాస్తాత! మహత్యుత్సవమంగళే ॥46॥

తమ్ముడా! తల్లులారా! నేను వచ్చిన శుభహేతువు చెబుతున్నాను. ఆలకించండి. సృష్టిసంహారకుడూ, శంకరుడూ అయిన మహేశుడు పంపగా నేను వచ్చాను. నాయనా! నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరజిల్లే కైలాసపర్వతం మీద బ్రహ్మ విష్ణు ప్రముఖులైన సకల దేవతలూ మహేశ్వరుడి సమక్షంలో సమావేశమయ్యారు.

తదా శివా సభాయాం వై శంకరం సర్వశంకరమ్ ।
సంబోధ్య కథయామాస తవాన్వేషణహేతుకమ్ ॥47॥

ఆ సభలో పార్వతీదేవి – సర్వలోక శుభంకరుడైన శంకరుణ్ణి సంబోధించి, నిన్ను అన్వేషించవలసిన కారణమేమిటో స్పష్టపరిచింది.

పప్రచ్ఛ తాన్ శివో దేవాన్ క్రమాత్ త్వత్ప్రాప్తిహేతవే ।
ప్రత్యుత్తరం దదుస్తే తు ప్రత్యేకం చ యథోచితమ్ ॥48॥

అపుడు మహేశ్వరుడు అక్కడ ఉన్న దేవతలనందరినీ వరసగా అడిగాడు, నీ తెన్నుగురించీ, నిన్ను దొరికించుకునే తీరుగురించీ దేవతలు ఎవరికి వారు యథోచితంగా సమాధానం చెప్పారు.

త్వామత్ర కృత్తికాస్థానే కథయామాసురీశ్వరీమ్ ।
సర్వే ధర్మాదయో ధర్మాధర్మస్య కర్మసాక్షిణః ॥49॥

వారిలో కర్మసాక్షులైన యమధర్మరాజాదులు అందరూ నువ్వు కృత్తికల నివాసభవనంలో ఉన్నావని శివుడికి విన్నవించారు.

ప్రబభూవ రహఃక్రీడా పార్వతీశివయోఃపురా ।
దృష్టస్య చ సురైశ్శంభోర్వీర్యం భూమౌ పపాత హ ॥50॥

వివాహానంతరం పార్వతీపరమేశ్వరులు దాంపత్యసుఖం అనుభవిస్తూండగా దేవతలు శివుడి సందర్శనానికి వచ్చి, విఘ్నం కలిగించారు. అప్పుడు శివతేజస్సు నేలమీద పడింది.

భూమిస్తదక్షిపవహ్నౌ వహ్నిశ్చాద్రౌ స భూధరః ।
గంగాయాం సాక్షిపద్వేగాత్తరంగైశ్శరకాననే ॥51॥

భూదేవి ఆ రేతస్సును వహ్నిలోకి విసిరేసింది. వహ్నిదేవుడు హిమాలయం పైకీ, హిమాలయం గంగలోకీ, గంగాదేవి తరంగహస్తాలతో దాన్ని రెల్లుపొదలోకీ సాగనంపారు.

తత్ర బాలోఽభవస్త్వం హి దేవకార్యకృతిప్రభుః ।
తత్ర లబ్ధః కృత్తికాభిస్త్వం భూమిం గచ్ఛ సాంప్రతమ్ ॥52॥

ఆ రెల్లుపొదలో నువ్వు బాలుడుగా ప్రభవించావు. దేవకార్యాన్ని నిర్వహించే సమర్థుడవు అవతరించావు. అక్కడనే నువ్వు ఈ కృత్తికలకు లభించావు. ఇంక ఇప్పుడు భూలోకానికి బయలుదేరు.

తవాభిషేకం శంభుస్తు కరిష్యతి సురైస్సహ ।
లప్స్యసే సర్వశాస్త్రాణి తారికాఖ్యం హనిష్యసి ॥53॥

శివపుత్రా! దేవతలతో కలిసి శివుడు నీ తండ్రి నీకు పట్టాభిషేకం జరుపుతాడు. సమస్త శస్త్రాస్త్రాలనూ గడిస్తావు. తారకుడనే రాక్షసుణ్ణి వధిస్తావు.

పుత్రస్త్వం విశ్వసంహర్తుస్త్వాం ప్రాప్తుం చాక్షమా ఇమాః ।
నాగ్నిం గోప్తుం యథా శక్తః శుష్కవృక్షః స్వకోటరే ॥54॥

నాయనా! సకల సృష్టిసంహారకుడైన శివుడి కుమారకుడవు నువ్వు. నీ ఆలనా పాలనా ఈ కృత్తికలకు తరమా? ఎండిపోయిన చెట్టు అగ్నిని తన తొఱ్ఱలో భరించగలదా ?

దీప్తవాంస్త్వం చ విశ్వేషు నాసాం గేహేషు శోభసే ।
యథా పతన్మహాకూపే ద్విజరాజో న రాజతే ॥55॥

ముల్లోకాలలోనూ వెలుగొందవలసినవాడవు నువ్వు. ఈ కృత్తికల గృహాలలో శోభించలేవు? ఒక మత్తమాతంగం మహాకూపము నందుపడి ఏ విధముగా ప్రకాశించవో ఆట్లే నీవు ఈ కృత్తికల గృహములో శోభించలేవు అని భావము.

కరోషి చ యథా లోకం నాచ్ఛన్నోఽస్మాసు తేజసా ।
యథా సూర్యో కలాచ్ఛన్నో న భవేన్మానవస్య చ ॥56॥

శంభునందనా! మరుగున ఉన్నా నువ్వు నీ తేజస్సుతో మాకు ఆలోకనం (దర్శనం) కలిగించవా? మబ్బులు కమ్మినంతమాత్రన మనిషికి సూర్యుడే ఉండడా?

విష్ణుస్త్వం జగతాం వ్యాపీ నాన్యో జాతో ఽసి శాంభవ ।
యథా న కేషాం వ్యాప్యం చ తత్సర్వం వ్యాపకం నభః ॥57॥

సర్వజగద్వ్యాపకుడైన విష్ణువవు నువ్వు. శంభు పుత్రుడివి. సామాన్యుడవు కావు. ఆకాశమనేది ఏ కొన్నింటినో ఆవరించేది కాదు, సర్వవ్యాపకం. నువ్వు అంతే.

యోగీంద్రో నానులిప్తశ్చ భాగీ చేత్పరిషోషణే ।
నైవ లిప్తో యథాత్మా చ కర్మయోగేషు జీవినామ్ ॥58॥

శరీరపోషణాదులు చేసుకుంటున్నా యోగీంద్రుడు వాటిలో లంపటుడు కాడు. అలాగే ప్రాణికోటి చేసే కర్మాచరణలో ఆత్మ తలమునకలు కాదు. నువ్వు అంతే.

విశ్వారంభస్త్వమీశశ్చ నాసుతే సంభవేత్ స్థితిః ।
గుణానాం తేజసాం రాశిర్యథాత్మా స చ యోగినః ॥59॥

ఈ విశ్వానికి ఆరంభకుడవు నువ్వు. అధిపతివి నువ్వు. గుణాల రాశివి. తేజస్సుల రాశివి. ఒక యోగీశ్వరుడి ఆత్మలాంటివాడివి. నీకు ఈ కృత్తికలతో ఉనికి కుదరదు గాక కుదరదు.

భ్రాతర్యే త్వాం న జానంతి తే నరా హతబుద్ధయః ।
నాద్రియంతే యథా భేకాస్తోకవాసాశ్చ పంకజాన్ ॥60॥

సోదరా! నిన్ను తెలుసుకోలేని నరులు నిజంగా బుద్ధిహీనులు. అంతేలే, ఒకే సరోవరంలో ఉంటున్న కప్పలు తమ్మిపువ్వులను అనగా పద్మములను గుర్తించగలవా, గౌరవించగలవా!

కార్తికేయ ఉవాచ – కార్తికేయుడు అన్నాడు.

భ్రాత్రస్సర్వం విజానాసి జ్ఞానం త్రైకాలికం చ యత్ ।
జ్ఞానీ త్వం కా ప్రశంసా తే యతో మృత్యుంజయాశ్రితః ॥61॥

అగ్రజా! నువ్వు సర్వజ్ఞుడివి. భూత భవిష్యద్వర్తమానకాలాలకు సంబంధించిన సమస్త పరిజ్ఞానమూ నీకు ఉంది. జ్ఞానివి అనడం నీకు ఏపాటి ప్రశంస! మృత్యుంజుయుణ్ణే ఆశ్రయించినవాడివి గదా! (మృత్యుంజయుడికే ఆంతరంగికుడివి కదా!)

కర్మణాం జన్మ యేషాం వా యాసు యాసు చ యోనిషు ।
తాసు తే నిర్వృతిం భ్రాతః ప్రాప్నువంతీహ సాంప్రతమ్ ॥62॥

కర్మానుసారంగా ఎవరెవరు ఏ జాతులలో జన్మించాలో అక్కడే జన్మిస్తారు. అక్కడే సుఖసంతోషాలను పొందుతారు. అవును గదా సోదరా?

కృత్తికా జ్ఞానవత్యశ్చ యోగిన్యః ప్రకృతేః కళాః ।
స్తన్యేనాసాం వర్ధితోఽ హముపకారేణ సంతతమ్ ॥63॥

ఈ కృత్తికలు ఆరుగురూ జ్ఞానస్వరూపిణులు. మహాయోగినులు. ప్రకృతికళలు. నాకు పాలిచ్చి పెంచిన వీరి ఉపకారంతో సేవలతో ఎదిగాను.

ఆసామహం పోష్య పుత్రో మదంశా యోషితస్త్విమాః ।
తస్యాశ్చ ప్రకృతేరంశః తతస్తత్ స్వామి వీర్యజః ॥64॥

వీరికి నేను పెంపుడు కొడుకుని. ఈ ఆరుగురూ నా అంశకు చెందినవారే. నేను ఈ ప్రకృతిలో ఒక అంశను అటుపైని ఆ శివుడి రేతస్సంభవుణ్ని.

న మద్భంగో హే శైలేంద్రకన్యయా నందికేశ్వర ।
సా చ మే ధర్మతో మాతా యథేమాస్సర్వసమ్మతాః ॥65॥

ఓ నందికేశ్వరా ! ఇంత మాత్రాన హిమశైలపుత్రితో నాకు తల్లీకొడుకుల అనుబంధం లేనట్టు కాదు. అది భంగపడినట్టూ కాదు. ఈ కృత్తికలు సర్వ సమ్మతంగా నాకు తల్లులైనట్టే ఆ జగన్మాత కూడా ధర్మబద్ధంగా నాకు మాతృమూర్తి.

శంభునా ప్రేషితస్త్వం చ శంభోః పుత్రసమో మహాన్ ।
ఆగచ్ఛామి త్వయా సార్ధం ద్రక్ష్యామి దేవతాకులమ్ ॥66॥

సోదరా! నిన్ను ఇక్కడికి పరమేశ్వరుడు పంపించాడు. నువ్వు శివుడికి పుత్రకల్పుడివి. మహానుభావుడివి. నీతో నేను తప్పకుండా వస్తాను. అక్కడున్న దేవతాబృందాన్ని దర్శిస్తాను.

ఇత్యేవముక్త్వా తం శీఘ్రం సంబోధ్య కృత్తికాగణమ్ ।
కార్తికేయః ప్రతస్థే హి సార్ధం శంకరపార్షదైః ॥67॥

నారదా! ఇలా పలికి, కార్తికేయుడు వెంటనే కృత్తికల అనుమతి తీసుకుని, ఆ శంకరకింకరులైన నందీశ్వరాదుల వెంట బయలుదేరాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే కార్తికేయాన్వేషణ నందిసంవాదవర్ణనం నామ చతుర్థోఽధ్యాయః ॥4॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు కార్తికేయాన్వేషణ నందిసంవాదవర్ణన అనే నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచమోఽధ్యాయః – అయిదవ అధ్యాయం

కుమారాభిషేక వర్ణనమ్ – కుమారాభిషేకం వర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

ఏతస్మిన్నంతరే తత్ర దదర్శ రథముత్తమమ్ ।
అద్భుతం శోభితం శశ్వద్విశ్వకర్మవినిర్మితమ్ ॥1॥

శతచక్రం సువిస్తీర్ణం మనోయాయి మనోహరమ్ ।
ప్రస్థాపితం చ పార్వత్యా వేష్టితం పార్షదైర్వరైః ॥2॥

సమారోహత్తతోఽనంతో హృదయేన విదూయతా ।
కార్తికః పరమజ్ఞానీ పరమేశాన వీర్యజః ॥3॥

నారదమునీ! అంతలో అక్కడ ఒక ఉత్తమరథం కనిపించింది. అత్యద్భుతంగా ఉంది. ఎంతో అందంగా ఉంది. దాన్ని విశ్వకర్మ స్వయంగా నిర్మించాడు. దానికి నూరు చక్రాలున్నాయి. చాలా విశాలంగా ఉంది. మనోహరంగా ఉంది. అంతేకాదు. అది మనోవేగంతో వెళ్ళగలుగుతుంది. దాన్ని పార్వతీ దేవి పంపించింది. ప్రమథనాయకులు దాన్ని పరివేష్టించి నిలబడ్డారు. అనంతుడు, పరమజ్ఞానవంతుడు, పరమేశ్వరపుత్రుడూ అయిన కార్తికేయుడు దాన్ని చూశాడు. కృత్తికలను విడిచి వెడుతున్నానే అన్న బెంగ అతడి ఎడదలో ముసురుకుంది. అలాగే ఆ రథాన్ని అధిరోహించాడు.

తదైవ కృత్తికాః ప్రాప్య ముక్తకేశ్యశ్చాఽఽతురాః ।
ఉన్మత్తా ఇవ తత్రైవ వక్తుమారేభిరే వచః ॥4॥

పుత్రకా! కృత్తికలలోనూ అదే దుఃఖం పెల్లుబికింది. జుట్టు విరబోసుకుని పిచ్చెక్కినవాళ్ళలాగా పరుగుపరుగున రథం దగ్గరికి వచ్చారు. ఇలా మాట్లాడటం మొదలు పెట్టారు.

కృత్తికా ఊచుః – కృత్తికలు అన్నారు.

విహాయాస్మాన్ కృపాసింధో గచ్ఛసి త్వం హి నిర్దయః ।
నాయం ధర్మో మాతృవర్గాన్ పాలితో యస్సుతస్త్యజేత్ ॥5॥

స్నేహేన వర్ధితోఽస్మాభిః పుత్రోఽస్మాకం చ ధర్మతః ।
కిం కుర్మః క్వచ యాస్యామః వయం కిం కరవామ హ ॥6॥

దయాసముద్రుడా! మమ్మల్ని విడిచిపెట్టి నిర్దయంగా వెళ్ళిపోతున్నావా? తల్లులను విడిచిపెట్టడం ధర్మం కాదు నాయనా! పాలిచ్చి పెంచి పోషిస్తే ఏ కొడుకైనా ఇలా విడిచివెళ్ళిపోతాడా? ఎంతో గారాబంగా వాత్సల్యంతో నిన్ను పెంచాం. ధర్మబద్ధంగా నువ్వు మా పుత్రుడివి. ఇప్పుడు మేము ఏమి చెయ్యాలి. ఎక్కడికి పోవాలి? అయ్యయ్యో!

ఇత్యుక్త్వా కృత్తికా స్సర్వాఃకృత్వా వక్షసి కార్తికమ్ ।
ద్రుతం మూర్ధ్న మవాపుస్తాస్సుత విచ్ఛేదకారణాత్ ॥7॥

ఆ కృత్తికలు ఇలా విలపిస్తూ కార్తికుణ్ని గుండెలకు హత్తుకున్నారు. అతడి ఎడబాటను తాళలేక స్పృహకోల్పోయారు.

తాఃకుమారో బోధయిత్వా అధ్యాత్మవచనేన వై ।
తాభిశ్చ పార్షదైస్సార్ధ మారురోహ రథం మునే ॥8॥

నారదమహర్షీ! అప్పుడు కార్తికేయుడు ఆధ్యాత్మికవచనాలతో వారిని మెల్లగా తెలివొందజేశాడు. వారిని కూడా తన వెంటబెట్టుకుని శివసేవకులతో సహా రథం అధిరోహించాడు.

దృష్ట్వా శ్రుత్వా మంగళాని బహూని సుఖదాని వై ।
కుమారఃపార్షదైస్సార్ధం జగామ పితృమందిరమ్ ॥9॥

బయలుదేరుతున్న వేళ మంగళకరాలైన ధ్వనులు వినిపించాయి. హాయి గొలిపే శకునాలు కనిపించాయి. అలా కుమారస్వామి శివసేవకులతో కలిసి తన తండ్రి నివాసానికి పయనమయ్యాడు.

దక్షేణ నందియుక్తశ్చ మనోయాయి రథేన చ ।
కుమారఃప్రాప కైలాసం న్యగ్రోధాఽక్షయమూలకే ॥10॥

తత్ర తస్థౌ కృత్తికాభిఃపార్షదప్రవరైస్సహ ।
కుమారశ్శంకరిఃప్రీతో నానాలీలావిశారదః ॥11॥

నారదా! అలా కుమారస్వామి నందీశ్వరుడితో సహా బయలుదేరి, మనోవేగంతో పయనించే ఆ ఉత్తమరథం మీద కైలాసగిరి చేరుకున్నాడు. అక్కడ ఉన్న ఒక అక్షయన్యగ్రోధవృక్షం (మర్రిచెట్టు) నీడన రథం నిలిపాడు. ఆరుగురు కృత్తికలూ అసంఖ్యాక శివసేవకులతో సహా ఆ శంకరప్రియపుత్రుడు, ఆ బహువిధలీలా విశారదుడు, ఆ కుమారస్వామి ఆనందపరవశుడై అక్కడ నిలిచాడు

తదా సర్వే సురగణా ఋషయస్సిద్ధచారణాః ।
విష్ణునా బ్రహ్మణా సార్ధం సమాచఖ్యుస్తదాగమమ్ ॥12॥

తదా దృష్ట్వా చ గాంగేయం యయౌ ప్రముదితశ్శివః ।
అన్యైస్సమేతో హరిణా బ్రహ్మణా చ సురర్షిభిః ॥13॥

అపుడు సకలదేవతలూ, ఋషులు, సిద్ధులు, చారణులు, విష్ణువు (నేనూ), బ్రహ్మదేవుడూ అందరు కలిసి ఒక్కపెట్టున అతడి ఆగమనవార్తను ప్రకటించారు. అది ఆలకించిన శివుడు సమ్మోదసంభరితుడై అల్లంత దూరాన గంగాతనయుణ్ని కుమారస్వామిని తిలకించాడు. బ్రహ్మవిష్ణువులతో, తక్కిన దేవతలతో, దేవర్షులతో కలిసి అక్షయన్యగ్రోధం వైపు బయలుదేరాడు.

శంఖాశ్చ బహువో నేదుః భేరీతూర్యాణ్యనేకశః ।
ఉత్సవస్సుమహానాసీత్ దేవానాం తుష్టచేతసామ్ ॥14॥

వందలవేల శంఖారావాలు మిన్నుముట్టాయి. భేరీతూర్యధ్వనులు దిక్కులు పిక్కటిల్లాయి. మనస్సులు ఆనందపరవశాలు కాగా సకలదేవతలకూ ఒక మహోత్సవం వెల్లివిరిసింది.

తదానీమేవ తం సర్వే వీరభద్రాదయో గణాః ।
కుర్వంతః స్వస్వయుఃకేలిం నానాతాళధరస్వరాః ॥15॥

ఆ క్షణంలోనే వీరభద్రాదులు ప్రమథనాయకులు అందరూ శివుణ్ని వెన్నంటి నడిచారు. పెద్దపెద్ద కంచుతాళాలు మ్రోగిస్తూ, అనుగుణంగా కంఠధ్వనులు చేస్తూ, ఒక కేళీవిలాసాన్ని, ఒక క్రీడావినోదాన్ని స్ఫురింపజేస్తూ, గుంపులు గుంపులుగా వెంట నడిచారు.

స్తావకాః స్తూయమానాశ్చ చక్రుస్తే గుణకీర్తనమ్ ।
జయశబ్దం నమశ్శబ్దం కుర్వాణాః ప్రీతమానసాః ॥16॥

ద్రష్టుం యయుస్తం శరజం శివాత్మజమనుత్తమమ్ ॥17॥

స్తోత్రపాఠకులు స్తుతులు ఆలపిస్తున్నారు. పార్వతీపరమేశ్వరుల కీర్తనం చేస్తున్నారు. అందరి మనస్సులూ ఆనందంతో ఉప్పొంగుతున్నాయి. ప్రతి నోటినుంచి జయశబ్దమో నమశ్శబ్దమో తారస్థాయిలో వెలువడుతోంది. శివకుమారుణ్ని ఉత్తమోత్తముణ్ని శరవనసంభవుణ్ని (రెల్లుపొదలో జన్మించినవాడు) దర్శించడం కోసం అందరూ అలా కోలాహలంగ బయలుదేరారు.

పార్వతీ మంగళం చక్రే రాజమార్గం మనోహరమ్ ।
పద్మరాగాది మణిభిస్సంస్కృతం పరితః పురమ్ ॥18॥

మనోహరమైన రాజమార్గాన్ని (ప్రధానవీధి) మంగళప్రదం చేసింది. పార్వతీదేవి. (ముగ్గులు – తోరణాలు – ఇత్యాదుల్ని సృష్టించి మంగళచిహ్నితం చేసిందని కావచ్చు.) కైలాసనగరం అంతా అన్ని వైపులా పద్మరాగాది మణులతో అలంకృతమయ్యేలా చేసింది.

పతిపుత్రవతీభిశ్చ సాధ్వీభిః స్త్రీభిరన్వితా ।
లక్ష్మ్యాది త్రింశద్దేవీశ్చ పురః కృత్వా సమాయయౌ ॥19॥

సంతానవతులూ, పతివ్రతలూ అయిన ముత్తైదువులతో కలిసి పార్వతీదేవి బయలుదేరింది. లక్ష్మీదేవి సరస్వతీదేవి మొదలైన మూడువందల మంది దేవతామహిళలు ఆమెకు ముందు నడిచారు.

రంభాద్యప్సరసో దివ్యాస్సస్మితా వేషసంయుతాః ।
సంగీతనర్తనపరా బభూవుశ్చ శివాజ్ఞయా ॥20॥

పార్వతీదేవి ఆనతి మేరకు రంభామేనకాదులైన అప్సరసలు సురుచిరవేషధారణతో చిరునవ్వులు చిందిస్తూ నృత్యసంకీర్తనలు సాగించారు.

యే తం సమీక్షయామాసుర్గాంగేయం శంకరోపమమ్।
దదృశుస్తే మహత్తేజో వ్యాప్తమాసీత్ జగత్త్రయే ।।21।।

నారదా! అలా బయలుదేరి వెడుతున్న వారికందరికీ అల్లంతదూరాన ఆ గంగాపుత్రుడు సాక్షాత్తు శంకరుడే అనిపించాడు. మహాతేజోమూర్తి. అతడి తేజస్సు ముల్లోకాలకూ వ్యాపించింది.

తత్తేజసావృతం బాలతప్తచామీకరప్రభమ్ ।
వవందిరే ద్రుతం సర్వే కుమారం సూర్యవర్చసమ్ ।।22।।

జహర్షుర్వినతస్కంధా నమశ్శబ్దరతాస్తదా ।
పరివార్యోపతస్థుస్తే వామదక్షిణమాగతాః ।।23।।

మేలిమిబంగారు కాంతులీనుతున్న ఆ బాలుణ్ని, సూర్యవర్చస్సుతో వెలిగిపోతున్న ఆ కుమారుణ్ని, సకల దేవతలూ ప్రమథగణనాయకులూ వెనువెంటనే నమస్కరించారు. ఆనందపరవశులవుతూ ముందుకి వంగి వంగి నమశ్శబ్దాన్ని ఉచ్చరిస్తూ మరీ నమస్కరించారు. ఆ బాలుడికి కుడిఎడమల సర్దుకుని అందరూ వినయంగా నిలబడ్డారు.

అహం విష్ణుశ్చ శక్రశ్చ తథా దేవాదయోఽఖిలాః ।
దండవత్పతితా భూమౌ పరివార్య కుమారకమ్ ।।24।।

నారదమునీ! నేను, విష్ణుమూర్తీ, ఇంద్రుడూ ఇంకా తక్కిన దేవనాయకులు అందరం ఆ బాలుడికి నేలమీద సాగిలపడి నమస్కరించాం. మెల్లగా లేచి అతడివద్ద నిలబడ్డాం.

ఏతస్మిన్నంతరే శంభుర్గిరిజా చ ముదాన్వితా ।
మహోత్సవం సమాగమ్య దదర్శ తనయం ముదా ।।25।।

ఆ వెనువెంటనే – ఆనందపరవశులవుతూ పార్వతీపరమేశ్వరులు మహోత్సవంగా దగ్గరికి వచ్చి తనయుణ్ని చూసి మురిసిపోయారు.

పుత్రం నిరీక్ష్య చ తదా జగదేకబంధుః
ప్రీత్యాన్వితః పరమయా పరయా భవాన్యా ।
స్నేహాన్వితో భుజగభోగయుతో హి సాక్షాత్
సర్వేశ్వరః పరివృతః ప్రమథైః పరేశః ।।26।।

జగదేకబంధువు శివుడు పరాశక్తి పార్వతితో కలిసి వచ్చి, అలా కుమారుణ్ని తిలికించి, ఎంతగానో మురిసిపోయాడు. ఆయన భుజగభూషణుడు. పరేశుడు. సాక్షాత్తూ సర్వేశ్వరుడు. తన ప్రమథగణాలతో సహా తరలివచ్చి కుమారుణ్ని తిలకించాడు. స్వామి గుండెల్లో ఒకానొక చెలికారం ఉప్పొంగింది – నాయనా!

అథ శక్తిధరః స్కందో దృష్ట్వా తౌ పార్వతీశివౌ ।
అవరుహ్య రథాత్తూర్ణం శిరసా ప్రణనామ హ ।।27।।

అప్పుడు శక్త్యాయుధధారి ఆ స్కందుడు పార్వతీపరమేశ్వరులను చూసి, వెంటనే రథం దిగి వచ్చి, ఇద్దరికీ శిరసా నమస్కరించాడు.

ఉపగుహ్య శివః ప్రీత్యా కుమారం మూర్ధ్ని శంకరః ।
జఘ్రౌ ప్రేమ్ణా పరేశానః ప్రసన్నః స్నేహకర్తృకః ॥28॥

శంకరుడు ప్రేమగా కుమారుణ్ని కౌగిలించుకున్నాడు, శిరస్సు మూర్కొన్నాడు. వాత్సల్యంతో పరమేశ్వరుడు ఎంతో ప్రసన్నుడయ్యాడు.

ఉపగహ్య గుహం తత్ర పార్వతీ జాతసంభ్రమా ।
ప్రస్నుతం పాయయామాస స్తనం స్నేహపరిప్లుతా ॥29॥

పుత్రకా! పార్వతీదేవి కూడా అలాగే గుహుణ్ని ఆలింగనం చేసుకుంది. ఆమె ఒక ఉద్వేగానికి లోనయ్యింది. మనస్సులో వాత్సల్యం పొంగిపొర్లింది. స్తనాల నుంచి దుగ్ధం స్రవించింది. కుమారుడికై కొంగుచాటు చేసింది.

తదా నీరాజితో దేవైస్సకలత్రైర్ముదాన్వితైః ।
జయశబ్దేన మహతా వ్యాప్తమాసీన్నభస్తలమ్ ॥30॥

అప్పుడు సతీసమేతులై సకలదేవతలూ కుమారస్వామికి మంగళనీరాజనం ఇచ్చారు. ప్రమథులూ, దేవతలూ ఆనందోత్సాహాలతో తారస్థాయిలో చేసిన జయజయధ్వని మిన్నుముట్టింది.

ఋషయో బ్రహ్మఘోషేణ గీతేనైవ చ గాయకాః ।
వాద్యైశ్చ బహవస్తత్రోపతస్థుశ్చ కుమారకమ్ ॥31॥

ఋషులు వేదనాదాలతో, గాయకులు స్తోత్రగీతాలతో తక్కినవారు వివిధ వాద్యాలతో కుమారస్వామిని స్తుతించారు. సేవించారు.

స్వమంకమారోప్య తదా మహేశః కుమారకం తం ప్రభయా సముజ్జ్వలమ్ ।
బభౌ భవానీపతిరేవ సాక్షాత్ శ్రియాన్వితః పుత్రవతాం వరిష్ఠః ॥32॥

దివ్యతేజస్సుతో సముజ్జ్వలంగా భాసిస్తున్న తన కుమారుణ్ని స్వయంగా ఒడిలో కూర్చో బెట్టుకున్నాడు మహేశుడు. దానితో సాక్షాత్తు పార్వతీపతికే ఒక కొత్తశోభ, ఒక కొత్తకళ, వచ్చింది. పుత్రవంతులలో వరిష్ఠుడనిపించాడు.

కుమారః స్వగణైస్సార్ధమాజగామ శివాలయమ్ ।
శివాజ్ఞయా మహోత్సాహైస్సహదేవైర్మహాసుఖీ ॥33॥

ఉత్సాహంతో గంతులు వేస్తున్న దేవతలూ, ప్రమథగణాలు వెంటరాగ శివుడి ఆజ్ఞమేరకు కుమారస్వామి సుఖంగా ఆదిదంపతుల నివాసమందిరం చేరుకున్నారు.

దంపతీ తౌ తదా తత్రైకపద్యేన విరేజతుః ।
వివంద్యమానావృషిభిరావృతౌ సురసత్తమైః ॥34॥

అక్కడ ఆ దంపతులు ఏకాసనం మీద విరాజిల్లారు. ఋషులూ, దేవతలూ, దేవనాయకులూ అంజలిబంధాలతో పరివేష్టించి, నిలబడ్డారు.

కుమారః క్రీడయామాస శివోత్సంగే ముదాన్వితః ।
వాసుకిం శివకంఠస్థం పాణిభ్యాం సమపీడయత్ ॥35॥

కుమారుడు శివుడి ఒడిలో హాయిగా ఆడుకుంటున్నాడు. తండ్రి మెడలో దండగా ఉన్న వాసుకిని చేతులతో కదిపి, నలిపి, ఇబ్బంది పెడుతున్నాడు.

ప్రహస్య భగవాన్ శంభుశ్శశంస గిరిజాం తదా ।
నిరీక్ష్య కృపయా దృష్ట్యా కృపాలుర్లీలయా కృతమ్ ॥36॥

ఆ బాల్యక్రీడను కృపాదృష్టితో తిలకించి, శంకరుడు కృపాలుడు కనక చిరునవ్వులు చిందించాడు. పార్వతీదేవికీ ఆ వినోదం తెలియపరిచాడు.

మందస్మితేన చ తదా భగవాన్మహేశః ప్రాప్తో ముదం చ పరమాం గిరిజాసమేతః ।
ప్రేమ్ణా స గద్గదగిరో జగదేకబంధుః నోవాచ కించన విభుర్భువనైక భర్తా ॥37॥

సాక్షాత్తూ భగవంతుడు ఆ మహేశుడు అటుపైని ఆ బాలుడి చిరునవ్వు తిలకించి, పార్వతీ సమేతుడై పరమానందం చవిచూశాడు. ఆ జగదేకబంధువుకు పుత్రప్రేమతో గొంతు వణికింది. ముల్లోకాలకూ విభుడే అయినా ఏమీ పలకలేక ఊరుకున్నాడు.

అథ శంభుర్జగన్నాథో హృష్టో లౌకికవృత్తవాన్ ।
రత్నసింహాసనే రమ్యే వాసయామాస కార్తికమ్ ॥38॥

అలా ఆనందపరవశుడైన జగన్నాథుడు శంభుడు అటుపిమ్మట లౌకికకర్తవ్యాన్ని ఎరిగినవాడై, కుమార కార్తికేయుణ్ణి ఒక అందమైన రత్నసింహాసనం మీద కూర్చుండబెట్టాడు.

వేదమంత్రాభిపూతైశ్చ సర్వతీర్థోదపూర్ణకైః ।
సద్రత్నకుంభశతకైః స్నాపయామాస తం ముదా ॥39॥

వందల రత్నకుంభాలలో సకల తీర్థోదకాలనూ తెప్పించాడు. వేదమంత్రాలతో పరిపూతం చేసి, ఆ జలాలతో ఆనందంగా కుమారుడికి పట్టాభిషేకస్నానం జరిపించాడు.

సద్రత్నసారరచితకిరీటముకుటాంగదమ్ ।
వైజయంతీం స్వమాలాం చ తస్మై చక్రం ప్రదౌ హరిః ॥40॥

శ్రేష్ఠమైనరత్నాలు అనేకం పొదిగిన కిరీటాన్నీ, ముకుటాన్నీ, భుజకీర్తుల్నీ బహూకరించాడు శ్రీమహావిష్ణువు. వీటితోపాటు తన మెడలో విరాజిల్లే వైజయంతీమాలికనూ, తన చేతిలో భాసిల్లే సుదర్శనచక్రాన్నీ, కుమారస్వామికి అందించాడు.

శూలం పినాకం పరశుం శక్తిం పాశుపతం శరమ్ ।
సంహారాస్త్రం చ పరమాం విద్యాం తస్మై దదౌ శివః ॥41॥

శివుడేమో పినాకమనే త్రిశూలాన్నీ, శక్తి ఆయుధాన్నీ, పాశుపతం అనే సర్వసంహారకాస్త్రాన్నీ అలాగే పరావిద్యనూ గుహుడికి అనుగ్రహించాడు.

అదామహం యజ్ఞసూత్రం వేదాంశ్చ వేదమాతరమ్
కమండలుం చ బ్రహ్మాస్త్రం విద్యాం చైవారిమర్దినీమ్ ॥42॥

గజేంద్రం చైవ వజ్రం చ దదౌ తస్మై సురేశ్వరః ।

నారదా ! నేనేమో ఒక యజ్ఞోపవీతాన్నీ, వేదాలనూ, వేదమాత ఐన గాయత్రీమంత్రాన్ని ఒక కమండలువునూ బహుకరించాను. బ్రహ్మాస్త్రాన్నీ శత్రుసంహారిణీవిద్యనూ ఉపదేశించాను. తన ఐరావతాన్నీ, వజ్రాయుధాన్ని అందించాడు ఇంద్రుడు.

శ్వేతచ్ఛత్రం రత్నమాలాం దదౌ వస్తుం జలేశ్వరః ॥43॥

మనోయాయిరథం సూర్యస్సన్నాహం చ మహాచయమ్ ।
యమదండం యమశ్చైవ సుధాకుంభం సుధానిధిః ॥44॥

వరుణుడు ఆ బాలకుడు ధరించడానికి తగిన వెల్లగొడుగునూ రత్నమాలనూ, బహూకరించాడు. సూర్యుడేమో దృఢకవచాన్నీ, మనోవేగంతో ప్రయాణించే రథాన్నీ కానుక చేశాడు. యముడు యమదండం అందిస్తే, చంద్రుడు అమృతకుంభం అందించాడు.

హుతాశనో దదౌ ప్రీత్యా మహాశక్తిం స్వసూనవే ।
దదౌ స్వశస్త్రం నిర్ఋతిర్వాయవ్యాస్త్రం సమీరణః ॥45॥

అగ్నిదేవుడు తన పుత్రుడైన ఆ గుహుడికి ప్రేమతో శక్తి ఆయుధం కానుకగా ఇచ్చాడు. నిర్ఋతి తన శస్త్రాన్ని ఇస్తే వాయుదేవుడు వాయవ్యాస్త్రం ఇచ్చాడు.

గదాం దదౌ కుబేరశ్చ శూలమీశో దదౌ ముదా ।
నానా శస్త్రాణ్యుపాయాంశ్చ సర్వే దేవా దదుర్ముదా ॥46॥

కుబేరుడు తిరుగులేని గదను, ఈశ్వానుడు తన శూలాన్ని ఇచ్చారు. ఇలాగే తక్కిన దేవతలందరూ ఆనందంగా అనేక శస్త్రాలనూ, అనేకవిద్యలనూ, ఉపాయాలనూ ఆ కుమారుడికి పట్టాభిషేకసమయాన బహూకరించారు.

కామాస్త్రం కామదేవోఽథ దదౌ తస్మై ముదాన్వితః ।
గదాం దదౌ స్వవిద్యాశ్చ తస్మై చ పరయా ముదా ॥47॥

క్షీరోదోఽమూల్యరత్నాని విశిష్టం రత్ననూపురమ్ ।
హిమాలయో హి దివ్యాని భూషణాన్యంశుకాని చ ॥48॥

చిత్రబర్హ్ణనామానం స్వపుత్రం గరుడో దదౌ ।
అరుణస్తామ్రచూడాఖ్యం బలినం చరణాయుధమ్ ॥49॥

మన్మథుడు ఆనందపరవశుడై కామాస్త్రంతో పాటు ఒక గదనూ, తన మదనవిద్యలనూ బహూకరించాడు. క్షీరసముద్రుడు అమూల్యరత్నాలనూ, రత్ననూపురాన్నీ కానుక పెట్టాడు. హిమవంతుడు దివ్యభూషణాలనూ, దివ్యవస్త్రాలనూ మనుమడికి చదివించాడు. గరుత్మంతుడు, చిత్రబర్హ్ణుడు అనే తన పుత్రుణ్ణి సేవకు సమర్పించాడు. అరుణుడు తామ్రచూడుడు అనే బలిష్ఠ కాకబాలకుణ్ణి అర్పించాడు.

పార్వతీ సస్మితా హృష్టా పరమైశ్వర్యముత్తమమ్ ।
దదౌ తస్మై మహాప్రీత్యా చిరంజీవిత్వమేవ చ ॥50॥

నారదా! పార్వతీదేవికి ఆనందమే ఆనందం! చిరునవ్వులే చిరునవ్వులు. బిడ్డడికి మహైశ్వర్యాన్ని, చిరంజీవిత్వాన్నీ మహాప్రీతితో కటాక్షించింది.

లక్ష్మీశ్చ సంపదం దివ్యాం మహాహారం మనోహరమ్ ।
సావిత్రీ సిద్ధవిద్యాం చ సమస్తాం ప్రదదౌ ముదా ॥51॥

అన్యాశ్చాపి మునే దేవ్యో యా యాస్తత్ర సమాగతాః ।
స్వాత్మవత్సు దదుస్తస్మై తథైవ శిశుపాలికాః ॥52॥

మునీశ్వరా! లక్ష్మీదేవి దివ్యసంపదనూ, ఒక మనోహరమైన మహాహారాన్ని అందించింది. సావిత్రీదేవి సిద్ధవిద్యను సమస్తంగా ఉపదేశించింది. ఇంకా ఇలాగే అప్పుడు అక్కడికి వచ్చిన దేవతావనితలందరూ పిల్లల తల్లులై ఆ బాలుడికి తమ చేతనైనది ఏదో ఒకటి బహూకరించారు.

మహామహోత్సవస్తత్ర బభూవ మునిసత్తమ ।
సర్వే ప్రసన్నతాం యాతా విశేషాచ్చ శివా శివౌ ॥53॥

మునిసత్తమా! అప్పుడక్కడ ఇలా ఒక మహోత్సవం పరిఢవిల్లింది. అందరి హృదయాలూ ప్రసన్నాలయ్యాయి. పార్వతీపరమేశ్వరుల మనస్సులు మరింత ప్రసన్నమయ్యాయి.

ఏతస్మిన్నంతరే కాలే ప్రోవాచ ప్రహసన్ ముదా ।
మునే బ్రహ్మాదికాన్ దేవాన్ రుద్రో భర్గః ప్రతాపవాన్ ॥54॥

నారదమహర్షీ! అలా ఆనందంగా ఉన్న ఆ సమయంలో మహాప్రతాపవంతుడు, భర్గుడూ, రుద్రుడూ అయిన పరమేశ్వరుడు ఒక్కింతగా నవ్వుతూ బ్రహ్మాదిదేవతలతో ఇలా అన్నాడు

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

హే హరే హే విధే దేవాస్సర్వే శృణుత మద్వచః ।
సర్వథాహం ప్రసన్నో ఽస్మి వరాన్ వృణుత ఐచ్ఛికాన్ ॥55॥

ఓ హరీ! ఓ విధీ! సకల దేవతలారా! నా మాట ఆలకించండి. ఇదిగో ఇప్పుడు నేను పూర్తిగా ప్రసన్నుణ్ణి అయ్యాను. మీకు కావలసిన వరాలను హాయిగా కోరుకోండి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

తచ్ఛ్రుత్వా వచనం శంభోర్మునే విష్ణ్వాదయస్సురాః ।
సర్వే ప్రోచుః ప్రసన్నాస్యా దేవం పశుపతిం ప్రభుమ్ ॥56॥

నారదమునీ! శంభుని నోటినుంచి ఈ ప్రకటన వినపడగానే శ్రీహరి మొదలుకొని దేవతలందరి ముఖాలూ వికసించాయి. అందరూ కలిసి మహాప్రభువూ, పశుపతీ, మహాదేవుడు అయిన శంకరుణ్ణి ఇలా అర్థించారు.

కుమారేణ హతో హ్యేష తారకో భవితా ప్రభో! ।
తదర్థమేవ సంజాతమిదం చరితముత్తమమ్ ॥57॥

తస్మాదద్యైవ యాస్యామస్తారకం హంతుముద్యతాః ।
ఆజ్ఞాం దేహి కుమారాయ స తం హంతుం సుఖాయ నః ॥58॥

మహాప్రభూ! ఈ కుమారుడి చేతిలో తారకాసురుడు మడిసిపోవుగాక! ఈ ఉత్తమోత్తమ సంఘటన (కుమారజననం) దాని కోసమే కదా జరిగింది! కనుక ఆ తారకుణ్ణి సంహరించడానికి మేమంతా ఇప్పుడే బయలుదేరతాం. తారకుణ్ణి చంపడానికీ, మాకందరికీ సుఖం పంచడానికీ ఈ కుమారస్వామిని ఆనతించు.

తథేతి మత్వా స విభుర్దత్తవాంస్తనయం తదా ।
దేవేభ్యస్తారకం హంతుం కృపయా పరిభావితః ॥59॥

ఈ అభ్యర్థనకు మహాదేవుడు సరే అని సమ్మతించాడు. దయాపరిపూర్ణుడై శివుడు తన కుమారుణ్ణి తారకసంహారం కోసమని దేవతలకు అప్పగించాడు.

శివాజ్ఞయా సురాస్సర్వే బ్రహ్మవిష్ణుముఖాస్తదా ।
పురస్కృత్య గుహం సద్యో నిర్జగ్ముర్మిలితా గిరేః ॥60॥

బహిర్నిస్సృత్య కైలాసాత్ త్వష్టా శాసనతో హరేః ।
విరేచే నగరం రమ్యమద్భుతం నికటే గిరేః ॥61॥

తత్ర రమ్యం గృహం దివ్యమద్భుతం పరమోజ్జ్వలమ్ ।
గుహార్థం నిర్మమే త్వష్టా తత్ర సింహాసనం వరమ్ ॥62॥

శివాజ్ఞను శివసావహించి, బ్రహ్మ విష్ణు ప్రభృతులు దేవతలందరూ వెంటనే గుహుణ్ణి తమ అగ్రభాగాన నిలుపుకొని, కైలాసగిరి నుంచి నిర్గమించారు. విష్ణుమూర్తి ఆజ్ఞమేరకు ఆ కైలాసగిరికి చేరువలోనే విశ్వకర్మ ఒకానొక అత్యద్భుత మహాసుందర నగరం నిర్మించాడు. అందులో గుహుడికోసమేనని ఒక భవనం నిర్మించాడు. అది అత్యద్భుతం. మహోజ్జ్వలం. మహోహరం. ఆ భవనంలో అలాంటిదే ఒక సింహాసనమూ నిర్మించాడు.

తదా హరిస్సుధీర్భక్త్యా కారయామాస మంగళమ్ ।
కార్తికస్యాభిషేకం హి సర్వతీర్థజలైస్సురైః ॥63॥

బుద్ధిశాలి శ్రీహరి భక్తిప్రపత్తులతో పుణ్యాహవచనాదికాలు జరిపించి, సర్వతీర్థోదకాలతోనూ, సకలదేవతలచేతా కార్తికేయుడికి అభిషేకం నిర్వహింపజేశాడు.

సర్వథా సమలంకృత్య వాసయామాస సంగ్రహమ్ ।
కార్తికస్య విధిం ప్రీత్యా కారయామాస చోత్సవమ్ ॥64॥

అటుపైని కార్తికుణ్ణి దివ్యవస్త్ర దివ్యాభరణాలతో అలంకరించి, ఆ భవనంలో నివసింపజేశాడు (గృహప్రవేశం జరిపించాడు). ఒక ఆనందమహోత్సవం జరిపించాడు.

బ్రహ్మాండాధిపతిత్వం హి దదౌ తస్మై ముదా హరిః ।
చకార తిలకం తస్య సమానర్చ సురైస్సహ ॥65॥

ఆ శుభసమయంలోనే శ్రీహరి ఆ కుమారుడికి బ్రహ్మాండాధిపతిత్వం ఆనందంగా అప్పగించాడు. స్వయంగా తిలకం దిద్దాడు. సకలదేవతలతోనూ కలిసి అర్చించాడు.

ప్రణమ్య కార్తికం ప్రీత్యా సర్వదేవర్షిభిస్సహ ।
తుష్టావ వివిధస్తోత్రైః శివరూపం సనాతనమ్ ॥66॥

దేవతలతో, మహర్షులతో కలిసి భక్తిగా కార్తికుడికి నమస్కరించాడు. శివస్వరూపుడూ, సనాతనుడూ అయిన ఆ కుమారుణ్ణి రకరకాల స్తోత్రాలతో స్తుతించాడు.

వరసింహాసనస్థో హిశుశుభేఽతీవ కార్తికః ।
స్వామిభావం సమాపన్నో బ్రహ్మాండస్యాపి పాలకః ॥67॥

అపుడు ఈ బ్రహ్మాండానికి స్వామిత్వమూ, పాలకత్వమూ పొంది, ఆ ఉత్తమసింహాసనం మీద కార్తికేయుడు అత్యంతం శోభించాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే కుమారాభిషేక వర్ణనం నామ పంచమోఽధ్యాయః ॥5॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు కుమారభిషేక వర్ణనం అనే అయిదవ అధ్యాయం సమాప్తం.

షష్ఠోఽధ్యాయః – ఆరవ అధ్యాయం

కుమారాద్భుతచరిత వర్ణనమ్ – కుమారాద్భుతచరిత వర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

అథ తత్ర స గాంగేయో దర్శయామాస సూతికామ్ ।
తామేవ శృణు సంప్రీత్యా నారద! త్వం స్వభక్తిదామ్ ॥1॥

నారదా! అప్పుడక్కడ గంగాపుత్రుడయిన, కుమారస్వామి ఒకానొక లీలావిశేషాన్ని ప్రదర్శించాడు. దాన్ని వివరంగా చెబుతాను. శ్రద్ధగా విను.

ద్విజ ఏకో నారదాఖ్య అజగామ తదైవ హి ।
తత్రాధ్వరకరః శ్రీమాన్ శరణార్థం గుహస్య వై ॥2॥

నారదుడు అనే ఒకనొక బ్రాహ్మణుడు అక్కడికి వచ్చాడు. శోభయమానంగా ఉన్నాడు. అతడేదో ఒక యజ్ఞాన్ని చేస్తున్నాడట. వచ్చి గుహుణ్ని శరణువేడాడు.

స విప్రః ప్రాప్య నికటం కార్తికస్య ప్రసన్నధీః ।
స్వాభిప్రాయం సమాచఖ్యౌ సుప్రణమ్య శుభైః స్తవైః ॥3॥

ఆ విప్రుడు ప్రసన్నచిత్తుడై వచ్చి, కార్తికేయుడికి చేరువలో నిలిచాడు. మంగళకరాలైన సోత్రాలు చేశాడు. నమస్కరించి తన రాకకు కారణం తెలిపాడు.

విప్ర ఉవాచ – విప్రుడు పలికాడు.

శృణు స్వామిన్ వచో మేఽద్య కష్టం మే వినివారయ ।
సర్వబ్రహ్మాండనాథస్త్వమతస్తే శరణం గతః ॥4॥

అజమేధాధ్వరం కర్తుమారంభం కృతవానహమ్ ।
సోఽజో గతో గృహాన్మే హి త్రోటయిత్వా స్వబంధనమ్ ॥5॥

స్వామీ! నా విన్నపం ఆలించు. ఇప్పుడు నాకు వచ్చిపడిన కష్టాన్ని తొలగించు. సర్వబ్రహ్మాండానికీ నాథుడివి నువ్వు. అందుకే నిన్ను శరణుజొచ్చాను. అజమేధం అనే యజ్ఞమొకటి ప్రారంభించాను .దాని కోసం సన్నద్ధం చేసుకున్న మేక (గొర్రె) కట్టుకొయ్యతో సహా ఊడబెరుక్కుని నా ఇంటినుంచి పారిపోయింది.

న జానే స గతః కుత్రాన్వేషణం తత్కృతం బహు ।
న ప్రాప్తో ఽజస్య బలవాన్ భంగో భవతి మే క్రతోః ॥6॥

త్వయి నాథే సతి విభో యజ్ఞభంగః కథం భవేత్ ।
విచార్యైవాఖిలేశాన కామం పూర్ణం కురుష్వ మే ॥7॥

అది ఎక్కడికి పోయిందో ఏమో తెలియడం లేదు. అన్వేషణమైతే చాలా చేశాను. మేక దొరకలేదు. అది చాలా బలిష్టమైన మేక. నా క్రతువుకి ఇలా విఘ్నం వచ్చిపడింది. నువ్వు ఏలికవైయుండగా యజ్ఞం భంగపడటమా! నువ్వు అఖిలేశ్వరుడవు. ఏదో ఒకటి బాగా ఆలోచించి నువ్వే నా యజ్ఞవాంఛను సంపన్నం చెయ్యాలి.

త్వాం విహాయ శరణ్యం కం యాయాం శివసుత ప్రభో ।
సర్వబ్రహ్మాండనాథం హి సర్వామరసుసేవితమ్ ॥8॥

ప్రభూ! శివకుమారా! సర్వబ్రహ్మాండనాయకుడివి నువ్వు. సకల దేవతలూ నిన్నే కదా సేవిస్తున్నారు. మరి నిన్ను కాక ఇంకెవరిని నేను శరణువేడను ।

దీనబంధుర్దయా సింధుస్సుసేవ్యో భక్తవత్సలః ।
హరిబ్రహ్మాదిదేవైశ్చ సుస్తుతః పరమేశ్వరః ॥9॥

పార్వతీనందనః స్కందః పరమేకః పరంతపః ।
పరమాత్మాత్మదః స్వామీ సతాం చ శరణార్థినామ్ ॥10॥

దీనబంధువు. దయాసింధువు. సులభసేవ్యుడు. భక్తవత్సలుడు. హరిబ్రహ్మాది దేవతల చేత స్తుతింపబడేవాడు. పరమేశ్వరుడు. పార్వతీ నందనుడు స్కందుడు. అద్వితీయుడు. శత్రు సంహారకుడు. పరమాత్మ. శరణాగతులైన సజ్జనులకు ఆత్మప్రదుడైన స్వామి.

దీనానాథ మహేశ! శంకరసుత! త్రైలోక్యనాథ! ప్రభో!
మాయాధీన! సమాగతో ఽస్మి శరణం మాం పాహి విప్రప్రియ ।
త్వం సర్వప్రకృతి ప్రియోఽఖిలవిద బ్రహ్మాది దేవైః స్తుతః
త్వం మాయాకృతిరాత్మభక్తసుఖదో రక్షాపరో మాయికః ॥11॥

దీనులను పాలించేవాడా! అనాథులకు దిక్కైనవాడా! శంకరనందనా! ముల్లోకాలకూ నాథుడా! ప్రభూ! మాయను అధీనంలో ఉంచుకున్నవాడా! విప్రులకు హితుడా! నిన్నే శరణు పొందాను. నన్ను కాపాడు. నువ్వు సమస్త ప్రకృతికే చెలికాడవు. సర్వజ్ఞుడవు. బ్రహ్మాదిదేవతలు నిన్నే స్తుతిస్తారు. నువ్వు మాయారూపధారివి. నీ భక్తులకు సకలసుఖాలూ కలిగిస్తావు. ఎల్లవేళలా రక్షిస్తావు. మాయను జయించినవాడవు.

భక్తత్రాణ గుణాకర స్త్రిగుణతో భిన్నోఽసి శంభుప్రియః
శంభుశ్శంభుసుతః ప్రసన్నసుఖదస్సచ్చిత్స్వరూపో మహాన్ ।
సర్వజ్ఞస్త్రిపురఘ్న శంకరసుతః సత్ప్రేమవశ్యస్సదా
షడ్వక్త్రః ప్రియసాధురానతప్రియస్సర్వేశ్వరశ్శంకరః ॥12॥

కార్తికేయా! భక్తులను కాపాడటం అనే గుణానికి నువ్వే దిక్కు. సత్త్వరజస్తమోగుణాలకు అతీతుడవు. నువ్వు శివుడికి అత్యంత ప్రియుడవు. శంభుసుతా! నీకూ, శంభునికీ అభేదం. ప్రపన్నులైనవారికి సకల సుఖాలూ కలిగిస్తావు. సత్ – చిత్ – స్వరూపుడవు. మహాత్ముడవు. సర్వజ్ఞుడవు. త్రిపురసంహారకుడైన శంకరుడికి గారాలపట్టివి.

ఉత్తమభక్తికి ఎప్పుడూ నువ్వు వశ్యుడవే. ఆరుమొగముల వాడివి. సాధు సజ్జనులంటే నీకు ఇష్టం. నమస్కరించిన వారూ హితులే. నువ్వే సర్వేశ్వరుడవు. నువ్వే శమ్ – కరుడవు.

సాధుద్రోహకరఘ్న శంకర గురో బ్రహ్మాండనాథః ప్రభుః ।
సర్వేషామమరాదిసేవితపదో మాం పాహి సేవాప్రియ ॥12॥

సాధుసజ్జనులకు ద్రోహం చేసేవారిని కడతేర్చేవాడా! శంకరా! గురూత్తమా! (శంకరుడు తండ్రిగా కలవాడా!) నువ్వే బ్రహ్మాండనాయకుడవు. అందరికీ నువ్వే ప్రభువవు. దేవతలూ, ఋషులూ ఇత్యాదులు అందరూ నీ పాదాలు సేవిస్తున్నారు. నువ్వు సేవాప్రియుడవు. దయచేసి నన్ను రక్షించు (పద్యంఅర్ధశార్దూలం)

వైరిభయంకర!ः శంకర! జనశరణస్య వందే తవ పదపద్మం సుఖకరణస్య ।
విజ్ఞప్తిం మమ కర్ణే స్కంద! నిధేహి నిజభక్తిం జన చేతసి సదా విధేహి ॥13॥

శత్రుభీకరా! భక్త శమ్+కరా! సకల జనులకూ దిక్కై సకల సుఖాలనూ కలిగించే నీ పాదపద్మాలకు నమస్కరిస్తున్నాను. ప్రభువా! స్కందుడా! నా విన్నపాన్ని చెవిని వేసుకో. ప్రజల హృదయాలలో నీపట్ల భక్తిని ఎల్లప్పుడూ నిలుపుకో.

కరోతి కిం తస్య బలీ విపక్షో దక్షోఽ సి పక్షోభయపార్శ్వగుప్తః ।
కిం తక్షకోఽప్యామిషభక్షకో వా త్వం రక్షకో యస్య స దక్షమాన్యः ॥14॥

మహాప్రభూ! నిన్ను రక్షకునిగా పొందినవాడే –సమర్థులలో సమ్మాన్యుడు. అతడికి ఎవ్వరూ ఏ అపకారమూ చెయ్యలేరు. అతడి శత్రువు ఎంతటి బలవంతుడైనా, అన్నివైపులా రక్షణకలవాడే అయినా సాక్షత్తూ తక్షకుడే (మహాసర్పం) అయినా, మాంసభక్షకుడే (రాక్షసుడు) అయినా అతడిని ఏమీ చెయ్యలేడు. అతనికి ఏమీ భయం లేదు.

విబుధగురురపి త్వాం స్తోతుమీశో న హి స్యాత్ కథయ కథమహం స్యాం మందబుద్ధిర్వరార్చ్య ।
శుచిరశుచిరనార్యో యాదృశస్తాదృశో వా పదకమలపరాగం స్కంద! తే ప్రార్థయామి ॥15॥

ఉత్తమోత్తములతో అర్చింపబడే స్వామీ! నిన్ను స్తుతించడానికి బృహస్పతిసైతం చాలడు గదా! మందబుద్ధిని నేనెలా సరిపోతాను చెప్పు! కార్తికేయా! నేను శుచిగా ఉన్నానో– అశుచిగా ఉన్నానో, ఆర్యుణ్నో, అనార్యుణ్నో, ఏదైతే అది నీ పాదపద్మాల పుప్పొడిని (శిరస్సున దాల్చడానికి) అభ్యర్థిస్తున్నాను.

హే సర్వేశ్వర భక్తవత్సల కృపాసింధో త్వదీయోఽస్మ్యహమ్
భృత్యస్స్యస్య న సేవకస్య గణపస్యాగశ్శతం సత్ప్రభో ।
భక్తిం క్వాపి కృతాం మనాగపి విభో జానాసి భృత్యార్తిహా
త్వత్తో నాస్త్యపరోఽవితా న భగవన్! మత్తో నరः పామరः ॥16॥

ఓ సర్వేశ్వరా! ముమ్మాటికీ నేను నీవాడను. నీ భృత్యుడను. దయాసముద్రుడా! నువ్వు నీ సేవకుడి తప్పుల్ని ఎన్నింటినైనా లెక్కించవు. గుర్తించవు. భక్తవత్సలా ! ఎప్పుడో ఏ కొంచెమో చేసిన భక్తినే(సేవనే) గుర్తిస్తావు. భృత్యుల

ఆర్తిని తొలగించే సత్ప్రభూ! సకల విభూ! నీ కన్నా నాకు సంరక్షకుడు లేడు. నా కన్నా పామరుడు వేరొకడు లేడు. నేనొక అజ్ఞానిని. మానవమాత్రుణ్ని

కల్యాణకర్తా కలికల్మషఘ్నుః కుబేరబంధుః కరుణార్ద్రచిత్తః ।
త్రిషట్కనేత్రో రసవక్త్రశోభీ యజ్ఞం ప్రపూర్ణం కురు మే గుహ త్వమ్ ॥17॥

నువ్వు సకలశుభాలనూ కలిగించేవాడవు. పాపపంకిలాలను తొలగించేవాడవు. కుబేరుడికి చుట్టానివి. నీ హృదయం ఎల్లప్పుడూ దయతో ఆర్ద్రంగా ఉంటుంది. నువ్వు ఆరు ముఖాలతో పద్దెనిమిది కన్నులతో(6×3=18) దయగల ముఖముతో శోభిస్తుంటావు. గుహా! దయచేసి నా యజ్ఞాన్ని సంపూర్ణం చెయ్యి.

రక్షకస్త్వం త్రిలోకస్య శరణాగతవత్సలః ।
యజ్ఞకర్తా యజ్ఞభర్తా హరసే విఘ్నకారిణమ్ ॥18॥

ముల్లోకాలకూ నువ్వే రక్షకుడవు. నిన్ను శరణుజొచ్చిన వారిపట్ల వాత్సల్యం వహిస్తావు. యజ్ఞకర్తవు, యజ్ఞభర్తవు నువ్వే. యజ్ఞానికి విఘ్నకర్తను నువ్వే హరిస్తావు – సంహరిస్తావు.

విఘ్నవారణ సాధూనాం సర్గకారణ సర్వతః ।
పూర్ణం కురు మమేశానసుత యజ్ఞం నమోఽస్తు తే ॥19॥

సాధుసజ్జనులకు వచ్చే విఘ్నాలను తొలగించేవాడా! సకలసృష్టికీ కారణమై వెలుగొందేవాడా! ఈశానపుత్రా! నా యజ్ఞాన్ని సుసంపన్నం చెయ్యి. నీకిదే నమస్కరిస్తున్నాను.

సర్వత్రాతా స్కంద హి త్వం సర్వజ్ఞాతా త్వమేవ హి ।
సర్వేశ్వరస్త్వమీశానో నివేశ సకలావనః ॥20॥

స్కందుడా! అందరికీ రక్షకుడవు నువ్వే గదా! అన్నీ తెలిసినవాడవు నువ్వేగదా ! నువ్వే సర్వేశ్వరుడవు, ఈశానుడవు. సకల లోకాలనూ, (నివేశ) కాపాడేవాడవూ నువ్వే.

సంగీతజ్ఞస్త్వమేవాసి వేదవిజ్ఞః పరం ప్రభుః ।
సర్వస్థాతా విధాత త్వం దేవదేవస్సతాం గతిః ॥21॥

సంగీతజ్ఞుడవు నువ్వే. వేదవేత్తవు నువ్వే. పరాత్పరుడవు నువ్వే. సృష్టిసమస్తాన్నీ నిలబెట్టేవాడవూ, సృష్టించేవాడవూ నువ్వే. నువ్వే దేవదేవుడవు. సజ్జనులకు నువ్వే ఏడుగడ.

భవానీ నందనశ్శంభుతనయో వయునః స్వరాట్ ।
ధ్యాతా ధ్యేయః పితౄణాం హి పితా యోనిస్సదాత్మనామ్ ॥22॥

పార్వతీ నందనుడవు నువ్వు. సాక్షాత్తూ శివపుత్రుడవూ నువ్వే. సమస్త విధులు తెలిసినవాడవు నువ్వే. నీకు నువ్వే అధిపతివి. ధ్యానించేవాడివీ నువ్వే, ధ్యానింపబడేవాడివీ నువ్వే. తండ్రులకే తండ్రివి నువ్వు. మహాత్ములకు జన్మస్థానం నువ్వే. (వయునః= విధిజ్ఞః, జ్ఞానీ , వేదవిత్ మొదలగునవి)

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య దేవసమ్రాట్ శివాత్మజః ।
స్వగణం వీరబాహ్వాఖ్యం ప్రేషయామాస తత్క్షతే ॥23॥

తదాజ్ఞయా వీరబాహుస్తదన్వేషణ హేతవే ।
ప్రణమ్య స్వామినం భక్త్యా మహావీరో ద్రుతం యయౌ ॥24॥

నారదమునీ! దేవతాసార్వభౌముడు ఆ శివనందనుడు నారదవిప్రుడి విన్నపం ఆలకించాడు. తన వీరబాహుడనే గణముఖ్యుణ్ణి పిలిచి, మేకను వెదకడానికి పంపించాడు. ఆ మహావీరుడు వీరబాహుడు గుహుడి ఆజ్ఞను శిరసావహించి భక్తితో స్వామికి నమస్కరించి, వెంటనే బయలుదేరాడు.

అన్వేషణం చకారాసౌ సర్వబ్రహ్మాండగోళకే ।
న ప్రాప తమజం కుత్ర శుశ్రావ తదుపద్రవమ్ ॥25॥

జగామాథ స వైకుంఠం తత్రాజం ప్రదదర్శ తమ్ ।
ఉపద్రవం ప్రకుర్వంతం గళయూపం మహాబలమ్॥26॥

ధృత్వా తం శృంగయోర్వీరో ధర్షయిత్వాతి వేగతః ।
ఆనినాయ స్వామిపురో వికుర్వంతం రవం బహు॥27॥

అతడు బ్రహ్మాండగోళాలన్నింటా వెదికాడు. కానీ ఎక్కడా ఆ మేక కనపడలేదు. ఒకచోట మాత్రం దాని అరుపు వినిపించింది. అప్పుడటువైపు వెళ్ళగా వైకుంఠంలో అది కనిపించింది. బిగ్గరగా అరుస్తోంది. దాని మెడలో యూపస్తంభం వేలాడుతోంది. అది చాలా బలిష్ఠమైన మేక. వీరబాహుడు దాని కొమ్ములు దొరకబుచ్చుకుని, లొంగదీసుకుని, మహావేగంగా గుహుడి చెంతకు తెచ్చాడు. అది బిగ్గరగా అరుస్తూనే ఉంది.

దృష్ట్వా తం కార్తిక స్సోఽర మారురోహ స తం ప్రభుః ।
ధృతబ్రహ్మాండగరిమా మహాసూతికరో గుహః ॥28॥

ముహూర్తమాత్రఽస్సో జో బ్రహ్మాండం సకలం మునే ।
బభ్రామాశ్రమ ఏవాశు పునస్తత్స్థానమాగతః ॥29॥

తత ఉత్తీర్య స స్వామీ సమువాస స్వమాసనమ్ ।
సోఽజః స్థితస్తు తత్రైవ స నారద ఉవాచ తమ్ ॥30॥

బ్రహ్మాండభారాన్నంతటినీ వహించేవాడూ, గొప్పగొప్ప లీలలూ మహిమలూ ప్రదర్శించేవాడూ అయిన ఆ కుమారస్వామి ఆ మేకను చూస్తూనే దాన్ని అధిరోహించాడు. నారదమహర్షీ! అది ఏమి అజమో కానీ ముహూర్తమాత్రంలో అతివేగంగా బ్రహ్మాండాన్ని అంతటినీ చుట్టివచ్చి, శ్రమ అన్నదే లేకుండా తన స్థానంలో తాను నిల్చింది. గుహుడు దిగివచ్చి తన సింహాసనం మీద తాను కూర్చున్నాడు. ఆ మేక అక్కడే అలాగే నిలబడింది. అప్పుడు దాని యజమానుడు నారదవిప్రుడు స్వామితో అన్నాడుగదా –

నారద ఉవాచ – నారదుడన్నాడు.

నమస్తే దేవ దేవేశ దేహి మేఽజం కృపానిధే ।
కుర్యామధ్వరమానందాత్ సఖాయం కురు మామహో ॥31॥

దేవా! దేవేశా! దయానిధీ! నమో నమః. దయచేసి నా మేకను నాకు ఇప్పించు. ఆహా! ఆనందంగా నా యజ్ఞం పూర్తిచేసుకుంటాను. స్వామీ! నన్ను నీ చెలికానిగా మన్నించు.

కార్తిక ఉవాచ – కార్తికుడు అన్నాడు.

వధయోగ్యో న విప్రాజ్ఞ స్వగృహం గచ్ఛ నారద ।
పూర్ణోఽస్తు తేఽధ్వరస్సర్వః ప్రసాదాదేవ మే కృతః ॥32॥

విప్రా! నారదా! ఈ మేక బలి ఇవ్వదగినది కాదు. కనక నువ్వు నీ ఇంటికి వెళ్ళిపో. నీ యజ్ఞమంతా నా అనుగ్రహం వల్ల సంపూర్ణమవుతుంది.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యాకర్ణ్య ద్విజః స్వామివచనం ప్రీతిమానసః ।
జగామ స్వాలయం దత్త్వా తస్మా ఆశిషముత్తమమ్ ॥33॥

స్వామి చెప్పిన ఈ మాటను విని ఆ బ్రాహ్మణుడు సంతోషించాడు. ఆ సంతోషంతో గుహుడికి అమోఘమైన ఆశీస్సుల అందించి తన ఇంటికి వెళ్ళిపోయాడు.

ఇతి శ్రీశివపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే కుమారాద్భుతచరిత వర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥6॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు కుమారాద్భుతచరితవర్ణనం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తమోఽధ్యాయః – ఏడవ అధ్యాయం

యుద్ధప్రారంభవర్ణనమ్ – యుద్ధప్రారంభవర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

హర్యాదయస్సురాస్తే చ దృష్ట్వా తచ్చరితం విభోః ।
సుప్రసన్నా బభూవుర్హి విశ్వాసాసక్తమానసాః ॥1॥

వల్గంతః కుర్వతో నాదం భావితశ్శివతేజసా ।
కుమారం తే పురస్కృత్య తారకం హంతుమాయయుః ॥2॥

నారదఋషీ! కార్తికేయుడి ఆ అద్భుతలీలను దర్శించి, విష్ణుమూర్తి మొదలుకొని దేవతలందరి మనస్సులూ నెమ్మదించాయి. గుహుడి మీద విశ్వాసం ఏర్పడింది. ఒక శివతజేస్సు వారిని ఆవహించింది. కేరింతలు కొడుతూ, కేకలు పెడుతూ కుమారస్వామిని అగ్రభాగాన నిలుపుకొని అప్పుడే తారకుణ్ని చంపడానికి బయలుదేరారు.

దేవానా ముద్యమం శ్రుత్వా తారకోఽపి మహాబలః ।
సైన్యేన మహతా సద్యో యయౌ యోద్ధుం సురాన్ ప్రతి ॥3॥

దేవతల ఈ మహోద్యమం తారకుడి చెవిని పడింది. అతడూ మహాబలశాలి. వెంటనే ఈ మహాసైన్య సమేతుడై దేవతలతో తలపడటానికి బయలుదేరాడు.

దేవా దృష్ట్వా సమాయాంతం తారకస్య మహాబలమ్ ।
బలేన బహుకుర్వంతః సింహనాదం వినిస్మయుః ॥4॥

ఎదురువస్తున్న తారకుడి మహాసైన్యాన్ని దేవతలు చూశారు. అశ్చర్యచకితులయ్యారు. రెట్టించిన బలంతో మినుముట్టేలాగా సింహనాదం చేశారు.

తదా నభోఽంగనా వాణీం జగాదోపరి సత్వరమ్ ।
శంకరప్రేరితా సద్యో హర్యాదీనఖిలాన్ సురాన్ ॥5॥

నారదా! సరిగ్గా అదేసమయంలో ఆకాశం నుంచి ఒక స్త్రీకంఠం వినిపించింది. పరమేశ్వరుడి ప్రేరణతో ఆ స్త్రీకంఠం (ఆకాశవాణి) – విష్ణు ప్రభృతులు దేవతలందరికీ వినిపించేలాగా పలికింది.

వ్యోమవాణ్యువాచ – ఆకాశవాణి పలికింది.

కుమారం చ పురస్కృత్య సురా యూయం సముద్యతాః ।
దైత్యాన్విజిత్య సంగ్రామే జయినోఽథ భవిష్యథ ॥6॥

దేవతలారా! కుమారస్వామిని అగ్రభాగాన నిలుపుకొని, మీరందరూ యుద్ధానికి సన్నద్ధులయ్యారు. రణరంగంలో తారకాది దైత్యులనందరినీ ఓడించి, మీరు విజయులవుతారు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

వాచం తు ఖేచరీం శ్రుత్వా దేవాస్సర్వే సముత్సుకాః ।
వీరశబ్దాన్ ప్రకుర్వంతో నిర్భయా హ్యభవంస్తదా ॥7॥

కుమారం చ పురస్కృత్య సర్వే తే జాతసాధ్వసాః ।
యోద్ధుకామాస్సురా జగ్ముర్మహీసాగరసంగమమ్ ॥8॥

ఆ ఖేచరీవాక్కును వినగానే దేవతలందరిలోనూ ఉత్సాహం ఉరకలు వేసింది. మనస్సుల్లో ఉన్న భయం తొలగిపోయింది. నిర్భయులయ్యారు. వీరోచితంగా నినాదాలు చేశారు. ఒక ఉద్వేగం అందరినీ ఆవహించింది. కుమారస్వామిని ముందు నిలుపుకుని, సురలందరూ రణోత్సుకులై కదిలారు. మహీనది సాగరసంగమం చేసే చోటుకి చేరుకున్నారు. అదే దేవదానవరణరంగం.

ఆజగామ ద్రుతం తత్ర యత్ర దేవాస్స తారకః ।
సైన్యేన మహతా సార్ధం సురైర్బహుభిరావృతమ్ ॥9॥

అసంఖ్యాకదేవతలతో క్రిక్కిరిసి పోయిన ఆ యుద్ధభూమికి తారకుడు మహాసైన్యంతో మహావేగంగా తరలి వచ్చాడు.

రణదుందుభయో నేదుః ప్రళయాంబుదనిస్స్వనాః ।
కర్కశాని చ వాద్యాని పరాణి చ తదాగమే ॥10॥

అతడు అలా వస్తోంటే ప్రళయకాల మేఘగర్జనల్లాగా రణభేరులు మ్రోగాయి. పటహాలూ, తూర్యాలు మొదలైన మరికొన్ని వాద్యాలు సైతం కఠోరంగా మ్రోగాయి.

గర్జమానాస్తదా దైత్యాస్తారకేణాసురేణ హ ।
కంపయంతో భువం పాదక్రమైర్వల్గనకారకాః ॥11॥

తారకాసురుడితో సహా దైత్యులందరూ భీకరంగా గర్జిస్తూ పరుగుపరుగున వస్తున్నారు. వాళ్ళ పాదఘట్టనలకి భూమి కంపిస్తోంది.

తచ్ఛ్రుత్వా రవమత్యుగ్రం సర్వే దేవా వినిర్భయాః ।
ఐకపద్యేన చోత్తస్థుర్యోద్ధుకామాశ్చ తారకమ్ ॥12॥

గజమారోప్య దేవేంద్రః కుమారం హ్యగ్రతోఽభవత్ ।
సురసైన్యేన మహతా లోకపాలైస్సమావృతః ॥13॥

రాక్షసుల ఆ భీకరగర్జనలకు దేవతలు ఎవ్వరూ భయపడలేదు. సరికదా తారకుడితో పోరాడటానికి అందరూ ఒక్కుమ్మడిగా నడుం బిగించి నిలబడ్డారు. అంతలోకీ దేవేంద్రుడు దేవతామహాసైన్యంతో, దిక్పాలకులతో పరివృతుడై కుమారస్వామిని తన ఐరావతం మీద కూర్చోబెట్టుకుని సేనాగ్రభాగాన నిలబడ్డాడు.

తదా దుందుభయో నేదుర్భేరీతూర్యాణ్యనేకశః ।
వీణా వేణు మృదంగాని తదా గంధర్వనిస్స్వనాః ॥14॥

గజం దత్త్వా మహేంద్రాయ కుమారో యానమారుహత్ ।
అనేకాశ్చర్యసంభూతం నానారత్నసమన్వితమ్ ॥15॥

ఆ సమయంలో దేవదుందుభులు మ్రోగాయి. భేరీతూర్యారావాలు మిన్ను ముట్టాయి. వీణా, వేణు మృదంగధ్వనులు మంగళసూచకంగా వినిపించాయి. గంధర్వుల గానాలు వినిపించాయి. కుమారస్వామి ఐరావతాన్ని ఇంద్రుడికే విడిచిపెట్టేసి తాను విమానం అధిరోహించాడు. అదో ఆశ్చర్యకరమైన విమానం. అనేకరత్నాలతో అలంకృతమైన విమానం.

విమానమారుహ్య తదా మహాయశాః స శాంకరిస్సర్వగుణైరుపేతః ।
శ్రియా సమేతః పరయా బభౌ మహాన్ సంవీజ్యమానశ్చమరైర్మహాగ్రభైః ॥16॥

సర్వగుణసంపన్నుడైన ఆ మహాయశస్వి శంకరప్రియతనూజుడు అలా దివ్యవిమానం అధిరోహించి, మహానుభావుడు పరాశోభతో విరాజిల్లాడు. విమానంలో అగ్రభాగాన నిలిచి చమరీమృగాలు (తమ తోకల వింజామరాలను) వీవనలు వీచాయి.

ప్రాచేతసం ఛత్రమతీవ సుప్రభం రత్నైరుపేతం వివిధైర్విరాజితమ్ ।
ధృతం తదా తచ్చ కుమారమూర్ధ్ని వై హ్యనంతచాంద్రైః కిరణైర్మహాప్రభైః ॥17॥

వరుణదేవుడు బహూకరించిన శ్వేతచ్ఛత్రం గుహుడి శిరస్సుమీద అందంగా వెలుగొందింది. రకరకాల రత్నాలతో అది కాంతులీనుతోంది. అసంఖ్యాకచంద్రకిరణాల వెన్నెలకాంతులను వెదజల్లుతోంది.

మిళితాస్తే తదా సర్వే దేవాశ్శక్రపురోగమాః ।
స్వైః స్వైర్బలైః పరివృతా యుద్ధకామా మహాబలాః ॥18॥

మహాబలిష్ఠులు దేవనాయకులందరూ తమ తమ సైన్యాలతో పరివేష్ఠితులై, కయ్యానికి కాలు దువ్వుతూ, ఇంద్రుడి నాయకత్వాన సంఘటితులై నిలిచారు.

ఏవం దేవాశ్చ దైత్యాశ్చ యోద్ధుకామా స్థితా భువి ।
సైన్యేన మహతా తేన వ్యూహం కృత్వా పృథక్ పృథక్ ॥19॥

నారదమునీ! ఇలా దేవతలూ దైత్యులూ యుద్ధోత్సాహంతో రణరంగాన నిలబడ్డారు. ఎవరి మహాసైన్యంతో వారు, ఎవరివ్యూహరచనతో వారు - నిలబడ్డారు.

తే సేనే సురదైత్యానాం శుశుభాతే పరస్పరమ్ ।
హంతుకామే తదాన్యోన్యం స్తూయమానే చ వందిభిః ॥20॥

ఉభే సేనే తదా తేషామగర్జేతాం వనోపమే ।
భయంకరేఽత్యవీరాణామితరేషాం సుఖావహే ॥21॥

దేవదానవ సైన్యాలు రెండూ పరస్పరం చంపుకోవాలనే కోరికతో ఎదురెదురుగా నిలబడ్డాయి. ఎవరి వందిమాగధులు వారిని స్తుతులతో ఉత్సాహపరుస్తూనే ఉన్నారు. మహారణ్యాలలాగా విస్తరించిన ఆ సేనల వీరగర్జనలు పిరికిపందలకు అతిభయంకరంగానూ, ధైర్యశాలులకు సుఖావహంగానూ ఉన్నాయి.

ఏతస్మిన్నంతరే తత్ర బలోన్మత్తాః పరస్పరమ్ ।
దైత్యా దేవా మహావీరా యుయుధుః క్రోధవిహ్వలాః ॥22॥

ఆసీత్సుతుములం యుద్ధం దేవదైత్యసమాకులమ్ ।
రుండముండాంకితం సర్వం క్షణేన సమపద్యత ॥23॥

దేవదైత్యమహావీరులు బలోన్మత్తులు. యుద్ధం ఎప్పుడు మొదలవుతుందా అని ఎదురుచూస్తున్నారు. క్రోధంతో ఊగిపోతున్నారు. ఒక్కసారిగా కలబడ్డారు. సంకులసమరం జరిగింది. క్షణంలో రణభూమి – తెగిపడ్డ శిరస్సులతో, పుర్రెలతో నిండిపోయింది.

భూమౌ నిపతితాస్తత్ర శతశోఽథ సహస్రశః ।
నికృత్తాంగా మహాశస్త్రైః నిహతా వీరసమ్మతాః ॥24॥

కేషాంచిద్బాహవశ్ఛిన్నా ఖడ్గపాతైస్సుదారుణైః ।
కేషాంచిదూరవశ్ఛిన్నా వీరాణాం మానినాం మృధే ॥25॥

శత్రువుల శస్త్రాస్త్రాలతో అవయవాలు తెగిపోయి ఉభయసేనలలోనూ మహావీరులు వందలూ, వేలుగా నేలకు ఒరిగిపోయారు. దారుణఖడ్గప్రహారాలతో కొందరి చేతులు తెగిపడ్డాయి, కొందరు వీరుల తొడలు విరిగిపోయాయి.

కేచిన్మథితసర్వాంగా గదాభిర్ముద్గరైస్తథా ।
కేచిన్నిర్భిన్నహృదయాః పాశైర్భల్లైశ్చ పాతితాః ॥26॥

కేచిద్విదారితాః పృష్ఠే కృంతైః ఋష్టిభిరంకుశైః ।
ఛిన్నాన్యపి శిరాంస్యేవ పతితాని చ భూతలే ॥27॥

గదాప్రహారాలతో, ముద్గరాల దెబ్బలతో అవయవాలన్నీ తునాతునకలై పడిపోయినవారు కొందరు. పాశలూ, బల్లేలూ గుండెల్లో దిగబడి నేలరాలినవారు కొందరు. ఖడ్గాలతో వాడివాడి అంకుశాలతో వీపులు చీరుకుపోయినవారు కొందరైతే, కేవలం శిరస్సులు మాత్రమే రాలిపడ్డవారు కొందరు.

బహూని చ కబంధాని నృత్యమానాని తత్ర వై ।
వల్గమానాని శతశో ఉద్యతాస్త్రకరాణి చ ॥28॥

శిరస్సులు తెగిపడినా చేతిలోని ఆయుధాన్ని అలాగే ఎత్తిపట్టుకుని, రణరంగాన గెంతుతూ, నృత్యమాడు తున్నాయి వందల వందల మొండేలు.

నద్యః ప్రవర్తితాస్తత్ర శతశోఽసృగ్వహాస్తదా ।
భూతప్రేతాదయస్తత్ర శతశశ్చ సమాగతాః ॥29॥

గోమాయవశ్శివాస్తత్ర భక్షయంతః పలం బహు ।
తథా గృధ్రవటాశ్యేనా వాయసా మాంసభక్షకాః ॥
బుభుజుః పతితానాం చ పలాని సుబహూని వై ॥30॥

నెత్తురుటేరులు వందలుగా పారి రణభూమిలో నదులయ్యాయి. వందల సంఖ్యలో భూతాలు, ప్రేతాలు గుమికూడాయి. మగనక్కలూ, ఆడనక్కలూ పుష్కలంగా మాంసం తింటున్నాయి. అలాగే గ్రద్దలూ, రాబందులూ, డేగలూ, కాకులూ–మాంసపు ముద్దల్ని కడుపుల నిండుగా ఆరగించాయి.

ఏతస్మిన్నంతరే తత్ర తారకాఖ్యో మహాబలః।
సైన్యేన మహతా సద్యో యయౌ యోద్ధుం సురాన్ ప్రతి ॥31॥

దేవా దృష్ట్వా సమాయాంతం తారకం యుద్ధదుర్మదమ్ ।
యోద్ధుకామం తదా సద్యో యయుశ్శక్రాదయస్తదా ॥32॥

బభూవాథ మహన్నాదస్సేనయోరుభయోరపి ।

అంతలో మహాబలశాలి తారకుడు యుద్ధానికి దిగాడు. మహాసైన్యంతో దేవతలను ఎదిరించడానికి వచ్చాడు. ఆ యుద్ధదుర్మదుణ్ని తారకుణ్ని తమతో తలపడటానికి వస్తున్నవాణ్ని తేరిపారజూశారు దేవతలు. వెంటనే ఇంద్రాదులందరూ ఒక్కపెట్టున అతడిమీదకు వెళ్ళారు. ఉభయసేనలూ ఢీకొనడంతో ఒక మహానాదం మిన్ను ముట్టింది.

అథాభూత్ ద్వంద్వయుద్ధం హి సురాసురవిమర్దనమ్ ॥
యం దృష్ట్వా హర్షితా వీరాః క్లీబాశ్చ భయమాగతాః ॥33॥

దేవదైత్యమహావీరులకు పరస్పరసంహారకంగా ద్వంద్వయుద్ధం ప్రవర్తిల్లింది. దాన్ని తిలకించిన వీరులు సంబరపడగా, పిరికిపందలు భయంతో వణికిపోయారు.

తారకో యుయుధే యుద్ధే శక్రేణ దితిజో బలీ ।
అగ్నినా సహ సంహ్రాదో జంభేనైన యమః స్వయమ్ ॥34॥

మహాప్రభుర్నైరృతేన పాశీ సహ బలేన చ ।
సువీరో వాయునా సార్ధం పవమానేన గుహ్యరాట్ ॥35॥

ఈశానేన సమం శంభుర్యుయుధే రణవిత్తమః ।
శుంభశ్శేషేణ యుయుధే కుంభశ్చంద్రేణ దానవః ॥36॥

కుంబరో మహిరేణాజౌ మహాబలపరాక్రమః ।
యయుధే పరమాస్త్రైశ్చ నానాయుద్ధవిశారదః ॥37॥

సురాసురుల ద్వంద్వయుద్ధం ఎవరెవరికి జరిగిందంటే –మహాబలశాలి దితి పుత్రుడు తారకుడు ఇంద్రుడితో తలపడ్డాడు. సంహ్రాదుడు అగ్నిదేవుడితో, యముడు స్వయంగా జంభాసురుడితో మహా ప్రభువనే దైత్యుడు నిర్ఋతితో, వరుణదేవుడు, బలాసురుడితో సువీరరాక్షసుడు వాయుదేవుడితో, గుహ్యులనే దేవతల రాజు పవమానుడనే దైత్యవీరుడితో, శంభుడనే దైత్యనాథుడు మహాయుద్ధవిశారదుడు సరాసరి వెళ్ళి ఈశానుడితో, శుంభుడనే దానవవీరుడు శేషుడితో, కుంభదానవుడు చంద్రుడితో, మహాబలపరాక్రమశాలి కుంబరాసురుడు సూర్యుడితో కలబడి రకరకాల యుద్ధవిధానాలతో, రకరకాల మహాస్త్రాలతో రణరంగాన నిలబడి యుద్ధం చేశారు.

ఏవం ద్వందేన యుద్ధేన మహతా చ సురాసురాః ।
సంగరే యుయుధుస్సర్వే బలేన కృతనిశ్చయాః ॥38॥

అన్యోన్యం స్పర్ధమానాస్తే॒ మరా దైత్యా మహాబలాః ।
తస్మిన్ దేవాసురే యుద్ధే దుర్జయా అభవన్మునే ॥39॥

ఈ విధంగా, నారదమునీ! సురాసురులు ద్వంద్వయుద్ధానికి దిగి ఆ రణరంగంలో ఎవరి బలం వారిదిగా కృతనిశ్చయులై పోరాటం సాగించారు. అమరులూ, అసురులూ పరస్పరం మహాస్పర్ధంతో యుద్ధం చేశారు. అందరూ మహాబలిష్ఠులే. ఆ దేవాసురసంగ్రామంలో ఎవరూ, ఎవరికీ తీసిపోలేదు. అందరూ దుర్జయులుగానే పోరాటం సాగించారు.

తదా చ తేషాం సురదానవానాం బభూవ యుద్ధం తుములం జయైషిణామ్ ।
సుఖావహం వీరమనస్వినాం వై భయావహం చైవ తథేతరేషామ్ ॥40॥

ఎవరికివారు జయకాంక్షతో పోరాడుతున్న దేవదానవులకు ఆవిధంగా సంకులసంగరం సాగింది. అది వీరమనస్వులకు సుఖావహంగా, భీరుమనస్వులకు భయావహంగా భాసించింది.

మహీ మహారౌద్రతరా వినష్టకై స్సురాసురైర్వై పతితైరనేకశః ।
తస్మిన్నగమ్యాతిభయానకా తదా జాతా మహాసౌఖ్యవహా మనస్వినామ్ ॥41॥

నారదమునీ! ప్రాణాలు కోల్పోయి నేలకు ఒరిగిన సురాసురల అసంఖ్యాక కళేబరాలతో యుద్ధభూమి మహారౌద్రంగా మారిపోయింది. అగమ్యమూ, అతిభయానకమూ అయిపోయింది. కానీ ధైర్యశాలులకు మాత్రం ఎంతగానో ఆనందదాయకమయ్యింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే యుద్ధప్రారంభవర్ణనం నామ సప్తమో॒ ధ్యాయః ॥7॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు యుద్ధప్రారంభవర్ణనం అనే ఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టమోఽధ్యాయః – ఎనిమిదవ అధ్యాయం

దేవదైత్యసామాన్య యుద్ధవర్ణనమ్ – దేవదైత్యసామాన్య యుద్ధవర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతి తే వర్ణితస్తాత! దేవదానవసేనయోః ।
సంగ్రామస్తుములోఽతీవ తత్ ప్రభోవ్ః శృణు నారద ॥1॥

ఏవం యుద్ధేఽతి తుములే దేవదానవసంక్షయే ।
తారకేణైవ దేవేంద్రః శక్త్యా పరమయా సహ ॥2॥

సద్యః పపాత నాగాచ్ఛ ధరణ్యాం మూర్ఛితోఽభవత్ ।
పరం కశ్మలమాపేదే వజ్రధారీ సురేశ్వరః ॥3॥

పుత్రకా! నారదా! దేవదానవసైన్యాలకు ఇలా జరిగిన భీకరయుద్ధాన్ని నీకు వర్ణించి చెప్పాను. నాయకుల మధ్య జరిగిన పోరు వివరిస్తాను విను. ఉభయపక్షాలవారూ నశించడానికి జరిగిన ఆ తుములసంగ్రామంలో తారకుడు ప్రయోగించిన మహాశక్తి ఆయుధం దెబ్బకు దేవేంద్రుడు తన మదగజం (ఐరావతం) నుంచి నేలకు రాలిపడ్డాడు. స్పృహ కోల్పాయాడు. వజ్రధారి ఆ సురేశ్వరుడు మిక్కిలి కష్టమును పొందెను.

తథైవ లోకపాస్సర్వేఽసురైశ్చ బలవత్తరైః ।
పరాజితా రణే తాత! మహారణవిశారదైః ॥4॥

అన్యే ఽపి నిర్జరా దైత్యైః యుధ్యమానాః పరాజితాః ।
అసహంతో హి తత్తేజః పలాయన పరాయణాః ॥5॥

అదేవిధంగా తక్కిన దిక్పాలకులు సైతం రణకోవిదులూ, బలశాలులూ అయిన దైత్యనాయకుల చేతుల్లో పరాజితులయ్యారు. మిగతా దేవతలూ అంతే. పోరాటంలో ఓడిపోయారు. దైత్యుల పరాక్రమాన్ని తట్టుకోలేక అందరూ పలాయనం చిత్తగించారు.

జగర్జురసురాస్తత్ర జయినస్సుకృతోద్యమాః ।
సింహనాదం ప్రకుర్వంతః కోలాహలపరాయణాః ॥6॥

గెలిచిన ఉత్సాహంతో అసురులు గర్జించారు. సింహనాదాలు చేస్తూ అంతులేని కోలాహలం సృష్టించారు.

ఏతస్మిన్నంతరే తత్ర వీరభద్రో రుషాన్వితః ।
ఆససాద గణైర్వీ రైస్తారకం వీరమానినమ్ ॥7॥

నిర్జరాన్ పృష్ఠతః కృత్వా శివకోపోద్భవో బలీ ।
తత్సమ్ముఖో బభూవాథ యోద్ధుకామో గణాగ్రణీః ॥8॥

తనయా! నారదా! ఇంతలో ఆ రణరంగానికి వీరభద్రుడు విచ్చేశాడు. మూర్తీభవించిన రోషంలా విచ్చేశాడు. అతడి వెంట ప్రమథగణాలు విచ్చేశాయి. వస్తూనే వీరగర్వంతో వీర్రవీగుతున్న తారకుణ్ని ఎదుర్కొన్నాడు. దేవతలను తన వెనక దాచి, తానే తారకుణ్ని ఢీకొన్నాడు. వీరభద్రుడంటే –శివుడి కోపం నుంచి ఉద్భవించినవాడు. మహాబలశాలి. ప్రమథగణాలకు అగ్రనాయకుడు వచ్చాడు. యుద్ధకాముడై వచ్చాడు. వచ్చి తారకుడి ఎదుట నిలిచాడు.

తదా తే ప్రమథాస్సర్వే దైత్యాశ్చ పరమోత్సవాః ।
యుయుధుస్సంయుగే ఽన్యోన్యం ప్రసక్తాశ్చ మహారణే ॥9॥

త్రిశూలైః ఋష్టిభిః పాశైః ఖడ్గైః పరశుపట్టిశైః ।
నిజఘ్నుస్సమరేఽన్యోన్యం రణే రణవిశారదాః ॥10॥

మహోత్సాహులై మహారణతత్పరులై ప్రమథగణాలూ, దైత్యగణాలూ పరస్పరం పోరాటం సాగించాయి. త్రిశూలాలూ, ఋష్టులు, పాశాలూ, ఖడ్గాలూ, పరశువులూ, పట్టిశాలూ – ఇలా రకరకాల ఆయుధాలతో ఆ రణవిశారదులు రణరంగాన పరస్పరం కొట్టుకున్నారు, పొడుచుకున్నారు.

తారకో వీరభద్రేణ స త్రిశూలాహతో భృశమ్ ।
పపాత సహసా భూమౌ క్షణం మూర్ఛా పరిప్లుతః ॥11॥

ఉత్థాయ స ద్రుతం వీరస్తారకో దైత్యసత్తమః ।
లబ్ధసంజ్ఞో బలాత్ శక్త్యా వీరభద్రం జఘాన హ ॥12॥

ఎదుట నిల్చిన వీరభద్రుడు తన చేతిలోని త్రిశూలంతో తారకుణ్ని బలంగా కొట్టాడు. వాడు స్పృహ కోల్పోయి నేలమీద పడ్డాడు. క్షణంలో తేరుకున్నాడు. వెంటనే లేచి నిలబడ్డాడు. పూర్తిగా స్పృహలోకి వచ్చాడు. తన శక్తి ఆయుధంతో వీరభద్రుణ్ని మోదాడు.

వీరభద్రస్తథా వీరో మహాతేజా హి తారకమ్ ।
జఘాన త్రిశిఖేనాశు ఘోరేణ నిశితేన తమ్ ॥13॥

మహాతేజస్వి అయిన వీరభద్రుడు–పదునైన తన భీషణత్రిశూలంతో అదే మోతాదులో తారకుణ్ని మోదాడు.

సోఽపి శక్త్యా వీరభద్రం జఘాన సమరే తతః ।
తారకో దితిజాధీశః ప్రబలో వీరసమ్మతః ॥14॥

ఏవం సంయుధ్యమానౌ తౌ జఘ్నతుశ్చేతరేతరమ్ ।
నానాస్త్ర శస్త్రైస్సమరే రణవిద్యావిశారదౌ ॥15॥

మహావీరుడూ, మహాబలిష్ఠుడు అయిన ఆ తారకుడు కూడా తన శక్త్యాయుధంతో వీరభద్రుణ్ని తిరిగికొట్టాడు. ఇలా ఒకరినొకరు కొట్టుకుంటూ, ఆ రణకోవిదులు ఇద్దరూ రకరకాల శస్త్రాస్త్రాలతో ద్వంద్వయుద్ధం సాగించారు.

తయోర్మహాత్మనోస్తత్ర ద్వంద్వ యుద్ధమభూత్తదా ।
సర్వేషాం పశ్యతామేవ తుములం రోమహర్షణమ్ ॥16॥

ఆ మహాత్ములిద్దరికీ అలా ప్రారంభమైన ద్వంద్వయుద్ధం తీవ్రరూపం ధరించింది. చూస్తున్న వారికి గగురుపొడిచింది.

తతో భేరీమృదంగాశ్చ పటహానకగోముఖాః ।
వినేదుర్విహతా వీరైః శృణ్వతాం సుభయానకాః ॥17॥

అంతలో – ఇరుపక్షాలలోని మహావీరులూ భేరి, మృదంగం, పటహం, ఆనకం, గోముఖం మొదలైన వాద్యాలను ఉవ్వెత్తున మోగించారు. ఆ ధ్వనులు శ్రోతలకు భయం పుట్టించాయి.

యుయుధా తేఽతిసన్నద్ధౌ ప్రహారైర్జర్జరీకృతౌ ।
అన్యోన్యమతిసంరబ్ధౌ తౌ బుధాంగారకావివ ॥18॥

బుధఅంగారక గ్రహాలలాగా – ఇద్దరూ తారక–వీరభద్రులు అత్యంతసన్నద్ధులై అత్యంత సంరబ్ధులై పోరాడుతుంటే ఆయుధాల దెబ్బలకు ఇద్దరి శరీరాలూ గాయాలపాలయ్యాయి. అయినా అలాగే యుద్ధం చేస్తున్నారు.

ఏవం దృష్ట్వా తదా యుద్ధం వీరభద్రస్య తేన చ ।
తత్ర గత్వా వీరభద్రమువోచస్త్వం శివప్రియః ॥19॥

నారదా! వీరభద్రుడికి తారకుడితో జరుగుతున్న యుద్ధాన్ని చూసి, శివుడికి అత్యంతప్రీతిపాత్రుడువైన నువ్వు రణరంగానికి వెళ్ళి, వీరభద్రుడితో ఇలా పలికావు.

నారద ఉవాచ – నారదుడు అన్నాడు.

వీరభద్ర మహావీర గణానామగ్రణీర్భవాన్ ।
నివర్తస్వ రణాదస్మాద్రోచతే న వధస్త్వయా ॥20॥

మహావీరా! వీరభద్రా! నువ్వు ప్రమథగణాలకు అగ్రనేతవు. దయచేసి ఈ యుద్ధం నుంచి వైదొలగు. నీ చేతిలో ఇతడి మరణం శోభించదు.

ఏవం నిశమ్య తద్వాక్యం వీరభద్రో గణాగ్రణీః ।
అవదత్స రుషావిష్టస్త్వాం తదా తు కృతాంజలిః ॥21॥

నారదా! గణాగ్రణి అయిన వీరభద్రుడు నీ మాటను వింటూనే రోషపడ్డాడు. కానీ సంభాళించుకొని నీకు నమస్కరిస్తూ ఇలా అన్నాడు.

వీరభద్ర ఉవాచ – వీరభద్రుడు అన్నాడు.

మునివర్య మహాప్రాజ్ఞ శృణు మే పరమం వచః ।
తారకం చ వధిష్యామి పశ్య మేఽద్య పరాక్రమమ్ ॥22॥

ఆనయంతి చ మే వీరాః స్వామినం రణసంసది ।
తే పాపినో మహాక్లీబా వినశ్యంతి రణం గతాః ॥23॥

మునివర్యా! మహాప్రాజ్ఞా! నారదా! సారాంశంగా చెబుతున్న నా మాట విను. తారకుణ్ణి నేను చంపితీరుతాను. చూడు, ఈనాడు నా ప్రతాపం. మహా మహా వీరులయ్యుండీ తమ ప్రభువు రణరంగానికి రావలసిన అవసరం కల్పిస్తే వారు వీరులు కాదు, మహాపాపులు, నపుంసకులు, వారు రణరంగానికి రావడం చావడానికే.

అసద్గతిం ప్రాప్నువంతి తేషాం చ నిరయో ధ్రువమ్ ।
వీరభద్రో హి విజ్ఞేయో న వాచ్యస్తే కదాచన ॥24॥

నారదా! అలాంటి పిరికిపందలకు సద్గతులుండవు. వారు నరకానికి పోవడం తథ్యం. ఈ వీరభద్రుడు అలాంటివాడు కాదు. తెలుసుకో ఏ నాటికీ మాట రానివ్వడు. (అపకీర్తి పాలు కాడు)

శస్త్రాస్త్రైర్భిన్నగాత్రా యే రణం కుర్వంతి నిర్భయాః ।
ఇహాముత్ర ప్రశంస్యాస్తే లభంతే సుఖమద్భుతమ్ ॥25॥

శృణ్వంతు మమ వాక్యాని దేవా హరిపురోగమాః ।
అతారకాం మహీమద్య కరిష్యే స్వామి వర్జితామ్ ॥26॥

శత్రువుల శస్త్రాస్త్రాలతో శరీరాలు తూట్లుపడిపోయినా నిర్భయంగా యుద్ధం సాగించే మహావీరులే అద్భుతంగా ఇహంలో ప్రశంసలు పొందుతున్నారు. పరంలో సుఖాలు పొందుతున్నారు. విష్ణుప్రముఖులారా! దేవతలారా! దయచేసి నా ప్రతిజ్ఞావాక్యాలు వినండి! మా నాయకుడితో ప్రమేయం లేకుండానే నేనే ఈ భూగోళాన్ని ఈ రోజుతో తారకరహితం చేసేస్తాను.

ఇత్యుక్త్వా ప్రమథైస్సార్ధం వీరభద్రో హి శూలధృక్ ।
విచింత్య మనసా శంభుం యుయుధే తారకేణ హి ॥27॥

వృషారూఢైరనేకైశ్చ త్రిశూలవరధారిభిః ।
మహావీరస్త్రినేత్రైశ్చ స రేజే రణసంగతః ॥28॥

త్రిశూలధారి వీరభద్రుడు ఇలా అంటూనే ఒక్కసారి మనస్సులో తన స్వామిని శివుణ్ణి ధ్యానించి, తారకుడితో తలపడ్డాడు. వృషభారూఢులై, త్రిశూలధారులై, త్రినేత్రభూషితులైన ప్రమథులు అసంఖ్యాకంగా తన వెంట నిలువగా ఆ మహావీరుడు రణరంగంలో విరాజిల్లాడు.

కోలాహలం ప్రకుర్వంతో నిర్భయాశ్శతశో గణాః ।
వీరభద్రం పురస్కృత్య యుయుధుర్దానవైస్సహ ॥29॥

అసురాస్తేఽపి యుయుధుస్తారకాసురజీవినః ।
బలోత్కటా మహావీరా మర్దయంతో గణాన్ రుషా ॥30॥

మహాకోలాహలంగా, మహానిర్భయంగా వందలవేల ప్రమథగణాలు వీరభద్రుని వెంట రణరంగాన నిలబడి, దానవవీరులతో పోరాటం సాగించారు. తారకుణ్ణి ఆశ్రయించుకుని, జీవిస్తున్న ఆ దానవ వీరులు సైతం మహాబలాఢ్యులై రోషంతో ప్రమథగణాలను పిప్పిపిప్పి చేస్తూ, సమానంగా పోరాడారు.

పునఃపునశ్చైవ బభూవ సంగరో మహోత్కటో దైత్యవరైర్గణానామ్ ।
ప్రహర్షమాణాః పరమాస్త్రకోవిదాః తదా గణాస్తే జయినో బభూవుః ॥31॥

ప్రమథులకూ, దైత్యవీరులకూ జరుగుతున్న మహాసంగ్రామం క్రమక్రమంగా మహోత్కటమయ్యింది. తీవ్రరూపం ధరించింది. ఎట్టకేలకు దివ్యాస్త్రకోవిదులు ప్రమథులు విజయులయ్యారు, ఆనందపరవశులయ్యారు.

గణైర్జితాస్తే ప్రబలైరసురా విముఖా రణే ।
పలాయనపరా జాతా వ్యథితా వ్యగ్రమానసాః ॥32॥

మహాబలశాలులైన గణాల చేతిలో ఓడిపోయిన అసురులు శారీరకంగా, మానసికంగా వ్యథితులయ్యారు. రణవిముఖులయ్యారు. పలాయనం చిత్తగించారు.

ఏవం భ్రష్టం స్వసైన్యం తద్దృష్ట్వా తత్పాలకోఽసురః ।
తారకో హి రుషా విష్టో హంతుం దేవగణాన్ యయౌ ॥33॥

భుజానామయుతం కృత్వా సింహమారుహ్య వేగతః ।
పాతయామాస తాన్ దేవాన్ గణాంశ్చ రణమూర్ధని ॥34॥

ఇలా పారిపోతున్న తన సైన్యాన్ని చూసి, దైత్యనాయకుడు తారకుడు రోషంతో మండిపడ్డాడు. ఒకేసారి అటు దేవతలనూ, ఇటు ప్రమథగణాలను సంహరించడానికి పూనుకొన్నాడు. ఒక్కసారిగా పదివేల చేతులవాడు అయ్యాడు. సింహవాహనం అధిరోహించాడు. మహావేగంగా రణరంగానికి దూసుకొని వచ్చాడు. దేవతలనూ, గణాలను వందలవేల సంఖ్యలో నేల రాల్చాడు.

స దృష్ట్వా తస్య తత్కర్మ వీరభద్రో గణాగ్రణీః ।
చకార సుమహత్కోపం తద్వధాయ మహాబలీ ॥35॥

స్మృత్వా శివపదాంభోజం జగ్రాహ త్రిశిఖం పరమ్ ।
జజ్వలుస్తేజసా తస్య దిశః సర్వా నభస్తథా ॥36॥

తారకుడి విజృంభణను గమనించాడు వీరభద్రుడు. గణనాయకుడు. మహాబలశాలి. పట్టరాని కోపంతో ఊగిపోయాడు. తారకుణ్ణి ఇక వధించెయ్యాలి అనుకున్నాడు. శివుడి పాదపద్మాలను తలుచుకున్నాడు. తిరుగులేని త్రిశూలం అందుకున్నాడు. ఆ క్షణంలో అతడి తేజస్సుకు దిక్కులు ప్రజ్వరిల్లాయి. ఆకాశం ధగధగలాడింది.

ఏతస్మిన్నంతరే స్వామీ వారయామాస తం రణమ్ ।
వీరబాహుముఖాన్సద్యో మహాకౌతుకదర్శకః ॥37॥

తదాజ్ఞయా వీరభద్రో నివృత్తోఽభూద్రణాత్తదా ।
కోపం చక్రే మహావీరస్తారకోఽసురనాయకః ॥38॥

అంతలో దేవసేనానాయకుడు కుమారస్వామి మహారణకౌతుకంతో వచ్చి, వీరభద్రుడి యుద్ధాన్ని ఆపుచేశాడు. వీరబాహుప్రముఖులైన గణనాయకులనూ వారించాడు. నాయకుడి ఆజ్ఞను శిరసావహించి, వీరభద్రుడు రణరంగం నుంచి వైదొలగాడు. అసురనాయకుడు తారకమహావీరుడు కోపంతో మరింత మండిపడ్డాడు.

చకార బాణవృష్టిం చ సురోపరి తదాసురః ।
తప్త్వా హ్యేసీత్సురాన్సద్యో నానాస్త్రరణకోవిదః ॥39॥

వెంటనే దేవతలమీద బాణవర్షం కురిపించాడు. దేవతలందర్నీ ఆ రణకోవిదుడు, అస్త్రకోవిదుడు అలా ఒక్క క్షణంలో అట్టుడికించి నిలిచాడు.

ఏవం కృత్వా మహత్కర్మ తారకో ఽసురపాలకః ।
సర్వేషామపి దేవానామశక్యో బలినాం వరః ॥40॥

బలిష్ఠులలో వరిష్ఠుడు అయిన ఆ అసురనాయకుడు తారకుడు ఇలా సకలదేవతలనూ అట్టుడికించిన ఘనకార్యం నిర్వహించి, మొత్తం దేవతాసమూహానికే అసాధ్యుడై నిలిచాడు.

ఏవం నిహన్యమానాంస్తాన్ దృష్ట్వా దేవాన్ భయాకులాన్ ।
కోపం కృత్వా రణాయాశు సన్నద్ధో ఽభవదచ్యుతః ॥41॥

ఈ విధంగా తారకుడి బాణాల తాకిడికి దేవతలందరూ బెంబేలెత్తిపోయారు. దీనిని అచ్యుతుడు గమనించాడు. కోపోద్రిక్తుడయ్యాడు. తారకుణ్ని ఎదుర్కోవడానికి సన్నద్ధుడయినాడు.

చక్రం సుదర్శం శార్ఙ్గం ధనురాదాయ సాయుధః ।
అభ్యుద్యయౌ మహాదైత్యం రణాయ భగవాన్ హరిః ॥42॥

తతస్సమభవద్యుద్ధం హరితారకయోర్మహత్ ।
లోమహర్షణమత్యుగ్రం సర్వేషాం పశ్యతాం మునే ॥43॥

సాయుధుడై సుదర్శనచక్రాన్ని, శార్ఙ్గధనుస్సునీ చేతబట్టి భగవంతుడు ఆ శ్రీహరి మహాదైత్యుడితో యుద్ధానికి ఎదురువెళ్ళాడు. హరితారకులకు భీకరసమరం జరిగింది. నారదమునీ! చూపరులందరికీ ఆ భీషణసంగ్రామం నిలువునా మిక్కిలి గగుర్పాటు కలిగించింది.

గదాముద్యమ్య స హరిర్జఘానాసురమోజసా ।
ద్విధా చకార తాం దైత్యస్త్రిశిఖేన మహాబలీ ॥44॥
తతస్స క్రుద్ధో భగవాన్ దేవానా మభయంకరః ।
శార్ఙ్గచ్యు తైశ్శరవ్యూహైర్జఘానాసురనాయకమ్ ॥45॥

శ్రీహరి తన కౌమోదకీ మహాగదను చేబూని అసురనాయకుణ్ని శక్తికొద్దీ కొట్టాడు. మహాబలశాలి దైత్యుడు దాన్ని తన త్రిశూలంతో రెండు ముక్కలు చేశాడు. శ్రీహరి కోపోద్రిక్తుడై. ఒక వైపు దేవతలకు అభయం చెబుతూనే ధనుస్సు అందుకున్నాడు. అసురనాయకుడిపై గురిపెట్టి బాణసమూహాలు గుప్పించాడు.

సో ఽపి దైత్యో మహావీరస్తారకః పరవీరహా ।
చిచ్ఛేద సకలాన్ బాణాన్ స్వశరైర్నిశితైర్ద్రుతమ్ ॥46॥

అథ శక్త్యా జఘానాశు మురారిం తారకాసురః ।
భూమౌ పపాత స హరిస్తత్ప్రహారేణ మూర్ఛితః ॥47॥

తారకాసురుడు తక్కువవాడా! మహావీరుడు. శత్రువీరసంహారకుడు. ఆ బాణాలను అన్నింటినీ అంతకు మించిన వాడిబాణాలతో, వేగంగా తునాతునకలు చేసేశాడు. (అంతే కాదు. వెంటనే తన శక్త్యాయుధంలో తునాతునకులు చేసేశాడు.) తరువాత తన శక్త్యాయుధంతో శ్రీహరిని ఒక్క దెబ్బవేశాడు. ఆ దెబ్బతో మూర్ఛపోయి శ్రీ మహావిష్ణువు నేలమీద పడ్డాడు.

జగ్రాహ స రుషా చక్రముత్థితః క్షణతోఽచ్యుతః ।
సింహనాదం మహత్కృత్వా జ్వలజ్జ్వాలాసమాకులమ్ ॥48॥

తేన తం చ జఘానాసౌ దైత్యానామధిపం హరిః ।
తత్ప్రహారేణ మహతా వ్యథితో న్యపతద్భువి ॥49॥

క్షణంలో తేరుకుని లేచాడు. రోషంతో చక్రాయుధం చేబూనాడు. సింహనాదం పెద్దదిగా చేశాడు. మంటలు విరజిమ్ముతున్న ఆ చక్రంతో దైత్యనాథుణ్ని కొట్టాడు. వాడు మూర్ఛిల్లి నేలకు ఒరిగాడు.

పునశ్చోత్థాయ దైత్యేంద్రస్తారకోఽసురనాయకః ।
చిచ్ఛేద త్వరితం చక్రం స్వశక్త్యాతిబలాన్వితః ॥50॥

పునస్తయా మహాశక్త్యా జఘానామరవల్లభమ్ ।
అచ్యుతోఽపి మహావీరో నందకేన జఘాన తమ్ ॥51॥

ఏవమన్యోన్యమసురో విష్ణుశ్చ బలవానుభౌ ।
యుయుధాతే రణే భూరి తత్రాక్షతబలౌ మునే ॥52॥

అసురనాయకుడు తారకుడు క్షణంలో కోలుకుని. తిరిగి లేచి నిలబడ్డాడు. మహాబలాన్వితుడు తన శక్త్యాయుధంతో మహావేగంగా ఆ సుదర్శనచక్రాన్ని తుత్తునియలు చేశాడు. అదే శక్తితో దేవతావల్లభుణ్ని శ్రీహరిని బలంగా కొట్టాడు. అప్పుడు ఆ మహావీరుడు అచ్యుతుడు తన నందకఖడ్గంతో తారకుణ్ని అతడి ఆయుధాన్ని ఎదుర్కొన్నాడు. ఇలా మహాబలశాలులైన ఆ సురవల్లభ – అసురవల్లభులు నారదమహర్షీ! తరిగిపోని శక్తిసంపన్నులై ద్వంద్వయుద్ధం సాగించారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే దేవదైత్యసామాన్య యుద్ధవర్ణనం నామాష్టమోఽధ్యాయః ॥8॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు దేవదైత్యసామాన్యయుద్ధ వర్ణనం అనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

నవమోఽధ్యాయః – తొమ్మిదవ అధ్యాయం

తారకవాక్యశక్రవిష్ణువీరభద్రయుద్ధవర్ణనమ్ – తారకవాక్యశక్రవిష్ణువీరభద్రయుద్ధవర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

దేవదేవ గుహ స్వామిన్ శాంకరే పార్వతీసుత ।
న శోభతే రణో విష్ణుతారకాసురయోర్వృథా ॥1॥

విష్ణునా న హి వధ్యోఽసౌ తారకో బలవానతి ।
మయా దత్తవరస్తస్మాత్సత్యం సత్యం వదామ్యహమ్ ॥2॥

నాన్యో హంతాస్య పాపస్య త్వాం వినా పార్వతీసుత ।
తస్మాత్ త్వయా హి కర్తవ్యం వచనం మే మహాప్రభో ॥3॥

దేవదేవా! గుహా! కుమారస్వామీ! శంకరసుతా! పార్వతీనందనా! శ్రీహరికీ, తారకుడికీ జరుగుతున్న ఈ యుద్ధం ఎంతమాత్రమూ శోభస్కరం కాదు. పైగా పూర్తిగా వృథా. ఈ బలశాలి తారకుడు విష్ణుమూర్తి చేతితో చావడుగాక చావడు. తారకుడికి నేను అలాంటి వరం ఇచ్చాను. ఇది ముమ్మాటికీ సత్యం. గౌరీతనయా! నువ్వు తప్ప వీణ్ని చంపగలిగిన వ్యక్తి మరొకడు లేడు. కనక మహాప్రభో! నా మాట విని, నువ్వే ఆ కర్తవ్యం నిర్వహించు.

సన్నద్ధో భవ దైత్యస్య వధాయాశు పరంతప ।
తద్వధార్థం సముత్పన్నః శంకరాత్త్వం శివాసుత ॥4॥

రక్ష రక్ష మహావీర త్రిదశాన్ వ్యథితాన్ రణే ।
న బాలస్త్వం యువా నైవ కింతు సర్వేశ్వరః ప్రభుః ॥5॥

శత్రుసంహారకా! గిరిజాతనూజా! తారకాసుర సంహారానికి వెంటనే నడుంకట్టు. ఆ దైత్యనాయకుణ్ని సంహరించడం కోసమే నువ్వు శివుడి నుంచి ఆవిర్భవించావు. ఓ మహావీరా! అన్ని విధాలుగానూ రణరంగాన నలిగిపోతున్న దేవతలను తత్క్షణం రక్షించు. నువ్వు బాలుడివీ కాదు, యువకుడివీ కాదు. కానీ సర్వేశ్వరుడివి. సర్వరక్షకుడివి.

శక్రం పశ్య తథా విష్ణుం వ్యాకులం చ సురాన్ గణాన్ ।
ఏవం జహి మహాదైత్యం త్రైలోక్యం సుఖినం కురు ॥6॥

ఇంద్రుణ్ని చూడు! ఎంత కలత చెందాడో, అలాగే విష్ణుమూర్తిని చూడు! ఎంతగా వ్యాకులితుడయ్యాడో, తక్కిన దేవతలనూ, ప్రమథగణాలనూ ఒక్కసారి చూడు! కనక వెంటనే ఈ మహాదైత్యుణ్ని మట్టుపెట్టు. ముల్లోకాలనూ సుఖపెట్టు.

అనేన విజితశ్చంద్రో లోకపాలైః పురా సహ ।
విష్ణుశ్చాపి మహావీరో తర్జితస్తపసో బలాత్ ॥7॥

త్రైలోక్యం నిర్జితం సర్వమసురేణ దురాత్మనా ।
ఇదానీం తవ సాన్నిధ్యాత్ పునర్యుద్ధం కృతం చ తైః ॥8॥

ఇంతకు పూర్వమే ఈ దేవేంద్రుడు లోకపాలకులతో సహా ఈ దైత్యుడి చేతిలో ఓడిపోయాడు. మహావీరుడైన శ్రీహరిని ఈ దానవుడు అలనాడే భయపెట్టాడు. ఈ దురాత్ముడు తపోబలంతో ముల్లోకాలనూ పూర్తిగా జయించేశాడు. అయినా ఇప్పుడు ఇదిగో నువ్విలా తమ సన్నిధిలో ఉన్నావని వీరు అందరూ మళ్ళీ అతడితో పోరాటానికి దిగారు.

తస్మాత్త్వయా నిహంతవ్యస్తారకః పాపపూరుషః ।
అన్యవధ్యో న చైవాయం మద్వరాత్ శంకరాత్మజ ॥9॥

ఓ శంకరనందనా! అందుకని ఆ పాపిష్టి తారకుణ్ణి నువ్వే వధించాలి. నేనిచ్చిన వరం వల్ల వాడు మరొకరికి వధ్యుడు కానేకాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతి శ్రుత్వా మమ వచః కుమారః శంకరాత్మజః ।
విజహాస ప్రసన్నాత్మా తథాస్త్వితి వచోఽబ్రవీత్ ॥10॥

వినిశ్చిత్యాసురవధం శాంకరిస్స మహాప్రభుః ।
విమానాదవతీర్యాథ పదాతిరభవత్తదా ॥11॥

నారదమునీ! శంకరసుతుడు కుమారస్వామి నా పలుకులు ఆలకించి పెద్దపెట్టున నవ్వాడు. ప్రసన్న చిత్తుడయ్యాడు. 'తథాస్తు' అని పలికాడు. సర్వసమర్థుడు. ఆ కుమారస్వామి ఇలా తారకాసురసంహారానికి కృతనిశ్చయుడై అప్పుడు తానున్న విమానం దిగి, పాదచారి అయ్యాడు.

పద్భ్యాం తదాసౌ పరిధావమానో రేజేఽతి వీరః శివజః కుమారః ।
కరే సమాదాయ మహాప్రభాం తాం శక్తిం మహోల్కామివ దీప్తిదీప్తామ్ ॥12॥

ఒకానొక గొప్ప ఉల్కలాగా దివ్యకాంతులు వెదజల్లుతున్న శక్తి ఆయుధాన్ని చేతబట్టుకొని, రణరంగంలో తారకాసురుడి వైపు వేగంగా పరుగిడుతూ, ఆ మహావీరుడు శివకుమారుడు అత్యద్భుతంగా విరాజిల్లాడు.

దృష్ట్వా తమాయాంత మతిప్రచండం అవ్యాకులం షణ్ముఖమప్రమేయమ్ ।
దైత్యో బభాషే సురసత్తమాన్సః కుమార ఏష ద్విషతాం ప్రహంతా ॥13॥

నారదా! స్థిరచిత్తంతో చండప్రచండంగా తనవైపు దూసుకువస్తున్న ఆ షణ్ముఖుణ్ణి, ఆ అప్రమేయుణ్ణి చూసి, దైత్యనాయకుడు దేవనాయకులతో అన్నాడు గదా ఈ బాలకుడా శత్రుసంహారకుడు?"

అనేన సాకం హ్యహమేకవీరో యోత్స్యే చ సర్వానహమేవ వీరాన్ ।
గణాంశ్చ సర్వానపి ఘాతయామి సలోకపాలాన్ హరినాయకాంశ్చ ॥14॥

ఏకైక మహావీరుణ్ని నేను. ఇతడితో పాటు ప్రమథగణాలను శ్రీహరి నాయకత్వంలోని దేవవీరులను సమస్తంగా ఇంద్రాది దిక్పాలకులతో సహా అందరినీ నేనే మట్టుపెడతాను.

ఇత్యేవముక్త్వా స తదా మహాబలః కుమారముద్దిశ్య యయౌ చ యోద్ధుమ్ ।
జగ్రాహ శక్తిం పరమాద్భుతాం చ స తారకో దేవవరాన్ బభాషే ॥15॥

ఇలా పలికి ఆ మహాబలుడయిన తారకుడు కుమారుడితో యుద్ధానికి సిద్ధపడి, ముందుకి నడిచాడు. అద్భుతమూ, అద్వితీయమూ అయిన తన శక్తి ఆయుధాన్ని చేత బట్టాడు. మళ్ళీ దేవనాయకులతో ఇలా అన్నాడు.

తారక ఉవాచ – తారకుడు అన్నాడు.

కుమారో మేఽగ్రతశ్చాద్య భవద్భిశ్చ కథం కృతః ।
యూయం గతత్రపా దేవా విశేషాత్ శక్రమేశ్వరౌ ॥16॥

పురైతాభ్యాం కృతంకర్మ విరుద్ధం వేదమార్గతః ।
తచ్ఛృణుధ్వం మయా ప్రోక్తం వర్ణయామి విశేషతః ॥17॥

దేవనాయకులారా! ప్రమథనాయకులారా! నన్ను ఎదిరించడానికి ఒక బాలుణ్ని మీరసలు ఎలా పంపగలిగారు? మీరంతా సిగ్గులేనివాళ్ళు. మరీ ముఖ్యంగా మీ ఇంద్రుడికీ మీ రమాపతికీను. ఒకప్పుడు వీళ్ళిద్దరూ చేసిన ఘనకార్యాలు వేదమార్గానికి ఎంత విరుద్ధాలో విశేషంగా వర్ణించి చెబుతాను. అందరూ ఒకసారి శ్రద్ధగా ఆలకించండి.

తత్ర విష్ణుశ్ఛలీ దోషీ హ్యవివేకీ విశేషతః ।
బలిర్యేన పురా బద్ధశ్ఛలమాశ్రిత్య పాపతః ॥18॥

ఇద్దరిలోనూ విష్ణుమూర్తి మరింత మోసగాడు. ఎన్నెన్ని దోషాలు చేశాడో! ఎంతటి అవివేకియో! పాపమార్గంలో మోసగించి, అలనాడు బలిచక్రవర్తిని తొక్కేసి పాతాళంలో బంధించాడు.

తేనైవ యత్నతః పూర్వమసురౌ మధుకైటభౌ ।
శిరోహీనౌ కృతౌ ధూర్త్యాద్వేదమార్గో వివర్జితః ॥19॥

మోహినీ రూపతోఽనేన పంక్తిభేదః కృతో హి వై ।
దేవాసురసుధాపానే వేదమార్గో విగర్హితః ॥20॥

అంతకు మునుపుకూడా అతడే వేదధర్మవిరుద్ధంగా ధూర్తమార్గంలో ప్రయత్నపూర్వకంగా మధుకైటభులనే అసురుల శిరస్సులు ఖండించాడు. అటుపైని దేవదానవులు అమృతపానసందర్భంలో ఈ విష్ణువే మరోసారి వేదమార్గాన్ని ధిక్కరించాడు. మోహినీరూపం ధరించి బంతిలో బలపక్షం చేశాడు.

రామో భూత్వా హతా నారీ వాలీ విధ్వంసితో హి సః ।
పునర్వైశ్రవణో విప్రో హతో నీతిర్హతా శ్రుతేః ॥21॥

పాపం వినా స్వకీయా స్త్రీ త్యక్తా పాపరతేన యత్ ।
తత్రాపి శ్రుతిమార్గశ్చ ధ్వంసితః స్వార్థహేతవే ॥22॥

ఆపైని త్రేతాయుగంలో రాముడుగా అవతరించి స్త్రీహత్య (తాటక) చేశాడు. వాలిని చెట్టుచాటునుంచి వధించాడు. బ్రాహ్మణుడైన వైశ్రవణుణ్ని (రావణుణ్ని) సంహరించాడు. ఇలా వేదనీతిని ధ్వంసం చేశాడు. ఏ పాపం ఎరగని ధర్మపత్నిని విడిచిపెట్టేశాడు. అక్కడా ఈ పాపాత్ముడు చేసినది స్వార్థంకోసమని వేదమార్గ విధ్వంసమే.

స్వజనన్యాశ్శిరశ్ఛిన్నమవతారే రసాఖ్యకే ।
గురుపుత్రాపమానశ్చ కృతోఽనేన దురాత్మనా ॥23॥

ఆరవ అవతారంలో పరశురాముడుగా తన కన్నతల్లి శిరస్సును గండ్రగొడ్డలితో నరికేశాడు. అంతేకాదు గురుపుత్రుణ్ని అవమానించిన దురాత్ముడుకూడా ఇతడే.

విశేషం: పరశురాముడు గురుపుత్రుణ్ని అవమానించిన పురాణగాధ ఏమిటో? గణేశుడి ఒక దంతాన్ని ఈతడు విరిచిన కథ ఒకటి ఉంది. పరశురాముడికి శివుడు గురువే.

కృష్ణో భూత్వాన్యనార్యశ్చ దూషితాః కులధర్మతః ।
శ్రుతిమార్గం పరిత్యజ్య స్వవివాహాః కృతాస్తథా ॥24॥

కృష్ణుడిగా అవతరించి, కులకాంతల శీలాలు చెడగొట్టాడు. కులధర్మదూషితులను చేశాడు. వేదమార్గాన్ని విడిచిపెట్టి వారందరికీ తనతో పెళ్లిళ్లు జరుపుకున్నాడు.

పునశ్చ వేదమార్గో హి నిందితో నవమే భవే ।
స్థాపితం నాస్తికమతం వేదమార్గవిరోధకృత్ ॥25॥

తొమ్మిదవ అవతారంలో (బుద్ధుడు) వేదధర్మాన్నే త్రోసిరాజన్నాడు. వేదమార్గానికి సర్వాత్మనా విరుద్ధంగా నాస్తికమతాన్ని స్థాపించాడు.

ఏవం యేన కృతం పాపం వేదమార్గం విసృజ్య వై ।
స కథం విజయేద్యుద్ధే భవేద్ధర్మవతాం వరః ॥26॥

ఇలా వేదధర్మాన్ని పూర్తిగా విడిచిపెట్టేసి, పాపాలు చేసినవాడు యుద్ధంలో ఎలా జయిస్తాడు? ధర్మాత్ములలో పేరెన్నికగన్నవాడు ఎలా అవుతాడు?

భ్రాతా జ్యేష్ఠశ్చ యస్తస్య శక్రః పాపీ మహాత్మనః ।
తేన పాపాన్యనేకాని కృతాని నిజహేతుతః ॥27॥

ఇంక ఇతడి అన్నగారు ఇంద్రుడు సరేసరి. మహాపాపిగా సర్వసమ్మతుడు. స్వార్థమే హేతువుగా అతడు చేసిన పాపకృత్యాలు ఇన్నీ అన్నీ కావు.

నికృత్తో హి దితేర్గర్భ్భః స్వార్థహేతోర్విశేషతః ।
ధర్షితా గౌతమస్త్రీ వై హతో వృత్రశ్చ విప్రజః ॥28॥

విశ్వరూపద్విజాతేర్వై భాగినేయస్య యద్గురోః ।
నికృత్తాని చ శీర్షాణి తదధ్వా ధ్వంసితః శ్రుతేః ॥29॥

విశేషించి తన ప్రాణాలు కాపాడుకోవడం కోసమని దితిగర్భంలోకి ప్రవేశించి పిండాన్ని ఖండఖండాలు చేసిన భ్రూణహంత ఈ దేవేంద్రుడు. గౌతమ మహర్షి ఇల్లాలు అహల్యను చెరచినవాడు వీడు. బ్రాహ్మణుడైన వృత్రుణ్ని హత్యచేసినవాడు వీడు. బృహస్పతికి మేనల్లుడూ, త్వష్టకొడుకూ, బ్రాహ్మణుడూ అయిన విశ్వరూపుడి మూడు శిరస్సులను ఖండించినవాడు ఇతడు. ఇలా వేదధర్మాన్ని వేదమార్గాన్ని ధ్వంసంచేశాడు.

కృత్వా బహూని పాపాని హరిశ్శక్రః పునః పునః ।
తేజోభిర్విహతావేవ నష్టవీర్యౌ విశేషతః ॥30॥

తయోర్బలేన నో యూయం సంగ్రామే జయమాప్స్యథ ।
కిమర్థం మూఢతాం ప్రాప్య ప్రాణాంస్త్యక్తుమిహాగతాః ॥31॥

ఇలా విష్ణువు, ఇంద్రుడు ఎన్నెన్నో పాపాలు ఎన్నెన్నో సార్లు చేసి తేజోహీనులయ్యారు. విశేషించి బలపరాక్రమరహితులయ్యారు. వీరిబలాన్ని నమ్ముకొని మీరు ఈ యుద్ధంలో జయం పొందలేరు. ఎందుకు ఈ మూఢత్వం? చావడానికి ఇక్కడికి రానేల?

జానంతౌ ధర్మమేతౌ న స్వార్థలంపటమానసౌ ।
ధర్మం వినామరాః కృత్యం నిష్ఫలం సకలం భవేత్ ॥32॥

మహాధృష్టావిమౌ మేఽద్య కృతవంతౌ పురశ్శిశుమ్ ।
అహం బాలం వధిష్యామి తయోస్సోఽపి భవిష్యతి ॥33॥

ఈ ఇంద్రోపేంద్రులిద్దరి మనస్సులూ ఎప్పుడూ స్వార్థలంపటాలే. వీరు ధర్మస్వరూపం ఎరగరు. దేవతలారా! ధర్మాన్ని తప్పిన ఏ పనియైనా అది పూర్తిగా నిష్ఫలమే అవుతుంది. పైకి కనిపించని అధర్మపరాయణులు ఈ శక్రుడు, ఈ విష్ణుడు. ఈపూట ఈ బాలుణ్ని తమ ముందు నిలుపుకున్నారు. కనక నేను ఈ బాలుణ్ని వధిస్తాను. వారితోపాటే ఇతడూను.

కిం బాల ఇతో యాయాద్దూరం ప్రాణపరీప్సయా ।
ఇత్యుక్త్వోద్దిశ్య చ హరీ వీరభద్రమువాచ సః ॥34॥

ప్రాణాలు నిలుపుకునే కోరికతో ఈ బాలుడు ఇక్కడి నుంచి దూరం వైదొలగుతాడా? హరినీ, శ్రీహరినీ ఉద్దేశించి ఇలా పలికి తారకాసురుడు వీరభద్రుడివైపు తిరిగాడు.

పురా హతాస్త్వయా విప్రా దక్షయజ్ఞే హ్యనేకశః ।
తత్కర్మణః ఫలం చాద్య దర్శయిష్యామి తేఽనఘ ॥35॥

వీరభద్రా! ఒకప్పుడు దక్షయజ్ఞంలో చాలామంది విప్రుల్ని నువ్వు సంహరించావు. పరమపవిత్రుడా! ఆ మహాపాపానికి తగిన ఫలం నీకిప్పుడు అందిస్తాను.

బ్రహ్మోవాచ - బ్రహ్మ అన్నాడు.

ఇత్యేవముక్త్వా తు విధూయ పుణ్యం నిజం స తన్నిందనకర్మణా వై ।
జగ్రాహ శక్తిం పరమాద్భుతాం చ స తారకో యుద్ధవతాం వరిష్ఠః ॥36॥

నారదమహర్షీ! ఇలా ఇంద్రోపేంద్రవీరభద్రుల్ని నిందించి, తారకుడు తనకున్న కాస్త పుణ్యాన్ని దులిపేసుకున్నాడు. అటుపైని ఆ రణరంగమహావీరుడు అత్యద్భుతమైన తన శక్తి ఆయుధాన్ని చేతబట్టాడు.

తం బాలాంతికమాయాంతం తారకాసురమోజసా ।
ఆజఘాన చ వజ్రేణ శక్రో గుహపురస్సరః ॥37॥

తేన వజ్రప్రహారేణ తారకో జర్జరీకృతః ।
భూమౌ పపాత సహసా నిందాహతబలః క్షణమ్ ॥38॥

శక్తిధరుడై తారకుడు ప్రతాపంతో ప్రజ్వరిల్లుతూ, కుమారుడివైపు దూసుకువస్తున్నాడు. ఆ గుహుణ్ని అగ్రభాగాన నిలుపుకున్న ఇంద్రుడు తక్షణం తన వజ్రాయుధాన్ని విసిరాడు. అప్పటికీ పరనిందతో బలం క్షీణించిన తారకుడు దానిదెబ్బకు శరీరమంతా కదిలిపోయి గభాలున కుప్పకూలాడు. అంతా చేసి క్షణకాలం

పతితోఽపి సముత్థాయ శక్త్యా తం ప్రాహరద్రుషా ।
పురందరం గజస్థం హి పాతయామాస భూతలే ॥39॥

హాహాకారో మహానాసీత్ పతితే చ పురందరే ।
సేనాయాం నిర్జరాణాం హి తద్దృష్ట్వా క్లేశ ఆవిశత్ ॥40॥

పడినంత వేగంగానూ లేచి నిలబడ్డాడు. చేతిలోని శక్తి ఆయుధాన్ని ఇంద్రుడి మీదకు విసిరాడు. దాని దెబ్బకు ఆ శక్రుడు ఐరావతం నుంచి రాలిపడ్డాడు. అదిచూసి దేవతాసైన్యంలో హాహాకారాలు మిన్నుముట్టాయి. అందరినీ దిగులు ఆవహించింది.

తారకేణాపి తత్రైవ యత్ కృతం కర్మ దుఃఖదమ్ ।
స్వనాశకరణం ధర్మవిరుద్ధం తన్నిబోధ మే ॥41॥

పతితం చ పదాక్రమ్య హస్తాద్వజ్రం ప్రగృహ్య వై ।
పునరుద్వజ్రఘాతేన శక్రమాతాడయద్భృశమ్ ॥42॥

నారదా! అప్పుడు తారకుడు చేసిన ఒక దుష్కృత్యం చెబుతాను విను. ధర్మవిరుద్ధమూ, ఆత్మ వినాశకమూ, దుఃఖదాయకమూ అయిన అకృత్యం అది. ఏమిటంటే ఐరావతం నుంచి స్పృహ తప్పి పడిపోయిన ఇంద్రుడి మీదకి లంఘించాడు తారకుడు. అతణ్ని కాళ్ళతో తొక్కిపట్టి, అతడి చేతిలోని వజ్రాయుధాన్ని ఊడలాక్కొని, దానితో ఇంద్రుణ్ని మళ్లీ మళ్ళీ కొట్టాడు. దారుణంగా కొట్టాడు.

ఏవం తిరస్కృతం దృష్ట్వా శక్రం విష్ణుః ప్రతాపవాన్ ।
చక్రముద్యమ్య భగవాన్ తారకం స జఘాన హ ॥43॥

ఇంత తీవ్రంగా పరాభూతుడైన ఇంద్రుణ్ని చూసి, ప్రతాపశాలి శ్రీహరి సాక్షాత్తు భగవంతుడు తన సుదర్శనచక్రాన్ని ప్రయోగించాడు. అది వెళ్ళి తారకుడ్ని ఢీకొంది.

చక్రప్రహారాభిహతో నిపపాత క్షితౌ హి సః ।
పునరుత్థాయ దైత్యేంద్రః శక్త్యా విష్ణుం జఘాన తమ్ ॥44॥

తేన శక్తిప్రహారేణ పతితో భువి చాచ్యుతః ।
హాహాకారో మహానాసీత్ చుక్రుశుశ్చాతి నిర్జరాః ॥45॥

సుదర్శనచక్రం తాకిడికి తారకుడు నేలకు ఒరిగాడు. వెంటనే తేరుకుని లేచాడు. శక్తి ఆయుధంతో విష్ణుమూర్తిని తిరిగికొట్టాడు. ఆ దెబ్బకు శ్రీహరి నేలమీద పడ్డాడు. దేవతలు పెద్దపెట్టున హాహాకారలు చేశారు. పెద్దగా విలపించారు.

నిమేషేణ పునర్విష్ణుర్యావదుత్తిష్ఠతే స్వయమ్ ।
తావత్స వీరభద్రో హి తత్క్షణాదాగతోఽసురమ్ ॥46॥

త్రిశూలం చ సముద్యమ్య వీరభద్రః ప్రతాపవాన్ ।
తారకం దితిజాధీశం జఘాన ప్రసభం బలీ ॥47॥

శ్రీమహావిష్ణువు తేరుకుని లేచినిలిచిన నిమిషంలోనే వీరభద్రుడు తానై వచ్చాడు. వచ్చిన క్షణంలోనే తారకాసురుణ్ని ఎదుర్కొన్నాడు. ప్రతాపశాలి వీరభద్రుడు. మహాబలశాలి వీరభద్రుడు. త్రిశూలం పైకెత్తి తారకుణ్ని ఊతంగా ఒక్క పోటు పొడిచాడు.

తత్త్రిశూలప్రహారేణ స పపాత క్షితౌ తదా ।
పతితోఽపి మహాతేజాస్తారకః పునరుత్థితః ॥48॥

కృత్వా క్రోధం మహావీరస్సకలాసురనాయకః ।
జఘాన పరయా శక్త్యా వీరభద్రం తదోరసి ॥49॥

వీరభద్రోఽపి పతితో భూతలే మూర్ఛితః క్షణమ్ ।
తచ్ఛక్త్యా పరయా క్రోధాన్నిహతో వక్షసి ధ్రువమ్ ॥50॥

ఆ త్రిశూలం దెబ్బతో దైత్యనాయకుడు దభీమని నేలమీద పడ్డాడు. వాడు మహాతేజస్వి. పడినవెంటనే మళ్ళీ లేచాడు. మహావీరుడు సకలాసురనేత. క్రోధంతో ఊగిపోయాడు. తిరుగులేని తన శక్తి ఆయుధంతో వీరభద్రుడి వక్షఃస్థలం మీద కొట్టాడు. అంతటి వీరభద్రుడూ మూర్ఛపోయి, కింద పడిపోయాడు.

సగణాశ్చైవ దేవాస్తే గంధర్వోరగరాక్షసాః ।
హాహాకారేణ మహతా చుక్రుశుశ్చ ముహుర్ముహుః ॥51॥

ప్రమథగణాలతో సహా సకలదేవతలు శోకించారు. గంధర్వులూ, ఉరగులూ, రాక్షసులూ దుఃఖించారు. హాహాకారాలు మళ్ళీ మళ్ళీ ఎగసిపడ్డాయి.

నిమేషమాత్రాత్సహసా మహౌజాః సవీరభద్రో ద్విషతాం నిహంతా ।
త్రిశూలముద్యమ్య తడిత్ప్రకాశం జాజ్వల్యమానం ప్రభయా విరేజే ॥52॥

వీరభద్రుడు వెంటనే నిమిషంలో తేరుకున్నాడు. గొప్ప ఓజస్వంతుడు, మహాశత్రుసంహారకుడు, వీరభద్రస్వామి క్రొక్కారు మెరుపులాంటి తన త్రిశూలాన్ని ధగద్ధగలాడిపోతున్న త్రిశూలాన్ని చేతబట్టి నిలబడ్డాడు. అంతులేని కాంతితో మెరిసిపోతూ.

స్వరోచిషా భాసితదిగ్వితానం సూర్యేందుబింబాగ్ని సమానమండలమ్ ।
మహాప్రభం వీరభయావహం పరం కాలాఖ్యమప్యంతకరం మహౌజ్జ్వలమ్ ॥53॥

వీరభద్రుడి తేజస్సుతో దశదిశలూ కాంతి మంతాలయ్యాయి. అతడొక సూర్యబింబంలా, చంద్రమండలంలా, అగ్నిగోళంలా ప్రకాశిస్తున్నాడు. మహాప్రభలతో అరివీరభయంకరంగా ఉన్నాడు. మహౌజ్జ్వలంగా కాలయముడికే యముడిలా ఉన్నాడు.

యావత్త్రిశూలేన తదా హంతుకామో మహాబలః ।
వీరభద్రోఽసురం యావత్ కుమారేణ నివారితః ॥54॥

నారదా! ఆ మహాబలుడు వీరభద్రుడు తన త్రిశూలంతో తారకాసురుణ్ణి ఇక సంహరిస్తున్నాడనగా కుమారస్వామి మళ్ళీ వారించాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే తారకవాక్యశక్రవిష్ణు వీరభద్రయుద్ధవర్ణనం నామ నవమోఽధ్యాయః ॥9॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు తారకవాక్యశక్రవిష్ణు వీరభద్రయుద్ధవర్ణనం అనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

దశమోఽధ్యాయః – పదవ అధ్యాయం

తారకాసురవధ దేవోత్సవ వర్ణనమ్ – తారకాసురవధ దేవోత్సవ వర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

నివార్య వీరభద్రం తం కుమారః పరవీరహా ।
సమైచ్ఛత్తారకవధం స్మృత్వా శివపదాంబుజౌ ॥1॥

జగర్జాథ మహాతేజాః కార్తికేయో మహాబలః ।
సన్నద్ధః సోఽభవత్క్రుద్ధస్సైన్యేన మహతా వృతః ॥2॥

నారదమునీ! శత్రుసంహారకుడు కుమారస్వామి ఆ వీరభద్రుణ్ని అలా వారించి, తన మనస్సులో పరమేశ్వరుడి పాదపద్మాలను ఒక్కసారి ధ్యానించాడు. తారకుణ్ని వధించడానికి నిశ్చయించుకున్నాడు. మహాబలశాలి ఆ మహాతేజస్వి కార్తికేయుడు పెద్దపెట్టున గర్జించాడు, క్రుద్ధుడయ్యాడు. మహాసైన్యంతో సన్నద్ధుడయ్యాడు.

తదా జయజయేత్యుక్తం సర్వైర్దేవైర్గణైస్తథా ।
సంస్తుతో వాగ్భిరిష్టాభిస్తదైవ చ సురర్షిభిః ॥3॥

ఆ సమయంలో సకలదేవసైన్యాలు, సర్వప్రమథగణాలు ఏకకంఠంగా జయజయధ్వనులు చేశాయి. దేవర్షులు ప్రియవాక్కులతో స్తుతించారు.

తారకస్య కుమారస్య సంగ్రామోఽతీవ దుస్సహః ।
జాతస్తదా మహాఘోరస్సర్వభూతభయంకరః ॥4॥

శక్తిహస్తౌ చ తౌ వీరౌ యుయుధాతే పరస్పరమ్ ।
సర్వేషాం పశ్యతాం తత్ర మహాశ్చర్యవతాం మునే ॥5॥

అప్పుడు తారకుడికీ, కుమారస్వామికీ తీవ్రసంగ్రామం జరిగింది. దుస్సహంగా మహాఘోరంగా సకల ప్రాణికోటికీ భయంకరంగా అది సాగింది. ఇద్దరూ మహావీరులే. ఇద్దరూ శక్తి ఆయుధధారులే. పరస్పరం ఢీకొన్నారు. నారదా! ఆ యుద్ధం చూపరులను ఆశ్చర్యంలో ముంచివేసింది.

శక్తినిర్భిన్నదేహౌ తౌ మహాసాధనసంయుతౌ ।
పరస్పరం వంచయంతౌ సింహావివ మహాబలౌ ॥6॥

వైతాళికం సమాశ్రిత్య తథా ఖేచరకం మతమ్ ।
ప్రాప్తికం చ సమాశ్రిత్య శక్త్యా శక్తిం విజఘ్నతుః ॥7॥

ఆ మహావీరులిద్దరూ సాధనసంపత్తి పుష్కలంగా ఉన్నవారే. శక్తిఘాతాలతో ఇద్దరి శరీరాలూ నెత్తురోడుతున్నాయి. ఇద్దరూ సమానబలశాలులే. ఒకరి నుంచి ఒకరు లాఘవంగా తప్పించుకుంటూ, పరస్పరం

సింహాల్లాగా పోరాడారు. వైతాళికం, ఖేచరకం, ప్రాప్తికం మొదలైన యుద్ధతంత్రాలనూ, పద్ధతులనూ ఆశ్రయించి ఒకరి శక్తిని మరొకరి శక్తితో మోదుకున్నారు.

ఏభిర్మంత్రైర్మహావీరౌ చక్రతుర్యుద్ధమద్భుతమ్ ।
అన్యోన్యం సాధకౌ భూత్వా మహాబలపరాక్రమౌ ॥8॥

మహాబలం ప్రకుర్వంతౌ పరస్పరవధైషిణౌ ।
జఘ్నతుశ్శక్తిధారాభీ రణే రణవిశారదౌ ॥9॥

అవే వైతాళికాది యుద్ధతంత్రాలతో, మంత్రాలతో ఇద్దరూ సాధకులయ్యారు. ఇద్దరూ మహావీరులు. ఇద్దరూ మహాబలపరాక్రములు. ఇద్దరూ అత్యద్భుతంగా యుద్ధం సాగించారు. గుహుణ్ని చంపాలని తారకుడూ, తారకుణ్ని చంపాలని గుహుడూ మొత్తం బలాన్నంతటినీ ఉపయోగిస్తున్నారు. ఇద్దరూ రణకోవిదులే. శక్తి ఆయుధాల పదునైన అంచులతో ఒకరినొకరు మోదుకొంటున్నారు.

మూర్ధ్ని కంఠే తథాచోర్వోః జానోశ్చైవ కటీతటే ।
వక్షస్యురసి పృష్ఠే చ చిచ్ఛిదుశ్చ పరస్పరమ్ ॥10॥

తదా తౌ యుధ్యమానౌ చ హంతుకామౌ మహాబలౌ ।
వల్గంతౌ వీరశబ్దైశ్చ నానాయుద్ధవిశారదౌ ॥11॥

నెత్తిమీద, మెడమీద, తొడలమీద, ముంగాళ్ళమీద, తొడల పైభాగాన, గుండెల మీద, గుండెల పైభాగాన,వీపు మీద, ఇలా మొత్తం శరీరాలను ఒకరిది ఒకరు ఆయుధాలతో చీల్చేశారు. ఇద్దరూ తీవ్రంగా పోరాడారు. ఇద్దరూ మహాబలశాలులు. రకరకాల యుద్ధాలలో విశారదులు. వీరోచితమైన అరుపుల్తో గెంతుతూ యుద్ధం చేశారు.

అభవన్ ప్రేక్షకాస్సర్వే దేవా గంధర్వకిన్నరాః ।
ఊచుః పరస్పరం తత్ర కో ఽస్మిన్ యుద్ధే విజేష్యతే ॥12॥

తదా నభోగతా వాణీ జగౌ దేవాంశ్చ సాంత్వయన్ ।
అసురం తారకం చాత్ర కుమారోఽయం హనిష్యతి ॥13॥

మా శోచ్యతాం సురైః సర్వైస్సుఖేన స్థీయతామితి ।
యుష్మదర్థం శంకరో హి పుత్రరూపేణ సంస్థితః ॥14॥

నారదా! తక్కిన దేవతలూ, గంధర్వులూ, కిన్నరులూ అందరూ ప్రేక్షకులై నిలబడ్డారు. ఈ యుద్ధంలో ఎవరు గెలుస్తారు? ఎవరు గెలుస్తారు? అని తమలో తాము చర్చించుకున్నారు. అంతలో ఆకాశవాణి ఒకటి వినిపించింది. ఈ తారకాసురుణ్ని ఈ కుమారుడు ఇక్కడ సంహరిస్తాడు. దేవతలారా! దిగులు చెందకండి. సుఖంగా ఉండండి. శంకరుడే మీ కోసమని ఇలా పుత్రరూపంలో నిలిచాడు. ఈ మాటలు దేవతలకూ, ప్రమథగణాలకూ ఊరట కలిగించాయి.

శ్రుత్వా తదా తాం గగనే సమీరితాం వాచం శుభాం సప్రమథైస్సమావృతః ।
నిహంతుకామః సుఖితః కుమారకో దైత్యాధిపం తారకమాశ్వభూత్తదా ॥15॥

ప్రమథగణాలతో పరివేష్టితుడై నిలిచిన కుమారస్వామి ఆకాశం నుంచి వినిపించిన ఈ శుభవాక్కును ఆలకించాడు. చాలా సంబరపడ్డాడు. వెనువెంటనే (ఆశు) దైత్యాధిపతిని తారకుణ్ని చంపడానికి ఉద్యుక్తుడయ్యాడు.

శక్త్యా తయా మహాబాహూరాజఘాన స్తనాంతరే ।
కుమారః స్మ రుషావిష్టస్తారకాసుర మోజసా ॥16॥

తం ప్రహారమనాదృత్య తారకో దైత్యపుంగవః ।
కుమారం చాపి సంక్రుద్ధః స్వశక్త్యా సంజఘాన సః ॥17॥

తన శక్తి ఆయుధంతో ఆ మహాబాహువు తారకుడి గుండెల మీద మహారోషంతో మహాతీవ్రంగా కొట్టాడు. దైత్యపుంగవుడు తారకుడు ఆ దెబ్బను లెక్కపెట్టలేదు. తానూ సంక్రుద్ధుడై తిరిగి తన శక్తితో కుమారుణ్ని అలాగే కొట్టాడు.

తేన శక్తిప్రహారేణ శాంకరిర్మూర్ఛితోఽ భవత్ ।
ముహూర్తాచ్చేతనాం ప్రాప స్తూయమానో మహర్షిభిః ॥18॥

యథా సింహో మదోన్మత్తో హంతుకామస్తదాసురమ్ ।
కుమారస్తారకం శక్త్యా స జఘాన ప్రతాపవాన్ ॥19॥

తారకుడి ఆ దెబ్బకి శాంకరి స్పృహ కోల్పోయాడు. కానీ వెంటనే తేరుకున్నాడు. మహర్షులు పెద్దగా స్తుతించారు. ఉత్సాహం రెట్టించింది. మదమత్తమహాసింహంలా తారకుణ్ని సంహరించడానికి కృతనిశ్చయుడయ్యాడు. మహాప్రతాపశాలి కుమారస్వామి మళ్ళీ తన శక్తి ఆయుధంతో అసురుణ్ని మరింత బలంగా కొట్టాడు.

ఏవం పరస్పరం తౌ హి కుమారశ్చాపి తారకః ।
యుయుధాతేఽ తి సంరబ్ధౌ శక్తియుద్ధవిశారదౌ ॥20॥

అభ్యాసపరమావాస్తా మన్యోన్యం విజిగీషయా ।
పదాతినౌ యుధ్యమానౌ చిత్రరూపౌ తరస్వినౌ ॥21॥

వివిధైర్హతపుంజైస్తావన్యోన్యం వినిజఘ్నతుః ।
నానామార్గాన్ ప్రకుర్వంతౌ గర్జంతౌ సుపరాక్రమౌ ॥22॥

ఈ ప్రకారంగా వారు పోరాడారు. ఇద్దరూ అతిసంరబ్ధులు. శక్తియుద్ధంలో ఇద్దరూ కోవిదులు. పరస్పరజయకాంక్షతో అభ్యాసం సాగిస్తున్నట్టు యుద్ధం చేశారు. నేలమీదనే నిలిచి, చిత్రవిచిత్రరూపాలతో అతివేగులై రకరకాల దెబ్బలతో ఒకరినొకరు కొట్టుకుంటూ అనేకమార్గాలలో పోరాటం సాగించారు. వీరగర్జనలతో పోరాటం సాగించారు.

అవలోకనపరాస్సర్వే దేవగంధర్వకిన్నరాః ।
విస్మయం పరమం జగ్ముర్నోచుః కించన తత్ర తే ॥23॥

న ववౌ పవమానశ్చ నిష్ప్రభోఽభూద్దివాకరః ।
చచాల వసుధా సర్వా సశైలవనకాననా ॥24॥

దేవగంధర్వకిన్నరాదులందరూ కేవలం కళ్ళప్పగించి చూస్తూ నిలబడ్డారు. ఆశ్చర్యచకితులై నిలబడ్డారు. నోరు మెదపకుండా నిలబడ్డారు. గాలి స్తంభించింది. సూర్యుడు కాంతిహీనుడయ్యాడు. పర్వతాలూ నదులూ ఆరణ్యాలతో సహా మొత్తం భూమి కంపించింది.

ఏతస్మిన్నంతరే తత్ర హిమాలయముఖా ధరాః ।
స్నేహార్దితాస్తదా జగ్ముః కుమారం చ పరీప్సవః ॥25॥

తతస్స దృష్ట్వా తాన్ సర్వాన్ భయభీతాంశ్చ శాంకరిః ।
పర్వతాన్ గిరిజాపుత్రో బభాషే పరిబోధయన్ ॥26॥

ఇంతలో హిమవంతుడూ మొదలైన పర్వతాధిదేవతలు అక్కడికి వచ్చారు. కుమారుడిపట్ల వాత్సల్యంతో తామై కోరివచ్చారు. శాంకరి వారిని చూశాడు. వారిలోని భయభీతిని గమనించాడు. వారికి ధైర్యం ప్రబోధిస్తూ ఇలా పలికాడు.

కుమార ఉవాచ – కుమారుడు అన్నాడు.

మా ఖిద్యతాం మహాభాగా మా చింతాం కుర్వతాం నగాః ।
ఘాతయామ్యద్య పాపిష్ఠం సర్వేషాం వః ప్రపశ్యతామ్ ॥27॥

మహాభాగులారా! పర్వతాధిదేవతలారా! బాధపడకండి. దిగులు చెందకండి. ఇదిగో ఇప్పుడే మీ అందరి కళ్ళయెదుటే ఈ పాపిష్ఠిని సంహరిస్తాను.

ఏవం సమాశ్వాస్య తదా పర్వతాన్ నిర్జరాన్ గణాన్ ।
ప్రణమ్య గిరిజాం శంభుమాదదే శక్తిముత్తమామ్ ॥28॥

తం తారకం హంతుమనాః కరశక్తిర్మహాప్రభుః ।
విరరాజ మహావీరః కుమారశ్శంభుబాలకః ॥29॥

శక్త్యా తయా జఘానాథ కుమారస్తారకాసురమ్ ।
తేజసాధ్యశ్శంకరస్య లోకక్లేశకరం చ తమ్ ॥30॥

పర్వతాధిదేవతలనూ, దేవతలనూ, ప్రమథగణాలనూ ఇలా ఊరడించి, మనస్సులో పార్వతీమాతకు నమస్కరించి, శంభునికి మ్రొక్కి, ధగద్ధగలాడుతున్న శక్తి ఆయుధాన్ని పైకెత్తాడు. తారకుణ్ణి సంహరించబోతున్న ఆ శక్తిధారి, ఆ మహాప్రభువు, ఆ శంభుతనయుడు, ఆ మహావీరుడు మహోజ్జ్వలంగా ప్రకాశించాడు. శంకరుడి తేజస్సుతో కలిసి మరింత శక్తిమంతుడయ్యాడు. లోకాలను పీడిస్తున్న తారకాసురుణ్ణి తన ఆయుధంతో చావమోదాడు.

పపాత సద్యస్సహసా విశీర్ణాంగోఽసురః క్షితౌ ।
తారకాఖ్యో మహావీరస్సర్వాసురగణాధిపః ॥31॥

కుమారేణ హతస్సోఽతివీరస్స ఖలు తారకః ।
లయం యయౌ చ తత్రైవ సర్వేషాం పశ్యతాం మునే ॥32॥

ఆ దెబ్బతో తారకుడి శరీరం శిథిలమైపోయింది. ఉన్నవాడున్నట్టు నేలమీద పడిపోయారు. సర్వరాక్షస మహానాయకుడు మహావీరుడు తారకాఖ్యుడు కుమారస్వామి చేతిలో నిహతుడయ్యాడు. నారదా! మహర్షీ! అందరూ చూస్తూ ఉండగా అతడు అలా నాశం చెందాడు.

తథా తం పతితం దృష్ట్వా తారకం బలవత్తరమ్ ।
న జఘాన పునర్వీరః స గత్వా వ్యసుమాహవే ॥33॥

హతే తస్మిన్ మహాదైత్యే తారకాఖ్యే మహాబలే ।
క్షయం ప్రణీతా బహవోఽసురా దేవగణైస్తదా ॥34॥

మహాబలశాలి తారకుడు అసువులు బాసి అలా నేలకు ఒరిగాడు. కుమారస్వామి చూశాడు. తానూ మహావీరుడు. కనుక మళ్ళీ ఇంక అతడిని కొట్టలేదు. కానీ మహాబలుడూ, మహాదైత్యుడూ అయిన తారకాఖ్యుడు చనిపోగానే మిగిలిన దైత్యసైనికుల్ని దేవతలూ, ప్రమథులూ కలిసి అసంఖ్యాకంగా సంహరించారు.

కేచిద్భీతాః ప్రాంజలయో బభూవుస్తత్ర చాహవే ।
ఛిన్నభిన్నాంగకాః కేచిన్మృతా దైత్యాస్సహస్రశః ॥35॥

కేచిజ్జాతాః కుమారస్య శరణం శరణార్థినః ।
వదంతః పాహి పాహీతి దైత్యాస్సాంజలయస్తదా ॥36॥

కొందరు దైత్యవీరులు భయభ్రాంతులై రణరంగంలోనే నమస్కారాలు పెట్టేశారు. కొందరు శరీరాలు తెగి వేలసంఖ్యలో మరణించారు. కొందరు శరణు శరణు – పాహి పాహి అంటూ శరణార్థులై నమస్కారాలతో కుమార స్వామిని శరణుజొచ్చారు.

కియంతశ్చ హతాస్తత్ర కియంతశ్చ పలాయితాః ।
పలాయమానా వ్యథితాస్తాడితా నిర్జరైర్గణైః ॥37॥

సహస్రశః ప్రవిష్టాస్తే పాతాలే చ జిజీషవః ।
పలాయమానాస్తే సర్వే భగ్నాశా దైన్యమాగతాః ॥38॥

ఎంతోమంది చనిపోయారు. ఎంతోమంది పారిపోయారు. పారిపోతున్న వారిని దేవతలూ ప్రమథులూ కొట్టారు, తన్నారు. బతకాలి అనే కోరికతో వేలమంది దైత్యులు పాతాళలోకానికి పారిపోయారు. మొత్తానికి దైత్యులందరి ఆశలూ అడుగంటాయి. అందరినీ ఒక దైన్యం ఆవరించింది.

ఏవం సర్వం దైత్యసైన్యం భ్రష్టం జాతం మునీశ్వర ।
న కేచిత్తత్ర సంతస్థుర్గణదేవభయాత్తదా ॥39॥

ఆసీన్నిష్కంటకం సర్వం హతే తస్మిన్ దురాత్మని ।
తే దేవాస్సుఖమాపన్నాస్సర్వే శక్రాదయస్తదా ॥40॥

నారదమునీశ్వరా! ఈ ప్రకారంగా దైత్యసైన్యం మొత్తం భ్రష్టమైపోయింది. దేవగణాలకూ, ప్రమథగణాలకూ భయపడి, ఒక్కడంటే ఒక్కడుకూడా రణరంగంలో నిలవలేదు. ఆ దుర్మార్గుడు తారకుడు నిహతుడు కాగా సకలలోకమూ నిష్కంటకమయ్యింది. ఇంద్రాదిదేవతలు హాయిగా ఊపిరిపీల్చుకున్నారు.

ఏవం విజయమాపన్నం కుమారం నిఖిలాస్సురాః ।
బభూవుర్యుగపద్ధృష్టాస్త్రిలోకాశ్చ మహాసుఖాః ॥41॥

ఇలా విజయసంపన్నుడైన కుమారస్వామిని చూసి, నిఖిలదేవతలూ ఆనందించారు. ముల్లోకాలూ ఒక్కసారిగా మహాసుఖానుభూతిని పొందాయి.

తదా శివోఽపి తం జ్ఞాత్వా విజయం కార్తికస్య చ ।
తత్రాజగామ స ముదా సగణః ప్రియయా సహ ॥42॥

స్వాత్మజం స్వాంకమారోప్య కుమారం సూర్యవర్చసమ్ ।
లాలయామాస సుప్రీత్యా శివా చ స్నేహసంకులా ॥43॥

కార్తికేయుడి ఈ విజయం తెలిసి శివుడు వెంటనే అక్కడికి వచ్చాడు. పార్వతీసమేతుడై, ప్రమథగణపరివృతుడై ఆనందంగా వచ్చాడు. సూర్యతేజస్సుతో వెలిగిపోతున్న తన కుమారుణ్ణి ఒడిలోకి తీసుకొని పార్వతీదేవి ఎంతో ప్రేమతో, వాత్సల్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ లాలించింది.

హిమాలయస్తదాగత్య స్వపుత్రైః పరివారితః ।
సబంధుస్సానుగశ్శంభుం తుష్టావ చ శివాం గుహమ్ ॥44॥

హిమాలయుడు తన పుత్రపరివారసహితుడై విచ్చేశాడు. బంధుమిత్రులను వెంటబెట్టుకొని మరీ విచ్చేశాడు. కూతురినీ, అల్లుణ్ణీ, మనవణ్ణీ ఎంతగానో స్తుతించాడు, మెచ్చుకొన్నాడు.

తతో దేవగణాస్సర్వే మునయస్సిద్ధచారణాః ।
తుష్టువుశ్శాంకరిం శంభుం గిరిజాం తుషితాం భృశమ్ ॥45॥

అంతలోనే సకలదేవగణాలూ, మునులూ, సిద్ధులూ, చారణులూ అందరూ కలిసి శాంకరినీ, శంకరుణ్ణి, సంతోషంతో పరవశిస్తున్న పార్వతీని బహుధా స్తుతించారు.

పుష్పవృష్టిం సుమహతీం చక్రుశ్చోపసురాస్తదా ।
జగుర్గంధర్వపతయో ననృతుశ్చాప్సరోగణాః ॥46॥

వాదిత్రాణి తదా నేదుస్తదానీం చ విశేషతః ।
జయశబ్దో నమః శబ్దో బభూవోచ్చైర్ముహుర్ముహుః ॥47॥

అప్పుడు ఉపదేవతలు పూలవాన కురిపించారు. గంధర్వపతులు బృందగానాలు వినిపించారు. అప్సరసలు నృత్యాలు చేశారు. రకరకాల మంగళవాద్యాలు విశేషంగా వినిపించాయి. జయజయధ్వానాలతో పాటు 'నమో నమః' అనే పదబంధాలూ ఉవ్వెత్తున నిరంతరంగా లేచాయి.

తతో మయాచ్యుతశ్చాపి సంతుష్టోఽభూద్విశేషతః ।
శివం శివాం కుమారం చ సంతుష్టావ సమాదరాత్ ॥48॥

కుమారమగ్రతః కృత్వా హరిసేంద్రముఖాస్సురాః ।
చక్రుర్నీరాజనం ప్రీత్యా మునయశ్చాపరే తథా ॥49॥

నేనూ, నాతోపాటు శ్రీహరీ విశేషంగా సంతుష్టులమయ్యాం. శివుణ్ని, శివాదేవినీ, కుమారుణ్ని సాదరంగా స్తుతించాం. విష్ణువు, ఇంద్రుడూ ఇంకా తక్కిన దేవతలూ, మునులూ గుహుణ్ని తమ ఎట్టయెదుట నిలిపి ఎంతో ప్రేమతో నీరాజనం ఇచ్చారు.

గీతవాదిత్రఘోషేణ బ్రహ్మఘోషేణ భూయసా ।
తదోత్సవో మహానాసీత్ కీర్తనం చ విశేషతః ॥50॥

గీతవాద్యై ర్వస్సుప్రసన్నైస్తథా సాంజలిభిర్మునే ।
స్తూయమనో జగన్నాథస్సర్వైర్దేవైర్గణైరభూత్ ॥51॥

తతస్స భగవాన్ రుద్రో భవాన్యా జగదంబయా ।
సర్వైః స్తుతో జగామాథ స్వగిరిం స్వగణైర్వృతః ॥52॥

గీతవాద్యధ్వనులతో, వేదఘోషలతో, విశేషకీర్తనలతో అప్పుడక్కడ అదొక మహోత్సవం అయ్యింది. వీనుల విందుగా వినపడుతున్న గీతాలు, నమస్కరిస్తూ స్తుతిస్తున్న మునీశ్వరులు, సకల దేవతలతో ప్రమథగణాలతో– జగన్నాథుడు సంస్తుతులు అందుకున్నాడు. సంతుష్టుడయ్యాడు. అటుపైని భగవంతుడు ఆ రుద్రుడు జగన్మాత పార్వతితోను, తన ప్రమథగణాలతోను కలిసి తన పర్వతనివాసానికి బయలుదేరివెళ్ళాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే తారకాసురవధదేవోత్సవ వర్ణనం నామ దశమోఽధ్యాయః ॥10॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు తారకాసురవధదేవోత్సవ వర్ణనం అనే పదవ అధ్యాయం సమాప్తం.

ఏకాదశోఽధ్యాయః – పదకొండవ అధ్యాయం

బాణప్రలంబవధ కుమారవిజయవర్ణనమ్ – బాణప్రలంబవధ కుమారవిజయవర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఏతస్మిన్నంతరే తత్ర క్రౌంచనామాచలో మునే ।
ఆజగామ కుమారస్య శరణం బాణపీడితః ॥1॥

పలాయమానో యో యుద్ధాదసోఢా తేజ ఐశ్వరమ్ ।
తుతోదాతీవ స క్రౌంచం కోట్యాయుతబలాన్వితః ॥2॥

ప్రణిపత్య కుమారస్య స భక్త్యా చరణాంబుజమ్ ।
ప్రేమనిర్భరయా వాచా తుష్టావ గుహమాదరాత్ ॥3॥

నారదా! అంతలో క్రౌంచమనే పర్వతం అక్కడికి వచ్చింది. బాణాసురుడు అతణ్ని దారుణంగా హింసించాడు. దానితో ఆ గిరివర్యుడు కుమారస్వామిని శరణుకోరి వచ్చాడు. ఈశ్వరతేజస్సును తట్టుకోలేక రణరంగం నుంచి పారిపోతూ బాణాసురుడు తన అసంఖ్యాకసైన్యంతో మార్గమధ్యంలో క్రౌంచగిరిని పీడించాడు. దానితో ఆ గిరివర్యుడు వచ్చి భక్తితత్పరుడై కుమారస్వామి పాదపద్మాల మీద సాష్టాంగపడ్డాడు. భక్తి నిండిన వాక్కులతో కుమారుణ్ని స్తుతించాడు. (కోట్యయుత–కోట్యాయుత–దీర్ఘం ఆర్షప్రయోగం).

క్రౌంచ ఉవాచ – క్రౌంచుడు అన్నాడు.

కుమార స్కంద దేవేశ తారకాసురనాశక ।
పాహి మాం శరణాపన్నం బాణాసురనిపీడితమ్ ॥4॥

సంగరాత్తే మహాసేన సముచ్ఛిన్నః పలాయితః ।
న్యపీడయచ్చ మాఽఽగత్య హా నాథ! కరుణాకర ॥5॥

తత్పీడితస్తే శరణమాగతోఽహం సుదుఃఖితః ।
పలాయమానో దేవేశ శరజన్మన్ దయాం కురు ॥6॥

కుమారా! దేవేశా! స్కందా! తారకాసురనాశకా! బాణాసురుడు పీడించగా వచ్చి నిన్ను శరణుజొచ్చాను. దయచేసి నన్ను కాపాడు. మహాసేనా! నీకు ఓడి, రణరంగం నుంచి పారిపోతూ, బాణాసురుడు వచ్చి, ఆ కసి నామీద తీర్చుకున్నాడు. నన్ను హింసించాడు. నాథా! కరుణాకరా! ఆ దుఃఖం తాళలేక నిన్నే శరణు వేడుకున్నాను. దేవేశా! శరజన్మా! దయ చూపించు రక్షించు.

దైత్యం తం నాశయ విభో బాణాహ్వం మాం సుఖీకురు ।
దైత్యఘ్నస్త్వం విశేషేణ దేవావనకరః స్వరాట్ ॥7॥

ప్రభూ! బాణాసురుణ్ని సంహరించు. నాకు ఆనందం కలిగించు. నువ్వు దైత్యవినాశకుడవు. విశేషించి దేవసంరక్షకుడవు. స్వరాట్టువు (చక్రవర్తివి).

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతి క్రౌంచస్తుతః స్కందః ప్రసన్నో భక్తపాలకః ।
గృహీత్వా శక్తిమతులాం స్వాం సస్మార శివం ధియా ॥8॥

చిక్షేప తాం సముద్దిశ్య స బాణం శంకరాత్మజః ।
మహాశబ్దో బభూవాథ జజ్వలుశ్చ దిశో నభః ॥9॥

సబలం భస్మసాత్కృత్వా సురం తం క్షణమాత్రతః ।
గుహోపకంఠం శక్తిస్సాజగామ పరమా మునే ॥10॥

ఇలా క్రౌంచుడు స్తుతించేసరికి భక్తరక్షకుడు స్కందుడు ప్రసన్నుడయ్యాడు. తన సాటిలేని శక్తిఆయుధాన్ని మళ్ళీ చేతబట్టాడు. మనస్సులో శివుణ్ని ధ్యానించాడు. ఆ బాణాసురుడు లక్ష్యంగా శంకరాత్మజుడు తన శక్తి ఆయుధాన్ని విసిరాడు. మరు నిమిషంలో ఒక మహాశబ్దం వినిపించింది. దశదిశలూ భగ్గుమన్నాయి. ఆకాశానికి మంటలు లేచాయి. సేనాసమేతంగా బాణాసురుణ్ని బుగ్గిచేసి క్షణంలో తిరిగివచ్చి గుహుడిదగ్గర నిలిచింది ఆ మహాశక్తి ఆయుధం–నారదా!

తతః కుమారః ప్రోవాచ క్రౌంచం గిరివరం ప్రభుః ।
నిర్భయః స్వగృహం గచ్ఛ నష్టః సబలోఽసురః ॥11॥

తచ్ఛ్రుత్వా స్వామివచనం ముదితో గిరిరాట్ తదా ।
స్తుత్వా గుహం శరారాతిం స్వధామ ప్రత్యపద్యత ॥12॥

అప్పుడు మహాప్రభువు కుమారస్వామి ఆ క్రౌంచగిరివర్యుడితో ఇలా అన్నాడు – పర్వతవరా! ఇంక నువ్వు నిర్భయంగా ఇంటికి వెళ్ళు. బాణాసురుడు సేనాసమేతంగా నాశనమయ్యాడు. – ఈ స్వామి వాక్కులు విని క్రౌంచుడు ఆ పర్వతరాజు ఆనందపరవశుడయ్యాడు. గుహుణ్ని బాణ(శర)దైత్యసంహారిని బహుధా స్తుతించి, తన ఇంటికి చేరుకున్నాడు.

తతః స్కందో మహేశస్య ముదా స్థాపితవాన్మునే ।
త్రీణి లింగాని తత్రైవ పాపఘ్నాని విధానతః ॥13॥

ప్రతిజ్ఞేశ్వర నామాదౌ కపాలేశ్వరమాదరాత్ ।
కుమారేశ్వరమేవాథ సర్వసిద్ధిప్రదం త్రయమ్ ॥14॥

నారదమునీ! అటుపైని స్కందుడు ఆ స్థలంలో తన విజయచిహ్నాలుగా మూడు శివలింగాలను సంతోషంతో వేదోక్తవిధానంగా ప్రతిష్ఠించాడు. అవి మూడూ సర్వపాపపరిహారకాలు. వాటిలో ప్రతిజ్ఞేశ్వరలింగం మొదటిది. కపాలేశ్వరలింగం రెండవది. కుమారేశ్వరలింగం మూడవది. మూడూ సర్వసిద్ధి ప్రదాయకాలు.

పునస్సర్వేశ్వరస్తత్ర జయస్తంభసమీపతః ।
స్తంభేశ్వరాభిదం లింగం గుహః స్థాపితవాన్ముదా ॥15॥

అక్కడ నెలకొల్పిన జయస్తంభానికి దగ్గరలో సర్వేశ్వరుడు కుమారస్వామి మరొక శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. దానిపేరు స్తంభేశ్వరలింగం. ఇవి నాలుగూ గుహప్రతిష్ఠలు.

తతస్సర్వే సురాస్తత్ర విష్ణుప్రభృతయో ముదా ।
లింగం స్థాపితవంతస్తే దేవదేవస్య శూలినః ॥16॥

సర్వేషాం శివలింగానాం మహిమాభూత్తదాద్భుతః ।
సర్వకామప్రదశ్చాపి ముక్తిదో భక్తికారిణామ్ ॥17॥

అదే ఆనందసమయంలో విష్ణుప్రభృతులు దేవతలు అందరూ కలిసి మరొక శివలింగాన్ని స్థాపించారు. దేవదేవుడైన త్రిశూలి చిహ్నమిది. అన్ని శివలింగాలలోనూ ఆ క్షణాన ఒకానొక అద్భుతమహిమ ప్రవేశించింది. అది భక్తులకు సర్వాభీష్టప్రదమైన మహిమ, ముక్తిప్రదమైన మహిమ.

తతస్సర్వే సురా విష్ణుప్రముఖాః ప్రీతమానసాః ।
ఐచ్ఛన్ గిరివరం గంతుం పురస్కృత్య గుహం ముదా ॥18॥

తస్మిన్నవసరే శేషపుత్రః కుముదనామకః ।
ఆజగామ కుమారస్య శరణం దైత్యపీడితః ॥19॥

విష్ణుమూర్తితో సహా దేవతలందరి మనస్సులూ ఆనందపరవశాలయ్యాయి. ఇంక గుహుణ్ణి తీసుకొని కైలాసగిరికి బయలుదేరదామనుకుంటున్నారు. అంతలో ఆదిశేషుడి కొడుకు కుముదుడనేవాడు పరుగుపరుగున అక్కడికి వచ్చాడు. దైత్యపీడితుడై వచ్చాడు. కుమారస్వామిని శరణు శరణు అన్నాడు.

ప్రలంబాఖ్యోఽసురో యో హి రణాదస్మాత్పలాయితః ।
స తత్రోపద్రవం చక్రే ప్రబలస్తారకానుగః ॥20॥

సోఽథ శేషస్య తనయః కుముదోఽహి పతేర్మహాన్ ।
కుమారశరణం ప్రాప్తస్తుష్టావ గిరిజాత్మజమ్ ॥21॥

ఈ యుద్ధంనుంచి పారిపోయిన వారిలో బాణాసురుడిలాగానే ప్రలంబాసురుడు మరొకడు. తారకాసురుడి అనుచరుడు. వీడు పాతాళానికి పారిపోతూ దారిలో కనిపించిన కుముదుణ్ణి హింసించాడు. ఈ కుముదుడు మహాత్ముడు. ఆదిశేషుడి తనయుడు. పాపం ప్రలంబుడితో దెబ్బలుతిని కుమారస్వామిని శరణుజొచ్చాడు. గిరిజాపుత్రుణ్ణి భక్తితో స్తుతించాడు.

కుముద ఉవాచ – కుముదుడు అన్నాడు.

దేవదేవ! మహాదేవవరతాత! మహాప్రభో ।
పీడితోఽహం ప్రలంబేన త్వాహం శరణమాగతః ॥22॥

పాహి మాం శరణాపన్నం ప్రలంబాసురపీడితమ్ ।
కుమార స్కంద దేవేశ తారకారే మహాప్రభో ॥23॥

త్వం దీనబంధుః కరుణాసింధురానతవత్సలః ।
ఖలనిగ్రహకర్తా హి శరణ్యశ్చ సతాం గతిః ॥24॥

దేవాధిదేవా! మహాదేవుడి పుత్రరత్నమా! మహాప్రభూ! ప్రలంబాసురుడు హింసిస్తే నీకు శరణాగతుణ్ణి అయ్యాను. నన్ను రక్షించు. కుమారస్వామీ! స్కందదేవా! దేవేశా! తారకాంతకా! నువ్వు దీనులకి ఆత్మబంధువు. కరుణాసింధువు నువ్వే. నమస్కరించినవారిపట్ల నీ వాత్సల్యం అమోఘం. దుర్జనులకు సంహారకుడవు నువ్వు. సజ్జనులకు శరణ్యుడవు నువ్వు. నువ్వే గతి.

కుముదేన స్తుతశ్చేత్థం విజ్ఞప్తస్తద్వధాయ హి ।
స్వాం చ శక్తిం చ జగ్రాహ స్మృత్వా శివపదాంబుజౌ ॥25॥

చిక్షేప తాం సముద్దిశ్య ప్రలంబం గిరిజాసుతః ।
మహాశబ్దో బభూవాథ జజ్వలుశ్చ దిశో నభః ॥26॥

తం సాయుతబలం శక్తిర్హుతం కృత్వా చ భస్మసాత్ ।
గుహోపకంఠం సహసా జగామాక్లిష్టకారిణీ ॥27॥

ఇలా కుముదుడు స్తుతించి, ప్రలంబుణ్ణి సంహరించమని విన్నవించాడు. వెంటనే కుమారస్వామి ప్రసన్నుడై శివుడి పాదపద్మాలను ధ్యానించి, తన శక్తి ఆయుధాన్ని చేపట్టాడు. ప్రలంబుడు లక్ష్యంగా దాన్ని గిరిజాసుతుడు ప్రయోగించాడు. రెప్పపాటుకాలంలో ఒక మహాశబ్దం వినిపించింది. దశదిశలూ భగ్గుమన్నాయి. ఆకాశాన మంటలు వ్యాపించాయి. సులువుగా శత్రువుల్ని సంహరించగల్గిన ఆ శక్తిఆయుధం వేలమంది సైన్యంతో సహా ప్రలంబుణ్ణి చిటికెలో బుగ్గిచేసి, తిరిగి వచ్చి, గుహుడి సన్నిధిలో నిలిచింది.

తతః కుమారః ప్రోవాచ కుముదం నాగబాలకమ్ ।
నిర్భయః స్వగృహం గచ్ఛ నష్టస్స సబలోఽసురః ॥28॥

అప్పుడు కుమారస్వామి ఆ సర్పరాజకుమారుడు కుముదుడితో అన్నాడు గదా – సేనాసమేతంగా ప్రలంబుడు నిహతుడయ్యాడు. నువ్వింక నిర్భయంగా ఇంటికి వెళ్ళు.

తచ్ఛ్రుత్వా గుహవాక్యం స కుముదోఽహిపతేస్సుతః ।
స్తుత్వా కుమారం నత్వా చ పాతాళం ముదితో యయౌ ॥29॥

గుహుడు చెప్పిన మాట విని శేషాహిపుత్రుడు కుముదుడు మరొక్కసారి కుమారస్వామిని స్తుతించి, నతించి, ఆనందంగా తన పాతాళలోకం చేరుకున్నాడు.

ఏవం కుమారవిజయం వర్ణితం తే మునీశ్వర ।
చరితం తారకవధం పరమాశ్చర్యకారకమ్ ॥30॥

సర్వపాపహరం దివ్యం సర్వకామప్రదం నృణామ్ ।
ధన్యం యశస్యమాయుష్యం భుక్తిముక్తిప్రదం సతామ్ ॥31॥

యే కీర్తయంతి యశోఽమితభాగ్యయుతా నరాః ।
కుమారచరితం దివ్యం శివలోకం ప్రయాంతి తే ॥32॥

శ్రోష్యంతి యే చ తత్కీర్తిం భక్త్యా శ్రద్ధాన్వితా జనాః ।
ముక్తిం ప్రాప్స్యంతి తే దివ్యామిహ భుక్త్వా పరం సుఖమ్ ॥33॥

నారదమునీశ్వరా! కుమారస్వామి విజయగాథ ఇది. తారకాసురుడి హాననచరిత్ర ఇది. అత్యంతాశ్చర్యకరం. నీకు వర్ణించి చెప్పాను. ఈ దివ్యగాథ మానవులకు సర్వపాపహరం. సర్వకామప్రదం. సజ్జనులకు ధన్యతను కల్గిస్తుంది. యశస్సునూ, ఆయుష్షునూ పెంపొందిస్తుంది. భుక్తిప్రదమూ, ముక్తిప్రదమూ కూడా. ఈ గాథను కొనియాడే నరులు అమితంగా యశస్సును పొందుతారు. భోగభాగ్యాలను పొందుతారు. కట్టకడపట శివలోకం చేరుకుంటారు. ఈ దివ్యమైన కుమారచరితనూ, స్వామికీర్తినీ భక్తితో శ్రద్ధతో ఆలకించినవారు ఇహంలో ఉత్తమసుఖాలు అనుభవించి, పరంలో దివ్యంగా ముక్తిని పొందుతారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే బాణప్రలంబవధ కుమారవిజయవర్ణనం నామైకాదశోఽధ్యాయః ॥11॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు బాణప్రలంబవధ కుమార విజయవర్ణనం అనే పదకొండవ అధ్యాయం సమాప్తం.

ద్వాదశోఽధ్యాయః – పన్నెండవ అధ్యాయం

స్వామికార్తిక చరితగర్భిత శివా శివచరితవర్ణనమ్–స్వామికార్తికచరిత్రతో కూడిన శివాశివచరిత వర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

నిహతం తారకం దృష్ట్వా దేవా విష్ణుపురోగమాః ।
తుష్టువుశ్శాంకరిం భక్త్యా సర్వేఽన్యే ముదితాననాః ॥1॥

నారదా! తారకాసురుడు అలా చనిపోవడాన్ని కళ్ళారా చూసి శ్రీహరిప్రముఖులు దేవతలందరూ, ఇంకా మహర్షులూ మొదలైనవారూ ఎంతగానో సంతోషించారు. వారందరి ముఖాలూ ఆనందంతో విప్పారాయి. అత్యంతభక్తితో ఆ శంకరసుతుణ్ణి ఇలా స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు స్తుతించారు.

నమః కల్యాణరూపాయ నమస్తే విశ్వమంగళ ।
విశ్వబంధో నమస్తేఽస్తు నమస్తే విశ్వభావన ॥2॥

నమోఽస్తు తే దానవవర్యహంత్రే
బాణాసురప్రాణహరాయ దేవ ।
ప్రలంబనాశాయ పవిత్రరూపిణే
నమో నమశ్శంకరతాత తుభ్యమ్ ॥3॥

కల్యాణరూపా! విశ్వమంగళా! విశ్వబంధూ! విశ్వభావనా! నమోనమః. దానవ మహారాజుని సంహరించిన వాడా! బాణాసురుడి ప్రాణాలు హరించినవాడా! ప్రలంబదైత్యుణ్ణి నాశనం చేసినవాడా! పవిత్రరూపా! శంకరసుతా! నమో నమః.

త్వమేవ కర్తా జగతాం చ భర్తా
త్వమేవ హర్తా శుచిజ ప్రసీద ।
ప్రపంచభూతస్తవ లోకబింబః
ప్రసీద శంభ్వాత్మజ దీనబంధో ॥4॥

ఈ సకలజగత్తుకీ నువ్వే కర్తవు. నువ్వే భర్తవు. నువ్వే సంహర్తవు. అగ్నిపుత్రా! మమ్మల్ని దయజూడు. ఈ ప్రపంచమే నువ్వు. ఈ చరాచరజగత్తు నీ ప్రతిబింబం. (నువ్వు బింబం – ఇది ప్రతిబింబం అని). శంభునందనా! దీనబాంధవా! మమ్ము దయజూడు.

దేవరక్షాకర స్వామిన్ రక్ష నస్సర్వదా ప్రభో ।
దేవప్రాణావనకర ప్రసీద కరుణాకర ॥5॥

దేవతలను రక్షించినవాడా! స్వామీ! ప్రభూ! మమ్మల్ని ఇలాగే సర్వదా కాపాడు. దేవతల ప్రాణాలకు సంరక్షకుడా! దయానిలయుడా! దయజూడు.

హత్వా తం తారకం దైత్యం పరివారయుతం విభో ।
మోచితాస్సకలా దేవా విపద్భ్యః పరమేశ్వర ॥6॥

ఓయి పరమేశ్వరా! ఓయి విభూ! పరివారసహితంగా ఆ తారకాసురుణ్ని సంహరించి, సకలదేవతలనూ ఆపదల నుంచి గట్టెక్కించావు. నీకిదే నమోనమః.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఏవం స్తుతః కుమారోఽసౌ దేవైర్విష్ణుముఖైః ప్రభుః ।
వరాన్ దదావభినవాన్ సర్వేభ్యః క్రమశో మునే ॥7॥

శైలాన్ నిరీక్ష్య స్తువతస్తతస్స గిరిశాత్మజః ।
సుప్రసన్నతరో భూత్వా ప్రోవాచ ప్రదదద్వరాన్ ॥8॥

విష్ణుమూర్తితో సహా సకలదేవతలూ ఇలా స్తుతించేసరికి ఆ ప్రభువు కుమారస్వామి ప్రసన్నుడై ఒక్కొక్కరికీ క్రమంగా కొత్తకొత్త వరాలను ప్రసాదించాడు. నారదా! మునుముందుగా – స్తుతిపరాయణులైన పర్వతాధిదేవతలను చూసి ఆ కైలాసనిలయాత్మజుడు చాలా సుప్రసన్నుడై వరాలు గుప్పించాడు.

స్కంద ఉవాచ – స్కందుడు అన్నాడు.

యూయం సర్వే పర్వతా హి పూజనీయాస్తపస్విభిః ।
కర్మిభిః జ్ఞానిభిశ్చైవ సేవ్యమానా భవిష్యథ ॥9॥

శంభోర్విశిష్టరూపాణి లింగరూపాణి చైవ హి ।
భవిష్యథ న సందేహః పర్వతా వచనాన్మమ ॥10॥

యోఽయం మాతామహో మేఽద్య హిమవాన్ పర్వతోత్తమః ।
తపస్వినాం మహాభాగః ఫలదో హి భవిష్యతి ॥11॥

పర్వత వర్యులారా! మీరంతా మహాతపస్వులకూ, కర్మిష్ఠులకూ, జ్ఞానులకూ పూజనీయులూ, సేవనీయులూ అగుదురుగాక! మీరంతా శివుడి విశిష్టలింగరూపాలే అవుతారు. సందేహం లేదు. ఇది నా మాట. ఇంక మా తాతగారు పర్వతోత్తముడు ఈ హిమవంతుడు నేటి నుంచీ మహాతపస్వులకు తపఃఫలాలను అందించే మహానుభావుడు అవుతాడు.

దేవా ఊచుః – దేవతలు స్తుతించారు.

ఏవం దత్త్వా వరాన్ హత్వా తారకం చాసురాధిపమ్ ।
త్వయా కృతాశ్చ సుఖినో వయం సర్వే చరాచరాః ॥12॥

ఓ శాంకరీ! అసురాధిపతిని తారకుణ్ని సంహరించడమే కాదు. ఇలా మాకందరికీ వరాలు ప్రసాదించి చరాచర సృష్టినంతటినీ ఆనందపరవశం చేశావు.

ఇదానీం ఖలు సుప్రీత్యా కైలాసం గిరిశాలయమ్ ।
జననీజనకౌ ద్రష్టుం శివాశంభూ త్వమర్హసి ॥13॥

ఇలా సుప్రీతుడవైన నువ్వు ఇంక ఇప్పుడేమో కైలాసపర్వతానికి వెళ్ళి, నీ జననీజనకుల్ని పార్వతీపరమేశ్వరుల్ని దర్శించుకోవడం సముచితం కదా!

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వా నిఖిలా దేవా విష్ణ్వాద్యాః ప్రాప్తశాసనాః ।
కృత్వా మహోత్సవం భూరి సకుమారా యయుర్గిరిమ్ ॥14॥

కుమారే గచ్ఛతి విభౌ కైలాసం శంకరాలయమ్ ।
మహామంగళముత్తస్థౌ జయశబ్దో బభూవ హ ॥15॥

ఈ మాటకు గుహుడు అంగీకరించి, బయలుదేరండి అని ఆజ్ఞాపించాడు. అలా అతడి శాసనం అందుకున్న నిఖిలదేవతలూ విష్ణుప్రభృతులూ ఒక మహోత్సవం జరిపి, కుమారస్వామితో కలిసి, కైలాసగిరికి పయనమయ్యారు. అలా కుమారస్వామి ఆ ప్రభువు శంకరుడి నివాసమైన కైలాసాద్రికి బయలుదేరగా శుభశకున పరంపర కనిపించింది. జయజయధ్వనులు మిన్నుముట్టాయి.

ఆరురోహ కుమారోఽసౌ విమానం పరమర్ధిమత్ ।
సర్వతోఽలంకృతం రమ్యం సర్వోపరి విరాజితమ్ ॥16॥

అహం విష్ణుశ్చ సముదౌ తదా చామరధారిణౌ ।
గుహమూర్ధ్ని మహాప్రీత్యా మునేఽభూవ హ్యతంద్రితౌ ॥17॥

అప్పుడు ఆ కుమారస్వామి సకలసంపత్సమృద్ధమై సర్వాంగసుందరంగా అలంకృతమైన దివ్యరమ్యవిమానాన్ని అధిరోహించాడు. అది అందరికన్నా ఎత్తున మీదుగా ఎగురుతూ విరాజిల్లింది. నేనూ, విష్ణుమూర్తీ చామరాలు చేతబట్టాం. నారదా! కడుంగడు జాగరూకులమై గుహుడి శిరోభాగాన ఎంతో ప్రీతితో, ఆనందంతో చామరాల వీవన సాగించాం.

ఇంద్రాద్యా అమరాస్సర్వే కుర్వంతో గుహసేవనమ్ ।
యథోచితం చతుర్దిక్షు జగ్ముశ్చ ప్రముదాస్తదా ॥18॥

శంభోర్జయం ప్రభాషంతః ప్రాపుస్తే శంభుపర్వతమ్ ।
సానందా వివిశుస్తత్రోచ్చరితో మంగళధ్వనిః ॥19॥

మిగతా ఇంద్రాదులైన దేవతలందరూ నాలుగువైపులా నిలబడి ఆనందంగా, యథోచితంగా గుహుణ్ని సేవిస్తూ కైలాసగిరికి పయనమయ్యారు. శివుడి విజయాన్ని ముచ్చటించుకుంటూ మురిసిపోతూ అందరూ శంభుపర్వతం చేరుకున్నారు. అక్కడ మంగళధ్వని మిన్నుముట్టింది.

దృష్ట్వా శివం శివాం చైవ సర్వే విష్ణ్వాదయో ద్రుతమ్ ।
ప్రణమ్య శంకరం భక్త్యా కరౌ బద్ధ్వా వినమ్రకాః ॥20॥

కుమారోఽపి వినీతాత్మా విమానాదవతీర్య చ ।
ప్రణనామ ముదా శంభుం శివాం సింహాసనస్థితామ్ ॥21॥

నారదా! కైలాసగిరిమీద పార్వతీపరమేశ్వరులని దర్శించి, విష్ణ్వాదులందరూ చేతులు జోడించి, వినమ్రులై భక్తితో శంకరుణ్ని నమస్కరించారు. గుహుడు కూడా అలాగే విమానం దిగి, వినమ్రుడై వచ్చి – సింహాసనారూఢులై ఉన్న పార్వతీపరమేశ్వరులకు ఆనందంగా నమస్కరించాడు.

అథ దృష్ట్వా కుమారం తం తనయం ప్రాణవల్లభమ్ ।
తౌ దంపతీ శివౌ దేవౌ ముముదాతేఽతి నారద ॥22॥

అప్పుడు ఆ దంపతులు శివానీ శివులు కూడా తమకు ప్రాణప్రియుడైన తనయుణ్ని కుమారస్వామిని చూసి, ఎంతగానో మురిసిపోయారు.

మహాప్రభుస్సముత్థాప్య తముత్సంగే న్యవేశయత్ ।
మూర్ధ్ని జఘ్రౌ ముదా స్నేహాత్తం పస్పర్శ కరేణ హ ॥23॥

మహానందభరశ్శంభుశ్చకార ముఖచుంబనమ్ ।
కుమారస్య మహాస్నేహాత్ తారకారేర్మహాప్రభోః ॥24॥

మహాప్రభువు శివుడు తనకు సాష్టాంగపడ్డ కుమారుణ్ని లేవనెత్తి ఒడిలో కూర్చుండబెట్టుకున్నాడు. శిరస్సు మూర్కొన్నాడు. వాత్సల్యంతో ఒళ్ళంతా చేతితో నిమిరాడు. మహానందపరవశుడయ్యాడు. ఆ తారకారి ముఖం ముద్దాడాడు.

శివాపి తం సముత్థాప్య సోత్సంగే సన్న్యవేశయత్ ।
కృత్వా మూర్ధ్ని మహాస్నేహాత్ తన్ముఖాబ్జం చుచుంబ హి ॥25॥

పార్వతీదేవి కూడా అలాగే బిడ్డను లేవనెత్తి, ఒడిలో కూర్చోబెట్టుకుని, శిరస్సు మూర్కొని, వాత్సల్యాతిశయంతో అతడి ముఖం ముద్దాడింది.

తయోస్తదా మహామోదో వవృధేఽతీవ నారద ।
దంపత్యోశ్శివయోస్తాత! భవాచారం ప్రకుర్వతోః ॥26॥

తదోత్సవో మహానాసీత్ నానావిధశ్శివాలయే ।
జయశబ్దో నమశ్శబ్దో బభూవాతీవ సర్వతః ॥27॥

తతస్సురగణాస్సర్వే విష్ణ్వాద్యా మునయస్తదా ।
సుప్రణమ్య ముదా శంభుం తుష్టువుస్సశివం మునే ॥28॥

నారదా! ఇలా లోకాచారం పాటించిన ఆ దంపతులకు అప్పుడెంతో ఆనందం కలిగింది. వెంటనే కైలాసగిరి మీద పలురకాల మహోత్సవం పరిఢవిల్లింది. జయజయ – నమోనమశ్శబ్దాలతో దిక్కులు పిక్కటిల్లాయి. విష్ణ్వాదిదేవతలూ సకల మునులూ శివాన్వితుడైన శివుణ్ని శిరసా నతించి, ఆనందంగా స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు అన్నారు.

దేవదేవ! మహాదేవ! భక్తానామభయప్రద ।
నమో నమస్తే బహుశః కృపాకర! మహేశ్వర ॥29॥

అద్భుతా తే మహాదేవ! మహాలీలా సుఖప్రదా ।
సర్వేషాం శంకర సతాం దీనబంధో మహాప్రభో ॥30॥

ఏవం మూఢధియశ్చాజ్ఞాః పూజాయాం తే సనాతన ।
ఆవాహనం న జానీమో గతిం నైవ ప్రభోఽద్భుతామ్ ॥31॥

ఓ దేవదేవా! మహాదేవా! భక్తులకు అభయం ఇచ్చేవాడా! కృపాకరా! మహేశ్వరా! నీకు అనేకానేక వందనాలు. నీ మహాలీల అత్యద్భుతం. అత్యంత సుఖప్రదం. సజ్జనులందరికీ శుభం కలిగించేవాడా! (శమ్+కర) దీనబంధూ! మహాప్రభూ! ఓయి సనాతనా! మేము దేవతలమే కానీ – నీ పూజావిధానం తెలియని మూఢులం. ఆవాహనాది షోడశోపచారాల విధానం ఎరగని అజ్ఞులం. నీ అత్యద్భుతమైన ప్రణాళికను (గతి) ఏ కొంచెమూ గుర్తించలేనివాళ్ళం.

గంగాసలిలధారాయా హ్యాధారాయ గుణాత్మనే ।
నమస్తే త్రిదశేశాయ శంకరాయ నమో నమః ॥32॥

వృషాంకాయ మహేశాయ గణానాం పతయే నమః ।
సర్వేశ్వరాయ దేవాయ త్రిలోకపతయే నమః ॥33॥

సంహర్త్రే జగతాం నాథ! సర్వేషాం తే నమో నమః ।
భర్త్రే కర్త్రే చ దేవేశ త్రిగుణేశాయ శాశ్వతే ॥34॥

గంగాజలధారలకు ఆధారమైనవాడికి, గుణస్వరూపుడికి త్రిదశుల నాయకుడికి, శంకరుడికి నీకిదే నమస్కారం. వృషభధ్వజుడికి, మహేశుడికి, ప్రమథగణాల అధిపతికి, సర్వేశ్వరుడికి, త్రిలోకపతికి శివమహాదేవుడికి నీకిదే నమస్కారం. నాథా! సకల జగత్తులసంహర్తకు, భర్తకు, కర్తకు, దేవేశుడికి త్రిగుణాధిపతికి శాశ్వతుడుకి నీకిదే నమోవాకం.

విసంగాయ పరేశాయ శివాయ పరమాత్మనే ।
నిష్ప్రపంచాయ శుద్ధాయ పరమాయావ్యయాయ చ ॥35॥

దండహస్తాయ కాలాయ పాశహస్తాయ తే నమః ।
వేదమంత్రప్రధానాయ శతజిహ్వాయ తే నమః ॥36॥

సంగరహితుడికి, పరాత్పరుడికి, శివుడికి, పరమాత్మకు, నిష్ప్రపంచుడికి, శుద్ధుడికి, పరముడికి, అవ్యయుడికి, దండహస్తుడికి, కాలునికి, పాశహస్తునికి, వేదమంత్రప్రధానుడికి, శతజిహ్వుడికి నీకిదే వందనం.

భూతం భవ్యం భవిష్యచ్చ స్థావరం జంగమం చ యత్ ।
తవ దేహోత్సముత్పన్నం సర్వథా పరమేశ్వర ॥37॥

పాహి నస్సర్వదా స్వామిన్ ప్రసీద భగవన్ ప్రభో ।
వయం తే శరణాపన్నాః సర్వథా పరమేశ్వర ॥38॥

పరమేశ్వరా! భూతభవిష్యద్వర్తమానకాలాలు నీనుంచే సముత్పన్నమయ్యాయి. నువ్వు కాలస్వరూపుడివి. స్థావరాలూ, జంగమాలూ నీనుంచే ఆవిర్భవించాయి. నువ్వు ప్రపంచస్వరూపుడివి. స్వామీ! ప్రభూ! భగవంతుడా! మమ్మల్ని ఎల్లవేళలా కరుణించు. ఎల్లప్పుడూ మేమందరమూ నీకు శరణాగతులమే. సర్వదా సర్వథా మాకు ప్రసన్నుడివి కావాలి నువ్వు.

శితికంఠాయ రుద్రాయ స్వాహాకారాయ తే నమః ।
అరూపాయ సరూపాయ విశ్వరూపాయ తే నమః ॥39॥

శివాయ నీలకంఠాయ చితాభస్మాంగధారిణే ।
నిత్యం నీలశిఖండాయ శ్రీకంఠాయ నమో నమః ॥40॥

శితికంఠుడికి, రుద్రుడికి, స్వాహాస్వరూపుడికి, అరూపుడికి, సరూపుడికి, విశ్వరూపుడికి, నీకివే నమస్కారాలు. శివుడికి, నీలకంఠుడికి, చితాభస్మాన్ని ధరించేవాడికి, నిత్యమూ నీలశిరోజాలవాడికి, శ్రీకంఠుడికి నీకివే నమస్కారాలు.

సర్వప్రణతదేహాయ సంయమిప్రణతాయ చ ।
మహాదేవాయ శర్వాయ సర్వార్చితపదాయ చ ॥41॥

అందరూ సాష్టాంగపడే రూపంకలవాడికి, నిగ్రహసంపన్నులైన తపస్వుల నమస్కారాలందుకునే వాడికి మహాదేవుడికి, శర్వుడికి, అందరిచేతా అర్చింపబడే పాదపద్మాలు కలవాడికి – నీకివే మా నమస్సులు.

త్వం బ్రహ్మా సర్వదేవానాం రుద్రాణాం నీలలోహితః ।
ఆత్మా చ సర్వభూతానాం సాంఖ్యైః పురుష ఉచ్యసే ॥42॥

పర్వతానాం సుమేరుస్త్వం నక్షత్రాణాం చ చంద్రమా ।
ఋషీణాం చ వశిష్ఠస్త్వం దేవానాం వాసవస్తథా ॥43॥

ఓంకారస్సర్వవేదానాం త్రాతా భవ మహేశ్వర ।
త్వం చ లోకహితార్థాయ భూతాని పరిషించసి ॥44॥

నువ్వు సర్వదేవతలలోనూ బ్రహ్మవు, రుద్రులలో నీలలోహితమూర్తివి, సర్వభూతాలకూ ఆత్మవు, సాంఖ్యులు నిన్ను పురుషుడు అంటారు. పర్వతాలలో మేరువు, తారలలో చంద్రుడు, ఋషులలో వశిష్ఠుడు, దేవతలలో ఇంద్రుడు – నువ్వే. సర్వవేదాలకూ నువ్వే ఓంకారానివి. సంరక్షకుడివి. లోకహితం కోరి నువ్వే ఈ పంచభూతాలనూ వృద్ధిపొందిస్తుంటావు.

మహేశ్వర మహాభాగ శుభాశుభనిరీక్షక ।
ఆప్యాయాస్మాన్ హి దేవేశ కర్తౄన్ వై వచనం తవ ॥45॥

రూపకోటిసహస్రేషు రూపకోటిశతేషు చ ।
అంతం గంతుం న శక్తాః స్మ దేవదేవ నమోఽస్తు తే ॥46॥

ఓ మహేశ్వరా! ఓ మహాభాగా! సకల ప్రాణికోటికీ సంబంధించిన శుభాశుభాల పర్యవేక్షకుడివి నువ్వు. దేవాధిదేవా! నీ ఆజ్ఞను పాలించే మమ్మల్ని దయచేసి ఆప్యాయంగా చూసుకో (ఆనందింపజెయ్యి). వందల వేలకోట్ల నీ రూపాలను కడముట్టా దర్శించలేని అశక్తులం మేము. పరమేశ్వరా! నీకిదే మా ప్రణామం.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతి స్తుత్వాఖిలా దేవా విష్ణ్వాద్యాః ప్రముఖస్థితాః ।
ముహుర్ముహుస్సుప్రణమ్య స్కందం కృత్వా పురస్సరమ్ ॥47॥

దేవస్తుతిం సమాకర్ణ్య శివస్సర్వేశ్వరః స్వరాట్ ।
సుప్రసన్నో బభూవాథ విజహాస దయాపరః ॥48॥

ఉవాచ సుప్రసన్నాత్మా విష్ణ్వాదీన్ సురసత్తమాన్ ।
శంకరః పరమేశానో దీనబంధుస్సతాం గతిః ॥49॥

స్కందుణ్ణి తమ ముందు నిలుపుకుని శ్రీహరిప్రముఖులైన దేవతలందరూ శంకరుణ్ణి మాటమాటకూ నమస్కరిస్తూ స్తుతించి నిలబడ్డారు. ఆ స్తుతులను ఆలకించి సర్వేశ్వరుడు శివుడు దేవతాసార్వభౌముడు ఎంతగానో ప్రసన్నుడయ్యాడు. ఆ దయాపరుడు ఆనందదరహాసం చేశాడు. సజ్జనులకు ఏడుగడ ఆ శంకరుడు, పరమేశానుడు దీనబంధువు అలా ప్రసన్నాత్ముడై శ్రీహరిప్రభృతులైన దేవతలతో ఇలా అన్నాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

హే హరే హే విధే దేవా వాక్యం మే శృణుతాదరాత్ ।
సర్వథాహం సతాం త్రాతా దేవానాం వః కృపానిధిః ॥50॥

దుష్టహంతా త్రిలోకేశశ్శంకరో భక్తవత్సలః ।
కర్తా భర్తా చ హర్తా చ సర్వేషాం నిర్వికారవాన్ ॥51॥

ఓ విష్ణూ! ఓ బ్రహ్మా! ఓ దేవతలారా! నా మాటను ఆదరంతో ఆలకించండి. సర్వదా నేను సజ్జనులకూ, దేవతలకూ సంరక్షకుణ్ని. దయానిధిని. దుష్టహంతను. త్రిలోకాధిపతిని. శంకరుణ్ని. భక్తవత్సలుణ్ని. అన్నింటికినీ నేనే కర్తను, భర్తను, హర్తను, అయినా నిర్వికారుణ్ని.

యదా యదా భవేద్దుఃఖం యుష్మాకం దేవసత్తమాః ।
తదా తదా మాం యూయం వై భజంతు సుఖహేతవే ॥52॥

దేవసత్తములారా! మీకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా నన్ను సేవించండి. మీకు దుఃఖాలు తొలిగి సుఖాలు కలుగుతాయి.

బ్రహ్మోవాచ - బ్రహ్మ అన్నాడు.

ఇత్యాజ్ఞప్తాస్తదా దేవా విష్ణ్వాద్యాస్సమునీశ్వరాః ।
శివం ప్రణమ్య సశివం కుమారం చ ముదాన్వితాః ॥53॥

కథయంతో యశో రమ్యం శివయోశ్శంకరేశ్చ తత్ ।
ఆనందం పరమం ప్రాప్య స్వధామాని యయుర్మునే ॥54॥

శివోఽపి శివయా సార్ధం సగణః పరమేశ్వరః ।
కుమారేణ యుతః ప్రీత్యోవాస తస్మిన్ గిరౌ ముదా ॥55॥

ఇత్యేవం కథితం సర్వం కౌమారం చరితం మునే ।
శైవం చ సుఖదం దివ్యం కిమన్యత్ శ్రోతుమిచ్ఛసి ॥56॥

ఇలా ఆజ్ఞప్తులై శ్రీహరిప్రముఖులు సకలదేవతలూ, మునీశ్వరులూ, పార్వతీసమేతుడైన శివుణ్ని శిరసా నమస్కరించి, కుమారస్వామినీ స్తుతించి, ఆనందించినవారై ఆ దంపతుల కమనీయయశస్సును గుహుడి గాథావిశేషాన్నీ పరస్పరం ముచ్చటించుకుంటూ తమతమ నివాసాలకు తిరిగివెళ్ళారు. నారదా! అటుపైని శివుడుసైతం తనయుడితో పార్వతితో ప్రమథగణాలతో తన నివాసాద్రి కైలాసం మీద ఆనందంగా నివసించాడు. నాయనా! ఇదీ కుమారస్వామి చరిత. శివసంబంధి గాథ. ఇది దివ్యం. ఇది రమ్యం. సమస్తమూ నీకు వినిపించాను. మరింక ఏది వినాలని కోరుకుంటున్నావు?

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే స్వామికార్తిక చరితగర్భిత శివాశివచరితవర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥12॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు స్వామికార్తికచరిత్రతో కూడిన శివాశివచరిత వర్ణనం అనే పన్నెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోదశోఽధ్యాయః – పదమూడవ అధ్యాయం

గణేశోత్పత్తి వర్ణనమ్ – గణేశోత్పత్తి వర్ణనం

సూత ఉవాచ – సూతుడు అన్నాడు.

తారకారేరితి శ్రుత్వా వృత్తమద్భుతముత్తమమ్ ।
నారదస్సుప్రసన్నోఽథ పప్రచ్ఛ ప్రీతితో విధిమ్ ॥1॥

మహర్షులారా! అద్భుతమూ, ఉత్తమమూ అయిన ఈ తారకారి వృత్తాంతం విని, నారదమహర్షి సుప్రసన్నుడై బ్రహ్మదేవుణ్ణి ప్రీతిపూర్వకంగా ఇలా అడిగాడు.

నారద ఉవాచ – నారదుడు అడిగాడు.

దేవదేవ ప్రజానాథ శివజ్ఞాననిధే మయా ।
శ్రుతం కార్తికసద్వృత్తమమృతాదపి చోత్తమమ్ ॥2॥

అధునా శ్రోతుమిచ్ఛామి గాణేశం వృత్తముత్తమమ్ ।
తజ్జన్మచరితం దివ్యం సర్వమంగళమంగళమ్ ॥3॥

సర్వప్రాణికోటినీ సృష్టించినవాడా! దేవదేవా! బ్రహ్మదేవా! శుభప్రదమైన జ్ఞానానికీ, శివసంబంధికథా జ్ఞానానికీ నిధియైనవాడా! అమృతంగా ఉత్తమమైన కార్తికవృత్తాంతాన్ని నీ పుణ్యమా అని విన్నాను. ఇంక ఇప్పుడు గణేశుడి ఉత్తమోత్తమవృత్తాంతం వినగోరుతున్నాను. గణేశుడి పుట్టుక అతడి చరిత్ర దివ్యమైనవి. మంగళాలలోకెల్లా మంగళప్రదాలు. దయచేసి విన్పించు.

సూత ఉవాచ – సూతుడు అన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య నారదస్య మహామునేః ।
ప్రసన్నమానసో బ్రహ్మా ప్రత్యువాచ శివం స్మరన్ ॥4॥

ఆ నారదమహాముని కోరికను ఆకర్ణించి, విని బ్రహ్మదేవుడి మనస్సు మరింతగా ప్రసన్నమయ్యింది. ఒక్కసారి మనస్సులో శివుణ్ణి స్మరించుకుని విరించి ప్రారంభించాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

కల్పభేదాద్గణేశస్య జనిః ప్రోక్తా విధేః పురా ।
శనిదృష్టం శిరశ్ఛిన్నం సంచితం గజమాననమ్ ॥5॥

ఇదానీం శ్వేతకల్పోక్తా గణేశోత్పత్తిరుచ్యతే ।
యత్ర చ్ఛిన్నం శిరస్తస్య శివేన చ కృపాళునా ॥6॥

నారదా! కల్పభేదాల్ని బట్టి గణేశుడి పుట్టుక రకరకాలుగా వినిపిస్తోంది. దిష్టి తగిలి అతడి శిరస్సు తెగిపోతే ఏనుగుతల అమర్చారు అని బ్రహ్మకల్పంలో గాథ. ఇప్పుడు నేను చెబుతున్నది శ్వేతవరాహకల్పోక్తమైన కథ. ఇందులో – దయాళుడైన శివుడే గణేశుడి తలను ఖండిస్తాడు.

విశేషం: శనిగ్రహానికి క్రూరదృష్టి అని మరోపేరు. అతడి చూపు పడితే భస్మమైపోవడమే. ఒకరోజున పార్వతీదేవి తన కుమారుణ్ని చూడమని శనికి పరీక్ష పెట్టిందట. అతడు చూశాడు. గణేశుడి తల భస్మమైపోయింది. అప్పుడు బ్రహ్మదేవుడు పార్వతిని ఓదార్చి మొదటిసారిగా నీ కంటబడిన ప్రాణి తలను తెచ్చి అమర్చమన్నాడు. అలా పార్వతికి కంటబడింది ఒక ఏనుగు. దాని తల తెచ్చి గణేశుడికి అమర్చారు. ఇది బ్రహ్మకల్పం చెప్పిన కథ (విధేఃపురా ప్రోక్తా జనిః).

సందేహో నాత్ర కర్తవ్యః శంకరస్యాతికృన్మనే ।
స హి సర్వాధిపః శంభుః నిర్గుణస్సగుణోఽపి హి ॥7॥

తల్లీలయాఖిలం విశ్వం సృజ్యతే పాల్యతే తథా ।
వినాశ్యతే మునిశ్రేష్ఠ! ప్రస్తుతం శృణు చాదరాత్ ॥8॥

మునిశ్రేష్ఠా! నారదా! ఈ విషయంలో నువ్వు ఏమీ సందేహించనవసరం లేదు. శంకరుడే చాలా మహిమలవాడు. అతడే సర్వాధిపతి. శంభువు. నిర్గుణుడూ సగుణుడూ కూడా అతడే. అతడి లీలావిశేషంగానే ఈ అఖిలవిశ్వమూ సృష్టింపబడుతోంది, రక్షింపబడుతోంది, లయింపబడుతోంది. ప్రస్తుతకథ చెబుతాను ఆదరంగా విను.

ఉద్వాహితే శివే చాత్ర కైలాసం చ గతే సతి ।
కియతా చైవ కాలేన జాతో గణపతేర్భవః ॥9॥

ఏకస్మిన్నేవ కాలే చ జయా చ విజయా సఖీ ।
పార్వత్యా చ మిలిత్వా వై విచారే తత్పరాభవత్ ॥10॥

శివుడు పార్వతిని పరిణయమాడి కైలాసగిరికి చేరుకున్నాక చాలా కాలానికి గణపతి పుట్టుక జరిగింది. అనగా అనగా ఒకనాడు – జయ అనే ఒక చెలికత్తె విజయ అనే మరొక చెలికత్తె పార్వతీదేవిని కలిసి, ఎవరికి వారుగా ఒక సమాలోచన చేశారు.

రుద్రస్య చ గణాస్సర్వే శివస్యాజ్ఞాపరాయణాః ।
తే సర్వేఽప్యస్మదీయాశ్చ నందిభృంగిపురస్సరాః ॥11॥

నంది – భృంగి నాయకులుగా ఉన్న రుద్రగణాలందరూ నిజానికి మనవాళ్ళే. కానీ వాళ్ళంతా కేవలం శివాజ్ఞాపరాయణులు.

ప్రమథాస్తే హ్యసంఖ్యాతా అస్మదీయో న కశ్చన ।
ద్వారి తిష్ఠంతి తే సర్వే శంకరాజ్ఞాపరాయణాః ॥12॥

తే సర్వేఽప్యస్మదీయాశ్చ తథాపి న మిళేన్మనః ।
ఏకశ్చాస్మదీయో హి రచనీయస్త్వయానఘే ॥13॥

అసంఖ్యాకంగా ఉన్నారు ప్రమథులు. వారిలో ఏ ఒక్కడు మనవాడు కాదు. అందరూ శివుడి ఆజ్ఞలను ప్రతీక్షిస్తూ ఆయన గుమ్మందగ్గరే ఉంటారు. నిజానికి వాళ్ళూ మనవాళ్ళే. కానీ ఎందుకనో మనకు వాళ్ళతో మనసు కలవలేదు. అందుకని పార్వతీ! పవిత్రురాలా! అస్మదీయుణ్ణి ఒక్కణ్ణి నువ్వు సృష్టించాలి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వా పార్వతీ దేవీ సఖీభ్యాం సుందరం వచః ।
హితం మేనే తదా తచ్చ కర్తుం స్మాప్యధ్యవస్యతి ॥14॥

సఖులిద్దరూ ఇలా అందంగా పలికే సరికి పార్వతీదేవి దాన్ని తనకు హితంగా భావించింది. ఆ పని చెయ్యడానికి నిశ్చయించుకుంది కూడా.

తతః కదాచిన్మజ్జత్యాం పార్వత్యాం వై సదాశివః ।
నందినం పరిభర్త్స్యాథ హ్యాజగామ గృహాంతరమ్ ॥15॥

ఆయాంతం శంకరం దృష్ట్వాఽసమయే జగదంబికా ।
ఉత్తస్థౌ మజ్జతీ సా వై లజ్జితా సుందరీ తదా ॥16॥

తస్మిన్నవసరే దేవీ కౌతుకేనాతిసంయుతా ।
తదీయం తద్వచశ్చైవ హితం మేనే సుఖావహమ్ ॥17॥

అంతట ఒకనాడు – పార్వతీదేవి తన మందిరంలో స్నానం చేస్తుండగా, ద్వారపాలకుడైన నందిని ధిక్కరించి సదాశివుడు సరాసరి లోపలికి వచ్చేశాడు. రాకూడని సమయంలో వచ్చిన శంకరుణ్ణి చూసి సౌందర్యరాశి ఆ జగదంబిక సిగ్గుపడుతూ తటాలున లేచి నిలబడింది. కౌతుకంతో కళవళపడుతున్న పార్వతికి సరిగ్గా ఆ సమయంలో మళ్ళీ అనిపించింది తన చెలిమికత్తెలు జయ – విజయల సూచన సబబే అనీ సుఖావహమనీ.

ఏవం జాతే సదా కాలే కదాచిత్పార్వతీ శివా ।
విచింత్య మనసా చేతి పరమా యా పరమేశ్వరీ ॥18॥

మదీయస్సేవకః కశ్చిత్ భవేత్ శుభతరః కృతీ ।
మదాజ్ఞయా పరం నాన్యద్రేఖామాత్రం చలేదిహ ॥19॥

ఇలా కొంతకాలం గడిచింది. శివాని–పార్వతి–పరాశక్తి–పరమేశ్వరి బాగా ఆలోచించింది. నాకు నావాడైన సేవకుడు ఒకడు ఉండాలి. అతడు శుభతరుడూ, సమర్థుడూ అయ్యుండాలి. నా ఆజ్ఞను రవ్వంతైనా జవదాటకూడదు. మరింకేదీ చెయ్యకూడదు.

విచార్యేతి చ సా దేవీ వపుషో మలసంభవమ్ ।
పురుషం నిర్మమౌ సా తు సర్వలక్షణసంయుతమ్ ॥20॥

సర్వావయవనిర్దోషం సర్వావయవసుందరమ్ ।
విశాలం సర్వశోభాఢ్యం మహాబలపరాక్రమమ్ ॥21॥

పార్వతీదేవి ఇలా ఆలోచించి తన ఒంటికి పట్టించుకున్న నలుగుపిండితో ఒక పురుషుణ్ని సృష్టించింది. అతడు సర్వలక్షణ సంపన్నుడు, నిర్దుష్టమైన అవయవనిర్మాణం, ఉట్టిపడుతున్న సర్వావయవసౌందర్యం, విశాలమైన విగ్రహం, దానికి తగ్గ మహాబలపరాక్రమాలు, సర్వశోభస్కరంగా ఉన్నాడు.

వస్త్రాణి చ తదా తస్మై దత్త్వా సా వివిధాని వై ।
నానాలంకరణం చైవ బహ్వాశిషమనుత్తమామ్ ॥22॥

మత్పుత్రస్త్వం మదీయోఽసి నాన్యః కశ్చిదిహాస్తి మే ।
ఏవముక్తస్స పురుషః నమస్కృత్య శివాం జగౌ ॥23॥

గౌరీదేవి అతడికి దివ్యవస్త్రాలూ, దివ్యాభరణాలూ దివ్యాశీస్సులూ అమేయంగా, అమోఘంగా అనుగ్రహించింది. నువ్వు నా పుత్రుడివి. నా వాడివి. నాకిక్కడ మరొకడు లేడు – అంది. ఈ మాటలు ఆలకించి ఆ పురుషుడు శివాదేవిని శిరసా నమస్కరించి, ఇలా పలికాడు.

గణేశ ఉవాచ – గణేశుడన్నాడు.

కిం కార్యం విద్యతే తేఽద్య కరవాణి తవోదితమ్ ।
ఇత్యుక్తా సా తదా తేన ప్రత్యువాచ సుతం శివా ॥24॥

తల్లీ! నేనిప్పుడు చెయ్యవలసిన పని ఏమిటి? నువ్వు ఏది చెబితే అది చేస్తాను. గణేశుడన్న ఈ మాట విని పార్వతీదేవి తన సుతుడికి ఇలా బదులు పలికింది.

శివోవాచ – పార్వతి పలికింది.

హే తాత శృణు మద్వాక్యం ద్వారపాలో భవాద్య మే ।
మత్పుత్రస్త్వం మదీయోఽసి నాన్యథా కశ్చిదస్తి మే ॥25॥

వినా మదాజ్ఞాం మత్పుత్ర నైవాయాత్ మద్గృహాంతరమ్ ।
కోఽపి క్వాపి హఠాత్తాత సత్యమేతన్మయోదితమ్ ॥26॥

నాయనా! ఇదిగో విను. ఈరోజు నువ్వు నా ద్వారపాలకుడుగా నిలబడు. నువ్వు నా కుమారుడివి. నావాడివి. నా కు మరొకడు లేడు. పుత్రకా! నా అనుమతి లేకుండా ఎవరుగానీ ఎప్పుడుగానీ, హఠాత్తుగా నా ఇంటిలోకి రానే రాకూడదు. ఇది నా ఆజ్ఞ. ఇది సత్యం.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వా చ దదౌ తస్మై యష్టిం చాతిదృఢాం మునే ।
తదీయం రూపమాలోక్య సుందరం హర్షమాగతా ॥27॥

ముఖమాచుంబ్య సుప్రీత్యాలింగ్య తం కృపయా సుతమ్ ।
స్వద్వారి స్థాపయామాస యష్టిపాణిం గణాధిపమ్ ॥28॥

నారదమునీ! ఇలా ఆజ్ఞాపించి పార్వతిదేవి అతడికి ఒక గట్టికర్రను చేతికిచ్చింది. అతడి సుందరాకారాన్ని చూసి మురిసిపోయింది. ముద్దాడింది. వాత్సల్యంతో, దయతో కౌగిలించుకుంది. అలా కర్రను చేతబట్టిన కొడుకు గణపతిని తన ఇంటి వాకిట నిలబెట్టింది.

అథ దేవీసుతస్తాత గృహద్వారి స్థితో గణః ।
యష్టిపాణిర్మహావీరః పార్వతీహితకామ్యయా ॥29॥

స్వద్వారి స్థాపయిత్వా తం గణేశం స్వసుతం శివా ।
స్వయం చ మజ్జతీ సా వై సంస్థితాసీత్సఖీయుతా ॥30॥

నారదా! దేవీసుతుడు! మహాబలుడు ఆ గణపతి – పార్వతీదేవి హితంకోరి, అలా కర్ర చేబూని, ఇంటి వాకిట నిలబడ్డాడు. కొడుకుని అలా వాకిట కావలి ఉంచి, పార్వతీదేవి తన చెలికత్తెలతో కలిసి జలకాలాడడం మొదలుపెట్టింది.

ఏతస్మిన్నేవ కాలే తు శివో ద్వారి సమాగతః ।
కౌతుకీ మునిశార్దూల! నానాలీలావిశారదః ॥31॥

ఉవాచ చ శివేశం తమవిజ్ఞాయ గణాధిపః ।
మాతురాజ్ఞాం వినా దేవ గమ్యతాం న త్వయాధునా ॥32॥

మజ్జనార్థం స్థితా మాతా క్వయాసీతో వ్రజాధునా ।
ఇత్యుక్త్వా యష్టికాం తస్య రోధనాయ తదాగ్రహీత్ ॥33॥

మునిశార్దూలా! సరిగ్గా అదేవేళ లీలావిశారదుడు శివుడు చాలా కుతుకంతో పార్వతి ఇంటిముంగిటికి వచ్చాడు. అతడెవరో తెలియక గణాధిపతి ఆ పార్వతీవల్లభుడితో ఇలా అన్నాడు – దేవా! మా తల్లిగారి అనుమతి లేనిదే నువ్విప్పుడు లోపలికి వెళ్ళడానికి వీలులేదు. మా తల్లి మజ్జనమాడుతోంది. నువ్వు లోపలికి ఎలా వెడతావు? ఇప్పటికి తిరిగి వెళ్ళిపో – అని చెప్పి అతణ్ని ఆపడం కోసం తన చేతికర్రను అందుకున్నాడు.

తం దృష్ట్వా తు శివః ప్రాహ కం నిషేధసి మూఢధీః ।
మాం న జానాస్యసద్బుద్ధే శివోఽహమితి నాన్యథా ॥34॥

తాడితస్తేన యష్ట్యా హి గణేశేన మహేశ్వరః ।
ప్రత్యువాచ స తం పుత్రం బహులీలశ్చ కోపితః ॥35॥

నారదా! అప్పుడు ఆ గణేశుణ్ణి చూసి శివుడు అన్నాడుగదా – ఓరీ మూఢుడా! ఎవరిని అడ్డగిస్తున్నావో తెలుసా? ఓరీ దుర్బుద్ధీ! నన్నే ఎరగవా? నేనెవడినో కాదు, సాక్షాత్తు శివుణ్ణి. శివోఽహమ్! శివుడు ఇలా అంటూండగానే గణేశుడు తన చేతికర్రతో కొట్టాడు. దెబ్బతిన్న శివుడికి కోపం వచ్చింది. అయినా బహులీలలవాడుగదా! ఆ పుత్రకుడితో మళ్ళీ ఇలా అన్నాడు.

శివ ఉవాచ – శివుడన్నాడు.

మూర్ఖోఽసి త్వం న జానాసి శివోఽహం గిరిజాపతిః ।
స్వగృహం యామి రే బాల! నిషేధసి కథం హి మామ్ ॥36॥

ఎంత మూర్ఖుడివిరా నాయనా నువ్వు! తెలుసుకోలేకపోతున్నావు. నేను శివుణ్ణి! పార్వతీపతిని. బాలకా! నా ఇంటిలోకి నేను వెడుతున్నానురా! నన్ను ఆపుతావేమిరా!

ఇత్యుక్త్వా ప్రవిశంతం తం మహేశం గణనాయకః ।
క్రోధం కృత్వా తతో విప్ర! దండేనాతాడయత్పునః ॥37॥

తతశ్శివశ్చ సంక్రుద్ధో గణానాజ్ఞాపయన్నిజాన్ ।
కో వాయం వర్తతే కిం చ క్రియంతే పశ్యతాం గణాః ॥38॥

ఇత్యుక్త్వా తు శివస్తత్ర స్థితః క్రుద్ధో గృహాద్బహిః ।
భవాచారరతః స్వామీ బహ్వద్భుతసులీలకః ॥39॥

ఇలా అంటూనే ఇంటిలోకి చొరబడుతున్న శివుణ్ణి గణనాయకుడు క్రుద్ధుడై తన కర్రతో మళ్ళీ కొట్టాడు. అప్పుడు శివుడుకూడా క్రుద్ధుడయ్యాడు. తన గణాలను ఆజ్ఞాపించాడు. ఎవడురా వీడు? ఇక్కడ ఎందుకున్నట్టు? అయినా మీరంతా చూస్తూ ఊరుకుంటారేంటి? ఏమి చేస్తున్నట్టు? – ఇలా అని క్రుద్ధుడై శివుడు అలా ఇంటి వెలుపలనే నిలబడిపోయాడు. ఆయన భవాచరపరాయణుడు. ప్రభువు. అనేకాద్భుతలీలలవాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే గణేశోత్పత్తి వర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః ॥13॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు గణేశోత్పత్తి వర్ణనం అనే పదమూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్దశోఽధ్యాయః – పద్మాల్గవ అధ్యాయం

గణవివాదవర్ణనమ్ – గణవివాదవర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

గణాస్తే క్రోధసంపన్నాస్తత్ర గత్వా శివాజ్ఞయా ।
పప్రచ్ఛుర్గిరిజాపుత్రం తం తదా ద్వారపాలకమ్ ॥1॥

నారదా! శివుడి ఆజ్ఞమేరకు శివగణాలన్నీ అక్కడికి చేరుకున్నాయి. అందరూ చాలా క్రోధంగా అక్కడికి వచ్చి, ద్వారపాలకుడుగా ఉన్న ఆ గిరిజాపుత్రుణ్ని ఇలా నిలదీశారు.

శివగణా ఊచుః – శివగణాలు ఇలా అన్నాయి.

కోఽసి త్వం కుత ఆయాతః కిం వా త్వం చ చికీర్షసి ।
ఇతోఽద్య గచ్ఛ దూరం వై యది జీవితుమిచ్ఛసి ॥2॥

బాలకా! నువ్వు ఎవడవు? ఎక్కడి నుంచి వచ్చావు? ఎందుకోసం వచ్చావు? ఇక్కడ ఏం చేస్తున్నావు? వెళ్ళు. జీవించదలుచుకుంటే. వెంటనే ఇక్కడినుంచి దూరంగా వెళ్ళిపో.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

తదీయం తద్వచః శ్రుత్వా గిరిజాతనయస్స వై ।
నిర్భయో దండపాణిశ్చ ద్వారపానబ్రవీదిదమ్ ॥3॥

ఈ పలుకులు విని గిరిజాతనయుడు ఏ మాత్రమూ జంకలేదు. నిర్భయంగా నిలబడ్డాడు. కర్ర చేతిలోనే పట్టుకొని నిలబడ్డాడు. శివుడి ద్వారపాలకులైన ఆ శివగణాలతో ఇలా పలికాడు.

గణేశ ఉవాచ – గణేశుడన్నాడు.

యూయం కే కుత ఆయాత భవంతస్సుందరా ఇమే ।
యాత దూరం కిమర్థం వై స్థితా అత్ర విరోధినః ॥4॥

అసలు మీరెవరు? ఎక్కడినుంచి వచ్చారు? మీరంతా చాలా అందంగా ఉన్నారు. వెళ్ళండి. దూరంగా పొండి. ఇంకా ఎందుకిక్కడ నిలబడ్డారు – విరోధుల్లాగా?

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఏవం శ్రుత్వా వచస్తస్య హాస్యం కృత్వా పరస్పరమ్ ।
ఊచుస్సర్వే శివగణా మహావీరా గతస్మయాః ॥5॥

పరస్పరమితి ప్రోచ్య సర్వే తే శివపార్షదాః ।
ద్వారపాలం గణేశం తం ప్రత్యూచుః క్రుద్ధమానసాః ॥6॥

నారదా! ఈ మాటలకు శివగణాలు ఒండొరులు నవ్వుకున్నారు. వారందరూ మహావీరులే. కానీ అణకువ లేనివారు. తమలో తాము కూడబలుక్కున్నారు. కడపటికి క్రుద్ధమానసులై ఆ శివపార్షదులు పార్వతీద్వారపాలకుడైన ఆ గణేశుడికి ఇలా బదులు పలికారు.

శివగణా ఊచుః – శివగణాలు అన్నారు.

శ్రూయతాం ద్వారపాలా హి వయం శివగణా వరాః ।
త్వాం నివారయితుం ప్రాప్తాశ్శంకరస్యాజ్ఞయా విభోః ॥7॥

త్వామపీహ గణం మత్వా న హన్యామోఽన్యథా హతః ।
తిష్ఠ దూరే స్వతస్త్వం చ కిమర్థం మృత్యుమీహసే ॥8॥

వినవయ్యా బాలకా! మేమంతా శివుడి ద్వారపాలకులం. దొడ్డ శివగణాలం. నిన్ను నివారించడం కోసం మా ప్రభువైన శంకరుడి ఆజ్ఞమేరకు ఇక్కడికి వచ్చాం. నిన్ను కూడా ఒక శివగణంగా భావించి ఇప్పటికింకా చంపలేదు. లేకపోతే ఈపాటికి చచ్చి ఉండేవాడివి. ఎందుకు అనవసరంగా స్వయానా మృత్యువుని కోరుకుంటావు, వెళ్ళిపో, దూరంగా వెళ్ళిపో!

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్తోఽపి గణేశశ్చ గిరిజాతనయోఽభయః ।
నిర్భర్త్స్య శంకరగణాన్న ద్వారం ముక్తవాంస్తదా ॥9॥

తే సర్వేఽపి గణాశ్చైవాస్తత్రత్యా వచనం తదా ।
శ్రుత్వా తత్ర శివం గత్వా తద్వృత్తాంతమథాబ్రువన్ ॥10॥

నారదమునీ! శివగణాలు ఇంత చెప్పినా గిరిజాతనయుడు గణేశుడు కాసింతైనా భయపడలేదు. శివగణాలను బెదిరించి అలా అక్కడే వాకిలిముంగిట నిలబడ్డాడు. అతడి అదిలింపులు ఆలకించిన శివగణాలు మాత్రం తమ ప్రభువు సన్నిధికి వచ్చి – జరిగినదంతా విన్నవించుకున్నాయి.

తతశ్చ తద్వచః శ్రుత్వాద్భుతలీలో మహేశ్వరః ।
వినిర్భర్త్స్య గణానూచే నిజాన్ లోకగతిర్మునే ॥11॥

అద్భుతలీలల వాడూ, లోకగతినెరిగినవాడూ అయిన మహేశ్వరుడు తన గణాలు చెప్పినదంతా విని నారదా! తనవారినే కసురుకుని ఇలా పలికాడు.

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడన్నాడు.

కశ్చాయం వర్తతే కిం చ బ్రవీత్యరివదుచ్ఛ్రితః ।
కిం కరిష్యత్యసద్బుద్ధిః స్వమృత్యుం వాంఛతి ధ్రువమ్ ॥12॥

దూరతః క్రియతాం హ్యేష ద్వారపాలో నవీనకః ।
క్లీబా ఇవ స్థితాస్తస్య వృత్తం వదథ మే కథమ్ ॥13॥

గణాలూ! అసలు ఎవడు వీడు? ఇక్కడ ఏం చేస్తున్నాడు? ఎందుకున్నాడు? శత్రువైన మొనగాడులాగా మాట్లాడుతున్నాడు. ఏం చెయ్యగలడు ఈ దుర్బుద్ధి? కచ్చితంగా తన చావును తానై కోరుకుంటున్నాడు. కొత్తద్వారపాలకుణ్ని వీణ్ని దూరంగా తరిమెయ్యండి. నపుంసకుల్లాగా నిలబడ్డారేమిటి? పెద్ద గొప్పగా వీడి సంగతి నాకు చెబుతారేమిటి?

స్వామినోక్తా గణాస్తే చాద్భుతలీలేన శంభునా ।
పునరాగత్య తత్రైవ తమూచుర్ద్వారపాలకమ్ ॥14॥

అద్భుతమహిమలవాడు ఆ శంభుడు ఇలా కసురుకొనే సరికి గణాలందరూ మళ్ళీ గణపతి దగ్గరికి వచ్చారు. అక్కడే నిలబడి ఆ కొత్తద్వారపాలకుడితో ఇలా పలికారు.

శివగణా ఊచు – శివగణాలు అన్నారు.

రేరే ద్వారప! కస్త్వం హి స్థితశ్చ స్థాపితః కుతః ।
నైవాస్మాన్ గణయస్యేవం కథం జీవితుమిచ్ఛసి ॥15॥

ద్వారపాలా వయం సర్వే స్థితః కిం పరిభాషసే ।
సింహాసన గృహీతశ్చ శృగాలః శివమీహతే ॥16॥

తావద్గర్జసి మూర్ఖ! త్వం యావద్గణ పరాక్రమః ।
నానుభూతస్త్వయాత్రైవ హ్యనుభూతః పతిష్యసి ॥17॥

ఓరోరీ! ద్వారపాలకా! ఎవడవురా నువ్వు ఇక్కడున్నావు? ఎందుకున్నావు? ఎవరు ఉండమన్నారు? మమ్మల్ని అసలు లెక్కచెయ్యడం లేదు. బతికి ఉందామనే? మేమందరం శివుడి ద్వారపాలకులం. ఏమి? మాట్లాడవేమి? అలా నిలబడ్డావు. సింహాసనం ఎక్కానుగదా అని వెనకటికి ఒక నక్క నేనే ప్రభువు నందిట! అలాఉంది నీ కథ. మూర్ఖుడా! మా గణాల పరాక్రమం రుచి చూడనంత వరకే నీ గర్జనలు. ఇప్పటికింకా నువ్వు అది రుచిచూడలేదు. చూశావో రాలి పోయావే!

ఇత్యుక్తైః తైస్ససంక్రుద్ధో హస్తాభ్యాం యష్టికం తదా ।
గృహీత్వా తాడయామాస గణాంస్తాన్ పరిభాషిణః ॥18॥

ఉవాచాథ శివాపుత్రః పరిభర్త్స్య గణేశ్వరాన్ ।
శంకరస్య మహావీరాన్ నిర్భయస్తాన్ గణేశ్వరః ॥19॥

శివగణాలు ఇలా పలికే సరికి గణపతి క్రుద్ధుడయ్యాడు. తన యష్టికను చేతుల్లోకి తీసుకున్నాడు. ఇష్టం వచ్చినట్టు వాగుతున్న శివగణాలను చావబాదాడు. అందరినీ ఇలా అదిలించి అటుపైని ఆ పార్వతీనందనుడు గణేశ్వరుడు నిర్భయంగా నిలబడి, ఆ శివగణమహావీరులతో ఇలా అన్నాడు.

శివాపుత్ర ఉవాచ – శివాపుత్రుడు అన్నాడు.

యాత యాత తతో దూరే నోచేద్వో దర్శయామిహ ।
స్వపరాక్రమమత్యుగ్రం యాస్యథాత్యుపహాస్యతామ్ ॥20॥

పొండి, పొండి దూరంగా పారిపొండి. లేదంటే నా అత్యుగ్రపరాక్రమం చూపిస్తాను. మీరంతా నవ్వులపాలైపోతారు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య గిరిజాతనయస్య హి ।
పరస్పరమథోచుస్తే శంకరస్య గణాస్తదా ॥21॥

ఆ గిరిజాతనయుడి అదిలింపులు ఆలకించి, శివగణాలు తమలో తాము చర్చించుకున్నారు.

శివగణా ఊచుః – శివగణాలు అనుకున్నారు.

కిం కర్తవ్యం క్వ గంతవ్యం క్రియతే స న కిం పునః ।
మర్యాదా రక్ష్యతేఽస్మాభిరన్యథా కిం బ్రవీతి చ ॥22॥

ఇప్పుడు ఏం చెయ్యాలి మనం? ఎక్కడికి పోవాలి? అతణ్ని మనం ఏమీ చెయ్యలేకపోతున్నాం ఎందుకని? కేవలం (సాటి ద్వారపాలకుడు గదా అని) మర్యాద పాటిస్తున్నాం. లేకపోతే మరి వేరే చెప్పాలా!

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

తతశ్శంభుగణాస్సర్వే శివం దూరే వ్యవస్థితమ్ ।
క్రోశమాత్రం తు కైలాసాద్గత్వా తే చ తథాబ్రువన్ ॥23॥

శివో విహస్య తాన్ సర్వాన్ త్రిశూలకర ఉగ్రధీః ।
ఉవాచ పరమేశో హి స్వగణాన్ వీరసమ్మతాన్ ॥24॥

నారదా! ఇలా చర్చించుకుని ఆ శివగణాలు – కైలాసాద్రికి ఒక కోసెడుదూరంలో నిల్చిన తమ ప్రభువు శివుడి దగ్గరికి వెళ్ళి విషయం విన్నవించారు. త్రిశూలం చేతబట్టి ఉగ్రుడై నిలచిన శివుడు వారినందరినీ పరిహసించాడు. వారందరూ తన గణాలు. మహావీరులుగా సమ్మతి గడించినవారు. అయినా వారితో పరమేశుడు ఇలా అన్నాడు.

శివ ఉవాచ – శివుడన్నాడు.

రేరే గణాః క్లీబమతా న వీరా వీరమానినః ।
మదగ్రే నోదితుం యోగ్యా భర్త్సితాః కిం పునర్వదేత్ ॥25॥

గమ్యతాం తాడ్యతాం చైష యః కశ్చిత్ప్రభవేదిహ ।
బహునోక్తేన కించాత్ర దూరీకర్తవ్య ఏవ సః ॥26॥

ఓరోరీ! నపుంసకులారా! మీరు వీరులు కాదు, వీరులమని విర్రవీగుతున్నారంతే. నా ముందు నోరెత్తడానికి యోగ్యత లేదు మీకు. బెదిరినవాడు ఇంకా మాట్లాడటమా?పొండి. ఎవడైనా సమర్థుడుంటే వెళ్ళి వాణ్ని తన్నాలి. ఊరికే వాగుడెందుకు? వాణ్ని పారద్రోలాలి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతి సర్వే మహేశేన జగ్ముస్తత్ర మునీశ్వర ।
భర్త్సితాస్తేన దేవేన ప్రోచుశ్చ గణసత్తమాః ॥27॥

నారదమునీశ్వరా! మహేశుడు ఇలా కసురుకునే సరికి ఆ గణసత్తములందరూ తిరిగి వచ్చి గణేశుని మరింత బెదిరించారు.

శివగణా ఊచుః – శివగణాలు అన్నారు.

రేరే త్వం శృణు వై బాల బలాత్కిం పరిభాషసే ।
ఇతస్త్వం దూరతో యాహి నో చేన్మృత్యుర్భవిష్యతి ॥28॥

ఒరేయ్ బాలకుడా! వినరా మా మాట. బలవంతుణ్ని అని ఏమి వాగుతున్నావురా? పారిపో. ఇక్కడి నుంచి దూరంగా పారిపో. లేదంటే నీకు చావు తప్పదు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతిశ్రుత్వా వచస్తేషాం శివాజ్ఞాకారిణాం ధ్రువమ్ ।
శివాసుతస్తదాభూత్స కింకరోమీతి దుఃఖితః ॥29॥

నారదా! శివపుత్రుడు శివగణాల బెదిరింపులు విన్నాడు. వారందరూ శివాజ్ఞా పరిపాలకులు. కచ్చితంగా అదే చేస్తున్నారు. ఇప్పుడు తానేమి చెయ్యాలో తెలియక పార్వతీనందనుడు చాలా బాధపడ్డాడు.

ఏతస్మిన్నంతరే దేవీ తేషాం తస్య చ వై పునః ।
శ్రుత్వా తు కలహం ద్వారి సఖీం పశ్యేతి సాబ్రవీత్ ॥30॥

సమాగత్య సఖీ తత్ర వృత్తాంతం సమబుధ్యత ।
క్షణమాత్రం తదా దృష్ట్వా గతా హృష్టా శివాంతికమ్ ॥31॥

ఇంతలో – తన ఇంటి గుమ్మం ముందు జరుగుతున్న ఈ మాటల కలహం ఇంటిలోపల ఉన్న పార్వతీదేవికి వినిపించి తన చెలికత్తెను పిలిచి చెప్పింది– వెళ్ళి చూసిరమ్మని. ఆ చెలికత్తె వచ్చింది. క్షణకాలం చూసింది. అంతా అర్థమయ్యింది. ఆనందమూ కలిగింది. గబగబా పార్వతి దగ్గరికి వెళ్ళింది.

తత్ర గత్వాతు తత్సర్వం వృత్తం తద్యదభూన్మునే ।
అశేషేణ తయా సఖ్యా కథితం గిరిజాగ్రతః ॥32॥

నారదమునీ! అలా లోపలికి వెళ్ళి, గుమ్మం ముందు జరిగిన మొత్తం వృత్తాంతాన్ని పూసగుచ్చినట్టు పార్వతీదేవికి విన్నవించింది.

సఖ్యువాచ – సఖి పలికింది.

అస్మదీయో గణో యో హి స్థితో ద్వారి మహేశ్వరి ।
నిర్భర్త్సయంతి తం వీరాశ్శంకరస్య గణా దృఢమ్ ॥33॥

శివశ్చైవ గణాస్సర్వే వినా తేఽవసరం కథమ్ ।
ప్రవిశంతి హఠాద్గేహే నైతత్ శుభతరం తవ ॥34॥

మహేశ్వరీ! మన గణపతి ఉన్నాడే అతడు ద్వారంలో నిలబడే ఉన్నాడు. శంకరుడి గణాలు – మహావీరులు– అతణ్ని గట్టిగా బెదిరిస్తున్నారు. ఇదేమిటి దేవీ! శంకరుడు గానీ, అతడి గణాలు గానీ, నీ వీలు తెలుసుకోకుండా నీ ఇంటిలోకి హఠాత్తుగా ఎలా ప్రవేశిస్తారు? ఇదేమీ బాగా లేదు. ఇది నీకు ఏ రకంగానూ మంచిది కాదు.

సమ్యక్కృతం హ్యనేనైవ న హి కోఽపి ప్రవేశితః ।
దుఃఖం చైవానుభూయాత్ర తిరస్కారాదికం తథా ॥35॥

మనవాడు చాలా మంచిపని చేశాడు. అంత దుఃఖమూ, అంతపరాభవమూ భరించి అలా నిలబడ్డాడే తప్ప ఒక్కణ్ని కూడా లోపలికి రానివ్వలేదు.

అతః పరం తు వాగ్వాదః క్రియతే చ పరస్పరమ్ ।
వాగ్వాదే చ కృతే నైవ తర్హ్యాయాంతు సుఖేన వై ॥36॥

ఇప్పటికి కూడా వాళ్ళమధ్య వాగ్వాదం నడుస్తూనే ఉంది. ఇలా వాదానికి దిగాక ఇంక వాళ్ళు హాయిగా లోపలికి రానే కూడదు.

కృతశ్చైవాత్ర వాగ్వాదస్తం జిత్వా విజయేన చ ।
ప్రవిశంతు తథా సర్వే నాన్యథా కర్హిచిత్ప్రియే ॥37॥

అస్మిన్నేవాస్మదీయే వై సర్వే సంభర్త్సితా వయమ్ ।
తస్మాద్దేవి త్వయా భద్రే న త్యాజ్యో మాన ఉత్తమః ॥38॥

శివో మర్కటవత్తేఽద్య వర్తతే సర్వదా సతి ।
కిం కరిష్యత్యహంకారమానుకూల్యం భవిష్యతి ॥39॥

మనవాడితో వాగ్వాదానికి దిగారు గదా, అతణ్ని జయించే లోపలికి రావాలి. అంతేగానీ ప్రియా! మరోలా వాళ్ళు రానే రాకూడదు. ఈ అస్మదీయుడి మీదనే మనమందరం ఆధారపడి ఉన్నాం. అందుచేత ఓ దేవీ! ఓ భద్రా! నీ ఉత్తమోత్తమమైన ఆత్మభిమానాన్ని సడలించకు. పార్వతీ! శివుడు నీపట్ల ఇవ్వేళ మరీ కోతిలా ప్రవర్తిస్తున్నాడు. ఏం చేస్తాడేం? అతడి అహంకారం మనకి అనుకూలమే అవుతుంది.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

అహో క్షణం స్థితా తత్ర శివేచ్ఛావశతస్సతీ ॥40॥

మనస్యువాచ సా భూత్వా మానినీ పార్వతీ తదా ॥41॥

ఆహా! శివేచ్ఛకు బద్ధురాలై ఆ పతివ్రత ఒక్కక్షణం ఆగింది. అటుపైని అభిమానవతిగా మారి తన మనస్సులో తానిలా అనుకొంది.

శివోవాచ – పార్వతి అనుకొంది.

అహో క్షణం స్థితో నైవ హఠాత్కారం కథం కృతః ।
కథం చైవాత్ర కర్తవ్యం వినయేనాథవా పునః ॥42॥

భవిష్యతి భవత్యేవ కృతం నైవాన్యథా పునః ।
ఇత్యుక్త్వా తు సఖీ తత్ర ప్రేషితా ప్రియయా తదా ॥43॥

అహో! నాథుడు ఒక్కక్షణం ఆగలేకపోయాడా? హఠాత్కారం ఎందుకు చేశాడబ్బా! ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి? పోనీ అంటే, వినయం సంగతి? సరే జరగవలసిందేదో జరిగే తీరుతుంది. మరోలా అవ్వదు. అని తనకు తాను సమాధానం చెప్పుకుని తన ప్రియసఖిని మళ్ళీ పంపింది.

సమాగత్యాబ్రవీత్సా చ ప్రియయా కథితం హి యత్ ।
తమాచష్ట గణేశం తం గిరిజాతనయం తదా ॥44॥

ఆ చెలికత్తె గణేశుడి దగ్గరికి వచ్చి, పార్వతీదేవి చెప్పమన్న విషయాలు అన్నీ ఆ గిరిజాతనయుడికి చెప్పింది.

సఖ్యువాచ – సఖి పలికింది.

సమ్యక్కృతం త్వయా భద్ర బలాత్తే ప్రవిశంతు న ।
భవదగ్రే గణా హ్యేతే కిం జయంతు భవాదృశమ్ ॥45॥

కృతం చేద్వాకృతం చైవ కర్తవ్యం క్రియతాం త్వయా ।
జితో యస్తు పునర్వాపి న వైరమథవా ధ్రువమ్ ॥46॥

భద్రా! గణేశా! నువ్వు చేసినపని చాలా బాగుంది. శివగణాలు బలాత్కారంగా లోపలికి ప్రవేశించకూడదు. అసలు నీముందు వీళ్ళెంత! నీలాంటి వాణ్ని జయించగలరా? మంచిదో చెడ్డదో, నీ కర్తవ్యం నువ్వు నిర్వహించు. ఒకవేళ ఓడిపోయావనుకో, మంచిదే, మనకింక వీళ్ళతో మళ్ళీ శత్రుత్వం అనేదే ఉండదు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతి శ్రుత్వా వచస్తస్యా మాతుశ్చైవ గణేశ్వరః ।
ఆనందం పరమం ప్రాప బలం భూరి మహోన్నతిమ్ ॥47॥

బద్ధ కక్షస్తథోష్ణీషం బద్ధ్వా జంఘోరు సంస్పృశన్ ।
ఉవాచ తాన్ గణాన్ సర్వాన్ నిర్భయం వచనం ముదా ॥48॥

నారదా! గణేశ్వరుడు తన తల్లిమాటగా ఆ చెలికత్తె చెప్పిన దంతా విన్నాడు. ఆనందపరవశుడయ్యాడు. అతడికి గొప్ప బలం వచ్చింది. ఔన్నత్యం సమకూడింది. నడుం బిగించాడు. తలపాగా సర్దుకున్నాడు. జబ్బలు తొడలు చరిచాడు. నిర్భయంగా ఆనందంగా ఆ శివగణాలతో ఇలా అన్నాడు.

గణేశ ఉవాచ – గణేశుడు అన్నాడు.

అహం చ గిరిజాసూనుర్యూయం శివగణాస్తథా ।
ఉభయే సమతాం ప్రాప్తాః కర్తవ్యం క్రియతాం పునః ॥49॥

నేను పార్వతీపుత్రుణ్ని. మీరు శివగణాలు. అవునా! ఇలా మనది (ఉభయులదీ) సమస్థాయి. కనక మీ కర్తవ్యం మీరు చెయ్యండి. (నా కర్తవ్యం నేను చేస్తాను అని).

భవంతో ద్వారపాలాశ్చ ద్వారపోఽహం కథం న హి ।
భవంతశ్చ స్థితాస్తత్రాహం స్థితోఽత్రేతి నిశ్చితమ్ ॥50॥

భవద్భిశ్చ స్థితం హ్యత్ర యదా భవతి నిశ్చితమ్ ।
తదా భవద్భిః కర్తవ్యం శివాజ్ఞాపరిపాలనమ్ ॥51॥

మీరందరూ ద్వారపాలకులు. నేను కాకపోయానా?, నేనూ ద్వారపాలకుణ్నే. కాకపోతే మీరు అక్కడ శివుడి గుమ్మం ముందు ఉంటారు. నేను ఇక్కడ ఉంటాను. ఇదీ ఏర్పాటు. మీరే వచ్చి ఇక్కడ ఉండటమనేది నిశ్చితమైతే అప్పుడు పార్వతీదేవి ఆజ్ఞను శిరసా వహించడం మీ కర్తవ్యం.

ఇదానీం తు మయా చాత్ర శివాజ్ఞాపరిపాలనమ్ ।
సత్యం చ క్రియతే వీరా నిర్ణీతం మే యథోచితమ్ ॥52॥

తస్మాత్ శివగణాస్సర్వే వచనం శృణుతాదరాత్ ।
హఠాద్వా వినయాద్వా న గంతవ్యం మందిరే పునః ॥53॥

మహావీరులారా! ఇప్పుడు ఇక్కడ నేను చేస్తున్నది అదే – పార్వతి ఆజ్ఞను పాలించడమే. నిజం, అదే నాకు నిర్ణీతం. అదే నేను యథోచితంగా చేస్తున్నాను. అంచేత ఓ శివగణాలవారూ! నా మాటను ఆదరంతో చెవిన బెట్టండి. దౌర్జన్యంతో గానీ సౌజన్యంతోగానీ ఎవ్వరూ ఈ మందిరంలోకి అడుగుపెట్టడానికి వీలులేదు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్తాస్తే గణేశేన సర్వే తే లజ్జితా గణాః ।
యయుశ్శివాంతికం తం వై నమస్కృత్య పురః స్థితాః ॥54॥

స్థిత్వా న్యవేదయన్ సర్వే వృత్తాంతం చ తదద్భుతమ్ ।
కరౌ బద్ధ్వా నతస్కంధాశ్శివం స్తుత్వా పురః స్థితాః ॥55॥

తత్సర్వం తు తదా శ్రుత్వా వృత్తం తత్ స్వగణోదితమ్ ।
లౌకికీం వృత్తిమాశ్రిత్య శంకరో వాక్యమబ్రవీత్ ॥56॥

నారదా! గణేశుడు ఇలా తెగేసి చెప్పేసరికి శివగణాలవారూ లజ్జిత్తులయ్యారు. శివుడి సన్నిధికి పరుగుతీశారు. నమస్కరించి ముందు – శివుణ్ని బహుధా స్తుతించి, నెమ్మదిగా ఈ అద్భుతవృత్తాంతమంతా విన్నవించారు. తన గణాలు చెప్పిన కథ అంత విన్నాడు శివుడు. లోకపద్ధతిని అనుసరించి ఇలా పలికాడు.

శంకర ఉవాచ – శంకరుడు అన్నాడు.

శ్రూయతాం చ గణాస్సర్వే యుద్ధం యోగ్యం భవేన్న హి ।
యూయం చాత్రాస్మదీయా వై స చ గౌరీగణస్తథా ॥57॥

వినయః క్రియతే చేద్వై వశ్యశ్శంభుః స్త్రియా సదా ।
ఇతి ఖ్యాతిర్భవేల్లోకే గర్హితా మే గణా ధ్రువమ్ ॥58॥

గణాలవారూ! మీరంతా వినండి. యుద్ధానికి దిగడం మనకు భావ్యం కాదు. ఎందుకంటే మీరందరూ నా వాళ్ళైనట్టే అతడేమో గౌరీగణం. కనక యుద్ధం భావ్యం కాదు. అలాగని మనం వినయంగా ఊరుకున్నామంటే – శివుడు భార్యా విధేయుడు అనే అపఖ్యాతి లోకమంతటా వ్యాపిస్తుంది. తప్పదు.

కృతే చైవాత్ర కర్తవ్యమితి నీతిర్గరీయసీ ।
ఏకాకీ స గణో బాలః కిం కరిష్యతి విక్రమమ్ ॥59॥

భవంతశ్చ గణా లోకే యుద్ధే చాతివిశారదాః ।
మదీయాశ్చ కథం యుద్ధం హిత్వా యాస్యథ లాఘవమ్ ॥60॥

కవ్విస్తే కయ్యానికి దిగవలసిందే అన్నది గొప్ప రాజనీతి. కానీ గౌరీగణం ఒంటరివాడు. పైగా బాలుడు. ఏమి పరాక్రమం చూపిస్తాడు, ఏమి కవ్విస్తాడు! మీరంతా యుద్ధవిద్యావిశారదులు అని లోకంలో ఖ్యాతి. మదీయులు. మీరు యుద్ధానికి దిగకపోతే అది మీకు చిన్నతనం అవుతుంది.

స్త్రియా గ్రహః కథం కార్యో పత్యురగ్రే విశేషతః ।
కృత్వా సా గిరిజా తస్య నూనం ఫలమవాప్స్యతి ॥61॥

తస్మాత్సర్వే చ మద్వీరాః శృణుతాదరతో వచః ।
కర్తవ్యం సర్వథా యుద్ధం భావి యత్తద్భవత్వితి ॥62॥

అసలింతకీ – భార్య పట్టుదలకీ, పంతానికీ పోవడమేమిటి? అందునా భర్త మీద. ఈ పని చేసింది గిరిజ. ఫలం అనుభవిస్తుంది. అంచేత – ఓ మహావీరులారా! నామాట శ్రద్ధగా ఆలకించండి. అన్నివిధాలా యుద్ధమే మనకు తక్షణకర్తవ్యం. రేపు ఏమైనా కానివ్వండిగాక!

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వా శంకరో బ్రహ్మన్! నానాలీలావిశారదః ।
విరరామ మునిశ్రేష్ఠ! దర్శయన్ లౌకికీం గతిమ్ ॥63॥

ఓ విప్రోత్తమా! మునివరా! నారదా! నానాలీలావిశారదుడైన శివుడు తన లౌకికప్రవృత్తిని ప్రదర్శిస్తూ ఈ మాటలు పలికి ఊరుకున్నాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే గణవివాదవర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు గణవివాదవర్ణనం అనే పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచదశోఽధ్యాయః – పదిహేనవ అధ్యాయం

గణేశ యుద్ధవర్ణనమ్ – గణేశ యుద్ధవర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్తా విభునా తేన నిశ్చయం పరమం గతాః ।
సన్నద్ధాస్తు తదా తత్ర జగ్ముశ్చ శివమందిరమ్ ॥1॥

గణేశోఽపి తథా దృష్ట్వా హ్యాయాంతాన్ గణసత్తమాన్ ।
యుద్ధాటోపం విధాయైవ స్థితాంశ్చైవాబ్రవీదిదమ్ ॥2॥

తమ ప్రభువు శంకరుడు ఇలా చెప్పేసరికి శివగణాలవారందరూ ఒక కచ్చితమైన నిశ్చయానికి వచ్చారు. వెంటనే సన్నద్ధులై పార్వతీమందిరం వైపు వెళ్ళారు. గణేశుడప్పుడు అలా తనవైపు దూసుకువస్తున్న ఆ శివగణాలను తేరిపార చూశాడు. అందరూ యుద్ధాటోపంతో వచ్చి నిలబడ్డారు. అప్పుడు వారితో ఇలా పలికాడు.

గణేశ ఉవాచ – గణేశుడు అన్నాడు.

ఆయాంతు గణపాస్సర్వే శివాజ్ఞాపరిపాలకాః ।
అహమేకశ్చ బాలశ్చ శివాజ్ఞాపరిపాలకః ॥3॥

తథాపి పశ్యతాం దేవీ పార్వతీ సూనుజం బలమ్ ।
బలవద్బాలయుద్ధం చ భవానీ శివపక్షయోః ॥4॥

శివుడి ఆజ్ఞను శిరసావహించే గణనాయకులారా! రండి! మీరందరూ రండి!! నేను ఏకాకిని. బాలుణ్ని. అయితేనేమి, శివాదేవి ఆజ్ఞను శిరసా వహించేవాణ్ని. ఇవ్వేళ – నా తల్లి పార్వతీదేవి ఈ తనయుడి బలపరాక్రమాలను తిలకిస్తుందిగాక! అలాగే శివుడూ తన గణాల శక్తిసామర్థ్యాలను తిలకించుగాక! ఇది బలవంతులకీ, బాలుడికీ జరుగుతున్న యుద్ధం. పార్వతీ – పరమేశ్వరపక్షాలకు జరుగుతున్న యుద్ధం!

భవద్భిశ్చ కృతం యుద్ధం పూర్వం యుద్ధవిశారదైః ॥5॥

మయా పూర్వం కృతం నైవ బాలోఽస్మి క్రియతేఽధునా ।
తథాపి భవతాం లజ్జా గిరిజాశివయోరపి ॥6॥

మమైవంతు భవేన్నైవ వైపరీత్యం భవిష్యతి ।
మమైవ భవతాల్లజ్జా గిరిజాశివయోరిహ ॥7॥

అయితే, మీరందరూ ఇంతకుపూర్వం చాలా యుద్ధాలు చేశారు. యుద్ధనిపుణులు మీరు. నేనింతవరకూ యుద్ధమే ఎరగను. బాలుణ్ని. ఇప్పుడే చేస్తున్నాను. కనక మీరు ఓడిపోయి సిగ్గుపడవలసివస్తే (మీకు సిగ్గయితే) అది మీకే కాదు గిరిజాశివులకూ చెందుతుంది. నా విషయంలో అలా కాదు. దీనికి భిన్నంగా జరుగుతుంది. నేను ఓడిపోయి సిగ్గుపడవలసి వస్తే (నా సిగ్గు) అదీ గిరిజాశంకరులకే చెందుతుంది. నాకు కాదు.

ఏవం జ్ఞాత్వా చ కర్తవ్యః సమరశ్చ గణేశ్వరాః ।
భవద్భిః స్వామినం దృష్ట్వా మయా చ మాతరం తదా ॥8॥

క్రియతే కీదృశం యుద్ధం భవితవ్యం భవత్వితి ।
తస్య వై వారణే కోఽపి న సమర్థస్త్రిలోకకే ॥9॥

శివగణేశ్వరులారా! ఈ విషయాన్ని గుర్తుంచుకుని మనం యుద్ధం చెయ్యాలి. మీరు మీ స్వామిని చూసీ, నేను మా అమ్మను చూసీ సమరం సాగించాలి. అంటే, మనం ఎటువంటి యుద్ధం చెయ్యాలి? జరగవలసిందేదో జరుగుతుంది. దాన్ని వారించగలిగిన సమర్థుడు ముల్లోకాలలోనూ లేడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యేవం భర్త్సితాస్తే హి దండభూషితబాహవః ।
వివిధాన్యాయుధాన్యేవం ధృత్వా తే చ సమాయయుః ॥10॥

ఘర్షయంతస్తదా దంతాన్ హుంకృత్య చ పునః పునః ।
పశ్య పశ్య బ్రువంతశ్చ గణాస్తే సముపాగతాః ॥11॥

గణేశుడు ఇలా బెదిరించేసరికి ఆ మహావీరులు కొందరు దండపాణులై, ఇంకా మరికొందరు మరిన్ని రకాల ఆయుధాలు చేపట్టి, అతణ్ని చుట్టుముట్టారు. పళ్ళు పటపటలాడిస్తూ, మాటిమాటికీ హుంకరిస్తూ, చూడరా చూడరా అని ఒకరినొకరు హెచ్చరించుకుంటూ ఆ శివగణాలు మీదమీదకి వచ్చారు.

నందీ ప్రథమమాగత్య ధృత్వా పాదం వ్యకర్షయత్ ।
ధావన్ భృంగీ ద్వితీయం చ పాదం ధృత్వా గణస్య చ ॥12॥

యావత్పాదౌ వికర్షంతౌ తావత్ హస్తేన వై గణః ।
ఆహత్య హస్తయోస్తాభ్యాముత్క్షిప్తౌ పాదకౌ స్వయమ్ ॥13॥

అందరికన్నా ముందు నందీశ్వరుడు వచ్చాడు. వస్తూనే గణపతి కాలు పట్టుకొని లాగబోయాడు. అతడి వెనకనే భృంగీశుడు పరుగుపరుగున వచ్చి రెండవ కాలు పట్టుకొని ఈడ్వబోయాడు. వారి ప్రయత్నాలు కార్యరూపం దాల్చేలోపలే గణేశుడు ఇద్దరినీ బలంగా చరిచాడు. వాళ్ళ చేతుల నుంచి తన కాళ్ళను విడిపించుకున్నాడు.

అథ దేవీసుతో వీరః సంగృహ్య పరిఘం బృహత్ ।
ద్వారస్థితో గణపతిః సర్వానాబోధయత్తదా ॥14॥

కేషాంచిత్పాణయో భిన్నాః కేషాంచిత్ పృష్ఠకాని చ ।
కేషాంచిచ్ఛ శిరాంస్యేవ కేషాంచిన్మస్తకాని చ ॥15॥

కేషాంచిజ్జానునీ తత్ర కేషాంచిత్ స్కంధకాస్తథా ।
సమ్ముఖే చాగతా యే వై తే సర్వే హృదయే హతాః ॥16॥

వెంటనే సన్నద్ధుడై ఆ దేవీసుతుడు ఒక మహాపరిఘను (ఇనుప దూలం) అందుకున్నాడు. తాను గుమ్మంలోనే నిలబడి అందినవాడిని అందినట్టు చావబాదాడు. కొందరికి చేతులు విరిగాయి. కొందరికి వీపులు చితికాయి. కొందరికి తలలు పగిలాయి. కొందరికి మెదళ్ళు ప్రిదిలాయి. కొందరికి కాళ్ళు ముక్కలయ్యాయి. కొందరికి మెడలు తెగాయి. ఎదురుగా వచ్చినవాడికల్లా గుండెలు చీలాయి.

కేచిచ్చ పతితా భూమౌ కేచిచ్చ విదిశో గతాః ।
కేషాంచిచ్చరణౌ ఛిన్నౌ కేచిత్ శర్వాంతికం గతాః ॥17॥

తేషాం మధ్యే తు కశ్చిద్వై సంగ్రామే సమ్ముఖో నహి ।
సింహం దృష్ట్వా యథా యాంతి మృగాశ్చైవ దిశో దశ ॥18॥

తథా తే చ గణాస్సర్వే గతాశ్చైవ సహస్రశః ।
పరావృత్య తథా సోఽపి సుద్వారి సముపస్థితః ॥19॥

కొందరు శివగణాలు నేలకు రాలిపోయారు. కొందరు దిక్కులు పట్టి పారిపోయారు. కొందరి కాళ్ళు తెగిపోయాయి. కొందరేమో శివుడి సన్నిధికి పరుగెత్తారు. మొత్తంమీద వారిలో ఏ ఒక్కడూ యుద్ధానికి సిద్ధంగా లేడు. అడవిలో సింహాన్ని చూసిన మృగాల్లాగా శివగణాలవారు చెల్లాచెదురై తలకొక దిక్కుకి పారిపోయారు. అప్పుడు గణపతి వెనుదిరిగి వచ్చి, గుమ్మం ముందు స్తిమితంగా నిలబడ్డాడు.

కల్పాంతకరణే కాలో దృశ్యతే చ భయంకరః ।
యథా తథైవ దృష్టస్స సర్వేషాం ప్రళయంకరః ॥20॥

కల్పాంతసమయంలో మహాకాలుడు ఎంత భయంకరంగా ఉంటాడో అలా. అందరి కన్నులకీ గణపతి – ప్రళయంకరుడై కనిపించాడు.

ఏతస్మిన్ సమయే చైవ సరమేశసురేశ్వరాః ।
ప్రేరితా నారదేనేహ దేవాస్సర్వే సమాగమన్ ॥21॥

సమబ్రువన్ తదా సర్వే శివస్య హితకామ్యయా ।
పురః స్థిత్వా శివం నత్వా హ్యాజ్ఞాం దేహి ప్రభో ఇతి ॥22॥

నారదా! ఆ సమయంలో నీ ప్రేరణ మేరకు విష్ణుమూర్తి, ఇంద్రుడు మొదలైన దేవతలందరూ శివుడి దగ్గరికి వచ్చారు. శివుడి హితంకోరి అలా వచ్చినవారై అతడి ఎదుట నమస్కరించి నిలిచి – మహాప్రభూ! ఆజ్ఞాపించు – అని సవినయంగా అభ్యర్థించారు.

త్వం పరం బ్రహ్మ సర్వేశస్సర్వే చ తవ సేవకాః ।
సృష్టేః కర్తా చ భర్తా చ సంహర్తా పరమేశ్వరః ॥23॥

రజస్సత్త్వతమోరూపో లీలయా నిర్గుణః స్వతః ।
కా లీలా రచితా చాద్య తామిదానీం వదప్రభో ॥24॥

పరమేశ్వరా! నువ్వే పరబ్రహ్మవు. సర్వేశుడివి. మేమంతా నీ సేవకులం. ఈ సృష్టికి కర్తవూ, భర్తవూ, సంహర్తవూ నువ్వే. స్వతస్సిద్ధంగా నువ్వు నిర్గుణుడివి. కానీ ఒక లీలావిశేషంగా సత్త్వరజస్తమస్స్వరూపుడివి అవుతూ ఉంటావు. ఇప్పుడు నువ్వు ఏ లీలావిశేషాన్ని కల్పించావో దయచేసి మాకు ఎరుకపరచు మహాప్రభూ!!

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తేషాం మునిశ్రేష్ఠ! మహేశ్వరః ।
గణాన్ భిన్నాన్ తదా దృష్ట్వా తేభ్యస్సర్వం న్యవేదయత్ ॥25॥

అథ సర్వేశ్వరస్తత్ర శంకరో మునిసత్తమ ।
విహస్య గిరిజానాథో బ్రహ్మాణం మామువాచ హ ॥26॥

మునిశ్రేష్ఠా! నారదా! దేవతల ఈ అభ్యర్థనను ఆలకించి మహేశ్వరుడు, అప్పటికే చెల్లాచెదురైపోయిన తన గణాలను తిలకించినవాడై సమస్తమూ దేవతలకు తెలియపరిచాడు. అటుపిమ్మట ఓ మునిసత్తమా! ఆ సర్వేశ్వరుడు, ఆ శంకరుడు ఆ గిరిజానాథుడు చిన్నగా నవ్వి బ్రహ్మనైన నాతో ఇలా అన్నాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

బ్రహ్మన్! శృణు మమ ద్వారి బాల ఏకస్సమాస్థితః ।
మహాబలో యష్టిపాణిర్గేహావేశ నివారకః ॥27॥

మహాప్రహారకర్తాసౌ మత్పార్షదవిఘాతకః ।
పరాజయః కృతస్తేన మద్గణానాం బలాదిహ ॥28॥

బ్రహ్మన్! త్వయైవ గంతవ్యం ప్రసాద్యోఽయం మహాబలః ।
యథా బ్రహ్మన్ నయః స్యాద్వై తథా కార్యం త్వయా విధే ॥29॥

బ్రహ్మదేవుడా! విను. నా ఇంటి గుమ్మం ముందు ఒకబాలుడు నిలబడ్డాడు. మహాబలశాలి. కర్ర ఒకటి చేతబట్టి నిలబడ్డాడు. ఇంటిలోకి వెళ్ళనివ్వడం లేదు. చావగొడుతున్నాడు. నా సేవకుల్ని చావబాదాడు. అతడి బలం ముందు నా గణాలవారందరూ పరాజయం పాలయ్యారు. అందుచేత ఓ చతుర్ముఖా! నువ్వే వెళ్ళాలి. ఆ మహాబాలుణ్ని ప్రసన్నం చెయ్యాలి. ఓ విరించీ! ఓ విధీ! ఒక నీతిగా, ఒక పద్ధతిగా ఉండేట్టు ఏదో ఒకటి నువ్వే చెయ్యాలి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యాకర్ణ్య ప్రభోర్వాక్యమజ్ఞాత్వా జ్ఞానమోహితః ।
తదీయ నికటం తాత! సర్వైః ఋషివరైరయామ్ ॥30॥

సమాయాంతం చ మాం దృష్ట్వా స గణేశో మహాబలీ ।
క్రోధం కృత్వా సమభ్యేత్య మమ శ్మశ్రూణ్యవాకిరత్ ॥31॥

శివుడి ఈ అభ్యర్థనతో నన్ను ఒక అజ్ఞానం కమ్ముకుంది. అతడి బలపరాక్రమాలు ఎరగక నాయనా! నేను ఋషీశ్వరుల నందరినీ వెంట బెట్టుకుని అతడి దగ్గిరికి వెళ్ళాను. చేరవస్తున్న నన్ను చూసి ఆ మహాబలశాలి గణేశుడు క్రోధవివశుడయ్యాడు. మీదమీదకు వచ్చి మీసాలు పట్టి గుంజాడు.

క్షమ్యతాం క్షమ్యతాం దేవ న యుద్ధార్థం సమాగతః ।
బ్రాహ్మణోఽహమనుగ్రాహ్యః శాంతికర్తానుపద్రవః ॥32॥

ఇత్యేవం బ్రువతి బ్రహ్మన్! తావత్పరిఘమాదదే ।
స గణేశో మహావీరో బాలోఽబాలపరాక్రమః ॥33॥

క్షమించు, క్షమించు మహాదేవా! నేను యుద్ధానికి రాలేదు. బ్రాహ్మణుణ్ని. అనుగ్రహించు. శాంతికర్తను. నావల్ల ఏ ఉపద్రవమూ లేదు. అని నేను మొరపెడుతూనే ఉన్నాను విప్రా! నారదా! అంతలోనే ఆ మహావీరుడు గణపతి ఒక పరిఘను అందుకున్నాడు. అతడు బాలుడే కానీ ప్రౌఢపరాక్రమశాలి.

గృహీతపరిఘం దృష్ట్వా తం గణేశం మహాబలమ్ ।
పలాయనపరో యాతస్త్వహం ద్రుతతరం తదా ॥34॥

యాత యాత బ్రువంతస్తే పరిఘేన హతాస్తదా ।
స్వయంచ పతితాః కేచిత్కేచిత్తేన నిపాతితాః ॥35॥

ఆ మహాబలి గణేశుడు అలా పరిఘు అందుకోవడం గమనించి నేను మహావేగంగా పారిపోయాను. మిగతా మహర్షులు సైతం పారిపొండి– పారిపొండి అని హెచ్చరించుకుంటూండగానే కొందరికి పరిఘు దెబ్బ తగలనే తగిలింది. కొందరు పరిగెత్తుతూ తమంత తాము పడితే, మరికొందరిని అతడు పడగొట్టాడు.

కేచిచ్చ శివసామీప్యం గత్వా తత్క్షణమాత్రతః ।
శివం విజ్ఞాపయాంచక్రుస్తద్వృత్తాంతమశేషతః ॥36॥

తథావిధాంశ్చ తాన్ దృష్ట్వా తద్వృత్తాంతం నిశమ్య సః ।
అపారమాదధే కోపం హరో లీలావిశారదః ॥37॥

కొందరైతే పరుగుపరుగున శివుడి దగ్గరికి వెళ్ళారు. జరిగింది అంతా విన్నవించారు. గాయాలపాలై అలా ఉన్న శివగణాలను చూసీ, వారు చెప్పినది వినీ హరుడు–లీలా విశారదుడు–అపారంగా కోపవివశుడు అయ్యాడు.

ఇంద్రాదికాన్ దేవగణాన్ షణ్ముఖప్రవరాన్ గణాన్ ।
భూతప్రేతపిశాచాంశ్చ సర్వానాదేశయత్తదా ॥38॥

తే సర్వే చ యథాయోగ్యం గతాస్తే సర్వతో దిశమ్ ।
తం గణం హంతుకామా హి శివాజ్ఞాత ఉదాయుధాః ॥39॥

వెంటనే – ఇంద్రుడి నాయకత్వంలోని దేవగణాలనూ, షణ్ముఖుడి నేతృత్వంలోని శివగణాలనూ, ఇంకా భూతప్రేత పిశాచాదులనూ – అందరినీ ఆజ్ఞాపించాడు. వారందరూ యథాయోగ్యంగా అన్ని వైపులకూ బయలు దేరారు. శివుడి ఆన కాబట్టి ఆయుధధారులై ఆ గణపతిని సంహరించడం కోసం బయలుదేరారు.

యస్య యస్యాయుధం యచ్చ తత్తత్సర్వం విశేషతః ।
తద్గణేశోపరి బలాత్సమాగత్య విమోచితమ్ ॥40॥

అలా అందరూ అన్ని వైపుల నుంచీ మోహరించి బలీయసులై ఎవరి విశిష్ట ఆయుధాలను వారు గణేశుడి మీద విశేషంగా ప్రయోగించారు.

హాహాకారో మహానాసీత్ త్రైలోక్యే సచరాచరే ।
త్రిలోకస్థా జనాస్సర్వే సంశయం పరమం గతాః ॥41॥

న యాతం బ్రహ్మణోఽప్యాయుః బ్రహ్మాండక్షయమేతి హి ।
అకాలే చ తథా నూనం శివేచ్ఛావశతః స్వయమ్ ॥42॥

నారదా! చరాచరజీవరాశితో నిండిన ముల్లోకాలలోనూ హాహాకారాలు మిన్నుముట్టాయి. ముల్లోకాలలోనూ ఉన్న జనులందరికీ ఒక మహాసంశయం కలిగింది. బ్రహ్మదేవుడికి ఆయువు ఇంకా మూడలేదు, అయినా బ్రహ్మాండం నాశనమైపోతుంది ఏమిటి! కచ్చితంగా ఇది శివేచ్ఛ. అందుకే అకాలంలో ఇది ఇలా తనంత తానుగా నాశనమైపోతోంది! అని.

తే సర్వే చాగతాస్తత్ర షణ్ముఖాద్యాశ్చ యే పునః ।
దేవా వ్యర్థాయుధా జాతా ఆశ్చర్యం పరమం గతాః ॥43॥

గణేశుణ్ని అలా చుట్టుముట్టిన షణ్ముఖాదులు ప్రయోగించిన విశిష్ట ఆయుధాలన్నీ వృథా అయిపోయాయి. అది చూసి అందరూ విస్తుపోయారు.

ఏతస్మిన్నంతరే దేవీ జగదంబా విబోధనా ।
జ్ఞాత్వా తచ్చరితం సర్వమపారం క్రోధమాదధే ॥44॥

శక్తిద్వయం తదా తత్ర తయా దేవ్యా మునీశ్వర ।
నిర్మితం స్వగణస్యైవ సర్వసాహాయ్యహేతవే ॥45॥

ఇంతలో – జ్ఞానస్వరూపిణి జగన్మాత ఈ వృత్తాంతమంతా తెలుసుకుంది. అంతులేని క్రోధం ఆమెను ఆవేశించింది. నారదమునీశ్వరా! తన గణపతికి అన్నివిధాలా సహాయంగా నిలవడం కోసమని వెంటనే ఇద్దరు శక్తిస్వరూపిణులను సృష్టించింది.

ఏకా ప్రచండరూపం చ ధృత్వాతిష్ఠన్మహామునే ।
శ్యామపర్వతసంకాశం విస్తీర్య ముఖగహ్వరమ్ ॥46॥

ఏకా విద్యుత్స్వరూపా చ బహుహస్తసమన్వితా ।
భయంకరా మహాదేవీ దుష్టదండవిధాయినీ ॥47॥

మహామునీ! వారిలో ఒక శక్తిస్వరూపిణి కాటుక కొండలాగా ప్రచండరూపం ధరించి, తన నోటిని మహాగుహలాగా తెరిచి నిలబడింది. రెండవ శక్తి – ఆకృతిదాల్చిన మెరుపులాగా ఉంది. వందల చేతులతో భీకరంగా ఉంది. దుష్టల్ని దండించడానికే అవతరించిన మహాదేవి.

ఆయుధాని చ సర్వాణి మోచితాని సురైర్గణైః ।
గృహీత్వా స్వముఖే తాని తాభ్యాం శీఘ్రం చ చిక్షిపే ॥48॥

దేవాయుధం న దృశ్యేత పరిఘుః పరితః పునః ।
ఏవం తాభ్యాం కృతం తత్ర చరితం పరమాద్భుతమ్ ॥49॥

దేవతలూ, శివగణాలూ గణపతి మీదకు ప్రయోగించిన ఆయుధాలను అన్నింటినీ ఈ శక్తిస్వరూపిణులిద్దరూ తమవైపు లాక్కొని, వెంటనే వాటినే వారిమీదకు (ఎవరు ప్రయోగించింది వారికే తగిలేట్టు) విసిరారు. గణపతి ఉపయోగిస్తున్న పరిఘు అనే ఆయుధానికి చుట్టుపక్కల ఎక్కడా దేవగణాల ఆయుధమన్నదే కనిపించలేదు. ఇలా ఒక అద్భుతకృత్యాన్ని వారు ఆచరించారు.

ఏకో బాలో ఽఖిలం సైన్యం లోడయామాస దుస్తరమ్ ।
యథా గిరివరేణైవ లోడితస్సాగరః పురా ॥50॥

ఏకేన నిహతాస్సర్వే శక్రాద్యా నిర్జరాస్తథా ।
శంకరస్య గణాశ్చైవ వ్యాకులా అభవంస్తదా ॥51॥

అథ సర్వే మిళిత్వా తే నిఃశ్వస్య చ ముహుర్ముహుః ।
పరస్పరం సమూచుస్తే తత్ప్రహార సమాకులాః ॥52॥

నారదా! వెనకటికి మందరగిరివరం క్షీరసాగరాన్ని మథించినట్లు ఒకే ఒక్క బాలుడు అపారమైన సమస్త దేవ–గణసైన్యాన్ని అల్లకల్లోలం చేసిపారేశాడు. ఇంద్రాది సకలదేవతలూ ఒక్కడి చేతిలోనే ఓడిపోయారు. శంకరగణాలు అందరూ కుమిలిపోయారు. ఇలా దెబ్బతిన్న వారందరూ నిట్టూర్పులూ, నిరుత్సాహాలతో ఒకచోట గుమికూడి తమలో తాము చర్చించుకున్నారు.

దేవగణా ఊచుః – దేవగణాలు అన్నారు.

కిం కర్తవ్యం క్వ గంతవ్యం న జ్ఞాయంతే దిశో దశ ।
పరిఘుం భ్రామయత్యేష సవ్యాపసవ్యమేవ చ ॥53॥

ఏం చెయ్యాలి, ఎక్కడికి పోవాలి? దిక్కు తోచడం లేదు. ఈ బాలుడు కుడీ ఎడమా అన్న తేడా లేకుండా తన పరిఘును ఒకటే తిప్పుడు తిప్పుతున్నాడు. ఏం చెయ్యాలి, ఎక్కడికి పోవాలి?

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఏతత్కాలేఽప్సరః శ్రేష్ఠాః పుష్పచందనపాణయః ।
ఋషయశ్చ త్వదాద్యా హి యేఽతియుద్ధేఽతిలాలసాః ॥54॥

తే సర్వే చ సమాజగ్ముర్యుద్ధసందర్శనాయ వై ।
పూరితో వ్యోమ సన్మార్గః తైస్తదా మునిసత్తమ ॥55॥

అదే సమయంలో పువ్వులూ, మంచిగంధమూ మొదలైన పూజాసామగ్రిని చేత బట్టుకుని, దేవ కాంతామణులూ, నీవంటి ఋషులూ మహాయుద్ధాన్ని దర్శించాలనే ఉత్కంఠకలవారందరూ అక్కడికి చేరుకున్నారు. నారదమునిసత్తమా! ఇలా వచ్చిన యుద్ధ సందర్శకులతో ఆకాశమంతా నిండిపోయింది.

తాస్తే దృష్ట్వా రణం తం వై మహావిస్మయమాగతాః ।
ఈదృశం పరమం యుద్ధం న దృష్టం చైకదాపి హి ॥56॥

'ఇలాంటి మహాయుద్ధాన్ని ఏనాడూ చూసి ఎరగము' అని ఆ సందర్శకులు ఆడామగా అందరూ నిబిడాశ్చర్యంతో నివ్వెరపోయారు.

పృథివీ కంపితా తత్ర సముద్రసహితా తదా ।
పర్వతాః పతితాశ్చైవ చక్రుస్సంగ్రామసంభవమ్ ॥57॥

ద్యౌ ర్గ్రహర్క్షగణైః ఘూర్ణా సర్వే వ్యాకులతాం గతాః ।
దేవాః పలాయితా స్సర్వే గణాశ్చ సకలాస్తదా ॥58॥

నారదా! ఈ మహాసంగ్రామానికి ఫలితమన్నట్టు – సముద్రసప్తకసహితంగా భూమి కంపించింది. మహాపర్వతాలు కుప్పకూలిపోయాయి. గ్రహనక్షత్రసమూహసహితంగా ఆకాశం ఘూర్ణిల్లింది. అందరూ వ్యాకులితులయ్యారు. దేవసైనికులూ, శివగణాలూ అందరూ పలాయనం చిత్తగించారు.

కేవలం షణ్ముఖస్తత్ర నాపలాయత విక్రమీ ।
మహావీరస్తదా సర్వానావార్య పురతః స్థితః ॥59॥

కేవలం మహావిక్రమ మహావీరుడు షణ్ముఖుడొక్కడు పారిపోకుండా నిలబడ్డాడు. అందరినీ నిలువరించి ఎట్టయెదుట నిలిచాడు.

శక్తిద్వయేన తద్యుద్ధే సర్వే చ నిష్ఫలీకృతాః ।
సర్వాస్త్రాణి నికృత్తాని సంక్షిప్తాన్యమరైర్గణైః ॥60॥

ఆ మహాయుద్ధంలో శక్తి స్వరూపిణులిద్దరి చేత మహావీరులందరూ నిష్ఫలులైపోయారు. దేవతలూ, శివగణాలూ ప్రయోగించిన ఆయుధాలన్నీ తుత్తునియలైపోయాయి.

యేఽవస్థితాశ్చ తే సర్వే శివస్యాంతికమాగతాః ।
దేవాః పలాయితాస్సర్వే గణాశ్చ సకలాస్తదా ॥61॥

తే సర్వే మిళితాశ్చైవ ముహుర్ముహ్వా శివం తదా ।
అబ్రువన్వచనం క్షిప్రం కోఽయం గణవరః ప్రభో ॥62॥

రణరంగంలో మిగిలినవారందరూ శివుడి చెంతకు చేరుకున్నారు. పారిపోయిన దేవతలూ, శివగణాలూ అంత మెల్లగా గుమికూడి శివుణ్ని మరీమరీ నమస్కరిస్తూ వచ్చి చేరారు. అందరూ ఏకకంఠంగా ఒక్కటే అడిగారు– మహాప్రభో! ఈ గణపతి ఎవడు? అని.

పురా చైవ శ్రుతం యుద్ధమిదానీం బహుధా పునః ।
దృశ్యతే న శ్రుతం దృష్టమీదృశం తు కదాచన ॥63॥

కించిద్విచార్యతాం దేవ త్వన్యథా న జయో భవేత్ ।
త్వమేవ రక్షకః స్వామిన్! బ్రహ్మాండస్య న సంశయః ॥64॥

పూర్వకాలంలో యుద్ధాల గురించి చాలా విన్నాం. ఇప్పుడూ వింటున్నాం. కానీ మహాప్రభూ! ఇలాంటి యుద్ధం మాత్రం ఏనాడూ కన్నదీ కాదు, విన్నదీ కాదు. మహాదేవా! దీని సంగతి కొంచెం ఆలోచించు. లేకపోతే మనకు జయం లభించదు. స్వామీ! ఈ బ్రహ్మాండానికంతటికీ నువ్వే రక్షకుడివి. సంశయం లేదు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యేవం తద్వచః శ్రుత్వా రుద్రః పరమకోపనః ।
కోపం కృత్వా చ తత్రైవ జగామ స్వగణైస్సహ ॥65॥

దేవసైన్యం చ తత్సర్వం విష్ణునా చక్రిణా సహ ।
సముత్సవం మహత్ కృత్వా శివస్యానుజగామ హ ॥66॥

వారందరూ పలికిన ఈ మాటలు విని, పరమకోపనుడు రుద్రుడు అదే కోపంతో తన గణాలను వెంటబెట్టుకుని గణపతి వైపు బయలుదేరాడు. దేవసైన్యం మొత్తం – చక్రధారి శ్రీమహావిష్ణువుతో సహా – శివుడికి మహోత్సవం జరిపి అతడివెంట నడిచింది.

ఏతస్మిన్నంతరే భక్త్యా నమస్కృత్య మహేశ్వరమ్ ।
అబ్రవీన్నారద త్వం వై దేవదేవం కృతాంజలిః ॥67॥

ఇంతలోకీ నారదా! నువ్వే అక్కడికి వచ్చావు. మహేశ్వరుడికి భక్తితో నమస్కరించావు. అలా అంజలి బంధంతో నిలబడి నువ్విలా పలికావు.

నారద ఉవాచ – నారదుడు అన్నాడు.

దేవదేవ! మహాదేవ! శృణు మద్వచనం విభో ।
త్వమేవ సర్వగః స్వామీ నానాలీలవిశారదః ॥68॥

త్వయా కృత్వా మహాలీలాం గణగర్వోఽపహారితః ।
అస్మై దత్త్వా బలం భూరి దేవగర్వశ్చ శంకర ॥69॥

దర్శితం భువనే నాథ స్వమేవ బలమద్భుతమ్ ।
స్వతంత్రేణ త్వయా శంభో సర్వగర్వాపహారిణా ॥70॥

దేవదేవా! మహాదేవా! నా మనవి ఆలించు విభూ! నువ్వే స్వామివి. నువ్వే సర్వగామివి. నువ్వే నానాలీలావిశారదుడివి. ఇలా ఒక మహాలీలను ఆచరించి శివగణాల అహంకారాన్ని తొలగించావు. ఈ బాల గణపతికి మహాబలాన్ని నువ్వే ప్రసాదించి దేవతల గర్వాన్ని అణిచివేశావు. శంకరా! జగన్నాథా! శంభూ! సర్వగర్వాపహారివై స్వతంత్రంగా నీ అంతట నువ్వుగా నీ అత్యద్భుతసత్త్వాన్ని ఇలా లోకానికి ప్రదర్శించావు.

ఇదానీం చ కురుష్వేశ! తాం లీలాం భక్తవత్సల ।
స్వగణానమరాంశ్చాపి సుసమ్మాన్యాభివర్ధయ ॥71॥

ఇమం న ఖేలయేదానీం జహి బ్రహ్మపదప్రద ।
ఇత్యుక్త్వా నారద! త్వం వై హ్యంతర్ధానం గతస్తదా ॥72॥

భక్తవత్సలా! మహేశా! ఇప్పుడు నీ లీలలను మరింక కొనసాగించకు. నీ గణాలనూ, దేవతలనూ సమ్మానించి వర్ధిల్లజెయ్యి. భక్తులకు బ్రహ్మపదాన్ని ప్రసాదించేవాడా! ఇప్పుడీ క్రీడను మరింక ఆడించకు. దయచేసి విడిచిపెట్టు. నారదా! నువ్విలా విన్నవించి వెంటనే అక్కడి నుంచి నిష్క్రమించావు.

ఇతి శ్రీ శివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే గణేశయుద్ధవర్ణనం నామ పంచదశోఽధ్యాయః ॥15॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు గణేశయుద్ధవర్ణనం అనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.

షోడశోఽధ్యాయః – పదహారవ అధ్యాయం

గణేశయుద్ధ గణేశశిరశ్ఛేదన వర్ణనమ్ – గణేశయుద్ధ గణేశశిరశ్ఛేద వర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతి శ్రుత్వా మహేశానో భక్తానుగ్రహకారకః ।
త్వద్వాచా యుద్ధకామోఽభూత్తేన బాలేన నారద ॥1॥

విష్ణుమాహూయ సమ్మంత్ర్య బలేన మహతా యుతః ।
సామరస్సమ్ముఖస్తస్యా ప్యభూద్దేవస్త్రిలోచనః ॥2॥

నారదా! భక్తానుగ్రహశీలి మహేశునికి నీ మాటలు విన్నాక అదేమిటో ఆ బాలగణపతితో యుద్ధం చెయ్యాలన్న కోరిక గాఢమయ్యింది. విష్ణుమూర్తిని పిలిచి సమాలోచన జరిపాడు. మహాసైన్యంతో, అమరులతో కలిసి ఆ ముక్కంటి బాలగణపతి ఎట్టయెదుట నిలిచాడు.

దేవాశ్చ యుయుధుస్తేన స్మృత్వా శివపదాంబుజమ్ ।
మహాబలా మహోత్సాహాశ్శివసద్దృష్టిలోకితాః ॥3॥

యుయుధేఽథ హరిస్తేన మహాబలపరాక్రమః ।
మహాదివ్యాయుధో వీరః ప్రవణః శివరూపకః ॥4॥

శివుడి పాదపద్మాలను స్మరించి దేవతలు ఆ బాలుడితో మళ్ళీ యుద్ధానికి దిగారు. అందరూ మహాబలులు. మహోత్సాహులు. శివుడి కృపావీక్షణాలను అందుకున్నవారు. మళ్ళీ యుద్ధానికి దిగారు. అగ్రభాగాన శ్రీమహావిష్ణువు. మహాబల పరాక్రమశాలి. మహాదివ్యాయుధధారి. మహావీరుడు. యుద్ధనిపుణుడు. శివస్వరూపుడు – శుభస్వరూపుడు. స్వయంగా గణపతితో మళ్ళీ తలపడ్డాడు.

యష్ట్యా గణాధిపస్సోఽథ జఘానామరపుంగవాన్ ।
హరిం చ సహసా వీరః శక్తిదత్తమహాబలః ॥5॥

సర్వేఽమరగణాస్తత్ర వికుంఠితబలా మునే ।
అభూవన్ విష్ణునా తేన హతా యష్ట్యా పరాఙ్ముఖాః ॥6॥

అప్పుడా గణాధిపతి తన యష్టితో అమరపుంగవుల్ని అందరినీ చితకబాదాడు. శక్తి అనుగ్రహించిన మహాబలం అతడిది. ఆ వీరుడు శ్రీహరిని సైతం అనూహ్యంగా కొట్టాడు. నారదమునీ! దేవ – శివగణాల వారందరూ శ్రీహరితో సహా సత్త్వహీనులయ్యారు. అతడి యష్టిదెబ్బకు వెనుదిరిగారు.

శివోఽపి సహ సైన్యేన యుద్ధం కృత్వా చిరం మునే ।
వికరాళం చ తం దృష్ట్వా విస్మయం పరమం గతః ॥7॥

ఛలేనైవ చ హంతవ్యో నాన్యథా హన్యతే పునః ।
ఇతి బుద్ధిం సమాస్థాయ సైన్యమధ్యే వ్యవస్థితః ॥8॥

నారదమునీ! సేనాసమేతుడై నిలిచి శివుడు సైతం చాలాకాలం యుద్ధంచేసి చెక్కుచెదరని గణపతిని చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు. ఇతణ్ని ఏదో ఒక మోసంతో జయించాలే తప్ప మరోలా చంపడం సాధ్యం కాదు అనే నిశ్చయానికి వచ్చాడు. అలా సైన్యమధ్యంలో నిలబడ్డాడు.

శివే దృష్టే తదా దేవే నిర్గుణే గుణరూపిణి ।
విష్ణౌ చైవాథ సంగ్రామే ఆయాతే సర్వదేవతాః ॥9॥

గణాశ్చైవ మహేశస్య మహాహర్షం తదా యయుః ।
సర్వే పరస్పరం ప్రీత్యా మిలిత్వా చక్రురుత్సవమ్ ॥10॥

నామరూపరహితుడైన మహాదేవుడు నామరూపధారియై తమ మధ్య అప్పుడు అలా కనిపిస్తూ ఉండగా, విష్ణుమూర్తి స్వయంగా సంగ్రామరంగానికి వచ్చి నిలబడగా సకలదేవతలూ, సకలశివగణాలూ మహాహర్షం పొందారు. అందరూ పరస్పరం ప్రేమగా గుమికూడి మహోత్సవం జరుపుకున్నారు.

అథ శక్తిసుతో వీరో వీరగత్యా స్వయుష్టితః ।
ప్రథమం పూజయామాస విష్ణుం సర్వసుఖావహమ్ ॥11॥

అహం చ మోహయిష్యామి హన్యతాం చ త్వయా విభో ।
ఛలం వినా న వధ్యోఽయం తామసోఽయం దురాసదః ॥12॥

ఇతి కృత్వా మతిం తత్ర సుసంమంత్ర్య చ శంభునా ।
ఆజ్ఞాం ప్రాప్యాభవచ్ఛైవీం విష్ణుర్మోహపరాయణః ॥13॥

నారదా! అటుపిమ్మట పార్వతీనందనుడు, మహావీరుడు ఆ గణపతి తన బడిత చేపట్టి వీరోచితంగా – సర్వసుఖావహుడైన విష్ణుమూర్తికి మొదటిపూజ (బడితపూజ) చేశాడు. అప్పుడు విష్ణువుకి కూడా శివుడికి వచ్చిన ఆలోచనయే వచ్చింది. ప్రభూ! వీడా తామసుడు. ఇతణ్ని సమీపించడమే కష్టం. ఏదో ఒక మోసం చెయ్యకుండా ఇతణ్ని వధించడం అసంభవం. కనక నేను ఈతణ్ని సమ్మోహపరుస్తాను, ఆ అదనులో నువ్వు సంహరించు – అని శివుడితో సమాలోచన జరిపి ఒక నిశ్చయానికి వచ్చాడు శ్రీహరి. శివుడి నుంచి అనుమతి పొంది విష్ణువు గణపతిని సమ్మోహపరచడంలో లీనమయ్యాడు.

శక్తిద్వయం తదా లీనం హరిం దృష్ట్వా తథావిధమ్ ।
దత్త్వా శక్తిబలం తస్మై గణేశాయాభవన్మునే ॥14॥

శక్తిద్వయేఽథ సంలీనే యత్ర విష్ణుః స్థితః స్వయమ్ ।
పరిఘం క్షిప్తవాన్ తత్ర గణేశో బలవత్తరః ॥15॥

అలా అప్పుడా పనిలో లీనమైన శ్రీహరిని గమనించి, గణపతి చెంత నిలిచిన శక్తిస్వరూపిణులిద్దరూ తమ శాక్తేయబలాలను కూడా గణపతికి సంక్రమింపజేసి అతడిలో లీనమైపోయారు. నారదమునివరా! అలా శక్తిద్వయం తనలో చేరిపోయాక ఆ గణపతి బలవత్తరుడై తన పరిఘను గురిచూసి విష్ణుమూర్తి నిలబడిన వైపు విసిరాడు.

కృత్వా యత్నం కిమప్యత్ర వంచయామాస తద్గతిమ్ ।
శివం స్మృత్వా మహేశానం స్వప్రభుం భక్తవత్సలమ్ ॥16॥

విష్ణుమూర్తి ఏదో ఉపాయం పన్ని, ఆ పరిఘను దారి మళ్ళించి, తనకు తగలకుండా తప్పించుకున్నాడు. తనకు ప్రభువు, భక్తవత్సలుడూ అయిన మహేశుణ్ణి తలుచుకుని – ఇలా తప్పించుకున్నాడు.

ఏకతస్తన్ముఖం దృష్ట్వా శంకరోఽప్యాజగామ హ ।
స్వత్రిశూలం సమాదాయ సుక్రుద్ధో యుద్ధకామ్యయా ॥17॥

ఆ సమయంలో ఒకచోటునుంచి శ్రీహరి ముఖాన్ని చూశాడు శంకరుడు. అతిక్రుద్ధుడయ్యాడు. తన త్రిశూలం పైకెత్తాడు. యుద్ధకాంక్షతో గణపతివైపు వేగంగా వచ్చాడు.

స దదర్శాగతం శంభుం శూలహస్తం మహేశ్వరమ్ ।
హంతుకామం నిజం వీరః శివాపుత్రో మహాబలః ॥18॥

శక్త్యా జఘాన తం హస్తే స్మృత్వా మాతృపదాంబుజమ్ ।
స గణేశో మహావీరః శివాశక్తిప్రవర్ధితః ॥19॥

త్రిశూలం చేతబట్టి తనను సంహరించడానికి వచ్చిన ఆ మహేశ్వరుణ్ణి ఆ శంభుణ్ణి దర్శించాడు మహాబలశాలి మహావీరుడు ఆ పార్వతీపుత్రుడు గణేశుడు. వెంటనే తన తల్లి పాదపద్మాలను ఒక్కసారి ధ్యానించి, శివాశక్తిప్రవర్ధితుడై ఆ గణపతి శక్తి ఆయుధంతో శివుణ్ణి చేతిమీద కొట్టాడు.

త్రిశూలం పతితం హస్తాత్ శివస్య పరమాత్మనః ।
దృష్ట్వా సదూతికస్తం వై పినాకం ధనురాదదే ॥20॥

తమప్యపాతయద్భూమౌ పరిఘేణ గణేశ్వరః ।
హతాః పంచ తథా హస్తాః పంచభిశ్శూలమాదదే ॥21॥

పరమాత్ముడు శివుడి చేతి నుంచి ఆ త్రిశూలం జారిపడింది. లీలావిశారదుడు అది గమనించి వెంటనే పినాకమనే తన ధనుస్సును చేతబట్టాడు. గణేశ్వరుడు తన పరిఘతో దాన్ని కూడా నేలకు పడగొట్టాడు. ఇలా అయిదుసార్లు శివుడి చేతులను కొట్టాడు. అప్పుడు శివుడు అయిదు చేతులతో త్రిశూలాన్ని ధరించాడు.కానీ –

అహో! దుఃఖతరం నూనం సంజాతమధునా మమ ।
భవేత్పునర్గణానాం కిం భవాచారీ జగావితి ॥22॥

నారదా! అప్పుడు పరమేశ్వరుడు లోకాచారాన్ని పాటిస్తూ అహో! ఇవ్వేళ నాకు ఎంతటి మహాదుఃఖం ప్రాప్తించింది! నాకే ఇలా అయితే ఇంక నా గణాలసంగతి ఏమిటి? అని బిగ్గరగా అరిచాడు. (శివుడు ఇలా నటించాడు అని సూచిస్తోంది "భవాచారి" అనే పదం).

ఏతస్మిన్నంతరే వీరః పరిఘేణ గణేశ్వరః ।
జఘాన సగణాన్ దేవాన్ శక్తిదత్తబలాన్వితః ॥23॥

గతా దశదిశో దేవాస్సగణాః పరిఘార్దితాః ।
న తస్థుస్సమరే కేఽపి తేనాద్భుతప్రహారిణా ॥24॥

ఇంతలో – మహావీరుడు ఆ గణేశ్వరుడు శక్తి దత్త బలాన్వితుడు – తన పరిఘతో శివగణాలనూ, దేవసైనికులనూ చితకబాదాడు. ఆ దెబ్బలు తాళలేక అందరూ దశదిశలకూ పారిపోయారు. ఆశ్చర్యకరంగా చావగొడుతున్న అతడి ముందు ఒక్కరంటే ఒక్కరుకూడా నిలబడలేకపోయారు.

విష్ణుస్తం చ గణం దృష్ట్వా ధన్యోఽయమితి చాబ్రవీత్ ।
మహాబలో మహావీరో మహాశూరో రణప్రియః ॥25॥

బహవో దేవతాశ్చైవ మయా దృష్టాస్తథా పునః ।
దానవో బహవో దైత్యా యక్షగంధర్వరాక్షసాః ॥26॥

నైతేన గణనాథేన సమతాం యాంతి కేఽపి చ ।
త్రైలోక్యేఽప్యఖిలే తేజోరూపశౌర్యగుణాదిభిః ॥27॥

నారదా! ఆ తరుణంలో శ్రీమహావిష్ణువు ఆ గణపతిని చూసి ఇతడు ధన్యుడు అని మెచ్చుకున్నాడు. ఇతడు మహాబలుడు. మహావీరుడు. మహాశూరుడు. రణప్రియుడు. నేను ఎందరెందరో దేవతల్ని చూశాను. దైత్యదానవయక్ష గంధర్వ రాక్షసుల్నీ చూశాను. కానీ వారిలో ఎవ్వరూ ఇతడికి సాటిరారు. తేజస్సూ రూపమూ శౌర్యగుణాదులలో ముల్లోకాలన్నింటా ఎక్కడా ఇతడికి సాటివచ్చేవాడు లేడు.

ఏవం సంబ్రువతేఽమ్మై పరిఘం భ్రామయన్ స చ ।
చిక్షేప విష్ణవే తత్ర శక్తిపుత్రో గణేశ్వరః ॥28॥

ఇలా మెచ్చుకుంటున్న విష్ణుమూర్తిని శక్తిపుత్రుడు ఆ గణేశ్వరుడు తన దీర్ఘపరిఘను గిరగిరా తిప్పి కొట్టబోయాడు.

చక్రం గృహీత్వా హరిణా స్మృత్వా శివపదాంబుజమ్ ।
తేన చక్రేణ పరిఘో ద్రుతం ఖండీకృతస్తదా ॥29॥

ఖండం తు పరిఘస్యాపి హరయే ప్రాక్షిపద్గణః ।
గృహీత్వా గరుడేనాపి పక్షిణా విఫలీకృతః ॥30॥

అప్పుడు శ్రీహరి శివుడి పాదపద్మాలకు ధ్యానించి, తన సుదర్శన చక్రాన్ని ప్రయోగించాడు. దాని దెబ్బకు ఆ పరిఘ రెప్పపాటుకాలంలో రెండు ముక్కలయ్యింది. చేతిలో మిగిలిన ఆ సగం ముక్కనే గణపతి శ్రీహరి వైపు విసిరాడు. అయితే గరుత్మంతుడు దానిని కబళించి నిష్ఫలం చేశాడు.

ఏవం విచరితం కాలం మహావీరావుభావపి ।
విష్ణుశ్చాపి గణశ్చైవం యుయుధాతే పరస్పరమ్ ॥31॥

పునర్వీరవరశ్శక్తిసుతః స్మృతశివో బలీ ।
గృహీత్వా యష్టిమతులాం తయా విష్ణుం జఘాన హ ॥32॥

అవిషహ్య ప్రహారం తం స భూమౌ నిపపాత హ ।
ద్రుతముత్థాయ యుయుధే శివాపుత్రేణ తేన వై ॥33॥

నారదా! ఈ విధంగా శ్రీహరి – గణపతి ఇద్దరు మహావీరులూ చాలాసేపు ఒకరితో ఒకరు యుద్ధం చేశారు. బలశాలి శక్తిసుతుడు శివాదేవిని స్మరించి తన యష్టిని మళ్ళీ అందుకుని, శ్రీహరిని బలంగా కొట్టాడు. ఆ దెబ్బను నిబ్బరించుకోలేక శ్రీహరి నేలమీద పడ్డాడు. కానీ వెంటనే లేచి గణేశునితో పోరాటం కొనసాగించాడు.

ఏతదంతరమాసాద్య శూలపాణిస్తథోత్తరే ।
ఆగత్య చ త్రిశూలేన తచ్ఛిరో నిరకృంతత ॥34॥

ఛిన్నే శిరసి తస్యైవ గణనాథస్య నారద ।
గణసైన్యం దేవసైన్యమభవచ్చ సునిశ్చలమ్ ॥35॥

ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, శూలపాణి శంకరుడు ఉత్తరం వైపునుంచి దూసుకు వచ్చి తన త్రిశూలంతో ఆ బాలగణపతి శిరస్సు ఖండించాడు. నారదా! అలా ఆ గణపతి శిరస్సు తెగిపడేసరికి అటు శివగణాలూ, ఇటు దేవసైన్యాలు – ఎక్కడివారు అక్కడే (బొమ్మల్లా) నిలిచిపోయారు.

నారదేన త్వయాగత్య దేవ్యై సర్వం నివేదితమ్ ।
మానిని! శ్రూయతాం మానః త్యాజ్యో నైవ త్వయాధునా ॥36॥

ఇత్యుక్త్వాంతర్హితస్తత్ర నారద త్వం కలిప్రియః ।
అవికారీ సదా శంభోర్మనోగతికరో మునిః ॥37॥

నారదా! గుర్తున్నదా? అప్పుడు నువ్వే పార్వతీదేవి సన్నిధికి వెళ్ళి జరిగినది అంతా విన్నవించావు. మానినీ! దయచేసి నా మాట విను, ఇప్పుడు మాత్రం నీ కోపాన్ని విడిచిపెట్టకు – అని బోధించి అంతర్ధానం చెందావు. నువ్వు కలహప్రియుడివి – కలిప్రియుడివి. సదా నిర్వికారుడివి. శివుడి మనసెరిగి పనిచేసే దేవమహామునివి!

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే గణేశయుద్ధ గణేశ శిరశ్ఛేదనవర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥16॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు గణేశయుద్ధ గణేశశిరశ్ఛేద వర్ణనం అనే పదహారవ అధ్యాయం సమాప్తం.

సప్తదశోఽధ్యాయః – పదిహేడవ అధ్యాయం
గణేశజీవన వర్ణనమ్ – గణేశజీవన వర్ణనం

నారద ఉవాచ – నారదుడు అడిగాడు.

బ్రహ్మన్! వద మహాప్రాజ్ఞ! తద్వృత్తాంతేఽఖిలే శ్రుతే ।
కిమకార్షీన్మహాదేవీ శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ॥1॥

ఓ బ్రహ్మా మహాప్రాజ్ఞా! గణేశయుద్ధ– గణేశశిరశ్ఛేదన వృత్తాంతమంతా విని, ఆ మహాదేవి ఆ తరువాత ఏమి చేసింది? తత్త్వతః వినాలని కుతూహలంగా ఉంది.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

శ్రూయతాం మునిశార్దూల కథయామ్యద్య తద్ధ్రువమ్ ।
చరితం జగదంబాయా యజ్జాతం తదనంతరమ్ ॥2॥

మృదంగాన్ పటహాంశ్చైవ గణాశ్చావాదయంస్తథా ।
మహోత్సవం తదా చక్రుః హతే తస్మిన్ గణాధిపే ॥3॥

మునిశార్దూలా! నారదా! శ్రద్ధగా ఆలకించు. నువ్వు అడిగింది తప్పకుండా ఇప్పుడే చెబుతాను. అటు తరువాత జరిగిన జగదంబచరితం ఏమిటో వినుము. గణపతి అలా చనిపోగానే శివగణాలవారందరూ మృదంగాలనూ, పటహాలనూ పెద్దపెట్టున మోగించారు. మహోత్సవం జరుపుకున్నారు.

శివోఽపి తచ్ఛిరశ్ఛిత్త్వా యావద్దుఃఖముపాదతే ।
తావచ్చ గిరిజా దేవీ చుక్రోధాతి మునీశ్వర ॥4॥

కిం కరోమి క్వ గచ్ఛామి హాహా! దుఃఖముపాగతమ్ ।
కథం దుఃఖం వినశ్యేతాప్యతిదుఃఖం మమాధునా ॥5॥

మత్సుతో నాశితశ్చాద్య దేవైస్సర్వైర్గణైస్తథా ।
సర్వాంస్తాన్నాశయిష్యామి ప్రళయం వా కరోమ్యహమ్ ॥6॥

గణేశుడి శిరస్సును ఖండించడమైతే ఖండించాడు గానీ వెంటనే దుఃఖంతో మునిగిపోయాడు శివుడు సైతం. మునీశ్వరా! నారదా! జగదంబ పార్వతీదేవికి మాత్రం పట్టరాని కోపం వచ్చింది. దుఃఖమూ వచ్చింది. ఏమి చెయ్యాలి? ఎక్కడికి పోవాలి? అయ్యయ్యో! ఇంత దుఃఖం వచ్చిపడిందే! ఇది తీరేది ఎలాగ? సకల దేవతలూ, శివగణాలూ కలిసి నా కుమారుణ్ణి అంత మొందించారు. కాబట్టి వీళ్ళని అందరినీ నేనిప్పుడు నాశనం చేస్తాను. మహాప్రళయం సృష్టిస్తాను.

ఇత్యేవం దుఃఖితా సా చ శక్తీశ్శతసహస్రశః ।
నిర్మమే తత్క్షణం క్రుద్ధా సర్వలోకమహేశ్వరీ ॥7॥

నిర్మితాస్తా నమస్కృత్య జగదంబాం శివాం తదా ।
జాజ్వల్యమానా హ్యవదన్ మాతరాదిశ్యతామితి ॥8॥

తచ్ఛ్రుత్వా శంభుశక్తిస్సా ప్రకృతిః క్రోధతత్పరా ।
ప్రత్యువాచ తు తాస్సర్వా మహామాయా మునీశ్వర ॥9॥

ఇలా దుఃఖించి, ఆ సర్వలోకమహేశ్వరి క్రుద్ధురాలై తత్క్షణమే వందల వేల శక్తిస్వరూపిణులను సృష్టించింది. వారందరూ జాజ్వల్యమానలై జగదంబ ముందు నిలిచి నమస్కరించి – మాతా! ఆజ్ఞాపించు – అని వినయంగా అభ్యర్థించారు. క్రోధవివశురాలైన ఆ ప్రకృతిస్వరూపిణి శంభుశక్తి – వారి అభ్యర్థనను ఆలకించింది. నారద మునీశ్వరా! ఆ మహామాయ వారికి ఇలా ఆజ్ఞాపించింది.

దేవ్యువాచ – దేవి ఆజ్ఞాపించింది.

హే శక్తయోఽధునా దేవ్యో యుష్మాభిర్మన్నిదేశతః ।
ప్రళయశ్చాత్ర కర్తవ్యో నాత్ర కార్యా విచారణా ॥10॥

దేవాంశ్చైవ ఋషీంశ్చైవ యక్షరాక్షసకాంస్తథా ।
అస్మదీయాన్ పరాంశ్చైవ సఖ్యో! భక్షత వై హఠాత్ ॥11॥

ఓ దేవీ శక్తిస్వరూపిణులారా! చెలులారా! ఇదే నా ఆజ్ఞ. ప్రళయం సృష్టించండి. మరొక ఆలోచన ఇప్పుడు అనవసరం. దేవతలు, ఋషులు, యక్షులు, రాక్షసులు, మనవాళ్ళు, పరాయివాళ్ళు – అందరినీ ఉన్నపళాన భక్షించండి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

తదాజ్ఞప్తాశ్చ తాస్సర్వాః శక్తయః క్రోధతత్పరాః ।
దేవాదీనాం చ సర్వేషాం సంహారం కర్తుముద్యతాః ॥12॥

యథా చ తృణసంహారమనలః కురుతే తథా ।
ఏవం తాశ్శక్తయస్సర్వాస్సంహారం కర్తుముద్యతాః ॥13॥

అలా ఆజ్ఞనందుకున్న ఆ దేవీశక్తులు క్రోధతత్పరలై దేవతాదుల్ని అందరినీ సంహరించడం ప్రారంభించారు. అగ్నిజ్వాలలు ఎండుగడ్డిని దహించివేసినట్టు వందల వేల దేవీశక్తులు ఈ మహాసంహారానికి పూనుకున్నాయి.

గణపో వాథ విష్ణుర్వా బ్రహ్మా వా శంకరస్తథా ।
ఇంద్రో వా యక్షరాజో వా స్కందో వా సూర్య ఏవ వా ॥14॥

సర్వేషాం చైవ సంహారం కుర్వంతి స్మ నిరంతరమ్ ।
యత్ర యత్ర తు దృశ్యేత తత్ర తత్రాపి శక్తయః ॥15॥

శివగణనాథుడే కానీ, విష్ణువే కానీ, బ్రహ్మదేవుడే కానీ శంకరుడే కానీ, ఇంద్రుడే కానీ, యక్షరాజే కానీ, స్కందుడే కానీ, సూర్యుడే కానీ, ఎవ్వర్నీ లెక్కచెయ్యకుండా– అందరినీ నిరంతరం సంహరిస్తున్నారు. ఎక్కడ చూసినా శక్తిస్వరూపిణులే!!

కరాళీ కుబ్జకా ఖంజా లంబశీర్ష్వా హ్యనేకశః ।
హస్తే ధృత్వా తు దేవాంశ్చ ముఖే చైవాక్షిపంస్తదా ॥16॥

కరాళి – కుబ్జక – ఖంజ – లంబశీర్ష – ఇత్యాదిగా వందల వేల శక్తిస్వరూపిణులు దేవతల్ని చేతులతో కబళించి, నోటిలో వేసుకుంటున్నారు.

తం సంహారం తదా దృష్ట్వా హరో బ్రహ్మా తథా హరిః ।
ఇంద్రాదయోఽఖిలా దేవా గణాశ్చ ఋషయస్తథా ॥17॥

కిం కరిష్యతి సా దేవీ సంహారం వాప్యకాలతః ।
ఇతి సంశయమాపన్నా జీవనాశా హతాభవత్ ॥18॥

నారదా! అప్పుడు జరుగుతున్న ఆ సంహారాన్ని చూసి శివుడు, బ్రహ్మ, శ్రీహరి, ఇంద్రాది దిక్పాలకులూ దేవతలూ, శివగణాలూ, ఋషులు – అందరికీ ఒక్కటే సంశయం కలిగింది. జగన్మాత ఏమి చెయ్యబోతోంది, అకాలంలో ఈ సంహారమేమిటి? ఈ సంశయంతో వారందరికీ జీవితాశ అడియాస అయ్యింది.

సర్వే చ మిళితాశ్చేమే కిం కర్తవ్యం వించిత్యతామ్ ।
ఏవం విచారయంతస్తే తూర్ణమూచుః పరస్పరమ్ ॥19॥

కర్తవ్యం ఏమిటో ఆలోచించండి అంటూ అందరూ ఒక్కచోట గుమికూడారు. ఇదే సమాలోచనతో ఒండొరులు సంభాషించుకున్నారు.

యదా చ గిరిజా దేవీ ప్రసన్నా హి భవేదిహ ।
తదా చైవ భవేత్ స్వాస్థ్యం నాన్యథా కోటియత్నతః ॥20॥

శివోఽపి దుఃఖమాపన్నో లౌకికీం గతిమాశ్రితః ।
మోహయన్ సకలాంస్తత్ర నానాలీలావిశారదః ॥21॥

పార్వతీదేవి ప్రసన్నురాలైతే తప్ప మనకు స్వస్థత లేదు. ఇతరత్రా కోటిప్రయత్నాలైనా వృథా – అనే నిశ్చయానికి వచ్చారు. నానాలీలావిశారదుడైన శంకరుడు సైతం అప్పుడు లోకవృత్తిని అనుసరించినవాడై తానూ దుఃఖిస్తున్నట్టు అందరినీ సమ్మోహపరిచాడు.

సర్వేషాం చైవ దేవానాం కటిర్భగ్నా యదా తదా ।
శివా క్రోధమయీ సాక్షాత్ గంతుం న పుర ఉత్సహేత్ ॥22॥

స్వీయో వా పరకీయో వా దేవో వా దానవోఽపి వా ।
గణో వాపి చ దిక్పాలో యక్షో వా కిన్నరో మునిః ॥23॥

విష్ణుర్వాపి తథా బ్రహ్మా శంకరశ్చ తథా ప్రభుః ।
న కశ్చిద్గిరిజాగ్రే చ స్థాతుం శక్తోఽభవన్మునే ॥24॥

జాజ్వల్యమానం తత్తేజస్సర్వతోఽదాహి తేఽఖిలాః ।
దృష్ట్వా భీతతరా ఆసన్ సర్వే దూరతరం స్థితాః ॥25॥

నారదమహర్షీ! దేవతలందరికీ నడుం విరిగినట్టయిపోయింది. జగదంబయే సాక్షాత్తూ క్రోధమయి అయ్యింది. ఆమె ముందుకు వెళ్ళడానికి ఎవ్వరూ ధైర్యం చెయ్యలేదు. అయినవాడూ కానివాడూ, దేవదానవ – శివగణ – దిక్పాల – యక్ష – కిన్నర – మునీశ్వరాదుల్లోనే కాదు చివరికి బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో సైతం ఒక్కడంటే ఒక్కడు పార్వతీదేవి ఎదుట నిలబడగలవాడే లేకపోయాడు. ఆమె తేజస్సు అంతటిది. జాజ్వల్యమానం. అన్నివైపులా దహించివేస్తోంది. ఆ దేవీ తేజస్సును చూసి ఎవరికి వారే గడగడలాడిపోతూ దూరదూరంగా నిలబడిపోయారు.

ఏతస్మిన్ సమయే తత్ర నారదో దివ్యదర్శనః ।
ఆగతస్త్వం మునే! దేవగణానాం సుఖహేతవే ॥26॥

బ్రహ్మాణం మాం భవం విష్ణుం శంకరం చ ప్రణమ్యతాః ।
సమాగత్య మిలిత్వోచే విచార్య కార్యమేవ వా ॥27॥

సర్వే సమ్మంత్రయాంచక్రుస్త్వయా దేవా మహాత్మనా ।
దుఃఖశాంతిః కథం స్యాద్వై సమూచుస్తత ఏవ తే ॥28॥

అదే సమయానికి దివ్య దర్శనుడివైన నారద మహర్షివి నువ్వు దేవ శివగణాలకు సుఖహేతువుగా అక్కడికి వచ్చావు. త్రిమూర్తులకు మా మువ్వురికీ నమస్కరించి, ఆ శక్తి స్వరూపిణులనూ నమస్కరించి, మా చేరువకి వచ్చావు. అందరితోనూ కలిసి మాట్లాడి కర్తవ్యమేమిటో ఆలోచించావు. దేవతలందరూ మహాత్ముడివైన నీతో సమాలోచన చేసి ఈ దుఃఖం ఎలా శాంతిస్తుందో నీకు విన్నవించారు.

యావచ్చ గిరిజా దేవీ కృపాం నైవ కరిష్యతి ।
తావన్నైవం సుఖం స్యాద్వై నాత్ర కార్యా విచారణా ॥29॥

ఋషయో హి త్వదాద్యాశ్చ గతాస్తే వై శివాంతికమ్ ।
సర్వే ప్రసాదయామాసుః క్రోధశాంత్యై తదా శివామ్ ॥30॥

పునః పునః ప్రణేముశ్చ స్తుత్వా స్తోత్రైరనేకశః ।
సర్వే ప్రాసాదయన్ ప్రీత్యా ప్రోచుర్దేవగణాజ్ఞయా ॥31॥

గిరిజాదేవి కృప వహించే దాకా మనకెవ్వరికీ సుఖమనేదే లేదు. ఇందులో మరొక ఆలోచనయే లేదు. ఇదీ దేవతల విన్నపం. అప్పుడు నీ నేతృత్వంలో ఋషులందరూ పార్వతీదేవి సన్నిధికి వెళ్ళారు. క్రోధశాంతికి

ఆ జగదీశ్వరిని బతిమాలు కొన్నారు. మాటిమాటికీ వంగి వంగి దండాలు పెట్టారు. రకరకాల స్తోత్రాలతో పలువిధాలుగా స్తుతించారు. దేవ శివగణాల ఆనతి మేరకు మీ మహర్షులందరూ కలిసి అలా ఆమెను భక్తితో బతిమలాడుకున్నారు.

సురర్షయ ఊచుః – దేవర్షులు అన్నారు.

జగదంబ! నమస్తుభ్యం శివాయై తే నమోఽస్తు తే ।
చండికాయై నమస్తుభ్యం కల్యాణ్యై తే నమోఽస్తుతే ॥32॥

ఆదిశక్తిస్త్వమేవాంబ! సర్వసృష్టికరీ సదా ।
త్వమేవ పాలినీ శక్తిస్త్వమేవ ప్రళయంకరీ ॥33॥

ప్రసన్నా భవ దేవేశి! శాంతిం కురు నమోఽస్తు తే ।
సర్వం హి వికలం దేవి! త్రిజగత్తవ కోపతః ॥34॥

జగదంబా! నీకిదే వందనం. శివా! నీకిదే ప్రణతి. చండికా! నీకిదే నమస్సు. కల్యాణీ! నీకిదే అంజలి. అమ్మా! ఆదిశక్తివి నువ్వే. సర్వసృష్టికారిణివీ నువ్వే, పాలినివీ నువ్వే, సంహారిణివీ నువ్వే. సకల దేవేశీ! దయచేసి ప్రసన్నురాలవై మాకు శాంతిని ప్రసాదించు. మహాదేవీ! నీ కోపం వల్ల ముల్లోకాలలోను సమస్తమూ అతలాకుతలం అయిపోయింది.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఏవం స్తుతా పరా దేవీ ఋషిభిశ్చ త్వదాదిభిః ।
క్రుద్ధదృష్ట్యా తదా తాంశ్చ కించిన్నోవాచ సా శివా ॥35॥

నీవంటి దేవర్షులందరూ ఇలా స్తుతించేసరికి ఆ పరాశక్తి ఆ శివామూర్తి క్రోధనయనాలతో చూసి ఊరుకున్నదే కానీ ఏమీ పలకలేదు.

తదా చ ఋషయస్సర్వే నత్వా తచ్చరణాంబుజమ్ ।
పునరూచుశ్శివాం భక్త్యా కృతాంజలిపుటాశ్శనైః ॥36॥

అప్పుడు ఋషులందరూ ఆమె పాదపద్మాలకు నమస్కరించి, అంజలిబంధంతో నిలిచి, భక్తితో మెల్లగా మళ్ళీ అభ్యర్థించారు.

ఋషయ ఊచుః – ఋషులు అన్నారు.

క్షమ్యతాం క్షమ్యతాం దేవి సంహారో జాయతేఽధునా ।
తవ స్వామీ స్థితశ్చాత్ర పశ్య పశ్య తమంబికే ॥37॥

వయం కే చ ఇమే దేవా విష్ణుబ్రహ్మాదయస్తథా ।
ప్రజాశ్చ భవదీయాశ్చ కృతాంజలిపుటాః స్థితాః ॥38॥

క్షంతవ్యశ్చాపరాధో వై సర్వేషాం పరమేశ్వరి ।
సర్వే హి వికలాశ్చాద్య శాంతిం తేషాం శివే కురు ॥39॥

క్షమించు మహాదేవీ! ఇప్పుడే సంహారం జరిగిపోతోంది. అడిగో నీ స్వామి – శంకరుడు – అక్కడ నిలబడి ఉన్నాడు. జగదంబికా! ఒక్కసారి చూడు. మేమేమిటి? సకలదేవతలూ. బ్రహ్మవిష్ణు ప్రభృతులు అరిగో. అందరూ నీ సంతానం. నీ ప్రజలు. అంజలిబంధాలతో నిలబడ్డారు. ఒక్కసారి తిలకించు. పరమేశ్వరీ! అందరి అపరాధాన్నీ దయచేసి క్షమించు. శివామూర్తీ! స్వాస్థ్యం కోల్పోయిన వీరందరికీ దయచేసి శాంతిని ప్రసాదించు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వా ఋషయస్సర్వే సుదీనతరమాకులాః ।
సంతస్థిరే చండికాగ్రే కృతాంజలి పుటాస్తదా ॥40॥

ఏవం శ్రుత్వా వచస్తేషాం ప్రసన్నా చండికాభవత్ ।
ప్రత్యువాచ ఋషీంస్తాన్వై కరుణావిష్టమానసా ॥41॥

ఇలా అభ్యర్థించి, దేవర్షులందరూ దీనాతిదీనంగా వ్యాకులచిత్తులై, అంజలిబంధనాలతో ఆ చండికాదేవి యెట్టయెదుట అలా నిలబడ్డారు. వారి విన్నపాలు ఆలించిన చండిక ప్రసన్నురాలయ్యింది. మనస్సులో కరుణ పెల్లుబికింది. ఋషులకు బదులు పలికింది.

దేవ్యువాచ – దేవి పలికింది.

మత్పుత్రో యది జీవేత తదా సంహరణం న హి ।
యథా హి భవతాం మధ్యే పూజ్యోఽయం చ భవిష్యతి ॥42॥

సర్వాధ్యక్షో భవేదద్య యూయం కురుత తద్యది ।
తదా శాంతిర్భవేల్లోకే నాన్యథా సుఖమాప్స్యథ ॥43॥

నా కుమారుడు జీవించాలి. మీ అందరి మధ్య అతడు పూజ్యుడు కావాలి. ఇప్పుడే సర్వాధ్యక్షుడు అవ్వాలి. ఇది మీరు చేస్తే ఈ సంహరణం ఆగుతుంది. లోకంలో శాంతి వెల్లివిరుస్తుంది. లేదంటే మీకు సుఖం కలగదు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్తాస్తే తదా సర్వే ఋషయో యుష్మదాదయః ।
తేభ్యో దేవేభ్య ఆగత్య సర్వం వృత్తం న్యవేదయన్ ॥44॥

తే చ సర్వే తథా శ్రుత్వా శంకరాయ న్యవేదయన్ ।
నత్వా ప్రాంజలయో దీనాః శక్రప్రభృతయస్సురాః ॥45॥

నారదా! జగన్మాత ఇలా చెప్పేసరికి మీ దేవర్షులందరూ త్వరత్వరగా దేవతల చెంతకు వచ్చి – జరిగినదంతా విన్నవించారు. వారందరూ అది ఆలకించారు. ఇంద్ర, విష్ణు ప్రభృతి దేవతలంతా కలిసి శంకరుడి సన్నిధికి వెళ్ళి శిరసులు వంచి నమస్కరిస్తూ, దీనులై ఈ విషయాన్ని నివేదించారు.

ప్రోవాచేతి సురాన్ శ్రుత్వా శివశ్చాపి తథా పునః ।
కర్తవ్యం చ తథా సర్వలోకస్వాస్థ్యం భవేదిహ ॥46॥

ఉత్తరస్యాం పునర్యాత ప్రథమం యో మిళేదిహ ।
తచ్ఛిరశ్చ సమాహృత్య యోజనీయం కళేబరే ॥47॥

వారు నివేదించినదంతా విన్నాడు శివుడు. అప్పుడిలా అన్నాడు – సకల లోకాలకూ స్వస్థత చేకూర్చడం ఇప్పటి మన కర్తవ్యం కదా! సరే ఇక్కడి నుంచి ఉత్తరదిక్కుగా బయలుదేరి వెళ్ళండి. ముమ్మొదటగా దొరికే ప్రాణి శిరస్సు ఖండించి, తెచ్చి ఈతడి కళేబరానికి అతకాలి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

తతస్తైస్తత్కృతం సర్వం శివాజ్ఞాప్రతిపాలకైః ।
కళేబరం సమానీయ ప్రక్షాళ్య విధివచ్చ తత్ ॥48॥

పూజయిత్వా పునస్తే వై గతాశ్చోదఙ్ముఖాస్తదా ।
ప్రథమం మిళితస్తత్ర హస్తీ చాప్యేకదంతకః ॥49॥

తచ్ఛిరశ్చ తదా నీత్వా తత్ర తేఽయోజయన్ ధ్రువమ్ ।
సంయోజ్య దేవతాస్సర్వాః శివం విష్ణుం విధిం తదా ॥50॥

ప్రణమ్య వచనం ప్రోచుర్భవదుక్తం కృతం చ నః ।
అనంతరం చ తత్కార్యం భవతాద్భవశేషితమ్ ॥51॥

అప్పుడు శివాజ్ఞాపరిపాలకులైన దేవగణాలందరూ వెళ్ళి, గణపతి కళేబరాన్ని తీసుకువచ్చారు. విధి విధానంగా ప్రక్షాళించారు. పూజలు నిర్వహించారు. అటుపైని ఉత్తరదిశగా బయలుదేరారు. ముమ్మొదటగా వారికి ఒకే దంతం ఉన్న మగయేనుగు కనిపించింది. దాని శిరస్సును ఖండించి తెచ్చి, గణపతి మొండేనికి అతికించారు. అటుపైని బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు నమస్కరించి–అయ్యా! మీరు చెప్పింది చేశాం, మిగిలింది మీరు నిర్వహించండి–అన్నారు.

తతస్తే తు విరేజుశ్చ పార్షదాశ్చ సురాస్సుఖమ్ ।
అథ తద్వచనం శ్రుత్వా శివోక్తం పర్యపాలయన్ ॥52॥

ఆ శివపార్షదులూ, ఆ దేవతలూ శివుడి ఆనతిని ఆలకించి, అలా నిర్వహించి ఆనందంతో విరాజిల్లారు.

ఊచుస్తే చ తదా తత్ర బ్రహ్మవిష్ణుసురాస్తథా ।
ప్రణమ్యేశం శివం దేవం స్వప్రభుం గుణవర్జితమ్ ॥53॥

యస్మాత్ త్వత్తేజసస్సర్వే వయం జాతా మహాత్మనః ।
త్వత్తేజస్తత్సమాయాతు వేదమంత్రాభియోగతః ॥54॥

అప్పుడు బ్రహ్మ, విష్ణు ప్రభృతులైన దేవనాయకులందరూ తమ ప్రభువు, గుణాతీతుడూ అయిన శివమహాదేవుణ్ని శిరసా నమస్కరించి – మహాత్మా! నీ తేజస్సుతో మేమందరమూ జన్మించాం. అదే నీ తేజస్సు వేదమంత్రాభియోగంతో ఇప్పుడు ఈ కళేబరంలోకి ప్రవేశించుగాక! – అని అభ్యర్థించారు.

ఇత్యేవ మభిమంత్రేణ మంత్రితం జలముత్తమమ్ ।
స్మృత్వా శివం సమేతాస్తే చిక్షిపుస్తత్కళేబరే ॥55॥

తజ్జలస్పర్శమాత్రేణ చిద్యుతో జీవితో ద్రుతమ్ ।
తదోత్తస్థౌ సుప్త ఇవ స బాలశ్చ శివేచ్ఛయా ॥56॥

వెంటనే వేదమంత్రాలతో సమ్మంత్రించిన పావనోదకాలను – దేవనాయకులంతా కలిసికట్టుగా నిల్చి శివుణ్ని ధ్యానిస్తూ కళేబరం మీద చిలకరించారు. ఆ జలస్పర్శ తగలడంతోనే బాలకుడిలో తేజస్సు వెలిగింది. ఆ వెంటనే ప్రాణం వచ్చింది. నిద్ర నుంచి మేల్కొన్నట్టుగా బాలకుడు లేచికూర్చున్నాడు. అంతా – శివేచ్ఛ.

సుభగస్సుందరతరో గజవక్త్రస్సురక్తకః ।
ప్రసన్నవదనశ్చాతిసుప్రభో లలితాకృతిః ॥57॥

తం దృష్ట్వా జీవితం బాలం శివాపుత్రం మునీశ్వర ।
సర్వే ముముదిరే తత్ర సర్వం దుఃఖం క్షయం గతమ్ ॥58॥

దేవ్యై సందర్శయామాసుః సర్వే హర్షసమన్వితాః ।
జీవితం తనయం దృష్ట్వా దేవీ హృష్టతరా భవత్ ॥59॥

బాలకుడు కాంతులొలుకుతున్నాడు. సుందరాతి సుందరుడు. గజవక్త్రుడు. ఎర్రని రంగు. ప్రసన్నవదనుడు. మంచి మహాతేజస్వి. లలితాకారుడు. నారదా! అలా పునరుజ్జీవితుడైన పార్వతీపుత్రుణ్ని చూసి అందరూ ఎంతో ఆనందించారు. దుఃఖమంతా తీరిపోయి ఊపిరి పీల్చుకున్నారు. ఆనందపరవశులై అందరూ కలిసి వెళ్ళి ఆ బాలకుణ్ని జగదంబికకు చూపించారు. పునరుజ్జీవితుడైన తనయుణ్ని చూసి ఆ జగన్మాత అవధులు లేని ఆనందం పొందింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే గణేశజీవన వర్ణనం నామ సప్తదశోఽధ్యాయః ॥17॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు గణేశజీవనవర్ణనం అనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

అష్టాదశోఽధ్యాయః – పద్దెనిమిదవ అధ్యాయం

గణేశగణాధిప పదవీ వర్ణనమ్ – గణేశగణాధిప పదవీ వర్ణనం

నారద ఉవాచ – నారదుడు అడిగాడు.

జీవితే గిరిజాపుత్రే దేవ్యా దృష్టే ప్రజేశ్వర ।
తతః కిమభవత్తత్ర కృపయా తద్వదాధునా ॥1॥

తండ్రీ! ప్రజేశ్వరా! గిరిజాపుత్రుడు గణపతి పునరుజ్జీవితుడయ్యాడు. జగన్మాత తిలకించింది. అటుపైని ఏమి జరిగిందో దయచేసి నాకీపూట తెలియజెప్పు.

జీవితే గిరిజాపుత్రే దేవ్యా దృష్టే మునీశ్వర ।
యజ్జాతం తచ్ఛృణుష్వాద్య వచ్మి తే మహదుత్సవమ్ ॥2॥

జీవితస్య శివాపుత్రో నిర్వ్యగ్రో వికృతో మునే ।
అభిషిక్తస్తదా దేవైర్గణాధ్యక్షైర్గజాననః ॥3॥

నారదమునీశ్వరా! గిరిజాపుత్రుడు పునరుజ్జీవితుడయ్యాడు. జగన్మాత తిలకించింది. అప్పుడు జరిగిన మహోత్సవం చెబుతున్నాను ఆలకించు. పునరుజ్జీవితుడైన గిరిజాపుత్రుడు నిర్వికారుడై నిబ్బరంగా ఉన్నాడు. అప్పుడు సకలదేవతలూ, శివగణనాయకులూ అందరూ కలిసి, ఆ గజాననుణ్ని అభిషిక్తుణ్ని చేశారు.

దృష్ట్వా స్వతనయం దేవీ శివా హర్షసమన్వితా ।
గృహీత్వా బాలకం దోర్భ్యాం ప్రముదా పరిషస్వజే ॥4॥

వస్త్రాణి వివిధానీహ నానాలంకరణాని చ ।
దదౌ ప్రీత్యా గణేశాయ స్వపుత్రాయ ముదాంబికా ॥5॥

శివామూర్తి హర్షాతిరేకంతో తన పుత్రుణ్ని తిలకించింది. చేతులు సాచి, ఆనందంగా కౌగిలించుకుంది. రకరకాల వస్త్రాలూ, ఆభరణాలూ ప్రేమతో గణేశుడికి అందించింది జగదంబిక.

పూజయిత్వా తయా దేవ్యా సిద్ధిభిశ్చాప్యనేకశః ।
కరేణ స్పర్శితస్సోఽథ సర్వదుఃఖ హరేణ వై ॥6॥

పూజయిత్వా సుతం దేవీ ముఖమాచుంబ్య శాంకరీ ।
వరాన్ దదౌ తదా ప్రీత్యా జాతస్త్వం దుఃఖితోఽధునా ॥7॥

ధన్యోఽసి కృతకృత్యోఽసి పూర్వపూజ్యో భవాధునా ।
సర్వేషామమరాణాం వై సర్వదా దుఃఖవర్జితః ॥8॥

అలా తనయుణ్ణి గౌరవించి, ఇంకా అనేక సిద్ధులను బహూకరించింది. సకల దుఃఖాలనూ హరించే తన చేతితో గణేశుడి తనువంతా నిమిరింది. అటుపైని ఆ జగన్మాత శాంకరి ఆ పుత్రుణ్ణి వాత్సల్యంతో ముద్దాడింది. ఇంకా ఎన్నో వరాలు ఇచ్చింది. నాయనా! నీకివ్వేళ ఎంతటి కష్టం కలిగింది! అయినా ధన్యుడివయ్యావు. కృతకృత్యుడివయ్యావు. ఇప్పటినుంచి నువ్వు దుఃఖరహితుడివై దేవతలకందరికన్నా ముందుగా పూజ లందుకుంటావు. తొలిపూజ నీకే దక్కుతుంది.

ఆననే తవ సిందూరం దృశ్యతే సాంప్రతం యది ।
తస్మాత్త్వం పూజనీయోఽసి సిందూరేణ సదా నరైః ॥9॥

పుష్పైర్వా చందనైర్వాపి గంధేనైవ శుభేన చ ।
నైవేద్యేన సురమ్యేణ నీరాజేన విధానతః ॥10॥

తాంబూలైరథ దానైశ్చ తథా ప్రక్రమణైరపి ।
నమస్కారవిధానేన పూజాం యస్తే విధాస్యతి ॥11॥

తస్య వై సకలా సిద్ధిర్భవిష్యతి న సంశయః ।
విఘ్నాన్యనేకరూపాణి క్షయం యాస్యంత్యసంశయమ్ ॥12॥

తండ్రీ! నీ ముఖం మీద ఇప్పుడు సిందూరం కనిపిస్తోంది. కనక మానవులందరూ నిన్ను సిందూరంతోనే పూజిస్తారు. పువ్వులతో, చందనాలతో, మంచిగంధంతో, రుచికరమైన నైవేద్యంతో, అందమైన నీరాజనంతో, తాంబూలాలతో, దానధర్మాలతో, ప్రదక్షిణలతో, నమస్కారాలతో, విధివిధానంగా నిన్ను ఎవరు పూజిస్తారో వారికి సమస్తమూ సిద్ధిస్తుంది. కోరికలన్నీ నెరవేరతాయి. సందేహమే లేదు. అలాగే రకరకాల విఘ్నాలూ వారికి తొలగిపోతాయి. ఇది నిస్సంశయం.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వా చ తదా దేవీ స్వపుత్రం తం మహేశ్వరీ ।
నానావస్తుభిరుత్కృష్టం పునరప్యర్చయత్తథా ॥13॥

నారదా! ఇలా వరాలు ప్రసాదించి, ఆ మహేశ్వరి తన పుత్రుణ్ణి ఇంకా అనేక వస్తువులతో మహోత్కృష్టంగా మళ్ళీ సమ్మానించింది.

తతః స్వాస్థ్యం చ దేవానాం గణానాం చ విశేషతః ।
గిరిజాకృపయా విప్ర! జాతం తత్క్షణమాత్రతః ॥14॥

విప్రా! నారదా! గిరిజామాత కృపతో ఆ క్షణంలోనే దేవతలకూ, శివగణాలకూ పూర్తిగా స్వస్థత చేకూరింది.

ఏతస్మింశ్చ క్షణే దేవా వాసవాద్యాశ్శివం ముదా ।
స్తుత్వా ప్రసాద్య తం దేవం భక్త్యా నిన్యుశ్శివాంతికమ్ ॥15॥

సంపాద్య గిరిశం పశ్చాదుత్సంగే సన్న్యవేశయన్ ।
బాలకం తం మహేశాన్యాః త్రిజగత్సుఖహేతవే ॥16॥

అదే సమయంలో ఇంద్రాది దేవతలందరూ సంబరపడుతూ, శివుణ్ని బహుధా స్తుతించి, ప్రసన్నుణ్ని చేసుకున్నారు. అంతా కలిసి ఆ మహాదేవుణ్ని భక్తితో శివామూర్తి చెంతకు తీసుకువెళ్ళారు. అటుపైని ముల్లోకాలకూ సుఖసంతోషాలు కోరి ఆ మహేశ్వరీపుత్రుణ్ని ఆ గిరిశుడి ఒడిలో కూర్చోబెట్టారు.

శివోఽపి తస్య శిరసి దత్త్వా స్వకరపంకజమ్ ।
ఉవాచ వచనం దేవాన్ పుత్రోఽయమితి మేఽపరః ॥17॥

అప్పుడు శివుడు తన చేదమ్మిని అతడి శిరస్సున ఉంచి – ఇతడు నా మరొక పుత్రుడు అని దేవతలముందు ప్రకటించాడు.

గణేశోఽపి తదోత్థాయ నమస్కృత్య శివాయ వై ।
పార్వత్యై చ నమస్కృత్య మహ్యం వై విష్ణవే తథా ॥18॥

నారదాద్యాన్ ఋషీన్ సర్వాన్ స త్వాస్థాయ పురోఽబ్రవీత్ ।
క్షంతవ్య శ్చాపరాధో మే మానశ్చైవేదృశో నృణామ్ ॥19॥

వెంటనే గణేశుడు తండ్రి ఒడి నుంచి దిగి, ముందుగా శివుడికీ తరువాత పార్వతికి అటుపైని నాకూ, విష్ణువుకీ నమస్కరించాడు. నారదాది దేవర్షులందరికీ నమస్కరిస్తూ వారి ముందుకు వెళ్ళి నిలబడి – ఋషులారా! నా అపరాధం క్షమించండి. మానవులకు అహంకారం అనేది ఇలాగే ఉంటుంది అన్నాడు.

అహం చ శంకరశ్చైవ విష్ణుశ్చేతే త్రయస్సురాః ।
ప్రత్యూచుర్యుగపత్ ప్రీత్యా దదతో వరముత్తమమ్ ॥20॥

నారదా! నేనూ, శంకరుడూ, విష్ణువూ – ముగ్గురు దేవతలమూ ఒకేసారి ప్రేమతో గణపతికి ఉత్తమవరాన్ని ఇస్తూ ఇలా బదులు పలికాము.

త్రయో వయం సురవరా యథా పూజ్యా జగత్త్రయే ।
తథాయం గణనాథశ్చ సకలైః ప్రతిపూజ్యతామ్ ॥21॥

వయం చ ప్రాకృతాశ్చాయం ప్రాకృతః పూజ్య ఏవ చ ।
గణేశో విఘ్నహర్తా హి సర్వకామఫలప్రదః ॥22॥

ఏతత్పూజాం పురా కృత్వా పశ్చాత్పూజ్యా వయం నరైః ।
వయం చ పూజితాస్సర్వే నాయం చాపూజితో యదా ॥23॥

అస్మిన్నపూజితే దేవాః పరపూజాకృతా యది ।
తదా తత్ఫలహానిః స్యాత్ నాత్ర కార్యా విచారణా ॥24॥

సురవరులం మేము ముగ్గురుమూ ముల్లోకాలలోనూ ఎలా పూజనీయులమో అలాగే ఇకనుంచీ ఈ గణనాథుడు అందరిచేతా పూజనీయుడు. మేము ప్రకృతిస్వరూపులమైనట్టే ఇతడూ ప్రకృతిస్వరూపుడు. కనక మాలాగానే పూజ్యుడు. ఇతడు విఘ్నవారకుడు. అందరికీ అన్ని కోరికలనూ ఫలప్రదం చేస్తాడు. మానవులు ముందుగా ఇతడిని పూజించి అటుపైని మాత్రమే మమ్మల్ని పూజించాలి. ఇతడిని పూజించకపోతే మమ్మల్ని పూజించనట్టే. అలాగే ఇతణ్ని ముందు అర్చించకుండా ఎందరు దేవతలకు ఎంత గొప్పపూజలు చేసినా ఫలం ఉండదు. ఈ విషయంలో చర్చ లేదు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వా స గణేశానో నానావస్తుభిరాదరాత్ ।
శివేన పూజితః పూర్వం విష్ణునానుప్రపూజితః ॥25॥

బ్రహ్మణా చ మయా తత్ర పార్వత్యా చ ప్రపూజితః ।
సర్వైర్దేవైర్గణైశ్చైవ పూజితః పరయా ముదా ॥26॥

సర్వై ర్మిలిత్వా తత్రైవ బ్రహ్మవిష్ణుహరాదిభిః ।
సగణేశశ్శివా తుష్టై సర్వాధ్యక్షో నివేదితః ॥27॥

పునశ్చైవ శివేనాస్మై సుప్రసన్నేన చేతసా ।
సర్వదా సుఖదా లోకే వరా దత్తా హ్యనేకశః ॥28॥

నారదా! ఇలా మేము ప్రకటించాక ముందుగా శివుడు అనేక పూజాద్రవ్యాలతో ఆదరంగా గణేశుణ్ని అర్చించాడు. అటుపైని శ్రీహరి, అతడి తరవాత నేనూ అర్చించాం. పార్వతీదేవి కూడా పూజించింది. సకల దేవతలూ, శివగణాలూ పరమానందంతో అర్చించారు. అయ్యాక, అందరితోనూ కలిసి త్రిమూర్తులం మేము ముగ్గురమూ అక్కడే పార్వతీదేవి తృప్తికోసం గణేశుణ్ని సర్వాధ్యక్షుడుగా ప్రకటించాం. ప్రసన్నమానసుడై శివుడు లోకంలో ఎల్లవేళలా అందరికీ సుఖప్రదాలైన వరాలు అనేకం మరొక్కసారి గణేశుడికి అందించాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

హే గిరీంద్రసుతా పుత్ర! సంతుష్టో ఽహం న సంశయః ।
మయి తుష్టే జగత్తుష్టం విరుద్ధః కోఽపి నో భవేత్ ॥29॥

బాలరూపోఽపి యస్మాత్త్వం మహావిక్రమకారకః ।
శక్తిపుత్రస్తేజస్వీ తస్మాద్భవ సదా సుఖీ ॥30॥

త్వన్నామ విఘ్నహంతృత్వే శ్రేష్ఠం చైవ భవత్వితి ।
మమ సర్వగణాధ్యక్షః సంపూజ్యస్త్వం భవాధునా ॥31॥

ఓ పార్వతీపుత్రా! నేను సంతుష్టి చెందాను. సందేహం లేదు. నేను సంతుష్టుణ్ని అయితే సర్వజగత్తూ సంతుష్టమైనట్టే. దీనికి తిరుగులేదు. బాలుడివే అయినా మహాపరాక్రమం చూపించావు. సాక్షాత్తు శక్తిపుత్రుడివి.

మహాతేజస్వివి. అంచేత ఎల్లవేళలా సుఖంగా జీవించు. విఘ్నాలను తొలగించే విషయంలో నీ నామధేయమే సర్వోత్తమం అగుగాక! నా సర్వగణాలకూ నువ్వు ఇప్పుడు అధ్యక్షుడివి. అలా అర్చితుడివి అవుదువుగాక!

ఏవముక్త్వా శంకరేణ పూజావిధిరనేకశః ।
ఆశిషశ్చాప్యనేకా హి కృత్వాస్తస్మింస్తు తత్క్షణాత్ ॥32॥

తతో దేవగణాశ్చైవ గీతం వాద్యం చ నృత్యకమ్ ।
ముదా తే కారయామాసుస్తథైవాప్సరసాం గణాః ॥33॥

పునశ్చైవ వరో దత్తస్సుప్రసన్నేన శంభునా ।
తస్మై చ గణనాథాయ శివేనైవ మహాత్మనా ॥34॥

శంకరుడు ఇలా పలికి, అనేక పూజావిధులు ఏర్పరిచి, ఆ క్షణంలో అతడికింకా అనేకాశీస్సులు అందించాడు. అంతట దేవతలూ, శివగణాలూ, అప్సరసలూ గీతవాద్యనృత్యాలతో ఆనందోత్సవం నిర్వహించారు. శంభుడు మరింతగా సుప్రసన్నుడయ్యాడు. మహాత్ముడు గదా శివుడు. గణనాథుడికి మళ్ళీ మరొక వరం ఇచ్చాడు.

చతుర్థ్యాం త్వం సముత్పన్నో భాద్రే మాసి గణేశ్వర ।
అసితే చ తథా పక్షే చంద్రస్యోదయనే శుభే ॥35॥

ప్రథమే చ తథా యామే గిరిజాయాస్సుచేతసః ।
ఆవిర్బభూవ తే రూపం యస్మాత్తే వ్రతముత్తమమ్ ॥36॥

తస్మాత్తద్దినమారభ్య తస్యామేవ తిథౌ ముదా ।
వ్రతం కార్యం విశేషేణ సర్వసిద్ధ్యై సుశోభనమ్ ॥37॥

గణేశ్వరా! విను. భాద్రపదమాసంలో కృష్ణపక్షంలో చవితి నాటి తొలిజామున చంద్రోదయ శుభముహూర్తాన పార్వతీదేవి మనస్సు నుంచి నీ రూపం ఆవిర్భవించింది. కనక నీ ఉత్తమవ్రతాన్ని ఆనాడు ఆరంభించి కానీ, లేదా ఆనాడే కానీ చెయ్యాలి. ఆనందంగా చెయ్యాలి. ఇది సర్వసిద్ధిప్రదమూ, సుశోభనమూ అయిన వ్రతం కనుక విశేషంగా చెయ్యాలి.

యావత్పునస్సమాయాతి వర్షాంతే చ చతుర్థికా ।
తావద్వ్రతం చ కర్తవ్యం తవ చైవ మమాజ్ఞయా ॥38॥

సంసారే సుఖమిచ్ఛంతి యేఽతులం చాప్యనేకశః ।
త్వాం పూజయంతు తే భక్త్యా చతుర్థ్యాం విధి పూర్వకమ్ ॥39॥

ఏడాది గడిచి మళ్ళీ చతుర్థి వచ్చేదాకా అంటే ఏడాది పొడవునా – ఈ వ్రతం చెయ్యాలి. ఇది నా ఆజ్ఞ. జీవితంలో అనేక విధాలుగా అన్నింటా సాటిలేని సుఖం కోరుకునే వారంతా భక్తితో చతుర్థినాడు శుచిగా నియమబద్ధంగా నిన్ను పూజింతురుగాక!

మార్గశీర్షే తథా మాసే రమాయా వై చతుర్థికా।
ప్రాతఃస్నానం తదా కృత్వా వ్రతం విప్రాన్నివేదయేత్ ॥40॥

మార్గశీర్షమాసంలో శ్రీచతుర్థినాడు (కృష్ణపక్షం చవితి) తెల్లవారుజామునే లేచి, స్నానం చేసి, ఈ వ్రతం ఆచరించాలి. అటుపైని వేదవిదులైన విప్రులకు నివేదన జరపాలి. మార్గశిర కృష్ణచతుర్థికి రమాచతుర్థి అనిపేరు.

దూర్వాభిః పూజనం కార్యముపవాసస్తథావిధః ।
రాత్రేశ్చ ప్రహరే జాతే స్నాత్వా సంపూజయేన్నరః ॥41॥

మూర్తిం ధాతుమయీం కృత్వా ప్రవాళసంభవాం తథా ।
శ్వేతార్క సంభవాం చాపి మార్దికాం నిర్మితాం తథా ॥42॥

ప్రతిష్ఠాప్య తదా తత్ర పూజయేత్ప్రయతః పుమాన్ ।
గంధైర్నానావిధైర్దివ్యైశ్చందనైః పుష్పకైరిహ॥43॥

గరికతో నీ పూజ నిర్వహించాలి. ముందురోజు ఉపవాసం ఉండాలి. రాత్రి చివరి జామున లేచి, స్నానం చేసి, మానవుడు నీ పూజ చెయ్యాలి. ముందుగా నీ మూర్తిని తయారుచేసుకోవాలి. లోహంతో గానీ, ప్రవాళాలతో గానీ (పగడాలు), తెల్లజిల్లేడు కర్రతో గానీ, లేదంటే మట్టితో గానీ తయారుచేసుకోవచ్చు. ఆ మూర్తిని ప్రతిష్ఠాపించి ప్రాణప్రతిష్ఠచేసి నరుడు ఏకాగ్రతతో అర్చించాలి. గంధచందనాది పరిమళద్రవ్యాలతో పువ్వులతో అర్చించాలి.

వితస్తి మాత్రా దూర్వా చ వ్యంగా వై మూలవర్జితా ।
ఈదృశానాం తద్బలానాం శతేనైకోత్తరేణ హ ॥44॥

ఏకవింశతికేనైవ పూజయేత్ ప్రతిమాం స్థితామ్ ।
ధూపైర్దీపైశ్చ నైవేద్యైర్వివిధైర్గణనాయకమ్ ॥45॥

తాంబూలాద్యర్ఘసద్ద్రవ్యైః ప్రణిపత్య స్తవైస్తథా ।
త్వాం తత్ర పూజయిత్వేత్థం బాలచంద్రం చ పూజయేత్ ॥46॥

పన్నెండంగుళాల పొడవున్న గరికలను ఎంచుకోవాలి. వాటికి కణుపులు, వేళ్ళూ తొలగించి సిద్ధం చేసుకోవాలి. అలాంటి దృఢమైన నూటొక్కగరికలతో నీ ప్రతిమను పూజించాలి. ఇరవైయొక్క రకాల పత్రాలతోనైనా పూజించవచ్చు. ధూప దీప నైవేద్యాలు గణ నాయకుడివైన నీకు సమర్పించాలి. అర్ఘపాద్య తాంబూలాదులూ నివేదించాలి. సాష్టాంగనమస్కారం చెయ్యాలి. స్తోత్రాలు పఠించాలి. ఇలా నిన్ను అర్చించిన తరవాత బాలచంద్రుణ్ణీ పూజించాలి.

పశ్చాద్విప్రాంశ్చ సంపూజ్య భోజయేన్మధురైర్ముదా ।
స్వయం చైవ తతో భుంజ్యా న్మధురం లవణం వినా ॥47॥

విసర్జయేత్తతః పశ్చాన్నియమం సర్వమాత్మనః ।
గణేశస్మరణం కుర్యాత్సంపూర్ణం స్యాద్వ్రతం శుభమ్ ॥48॥

అటుపైని విప్రుల్ని పూజించి, వారికి సంతోషంగా మధుర పదార్థాలతో విందు ఆరగింపజెయ్యాలి. తరువాత తాను ఉప్పులేకుండా తీపి వంటకాలు భుజించాలి. ఇది అయిన తరవాత వ్రతనియమాలనన్నింటినీ విడిచిపెట్టాలి. గణేశనామజపం చెయ్యాలి. దీనితో శుభప్రదమైన ఈ వ్రతం సంపూర్ణం అవుతుంది.

ఏవం వ్రతేన సంపూర్ణే వర్షే జాతే నరస్తదా ।
ఉద్యాపనవిధిం కుర్యాత్ వ్రత సంపూర్తి హేతవే ॥49॥

ఇలా ఈ వ్రతంలో ఏడాది గడిచాక, ఆ భక్తుడు వ్రతసంపూర్తిసూచకంగా ఉద్యాపన నిర్వహించాలి.

ద్వాదశబ్రాహ్మణాస్తత్ర భోజనీయా మదాజ్ఞయా ।
కుంభమేకం చ సంస్థాప్య పూజ్యా మూర్తిస్త్వదీయికా ॥50॥

స్థండిలే ఽష్టదళం కృత్వా తదా వేదవిధానతః ।
హోమశ్చైవాత్ర కర్తవ్యో విత్తశాఠ్యవివర్జితైః ॥51॥

ఉద్యాపననాడు పన్నెండు మంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. ఇది నా ఆజ్ఞ. కలశం స్థాపించి నీ మూర్తిని అర్చించాలి. చదునైన నేలమీద అష్టదళపద్మం వేసి, దాని మీద హోమకుండం ఏర్పరిచి, వేదం చెప్పిన పద్ధతిలో హోమం చెయ్యాలి. ఈ వ్రతం, ఈ హోమం చేసే యజమానులకు ధనవ్యయం పట్ల పిసినారితనం ఉండకూడదు.

స్త్రీద్వయం చ తథా చాత్ర వటుకద్వయమాదరాత్ ।
భోజయేత్పూజయిత్వా వై మూర్త్యగ్రే విధిపూర్వకమ్ ॥52॥

ఇద్దరు ముత్తైదువులనూ, ఇద్దరు బ్రహ్మచారులనూ ఆదరంగా ఆహ్వానించి, నీ మూర్తి యెదుట నియమపూర్వకంగా అర్చించి విందు ఆరగింపచెయ్యాలి.

నిశి జాగరణం కార్యం పునః ప్రాతః ప్రపూజయేత్ ।
విసర్జనం తతశ్చైవ పునరాగమనాయ చ ॥53॥

ఆనాటి రాత్రి అంత జాగరణం చెయ్యాలి. తెల్లవారగానే పునః పూజ జరపాలి. అటుపైని 'పునరాగమనాయ చ' – మంత్రంతో ఉద్వాసన పలికి ప్రతిమావిసర్జనం చెయ్యాలి.

బాలకాచ్ఛాశిషో గ్రాహ్యాః స్వస్తివాచనమేవ చ ।
పుష్పాంజలిం ప్రదద్యాచ్చ వ్రతసంపూర్ణహేతవే ॥54॥

నమస్కారాంస్తతః కృత్వా నానాకార్యం ప్రకల్పయేత్।
ఏవం వ్రతం కృతం యేన తస్యేప్సితఫలం భవేత్ ॥55॥

ఆ వేదవటువు నుంచి స్వస్తివాచనపూర్వకంగా ఆశీస్సులు అందుకోవాలి. వ్రతసంపూర్తి సూచకంగా మంత్రపుష్పం సమర్పించాలి. సాష్టాంగనమస్కారాలూ ఇంకా చెయ్యవలసిన అనేక విధులూ నిర్వహించాలి. ఇలా భక్తి శ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరించినవారికి అభీష్టఫలం లభించి తీరుతుంది.

యో నిత్యం శ్రద్ధయా సార్ధం పూజాం చైవ స్వశక్తితః ।
కుర్యాత్తవ గణేశాన! సర్వకామఫలాప్తయే ॥56॥

గణేశా! అభీష్టాలన్నీ నెరవేరాలంటే నిత్యమూ నిన్ను పూజించాలి. శ్రద్ధగా అర్చించాలి. శక్త్యనుసారం సేవించాలి.

సిందూరైశ్చందనైశ్చైవ తండులైః కేతకైస్తథా ।
ఉపచారైరనేకైశ్చ పూజయేత్ త్వాం గణేశ్వరమ్ ॥57॥

ఏవం త్వాం పూజయేయుర్యే భక్త్యా నానోపచారతః ।
తేషాం సిద్ధిర్భవేన్నిత్యం విఘ్ననాశో భవేదిహ ॥58॥

సర్వైర్వ ర్ణైః ప్రకర్తవ్యా స్త్రీభిశ్చైవ విశేషతః ।
ఉదయాభిముఖైశ్చైవ రాజభిశ్చ విశేషతః ॥59॥

యం యం కామయతే యో వై తం తమాప్నోతి నిశ్చితమ్।
అతః కామయమానేన తేన సేవ్యస్సదా భవాన్ ॥60॥

అభీష్టాలన్నీ నెరవేరాలంటే అతడు గణేశ్వరుడవైన నిన్ను సిందూరచందనాదులతోను, అక్షతలతోను (బియ్యం) షోడశానేక ఉపచారాలతోను శ్రద్ధగా పూజించాలి. ఇలా సకలోపచారాలతోనూ భక్తితో నిన్ను పూజించిన వారికి విఘ్నాలన్నీ తొలగిపోయి కోరికలన్నీ సిద్ధిస్తాయి. అన్ని వర్ణాలవారు ఈ పూజ చెయ్యవచ్చు. విశేషించి స్త్రీలందరూ ఆచరించవలసినది. వృద్ధిని కోరుకునే రాజులు తప్పక నిన్ను పూజించాలి. ఎవరు ఏది కోరుకుంటే అది తప్పకుండా నెరవేరుతుంది. కనక కోరికలున్నవారు ప్రధానంగా నిత్యమూ నిన్ను సేవించాలి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

శివేనైవం తదా ప్రోక్తం గణేశాయ మహాత్మనే ।
తదానీం దేవతైశ్చైవ సర్వైశ్చ ఋషిసత్తమైః ॥61॥

తథేత్యుక్త్వా తు తై స్సర్వైర్గణైః శంభుప్రియైర్మునే ॥
పూజితో హి గణాధీశో విధినా పరమేణ సః ॥62॥

తతశ్చైవ గణాస్సర్వే ప్రణేముస్తే గణేశ్వరమ్ ।
సమానర్చుర్విశేషణ నానావస్తుభిరాదరాత్ ॥63॥

నారదా! మహాత్ముడైన గణేశుడికి శివుడు ఇలా వివరించి చెప్పాడు. అది విన్న దేవతలూ, ఋషీశ్వరూలూ, శంభుప్రియులైన గణాలవారూ అందరూ వెంటనే పరమనిష్ఠతో గణాధీశుణ్ణి పూజించారు. అందరూ సాష్టాంగ పడ్డారు. రకరకాల వస్తువులతో, పూజాద్రవ్యాలతో చాలా విశేషంగా చాలా ఆదరంగా అర్చించారు.

గిరిజాయాస్సముత్పన్నో యశ్చ హర్షో మహామునే ।
చతుర్భిర్వదనైర్వై తమవర్ణం చ కథం బ్రువే ॥64॥

మహామునీ! ఆ సమయంలో పార్వతీదేవికి కలిగిన ఆనందం వర్ణనాతీతం. నాకున్న నాలుగు ముఖాలూ చాలవు, మరి ఆ ఆనందాన్ని ఎలా వర్ణించగలను?

దేవదుందుభయో నేదుర్ననృతుశ్చాప్సరో గణాః ।
జగుర్గంధర్వముఖ్యాశ్చ పుష్పవర్షం పపాత హ ॥65॥

జగత్స్వాస్థ్యం తదా ప్రాప గణాధీశే ప్రతిష్ఠితే ।
మహోత్సవో మహానాసీత్ సర్వం దుఃఖం క్షయం గతమ్ ॥66॥

దేవదుందుభులు మ్రోగాయి. అప్సరసలు నాట్యం చేశారు. గంధర్వులు గానం చేశారు. పుష్పవృష్టి కురిసింది. గణాధీశుడు అలా అధ్యక్షస్థానంలో ప్రతిష్ఠుడయ్యే సరికల్లా జగత్తుకంతటికీ స్వస్థత చేకూరింది. అంతటా ఒక మహోత్సవం వెల్లివిరిసింది. సమస్తదుఃఖమూ అంతమైపోయింది.

శివా శివౌ చ మోదేతాం విశేషేణాతి నారద ।
ఆసీత్సుమంగళం భూరి సర్వత్ర సుఖదాయకమ్ ॥67॥

తతో దేవగణాస్సర్వే ఋషీణాం చ గణాస్తథా ।
సమాగతాశ్చ తే తత్ర జగ్ముస్తే తు శివాజ్ఞయా ॥68॥

నారదా! విశేషించి శివాశివులు చాలా ఆనందించారు. అంతటా సుఖప్రదంగా అందరికీ శుభం జరిగింది. ఇక దేవ– శివగణాలూ, ఋషిగణాలూ శివుడి దగ్గర సెలవు తీసుకుని నిష్క్రమించారు.

ప్రశంసంతశ్శివాం తత్ర గణేశం చ పునః పునః ।
శివం చైవ తథా స్తుత్వా కీదృశం యుద్ధమేవ చ ॥69॥

పార్వతీదేవిని ప్రశంసిస్తూ, గణేశుణ్ని అభినందిస్తూ, శివుణ్ని మెచ్చుకుంటూ ఆహా! ఎలాంటి యుద్ధం జరిగింది ఓహో ! అని తలుచుకుంటూ– దేవగణాలూ, ఋషిగణాలూ నిష్క్రమించాయి.

యదా సా గిరిజాదేవీ కోపహీనా బభూవ హ ।
శివోఽ పి గిరిజాం తత్ర పూర్వవత్సంప్రపద్య తామ్ ॥70॥

చకార వివిధం సౌఖ్యం లోకానాం హితకామ్యయా ।
స్వాత్మారామోఽ పి పరమో భక్తకార్యోద్యతః సదా ॥71॥

నారదా! గిరిజాదేవికి కోపం పూర్తిగా తగ్గాక, శివుడు ఆమెకు చేరువై మునుపటిలాగానే లోకహితం కోరి వివిధసౌఖ్యాలు అందించాడు. ఆయన పరాత్పరుడు, స్వాత్మారాముడు. అయినా నిరంతరం భక్త సంరక్షణ తత్పరుడు.

విష్ణుశ్చ శివమాపృచ్ఛ్య బ్రహ్మాహం తం తథైవ హి ।
ఆగచ్ఛావ స్వధామం చ శివౌ సంసేవ్య భక్తితః ॥72॥

నేనూ, విష్ణుమూర్తీ కూడా అలాగే శివుడి దగ్గర సెలవు తీసుకుని ఆ దంపతుల్ని ఇద్దరినీ మరొకసారి సేవించి, మా నివాసాలకు మేము తిరిగి వచ్చాం.

నారద! త్వం చ భగవన్ సంగీయ శివయోర్యశః ।
అగమో భవనం స్వం చ శివౌ పృష్ట్వా మునీశ్వర ॥73॥

ఏతత్తే సర్వమాఖ్యాతం మయా వై శివయోర్యశః ।
భవత్ప్రేష్ణేన విఘ్నేశ యశస్సమ్మిశ్రమాదరాత్ ॥74॥

నారద! జ్ఞానీ! నువ్వుకూడా అలాగే శివాశివుల యశస్సును సంకీర్తించి, అనుమతి తీసుకుని, నీ నివాసానికి తరలివెళ్ళావు. చెప్పమని నువ్వు అడిగావు కాబట్టి ఇలా విఘ్నేశ్వర్వుడి యశస్సుతో సమ్మిశ్రితమైన పార్వతీపరమేశ్వరుల యశస్సును నీకు సమగ్రంగా వివరించాను.

ఇదం సుమంగళాఖ్యానం యః శృణోతి సుసంయతః ।
సర్వమంగళసంయుక్తః స భవేన్మంగళాలయః ॥75॥

అపుత్రో లభతే పుత్రం నిర్ధనో లభతే ధనమ్।
భార్యార్థీ లభతే భార్యాం ప్రజార్థీ లభతే ప్రజామ్ ॥76॥

ఆరోగ్యం లభతే రోగీ సౌభాగ్యం దుర్భగో లభేత్ ।
నష్టపుత్రం నష్టధనం ప్రోషితా చ పతిం లభేత్ ॥77॥

శోకావిష్టః శోకహీనః స భవేన్నాత్ర సంశయః ।
ఇదం గణేశమాఖ్యానం యస్య గేహే చ తిష్ఠతి ॥78॥

సదా మంగళసంయుక్తః స భవేన్నాత్ర సంశయః ।
యాత్రాకాలే చ పుణ్యాహే యః శృణోతి సమాహితః ॥
సర్వాభీష్టం చ లభతే శ్రీగణేశప్రసాదతః ॥79॥

ఇది శుభప్రదమైన ఆఖ్యానం. శ్రద్ధగా దీన్ని విన్న వ్యక్తులకు సమస్తశుభాలూ కలుగుతాయి. వారే శుభాలయలు అవుతారు. సంతానహీనులకు సంతానం, ధనహీనులకు ధనం, భార్యార్థికి భార్య, ప్రజార్థికి ప్రజ, ఆరోగ్యార్థికి ఆరోగ్యం, అసుందరుడికి సౌందర్యం, ప్రోషితపతికి పతి, నష్టపుత్రునకు పుత్రుడు, నష్టధనునకు ధనం, లభించడం నిశ్చయం. శోకావిష్టులు వింటే వారి శోకం తొలగిపోతుంది. నిస్సంశయం. ఈ గణేశాఖ్యానం గ్రంథరూపంగా ఉన్న ఇల్లు నిత్యం మంగళనిలయమే అవుతుంది. ప్రయాణసమయంలో గానీ మంచిరోజున గానీ దీన్ని ఏకాగ్రచిత్తంతో వింటే శ్రీగణేశుడి అనుగ్రహం వల్ల సర్వాభీష్టాలూ నెరవేరతాయి.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే గణేశగణాధిపపదవీ వర్ణనం నామ అష్టాదశోఽధ్యాయః ॥18॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు గణేశగణాధిపపదవీ వర్ణనం అనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనవింశోఽధ్యాయః – పందొమ్మిదవ అధ్యాయం

గణేశవివాహోపక్రమః – గణేశవివాహోపక్రమం

నారద ఉవాచ – నారదుడు అన్నాడు.

గణేశస్య శ్రుతా తాత సమ్యగ్జనిరనుత్తమా ।
చరిత్ర మపి దివ్యం వై సుపరాక్రమభూషితమ్ ॥1॥

తతః కిమభవత్తాత! తత్త్వం వద సురేశ్వర ।
శివాశివయశఃస్ఫీతం మహానందప్రదాయకమ్ ॥2॥

తండ్రీ! ఉత్తమోత్తమమైన గణేశజన్మవృత్తాంతం విన్నాను. మహాపరాక్రమంతో విరాజిల్లిన అతడి దివ్య చరిత్రను ఆలకించాను. దేవాధిదేవా! అటుపైని ఏమి జరిగింది? శివాశివుల యశస్సుతో అలరారుతూ అంతులేని ఆనందాన్ని అందించే ఆ వృత్తాంతాన్ని దయచేసి వాస్తవంగా నాకు వినిపించు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

సాధు పృష్టం మునిశ్రేష్ఠ భవతా కరుణాత్మనా ।
శ్రూయతాం దత్తకర్ణో హి వక్ష్యేఽహం ఋషిసత్తమ ॥3॥

శివా శివశ్చ విప్రేంద్ర ద్వయోశ్చ సుతయోః పరమ్ ।
దర్శం దర్శం చ తల్లీలాం మహత్ప్రేమసమావహత్ ॥4॥

పిత్రోర్లాలయతోస్తత్ర సుఖం చాతి వ్యవర్ధత ।
సదా ప్రీత్యా ముదా చాతి ఖేలనం చక్రతుస్సుతౌ ॥5॥

మునివరా! మంచి విషయం అడిగావు. నీది మెత్తని హృదయం. ఋషిసత్తమా! నువ్వడిగింది చెబుతున్నాను. చెవులప్పగించి ఆలకించు. శివా శివమూర్తులకు తమ ఇద్దరు కొడుకుల లీలా విలాసాలు చూసినకొద్దీ చూడాలనిపిస్తూ ఏంతో ప్రేమనూ ఆనందాన్నీ కలిగిస్తున్నాయి. తల్లిదండ్రుల లాలనతో ఆ తనయులకూ సుఖమూ, సంతోషమూ వర్ధిల్లుతున్నాయి. నిరంతరం ఉల్లాసంగా ఉత్సాహంగా ఆనందంగా ఆడుకుంటున్నారు.

తావేవ తనయౌ తత్ర మాతాపిత్రోర్మునీశ్వర ।
మహాభక్త్యా యదా యుక్తౌ పరిచర్యాం ప్రచక్రతుః ॥6॥

షణ్ముఖే చ గణేశే చ పిత్రోస్తదధికం సదా ।
స్నేహో వ్యవర్ధత మహాన్ శుక్లపక్షే యథా శశీ ॥7॥

మునీశ్వరా! ఆడుకోవడమే కాదు ఆ తనయులిద్దరూ జంటగా తమ తల్లిదండ్రులకు ఎంతో భక్తితో పరిచర్యలు కూడా చేస్తున్నారు. దీనితో పార్వతీపరమేశ్వరులకు అటు షణ్ముఖుని మీదా ఇటు గణేశుని మీదా ఎంతో వాత్సల్యం శుక్లపక్షంలో చంద్రకళలాగా దినదినాభివృద్ధి చెందింది.

కదాచిత్తౌ స్థితౌ తత్ర రహసి ప్రేమసంయుతౌ ।
శివాశివశ్చ దేవర్షే! సువిచారపరాయణౌ ॥8॥

దేవర్షీ! ఇలా కాలం గడవగా– ఒకనాడు పార్వతీపరమేశ్వరులు తమ ఏకాంతంలో ప్రేమతో కూడియుండి తమ పుత్రులగురించి ఆలోచించారు.

శివాశివావూచతుః – పార్వతీపరమేశ్వరులు అన్నారు.

వివాహయోగ్యౌ సంజాతౌ సుతావితి చ తావుభౌ ।
వివాహశ్చ కథం కార్యః పుత్రయోరుభయోశ్శుభమ్ ॥9॥

షణ్ముఖశ్చ ప్రియతమో గణేశశ్చ తథైవ చ ।
ఇతి చింతాసముద్విగ్నౌ లీలానందౌ బభూవతుః ॥10॥

పిల్లలు ఇద్దరూ వివాహయోగ్యులయ్యారు. ఇద్దరికీ ఆ వయస్సు వచ్చింది. శుభప్రదంగా వివాహం చెయ్యాలి. ఇద్దరికీ ఎలాగ? షణ్ముఖుడు ప్రియతముడు. గణేశుడు అలాగే. ఇద్దరికీ ఒకేసారి వివాహం చెయ్యడం ఎలా చెప్మా అని ఇద్దరూ లీలానందానుభూతిలో చింతా సముద్విగ్నులయ్యారు.

స్వపిత్రోర్మతమాజ్ఞాయ తౌ సుతావపి సంస్పృహౌ ।
తదిచ్ఛయా వివాహార్థం బభూవతురథో మునే ॥11॥

అహం చ పరిణేష్యామి హ్యహం చైవ పునఃపునః ।
పరస్పరం చ నిత్యం వై వివాదే తత్పరావుభౌ ॥12॥

నారదమునీ! తల్లిదండ్రుల అభిప్రాయాన్ని గుర్తించి, వారి ఇచ్ఛానుసారంగానే వివాహాలు చేసుకోవడానికి సుముఖులూ, సంసిద్ధులూ అయ్యారు. షణ్ముఖ గణేశ్వరు లిద్దరూ ముందుగా నేను చేసుకుంటానంటే నేను చేసుకుంటానంటూ వారిద్దరూ అనునిత్యమూ మాటమాటికీ వివాదాలాడుకుంటున్నారు.

శ్రుత్వా తద్వచనం తౌ చ దంపతీ జగతాం ప్రభూ ।
లౌకికాచారమాశ్రిత్య విస్మయం పరమం గతౌ ॥13॥

కిం కర్తవ్యం కథం కార్యో వివాహవిధిరేతయోః ।
ఇతి నిశ్చిత్య తాభ్యాం వై యుక్తిశ్చ రచితాద్భుతా ॥14॥

కదాచిత్సమయే స్థిత్వా సమాహూయ స్వపుత్రకౌ ।
కథయామాసతుస్తత్ర పుత్రయోః పితరౌ తదా ॥15॥

జగత్ప్రభువులైన ఆ దంపతులు పిల్లల వివాదం ఆలకించి, లౌకికాచారం ప్రకారం సాధారణ దంపంతుల్లాగా చాలా ఆశ్చర్యచకితులయ్యారు. కర్తవ్యం ఏమిటి? ఇద్దరికీ వివాహవిధులు ఒకేసారి ఎలా నిర్వహించాలి? ఇది ఆలోచించి వారు ఒక అద్భుతయుక్తిని పన్నారు. ఒకనాడా దంపతులు పుత్రకుల్ని చేరబిల్చి ఇలా చెప్పారు.

శివాశివా ఊచతుః – పార్వతీ పరమేశ్వరులు అన్నారు.

అస్మాకం నియమః పూర్వం కృతశ్చ సుఖదో హి వామ్ ।
శ్రూయతాం సుసుతౌ ప్రీత్యా కథాయావో యథార్థకమ్ ॥16॥

సమౌ ద్వావపి సత్పుత్రౌ విశేషో నాత్ర లభ్యతే ।
తస్మాత్పణః కృతశ్చందః పుత్రయోరుభయోరపి ॥17॥

యశ్చైవ పృథివీం సర్వాం క్రాంత్వా పూర్వముపావ్రజేత్ ।
తస్యైవ ప్రథమం కార్యో వివాహశ్శుభలక్షణః ॥18॥

కుమారులారా! మీ సుఖం కోరి, మీ కోసమని మీ చిన్నప్పుడే మేమొక నియమం చేశాం. అది ఇప్పుడు చెబుతున్నాం, శ్రద్ధగా ఆలకించండి. మీరిద్దరూ మాకు సమానమే. ఎవరూ ఎక్కువా కాదు, తక్కువా కాదు. అంచేత మీ ఇద్దరికీ సుఖప్రదంగా సమంగా ఒక పందెం నిశ్చయించాం. అదేమిటంటే – మీరిద్దరూ ఈ భూగోళాన్ని మొత్తం చుట్టిరావాలి. ఎవరు ముందుగా వస్తే వారికి ముందుగా వివాహం జరుగుతుంది.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

తయోరేవం వచః శ్రుత్వా శరజన్మా మహాబలః ।
జగామ మందిరాత్తూర్ణం పృథివీక్రమణాయ వై ॥19॥

తల్లిదండ్రుల నోటినుంచి ఈ మాట వినడమేమిటి, మహాబలశాలి షణ్ముఖుడు ఇంటినుంచి భూప్రదక్షిణానికి బయలుదేరేశాడు.

గణనాథశ్చ తత్రైవ సంస్థితో బుద్ధిసత్తమః ।
సుబుద్ధ్యా సంవిచార్యేతి చిత్త ఏవ పునః పునః ॥20॥

కిం కర్తవ్యం క్వ గంతవ్యం లంఘితుం నైవ శక్యతే ।
క్రోశమాత్రం గతః స్యాద్వై గమ్యతే న మయా పునః ॥21॥

కిం పునః పృథివీమేతాం క్రాంత్వా చోపార్జితం సుఖమ్ ।
విచార్యేతి గణేశస్తు యచ్చకార శృణుష్వ తత్ ॥22॥

నారదా! గణనాథుడు మాత్రం అక్కడే ఉండిపోయాడు. అతడు బుద్ధిశాలి. లోలోపల బాగా ఆలోచించాడు. ఏమిటి చెయ్యడం? ఎగరడమా? దూకడమా? సాధ్యంకాదే. ఒక క్రోశమైనా నడిచినవాణ్ణి కానా యె. మొత్తం తేలికగా సుఖంగా పృథివిని చుట్టి రాగలనా? ఇలా ఆలోచించి ఏమిచేశాడండే – విను

స్నానం కృత్వా యథా న్యాయం సమాగత్య స్వయం గృహమ్ ।
ఉవాచ పితరం తత్ర మాతరం పునరేవ సః ॥23॥

పద్ధతిగా స్నానం చేసి స్వయంగా ఇంటికి వచ్చి తండ్రితోనూ తల్లితోనూ ఇలా అన్నాడు.

గణేశ ఉవాచ – గణేశుడన్నాడు.

ఆసనే స్థాపితే హ్యత్ర పూజార్థం భవతోరిహ ।
భవంతౌ సంస్థితౌ తాతౌ పూర్యతాం మే మనోరథః ॥24॥

తల్లిదండ్రులారా! మిమ్మల్ని అర్చించడం కోసం ఇవిగో ఆసనాలు ఇక్కడ సిద్ధం చేశాను. దయచేసి వచ్చి వాటిమీద కూర్చోండి. నా కోరిక తీర్చండి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతి శ్రుత్వా వచస్తస్య పార్వతీపరమేశ్వరౌ ।
అస్థాతామాసనే తత్ర తత్పూజా గ్రహణాయ వై ॥25॥

తేనాథ పూజితౌ తౌ చ ప్రక్రాంతౌ చ పునఃపునః ।
ఏవం చ కృతవాన్ సప్త ప్రణామాస్తు తథైవ సః ॥26॥

బద్ధాంజలిరథోవాచ గణేశో బుద్ధిసాగరః ।
స్తుత్వా బహువిధస్థాత పితరౌ ప్రేమవిహ్వతౌ ॥27॥

గణేశుడి విన్నపాన్ని ఆలకించి పార్వతీపరమేశ్వరులు సరే అని అంగీకరించి అతడి పూజలు అందుకోవడానికి ఆ సముచితాసనాలను అధిష్ఠించారు. ఇద్దరినీ అర్చించి గణపతి అనేక పర్యాయాలు ప్రదక్షిణలు చేశాడు. ఏడు ప్రదక్షిణాలు చేసి ఏడు సాష్టాంగనమస్కృతులు చేశాడు. బుద్ధిసాగరుడు ఆ గణేశుడు అంజలి బంధంతో అలాగే నిలబడి బహువిధాలుగా వారిని స్తుతించాడు. దానితో నారదా? జగత్పితరులు పుత్రప్రేమతో ఉక్కిరిబిక్కిరై పోయారు.

గణేశ ఉవాచ – గణేశుడన్నాడు.

భో మాతర్భో పితస్త్వం చ శృణు మే పరమం వచః ।
శీఘ్రం చైవాత్ర కర్తవ్యో వివాహశ్శోభనో మమ ॥28॥

తల్లీ! దయచేసి విను. తండ్రీ! ఆలకించు. అసలైన మాట చెబుతున్నాను. మీరిప్పుడు వెంటనే నా శోభనం వివాహం జరిపించాలి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యేవం వచనం శ్రుత్వా గణేశస్య మహాత్మనః ।
మహాబుద్ధినిధిం తం తౌ పితరావూచతుస్తదా ॥29॥

మహాత్ముడు గణపతి అడిగింది విని ఆ బుద్ధినిధితో పార్వతీపరమేశ్వరులు ఇలా అన్నారు.

శివాశివా వూచతుః – పార్వతీ పరమేశ్వరులు అన్నారు.

ప్రక్రామేత భవాన్ సమ్యక్ పృథివీం చ సకాననామ్ ।
కుమారో గతవాంస్తత్ర త్వం గచ్ఛ పుర ఆవ్రజ ॥30॥

అడవులతో, కడలులతో ఉన్న మొత్తం భూమికి నువ్వు చక్కగా ప్రదక్షిణం చెయ్యి. షణ్ముఖుడు వెళ్ళాడు గదా! నువ్వుకూడా వెళ్ళు, అతడికంటే ముందుగా తిరిగిరా.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యేవం వచనం శ్రుత్వా పిత్రోర్గణపతిర్ద్రుతమ్।
ఉవాచ నియతస్తత్ర వచనం క్రోధసంయుతః ॥31॥

తల్లిదండ్రుల నోటినుంచి ఈ మాట వినడంతోనే గణపతికి క్రోధం ఆవహించింది. అయినా నిలువరించుకుని నిబ్బరంగా ఇలా పలికాడు.

గణేశ ఉవాచ – గణేశుడన్నాడు.

భో మాతర్భో పితర్ధర్మరూపౌ ప్రాజ్ఞౌ యువాం మతౌ ।
ధర్మతః శ్రూయతాం సమ్యక్ వచనం మమ సత్తమౌ ॥32॥

మయా తు పృథివీ క్రాంతా సప్తవారం పునః పునః ।
ఏవం కథం బ్రువాతే వై పునశ్చ పితరావిహ ॥33॥

తల్లిదండ్రులారా! ఉత్తమోత్తములారా! మీరు ధర్మ స్వరూపులు, ప్రాజ్ఞులు నే నెరుగుదును. దయచేసి ధర్మ పద్ధతిలో నా మాటల్ని సరిగా అర్థం చేసుకోండి. నేను భూప్రదక్షిణం చేసేశాను. ఒక్కసారి కాదు. ఏడు సార్లు చేశాను. అయినా ఎందుకనో మరి తల్లిదండ్రులు మీరు ఇలా మాట్లాడుతున్నారు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

తద్వచస్తు తదా శ్రుత్వా లౌకికీం గతిమాశ్రితౌ ।
మహాలీలాకరౌ తత్ర పితరావూచతుశ్చ తమ్ ॥34॥

మహాలీలావిశారదులు పార్వతీపరమేశ్వరులు తమ పుత్రుడి పలుకులు ఆలకించారు. లోకవృత్తి ననుసరించి బదులు పలికారు.

పితరావూచతుః – తల్లిదండ్రులు అడిగారు.

కదా క్రాంతా త్వయా పుత్ర పృథివీ సుమహత్తరా ।
సప్తద్వీపా సముద్రాంతా మహద్భిర్గహనైర్యుతా ॥35॥

నాయనా! గణపతీ! సప్తద్వీపాలతో సప్తసముద్రాలతో దుర్గమారణ్యాలతో సువిశాలమైన ఈ భూమిని నువ్వు ఎప్పుడు ప్రదక్షిణం చేసి వచ్చావు తండ్రీ?

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

తయో రేవం వచః శ్రుత్వా శివాశంకరయోర్మునే ।
మహాబుద్ధినిధిః పుత్రో గణేశో వాక్యమబ్రవీత్ ॥36॥

నారదమునీ! పార్వతీపరమేశ్వరులు ఇలా ప్రశ్నించేసరికి బుద్ధిసాగరుడైన గణేశుడు ఇలా సమాధానం చెప్పాడు.

గణేశ ఉవాచ –గణేశుడు అన్నాడు.

భవతోఃపూజనం కృత్వా శివాశంకరయోరహమ్ ।
స్వబుద్ధ్యా హి సముద్రాంతపృథ్వీకృతపరిక్రమః ॥37॥

ఇత్యేవం వచనం వేదే శాస్త్రే వా ధర్మసంచయే ।
వర్తతే కిం చ తత్తథ్యం న హి కిం తథ్యమేవ వా ॥38॥

పార్వతీపరమేశ్వరుల్ని మిమ్మల్ని అర్చించానంటే నేను మానసికంగా సమస్తభూగోళాన్నీ ప్రదక్షిణం చేసినట్టే. ఇలాగని వేదాలూ, వేదంగాలూ, ధర్మశాస్త్రాలూ చెబుతున్నాయి. ఆ మాట అసత్యమా? సత్యమా?

పిత్రోశ్చ పూజనం కృత్వా ప్రక్రాంతిం చ కరోతి యః ।
తస్య వై పృథివీజన్యఫలం భవతి నిశ్చితమ్ ॥39॥

అపహాయ గృహే యో వై పితరౌ తీర్థమావ్రజేత్ ।
తస్య పాపం తథా ప్రోక్తం హననే చ తయోర్యథా ॥40॥

ఏ వ్యక్తి గానీ తన తల్లిదండ్రుల్ని పూజించి ప్రదక్షిణం చేశాడంటే చాలు అతడికి భూప్రదక్షిణం చేసిన ఫలం లభిస్తుంది. ఇది నిశ్చయం. ఇంటిలో ఉన్న తల్లిదండ్రుల్ని అర్చించక తీర్థయాత్రలకు ఎగబడేవాడికి – వారిని చంపినంతటి మహాపాపం చుట్టుకుంటుంది.

పుత్రస్యహి మహత్తీర్థం పిత్రోశ్చరణపంకజమ్ ।
అన్యతీర్థం తు దూరే వై గత్వా సంప్రాప్యతే పునః ॥41॥

ఇదం సన్నిహితం తీర్థం సులభం ధర్మసాధనమ్ ।
పుత్రస్య చ స్త్రియాశ్చైవ తీర్థం గేహే సుశోభనమ్ ॥42॥

తల్లిదండ్రుల పాదపద్మాలే ఏ తనయుడికైనా మహాపుణ్యతీర్థం. మిగతా తీర్థం ఏదైనా దూరంగానే ఉంటుంది. దానిని ప్రయాస పడి చేరుకోవలసి ఉంటుంది. ఇది మాత్రం చేరువలో ఉండే తీర్థం. సులభమైన తీర్థం. సకల ధర్మసాధకమైన తీర్థం. కొడుకుకి గానీ, కూతురికి గానీ ఇంటిలోనే ఉండే అద్భుతతీర్థం– తల్లిదండ్రుల పాదపద్మాలే.

ఇతి శాస్త్రాణి వేదాశ్చ భాషంతే యన్నిరంతరమ్ ।
భవద్భ్యాం తత్ప్రకర్తవ్యమసత్యం పునరేవ చ ॥43॥

భవదీయం త్విదం రూపమసత్యం చ భవేదిహ ।
తదా వేదో ఽప్యసత్యో వై భవేదితి న సంశయః ॥44॥

వేదాలూ, శాస్త్రాలూ నిరంతరంగా ఘోషిస్తున్న ఈ మాటను మీరు కనక అసత్యం చేస్తే, అప్పుడు మీ ఈ రూపమూ అసత్యమవుతుంది. వేదమూ అసత్యమవుతుంది. సందేహం లేదు.

శీఘ్రం చ భవితవ్యో మే వివాహః క్రియతాం శుభః ।
అథవా వేదశాస్త్రం చ వ్యలీకం కథ్యతామితి ॥45॥

ద్వయోః శ్రేష్ఠతమం మధ్యే యత్స్యాత్సమ్యగ్విచార్యతత్।
కర్తవ్యం చ ప్రయత్నేన పితరౌ ధర్మరూపిణౌ ॥46॥

అందుచేత – శీఘ్రంగా నాకు శుభప్రదమైన వివాహం జరిపించండి. లేదంటే వేదమూ, శాస్త్రమూ అసత్యమని ప్రకటించండి. తల్లిదండ్రులారా! ధర్మస్వరూపులారా! ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠమో బాగా ఆలోచించి, పూనికతో దాన్ని చెయ్యండి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వా పార్వతీపుత్రస్స గణేశః ప్రకృష్టధీః ।
విరరామ మహాజ్ఞానీ తదా బుద్ధిమతాం వరః ॥47॥

తౌ దంపతీ చ విశ్వేశౌ పార్వతీశంకరౌ తదా ।
ఇతి శ్రుత్వా వచస్తస్య విస్మయం పరమం గతాః ॥48॥

తతః శివా శివశ్చైవ పుత్రం బుద్ధివిచక్షణమ్ ।
సుప్రశస్యోచతుః ప్రీత్యా తౌ యథార్థప్రభాషిణమ్ ॥49॥

నారదా! మహామేధావి, మహాజ్ఞాని, మహాబుద్ధిమంతులలో అగ్రగణ్యుడు అయిన పార్వతీపుత్రుడు గణేశుడు ఇలా పలికి ఊరుకున్నాడు. విశ్వేశులు ఆ దంపతులు పార్వతీశంకరులు తమ కుమారుడి మాటలకు చాలా విస్మయం చెందారు. కానీ పుత్రుడి బుద్ధికుశలతను మాత్రం మెచ్చుకున్నారు. యథార్థం మాట్లాడిన కుమారుణ్ని చూస్తూ ప్రేమగా బదులు పలికారు.

శివాశివావూచతుః – పార్వతీపరమేశ్వరులు అన్నారు.

పుత్ర తే విమలా బుద్ధిస్సముత్పన్నా మహాత్మనః ।
త్వయోక్తం యద్వచశ్చైవ తతశ్చైవ చ నాన్యథా ॥50॥

సముత్పన్నే చ దుఃఖే చ యస్య బుద్ధిర్విశిష్యతే ।
తస్య దుఃఖం వినశ్యేత సూర్యే దృష్టే యథా తమః ॥51॥

పుత్రకా! గణేశా! నువ్వు మహాత్ముడివి. నీకు చాలా మంచి ఉపాయం తట్టింది. నువ్వన్నది సత్యమే. మరొకటి కాదు. కష్టం వచ్చిపడినప్పుడు ఎవడి తెలివి ప్రకాశిస్తుందో, మేల్కొంటుందో వాడికి ఆ కష్టమనేది – సూర్యుణ్ని చూసిన చీకటిలాగా– తక్షణమే తొలగిపోతుంది.

బుద్ధిర్యస్య బలం తస్య నిర్బుద్ధేస్తు కుతో బలమ్ ।
కూపే సింహో మదోన్మత్తశ్శశకేన నిపాతితః ॥52॥

ఎవరికైనా గానీ ఉపాయమే బలం. ఉపాయం స్ఫురించనివారికి బలం ఉండీ నిష్ప్రయోజనం. మదోన్మత్తమైన సింహాన్ని ఒక కుందేలు పిల్ల నూతిలోకి కూల్చేసింది గదా!

వేదశాస్త్రపురాణేషు బాలకస్య యథోదితమ్ ।
త్వయా కృతం తు తత్సర్వం ధర్మస్య పరిపాలనమ్ ॥53॥

సమ్యక్కృతం త్వయా యచ్చ తత్కేనాపి భవేదిహ ।
ఆవాభ్యాం మానితం తచ్చ నాన్యథా క్రియతే ఽధునా ॥54॥

ఇత్యుక్త్వా తౌ సమాశ్వాస్య గణేశం బుద్ధిసాగరమ్।
వివాహకరణే చాస్య మతిం చక్రతురుత్తమామ్ ॥55॥

తల్లిదండ్రుల్ని పూజించాలి అని వేదశాస్త్రపురాణాలు ఉద్ఘోషించిన పుత్రధర్మాన్ని నువ్వు పూర్తిగా ఆచరించావు. ఎందుకోసం చేసినా నువ్వు చక్కగా ఆచరించిన ఈ ధర్మాన్ని మేము గౌరవిస్తున్నాం. మరోలా జరగదు – అని బుద్ధి సాగరుడైన గణేశుణ్ని చక్కబరిచి పార్వతీపరమేశ్వరులు అతడికి వివాహం చెయ్యాలి అనే ఉత్తమనిర్ణయం తీసుకున్నారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే గణేశవివాహోపక్రమో నామైకోనవింశోఽధ్యాయః ॥19॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు గణేశవివాహోపక్రమం అనే పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

వింశోఽధ్యాయః – ఇరవైయవ అధ్యాయం

గణేశవివాహవర్ణనమ్ – గణేశవివాహవర్ణనం

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

ఏతస్మిన్నంతరే తత్ర విశ్వరూపః ప్రజాపతిః ।
తదుద్యోగం సంవిచార్య సుఖమాప ప్రసన్నధీః ॥1॥

విశ్వరూప ప్రజేశస్య దివ్యరూపే సుతే ఉభే ।
సిద్ధిర్బుద్ధిరితి ఖ్యాతే శుభే సర్వాంగశోభనే ॥2॥

తాభ్యాం చైవ గణేశస్య గిరిజాశంకరౌ ప్రభూ ।
మహోత్సవం వివాహం చ కారయామాసతుర్ముదా ॥3॥

సంతుష్టా దేవతాస్సర్వాస్తద్వివాహే సమాగమన్ ।
యథా చైవ శివస్యైవ గిరిజాయా మనోరథః ॥4॥

తథా చ విశ్వరూపోఽసౌ వివాహం కృతవాంస్తథా ।
తథా చ ఋషయో దేవా లేభిరే పరమాం ముదమ్ ॥5॥

పార్వతీపరమేశ్వరులు కొడుకు గణేశుడికి వివాహప్రయత్నాలు మొదలుపెట్టారు అనే సమాచారం ప్రజాపతి విశ్వరూపుడికి తెలిసింది. చాలా సంతోషించాడు. అతడి మనస్సు కలతదేరింది. ఆయన ఇద్దరు ఆడపిల్లల తండ్రి. సిద్ధి-బుద్ధి అని వాళ్ళ పేర్లు. ఇద్దరూ సుందరాంగులు. శుభలక్షణసంపన్నలు. సర్వాంగశోభనలు. గిరిజాశంకరులు తమ గణేశుడికి ఈ కన్యకలతో ఆనందంగా మహోత్సవంగా వివాహం జరిపించారు. ఆది దంపతుల కోరిక మేరకు సకలదేవతలూ ఆహూతులై ఈ వివాహానికి వచ్చి చాలా సంతుష్టులయ్యారు. విశ్వ రూపుడు స్వయంగా నిలబడి ఈ వివాహం ఎలా జరిపించాడంటే ఋషులూ, దేవతలూ అంతా పరమానందం పొందారు.

గణేశోఽపి తదా తాభ్యాం సుఖం చైవావ చింతకమ్(?) ।
ప్రాప్తవాంశ్చ మునే తత్తు వర్ణితుం నైవ శక్యతే ॥6॥

కియతా చైవ కాలేన గణేశస్య మహాత్మనః ।
ద్వయోః పత్న్యోశ్చ ద్వౌ దివ్యౌ తస్య పుత్రౌ బభూవతుః ॥7॥

సిద్ధేర్గణేశ పత్న్యాస్తు క్షేమనామా సుతోఽభవత్ ।
బుద్ధేర్లాభాభిదః పుత్రో హ్యాసీత్పరమశోభనః ॥8॥

నారదమునీ! ఆ ఇద్దరు భార్యలతోనూ గణేశుడు పొందిన సుఖసంతోషాలను వర్ణించి చెప్పడం నా వల్ల కాదయ్య! అలా కాలం గడవగా మహాత్ముడు గణేశుడికి సిద్ధివల్ల క్షేముడు, బుద్ధివల్ల లాభుడు అని ఇద్దరు పుత్రులు పరమసుందరులు జన్మించారు.

ఏవం సుఖమచింత్యం వై భుంజానే హి గణేశ్వరే ।
ఆజగామ ద్వితీయశ్చ క్రాంత్వా పృథ్వీం సుతస్తదా ॥9॥

ఇలా గణేశ్వరుడు అచింత్యసుఖసంతోషాలను అనుభవిస్తూండగా ఒకనాడు షణ్ముఖుడు తన పృథ్వీ ప్రదక్షిణం పూర్తి చేసుకుని ఇంటికి తిరిగివచ్చాడు.

తావచ్చ నారదేనైవ ప్రాప్తో గేహే మహాత్మనా ।
యథార్థం వచ్మి నోఽసత్యం న చ్ఛలేన మత్సరాత్ ॥10॥

పితృభ్యాం తు కృతం యచ్చ శివయా శంకరేణ తే ।
తన్న కుర్యాత్పరో లోకే సత్యం సత్యం బ్రవీమ్యహమ్ ॥11॥

నిష్క్రమ్య త్వాం కుక్రమణం మిషముత్పాద్య యత్నతః ।
గణేశస్య వరో ఽ కారి వివాహః పరశోభనః ॥12॥

సరిగ్గా అదే సమయానికి మహాత్మా! నారదా! నువ్వూ ఆ ఇంటికే వచ్చావు. వస్తూనే మొదలు పెట్టావు – షణ్ముఖా! నిజం చెబుతున్నాను. అసత్యం చెప్పడం లేదు. నిన్ను మోసగించాలనీ కాదు, ఒకరి మీద మాత్సర్యంతోనూ కాదు. నీ తల్లిదండ్రులు పార్వతీపరమేశ్వరులు ఏమి చేశారో యథార్థం నీకు తెలియాలి కనక చెబుతున్నాను. ఈలోకంలో అలాంటి పనిని శత్రువు కూడా చెయ్యడు. ఇది ముమ్మాటికీ నిజం. భూప్రదక్షిణం అనే ఒక వంకను కావాలని కల్పించి, నిన్ను వెళ్ళగొట్టి, గణేశుడికి ఉత్తమోత్తమంగా పరమశోభనంగా వివాహం జరిపించారు నీ తల్లిదండ్రులు.

గణేశస్తు కృతోద్వాహో లబ్ధవాన్ స్త్రీద్వయం ముదా ।
విశ్వరూప ప్రజేశస్య కన్యారత్నం మహోత్తమమ్ ॥13॥

పుత్రద్వయం లలాభాసౌ ద్వయోః పత్నోఃశుభాంగయోః ।
సిద్ధేః క్షేమం తథా బుద్ధేర్లాభం సర్వసుఖప్రదమ్ ॥14॥

పత్నోర్ద్వయోర్గణేశో ఽసౌ లబ్ధ్వా పుత్రద్వయం శుభమ్ ।
మాతా పిత్రోర్మతేనైవ సుఖం భుంక్తే నిరంతరమ్ ॥15॥

గణేశుడు అలా పెళ్ళికొడుకై ఆనందంగా ఇద్దరు కన్యలను చెట్టపట్టాడు. విశ్వరూప ప్రజాపతి కూతుళ్ళు వారిద్దరూ సిద్ధి– బుద్ధి అని. ఉత్తమోత్తమకన్యలు. శుభాంగినులు. ఇద్దరినీ వివాహమాడాడు. అప్పుడే ఇద్దరు కొడుకుల్ని కూడా పొందాడు. సిద్ధివల్ల క్షేముడు, బుద్ధివల్ల సర్వసుఖప్రదుడైన లాభుడు అతడికి జన్మించారు.

ఇలా ఇద్దరు భార్యాలనూ, వారివల్ల ఇద్దరు కొడుకులనూ పొంది గణేశుడు హాయిగా తల్లిదండ్రుల సమ్మతితో నిరంతరం సుఖసంతోషాలు అనుభవిస్తున్నాడు.

భవతా పృథివీ క్రాంతా ససముద్రా సకాననా ।
తచ్ఛలాజ్ఞావశాత్తాత తస్య జాతం ఫలం త్విదమ్ ॥16॥

పితృభ్యాం క్రియతే స్మైతచ్ఛలం తాత! విచార్యతామ్।
స్వస్వామిభ్యాం విశేషేణ హ్యన్యః కిం న కరోతి వై ॥17॥

అసమ్యక్చ కృతం తాభ్యాం త్వత్పితృభ్యాం హి కర్మ హ ।
విచార్యతాం త్వయాహీహ మచ్ఛిత్తే న శుభం మతమ్ ॥18॥

బాలకా! వంచనాపూరితమైన నీ తండ్రి ఆజ్ఞను శిరసావహించి మహాసముద్రాలతో, మహారణ్యాలతో నిండిన ఈ భూగోళాన్ని ప్రదక్షిణం చేసివచ్చినవాడివి నువ్వైతే దాని ఫలం దక్కినది మాత్రం ఆ గణేశుడికి. నీకు సర్వాధికారులైనవారు విశేషించి స్వయానా తల్లిదండ్రులే ఇలా వంచన చేస్తే మరొకడు చెయ్యడా? నీ తల్లిదండ్రులు చేసిన పని కచ్చితంగా అసమంజసం. నువ్వుకూడా ఆలోచించు. నా దృష్టిలో ఇది మంచిదీ కాదు, మంగళమూ కాదు.

దద్యాద్యది గరం మాతా విక్రీణీయాత్పితా యది ।
రాజా హరతి సర్వస్వం కస్మై కిం చ బ్రవీతు వై ॥19॥

యేనైవేదం కృతం స్యాద్వై కర్మానర్థకం పరమ్ ।
శాంతికామస్సుధీస్తాత! తన్ముఖం న విలోకయేత్ ॥20॥

ఇతి నీతిః శ్రుతౌ ప్రోక్తా స్మృతౌ శాస్త్రేషు సర్వతః ।
నివేదితా చ సా తేఽద్య యథేచ్ఛసి తథా కురు ॥21॥

కన్న తల్లియే విషం పెడితే, జన్మనిచ్చిన తండ్రియే అమ్మేస్తానంటే, మహారాజే ప్రజల సొమ్ము కాజేస్తే – ఇంక ఎవరితో మొరపెట్టుకోవాలి! నాయనా! షణ్ముఖా! శాంతికాముకుడూ, బుద్ధిమంతుడూ అయినవాడెవ్వడూ– ఇంతటి దారుణమూ, అనర్థకమూ అయిన దుష్కర్మచేసినవాడిముఖం చూడకూడదు అని శ్రుతులూ, స్మృతులూ, శాస్త్రాలూ చెబుతున్న నీతి. అది నీకిప్పుడు చెప్పాను. ఇంక నీ ఇష్టప్రకారం చెయ్యి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వా నారద త్వం తు మహేశ్వరమనోగతిః ।
తస్మై తథా కుమారాయ వాక్యం మౌనముపాగతః ॥22॥

నారదా! మహేశ్వరుడి మనసెరిగి నడుచుకునేవాడివి నువ్వు. షణ్ముఖుడికి ఇలా నూరిపోసి, మౌనంగా నిష్క్రమించావు.

స్కందో ఽపి పితరం నత్వా కోపాగ్ని జ్వలితస్తదా ।
జగామ పర్వతం క్రౌంచం పితృభ్యాం వారితోఽపి సన్ ॥23॥

వారణే కృతే త్వద్య గమ్యతే చ కథం త్వయా ।
ఇత్యేవం చ నిషిద్ధో ఽపి ప్రోచ్య నేతి జగామ సః ॥24॥

న స్థాతవ్యం మయా తాతౌ క్షణమప్యత్ర కించన ।
యద్యేవం కపటం ప్రీతిమపహాయ కృతం మయి ॥25॥

ఏవముక్త్వా గతస్తత్ర మునే సో ఽద్యాపి వర్తతే ।
దర్శనేనైవ సర్వేషాం లోకానాం పాపహారకః ॥26॥

నారదుడు చెప్పినది వింటూనే స్కందుడిలో కోపాగ్నిజ్వాలాలు ఎగసిపడ్డాయి. అయినా తమాయించుకుని తండ్రికి నమస్కరించి, క్రౌంచపర్వతానికి బయలుదేరాడు. తల్లిదండ్రులు వారిస్తున్నా ఆగలేదు. ఆగమంటూంటే వెళ్ళిపోతావేమిటి పుత్రకా! అని ఎంత నిలువరించినా తిరస్కరించి బయలుదేరాడు. తల్లిదండ్రులారా! నా పట్ల ప్రేమకు బదులు ఇలా వంచన చేసిన మీరున్న ఈ చోట నేను ఒక్క క్షణం కూడా ఉండకూడదు. అని బదులు పలికి విసవిసా వెళ్ళిపోయాడు. మహామునీ! నారదా! ఆ షణ్ముఖుడు ఇప్పటికీ అక్కడే ఉంటున్నాడు. కేవలం దర్శనమాత్రం చేతనే సకల లోకులకూ పాపహారకుడు ఆ స్కందుడు.

తద్దినం హి సమారభ్య కార్తికేయస్య తస్య వై ।
శివపుత్రస్య దేవర్షే కుమారత్వం ప్రతిష్ఠితమ్ ॥27॥

తన్నామ శుభదం లోకే ప్రసిద్ధం భువనత్రయే ।
సర్వపాపహరం పుణ్యం బ్రహ్మచర్యప్రదం పరమ్ ॥28॥

దేవర్షీ! అప్పటినుంచీ శివపుత్రుడు కార్తికేయుడు అలా బ్రహ్మచారిగా నిలిచిపోయాడు. ముల్లోకాలలోనూ అతడి నామం– శుభప్రదమనీ, సర్వపాపహరమనీ, పుణ్యదాయకమనీ, బ్రహ్మచర్యప్రదమనీ సుప్రసిద్ధం .

కార్తిక్యాం చ సదా దేవా ఋషయశ్చ సతీర్థకాః ।
దర్శనార్థం కుమారస్య గచ్ఛంతి చ మునీశ్వరాః ॥29॥

కార్తిక్యాం కృత్తికాసంగే కుర్యాద్యః స్వామి దర్శనమ్ ।
తస్య పాపం దహేత్సర్వం చిత్తేప్సితఫలం లభేత్ ॥30॥

ప్రతి కార్తికమాసంలోనూ దేవతలూ, సతీర్థులైన ఋషులు, మునీశ్వరులూ కుమారస్వామి దర్శనం కోసం క్రౌంచపర్వతానికి వెడతారు. కార్తికమాసంలో కృత్తికానక్షత్రం ఉన్నరోజున స్వామి దర్శనం చేసుకుంటే వారి పాపాలు నశిస్తాయి. కోరికలు ఫలిస్తాయి.

ఉమాపి దుఃఖమాపన్నా స్కందస్య విరహే సతి ।
ఉవాచ స్వామినం దీనా తత్ర గచ్ఛ మయా ప్రభో ॥31॥

తత్సుఖార్థం స్వయం శంభుర్గతః స్వాంశేన పర్వతే ।
మల్లికార్జున నామాసీత్ జ్యోతిర్లింగం సుఖావహమ్ ॥32 ॥

అద్యాపి దృశ్యతే తత్ర శివయా సహితశ్శివః ।
సర్వేషాం నిజభక్తానాం కామపూరస్సతాం గతిః ॥33॥

స్కందకుమారుడు అలిగి వెళ్ళిపోయాడని పార్వతిదేవి విలపించింది. బెంగ పెట్టుకుంది. దీనంగా తన భర్తను అభ్యర్థించింది ప్రభూ! ఒక్కసారి వెళ్ళి వద్దాం అని. ఆమెను ఆనందింపజేయడంకోసం శివుడు సరే అని బయలుదేరాడు. క్రౌంచపర్వతం చేరుకున్నారు. అక్కడ పరమశివుడు తన అంశతో ఒక జ్యోతిర్లింగం అయ్యాడు. అదే మల్లికార్జున జ్యోతిర్లింగం. సర్వలోక సుఖావహం. నేటికీ పార్వతీసహితుడై శివుడు అక్కడ దర్శనమిస్తూ, తన భక్తులందరికీ వాంఛితాలు పూరిస్తూ, సత్పురుషులకు ఏడుగడగా విరాజిల్లుతున్నాడు.

తమాగతం స విజ్ఞాయ కుమారస్సశివం శివమ్ ।
సవిరజ్య తతో ఽన్యత్ర గంతుమాసీత్సముత్సుకః ॥34॥

దేవైశ్చ మునిభిశ్చైవ ప్రార్థిత స్సోఽపి దూరతః ।
యోజనత్రయముత్సృజ్య స్థితః స్థానే చ కార్తికః ॥35॥

శివాసమేతుడై శివుడు క్రౌంచపర్వతానికి వచ్చాడని తెలిసి కుమారస్వామి ఆ పర్వతాన్ని విడిచి, మరొకచోటుకి వెళ్ళిపోవడానికి సముత్సుకుడయ్యాడు. కానీ దేవతలూ, మునీశ్వరులూ మరీమరీ అభ్యర్థించడంతో ఆగిపోయి, అదే పర్వతానికి (జ్యోతిర్లింగానికి) మూడు యోజనాల దూరాన కార్తికుడు తన నివాసస్థానం ఏర్పరచుకున్నాడు.

పుత్రస్నేహాతురౌ తౌ వై శివౌ పర్వణి పర్వణి ।
దర్శనార్థం కుమార స్య తస్య నారద! గచ్ఛతః ॥36॥

అమావాస్యాదినే శంభుః స్వయం గచ్ఛతి తత్ర హ ।
పూర్ణమాసీ దినే తత్ర పార్వతీ గచ్ఛతి ధ్రువమ్॥37॥

నారదా! పుత్రవాత్సల్యంతో పరితపిస్తూ పార్వతీపరమేశ్వరులు ప్రతిపర్వదినాన కుమారుణ్ని చూడటం కోసం అక్కడికి వెడుతూ ఉంటారు. అమావాస్యనాడు స్వయంగా శివుడు వెడతాడు. పున్నమినాడైతే తప్పకుండా పార్వతి వెడుతుంది.

యద్యత్తస్య చ వృత్తాంతం భవత్పృష్టం మునీశ్వర! ।
కార్తికస్య గణేశస్య పరమం కథితం మయా ॥38॥

ఏతచ్ఛ్రుత్వా నరో ధీమాన్ సర్వపాపైః ప్రముచ్యతే ।
శోభనాన్ లభతే కామానీప్సితాన్సకలాన్సదా ॥39 ॥

నారదమునీశ్వరా! కార్తిక, గణేశులకు సంబంధించి నువ్వు అడిగిన సమస్తవృత్తాంతాన్నీ తెలియజెప్పాను. ఇది విన్న బుద్ధిమంతుడు సర్వపాపవిముక్తుడవుతాడు. శుభప్రదాలైన అతడి సకలవాంఛలూ నెరవేరతాయి.

యః పఠేత్పాఠయేద్వాపి శృణుయాచ్ఛ్రావయేత్తథా ।
సర్వాన్ కామానవాప్నోతి నాత్ర కార్యా విచారణా ॥40॥

బ్రాహ్మణో బ్రహ్మవర్చస్వీ క్షత్రియో విజయీ భవేత్ ।
వైశ్యో ధనసమృద్ధః స్యాత్ శూద్రస్తత్సమతామియాత్ ॥41॥

ఈ ఘట్టాన్ని చదివినవారికీ, చదివించినవారికీ, విన్నవారికీ, వినిపించినవారికీ కోరికలన్నీ తీరతా యనడంలో సందేహమే లేదు. బ్రహ్మణుడు బ్రహ్మతేజస్వి అవుతాడు. క్షత్రియుడు విజయాలు పొందుతాడు. వైశ్యుడికి ధన సమృద్ధి కలుగుతుంది. శూద్రుడు మహాపురుషసన్నిభుడవుతాడు.

రోగీ రోగాత్ప్రముచ్యేత భయాన్ముచ్యేత భీతియుక్ ।
భూతప్రేతాదిబాధాభ్యః పీడితో న భవేన్నరః ॥42॥

ఏతదాఖ్యానమనఘం యశస్యం సుఖవర్ధనమ్ ।
ఆయుష్యం స్వర్గ్యమతులం పుత్రపౌత్రాదికారకమ్ ॥43॥

అపవర్గప్రదం చాపి శివజ్ఞానప్రదం పరమ్ ।
శివాశివ ప్రీతికరం శివభక్తి వివర్ధనమ్ ॥
శ్రవణీయం సదా భక్తైః నిష్కామైశ్చ ముముక్షుభిః ।
శివాద్వైతప్రదం చైతత్ సదాశివమయం శివమ్ ॥44॥

ఈ కథవింటే – రోగికి రోగవిముక్తి, భీరువుకి భయవిముక్తి, భూతప్రేతాది పీడితుడికి వాటినుంచి విముక్తి లభించి తీరుతుంది. ఇది పరమపవిత్రమైన ఆఖ్యానం. పుణ్యప్రదం. యశస్కరం. సుఖవర్ధకం. ఆయుర్వర్ధకం. ఉత్తమగతిప్రదం. అనుపమానం. పుత్రపౌత్రాభివృద్ధికరం. మోక్షప్రదం. శివజ్ఞానప్రదం. పార్వతీపరమేశ్వరులకు ప్రీతికరం. శివభక్తిని ఇనుమడింపజేస్తుంది. నిష్కాములైన భక్తులూ, ముముక్షువులూ నిరంతరం దీనిని వినాలి. ఇది శివాద్వైతప్రదం. సదాశివమయం. ఇదే శివమ్.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం చతుర్థే కుమారఖండే గణేశవివాహవర్ణనం నామ వింశోఽధ్యాయః ॥20॥

శ్రీశివమహాపురాణం రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండమందు గణేశవివాహవర్ణనం అనే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

రుద్రసంహితలో నాల్గవదైన కుమారఖండం సమాప్తం

పంచమః యుద్ధఖండః – రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండం

ప్రథమోఽధ్యాయః – మొదటి అధ్యాయం

త్రిపురవర్ణనమ్ – త్రిపురవర్ణనం

నారద ఉవాచ – నారదుడు అడిగాడు.

శ్రుతమస్మాభిరానందప్రదం చరితముత్తమమ్ ।
గృహస్థస్యైవ శంభోశ్చ గణస్కందాదిసత్కథమ్ ॥1॥

ఇదానీం బ్రూహి సుప్రీత్యా చరితం వరముత్తమమ్ ।
శంకరో హి యథా రుద్రో జఘాన విహరన్ ఖలాన్ ॥2॥

కథం దదాహ భగవాన్నగరాణి సురద్విషామ్ ।
త్రీణ్యేకేన చ బాణేన యుగపత్కేన వీర్యవాన్ ॥3॥

ఏతత్సర్వం సమాచక్ష్వ చరితం శశిమౌళినః ।
దేవర్షిసుఖదం శశ్వన్మాయావిహరతః ప్రభోః ॥4॥

తండ్రీ! చతుర్ముఖా! గృహస్థుడైన శంభుడి కథ, గణపతి చరిత్ర, స్కందుడి వృత్తాంతం – అన్నీ ఆనందప్రదాలే. ఉత్తమోత్తమాలే. నీ దయవల్ల వినగలిగాం. ఇప్పుడు వీటికన్నా శ్రేష్ఠము, ఉత్తమమూ అయిన మరొక చరితను అడుగుతున్నాను. మరింత సుప్రీతుడవై తెలియపరుచు. శంకరుడు రుద్రుడై విహరిస్తూ దుష్టుల్ని ఎలా సంహరించాడు? రాక్షసుల నగరాలను ఎలా భస్మం చేశాడు? మూడు శత్రుపురాలను ఒకే బాణంతో ఒకేసారి ఎందుకని ఎలా తగులబెట్టాడు? ఎంతటి శక్తిసంపన్నుడు? ఆ ప్రభువు చంద్రమౌళి. మాయావిహారి అయిన ఆయన చరితం దేవతలకూ ఋషులకూ నిరంతరం సుఖప్రదం. దయచేసి ఇది సమగ్రంగా నాకు తెలియజెయ్యి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఏవమేతత్పురా పృష్టో వ్యాసేన ఋషిసత్తమః ।
సనత్కుమారం ప్రోవాచ తదేవ కథయామ్యహమ్ ॥5॥

నారదా ! వెనకటికి ఇదే ప్రశ్నను వ్యాసుడు అడిగితే సనత్కుమారుడు వివరంగా చెప్పాడు. అదే ఇప్పుడు నేను నీకు చెబుతున్నాను. విను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

శృణు వ్యాస మహాప్రాజ్ఞ చరితం శశిమౌళినః ।
యథా దదాహ త్రిపురం బాణేనైకేన విశ్వహృత్ ॥6॥

శివాత్మజేన స్కందేన నిహతే తారకాసురే ।
తత్పుత్రాస్తు త్రయో దైత్యాః పర్యతప్యన్మునీశ్వర ॥7॥

మహాప్రాజ్ఞా! వ్యాసర్షీ! చంద్రశేఖరుడి చరితం ఆలకించు.సృష్టిసంహారకుడు ఆ రుద్రుడు ఒకే ఒక బాణంతో త్రిపురాసురుల్ని ఎలా భస్మం చేశాడో చెబుతున్నాను. విను. శివపుత్రుడు కుమారస్వామి తారకాసురుణ్ని సంహరించాడు గదా! మునీశ్వరా! ఆ దైత్యనాయకుడి ముగ్గురు కుమారులూ. దానికి దారుణంగా దుఃఖించారు.

తారకాక్షస్తు తజ్జ్యేష్ఠో విద్యున్మాలీ చ మధ్యమః ।
కమలాక్షః కనీయాంశ్చ సర్వే తుల్యబలాస్సదా ॥8॥

జితేంద్రియాస్ససన్నద్ధాస్సంయతాస్సత్యవాదినః ।
దృఢచిత్తా మహావీరా దేవద్రోహిణ ఏవ చ ॥9॥

తే తు మేరుగుహాం గత్వా తపశ్చక్రుర్మహాద్భుతమ్ ।
త్రయస్సర్వాన్సుభోగాంశ్చ విహాయ సుమనోహరాన్ ॥10॥

వ్యాసమహర్షీ! ఆ ముగ్గురిలోనూ పెద్దవాడు – తారకాక్షుడు. రెండవవాడు విద్యున్మాలి. చిన్నవాడు కమలాక్షుడు. ముగ్గురూ సమాన బలశాలురు. జితేంద్రియులు. సర్వసన్నద్ధులు. సోదరస్నేహంతో పెనవేసుకున్న వాళ్ళు. సత్యవాదులు. దృఢచిత్తులు. మహావీరులు అన్నీ మంచి గుణాలే – కాకపోతే నిరంతరం దేవద్రోహులు. దేవతల్ని పీడించడమే పని. తండ్రి చనిపోయాక ఈ ముగ్గురూ కలిసి మేరు పర్వతగుహలో అద్భుత తపస్సు చేశారు. మనోహర రాజభోగాలను అన్నింటినీ పరిత్యజించి తీవ్ర తపస్సు చేశారు.

వసంతే సర్వకామాంశ్చ గీతవాదిత్రనిస్స్వనమ్ ।
విహాయ సోత్సవం తేపుస్త్రయస్తే తారకాత్మజాః ॥11॥

గ్రీష్మే సూర్యప్రభాం జిత్వా దిక్షు ప్రజ్వాల్య పావకమ్ ।
తన్మధ్యసంస్థాః సిద్ధ్యర్థం జుహువుర్హవ్యమాదరాత్ ॥12॥

మహాప్రతాపపతితాస్సర్వే ఽప్యాసన్ సమూర్ఛితాః ।
వర్షాసు గతసంత్రాసా వృష్టిం మూర్ధన్యధారయన్ ॥13॥

కన్నులపండువైన వసంతఋతువులో వీరు ముగ్గురూ అన్ని కోరికలనూ విడిచిపెట్టి, గీతవాద్యాలను సైతం బహిష్కరించి, ఉత్సాహంగా తమ తపస్సు కొనసాగించారు. గ్రీష్మర్తువులోనైతే ఎండవేడిమికి తట్టుకుని చుట్టూ నాలుగు దిక్కులా అగ్నిని ప్రజ్వలింపజేసుకుని ఇలా పంచాగ్నిమధ్యంలో ఉండి తపస్సిద్ధికోసం భక్తితో హోమాలు చేశారు. ఆ తాపానికి మూర్ఛిల్లేవారు. వర్షర్తువులో కుంభవృష్టిని జంకూ గొంకూ లేకుండా శిరస్సున భరించేవారు.

శరత్కాలే ప్రసూతం తు భోజనం తు బుభుక్షితాః ।
రమ్యం స్నిగ్ధం స్థిరం హృద్యం ఫలం మూలమనుత్తమమ్ ॥14॥

సంయమాత్ క్షుత్తృషోర్జిత్వా పానాన్యుచ్చావచాన్యపి ।
బుభుక్షితేభ్యో దత్త్వా తు బభూవురుపలా ఇవ ॥15॥

వ్యాసమహర్షీ! శరదృతువులో చెట్టుకి కాసినదే భోజనంగా స్వీకరించారు. అందంగా, స్నిగ్ధంగా, రుచిగా ఉండే మేలైన కందమూలఫలాలే వారి ఆహారం. నిగ్రహంతో ఆకలిదప్పుల్ని జయించి పానీయాలనూ లేహ్యచోష్యాలనూ ఆకొన్నవారికి పంచిపెట్టి తాము శిలల్లాగా నిలబడి తపస్సు సాగించారు.

సంస్థితాస్తే మహాత్మానో నిరాధారాశ్చతుర్దిశమ్ ।
హేమంతే గిరిమాశ్రిత్య ధైర్యేణ పరమేణ తు ॥16॥

తుషారదేహసంఛన్నా జలక్లిన్నేన వాససా ।
ఆసాద్య దేహం క్షేమేణ శిశిరే తోయమధ్యగాః ॥17॥

అనిర్విణ్ణాస్తతస్సర్వే క్రమశోఽవర్ధయంస్తపః ।
తేపుస్తయస్తే తత్పుత్రా విధిముద్దిశ్య సత్తమాః ॥18॥

హేమంతంలో పర్వతశిఖరం మీద ఏ దిక్కునా ఏ ఆధారమూ లేకుండా తపస్సు చేశారు. మంచుకురిసి శరీరాలు మునిగిపోయినా, కట్టుబట్టలు తడిసిపోయినా ధైర్యంగా నిలబడి తపస్సు చేశారు. శిశిరంలోనైతే తెల్లనివస్త్రాలు ధరించి నీటిలో నిలిచి తపస్సులు కొనసాగించారు. ముగ్గురూ ఇలా నిర్వేదపడకుండా బ్రహ్మదేవుణ్ని ఉద్దేశించి క్రమక్రమంగా తీవ్రత పెంచుతూ తపస్సు చేశారు.

తప ఉగ్రం సమాస్థాయ నియమే పరమే స్థితాః ।
తపసా కర్షయామాసుర్దేహాన్ స్వాన్ దానవోత్తమాః ॥19॥

కొన్ని సంవత్సరాలకు ఆ దానవోత్తములు కఠోరనియమాలతో ఉగ్రతపస్సులకు దిగారు. దేహాలను శుష్కింపజేశారు.

వర్షాణాం శతకం చైవ పదమేకం నిధాయ చ ।
భూమౌ స్థిత్వా పరం తత్ర తేపుస్తే బలవత్తరాః ॥20॥

తే సహస్రం తు వర్షాణాం వాతభక్షాస్సుదారుణాః ।
తపస్తేపుర్దురాత్మానః పరం తాపముపాగతాః ॥21॥

ఆ బలిష్ఠులు ఒంటికాలిమీద నిలబడి ఒక వంద సంవత్సరాలు, కేవలం వాయుభక్షకులై ఒక వెయ్యి సంవత్సరాలు ఉగ్రతపస్సు చేశారు. ముగ్గురూ దారుణస్వభావులు. దురాత్ములు. అలా మిక్కిలి తాపం పొందారు.

వర్షాణాం తు సహస్రం వై మస్తకేనాస్థితాస్తథా ।
వర్షాణాంతు శతేనైవ ఊర్ధ్వబాహవ ఆసితాః ॥22॥

ఏవం దుఃఖం పరం ప్రాప్తా దురాగ్రహపరా ఇమే ।
ఈదృక్తే సంస్థితా దైత్యా దివారాత్రమతంద్రితాః ॥23॥

ఏవం తేషాం గతః కాలో మహాన్ సుతపతాం మునే ।
బ్రహ్మాత్మానాం తారకాణాం ధర్మేణేతి మతిర్మమ ॥24॥

బ్రహ్మదేవుడు ఇంకా ప్రత్యక్షం కాకపోవడంతో మరొక వెయ్యి సంవత్సరాలు తలకిందులుగా తపస్సు చేశారు. అటుపైని ఇంకొక వందసంవత్సరాలు ఊర్ధ్వ బాహువులై తపస్సు చేశారు. ఇలా చాలా కష్టపడ్డారు. వారి పట్టుదల పెరిగి పెరిగి దురాగ్రహంగా మారింది. రేయింబవళ్ళు ఏకాగ్రచిత్తంతో అలాగే తపస్సు కొనసాగించారు. వ్యాసమహర్షీ! బ్రహ్మధ్యానపరాయణులైన ఆ తారకదైత్యనందనులకి వందల సంవత్సరాల కాలం ఇలా పవిత్రంగా ధర్మబద్ధంగా సాగిందనే నా అభిప్రాయం.

ప్రాదురాసీత్తతో బ్రహ్మా సురాసురగురుర్మహాన్ ।
సంతుష్టస్తపసా తేషాం వరం దాతు మహాయశాః ॥25॥

మునిదేవాసురైస్సార్ధం సాంత్వపూర్వమిదం వచః ।
తతస్తానబ్రవీత్సర్వాన్ సర్వభూతపితామహః ॥26॥

ఎట్టకేలకు వారి తపస్సులకు సంతుష్టుడై– దేవదానవులకు పెద్దదిక్కు, మహాత్ముడు అయిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యాడు. మునులూ సురలూ, అసురులూ వెంటరాగా దర్శనమనుగ్రహించి ఆ సర్వభూతపితామహుడు బ్రహ్మదేవుడు తారకాక్ష విద్యున్మాలి కమలాక్షుల్ని బుజ్జగిస్తూ ఇలా పలికాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ప్రసన్నోఽస్మి మహాదైత్యా యుష్మాకం తపసా మునే ।
సర్వం దాస్యామి యుష్మభ్యం వరం బ్రూత యదీప్సితమ్ ॥27॥

కిమర్థం సుతపస్తప్తం కథయధ్వం సురద్విషామ్ ।
సర్వేషాం తపసో దాతా సర్వకర్తా స్మి సర్వదా ॥28॥

మహాదైత్యులారా! మీ తపస్సుకి నేను ప్రసన్నుణ్ణి అయ్యాను. మీకు సమస్తమూ ఇస్తాను. ఈప్సితవరం ఏమిటో అడగండి. ఇంత మహాతపస్సు దేనికోసం చేశారో చెప్పండి. తపస్సులు చేసే రాక్షసులకందరికీ వరాలు ఇచ్చేవాణ్ణి నేనే. నేను (సర్వదా– సర్వకర్తను) సర్వతంత్రస్వతంత్రుణ్ణి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

తస్య తద్వచనం శ్రుత్వా శనైస్తే స్వాత్మనో గతమ్ ।
ఊచుః ప్రాంజలయస్సర్వే ప్రణిపత్య పితామహమ్ ॥29॥

సత్యవతీ పుత్రా! బ్రహ్మదేవుడి ఆ మాటలు ఆలకించి ముగ్గురుదైత్యకుమారులూ పితామహుడికి ముందుగా నమస్కరించారు. సాష్టాంగపడ్డారు. మెల్లగా తమ మనస్సులోని కోరికను వెల్లడించారు.

దైత్యా ఊచుః – దైత్యులు అన్నారు.

యది ప్రసన్నో దేవేశ యది దేయో వరస్త్వయా ।
అవధ్యత్వం చ సర్వేషాం సర్వభూతేషు దేహి నః ॥30॥

స్థిరాన్ కురు జగన్నాథ పాంతు నః పరిపంథినః ।
జరారోగాదయస్సర్వే నాస్మాన్ మృత్యురగాత్ క్వచిత్ ॥31॥

అజరాశ్చామరాస్సర్వే భవామ ఇతి నో మతమ్ ।
సమృత్యవః కరిష్యామస్సర్వాననన్యాంస్త్రిలోకకే ॥32॥

దేవాధిదేవా! బ్రహ్మదేవా! నిజంగా నువ్వు ప్రసన్నుడివైతే మాకు వరమే ఇవ్వాలనుకుంటే – ఈ ప్రాణికోటిలో మా ముగ్గురికీ అవధ్యత్వం ప్రసాదించు జగన్నాథా! మమ్మల్ని శాశ్వతుల్ని చెయ్యి, శత్రువుల నుంచి సంరక్షించు. వార్ధక్యం, అనారోగ్యం, మృత్యువు అనేవి మావైపు రాకుండుగాక! మేము ముగ్గురమూ అజరామరులం కావాలనేది మా అభిమతం. ముల్లోకాలలోనూ తక్కినవారినందరినీ మృత్యుసహితుల్ని మేమే చేస్తాం.

లక్ష్మ్యా కిం తద్విపులయా కిం కార్యం హి పురోత్తమైః ।
అన్యైశ్చ విపులైర్భోగైః స్థానైశ్వర్యేణ వా పునః ॥33॥

యత్రైవ మృత్యునా గ్రస్తో నియతం పంచభిర్దినైః ।
వ్యర్థం తస్యాఖిలం బ్రహ్మన్ నిశ్చితం న ఇతీవ హి ॥34॥

అంతులేని సంపదలు, శ్రేష్ఠమైన నగరాలు, రకరకాల భోగాలు, ఇంద్ర పదవులు, ప్రభుతలు – ఇవన్నీ ఉండి ఏమి లాభం అయిదునాళ్ళకే మృత్యువుకు చిక్కినప్పుడు! బ్రహ్మన్! రాలిపోయేవాడికి ఇవన్నీ వృధా అని మా నిశ్చితాభిప్రాయం.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇతి శ్రుత్వా వచస్తేషాం దైత్యానాం చ తపస్వినామ్ ।
ప్రత్యువాచ శివం స్మృత్వా స్వం ప్రభుం గిరిశం విధిః ॥35॥

మహాతపస్సులు ఆ దైత్యపుత్రులు అడిగినది విని బ్రహ్మదేవుడు తన ప్రభువైన శివుణ్ని ఆ గిరిశుణ్ని మదిలో తలుచుకుని వారికిలా బదులు పలికాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

నాస్తి సర్వామరత్వం చ నివర్తధ్వమతోఽసురాః ।
అన్యం వరం వృణీధ్వం వై యాదృశో వో హి రోచతే ॥36॥

జాతో జనిష్యతే నూనం జంతుః కోఽప్యసురా క్వచిత్ ।
అజరశ్చామరో లోకే న భవిష్యతి భూతలే ॥37॥

ఋతే తు ఖండపరశోః కాలకాలాద్ధరేస్తథా ।
తౌ ధర్మాధర్మపరమావవ్యక్తౌ వ్యక్తరూపిణౌ ॥38॥

అసురులారా! అమరత్వమనేది ఎవ్వరికీ లేదు. మీ మనసుల్ని మళ్లించుకోండి. మీకు నచ్చిన మరొకవరం ఏదైనా కోరుకోండి. పుట్టినవాడు (చనిపోయి) మళ్ళీ పుడతాడు. తారకపుత్రులారా! ఏ ప్రాణికైనా ఇది తప్పదు. భూలోకంలో ముసలితనం లేనివాడూ, చావులేనివాడూ లేడు, ఉండడు. కాలకాలుడు ఖండపరశువు అయిన సదాశివుడూ, శ్రీహరీ ఈ ఇద్దరూ తప్ప, వీరిద్దరూ ధర్మాధర్మాలకు గమ్యాలు, వ్యక్తావ్యక్తస్వరూపులు.

సంపీడనాయ జగతో యది స క్రియతే తపః ।
సఫలం తద్గతం వేద్యం తస్మాత్సువిహితం తపః ॥39॥

తద్విచార్య స్వయం బుద్ధ్యా న శక్యం యత్సురాసురైః ।
దుర్లభం వా సుదుస్సాధ్యం మృత్యుం వంచయతానఘాః ॥40॥

తత్కించిన్మరణే హేతుం వృణీధ్వం సత్త్వమాశ్రితాః ।
యేన మృత్యుర్నైవ వృతో రక్షతస్తత్పృథక్ పృథక్ ॥41॥

అదీగాక దైత్యులారా! మీరు మరొక్క విషయం తెలుసుకోవాలి. జగత్తును పీడించడం కోసమే తపస్సు చేసినట్టయితే అది పోయినట్టే. అది ఫలించదు. మంచి లక్ష్యం కోసం చేసినదే తపస్సు. అందుచేత పుణ్యాత్ములారా! స్వయంగా బుద్ధిపెట్టి ఆలోచించండి. సురాసురులకు దుర్లభమూ, అసాధ్యము అయిన ఒక వరం కోరి మృత్యువును వంచించండి. కాసింత సత్త్వగుణం వహించి, అసలు మృత్యువే దరిజేరని ఏదైనా ఒక మరణహేతువును కోరుకోండి. దానితో ఎవరికివారుగా రక్షణ పొందండి. (అమరత్వం అసంభవం కాబట్టి, అంతే అసంభవమైన మరణహేతువును ఊహించి కోరుకోండి అని సూచన. 40-41 శ్లోకాలు క్లిష్టాన్వయాలు)

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఏతద్విధివచః శ్రుత్వా ముహూర్తం ధ్యానమాస్థితాః ।
ప్రోచుస్తే చింతయిత్వాథ సర్వలోకపితామహమ్ ॥42॥

బ్రహ్మదేవుడు చెప్పిన ఈ మాటను విని దైత్యకుమారులు ముహూర్తకాలం ధ్యానమగ్నులయ్యారు. బాగా ఆలోచించి సర్వలోకపితామహుడితో ఇలా పలికారు.

దైత్యా ఊచుః – దైత్యులు అన్నారు.

భగవన్నాస్తి నో వేశ్మ పరాక్రమవతామపి ।
అధృష్యాః శాత్రవానాం తు యత్ర వత్స్యామహే సుఖమ్ ॥43॥

పురాణి త్రీణి నో దేహి నిర్మాయాత్యద్భుతాని హి ।
సర్వసంపత్సమృద్ధాన్యప్రధృష్యాణి దివౌకసామ్ ॥44॥

వయం పురాణి త్రీణ్యేవం సమాస్థాయ మహీమిమామ్ ।
చరిష్యామో హి లోకేశ త్వత్ప్రసాదాజ్జగద్గురో ॥45॥

బ్రహ్మదేవా! ఇంతటి పరాక్రమవంతులమే అయినా శత్రువులకు చొరగానిదై మేము సుఖంగా నివసించడానికి అనువైన ఒక నివాసస్థలమంటూ మాకు ఇంతవరకూ లేకపోయింది. కనక మూడు పురాలను అద్భుతంగా నిర్మింపజేసి మాకు ఇయ్యి. అవి సర్వసంపత్సమృద్ధాలుగా ఉండాలి. దేవతలకు సైతం చొరగానివై ఉండాలి. అలాంటి మూడు పట్టణాలను మేము ముగ్గురమూ పొంది జగత్పితా! లోకేశా! నీ అనుగ్రహం వల్ల ఈ భూగోళమంతటా హాయిగా సంచరిస్తాం.

తారకాక్షస్తతః ప్రాహ యదభేద్యం సురైరపి ।
కరోతి విశ్వకర్మా తన్మమ హేమమయం పురమ్ ॥46॥

యయాచే కమలాక్షస్తు రాజతం సుమహత్పురమ్ ।
విద్యున్మాలీ చ సంహృష్టో వజ్రాయసమయం మహత్ ॥47॥

వ్యాసా! అప్పుడు సురలకైనా అభేద్యమై విశ్వకర్మ నాకోసం స్వర్ణమయపురాన్ని (బంగారు) నిర్మించు గాక! అని తారకాక్షుడు అడిగితే, రాజతమహాపురం (వెండి) కావాలని కమలాక్షుడు, వజ్రకఠినమైన ఆయస (ఇనుము) మహాపురం కావాలని సంతుష్టుడైన విద్యున్మాలి కోరుకున్నారు.

పురేష్వేతేషు భో బ్రహ్మన్నేకస్థానస్థితేషు చ ।
మధ్యాహ్నేభిజితే కాలే శీతాంశౌ పుష్యసంస్థితే ॥48॥

ఉపర్యుపర్యదృష్టేషు వ్యోమ్ని నీలాభ్రసంస్థితే ।
వర్షత్సు కాలమేఘేషు పుష్కరావర్తనామసు ॥49॥

తథా వర్షసహస్రాంతే సమేష్యామః పరస్పరమ్ ।
ఏకీభావం గమిష్యంతి పురాణ్యేతాని నాన్యథా ॥50॥

చతుర్ముఖా! వేటికవిగా ఉండే ఈ పురాలు ఒక వెయ్యి సంవత్సరాల తరవాత మాత్రమే ఒక చోటికి వస్తాయి. అది కూడా – మధ్యాహ్నకాలంలో అభిజిల్లగ్నంలో చంద్రుడు పుష్యంలో ఉండగా, ఆకాశాన నీల మేఘాలు ఉండి వాటికి చాలా ఎత్తున కంటికి కనపడని పుష్కరావర్తకాలనే మేఘాలు వర్షిస్తూన్న సమయంలో మా ఈ పురాలు కలయికను పొంది. ఒక చోటికి వస్తాయి. మరింక ఎన్నడూ ఏవిధంగానూ కాదు.

సర్వదేవమయో దేవస్సర్వేషాం మే కుహేలయా ।
అసంభవే రథే తిష్ఠన్ సర్వోపస్కరణాన్వితే ॥51॥

అసంభావ్యైకకాండేన భినత్తు నగరాణి నః ।
నిర్వైరః కృత్తివాసాస్తు యోఽ స్మాకమితి నిత్యశః ॥52॥

వంద్యః పూజ్యోఽ భి వంద్యశ్చ సోఽస్మాకం నిర్దహేత్కథమ్ ।
ఇతి చేతసి సంధాయ తాదృశో భువి దుర్లభః ॥53॥

అలా అప్పుడు ఒక చోటకి వచ్చిన మా నగరాలను – సర్వదేవతామయుడైన మహాదేవుడు మాముగ్గురికీ ఒక దుర్విలాసంగా ఒకానొక అసంభవరథం మీద సకలసాధనసంపత్తితో నిండిన రథం మీద నిలిచినవాడై ఊహకే అందని ఒకే ఒకబాణంతో ధ్వంసం చెయ్యాలి. (ఇదే మా మృత్యువు అని) అలా చెయ్యగలిగిన ఆ కృత్తివాసుడు శంకరుడు మాకు చిరకాలంగా అనుకూలుడే. మాతో శత్రుత్వం లేదు. మాకు పూజ్యుడు, వంద్యుడు, అభివంద్యుడు. కనక మమ్మల్ని ఎలా దహిస్తాడు, ఎందుకు దహిస్తాడు? బ్రహ్మదేవా! ఇదీ మా ఆలోచన. పోనీ అంటే అంతటివాడు ఈ భూమిలో మరొకడు దుర్లభుడు. (కనక మాకు మృత్యువు ఉండదు)

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఏతచ్ఛ్రుత్వా వచస్తేషాం బ్రహ్మా లోకపితామహః ।
ఏవమస్త్వితి తాన్ ప్రాహ సృష్టికర్తా స్మరన్ శివమ్ ॥54॥

వారి కోరిక ఆలకించి లోకపితామహుడు, సృష్టికర్త ఆ బ్రహ్మదేవుడు మరొక్కసారి శివుణ్ని తలుచుకుని 'అట్లే అగుగాక' అని వరమిచ్చాడు.

ఆజ్ఞాం దదౌ మయస్యాపి పుత్ర! త్వం నగరత్రయమ్ ।
కాంచనం రాజతం చైవ ఆయసం చేతి భో! మయ ॥55 ॥

ఇత్యాదిశ్య మయం బ్రహ్మా ప్రత్యక్షం ప్రావిశద్దివమ్ ।
తేషాం తారకపుత్రాణాం పశ్యతాం నిజధామ హి ॥56॥

వెంటనే మయుణ్ణీ ఆజ్ఞాపించాడు. నాయనా! మయా! బంగారు, వెండి, ఇనుములతో నువ్వు నగరాలు నిర్మించు – అని ఆదేశించి బ్రహ్మదేవుడు ఆ తారకపుత్రులు చూస్తుండగానే ప్రత్యక్షంగా తన నివాసానికి వెళ్ళిపోయాడు. (కుత్ర త్వం నగరత్రయమ్ – అని పాఠాంతరం)

తతో మయశ్చ తపసా చక్రే ధీరః పురాణ్యథ ।
కాంచనం తారకాక్షస్య కమలాక్షస్య రాజతమ్ ॥57॥

విద్యున్మాల్యాయసం(?)చైవ త్రివిధం దుర్గముత్తమమ్ ।
స్వర్గే వ్యోమ్ని చ భూమౌ చ క్రమాత్ జ్ఞేయాని తాని వై ॥58॥

దత్త్వా తేభ్యో ఽ సురేభ్యశ్చ పురాణి త్రీణి వై మయః। ।
ప్రావివేశ స్వయం తత్ర హితకా మపరాయణః ॥59॥

అంతట ధీరుడు ఆ మయుడు తన తపశ్శక్తితో మూడుపురాలు నిర్మించాడు. తారకాక్షుడికి స్వర్గంలో కాంచనపురం, కమలాక్షుడికి ఆకాశంలో రాజత(వెండి)పురం, విద్యున్మాలికి భూమిమీద ఆయస (ఇనుము)పురం

వరుసగా నిర్మించి ఆ దైత్యపుత్రులకు అందించాడు. వారి మేలు కోరినవాడై తానే స్వయంగా వారిని ఆ పురాలలో ప్రవేశపెట్టాడు. (పురప్రవేశాలు జరిపించాడు)

ఏవం పురత్రయం ప్రాప్య ప్రవిష్టాస్తారకాత్మజాః ।
బుభుజుస్సకలాన్ భోగాన్ మహాబలపరాక్రమాః ॥60॥

వ్యాసర్షీ! మహాబల పరాక్రమసంపన్నులు ఆ తారకపుత్రులు ఇలా తమకోసం మూడుపురాలను పొంది సకలభోగాలనూ అనుభవించారు.

కల్పద్రుమైశ్చ సంకీర్ణం గజవాజిసమాకులమ్ ।
నానాప్రాసాదసంకీర్ణం మణిజాలసమావృతమ్ ॥61॥

సూర్యమండలసంకాశైర్విమానైస్సర్వతోముఖైః ।
పద్మరాగమయైశ్చైవ శోభితం చంద్రసన్నిభైః ॥62॥

ప్రాసాదైర్గోపురైర్దివ్యైః కైలాసశిఖరోపమైః ।
దివ్యస్త్రీజనసంకీర్ణైః గంధర్వైః సిద్ధచారణైః ॥63॥

ఆ నగరాలు ఒక్కొక్కటి కల్పవృక్షాలతో కిటకిటలాడుతున్నాయి. ఎక్కడ చూసిన ఏనుగులూ గుర్రాలే. రకరకాల అసంఖ్యాక మణిమయప్రాసాదాలు. భవనాగ్రవిమానాలు (శిఖరాలు) సర్వతోముఖాలై సూర్యమండలాల్లాగా ప్రకాశిస్తున్నాయి. కొన్ని ప్రాసాదాలు పద్మరాగనిర్మితాలు. కొన్ని చంద్రమండల సన్నిభాలు. వాటి దివ్యగోపురాలు కైలాసశిఖరాల్లాగా ఉన్నాయి. ఎక్కడచూసినా దివ్యస్త్రీలు, గంధర్వులు, సిద్ధులు, చారణులు.

రుద్రాలయైః ప్రతిగృహమగ్నిహోత్రైః ప్రతిష్ఠితైః ।
ద్విజోత్తమైః శాస్త్రవిజ్ఞైశ్శివభక్తిరతైస్సదా ॥64॥

వాపీకూపతడాగైశ్చ దీర్ఘికాభిస్సుశోభితమ్ ।
ఉద్యానవనవృక్షైశ్చ స్వర్గచ్యుతగుణోత్తమైః ॥65॥

నదీనదసరిన్ముఖ్యపుష్కరైః శోభితం సదా ।
సర్వకామఫలాఢ్యైశ్చానేకైః వృక్షైర్మనోహరమ్ ॥66॥

ఎక్కడచూసినా శివాలయాలు. ఇంటింటా అగ్నిహోత్రశాలలు. శివభక్తులూ, శాస్త్రవిజ్ఞులు అయిన ద్విజోత్తములు. వాపీకూపతటాకాలతో దీర్ఘికలతో (దిగుడు బావులు) సుమనోహరం. స్వర్గం నుంచి జారిపడ్డాయా అన్నంత అందంగా ఉన్న ఉద్యానవనాలూ, వాటిలో వృక్షాలూను. నదులు నదాలు ఏరులు సరస్సులు వీటితో ఎంతో సుందరంగా ఉంది. కోరికలనన్నింటినీ తీర్చగల అనేక వృక్షాలతో (కల్పతరువులతో) ప్రతి నగరమూ మనోహరం.

మత్తమాతంగయూథైశ్చ తురంగైశ్చ సుశోభనైః ।
రథైశ్చ వివిధాకారైశ్శిబికాభిరలంకృతమ్ ॥67॥

సమయాదిశికైశ్చైవ క్రీడాస్థానైః పృథక్ పృథక్ ।
వేదాధ్యయనశాలాభిర్వివిధాభిః పృథక్ పృథక్ ॥68॥

అదృష్టం మనసా వాచా పాపాన్వితనరైస్సదా ।
మహాత్మభిశ్శుభాచారైః పుణ్యవద్భిః ప్రవీక్ష్యతే ॥69॥

మదించిన ఏనుగుల గుంపులు, ఉత్తమజాతి గుర్రాలు, రథాలు, వివిధాకారాల్లో పల్లకీలు, ప్రతినగరాన్నీ అలంకరిస్తున్నాయి. చాలా చోట్ల సమయాదిశికలు (గడియారాలు) ఉన్నాయి. విడివిడిగా క్రీడాస్థలాలున్నాయి. చతుర్వేదాలకూ విడివిడిగా వేదాధ్యయనశాలలున్నాయి. పాపాత్ముల కంటికి కనిపించని నగరం ఒక్కొక్కటీ మనస్సుకీ వాక్కులకీ కూడా అందని నగరం. సదాచారులూ పుణ్యాత్ములు అయిన మహాత్ములకే కనిపించే నగరం ఒక్కొక్కటీను.

పతివ్రతాభిస్సర్వత్ర పాతితం స్థలముత్తమమ్ ।
పతిసేవనశీలాభిర్విముఖాభిః కుధర్మతః ॥70॥

ప్రతినగరము పతివ్రతలతో పతిసేవాతత్పరలతో, అధర్మవిముఖలతో, పవిత్రమైన స్థలమే. ఉత్తమక్షేత్రమే.

దైత్యశూరైర్మహాభాగైస్సదారైస్సుతైర్వ్రిజైః ।
శ్రౌతస్మార్తార్థతత్త్వజ్ఞైః స్వధర్మనిరతైర్యుతమ్ ॥71॥

వ్యూఢోరస్కైః వృషస్కంధైస్సామయుద్ధధరైస్సదా ।
ప్రశాంతైః కుపితైశ్చైవ కుబ్జైర్వామనకైస్తథా ॥72॥

నీలోత్పలదళప్రఖ్యైర్నీలకుంచితమూర్ధజైః ।
మయేన రక్షితైస్సర్వై శ్శిక్షితైర్యుద్ధలాలసైః ॥73॥

నగరం నిండా దైత్యశూరులే. మహానుభావులు. భార్యాపుత్రసమేతులు. అలాగే శ్రౌతస్మార్తవిధుల్నీ వాటి తత్త్వాల్నీ ఎరిగి స్వధర్మనిష్ఠులైన బ్రాహ్మణులు నగరమంతటా ఉన్నారు. ఇంకా బలిష్ఠమైన వక్షఃస్థలాలతో ఆబోతుమూపులతో, సంధి – విగ్రహ సమర్థులైన మహావీరులు ఎందరెందరో. వారిలో కొందరు ప్రశాంత స్వభావులు. కొందరు కోపనులు. కొందరు పొట్టివారు. కొందరు వక్రస్వరూపులు. వారందరిదీ ఒకే రకం జుట్టు. నల్లకలువరేకుల రంగులో కురచగా తలకు అతుక్కున్నట్టు ఉంటుంది. అందరూ యుద్ధలాలసులే. అందరికీ మయుడే రక్షకుడూ శిక్షకుడూ.

వరసమరరతైర్యుతం సమంతాత్ అజశివపూజనయా విశుద్ధ వీర్యైః ।
రవి మరుత మహేంద్ర సన్నికాశైః సురమథనైస్సుదృఢైస్సుసేవితం యత్ ॥74॥

అందరూ ఘోరసంగ్రామప్రియులు. బ్రహ్మనూ శివుణ్నీ అర్చించడంతో పవిత్రశక్తి సంపన్నులు. సూర్య మరుత్తులు దేవేంద్రులకు సాటివచ్చేవారు. దేవతలను మథించేవారు. బలిష్ఠులు. ఇలాంటి దైత్యవీరులు ప్రతినగరాన్ని సేవిస్తున్నారు.

శాస్త్రవేదపురాణేషు యే యే ధర్మాః ప్రకీర్తితాః ।
శివప్రియాస్సదా దేవాస్తే ధర్మాస్తత్ర సర్వతః ॥75॥

శాస్త్రాలలో వేదాలలో పురాణాలలో శివుడికి ప్రీతికరాలుగా ప్రకీర్తితాలైన ధర్మాలే అక్కడి ధర్మాలు. శివుడికి ఇష్టులైన దేవతలే అక్కడి దేవతలు.

ఏవం లబ్ధవరాస్తే తు దైతేయాస్తారకాత్మజాః ।
శైవం మయముపాశ్రిత్య నివసంతి స్మ తత్ర హి ॥76॥

వ్యాసా! ఆ తారకాత్మజులు బ్రహ్మదేవుడి నుంచి వరాలు పొందినవారై ఇలా పరమశైవుడైన మయుణ్ని ఆశ్రయించుకుని ఆ నగరాలలో నివసిస్తున్నారు.

సర్వం త్రైలోక్యముత్సార్య ప్రవిశ్య నగరాణి తే ।
కుర్వంతి స్మ మహద్రాజ్యం శివమార్గరతాస్సదా ॥77 ॥

తతో మహాన్ గతః కాలో వసతాం పుణ్యకర్మణామ్ ।
యథాసుఖం యథా జోషం సద్రాజ్యం కుర్వతాం మునే ॥78॥

మహామునీ! ముల్లోకాలనూ విడిచిపెట్టి, ముగ్గురూ తమ తమ పురాలలో ప్రవేశించి, శివమార్గాను యాయులై మహారాజ్యాలను పాలిస్తున్నారు. పుణ్యకర్మలను ఆచరిస్తూ సుఖంగా సంతోషంగా నివసిస్తూ వారిలా తమ రాజ్యాలను పాలిస్తుండగా వందల వేల సంవత్సరాల కాలం దొర్లిపోయింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే త్రిపురవధోపాఖ్యానే త్రిపురవర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥1॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు త్రిపుర వధోపాఖ్యానంలో త్రిపురవర్ణనం అనే మొదటి అధ్యాయం సమాప్తం.

ద్వితీయోఽధ్యాయః – రెండవ అధ్యాయం

దేవస్తుతిః – దేవస్తుతి

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

బ్రహ్మపుత్ర! మహాప్రాజ్ఞ! వద మే వదతాం వర ।
తతః కిమభవద్దేవాః కథం చ సుఖినోఽభవన్ ॥1॥

బ్రహ్మమానస పుత్రా! మహాప్రాజ్ఞా! సనత్కుమారా! నువ్వు వక్తలలో ఉత్తముడివి. అటు పైని ఏమి జరిగింది? దేవతలు సుఖంగా జీవించగలిగారా ? ఇది కూడా దయచేసి నాకు వివరించు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్యామితధీమతః ।
సనత్కుమారః ప్రోవాచ స్మృత్వా శివపదాంబుజమ్ ॥2॥

నారదా! అత్యంతధీశాలి వ్యాసుడు అడిగింది విని సనత్కుమారుడు మరోసారి శివుడి పాదపద్మాలను ధ్యానించి అనంతరకథ అందుకున్నాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు పలికాడు.

అథ తత్ప్రభయా దగ్ధా దేవా హీంద్రాదయస్తథా ।
సమ్మంత్ర్య దుఃఖితాస్సర్వే బ్రహ్మాణం శరణం యయుః ॥3॥

నత్వా పితామహం ప్రీత్యా పరిక్షిప్యాఖిలాస్సురాః ॥
దుఃఖం విజ్ఞాపయామాసుర్విలోక్యావసరం తతః ॥4॥

వ్యాసమహర్షీ! త్రిపురాలలోనూ వెలిగిపోతున్న మయుడి ప్రభను, తారకపుత్రుల ప్రభనూ చూసి దేవతలు కుమిలిపోయారు. దుఃఖం భరించలేక తమలో తాము ఆలోచించుకుని అందరూ కలిసి వెళ్ళి బ్రహ్మదేవుణ్ని శరణువేడారు. తగిన సమయం చూసి అఖిల సురులూ గుంపుగా పితామహుడికి భక్తితో నమస్కరించి తమ గోడు వెళ్ళబోసుకున్నారు.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

ధాతస్త్రిపురనాథేన సతారకసుతేన హి ।
సర్వే ప్రతాపితా నూనం మయేన త్రిదివౌకసః ॥5॥

అతస్తే శరణం యాతా దుఃఖితా హి విధే వయమ్ ।
కురు త్వం తద్వధోపాయం సుఖినః స్యామ తద్వయం ॥6॥

ధాతా! పితామహా! విధీ! తారకసుతుల్ని తన గుప్పిట్లో పెట్టుకుని త్రిపురాలకూ తానే నాథుడై మయుడు స్వర్గవాసులమైన మమ్మల్ని దారుణంగా ఏడిపిస్తున్నాడు. దుఃఖం భరించలేక నిన్ను శరణు అన్నాం. వాణ్ని చంపే ఉపాయం ఆలోచించి మమ్మల్ని సుఖపెట్టు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇతి విజ్ఞాపితో దేవైర్విహస్య భవకృద్విధిః ।
ప్రత్యువాచాథ తాన్ సర్వాన్మయతో భీతమానసాన్ ॥7॥

దేవతల విజ్ఞాపన ఆలకించి సృష్టికర్త బ్రహ్మదేవుడు పెద్దగా నవ్వి, మయుడంటేనే భయపడిపోతున్న ఆ దేవతలకు ఇలా బదులు పలికాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

న భేతవ్యం సురాస్తేభ్యో దానవేభ్యో విశేషతః ।
అచక్షే తద్వధోపాయం శివం శర్వః కరిష్యతి ॥8॥

మత్తో వివర్ధితో దైత్యో వధం మత్తో న చార్హతి ।
తథాపి పుణ్యం వర్ధేత నగరే త్రిపురే పునః ॥9॥

శివం చ ప్రార్థయధ్వం వై సర్వే దేవస్సవాసవాః ।
సర్వాధీశః ప్రసన్నశ్చేత్స వః కార్యం కరిష్యతి॥10॥

దేవతలారా! వారిని చూసి భయపడవలసిన పనిలేదు. విశేషించి దానవులకు అసలు భయపడకండి. నేను చెబుతున్నాను గదా! వారిని సంహరించే శుభప్రదమైన ఉపాయాన్ని శర్వుడు ఆలోచిస్తాడు. నేనే పెంచి ఆ దైత్యుణ్ని నేనే చంపడం భావ్యం కాదు. అదీ గాక ఆ త్రిపురాలలో పుణ్యమూ వృద్ధి పొందుతోంది. అది మరింత వృద్ధి పొందుగాక! ఇంద్రాదిదేవతలారా! మీరంతా శివుణ్ని ప్రార్థించండి. ఆయన సర్వాధీశుడు ప్రసన్నుడైతే మీరు కోరినపని చేస్తాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇత్యాకర్ణ్య విధేర్వాణీం సర్వే దేవాస్సవాసవాః ।
దుఃఖితాస్తే యయుస్తత్ర యత్రాస్తే వృషభధ్వజః ॥11॥

ప్రణమ్య భక్త్యా దేవేశం సర్వే ప్రాంజలయస్తథా ।
తుష్టువుర్వినతస్కంధాశ్శంకరం లోకశంకరమ్ ॥12॥

బ్రహ్మ చెప్పిన ఈ వాక్కును ఆలకించి ఇంద్రాది దేవతలందరు మరింత దుఃఖితులై వృషభధ్వజుణ్ని చేరుకున్నారు. సర్వేశ్వరుడికి అందరూ భక్తిగా సాష్టాంగపడి అంజలిబంధాలతో మెడలు వంచి నిలబడి లోక శంకరుడైన ఆ శంకరుణ్ని స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు స్తుతించారు.

నమో హిరణ్యగర్భాయ సర్వసృష్టివిధాయినే ।
నమః స్థితికృతే తుభ్యం విష్ణవే ప్రభవిష్ణవే ॥13॥

నమో హరస్వరూపాయ భూతసంహారకారిణే ।
నిర్గుణాయ నమస్తుభ్యం శివాయామితతేజసే ॥14॥

అవస్థారహితాయాథ నిర్వికారాయ వర్చసే ।
మహాభూతాత్మభూతాయ నిర్లిప్తాయ మహాత్మనే ॥15॥

హిరణ్యగర్భుడవై (బ్రహ్మ) సకలసృష్టినీ నిర్వహించే నీకు ఇదే మా వందనం. సర్వవ్యాపకుడైన విష్ణుమూర్తివై సృష్టికి ఒక స్థితిని కల్పించే నీకు ఇదే నమస్కారం. ప్రళయవేళ హరస్వరూపుడవై సకలసృష్టినీ ఉపసంహరించే నీకిదే మా ప్రణతి. నిర్గుణుడికి అమితతేజస్వికి శివుడికి నీకిదే ప్రణామం. అవస్థారహితుడికి, నిర్వికారుడికి, తేజస్స్వరూపుడికి, సకలప్రాణికోటికి ఆత్మస్వరూపుడైనవాడికి, నిర్లిప్తుడికి, మహాత్ముడికి నీకివే నమస్కారాలు.

నమస్తే భూతపతయే మహాభారసహిష్ణవే ।
తృష్ణా హరాయ నిర్వైరాకృతయే భూరితేజసే ॥16॥

మహాదైత్యమహారణ్యనాశినే దావవహ్నయే ।
దైత్యద్రుమకుఠారాయ నమస్తే శూలపాణయే ॥17॥

మహాదనుజనాశాయ నమస్తే పరమేశ్వర ।
అంబికాపతయే తుభ్యం నమస్సర్వాస్త్రధారక ॥18॥

భూతపతికి, మహాభారాన్ని వహించేవాడికి, అత్యాశను హరించేవాడికి, వైరమేలేని ఆకృతికలవాడికి, భూరితేజస్వికి, మహాదైత్యులనే మహారణ్యాన్ని నాశనం చేసే దావాగ్నివంటివాడికి, రాక్షసులు అనే వృక్షాలకు గొడ్డలివంటివాడికి, శూలపాణికి నీకిదే వషట్కారం. మహాదనుజవినాశకా! పరమేశ్వరా! అంబికాపతీ! సర్వాస్త్రధారణనిపుణా! నీకిదే నమస్సు.

నమస్తే పార్వతీనాథ పరమాత్మన్ మహేశ్వర ।
నీలకంఠాయ రుద్రాయ నమస్తే రుద్రరూపిణే ॥19॥

నమో వేదాంతవేద్యాయ మార్గాతీతాయ తే నమః ।
నమో గుణస్వరూపాయ గుణినే గుణవర్జితే ॥20॥

పార్వతీనాథా ! పరమాత్మా! మహేశ్వరా! నీలకంఠా! రౌద్రస్వరూపా! రుద్రా! వేదాంతవేద్యా! సర్వమార్గాతీతా! గుణస్వరూపా! గుణాన్వితా! గుణవిరహితా! నీకిదే నమస్కారం.

మహాదేవ నమస్తుభ్యం త్రిలోకీనందనాయ చ ।
ప్రద్యుమ్నాయానిరుద్ధాయ వాసుదేవాయ తే నమః ॥21॥

సంకర్షణాయ దేవాయ నమస్తే కంసనాశినే ।
చాణూరమర్దినే తుభ్యం దామోదర విషాదినే ॥22॥

హృషీకేశాచ్యుత విభో మృడ శంకర తే నమః ।
అధోక్షజ గజారాతే కామారే విషభక్షణ ॥23॥

మహాదేవా! ముల్లోకాలకూ ఆనందం పంచేవాడా! ప్రద్యుమ్నా! అనిరుద్ధా! వాసుదేవా! (శివకేశవా భేదం) సంకర్షణా! కంససంహారీ! నీకిదే మొక్కు. చాణూరమర్దనా! దామోదరా! కాలకూట భక్షకా! హృషీకేశా! అచ్యుతా! విభూ! మృడా! శంకరా! అధోక్షజా! గజాసురవిధ్వంసకా! మన్మథాంతకా! గరళకంఠా! నీకిదే సాష్టాంగం.

నారాయణాయ దేవాయ నారాయణపరాయ చ ।
నారాయణస్వరూపాయ నారాయణతనూద్భవ ॥24॥

నమస్తే సర్వరూపాయ మహానరకహారిణే ।
పాపాపహారిణే తుభ్యం నమో వృషభవాహన ॥25॥

క్షణాదికాలరూపాయ స్వభక్తబలదాయినే ।
నానా రూపాయ రూపాయ దైత్యచక్రవిమర్దినే ॥26॥

నారాయణా! నారాయణపరా! నారాయణస్వరూపా! నారాయణ తనూద్భవా! సర్వ స్వరూపా! మహానరక నివారక! పాపపరిహారకా! వృషభవాహనా! క్షణ నిమేషాదికాలరూపా! నిజభక్తులకు బలాన్నిచ్చేవాడా! నానారూపా! ఏకైకరూపా! దైత్యసమూహవిమర్దకా! నీకివే నమస్కృతులు.

నమో బ్రహ్మణ్యదేవాయ గోబ్రాహ్మణహితాయ చ ।
సహస్రమూర్తయే తుభ్యం సహస్రాపవయవాయ చ ॥27॥

ధర్మరూపాయ సత్త్వాయ నమస్సత్త్వాత్మనే హర ।
వేదవేద్యస్వరూపాయ నమో వేదప్రియాయ చ ॥28॥

నమో వేదస్వరూపాయ వేదవక్త్రే నమో నమః ।
సదాచారాధ్వగమ్యాయ సదాచారాధ్వగామినే ॥29॥

బ్రహ్మణ్యులకు ఆరాధ్యదైవమా! గో బ్రాహ్మణులకు హితకరా! సహస్రమూర్తీ! సహస్రావయవా! నీకిదే అభివందనం. ధర్మరూపా! సత్త్వా! సత్త్వాత్మకా! హర ! వేదాలతో తెలిసే రూపం కలవాడా! వేదప్రియా! వేదస్వరూపా! వేదవక్త్రా! సదాచారమనే మార్గానికి గమ్యమైనవాడా! సదాచారమనే మార్గంలోనే నడిచేవాడా! నీకివే నమస్సులు.

విష్వక్సేనాయ తుభ్యం నమస్సత్యమయాయ చ ।
సత్యప్రియాయ సత్యాయ సత్యగమ్యాయ తే నమః ॥30॥

నమస్తే మాయినే తుభ్యం మాయాధీశాయ వై నమః ।
బ్రహ్మగాయ నమస్తుభ్యం బ్రహ్మణే బ్రహ్మజాయ చ ॥31॥

తపసే తే నమోఽస్త్వీశ తపసాం ఫలదాయినే ।
స్తుత్యాయ స్తుతయే నిత్యం స్తుతిసంప్రీతచేతసే ॥32॥

కీర్తిపీఠమా! సత్యమయా! సత్యప్రియా! సత్యా! సత్యగమ్యా! మాయారూపా! మాయాధీశా! బ్రహ్మను పొందేవాడా! (బ్రహ్మ=వేదం) ఓ పరబ్రహ్మా! బ్రహ్మసంభవా! తపఃస్వరూపా! తపఃఫలదాయకా! స్తుత్యా ! స్తుతిస్వరూపా! స్తుతులకు ఆనందించే మనస్సుకలవాడా! నీకు నమస్కారం.

శ్రుత్యాచారప్రసన్నాయ స్తుత్యాచారప్రియాయ చ ।
చతుర్విధస్వరూపాయ జలస్థలజరూపిణే ॥33॥

వేదవిహితమైన ఆచారాలకు ప్రసన్నమయ్యేవాడా! కొనియాడదగిన ఆచారాలంటే ఇష్టపడేవాడా! ఉద్భిజ – అండజ స్వేదజాలనే చతుర్విధ జీవస్వరూపా! నీటబుట్టినవీ నేలబుట్టినవీ నీరూపమే అయినవాడా! నీకు నతులు. (స్మృతాచార – అని పాఠాంతరం. స్మృతులు చెప్పిన ఆచారవిధులకు ప్రసన్నమయ్యేవాడా!)

సర్వే దేవాదయో నాథ శ్రేష్ఠత్వేన విభూతయః ।
దేవానామింద్రరూపోఽసి గ్రహాణాం త్వం రవిర్మతః ॥34॥

సత్యలోకోఽసి లోకానాం సరితం ద్యుసరిద్భవాన్ ।
శ్వేతవర్ణోఽసి వర్ణానాం సరసాం మానసం సరః ॥35॥

శైలానాం గిరిజాతాతః కామధుక్ త్వం చ గోషు హ ।
క్షీరోదధిస్తు సింధూనాం ధాతూనాం హాటకో భవాన్ ॥36॥

ప్రభూ! నీ విభూతులే (కళలే) దేవతాదులలో ఉత్తమోత్తమాలుగా వెలుగొందుతున్నాయి. దేవతలలో నువ్వు ఇంద్రుడివి. గ్రహాలలో సూర్యుడివి. లోకాలలో సత్యలోకానివి. నదులలో ఆకాశగంగవు. రంగులలో శ్వేతవర్ణానివి. సరస్సులలో మానససరస్సువి. పర్వతాలలో హిమాలయానివి. గోవులలో కామధేనువివి. సముద్రాలలో క్షీర సముద్రానివి. లోహాలలో బంగారానివి.

వర్ణానాం బ్రాహ్మణోఽసి త్వం నృణాం రాజాసి శంకర ।
ముక్తిక్షేత్రేషు కాశీ త్వం తీర్థానాం తీర్థరాట్ భవాన్ ॥37॥

నాలుగువర్ణాల్లో నువ్వు బ్రాహ్మణుడివి. మానవులలో మహారాజువి. శంకరా! ముక్తినొసగే దివ్యక్షేత్రాలలో కాశీ నగరానివి. తీర్థాలలో నువ్వు తీర్థరాజమైన ప్రయాగవు.

ఉపలేషు సమస్తేషు స్ఫటికస్త్వం మహేశ్వర ।
కమలస్త్వం ప్రసూనేషు శైలేషు హిమవాంస్తథా ॥38॥

భవాన్ వాక్ వ్యవహారేషు భార్గవస్త్వం కవిష్వపి ।
పక్షిష్వేవాసి శరభః సింహో హింస్రేషు సమ్మతః ॥39॥

శాలగ్రామశిలా చ త్వం శిలాసు వృషభధ్వజ ।
పూజ్యరూపేషు సర్వేషు నర్మదాలింగమేవ హి ॥40॥

మహేశ్వరా! రాళ్లల్లో నువ్వు స్ఫటికానివి. పువ్వులలో కమలానివి. పర్వతాలలో హిమవంతుడివి. లోకవ్యవహారాలలో వాగ్రూపివి. కవులలో భార్గవుడివి. పక్షులలో (ఎనిమిది కాళ్ళ) శరభానివి. హింసించే మృగాలలో సింహానివి. శిలలో శాలగ్రామశిలవు, వృషభధ్వజా! అర్చారూపాలన్నింటిలో నువ్వు నర్మదాలింగానివి.

నందీశ్వరోఽసి పశుషు వృషభః పరమేశ్వర ।
వేదేషూపనిషద్రూపీ యజ్వనాం శీతభానుమాన్ ॥41॥

ప్రతాపినాం పావకస్త్వం శైవానామచ్యుతో భవాన్ ।
భారతం త్వం పురాణానాం మకారోఽ స్యక్షరేషు చ ॥42॥

ప్రణవో బీజమంత్రాణాం దారుణానాం విషం భవాన్ ।
వ్యోమ వ్యాప్తిమతాం త్వం వై పరమాత్మాసి చాత్మనామ్ ॥43॥

పరమేశ్వరా! పశువులలో మహావృషభమైన నందీశ్వరుడివి. వేదాలలో ఉపనిషద్రూపానివి. యజ్ఞకర్తలలో చంద్రుడివి. ప్రతాపవంతులలో అగ్నివి. శైవులలో విష్ణుమూర్తివి. పురాణాలలో భారతానివి. అక్షరాలలో మకారానివి. బీజాక్షరాలలో ఓంకారానివి. దారుణవస్తువులలో విషానివి నువ్వు. వ్యాప్తిమంతాలలో ఆకాశానివి. ఆత్మలలో పరమాత్మవు నువ్వు.

ఇంద్రియాణాం మనశ్చ త్వం దానానామభయం భవాన్ ।
పావనానాం జలంచాసి జీవనానాం తథామృతమ్ ॥44॥

లాభానాం పుత్రలాభోఽసి వాయుర్వేగవతామసి ।
నిత్యకర్మసు సర్వేషు సంధ్యోపాస్తిర్భవాన్మతా ॥45॥

క్రతూనామశ్వమేధోఽసి యుగానాం ప్రథమో యుగః ।
పుష్యస్త్వం సర్వధిష్ణ్యానామమావాస్యా తిథిష్వసి ॥46॥

శంకరా! ఇంద్రియాలలో మనస్సువి నువ్వు. దానాలలో అభయదానానివి. పావనాలలో జలం నువ్వు. జీవనాలలో అమృతానివి. లాభాలలో పుత్రలాభానివి. వేగవంతాలలో వాయువు నువ్వు. నిత్యకర్మలన్నింటిలోకీ సంధ్యోపాసనవు నువ్వు. యాగాలలో అశ్వమేధానివి. యుగాలలో కృతయుగానివి. నక్షత్రాలలో పుష్యానివి. తిథులలో అమావాస్యవు.

సర్వర్తుషు వసంతస్త్వం సర్వపర్వసు సంక్రమః ।
కుశోఽ సి తృణజాతీనాం స్థూలవృక్షేషు వై వటః ॥47॥

యోగేషు చ వ్యతీపాతస్సోమవల్లీ లతాసు చ ।
బుద్ధీనాం ధర్మబుద్ధిస్త్వం కళత్రం సుహృదాం భవాన్ ॥48॥

సాధకానాం శుచీనాం త్వం ప్రాణాయామో మహేశ్వర ।
జ్యోతిర్లింగేషు సర్వేషు భవాన్ విశ్వేశ్వరో మతః ॥49॥

మహేశ్వరా! ఋతువులన్నింటిలోకీ వసంతానివి నువ్వు. పండుగలలో సంక్రాంతివి నువ్వు. తృణజాతులలో దర్భవు. స్థూలవృక్షాలలో మర్రిచెట్టువు. యోగాలలో వ్యతీపాతయోగానివి. లతలలో సోమలతవు. బుద్ధులలో ధర్మబుద్ధివి. నేస్తాలలో భార్యవు నువ్వు. (భార్యను మించిన నేస్తం లేదు) యోగసాధకుల పవిత్రకృత్యాలలో ప్రాణాయామానివి. జ్యోతిర్లింగాలలో విశ్వేశ్వరజ్యోతిర్లింగానివి.

ధర్మస్త్వం సర్వబంధూనా మాశ్రమాణాం పరో భవాన్ ।
మోక్షస్త్వం సర్వవర్గేషు రుద్రాణాం నీలలోహితః ॥50॥

ఆదిత్యానాం వాసుదేవో హనూమాన్వానరేషు చ ।
యజ్ఞానాం జపయజ్ఞోఽసి రామః శస్త్రభృతాం భవాన్ ॥51॥

గంధర్వాణాం చిత్రరథో వసూనాం పావకో ధ్రువమ్ ।
మాసానామధిమాసస్త్వం వ్రతానాం త్వం చతుర్దశీ ॥52॥

గౌరీవల్లభా! బంధుకోటిలో నువ్వు ధర్మానివి. (ధర్మాన్ని మించిన బంధువు లేదు;) ఆశ్రమాలలో సన్న్యాసాశ్రమానివి. చతుర్విధపురుషార్థాలలో నువ్వు మోక్షానివి. ఏకాదశరుద్రులలో నీలలోహితుడివి. ద్వాదశాదిత్యులలో వాసుదేవుడివి. వానరులలో హనుమంతుడివి. యజ్ఞాలలో జపయజ్ఞానివి. ధానుష్కులలో శ్రీరాముడివి. గంధర్వులలో చిత్రరథుడివి. అష్టవసువులలో పావకుడివి. మాసాలలో అధికమాసానివి. వ్రతాలలో చతుర్దశీవ్రతానివి.

ఐరావతో గజేంద్రాణాం సిద్ధానాం కపిలో మతః ।
అనంతస్త్వం హినాగానాం పితౄణామర్యమా భవాన్ ॥53॥

కాలః కలయతాం చ త్వం, దైత్యానాం బలిరేవ చ ।
కిం బహూక్తేన దేవేశ సర్వం విష్టభ్య వై జగత్ ॥54॥

ఏకాంశేన స్థితస్త్వం హి బహిఃస్థోఽన్విత ఏవ చ ॥55॥

దేవేశా! గజేంద్రాలలో ఐరావతానివి. సిద్ధులలో కపిలుడివి. సర్పాలలో అనంతుడివి. పితృదేవతలలో అర్యముడివి. గణకులలో కాలుడివి. దైత్యులలో బలిచక్రవర్తివి. వెయ్యి మాట లెందుకు స్వామీ. ఈ జగత్తు ను సమస్తంగా వ్యాపించి బహిరంతరంగాలలో అద్వితీయాంశగా వెలుగొందేవాడివి నువ్వొక్కడివే.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇతి స్తుత్వా సురాస్సర్వే మహాదేవం వృషధ్వజమ్ ।
స్తోత్రైర్నానావిధైర్దివ్యైః శూలినం పరమేశ్వరమ్ ॥56॥

ప్రత్యూచుః ప్రస్తుతం దీనాః స్వార్థం స్వార్థవిచక్షణాః ।
వాసవాద్యాః నతస్కంధాః కృతాంజలిపుటా మునే ॥57॥

వ్యాసమహర్షీ! ఇలా దేవతలందరూ వృషధ్వజుడైన త్రిశూలధారి, మహాదేవుడు అయిన ఆ పరమేశ్వరుణ్ణి నానావిధదివ్యస్తోత్రాలలో సంకీర్తించి ప్రస్తుతం తాము వచ్చిన పనిని అతిదీనంగా విన్నవించారు. వారందరూ స్వార్థవిచక్షణులు. కనక ఆ ఇంద్రాదులు అంజలిబంధాలతో వంగి నిలబడి తమ స్వప్రయోజనాన్ని విన్నవించుకున్నారు.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

పరాజితా మహాదేవ భ్రాతృభ్యాం సహితేన తు ।
భగవంస్తారకోత్పన్నైః సర్వే దేవాస్సవాసవాః ॥58॥
త్రైలోక్యం స్వవశం నీతం తథా చ మునిసత్తమాః ।
విధ్వస్తాస్సర్వసంసిద్ధాస్సర్వముత్సాదితం జగత్ ॥59॥
యజ్ఞభాగాన్ సమగ్రాంస్తు స్వయం గృహ్ణాతి దారుణః ।
ప్రవర్తితో హ్యధర్మస్తైః ఋషీణాం చ నివారితః ॥60॥

మహాదేవా! తన సోదరులిద్దరితోనూ కలిసి తారకాక్షుడు మమ్మల్ని పరాజితుల్ని చేశాడు. ఇంద్రుడితో సహా దేవతలమందరము ఆ తారకపుత్రుల చేతిలో ఓడిపోయాం. ఆ తారకాక్షుడు ముల్లోకాలనూ తన వశంలోకి తెచ్చేసుకున్నాడు. మునీశ్వరుల్నీ సిద్ధ–సాధ్య–దేవజాతులనూ ధ్వంసం చేశాడు. జగత్తు మొత్తాన్ని అల్లకల్లోలం చేశాడు. దారుణస్వభావులు ఆ ముగ్గురూ యజ్ఞభాగాలను మాకు చెందవలసిన వాటిని వారే లాగేసుకుంటున్నారు. ఋషిధర్మాలను పూర్తిగా అడ్డుకుని కేవలం అధర్మాన్ని నడిపిస్తున్నారు.

అవధ్యాస్సర్వభూతానాం నియతం తారకాత్మజాః ।
తదిచ్ఛయా ప్రకుర్వంతి సర్వే కర్మాణి శంకర ॥61॥

శంకరా! ఆ ముగ్గురూ ఏ ప్రాణికీ అవధ్యులు. ఇది విధివరం. అందుకని అందరూ వారి ఇచ్ఛానుసారంగానే కర్మాచరణం చేస్తున్నారు. (దుష్టకర్మలనే వారు అనుమతిస్తున్నారు, ప్రజలు అవే చేస్తున్నారు)

యావన్న క్షీయతే దైత్యైః ఘోరైః త్రిపురవాసిభిః ।
తావద్విధీయతాం నీతిర్యయా సంరక్ష్యతే జగత్ ॥62॥

పార్వతీపతీ! త్రిపురవాసులైన ఆ ఘోరదైత్యులు మరింతగా పూర్తిగా నాశనం చెయ్యకముందే మహాప్రభూ! ధర్మాన్ని (నీతిని) నిలబెట్టు. ఈ జగత్తును రక్షించే నీతిని అమలుపరుచు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తేషామింద్రాదీనాం దివౌకసామ్ ।
శివస్సంభాషమాణానాం ప్రతివాక్యమువాచ సః ॥63॥

వ్యాసర్షీ! ఇలా భాషిస్తున్న ఇంద్రాదిదేవతల విన్నపం విని ఆ మహాదేవుడు శివుడు బదులు పలికాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే దేవస్తుతిర్నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు దేవస్తుతి అనే రెండవ అధ్యాయం సమాప్తం.

తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయం

త్రిపురవధోపాఖ్యానం-భూతత్రిపురధర్మవర్ణనమ్ -

త్రిపురవధోపాఖ్యానం-భూతత్రిపురరధర్మవర్ణనం

శివ ఉవాచ - శివుడు పలికాడు.

అయం వై త్రిపురాధ్యక్షః పుణ్యవాన్ వర్తతేఽధునా ।
యత్ర పుణ్యం ప్రవర్తేత న హంతవ్యో బుధైః క్వచిత్ ॥1॥

జానామి దేవకష్టం చ విబుధాః సకలం మహత్ ।
దైత్యాస్తే ప్రబలా హంతుమశక్యాస్తు సురాసురైః ॥2॥

పుణ్యవంతస్తు తే సర్వే సమయాస్తారకాత్మజాః ।
దుస్సాధ్యస్తు వధస్తేషాం సర్వేషాం పురవాసినామ్ ॥3॥

మిత్రద్రోహం కథం జానన్ కరోమి రణకర్కశః ।
సుహృద్ ద్రోహే మహత్పాపం పూర్వముక్తం స్వయంభువా ॥4॥

విబుధులారా! త్రిపురాధ్యక్షుడు తారకాక్షుడు ప్రస్తుతం చాలా పుణ్యశాలి. పుణ్యమార్గంలో ప్రవర్తించేవాణ్ని దేవతలు సైతం సంహరించకూడదు. అయితే మీరు పడుతున్న మహాకష్టం అంతా నాకు తెలుసు. కానీ ఆ దైత్యులు అత్యంతబలిష్ఠులు. వారిని చంపడమనేది సురాసురులకు సాధ్యం కాని పని. మయుడితో సహా ఆ తారకాత్మజులూ, వారి ప్రజలు అంతా పుణ్యవంతులు. త్రిపురనివాసులైన వారి నందరినీ వధించడం సాధ్యం కాదు. అదీ గాక ఎరిగి ఎరిగీ- నేను ఎంత రణకర్కశుడినైనా మిత్రద్రోహం చేస్తానా? మిత్రద్రోహమనేది మహాపాపమని బ్రహ్మదేవుడు ఏనాడో చెప్పాడు.

బ్రహ్మఘ్నే చ సురాపే చ స్తేయే భగ్నవ్రతే తథా ।
నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః ॥5॥

మమ భక్తాస్తు తే దైత్యా మయా వధ్యాః కథం సురాః ।
విచార్యతాం భవద్భిశ్చ ధర్మజ్ఞైరేవ ధర్మతః ॥6॥

తావత్తే నైవ హంతవ్యా యావద్భక్తికృతశ్చ మే ।
తథాపి విష్ణవే దేవా నివేద్యం కారణం త్విదమ్ ॥7॥

బ్రహ్మహత్య- సురాపానం- దొంగతనం- వ్రతభంగం- ఇలాంటి పాపాలకు ఏదో ఒక నిష్కృతిని చెప్పారు పెద్దలు. కానీ కృతఘ్నుడికి మాత్రం ఏ నిష్కృతీ లేదు. అందుకని నా మిత్రులకి నేను ద్రోహం చెయ్యలేను. దేవతలారా! ఆ దైత్యులంతా నా భక్తులు. నేనెలా చంపుతాను? ఆలోచించండి. మీరు ధర్మం తెలిసినవారేగా! ధర్మబుద్ధితో ఆలోచించండి. నా పట్ల భక్తి ఉన్నంతవరకూ వాళ్ళు హంతవ్యులు కానే కారు. అయినా అమరులారా!

మిరంతా వెళ్ళి 'ఇదీ కారణం'– అని విష్ణుమూర్తికి విన్నవించండి. (ఈ కారణంగా శివుడు వారిని వధించనన్నాడని నివేదించండి)

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇత్యేవం తద్వచః శ్రుత్వా దేవాశ్చక్రపురోగమాః ।
న్యవేదయన్ ద్రుతం సర్వే బ్రహ్మణే ప్రథమం మునే ॥8॥

తతో విధిం పురస్కృత్య సర్వే దేవాస్సవాసవాః ।
వైకుంఠం ప్రయయుః శీఘ్రం సర్వే శోభాసమన్వితమ్ ॥9॥

తత్ర గత్వా హరిం దృష్ట్వా ప్రణేముర్జాతసంభ్రమాః ।
తుష్టువుశ్చ మహాభక్త్యా కృతాంజలిపుటాస్సురాః ॥10॥

సాత్యవతేయా! శివుడు ఇలా పలికేసరికి ఇంద్రాదిదేవతలందరూ వెంటనే బయలుదేరి ముందుగా బ్రహ్మదేవుడిదగ్గరికి వెళ్ళారు. అతడిని ముందు పెట్టుకుని సకలశోభాసమన్వితమైన వైకుంఠానికి శీఘ్రంగా వెళ్ళారు. అక్కడ శ్రీహరిని దర్శించి ససంభ్రంగా నమస్కరించారు. అలాగే నిలిచి చాలా భక్తితో స్తుతించారు.

స్వదుఃఖకారణం సర్వం పూర్వవత్తదనంతరమ్ ।
న్యవేదయన్ ద్రుతం తస్మై విష్ణవే ప్రభవిష్ణవే ॥11॥

దేవదుఃఖం తతః శ్రుత్వా దత్తం చ త్రిపురాలయైః ।
జ్ఞాత్వా వ్రతం చ తేషాం తద్విష్ణుర్వచనమబ్రవీత్ ॥12॥

స్తుతించిన అనంతరం తమ దుఃఖహేతువుని ప్రభవిష్ణువైన ఆ విష్ణుమూర్తికి వేగంగా (క్లుప్తంగా) మునుపటిలాగానే విన్నవించారు. త్రిపురాధీశులు దేవతలకు కలిగించిన దుఃఖాన్ని విని, అలాగే ఆ దైత్యపుత్రుల ధర్మనిష్ఠను తెలుసుకుని విష్ణుమూర్తి తన మాట చెప్పాడు.

విష్ణురువాచ – విష్ణువు అన్నాడు.

ఇదం సత్యం వచశ్చైవ యత్ర ధర్మస్సనాతనః ।
తత్ర దుఃఖం న జాయేత సూర్యే దృష్టే యథా తమః ॥13॥

దేవతలారా! ఒక్క మాట మాత్రం వాస్తవం. సనాతనధర్మం ఉన్నచోట దుఃఖం అనేదే ఉండదు. సూర్యుడు కనిపిస్తే చీకటి ఉండనట్టు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇత్యేతద్వచనం శ్రుత్వా దేవా దుఃఖముపాగతాః ।
పునరూచుస్తథా విష్ణుం పరిమ్లానముఖాంబుజాః ॥14॥

శ్రీహరి ఇలా అనేసరికి దేవతలకు మరింత దుఃఖం వచ్చింది. ముఖపద్మాలు వాడిపోయాయి. అయినా మళ్ళీ శ్రీహరిని వేడుకున్నారు.

దేవా ఊచుః – దేవతలు అన్నారు.

కథం చైవ ప్రకర్తవ్యం కథం దుఃఖం నిరస్యతే ।
కథం భవేమ సుఖినః కథం స్థాస్యామహే వయమ్ ॥15॥

కథం ధర్మా భవిష్యంతి త్రిపురే జీవితే సతి ।
దేవదుఃఖప్రదా నూనం సర్వే త్రిపురవాసినః ॥16॥

కిం వా తే త్రిపురస్యేహ వధశ్చైవ విధీయతామ్ ।
నోచేదకాలికీ దేవసంహతిః క్రియతాం ధ్రువమ్ ॥17॥

మహాప్రభూ! మేము ఏమి చెయ్యాలి? మా దుఃఖం తొలగేది ఎలా? మేమెలా సుఖపడాలి? మేమసలు బతకాలా వద్దా? త్రిపురాసురుడు ప్రాణాలతో ఉండగా ధర్మాలు ఎలా నడుస్తాయి? త్రిపురవాసులందరూ దేవతల్ని దుఃఖపెట్టేవారే. ఏమో, ఏమి చేస్తావో మాకు తెలీదు, త్రిపురాసురుణ్ణి సంహరించు. లేదా మాదేవజాతిని కచ్చితంగా కాలం చెల్లిపోయినదాన్నిగానైనా దయచేసి చెయ్యి. (మాకు కాలం చెల్లడాన్ని అనుమతించు.)

సనత్కుమార ఊవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇత్యుక్త్వా తే తదా దేవా దుఃఖం కృత్వా పునః పునః! ।
స్థితిం నైవ గతిం తే వై చక్రుర్దేవవరాదిహ ॥18॥

తాన్వై తథావిధాన్ దృష్ట్వా హీనాన్వినయసంయుతాన్ ।
సోఽ పి నారాయణః శ్రీమాంశ్చింతయేచ్ఛేతసా తథా ॥19॥

ఇలా ఉక్రోషంగా పలికి దేవతలు దుఃఖం ఆపుకోలేక మళ్ళీ మళ్ళీ విలపించారు. దేవవరిష్ఠుడై శ్రీహరి సన్నిధిలో అలా ఉండలేకా వెళ్ళిపోలేకా ఇబ్బందిపడ్డారు. వినయవిధేయతల్ని విడిచిపెట్టలేక, వచ్చిపడిన దైన్యాన్ని భరించలేక అవస్థపడుతున్న ఆ దేవతల్ని గమనించి శ్రీమన్నారాయణుడు మనస్సులో ఆలోచన సాగించాడు.

కిం కార్యం దేవకార్యేషు మయా దేవసహాయినా ।
శివ భక్తాస్తు తే దైత్యాస్తారకస్య సుతా ఇతి ॥20॥

ఇతి సంచింత్య తత్కాలే విష్ణునా ప్రభవిష్ణునా।
తతో యజ్ఞః స్మృతస్తేన దేవకార్యార్థమక్షయః ॥21॥

నేనిపుడు ఏం చెయ్యాలి? దేవకార్యాలకు ఎప్పుడూ నేను సహాయపడేవాడినే. కానీ ఈ తారకపుత్రులు పరమశివభక్తులు. ఎలా? – అని ఆలోచించి ఆలోచించి శ్రీమహావిష్ణువు ఒక నిర్ణయానికి వచ్చాడు. దేవకార్యార్థంగా అక్షయుడైన యజ్ఞాధిష్ఠానపురుషుణ్ణి స్మరించాడు.

తద్విష్ణుస్మృతిమాత్రేణ యజ్ఞాస్తే తత్క్షణం ద్రుతమ్
ఆగతాస్తత్ర యత్రాస్తే శ్రీపతిః పురుషోత్తమః ॥22॥

తతో విష్ణుం యజ్ఞపతిం పురాణం పురుషం హరిమ్ ।
ప్రణమ్య తుష్టువుస్తే వై కృతాంజలిపుటాస్తదా ॥23॥

భగవానపి తాన్ దృష్ట్వా యజ్ఞాన్ ప్రాహ సనాతనాన్ ।
సనాతనస్తదా సేంద్రాన్స దేవానాలోక్య చాచ్యుతః ॥24॥

శ్రీమహావిష్ణువు తలుచుకోగానే వెంటనే వేగంగా యజ్ఞాధిష్ఠానపురుషులు అందరూ వచ్చి ఆ పురుషోత్తముడి సన్నిధిలో నిలిచారు. సాష్టాంగపడి లేచి అంజలిబంధనాలతో నిలిచి పురాణపురుషుడూ యజ్ఞపతి అయిన శ్రీహరిని శ్రీపతిని బహుధా స్తుతించారు. సనాతనులైన ఆ యజ్ఞపురుషుల్నీ ఇంద్రాది దేవతల్నీ తిలకించి సనాతనుడు ఆ భగవంతుడు అచ్యుతుడు ఇలా పలికాడు.

విష్ణురువాచ – విష్ణువు అన్నాడు.

అనేనైవ సదా దేవా యజధ్వం పరమేశ్వరమ్ ।
పురత్రయ వినాశాయ జగత్త్రయ విభూతయే ॥25॥

దేవతలారా! ఇదిగో ఈ యజ్ఞాధిష్ఠానపురుషుడితో మీరందరూ ఆ పరమేశ్వరుణ్ణి పూజించండి. పురత్రయ వినాశం కోసం, జగత్త్రయవిభూతి కోసం మీరు ఈ యజ్ఞం నిర్వహించండి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

అచ్యుతస్య వచః శ్రుత్వా దేవదేవస్య ధీమతః ।
ప్రేమ్ణా తే ప్రణతిం కృత్వా యజ్ఞేశం తేఽస్తువన్ సురాః ॥26॥

ఏవం స్తుత్వా తతో దేవా అయజన్ యజ్ఞపూరుషమ్ ।
యజ్ఞోక్తేన విధానేన సంపూర్ణవిధయో మునే ॥27॥

వ్యాసమునీ! ధీమంతుడూ దేవదేవుడూ అయిన అచ్యుతుడు చెప్పిన మాటను శిరసావహించి దేవతలందరూ భక్తితో ఆ యజ్ఞేశుడికి నమస్కరించి ఎంతగానో స్తుతించారు. అటుపైని ఆ యజ్ఞపురుషుణ్ణి యజ్ఞోక్త ప్రకారంగా సంపూర్ణ నియమనిష్ఠలతో యజించారు.

తతస్తస్మాద్యజ్ఞకుండాత్సముత్పేతుస్సహస్రశః ।
భూతసంఘా మహాకాయాః శూలశక్తిగదాయుధాః ॥28॥

దదృశుస్తే సురాస్తాన్వై భూతసంఘాన్ సహస్రశః ।
శూలశక్తిగదాహస్తాన్ దండచాపశిలాయుధాన్ ॥29॥

నానాప్రహరణోపేతాన్ నానావేషధరాంస్తథా ।
కాలాగ్నిరుద్రసదృశాన్ కాలసూర్యోపమాంస్తదా ॥30॥

దృష్ట్వా తానబ్రవీద్విష్ణుః ప్రణిపత్య పురఃస్థితాన్ ।
భూతాన్ యజ్ఞపతిః శ్రీమాన్ రుద్రాజ్ఞాప్రతిపాలకః ॥31॥

అంతట ఆ యజ్ఞకుండం నుంచి వేలవేల సంఖ్యలో భూతసమూహాలు ఒక్కసారిగా ఆవిర్భవించాయి. అందరూ మహాకాయులే. శూలం శక్తి గద మొదలైన ఆయుధాలు ధరించి ఉన్నారు. దండ–చాప– శిలాయుధ ధారులు. ఇంకా అనేకాయుధాలతో అనేకవేషధారులై ప్రళయకాలాగ్నులో ప్రళయకాలరుద్రులో, ప్రళయకాల సూర్యగోళాలో, అన్నట్టున్నారు. వీరిని చూసి దేవతలంతా చకితులై పోయారు. చూస్తూండగానే వీరందరూ శ్రీమహావిష్ణువుకి సాగిలిమొక్కి అతడి ఎదుట సవినయంగా నిలబడ్డారు. రుద్రుడి ఆనతిని శిరసావహించేవాడూ, యజ్ఞేశ్వరుడూ అయిన శ్రీమహావిష్ణువు అప్పుడు వారితో ఇలా పలికాడు.

విష్ణురువాచ – విష్ణువు పలికాడు.

భూతాః శృణుత మద్వాక్యం దేవకార్యార్థముద్యతాః ।
గచ్ఛంతు త్రిపురం సద్యస్సర్వే హి బలవత్తరాః ॥32॥

గత్వా దగ్ధ్వా చ భిత్త్వా చ భంక్త్వా దైత్యపురత్రయమ్ ।
పునర్యథాగతా భూతా గంతుమర్హథ భూతయే ॥33॥

భూతాల్లారా! వినండి నా మాట. మీరందరూ దేవకార్యంకోసం ఉద్భవించారు. మహాబలిష్ఠులు. వెంటనే త్రిపురాలకు వెళ్ళి ఆ దైత్యపట్టణాలను మూడింటినీ కాల్చి పగిల్చి కూల్చి– మళ్ళీ ఎలా వచ్చారో అలా వెళ్ళిపోండి. ఇది మీకు శుభప్రదం.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

తచ్ఛ్రుత్వా భగవద్వాక్యం తతో భూతగణాశ్చ తే ।
ప్రణమ్య దేవదేవం తం యయుర్దైత్యపురత్రయమ్ ॥34॥

గత్వా తత్ప్రవిశంతశ్చ త్రిపురాధిపతేజసి ।
భస్మసాదభవన్ సద్యః శలభా ఇవ పావకే ॥35॥

శ్రీమహావిష్ణువు ఆజ్ఞను స్వీకరించి ఆ భూతగణాలు ఒక్కసారి మళ్ళీ శ్రీహరికి నమస్కరించి వెంటనే త్రిపురాలకు బయలుదేరారు. వెళ్ళి ఆ నగరాలలోకి ప్రవేశించారో లేదో అంతే ఆ తేజస్సుకి అందరూ మంటల్లో మిడతల్లాగా బూడిద అయిపోయారు.

అవశిష్టాశ్చ యే కేచిత్పలాయనపరాయణాః ।
నిస్సృత్యారం సమాయాతా హరేర్నికటమాకులాః ॥36॥

తాన్ దృష్ట్వా స హరిః శ్రుత్వా తచ్చ వృత్తమశేషతః ।
చింతయామాస భగవాన్ మనసా పురుషోత్తమః ॥37॥

వ్యాసమహర్షీ! కాలిపోయినవారు కాలిపోగా, మిగిలిన ఆ కొద్దిమందీ పలాయనం చిత్తగించారు. భయభ్రాంతులై శ్రీహరి సన్నిధికి తిరిగివచ్చారు. అలా వచ్చిన వాళ్ళని చూసి వాళ్ళు చెప్పింది విని– పురుషోత్తముడు ఆలోచనలో పడ్డాడు.

కిం కృత్యమధునా కార్యమితి సంతప్తమానసః ।
సంతప్తానమరాన్సర్వానాజ్ఞాయ చ సవాసవాన్ ॥38॥

కథం తేషాం చ దైత్యానాం బలాద్ధత్వా పురత్రయమ్ ।
దేవకార్యం కరిష్యామీత్యాసీచ్చింతాసమాకులః ॥39॥

నాశో ఽభిచారతో నాస్తి ధర్మిష్ఠానాం న సంశయః ।
ఇతి ప్రాహ స్వయంచేశః శ్రుత్యాచారప్రమాణకృత్ ॥40॥

ఏమి చెయ్యాలో తోచక ఆకుల చిత్తుడై, తనలాగానే ఆకుల పడుతున్నారని ఇంద్రాదిదేవతల నందరినీ గమనించి, ఆ దైత్యకుమారుల పురత్రయాన్ని బలవంతంగా నాశనం చేసి, దేవకార్యం ఎలా నెరవేర్చగలనా అని చింతాసమాకులుడయ్యాడు. ఇలాంటి అభిచారాలతో (చేతబడులు వగైరాలను అభిచారాలు – ఆభిచారిక హోమాలు అంటారు) ధర్మిష్ఠులకు హాని జరగదు గాక జరగదని వేదాచారాలకు ప్రామాణికుడైన సదాశివుడు ఏనాడో స్వయంగా చెప్పనే చెప్పాడు.

దైత్యాశ్చ తే హి ధర్మిష్ఠాస్సర్వే త్రిపురవాసినః ।
తస్మాదవధ్యతాం ప్రాప్తా నాన్యథా సురపుంగవాః ॥41॥

సురపుంగవులారా! త్రిపురవాసులైన ఆ దైత్యులు ధర్మిష్ఠులు. అందుకే అవధ్యతను పొందగలిగారు. మరొకలా వారికి ఈ అవధ్యత్వం రాదు.

కృత్వా తు సుమహత్పాపం రుద్రమభ్యర్చయంతి తే ।
ముచ్యంతే పాతకైస్సర్వైః పద్మపత్రమివాంభసా ॥42॥

రుద్రాభ్యర్చనతో దేవాస్సర్వే కామా భవంతి హి ।
నానోపభోగసంపత్తిర్వశ్యతాం యాతి వై భువి ॥43॥

తస్మాత్తద్భోగినో దైత్యా లింగార్చనపరాయణాః ।
అనేకవిధసంపత్తేర్మోక్షస్యాపి పరత్ర చ ॥44॥

తతః కృత్వా ధర్మవిఘ్నం తేషామేవాత్మమాయయా ।
దైత్యానాం దేవకార్యార్థం హరిష్యే త్రిపురం క్షణాత్ ॥45 ॥

ఈ దైత్యులు ఎంతటి పాపకృత్యాలు చేస్తున్నా శివార్చనాతత్పరులు కనుక తామరాకు మీద నీటిబొట్టుల్లాగా ఆ పాపాలు ఏమీ వీరికి అంటడం లేదు. పాతకాలనుంచి విముక్తులవుతున్నారు. దేవతలారా! రుద్రుణ్ణి అర్చిస్తే తీరని కోరికలంటూ ఉండవు. సమస్తభోగాలూ, సమస్తసంపదలూ కైవసం అవుతాయి. లింగార్చనపరాయణులు కనుకనే ఆ దైత్యులు అంతటి భోగాలు అనుభవిస్తున్నారు. ఇహలోకసంపత్తికీ మోక్షప్రాప్తికీ మూలకందం శివ లింగార్చనమే. సరే నా మాయాజాలంతో ఆ దైత్యులకి ధర్మవిఘ్నం కలిగించి – దేవకార్యసిద్ధికోసం వారినీ, వారి త్రిపురాలనీ క్షణంలో హరిస్తాను.

విచార్యేత్థం తతస్తేషాం భగవాన్పురుషోత్తమః ।
కర్తుం వ్యవస్థితః పశ్చాత్ ధర్మవిఘ్నం సురారిణామ్ ॥46॥

యావచ్చ వేదధర్మాస్తు యావద్వై శంకరార్చనమ్ ।
యావచ్చ శుచికృత్యాది తావన్నాశో భవేన్న హి ॥47॥

తస్మాదేవం ప్రకర్తవ్యం వేదధర్మస్తతో వ్రజేత్ ।
త్యక్తలింగార్చనా దైత్యా భవిష్యంతి న సంశయః ॥48॥

బాగా ఆలోచించి ఈ నిర్ణయాన్ని ప్రకటించిన ఆ పురుషోత్తముడు అటుపైని దేవశత్రువులైన రాక్షసులకు ముందుగా ధర్మవిఘ్నం కలిగించాలనుకున్నాడు. వేదధర్మాలూ, శివలింగార్చనమూ, శౌచకృత్యాలు జరుగుతున్నంత కాలం దైత్యసంతతికి నాశనం లేదు. కనుక వారినుంచి వేదధర్మం తొలగిపోయేట్టు చెయ్యాలి. అటుపైని వాళ్ళంతట వాళ్ళే శివలింగార్చన వదిలేస్తారు. సందేహం లేదు.

ఇతి నిశ్చిత్య వై విష్ణుర్విఘ్నార్థమకరోత్తదా ।
తేషాం ధర్మస్య దైత్యానాముపాయం శ్రుతిఖండనమ్ ॥49॥

ఇలా నిశ్చయించి విష్ణుమూర్తి, దైత్యుల ధర్మనిష్ఠకు విఘ్నం కలిగించాలి. అంటే వేదాలను నిందించడం–ఖండించడమే ఉపాయంగా భావించాడు.

తదైవోవాచ దేవాన్స విష్ణుర్దేవసహాయకృత్ ।
శివాజ్ఞయా శివేనైవాజ్ఞప్తః త్రైలోక్యరక్షణే ॥50॥

ముల్లోకాలనూ రక్షించడానికి శివుడిచేత నియుక్తుడై దేవకార్యాలకు సహాయపడుతున్న శ్రీమహావిష్ణువు శివాజ్ఞను అనుసరించి, ఇదే విషయాన్ని దేవతలందరికీ తెలియపరిచాడు.

విష్ణురువాచ – విష్ణువు అన్నాడు.

హే దేవాస్సకలా యూయం గచ్ఛత స్వగృహాన్ ధ్రువమ్ ।
దైవకార్యం కరిష్యామి యథామతి న సంశయః ॥51॥

తాన్ రుద్రాద్విముఖాన్నూనం కరిష్యామి సుయత్నతః ।
స్వభక్తిరహితాన్ జ్ఞాత్వా తాన్ కరిష్యతి భస్మసాత్ ॥52॥

దేవతలారా! మీరందరూ మీమీ ఇళ్ళకు వెళ్ళండి. నా బుద్ధికి తోచినట్టు ఈ దేవకార్యాన్ని నేను చక్కబెడతాను. సందేహం లేదు. గట్టి ప్రయత్నమే చేసి ఆ దైత్యుల్ని కచ్చితంగా రుద్రుడికి విముఖుల్ని చేస్తాను. అటుపైని వారిలో శివభక్తి అడుగంటిందని తెలిసి రుద్రుడే వారిని భస్మం చేస్తాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తదాజ్ఞాం శిరసాధాయ శ్వాసితాస్తేఽమరా మునే ।
స్వస్వధామాని విశ్వస్తా యయుః బ్రహ్మాపి మోదితః ॥53॥

తతశ్చైవాకరోద్విష్ణుర్దేవార్థం హితముత్తమమ్ ।
తదేవ శ్రూయతాం సమ్యక్సర్వపాపప్రణాశనమ్ ॥54॥

వ్యాసమహామునీ! శ్రీహరి ఆజ్ఞను శివసావహించి దేవతలంతా ఊపిరి పీల్చుకుని ఎవరికి వారుగా స్వగృహాలకు వెళ్ళారు. బ్రహ్మదేవుడూ ఆనందించాడు. అటుపిమ్మట మహర్షీ! శ్రీమహావిష్ణువు దేవతలకోసం ఒక ఉత్తమోత్తమ హితాన్ని చేశాడు. అదేమిటో చెబుతాను, ఆలకించు. అది సర్వపాపప్రణాశకం సుమా!

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే త్రిపురవధోపాఖ్యానం–భూతత్రిపురధర్మవర్ణనం నామ తృతీయోఽధ్యాయః ॥3॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు త్రిపుర వధోపాఖ్యానం – భూతత్రిపురధర్మవర్ణనం అనే మూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్థోఽధ్యాయః – నాల్గవ అధ్యాయం

సనత్కుమార పారాశర్య సంవాదే త్రిపురదీక్షావిధానమ్

సనత్కుమార పారాశర్య సంవాదంలో త్రిపురదీక్షా విధానం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

అసృజచ్చ మహాతేజాః పురుషం స్వాత్మసంభవమ్ ।
ఏకం మాయామయం తేషాం ధర్మవిఘ్నార్థమచ్యుతః ॥1॥

ముండినం మ్లానవస్త్రం చ గుంఫిపాత్రసమన్వితమ్ ।
దధానం పుంజికాం హస్తే చాలయంతం పదే పదే ॥2॥

వస్త్రయుక్తం తథా హస్తం క్షీయమాణం ముఖే సదా ।
ధర్మేతి వ్యాహరంతం హి వాచా విక్లబయా మునిమ్ ॥3॥

వ్యాసమహర్షీ! మహాతేజస్వి అచ్యుతుడు అప్పుడు మాయామయుడైన పురుషుణ్ని ఒకణ్ని తన ఆత్మ సంభవుడుగా సృష్టించాడు. దైత్యవీరుల ధర్మనిష్ఠకు విఘ్నం కలిగించడం కోసమే సృష్టించాడు. ఆ మాయా మోహపురుషుడిది బోడిగుండు. ఒక చేతిలో చిక్కం – అందులో ఒకటి రెండు పాత్రలు ఉన్నాయి. మరొక చేతిలో పుంజిక (వస్త్రగుచ్ఛం) ఉంది. దాన్ని అడుగడుగునా అటూ ఇటూ విసురుతున్నాడు. రెండు చేతులకూ, వస్త్రాచ్ఛాదనలున్నాయి. ముఖం శుష్కించిపోయి ఉంది. నీరసంగా వినిపిస్తున్న కంఠస్వరంతో, 'ధర్మం ధర్మం' అని పలుకుతున్నాడు. అటువంటి మునిని సృష్టించాడు అచ్యుతుడు.

స నమస్కృత్య విష్ణుం తం తత్పరస్సంస్థితోఽథ వై ।
ఉవాచ వచనం తత్ర హరిం స ప్రాంజలి స్తదా ॥4॥

అరిహన్నచ్యుతం పూజ్యం కిం కరోమి తదాదిశ ।
కాని నామాని మే దేవ స్థానం వాపి వద ప్రభో ॥5॥

ఇత్యేవం భగవాన్విష్ణుః శ్రుత్వా తస్య శుభం వచః ।
ప్రసన్నమానసో భూత్వా వచనం చేదమబ్రవీత్ ॥6॥

అతడి పేరు అరిహన్. అతడు పూజ్యశ్రీమహావిష్ణువుకి నమస్కరించి అలాగే ఎదుట నిలిచి అడిగాడు. దేవా! నేనేమి చెయ్యాలో ఆజ్ఞాపించు. నాకు పేర్లేమిటో చెప్పు. నా నివాసస్థానం ఏదో చూపించు. ఇలా అడిగిన అతడి శుభవచనాలకి ప్రసన్నచిత్తుడై విష్ణుభగవానుడు ఇలా సమాధానం చెప్పాడు.

విష్ణురువాచ – విష్ణువు చెప్పాడు.

యదర్థం నిర్మితో ఽసి త్వం నిబోధ కథయామి తే ।
మదంగజ మహాప్రాజ్ఞ మద్రూపస్త్వం న సంశయః ॥7॥

మమాంగాచ్చ సముత్పన్నో మత్కార్యం కర్తుమర్హసి ।
మదీయస్త్వం సదా పూజ్యో భవిష్యసి న సంశయః ॥8॥

అరిహన్నామ తే స్యాత్తు హ్యన్యాని న శుభాని చ ।
స్థానం వక్ష్యామి తే పశ్చాత్ శృణు ప్రస్తుతమాదరాత్ ॥9॥

మాయిన్! మాయామయం శాస్త్రం తత్ షోడశసహస్రకమ్ ।
శ్రౌతస్మార్తవిరుద్ధం చ వర్ణాశ్రమవివర్జితమ్ ॥10॥

అపభ్రంశమయం శాస్త్రం కర్మవాదమయం తథా ।
రచయేతి ప్రయత్నేన తద్విస్తారో భవిష్యతి ॥11॥

దదామి తవ నిర్మాణే సామర్థ్యం తద్భవిష్యతి ।
మాయా చ వివిధా శీఘ్రం త్వదధీనా భవిష్యతి ॥12॥

ప్రాజ్ఞుడా! నిన్ను ఎందుకు సృష్టించానో చెబుతున్నాను, తెలుసుకో. నువ్వు నా అంగజుడివి (పుత్రుడివి). నా పోలికలే నీవి. సందేహం లేదు. నా నుంచి ఉద్భవించావు కనక నా పని నువ్వు చెయ్యాలి. నువ్వు నా వాడివి. పరమపూజ్యుడివి అవుతావు. సంశయం లేదు. నీ పేరు అరిహన్. తక్కినవి మంచి పేర్లు కావు. నీకు నివాసస్థలం ఎక్కడో తరువాత చెబుతాను. ప్రస్తుతం శ్రద్ధగా విను. మాయావీ! నువ్వు మాయామయమైన ఒక శాస్త్రం రచించాలి. అది పదహారువేల (లక్షల) శ్లోకాలతో ఉండాలి. వేదవిరుద్ధంగా స్మృతులకు విరుద్ధంగా వర్ణాశ్రమధర్మాలకు విరుద్ధంగా రూపొందాలి. కేవలం కర్మవాదాన్ని ప్రతిపాదిస్తూ అపభ్రంశభాషలో ఉండాలి. ఆ శాస్త్రం నువ్వు పూనికతో రచించు. దానికి చాలా విస్తృతంగా ప్రసిద్ధి ప్రచారం వస్తాయి. దాన్ని రచించడానికి అవసరమైన శక్తిసామర్థ్యాలను నీకు అనుగ్రహిస్తున్నాను.రకరకాల మాయ కూడా వెంటనే నీకు అధీనమవుతుంది. (తత్తు షోడశలక్షకమ్–అని పాఠాంతరం)

తత్ శ్రుత్వా వచనం తస్య హరేశ్చ పరమాత్మనః ।
నమస్కృత్య ప్రత్యువాచ స మాయీ తం జనార్దనమ్ ॥13॥

వ్యాసమహర్షీ! పరమాత్మ శ్రీహరి చెప్పిన ఈ విషయం విని ఆ మాయావి ఆ జనార్దనుడికి నమస్కరించి ఇలా అన్నాడు.

ముండ్యువాచ – ముండతశిరస్కుడు అరిహన్ అన్నాడు.

యత్ కర్తవ్యం మయా దేవ ద్రుతమాదిశ తత్ప్రభో ।
త్వదాజ్ఞయాఖిలం కర్మ సఫలం చ భవిష్యతి ॥14॥

దేవా! ప్రభూ! దీనికి నేనేమి చెయ్యాలో వెంటనే ఆజ్ఞాపించు. నీ ఆనతి మేరకు పని సమస్తమూ సఫలమవుతుంది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇత్యుక్త్వా పాఠయామాస శాస్త్రం మాయామయం తథా ।
ఇహైవ స్వర్గనరకప్రత్యయో నాన్యథా పునః ॥15॥

తమువాచ పునర్విష్ణుః స్మృత్వా శివపదాంబుజమ్ ।
మోహనీయా ఇమే దైత్యాః సర్వే త్రిపురవాసినః ॥16॥

కార్యాస్తే దీక్షితా నూనం పాఠనీయాః ప్రయత్నతః ।
మదాజ్ఞయా న దోషస్తే భవిష్యతి మహామతే ॥17॥

వ్యాసమునీంద్రా! అప్పుడు శ్రీమహావిష్ణువు మాయామయమైన శాస్త్రాన్ని అతడికి బోధించాడు. స్వర్గమూ నరకమూ అంటూ ఏమీ లేవు. ఉన్నది అంతా ఇహమొక్కటే. ఇలా సారాంశం చెప్పి శ్రీహరి శివుడి పాదపద్మాలను మరొక్క తడవ ధ్యానించి, ఇంకా ఇలా ఉపదేశించాడు. ఓ మహామతీ! త్రిపురవాసులైన దైత్యులందరినీ నువ్వు మోహంలో పడవెయ్యాలి. ఈ శాస్త్రాన్ని వారితో బాగా చదివించి దీని ఆచరణకు దీక్షాబద్ధుల్ని చెయ్యాలి. ఇది నా ఆజ్ఞ కనక ఇందువల్ల నీకు వచ్చే దోషమేమీ లేదు.

ధర్మాస్తత్ర ప్రకాశంతే శ్రౌతస్మార్తా న సంశయః ।
అనయా విద్యయా సర్వే స్ఫోటనీయా ధ్రువం యతే ॥18॥

గంతుమర్హతి నాశార్థం ముండిన్! త్రిపురవాసినామ్ ।
తమోధర్మం సంప్రకాశ్య నాశయస్వ పురత్రయమ్ ॥19॥

హే ముండిన్! అక్కడ త్రిపురాలలో శ్రౌతస్మార్తధర్మాలు అద్భుతంగా ప్రకాశిస్తున్నాయి. నువ్వు ఈ మాయామోహవిద్యతో వాటిని పూర్తిగా ఎగరగొట్టాలి. త్రిపురవాసులను భ్రష్టుపట్టించడానికి నువ్వు వెంటనే అక్కడికి వెళ్ళు. ఈ తమోధర్మాన్ని (తామసిక ధర్మం) విస్తృతంగా ప్రచారం చెయ్యి. పురత్రయాన్ని ధ్వంసం చెయ్యి.

తతశ్చైవ పునర్గత్వా మరుస్థల్యాం త్వయా విభో ।
స్థాతవ్యం చ స్వధర్మేణ కలిర్యావత్ సమావ్రజేత్ ॥20॥

ప్రవృత్తే తు యుగే తస్మిన్ స్వీయో ధర్మః ప్రకాశ్యతామ్ ।
శిష్యైశ్చ ప్రతిశిష్యైశ్చ వర్తనీయస్త్వయా పునః ॥21॥

అటుమీదట – ఓ వ్యాపనశీలుడా! పెద్ద ఎడారికి వెళ్ళి అక్కడ నివసిద్దువు గాని. నీ మాయామోహ ధర్మాన్ని అనుష్ఠిస్తూ కలియుగం వచ్చేదాకా అక్కడ ఉండి, కలి ప్రవేశించాక శిష్య ప్రశిష్యులతో పెద్దఎత్తున నీ మతాన్ని ప్రచారం చేద్దువు గాని, ఆచరింపజేద్దువు గాని.

మదాజ్ఞయా భవద్ధర్మో విస్తారం యాస్యతి ధ్రువమ్ ।
మదనుజ్ఞాపరో నిత్యం గతిం ప్రాప్స్యసి మామకీమ్ ॥22॥

ఏవమాజ్ఞా తదా దత్తా విష్ణునా ప్రభవిష్ణునా ।
శాసనాద్దేవదేవస్య హృదా త్వంతర్దధే హరిః ॥23॥

ఓయీ అరిహన్! నీ మాయామోహధర్మం బాగా విస్తరిస్తుంది. తప్పదు. ఇది నా ఆజ్ఞ. నేను చెప్పినట్టు తత్పరుడవై చెయ్యి. నా సాయుజ్యాన్ని పొందుతావు. (విష్ణులోకనివాసం లభిస్తుంది). వ్యాసా! మహాదేవుడైన శివుడి ఆజ్ఞను తన అంతరంగం ద్వారా అందుకుని శ్రీమహావిష్ణువు ఆతడికి ఇలా ఆనతి ఇచ్చి అంతర్ధానం చెందాడు.

తతస్స ముండీ పరిపాలయన్ హరే రాజ్ఞాం తథా నిర్మితవాంశ్చ శిష్యాన్ ।
యథాస్వరూపం చతురస్తదానీం మాయామయం శాస్త్రమపాఠయత్ స్వయమ్ ॥24॥

యథా స్వయం తథా తే చ చత్వారో ముండినః శుభాః ।
నమస్కృత్య స్థితాస్తత్ర హరయే పరమాత్మనే ॥25॥

అటుపిమ్మట ఆ ముండిత శిరస్కుడు శ్రీహరి ఆజ్ఞప్రకారంగా అచ్చం తనలాగానే ఉన్న నలుగురు శిష్యులను సృష్టించాడు. తానే స్వయంగా వారికి తన మాయామయశాస్త్రాన్ని బోధించాడు. వారు నలుగురూ ఇతడిలాగానే బోడిగుండులతో శుభప్రదంగా ఉన్నారు. శ్రీమహావిష్ణువుకి నమస్కరించి నిలబడ్డారు.

హరిశ్చాపి మునేస్తత్ర చతురస్తాంస్తదా స్వయమ్ ।
ఉవాచ పరమప్రీతశ్శివాజ్ఞాపరిపాలకః ॥26॥

యథా గురుస్తథా యూయం భవిష్యథ మదాజ్ఞయా ।
ధన్యాఃస్థ సద్గతిమిహ సంప్రాప్స్యథ న సంశయః ॥27॥

శివాజ్ఞను శిరసావహించే శ్రీహరి చాలా ఆనందించి ఆ అరిహంతుని శిష్యులు నలుగురికీ స్వయంగా ఇలా ఉపదేశించాడు. మీ గురువులాగానే మీరు ఉండండి. ఇది నా ఆన. మీరందరూ ధన్యులవుతారు. సద్గతిని పొందుతారు. సందేహం లేదు.

చత్వారో ముండినస్తేఽథ ధర్మం పాషండమాశ్రితాః ।
హస్తే పాత్రం దధానాశ్చ తుండవస్త్రస్య ధారకాః ॥28॥

మలినాన్యేవ వాసాంసి ధారయంతో హ్యభాషిణః ।
ధర్మో లాభః పరం తత్త్వం వదంతస్తుతిహర్షతః ॥29॥

మార్జనీం ధ్రియమాణాశ్చ వస్త్రఖండవినిర్మితామ్ ।
శనైశ్శనైశ్చలంతో హి జీవహింసాభయాత్ ధ్రువమ్ ॥30॥

తే సర్వే చ తదా దేవం భగవంతం ముదాన్వితాః ।
నమస్కృత్య పునస్తత్ర మునే తస్థుస్తదగ్రతః ॥31॥

ఆ నలుగురు బోడిగుండులవారూ పాషండమతాన్ని (పునర్జన్మలు, కర్మసిద్ధాంతాలు, స్వర్గనరకాలు ఇత్యాది వైదికసూత్రాలను తిరస్కరించిన మతం) స్వీకరించారు. చేతిలో ఒక పాత్ర ధరించారు. ముక్కు నుంచి నోటి వరకు ఒక వస్త్రం కట్టుకున్నారు. మాసిపోయిన గుడ్డలే తాల్చారు. ధర్మమే లాభం, అదే పరతత్త్వం అని ఆనందపడుతూ

ప్రకటించడం తప్ప మరింక ఏమీ మాట్లాడటం లేదు. జీవహింసాభయం వల్ల ఒక గుడ్డ చీపురుతో నేలను తుడుచుకుంటూ మెల్లమెల్లగా నడుస్తున్నారు. వీరందరూ సంతోషంగా శ్రీహరికి నమస్కరించి అతడి ఎదుట నిలబడ్డారు.

హరిణా చ తదా హస్తే ధృత్వా చ గురవే ఽర్పితాః ।
అభ్యధాయి చ సుప్రీత్యా తన్నామాపి విశేషతః ॥32॥

యథా త్వం చ తథైవైతే మదీయా వై న సంశయః ।
ఆదిరూపం చ తన్నామ పూజ్యత్వాత్పూజ్య ఉచ్యతే ॥33॥

ఋషిర్యతిస్తథా కీర్య ఉపాధ్యాయ ఇతి స్వయమ్ ।
ఇమాన్యపి తు నామాని ప్రసిద్ధాని భవంతు వః ॥34॥

అప్పుడు శ్రీహరి ఆ నలుగురి చేతుల్నీ తన చేతుల్లోకి తీసుకుని స్వయంగా గురువుకి అప్పగించాడు. ఎంతో ఆనందంగా వారి పేర్లు కూడా ప్రకటించాడు. అరిహన్! నీ లాగానే వీళ్ళు నావాళ్ళు. సందేహం లేదు. మీ అందరి పేర్లకీ మొదట "పూజ్య" అనేది ఉంటుంది. దానితో కలిపి వీళ్ళ పేర్లు ఏమిటంటే – పూజ్య ఋషి, పూజ్య యతి, పూజ్య కీర్య, పూజ్య ఉపాధ్యాయ – అని మీకు పెట్టిన ఈ పేర్లు చాలా ప్రసిద్ధిపొందుతాయి.

మమాపి చ భవద్భిశ్చ నామ గ్రాహ్యం శుభం పునః ।
అరిహన్నితి తన్నామ ధ్యేయం పాపప్రణాశనమ్ ॥35॥

భవద్భి శ్చైవ కర్తవ్యం కార్యం లోకసుఖావహమ్ ।
లోకానుకూలం చరతాం భవిష్యత్యుత్తమా గతిః ॥36॥

నా పేరును కూడా మీరు ధ్యానించవచ్చు. జపించవచ్చు. అది శుభప్రదం. కానీ అరిహన్ అనే పేరుని మాత్రం మీరంతా తప్పక ధ్యానించాలి. అది సర్వపాపప్రణాశకం. మీరంత చెయ్యవలసింది ఒకే ఒక్క పని. లోకాలకి సుఖావహమైనది బోధించండి. లోకులకి అనుకూలంగా చరించండి, ఆచరించండి. మీకు ఉత్తమగతి కలుగుతుంది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

తతః ప్రణమ్య తం మాయీ శిష్యయుక్తః స్వయం తదా! ।
జగామ త్రిపురం సద్యః శివేచ్ఛాకారిణం ముదా ॥37॥

ప్రవిశ్య తత్పురం తూర్ణం విష్ణునా చోదితో వశీ ।
మహామాయావినా తేన ఋషిర్మాయాం తదా కరోత్ ॥38॥

నగరోపవనే కృత్వా శిష్యైర్యుక్తః స్థితిం తదా ।
మాయాం ప్రవర్తయామాస మాయినామపి మోహినీమ్ ॥39॥

వ్యాసమహర్షీ! ఆ మహామాయి అరిహంతుడు శిష్యసమేతుడై శివాజ్ఞావశవర్తికి విష్ణుమూర్తికి నమస్కరించి వెంటనే త్రిపురాలకు బయలుదేరాడు. మహామాయావి విష్ణుప్రేరితుడై ఆ వశి, ఆ ఋషి అలా త్రిపురాలలో ప్రవేశించి ఆ నగరానికి చేరువలో ఉన్న ఒక వనంలో బస ఏర్పరచుకున్నాడు. మాయావులను సైతం మోహపరిచే తన మహామాయను మహామాయావియైన శ్రీహరి ప్రేరణతో ప్రయోగించాడు.

శివార్చనప్రభావేణ తన్మాయా సహసా మునే ।
త్రిపురే న చచాలాశు నిర్విణ్ణోఽభూత్తదా యతిః ॥40॥

అథ విష్ణుం స సస్మార తుష్టావ చ హృదా బహు ।
నష్టోత్సాహో విచేతస్కో హృదయేన విదూయతా ॥41॥

వ్యాసమునీశ్వరా! త్రిపురవాసుల నిరంతర శివార్చనాప్రభావం వల్ల ఆ మహామాయ అక్కడ పనిచెయ్యలేదు. యతీశ్వరుడు పూజ్య అరిహంతుడు నిర్విణ్ణుడయ్యాడు. నీరుగారి పోయాడు. మనస్సు విలవిలలాడింది. వెంటనే శ్రీహరిని ధ్యానించాడు, స్తుతించాడు.

తత్ స్మృతస్త్వరితం విష్ణుః సస్మార శంకరం హృది ।
ప్రాప్యాజ్ఞాం మనసా తస్య స్మృతవాన్నారదం ద్రుతమ్ ॥42॥

స్మృతమాత్రేణ విష్ణోశ్చ నారదస్సముపస్థితః ।
నత్వా స్తుత్వా పురస్తస్య స్థితోఽభూత్సాంజలిస్తదా ॥43॥

అథ తం నారదం ప్రాహ విష్ణుర్మతిమతాం వరః ।
లోకోపకారనిరతో దేవకార్యకరస్సదా ॥44॥

శివాజ్ఞయోచ్యతే తాత గచ్ఛ త్వం త్రిపురం ద్రుతమ్ ।
ఋషిస్తత్ర గతశ్శిష్యైర్మోహార్థం తత్పురవాసినామ్ ॥45

అరిహంతుడు స్మరించగానే శ్రీహరి తాను శివుణ్ని స్మరించాడు. అతడి మనస్సుకి శివుడి ఆజ్ఞ అందింది. వెంటనే నారదుణ్ని స్మరించాడు. తలచుకోగానే నారదుడు శ్రీహరి ముందు ప్రత్యక్షమయ్యాడు. నమస్కరించాడు. స్తుతించాడు. అంజలిబంధంతో నిలబడ్డాడు. అప్పుడు ఆ మతిమతాం వరుడైన విష్ణుమూర్తి నారదుడితో ఇలా అన్నాడు. నాయనా! నారదా! నువ్వు ఎప్పుడూ లోకోపకారనిరతుడివి. దేవకార్యాలను చక్కబెడతావు. నువ్వు వెంటనే త్రిపురాలకు వెళ్ళు. ఇది శివాజ్ఞ కనక చెబుతున్నాను. త్రిపురవాసుల్ని మోహపరచడం కోసం పూజ్య అరిహంతుడు అనే ఋషి శిష్యులతో సహా అక్కడికి వెళ్ళాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య నారదో మునిసత్తమః ।
గతస్తత్ర ద్రుతం యత్ర స ఋషిర్మాయినాం వరః ॥46॥

నారదోఽ పి తథా మాయీ నియోగాన్మాయినః ప్రభోః ।
ప్రవిశ్య తత్పురం తేన మాయినా సహ దీక్షితః ॥47॥

తతశ్చ నారదో గత్వా త్రిపురాధీశసన్నిధౌ ।
క్షేమప్రశ్నాదికం కృత్వా రాజ్ఞే సర్వం న్యవేదయత్ ॥48॥

వ్యాసమునీ! శ్రీహరి చెప్పిన ఈ పలుకులు ఆలకించి మునిసత్తముడు నారదుడు వెంటనే బయలుదేరాడు. మహామాయికుడైన పూజ్య అరిహంతుణ్ని కలుసుకున్నాడు. నారదుడూ మాయికుడే. ఈ మాయికులందరికీ ప్రభువు శ్రీహరి. ఆయన ఆనతి మేరకు వచ్చిన నారదుడు అరిహంతుడితో సహదీక్షితుడై (వేషం మార్చి) త్రిపురప్రవేశం చేసి, సరాసరి త్రిపురాధీశుడి సన్నిధికి వెళ్ళాడు. కుశలప్రశ్నలు అయ్యాక ఆ దైత్యాధిపతికి సమస్తమూ విన్నవించాడు.

నారద ఉవాచ – నారదుడు అన్నాడు.

కశ్చిత్సమాగతశ్చాత్ర యతిధర్మపరాయణః ।
సర్వవిద్యా ప్రకృష్టో హి వేదవిద్యాపరాన్వితః ॥49॥

దృష్ట్వా చ బహవో ధర్మా నైతేన సదృశాః పునః ।
వయం సుదీక్షితాశ్చాత్ర దృష్ట్వా ధర్మం సనాతనమ్ ॥50॥

తవేచ్ఛా యది వర్తేత తద్ధర్మం దైత్యసత్తమ ।
తద్ధర్మస్య మహారాజ గ్రాహ్యో దీక్షా త్వయా పునః ॥51॥

దైత్యసత్తమా ! ఒకానొక ఋషి ఈ త్రిపురానికి వచ్చాడు. ఆయన యతిధర్మపరాయణుడు. సర్వవిద్యలలోనూ గట్టివాడు. వేదవిద్యాపారంగతుడు. అనేక ధర్మాలను చూసినవాడు – ఎరిగినవాడు. ఇతడికి సాటివచ్చేవాడు మరొకడు లేడు. అతడి సనాతనధర్మాన్ని అవలోకించి మేము వారి ధర్మదీక్ష తీసుకున్నాం. నీకు కూడా ఆ ధర్మం మీద ఆసక్తి వుంటే మహారాజా! నువ్వుకూడా ఆ ధర్మదీక్ష స్వీకరించు!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

తదీయం స వచః శ్రుత్వా మహదర్థసుగర్భితమ్ ।
విస్మితో హృది దైత్యేశో జగౌ తత్ర విమోహితః ॥52॥

నారదో దీక్షితో యస్మాద్వయం దీక్షామవాప్నుమః ।
ఇత్యేవం చ విదిత్వా వై జగామ స్వయమేవ హ ॥53॥

తద్రూపం చ తదా దృష్ట్వా మోహితో మాయయా తథా ।
ఉవాచ వచనం తస్మై నమస్కృత్య మహాత్మనే ॥54॥

గంభీరార్థగర్భితంగా నారదుడు చెప్పిన మాటలు విని ఆ దైత్యవల్లభుడు మనస్సులో ఆశ్చర్యపడ్డాడు. విమోహితుడయ్యాడు. అరిహంతుడి దగ్గరికి వెళ్ళాడు. నారదుడంతటివాడే దీక్షను స్వీకరించాడంటే మేమూ

ఈ ధర్మదీక్షను స్వీకరిస్తాం అనే నిర్ణయానికి వచ్చి స్వయంగా ఆ పూజ్యఋషి చెంతకు వెళ్ళాడు. అతడి రూపాన్ని చూడటంతోనే మాయామోహితుడయ్యాడు. ఆ మహాత్ముడికి నమస్కరించాడు. నమస్కరించి ఇలా అన్నాడు.

త్రిపురాధిప ఉవాచ – త్రిపురాధిపతి అన్నాడు.

దీక్షా దేయా త్వయా మహ్యం నిర్మలాశయ భో ఋషే ।
అహం శిష్యో భవిష్యామి సత్యం సత్యం న సంశయః ॥55॥

ఇత్యేవం తు వచః శ్రుత్వా దైత్యరాజస్య నిర్మలమ్ ।
ప్రత్యువాచ సుయత్నేన ఋషిస్స చ సనాతనః ॥56॥

మదీయా కరణీయా స్యాద్యద్యాజ్ఞా దైత్యసత్తమ ।
తదా దేయా మయా దీక్షా నాన్యథా కోటియత్నతః ॥57॥

ఇత్యేవం తు వచః శ్రుత్వా రాజా మాయామయోఽభవత్ ।
ఉవాచ వచనం శీఘ్రం యతిం తం హి కృతాంజలిః ॥58॥

ఓ ఋషీ! పవిత్రాశయా! దయచేసి నాకు నీ ధర్మదీక్షను అనుగ్రహించు. నేను నీకు శిష్యుణ్ని అవుతాను. ఇది ముమ్మాటికీ నిజం. సందేహం లేదు. దైత్యరాజు ఎంతో నిర్మలంగా పలికిన ఈ మాట ఆలకించి సనాతనుడైన ఆ ఋషి అతిప్రయత్నం మీద బదులు పలికాడు. దైత్యోత్తమా! నా ఆనతిని నువ్వు ఆచరిస్తానంటేనే నీకు దీక్ష ఇస్తాను. లేకపోతే కోటి ప్రయత్నాలు చేసినా ఇవ్వను – అన్నాడు. అప్పటికే మాయామోహితుడై పోయిన దైత్యరాజు ఈ మాట విని మరోసారి యతికి నమస్కరించి వెంటనే ఇలా అన్నాడు.

దైత్య ఉవాచ – దైత్యుడు అన్నాడు.

యథాజ్ఞాం దాస్యసి త్వం చ తత్తథైవ చ నాన్యథా ।
త్వదాజ్ఞాం నోల్లంఘయిష్యే సత్యం సత్యం న సంశయః ॥59॥

యతివరా! నువ్వు ఏది ఆజ్ఞాపిస్తే అది అల్లాగే ఆచరిస్తాను. మరోలా చెయ్యను. నీ ఆనతిని జవదాటను. ఇది ముమ్మాటికీ నిజం. సందేహం లేదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య త్రిపురాధీశితుస్తథా ।
దూరీకృత్య ముఖాద్వస్త్రమువాచ ఋషిసత్తమః ॥60॥

దీక్షాం గృహ్ణీష్వ దైత్యేంద్ర సర్వధర్మోత్తమోత్తమామ్ ।
దదౌ దీక్షా విధానేన ప్రాప్స్యసి త్వం కృతార్థతామ్ ॥61॥

త్రిపురాధీశుడి ప్రతిజ్ఞ విని అప్పుడు ఆ ఋషిసత్తముడు తన ముఖవస్త్రాన్ని తొలగించి అనుగ్రహభాషణం చేశాడు. దైత్యేంద్రా! సర్వధార్మాలలోకీ ఉత్తమోత్తమం ఈ ధర్మదీక్ష. దీక్షావిధానంతో నీకు ఇస్తున్నాను. ఇదే స్వీకరించు. కృతార్థుడవవుతావు.

ఇత్యుక్త్వా స తు మాయావీ దైత్యరాజాయ సత్వరమ్ ।
దదౌ దీక్షాం స్వధర్మోక్తాం తస్మై విధివిధానతః ॥62॥

దైత్యరాజే దీక్షితే చ తస్మిన్ స సహజే మునే ।
సర్వే చ దీక్షితా జాతాస్తత్ర త్రిపురవాసినః ॥63॥

మునేః శిష్యైః ప్రశిష్యైశ్చ వ్యాప్తమాసీత్ ద్రుతం తదా ।
మహామాయావినస్తత్తు త్రిపురం సకలం మునే ॥64॥

ఇలా చెప్పి ఆ మాయావి దైత్యరాజుకి వెంటనే – స్వధర్మోక్తమైన దీక్షను విధివిధానసహితంగా అందించాడు. వ్యాసమునీ! సోదరులిద్దరితోనూ కలిసి ఆ దైత్యనాయకుడు ఇలా ధర్మదీక్షతుడయ్యే సరికి మొత్తం త్రిపురవాసులు అందరూ దీక్షాస్వీకారాలు చేసేశారు. వ్యాసమహర్షీ! ఏమి చెప్పమంటావ్? అతిశీఘ్రంగా ఆ త్రిపురాలు మొత్తం మహామయావి శిష్యప్రశిష్యమయాలు అయిపోయాయి.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితయాం పంచమే యుద్ధఖండే సనత్కుమార పారాశర్యసంవాదే త్రిపురదీక్షావిధానం నామ చతుర్థోఽధ్యాయః ॥4॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు సనత్కుమార పారాశర్యసంవాదం – త్రిపురదీక్షావిధానం అనే నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచమోఽధ్యాయః – అయిదవ అధ్యాయం

త్రిపురమోహనమ్ – త్రిపురమోహనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

దైత్యరాజే దీక్షితే చ మాయినా తేన మోహితే ।
కిమువాచ తదా మాయీ కిం చకార స దైత్యపః ॥1॥

సనత్కుమారా! ఆ మాయావికి మోహితుడై దైత్యరాజు దీక్షితుడయ్యాక ఆ మాయావి ఏమి ఉపదేశించాడు? ఆ దైత్యరాజు ఏమి చేశాడు?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

దీక్షాం దత్త్వా యతిస్తస్మా అరిహన్నారదాదిభిః ।
శిష్యైస్సేవితపాదాబ్జో దైత్యరాజానమబ్రవీత్ ॥2॥

వ్యాసమహర్షీ! అరిహంతుడు దైత్యరాజుకు అలా దీక్షనిచ్చి నారదాదిశిష్యులు అందరూ తన పాదపద్మాలను సేవిస్తుండగా మెల్లగా దైత్యరాజుతో ఇలా పలికాడు.

అరిహన్నువాచ – అరిహంతుడు పలికాడు.

శృణు దైత్యపతే వాక్యం మమ సంజ్ఞానగర్భితమ్ ।
వేదాంతసారసర్వస్వం రహస్యం పరమోత్తమమ్ ॥3॥

అనాదిసిద్ధస్సంసారః కర్తృకర్మవివర్జితః ।
స్వయం ప్రాదుర్భవత్యేవ స్వయమేవ విలీయతే ॥4॥

బ్రహ్మాదిస్తంబపర్యంతం యావద్దేహ నిబంధనమ్ ।
ఆత్మైవైకేశ్వరస్తత్ర న ద్వితీయస్తదీశితా ॥5॥

దైత్యపతీ! శ్రద్ధగా ఆలకించు. మహాజ్ఞానగర్భితాలైన వాక్యాలు చెబుతున్నాను. ఇది వేదాంతసారసర్వస్వం. ఇది రహస్యం. ఇది ఉత్తమోత్తమం. ఈ ప్రపంచం అనాదిసిద్ధం. కర్తృ కర్మ వివర్జితం. తనంత తానుగా పుట్టింది, తనంత తానుగా గిడుతుంది. బ్రహ్మ మొదలుకొని గడ్డిపోచవరకూ (స్తంబం) దేహధారులన్నింటికీ కేవలం ఆత్మయే ఈశ్వరుడు. మరొక ప్రభువు లేడు.

యద్బ్రహ్మవిష్ణురుద్రాఖ్యస్తదాఖ్యా దేహినామిమాః ।
ఆఖ్యా యథాస్మదాదీనామరిహన్నాదిరుచ్యతే ॥6॥

దేహో యథాస్మదాదీనాం స్వకాలేన విలీయతే ।
బ్రహ్మాదిమశకాంతానాం స్వకాలాల్లీయతే తథా ॥7॥

విచార్యమాణే దేహే ఽస్మిన్ న కించిదధికం క్వచిత్ ।
ఆహారో మైథునం నిద్రా భయం సర్వత్ర యత్సమమ్ ॥8॥

బ్రహ్మ – విష్ణువు – రుద్రుడు అనేవి కేవలం ఆ దేహధారులకు పేర్లు. అరిహంతుడనీ మరొకటనీ మనకందరూ ఉన్నట్టే అవి వారికి పేర్లు – అంతే. మన శరీరాలు ఎలాగైతే కాలం మూడినప్పుడు రాలిపోతాయో అలాగే బ్రహ్మ మొదలుకొని దోమవరకూ ఉన్న సకలప్రాణుల తనువులూ వాటివాటి కాలం మూడినప్పుడు రాలిపోతాయి. బాగా ఆలోచించి చూస్తే తెలుస్తుంది – ఈ శరీరమనే దాంట్లో బ్రహ్మాదులకు మనకన్నా ఆధిక్యం ఏమీ లేదని. ఆహారనిద్రాభయమైథునాలు ఉభయత్ర సమానమే.

నిరాహారపరీమాణం ప్రాప్య సర్వో హి దేహభృత్ ।
సదృశీమేవ సంతృప్తిం ప్రాప్నుయాన్నాధికేతరామ్ ॥9॥

యథా వితృషితాః స్యామ పీత్వా పేయం ముదా వయమ్ ।
తృషితాస్తు తథాన్యే ఽపి న విశేషోఽల్పకోఽధికః ॥10॥

తమకు సరిపడినంత నీరు ఆహారం పొందినప్పుడు దేహధారులెవరైనా ఒకే రకం సంతృప్తిని పొందుతారు. (నిద్రాహార– పాఠాంతరం) అందులో ఎక్కువ – తక్కువలు ఉండవు. దాహం వేసినప్పుడు పానీయం సేవించి మనం ఎలా ఆనందం పొందుతామో, దప్పికగొన్నవాడు ఎవడైనా అలాగే అదే ఆనందం పొందుతాడు. ఎక్కువ తక్కువలు ఏమీ ఉండవు.

సంతు నార్యః సహస్రాణి రూపలావణ్యభూమయః ।
పరం నిధువనే కాలే హ్యేకేవేహోపయుజ్యతే ॥11॥

అశ్వాః పరశ్శతాస్సంతు సంత్వనేకేఽప్యనేకధా ।
అధిరోహే తథాప్యేకో న ద్వితీయస్తథాత్మనః ॥12॥

మరొక్క విషయం దైత్యవల్లభా! రూపలావణ్యవతులైన అంతఃపురకాంతలు వేలమంది ఉండవచ్చుగాక,కానీ సంభోగానికి అవసరమయ్యేది–అక్కరకు వచ్చేది–ఒక్కతే. అలాగే వందలసంఖ్యలో గుర్రాలు ఉండవచ్చు.అవిఅనేక జాతులవి కావచ్చు. కానీ ప్రయాణానికి మనం అధిరోహించేది–ఒక్కటే. అన్నీ మనవే అయినా రెండు కుదరవు.

పర్యంకశాయినాం స్వాపే సుఖం యదుపజాయతే ।
తదేవ సౌఖ్యం నిద్రాభిర్భూతభూశాయినామపి ॥13॥

యథైవ మరణాద్భీతిరస్మదాది వపుష్మతామ్ ।
బ్రహ్మాదికీటకాంతానాం తథా మరణతో భయమ్ ॥14॥

హంసతూలికాతల్పం మీద నిద్రించేవాడిది ఎలాంటి సౌఖ్యమో, చెట్టుమీద గట్టుమీద నిద్రపోయే ప్రాణిదీ అదే సుఖం. అలాగే మనలాంటి శరీరధారులకు మృత్యుభీతి ఎలాంటిదో బ్రహ్మాదికీటపర్యంతం సకలజీవులకూ మృత్యుభయం అలాంటిదే.

సర్వే తనుభృతస్తుల్యా యది బుద్ధ్యా విచార్యతే ।
ఇదం నిశ్చిత్య కేనాపి నో హింస్యః కోఽపి కుత్రచిత్ ॥15॥

ధర్మో జీవదయాతుల్యో న క్వాపి జగతీతలే ।
తస్మాత్సర్వప్రయత్నేన కార్యా జీవదయా నృభిః ॥16॥

ఏకస్మిన్ రక్షితే జీవే త్రైలోక్యం రక్షితం భవేత్ ।
ఘాతితే ఘాతితం తద్వత్ తస్మాద్రక్షేన్న ఘాతయేత్ ॥17॥

బుద్ధిపెట్టి ఆలోచించి చూస్తే – శరీరధారులందరూ సమానులే. ఇది తెలుసుకోవాలి. అంచేత ఎవ్వరూ ఎవ్వరినీ ఏనాడూ హింసించకూడదు. జీవుల పట్ల దయజూపడాన్ని మించిన ధర్మం ఏదీ లేదు. ఈ భూతాలలో మానవులంతా పూనికతో జీవకారుణ్యం వహించాలి. ఆచరించాలి. ఒక్కప్రాణిని రక్షిస్తే ముల్లోకాలనూ రక్షించినట్టే, హింసిస్తే హింసించినట్టే. కాబట్టి మనం రక్షించాలే కానీ హింసించకూడదు.

అహింసా పరమో ధర్మః పాపమాత్మప్రపీడనమ్ ।
అపరాధీనతా ముక్తిః స్వర్గో ఽభిలషితాశనమ్ ॥18॥

పూర్వసూరిభిరిత్యుక్తం సత్ప్రమాణతయా ధ్రువమ్ ।
తస్మాన్న హింసా కర్తవ్యో నరైర్నరకభీరుభిః ॥19॥

న హింసాసదృశం పాపం త్రైలోక్యే సచరాచరే ।
హింసకో నరకం గచ్ఛేత్ స్వర్గం గచ్ఛేదహింసకః ॥20॥

దానవేశ్వరా! అహింస అనేది ఉత్తమోత్తమం ధర్మం. ప్రాణిని పీడించడమనేది మహాపాపం. అపరాధీనులుగా (స్వతంత్రులుగా) జీవించడమే ముక్తి. అంటే కోరుకున్నది భుజించడమే స్వర్గం. మన పూర్వపండితులు చెప్పిన ఈ మాటకు తిరుగులేదు. ఎన్నెన్నో ప్రమాణాలతో ఇది ధ్రువీకృతం. ఈ ముల్లోకాలలో సకల చరాచరప్రాణికోటిలో హింసవంటి మహాపాపం మరొకటి లేదు. హింసకుడు నరకానికి పోతాడు, అహింసకుడు స్వర్గం పొందుతాడు.

సంతి దానాన్యనేకాని కిం తైస్తుచ్ఛఫలప్రదైః ।
అభీతసదృశం దానం పరమేకమపీహ న ॥21॥

ఇహ చత్వారి దానాని ప్రోక్తాని పరమర్షిభిః ।
విచార్య నానాశాస్త్రాణి శర్మణేఽత్ర పరత్ర చ ॥22॥

లోకంలో అనేకదానాలు ప్రసిద్ధికెక్కాయి. కానీ వాటితో ఏమి లాభం! అన్నీ తుచ్ఛఫలప్రదాలే. అభయప్రదానానికి సాటివచ్చే దానం – ఒక్కటంటే ఒక్కటి లేదు. దైత్యేశా ! పరమర్షులు నాలుగు ఉత్తమదానాలను అన్ని శాస్త్రాలనూ అవలోకించి చెప్పారు. ఇహంలోనూ పరంలోనూ సుఖప్రదాలైన దానాలు నాలుగు.

భీతేభ్యశ్చాభయం దేయం వ్యాధితేభ్యస్తథౌషధమ్ ।
దేయా విద్యార్థినాం విద్యా దేయమన్నం క్షుధాతురే ॥23॥

యాని యానీహ దానాని బహూమున్యుదితాని చ ।
జీవాభయప్రదానస్య కళాం నార్హతి షోడశీమ్ ॥24॥

అవిచింత్య ప్రభావం హి మణిమంత్రౌషధం బలమ్ ।
తదభ్యస్యం ప్రయత్నేన నామార్థోపార్జనాయ వై ॥25॥

అర్థానుపార్జ్య బహుశో ద్వాదశాయతనాని వై ।
పరితః పరిపూజ్యాని కిమన్యైరిహ పూజితైః ॥26॥

భీతులకు అభయం ఇవ్వాలి. వ్యాధికలవారికి ఔషధం ఇవ్వాలి. విద్యను కోరేవారికి విద్య అందించాలి. ఆకొన్నవారికి అన్నం పెట్టాలి. ఇవి నాలుగూ ఉత్తమదానాలు. వీటితో సహా ఇంతవరకూ అనేక మహర్షులు చెప్పిన అనేక దానాల్నీ కలిపినా జీవాభయదానంలోని పదహారవ కళకైనా సాటిరావు. దైత్యపతీ! మరొక్క రహస్యం. మణిమంత్రౌషధాల బలమూ ప్రభావమూ ఊహింపలేం. ఏ పాటి అనే ఆలోచనయే పెట్టుకోకుండా ప్రయత్నపూర్వకంగా వీటిని అభ్యసించాలి. ప్రఖ్యాతికోసం, ధనార్జనకోసం, అందరూ ధనాన్ని పుష్కలంగా సంపాదించాలి. పది ఇంద్రియాలూ, మనస్సూ, బుద్ధి అనే 12 ఇంద్రియాల అర్చన నిరంతరం చెయ్యాలి. అంతే మరింక వేరే పూజలూ అర్చనలూ ఎందుకు?

పంచకర్మేంద్రియగ్రామాః పంచ బుద్ధీంద్రియాణి చ ।
మనో బుద్ధిరిహ ప్రోక్తం ద్వాదశాయతనం శుభమ్ ॥27॥

ద్వాదశాయతనమంటే ఏమో అనుకోకు. అయిదు కర్మేంద్రియాలు, అయిదు జ్ఞానేంద్రియాలు, ఒక మనస్సు, ఒక బుద్ధి – వీటి సమాహారమే ద్వాదశాయతనం. అంటే ఈ దేహం. ఇది శుభప్రదమని పెద్దలమాట.

ఇహైవ స్వర్గనరకే ప్రాణినాం నాన్యతః క్వచిత్ ।
సుఖం స్వర్గః సమాఖ్యాతో దుఃఖం నరకమేవ హి ॥28॥

సుఖేషు భుజ్యమానేషు యత్ స్యాద్దేహవిసర్జనమ్ ।
అయమేవ పరో మోక్షో విజ్ఞేయస్తత్త్వచింతకైః ॥29॥

వాసనాసహితే క్లేశసముచ్ఛేదే సతి ధ్రువమ్ ।
అజ్ఞానోపరమో మోక్షో విజ్ఞేయస్తత్త్వచింతకైః ॥30॥

దైత్యాధీశా! ప్రాణికోటికి స్వర్గనరకాలు ఇక్కడే ఉన్నాయి. మరెక్కడో లేవు. సుఖమే స్వర్గం. దుఃఖమే నరకం. సుఖాలు అనుభవిస్తూ అనుభవిస్తూ తనువు చాలించడమే మోక్షం అని తత్త్వచింతకులు గుర్తించాలి. బెంగలతో సహా దుఃఖం పూర్తిగా అంతరించి అజ్ఞానం తొలగిపోవడమే మోక్షమని తాత్త్వికులు గుర్తించాలి.

ప్రామాణికీ శ్రుతిరియం ప్రోచ్యతే వేదవాదిభిః ।
న హింస్యాత్సర్వభూతాని నాన్యా హింసా ప్రవర్తికా ॥31॥

అగ్నిష్టోమీయమితి యా భ్రామికా సా సతామిహ ।
న సా ప్రమాణం జ్ఞాతౄణాం పశ్వాలంభనకారికా ॥32॥

ఏ ప్రాణినీ హింసించకూడదనీ, ఇతరుల్ని హింసించడం తగదనీ వేదవేత్తలందరూ చెబుతున్న ప్రామాణిక శ్రుతివాక్యం. పశుహింసతో కూడిన అగ్నిష్టోమీయం వేదసమ్మతమనడం వట్టి భ్రమ. విజ్ఞులు దాన్ని ప్రామాణికంగా అంగీకరించరు.

వృక్షాంశ్ఛిత్వా పశూన్ హత్వా కృత్వా రుధిరకర్దమమ్ ।
దగ్ధ్వా వహ్నౌ తిలాజ్యాది చిత్రం స్వర్గో ఽభిలష్యతే ॥33॥

ఇత్యేవం స్వమతం ప్రోచ్య యతిః త్రిపురనాయకమ్ ।
శ్రావయిత్వాఖిలాన్ పౌరాన్ ఉవాచ పునరాదరాత్ ॥34॥

వృక్షాలను నరికి, పశువులను సంహరించి, నెత్తురుతో నేలంతా బురదచేసి తిలలూ, నెయ్యీ అగ్నిలో బుగ్గి చేసి – స్వర్గాన్ని అభిలషిస్తున్నాడు యజమానుడు. ఎంత చిత్రం! వ్యాసమునీ! ఆ యతి పూజ్య అరిహంతుడు త్రిపురనాయకులకి ఇలా తన మతాన్ని బోధించి, త్రిపురవాసులందరికీ వినిపింపజేసి – ఇంకా మరింత ఆదరంతో ఇలా పలికాడు.

దృష్టార్థప్రత్యయకరాన్ దేహసౌఖ్యైకసాధకాన్ ।
బౌద్ధాగమ వినిర్దిష్టాన్ ధర్మాన్ వేదపరాంస్తతః ॥35॥

ఆనందం బ్రహ్మణో రూపం శ్రుత్యైవం యన్నిగద్యతే ।
తత్తథైవేహ మంతవ్యం మిథ్యా నానాత్వకల్పనా ॥36॥

యావత్ స్వస్థమిదం వర్ష్మ యావన్నేంద్రియవిక్లబః ।
యావజ్జరా చ దూరేఽస్తి తావత్సౌఖ్యం ప్రసాధయేత్ ॥37॥

ప్రత్యక్షప్రమాణసిద్ధాలూ, శరీరసౌఖ్యసంపాదకాలూ, బౌద్ధాగమప్రతిపాదితాలూ అయిన ధర్మాలే వేదధర్మాలు కూడాను. ఆనందం బ్రహ్మస్వరూపమని వేదం చెబుతోంది. అది అంతే అలాగే స్వీకరించాలి. దానికి బహువిధరూపకల్పన అంతా మిథ్య. ఈ శరీరం ఆరోగ్యంగా ఉన్నంతసేపూ, ఇంద్రియాలు చురుకుగ పని చేస్తున్నంతసేపూ ముసలితనం రానంతవరకు – సౌఖ్యం అనుభవించడమే.

అస్వాస్థ్యేంద్రియవైక్లబ్యే వార్ధకే తు కుతస్సుఖమ్ ।
శరీరమపి దాతవ్యమర్థిభ్యోఽతస్సుఖేప్సుభిః ॥38॥

యాచమానమనోవృత్తిప్రీణనే యస్య నో జనిః ।
తేన భూర్భారవత్యేషా సముద్రాగద్రుమైర్న హి ॥39॥

ఆరోగ్యం క్షీణించి, ఇంద్రియాలు పటుత్వం కోల్పోయి, మసలితనం వచ్చిపడితే ఇంక సుఖం ఎక్కడిది? సుఖలాలసులు అడిగినవారికి శరీరంసైతం దానం చేసెయ్యాలి. యాచకుడి మనస్సుకి ప్రీతి కలిగించనివాడి జన్మ వ్యర్థం. నిజానికి వాడే భూమికి భారం. సముద్రాలూ పర్వతాలూ వృక్షాలు బరువు కానే కాదు.

సత్వరం గత్వరో దేహః సంచయాస్సపరిక్షయాః ।
ఇతి విజ్ఞాయ విజ్ఞాతా దేహసౌఖ్యం ప్రసాధయేత్ ॥40॥

శ్వవాయసకృమీణాం చ ప్రాతర్భోజ్యమిదం వపుః ।
భస్మాంతం తచ్ఛరీరం చ వేదే సత్యం ప్రపఠ్యతే ॥41॥

ముధా జాతి వికల్పో ఽయం లోకేషు పరికల్పతే ।
మానుష్యే సతి సామాన్యే కోఽధమః కోఽథ చోత్తమః ॥42॥

దైత్యనాయకులారా! త్రిపురవాసులారా! ఈ దేహం – సత్వరంగా వెళ్ళిపోయేదే. కూడ బెట్టుకున్నవన్నీ అంతరించిపోయేవే. బుద్ధిమంతుడు ఇది తెలిసి శరీరసుఖాలు అనుభవించాలి. ఈ దేహం – కడపటికి కుక్కలకీ కాకులకీ పురుగులకీ చద్దన్నం అయ్యేదే. 'భస్మాంతం తచ్ఛరీరమ్' అన్న వేదవాక్కు ముమ్మాటికీ సత్యం (శరీరానికి చివరిదశ బూడిద). ఈ మాత్రం దానికి జాతిభేదాల కల్పన ఒకటి ఈ లోకంలో! అందరూ మనుషులే అయినప్పుడు మానవత్వం అనేది సమానధర్మమైనప్పుడు ఒకడు అధముడేమిటి? ఒకడు ఉత్తముడేమిటి? అందరూ సమానులే

బ్రహ్మాదిసృష్టిరేషేతి ప్రోచ్యతే వృద్ధపూరుషైః ।
తస్య జాతౌ సుతౌ దక్షమరీచీ చేతి విశ్రుతౌ ॥43॥

మారీచేన కశ్యపేన దక్షకన్యాస్సులోచనాః ।
ధర్మేణ కిల మార్గేణ పరిణీతాస్త్రయోదశ॥44॥

అపీదానీంతనై ర్మర్త్యై రల్పబుద్ధిపరాక్రమైః ।
అపి గమ్యస్త్వగమ్యోఽయం విచారః క్రియతే ముధా ॥45॥

ఈ సృష్టిమొత్తం బ్రహ్మతో ప్రారంభమయ్యిందని పెద్దలు చెబుతున్నారు. అతడికి దక్షుడు – మరీచి అని ఇద్దరు పుత్రులు జన్మించారు. ఇద్దరూ ప్రసిద్ధులు. మరీచి కొడుకు కశ్యపుడు. ఈయన కశ్యపుడి పుత్రికలను సులోచనలను పదమూడుమందినీ ధర్మబద్ధంగా వివాహం చేసుకున్నాడు. ఈ కాలం మనుషులు అల్పబుద్ధులూ అల్పపరాక్రములూను. వాళ్ళకి అర్థమవుతుందా ఇది ? అంతా అగమ్యగోచరం. సరే – ఇప్పుడు ఈ చర్చ వృథా. వదిలేద్దాం.

ముఖబాహూరుసంజాతం చాతుర్వర్ణ్యం సహోదితమ్ ।
కల్పనేయం కృతా పూర్వైర్న ఘటేత విచారతః ॥46॥

ఏకస్యాం చ తనౌ జాతా ఏకస్మాద్యది వా క్వచిత్ ।
చత్వారస్తనయాస్తత్కిం భిన్నవర్ణత్వమాప్నుయుః ॥47॥

వర్ణావర్ణవిభాగోఽయం తస్మాన్న ప్రతిభాసతే ।
అతో భేదో న మంతవ్యో మానుష్యే కేనచిత్ క్వచిత్ ॥48॥

విరాట్పురుషుడి ముఖం – బాహువులు– ఊరువులు– పాదాలనుంచి చాతుర్వర్ణ్యాల వారు తోబుట్టువుల్లా ఉద్భవించారు అని పూర్వులు చేసిన కల్పన. ఆలోచించి చూస్తే ఇది ఏమాత్రం పొసగదు. ఒకే తనువు నుంచి

ఒక్కసారిగా నలుగురు పుత్రులు ఉద్భవిస్తే వారు నాలుగువర్ణాలవారు ఎలా అవుతారు? అంచేత ఈ విభాగం పొసగదు గాక పొసగదు. కనక – ఎవ్వడు గానీ ఎప్పుడు గానీ మనుషుల్లో వర్ణభేదాన్ని భావించనే కూడదు.

సనత్కుమార ఉవాచ– సనత్కుమారుడు అన్నాడు.

ఇత్థమాభాష్య దైత్యేశం పౌరాంశ్చ స యతిర్మునే ।
సశిష్యో వేదధర్మాంశ్చ నాశయామాస చాదరాత్ ॥49॥

స్త్రీధర్మం ఖండయామాస పాతివ్రత్యపరం మహత్ ॥
జితేంద్రియత్వం సర్వేషాం పురుషాణాం తథైవ సః ॥50॥

దేవధర్మాన్విశేషేణ శ్రాద్ధధర్మాంస్తథైవ చ ।
మఖధర్మాన్ వ్రతాదీంశ్చ తీర్థశ్రాద్ధం విశేషతః ॥51॥

శివపూజాం విశేషేణ లింగారాధనపూర్వికామ్ ।
విష్ణుసూర్యగణేశాదిపూజనం విధిపూర్వకమ్॥52॥

స్నానదానాదికం సర్వం పర్వకాలం విశేషతః ।
ఖండయామాస సయతిర్మాయీ మాయావినాం వరః ॥53॥

వ్యాసమునీ! ఈ ప్రకారంగా ఆ యతి పూజ్య అరిహంతుడు, ఆ ముగ్గురు దైత్యేశులకు వారి పౌరులకూ ఉపదేశించి, తన శిష్యబృందంతో కలిసి ఎంతో ఆదరంతో వేదధర్మాలను మొత్తం ధ్వంసం చేశాడు. ఉత్తమస్త్రీధర్మమైన పాతివ్రత్యాన్నీ, పురుషుల ఉత్తమధర్మమైన జితేంద్రియత్వాన్నీ, దేవయజ్ఞ –పితృయజ్ఞ ధర్మాలనూ, యాగవిధులనూ, వ్రతాలనూ, తీర్థాలనూ, తీర్థశ్రాద్ధాలనూ–ఇలా అన్నింటినీ ఖండించి త్రిపురాలనుంచి ఎగరగొట్టాడు. లింగార్చనాపూర్వకంగా జరిగే శివపూజనూ, విష్ణు– సూర్య –గణేశాదుల ఉపాసనలనూ, పర్వకాలాలలో జరిపే స్నానదానాది విధులనూ అన్నింటినీ ఖండించి తిరస్కరించి త్రిపురవాసులకు దూరం చేశాడు ఆ మహామాయావి అయిన అరిహంతుడు.

కిం బహూక్తేన విప్రేంద్ర త్రిపురే తేన మాయినా ।
వేదధర్మాశ్చ యే కేచిత్తే సర్వే దూరతః కృతాః ॥54॥

పతిధర్మాశ్రయా స్సర్వా మోహితా స్త్రిపురాంగనాః ।
భర్తృశుశ్రూషణవతీం విజహుర్మతిముత్తమామ్ ॥55॥

అభ్యస్యాకర్షిణీం విద్యాం వశీకృత్యమయీమపి ।
పురుషాస్సఫలీచక్రుః పరదారేషు మోహితాః ॥56॥

విప్రేంద్రా! వ్యాసమునీంద్రా! వెయ్యిమాటలు ఎందుకు గానీ ఒక్కమాటలో చెబుతాను. ఆ మాయావి మొత్తం వేదధర్మాల నన్నింటినీ త్రిపురాలకు దూరం చేసేశాడు. పతివ్రతలుగా ఉన్న త్రిపురాంగనలు మోహ పరవశలై 'పతిశుశ్రూష' అనే ఉత్తమ ఆలోచననే విడిచిపెట్టేశారు. పురుషులైతే ఆకర్షణీవిద్యనూ వశీకరణ విద్యనూ అభ్యసించి పరదారలపట్ల సమ్మోహితులై సఫలురయ్యారు.

అంతఃపురచరా నార్యస్తథా రాజకుమారకాః ।
పౌరాః పురాంగనాశ్చాపి సర్వే తైశ్చ విమోహితాః ॥57॥

ఏవం పౌరేషు సర్వేషు నిజధర్మేషు సర్వథా ।
పరాఙ్ముఖేషు జాతేషు ప్రోల్లలాస వృషేతరః ॥58॥

మాయా చ దేవదేవస్య విష్ణోస్తస్యాజ్ఞయా ప్రభోః ।
అలక్ష్మీశ్చ స్వయం తస్య నియోగాత్ త్రిపురం గతా ॥59॥

యా లక్ష్మీస్తపసా తేషాం లబ్ధా దేవేశ్వరాదరాత్ ।
బహిర్గతా పరిత్యజ్య నియోగాత్ బ్రహ్మణః ప్రభోః ॥60॥

అంతఃపురకాంతలూ, రాజకుమారులు, పేరాంగనలూ, పురంధ్రులూ – అందరూ ఆ గురుశిష్యబృందానికి మోహితులై లొంగిపోయారు. మొత్తానికి త్రిపురదేశాల పౌరులందరూ ఇలా నిజధర్మపరాఙ్ముఖులయ్యేసరికి ఆ వృషేతరుడు పూజ్య అరిహంతుడు చాలా ఆనందించాడు. దేవదేవుడైన శివుని ఆజ్ఞప్రకారం ప్రభువైన శ్రీమన్నారాయణుడి నియామకం వల్ల ఒక మాయ – ఒక అలక్ష్మి స్వయంగా ఆ త్రిపురాలలో ప్రవేశించాయి. శివానుగ్రహం వల్ల, తపస్సుల వల్ల ఆ దైత్యులు సంపాదించుకున్న లక్ష్మి ఇప్పుడు బ్రహ్మదేవుడి అనుమతితో వారిని పరిత్యజించి, త్రిపురాలను విడిచివెళ్ళిపోయింది.

బుద్ధిమోహం తథా భూతం విష్ణోర్మాయా వినిర్మితమ్ ।
తేషాం దత్త్వా క్షణాదేవ కృతార్థోఽభూత్స నారదః ॥61॥

నారదోఽపి తథా రూపో యథా మాయీ తథైవ సః ।
తథాపి వికృతో నాభూత్ పరమేశాదనుగ్రహాత్ ॥62॥

ఆసీత్కుంఠితసామర్థ్యో దైత్యరాజోఽపి భో మునే ।
భ్రాతృభ్యాం సహితస్తత్ర మయేన చ శివేచ్ఛయా ॥63॥

వ్యాసమునీ! విష్ణుమాయావినిర్మితమైన బుద్ధిమోహాన్ని అలా దైత్యనేతలకు క్షణంలో అంటించి దేవర్షి నారదుడు కృతకృత్యుడయ్యాడు. ఇప్పుడు నారదుడు కూడా ఆ మాయావి అరిహంతుడిలాంటివాడే. కానీ పరమేశ్వరుడి అనుగ్రహం వల్ల మాయావికృతుడు కాలేదు. (నటించాడే కానీ తాను మాయావి కాలేదు). సరే – మెల్లగా దైత్యనాయకుడి శక్తిసామర్థ్యాలు సన్నగిల్లాయి. అతడి సోదరుల సామర్థ్యాలూ మయుడి సామర్థ్యమూ – క్రమంగా క్షీణించాయి. అంతా శివేచ్ఛ!

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే త్రిపురమోహనం నామ పంచమోఽధ్యాయః ॥5॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు త్రిపురమోహనం అనే అయిదవ అధ్యాయం సమాప్తం.

షష్ఠోఽధ్యాయః – ఆరవ అధ్యాయం
శివస్తుతి వర్ణనమ్ – శివస్తుతి వర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

తస్మిన్ దైత్యాధిపే పౌరే సభ్రాతరి విమోహితే ।
సనత్కుమార కిం వాసీత్తదాచక్ష్వాఖిలం విభో ॥1॥

సోదరసహితంగా దైత్యాధిపతి అలా సమ్మోహితుడు కాగా అటుపైని ఏమి జరిగిందో మహానుభావా! సనత్కుమారా! సవివరంగా తెలియజెప్పు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

త్రిపురే చ తథాభూతే దైత్యే త్యక్తశివార్చనే ।
స్త్రీధర్మే నిఖిలే నష్టే దురాచారే వ్యవస్థితే ॥2॥

కృతార్థ ఇవ లక్ష్మీశో దేవైస్సార్ధముమాపతిమ్ ।
నివేదితుం తచ్చరిత్రం కైలాసమగమద్ధరిః ॥3॥

తస్యోపకంఠం స్థిత్వాఽసౌ దేవైస్సహ రమాపతిః ।
తతో భూరి స చ బ్రహ్మా పరమేణ సమాధినా ॥4॥

మనసా ప్రాప్య సర్వజ్ఞం బ్రహ్మణా చ హరిస్తదా ।
తుష్టావ వాగ్భిరిష్టాభిశ్శంకరం పురుషోత్తమః ॥5॥

వ్యాసమహర్షీ! త్రిపురాలు అలా అయిపోయాయి. దైత్యవల్లభుడు శివార్చన మానేశాడు. రాజ్యంలో స్త్రీ ధర్మాలు అన్నీ అడుగంటాయి. దురాచారాలు పెచ్చరిల్లాయి. దీనితో లక్ష్మీపతి కృతార్థుణ్ణి అయ్యానని మురిసిపోయాడు. ఈ చరితనంతా శివుడికి నివేదించడం కోసం బ్రహ్మాదిదేవతలతో కలిసి కైలాసాద్రికి వెళ్ళి శివుని సన్నిధిలో నిలబడ్డారు. బ్రహ్మవిష్ణువులు ఏకాగ్రతతో సర్వజ్ఞుణ్ణి ఆ శివుణ్ణి మనస్సులలో నిలుపుకొని ప్రీతికరమైన వాక్కులతో బహుధా స్తుతించారు.

విష్ణురువాచ – విష్ణువు ఇలా స్తుతించాడు.

మహేశ్వరాయ దేవాయ నమస్తే పరమాత్మనే ।
నారాయణాయ రుద్రాయ బ్రహ్మణే బ్రహ్మరూపిణే ॥6॥

ఏవం స్తుత్వా మహాదేవం దండవత్ప్రణిపత్య హ ।
జజాప రుద్రమంత్రం చ దక్షిణామూర్తిసంభవమ్ ॥7॥

జలే స్థిత్వా సార్ధకోటిప్రమితం తన్మనాః ప్రభుః ।
సంస్మరన్ మనసా శంభుం స్వప్రభుం పరమేశ్వరమ్ ॥8॥

తావద్దేవాస్తదా సర్వే తన్మనస్కా మహేశ్వరమ్ ॥9॥

దేవుడైన 'మహేశ్వరునికి నమస్సు.। పరమాత్మకు నమస్కృతి. । నారాయణునికి నమస్కారం. రుద్రునికి దండం. । బ్రహ్మకు నమస్సు । బ్రహ్మరూపునకు దండము అని ।'– స్తుతించి సాష్టాంగ నమస్కారం చేశాడు. అటుపైని –దక్షిణా మూర్తి సంభవమైన రుద్రమంత్రాన్ని జపించాడు. నీటిలో నిలబడి శివుని మీద మనస్సు నిలిపి కోటిన్నర మంత్రజపం చేశాడు. తన ప్రభువైన పరమేశ్వరుణ్ని శంభుణ్ని ధ్యానించాడు. అంతలోకీ దేవతలందరూ అలాగే శివమనస్కులై ఈశ్వరుణ్ని స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు స్తుతించారు.

నమస్సర్వాత్మనే తుభ్యం శంకరాయార్తిహారిణే ।
రుద్రాయ నీలకంఠాయ చిద్రూపాయ ప్రచేతసే ॥10॥

గతిర్నస్సర్వదా త్వం హి సర్వాపద్వినివారకః ।
త్వమేవ సర్వదాఽస్మాభిర్వంద్యో దేవారిసూదన ॥11॥

త్వమాదిస్త్వమనాదిశ్చ స్వానందశ్చాక్షయః ప్రభుః ।
ప్రకృతేః పురుషస్యాపి సాక్షాత్ స్రష్టా జగత్ప్రభుః ॥12॥

సర్వాత్మకా! శంకరా! ఆర్తిహారీ! రుద్రా! నీలకంఠా! చిద్రూపా! ప్రచేతసా! నీకిదే వందనం. సర్వాపదలనూ నివారించేవాడా! మాకందరికీ గతి నువ్వే. దేవశత్రుసంహారకా! మేము నిరంతరం నమస్కరించేది నిన్నే. ఈ ప్రకృతికి ఆదివి, అనాదివి నువ్వే. నువ్వు ఆత్మానందుడివి. అక్షయుడివి. ప్రభువువి. ప్రకృతి పురుషులకు సాక్షాత్తు స్రష్టవు నువ్వే. నువ్వే జగత్ప్రభువువి.

త్వమేవ జగతాం కర్తా భర్తా హర్తా త్వమేవ హి ।
బ్రహ్మా విష్ణుర్హరో భూత్వా రజస్సత్త్వతమోగుణైః ॥13॥

తారకోఽసి జగత్యస్మిన్ సర్వేషామధిపోఽవ్యయః ।
వరదో వాఙ్మయో వాచ్యో వాచ్యవాచకవర్జితః ॥14॥

యాచ్యో ముక్త్యర్థమీశానో యోగిభిర్యోగవిత్తమైః ।
హృత్పుండరీకవివరే యోగినాం త్వం హి సంస్థితః ॥15॥

ఈ జగత్తులకు కర్తవూ భర్తవూ హర్తవూ నువ్వే. రజోగుణంతో బ్రహ్మవై, సత్త్వగుణంతో విష్ణువువై, తమోగుణంతో శివుడివై విరాజిల్లుతున్నావు. ఈ సృష్టిలో నువ్వే తారకుడివి. దాటించేవాడివి. అందరికీ అధిపతివి నువ్వే. అవ్యయుడివి నువ్వే. వరప్రదాతవు. వాఙ్మయస్వరూపుడివి. వాచ్యుడివి. అవాచ్యుడివి. వాచక వివర్జితుడివి. యోగీశ్వరులు ముక్తికోసం యాచించే ఈశానుడివి నువ్వే. వారి హృదయపుండరీకంలో ఉండేది నువ్వే.

వదంతి వేదాస్త్వాం సంతః పరబ్రహ్మస్వరూపిణమ్ ।
భవంతం తత్త్వమిత్యద్య తేజోరాశిం పరాత్పరమ్ ॥16॥

పరమాత్మానమిత్యాహురస్మిన్ జగతి యద్విభో ।
త్వమేవ శర్వ! సర్వాత్మన్! త్రిలోకాధిపతే భవ ॥17॥

దృష్టం శ్రుతం స్తుతం సర్వం జ్ఞాయమానం జగద్గురో ।
అణోరల్పతరం ప్రాహుర్మహతోఽపి మహత్తరమ్ ॥18॥

వేదాలు నిన్ను పరబ్రహ్మస్వరూపిగా చెబుతున్నాయి. వేదాంతులు అదే అంటున్నారు. తత్త్వం నువ్వే అనీ, తేజోరాశివి నువ్వే అనీ, పరాత్పరుడివి నువ్వే అనీ చెబుతున్నారు. విభూ! ఈ జగత్తులో నువ్వే పరమాత్మవు. శర్వా! సర్వాత్మకా! త్రిలోకాధిపతీ! భవా! నువ్వే పరమాత్మవు. కనపడేదీ వినపడేదీ కీర్తింపబడేదీ తెలియబడేదీ అన్నీ నువ్వే. జగద్గురూ! నిన్ను సూక్ష్మంలో సూక్ష్మం అనీ, అధికంలో అధికం అనీ వేదాలు వర్ణిస్తున్నాయి.

సర్వతః పాణిపాదాంతం సర్వతోఽక్షి శిరోముఖమ్ ।
సర్వతః శ్రవణఘ్రాణం త్వాం నమామి చ సర్వతః ॥19॥

సర్వజ్ఞం సర్వతో వ్యాపిన్ సర్వేశ్వరమనావృతమ్ ।
విశ్వరూపం విరూపాక్షం త్వాం నమామి చ సర్వతః ॥20॥

సర్వేశ్వరం భవాధ్యక్షం సత్యం శివమనుత్తమమ్ ।
కోటిభాస్కరసంకాశం త్వాం నమామి చ సర్వతః ॥21॥

అన్నివైపులా చేతులు కాళ్ళు కన్నులు శిరస్సులు ముఖాలు చెవులు ముక్కులు కలిగిన నీకు అన్ని వైపులా అన్నీ తెలిసినవాడూ, అంతటా వ్యాపించినవాడూ, అంతకూ ప్రభువూ, ఏ ఆవరణాలేనివాడూ, నమస్కరిస్తున్నాను. విశ్వరూపుడు, విరూపాక్షుడు – అయిన నీకు అన్నివైపులా నమస్కరిస్తున్నాను. సర్వేశ్వరుడు, భవాధ్యక్షుడు, సత్యస్వరూపుడు, శివుడు, అనుత్తముడు (ఎవనికంటే ఉత్తముడు లేడో అతడు – అనుత్తముడు), కోటిసూర్యసదృశుడు – అయిన నీకు అన్ని వైపులా నమస్కరిస్తున్నాను.

విశ్వదేవమనాద్యంతం షడ్వింశత్కమనీశ్వరమ్ ।
ప్రవర్తకం చ సర్వేషాం త్వాం నమామి చ సర్వతః ॥22॥

ప్రవర్తకం చ ప్రకృతేస్సర్వస్య ప్రపితామహమ్ ।
సర్వవిగ్రహమీశం హి త్వాం నమామి చ సర్వతః ॥23॥

జగత్తుకంతకూ స్వామివి. తుది మొదలు లేనివాడివి. ఇరవైయారు తత్త్వాల రూపానివి, అనీశ్వరుడివి, అందరినీ ప్రవర్తింపజేసే వాడివి అయిన నీకు అన్నివైపులా మొక్కుతున్నాను. ప్రకృతికి చైతన్యప్రదుడివి, సమస్త ప్రాణికోటికీ ముత్తాతవు సమస్తరూపధారివి, ఈశుడివి అయిన నీకు అన్ని వైపులా వందనాలు.

ఏవం వదంతి వరదం సర్వావాసం స్వయంభువమ్।
శ్రుతయః శ్రుతిసారజ్ఞం శ్రుతిసారవిదశ్చ యే ।।24।।

అదృశ్యమస్మాభిరనేకభూతం త్వయాకృతం యద్భవతాథ లోకే ।
త్వమేవ దేవా సురభూసురాశ్చ అన్యే చ వై స్థావరజంగమాశ్చ ।।25।।

వరప్రదుడివైన నిన్ను సర్వాంతర్యామిగా స్వయంభువుడిగా చెబుతున్నాయి వేదాలు. వేదసారజ్ఞుడవని చెబుతున్నారు వేదవిదులు. పరమేశ్వరా! ఈలోకంలో అనంతంగా ఉన్న నీ రూపవైవిధ్యాన్ని మేము దర్శించలేని అశక్తులం. దేవ–అసుర–భూసురాదులే కాదు తక్కిన స్థావర జంగామాలు సైతం నువ్వేకదా!

పాహ్యనన్యగతీన్ శంభో సురాన్నో దేవవల్లభ ।
నష్టప్రాయాన్ త్రిపురతో వినిహత్యాసురాన్ క్షణాత్ ।।26।।

మాయయా మోహితాస్తే ఽద్య భవతః పరమేశ్వర ।
విష్ణునా ప్రోక్తయుక్త్యా త ఉజ్ఝితా ధర్మతః ప్రభో ।।27।।

సంత్యక్త సర్వధర్మాశ్చ బౌద్ధాగమసమాశ్రితాః ।
అస్మద్భాగ్యవశాజ్జాతా దైత్యాస్తే భక్తివత్సల ।।28।।

శంభూ! నువ్వు తప్ప వేరే దిక్కులేని వాళ్ళం. దేవవల్లభా! త్రిపురదైత్యులు కారణంగా ఇప్పటికే మృతప్రాయులం. వెంటనే చిటికెలో ఆ రాక్షసుల్ని సంహరించి మమ్మల్ని కాపాడు స్వామీ! ఆ దైత్యులిపుడు నీ మాయలో పడిపోయారు. విష్ణువు పన్నిన యుక్తితో వాళ్ళంతా ధర్మభ్రష్టులు అయ్యారు. ఇదే అదును. మా అదృష్టం బాగుండి వాళ్ళిలా సర్వధర్మాలనూ విడిచి పెట్టి బౌద్ధధర్మాలను స్వీకరించారు. భక్తవత్సలా! పరమేశ్వరా! వాళ్ళని సంహరించు. మమ్మల్ని రక్షించు.

సదా త్వం కార్యకర్తా హి దేవానాం శరణప్రద ।
వయం తే శరణాపన్నా యథేచ్ఛసి తథా కురు ।।29।।

దేవకార్యాలకు కర్తవు నువ్వు. శరణు అంటే చాలు రక్షిస్తావు. మేమంతా నీకు శరణాగతులం. నీఇష్టం. ఏమి చెయ్యాలనుకుంటావో అది చెయ్యి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇతి స్తుత్వా మహేశానం దేవాస్తు పురతః స్థితాః ।
కృతాంజలిపుటా దీనా ఆసన్ సన్నతమూర్తయః ।।30।।

స్తుతశ్చైవం సురేంద్రాద్యైః విష్ణోర్జాప్యేన చేశ్వరః ।
అగచ్ఛత్తత్ర సర్వేశో వృషమారుహ్య హర్షితః ।।31।।

విష్ణుమాలింగ్య నందీశాదవరుహ్య ప్రసన్నధీః ।
దదర్శ సుదృశా తత్ర నందీదత్తకరోఽఖిలాన్ ॥32॥

అథ దేవాన్ సమాలోక్య కృపాదృష్ట్యా హరిం హరః ।
ప్రాహ గంభీరయా వాచా ప్రసన్నః పార్వతీపతిః ॥33॥

వ్యాసమునీ! మహేశ్వరుణ్ణి ఇలా స్తుతించి అంజలిబంధనాలతో వంగి వంగి నిలబడ్డారు దేవతలందరూ. ఇంద్రాదుల స్తుతికీ శ్రీహరి చేసిన జపానికీ సంతుష్టుడై సర్వేశ్వరుడు వృషభవాహనం అధిరోహించి దేవతల చెంతకు వచ్చారు. నందివాహనం దిగి ప్రసన్నచిత్తంతో శ్రీహరిని కౌగిలించుకున్నాడు. నందీశ్వరుడిమీద చెయ్యివేసి నిలబడి చక్కని చూపులతో అఖిలదేవతలనూ తిలకించాడు. కృపాదృష్టులు అందరిమీద చిలికించాడు. ఎంతో ప్రసన్నంగా ఉన్న ఆ పార్వతీపతి శ్రీహరితో గంభీరంగా ఇలా పలికాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

జ్ఞాతం మయేదమధునా దేవకార్యం సురేశ్వర ।
విష్ణోర్మాయాబలం చైవ నారదస్య చ ధీమతః ॥34॥

తేషామధర్మనిష్ఠానాం దైత్యానాం దేవసత్తమ ।
పురత్రయవినాశం చ కరిష్యేఽహం న సంశయః ॥35॥

పరం తు తే మహాదైత్యా మద్భక్తా దృఢమానసాః ।
అథ వధ్యా మయైవ స్యుః వ్యాజత్యక్తవృషోత్తమాః ॥36॥

విష్ణుర్వాన్యాత్పరో వాథ యత్త్యాజితవృషాః కృతాః ।
దైత్యా మద్భక్తిరహితాస్సర్వే త్రిపురవాసినః ॥37॥

సురేశ్వరా! దేవకార్యం ఏమిటో ఇప్పుడు అర్థమయ్యింది. విష్ణుమూర్తి మాయా శక్తి, నారదుడి ధీశక్తి అర్థమయ్యాయి. దేవసత్తమా! దైత్యులిప్పుడు అధర్మనిష్ఠులయ్యారు కనుక వారినీ, వారి పురత్రయాన్ని నాశనం చేస్తాను. సందేహం లేదు. కానీ ఆ మహాదైత్యులు నాకు పరమభక్తులు. దృఢచిత్తులు. ఒక మాయతో (కుట్రతో) ధర్మభ్రష్టుల్ని చేసిందే కాక, వాళ్ళని చేజేతులా నేనే చంపడమా! ఎలాగూ ధర్మభ్రష్టుల్ని చేశారు కనక, నా భక్తినీ విడిచిపెట్టించారు కనక ఇప్పుడు ఆ దైతుల్నీ, త్రిపురవాసుల్నీ విష్ణుమూర్తే సంహరించవచ్చు. మరొకరైనా సంహరించవచ్చు.

ఇతి శంభోస్తు వచనం శ్రుత్వా సర్వే దివౌకసః ।
విమనస్కా బభూవుస్తే హరిశ్చాపి మునీశ్వర ॥38॥

దేవాన్ విష్ణుముదాసీనాన్ దృష్ట్వా చ భవకృద్విధిః ।
కృతాంజలి పురశ్శంభుం బ్రహ్మా వచనమబ్రవీత్ ॥39॥

వ్యాసమునీశ్వరా! శివుడి ఈ మాటలు విని దివౌకసులంతా నిరుత్సాహులు అయ్యారు. శ్రీహరి కూడా విమనస్కుడయ్యాడు. నీరు గారిపోయి నిలబడిన వీరినందరినీ గమనించి సృష్టికర్త బ్రహ్మదేవుడు కృతాంజలి బంధంతో మరొక్కసారి శివుడికి ఇలా విజ్ఞప్తి చేశాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

న కించిద్విద్యతే పాపం యస్మాత్ త్వం యోగవిత్తమః ।
పరమేశః పరం బ్రహ్మ సదా దేవర్షిరక్షకః ॥40॥

తవైవ శాసనాత్తే వై మోహితాః ప్రేరకో భవాన్ ।
త్యక్తస్వధర్మత్వత్పూజాః పరవధ్యాస్తథాపి న ॥41॥

అతస్త్వయా మహాదేవ సురర్షి ప్రాణరక్షక ।
సాధూనాం రక్షణార్థాయ హంతవ్యా మ్లేచ్ఛజాతయః ॥42॥

సదాశివా! ఇందులో మహాపాపం ఏమీ లేదు. ఎందుకంటే – నువ్వు యోగవిద్యాపారంగతుడివి. పరమేశ్వరుడివి. పరబ్రహ్మం నువ్వే. దేవతలనూ ఋషులనూ ఎల్లప్పుడూ రక్షించేవాడివి నువ్వే. నీ ఆజ్ఞతోనే కదా మేము దైత్యుల్ని సమ్మోహితుల్ని చేసింది ! ప్రేరకుడివి నువ్వే. ఆ దైత్యులిప్పుడు ధర్మభ్రష్టులు అయ్యారు.నీ పూజలు మానేశారు. కనక – నిజమే – నువ్వన్నట్లు వారినిప్పుడు ఎవ్వరైనా సంహరించవచ్చు. కానీ అలా కాదు. నువ్వే సంహరించాలి. నువ్వు మహాదేవుడివి. సుర– ఋషి– ప్రాణరక్షకుడివి. సాధుసంరక్షణకోసం మ్లేచ్ఛజాతుల్ని అంతమొందించాల్సింది నువ్వే.

రాజ్ఞస్తస్య న తత్పాపం విద్యతే ధర్మతస్తవ ।
తస్మాద్రక్షేత్ ద్విజాన్ సాధూన్ కంటకాద్వై విశోధయేత్ ॥43॥

ఏవ మిచ్ఛేదిహాన్యత్ర రాజా చేద్రాజ్యమాత్మనః ।
ప్రభుత్వం సర్వలోకానాం తస్మాద్రక్షస్వ మా చిరమ్ ॥44॥

మహారాజువైన నీకు ఇది ధర్మం కనక నీకు ఏ పాపమూ లేదిందులో. అందుచేత సాధుసజ్జనులనూ విప్రులనూ రక్షించు. లోకకంటకుల్ని ఏరిపారెయ్. ఇహ పరాలలో తన ఏలుబడి(రాజ్యం) సాగాలి అనుకున్న రాజు ఈ పనిచేస్తాడు. నీది త్రిలోకాధిపత్యం. అందుకని వీరిని అందరినీ రక్షించు. ఆలస్యం చెయ్యకు.

మునీంద్రేశాస్తథా యజ్ఞా వేదాశ్శాస్త్రాదయోఽఖిలాః ।
ప్రజాస్తే దేవదేవేశ హ్యయం విష్ణురపి ధ్రువమ్ ॥45॥

దేవతాసార్వభౌమస్త్వం సమ్రాట్ సర్వేశ్వరః ప్రభో ।
పరివారస్తవైవైష హర్యాది సకలం జగత్ ॥46॥

యువరాజో హరిస్తేఽజ బ్రహ్మాహం తే పురోహితః ।
రాజకార్యకరశ్శక్రః త్వదాజ్ఞాపరిపాలకః ॥47॥

దేవదేవేశా! మునీంద్రులూ, యజ్ఞాలూ, వేదాలూ, శాస్త్రాలూ ఇవన్నీ నీ ప్రజలు. నేనూ, విష్ణువూ కూడా నీ సంతతి. ఇది నిశ్చితం. దేవతా సార్వభౌముడివి నువ్వు. సమాట్టువి. సర్వేశ్వరుడివి. ప్రభూ! శ్రీహరితో సహా ఈ సకల జగత్తూ, ప్రాణికోటీ నీ పరివారం. శ్రీహరి నీ యువరాజు. బ్రహ్మను నేనేమో నీ పురోహితుణ్ని. రాజకార్యనిర్వాహకుడు నీ ఆజ్ఞను పాలించే ఈ ఇంద్రుడు .

దేవా అన్యే ఽపి సర్వేశ తవ శాసనయంత్రితాః ।
స్వస్వకార్యకరా నిత్యం సత్యం సత్యం న సంశయః ॥48॥

సర్వేశా! మిగతా దేవతలు అందరూ నీ శాసనబద్ధులు. తమ తమ విధుల్ని నిరంతరం నిర్వహిస్తూ ఉంటారు. ఇది ముమ్మాటికీ సత్యం.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య బ్రహ్మణః పరమేశ్వరః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా శంకరస్సురపో విధిమ్ ॥49॥

వ్యాసర్షీ! బ్రహ్మదేవుడి విజ్ఞప్తిని విని, పరమేశ్వరుడు – శంకరుడు– సురపతి–ఎంతో ప్రసన్నాత్ముడై విధికి బదులు పలికాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

హే బ్రహ్మన్! యద్యహం దేవరాజస్సమ్రాట్ ప్రకీర్తితః ।
తత్ప్రకారో న మే కశ్చిత్ గృహ్ణీయాం యమిహ ప్రభుః ॥50॥

రథో నాస్తి మహాదివ్యస్తాదృక్ సారథినా సహ ।
ధనుర్బాణాదికం చాపి సంగ్రామే జయకారకమ్ ॥51॥

యమాస్థాయ ధనుర్బాణాన్ గృహీత్వా యోజ్య వై మనః ।
నిహనిష్యామ్యహం దైత్యాన్ ప్రబలానపి సంగరే ॥52॥

ఓ బ్రహ్మా! దేవతలకు రాజుననీ, సమ్రాట్టుననీ, ప్రభువుననీ నన్ను కీర్తిస్తున్నావు. కానీ దానికి కావలసిన పరికరమేదీ నాకు అందుబాటులో లేదు. ఒక దివ్యరథం లేదు, దివ్యసారథి లేడు. సంగ్రామంలో జయం సమకూర్చే ధనుర్బాణాదులు లేవు. అవే ఉంటే వాటిని చేపట్టి, మనస్సుపెట్టి, ఎక్కుపెట్టి, రణరంగంలో నిలిచి ఎంతటి బలశాలులైనా సరే దైత్యుల్ని మట్టుబెట్టగలను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

అద్య సబ్రహ్మకా దేవాస్సేంద్రోపేంద్రాః ప్రహర్షితాః ।
శ్రుత్వా ప్రభోస్తదా వాక్యం నత్వా ప్రోచుర్మహేశ్వరమ్ ॥53॥

ప్రభువు శివుడు పలికిన ఈ మాటలు విని – బ్రహ్మేంద్రోపేంద్రాది దేవతలందరూ మురిసిపోయారు. అందరూ శిరసా నమస్కరించి ఆ మహేశ్వరుడితో ఇలా పలికారు.

దేవా ఊచుః – దేవతలు అన్నారు.

వయం భవామ దేవేశ తత్ప్రకారా మహేశ్వర ।
రథాదికాః తవ స్వామిన్ సన్నద్ధాస్సంగరాయ హి ॥54॥

ఇత్తుక్త్వా సంహతాస్సర్వే శివేచ్ఛామధిగమ్య హ ।
పృథగూచుః ప్రసన్నాస్తే కృతాంజలిపుటాస్సురాః ॥55॥

దేవేశా! మహేశ్వరా! నీకు అవన్నీ మేమే అవుతాం. రథమూ, సారథీ, ధనుర్బాణాలూ అన్నీ అవుతాం. సంగరానికి సన్నద్ధంగా ఉన్నాం. అవే అందరూ కలిసి పలికారు. శివేచ్ఛను అవగతం చేసుకుని ప్రసన్నచిత్తులై అంజలిబంధనాలతో నిలిచి ఎవరికివారుగానూ పలికారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శివస్తుతి వర్ణనం నామ షష్ఠో ఽధ్యాయః ॥6॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శివస్తుతి వర్ణనం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తమోఽధ్యాయః – ఏడవ అధ్యాయం
దేవస్తుతి వర్ణనమ్ – దేవస్తుతి వర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఏతచ్ఛ్రుత్వా తు సర్వేషాం దేవాదీనాం వచో హరః ।
అంగీచకార సుప్రీత్యా శరణ్యో భక్తవత్సలః ॥1॥

ఏతస్మిన్నంతరే దేవీ పుత్రాభ్యాం సంయుతా శివా ।
ఆజగామ మునే తత్ర యత్ర దేవాన్వితో హరః ॥2॥

అథాగతాం శివాం దృష్ట్వా సర్వే విష్ణ్వాదయో ద్రుతమ్ ।
ప్రణేమురతినమ్రాస్తే విస్మితా గతసంభ్రమాః ॥3॥

ప్రోచుర్జయేతి సద్వాక్యం మునే! సర్వే సులక్షణమ్ ।
తూష్ణీమాసన్నజానంతః తదాగమనకారణమ్ ॥4॥

అథ సర్వైః స్తుతా దేవైర్దేవ్యద్భుతకుతూహలా ।
ఉవాచ స్వామినం ప్రీత్యా నానాలీలావిశారదమ్ ॥5॥

దేవతలందరూ ముక్తకంఠంతో చెప్పిన ఈ మాటను ఆలకించి శరణ్యుడూ భక్తవత్సలుడూ అయిన శివుడు సంతోషంతో దానికి అంగీకరించాడు. వ్యాసమునీ! అంతలోకీ పార్వతీదేవి తన ఇద్దరు పుత్రులతోనూ కలిసి అక్కడికి వచ్చింది. హఠాత్తుగా అలా తామున్న చోటికి వచ్చిన పార్వతీదేవిని చూసి శ్రీహరి ప్రభృతులు అందరూ వెంటనే వినమ్రులై నమస్కరించారు. విస్మితులయ్యారు. అప్పటివరకూ వారిలో కనిపించిన సంతోషసంభ్రమాలు ఒక్కసారిగా నెమ్మదించాయి. అయినా అందరూ సలక్షణంగా జయజయధ్వానాలు పలికారు. రాకకు కారణమేమిటో తెలియక మిన్నకుండిపోయారు. తేరుకుని బహుధా స్తుతించారు. అప్పుడు ఆ దేవి అద్భుతమైన ఒక కుతూహలంతో ప్రీతితో నానాలీలావిశారదుడైన తన స్వామిని ఉద్దేశించి ఇలా పలికింది.

దేవ్యువాచ – దేవి పలికింది.

క్రీడమానం విభో పశ్య షణ్ముఖం రవిసన్నిభమ్ ।
పుత్రం పుత్రవతాం శ్రేష్ఠ! భూషితం భూషణైర్వరైః ॥6॥

ఇత్యేవం లోకమాత్రా చ వాగ్భిస్సంబోధితశ్శివః ।
న యయౌ తృప్తిమీశానః పిబన్ స్కందాననామృతమ్ ॥7॥

స సస్మారాగతాన్ దైత్యాన్నిజతేజో నిపీడితాన్ ।
స్కందమాలింగ్య చాఘ్రాయ ముమోదాతి మహేశ్వరః ॥8॥

పుత్రవంతులలోకెల్లా ఉత్తమోత్తముడవైన ప్రియవల్లభా! ఇడిగో మన పుత్రుడు షణ్ముఖుడు. విలువైన ఆభరణాలతో అలంకృతుడై – సూర్యసమానుడు – ఎలా ఆడుకుంటున్నాడో చూశావా! అని లోకమాత తన సరసవాక్కులతో శివుణ్ని సంబోధించింది. ఈశ్వరుడు ఆ స్కందుడి వదనామృతాన్ని కన్నులారా గ్రోలుతూ ఎంతకూ తనివిపొందలేదు. మునీశ్వరా! ఆ చిన్నారి మీదకు అలనాడు లంఘించి అతడి తేజస్సుతో దెబ్బతిన్న రాక్షసులు తలపులో మెదిలి మహేశ్వరుడు ఒక్కసారిగా కుమారస్వామిని చేరదీసి కౌగిలించుకున్నాడు. శిరస్సు మూర్కొన్నాడు. ఆనందపరవశుడయ్యాడు.

జగదంబాథ తత్రైవ సమ్మంత్ర్య ప్రభుణా చ సా ।
స్థిత్వా కించిత్సముత్తస్థౌ నానాలీలావిశారదా ॥9॥

తతః సనందీ సహ షణ్ముఖేన తయా చ సార్ధం గిరి రాజపుత్ర్యా ।
వివేశ శంభుర్భవనం సులీలః సురైస్సమస్తైరభివంద్యమానః ॥10॥

జగన్మాత అక్కడే ఉండి కొంచెం సేపు తన ప్రభువుతో సమాలోచన జరిపి లేచి నిలబడింది. అనేకలీలా విశారదురాలు ఆ జగన్మాత. వెంటనే శివుడూ లేచాడు. నందీశ్వరుడితో షణ్ముఖుడితో గిరిరాజపుత్రితో కలిసి సవిలాసంగా శంభుడు తన భవనంలోకి నిష్క్రమించాడు. దేవతలందరూ శిరసా నమస్కరిస్తూ అలా నిలుచుండిపోయారు.

ద్వారస్య పార్శ్వతః తస్థుర్దేవదేవస్య ధీమతః ।
తేఽథ దేవా మహావ్యగ్రా విమనస్కా మునేఽఖిలాః ॥11॥

వ్యాసమహర్షీ! ఆ దేవదేవుడి భవనద్వారానికి అటూ ఇటూ నిలబడ్డ సకల దేవతలూ ఆ క్షణంలో నిరుత్సాహులయ్యారు. లోలోపల ఎంతగానో కలత చెందారు.

కిం కర్తవ్యం క్వ గంతవ్యం కః స్యాదస్మత్సుఖప్రదః ।
కిం తు కింత్వితి సంజాతం హా హతాస్మేతి వాదనమ్ ॥12॥

అన్యోన్యం ప్రేక్ష్య శక్రాద్యా బభూవుశ్చాతివిహ్వలాః ।
ప్రోచుర్వికలవాక్యం తే ధిక్కుర్వంతో నిజం విధిమ్ ॥13॥

ఇప్పుడు మనం ఏమి చెయ్యాలి? ఎక్కడికి పోవాలి? మనకి సుఖసంతోషాలు అందించేవాడు ఎవడు? ఏమిటి? ఏమిటి? అయ్యో! దెబ్బతిన్నామే – అనే మాటల కలకలం పుట్టింది. (వాదినామ్ అని పాఠాంతరం). ఇంద్రాదులు సైతం ఎంతగానో విహ్వలులయ్యారు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. వికలవాక్యాలు పంచుకున్నారు. తమ నుదుటిరాతను (విధిని) నిందించుకున్నారు.

పాపా వయమిహేత్యన్యే హ్యభాగ్యాశ్చేతి చాపరే ।
తే భాగ్యవంతో దైత్యేంద్రా ఇతి చాన్యేఽబ్రువన్ సురాః ॥14॥

మనం మహాపాపులమని కొందరూ, దురదృష్టవంతులం అని ఇంకొందరూ, ఆ దైత్యేంద్రులే అదృష్టవంతులని మరికొందరూ – ఇలా దేవతలందరూ పెద్దగా వాపోయారు.

తస్మిన్నేవాంతరే తేషాం శ్రుత్వా శబ్దాననేకశః ।
కుంభోదరో మహాతేజా దండేనాతాడయత్సురాన్ ॥15॥

రకరకాల మాటల కోలాహలం విని మహాతేజస్వి శివగణమైన కుంభోదరుడు రివ్వున వచ్చాడు. ద్వారానికి అటూ ఇటూ ఉన్న సకలదేవతలనూ తన దండాయుధంతో చితకబాదాడు.

దుద్రువుస్తే భయావిష్టా దేవా హాహేతి వాదినః ।
అపతన్మునయశ్చాన్యే విహ్వలత్వం బభూవ హ ॥16॥

ఇంద్రస్తు వికలోఽతీవ జానుభ్యామవనీం గతః ।
అన్యే దేవర్షయోఽతీవ వికలాః పతితా భువి ॥17॥

సర్వే మిళిత్వా మునయస్సురాశ్చ సమమాకులాః ।
సంగతా విధిహర్యోస్తు సమీపం మిత్రచేతసోః ॥18॥

దేవతలందరూ భయంతో పరుగులు తీశారు. కుయ్యో మొర్రోమంటూ పారిపోయారు. పరుగెత్తలేని మునులు వివశులై పడిపోయారు. ఇంద్రుడు మరింత కుంగిపోయాడు. మోకాళ్ళమీద నేలపై పడిపోయాడు. మిగతా దేవతలూ ఋషులూ చాలా మంది ఇలాగే వికలులై పడిపోయారు. అందరి మనస్సులూ సమానంగా భయపడ్డాయి. ఎట్టకేలకు అందరూ ఒకచోటికి చేరుకున్నారు. కలుసుకున్నారు. తమపట్ల మిత్రభావనతో ఉండే బ్రహ్మ విష్ణువుల చెంతకు చేరుకున్నారు.

అహో! విధిబలం చైతన్మునయః కశ్యపాదయః ।
వదన్తి స్మ తదా సర్వే హరిం లోకభయాపహమ్ ॥19॥

అభాగ్యాన్న సమాప్తం తు కార్యమిత్యపరే ద్విజాః ।
కస్మాద్విఘ్నమిదం జాతమిత్యన్యే హ్యతివిస్మితాః ॥20॥

ఇత్యేవం వచనం శ్రుత్వా కశ్యపాద్యుదితం మునే ।
ఆశ్వాసయన్మునీన్ దేవాన్ హరిర్వాక్యముపాదదే ॥21॥

లోకాలకు వచ్చే భయాలను తొలగించే శ్రీమహావిష్ణువుతో కశ్యపాదిమహర్షులు ఒక్కొక్కరు ఒక్కొక్కలాగా విన్నవించారు. ఆహా! విధి ఎంత బలీయం – అని కొందరు విస్తుపోగా, ఎంత దురదృష్టం! పని పూర్తికాలేదు – అని కొందరు ద్విజులు నిరుత్సాహం ప్రకటించారు. అసలు ఎందుకని ఇలా విఘ్నం జరిగింది – అంటూ ఎక్కువ మంది అతి విస్మితులయ్యారు. కశ్యపాదుల నోటినుంచి వెలువడుతున్న ఈ మాటలు విని వ్యాసర్షీ! దేవతలనూ మునులనూ ఓదారుస్తూ శ్రీమహావిష్ణువు ఇలా స్పందించాడు.

విష్ణురువాచ – విష్ణువు చెప్పాడు.

హే దేవా మునయస్సర్వే మద్వచః శృణుతాదరాత్ ।
కిమర్థం దుఃఖమాపన్నా దుఃఖం తు త్యజతాఖిలమ్ ॥22॥

మహదారాధనం దేవా న సుసాధ్యం విచార్యతామ్ ।
మహదారాధనే పూర్వం భవేద్దుఃఖమితి శ్రుతమ్ ॥
విజ్ఞాయ దృఢతాం దేవాః ప్రసన్నో భవతి ధ్రువమ్ ॥23॥

దేవతలారా! మునులారా! అందరూ నా మాట శ్రద్ధగా ఆలకించండి. ఎందుకు దుఃఖపడటం? దుఃఖాన్ని పూర్తిగా విడిచిపెట్టండి. దేవతలారా! ఆలోచించండి. మహాత్ముల్ని ఆరాధించడం అంత తేలిక ఏమీ కాదు. మహదారాధనలో ముందు దుఃఖమే కలుగుతుంది. ఇది మీరెప్పుడూ వినలేదా? మన ఆరాధనలోని దృఢత్వాన్ని పరీక్షించి తెలుసుకున్నాక మాత్రమే మహాత్ముడు ప్రసన్నుడవుతాడు. ఇది నిశ్చయం.

శివస్సర్వగణాధ్యక్షస్సహసా పరమేశ్వరః ।
విచార్యతాం హృదా సర్వైః కథం వశ్యో భవేదితి ॥24॥

ప్రణవం పూర్వముచ్చార్య నమః పశ్చాదుదాహరేత్ ।
శివాయేతి తతః పశ్చాత్ శుభద్వయమతః పరమ్ ॥25॥

కురుద్వయం తతః ప్రోక్తం శివాయ చ తతః పునః ।
నమశ్చ ప్రణవశ్చైవ మంత్రమేవం సదా బుధాః ॥26॥

అవర్తధ్వం పునర్యూయం యది శంభుకృతే తదా ।
కోటిమేకం తథా జప్త్వా శివః కార్యం కరిష్యతి ॥27॥

సర్వగణాధ్యక్షుడూ పరమేశ్వరుడూ అయిన శివుడు అంతవెంటనే మనకు వశ్యుడవుతాడా? అందరూ మనస్సులో బాగా ఆలోచించండి. కనక ఒక మార్గం చెబుతాను వినండి. ప్రణవపూర్వకంగా ముందు నమశ్శబ్దాన్ని ఉచ్చరించాలి. (ఓం నమః) అటుపైని శివాయ అనేది పలకాలి. ఆ పైని శుభమ్ అనే మాటను రెండు సార్లు అనాలి. దానికి కురు అనే మాటను రెండుసార్లు కలపాలి. అయ్యాక శివాయ నమః ఓమ్ అనే పదాలనూ అదే వరుసలో మళ్ళీ పలకాలి. ఓమ్ నమశ్శివాయ శుభం శుభం కురు కురు శివాయ నమ ఓమ్ – అనేది మహామంత్రం. దేవతలారా! మునులారా! మీరంతా ఈ మంత్రాన్ని ఒక్కొక్కరూ కోటి జపం చెయ్యాలి. ఇది శంభుప్రీతికరం. అప్పుడు శివుడు మన కార్యం నెరవేరుస్తాడు.

ఇత్యుక్తే చ తదా తేన హరిణా ప్రభవిష్ణునా ।
తథా దేవాః పునశ్చక్రుః హరస్యారాధనం మునే ॥28॥

సంజజాప హరిశ్చాపి సవిధిశ్శివమానసః ।
దేవానాం కార్యసిద్ధ్యర్థం మునీనాం చ విశేషతః ॥29॥

ముహుః శివేతి భాషంతో దేవా ధైర్యసమన్వితాః ।
కోటిసంఖ్యం తదా కృత్వా స్థితాస్తే మునిసత్తమ ॥30॥

వ్యాసమహర్షీ! ప్రభవిష్ణువైన విష్ణువు ఇలా చెప్పేసరికి దేవతలందరూ మళ్ళీ శివారాధన మొదలుపెట్టారు. శివుణ్ని మనస్సులలో నిల్పుకుని విష్ణువూ బ్రహ్మదేవుడూ సైతం ఈ శివమహామంత్రజపం చేశారు. దేవ కార్యం మునికార్యం సిద్ధించాలని ఈ విశిష్టజపం విశేషంగా చేశారు. దేవతలు నోరుతెరిస్తే చాలు శివా శివా అన్నదే పలుకుతున్నారు. అదే పలకరింపు, అదే పలవరింత, మునీశ్వరా! అందరిలోనూ ఒక ధైర్యం వచ్చింది. ఒక్కొక్కరూ కోటిజపం పూర్తిచేశారు. ఎదురుచూస్తూ నిలిచారు.

ఏతస్మిన్నంతరే సాక్షత్ శివః ప్రాదురభూత్ స్వయమ్ ।
యథోక్తేన స్వరూపేణ వచనం చేదమబ్రవీత్ ॥31॥

అంతలోకే శివుడు స్వయంగా సాక్షాత్కరించాడు. యథోక్తస్వరూపంతో వారి ముందు ప్రత్యక్షమయ్యాడు. ఇలా పలికాడుకూడా.

శ్రీశివ ఉవాచ – శివుడు అన్నాడు.

హే హరే హే విధే దేవా మునయశ్చ శుభవ్రతాః ।
ప్రసన్నో ఽస్మి వరం బ్రూత జపేనానేన చేప్సితమ్ ॥32॥

ఓ విష్ణూ! ఓ బ్రహ్మా! ఓ దేవతలారా! ఓ మునులారా! శుభవ్రతులారా! ప్రసన్నుణ్ణి అయ్యాను. ఈ మహాజపంతో మీరు ఏది కోరుకుంటున్నారో అది వరంగా అడగండి.

దేవా ఊచుః – దేవతలు అడిగారు.

యది ప్రసన్నో దేవేశ జగదీశ్వర శంకర ।
సురాన్ విజ్ఞాయ వికలాన్ హన్యతాం త్రిపురాణి చ ॥33॥

రక్షాస్మాన్ పరమేశాన దీనబంధో కృపాకర ।
త్వయైవ రక్షితా దేవా సదాపద్భ్యో ముహుర్ముహుః ॥34॥

దేవేశా! జగదీశా! శంకరా! నువ్వు నిజంగా ప్రసన్నుడవే అయితే ఇదిగో ఇలా వికలచిత్తులమై ఉన్న మా దేవతలనందరినీ ఒక్కసారి గమనించి, వెంటనే త్రిపురదైత్యసంహారం నిర్వహించు, పరమేశానా! దీనబంధూ! కృపాకరా! మమ్మల్ని దయచేసి రక్షించు. ఎప్పుడు ఆపదలు వచ్చినా దేవతలను ఎప్పటికప్పుడు మాటిమాటికీ రక్షించిన రక్షకుడివి నువ్వే.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇత్యుక్తం వచనం తేషాం శ్రుత్వా సహరివేధసామ్ ।
విహస్యాంతస్తదా బ్రహ్మన్ మహేశః పునరబ్రవీత్ ॥35॥

వ్యాసమహర్షీ! ఓ బ్రహ్మా! బ్రహ్మ విష్ణువులతో సహా వారందరూ కోరిన ఈ వరాన్ని ఆలకించి మహేశ్వరుడు లోలోపల నవ్వుకుని ఇలా బదులిచ్చాడు.

మహేశ ఉవాచ – మహేశుడు అన్నాడు.

హే హరే హే విధే దేవా మునయశ్చాఖిలా వచః ।
మదీయం శృణుతాదృత్య నష్టం మత్వా పురత్రయమ్ ॥36॥

రథం చ సారథిం దివ్యం కార్ముకం శరముత్తమమ్ ।
పూర్వమంగీకృతం సర్వముపపాదయతాచిరమ్ ॥37॥

హే విష్ణో! హే విధే! త్వం హి త్రిలోకాధిపతిర్ధ్రువమ్ ।
సర్వసమ్రాట్సకారం మే కర్తుమర్హసి యత్నతః ॥38॥

నష్టం పురత్రయం మత్వా దేవసాహాయ్యమిత్యుత ।
కరిష్యథః ప్రయత్నేనాధికృతౌ సర్గపాలనే ॥39॥

ఓ హరీ! ఓ విధీ! ఓ దేవతలారా! ఓ మునులారా! అందరూ శ్రద్ధగా నా వాక్కులు వినండి. పురత్రయం నాశనమైపోయిందనే భావించండి. మునుపు మీరు అంగీకరించినట్టుగా దివ్యరథాన్ని దివ్యసారథిని, దివ్య కార్ముకాన్ని, దివ్యశరాన్ని – సమస్తమూ నాకు అమర్చండి. ఆలస్యం చెయ్యకండి. ఓ విష్ణూ! ఓ బ్రహ్మా! నువ్వు – నువ్వు – త్రిలోకాధిపతివి. ఇది నిజం. నేను సర్వసమ్రాట్టుని. సృష్టి – పరిపాలనలకు అధికారులైన మీరిద్దరూ త్రిపురాలు నష్టమై పోయాయనే భావించి దేవసాహాయ్యంగా పూనికతో ఇది చెయ్యండి.

అయం మంత్రో మహాపుణ్యో మత్ప్రీతిజనకశ్శుభః ।
భుక్తిముక్తిప్రదస్సర్వకామదశ్శైవకావహః ॥40॥

ధన్యో యశస్య ఆయుష్యః స్వర్గకామార్థినాం నృణామ్ ।
అపవర్గో హ్యకామానాం ముక్తానాం భుక్తిముక్తిదః ॥41॥

య ఇమం కీర్తయేన్మంత్రం శుచిర్భూత్వా సదా నరః ।
శృణుయాత్ శ్రావయేద్వాపి సర్వాన్ కామానవాప్నుయాత్ ॥42॥

దేవతలారా! మీరు జపించిన ఈ మంత్రం మహాపవిత్రం. నాకు ఎంతో ప్రీతిదాయకం. శుభప్రదం. భుక్తిముక్తి దాయకం. అన్ని కోరికలనూ తీరుస్తుంది. శివభక్తులకు ఎంతయినా ఆనందావహం. (కమ్=సుఖమ్). ఇది ధన్యం. ఇది కీర్తికాంఠకము. ఇది ఆయువు పెంచుతుంది. స్వర్గాన్ని కోరి జపించే నరులకు స్వర్గప్రదం.

నిష్కామంగా జపించేవారికి ముక్తిప్రదం. సర్వసంగపరిత్యాగులకు భుక్తిముక్తులు రెండూ ఇస్తుంది. శుచియై భక్తుడు ఈ మహామంత్రాన్ని అన్నా, విన్నా, వినిపించినా అతడికి సకల వాంఛితాలూ నెరవేరతాయి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇతి శ్రుత్వా వచస్తస్య శివస్య పరమాత్మనః ।
సర్వే దేవా ముదం ప్రాపుః హరిబ్రహ్మాదయస్తథా ॥43॥

సర్వదేవమయం దివ్యం రథం పరమశోభనమ్ ।
రచయామాస విశ్వార్థే విశ్వకర్మా తదాజ్ఞయా ॥44॥

పరమాత్మ శివుడూ ఇలా చెప్పేసరికి హరిబ్రహ్మాదులైన సకల దేవతలూ ఎంతగానో మురిసిపోయారు. వెంటనే వారి ఆజ్ఞమేరకు విశ్వకర్మ సర్వదేవతామయమైన ఒక దివ్యరథాన్ని అత్యంతసుందరంగా జగత్కల్యాణంకోరి తయారుచేశాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే దేవస్తుతివర్ణనం నామ సప్తమోఽధ్యాయః ॥7॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు దేవస్తుతి వర్ణనం అనే ఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టమోఽధ్యాయః – ఎనిమిదవ అధ్యాయం

రథాదియుద్ధ ప్రకారవర్ణనమ్ – రథాదియుద్ధ ప్రకారవర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడన్నాడు.

సనత్కుమార సర్వజ్ఞ శైవప్రవర సన్మతే ।
అద్భుతేయం కథా తాత శ్రావితా పరమేశితుః ॥1॥

ఇదానీం రథనిర్మాణం బ్రూహి దేవమయం పరమ్ ।
శివార్థం యత్కృతం దివ్యం ధీమతా విశ్వకర్మణా ॥2॥

ఓ సనత్కుమారా! సర్వజ్ఞుడా! శివభక్తులలోకెల్లా ఉత్తముడా! ఓ సుమతీ! తండ్రీ! పరమేశ్వరుడి అద్భుతగాథను వినిపించావు. ఇప్పుడు ఆ దివ్యరథ నిర్మాణం గురించి తెలియజెప్పు. దేవమయంగా ఉత్తమంగా శివుడికోసమని ధీశాలి విశ్వకర్మ నిర్మించిన దివ్యరథం కదా అది. ఎలా నిర్మించాడో వివరించవా!

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్య స మునీశ్వరః ।
సనత్కుమారః ప్రోవాచ స్మృత్వా శివపదాంబుజమ్ ॥3॥

వ్యాసుడి ఈ అభ్యర్థనకు మునీశ్వరుడయిన ఆ సనత్కుమారుడు మరొక్కసారి శివుడి పాదపద్మాలను ధ్యానించి ఇలా వివరించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాస మహాప్రాజ్ఞ రథాదేర్నిర్మితిం మునే ।
యథామతి ప్రవక్ష్యేఽహం స్మృతా శివపదాంబుజమ్ ॥4॥

అథ దేవస్య రుద్రస్య నిర్మితో విశ్వకర్మణా ।
సర్వలోకమయో దివ్యో రథో యత్నేన సాదరమ్ ॥5॥

సర్వభూతమయశ్చైవ సౌవర్ణస్సర్వసమ్మతః ।
రథాంగం దక్షిణం సూర్యస్తద్వామం సోమ ఏవ చ ॥6॥

మహాప్రాజ్ఞుడా! వ్యాసమునీ! శివుడి పాదపద్మాలను ధ్యానించి – నాకు తెలిసినంత మటుకు ఆ దివ్యరథ నిర్మాణం గురించి చెబుతాను. శ్రద్ధగా విను. రుద్రుడి కోసమని విశ్వకర్మ స్వయంగా ఎంతో ఆదరంతో పూనికతో సర్వలోకమయమైన దివ్యరథాన్ని నిర్మించాడు. అది సర్వభూతమయం. సర్వసమ్మతం. అంతా బంగారమే. దానికి కుడి చక్రం సూర్యుడు, ఎడమ చక్రం చంద్రుడు.

దక్షిణం ద్వాదశారం హి షోడశారం తథోత్తరమ్ ।
అరేషు తేషు విప్రేంద్ర ఆదిత్యా ద్వాదశైవ తు ॥7॥

శశినః షోడశారాస్తు కళా వామస్య సువ్రత ।
ఋక్షాణి తు తథా తస్య వామస్యైవ విభూషణమ్ ॥8॥

ఋతవో నేమయష్షట్ చ తయోర్వై విప్రపుంగవ ।
పుష్కరం చాంతరిక్షం వై రథనీడశ్చ మందరః ॥9॥

అస్తాద్రిరుదయాద్రిస్తు తావుభౌ కూబరౌ స్మృతౌ ।
అధిష్ఠానం మహామేరురాశ్రయాః కేశరాచలాః ॥10॥

కుడి చక్రానికి పన్నెండు ఆకులు, ఎడమ చక్రానికి పదహారు ఆకులు. ద్వాదశ ఆదిత్యులే పన్నెండు ఆకులు. చంద్రుడి పదహారు కళలే పదహారు ఆకులు. నక్షత్రాలు అన్నీ ఎడమ చక్రానికి అలంకారాలు. ఆ చక్రాలు రెండింటికీ ఆరేసి ఋతువులే పూటీలు (నేమి). బ్రాహ్మణోత్తమా! అంతరిక్షమే అడ్డ. మందరపర్వతం వచ్చి ఆ రథానికి కామ (రథనీడం). అస్తాచలం ఒక వైపు ఉదయాచలం ఒకవైపు దానికి కాడి. మహామేరుపర్వతమే అంతకూ ప్రధానం అయ్యింది. దాని ప్రత్యంతపర్వతాలు (కేసరాచలాలు) అధిష్ఠానానికి చుట్టూ నిలువుటంచులు.

వేగస్సంవత్సరాస్తస్య అయనే చక్రసంగమౌ ।
ముహూర్తా బంధురాస్తస్య శమ్యాశ్చైవ కళాః స్మృతాః ॥11॥

తస్య కాష్ఠాః స్మృతా ఘోణాశ్చాక్షదండాః క్షణాశ్చ వై ।
నిమేషాశ్చానుకర్షశ్చ ఈషాశ్చానులవాః స్మృతాః ॥12॥

ద్యౌర్వరూథం రథస్యాస్య స్వర్గమోక్షావుభౌ ధ్వజౌ ।
యుగాంతకోటితౌ తస్య భ్రమకామదుఘౌ స్మృతౌ ॥13॥

సంవత్సరాలే దాని వేగం. ఉత్తరాయణ – దక్షిణాయనాలు చక్రాల ఇరుసులు. ముహూర్తాలే బందులు (భూషణ ముకుటములు – అని శ్రీస్వామి తత్త్వవిదానంద సరస్వతులు). కళలే (కాలంలో చిన్న పరిమాణం) దాని కీలలు. కాష్ఠలు దానికి ఘోణాలు (మేకుల వంటివి?). క్షణాలు దాని అక్షదండాలు (ఇరుసు కర్రలు?). నిముసాలు కింది కర్రలు, అనులవాలు (నిముసంలో చిన్న పరిమాణం) దాని నిలువు కర్రలు (ఈషలు). ద్యులోకమే దాని నొగ (వరూధం). స్వర్గమోక్షాలు రెండూ రథధ్వజాలు. అభ్రమువు అనే దిగ్గజం ఒకటీ, కామధేనువొకటి దాని కాడికొసలు (యుగాంతకోటులు).

ఈషాదండస్తథా వ్యక్తం బుద్ధిస్తస్యైవ నద్వలః ।
కోణాస్తస్యాప్యహంకారో భూతాని చ బలం స్మృతమ్ ॥14॥

ఇంద్రియాణి చ తస్యైవ భూషణాని సమంతతః ।
శ్రద్ధా చ గతిరస్యైవ రథస్య మునిసత్తమ ॥15॥

అవ్యక్త ప్రకృతి దాని నిలువుస్తంభం. (తథా+వ్యక్తమ్. వ్యక్తప్రకృతి అని కానీ). బుద్ధి అనేది ఆ రథం మీద ఉన్న వెదురు కర్రల ఆసనం (నద్వలః). అహంకారమే దాని కోణాలు. పంచభూతాలు (లేదా సర్వప్రాణికోటి) – దాని బలం. ఇంద్రియాలు దాని అలంకారాలు. మునీశ్వరా! ఈ రథాన్ని నడిపించే శక్తి – శ్రద్ధ. (దాని గమనమే శ్రద్ధ అని కానీ).

తదానీం భూషణాన్యేవ షడంగాన్యుపభూషణమ్ ।
పురాణన్యాయ మీమాంసాధర్మశాస్త్రాణి సువ్రత! ॥16॥

బలాశయా వరాశ్చైవ సర్వలక్షణసంయుతాః ।
మంత్రా ఘంటాః స్మృతాస్తేషాం వర్ణఃపాదాస్తదాశ్రమాః ॥17॥

అథో బంధో హ్యనంతస్తు సహస్రఫణభూషితః ।
దిశః పాశా రథస్యాస్య తథాచోపదిశశ్చ హ ॥18॥

ఛందోవ్యాకరణాదులైన షడంగాలూ ఆ రథానికి భూషణాలే. పురాణం – న్యాయం – మీమాంస – ధర్మశాస్త్రాలు ఓ సువ్రతుడా! దాని ఉపభూషణాలు. సర్వలక్షణసంయుతాలూ, శక్తిసంపన్నాలూ, ఉత్తమోత్తమాలూ అయిన మంత్రాలూ మంత్రాక్షరాలూ, మంత్రపాదాలూ దానికి చిరుగంటలు. (బ్రహ్మచర్యాది ఆశ్రమాలు దానికి పాదాలు) వెయ్యి పడగలతో అలరారే అనంతుడు (ఆదిశేషుడు) ఆ రథానికి అథోబంధనం. దిక్కులూ ఉపదిక్కులూ తక్కిన బంధనపాశాలు – (కట్టుతాళ్ళు.) (పాశాః – పాదాః అని రెండు పాఠాలు కనబడుతున్నాయి).

పుష్కరాద్యాః పతాకాశ్చ సౌవర్ణా రత్నభూషితాః ।
సముద్రాస్తస్య చత్వారో రథకంబళినః స్మృతాః ॥19॥

గంగాద్యాస్సరితః శ్రేష్ఠాః సర్వాభరణభూషితాః ।
చామరాసక్తహస్తాగ్రాస్సర్వాః స్త్రీరూపశోభితాః ॥20॥

తత్ర తత్ర కృతస్థానాః శోభయాం చక్రిరే రథమ్ ।
ఆవహాద్యాస్తథా సప్త సోపానం హైమముత్తమమ్ ॥21॥

పుష్కరాది సకలతీర్థాలూ ఆ రథం మీద ఎగురుతున్న రత్నాలంకృతసువర్ణపతాకాలు. నాలుగు సముద్రాలూ రథంలో పరిచిన కంబళీలు. గంగా పావననదీదేవతలు స్త్రీరూపధారిణులై సర్వాభరణభూషితలై అందరూ చామరాలు చేత బట్టుకుని రథంలో యోగ్యస్థానాలలో అక్కడక్కడా నిలబడి ఒక ప్రత్యేకశోభను చేకూర్చారు. ఆవహ – ప్రవహ –సంవహ – ఉద్వహ – వివహ – పరివహ – పరావహ అనే ఏడు దొంతులు వాయువులు ఆ రథానికి బంగారుమెట్లు.

లోకాలోకాచలస్తస్యోపసోపానస్సమంతః ।
విషమశ్చ తథా బాహ్యో మానసాదిస్తు శోభనః ॥22॥

పాశాస్సమంతతస్తస్య సర్వే వర్షాచలాః స్మృతాః ।
తలాస్తస్య రథస్యాఽథ సర్వే తలనివాసినః ॥23॥

సారథిర్భగవాన్ బ్రహ్మా దేవా రశ్మిధరాః స్మృతః ।
ప్రతోదో బ్రహ్మణస్తస్య ప్రణవో బ్రహ్మదైవతమ్ ॥24॥

వ్యాసమహర్షీ! లోకాలోకపర్వతశ్రేణి ఆ రథానికి ఇరువైపులా ఉపసోపానపరంపరగా నిలిచింది. మానసాది సరస్సులు రథానికి వెలుపల ఒకవైపున ఎగుడుదిగుడు మెట్లుగా అందంగా అమిరాయి. వర్షపర్వతం వింధ్యపర్వతం – ఇత్యాదులన్నీ రథానికి అన్నివైపులా బిగింపు గొలుసులయ్యాయి. తలలోకనివాసులంతా దానికి అధోభాగమయ్యారు. భగవంతుడైన బ్రహ్మదేవుడు పగ్గాలు పట్టిన సారథిగా నిలిచాడు. పరబ్రహ్మమే అధిదేవతగా అలరారే ప్రణవం (ఓంకారం) బ్రహ్మదేవుడి చేతిలో కమిచీ (కొరడా) అయ్యింది. దేవతలంతా పగ్గాలు పట్టిన వారయ్యారు.

అకారశ్చ మహచ్ఛత్రం మందరః పార్శ్వదండభాక్ ।
శైలేంద్రః కార్ముకం తస్య జ్యా భుజంగాధిపతిః స్వయమ్ ॥25॥

ఘంటా సరస్వతీదేవీ ధనుషః శ్రుతిరూపిణీ ।
ఇషుర్విష్ణుర్మహాతేజాస్త్వగ్నిః శల్యం ప్రకీర్తితమ్ ॥26॥

హయాస్తస్య తథా ప్రోక్తాశ్చత్వారో నిగమా మునే ।
జ్యోతీంషి భూషణం తేషామవశిష్టాన్యతః పరమ్ ॥27॥

అకారమే ఆ రథానికి పెద్ద వెల్లగొడుగు. మందరపర్వతం దానిలోపల పార్శ్వదండం (చేతి ఊతం) అయ్యింది. పర్వతేంద్రుడు మేరువు కార్ముక మయ్యింది. ఆదిశేషుడు దాని అల్లెత్రాడయ్యాడు. వేదస్వరూపిణి సరస్వతి ఆ ధనురగ్రాలలో చిరుగంటలుగా నిలిచింది. మహాతేజస్వి శ్రీహరి స్వయంగా బాణం అయ్యాడు. ప్రజ్వరిల్లే అగ్ని ఆ బాణానికి ములుకు అయ్యాడు. మహామునీ! చతుర్వేదాలు గుర్రాలుగా రూపొందాయి. జ్యోతిస్స్వరూపాలైన తక్కిన నక్షత్రాలూ, గ్రహాలూ ఆ గుర్రాలకు భూషణసముదాయం అయ్యాయి.

అనీకం విషసంభూతం వాయవో వాజకాః స్మృతాః ।
ఋషయో వ్యాసముఖ్యాశ్చ వాహవాహాస్తథాభవన్ ॥28॥

స్వల్పాక్షరైః సంబ్రవీమి కిం బహూక్త్యా మునీశ్వర ।
బ్రహ్మాండే చైవ యత్కించిద్వస్తు తద్వై రథే స్మృతమ్ ॥29॥

ఏవం సమ్యక్కృతస్తేన ధీమతా విశ్వకర్మణా ।
సరథాదిప్రకారో హి బ్రహ్మవిష్ణ్వ జ్ఞయా శుభః ॥30॥

నీటి నుంచి పుట్టిన జీవరాశి అంతా సైన్యమయ్యింది. వాయువులు వాజకులు అయ్యారు. వ్యాసాదిమహర్షులు అశ్వసంరక్షకులు (వాహవాహాః) అయ్యారు. వ్యాసమునీశ్వరా! వెయ్యిమాటలు ఎందుకుగానీ క్లుప్తంగా చెబుతాను విను. ఈ బ్రహ్మాండంలో ఈ సృష్టిలో ఉన్న ప్రతివస్తువూ ఆ రథంలో భాగమయ్యింది. ధీశాలి విశ్వకర్మ బ్రహ్మవిష్ణువుల ఆజ్ఞమేరకు ఇలా దివ్య రథంతో సహా సమస్త శుభ సాధన సంపత్తినీ చక్కగా అమర్చాడు.

విశేషం: విషసంభూతమ్ అంటే విషం నుంచి పుట్టిన అని కొందరు భావించారు. 'వాజకాః' అనేచోట 'వాదకాః' అని పాఠాంతరం కనిపిస్తోంది. వాదకాలంటే భేరీపటహాది యుద్ధవాద్యాలను మోగించేవారని. వాజక పదానికి చాలా అర్థాలున్నాయి. వాటిలో శక్తిసంపన్నులూ, పోరాడే పటిమకలవారూ అనే అర్థాలు ఈ సందర్భానికి కుదురుతున్నాయి. బాణాలకు వేగం కోసం అమర్చే పక్షి ఈకలు' అనే అర్థం కూడా ఈ పదానికి ఉంది. అది కూడా ఈ సందర్భానికి కుదిరేదే.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే రథాదియుద్ధ ప్రకారవర్ణనం నామాష్టమోఽధ్యాయః ॥8॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు రథాదియుద్ధ ప్రకారవర్ణనం అనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

⁂

నవమోఽధ్యాయః – తొమ్మిదవ అధ్యాయం

శివయాత్రావర్ణనమ్ – శివయాత్రావర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఈదృగ్విధం మహాదివ్యం నానాశ్చర్యమయం రథమ్ ।
సన్నహ్య నిగమానశ్వాన్ తం బ్రహ్మా ప్రార్పయత్ శివమ్ ॥1॥

శంభవేఽసౌ నివేద్యాధిరోపయామాస శూలినమ్ ।
బహుశః ప్రార్థ్య దేవేశం విష్ణ్వాదిసురసమ్మతమ్ ॥2॥

తతస్తస్మిన్ రథే దివ్యే రథప్రాకరసంయుతే ।
సర్వదేవమయః శంభుః ఆరురోహ మహాప్రభుః ॥3॥

ఋషిభిస్తూయమానశ్చ దేవగంధర్వపన్నగైః ।
విష్ణునా బ్రహ్మణా చాపి లోకపాలైర్బభూవ హ ॥4॥

ఉపావృతశ్చాప్సరసాం గణైర్గీతవిశారదైః ।
శుశుభే వరదశ్శంభుస్స తం ప్రేక్ష్య చ సారథిమ్ ॥5॥

వ్యాసమహర్షీ! ఇలాంటి ఆశ్చర్యకరమైన ఒక మహాదివ్యరథాన్ని సన్నద్ధం చేసి దానికి వేదాలను అశ్వాలుగా పూన్చి బ్రహ్మదేవుడు శివుడికి అర్పించాడు. విన్నవించి త్రిశూలిని దానిపై అధిరోహింపజేశాడు. ప్రాకార సంయుతమైన ఆ దివ్యరథాన్ని అధిరోహించమని విష్ణ్వాదుల సమ్మతితో ఎంతగానో బతిమాలి శివుణ్ని అంగీకరింపజేశాడు. సర్వదేవమయుడు మహాప్రభువు శంభువు దాన్ని ఆరోహించాడు. ఋషులూ, దేవతలూ, గంధర్వులూ, బ్రహ్మవిష్ణువులూ, లోకపాలకులూ బహుధా స్తుతించారు. సంగీతవిశారదులైన అప్సరసలు గుమికూడారు. సారథినీ (బ్రహ్మను), ఆ దివ్యరథాన్ని చూసి వరదుడు శివుడు ఆనందసంశోభితుడయ్యాడు.

తస్మిన్నారోహతి రథం కల్పితం లోకసంభృతమ్ ।
శిరోభిః పతితా భూమౌ తురంగా వేదసంభవాః ॥6॥

చచాల వసుధా చేలుస్సకలాశ్చ మహీధరాః ।
చకంపే సహసా శేషోఽసోఢా తద్భారమాతురః ॥7॥

అథాథః స రథస్యాస్య భగవాన్ ధరణీధరః ।
వృషేంద్రరూపీ చోత్థాయ స్థాపయామాస వై క్షణమ్ ॥8॥

క్షణాంతరే వృషేంద్రోఽపి జానుభ్యామగమద్ధరామ్ ।
రథారూఢమహేశస్య సుతేజస్సోఢుమక్షమః ॥9॥

బ్రహ్మాండసంభృతంగా విశ్వకర్మ కల్పించిన ఆ రథాన్ని శివుడు ఆరోహిస్తుండగా చతుర్వేదమయాలైన దాని గుర్రాలు తలలు వాల్చి చదికిల బడ్డాయి. మహాదేవుడి భారాన్ని మొయ్యలేక భూమి కంపించింది, కొండలు అల్లల్లాడాయి. ఆదిశేషుడు సైతం గడగడలాడాడు. కానీ వెంటనే తేరుకుని భూభారవహుడైన ఆ శేషుడు మహావృషభరూపం ధరించి ఆ దివ్యరథాన్ని పైకి లేపి నిలబెట్టాడు. మరుక్షణంలో అతడు సైతం రథం మీది శివుడి మహాశక్తిని మొయ్యలేక కాళ్ళు మడతబడి చదికిలబడ్డాడు.

అభీషుహస్తో భగవాన్ ఉద్యమ్య చ హయాంస్తదా ।
స్థాపయామాస దేవస్య వచనాద్వై రథం వరమ్ ॥10॥

తతోఽసౌ చోదయామాస మనోమారుతరంహసః ।
బ్రహ్మా హయాన్వేదమయాన్నద్ధాన్రథవరే స్థితః ॥11॥

పురాణ్యుద్దిశ్య వై త్రీణి తేషాం ఖస్థాని తాని హి ।
అధిష్ఠితే మహేశే తు దానవానాం తరస్వినామ్ ॥12॥

అప్పుడు సారథిగా కూర్చుని కమిచీపట్టుకున్న బ్రహ్మదేవుడు శివుడి ఆనతిపై ఆ గుర్రాలను నిలబెట్టాడు, రథమూ నిలబడింది. అవి మనోవేగ, వాయువేగాలున్న గుర్రాలు. వేదమయాలు. దివ్యరథాన్ని పూన్చిన హయవరాలు. వాటిని కదిలించాడు బ్రహ్మదేవుడు. మహావేగవంతులైన దానవుల త్రిపురాలవైపు – ఆకాశంలో సంచరించే ఆ త్రిపురాలవైపు – మహేశుడు అధిష్ఠించిన ఆ దివ్యరథం బ్రహ్మచోదితమై కదిలింది.

అథాహ భగవాన్ రుద్రో దేవానాలోక్య శంకరః ।
పశూనామాధిపత్యం మే దద్ధ్వం హన్మి తతోఽసురాన్ ॥13॥

పృథక్ పశుత్వం దేవానాం తథాన్యేషాం సురోత్తమాః ।
కల్పయిత్వైవ వధ్యాస్తే నాన్యథా దైత్యసత్తమాః ॥14॥

అప్పుడు రథారూఢుడైన ఆ రుద్రుడు ఆ శంకరుడు – దేవతలవైపు చూస్తూ ఇలా అన్నాడు. సురోత్తములారా! నాకు పశుపతిత్వాన్ని ఇవ్వండి. అప్పుడే ఆ దైత్యులను సంహరిస్తాను. దేవతలకూ తదితరులైన మానవాదులకూ విడివిడిగా పశుత్వాన్ని కల్పిస్తేనే తప్ప ఆ దైత్యసత్తముల్ని వధించడం సాధ్యం కాదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇతి శ్రుత్వా వచస్తస్య దేవదేవస్య ధీమతః ।
విషాదమగమన్సర్వే పశుత్వం ప్రతి శంకితాః ॥15॥

తేషాం భావమథ జ్ఞాత్వా దేవదేవోఽంబికాపతిః ।
విహస్య కృపయా దేవాన్ శంభుస్తానిదమబ్రవీత్ ॥16॥

ధీశాలియైన దేవదేవుడి ఈ మాటను వినడంతోనే దేవతలను విషాదం ఆవరించింది. తాము పశుత్వం స్వీకరించడమేమిటని చిన్నబుచ్చుకున్నారు. వారి భావాన్ని గ్రహించి అంబికాపతి పెద్దగా నవ్వి తానే దయతో ఇలా వివరించాడు.

శంభురువాచ – శంభుడు అన్నాడు.

మా వోఽస్తు పశుభావేఽపి పాతో విబుధసత్తమాః ।
శ్రూయతాం పశుభావస్య విమోక్షః క్రియతాం చ సః ॥17॥

యో వై పాశుపతం దివ్యం చరిష్యతి స మోక్ష్యతి ।
పశుత్వాదితి సత్యం వః ప్రతిజ్ఞాతం సమాహితః ॥18॥

యే చాప్యన్యే కరిష్యన్తి వ్రతం పాశుపతం మమ ।
మోక్ష్యన్తి తే న సందేహః పశుత్వాత్సురసత్తమాః ॥19॥

నైష్ఠికం ద్వాదశాబ్దం వా తదర్ధం వర్షకత్రయమ్ ।
శుశ్రూషాం కారయేద్యస్తు స పశుత్వాద్విముచ్యతే ॥20॥

తస్మాత్పరమిదం దివ్యం చరిష్యథ సురోత్తమాః ।
పశుత్వాన్మోక్ష్యథ తదా యూయమత్ర న సంశయః ॥21॥

విబుధసత్తములారా! పశుత్వం స్వీకరించినందువల్ల మీరేమీ పతనమైపోరు. వినండి. దాని నుంచి విముక్తి నేనే కల్గిస్తాను. దివ్యమైన పాశుపతదీక్ష ఇది. దీన్ని ఆచరించినవాడు పశుత్వం నుంచి విముక్తుడవుతాడు. ఇది నా ప్రతిజ్ఞ. సమాహితచిత్తులై ఆలకించండి. మీరే కాదు మరెవ్వరైనా సరే ఈ నా దివ్యమైన పాశుపతవ్రతాన్ని ఆచరిస్తే చాలు వారంతా పశుత్వం నుంచి ముక్తి పొందుతారు. సందేహం లేదు. సురోత్తములారా! నిష్ఠగా పన్నెండేళ్ళు లేదా అందులో సగం – ఆరేళ్ళు లేదా అందులో సగం – మూడేళ్ళు ఈ పాశుపతశుశ్రూష చెయ్యాలి. పశుత్వం నుంచి విముక్తి లభించితీరుతుంది. అంచేత – ఉత్తమోత్తమమూ దివ్యమూ అయిన ఈ వ్రతాన్ని స్వీకరించండి. మిమ్మల్ని విముక్తుల్ని నేను చేస్తాను. ఇందులో ఏ సంశయమూ లేదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య మహేశస్య పరాత్మనః ।
తథేతి చాబ్రువన్ దేవా హరిబ్రహ్మాదయస్తథా ॥22॥

తస్మాద్వై పశవస్సర్వే దేవాసురవరాః ప్రభోః ।
రుద్రః పశుపతిశ్చైవ పశుపాశవిమోచకః ॥23॥

తదా పశుపతీత్యేతత్ తస్య నామ మహేశితుః ।
ప్రసిద్ధమభవద్వధ్వా సర్వలోకేషు శర్మదమ్ ॥24॥

పరమాత్ముడా! మహేశ్వరుడు చెప్పిన ఈ మాటలు విని హరిబ్రహ్మదేవతలు అందరూ సరే అని సమ్మతించారు. అప్పటినుంచీ దేవాసురులందరూ ప్రభువుకి పశువులు అయ్యారు. రుద్రుడు పశుపాశ విమోచకుడైన పశుపతి అయ్యాడు. అందుకని మహేశుడికి పశుపతి అనే పేరు సర్వలోకాలలోనూ ఆనందప్రదంగా ప్రసిద్ధమయ్యింది.

ముదా జయేతి భాషంతస్సర్వే దేవర్షయస్తదా ।
అముదంశ్చాతి దేవేశో బ్రహ్మా విష్ణుః పరేఽపి చ ॥25॥

తస్మింశ్చ సమయే యచ్చరూపం తస్య మహాత్మనః ।
జాతం తద్వర్ణితుం శక్యం న హి వర్షశతైరపి ॥26॥

ఏవం విధో మహేశానో మహేశాన్యఖిలేశ్వరః ।
జగామ త్రిపురం హంతుం సర్వేషాం సుఖదాయకః ॥27॥

వ్యాసమహర్షీ! అప్పుడు దేవతలూ ఋషులూ అంతా జయజయధ్వానాలు చేశారు. దేవేశుడు శివుడూ బ్రహ్మదేవుడూ విష్ణువూ తక్కిన ఇంద్రాదిలోకపాలకులూ ఎంతో ఆనందించారు. అప్పటి మహేశుడి రూపాన్ని వర్ణించడం ఎవ్వరి తరమూ కాదు, వందల సంవత్సరాలకైనా పూర్తికాదు. అంతటి ఉత్సాహంతో ఆనందంతో శివుడు అఖిలేశ్వరుడు సమస్తప్రాణికోటికీ సుఖదాయకుడూ ఆ శివుడు త్రిపురసంహారానికి బయలుదేరాడు.

తం దేవదేవం త్రిపురం నిహన్తుం తదాను సర్వే తు రవిప్రకాశాః ।
గజైర్వాజైస్సింహవరై రథైశ్చ వృషైర్యయుస్తేఽమరరాజముఖ్యాః ॥28॥

హలైశ్చ శాలైర్ముసలైః ఋశుండైః గిరీంద్రకల్పైర్గిరిసన్నిభాశ్చ ।
నానాయుధైస్సంయుత బాహవస్తే తతో ను హృష్టాః ప్రయయుస్సురేశాః ॥29॥

నానాయుధాఢ్యాః పరమప్రకాశాః మహోత్సవశ్శంభుజయం వదంతః ।
యయుః పురస్తస్య మహేశ్వరస్య తథేంద్ర పద్మోద్భవ విష్ణుముఖ్యాః ॥30॥

త్రిపురసంహారానికి అలా బయలుదేరిన దేవదేవుని వెంట సూర్యసమతేజస్కులైన ఇంద్రాది దేవ ముఖ్యులందరూ ఏనుగుల మీదా, గుర్రాలమీదా, సింహాలమీదా, రథాలమీదా, వృషభాలమీదా బయలుదేరారు. హలాలు శాలలు ముసలాలు భుశుండాలు మొదలైన పర్వతాల్లాంటి ఆయుధాలు ధరించి పర్వతాకారులై వెంట నడిచారు. అనేకాయుధాలను చేతుల్లో ధరించి ఆనందోత్సాహాలతో నడిచారు. ధరించిన ఆయుధాలతో వెలిగిపోతున్నారు. ఒక మహోత్సవంగా – శివుడికి జయం జయం అని పలుకుతూ ఇంద్ర–బ్రహ్మ–విష్ణు ప్రభృతులు మహేశుడికి ముందు నడిచారు.

జహృషు ర్మునయస్సర్వే దండహస్తా జటాధరాః ।
వవృషుర్పుష్పవర్షాణి ఖేచరాస్సిద్ధచారణాః ॥31॥

పురత్రయం చ విప్రేంద్ర వ్రజన్సర్వే గణేశ్వరాః ।
తేషాం సంఖ్యాం చ కః కర్తుం సమర్థో వచ్మి కాంశ్చన ॥32॥

జటాధరులైన మునులందరూ తమ జపదండాలను పైకెత్తి ఆనందం ప్రకటించారు. ఆకాశచరులైన సిద్ధచారణజాతులవారు పుష్పవృష్టులు కురిపించారు. ఓ బ్రాహ్మణోత్తమా! వ్యాసమునీశ్వరా! త్రిపురాల మీదకు దండువెళ్ళిన గణాధ్యక్షుల సంఖ్యను లెక్కించి చెప్పడం ఎవడి వల్ల అవుతుంది! అయినా కొందరిని చెబుతానువిను.

గణేశ్వరర్దేవగణైశ్చ భృంగీ సమావృతస్సర్వగణేంద్రవర్యః ।
జగామ యోగిన్! త్రిపురం నిహంతుం విమానమారుహ్య యథా మహేంద్రః ॥33॥

యోగీ! వ్యాసమునీ! గణేశ్వరులతోనూ దేవగణాలతోనూ పరివేష్టితుడై గణేంద్రవర్యుడైన భృంగి త్రిపురసంహారం కోసమని ఒక దివ్యవిమానం అధిరోహించి మహేంద్రుడిలా బయలుదేరాడు.

కేశో విగతవాసశ్చ మహాకేశో మహాజ్వరః ।
సోమవల్లీ సవర్ణశ్చ సోమదస్సనకస్తథా ॥34॥

సోమధృక్ సూర్యవర్చాశ్చ సూర్యప్రేషణకస్తథా ।
సూర్యాక్షస్సూరినామా చ సురస్సుందర ఏవ చ ॥35॥

ప్రస్కందః కుందరశ్చండః కంపనశ్చాతికంపనః ।
ఇంద్రశ్చేంద్రజవశ్చైవ యంతా హిమకరస్తథా ॥36॥

శతాక్షశ్చైవ పంచాక్షః సహస్రాక్షో మహోదరః ।
సతీజహుశ్శతాస్యశ్చ రంకః కర్పూరపూతనః ॥37॥

కేశుడు విగతవాససుడు మహాకేశుడు మహాజ్వరుడు సోమవల్లీసవర్ణుడు సోమదుడు సనకుడు సోమధృక్కు సూర్యవర్చసుడు సూర్యప్రేషణకుడు సూర్యాక్షుడు సూరినామకుడు సురసుందరుడు ప్రస్కందుడు కుందరుడు చండుడు కంపనుడు అతికంపనుడు ఇంద్రుడు ఇంద్రజవనుడు యంతృడు హిమకరుడు శతాక్షుడు పంచాక్షుడు సహస్రాక్షుడు మహోదరుడు సతీజహుడు శతాస్యుడు రంకుడు కర్పూరపూతనుడు ఇంకా....

ద్విశిఖస్త్రిశిఖశ్చైవ తథాహంకారాకారకః ।
అజవక్త్రోఽష్టవక్త్రశ్చ హయవక్త్రోఽర్ధవక్త్రకః ॥38॥

ఇత్యాద్యా గణపా వీరా బహవోఽపరిమేయకాః ।
ప్రయయుః పరివార్యేశం లక్ష్యలక్షణవర్జితాః ॥39॥

సమావృత్య మహాదేవం తదాపుస్తే పినాకినమ్ ।
దగ్ధుం సమర్థా మనసా క్షణేన సచరాచరమ్ ॥40॥

ద్విశిఖుడు త్రిశిఖుడు అహంకారకారకుడు అజవక్త్రుడు అష్టవక్త్రుడు హయవక్త్రుడు అర్ధవక్త్రుడు – ఇత్యాదిగా గణవీరులు అపరిమేయులు ఈశుడి వెంట నడిచారు. వీరికి లక్ష్యలక్షణాలు ఏవీ వర్తించవు – శివుడు చెప్పింది చెయ్యడమే తప్ప. మహాదేవుణ్ణి ఆ పినాకపాణిని అన్ని వైపులా ఆవరించి నడిచారు. వీరిలో ప్రతిఒక్కరూ క్షణకాలంలో మనశ్శక్తితో ఈ చరాచరజగత్తునంతటినీ భస్మం చెయ్యగలిగిన సమర్థులు.

దగ్ధుం జగత్సర్వమిదం సమర్థాః కింత్వత్ర దగ్ధుం త్రిపురం పినాకీ ।
రథేన కించాత్ర శరేణ తస్య గణైశ్చ కిం దేవగణైశ్చ శంభోః ॥41॥

స ఏవ దగ్ధుం త్రిపురాణి తాని దేవద్విషాం వ్యాస పినాకపాణిః ।
స్వయం గతస్తత్ర గణైశ్చ సార్ధం నిజైస్సురాణామపి సోఽద్భుతోఽతి ॥42॥

వ్యాసర్షీ! జగత్తుని మొత్తం బూడిద చెయ్యడానికి సమర్థులు వీరొక్కక్కరూ! పురత్రయాన్ని భస్మీకరించడానికి ఇంక పినాకి ఎందుకు, దివ్యరథం ఎందుకు, దివ్యబాణం ఎందుకు, శివగణాలెందుకు, దేవగణాలెందుకు!! అయినా దేవశత్రువులైన ఆ దైత్యుల త్రిపురాలను దగ్ధం చెయ్యడానికి శివుడే స్వయంగా వెళ్ళడం, అదీ – నిజగణాలతో సురగణాలతో కలిసివెళ్ళడం – అద్భుతాలలో కెల్లా అత్యద్భుతం కదూ!!

కిం తత్ర కారణం చాన్యద్వచ్మి తే ఋషిసత్తమ ।
లోకేషు ఖ్యాపనార్థం వై యశః పరమలాపహమ్ ॥43॥

అన్యచ్చ కారణం హ్యేతద్దుష్టానాం ప్రత్యయాయ వై ।
సర్వేష్వపి చ దేవేషు యస్మాన్నాన్యో విశిష్యతే ॥44॥

ఋషిసత్తమా! వ్యాసా! మరి దీనికి కారణం ఏమిటి అంటే చెబుతాను విను. సర్వపాపపంకిలాలనూ తొలగించే తన పవిత్రయశస్సును లోకాలలో విఖ్యాతం చెయ్యడానికి. మరొక హేతువూ ఉంది. సకల దేవతలలోకీ శివుడే గొప్పవాడు, శివుణ్ణి మించినవాడు మరొకడు లేడు అని దుష్టులలో ఒక విశ్వాసం కలిగించడానికి. ఈ రెండు కారణాలుగా శివుడే స్వయంగా త్రిపురదాహానికి పూనుకున్నాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శివయాత్రావర్ణనం నామ నవమోఽధ్యాయః ॥9॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శివయాత్రావర్ణనం అనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

దశమోఽధ్యాయః – పదవ అధ్యాయం

త్రిపురదాహవర్ణనమ్ – త్రిపురదాహవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

అథ శంభుర్మహాదేవో రథస్థస్సర్వసంయుతః ।
త్రిపురం సకలం దగ్ధుముద్యతోఽభూత్సురద్విషామ్ ॥1॥

శీర్షం స్థానకమాస్థాయ సంధాయ చ శరోత్తమమ్ ।
సజ్జం తత్కార్ముకం కృత్వా ప్రత్యాలీఢం మహాద్భుతమ్ ॥2॥

నివేశ్య దృఢముష్టౌ చ దృష్టిం దృష్టౌ నివేశ్య చ ।
అతిష్ఠన్నిశ్చలస్తత్ర శతం వర్షసహస్రకమ్ ॥3॥

సర్వసన్నద్ధుడై మహాదేవుడైన శంభుడు దివ్యరథారూఢుడై దేవవిరోధులైన దైత్యత్రిపురాలను దగ్ధం చెయ్యడానికి ఉద్యుక్తుడయ్యాడు. రథం మీద శీర్షస్థానంలో నిలబడ్డాడు. దివ్యశరాన్ని తొడిగి దివ్యకార్ముకాన్ని ఎక్కుబెట్టి ఆ లీఢపాదుడై కుడికాలు ముందుకు చాచి నిలిచాడు. నారికి తొడిగిన బాణాన్ని పిడికిట గట్టిగా పట్టి దృష్టి నిలిపి ఒక లక్షసంవత్సరాలు నిశ్చలంగా లేచి నిలబడ్డాడు.

తతోఽంగుష్ఠే గణాధ్యక్షస్స తుదత్యనిశం స్థితః ।
న లక్ష్యం వివిశుస్తాని పురాణ్యస్య త్రిశూలినః ॥4॥

తతోఽంతరిక్షాదశృణోద్ధనుర్బాణధరో హరః ।
ముంజకేశో విరూపాక్షః వాచం పరమశోభనామ్ ॥5॥

గజాస్యుడు గణపతి ఆ (దైత్యారి) శంకరుడి బొటనవేలిమీద నిరంతరంగా నిలిచి పీడిస్తూ ఉండేవాడు. కనకనే – ఆ త్రిపురాలు త్రిశూలికి దృష్టిగోచరాలు కాలేదు. అప్పుడు ఆకాశవాణి వినిపించింది. ధనుర్బాణాలు చేతబట్టి నిల్చున్న శంకరుడు ముంజకేశుడు ఆ ముక్కంటి పరమశోభనమైన ఆ వాక్కు విన్నాడు.

భో భో న యావద్భగవన్నర్చితోఽసౌ వినాయకః ।
పురాణి జగదీశేశ సాంప్రతం న హనిష్యసి ॥6॥

ఓ జగదీశ్వరేశ్వరా! వినాయకుణ్ణి పూజించకుండా నువ్విప్పుడు ఈ త్రిపురాలను నాశనం చెయ్యలేవు.

ఏతచ్ఛ్రుత్వా తు వచనం గజవక్త్రమపూజయత్ ।
భద్రకాళీం సమాహూయ తతోఽంధకనిషూదనః ॥7॥

తస్మిన్సంపూజితే హర్షాత్పరితుష్టే పురస్సరే ।
వినాయకే తతో వ్యోమ్ని దదర్శ భగవాన్ హరః ॥8॥

పురాణి త్రీణి దైత్యానాం తారకాణాం మహాత్మనామ్ ।
యథాతథం హి యుక్తాని కేచిదిత్థం వదంతి హ ॥9॥

ఈ ఆకాశవాణిని విన్నాడు అంధకాసురసంహారి శంకరుడు. వెంటనే భద్రకాళిని ఆహ్వానించి గజవక్త్రుణ్ణి పూజించాడు. అప్పుడు వినాయకుడు సంతుష్టుడై ముందు నిలిచాడు. మహాదైత్యులైన తారకపుత్రుల త్రిపురాలు ఆకాశంలో శివుడికి దృష్టిగోచరాలయ్యాయి. ఉన్నవి ఉన్నట్టు కనిపించాయి. వ్యాసమహర్షీ! అయితే ఈ విషయంలో కొందరు ఇలా అంటున్నారు.

పరబ్రహ్మణి దేవేశే సర్వోపాస్యే మహేశ్వరే ।
అన్యప్రసాదతః కార్యసిద్ధిః ఘటతి నేతి హి ॥10॥

స స్వతంత్రః పరంబ్రహ్మ సగుణో నిర్గుణోఽపి వా ।
అలక్ష్యః సకలైః స్వామీ పరమాత్మా నిరంజనః ॥11॥

పంచదేవాత్మకః పంచదేవోపాస్యః పరః ప్రభుః ।
తస్యోపాస్యో న కోప్యస్తి స ఏవోపాస్య ఆలయమ్ ॥12॥

అథవా లీలయా తస్య సర్వం సంఘటతే మునే ।
చరితం దేవదేవస్య వరదాతుర్మహేశితుః ॥13॥

మహేశ్వరుడంటే పరబ్రహ్మ. దేవదేవేశ్వరుడు. సర్వోపాస్యుడు. ఇంతటి మహానుభావుడికి మరొకరి అనుగ్రహంతో కార్యసిద్ధి అనేది కుదరదు. ఆయన స్వతంత్రుడు. పరం – బ్రహ్మం. సగుణుడైనా (సాకారుడైన) నిర్గుణుడైనా (నిరాకరుడైనా) ఎల్లరకూ కానరానివాడు. అందరికీ తానే ప్రభువు. పరమాత్మ. నిరంజనుడు. పంచదేవాత్మకుడు. పంచదేవోపాస్యుడు. (బ్రహ్మ – రుద్ర – విష్ణు – ఈశాన – సదాశివులు పంచదేవులని ఒక మతం. త్రిమూర్తులూ స్కందుడూ ఇంద్రుడు అని మరొక మతం. సూర్య – గణేశ – దుర్గా – రుద్ర – విష్ణువులని ఇంకొక మతం) పరాత్పరుడు. జగత్ప్రభువు. ఆయనకి ఒక ఉపాస్యుడనేవాడే లేడు. ఆయనే అందరికీ మహాప్రళయందాకా ఉపాస్యుడు. వ్యాసమునీ! అసలీ జగత్తులో జరిగేది సమస్తమూ ఆయన లీలావిశేషమే. వరదుడూ మహేశుడూ అయిన ఆ దేవదేవుడి చరితమే అంతా.

తస్మిన్ స్థితే మహాదేవే పూజయిత్వా గణాధిపమ్ ।
పురాణి తత్ర కాలేన జగ్మురేకత్వమాశు వై ॥14॥

ఏకీభావం మునే తత్ర త్రిపురే సముపాగతే ।
బభూవ తుములో హర్షో దేవాదీనాం మహాత్మనామ్ ॥15॥

సరే – మహాదేవుడు గణాధిపతిని పూజించి నిలిచేసరికి – కాలవశాన ఆ త్రిపురాలు వేగంగా ఏకత్వం పొందాయి. వేరువేరుగా ఆకాశంలో ఎగిరే దైత్యపురాలు ఇలా ఒక్కటై దృష్టిగోచరమయ్యే సరికి దేవతలలో ఋషులలో ఆనందం వెల్లివిరిసింది.

తతో దేవగణాస్సర్వే సిద్ధాశ్చ పరమర్షయః ।
జయేతి వాచో ముముచుః స్తువంతశ్చాష్టమూర్తినమ్ ॥16॥

అథాహేతి తతో బ్రహ్మా విష్ణుశ్చ జగతాం పతిః ।
సమయోఽపి సమాయాతో దైత్యానాం వధకర్మణః ॥17॥

తేషాం తారకపుత్రాణాం త్రిపురాణాం మహేశ్వర ।
దేవకార్యం కురు విభో ఏకత్వమపి చాగతమ్ ॥18॥

యావన్నయాంతి దేవేశ విప్రయోగం పురాణి వై ।
తావద్బాణం విముంచశ్చ త్రిపురం భస్మసాత్కురు ॥19॥

అంతట – దేవగణాలూ శివగణాలూ సిద్ధులూ పరమర్షులూ జయజయధ్వానాలు చేస్తూ అష్టమూర్తి శివుణి స్తుతించారు. (పంచభూతాలు సూర్యచంద్రులూ యజమానుడూ – ఇవి శివుడి అష్టమూర్తులు). అంతలోకీ బ్రహ్మవిష్ణుదేవులన్నారు గదా – మహేశ్వరా! తారకపుత్రులను సంహరించడానికీ ఆ దైత్యుల త్రిపురాలను భస్మం చెయ్యడానికీ సమయం ఆసన్నమయ్యింది. దేవకార్యాన్ని నిర్వహించు. వేరు వేరుగా ఉండే త్రిపురాలు ఇప్పుడు ఒక్కటి అయ్యాయి. దేవేశా! అవి మళ్ళీ విడిపోకముందే దివ్యబాణం ప్రయోగించు, భస్మం చెయ్యి.

అథ సజ్యం ధనుః కృత్వా శర్వస్సంధాయ తం శరమ్ ।
పూజ్యం పాశుపతాస్త్రం స త్రిపురం సమచింతయత్ ॥20॥

అథ దేవో మహాదేవో వరలీలావిశారదః ।
కేనాపి కారణేనాత్ర సావజ్ఞం తదవైక్షత ॥21॥

బ్రహ్మాదుల అభ్యర్థనతో శర్వుడు ధనుస్సుకి నారిని బంధించి శరాన్ని సంధించి, ఒక్కసారి త్రిపురాన్ని గురించి ఆలోచించాడు. పరమపూజ్యమైన పాశుపతాస్త్రాన్ని ప్రయోగించాడు. ఊహకందని ఉత్తమలీలలలో విశారదుడు ఆ మహాదేవుడు. కారణమేమో తెలియదుగానీ ఆ క్షణాన తాను చేస్తున్నపనిని చిన్నతనంగా భావించాడు ఆ దేవదేవుడు.

పురత్రయం విరూపాక్షః కర్తుం తద్భస్మసాత్ క్షణాత్ ।
సమర్థః పరమేశాన జానాతు చ సతాం గతిః ॥22॥

దగ్ధుం సమర్థో దేవేశ వీక్షణేన జగత్త్రయమ్ ।
అస్మద్యశో వివృద్ధ్యర్థం శరం మోక్తుమిహార్హసి ॥23॥

వ్యాసమునీ! అదే సమయంలో బ్రహ్మాదిదేవతలందరూ ముక్తకంఠంగా శివుణ్ణి ఇలా అభ్యర్థించారు – విరూపాక్షా! పరమేశానా! పురత్రయాన్ని క్షణంలో భస్మం చెయ్యగల సమర్థుడివి. అది చేసి సత్పురుషులకు గతి కల్పింతువుగాక! నువ్వసలు కంటిచూపుతోనే జగత్త్రయాన్ని భస్మీపటలం చెయ్యగలవు, అయినా మా యశస్సును పెంపొందించడం కోసం దయచేసి ఈ దివ్యబాణాన్ని ప్రయోగించు.

ఇతి స్తుతోఽమరైస్సర్వైర్విష్ణ్వాది విధిభిస్తదా ।
దగ్ధుం పురత్రయం తద్వై బాణేనైచ్ఛన్మహేశ్వరః ॥24॥

అభిలాఖ్యముహూర్తే తు వికృష్య ధనురద్భుతమ్ ।
కృత్వా జ్యాతలనిర్ఘోషం నాదమత్యంతదుస్సహమ్ ॥25॥

ఆత్మనో నామ విశ్రావ్య సమాభాష్య మహాసురాన్ ।
మార్తండకోటివపుషం కాండముగ్రో ముమోచ హ ॥26॥

బ్రహ్మదేవుడూ విష్ణుమూర్తీ ఇంకా తక్కిన అమరులందరూ ఇలా విన్నవించే సరికి మహేశ్వరుడు తన దివ్యబాణంతో పురత్రయాన్ని దహించివెయ్యడానికి ఇష్టపడ్డాడు. అది సరిగ్గా అభిల (అభిజిత్) ముహూర్తం. ధనుస్సును నిండా ఎక్కుపెట్టాడు. అల్లెత్రాడును మ్రోగించాడు. దుర్భరమైన నాదం ఉప్పతిల్లింది. నేను, మహేశ్వరుణ్ణి, మిమ్మల్ని సంహరిస్తున్నాను అంటూ ఆ దైత్యులకు వినపడేలాగా నినదించి కోటిసూర్యకాంతులతో ప్రకాశిస్తున్న దివ్యబాణాన్ని ఆ ఉగ్రుడు వారిపై ప్రయోగించాడు.

దదాహ త్రిపురస్థాంస్తాన్ దైత్యాంస్త్రీన్విమలాపహః ।
స అశుగో విష్ణుమయో వహ్నిశల్యో మహోజ్వలన్ ॥27॥

తతః పురాణి దగ్ధాని చతుర్జలధిమేఖలామ్ ।
గతాని యుగపద్భూమిం త్రీణి దగ్ధాని భస్మశః ॥28॥

దైత్యాస్తు శతశో దగ్ధాస్తస్య బాణస్థ వహ్నినా ।
హాహాకారం ప్రకుర్వంతశ్శివపూజావ్యతిక్రమాత్ ॥29॥

విష్ణుమయమైన ఆ బాణం, పాపాలను కాల్చివేసే ఆ బాణం అగ్గిములికితో మంటలు విరజిమ్ముకుంటూ వేగంగా వెళ్ళి త్రిపురాలలో ఉన్న దైత్యులను ముగ్గురినీ దహించివేసింది. క్షణంలో త్రిపురాలు బూడిదకుప్పలై చతుస్సముద్రాలే మేఖలగా అలరారుతున్న భూమిమీదకి ఒక్కసారిగా కూలిపోయాయి. శివపూజను ఉల్లంఘించిన పాపానికి వందల కొలది దైత్యులు హాహాకారాలు చేస్తూ ఆ బాణాగ్నిచే కాలి బూడిదైపోయారు.

తారకాక్షస్తు నిర్దగ్ధో భ్రాతృభ్యాం సహితోఽభవత్ ।
సస్మార స్వప్రభుం దేవం శంకరం భక్తవత్సలమ్ ॥30॥

భక్త్యా పరమయా యుక్తః ప్రలపన్ వివిధా గిరః ।
మహాదేవం సముద్వీక్ష్య మనసా తముమాచ సః ॥31॥

తారకాక్షుడు తన సోదరులిద్దరితోనూ నిర్దగ్ధుడై భక్తవత్సలుడు తన ప్రభువునైన శంకరుని స్మరించుకున్నాడు. మహాదేవుణ్ణి అంతరంగంలో దర్శిస్తూ పరమభక్తితో ఇలా పలికాడు.

తారకాక్ష ఉవాచ – తారకాక్షుడు పలికాడు.

భవ జ్ఞాతోఽసి తుష్టోఽసి యద్యస్మాన్ సహ బంధుభిః ।
తేన సత్యేన భూయోఽపి కదా త్వం ప్రదహిష్యసి ॥32॥

దుర్లభం లబ్ధమస్మాభిర్యదప్రాప్యం సురాసురైః ।
త్వద్భావభావితాబుద్ధిర్జాతే జాతే భవత్వితి ॥33॥

ఇత్యేవం విబ్రువంతస్తే దానవాస్తేన వహ్నినా ।
శివాజ్ఞయాద్భుతం దగ్ధా భస్మసాదభవన్మునే ॥34॥

ఓ భవా! ఓ శివా! ఇప్పటికి నిన్ను అర్థం చేసుకున్నాం. నువ్వు సంతుష్టుడివయ్యావు. సత్యమైన ఈ కారణంగా మమ్మల్నీ మా బంధువుల్నీ మళ్ళీ ఎప్పుడు దహిస్తావో గదా! సురాసురులకు అప్రాప్యమూ దుర్లభమూ అయిన మహాభాగ్యం (నీ చేతితో మరణించడం) మాకు దక్కింది. జన్మజన్మలకూ నీ ఉనికిని నిరంతరం భావించే బుద్ధి మాకు కలుగుగాక! – ఇలా పలుకుతూ ఆ దానవవీరులు, వ్యాసమునీంద్రా! శివాజ్ఞ ప్రకారం బాణాగ్నిలో దగ్ధులై బూడిదకుప్పలయ్యారు.

అన్యేఽపి బాలా వృద్ధాశ్చ దానవాస్తేన వహ్నినా ।
శివాజ్ఞయా ద్రుతం వ్యాస! నిర్దగ్ధాః భస్మసాత్కృతాః ॥35॥

స్త్రియో వా పురుషా వాపి వాహనాని చ తత్ర యే ।
సర్వే తేనాగ్నినా దగ్ధాః కల్పాంతే తు జగద్యథా ॥36॥

భర్తౄన్ కంఠగతాన్ హిత్వా కాశ్చిద్దగ్ధా వరస్త్రియః ।
కాశ్చిత్సుప్తాః ప్రమత్తాశ్చ రతిశ్రాంతాశ్చ యోషితః ॥
అర్ధదగ్ధా విబుద్ధాశ్చ బభ్రముర్మోహమూర్ఛితాః ॥37॥

వ్యాసమునీంద్రా! తారకాక్షాదులే కాక తక్కిన దానవులు కూడా బాలురూ వృద్ధులూ అందరూ బాణాగ్నిలో కాలి బూడిద అయ్యారు – ఇది శివాజ్ఞ. ఆ త్రిపురాలలో ఉన్న స్త్రీలూ పురుషులూ వాహనాలూ సమస్తమూ – ప్రళయకాలాగ్నిలో జగత్తులాగా దగ్ధమైపోయాయి. వరాంగనలు కౌగిట్లో ఉన్న భర్తలను విడిచి కాలిపోయారు. కొందరు నిద్రలోనే దహనమైపోయారు. కొందరు ప్రమత్తులై కొందరు రతిశ్రాంతులై కాలిపోయారు. సగం కాలి నిద్రలేచి మోహమూర్ఛితులై గంతులు వేస్తూ బూడిదైపోయినవారు మరికొందరు.

తేన నాసీత్సుసూక్ష్మోఽపి ఘోరత్రిపురవహ్నినా ॥38॥

అవిదగ్ధో వినిర్ముక్తః స్థావరో జంగమోఽపి వా ।
వర్జయితా మయం దైత్యం విశ్వకర్మాణమవ్యయమ్ ॥39॥

అవిరుద్ధం తు దేవానాం రక్షితం శంభుతేజసా ।
విపత్కాలేఽపి సద్భక్తం మహేశశరణాగతమ్ ॥40॥

సన్నిపాతో హి యేషాం నో విద్యతే నాశకారకః ।
దైత్యానామన్యసత్త్వానాం భావాభావే కృతాకృతే ॥41॥

వ్యాసమహర్షీ! ఘోరమైన ఆ త్రిపురాగ్నిలో కాలి బూడిదకానిదంటూ స్థావర జంగమాల్లో ఏ చిన్నపాటిదీ మిగలలేదు – ఒక్క విశ్వకర్మ మయుడు తప్ప. అతడు దైత్యుడే అయినా దేవతలతో శత్రుత్వం లేనివాడు కనక శంభుతేజస్సుతో రక్షితుడయ్యాడు. మహేశ్వరశరణాగతుడైన సద్భక్తుడికి విపత్కాలంలో కూడా వినాశం ఉండదు. వినాశకారకాలు అతడి జోలికి పోవు. వారు దైత్యులే కానీ ఇతరప్రాణులే కానీ చెయ్యవలసినది చెయ్యాలి, చేయకూడనిది మానాలి.

తస్మాద్యత్నస్సుసంభావ్యస్సద్భిః కర్తవ్య ఏవ హి ।
గర్హణాత్ క్షీయతే లోకో న తత్కర్మ సమాచరేత్ ॥42॥

న సంయోగో యథా తేషాం భూయాత్ త్రిపురవాసినామ్ ।
మతమేతద్ధి సర్వేషాం దైవాద్యది యతో భవేత్ ॥43॥

యే పూజయంతస్తత్రాపి దైత్యా రుద్రం సబాంధవాః ।
గాణపత్యం యయుస్సర్వే శివపూజావిధేర్బలాత్ ॥44॥

అందుచేత సజ్జనులు సత్కర్మలనే ప్రయత్నపూర్వకంగా ఆచరించడం మంచిది. నింద్యకర్మలు చేస్తే లోకులు వినాశం చెందుతారు. త్రిపురవాసులకు పట్టిన దుర్గతి మరింకెవ్వరికీ కలుగకుండుగాక! ఎవరికైనా దుర్దైవవశాన అది జరిగితే జరుగుగాక! సరే ఆ త్రిపురాలలో రుద్రార్చన చేస్తూ కాలంగడిపిన దైత్యులందరూ బంధుమిత్రులతో సహా గాణపత్యస్థితిని పొందారు. శివుడికి చేసిన పూజావిధుల బలం అంతటిది కనక.

ఇతి శ్రీశివపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే త్రిపురదాహవర్ణనం నామ దశమోఽధ్యాయః ॥10॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు త్రిపురదాహ వర్ణనం అనే పదవ అధ్యాయం సమాప్తం.

ఏకాదశోఽధ్యాయః – పదకొండవ అధ్యాయం

దేవస్తుతి వర్ణనమ్ – దేవస్తుతి వర్ణన

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

బ్రహ్మపుత్ర మహాప్రాజ్ఞ ధన్యస్త్వం శైవసత్తమ ।
కిమకార్షుస్తతో దేవా దగ్ధే చ త్రిపురేఽఖిలాః ॥1॥

మయః కుత్ర గతోఽదగ్ధో పతయః కుత్ర తే గతాః ।
తత్సర్వం మే సమాచక్ష్వ యది శంభుకథాశ్రయమ్ ॥2॥

బ్రహ్మపుత్రా! సనత్కుమారా! మహాప్రాజ్ఞా! శైవసత్తమా! నువ్వు ధన్యుడివి. త్రిపురాలు దగ్ధమయ్యాక దేవతలందరూ ఏమి చేశారు? దగ్ధుడు కాకుండా మిగిలిన మయుడు ఎక్కడికి వెళ్ళాడు? దేవతాపతులు ఎక్కడికి వెళ్ళారు. శంభుని కథకు సంబంధించిన ఈ సమస్తాన్నీ దయచేసి నాకు తెలియజెప్పు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వ్యాసవాక్యం భగవాన్ భవకృత్సుతః ।
సనత్కుమారః ప్రోవాచ శివపాదయుగం స్మరన్ ॥3॥

వ్యాసుడు ఇలా అడుగగా బ్రహ్మపుత్రుడు భగవాన్ సనత్కుమారుడు శివుడి పాదపద్మాలను స్మరించి ఇలా పలికాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాస మహాబుద్ధే పారాశర్య మహేశితుః ।
చరితం సర్వపాపఘ్నం లోకలీలానుసారిణః ॥4॥

మహేశ్వరేణ సర్వస్మిన్ త్రిపురే దైత్యసంకులే ।
దగ్ధే విశేషతస్తత్ర విస్మితాస్తేఽభవన్ సురాః ॥5॥

న కించిదబ్రువన్ దేవాః సేంద్రోపేంద్రాదయస్తదా ।
మహాతేజస్వినం రుద్రం సర్వే వీక్ష్య ససంభ్రమాః ॥6॥

పరాశరుడి పుత్రుడా! బుద్ధిమంతుడా! వ్యాసమునీశ్వరుడా! లౌకికధర్మాలను అనుసరించిన మహాశివుడి చరితం పరమపావనం. సమస్తపాపాలనూ తొలగిస్తుంది. నువ్వడిగిన మిగతా కథ చెబుతాను, విను. దైత్యులతో క్రిక్కిరిసిన ఆ త్రిపురాలలో అన్నింటినీ మహేశ్వరుడు అలా దహించివెయ్యగానే దేవతలంతా ఆశ్చర్యచకితులయ్యారు. ఇంద్ర–ఉపేంద్ర–బ్రహ్మాదులుసైతం–మహాతేజస్వియైన రుద్రుణ్ణి చూస్తూ అలా నిశ్చేష్టులై నిలిచిపోయారే తప్ప నోరు విప్పలేకపోయారు, పెదవి కదపలేకపోయారు.

మహాభయంకరం రౌద్రం ప్రజ్వలంతం దిశో దశ ।
కోటిసూర్యప్రతీకాశం ప్రళయానలసన్నిభమ్ ॥7॥

భయాద్దేవం నిరీక్ష్యైవ దేవీం చ హిమవత్సుతామ్ ।
బిభ్యిరే నిఖిలా దేవప్రముఖాస్తస్థురానతాః ॥8॥

దృష్ట్వానీకం తదా భీతం దేవానామృషిపుంగవాః ।
న కించిదూచుస్సంతస్థుః ప్రణేముస్తే సమంతతః ॥9॥

మహేశ్వరుడు రౌద్రంగా ఉన్నాడు. మహాభయంకరంగా ఉన్నాడు. దశదిశలనూ ప్రజ్వలింపజేస్తున్నాడు. కోటిసూర్యబింబాలు ఒక్కసారిగా ఉదయించినట్టున్నాడు. ప్రళయకాలాగ్నిలాగా ఉన్నాడు. ఆ శివుణ్ణి, చెంతనే ఉన్న హిమవంతుని పుత్రికయైన పార్వతీదేవినీ చూసి దేవతలూ దేవప్రముఖులూ భయంతో వణికిపోయారు. శిరస్సులు వంచి వంగి అలా నిలిచిపోయారు. భయభ్రాంతమై నిలిచిన దేవసేననూ దేవతలనూ చూసి ఋషిపుంగవులు సైతం ఏమీ పలకలేక ఎక్కడివారక్కడే పరమేశ్వరుడికి నమస్కరిస్తూ నిలబడ్డారు.

అథ బ్రహ్మాపి సంభీతో దృష్ట్వా రూపం చ శాంకరమ్ ।
తుష్టావ తుష్టహృదయో దేవైస్సహ సమాహితః ॥10॥

విష్ణునా చ సభీతేన దేవదేవం భవం హరమ్ ।
త్రిపురారిం సగిరిజం భక్తాధీనం మహేశ్వరమ్ ॥11॥

పారాశర్యా! శంకరుడి ఆ రూపం చూసి బ్రహ్మదేవుడు కూడా భయపడ్డాడు. కానీ వెంటనే తేరుకున్నాడు. సంతుష్టహృదయుడై తక్కిన దేవతలతో కలిసి ఏకాగ్రచిత్తంతో పరమేశ్వరుణ్ణి స్తుతించాడు. విష్ణువు కూడా భయం నుంచి తేరుకుని ఆ దేవదేవుణ్ణి, ఆ భవుణ్ణి, ఆ హరుణ్ణి, ఆ త్రిపురారిని, ఆ గిరిజాసహితుణ్ణి, ఆ భక్తపరాధీనుణ్ణి, ఆ మహేశ్వరుణ్ణి – బ్రహ్మతో గొంతుకలిపి కీర్తించాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ స్తుతించాడు.

దేవదేవ మహాదేవ భక్తానుగ్రహకారక ।
ప్రసీద పరమేశాన సర్వదేవహితప్రద ॥12॥

ప్రసీద జగతాంనాథ ప్రసీదానందదాయక ।
ప్రసీద శంకర స్వామిన్ ప్రసీద పరమేశ్వర ॥13॥

ఓంకారాయ నమస్తుభ్యమాకారపరతారక ।
ప్రసీద సర్వదేవేశ త్రిపురఘ్న మహేశ్వర ॥14॥

దేవదేవా! మహాదేవా! భక్తానుగ్రహకారకా! పరమేశానా! సర్వదేవతలకూ హితం అనుగ్రహించేవాడా! జగత్తులకు నాథుడా! ఆనందదాయకా! శంకరా! స్వామీ! పరమేశ్వరా! కటాక్షించు. అనుగ్రహించు. ప్రసన్నుడివి

కమ్ము! ఓంకారస్వరూపా! నీకిదే వందనం. నీ ఆకారాన్ని తదేకంగా ధ్యానించేవారిని తరింపజేసేవాడా! సర్వదేవప్రభూ! త్రిపురసంహారకా! మహేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము.

నానావాచ్యాయ దేవాయ ప్రణతప్రియ శంకర ।
అగుణాయ నమస్తుభ్యం ప్రకృతేః పురుషాత్పర ॥15॥

నిర్వికారాయ నిత్యాయ నిత్యతృప్తాయ భాస్వతే ।
నిరంజనాయ దివ్యాయ త్రిగుణాయ నమోఽస్తు తే ॥16॥

సగుణాయ నమస్తుభ్యం స్వర్గేశాయ నమోఽస్తు తే ।
సదాశివాయ శాంతాయ మహేశాయ పినాకినే ॥17॥

సర్వజ్ఞాయ శరణ్యాయ సద్యోజాతాయ తే నమః ।
వామదేవాయ రుద్రాయ తదాష్యపురుషాయ చ ॥18॥

భాషల్లోని అన్ని పదాలూ నీకు వాచకాలే. దేవా! భక్తజనప్రియా (ప్రణతజనం)! శంకరా! గుణాతీతా! ప్రకృతి పురుషులకంటే అధికుడా, నిర్వికారుడా! నిత్యా! నిత్యతృప్తా! భాస్వంతుడా! నిరంజనా! దివ్యా! త్రిగుణస్వరూపా! నీకు నమస్సులు. సగుణాకారా! స్వర్గలోకేశ్వరా! సదాశివా! శాంతరూపా! మహేశా! పినాకపాణీ! నీకు నమస్కారం. సర్వజ్ఞా! శరణ్యా! సద్యోజాతా! నీకివే నమస్సులు. వామదేవా! రుద్రా! స్త్రీ – పుమాదిభేదాతీతా! నీకివే నమస్సులు.

అఘోరాయ సుసేవ్యాయ భక్తాధీనాయ తే నమః ।
ఈశానాయ వరేణ్యాయ భక్తానందప్రదాయినే ॥19॥

రక్ష రక్ష మహాదేవ భీతాన్నస్సకలామరాన్ ।
దగ్ధ్వా చ త్రిపురం సర్వే కృతార్థా అమరాః కృతాః ॥20॥

అఘోరా! సుసేవ్యా! భక్తాధీనా! ఈశానా! వరేణ్యా! (శ్రేష్ఠుడా అని) భక్తులకు ఆనందం పంచేవాడా! మహాదేవా! భయపడిపోతున్న మా దేవతలు అందరినీ రక్షించు! రక్షించు! నువ్విలా త్రిపురాలను దహించివెయ్యడంతో మేమందరం భయాన్ని పొందాము మా దేవతలూ అందరమూ కృతార్థులమయ్యాం. ఇది నీ దయ స్వామీ!

స్తుత్వై వం దేవతాస్సర్వా నమస్కారం పృథక్ పృథక్ ।
చక్రుస్తే పరమప్రీతా బ్రహ్మాద్యాస్తు సదాశివమ్ ॥21॥

అథ బ్రహ్మా స్వయం దేవం త్రిపురారిం మహేశ్వరమ్ ।
తుష్టావ ప్రణతో భూత్వా నతస్కంధః కృతాంజలిః ॥22॥

దేవతలందరూ ఇలా స్తుతించి ఎవరికి వారుగా నమస్కరించి బ్రహ్మాది ఆనందపరవశులయ్యారు. వీరితో గొంతుకలిపిన బ్రహ్మదేవుడు మళ్ళీ స్వయంగా ఆ సదాశివునికి త్రిపురారికి మహేశ్వరునికి నమస్కరించి మూపువంచి నిలబడి స్తుతించాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

భగవన్ దేవదేవేశ త్రిపురాంతక శంకర ।
త్వయి భక్తిః పరా మేఽస్తు మహాదేవానపాయినీ ॥23॥

సర్వదా మేఽస్తు సారథ్యం తవ దేవేశ శంకర ।
అనుకూలో భవ విభో సదా త్వం పరమేశ్వర ॥24॥

హే భగవన్! దేవదేవేశ్వరా! త్రిపురాంతకా! శంకరా! మహాదేవా! నీపట్ల నాకున్న భక్తి ఉత్తమోత్తమం. అది ఏనాడూ ఎడబాయనిది. శంకరా! నీ సారథ్యం నీ మార్గదర్శకత్వం నాకు ఎల్లప్పుడూ ఉండుగాక! పరమేశ్వరా! ప్రభూ! సదా మాకు ఇలాగే అనుకూలుడుగా ఉండుము.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి స్తుత్వా విధిశ్శంభుం భక్తవత్సలమానతః ।
విరరామ నతస్కంధః కృతాంజలిరుదారధీః ॥25॥

జనార్దనోఽపి భగవాన్ నమస్కృత్య మహేశ్వరమ్ ।
కృతాంజలిపుటో భూత్వా తుష్టావ చ మహేశ్వరమ్ ॥26॥

పూర్తిగా వంగినవాడు ఉదారమనస్వియైన బ్రహ్మదేవుడు భక్తవత్సలుడైన శంభుణ్ని స్తుతించి వంగి వంగి నమస్కరిస్తూ నిలబడ్డాడు. జనార్దనుడు కూడా నమస్కారార్హుడైన మహేశ్వరుణ్ని అలాగే చేతులుజోడించి, నిలిచి స్తుతించాడు.

విష్ణురువాచ – విష్ణువు అన్నాడు.

దేవాధీశ మహేశాన దీనబంధో కృపాకర ।
ప్రసీద పరమేశాన కృపాం కురు నతప్రియ ॥27॥

నిర్గుణాయ నమస్తుభ్యం పునశ్చ సగుణాయ చ ।
పునః ప్రకృతిరూపాయ పునశ్చ పురుషాయ చ ॥28॥

పశ్చాద్గుణస్వరూపాయ నతో విశ్వాత్మనే నమః ।
భక్తిప్రియాయ శాంతాయ శివాయ పరమాత్మనే ॥29॥

సదాశివాయ రుద్రాయ జగతాం పతయే నమః ।
త్వయి భక్తిః దృఢా మేఽద్య వర్ధమానా భవత్వితి ॥30॥

దేవాధీశా! మహాదేవా! దీనబంధూ! కృపాకరా! పరమేశానా! నమస్కరించిన వారిని ఇష్టపడేవాడా! ప్రసన్నుడివై నా పట్ల దయవహించు. సగుణుడివీ నువ్వే, నిర్గుణిడివీ నువ్వే. ప్రకృతి పురుష స్వరూపాలు రెండూ నువ్వే. ఓ గుణస్వరూపా! నీకు నతులు. విశ్వాత్మకా! నీకు ప్రణతులు. భక్తికి ఇష్టపడేవాడా! శాంతాకారా! శివా! పరమాత్మా!

సదాశివా! రుద్రా! జగత్పతీ! నీకివే వందనాలు. నీపట్ల ఇప్పుడు నాకున్న ఈ దృఢభక్తి ఇంకా వృద్ధిపొందుగాక! అని స్తుతించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా విరరామాసౌ శైవప్రవరసత్తమః ।
సర్వే దేవాః ప్రణమ్యోచుస్తతస్తం పరమేశ్వరమ్ ॥31॥

వ్యాసమహర్షీ! శివభక్తులలో ఉత్తమోత్తముడైన శ్రీహరి ఇలా స్తుతించి విరమించగా సకల దేవతలూ పరమేశ్వరుణ్ని అంజలించి ఇలా విన్నవించారు.

దేవా ఊచుః – దేవతలు స్తుతించారు.

దేవనాథ మహాదేవ కరుణాకర శంకర ।
ప్రసీద జగతాం నాథ ప్రసీద పరమేశ్వర ॥32॥

ప్రసీద సర్వకర్తా త్వం నమామస్త్వాం వయం ముదా ।
త్వయి భక్తిః దృఢాస్మాకం నిత్యం స్యాదనపాయినీ ॥33॥

దేవనాథా! మహాదేవా! కరుణాకరా! శంకరా! జగన్నాథా! పరమేశ్వరా! మాకు ప్రసన్నుడివి కమ్ము! సర్వకర్తా! ఆనందంగా నీకిదే నమస్కరిస్తున్నాము. నీపట్ల మాకున్న ఈ దృఢభక్తి నిరంతరం మమ్మల్ని ఎడబాయకుండా ఉండుగాక!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి స్తుతశ్చ దేవేశో బ్రహ్మణా హరిణాఽమరైః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా శంకరో లోకశంకరః ॥34॥

బ్రహ్మదేవుడూ, విష్ణుమూర్తీ, సకలదేవతలూ ఇలా స్తుతించే సరికి దేవేశుడు లోకశంకరుడు అయిన శంకరుడు ప్రసన్నుడై బదులు పలికాడు.

శంకర ఉవాచ – శంకరుడు అన్నాడు.

హే విధే హే హరే దేవాః ప్రసన్నోఽస్మి విశేషతః ।
మనోఽభిలషితం బ్రూత వరం సర్వే విచారతః ॥35॥

ఓ బ్రహ్మదేవుడా! ఓ విష్ణుమూర్తీ! ఓ దేవతలారా! నేను చాలా ప్రసన్నుణ్ని అయ్యాను. మీరంతా బాగా ఆలోచించి మీ మనస్సుకి నచ్చిన వరం కోరండి ఇస్తాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తం వచనం శ్రుత్వా హరేణ మునిసత్తమ ।
ప్రత్యూచుస్సర్వదేవాశ్చ ప్రసన్నేనాంతరాత్మనా ॥36॥

వ్యాసమునిసత్తమా! హరుడు ఇలా అనుగ్రహించేసరికి సకలదేవతలూ అంతరంగంలో తేరుకుని బదులు పలికారు.

సర్వే దేవా ఊచుః – సర్వ దేవతలూ అడిగారు.

యది ప్రసన్నో భగవన్ యది దేయో వరస్త్వయా ।
దేవదేవేశ చాస్మభ్యం జ్ఞాత్వా దాసాన్ హి నస్సురాన్ ॥37॥

యదా దుఃఖం తు దేవానాం సంభవేద్దేవసత్తమ ।
తదా త్వం ప్రకటో భూత్వా దుఃఖం నాశయ సర్వదా ॥38॥

దేవదేవా! మేమందరం దేవతలం, నీ దాసులం, నువ్వు ప్రసన్నుడవై మాకు ఏదైనా వరం ఇవ్వాలనుకుంటే – ఒక్కటే మేము అడిగేది. దేవసత్తమా! దేవతలకు ఏ కష్టం ఎప్పుడు వచ్చినా దయచేసి నువ్వు కనబడి ఎల్లవేళలా ఆ కష్టాన్ని తొలగించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తో భగవాన్ రుద్రో బ్రహ్మణా హరిణామరైః ।
యుగపత్ప్రాహ తుష్టాత్మా తథేత్యస్తు నిరంతరమ్ ॥39॥

స్తవైరేతైశ్చ తుష్టోఽస్మి దాస్యామి సర్వదా ధ్రువమ్ ।
యదభీష్టతమం లోకే పఠతాం శృణ్వతాం సురాః ॥40॥

ఇత్యుక్త్వా శంకరః ప్రీతో దేవదుఃఖహరస్సదా ।
సర్వదేవప్రియం యద్వై తత్సర్వం చ ప్రదత్తవాన్ ॥41॥

బ్రహ్మ విష్ణ్వాది దేవతలందరూ ఇలా కోరగానే రుద్రుడు సంబరపడి "తథాస్తు నిరంతరమ్" (అట్లే అగుగాక!)అని ఒక్కసారిగా పలికాడు. దేవతలారా! మీరు చేసిన స్తోత్రాలు నాకు చాలా ఆనందం కలిగించాయి. మీ కోరిక ఎప్పుడూ తీరుస్తాను. ఈ స్తుతుల్ని చదివినవారికీ, విన్నవారికీ అభీష్టాలు నెరవేరతాయి – అని పలికి దేవదుఃఖహరుడు ఆ శంకరుడు సర్వదేవతలకు ప్రియమైనవి సమస్తమూ అందించాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే దేవస్తుతివర్ణనం నామ ఏకాదశోఽధ్యాయః ॥11॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు దేవస్తుతివర్ణనమనే పదకొండవ అధ్యాయం సమాప్తం.

ద్వాదశోఽధ్యాయః – పన్నెండవ అధ్యాయం

త్రిపురవధానంతరం దేవస్తుతి మయస్తుతి ముండినివేశన దేవస్వస్థానగమనవర్ణనమ్

త్రిపురవధానంతరం దేవతాస్తుతి, మయుడు చేసిన స్తుతి,

ముండినివేశనం, దేవతల స్వస్థానగమనవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏతస్మిన్నంతరే శంభుం ప్రసన్నం వీక్ష్య దానవః ।
తత్రాజగామ సుప్రీతో మయోఽదగ్ధః కృపాబలాత్ ॥1॥

ప్రణనామ హరం ప్రీత్యా సురానన్యానపి ధ్రువమ్ ।
కృతాంజలిర్నతస్కంధః ప్రణనామ పునశ్శివమ్ ॥2॥

అథోత్థాయ శివం దృష్ట్వా ప్రేమ్ణా గద్గదసుస్వరః ।
తుష్టావ భక్తిపూర్ణాత్మా స దానవవరో మయః ॥3॥

వ్యాసమునీ! శివుడు ఇంత ప్రసన్నంగా ఉండడం గమనించాడు మయుడు. అతడు దానవుడే అయినా శంకరుడి కృపాబలం వల్ల త్రిపురాలతోపాటు మసి అయిపోకుండా బతికాడుగదా! అతడు సుప్రీతుడై ఇప్పుడు శివుడి సన్నిధికి వచ్చాడు. భక్తితో హరుడికీ తక్కిన దేవతలకీ నమస్కరించాడు. వంగి నమస్కరిస్తూ నిలబడి శివుణ్ని భక్తిగా దర్శిస్తూ గద్గదస్వరంతో స్తుతించాడు. భక్తి పెల్లుబికి అతడి గొంతు వణికింది స్తుతించాడు.

మయ ఉవాచ – మయుడు స్తుతించాడు.

దేవదేవ మహాదేవ భక్తవత్సల శంకర ।
కల్పవృక్షస్వరూపోఽసి సర్వపక్ష వివర్జితః ॥4॥

జ్యోతీరూప నమస్తేఽస్తు విశ్వరూప నమోఽస్తు తే ।
నమః పూతాత్మనే తుభ్యం పావనాయ నమో నమః ॥5॥

చిత్రరూపాయ నిత్యాయ రూపాతీతాయ తే నమః ।
దివ్యరూపాయ దివ్యాయ సుదివ్యాకృతయే నమః ॥6॥

నమః ప్రణతసర్వార్తినాశకాయ శివాత్మనే ।
కర్త్రే భర్త్రే చ సంహర్త్రే త్రిలోకానాం నమో నమః ॥7॥

భక్తిగమ్యాయ భక్తానాం నమస్తుభ్యం కృపాలవే ।
తపః సత్ఫలదాత్రే తే శివాకాంత శివేశ్వర ॥8॥

న జానామి స్తుతిం కర్తుం స్తుతిప్రియ పరేశ్వర ।
ప్రసన్నో భవ సర్వేశ పాహి మాం శరణాగతమ్ ॥9॥

దేవదేవా! మహాదేవా! భక్తవత్సలా! శంకరా! నువ్వు కల్పవృక్షానివి. స్వపక్షం – పరపక్షం అనే భేదాలకు అతీతుడివి. వెలుగుప్రోవా! విశ్వరూపా! నమో నమః. పవిత్రమైన అంతరంగం నీది. సకలపావనుడివి. చిత్రరూపా! రూపాతీతా! దివ్యరూపా! దివ్యా! దివ్యాకృతీ! శివాత్మకా! నమస్కరించిన భక్తుల ఆర్తులనన్నింటినీ తొలగించేవాడా! ముల్లోకాలకు కర్తవూ భర్తవూ సంహర్తవూ నువ్వేకదా! భక్తుల భక్తికి గమ్యస్థానం నువ్వే. కృపాళూ! నీకిదే వందనం. తపస్సులకు సత్ఫలాలను ప్రసాదించేవాడా! శివా వల్లభా! శివేశ్వరా! స్తుతిప్రియా! సర్వేశ్వరా! పరేశా! నిన్ను స్తోత్రం చెయ్యడం ఎలాగో కూడా తెలియనివాణ్ని. నీకు శరణాగతుణ్ని. నాపట్ల ప్రసన్నుడివై నన్ను రక్షించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య మయోక్తాం హి సంస్తుతిం పరమేశ్వరః ।
ప్రసన్నోఽభూత్ ద్విజశ్రేష్ఠ మయం ప్రోవాచ చాదరాత్ ॥10॥

బ్రాహ్మణోత్తమా! వ్యాసమునీంద్రా! మయుడు చేసిన ఈ సంస్తుతికి పరమేశ్వరుడు ప్రసన్నుడయ్యాడు. ఆదరంగా సంభాషించాడు.

శివ ఉవాచ – శివుడన్నాడు.

వరం బ్రూహి ప్రసన్నోఽహం మయ దానవసత్తమ ।
మనోఽభిలషితం యత్తే తద్దాస్యామి న సంశయః ॥11॥

మయుడా! దానవసత్తముడా! నీ స్తుతికి ప్రసన్నుణ్ని అయ్యాను. నీకొక వరం ఇస్తాను. నీ మనస్సుకి నచ్చింది కోరుకో. సంశయం లేదు.

సనత్కుమారుడు ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శ్రుత్వా శివం వచశ్శంభోస్స మయో దానవర్షభః ।
ప్రత్యువాచ ప్రభుం నత్వా నతస్కంధః కృతాంజలిః ॥12॥

వ్యాసమునీ! శివుడు పలికిన ఈ శుభప్రదమైన మాటకు దానవోత్తముడైన ఆ మయుడు ముగ్ధుడయ్యాడు. మరింతగా వంగి ప్రభువుకు నమస్కరిస్తూ ఇలా బదులు పలికాడు.

మయ ఉవాచ – మయుడు విన్నవించాడు.

దేవదేవ మహాదేవ ప్రసన్నో యది మే భవాన్ ।
వరయోగ్యోఽస్మ్యహం చేద్ధి స్వభక్తిం దేహి శాశ్వతీమ్ ॥13॥

స్వభక్తేషు సదా సఖ్యం దీనేషు చ దయాం సదా ।
ఉపేక్షమన్యజీవేషు ఖలేషు పరమేశ్వర ॥14॥

కదాపి నాసురో భావో భవేన్మమ మహేశ్వర ।
నిర్భయః స్యాం సదా నాథ మగ్నస్త్వద్భజనే శుభే ॥15॥

దేవదేవా! మహాదేవా! నువ్వు నాపట్ల ప్రసన్నుడివైతే, నువ్వు వరం ప్రసాదించడానికి నేను యోగ్యుణ్ణే అయితే ప్రభూ! నాకున్న ఈ శివభక్తిని శాశ్వతం చెయ్యి. నీ భక్తులతో చెలిమినీ, దీనులపట్ల దయనూ, దుష్టులపట్ల ఉపేక్షాభావాన్నీ పరమేశ్వరా! నాకు కటాక్షించు. అసురభావం అనేది నాలో ఎప్పుడూ పొడచూపకుండా చెయ్యి. శుభప్రదమైన నీ భజనలో నిరంతరం మునిగి, నిర్భయంగా జీవించే వరం ప్రసాదించు.

సనత్కుమార ఉవాచ - సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి సంప్రార్థ్యమానస్తు శంకరః పరమేశ్వరః ।
ప్రత్యువాచ మయంనాథ ప్రసన్నో భక్తవత్సలః ॥16॥

వ్యాసమహర్షీ! మయుడు ఇలా ప్రార్థిస్తే పరమేశ్వరుడు ఆ శంకరుడు భక్తవత్సలుడు మరింత ప్రసన్నుడై ఇలా పలికాడు.

మహేశ్వర ఉవాచ - మహేశ్వరుడు అన్నాడు.

దానవర్షభ ధన్యస్త్వం మద్భక్తో నిర్వికారవాన్ ।
ప్రదత్తాస్తే వరాస్సర్వేఽభీప్సితా యే తవాధునా ॥17॥

గచ్ఛ త్వం వితలం లోకం రమణీయం దివోఽపి వా ।
సమేతః పరివారేణ నిజేన మమ శాసనాత్ ॥18॥

నిర్భయస్తత్ర సంతిష్ఠ సంహృష్టో భక్తిమాన్సదా ।
కదాపి నాసురో భావో భవిష్యతి మదాజ్ఞయా ॥19॥

దానవోత్తమా! నువ్వు నా భక్తుడివి. నిర్వికారుడివి. అంచేత ధన్యుడివి. నువ్వు ఇప్పుడు కోరుకున్న వరాలు అన్నీ ఇస్తున్నాను. నువ్వు హాయిగా నీ పరివారంతో కలిసి స్వర్గం కన్నా చాలా అందమైన వితలలోకానికి వెళ్ళు. ఇది నా ఆజ్ఞ. అక్కడ నిర్భయంగా ఆనందంగా నిరంతరభక్తితో జీవించు. నీకు ఏనాడూ ఆసురభావం కలుగదు. ఇది నా శాసనం.

సనత్కుమార ఉవాచ - సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాజ్ఞాం శిరసాధాయ శంకరస్య మహాత్మనః ।
తం ప్రణమ్య సురాంశ్చాపి వితలం ప్రజగామ సః ॥20॥

ఏతస్మిన్నంతరే తే వై ముండినశ్చ సమాగతాః ।
ప్రణమ్యోచుశ్చ తాన్ సర్వాన్ విష్ణుబ్రహ్మాదికాన్ సురాన్ ॥21॥

కుత్ర యామ వయం దేవాః కర్మ కిం కరవామహే ।
ఆజ్ఞాపయత నః శీఘ్రం భవదాదేశకారకాన్ ॥22॥

కృతం దుష్కర్మ చాస్మాభిః హే హరే హే విధే సురాః ।
దైత్యానాం శివభక్తానాం శివభక్తిర్వినాశితా ॥23॥

కోటికల్పాని నరకే నో వాసస్తు భవిష్యతి ।
నోద్ధారో భవితా నూనం శివభక్తవిరోధినామ్ ॥24॥

పరంతు భవదిచ్ఛాత ఇదం దుష్కర్మ నః కృతమ్ ।
తచ్ఛాంతిం కృపయా బ్రూత వయం వశ్శరణాగతాః ॥25॥

వ్యాసమునీశ్వరా! శంకరుడూ మహాత్ముడూ అయిన ఆ శివుడి ఆజ్ఞను శిరసా గ్రహించి నమస్కరించి ఇతరదేవతలకూ మొక్కి ఆ మయుడు వితలలోకానికి వెళ్ళిపోయాడు. వ్యాసా! ఆ క్షణంలోనే బోడితలలు గల అరిహంతుడు, అతడి శిష్యులూ అక్కడికి వచ్చారు. బ్రహ్మ విష్ణు ప్రభృతులైన సురలందరికీ నమస్కరించి ఇలా అడిగారు – ఓ హరీ! ఓ విధీ! ఓ దేవతలారా! మేమిప్పుడు ఎక్కడికి పోవాలి? ఏ పని చెయ్యాలి? మీ ఆదేశాన్ని ఆచరించడమే మా పని. వెంటనే ఆజ్ఞాపించండి. మేము చాలా దుష్కృత్యం చేశాం. శివభక్తులైన దైత్యుల్లోని భక్తిని నాశనం చేశాం. కోటికల్పాల నరకవాసం మాకు తప్పదు. శివభక్తులకు హాని చేసినవాణ్ని, విరోధించినవాణ్ని ఎవ్వడూ ఉద్ధరించలేడు. ఇది వాస్తవం. అయితే మీ అందరి కోరిక మీదా మేము ఈ దుష్కృతాన్ని ఆచరించాం. అందుకని దయచేసి దానికి శాంతిని కూడా మీరే చెప్పండి. మేమిదే మీకు శరణాగతులం.

తేషాం తద్వచనం శ్రుత్వా విష్ణుబ్రహ్మాదయస్సురాః ।
అబ్రువన్ ముండినస్తాంస్తే స్థితానగ్రే కృతాంజలీన్ ॥26॥

వ్యాసా! బ్రహ్మవిష్ణుప్రభృతులు దేవతలందరూ వారి పలుకులు ఆలకించారు. అంజలిబంధనాలతో ఎదుట నిల్చిన ఈ ముండితశిరస్కులకు ఇలా ప్రతివచనం పలికారు.

విష్ణ్వాదయ ఊచుః – విష్ణువు మొదలైనవారు అన్నారు.

న భేతవ్యం భవద్భిస్తు ముండినో వై కదాచన ।
శివాజ్ఞయేదం సకలం జాతం చరితముత్తమమ్ ॥27॥

యుష్మాకం భవితా నైవ కుగతిర్దుఃఖదాయినీ ।
శివవాచా యతో యూయం దేవర్షిహితకారకాః ॥28॥

సురర్షిహితకృచ్ఛంభుస్సురర్షిహితకృత్ప్రియః ।
సురర్షిహితకృత్ నౄణాం కదాపి కుగతిర్నహి ॥29॥

అద్యతో మతమేతం హి ప్రవిష్టానాం నృణాం కలౌ ।
కుగతిర్భవితా బ్రూమః సత్యం నైవాత్ర సంశయః ॥30॥

భవద్భిర్ముండినో ధీరా గుప్తభావాన్మమాజ్ఞయా ।
తావన్మరుస్థలీ సేవ్యా కలిర్యావత్సమావ్రజేత్ ॥31॥

ఆగతే చ కలౌ యూయం స్వమతం స్థాపయిష్యథ ।
కలౌ తు మోహితా మూఢాస్సంగ్రహీష్యతి వో మతమ్ ॥32॥

ఓ ముండితులారా! మీరు ఏమీ భయపడకండి. ఉత్తమోత్తమమైన ఈ చరితమంతా కేవలం శివాజ్ఞతోనే జరిగింది. దుఃఖదాయకాలైన నరకవాసాది దుర్గతులు మీకు కలుగవు. ఎందుకంటే – మీరు శివుడి మాటమీద ఇదంతా చేశారు. దేవతలకూ ఋషులకూ హితం కలిగించారు. నిజానికి సుర – ఋషి హితకారకుడు శివుడొక్కడే. అదే పనిని చేసినవారంటే శివుడికి ఎంత ఇష్టంలో, సురలకూ ఋషులకూ ఇలా మీలాగా హితం చేసిన మనిషికి ఏనాడూ దుర్గతి ఉండదు. కానీ మీరు ప్రచారం చేసిన మతంలోకి ప్రవేశించిన ప్రజలందరూ నేటి నుంచీ దుర్గతులపాలవుతారు. ఇది నిజం. సంశయం లేదు. ధీరులారా! ముండితులైన మీరు ఒక మరుస్థలంలో (ఎడారి) రహస్యంగా జీవించండి. కలియుగం ప్రవేశించే వరకూ అజ్ఞాతజీవితం గడపండి. కలి ప్రవేశించాక మళ్ళీ మీ మతాన్ని వ్యాప్తిలోకి తెద్దురుగాని. మోహితులైన మూఢులు అప్పుడు మీ మతం స్వీకరిస్తారు – అనుసరిస్తారు.

విశేషం: గుర్జరపూర్వభాగాత్తు ద్వారకా యస్య దక్షిణా! మరుదేశో మహేశాని ఉష్ట్రోత్పత్తిపరాయణః ॥ అని శక్తిసంగమ తంత్ర గ్రంథం (॥.7.9) చెబుతోంది. ఇది ఇప్పటి థార్ ఎడారి.

ఇత్యాజ్ఞప్తాః సురేశైశ్చ ముండినస్తే మునీశ్వర ।
నమస్కృత్య గతాస్తత్ర యథోద్దిష్టం స్వమాశ్రమమ్ ॥33॥

వ్యానమునీశ్వరా! దేవతానాయకుల ఆజ్ఞను శిరసావహించి అందరికీ శిరసా నమస్కరించి ఆ ముండితులందరూ తమకు నిర్దిష్టమైన మరుదేశానికి తరలిపోయారు.

తతస్స భగవాన్ రుద్రో దగ్ధ్వా త్రిపురవాసినః ।
కృతకృత్యో మహాయోగీ బ్రహ్మాద్యైర్భిపూజితః ॥34॥

స్వగణైర్నిఖిలైర్దేవ్యా శివయా సహితః ప్రభుః ।
కృత్వామరమహత్కార్యం ససుతోఽంతరధాదథ ॥35॥

తతశ్చాంతర్హితే దేవే పరివారాన్వితే శివే ।
ధనుశ్శరరథాద్యశ్చ ప్రాకారోఽంతర్ధిమాగమత్ ॥36॥

మహాయోగి రుద్రుడు ఈ తీరుగా దేవకార్యం త్రిపురసంహారం చేసి కృతకృత్యుడయ్యాడు. బ్రహ్మ విష్ణు ప్రభృతుల పూజలూ స్తోత్రాలు అందుకున్నాడు. అటుపైని తన సమస్తగణాలతోనూ దేవేరి పార్వతితోనూ పుత్రులతోనూ కలిసి అంతర్ధానం చెందాడు. అదేక్షణంలో దివ్యధనుస్సు, దివ్యశరమూ, దివ్యరథమూ ఇత్యాది సాధనసామగ్రి అంతా అంతర్ధానం చెందింది.

తతో బ్రహ్మా హరిర్దేవా మునిగంధర్వకిన్నరాః ।
నాగాస్సర్పాశ్చాప్సరసస్సంహృష్టాశ్చాథ మానుషాః ॥37॥

స్వం స్వం స్థానం ముదా జగ్ముశ్శంసంతః శాంకరం యశః ।
స్వం స్వం స్థానమనుప్రాప్య నిర్వృతిం పరమాం యయుః ॥38॥

ఆ పిమ్మట బ్రహ్మదేవుడూ, శ్రీమహావిష్ణువూ, మునులూ, గంధర్వులూ, కిన్నరులూ, నాగజాతివారూ, సర్పజాతివారూ, అప్సరసలూ, మానవులూ – ఇలా అందరూ తమ తమ నివాసాలకు ఆనందంగా శంకరుడి యశస్సుని కీర్తించుకుంటూ తరలివెళ్ళారు. నివాసాలు చేరుకుని అంతులేని మనశ్శాంతిని అనుభవించారు.

ఏతత్తే కథితం సర్వం చరితం శశిమౌలినః (ఆర్షప్రయోగం) ।
త్రిపురక్షయసంసూచి పరలీలాన్వితం మహత్ ॥39॥

ధన్యం యశస్యమాయుష్యం ధనధాన్యప్రవర్ధకమ్ ।
స్వర్గదం మోక్షదం చాపి కిం భూయః శ్రోతుమిచ్ఛసి ॥40॥

ఇదం హి పరమాఖ్యానం యః పఠేత్ శృణుయాత్సదా ।
ఇహ భుక్త్వాఽఖిలాన్ కామానంతే ముక్తిమవాప్నుయాత్ ॥41॥

పరాశరాత్మజా! శశిశేఖరుడి ఈ చరితం మొత్తం నీకు చెప్పాను. ఈ త్రిపురసంహారగాథ చాలా మహిమాన్వితం. ఉత్తమలీలావిశేషం. ధన్యత – యశస్సు – ఆయుర్దాయం – ధనధాన్యసమృద్ధి – స్వర్గం – మోక్షం – ఇలా అన్నింటినీ అందించే దివ్యగాథ ఇది. విన్నావు కదా! ఇంకా ఏమి వినాలనుకుంటున్నావో చెప్పు. ఈ ఉత్తమగాథను చదివినవారూ, విన్నవారూ ఇహంలో కోరికలు తీరి, భోగాలు అనుభవించి పరంలో ముక్తులవుతారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే సనత్కుమారపారాశర్య సంవాదే త్రిపురవధానంతరం దేవస్తుతి మయస్తుతి ముండినివేశన దేవస్వస్థానగమనవర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥12॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు సనత్కుమార పారాశర్యసంవాదంలో త్రిపురవధానంతరం దేవతాస్తుతి, మయుడు చేసిన స్తుతి, ముండితుల నివేశనం, దేవతల స్వస్థానగమనవర్ణనం అనే పన్నెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోదశోఽధ్యాయః – పదమూడవ అధ్యాయం

జలంధరవధోపాఖ్యానే శక్రజీవనమ్ – జలంధరవధోపాఖ్యానంలో శక్రజీవనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

భో బ్రహ్మన్ భగవన్ పూర్వం శ్రుతం మే బ్రహ్మపుత్రక ।
జలంధరం మహాదైత్యమవధీచ్ఛంకరః ప్రభుః ॥1॥

తత్త్వం వద మహాప్రాజ్ఞ చరితం శశిమౌళినః ।
విస్తారపూర్వకం శృణ్వన్ కస్తృప్యేత్తద్యశోఽమలమ్ ॥2॥

ఓ బ్రాహ్మణోత్తమా! బ్రహ్మపుత్రకా! సనత్కుమారా! జలంధరుడనే మహాదైత్యుణ్ని మన ప్రభువు శంకరుడు మునుపు ఎప్పుడో మట్టుబెట్టాడని విన్నాను. మహాప్రాజ్ఞుడా! ఆ వృత్తాంతం సవిస్తరంగా వినాలి అని నా కోరిక. చంద్రశేఖరుడి పావనయశస్సునీ పవిత్రచరితనీ వినడంలో ఎవరికైనా ఎప్పటికైనా తనివితీరుతుందా చెప్పు!

సూత ఉవాచ – సూతుడు అన్నాడు.

ఇత్యేవం వ్యాససంపృష్టో బ్రహ్మపుత్రో మహామునిః ।
ఉవాచార్థవదవ్యగ్రం వాక్యం వాక్యవిశారదః ॥3॥

వ్యాసుడు ఇలా అభ్యర్థిస్తే బ్రహ్మపుత్రుడు మహాముని ఆ సనత్కుమారుడు చాలా సంబరపడ్డాడు. అతడు వాక్యవిశారదుడు. కథ చెప్పడంలో నేర్పరి. ఏకాగ్రచిత్తుడై అర్థవంతమైన వాక్యవిన్యాసంతో ఇలా ఆరంభించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏకదా జీవశక్రౌ చ భక్త్యా పరమయా మునే ।
దర్శనం కర్తుమీశస్య కైలాసం జగ్మతుర్భృశమ్ ॥4॥

అథ గుర్వింద్రయోర్జ్ఞాత్వాగమనం శంకరః ప్రభుః ।
పరీక్షితుం తయోర్జ్ఞానం స్వదర్శనరతాత్మనోః ॥5॥

దిగంబరోఽథ తన్మార్గమారుధ్య సద్గతిస్సతామ్ ।
జటాబద్ధేన శిరసా తిష్ఠత్సంశోభితాననః ॥6॥

వ్యాసమునీ! అనగా అనగా ఒకప్పుడు బృహస్పతి, ఇంద్రుడూ కైలాసపర్వతానికి వెళ్ళారు. ఎంతో భక్తితో పరమేశ్వరుణ్ని దర్శించుకుందామని. వీళ్ళు ఇద్దరూ వస్తున్నారని శంకరుడికి తెలిసింది. తనని దర్శించడంలో వీళ్ళకి ఏపాటి గాఢానురక్తి ఉన్నదో పరీక్షిద్దాం అనిపించింది ఆ ప్రభువుకి. సజ్జనులకి సద్గతులు కలిగించే ఆ పార్వతీపతి వెంటనే దిగంబరుడుగా మారి జడలుగట్టిన తల, మెరుస్తున్న మొగంతో వారి దారికి అడ్డునిలిచాడు.

అథ తౌ గురుశక్రౌ చ కుర్వంతౌ గమనం ముదా ।
ఆలోక్య పురుషం భీమం మార్గమధ్యేఽద్భుతాకృతిమ్ ॥7॥

మహాతేజస్వినం శాంతం జటాసంబద్ధమస్తకమ్ ।
మహాబాహుం మహోరస్కం గౌరం నయనభీషణమ్ ॥8॥

అథో పురందరోఽపృచ్ఛత్ స్వాధికారేణ దుర్మదః ।
పురుషం తం స్వమార్గాంతస్థితమజ్ఞాయ శంకరమ్ ॥9॥

ఆనందంగా నడిచివెడుతున్న ఆ గురుశిష్యులు (బృహస్పతి – ఇంద్రుడు) మార్గమధ్యంలో ఎదురుపడిన ఆ పురుషుణ్ని అద్భుతాకారంలో ఉన్న శివుణ్ని (భీముణ్ని) చూశారు. అతడు మహాతేజస్వి. శాంతాకారుడు. జడలు కట్టిన శిరస్సుతో గౌరవర్ణంలో చూపులకి భయంకరంగా ఉన్నాడు. అతడి బాహువులు బలంగా పొడవుగా ఉన్నాయి. వక్షఃస్థలం ఉన్నతంగా కఠినంగా ఉంది. అతణ్ణివారు శివుడిగా గుర్తించలేకపోయారు. తమ దారికి అడ్డం వచ్చాడే అన్న అధికారదుర్మదంతో ఇంద్రుడు ఇలా ప్రశ్నించాడు.

పురందర ఉవాచ – పురందరుడు అడిగాడు.

కస్త్వం భోః కుత ఆయాతః కిం నామ వద తత్త్వతః ।
స్వస్థానే సంస్థితశ్శంభుః కిం వాన్యత్ర గతః ప్రభుః ॥10॥

ఎవడివయ్యా నువ్వు? ఎక్కడి నుంచి వచ్చావు? నీ పేరేమిటి? నిజం చెప్పు. శివుడు ఇంటిలో ఉన్నాడా? మరెక్కడికైనా వెళ్ళాడా ఆ ప్రభువు?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శక్రేణేత్థం స పృష్ఠస్తు కించిన్నోవాచ తాపసః ।
శక్రః పునరపృచ్ఛద్వై నోవాచ స దిగంబరః ॥11॥

పునః పురందరోఽపృచ్ఛల్లోకానామధిపేశ్వరః ।
తూష్ణీమాస మహాయోగీ లీలారూపధరః ప్రభుః ॥12॥

ఇత్థం పునః పునః పృష్ఠశ్శక్రేణ స దిగంబరః ।
నోవాచ కించిద్భగవాన్ శక్రజ్ఞానపరీక్షయా ॥13॥

అథ చుక్రోధ దేవేశః త్రైలోక్యైశ్వర్యగర్వితః ।
ఉవాచ వచనం చైవ తం నిర్భర్త్స్య జటాధరమ్ ॥14॥

శక్రుడు ఇలా అడిగినా ఆ తాపసుడు ఏమీ బదులివ్వలేదు. మళ్ళీ అడిగాడు. అయినా దిగంబరుడు పలకలేదు. లోకపాలకులకు అధిపతి ఆ ఇంద్రుడు – ఆ పురందరుడు. మరొక్కసారి అడిగాడు. లీలారూపధారి మహాయోగి ఆ శివప్రభువు మిన్నకున్నాడు. ఇలా ఇంద్రుడు ఎన్నోసార్లు అడిగాడు. అయినా దిగంబరుడు నోరు

విప్పలేదు – అతడి జ్ఞానం పరీక్షించాలి అనుకున్నాడు – పెదవి కదపలేదు. ముల్లోకాలకూ అధిపతిని అనే గర్వం దేవేంద్రుడిలో పొటమరించింది. క్రుద్ధుడయ్యాడు. జటాధరుణ్ని బెదిరిస్తూ ఇలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ – ఇంద్రుడు అన్నాడు.

రే మయా పృచ్ఛ్యమానోఽపి నోత్తరం దత్తవానసి ।
అతస్త్వాం హన్మి వజ్రేణ కస్తే త్రాతాస్తి దుర్మతే ॥15॥

ఓరీ! ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పవేమిరా దుర్మతీ! ఇదిగో వజ్రాయుధంతో నిన్ను ఇప్పుడే ఇక్కడే చంపుతాను. ఎవడురా నీకు రక్షకుడు?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుదీర్య తతో వజ్రీ సన్నిరీక్ష్య క్రుధా హి తమ్ ।
హంతుం దిగంబరం వజ్రముద్యతం స చకార హ ॥16॥

పురందరం వజ్రహస్తం దృష్ట్వా దేవస్సదాశివః ।
చకార స్తంభనం తస్య వజ్రపాతస్య శంకరః ॥17॥

తతో రుద్రః క్రుధావిష్టః కరాళాక్షో భయంకరః ।
ద్రుతమేవ ప్రజజ్వాల తేజసా ప్రదహన్నివ ॥18॥

బాహుప్రతిష్టంభభువా మన్యునాంతశ్శచీపతిః ।
సమదహ్యత భోగీవ మంత్రరుద్ధపరాక్రమః ॥19॥

వ్యాసమునీ! ఇలా అంటూనే దేవేంద్రుడు ఆ దిగంబరుణ్ని కోపంగా చూస్తూ చంపడం కోసమని వజ్రాయుధాన్ని పైకెత్తాడు. సదాశివుడు ఆ వజ్రహస్తుడి వైపు ఒక్కసారి చూశాడు. ఆ చేతిని అలాగే స్తంభింపజేశాడు – రుద్రుడు. కోపంతో ఊగిపోయాడు. కన్నులు ఎరుపెక్కి కరాళంగా మారిపోయాయి. రెప్పపాటుకాలంలో భయంకరుడయ్యాడు. తన తేజస్సుతో దహించివేసేలాగా ప్రజ్వలించాడు. ఎదుట నిల్చిన శచీపతికి చెయ్యి కొయ్యబారిపోవడంతో గుండెల్లో కోపం భగభగలాడింది. మంత్రానికి కట్టువడ్డ పాములాగా గింజుకున్నాడు.

దృష్ట్వా బృహస్పతిస్తూర్ణం ప్రజ్వలంతం స్వతేజసా ।
పురుషం తం ధియా జ్ఞాత్వా ప్రణనామ హరం ప్రభుమ్ ॥20॥

కృతాంజలిపుటో భూత్వా తతో గురురుదారధీః ।
నత్వా చ దండవద్భూమౌ ప్రభుం స్తోతుం ప్రచక్రమే ॥21॥

అంతా చూస్తున్న బృహస్పతి గ్రహించాడు. ఎట్టయెదుట స్వతేజస్సుతో ప్రకాశిస్తున్న మహాపురుషుణ్ని శంకరమహాప్రభువుగా గుర్తించాడు. ధీశాలి. బుద్ధిమంతుడు. వెంటనే చేతులు జోడించి సాష్టాంగపడి ప్రభువును స్తుతించాడు.

గురువాచ – బృహస్పతి స్తుతించాడు.

నమో దేవాధిదేవాయ మహాదేవాయ చాత్మనే ।
మహేశ్వరాయ ప్రభవే త్ర్యంబకాయ కపర్దినే ॥22॥

దీననాథాయ విభవే నమోఽంధకనిషూదినే ।
త్రిపురఘ్నాయ శర్వాయ బ్రహ్మణే పరమేష్ఠినే ॥23॥

విరూపాక్షాయ రుద్రాయ బహురూపాయ శంభవే ।
విరూపాయాతిరూపాయ రూపాతీతాయ తే నమః ॥24॥

యజ్ఞవిధ్వంసకర్త్రే చ యజ్ఞానాం ఫలదాయినే ।
నమస్తే మఖరూపాయ పరకర్మప్రవర్తినే ॥25॥

దేవాధిదేవా! మహాదేవా! ఆత్మరూపా! మహేశ్వరా! ప్రభూ! ముక్కంటీ! కపర్దీ! నీకిదే నమో నమః. దీననాథా! విభూ! అంధకాసురసంహారకా! త్రిపురహారీ! శర్వా! బ్రహ్మస్వరూపమా! పరమేష్ఠీ! విరూపాక్షా! రుద్రా! బహురూపా! శంభూ! వందనాలు. విరూపా! అతిరూపా! రూపాతీతా! నీకిదే వందనం. దక్షాధ్వర విధ్వంసీ! యజ్ఞఫలదాయకా! యజ్ఞరూపా! పరకర్మలను ప్రవర్తింపజేసేవాడా! నీకిదే నమస్కారము.

కాలాంతకాయ కాలాయ కాలభోగిధరాయ చ ।
నమస్తే పరమేశాయ సర్వత్ర వ్యాపినే నమః ॥26॥

నమో బ్రహ్మశిరోహంత్రే బ్రహ్మచంద్రస్తుతాయ చ ।
బ్రహ్మణ్యాయ నమస్తేఽస్తు నమస్తే పరమాత్మనే ॥27॥

త్వమగ్నిరనిలో వ్యోమ త్వమేవాపో వసుంధరా ।
త్వం సూర్యశ్చంద్రమా భాని జ్యోతిశ్చక్రం త్వమేవ హి ॥28॥

త్వమేవ విష్ణుస్త్వం బ్రహ్మా తత్ స్తుతస్త్వం పరేశ్వరః ।
మునయస్సనకాద్యాస్త్వం నారదస్త్వం తపోధనః ॥29॥

కాలాంతకా! కాలస్వరూపా! కాలసర్పధరా! పరమేశా! సర్వవ్యాపకా! నమో నమః. బ్రహ్మ శిరస్సును ఖండించినవాడా! బ్రహ్మతో చంద్రుడితో స్తుతింపబడినవాడా! బ్రహ్మణ్యా! పరమాత్మా! నమో నమః. అగ్ని – వాయువు –ఆకాశం–నీరు–నేల–సూర్యచంద్రులు–తారలూ– మొత్తం జ్యోతిశ్చక్రం నువ్వే. బ్రహ్మవు నువ్వే. హరివి నువ్వే. వారితో స్తుతులందుకొనేదీ నువ్వే. పరమేశ్వరా! సనకాది మునులూ నువ్వే. తపోధనుడైన నారదుడూ నువ్వే.

త్వమేవ సర్వలోకేశస్త్వమేవ జగదాత్మకః ।
సర్వాన్వయస్సర్వభిన్నస్త్వమేవ ప్రకృతేః పరః ॥30॥

త్వం వై సృజసి లోకాంశ్చ రజసా విధినామభాక్ ।
సత్త్వేన హరిరూపస్త్వం సకలం యాసి వై జగత్ ॥31॥

త్వమేవాసి మహాదేవ తమసా హరరూపధృక్ ।
లీలయా భువనం సర్వం నిఖిలం పాంచభౌతికమ్ ॥32॥

త్వద్ ధ్యానబలతస్సూర్యస్తపతే విశ్వభావన ।
అమృతం చ్యవతే లోకే శశీ వాతి సమీరణః ॥33॥

సర్వలోకాలకూ ఈశ్వరుడివి నువ్వే. జగదాత్మకుడివి నువ్వు. అన్నింటా నువ్వు ఉంటావు. అన్నింటికీ భిన్నుడిగానూ ఉంటావు. ఈ ప్రకృతికి పరాత్పరుడివి నువ్వు. రజోగుణప్రధానుడివై బ్రహ్మదేవుడనే పేరు ధరించి లోకాలను సృష్టిస్తావు. సత్త్వగుణంతో విష్ణునామరూపధారివై వీటిని నడిపిస్తావు. తమోగుణంతో హరనామరూపధారివై వీటిని హరిస్తావు. మహాదేవా! ఈ పాంచభౌతికమైన సకలజగత్తూ నీకు లీలాధీనం. విశ్వభావనుడా! నిన్ను ధ్యానించిన బలంతోనే – సూర్యుడు వెలుగొందుతున్నాడు, చంద్రుడు లోకం మీద అమృతం చిలుకుతున్నాడు, వాయుదేవుడు వీస్తున్నాడు.

త్వద్ ధ్యానబలతో మేఘాశ్చాంబు వర్షంతి శంకర ।
త్వద్ ధ్యానబలతశ్శక్రస్త్రిలోకీం పాతి పుత్రవత్ ॥34॥

త్వద్ ధ్యానబలతో మేఘా సర్వే దేవా మునీశ్వరాః ।
స్వాధికారం చ కుర్వంతి చకితా భవతో భయాత్ ॥35॥

త్వత్పాదకమలస్యైవ సేవనాద్భువి మానవాః ।
నాద్రియంతే సురాన్ రుద్ర లోకైశ్వర్యం చ భుంజతే ॥36॥

శంకరా! నిన్ను ధ్యానించిన బలంతోనే మబ్బులు వర్షిస్తున్నాయి. నీ ధ్యానబలంతోనే ఇంద్రుడు ముల్లోకాలనూ పుత్రసమానంగా సాకగలుగుతున్నాడు. సకల మునీశ్వరులూ, సకల దేవతలూ, సకల మేఘాలూ నిన్ను ధ్యానించిన బలంతోనే తమ తమ అధికారాలనూ విధులనూ భయభక్తులతో నిర్వహించగలుగుతున్నారు. నీ పాదపద్మాలను ఉపాసించిన మానవులు ఓ రుద్రా! దేవతలనుసైతం లెక్కచేయకుండా సమస్తైశ్వర్యాలనూ భూలోకంలో అనుభవిస్తున్నారు.

త్వత్పాదకమలస్యైవ సేవనాదగమన్పరామ్ ।
గతిం యోగధనానామప్యగమ్యాం సర్వదుర్లభామ్ ॥37॥

సదాశివా! నీ పాదపద్మాలను సేవించడం వల్లనే మానవులు మహామహాయోగధనులకు సైతం సర్వ దుర్లభమైన పరాంగతిని సులభంగా పొందగలుగుతున్నారు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

బృహస్పతిరితి స్తుత్వా శంకరం లోకశంకరమ్ ।
పాదయోః పాతయామాస తస్యేశస్య పురందరమ్ ॥38॥

పాతాయిత్వా చ దేవేశమింద్రం నత శిరోధరమ్ ।
బృహస్పతిరువాచేదం ప్రశ్రయావనతశ్శివమ్ ॥39॥

వ్యాసర్షీ! లోకములకు శుభము కల్గించు శంకరుణ్ణి ఇలా స్తుతించి బృహస్పతి ఆ పురందరుణ్ణి శివుడి పాదాల మీద పడవేశాడు. నతశిరస్కుడై నిలిచిన ఇంద్రుణ్ణి అలా శంకరుడికి పాదాక్రాంతుణ్ణి చేసి దేవగురువు బృహస్పతి ఇలా పలికాడు.

బృహస్పతి రువాచ – బృహస్పతి అభ్యర్థించాడు.

దీననాథ మహాదేవ ప్రణతం తవ పాదయోః ।
సముద్ధర చ శాంతం స్వం క్రోధం నయనజం కురు ॥40॥

తుష్టో భవ మహాదేవ పాహీంద్రం శరణాగతమ్ ।
అగ్నిరేష శమం యాతు ఫాలనేత్రసముద్భవః ॥41॥

దీనులకు దిక్కయినవాడా! మహాదేవా! ఇదిగో నీ కాళ్ళ మీద పడ్డాడు ఇంద్రుడు. దయచేసి ఇతడిని ఉద్ధరించు. నీ కన్నులలో తొణుకుతున్న క్రోధాన్ని దయతో శాంతింపజెయ్యి. దేవాధిదేవా! తృప్తి పొందు. శరణాగతుడైన ఇంద్రుణ్ణి రక్షించు. నీ మూడవకంట కణకణలాడుతున్న అగ్ని శమించుగాక!.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య గురోర్వాక్యం దేవదేవో మహేశ్వరః ।
ఉవాచ కరుణాసింధుః మేఘనిర్హ్రాదయా గిరా ॥42॥

బృహస్పతి చేసిన ఈ అభ్యర్థనను ఆలకించి దేవదేవుడు మహేశ్వరుడు దయా సముద్రుడు పిడుగులాంటి కంఠధ్వనితో ఇలా పలికాడు.

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు అన్నాడు.

క్రోధం చ నిస్సృతం నేత్రాత్ ధారయామి బృహస్పతే ।
కథం హి కంచుకీం సర్పస్సంధత్తే నోజ్ఝితాం పునః ॥43॥

బృహస్పతీ! నా కన్నులనుంచి వెలువడిన క్రోధాన్ని వెనక్కి తీసుకోలేను. సర్పం తాను విడిచిన కుబుసాన్ని మళ్ళీ ధరించగలుగుతుందా?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇతి శ్రుత్వా వచస్తస్య శంకరస్య బృహస్పతిః ।
ఉవాచ క్లిష్టరూపశ్చ భయవ్యాకులమానసః ॥44॥

శంకరుడి నోటి నుంచి ఈ మాట వినగానే బృహస్పతి ముఖకవళికలు మారాయి. కష్టపెట్టుకున్నాడు. మనస్సు భయంతో వ్యాకులమయ్యింది. అలాగే పలికాడు.

బృహస్పతిరువాచ – బృహస్పతి అభ్యర్థించాడు.

హే దేవ భగవన్ భక్తా అనుకంప్యాస్సదైవ హి ।
భక్తవత్సలనామేతి త్వం సత్యం కురు శంకర ॥45॥

క్షేప్తుమన్యత్ర దేవేశ స్వతేజోఽత్యుగ్రమర్హసి ।
ఉద్ధర్తస్సర్వభక్తానాం సముద్ధర పురందరమ్ ॥46॥

ఓ దేవా! హే భగవన్! ఓ శంకరా! భక్తులు ఎల్లప్పుడూ దయజూడదగినవారే కదా! నువ్వు భక్తవత్సలుడివి. దయచేసి ఈ పేరుని సార్థకం చెయ్యి. దేవాధిదేవా! అత్యుగ్రమైన నీ తేజస్సుని మరొకచోట ఎక్కడైనా విసిరివెయ్యి. భక్తుల్ని అందరినీ ఉద్ధరించేవాడివి. దయచేసి ఈ ఇంద్రుణ్ని ఉద్ధరించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తో గురుణా రుద్రో భక్తవత్సలనామభాక్ ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా సురేజ్యం ప్రణతార్తిహా ॥47॥

దేవగురువు ఇలా అభ్యర్థించే సరికి భక్తవత్సలనామధారి రుద్రుడు ప్రసన్నుడయ్యాడు. ఆయన ప్రణతుల ఆర్తిని తొలగించేవాడు గదా! బృహస్పతికి ఇలా బదులిచ్చాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

ప్రీతః స్తుత్యాఽనయా తాత దదామి వరముత్తమమ్ ।
ఇంద్రస్య జీవదానేన జీవేతి త్వం ప్రథాం వ్రజ ॥48॥

సముద్భూతోఽనలో యోఽయం ఫాలనేత్రాత్సురేశహా ।
ఏనం త్యక్ష్యామ్యహం దూరం యథేంద్రం నైవ పీడయేత్ ॥49॥

నాయనా! బృహస్పతీ! నీ స్తోత్రానికి నేను చాలా సంతోషించాను. నీకొక వరమిస్తున్నాను. ఇంద్రుడికి ప్రాణాలు నిలబెట్టావు కాబట్టి నేటి నుంచి నువ్వు జీవుడు అని ప్రసిద్ధికి ఎక్కుతావు. ఈ దేవేంద్రుణ్ని సంహరించడానికి నా ఫాలనేత్రం నుంచి వెలుపలికి ఉబికివచ్చిన అగ్నిని దీన్ని ఎక్కడికో దూరంగా విసిరేస్తున్నాను. నీ ఇంద్రుణ్ని ఇది బాధించదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యు క్త్వా తం కరే ధృత్వా స్వతేజోఽనలమద్భుతమ్ ।
ఫాలనేత్రాత్సముద్భూతం ప్రాక్షిపల్లవణాంభసి ॥50॥

తతశ్చాంతర్దధే రుద్రో మహాలీలాకరః ప్రభుః ।
గురుశక్రౌ భయాన్ముక్తౌ జగ్మతుస్సుఖముత్తమమ్ ॥51॥

యదర్థం గమనోద్యుక్తౌ దర్శనం ప్రాప్య తస్య వై ।
కృతార్థౌ గురుశుక్రౌ హి స్వస్థానం జగ్మతుర్ముదా ॥52॥

శివుడు ఇలా పలికి వ్యాసమునీ! అద్భుతావహమైన తన తేజస్సును, తన మూడవకంటి నుంచి పెల్లుబికిన ఆ అగ్నిని చేతిలోకి తీసుకుని దూరంగా ఉప్పునీటిసముద్రంలోకి విసిరేశాడు. మహాలీలలు చూపే ప్రభువు ఆ రుద్రుడు వెంటనే అంతర్హితుడయ్యాడు. బృహస్పతి – ఇంద్రుడు భయవిముక్తులై తమ తమ నివాసాలకు సుఖంగా బయలుదేరారు. శివుడి దర్శనం కోరి వచ్చిన ఆ గురుశిష్యులిద్దరూ కృతార్థులై ఆనందంగా ఇళ్ళకు చేరుకున్నారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్ర సంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరవధోపాఖ్యానే శక్రజీవనం నామ త్రయోదశోఽధ్యాయః ॥13॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధర వధోపాఖ్యానంలో శక్రజీవనం అనే పదమూడవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

చతుర్దశోఽధ్యాయః – పద్మాల్గవ అధ్యాయం

జలంధరోత్పత్తి వివాహవర్ణనమ్ – జలంధరోత్పత్తి వివాహవర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

సనత్కుమార సర్వజ్ఞ బ్రహ్మపుత్ర నమోఽస్తు తే ।
శ్రుతేయమద్భుతా మేఽద్య కథా శంభోర్మహాత్మనః ॥1॥

క్షిప్తే స్వతేజసి బ్రహ్మన్ ఫాలనేత్రసముద్భవే ।
లవణాంభసి కిం తాతాభవత్తత్ర వదాఽశు తత్ ॥2॥

సనత్కుమారుడా! సర్వజ్ఞుడా! బ్రహ్మపుత్రుడా! నీకిదే వందనం. మహాత్ముడు శంభుడి వృత్తాంతం, అత్యద్భుత కథ నేటికి విన్నాను. బ్రాహ్మణోత్తమా! ఫాలనేత్రం నుంచి సముద్భవించిన తన తేజస్సును – ఆ అగ్నిని అలా ఉప్పునీటి సముద్రంలోకి విసిరేస్తే అటుపైని ఏమి జరిగిందో – దయచేసి శీఘ్రంగా వివరించండి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు పలికాడు.

శృణు తాత మహాప్రాజ్ఞ శివలీలాం మహాద్భుతామ్ ।
యచ్ఛ్రుత్వా శ్రద్ధయా భక్తో యోగినాం గతిమాప్నుయాత్ ॥3॥

అథో శివస్య తత్తేజః ఫాలనేత్రసముద్భవమ్ ।
క్షిప్తం చ లవణాంభోధౌ సద్యో బాలత్వమాప హ ॥4॥

తత్ర వై సింధుగంగాయాః సాగరస్య చ సంగమే ।
రురోదోచ్చైస్స వై బాలస్సర్వలోకభయంకరః ॥5॥

నాయనా! వ్యాసుడా! మహాప్రాజ్ఞుడా! అత్యద్భుతమైన శివలీల ఇది. దీన్ని శ్రద్ధగా ఆలకించిన భక్తుడు యోగీశ్వరుల సద్గతిని పొందుతాడు. ఫాలనేత్రంనుంచి పుట్టిన తన తేజస్సును శివుడలా లవణసముద్రంలోకి విసిరేస్తే అది అక్కడ వెంటనే ఒక బాలుడుగా మారింది. సింధునదీ సాగరసంగమస్థలం అది. లోకభీకరుడుగా అవతరించిన ఆ బిడ్డడు బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టాడు. (గంగ=నది, నీరు)

రుదతస్తస్య శబ్దేన ప్రాకంపద్ధరణీ ముహుః ।
స్వర్గశ్చ సత్యలోకశ్చ తత్స్వనాద్బధిరీకృతః ॥6॥

బాలస్య రోదనేనైవ సర్వే లోకాశ్చ తత్రసుః ।
సర్వతో లోకపాలాశ్చ విహ్వలీకృతమానసాః ॥7॥

కిం బహూక్తేన విప్రేంద్ర చచాల సచరాచరమ్ ।
భువనం నిఖిలం తాత రోదనాత్తచ్ఛిశోర్విభో ॥8॥

ఆ బిడ్డడి రోదనధ్వనికి భూమి తెగ కంపించింది. స్వర్గలోకమూ సత్యలోకమూ చెవులు చిల్లులుపడ్డాయి. లోకాలన్నీ భీతిల్లాయి. లోకపాలుర అంతరంగాలు కకావికలయ్యాయి. బ్రాహ్మణోత్తమా! వ్యాసమునీంద్రా! ఒక్కముక్కలో చెప్పాలంటే మహాప్రభో! చరాచరజగత్తు అంతా కంపించింది.

అథ తే వ్యాకులాస్సర్వే దేవాస్సమునయో ద్రుతమ్ ।
పితామహం లోకగురుం బ్రహ్మాణం శరణం యయుః ॥9॥

తత్ర గత్వా చ తే దేవా మునయశ్చ సవాసవాః ।
ప్రణమ్య చ సుసంస్తుత్య ప్రోచుస్తం పరమేష్ఠినమ్ ॥10॥

అలా కలత చెందిన దేవతలూ దేవనాయకులూ మునులూ అందరూ కలిసి వెంటనే లోకపితామహుడైన బ్రహ్మదేవుణ్ణి శరణుజొచ్చారు. ఇంద్రుడితో సహా అందరూ చతుర్ముఖుడికి ప్రణామం చేసి ఎంతో సేపు స్తుతించి కడకు ఆ పరమేష్ఠితో ఇలా పలికారు.

దేవా ఊచుః – దేవతలు అభ్యర్థించారు.

లోకాధీశ సురాధీశ భయం నస్సముపస్థితమ్ ।
తన్నాశయ మహాయోగిన్! జాతో ఽయం హ్యద్భుతో రవః ॥11॥

ఓ సర్వలోకాధీశా! ఓ సురాధీశ్వరా! ఓ మహాయోగీ! మాకు వచ్చిపడిన ఈ మహాభయాన్ని దయచేసి తొలగించు. ఇదేదో అద్భుతావహంగా ఒక భీకర రోదనధ్వని మిన్నుముట్టింది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు పలికాడు.

ఇత్యాకర్ణ్య వచస్తేషాం బ్రహ్మా లోకపితామహః ।
గంతుమైచ్ఛత్తతస్తత్ర కిమేతదితి విస్మితః ॥12॥

తతో బ్రహ్మా సురైస్తాతావతరత్సత్యలోకతః ।
రసాం తద్ జ్ఞాతుమిచ్ఛన్స సముద్రమగమత్తదా ॥13॥

యావత్తత్రాగతో బ్రహ్మా సర్వలోకపితామహః ।
తావత్సముద్రస్యోత్సంగే తం బాలం స దదర్శ హ ॥14॥

ఆగతం విధిమాలోక్య దేవరూప్యథ సాగరః ।
ప్రణమ్య శిరసా బాలం తస్యోత్సంగే న్యవేశయత్ ॥15॥

లోకపితామహుడు ఆ బ్రహ్మదేవుడు దేవతల విన్నపం ఆలకించి ఏమిటా ఈ రోదనధ్వని అని నివ్వెరపోయాడు. అది వస్తున్న చోటికి వెళ్ళి – చూడాలనుకున్నాడు. వెంటనే సత్యలోకం నుంచి బయలుదేరాడు. దేవతలు వెంట నడిచారు. భూమికి దిగివచ్చి – ఆ ధ్వని వస్తున్న సముద్రం చెంతకు చేరుకున్నాడు. సముద్రుడి ఒడిలో ఆ బాలుణ్ణి చూశాడు. చేరవచ్చిన బ్రహ్మదేవుణ్ణి తిలకించి సముద్రుడు తన దేవరూపం ధరించి వచ్చి శిరసా నమస్కరించి ఆ బాలుణ్ణి పితామహుడి ఒడిలో ఉంచాడు.

తతో బ్రహ్మాఽబ్రవీద్వాక్యం సాగరం విస్మయాన్వితః ।
జలరాశే ద్రుతం బ్రూహి కస్యాయం శిశురద్భుతః ॥16॥

ఆశ్చర్యచకితుడై బ్రహ్మదేవుడు ఆ సాగరుణ్ని అడిగాడు – ఓ జలరాశీ! త్వరగా చెప్పు, ఈ అద్భుతశిశువు ఎవరిబిడ్డ?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

బ్రహ్మణో వాక్యమాకర్ణ్య ముదితస్సాగరస్తదా ।
ప్రత్యువాచ ప్రజేశం స నత్వా స్తుత్వా కృతాంజలిః ॥17॥

వ్యాసమునీ! బ్రహ్మదేవుడి ప్రశ్నకు సంబరపడి సాగరుడు మరొకసారి నతించి నుతించి అంజలిబద్ధుడై ప్రజాపతికి బదులిచ్చాడు.

సముద్ర ఉవాచ – సముద్రుడు చెప్పాడు.

భోభో బ్రహ్మన్ మయా ప్రాప్తో బాలకోఽయమజానతా ।
ప్రభవం సింధుగంగాయామకస్మాత్సర్వలోకప ॥18॥

జాతకర్మాదిసంస్కారాన్ కురుష్వాద్య జగద్గురో ।
జాతకోక్త ఫలం సర్వం విధాతర్వక్తుమర్హసి ॥19॥

సర్వలోకపతీ! బ్రహ్మదేవుడా! ఈ బాలకుడు ఎవరో తెలియదు, సింధుసాగర సంగమస్థలంలో అకస్మాత్తుగా జన్మించాడు. నా ఒడిలో చేరాడు. నువ్వు జగత్పితవు. ఈ బాలుడికి జాతకర్మాదిసంస్కారాలు జరిపించు. ఇతడి జాతకం ఏమిటో ఎలా ఉంటుందో తెలియజెప్పు విధాతా!.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏవం వదతి పాథోధౌ స బాలస్సాగరాత్మజః ।
బ్రహ్మాణమగ్రహీత్కంఠే విధున్వంతం ముహుర్ముహుః ॥20॥

విధూననం చ తస్యైవం సర్వలోకకృతో విధేః ।
పీడితస్య చ కాలేయ నేత్రాభ్యా మగమజ్జలమ్ ॥21॥

కరాభ్యా మబ్ధిజాతస్య తత్సుతస్య మహౌజసః ।
కథంచిన్ముక్తకంఠస్తు బ్రహ్మా ప్రోవాచ సాదరమ్ ॥22॥

సముద్రుడు ఇలా మాట్లాడుతూండగానే సాగరపుత్రుడు ఆ బాలుడు బ్రహ్మదేవుడి కంఠం పట్టుకుని అదే పనిగా కుదుపనారంభించాడు. జగత్సృష్టికర్త బ్రహ్మదేవుడు ఈ గుంజుడికి తట్టుకోలేకపోయాడు. కన్నీరుబికింది. ఆ సాగరపుత్రుడు గొప్ప ఓజస్వి. విధాత ఎలాగో అతడి పట్టునుంచి మెడ విడిపించుకుని సాదరంగా పలికాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

శృణు సాగర వక్ష్యామి తవాస్య తనయస్య హి ।
జాతకోక్తఫలం సర్వం సమాధానరతః ఖలు ॥23॥

నేత్రాభ్యాం విధృతం యస్మాదనేనైవ జలం మమ ।
తస్మాజ్జలంధరేతీహ ఖ్యాతో నామ్నా భవత్వసౌ ॥24॥

అధునైవైష తరుణస్సర్వశాస్త్రార్థపారగః ।
మహాపరాక్రమో ధీరో యోద్ధా చ రణదుర్మదః ॥25॥

భవిష్యతి చ గంభీరస్త్వం యథా సమరే గుహః ।
సర్వజేతా చ సంగ్రామే సర్వసంపద్విరాజితః ॥26॥

ఇదిగో సాగరా! చెబుతున్నాను, విను. ఈ బాలుడు నీ తనయుడు. ఇతడి జాతకఫలం సమస్తం తెలియజేస్తున్నాను – సావధానంగా ఉన్నావుగదా! ఇతడు నాకు కళ్ళల్లో నీళ్ళు ఉబికించాడు కనక జలంధరుడు అనే పేరుతో ప్రసిద్ధుడవుతాడు. వెంటనే ఇప్పుడే తరుణవయస్కుడైపోతాడు. సమస్తశాస్త్రార్థాలలోనూ పారంగతుడవుతాడు. మహాపరాక్రమశాలి, ధీరుడు, యోధుడు, సమరదుర్మదుడు – అవుతాడు. నీలాగానే లోతు చిక్కని గంభీరుడవుతాడు. కుమారస్వామిలాగా సంగ్రామంలో సర్వవిజేత అవుతాడు. సర్వసంపద్విరాజితుడవుతాడు.

దైత్యానామధిపో బాలస్సర్వేషాం చ భవిష్యతి ।
విష్ణోరపి భవేజ్జేతా న కుతశ్చిత్పరాభవః ॥27॥

అవధ్యస్సర్వభూతానాం వినా రుద్రం భవిష్యతి ।
యత ఏష సముద్భూతస్తత్రైవానీం గమిష్యతి ॥28॥

పతివ్రతాస్య భవితా పత్నీ సౌభాగ్యవర్ధనీ ।
సర్వాంగసుందరీ రమ్యా ప్రియవాక్ఫీలసాగరా ॥29॥

ఈ బాలుడు జలంధరుడు సకల దైత్యులకూ అధిపతి అవుతాడు. విష్ణువుని కూడా జయిస్తాడు. ఇతడికి ఎక్కడా ఎప్పుడూ పరాభవము (ఓటమి) ఉండదు. ఒక్క రుద్రుడికి తప్ప తక్కిన అందరికీ ఇతడు అవధ్యుడు. ఎక్కడ పుట్టాడో అక్కడికి ఇతడిప్పుడు వెళ్ళిపోతాడు. ఇతడికి గొప్ప పతివ్రత భార్య అవుతుంది. ఆవిడ ఇతడికి సౌభాగ్యవర్ధని. సర్వాంగసుందరి. అందంగా ప్రియంగా మాట్లాడుతుంది. ఈ సద్గుణాలలో ఆవిడ – సముద్రానికి సాటివస్తుంది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా శుక్రమాహూయ రాజ్యే తం చాభిషేచయత్ ।
ఆమంత్ర్య సరితాం నాథం బ్రహ్మాంతర్ధానమన్వగాత్ ॥30॥

అథ తద్ధర్మనోత్ఫుల్లనయనస్సాగరస్తదా ।
తమాత్మజం సమాదాయ స్వగేహమగమన్ముదా ॥31॥

అపోషయన్మహోపాయైః స్వబాలం ముదితాత్మకః ।
సర్వాంగసుందరం రమ్యం మహాద్భుతసుతేజసమ్ ॥32॥

అథాంబుధిస్సమాహూయ కాలనేమిం మహాసురమ్ ।
బృందాభిధాం సుతాం తస్య తద్భార్యార్థమయాచత ॥33॥

వ్యాసర్షీ! బ్రహ్మదేవుడు ఈ మాటలు చెప్పి, శుక్రాచార్యుణ్ణి ఆహ్వానించి, దైత్యరాజుగా జలంధరుడికి పట్టాభిషేకం జరిపించాడు. సముద్రుడికి వీడ్కోలు చెప్పి చతుర్ముఖుడు అంతర్ధానం చెందాడు. ఆ బాలకుణ్ణి చూసి సాగరుడి కన్నులు ఆనందంతో విప్పారాయి. అతణ్ణి తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. ఎన్నెన్నో సౌకర్యాలతో సౌఖ్యాలతో ఆ బాలుణ్ణి పరిపోషించాడు. ఆనందపరవశుడయ్యాడు. బాలుడు తరుణుడై సర్వాంగసుందరుడుగా మహాద్భుతతేజస్విగా రూపొందాడు. అప్పుడా సముద్రుడు మహాసురుడైన కాలనేమిని ఆహ్వానించి అతడి కూతురు బృందను జలంధరుడికి భార్యగా (తనకు కోడలిగా) అభ్యర్థించాడు.

కాలనేమ్యసురో వీరోఽసురాణాం ప్రవరస్సుధీః ।
సాధు యేనేఽంబుధేర్యాచ్ఞాం స్వకర్మనిపుణో మునే ॥34॥

జలంధరాయ వీరాయ సాగరప్రభవాయ చ ।
దదౌ బ్రహ్మవిధానేన స్వసుతాం ప్రాణవల్లభామ్ ॥35॥

తదోత్సవో మహానాసీద్వివాహే చ తయోస్తదా ।
సుఖం ప్రాపుర్నదా నద్యోఽసురాశ్చైవాఖిలా మునే ॥36॥

ఈ కాలనేమి ఒక అసురుడు. (విరోచనుడి కొడుకు. హిరణ్యకశిపుడి మునిమనువడు) మహావీరుడు. అసురజాతిలో అగ్రగణ్యుడు. బుద్ధిశాలి. తన పనులను చక్కబెట్టుకోవడంలో నేర్పరి. అంచేత ఓ వ్యాసమునీ! సముద్రుడి అభ్యర్థనను మేల్తరంగా భావించాడు. సాగరపుత్రుడూ మహావీరుడూ అయిన జలంధరుడికి – తనకు ప్రాణసమానమైన కూతురు బృందను ఇచ్చి బ్రాహ్మవివాహం – ఆ పద్ధతిలో – జరిపించాడు. బృందాజలంధరుల వివాహసందర్భంగా ఒక మహోత్సవం జరిగింది. వరుడివైపున సకల నదీనదాలూ వధువువైపున సకల – అసురబృందాలూ ఆనందం పంచుకున్నాయి.

సముద్రోఽతిసుఖం ప్రాప సుతం దృష్ట్వా హి సస్త్రియమ్ ।
దానం దదౌ ద్విజాతిభ్యోఽన్యేభ్యశ్చ యథావిధి ॥37॥

యే దేవైర్నిర్జితాః పూర్వం దైత్యాః పాతాళసంస్థితాః ।
తే హి భూమండలం యాతాః నిర్భయాస్తముపాశ్రితాః ॥38॥

వ్యాసమునీంద్రా! కోడలితో కొడుకుని చూసి సముద్రుడు ఆనందపరవశుడయ్యాడు. బ్రాహ్మణులకూ తక్కినవారికీ యథావిధిగా అనేకదానాలు చేశాడు. మునీశ్వరా! మునుపు దేవతలచేతిలో ఓడిపోయి పాతాళలోకంలో తలదాచుకున్న దైత్యులందరూ ఇప్పుడు నిర్భయంగా భూమండలానికి వచ్చారు. జలంధరుణ్ని ఆశ్రయించారు.

తే కాలనేమి ప్రముఖాస్తతోఽసురాః తస్మై సుతాం సింధుసుతాయ దత్త్వా ।
బభూవురత్యంతముదాన్వితా హి తమాశ్రితా దేవ వినిర్జయాయ ॥39॥

స చాపి వీరోఽంబుధిబాలకోఽసౌ జలంధరాఖ్యోఽసురవీరవీరః ।
సంప్రాప్య భార్యామతిసుందరీం వశీ చకార రాజ్యం హి కవిప్రభావాత్ ॥40॥

కాలనేమి ప్రభృతులు అసురులందరూ – సముద్రపుత్రుడికి బృందనిచ్చి వివాహం చెయ్యడంతో – అత్యంత ప్రముదితులయ్యారు. దేవతల్ని జయించాలనే కోరికతో అందరూ కలిసి జలంధరుణ్ని ఆశ్రయించారు. ఆ అంబుధిబాలకుడు జలంధరుడు మహావీరుడు. ఇప్పుడు అసురవీరులకు నాయకుడయ్యాడు. అత్యంత సౌందర్యవతి బృందను భార్యగా పొంది నిగ్రహసంపన్నుడై శుక్రాచార్యుడి మార్గదర్శకత్వంలో అసురరాజ్యపాలన ఆరంభించాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరవధోపాఖ్యానే జలంధరోత్పత్తి వివాహవర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధర వధోపాఖ్యానంలో జలంధరోత్పత్తి వివాహవర్ణనం అనే పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦ ❦

పంచదశోఽధ్యాయః – పదిహేనవ అధ్యాయం

దేవజలంధరయుద్ధ వర్ణనమ్ – దేవజలంధరయుద్ధ వర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏకదా వారిధిసుతో బృందాపతిరుదారధీః ।
సభార్యస్సంస్థితో వీరోఽసురైస్సర్వైస్సమన్వితః ॥1॥

తత్రాజగామ సుప్రీతస్సువర్చాస్త్వథ భార్గవః ।
తేజః పుంజో మూర్త ఇవ భాసయన్సకలా దిశః ॥2॥

తం దృష్ట్వా గురుమాయాంతమసురాస్తేఽఖిలా ద్రుతమ్ ।
ప్రణేముఃప్రీతమనసస్సింధుపుత్రోఽపి సాదరమ్ ॥3॥

దత్త్వాఽశీర్వచనం తేభ్యో భార్గవస్తేజసాం నిధిః ।
నిషసాదాసనే రమ్యే సంతస్థుస్తేఽపి పూర్వవత్ ॥4॥

అథ సింధ్వాత్మజో వీరో దృష్ట్వా ప్రీత్యా నిజాం సభామ్ ।
జలంధరః ప్రసన్నోఽభూ దనష్టవరశాసనః ॥5॥

తత్ స్థితం ఛిన్నశిరసం దృష్ట్వా రాహుం స దైత్యరాట్ ।
పప్రచ్ఛ భార్గవం శీఘ్రమిదం సాగరనందనః ॥6॥

వ్యాసమహర్షీ! వారిధిసుతుడూ బృందావల్లభుడూ ఉదారధీశాలి మహావీరుడూ అయిన ఆ జలంధరుడు ఒకనాడు సకలాసురులతో సభతీర్చి తాను భార్యాసమేతుడై అగ్రాసనాన కూర్చున్నాడు. అప్పుడక్కడికి చిరునవ్వులతో శుక్రాచార్యుడు (భృగుపుత్రుడు) వచ్చాడు. అతడు మహావర్చస్వి. రూపుదాల్చిన తేజఃపుంజంలా ఉన్నాడు. దశదిశలనూ ప్రకాశింపజేస్తూ వస్తున్న గురువుని అల్లంతదూరంలోనే చూసి వెంటనే సింధుపుత్రుడూ అఖిలాసురులూ లేచి నిలిచి సాదరంగా అతనికి నమస్కరించారు. తేజోనిధి శుక్రాచార్యుడు అందరినీ ఆశీర్వదించి సముచితాసనంలో కూర్చున్నాడు. అప్పుడు అందరూ మునుపటిలాగా ఎవరి స్థానాలలో వారు కూర్చున్నారు. సింధుపుత్రుడు జలంధరుడు తన సభను ప్రేమగా కలయజూశాడు.తిరుగులేని శాసనాధికారి ఆ జలంధరుడు ప్రసన్నచిత్తంతో సభను తిలకించాడు. అప్పుడు ఆ సభలో ఒకచోట – శిరస్సులేని రాహువు కన్పించాడు. వెంటనే సాగరనందనుడు తమ గురువును ఇలా అడిగాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు అడిగాడు.

కేనేదం విహితం రాహోఃశిరశ్ఛేదనకం ప్రభో ।
తద్బ్రూహి నిఖిలం వృత్తం యథావత్తత్త్వతో గురో ॥7॥

గురువర్యా! మహాప్రభూ! రాహువు శిరస్సును ఇలా నరికివేసినది ఎవరు? దయచేసి ఆ వృత్తాంతమంతా వాస్తవంగా జరిగింది జరిగినట్లు నాకు తెలియజెప్పు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య సింధుపుత్రస్య భార్గవః ।
స్మృత్వా శివపదాంభోజం ప్రత్యువాచ యథార్థవత్ ॥8॥

వ్యాసమునీ! సింధుపుత్రుడి ప్రశ్నను ఆలకించి భృగునందనుడు శుక్రాచార్యుడు ఒక్కసారి శివుడి పాదపద్మాలను ధ్యానించి వాస్తవగాథను వివరించాడు.

శుక్ర ఉవాచ – శుక్రుడు వివరించాడు.

జలంధర మహావీర సర్వాసురసహాయక ।
శృణు వృత్తాంతమఖిలం యథావత్కథయామి తే ॥9॥

పురాభవద్బలిర్వీరో విరోచనసుతో బలీ ।
హిరణ్యకశిపోశ్చైవ ప్రపౌత్రో ధర్మవిత్తమః ॥10॥

పరాజితస్సురాస్తేన రమేశం శరణం యయుః ।
సవాసవాః స్వవృత్తాంతమాచఖ్యుః స్వార్థసాధకాః ॥11॥

ఓయీ జలంధరా! సర్వాసురసహాయకా! వృత్తాంతమంతా జరిగిందిజరిగినట్టుగా చెబుతున్నాను విను. ఒకప్పుడు దైత్యనాయకుడు బలిచక్రవర్తి ఉండేవాడు. మహావీరుడు, మహాబలశాలి. విరోచనుడి కుమారుడు. హిరణ్యకశిపుడి మునిమనవడు. ధర్మం తెలిసిన ఉత్తముడు. అతడి చేతిలో దేవతలందరూ పరాజితులయ్యారు. వారందరూపారిపోయి విష్ణుమూర్తిని శరణువేడారు. ఇంద్రుడితోసహా అందరూకలిసి కేవలం స్వార్థబుద్ధితో తమ వృత్తాంతాన్ని శ్రీహరికి విన్నవించుకున్నారు.

తదాజ్ఞయాసురైస్సార్ధం చక్రుస్సంధిమథో సురాః ।
స్వకార్యసిద్ధయే తాత! ఫలకర్మవిచక్షణాః ॥12॥

అథామృతార్థం సింధోశ్చ మథనం చక్రురాదరాత్ ।
విష్ణోస్సహాయినస్తే హి సురాస్సర్వే ఽసురై స్సహ ॥13॥

తతో రత్నోపహరణమకార్ష్ణు ర్దైత్యశత్రవః ।
జగృహుర్యత్నతో దేవాః పపురప్యమృతం ఫలాత్ ॥14॥

శ్రీహరిఇచ్చిన ఆజ్ఞమేరకు సురలు అసురులతో సంధి కుదుర్చుకున్నారు. నాయనా! ఇది కేవలం స్వకార్యసిద్ధికోసం – మోసగించడంలో నిపుణులైన దేవతలు కుదుర్చుకున్న సంధి. అటుపైని సురలూ అసురులు కలిసి మైత్రిగా సముద్రమథనం చేశారు. వీరందరికీ విష్ణుమూర్తి సహాయం చేశాడు. క్షీరసముద్రంనుంచి లభిస్తున్న

రత్నాల అపహరణం అనే పని మొదలయ్యింది. దైత్యశత్రువులు దేవతలు విలువైన వాటిని అన్నింటినీ కాజేశారు. మోసగించి అమృతమూ తాగేశారు.

తతః పరాభవం చక్రురసురాణాం సహాయతః ।
విష్ణోస్సురాస్సశక్రాస్తేఽమృతపానాద్బలాన్వితాః ॥15॥

శిరశ్ఛేదం చకారాసౌ పిబతశ్చామృతం హరిః ।
రాహోర్దేవసభాయాం హి పక్షపాతీ హరేస్సదా ॥16॥

అటుపైని విష్ణుమూర్తి సహకారంతో ఇంద్రాది దేవతలు – అప్పటికే అమృతపానంతో మరింత బలిష్ఠులై అసురులను పరాభవించారు. అదే దేవసభలో (సుధర్మ) శ్రీహరి– అమృతం తాగబోతున్న రాహువుకి శిరశ్ఛేదం చేశాడు. విష్ణుమూర్తి ఎప్పుడూ ఇంద్రుడి పక్షపాతమే కదా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏవం కవిస్తస్య శిరశ్ఛేదం రాహోః శశంస చ ।
అమృతార్థే సముద్రస్య మంథనం దేవకారితమ్ ॥17॥

రత్నోపహరణం చైవ దైత్యానాం చ పరాభవమ్ ।
దేవైరమృతపానం చ కృతం సర్వం చ విస్తరాత్ ॥18॥

తదాకర్ణ్య మహావీరోఽంబుధిబాలః ప్రతాపవాన్ ।
చుక్రోధ క్రోధరక్తాక్షః స్వపితుర్మంథనం తదా ॥19॥

వ్యాసమునీ! ఈ విధంగా శుక్రాచార్యుడు రాహువు శిరశ్ఛేదం గురించి, అమృతంకోసం దేవతలు చేసిన సముద్రమథనం గురించీ, రత్నాపహరణం గురించీ దైత్యులకు జరిగిన పరాభవం గురించి, దేవతల అమృతపానం గురించి, సమస్తమూ సవిస్తరంగా చెప్పాడు. మహావీరుడు మహాప్రతాపుడు అయిన ఆ జలంధరుడు అంతా విన్నాడు. తన తండ్రిని అలా మథించారా అని క్రోధతామ్రాక్షుడయ్యాడు.

అథ దూతం సమాహూయ ఘుస్మరాభిధముత్తమమ్ ।
సర్వం శశంస చరితం యదాహ గురురాత్మవాన్ ॥20॥

అథ తం ప్రేషయామాస స్వదూతం శక్రసన్నిధౌ ।
సమ్మాన్య బహుశః ప్రీత్యాఽభయందత్త్వా విశారదమ్ ॥21॥

వెంటనే ఘుస్మరుడనే ఉత్తమదూతను పిలిచాడు. శుక్రాచార్యుడు చెప్పిన వృత్తాంతమంతా అతనికి వివరించాడు. ఇంద్రుడి సన్నిధికి తన దూతగా అతణ్ని సన్నద్ధం చేశాడు. ప్రేమతో గొప్పగా సత్కరించి, అభయం ఇచ్చి, ఆ నేర్పరిని ఇంద్రుడి దగ్గరికి పంపించాడు.

దూతస్తివిష్టపం తస్య జగామామరమరం సుధీః ।
ఘుస్మరోఽంబుధిబాలస్య సర్వదేవసమన్వితమ్ ॥22॥

బుద్ధిశాలి ఈ ఘస్మరుడు. జలంధరుడి దూతగా – సకల దేవనిలయమైన త్రివిష్టపానికి వేగంగా చేరుకున్నాడు.

తత్ర గత్వా స దూతస్తు సుధర్మాం ప్రాప్య సత్వరమ్ ।
గర్వాదఖర్వమౌళిర్హి దేవేంద్రం వాక్యమబ్రవీత్ ॥23॥

త్రివిష్టపానికి వెంటనే వెళ్ళి సరాసరి ఇంద్రుడి సభాభవనం సుధర్మలోనికి ప్రవేశించాడు. దేవేంద్రుడికి శిరసువంచలేదు నమస్కరించలేదు. అదీ అతడి గర్వం. ఇంద్రుడితో ఇలా పలికాడు.

ఘస్మర ఉవాచ – ఘస్మరుడు పలికాడు.

జలంధరోఽబ్ధితనయస్సర్వదైత్యజనేశ్వరః ।
సుప్రతాపీ మహావీరః స్వయం కవి సహాయవాన్ ॥24॥

దూతోఽహం తస్య వీరస్య ఘస్మరాఖ్యో న ఘస్మరః ।
ప్రేషితస్తేన వీరేణ త్వత్సకాశమిహాగతః ॥25॥

అవ్యాహతాజ్ఞస్సర్వత్ర జలంధర ఉదగ్రధీః ।
నిర్జితాఖిలదైత్యారి స్సయదాహ శృణుష్వ తత్ ॥26॥

సకల దైత్యులకూ అధిపతి – జలంధరుడు. ఆయన సముద్రుడి కొడుకు. మహావీరుడు. మహాప్రతాపశాలి. శుక్రాచార్యుడు స్వయంగా మా దైత్యపతికి సహాయకుడు. ఆ మహావీరుడి దూతను నేను. నా పేరు ఘస్మరుడు పేరుకే ఘస్మరుణ్ణి కానీ నిజంగా ఘస్మరుణ్ణి (వినాశకుడను) కాను. ఆయన పంపితే మీ దగ్గరికి వచ్చాను. జలంధరుడి ఆజ్ఞకు తిరుగులేదు. అతడిది నిత్యజాగరూకమైన బుద్ధి. దైత్యశత్రువులనందరినీ నిర్జించిన ఘనుడు. ఆ జలంధరుడు ఏమన్నాడో – వినండి.

జలంధర ఉవాచ – జలంధరుడు అన్నాడు.

కస్మాత్త్వయా మమ పితా మథితస్సాగరోఽద్రిణా ।
నీతాని సర్వరత్నాని పితుర్మే దేవతాధమ ॥27॥

ఉచితం న కృతం తేఽద్య తాని శీఘ్రం ప్రయచ్ఛ మే ।
మమాయాహి విచార్యేత్థం శరణం దైవతైస్సహ ॥28॥

అన్యథా తే భయం భూరి భవిష్యతి సురాధమ ।
రాజ్యవిధ్వంసనం చైవ సత్యమేతద్ధ్రువీమ్యహమ్ ॥29॥

ఓరీ! దేవతాధమా! మా తండ్రి సాగరుణ్ణి నువ్వు పర్వతంతో ఎందుకని మథించావు? సర్వరత్నాలనూ ఎందుకని అపహరించావు? నువ్వు చేసింది మంచిపని కాదు. ఆ రత్నాలను అన్నింటినీ తెచ్చి వెంటనే నాకు అప్పగించు. బాగా ఆలోచించుకో. నీ దేవతాసమూహంతో వచ్చి నన్ను శరణు వేడుకో. లేదంటే – ఓరీ సురాధమా! నీకు మహాభయంకర పరిస్థితి ఎదురవుతుంది. రాజ్యవిధ్వంసనం జరుగుతుంది. నిజం చెబుతున్నాను సుమా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి దూతవచః శ్రుత్వా విస్మితస్త్రిదశాధిపః ।
ఉవాచ తం స్మరన్నింద్రో భయరోషసమన్వితః ॥30॥

అద్రయో మద్భయాత్ త్రస్తాః స్వకుక్షిస్థా యతః కృతాః ।
అన్యేఽపి మద్విషస్తేన రక్షితా దితిజాః పురా ॥31॥

తస్మాత్తద్రత్నజాతం తు మయా సర్వం హృతం కిల ।
న తిష్ఠతి మమ ద్రోహీ సుఖం సత్యం బ్రవీమ్యహమ్ ॥32॥

వ్యాసర్షీ! జలంధరుడి మాటగా ఆ దూత చెప్పినది విని త్రిదశాధిపతి ఆశ్చర్యపోయాడు. ఒకవైపు భయమూ మరోవైపు రోషమూ ఉబికి వచ్చాయి. వాటిని ఆపుచేసుకుంటూ గతాన్ని గుర్తుచేసుకుంటూ బదులు పలికాడు. వెనకటికి నాకు భయపడి పారిపోతున్న రెక్కలపర్వతాలకు సముద్రుడు ఆశ్రయమిచ్చాడు. వాటిని తన కడుపులో దాచాడు. ఇంకా ఇలాగే నా శత్రువులైన దైత్యుల్ని చాలామందిని రక్షించాడు. అందుకని సముద్రుడిలో ఉన్న రత్నరాశినిమొత్తం నేనుహరించాను. నాకు అపకారంచేసినవాడెవ్వడూ సుఖంగా ఉండలేడు. ఇది నిజం చెబుతున్నాను, తెలుసుకో.

శంఖోఽప్యేవం పురా దైత్యో మాం ద్విషన్ సాగరాత్మజః ।
అభవన్మూఢచిత్తస్తు సాధుసంఘాత్సముజ్ఝితః ॥33॥

మమానుజేన హరిణా నిహతస్య హి పాపధీః ।
హింసకస్సాధుసంఘస్య పాపిష్ఠస్సాగరోదరే ॥34॥

తద్గచ్ఛ దూత శీఘ్రం త్వం కథయస్వాస్య తత్త్వతః ।
అబ్ధిపుత్రస్య సర్వం హి సింధోర్మంథనకారణమ్ ॥35॥

వెనకటికి ఇలాగే శంఖుడు అని మరొక దైత్యుడు. సముద్రుడి కొడుకే. నాతో వైరం పెట్టుకున్నాడు మూఢుడు. సజ్జనసమూహాలు అతణ్ని వెలివేశాయి. ఈ పాపిష్ఠివాడు వాళ్ళనందరినీ హింసించనారంభించాడు. అప్పుడు మా తమ్ముడు శ్రీహరి ఆ శంఖుణ్ణి సముద్రగర్భంలో సంహరించాడు. అందుకని ఓరీ దూతా!వెళ్ళు శీఘ్రంగా వెళ్ళి మీ అబ్ధిపుత్రుడు జలంధరుడికి తెలియజెప్పు – ఈ కారణంగా మేము వాళ్ళనాన్నని మథించామని.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్థం విసర్జితో దూతో ఘస్మరాఖ్యస్సుబుద్ధిమాన్ ।
తదేంద్రేణాగమత్తూర్ణం యత్ర వీరో జలంధరః ॥36॥

తదిదం వచనం దైత్యరాజో హి తేన ధీమతా ।
కథితో నిఖిలం శక్రప్రోక్తం దూతేన వై తదా ॥37॥

తన్నిశమ్య తతో దైత్యో రోషాత్ ప్రస్ఫురితాధరః ।
ఉద్యోగమకరోత్తూర్ణం సర్వదేవజిగీషయా ॥38॥

ఇలా చెప్పి ఇంద్రుడు సాగనంపితే బుద్ధిశాలి ఆ దూత ఘస్మరుడు వేగంగా తమ మహావీరుడైన జలంధరుడి దగ్గరికి తిరిగివచ్చాడు. వస్తూనే తనతో ఇంద్రుడు అన్నదిఅన్నట్టు మొత్తం దైత్యరాజుకి విన్నవించాడు. అది వింటూనే సముద్రపుత్రుడు రోషావిష్టుడయ్యాడు. అతడి పెదవులు కోపంతోఅదిరాయి. సకలదేవతలనూ జయించితీరాలి అనే నిశ్చయానికివచ్చాడు. వెంటనే ఆ ప్రయత్నం మొదలుపెట్టాడు.

తదోద్యోగేఽసురేంద్రస్య దిగ్భ్యః పాతాళతస్తథా ।
దితిజాః ప్రత్యపద్యంత కోటిశః కోటిశస్తథా ॥39॥

అథ శుంభనిశుంభాద్యైర్బలాధిపతికోటిభిః ।
నిర్జగామ మహావీరః సింధుపుత్రః ప్రతాపవాన్ ॥40॥

ప్రాప త్రివిష్టపం సద్యః సర్వసైన్యసమావృతః ।
దధ్మౌ శంఖం జలధిజో నేదుర్వీరాశ్చ సర్వతః ॥41॥

గత్వా త్రివిష్టపం దైత్యో నందనాధిష్ఠితోఽభవత్ ।
సర్వం సైన్యం సమావృత్య కుర్వాణః సింహవద్రవమ్ ॥42॥

పురమావృత్య తిష్ఠత్తద్దృష్ట్వా సైన్యబలం మహత్ ।
నిర్యయుస్త్వమరావత్యా దేవా యుద్ధాయ దంశితాః ॥43॥

దైత్యేంద్రుడు జలంధరుడిప్రయత్నం తెలియగానే దశదిశలనుంచీ పాతాళంనుంచీ దైత్యులు కోట్లు కోట్లుగా వచ్చి అతడి వెంట నిలిచారు. శుంభ నిశుంభాదిదైత్యసేనాపతులు కోటి కోటి సైన్యంతో అండగా వచ్చారు. మహావీరుడూ మహాప్రతాపవంతుడూ అయిన జలంధరుడు ఈ మహాసైన్యంతో వెంటనే త్రివిష్టపం చేరుకున్నాడు. శంఖం పూరించాడు. దైత్యవీరులు నినదించారు. అంతా నందనవనంలో దండువిడిశారు. జలంధరుడు సింహనాదం చేస్తూ సేనతో అమరావతిని చుట్టుముట్టాడు. అంతటి దైత్యమహాసైన్యాన్ని చూసి దేవతలు కవచాదులు ధరించి సన్నద్ధులై యుద్ధంకోసం పురం నుండి బయలుదేరి వచ్చారు.

తతస్సమభవద్యుద్ధం దేవదానవసేనయోః ।
ముసలైః పరిఘైర్బాణైర్గదాపరశుశక్తిభిః ॥44॥

తేఽన్యోన్యం సమధావేతాం జఘ్నతుశ్చ పరస్పరమ్ ।
క్షణేనాభవతాం సేనే రుధిరౌఘపరిప్లుతే ॥45॥

పతితైః పాత్యమానైశ్చ గజాశ్వరథపత్తిభిః ।
వ్యరాజత రణే భూమి స్సంధ్యాభ్రపటలైరివ ॥46॥

అప్పుడు దేవదానవమహాసేనలకు భీకరయుద్ధం జరిగింది. ముసలాలు పరిఘులు బాణాలు గదలు పరశువులు శక్తులు – ఇలాంటి ఆయుధాలతో పోరాటం సాగింది. సమానంగా పరుగులుతీస్తూ పరస్పరం చంపుకున్నారు. ఒక్కక్షణకాలంలో ఉభయసైన్యాలు నెత్తురుటేరుల్లో తడిసిముద్ద అయ్యాయి. నేలకు ఒరిగిన ఒరుగుతున్న గజ – అశ్వ – రథ – భటాదులతో ఆ రణరంగం – సంధ్యారుణ మేఘమాలికలతోటి ఆకాశంలాగా భాసిల్లింది.

తత్ర యుద్ధే మృతాన్ దైత్యాన్ భార్గవస్తానజీవయత్ ।
విద్యయా మృతజీవిన్యా మంత్రితైస్తోయబిందుభిః ॥47॥

దేవానపి తథా యుద్ధే తత్రాజీవయదంగిరాః ।
దివ్యౌషధైస్సమానీయ ద్రోణాద్రేస్స పునః పునః ॥48॥

దృష్ట్వాన్స తథా యుద్ధే పునరేవ సముత్థితాన్ ।
జలంధరః క్రోధవశో భార్గవం వాక్యమబ్రవీత్ ॥49॥

ఆ యుద్ధంలో మరణించిన దైత్యులనందరినీ శుక్రాచార్యుడు తానెరిగిన మృతసంజీవినీవిద్యతో మంత్రించిన నీళ్ళు చిలకరించి పునరుజ్జీవితుల్ని చేశాడు. అలాగే బృహస్పతి ద్రోణపర్వతం నుంచి దివ్యౌషధాలు తెచ్చి దేవసైనికుల్ని బతికించాడు. ఇలా మళ్ళీ బతికి లేచి నిలబడి యుద్ధం చేస్తున్నారు దేవతలు. ఇది చూడటంతో జలంధరుడికి క్రోధం కట్టలు తెంచుకుంది. శుక్రుణ్ణి అడిగాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు అడిగాడు.

మయా దేవా హతా యుద్ధే ఉత్తిష్ఠంతి కథం పునః ।
తతస్సంజీవినీ విద్యా నైవాన్యత్రేతి వై శ్రుతా ॥50॥

గురువర్యా! ఇదేమిటి, రణరంగంలో నా చేతిలో మడిసిన దేవతలు మళ్ళీ లేస్తున్నారు? ఈ సంజీవినీ విద్య నీకు తప్ప మరింకెవ్వరికీ తెలియదనికదా నేను విన్నది!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య సింధుపుత్రస్య భార్గవః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా గురుః శుక్రో జలంధరమ్ ॥51॥

వ్యాసర్షీ! జలంధరుడి సందేహాన్ని ఆలకించి దైత్యగురువు శుక్రాచార్యుడు ప్రసన్నచిత్తంతో అతడికి బదులిచ్చాడు.

శుక్ర ఉవాచ – శుక్రుడు పలికాడు.

దివ్యౌషధీస్సమానీయ ద్రోణాద్రేరంగిరాస్సురాన్ ।
జీవయత్యేష వై తాతః సత్యం జానీహి మే వచః ॥52॥

జయమిచ్ఛసి చేత్తాత! శృణు మే వచనం శుభమ్ ।
తతస్సోఽరం భుజాభ్యాం త్వం ద్రోణమబ్ధావుపాహర ॥53॥

నాయనా! జలంధరా! బృహస్పతి – దేవగురువు – ద్రోణాద్రి నుంచి దివ్యౌషధుల్ని తెచ్చి దేవతలను పునరుజ్జీవింపజేస్తున్నాడు. ఇది నిజం, నా మాట నమ్ము. నీకు జయమే కావాలనుకుంటే ఒక మంచిమాట చెబుతాను, విను. వెంటనే ఆ ద్రోణపర్వతాన్ని నీ చేతులతో పెల్లగించి సముద్రంలోకి విసిరెయ్యి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తస్య తు దైత్యేంద్రో గురుణా భార్గవేణ హ ।
ద్రుతం జగామ యత్రాసౌ అస్తే చైవాద్రిరాట్ చ సః ॥54॥

భుజాభ్యాం తరసా దైత్యో నీత్వా ద్రోణం చ తం తదా ।
ప్రాక్షిపత్సాగరే తూర్ణం చిత్రం న హరతేజసి ॥55॥

పునరాయాన్మహావీర స్సింధుపుత్రో మహాహవమ్ ।
జఘానాస్త్రైశ్చ వివిధైస్సురాన్ కృత్వా బలం మహత్ ॥56॥

గురువు శుక్రాచార్యుడు ఇలా చెప్పేసరికి జలంధరుడు వెంటనే బయలుదేరాడు. ఆ పర్వతరాజాన్ని చేరుకున్నాడు. చేతులతో అలవోకగా పెళ్ళగించి సముద్రంలోకి విసిరేశాడు. శివాంశసంభవుడి విషయంలో ఇది వింతకాదు. రణరంగానికి తిరిగివచ్చాడు. వస్తూనే రెట్టించిన బలంతో రకరకాల ఆయుధాలను ప్రయోగించి దేవతలను చితకబాదాడు, చావగొట్టాడు.

అథ దేవాన్ హతాన్ దృష్ట్వా ద్రోణాద్రిమగమద్గురుః ।
తావత్తత్ర గిరీంద్రం తం న దదర్శ సురార్చితః ॥57॥

జ్ఞాత్వా దైత్యహృతం ద్రోణం ధిషణో భయవిహ్వలః ।
ఆగత్య దేవాన్ ప్రోవాచ జీవో వ్యాకులమానసః ॥58॥

అతడి చేతిలో అలా దేవతలు చనిపోతూంటే చూసి దేవగురువు బృహస్పతి మళ్ళీ హడావిడిగా ద్రోణాద్రికి పరుగుపెట్టాడు. అతడికి అక్కడ ఆ పర్వతం కనిపించలేదు. జలంధరుడు దాన్ని సముద్రంలోకి విసిరేశాడన్నది తెలుసుకుని భయంతో నిలువునా వణికిపోయాడు. జీవుడి (గురుని) మనస్సంతా కకావికలమయ్యింది. దేవతల చెంతకు పరుగుపరుగున వచ్చాడు. ఇలా అన్నాడు

గురురువాచ – బృహస్పతి అన్నాడు.

పలాయధ్వం సురాస్సర్వే ద్రోణో నాస్తి గిరిర్మహాన్ ।
ధ్రువం ధ్వస్తశ్చ దైత్యేన పాథోధి తనయేన హి ॥59॥

జలంధరో మహాదైత్యో నాయం జేతుం క్షమో యతః ।
రుద్రాంశసంభవో హ్యేష సర్వామరవిమర్దనః ॥60॥

మయా జ్ఞాతః ప్రభావోఽస్య యథోత్పన్నః స్వయం సురాః ।
శివాపమానకృచ్ఛ్రచేష్టితం స్మరతాఖిలమ్ ॥61॥

దేవతలారా! అందరూ రణరంగం నుంచి పారిపోండి. అక్కడ ద్రోణమహాపర్వతం కనుమరుగయ్యింది. కచ్చితంగా దాన్ని సముద్రతనయుడు జలంధరుడే ధ్వంసం చేశాడు. వీడు మహాదైత్యుడు. రుద్రాంశసంభవుడు.

సకల దేవతలనూ నుగ్గునుగ్గు చేస్తాడు. వీణ్ణి జయించడం అసంభవం. వీడు ఎలా జన్మించాడో వీడి ప్రభావం ఏమిటో నాకు తెలుసు. శివుణ్ణి అవమానించిన మన ఇంద్రుడి పిచ్చిచేష్టను ఒకసారి గుర్తుతెచ్చుకోండి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శ్రుత్వా తద్వచనం దేవాస్సురాచార్యప్రకీర్తితమ్ ।
జయాశాం త్యక్తవంతస్తే భయవిహ్వలితాస్తథా ॥62॥

దైత్యరాజేన తేనాతి హన్యమానాస్సమంతతః ।
ధైర్యం త్యక్త్వా పలాయంత దిశో దశ సవాసవాః ॥63॥

సురాచార్యుడు గొంతెత్తి చెప్పిన ఈ మాటను వినడంతోనే దేవతలు గెలుపు మీద ఆశ వదులుకున్నారు. దైత్యరాజు విజృంభించి చితకబాదుతోంటే ఇంద్రుడితో సహా అందరూ ధైర్యాన్ని వదిలి పెట్టి బెంబేలెత్తిపోయారు. దశదిశలకూ పలాయనం చిత్తగించారు.

దేవాన్విద్రావితాన్ దృష్ట్వా దైత్యస్సాగరనందనః ।
శంఖభేరీ జయరవైః ప్రవివేశామరావతీమ్ ॥64॥

ప్రవిష్టే నగరీం దైత్యే దేవాః శక్రపురోగమాః ।
సువర్ణాద్రిగుహాం ప్రాప్తాన్యవసన్ దైత్యతాపితాః ॥65॥

తదైవ సర్వేష్వసురోఽధికారే ష్వింద్రాదికానాం వినివేశ్య సమ్యక్ ।
శుంభాదికాన్ దైత్యవరాన్ పృథక్ పృథక్ స్వయం సువర్ణాద్రిగుహాం వ్యగాన్మునే ॥66॥

వ్యాసమునీ! అలా దేవతలంతా పారిపోవడాన్ని కళ్ళారా చూసి సాగరనందనుడు ఆ జలంధరుడు శంఖభేరీధ్వనులతో జయజయధ్వానాలతో అమరావతీపట్టణంలోకి ప్రవేశించాడు. పారిపోయిన ఇంద్రాది దేవతలు మేరుపర్వతగుహలో ప్రవేశించి తలదాచుకున్నారు. జలంధరుడు పెట్టిన హింసకు కుమిలిపోతూ కాలం గడిపారు. అప్పుడా దైత్యేంద్రుడు ఇంద్రాదుల అధికారపీఠాలలో శుంభ నిశుంభాది దైత్యవర్యుల్ని ఒక్కొక్కరిని నియమించి తాను స్వయంగా మేరుపర్వతగుహకు బయలుదేరాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధకాండే జలంధరవధోపాఖ్యానే దేవజలంధర యుద్ధవర్ణనం నామ పంచదశోఽధ్యాయః ॥15॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధరవధో పాఖ్యానంలో దేవజలంధరయుద్ధవర్ణనమనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.

షోడశోఽధ్యాయః – పదహారవ అధ్యాయం

దేవయుద్ధవర్ణనమ్ – దేవయుద్ధవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

పునర్దైత్యం సమాయాంతం దృష్ట్వా దేవాస్సవాసవాః ।
భయాత్ప్రకంపితాస్సర్వే సహైవాదుద్రువుర్ద్రుతమ్ ॥1॥

వైకుంఠం ప్రయయుస్సర్వే పురస్కృత్య ప్రజాపతిమ్ ।
తుష్టువుస్తే సురా నత్వా సప్రజాపతయోఽఖిలాః ॥2॥

వ్యాసమహర్షీ! మళ్ళీ వచ్చిపడిన జలంధరుణ్ణి చూసి ఇంద్రాది దేవతలందరూ భయకంపితులై మేరుగుహ నుంచి వెంటనే పరుగు లంకించుకున్నారు. బ్రహ్మదేవుణ్ణి అగ్రభాగాన నిల్పుకొని వైకుంఠం చేరుకున్నారు. అందరూ శ్రీహరికి నమస్కరించి అతణ్ణి స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

హృషీకేశ మహాబాహో భగవన్ మధుసూదన ।
నమస్తే దేవదేవేశ సర్వదైత్యవినాశక ॥3॥

మత్స్యరూపాయ తే విష్ణో వేదాన్నీతవతే నమః ।
సత్యవ్రతేన సద్రాజ్ఞా ప్రళయాబ్ధివిహారిణే ॥4॥

కుర్వాణానాం సురాణాం చ మంథనాయోద్యమం భృశమ్ ।
బిభ్రతే మందరగిరిం కూర్మరూపాయ తే నమః ॥5॥

నమస్తే భగవన్నాథ క్రతవే సూకరాత్మనే ।
వసుంధరాం జనాధారాం మూర్ధతో బిభ్రతే నమః ॥6॥

హృషీకేశా! మహాబాహూ! భగవాన్! మధుసూదనా! దేవాధిదేవా! దైత్యవినాశకా! నీకిదే వందనం. మత్స్యరూపం ధరించి సోమకాసురుణ్ణి సంహరించి వేదాలను కాపాడినవాడా! సత్యవ్రతుడనే ఉత్తమపరిపాలకుడితో కలిసి ప్రళయమహాసముద్రంలో విహరించేవాడా! నీకిదే వందనం. సాగరమథనానికి దేవతలంతా మహోద్యమం చేస్తుండగా కూర్మరూపం ధరించి మందరాద్రిని వహించినవాడా! హే భగవాన్! హే నాథా! యజ్ఞవరాహరూపం వహించి జనాధారమైన భూగోళాన్ని ముట్టెతో మోసినవాడా! నీకిదే వందనం.

వామనాయ నమస్తుభ్యముపేంద్రాఖ్యాయ విష్ణవే ।
విప్రరూపేణ దైత్యేంద్రం బలిం ఛలయతే విభో ॥7॥

నమః పరశురామాయ క్షత్రనిఃక్షత్రకారిణే ।
మాతుహితకృతే తుభ్యం కుపితాయాసతాం ద్రుహే ॥8॥

రామాయ లోకరామాయ మర్యాదాపురుషాయ తే ।
రావణాంతకరాయాశు సీతాయాః పతయే నమః ॥9॥

నమస్తే జ్ఞానగూఢాయ కృష్ణాయ పరమాత్మనే ।
రాధావిహారశీలాయ నానాలీలాకరాయ చ ॥10॥

బ్రాహ్మణవటురూపం ధరించి బలిచక్రవర్తిని మోసం చేసిన వామనరూపా! ఉపేంద్రనామం వహించినవాడా! నీకిదే వందనం. కన్నతల్లికి హితకరుడవై భూమిని క్షత్రియరహితం చేసిన పరశురామా! అసజ్జనుల పట్ల కోపించేవాడా! నీకిదే వందనం. లోకులకు ఆనందకరుడవై మర్యాదాపురుషోత్తముడివై రామావతారం ధరించి సీతావల్లభుడివై రావణాసురుణ్ణి సంహరించినవాడా! కృష్ణావతారంలో నిగూఢజ్ఞానంతో పరమాత్మవై రాధాపతివై అనేక లీలావిలాసాలు ప్రదర్శించినవాడా! నీకిదే వందనం.

నమస్తే గూఢదేహాయ వేదనిందాకరాయ చ ।
యోగాచార్యాయ జైనాయ బౌద్ధరూపాయ మాపతే ॥11॥

నమస్తే కల్కిరూపాయ మ్లేచ్ఛానామంతకారిణే ।
అనంతశక్తిరూపాయ సద్ధర్మస్థాపనాయ చ ॥12॥

నమస్తే కపిలరూపాయ దేవహూత్యై మహాత్మనే ।
వదతే సాంఖ్యయోగం చ సాంఖ్యాచార్యాయ వై ప్రభో ॥13॥

గూఢదేహధారివై వేదనిందాకరుడివై యోగాచార్యుడివై జైనుడివై బుద్ధావతారం ధరించిన రమాపతీ! కల్కిరూపం ధరించి అనంతశక్తిసంపన్నుడివై సద్ధర్మస్థాపన కోసం మ్లేచ్ఛులను సంహరించినవాడా! కపిలరూపివై దేవహూతికి సాంఖ్యయోగం ప్రబోధించిన సాంఖ్యాచార్యా! మహాత్మా! ప్రభూ! నీకిదే వందనం.

నమః పరమహంసాయ జ్ఞానం సంవదతే పరమ్ ।
విధాత్రే జ్ఞానరూపాయ యేనాత్మా సంప్రసీదతి ॥14॥

వేదవ్యాసాయ వేదానాం విభాగం కుర్వతే నమః ।
హితాయ సర్వలోకానాం పురాణరచనాయ చ ॥15॥

ఏవం మత్స్యాదితనుభిర్భక్తకార్యోద్యతాయ తే ।
సర్గస్థితిధ్వంసకర్త్రే నమస్తే బ్రహ్మణే ప్రభో ॥16॥

పరమహంసా! దివ్యజ్ఞానం ప్రబోధించేవాడా! విధాతా! జ్ఞానరూపా! నువ్వు బోధించే దివ్యజ్ఞానంతో ఆత్మ ప్రసన్నమవుతుంది, కలత దేరుతుంది. వేదాలను విభాగం చేసిన వేదవ్యాసా! సర్వలోకహితం కోరి పురాణరచన

చేసినవాడా! ఇలా మత్స్యాదిరూపాలతో భక్తుల కార్యాలను చక్కబెట్టేవాడా! సర్గ – స్థితి – లయాలను చేసేవాడా! పరబ్రహ్మా! మహాప్రభూ! నీకిదే వందనం.

ఆర్తిహర్త్రే స్వదాసానాం సుఖదాయ శుభాయ చ ।
పీతాంబరాయ హరయే తార్క్ష్యయానాయ తే నమః ॥
సర్వక్రియాయైకకర్త్రే శరణాయ నమో నమః ॥17॥

దైత్యసంతాపితామర్త్య దుఃఖాదిధ్వంసవజ్రక ।
శేషతల్పశయాయార్కచంద్రనేత్రాయ తే నమః ॥18॥

దాసుల ఆర్తిని తొలగించేవాడా! సుఖదాయకా! శుభదాయకా! పీతాంబరధారీ! హరీ! గరుడవాహనా! సమస్తక్రియలకూ ఏకైక కర్తా! శరణ్యా! దైత్యపీడితులైన మానవుల దుఃఖాదుల్ని ధ్వంసం చేసే వజ్రాయుధమా! శేషతల్పశయనా! సూర్య–చంద్ర నయనా! నీకిదే వందనం.

కృపాసింధో రమానాథ పాహి నశ్శరణాగతాన్ ।
జలంధరేణ దేవాశ్చ స్వర్గాత్సర్వే నిరాకృతాః ॥19॥

సూర్యోనిస్సారితః స్థానాత్ చంద్రో వహ్నిస్తథైవ చ ।
పాతాళాన్నాగరాజశ్చ ధర్మరాజో నిరాకృతః ॥20॥

విచరంతి యథా మర్త్యాః శోభంతే నైవ తే సురాః ।
శరణం తే వయం ప్రాప్తా వధస్తస్య విచింత్యతామ్ ॥21॥

ఓ దయాసముద్రమా! లక్ష్మీపతీ! శరణు కోరివచ్చిన మమ్ము రక్షించు జలంధరుడు మా దేవతల్ని అందర్నీ స్వర్గం నుంచి తరిమేశాడు. సూర్యచంద్రులకి స్థానభ్రంశం కలిగించాడు. అగ్నిదేవుణ్నీ అలాగే చేశాడు. నాగరాజు – ఆదిశేషుణ్ని పాతాళం నుంచి పంపివేశాడు. యమధర్మరాజునీ నిరాకరించాడు. ఇవ్వేళ మేమంతా శోభకోల్పోయి మానవమాత్రులుగా తిరుగుతున్నాం. నిన్ను శరణు వేడుకుంటున్నాం. అతణ్ని చంపడం గురించి ఆలోచించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి దీనవచః శ్రుత్వా దేవానాం మధుసూదనః ।
జగాద కరుణాసింధుర్మేఘనిర్హ్రాదయా గిరా ॥22॥

దేవతల ఈ దీనాలాపాలు విన్న మధుసూదనుడు కరుణాసముద్రుడు కనక మేఘగర్జనవంటి తన సహజకంఠస్వరంతో ఇలా పలికాడు.

విష్ణురువాచ – విష్ణువు పలికాడు.

భయం త్యజత హే దేవా గమిష్యామ్యహమాహవమ్ ।
జలంధరేణ దైత్యేన కరిష్యామి పరాక్రమమ్ ॥23॥

ఇత్యుక్త్వా సహసోత్థాయ దైత్యారిః ఖిన్నమానసః ।
ఆరోహద్గరుడం వేగాత్ కృపయా భక్తవత్సలః ॥24॥

ఓ దేవతలారా! నిర్భయంగా ఉండండి. ఇదిగో యుద్ధానికి బయలుదేరుతున్నాను. ఆ దైత్యేంద్రుడు జలంధరుడికి నా పరాక్రమం చూపిస్తాను– భక్తవత్సలుడూ ఆర్ద్రమనస్కుడూ అయిన ఆ దైత్యారి – శ్రీహరి – దయామయుడు ఈ మాట అనడమేమిటి వెంటనే వేగంగా గురుత్మంతుణ్ణి అధిరోహించాడు.

గచ్ఛంతం వల్లభం దృష్ట్వా దేవైస్సార్ధం సముద్రజా ।
సాంజలిర్బాష్పనయనా లక్ష్మీర్వచనమబ్రవీత్ ॥25॥

అలా బయలుదేరి సకలదేవతాసమేతుడై వెళుతున్న నాథుణ్ణి చూసి లక్ష్మీదేవి బాష్పనయనాలతో ఇలా పలికింది.

లక్ష్మ్యువాచ – లక్ష్మి అడిగింది.

అహం తే వల్లభా నాథ! భక్తా యది చ సర్వదా ।
తత్కథం తే మమ భ్రాతా యుద్ధే వధ్యః కృపానిధే ॥26॥

నాథా! నేను నీకు ప్రియమైన ఇల్లాలిని. సర్వదా నీకు భక్తురాలిని. నువ్వు దయానిధివి. మరి నువ్వు నా సోదరుడు జలంధరుణ్ణి(సాగరపుత్రుడు) యుద్ధంలో వధించడం సమంజసమేనా? ఎలా?

విష్ణురువాచ – విష్ణువు అన్నాడు.

జలంధరేణ దైత్యేన కరిష్యామి పరాక్రమమ్ ।
తైస్సంస్తుతో గమిష్యామి యుద్ధాయ త్వరితాన్వితః ॥27॥

రుద్రాంశసంభవత్వాచ్చ బ్రహ్మణో వచనాదపి ।
ప్రీత్యా చ తవ నైవాయం మమ వధ్యో జలంధరః ॥28॥

దేవీ! జలంధరుడికి నా పరాక్రమం చూపిస్తాను అంతే. ఈ దేవతలంతా నన్ను స్తుతించి వేడుకున్నారు కనుక వెంటనే యుద్ధానికి వెళుతున్నాను. జలంధరుణ్ణి నేను వధించను– వధించలేను. దీనికి మూడు కారణాలున్నాయి. మొదటిది – అతడు రుద్రాంశసంభవుడు. రెండవది – అతడి గురించి (జాతకం) బ్రహ్మ చెప్పిన మాట. మూడవది– నీపట్ల నాకున్న ప్రేమ.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా గరుడారూఢః శంఖచక్రగదాసిభృత్ ।
విష్ణుర్వేగాద్యయౌ యోద్ధుం దేవైశ్శక్రాదిభిస్సహ ॥29॥

ద్రుతం స ప్రాప తత్రైవ యత్ర దైత్యో జలంధరః ।
కుర్వన్ సింహరవం దేవైః జ్వలద్భిర్విష్ణుతేజసా ॥30॥

లక్ష్మీదేవికి ఈ మాట చెప్పి శ్రీహరి – శంఖ చక్ర గదాఖడ్గాలను ధరించి గురుడుణ్ణి అధిరోహించి వేగంగా యుద్ధభూమికి బయలుదేరాడు. ఇంద్రాదిదేవతలంతా అతడివెంట వెళ్ళారు. జలంధరుడున్న చోటుకి క్షణంలో చేరుకున్నారు. విష్ణువు తేజస్సుతో ప్రకాశిస్తున్నారు ఇంద్రాది దేవతలు. శ్రీహరి ఒక్కసారిగా సింహనాదం చేశాడు.

అథారుణానుజ జవపక్షవాతప్రపీడితాః ।
వాత్యావివర్తితా దైత్యా బభ్రముః ఖే యథా ఘనాః ॥31॥

తతో జలంధరో దృష్ట్వా దైత్యాన్ వాత్యాప్రపీడితాన్ ।
ఉద్ధృత్య వచనం క్రోధాత్ ద్రుతం విష్ణుం సమభ్యగాత్ ॥32॥

ఏతస్మిన్నంతరే దేవాశ్చక్రుర్యుద్ధం ప్రహర్షితాః ।
తేజసా చ హరేః పుష్టా మహాబలసమన్వితాః ॥33॥

యుద్ధోద్యతం సమాలోక్య దేవసైన్యముపస్థితమ్ ।
దైత్యానాజ్ఞాపయామాస సమరే చాతిదుర్మదాన్ ॥34॥

వ్యాసమునీ! అప్పుడు అరుణసోదరుడైన ఆ గరుత్మంతుడి రెక్కల నుంచి మహావేగంగా వెలువడుతున్న సుడిగాలి తాకిడికి దైత్యులు మబ్బుతునకల్లాగా చెల్లాచెదరైపోయారు. గిరికీలు కొట్టారు. జలంధరుడు తన దైత్యవీరుల దురవస్థను గమనించాడు. క్రోధం పట్టలేక బిగ్గరగా అరుస్తూ విష్ణుమూర్తి మీదకి లంఘించాడు. మహాబలిష్ఠులైన దేవతలు శ్రీహరి తేజస్సుతో పరిపుష్టులై ఉరకలువేస్తున్న ఉత్సాహంతో దైత్యులతో కలబడ్డారు. దేవసైన్యమంతా ఒక్కపెట్టున పోరాటానికి దిగేసరికి జలంధరుడు రణదుర్మదులైన తన దైత్యవీరుల్ని ఇలా ఆజ్ఞాపించాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు అన్నాడు.

భోభో దైత్యవరా యూయం యుద్ధం కురుత దుస్తరమ్ ।
శక్రాద్వైరమరైరద్య ప్రబలైః కాతరైస్సదా ॥35॥

మౌర్యాస్తు లక్షసంఖ్యాతా ధౌమ్రాహి శతసంఖ్యకాః ।
అసురాః కోటిసంఖ్యాతాః కాలకేయాస్తథైవ చ ॥36॥

కాలకానాం దౌర్హృదానాం కంకానాం లక్షసంఖ్యయా ।
అన్యే ఽపి స్వబలైర్యుక్తా వినిర్యాంతు మమాజ్ఞయా ॥37॥

సర్వే సజ్జా వినిర్యాత బహుసేనాభిసంయుతాః ।
నానాశస్త్రాస్త్రసంయుక్తా నిర్భయా గతసంశయాః ॥38॥

భోభో శుంభనిశుంభౌ చ దేవాన్సమరకాతరాన్ ।
క్షణేన సుమహావీర్యౌ తుచ్ఛాన్నాశయతం యువామ్ ॥39॥

దైత్యవీరులారా! భీకరయుద్ధం చెయ్యండి. ఇంద్రాదిదేవతలు బలశాలులే కానీ సహజంగా పిరికివాళ్ళు. మనవాళ్ళల్లో మౌర్యులు. లక్షలలో, ధౌమ్రులు వందలలో, అసురులు, కాలకేయులు కోట్లలో, కాలకులు, దుర్హృదులూ, కంకనులూ లక్షలలో, మిగతావాళ్ళు వారివారి సేనలతో యుద్ధరంగంలోకి దిగండి. ఇది నా ఆజ్ఞ. అందరూ సన్నద్ధులై సకలసేనాసంయుతులై రకరకాల శస్త్రాస్త్రాలు ధరించి నిర్భయులై నిస్సంశయులై రంగంలోకి దిగండి. శుంభ నిశుంభులారా! మీరు ఇద్దరికిద్దరే మహావీర్యసంపన్నులు. వీళ్ళు ఈ దేవతలు వట్టి పిరికిపందలు. తుచ్ఛులు. మీరిద్దరూ కలిసి క్షణంలో వీళ్ళని మట్టుపెట్టండి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

దైత్యా జలంధరాజ్ఞప్తా ఇత్థం యుద్ధవిశారదాః ।
యుయుధుస్తేఽసురాస్సర్వే చతురంగబలాన్వితాః ॥40॥

గదాభిస్తీక్ష్ణబాణైశ్చ శూలపట్టిసతోమరైః ।
కేచిత్పరశుశూలైశ్చ నిజఘ్నుస్తే పరస్పరమ్ ॥41॥

నానాయుధైశ్చ పరైస్తత్ర నిజఘ్నుస్తే బలాన్వితాః ।
దేవాస్తథా మహావీరా హృషీకేశబలాన్వితాః ॥42॥

యుయుధుస్తీక్ష్ణబాణాశ్చ క్షిపంతస్సింహవద్రవాః ।
కేచిద్బాణైస్సుతీక్ష్ణైశ్చ కేచిన్ముసలతోమరైః ॥43॥

కేచిత్పరశుశూలైశ్చ నిజఘ్నుస్తే పరస్పరమ్ ।
ఇత్థం సురాణాం దైత్యానాం సంగ్రామస్సుమహూన్మహాన్ ।
అత్యల్పణో మునీనాం హి సిద్ధానాం భయకారకః ॥44॥

జలంధరుడి ఆజ్ఞతో యుద్ధవిశారదులు, దైత్యనాయకులు చతురంగబలాలతో యుద్ధానికి దిగి దేవతలతో భీకరంగా పోరాడారు. గదలు – వాడి బాణాలు – శూలాలు – పట్టిసాలు – తోమరాలు – పరశువులు ఇంకా ఇలాంటి రకరకాల అనేకాయుధాలతో దేవదానవులు పరస్పరం హింసించుకున్నారు. అందరూ బలశాలులే. దేవతలకు హృషీకేశుడి తేజస్సు అదనం. సింహాల్లా గర్జిస్తూ వాళ్ళు మహాసంగ్రామం సాగిస్తుంటే తిలకిస్తున్న సిద్ధసాధ్యాదిదేవగణాలకూ ఋషిమునిగణాలకూ భయం పెల్లుబికింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే దేవయుద్ధవర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥16॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు దేవయుద్ధవర్ణనమనే పదహారవ అధ్యాయం సమాప్తం.

సప్తదశోఽధ్యాయః – పదిహేడవ అధ్యాయం

విష్ణుజలంధరయుద్ధ వర్ణనమ్ – విష్ణుజలంధరయుద్ధ వర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అథ దైత్యా మహావీర్యాశ్శూలైః పరశుపట్టిశైః ।
నిజఘ్నుస్సర్వదేవాంశ్చ భయవ్యాకులమానసాన్ ॥1॥

దైత్యాయుధైః సమావిద్ధదేహా దేవాస్సవాసవాః ।
రణాద్విదుద్రువుస్సర్వే భయవ్యాకులమానసాః ॥2॥

పలాయనపరాన్ దృష్ట్వా హృషీకేశస్సురానథ ।
విష్ణుర్వై గరుడారూఢో యోద్ధుమభ్యాయయౌ ద్రుతమ్ ॥3॥

వ్యాసమునీ! మహాబలిష్ఠులైన ఆ దైత్యవరిష్ఠులు శూల–పరశు–పట్టిశాదిశస్త్రాస్త్రాలతో చిదకబాదుతోంటే దేవతల మనస్సులు భయంతో వణికిపోయాయి. ఇంద్రుడితో సహా అందరి శరీరాలకూ గాయాలయ్యాయి. బదుకుజీవుడా అని రణరంగం నుంచి పలాయనం చిత్తగించారు. హృషీకేశుడు ఇది గమనించాడు. గరుడారూఢుడై వెంటనే తానై వచ్చి యుద్ధం ప్రారంభించాడు.

సుదర్శనేన చక్రేణ సర్వతః ప్రస్ఫురన్ రుచా ।
సుశోభితకరాబ్జశ్చ రేజే భక్తాభయంకరః ॥4॥

శంఖ ఖడ్గగదా శార్ఙ్గధారీ క్రోధసమన్వితః ।
కఠోరాస్త్రో మహావీరః సర్వయుద్ధవిశారదః ॥5॥

ధనుషం శార్ఙ్గనామానం విస్ఫార్య వినినాద హ ।
తస్య నాదేన త్రైలోక్యం పూరితం మహతా మునే ॥6॥

శార్ఙ్గనిస్సృతబాణైశ్చ దితిజానాం శిరాంసి వై ।
చకర్త భగవాన్విష్ణుః కోటిశో రుట్సమాకులః ॥7॥

దశదిశలకూ కాంతులు విరజిమ్ముతున్న సుదర్శనచక్రాన్ని చేత ధరించి, భక్త – అభయంకరుడు శ్రీహరి అద్భుతంగా విరాజిల్లాడు. క్రోధం కట్టలు తెంచుకుంది. శంఖ–ఖడ్గ–గదా–శార్ఙ్గధారి ఆ శ్రీహరి సర్వయుద్ధవిశారదుడు. మహావీరుడు. అతడివి చాలా కఠోరాస్త్రాలు. ఒక్కసారిగా ధనుష్టంకారం చేశాడు. సింహగర్జన కూడా చేశాడు. ఆ ధ్వని ముల్లోకాలూ నిండిపోయింది. పట్టరాని కోపంతో నిశితబాణపరంపర గుప్పించి భగవంతుడు ఆ శ్రీహరి కోట్ల సంఖ్యలో దైత్యుల శిరస్సులు ఖండించాడు.

అథారుణానుజ జవ పక్షవాతప్రపీడితాః ।
వాత్యా వివర్తితా దైత్యా బభ్రముఃఖే యథా ఘనాః ॥8॥

తతో జలంధరో దృష్ట్వా దైత్యాన్ వాత్యా ప్రపీడితాన్ ।
చుక్రోధాతి మహాదైత్యో దేవబృందభయంకరః ॥9॥

మర్దయంతం చ తం దృష్ట్వా దైత్యాన్ ప్రస్ఫురితాధరః ।
యోద్ధుమభ్యాయయౌ వీరో వేగేన హరిణా సహ ॥10॥

అప్పుడు – అరుణసోదరుడైన గరుత్మంతుడి రెక్కల నుంచి వెలువడ్డ మహాప్రభంజనాన్ని తాళలేక దైత్యులు ఆకాశంలో మబ్బుల్లాగా చెల్లాచెదురైపోయారు. ఇది చూసి జలంధరుడు దేవబృందభయంకరుడు మహాదైత్యుడు కోపంతో ఊగిపోయాడు. దైత్యుల్ని శ్రీహరి ఇలా మర్దిస్తూంటే చూస్తున్న జలంధరుడి పెదవులు కోపంతో అదిరాయి. ఆ మహావీరుడు వేగంగా వెళ్ళి శ్రీహరిని తానే ఎదుర్కొన్నాడు. పోరాటం ప్రారంభించాడు.

స చకార మహానాదం దేవాసురభయంకరమ్ ।
దైత్యానామధిపః కర్ణ విదీర్ణాః శ్రవణాత్తతః ॥11॥

భయంకరేణ దైత్యస్య నాదేన పూరితం తదా ।
జలంధరస్య మహతా చకంపే సకలం జగత్ ॥12॥

తతస్సమభవద్యుద్ధం విష్ణుదైత్యేంద్రయోర్మహత్ ।
ఆకాశం కుర్వతోర్బాణైస్తదా నిరవకాశవత్ ॥13॥

తయోశ్చ తేన యుద్ధేన పరస్పరమభూన్మునే ।
దేవా సురర్షిసిద్ధానాం భీకరేణాతివిస్మయః ॥14॥

జలంధరుడు దేవదానవభయంకరంగా గర్జించాడు. అది విన్నవారి చెవులు పగిలి పోయాయి. ఆ ధ్వనితో పిక్కటిల్లి సకలజగత్తూ కంపించింది. అప్పుడు విష్ణు దైత్యేంద్రులకు మహాయుద్ధం జరిగింది. వారు ప్రయోగించిన బాణాలతో ఆకాశం మొత్తం క్రిక్కిరిసిపోయింది. వ్యాసమునీ! ఆ ఇద్దరికీ జరుగుతున్న భీకరయుద్ధాన్ని చూస్తున్న దేవతలూ దైత్యులూ ఋషులూ సిద్ధులూ – అంతా ఆశ్చర్యచకితులై మ్రాన్పడిపోయారు.

విష్ణుర్దైత్యస్య బాణౌఘైః ధ్వజం ఛత్రం ధనుశ్శరాన్ ।
చిచ్ఛేద తం చ హృదయే బాణేనైకేన తాడయన్ ॥15॥

తతో దైత్యస్సముత్పత్య గదాపాణిస్త్వరాన్వితః ।
ఆహత్య గరుడం మూర్ధ్ని పాతయామాస భూతలే ॥16॥

విష్ణుం జఘాన శూలేన తీక్ష్ణేన ప్రస్ఫురద్రుచా ।
హృదయే క్రోధసంయుక్తో దైత్యః ప్రస్ఫురితాధరః ॥17॥

విష్ణోర్గదాం చ ఖడ్గేన చిచ్ఛేద ప్రహసన్నివ ।
తం వివ్యాధ శరైస్తీక్ష్ణైః శార్ఙ్గం విస్ఫార్య దైత్యహా ॥18॥

శ్రీమహావిష్ణువు తన బాణపరంపరతో జలంధరుడి ధ్వజాన్ని, ఛత్రాన్ని, ధనుస్సునీ, బాణాల్నీ ఒక్కసారిగా ఖండించాడు. మరొక్కబాణంతో అతడి గుండె మీద కొట్టాడు. చెక్కుచెదరని దైత్యనాయకుడు వెంటనే పెనుగదను చేతబట్టుకుని శ్రీహరి మీదకి లంఘించాడు. గరుత్మంతుని శిరస్సుమీద బలంగా మోదాడు. అతడు గిరికీలు కొడుతూ నేలకు పడిపోయాడు. అదే అదనుగా జలంధరుడు తళతళలాడుతున్న త్రిశూలం చేతబట్టి శ్రీహరిని గుండెల్లో పొడిచాడు. అలా పొడుస్తున్నప్పుడు ఆ దైత్యుడి పెదవులు క్రోధతీవ్రతతో వణికాయి. వికటాట్టహాసం చేస్తూ పెనుకత్తి చేబూని శ్రీహరి చేతిలోని గదను ఒకే వేటుతో విరగ్గొట్టాడు. నివ్వెరపోయిన శ్రీహరి వెంటనే తేరుకున్నాడు. తిరగబడ్డాడు. ఒకేసారి అనేక తీక్ష్ణశరాలు సంధించి తన శార్ఙ్గాన్ని చెవిదాకా లాగి విడిచిపెట్టాడు ఆ దైత్యాంతకుడు.

విష్ణుర్జలంధరం దైత్యం భయదేన శరేణ హ ।
క్రోధావిష్టోఽతి తీక్ష్ణేన జఘానాశు సురారిహా ॥19॥

ఆగతం తస్య తం బాణం దృష్ట్వా దైత్యో మహాబలః ।
ఛిత్వా బాణేన విష్ణుం చ జఘాన హృదయే ద్రుతమ్ ॥20॥

కేశవోఽపి మహాబాహుః విక్షిప్తమసురేణ తమ్ ।
శరం తిలప్రమాణేన ఛిత్వా వీరో ననాద హ ॥21॥

సురశత్రు సంహారకుడు ఆ శ్రీహరి క్రోధావిష్టుడై ప్రయోగించిన ఆ భయంకరశరసమూహాన్ని తన మీదకు వచ్చిపడుతున్నవాటిని గమనించి దైత్యనేత ఒకే ఒక్కబాణంతో తుత్తునియలు చేశాడు. జాగుచెయ్యకుండా మరొక్క బాణంతో మళ్ళీ శ్రీహరిగుండెకు గురిచూసి కొట్టాడు. మహావీరుడు కేశవుడు తనపైకి వస్తున్న ఆ బాణాన్ని మరొకబాణంతో నువ్వు గింజలంతగా ముక్కలు ముక్కలు చేసి సింహంలా గర్జించాడు.

పునర్బాణం సమాధత్త ధనుషి క్రోధవేపితః ।
మహాబలోఽథ బాణేన చిచ్ఛేద స శిలీముఖమ్ ॥22॥

వాసుదేవః పునర్బాణం నాశాయ విబుధద్విషః ।
క్రోధేనాధత్త ధనుషి సింహవద్వినినాద హ ॥23॥

జలంధరోఽథ దైత్యేంద్రః కోపచ్ఛిన్నాధరో బలీ ।
శరేణ స్వేన శార్ఙ్గాఖ్యం ధనుశ్చిచ్ఛేద వైష్ణవమ్ ॥24॥

పునర్బాణైస్సుతీక్ష్ణైశ్చ జఘాన మధుసూదనమ్ ।
ఉగ్రవీర్యో మహావీరో దేవానాం భయకారకః ॥25॥

సింహనాదం చేస్తూనే క్రోధంతో ఊగిపోతున్న ఆ మహాబలశాలి శ్రీహరి మరొక బాణం ధనుస్సుకి తొడిగి విడిచిపెట్టాడు. ఈసారి ఆ శిలీముఖాన్ని దైత్యుడు తుత్తునియలు చేశాడు. వాసుదేవుడు మళ్ళీ సింహనాదం చేసి ఆ దేవవిద్వేషిని నాశనం చెయ్యడం కోసమని అమోఘబాణాన్ని సంధించాడు. దైత్యేంద్రుడు జలంధరుడు కోపం పట్టలేకపోయాడు. పంటితో కొరికిన పెదవినించి రక్తం చిమ్మింది. అతివేగంగా శరం సంధించి – విష్ణుమూర్తి బాణం వదిలేలోగానే – అతడి శార్ఙ్గధనుస్సును రెండు ముక్కలు చేసేశాడు. అది వైష్ణవధనుస్సు. విరిగింది. మధుసూదనుడు తెప్పరిల్లేలోగా దైత్యేంద్రుడు అతడి మీద శరవృష్టి కురిపించాడు. వాడు ఉగ్రవీర్యుడు. మహావీరుడు. దేవతలకు భయంకరుడు.

సచ్ఛిన్నధన్వా భగవాన్ కేశవో లోకరక్షకః ।
జలంధరస్య నాశాయ చిక్షేప స్వగదాం పరామ్ ॥26॥

సా గదా హరిణా క్షిప్తా జ్వలజ్జ్వలనసన్నిభా ।
అమోఘగతికా శీఘ్రం తస్య దేహే లలాగ హ ॥27॥

తయా హతో మహాదైత్యో న చచాలాపి కించన ।
జలంధరో మదోన్మత్తః పుష్పమాలాహతో యథా ॥28॥

వ్యాసమునీ! లోకరక్షకుడు, భగవంతుడు, ఆ కేశవుడు విరిగిన తన శార్ఙ్గాన్ని చూసి క్రోధావిష్టుడయ్యాడు. జలంధరుణ్ణి ఇక మట్టుబెట్టాల్సిందే అని తిరుగులేని తన గదను (కౌమోదకి) అతడి మీదికి విసిరాడు. అది పెనుమంటలు విరజిమ్ముతూ నిరాఘాటంగా అతిశీఘ్రంగా వచ్చి దైత్యుడి మహాకాయాన్ని ఢీకొట్టింది. అయినా ఆ మహాదైత్యుడు ఆ మదోన్మత్తుడు కాసింతయినా చలించలేదు. పూలమాలతో కొట్టినట్టయ్యింది అతడికి.

తతో జలంధరః క్రోధీ దేవత్రాసకరోఽక్షిపత్ ।
త్రిశూలమనలాకారం హరయే రణదుర్మదః ॥29॥

అథ విష్ణుస్తత్త్రిశూలం చిచ్ఛేద తరసా ద్రుతమ్ ।
నందకాఖ్యేన ఖడ్గేన స్మృత్వా శివపదాంబుజమ్ ॥30॥

ఛిన్నే త్రిశూలే దైత్యేంద్ర ఉత్పత్య సహసా ద్రుతమ్ ।
ఆగత్య హృదయే విష్ణుం జఘాన దృఢముష్టినా ॥31॥

సోఽపి విష్ణుర్మహావీరోఽవిగణయ్య చ తద్వ్యథామ్ ।
జలంధరం చ హృదయే జఘాన దృఢముష్టినా ॥32॥

తతస్తౌ బాహుయుద్ధేన యుయుధాతే మహాబలౌ ।
బాహుభిర్ముష్టిభిశ్చైవ జానుభిర్నాదయన్మహీమ్ ॥33॥

కానీ, దేవతలకు భయంకరుడైన ఆ జలంధరుడిలో క్రోధం పెల్లుబికింది. రణదుర్మదుడుగదా! వెంటనే అగ్నిరూపంతో మండుతున్న త్రిశూలాన్ని శ్రీహరిపైకి విసిరాడు. శ్రీమహావిష్ణువు తన మనస్సులో శివుడి

పాదపద్మాలను ధ్యానించి నందకఖడ్గంతో ఆ త్రిశూలాన్ని ఛేదించాడు. దైత్యేంద్రుడికి ఏమి చెయ్యాలో తోచలేదు, పరుగుపరుగున వెళ్ళి విష్ణుమూర్తి గుండెమీద పిడిగుద్దు వేశాడు. మహావీరుడు విష్ణుమూర్తికూడా ఆ దెబ్బను లెక్కచెయ్యకుండా తిరిగి అతణ్ణి అదేచోట అలాగే పిడిగుద్దు వేశాడు. అటుపైని ఇద్దరూ కలబడి బాహుయుద్ధానికి దిగారు. మహాబలిష్ఠులు. బాహుఘాతాలతో ముష్టిఘాతాలతో జానుఘాతాలతో భూమిని దద్దరిల్లజేశారు.

ఏవం హి సుచిరం యుద్ధం కృత్వా తేనాసురేణ వై ।
విస్మితోఽభూన్మునిశ్రేష్ఠ హృది గ్లానిమవాప హ ॥34॥

అథ ప్రసన్నో భగవాన్మాయీ మాయావిదాంవరః ।
ఉవాచ దైత్యరాజానం మేఘగంభీరయా గిరా ॥35॥

మునిశ్రేష్ఠా! వ్యాసా! ఇలా శ్రీహరికి ఆ దైత్యరాజుతో యుద్ధం చిరకాలం సాగింది. అతడి శక్తికి ఆశ్చర్యపడ్డాడు. మనసులో అలిసిపోయాడు. విష్ణుమూర్తి అంటే మాయావులకే మాయావి. భగవంతుడు గదా! ప్రసన్నుడయ్యాడు. మేఘగంభీరకంఠధ్వనితో దైత్యరాజుతో ఇలా పలికాడు.

విష్ణురువాచ – విష్ణువు అన్నాడు.

భోభో! దైత్యవరశ్రేష్ఠ! ధన్యస్త్వం రణదుర్మదః ।
మహాయుధవరైర్యత్త్వం న భీతో హి మహాప్రభుః ॥36॥

ఏభిరేవాయుధైరుగ్రైః దైత్యా హి బహవో హతాః ।
మహాజౌ దుర్మదా వీరాశ్ఛిన్నదేహా మృతిం గతాః ॥37॥

యుద్ధేన తే మహాదైత్య ప్రసన్నోఽస్మి మహాన్ భవాన్ ।
న దృష్టస్త్వత్సమో వీరః త్రైలోక్యే సచరాచరే ॥38॥

వరం వరయ దైత్యేంద్ర ప్రీతోఽస్మి తవ విక్రమాత్ ।
అదేయమపి తే దద్మి యత్తే మనసి వర్తతే ॥39॥

ఓయోయీ దైత్యోత్తమోత్తమా! నువ్వు ధన్యుడివి. రణదుర్మదుడివి. ఇలాంటి మహాయుద్ధాలలో ఇవే మహాయుధాలతో పూర్వం దైత్యులెందరో నాచేతిలో తనువులు తెగి నిహతులయ్యారు. నువ్వేమో జంకనైనా లేదు. అందుకని నువ్వు మహానుభావుడివి. నీ యుద్ధనైపుణ్యానికి నేను సంతృప్తి చెందాను. ప్రసన్నుణ్ణి అయ్యాను. నువ్వు చాలా చాలా గొప్పవాడివి. ఈ ముల్లోకాలలోనూ చరాచరజీవరాశిలో నీకు సాటివచ్చే ప్రాణిని నేను చూడలేదు. అందుకని ఓ దైత్యేంద్రా! నీ పరాక్రమానికి పరమప్రీతుడనై నీకొక వరం ఇస్తున్నాను. ఇవ్వకూడనిదే అయినా ఇచ్చేస్తాను. కోరుకో! నీ మనస్సులో ఉన్నది ఏమిటో అది కోరుకో!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య విష్ణోర్మాయావినో హరేః ।
ప్రత్యువాచ మహాబుద్ధిః దైత్యరాజో జలంధరః ॥40॥

వ్యాసమునీ! మహామాయావి శ్రీహరి ఇలా అనే సరికి మహాబుద్ధిశాలి దైత్యరాజు ఆ జలంధరుడు మారుపలికాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు అన్నాడు.

యది భావుక తుష్టోఽసి వరమేతద్దదస్వ మే ।
మద్భగిన్యా మయా సార్ధం మద్గేహే సగణో వస ॥41॥

బావా! నిజంగా నువ్వు సంతుష్టుడివైతే నా సోదరితో నీ జనగణంతో వచ్చి నువ్వు నా ఇంట నివసించు! ఇదే నేనడిగే వరం ఇవ్వు!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

తదాకర్ణ్య వచస్తస్య మహాదైత్యస్య ఖిన్నధీః ।
తథాస్త్వితి చ దేవేశో జగాద భగవాన్ హరిః ॥42॥

ఉవాస సతతో విష్ణు స్సర్వదేవగణైస్సహ ।
జాలంధరం నామ పురమాగత్య రమయా సహ ॥43॥

అథో జలంధరో దైత్యః స్వభగిన్యా చ విష్ణునా ।
ఉవాస స్వాలయం ప్రాప్తో హర్షాకులితమానసః ॥44॥

వ్యాసా! మహాదైత్యుడి ఈ కోరిక విన్న శ్రీహరి మనస్సులో కొంత నొచ్చుకున్నా, సరే అని అంగీకరించి తథాస్తు అన్నాడు. దేవతలతో లక్ష్మీదేవితో కలిసి జలంధరపట్టణానికి వెళ్ళి నివసించనారంభించాడు. జలంధరుడు కూడా ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ తన సోదరి లక్ష్మితో, బావగారు శ్రీహరితో కలిసి తన నివాసభవనంలోకి చేరుకున్నాడు.

జలందరోఽథ దేవానామధికారేషు దానవాన్ ।
స్థాపయిత్వా సహర్షస్సన్ పునరాగాన్మహీతలమ్ ॥45॥

దేవగంధర్వసిద్ధేషు యత్కించిద్రత్నసంచితమ్ ।
తదాత్మవశగం కృత్వా తిష్ఠత్సాగరనందనః ॥46॥

పాతాళభవనే దైత్యం నిశుంభం సుమహాబలమ్ ।
స్థాపయిత్వా స శేషాదీనానయద్భూతలం బలీ ॥47॥

దేవగంధర్వ సిద్ధౌఘాన్ సర్పరాక్షసమానుషాన్ ।
స్వపురే నాగరాన్ కృత్వా శశాస భువనత్రయమ్ ॥48॥

అటుపైని జలంధరుడు దేవతల అధికారపీఠాలలో దానవుల్ని నియమించి తాను మళ్ళీ భూతలానికి వెళ్ళాడు. దేవగంధర్వసిద్ధజాతులదగ్గర మిగిలిపోయిన ఆ కొద్దిపాటి రత్నరాశుల్ని కూడా వశపరుచుకుని స్తిమితపడ్డాడు.

ఆ సాగరనందనుడు. మహాబలిష్ఠుడైన నిశుంభుణ్ణి పాతాళానికి అధిపతిని చేసి (ఆ బరువుని అతడి భుజస్కంధాలపై పెట్టి), అక్కడ ఉండే ఆదిశేషుణ్ణి తన భూతలానికి రప్పించుకున్నాడు. ఇలా దేవ–గంధర్వ– సిద్ధసమూహాలనూ నాగ–రాక్షస–మానుషజాతులనూ తన రాజ్యంలో పౌరులుగా చేసి ఆ జలంధరుడు ముల్లోకాలనూ పరిపాలించాడు.

ఏవం జలంధరః కృత్వా దేవాన్ స్వవశవర్తినః ।
ధర్మేణ పాలయామాస ప్రజాః పుత్రానివౌరసాన్ ॥49॥

న కశ్చిద్ వ్యాధితో నైవ దుఃఖితో న కృశస్తథా ।
న దీనో దృశ్యతే తస్మిన్ ధర్మాద్రాజ్యం ప్రశాసతి ॥50॥

వ్యాసమహర్షీ! ఈ విధంగా ఆ జలంధరుడు దేవతలనందరినీ వశవర్తులుగా చేసుకుని, ప్రజలనందరినీ రక్తం పంచుకుపుట్టిన బిడ్డలుగా ధర్మబద్ధంగా పరిపాలన సాగించాడు. అతడలా ధర్మపరిపాలన చేస్తుంటే – అతడి రాజ్యంలో వ్యాధితుడుగానీ దుఃఖితుడుగానీ కృశించినవాడుగానీ దీనుడుగానీ కలికానికైనా కానరాలేదు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరోపాఖ్యానే విష్ణుజలంధరయుద్ధవర్ణనం నామ సప్తదశోఽధ్యాయః ॥17॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధరోపాఖ్యానంలో విష్ణుజలంధరయుద్ధవర్ణనమనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

అష్టాదశోఽధ్యాయః – పద్దెనిమిదవ అధ్యాయం

దేవర్షి (నారద) జలంధర సంవాదమ్ – దేవర్షి (నారద) జలంధర సంవాదం

సనత్కుమారు ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏవం శాసతి ధర్మేణ మహీం తస్మిన్ మహాసురే ।
బభూవుర్దుఃఖినో దేవా భ్రాతృభావాన్మునీశ్వర ॥1॥

దుఃఖితాస్తే సురాస్సర్వే శివం శరణమాయయుః ।
మనసా శంకరం దేవదేవం సర్వప్రభుం ప్రభుమ్ ॥2॥

తుష్టువుర్వాగ్భిరిష్టాభిర్భగవంతం మహేశ్వరమ్ ।
నివృత్తయే స్వదుఃఖస్య సర్వదం భక్తవత్సలమ్ ॥3॥

వ్యాసమునీ! ఆ మహాసురుడు ధర్మబద్ధంగా ఇలా మహీమండలాన్ని పాలిస్తూంటే దేవతలు దాయాది (జ్ఞాతి) సోదరభావంతో లోలోపల కుమిలిపోయారు. దుఃఖించి దుఃఖించి ఎట్టకేలకు శంకరుణ్ణి శరణువేడుకున్నారు. సర్వప్రభువు ఆ ప్రభువు. దేవదేవుడు. అతణ్ణి మనసా వేడుకున్నారు. శివుడిణ్ణి రుచించే వాక్కులతో స్తుతించారు మహేశ్వరుడు భక్తవత్సలుడూ అయిన ఆ భగవంతుణ్ణి అన్నీ ఇచ్చేటువంటివాణ్ణి దుఃఖాన్నిపోగొట్టు కోవటం కోసం శరణు వేడారు.

ఆహూయ చ మహాదేవో భక్తానాం సర్వకామదః।
నారదం ప్రేరయామాస దేవకార్యచికీర్షయా ॥4॥

అథ దేవమునిః జ్ఞానీ శంభుభక్తస్సతాం గతిః ।
శివాజ్ఞయా యయౌ దైత్యపురే దేవాన్స నారదః ॥5॥

వ్యాకులాస్తే సురాస్సర్వే వాసవాద్యా ద్రుతం మునిమ్ ।
ఆగచ్ఛంతం సమాలోక్య సముత్తస్థుర్హి నారదమ్ ॥6॥

దదుస్త ఆసనం నత్వా మునయే ప్రీతిపూర్వకమ్ ।
నారదాయ సురా శ్శక్రముఖా ఉత్కంఠితాననాః ॥7॥

సుఖాసీనం మునివరమాసనే సుప్రణమ్య తమ్ ।
పునః ప్రోచుస్సురా దీనా వాసవాద్యా మునీశ్వరమ్ ॥8॥

భక్తుల కోరికలను తీర్చే మహాదేవుడు దేవకార్యం నిర్వహించాలనే తలంపుతో నారదుణ్ణి పిలిపించుకున్నాడు. ఏదో చెప్పి పంపించాడు. తరువాత శివభక్తుడు, సత్పురుషులకు ఆధారమైనవాడు మహాజ్ఞానియైన ఆ దేవముని శివాజ్ఞను శిరసావహించి దైత్యపురికి బయలుదేరాడు దేవతల్ని కలవడం కోసం, ఆకులచిత్తులై రోజులు గడుపుతున్న

ఇంద్రాదిదేవతలు తమ చెంతకు వస్తున్న నారదమహర్షిని చూసి లేచి నిలబడ్డారు. భక్తితో నమస్కరించారు. సముచితాసనం చూపించారు. ఉత్కంఠ నిండిన ముఖాలతో వాళ్ళందరూ ఆ దేవర్షి సుఖాసీనుడయ్యే వరకూ ఆగి మళ్ళీ నమస్కరించి దీనాతిదీనంగా తమ గోడు వెళ్ళబోసుకున్నారు.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

భోభో మునివరశ్రేష్ఠ దుఃఖం శృణు కృపాకర ।
శ్రుత్వా తన్నాశయ క్షిప్రం ప్రభుస్త్వం శంకరప్రియః ॥9॥

జలంధరేణ దైత్యేన సురా విద్రావితా భృశమ్ ।
స్వస్థానాద్ భ్రాతృభావాచ్చ దుఃఖితా వయమాకులాః ॥10॥

స్వస్థానాదుష్ణరశ్మిశ్చ చంద్రో నిస్సారితస్తథా ।
వహ్నిశ్చ ధర్మరాజశ్చ లోకపాలాస్తథేతరే ॥11॥

సుబలిష్ఠేన వై తేన సర్వే దేవాః ప్రపీడితాః ।
దుఃఖం ప్రాప్తా వయంచాతి శరణం త్వాం సమాగతాః ॥12॥

మునులలోకెల్లా ఉత్తమోత్తముడా! దయాకరా! దయచేసి మా దుఃఖం ఆలకించు. విని దాన్ని తొలిగించు. నువ్వు సమర్థుడివి. శివుడికి అత్యంత ప్రియుడివి. దైత్యనాథుడు జలంధరుడు దేవతలనందరినీ తమ తమ పదవులనుంచి తరిమికొట్టాడు. నువ్వెరుగుదువు గదా దేవతలూ దైత్యులు దాయాదులని. ఈ జ్ఞాతిభావం మమ్మల్ని మరింత కుంగదీస్తోంది. చాలా కలతచెందిఉన్నాం. సూర్యచంద్రుల్నిసైతం స్వస్థానాలనుంచి తొలగించాడు. అగ్నిదేవుణ్ణి యమధర్మరాజుని ఇంకా తక్కిన దిక్పతులనందరినీ పదవీచ్యుతుల్నిచేశాడు. ఆ బలిష్ఠుడిచేతిలో సురలమందరమూ తీవ్రంగా పీడితులమయ్యాం. భరింపరాని దుఃఖంతో నిన్ను శరణు కోరివచ్చాము.

సంగ్రామే స హృషీకేశం స్వవశం కృతవాన్ బలీ ।
జలంధరో మహాదైత్యః సర్వామరవిమర్దకః ॥13॥

తస్య వశ్యో వరాధీనోఽవాత్సీత్తత్సదనే హరిః ।
స లక్ష్మ్యా సహితో విష్ణుర్యే నస్సర్వార్థసాధకః ॥14॥

జలంధరవినాశాయ యత్నం కురు మహామతే ।
త్వం నో దైవవశాత్ప్రాప్తస్సదా సర్వార్థసాధకః ॥15॥

ఆ మహాబలశాలి రణరంగంలో హృషికేశుణ్ణి వశపరుచుకున్నాడు. ఆ జలంధరమహాదైత్యుడు సర్వదేవతా విమర్దకుడు. వరమిచ్చి వాడికి వశుడై శ్రీమహావిష్ణువు లక్ష్మీసమేతంగా వాడి ఇంటిలోనే కాపురముంటున్నాడు. మా కందరికీదిక్కు, సర్వార్థసాధకుడు విష్ణువే కదా! అతడే అలా అయ్యాడు. అందుకని ఓ మహామతీ! దయచేసి జలంధరుడి వినాశనానికి వలసిన ప్రయత్నం చెయ్యి. దైవికంగా నువ్వు ఇక్కడికి వచ్చావు. మహర్షీ! నువ్వే మాకు సర్వప్రయోజనసాధకుడివి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తేషామమరాణాం స నారదః ।
ఆశ్వాస్య మునిశార్దూలస్తానువాచ కృపాకరః ॥16॥

వ్యాసమునీ! దేవతల ఈ దీనాలాపాలు ఆలకించి దయామయుడు మునిశార్దూలుడు ఆ నారదుడు వారిని ఓదారుస్తూ ఇలా పలికాడు

నారద ఉవాచ – నారదుడు పలికాడు.

జానే ఽ హం వై సురా యూయం దైత్యరాజపరాజితాః ।
దుఃఖం ప్రాప్తాః పీడితాశ్చ స్థానాన్నిస్సారితాఃఖలు ॥17॥

స్వశక్త్యా భవతాం స్వార్థం కరిష్యే నాత్ర సంశయః ।
అనుకూలోఽ హమివ వో దుఃఖం ప్రాప్తా యతో ఽమరాః ॥18॥

దేవతలారా! దైత్యరాజు చేతిలో పరాజితులై పీడితులై పదవీభ్రంశితులైన మీ దుఃఖం నేనెరుగుదును. నా శక్తి మేరకు మీ ప్రయోజనం నెరవేర్చే ప్రయత్నం చేస్తాను. ఇందులో సంశయం లేదు. అమరులైయుండీ మీరంతా ఇంత దుఃఖం పొందారు. మీకు నేను అనుకూలుణ్ణి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏవముక్త్వా మునిశ్రేష్ఠ ద్రష్టుం దానవవల్లభమ్ ।
ఆశ్వాస్య సకలాన్ దేవాన్ జలంధరసభాం యయౌ ॥19॥

అథాగతం మునిశ్రేష్ఠం దృష్ట్వా దేవో జలంధరః ।
ఉత్థాయ పరయా భక్త్యా దదౌ శ్రేష్ఠాసనం వరమ్ ॥20॥

స తం సంపూజ్య విధివద్దానవేంద్రోఽ తి విస్మితః ।
సుప్రహస్య తదా వాక్యం జగాద మునిసత్తమమ్ ॥21॥

మునివర్యా! వ్యాసా! నారదుడు సకలదేవతలనూ ఇలా ఓదార్చి దానవవల్లభుణ్ణి దర్శించడంకోసం జలంధరసభకు వెళ్ళాడు. వస్తున్న మునిశ్రేష్ఠుణ్ణి చూసి మహారాజు జలంధరుడు సింహాసనంనుంచి లేచి ఉత్తమభక్తితో ఉత్తమోత్తమమైన ఆసనం సమర్పించాడు. విధివిధానంగా అతిథిపూజచేశాడు. అతడి రాకకు విస్మితుడైన ఆ దానవేంద్రుడు అందంగా పెద్దగా నవ్వుతూ మునిసత్తముడితో ఇలా అన్నాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు అడిగాడు.

కుత ఆగమ్యతే బ్రహ్మన్ కిం చ దృష్టం త్వయా క్వచిత్ ।
యదర్థమిహ చాయాతస్తదాజ్ఞాపయ మాం మునే ॥22॥

హే బ్రహ్మన్! ఎక్కడినుండి రాక? నువ్వు ఏదైనా చూశావా? నీ రాకకు కారణమేమిటో అది నాకు ఆజ్ఞాపించు – దేవర్షీ !

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య దైత్యేంద్రస్య మహామునిః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా నారదో హి జలంధరమ్ ॥23॥

వ్యాసమునీ! దైత్యేంద్రుడి పలుకులు ఆలకించి దేవర్షి నారదుడు ప్రసన్నాత్ముడు అయ్యాడు. అతడితో ఇలా పలికాడు.

నారద ఉవాచ – నారదుడు చెప్పాడు.

సర్వదానవదైత్యేంద్ర జలంధర మహామతే ।
ధన్యస్త్వం సర్వలోకేశ రత్నభోక్తా త్వమేవ హి ॥24॥

మదాగమనహేతుం వై శృణు దైత్యేంద్రసత్తమ ।
యదర్థమిహచాయాతస్త్వహం వక్ష్యే ఽఖిలం హి తత్ ॥25॥

సర్వదానవ దైత్యేంద్రా! జలంధరా! మహామతీ! సర్వలోకేశా! నువ్వు ధన్యుడివి.(రత్నాలను అనుభవించేవాడివి) దైత్యనాయకులలో ఉత్తమోత్తముడా! ఆలకించు! నా రాకకు కారణమేమిటో, ఎందుకోసం నేనిక్కడికివచ్చానో అంతా చెబుతాను. విను.

గతః కైలాస శిఖరం దైత్యేంద్రాహం యదృచ్ఛయా ।
యోజనాయుతవిస్తీర్ణం కల్పద్రుమమహావనమ్ ॥26॥

కామధేనుశతాకీర్ణం చింతామణి సుదీపితమ్ ।
సర్వరుక్మమయం దివ్యం సర్వత్రాద్భుతశోభితమ్॥27॥

తత్రోమయా సహాసీనం దృష్టవానస్మి శంకరమ్ ।
సర్వాంగసుందరం గౌరం త్రినేత్రం చంద్రశేఖరమ్॥28॥

దైత్యేంద్రా! అనుకోకుండా నేనివ్వేళ కైలాసశిఖరానికి వెళ్ళాను. ఆ శిఖరంమీద పదివేలయోజనాల విస్తీర్ణంలో కల్పవృక్షమహావనంచూశాను. అందులో వందలకామధేనువులు సంచరిస్తున్నాయి. ఆ వనంలోనే ఒక బంగారుగద్దె. దానికి చింతామణులు పొదగబడిఉన్నాయి. వాటి కాంతులు దశదిశలా వ్యాపిస్తున్నాయి. దివ్యంగా అత్యద్భుతంగా శోభిస్తున్న ఆ సింహాసనంమీద ఉమాసమేతుడై కూర్చున్న సర్వాంగసుందరుడు, గౌరవర్ణంలోఉన్నవాడు, త్రినేత్రుడు, చంద్రశేఖరుడు అయిన శంకరుణ్ణి తిలకించాను

తం దృష్ట్వా మహదాశ్చర్యం వితర్కో మేఽభవత్తదా!
క్వాపీదృశీ భవేద్బుద్ధిః త్రైలోక్యే వా నవేతి చ ॥29॥

తావత్తవాపి దైత్యేంద్ర సమృద్ధిస్సంస్మృతా మయా ।
తద్విలోకనకామోఽహం త్వత్సాన్నిధ్యమిహాగతః ॥30॥

దైత్యోత్తమా! ఆ మహదాశ్చర్యం చూసి నాలో ఒక ఆలోచన బయలుదేరింది. ముల్లోకాలలోనూ ఎక్కడైనా ఇలాంటి సమృద్ధి ఉన్నదా? అని. అప్పుడు జలంధరా! నీ సమృద్ధికూడా ఇంతటిదేనన్నది జ్ఞాపకం వచ్చింది. దాన్ని చూడాలి అనే కోరిక కలిగింది. అందుకోసం ఇదిగో ఇలా నీ సన్నిధికి వచ్చాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి నారదతః శ్రుత్వా స దైత్యేంద్రో జలంధరః ।
స్వసమృద్ధిం సమగ్రాం వై దర్శయామాస సాదరమ్ ॥31॥

దృష్ట్వా స నారదో జ్ఞానీ దైవకార్యసుసాధకః ।
ప్రభుప్రేరణయా ప్రాహ దైత్యేంద్రం తం జలంధరమ్ ॥32॥

నారదుడు ఇలా అనేసరికి దైత్యేంద్రుడు ఆ జలంధరుడు తన సమృద్ధినంతటినీ సమగ్రంగా సాదరంగా దేవర్షికి చూపించాడు. అంతా చూశాడు నారదుడు. మహాజ్ఞాని కదా! పైగా దేవకార్యాన్ని సుసాధ్యం చేసే నేర్పరి కూడా. ప్రభువైన పరమేశ్వరుడి ప్రేరణతో నారదుడు అప్పుడతనికి ఇలా చెప్పాడు.

నారద ఉవాచ – నారదుడు అన్నాడు.

తవాస్తి సుసమృద్ధిర్హి వరవీరాఖిలాధునా ।
త్రైలోక్యస్య పతిస్త్వం హి చిత్రం కిం చాత్ర సంభవమ్ ॥33॥

మణయో రత్నపుంజాశ్చ గజాద్యాశ్చ సమృద్ధయః ।
తే గృహే ఽద్య విభాంతీహ యాని రత్నాని తాన్యపి ॥34॥

గజరత్నం త్వయానీతం శక్రస్యైరావతస్తథా ।
అశ్వరత్నం మహావీర సూర్యస్యోచ్చైఃశ్రవా హయః ॥35॥

వీరాధివీరా! నీకిప్పుడు సమస్తవిధసమృద్ధీ అమిరింది. ముల్లోకాలకూ నువ్వే అధిపతివి గదా! ఇందులో వింత ఏముంది! మణి సమృద్ధి – రత్నపుంజసమృద్ధి– గజాశ్వాది సమృద్ధి అన్నీ ఇప్పుడు నీ ఇంట ఉన్నాయి. ఏవి ఏవి అత్యుత్తమాలో అవన్నీ నీ ఇంటిలో వెలుగొందుతున్నాయి. గజరత్నమనిపించుకున్న ఇంద్రుడి ఐరావతాన్ని నువ్వు తెచ్చేసుకున్నావు. అశ్వరత్నమైన సూర్యుడి ఉచ్చైఃశ్రవాన్ని కైవసం చేసుకున్నావు.

కల్పవృక్షస్త్వయానీతో నిధయో ధనదస్య చ ।
హంసయుక్తవిమానం చ త్వయానీతం హి వేధసః ॥36॥

ఇత్యేవం వరరత్నాని దివి పృథ్వ్యాం రసాతలే ।
యాని దైత్యేంద్ర తే భాంతి గృహే తాని సమస్తతః ॥37॥

త్వత్సమృద్ధిమిమాం పశ్యన్ సంపూర్ణాం వివిధామహమ్ ।
ప్రసన్నో ఽస్మి మహావీర గజాశ్వాదిసుశోభితామ్ ॥38॥

కల్పవృక్షాన్ని పెకలించి తెచ్చేసుకున్నావు. కుబేరుడి నుంచి నవనిధులూ కొల్లగొట్టి తెచ్చుకున్నావు. బ్రహ్మదేవుడి నుంచి రాజహంసల విమానాన్ని స్వాధీనం చేసుకున్నావు. ఇలా ఉత్తమోత్తమరత్నాలను దేవలోకం నుంచీ భూలోకం నుంచీ, పాతాళంనుంచీ అన్నింటినీ తెచ్చుకున్నావు. దైత్యేంద్రా! ఇవ్వేళ నీ ఇల్లు ఆ రత్నాలతో సమృద్ధంగా ప్రకాశిస్తోంది. వైవిధ్యంతో సంపూర్ణతతో గజాశ్వాదులతో విరాజిల్లుతున్న ఈ నీ సమృద్ధిని చూసి మహావీరా! నిజంగా నా మనస్సు ప్రసన్నమయ్యింది.

జాయారత్నం మహాశ్రేష్ఠం జలంధర! న తే గృహే ।
తదానేతుం విశేషేణ స్త్రీరత్నం వై త్వమర్హసి ॥39॥

యస్య గేహే సురత్నాని సర్వాణి హి జలంధర ।
జాయారత్నం న చేత్తాని న శోభంతే వృథా ధ్రువమ్ ॥40॥

జలంధరా! ఇన్ని రత్నాలూ ఉన్నాయి గానీ మహాశ్రేష్ఠమైన భార్యారత్నం ఒక్కటి నీ ఇంట లేక పోయింది. అంచేత – విశేషించి ఒక స్త్రీరత్నాన్ని నువ్వు తెచ్చుకోవాలి. ఇంటిలో గొప్పగొప్ప రత్నాలు ఎన్ని ఉన్నా, అన్నీ ఉన్నా భార్యారత్నం లేకపోతే – జలంధరా! వింటున్నావా? – ఆ రత్నాలు శోభించవు సుమా! ముమ్మాటికీ వృథా.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యేవం వచనం శ్రుత్వా నారదస్య మహాత్మనః ।
ఉవాచ దైత్యరాజో హి మదనాకులమానసః ॥41॥

మహాత్ముడు నారదుడు అన్న ఈ మాటలు వినడంతోనే దైత్యరాజుగారి మనస్సు మన్మథభావాలతో వ్యాకులితమయ్యింది. నారదుడితో ఇలా అన్నాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు అడిగాడు.

భో భో నారద దేవర్షే నమస్తేఽస్తు మహాప్రభో ।
జాయారత్నవరం కుత్ర వర్తతే తద్వదాధునా ॥42॥

బ్రహ్మాండే యత్ర కుత్రాపి తద్రత్నం యది వర్తతే ।
తదానేష్యే తతో బ్రహ్మన్ సత్యం సత్యం న సంశయః ॥43॥

ఓయీ! నారదా! దేవర్షీ! నీకిదే వందనం. అలాంటి జాయారత్నం ఎక్కడ ఉన్నదో ఇప్పుడే చెప్పు మహాప్రభో! ఈ బ్రహ్మాండంలో ఎక్కడైన ఒకవేళవున్నట్లయితే – ఆ రత్నాన్ని తెచ్చేసుకుంటాను. హే బ్రహ్మన్! ఇది ముమ్మాటికీ నిజం – సందేహం లేదు.

నారద ఉవాచ – నారదుడు ఉపదేశించాడు.

కైలాసే హ్యతిరమ్యే చ సర్వర్ధిసుసమాకులే ।
యోగిరూపధరశ్శంభురస్తి తత్ర దిగంబరః ॥44॥

తస్య భార్యా సురమ్యా హి సర్వలక్షణలక్షితా ।
సర్వాంగసుందరీ నామ్నా పార్వతీతి మనోహరా॥45॥

తదీదృశం రూపమనన్యసంగతం దృష్టం న కుత్రాపి కుతూహలాఢ్యమ్ ।
అత్యద్భుతం మోహనకృత్సుయోగినాం సుదర్శనీయం పరమర్ధికారి ॥46॥

అయితే జలంధరా! చెబుతున్నాను. విను అతిరమ్యం కైలాసపర్వతం అని అన్నాను గదా! అది సకల సమృద్ధులతోనూ క్రిక్కిరిసి ఉంది అదిగో ఆ పర్వతం మీద శంభుడు దిగంబర యోగిరూపధారిగా ఉన్నాడు. అతడి భార్య– సర్వాంగసుందరి. సర్వలక్షణలక్షిత. పేరు పార్వతి అనిట! అతిమనోహర, సురమ్య. అలాంటి రూపం మరెక్కడా కనిపించలేదు. ఎంత కుతూహలం రేపే రూపమో! అత్యద్భుతం! యోగులను సైతం సమ్మోహపరిచే రూపం. చూసేకొద్దీ చూడాలనిపించే రూపం. సకల సమృద్ధులూ కలిగించే రూపం.

స్వచిత్తే కల్పయామ్యద్య శివాదన్యస్సమృద్ధివాన్ ।
జాయారత్నాన్వితాద్వీర త్రిలోక్యాం న జలంధర ॥47॥

యస్యా లావణ్యజలధౌ నిమగ్నశ్చతురాననః ।
స్వధైర్యం ముముచే పూర్వం తయా కా ఽన్యోపమాయతే ॥48॥

గతరాగోఽపి హి యయా మదనారిః స్వలీలయా ।
నిజతంత్రో ఽపి యతస్స స్వాత్మవశగః కృతః ॥49॥

యథా స్త్రీరత్నసంభోక్తుస్సమృద్ధిస్తస్య సాభవత్ ।
తథా న తవ దైత్యేంద్ర సర్వరత్నాధిపస్య చ ॥50॥

మహావీరా! జలంధరా! ఇప్పుడు నా మనస్సు నిశ్చయంగా చెబుతోంది. సకల సమృద్ధులూ కలిగి భార్యారత్నంకూడా ఉన్నవాడు ఈ ముల్లోకాలలోనూ ఒక్క శివుడు తప్ప మరొకడు లేడంటే లేదు. ఆ పార్వతీ లావణ్యజలనిధిలో మునిగిపోయి – పూర్వం ఒకప్పుడు – బ్రహ్మదేవుడంతటివాడే డీలా పడిపోయాడు తెలుసా! మరింక ఏ వనితను ఆమెకు సాటి చెబుతావో చెప్పు. వీతరాగుడై మన్మథుణ్ణి భస్మం చేసినవాడూ స్వతంత్రుడూ అయిన శివుణ్ణి తన లీలావిశేషంతో స్వాధీనం చేసుకుంది ఆ పార్వతి. స్త్రీరత్నాన్ని అనుభవించేవాడికి ఏ సమృద్ధి కలుగుతుందో ఆ సకలసమృద్ధి ఒక్క శివుడికే ఉంది. దైత్యేంద్రా! నువ్వు సర్వరత్నాధిపతివే అయినా నీకు ఆ సమృద్ధి లేదు, ఆ శోభా లేదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా స తు దేవర్షిః నారదో లోకవిశ్రుతః ।
యయౌ విహాయసా దేవోపకారకరణోద్యతః ॥51॥

వ్యాసమహర్షీ! సకల లోకప్రసిద్ధుడైన దేవర్షి ఆ నారదుడు దేవతలకు ఉపకారం చెయ్యడానికే నడుం బింగించిన వాడు దైత్యేంద్రుడికి ఇది కాస్తా ఉపదేశించి ఆకాశమార్గాన తిరిగివెళ్ళాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరవధోపాయాఖ్యానే దేవర్షి (నారద) జలంధర సంవాదో నామ అష్టదశోఽధ్యాయః ॥18॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధరవధో పాయాఖ్యానంలో దేవర్షి (నారద) జలంధర సంవాదమనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

ఏకోనవింశోఽధ్యాయః – పందొమ్మిదవ అధ్యాయం

దూతసంవాదమ్ – దూతసంవాదం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

సనత్కుమార సర్వజ్ఞ నారదే హి గతే దివి ।
దైత్యరాట్కిమకార్షీత్స తన్మే వద సువిస్తరాత్ ॥1॥

సమస్తమూ ఎరిగినవాడా! సనత్కుమారుడా! నారదుడు అలా దేవలోకానికి వెళ్ళిపోయాక ఆ దైత్యరాజు ఏమిచేశాడో దయచేసి సవిస్తరంగా నాకు వినిపించు!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తమామంత్ర్య గతే దైత్యం నారదే దివి దైత్యరాట్ ।
తద్రూపశ్రవణాదాసీదనంగజ్వరపీడితః ॥2॥

అథో జలంధరో దైత్యః కాలాధీనః ప్రనష్టధీః ।
దూతమాహ్వాయయామాస సైంహికేయం విమోహితః ॥3॥

ఆగతం తం సమాలోక్య కామాక్రాంతమనాస్స హి ।
సుసంబోధ్య సమాచష్ట సింధుపుత్రో జలంధరః ॥4॥

దైత్యుడికి వీడ్కోలు చెప్పి నారదుడు దేవలోకానికి వెళ్ళిపోయాక ఓ వ్యాసమునీ! జలంధరుడికి మన్మథజ్వరం పట్టుకుంది. పార్వతీరూపసౌందర్యం విన్నాడు గదా! విరహ పీడితుడయ్యాడు. పోగాలం దాపురించింది. బుద్ధి క్షీణించింది. కామవిమోహితుడయ్యాడు. తన దూతను సింహికానందనుణ్ణి రాహువును పిలిపించుకున్నాడు. సన్నిధికి వచ్చి నిలబడ్డ దూతను చూసి, చక్కగా సంబోధించి – కామాక్రాంత మనస్కుడై ఉన్న ఆ సింధుపుత్రుడు జలంధరుడు ఇలా పలికాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు పలికాడు.

భో భో దూతవరశ్రేష్ఠ సర్వకార్యప్రసాధక ।
సైంహికేయ మహాప్రాజ్ఞ కైలాసం గచ్ఛ పర్వతమ్ ॥5॥

తత్రాస్తి యోగీ శంభ్వాఖ్యస్తపస్వీ చ జటాధరః ।
భస్మభూషితసర్వాంగో విరక్తో విజితేంద్రియః ॥6॥

తత్ర గత్వేతి వక్తవ్యం యోగినం దూత శంకరమ్ ।
జటాధరం విరక్తం తం నిర్భయేన హృదా త్వయా ॥7॥

ఉత్తమదూతలలోకెల్లా ఉత్తముడా! సకలకార్యాలనూ సాధించేవాడా! మహాప్రాజ్ఞుడా! సింహికానందనుడా! రాహూ! బయలుదేరు. కైలాసపర్వతానికివెళ్ళు. అక్కడ శంభువు అనే పేరుతో ఒక యోగి ఉంటాడు. అతడు ఒక తపస్వి. జటాధరుడు. ఒళ్ళంతా బూడిదపులుముకుని ఉంటాడు. మహావిరక్తుడు. జితేంద్రియుడు. దూతా! అక్కడికి వెళ్ళి – ఆ యోగితో, ఆ శంకరుడితో, ఆ జటాధారితో, ఆ విరాగితో నిర్భయంగా గుండె నిబ్బరంతో నా మాటగా ఇలా చెప్పు–

హే యోగిస్తే దయాసింధో జాయారత్నేన కిం భవేత్ ।
భూత ప్రేత పిశాచాది సేవితేన వనౌకసా ॥8॥

మన్నాథే భువనే యోగిన్నోచితా గతిరీదృశీ ।
జాయారత్నమతస్త్వం మే దేహి రత్నభుజే నిజమ్ ॥9॥

యాని యాని సురత్నాని త్రైలోక్యే తాని సంతి మే ।
మదధీనం జగత్సర్వం విద్ధి త్వం సచరాచరమ్ ॥10॥

ఓయీ! యోగీ! దయాసింధూ! భూత ప్రేత పిశాచాదులే అనుచరులుగా కొండకోనల్లో నివసించే నీకు భార్యారత్నం ఎందుకయ్యా? యోగీ! నేను అధిపతిగా ఉన్న ఈ లోకంలో ఇటువంటి అనౌచిత్యం జరగడానికి వీల్లేదు. అంచేత నీ జాయారత్నాన్ని నాకు ఇచ్చేసెయ్యి. నేను రత్నభోక్తను. ముల్లోకాలలోనూ ఉత్తమోత్తమాలు అన్నీ నాదగ్గరే ఉన్నాయి. చరాచరజగత్తు అంతా నా అధీనంలోనే ఉంది. ఇది నువ్వు తెలుసుకో!

ఇంద్రస్య గజరత్నం చోచ్చైఃశ్రవో రత్నముత్తమమ్ ।
బలాద్గృహీతం సహసా పారిజాతతరుస్తథా ॥11॥

విమానం హంససంయుక్తమంగణే మమ తిష్ఠతి ।
రత్నభూతం మహాదివ్యముత్తమం వేధసోఽద్భుతమ్ ॥12॥

మహాపద్మాదికం దివ్యం నిధిరత్నం స్వదస్య చ ।
ఛత్రం మే వారుణం గేహే కాంచనస్రావి తిష్ఠతి॥13॥

కింజల్కినీ మహామాలా సర్వదామ్లానపంకజా ।
మత్పితుస్సామమైవాస్తి పాశశ్చ కపతేస్తథా ॥14॥

ఇంద్రుడి గజరత్నం, అశ్వరత్నముచ్చైఃశ్రవం, తరురత్నం పారిజాతం – అన్నింటినీ బలప్రయోగంతో స్వాధీనం చేసుకున్నాను. బ్రహ్మదేవుడి అత్యద్భుత – మహాదివ్య–విమానరత్నం రాజహంసలవిమానం ఇప్పుడు నా ఇంటిముంగిట ఉంది. కుబేరుడి నిధిరత్నాలు మహాపద్మాదులు తొమ్మిదీ నా ఆధీనంలోనే ఉన్నాయి. (స్వమ్=ధనమ్–దదాతి ఇతి స్వదః=కుబేరః). వరుణుడి ఛత్రరత్నం పసిడి జాలువారే గొడుగు నా ఇంటిలోనే ఉంది. అలాగే జలాధిదేవత వరుణుడి శస్త్రరత్నం దివ్యపాశం నాదగ్గరే ఉంది. (కమ్=జలమ్. తస్య పతిః – కపతిః = వరుణః)

మా తండ్రిగారి మాలారత్నం – ఏనాడూ వాడిపోని పద్మాలతో రూపొందిన కింజల్కినీమహామాల నా చేతిలోనే ఉంది.

మృత్యోరుత్క్రాంతిదా శక్తిర్మయా నీతా బలాద్ధరా ।
దదౌ మహ్యం శుచిర్దివ్యే శుచిశౌచే చ వాససీ ॥15॥

ఏవం యోగీంద్ర! రత్నాని సర్వాణి విలసంతి మే ।
అతస్త్వమపి మే దేహి స్వస్త్రీరత్నం జటాధర ॥16॥

మృత్యుదేవత యమధర్మరాజుగారి చేతిలో ఉండి సకల ప్రాణికోటికీ ఊర్ధ్వగతులు కల్పించే ఉత్తమోత్తమ శక్తిరత్నాన్ని బలవంతంగా కైవసం చేసుకున్నాను. అగ్నిదేవుడైతే శుచిశౌచాలనే తన దివ్యవస్త్రరత్నాలను స్వయంగా నాకు సమర్పించుకున్నాడు. యోగీంద్రా! ఈ విధంగా మహారత్నాలు అన్నీ నా ఆధీనంలోనే ఉన్నాయి. అంచేత ఓ జటాధారీ! నువ్వుకూడా నీ స్త్రీరత్నాన్ని నాకు సమర్పించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి శ్రుత్వా వచస్తస్య నందినా స ప్రవేశితః ।
జగామోగ్రసభాం రాహుర్విస్మయోఽద్భుతలోచనః ॥17॥

తత్ర గత్వా శివం సాక్షాద్దేవదేవం మహాప్రభుమ్ ।
స్వతేజోధ్వస్తతమసం భస్మలేపవిరాజితమ్ ॥18॥

మహారాజోపచారేణ విలసంతం మహాద్భుతమ్ ।
సర్వాంగసుందరం దివ్యభూషణైర్భూషితం హరమ్ ॥19॥

ప్రణనామ చ తం గర్వాత్తత్తేజః క్రాంతవిగ్రహః ।
నికటం గతవాన్ శంభోస్స దూతో రాహుసంజ్ఞకః ॥20॥

జలంధరుడు చెప్పినదంతా విన్నాడు రాహువు. అతడికళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి. కైలాసగిరికి బయలుదేరి వెళ్ళాడు. అక్కడ నందీశ్వరునిచే శంకరసభలోకి ప్రవేశపెట్టాడు. ఆ సభలో శివుణ్ణిచూశాడు. సాక్షాత్తు దేవదేవుడు. మహాప్రభువు. తన తేజస్సుతో చీకటుల్ని పారద్రోలే మహాప్రభువు. భస్మవిలేపనంతో విరాజిల్లుతున్న శంకరుడు, మహారాజలక్షణాలతో సేవకుల ఉపచారాలతో అద్భుతంగా విలసిల్లుతున్నాడు. సర్వాంగసుందరుడు. దివ్యభూషణ భూషితుడు. హరుడు, ఆ దేవుణ్ణి చూసి సగర్వంగా నమస్కరించాడు రాహువు. రాహువు తనువంతా శివతేజస్సులో మునిగిపోయింది. జలంధరుడి దూతగా ఈ రాహునామకుడు శివమహాదేవుడి సమీపానికి వెళ్ళాడు.

అథో తదగ్ర ఆసీనో వక్తుకామో హి సైంహికః ।
త్ర్యంబకం స తదా సంజ్ఞా ప్రేరితో వాక్యమబ్రవీత్ ॥21॥

ఆ సభలో శివుడికి ఎదుట ఆసీనుడయ్యాడు సింహికాపుత్రుడు. మాట్లాడబోయాడు. శివుడు తన అనుమతిని సైగచేశాడు. అది ప్రేరణగా ఆ రాహువు ముక్కంటితో ఇలా పలికాడు.

రాహురువాచ – రాహువు పలికాడు.

దైత్యపన్నగసేవ్యస్య త్రైలోక్యాధిపతేస్సదా ।
దూతోఽహం ప్రేషితస్తేన త్వత్సకాశమిహాగతః ॥22॥

జలంధరోఽబ్ధితనయస్సర్వదైత్యజనేశ్వరః ।
త్రైలోక్యస్యేశ్వరస్సోఽథ భవత్సర్వాధినాయకాః ॥23॥

స దైత్యరాజో బలవాన్ దేవానామంతకోపమః ।
యోగినం త్వాం సముద్దిశ్య స యదాహ శృణుష్వ తత్ ॥24॥

దైత్యులతో పన్నగులతో సేవలందుకుంటున్న త్రిలోకాధిపతి జలంధరుడి దూతను నేను. అతడి పనుపున ఇప్పుడిలా నీ దగ్గరికి వచ్చాను. జలంధరుడు సాగరనందనుడు. సర్వదైత్యజనేశ్వరుడు. ముల్లోకాలకూ ప్రభువు. సర్వాధినాయకుడు. ఆ దైత్యరాజు మహాబలశాలి. దేవతలకు యముడిలాంటివాడు. అతడు యోగివైన నీకు చెప్పమన్నదేమిటో చెబుతున్నాను – ఆలకించు.

మహాదివ్యప్రభావస్య తస్య దైత్యపతేః ప్రభోః ।
సర్వరత్నేశ్వరస్య త్వమాజ్ఞాం శృణు వృషధ్వజ ॥25॥

శ్మశానవాసినో నిత్యమస్థిమాలాధరస్య చ ।
దిగంబరస్య తే భార్యా కథం హైమవతీ శుభా ॥26॥

అహం రత్నాధినాథోఽస్మి సా చ స్త్రీరత్నసంజ్ఞితా ।
తస్మాన్మమైవ సా యోగ్యా నైవ భిక్షాశినస్తవ ॥27॥

మమ వశ్యాస్త్రయో లోకా భుంజేఽహం మఖభాగకాన్ ।
యాని సంతి త్రిలోకే ఽస్మిన్ రత్నాని మమ సద్మని ॥28॥

వయం రత్నభుజస్త్వం తు యోగీ ఖలు దిగంబరః ।
స్వస్త్రీరత్నం దేహి మహ్యం రాజ్ఞస్సుఖకరాః ప్రజాః ॥29॥

ఓయీ వృషధ్వజా! మహాదివ్యప్రభావుడూ సర్వరత్నేశ్వరుడూ మా దైత్యప్రభువు నీకు చెప్పమన్న ఆజ్ఞ ఇదిగో – విను. నువ్వు వల్లకాటిలో నివసిస్తావు. ఎప్పుడూ పుర్రెలదండలు ధరిస్తావు. పైగా దిగంబరుడివి. సర్వశుభలక్షణసంపన్న హిమశైలపుత్రిక నీకు ఇల్లాలేమిటయ్యా! నేను రత్నాధినాథుణ్ణి. ఆమె స్త్రీరత్నం. కనక ఆమె నాకే భార్యగా తగును. బిచ్చమెత్తుకునేవాడివి నీకు తగదు. ముల్లోకాలూ నా వశంలో ఉన్నాయి. యజ్ఞభాగాలను నేనే అనుభవిస్తున్నాను. త్రిభువనాలలోనూ ఉన్న రత్నాలన్నీ (ఉత్తమోత్తమాలు) నా ఇంటిలోనే ఉన్నాయి. మేము రత్నభోక్తలం. నువ్వు యోగిమాత్రుడివి, దిగంబరుడివి. నీ స్త్రీరత్నాన్ని తెచ్చి నాకు అప్పగించు. ప్రజలెప్పుడూ రాజుకి సుఖకారులుగా ఉండాలి. తెలుసుగదా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

వదత్యేవం తథా రాహౌ భ్రూమధ్యాచ్ఛూలపాణినః ।
అభవత్పురుషో రౌద్రస్త్రివ్రాశనిసమస్వనః ॥30॥

సింహాస్యః ప్రచలజిహ్వ స్సజ్జ్వాలనయనో మహాన్ ।
ఊర్ధ్వకేశశ్శుష్కతనుః నృసింహ ఇవ చాపరః ॥31॥

మహాతనుర్మహాబాహుస్తాలజంఘో భయంకరః ।
అభిదుద్రావ వేగేన రాహుం స పురుషో ద్రుతమ్ ॥32॥

స తం ఖాదితుమాయాంతం దృష్ట్వా రాహుర్భయాతురః ।
అథావదతివేగేన బహిస్స చ దధార తమ్ ॥33॥

వ్యాసమునీ! రాహువు ఇలా వాగుతుండగా శూలాయుధపాణి భ్రూమధ్యభాగం నుంచి ఒక రౌద్రాకార పురుషుడు పిడుగులా గర్జిస్తూ అవతరించాడు. అతడిది అచ్చు సింహముఖం. పొడవైన నాలుక చప్పరిస్తున్నాడు. కన్నుల నుంచి నిప్పులు కణకణరాలుతున్నాయి. మహారూపం. తలవెంట్రుకలు నిక్కబొడుచుకుని ఉన్నాయి. తక్కిన తనువంతా సన్నగా ఎండుకట్టెలా ఉంది. మరొక నరసింహావతారమా అన్నట్టున్నాడు. ఆ మహాతనువు ఆ మహాబాహువు ఆ తాళజంఘుడు ఆ భీకరుడు అతివేగంగా రాహువుమీదకి దూసుకువెళ్ళాడు. తనని నమిలిమింగెయ్యడానికి వస్తున్న ఆ సింహపురుషుణ్ణి చూసి రాహువు భయాతురుడై పరుగు లంకించుకున్నాడు. అంతకన్నా వేగంగా తరుముకుంటూ వచ్చి ఆ మహాబాహువు రాహువుని పట్టుకున్నాడు.

రాహురువాచ – రాహువు అభ్యర్థించాడు.

దేవదేవ మహేశాన పాహి మాం శరణాగతమ్ ।
సురాసురైస్సదా వంద్యః పరమైశ్వర్యవాన్ ప్రభుః ॥34॥

బ్రాహ్మణం మాం మహాదేవ ఖాదితుం సముపాగతః ।
పురుషోఽయం తవేశాన సేవకోఽతిభయంకరః ॥35॥

ఏతస్మాద్రక్ష దేవేశ శరణాగతవత్సల ।
న ఖాదేత యథాయం మాం నమస్తేఽస్తు ముహుర్ముహుః ॥36॥

దేవాదిదేవా! మహేశ్వరా! రక్షించు, రక్షించు, నీకు శరణాగతుణ్ణి నేను. కాపాడు. సురాసురులతో నిరంతరం నమస్కృతులందుకునేవాడా! మహాప్రభూ! పరమైశ్వర్య సంపన్నా! పాహి మామ్. నేను బ్రాహ్మణుణ్ణి. నన్ను చంపి తినెయ్యడానికి పట్టుకున్నాడు. ఈ సింహపురుషుడు అతిభయంకరుడు, నీవాడు. నీ సేవకుడు. వీడిబారినుంచి నన్ను కాపాడు. ఓ దేవదేవేశా! ఓ శరణాగతావత్సలా! వీడు నన్ను తినెయ్యకుండా చూడు. నీకు మరల మరల నమస్కారం.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

మహాదేవో వచఃశ్రుత్వా బ్రాహ్మణస్య తదా మునే ।
అబ్రవీత్ స్వగణం తం వై దీనానాథప్రియఃప్రభుః ॥37॥

వ్యాసమునీ! ఆ బ్రాహ్మణుడి అభ్యర్థన విని దీన– అనాథప్రియుడైన ఆ శంకరప్రభువు తన గణ పురుషుడితో ఇలా అన్నాడు.

మహాదేవ ఉవాచ – మహాదేవుడు పలికాడు.

ప్రముంచ బ్రాహ్మణం దూతం రాహ్వాఖ్యం శరణాగతమ్ ।
శరణ్యా రక్షణీయా హి న దండ్యా గణసత్తమ ॥38॥

గణసత్తమా! సింహపురుషా! ఈ రాహువును విడిచిపెట్టేసెయ్యి. ఇతడు బ్రాహ్మణుడు జలంధరుడు పంపిన దూత. పైగా శరణాగతుడు. శరణ్యులు రక్షణీయులే కానీ దండ్యులు కారు గదా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తో గిరిజేశేన స గణఃకరుణాత్మనా ।
రాహుం తత్యాజ సహసా బ్రాహ్మణేతి శ్రుతాక్షరః ॥39॥

రాహుం త్యక్త్వాంబరే సోఽథ పురుషో దీనయా గిరా ।
శివోపకంఠమాగత్య మహాదేవం వ్యజిజ్ఞపత్ ॥40॥

కరుణామయుడైన గిరిజావల్లభుడు ఇలా చెప్పేసరికి, బ్రాహ్మణుడు అనే అక్షరాలు వినడంతోనే ఆ గణపురుషుడు రాహువును విడిచిపెట్టేశాడు. అలా వాణ్ణి ఆకాశంలో విడిచిపెట్టేసి ఆ సింహపురుషుడు శివుడి సమీపానికివచ్చి దీనవాక్కులతో మహాదేవుడికి ఇలా విన్నవించుకున్నాడు.

పురుష ఉవాచ – గణపురుషుడు అభ్యర్థించాడు.

దేవదేవ మహాదేవ కరుణాకర శంకర ।
త్యాజితం మమ భక్ష్యం తే శరణాగతవత్సల ॥41॥

క్షుధా మాం బాధతే స్వామిన్! క్షుత్ క్షామశ్చాస్మి సర్వథా ।
కిం భక్ష్యం మమ దేవేశ తదాజ్ఞాపయ మాం ప్రభో ॥42॥

దేవదేవా! మహాదేవా! కరుణాకరా! శంకరా! శరణాగతవత్సలా! నాకు అందిన ఆహారాన్ని నువ్విలా విడిచిపెట్టించేశావు. స్వామీ! ఆకలి నన్ను బాధిస్తోంది. ఆకలితో దహించుకుపోతున్నాను. దేవేశా! మహాప్రభూ! నేను దేనిని అహారముగా గ్రహించవలెనో ఆజ్ఞాపించుము.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య పురుషస్య మహాప్రభుః ।
ప్రత్యువా చాద్భుతోఽతి స కౌతుకీ స్వహితంకరః ॥43॥

గణపురుషుడి ఈ విజ్ఞప్తిని విని మహాప్రభువు శివుడిలో ఆశ్చర్యకరంగా ఒక అత్యుత్కంఠ రేకెత్తింది. స్వీయహితంకరుడై ఇలా బదులిచ్చాడు.

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు అన్నాడు.

బుభుక్షా యది తేఽతీవ క్షుధా త్వాం బాధతే యది ।
సంభక్షయాత్మనః శీఘ్రం మాంసం త్వం హస్తపాదయోః ॥44॥

గణపురుషసింహమా! నీకు నిజంగా అంత ఆకలి వేస్తోంటే, అది నిన్ను అంతగా దహించివేస్తోంటే ఏంచేస్తావు? వెంటనే నీ కాళ్లూ చేతుల మాంసాన్ని తినేసెయ్యి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శివేనైవమాజ్ఞప్తశ్చఖాద పురుషః స్వకమ్ ।
హస్తపాదోద్భవం మాంసం శిరశ్శేషోఽభవద్యథా ॥45॥

దృష్ట్వా శిరోఽవశేషం తు సుప్రసన్నస్సదాశివః ।
పురుషం భీమకర్మాణం తమువాచ సవిస్మయః ॥46॥

వ్యాసా! శివుడిలా ఆజ్ఞాపించడంతో ఆ గణపురుషుడు తన శరీరమాంసాన్ని తానే తినేసి కేవలం శిరోమాత్రంగా మిగిలాడు. అతణ్ణి చూసి సదాశివుడు సుప్రసన్నుడయ్యాడు. ఆశ్చర్యచకితుడయ్యాడు. తన ఆజ్ఞను పాటించి అంతటి భయంకరకర్మను ఆచరించిన అతడితో ఇలా పలికాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

హే మహాగణ! ధన్యస్త్వం మదాజ్ఞాప్రతిపాలకః ।
సంతుష్టశ్చాస్మి తేఽతీవ కర్మణానేన సత్తమ ॥47॥

త్వం కీర్తిముఖసంజ్ఞో హి భవ మద్ద్వారకస్సదా।
మహాగణో మహావీరస్సర్వదుష్టభయంకరః ॥48॥

మత్ప్రియస్త్వం మదర్చాయాం సదా పూజ్యో హి మజ్జనైః ।
త్వదర్చాం యే న కుర్వంతి నైవ తే మత్ప్రియంకరాః ॥49॥

ఓయీ మహాగణా! నువ్వు ధన్యుడివి. నా ఆజ్ఞను పాలించావు. నువ్వుచేసిన ఈ పనితో నేను చాలా సంతుష్టి చెందాను. ఉమా! గణసత్తమా! నేటినుంచీ నీ పేరు కీర్తిముఖుడు. నువ్వు నా కుమారుడివి. నువ్వు

మహావీరుడివి. సర్వదుష్టభయంకరుడివి. నాకు అత్యంతాప్తుడివి. నా భక్తులందరూ ఇంక నన్ను పూజించే వేళ నిన్నుకూడా అర్చిస్తారు. అలా నిన్ను అర్చించనివారు నాకు ప్రియంకరులు కారు, కాలేరు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి శంభోర్వరం ప్రాప్య పురుషః ప్రజహర్ష సః ।
తదా ప్రభృతి దేవేశ ద్వారే కీర్తిముఖః స్థితః ॥50॥

పూజనీయో విశేషేణ స గణశ్శివపూజనే ।
నార్చయంతీహ యే పూర్వం తేషామర్చా వృథా భవేత్ ॥51॥

వ్యాసర్షీ! శివుడి నుంచి ఈ వరం పొంది ఆ మహాగణపురుషుడు ఎంతగానో సంబరపడ్డాడు. అదిగో అప్పటి నుంచీ శివాలయద్వారభాగంలో కీర్తిముఖుడు ఉంటున్నాడు. శివార్చనలో ముందుగా ఇతడిని విశేషంగా అర్చించాలి. అలా చెయ్యనివారి శివపూజ నిష్ఫలం.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరవధోపాఖ్యానే దూతసంవాదనామైకోనవింశోఽధ్యాయః ॥19॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధరవధో పాఖ్యానంలో దూతసంవాదం అనే పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

వింశోఽధ్యాయః – ఇరవైయవ అధ్యాయం

సామాన్యగణాసురయుద్ధవర్ణనమ్ – సామాన్యగణాసురయుద్ధవర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

సనత్కుమార సర్వజ్ఞ కథా తే శ్రావితాద్భుతా ।
మహాప్రభోశ్శంకరస్య యత్ర లీలా చ పావనీ ॥1॥

ఇదానీం బ్రూహి సుప్రీత్యా కృపాం కృత్వా మమోపరి ।
రాహుర్ముక్తః కుత్ర గతః పురుషేణ మహామునే ॥2॥

సనత్కుమారా! సర్వజ్ఞా! అద్భుతమైన కథ వినిపించావు. మహాప్రభువు శంకరుడి పరమపావన లీలా విశేషం తెలియజెప్పావు. ఇంక ఇప్పుడు సంప్రీతుడివై నా మీద దయబూని అనంతర వృత్తాంతం వినిపించు. మహామునీ! ఆ గణపురుషుడి చేతినుంచి విడుదలయ్యాక రాహువు ఎక్కడికి వెళ్ళాడు?

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్యామితమేధసః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా బ్రహ్మపుత్రో మహామునిః ॥3॥

మహామేధావి వ్యాసమహర్షి ఇలా అభ్యర్థించగా మిక్కిలి ప్రసన్నుడై ఆ మహాముని బ్రహ్మపుత్రుడు సనత్కుమారుడు కథ కొనసాగించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

రాహుర్విముక్తో యస్తేన సోఽపి తద్బర్బరస్థలే ।
అతస్స బర్బరో భూత ఇతి భూమౌ ప్రథాం గతః ॥4॥

తతస్స మన్యమానస్స్వం పునర్జనిమథానతః ।
గతగర్వో జగామాథ జలంధరపురం శనైః ॥5॥

జలంధరాయ సోఽభ్యేత్య సర్వమాశవిచేష్టితమ్ ।
కథయామాస తద్వ్యాసా ద్వ్యాస దైత్యేశ్వరాయ వై ॥6॥

సత్యవతీపుత్రా! ఆ మహాగణపురుషుడు రాహువుని ఆకాశంలో కదా విడిచిపెట్టాడు. అది సరిగ్గా బర్బరదేశం మీద ఉన్న ఆకాశం. వాడు వచ్చి వచ్చి ఆ బర్బరదేశంలో పడ్డాడు. అందుకని అప్పటి నుంచీ వాడికి బర్బరుడనే పేరు వచ్చింది. సరే–అతగాడు తనకొక పునర్జన్మ వచ్చినట్టే భావించాడు. గర్వం వదిలిపోయింది. వినయం అలవడింది. మెల్లగా జలంధరపట్టణం చేరుకున్నాడు. జలంధరుణ్ణి సమీపించాడు. ఈశ్వరుడు చేసిన ఆ చేష్టావిశేషాన్ని మొత్తం విపులంగా (వ్యాసాత్) ఓ వ్యాసా! తన దైత్యేశ్వరుడికి విన్నవించాడు.

జలంధరస్తు తచ్ఛ్రుత్వా కోపాకులితవిగ్రహః ।
బభూవ బలవాన్ సింధుపుత్రో దైత్యేంద్రసత్తమః ॥7॥

తతః కోపపరాధీనమానసో దైత్యసత్తమః ।
ఉద్యోగం సర్వసైన్యానాం దైత్యానామాదిదేశ హ ॥8॥

జలంధరుడు అది వినడంతోనే నిలువెల్లా కోపంతో ఊగిపోయాడు. ఆ సింధుపుత్రుడు మహాబలశాలి. దైత్యేంద్రుడు. కోపపరాధీనమానసుడయ్యాడు. దైత్యసేనలనన్నింటినీ యుద్ధానికి సన్నద్ధం కమ్మని ఆదేశించాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు చెప్పాడు.

నిర్గచ్ఛంత్వఖిలా దైత్యాః కాలనేమిముఖాః ఖలు ।
తథా శుంభనిశుంభాద్యా వీరాః స్వబలసంయుతాః ॥9॥

కోటివీర్యకులోత్పన్నాః కంబువంశ్యాశ్చ దౌర్హృదాః ।
కాలకాః కాలకేయాశ్చ మౌర్యా ధౌమ్రాస్తథైవ చ ॥10॥

కాలనేమి ప్రభృతులారా! దైత్యులారా! అందరూ బయలుదేరండి. శుంభనిశుంభాదులారా! మీమీ సేనలతో కదలండి వీరకులోత్పన్నులారా! కంబువంశ్యులారా! దౌర్హృదులారా! కాలకులారా! కాలకేయులారా! మౌర్యులారా! ధౌమ్రులారా! కోటానుకోట్లుగా బయలుదేరండి.

ఇత్యాజ్ఞాప్యాసురపతిస్సింధుపుత్రో ప్రతాపవాన్ ।
నిర్జగామాశు దైత్యానాం కోటిభిః పరివారితః ॥11॥

తతస్తస్యాగ్రతశ్శుక్రో రాహుశ్ఛిన్నశిరోఽభవత్ ।
ముకుటశ్చాపతద్భూమౌ వేగాత్ప్రస్ఖలితస్తదా ॥12॥

వ్యరాజత నభః పూర్ణం ప్రావృషీవ యథా ఘనైః ।
జాతా అశకునా భూరి మహానిద్రావిసూచకాః ॥13॥

అందరికీ ఇలా ఆజ్ఞాపించి ప్రతాపశాలి సింధుపుత్రుడు అయిన జలంధరుడు తానే అనేక కోట్ల దైత్యవీరులతో కలిసి యుద్ధానికి బయలుదేరాడు. అతడికి అగ్రభాగాన శుక్రుడూ శిరస్సులేని రాహువు నడిచారు. అయితే జలంధరుడి వేగానికి కదిలి జారి అతడి కిరీటం నేలరాలింది. అంతలోకీ ఉన్నట్టుండి ఆకాశమంతటా వర్ష ఋతువులాగా కారుమబ్బులు కమ్ముకున్నాయి. మృత్యువుని సూచించే అపశకునాలు ఎన్నో కనిపించాయి.

తస్యోద్యోగం తథా దృష్ట్వా గీర్వాణాస్తే సవాసవాః ।
అలక్షితాస్తదా జగ్ముః కైలాసం శంకరాలయమ్ ॥14॥

తత్ర గత్వా శివం దృష్ట్వా సుప్రణమ్య సవాసవాః ।
దేవాస్సర్వే నతస్కంధాః కరౌ బద్ధ్వా చ తుష్టువుః ॥15॥

జలంధరుడి యుద్ధప్రయత్నాలను గమనించిన గీర్వాణులు ఇంద్రుడితో సహా అందరూ కలిసి రహస్యంగా కైలాసాద్రికి వెళ్ళి శంకరుణ్ణి దర్శించారు. సాగిలపడ్డారు. లేచి నిలిచి వంగివంగి దండాలు పెడుతూ స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

దేవ దేవ మహాదేవ కరుణాకర శంకర ।
నమస్తే ఽస్తు మహేశాన పాహి నశ్శరణాగతాన్ ॥16॥

విహ్వలా వయమత్యుగ్రం జలంధరకృతాత్ప్రభో ।
ఉపద్రవాత్స దేవేంద్రాః స్థానభ్రష్టాః క్షితిస్థితాః ॥17॥

న జానాసి కథం స్వామిన్! దేవాపత్తిమిమాం ప్రభో ।
తస్మాన్నో రక్షణార్థాయ జహి సాగరనందనమ్ ॥18॥

అస్మాకం రక్షణార్థాయ యత్పూర్వం గరుడధ్వజః ।
నియోజితస్త్వయా నాథ న క్షమస్సోఽద్య రక్షితుమ్ ॥19॥

తదధీనో గృహే తస్య తిష్ఠత్యద్య మయా సహ ।
వయం చ తత్ర తిష్ఠామస్తదాజ్ఞావశగాస్సుగాః ॥20॥

దేవదేవా! మహాదేవా! కరుణాకరా! శంకరా! మహేశానా! నమో నమః. శరణాగతులం మమ్మల్ని కాపాడు ప్రభూ! జలంధరుడి ఉగ్రకృత్యాలకు మేమంతా నలిగిపోయాం. దేవేంద్రాదులందరూ పదవీభ్రష్టులై భూలోకంలో నివసిస్తున్నారు. దేవతలకందరికీ వచ్చిన ఈ ముప్పు నీకు తెలిసినట్టులేదు. స్వామీ! మా క్షేమంకోసం దయచేసి నువ్వు ఆ సాగరనందనుణ్ణి సంహరించు. ఇంతకుముందు–మా రక్షణకోసమని నువ్వు గరుడధ్వజుణ్ణి నియోగించావు. అయితే ఆ శ్రీహరి మమ్మల్ని కాపాడలేకపోయాడు. పైగా అతడే వెళ్ళి జలంధరునికి అధీనుడై అతడి ఇంటిలో కాపురం పెట్టాడు. అతడితో పాటే మేమూను. జలంధరుడి ఆజ్ఞకు వశవర్తులమై అతడి ఇంటిలోనే ఉంటున్నాం.

అలక్షితా వయం చాత్రాగతాశ్శంభో త్వదంతికమ్ ।
స ఆయాతి త్వయా కర్తుం రణం సింధుసుతో బలీ ॥21॥

అతస్స్వామిన్! రణే త్వం తమవిలంబం జలంధరమ్।
హంతుమర్హసి సర్వజ్ఞ పాహి నశ్శరణాగతాన్ ॥22॥

శంభూ! అతడి కంటబడకండా ఎలాగో నీ సన్నిధికి వచ్చాం. ఆ బలశాలి నీతో యుద్ధానికి వస్తున్నాడు. అంచేత స్వామీ! రణరంగంలో వాణ్ణి ఆలస్యం చెయ్యకుండా సంహరించు. నువ్వు సర్వజ్ఞుడివి. శరణాగతులమైన మమ్మల్ని కాపాడు. రక్షించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా తే సురాస్సర్వే ప్రభుం నత్వా సవాసవాః ।
పాదౌ నిరీక్ష్య సంతస్థుర్మహేశస్య వినమ్రకాః ॥23॥

ఇతి దేవ వచః శ్రుత్వా ప్రహస్య వృషభధ్వజః ।
ద్రుతం విష్ణుం సమాహూయ వచనం చేదమబ్రవీత్ ॥24॥

ఇలా అభ్యర్థించి ఇంద్రాదిదేవతలందరూ అలాగే నమస్కరిస్తూ శివుడి పాదాలవైపే చూస్తూ వినమ్రులై నిలబడ్డారు. వృషభధ్వజుడు దేవతల పల్కులు విని పెద్దగా నవ్వాడు. వెంటనే విష్ణుమూర్తిని పిలిపించాడు. ఇలా అన్నాడు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు అడిగాడు.

హృషీకేశ మహావిష్ణో దేవాశ్చాత్ర సమాగతాః ।
జలంధర కృతాపీడాశ్శరణం మేఽతి విహ్వలాః ॥25॥

జలంధరః కథం విష్ణో సంగరే న హతస్త్వయా ।
తద్గృహం చాపి యాతోఽసి త్యక్త్వా వైకుంఠమాత్మనః ॥26॥

మయా నియోజితస్త్వం హి సాధుసంరక్షణాయ చ ।
నిగ్రహాయ ఖలానాం చ స్వతంత్రేణ విహారిణా ॥27॥

హృషీకేశా! మహావిష్ణూ! ఇదుగో దేవతలందరూ ఇక్కడ సమావేశమయ్యారు. జలంధరుడి చేతిలో సంకటపడి నలిగిపోయి ఇలా వచ్చి నన్ను శరణుజొచ్చారు. విష్ణుమూర్తీ! ఆ జలంధరుణ్ణి యుద్ధంలో నువ్వసలు ఎందుకు సంహరించలేదు? పైగా నీ వైకుంఠాన్ని విడిచిపెట్టి వాడి ఇంటికే వెళ్ళి కూచున్నావా? సర్వతంత్ర స్వతంత్రుణ్ణయిన నేను సాధుజనసంరక్షణకోసమూ, ఖలజనసంహారం కోసమూ కదా నిన్ను నియోగించాను?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య మహేశస్య వచనం గరుడధ్వజః ।
ప్రత్యువాచ వినీతాత్మా నతస్సాంజలిర్హరిః ॥28॥

వ్యాసర్షీ! మహేశుడు ఇలా అడిగేసరికి గరుడధ్వజుడు వినయ వినమితగాత్రుడై అంజలిబంధంతో నిలబడి బదులుపలికాడు.

విష్ణురువాచ – విష్ణువు విన్నవించాడు.

తవాంశసంభవత్వాచ్చ భ్రాతృత్వాచ్చ తథా శ్రియః ।
మయా న నిహతస్సంఖ్యే త్వమేనం జహి దానవమ్ ॥29॥

మహాబలో మహావీరోఽజేయస్సర్వదివౌకసామ్ ।
అన్యేషాం చాపి దేవేశ సత్యమేతద్భవీమ్యహమ్ ॥30॥

మయా కృతో రణస్తేన చిరం దేవాన్వితేన వై ।
మదుపాయో న ప్రవృత్తాస్తస్మిన్ దానవపుంగవే ॥31॥

తత్పరాక్రమసంతుష్టో వరం బ్రూహీత్యహం ఖలు ।
ఇతి మద్వచనం శ్రుత్వా స వవ్రే వరముత్తమమ్ ॥32॥

మద్భగిన్యా మయా సార్ధం మద్గేహే ససురో వస ।
మదధీనో మహావిష్ణో ఇత్యహం తద్గృహం గతః ॥33॥

మహేశ్వరా! ఆ జలంధరుడు నీ అంశలో పుట్టినవాడు. సముద్రసుతుడు కనక నా ఇల్లాలు లక్ష్మీదేవికి తమ్ముడు. (లక్ష్మీ సాగరపుత్రి). ఈ రెండు కారణాలవల్ల నేను అతణ్ణి రణరంగంలో మట్టుపెట్టలేదు. అతడు మహాబలుడు. మహావీరుడు. సకలదేవతలకూ అజేయుడు. దేవతలకే కాదు ఆ దానవుడు ఎవరికైనా అజేయుడే. ఇది నిజం. దేవతలందరితో కలిసి నేను అతడితో చిరకాలం పోరాడాను. నా ఉపాయాలేవీ ఆ దైత్యనాయకుడి మీద పనిచెయ్యలేదు. కానీ అతడి పరాక్రమం చూసి నేనెంతగానో సంబరపడ్డాను. వరం కోరుకోమన్నాను. నా సోదరితో సకల దేవతలతో కలిసి నువ్వు వచ్చి నా ఇంటిలో నా అధీనంలో ఉండు – అని ఒక ఉత్తమవరం నన్ను కోరాడు. అందుమీదట నేను వెళ్ళి ఆ జలంధరుడి ఇంటిలో నివసిస్తున్నాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి విష్ణోర్వచః శ్రుత్వా శంకరస్య మహేశ్వరః ।
విహస్యోవాచ సుప్రీతస్సదయో భక్తవత్సలః ॥34॥

విష్ణుమూర్తి చేసిన ఈ విన్నపం విని మహేశ్వరుడు శంకరుడు సంప్రీతుడు అయ్యాడు. భక్తవత్సలుడూ దయామయుడునూ అయిన ఆ శంకరుడు. పెద్దగా నవ్వి ఇలా పలికాడు.

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు అన్నాడు.

హే విష్ణో సురవర్య త్వం శృణు మద్వాక్యమాదరాత్ ।
జలంధరం మహాదైత్యం హనిష్యామి న సంశయః ॥35॥

స్వస్థానం గచ్ఛ నిర్భీతో దేవా గచ్ఛంత్వపి ధ్రువమ్।
నిర్భయా వీతసందేహా హతం మత్వాసురాధిపమ్॥36॥

ఓయీ విష్ణూ! సురవర్యా! నా పలుకులు శ్రద్ధగా విను. మహాదైత్యుడు ఆ జలంధరుణ్ణి సంహరిస్తాను. సందేహం లేదు. నిర్భయంగా నీ ఇంటికి నువ్వు వెళ్ళు. దేవతలారా! మీరూ వెళ్ళండి. భయాలూ సందేహాలు వదిలిపెట్టండి. జలంధరుడు అసురాధిపతి నిహతుడయ్యాడనే భావించండి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి శ్రుత్వా మహేశస్య వచనం స రమాపతిః ।
సనిర్జరో జగామాశు స్వస్థానం గతసంశయః ॥37॥

ఏతస్మిన్నంతరే వ్యాస! స దైత్యేంద్రోఽతివిక్రమః ।
సన్నద్ధైరసురైస్సార్ధం శైలప్రాంతం యయౌ బలీ ॥38॥

కైలాసమవరుద్ధాథ మహత్యా సేనయా యుతః ।
సంతస్థౌ కాలసంకాశః కుర్వన్ సింహరవం మహాన్ ॥39॥

శివుడు చెప్పిన ఈ పలుకులు ఆలకించి సంశయాలు తీరి, రమాపతి దేవతలందరితోనూ కలిసి తన వైకుంఠానికి వెళ్ళిపోయాడు. వ్యాసమహర్షీ! అంతలోకీ – అతివిక్రముడైన ఆ దైత్యేంద్రుడు సన్నద్ధులైన తన అసురసైనికులతో కైలాసపర్వతప్రాంతం చేరుకున్నాడు. మొత్తం పర్వతాన్ని ముట్టడించి మహాసైన్యంతో నిలబడ్డాడు. కాలయముడిలాగా నిలిచి భయంకరంగా సింహనాదం చేశాడు.

అథ కోలాహలం శ్రుత్వా దైత్యనాదసముద్భవమ్ ।
చుక్రోధాతి మహేశానో మహాలీలః ఖలాంతకః ॥40॥

సమాదిదేశ సంఖ్యాయ స్వగణాన్ స మహాబలాన్ ।
నంద్యాదికాన్ మహాదేవో మహాఽతికౌతుకీ హరః ॥41॥

దైత్యుల సింహనాదాలతో చెలరేగిన కోలాహలం మహేశ్వరుడికి వినిపించింది. ఆ మహాలీలా విశారదుడికి ఆ ఖలాంతకుడికి క్రోధం పెల్లుబికింది. ఒక మహాకౌతుకమూ రేకెత్తింది. వెంటనే ఆ మహాదేవుడు నంది ప్రభృతులైన శివగణాలను మహాబలాలను యుద్ధానికి ఆదేశించాడు

నందీభముఖసేనానీ ముఖాస్సర్వే శివాజ్ఞయా ।
గణాశ్చ సమనహ్యంత యుద్ధాయాతిత్వరాన్వితాః ॥42॥

అవతేరుర్గణాస్సర్వే కైలాసాత్ క్రోధదుర్మదాః ।
వల్గతో రణశబ్దాంశ్చ మహావీరా రణాయ హి ॥43॥

నందీశ్వరుడు గజముఖుడు కుమారస్వామి ప్రభృతులైన శివగణాలు అందరూ శివాజ్ఞతో త్వరత్వరగా యుద్ధసన్నద్ధులయ్యారు. అందరూ క్రోధదుర్మదులు. మహావీరులు. రణగొణధ్వనులతో అందరూ పరుగుపరుగున కైలాసశిఖరం నుంచి రణరంగానికి అవతరించారు.

తతస్సమభవద్యుద్ధం కైలాసోపత్యకాసు వై ।
ప్రమథాధిపదైత్యానాం ఘోరం శస్త్రాస్త్రసంకులమ్ ॥44॥

భేరీమృదంగశంఖౌఘైర్నిస్వానైర్వీరహర్షణైః ।
గజాశ్వరథశబ్దైశ్చ నాదితా భూర్వ్యకంపత ॥45॥

శక్తితోమరబాణౌఘై ర్ముసలైః పాశపట్టిశైః ।
వ్యరాజత నభః పూర్ణం ముక్తాభిరివ సంవృతమ్ ॥46॥

నిహతైరివ నాగాశ్వైః పత్తిభిర్భూర్వ్యరాజత ।
వజ్రాహతైః పర్వతేంద్రైః పూర్వమాసీత్ససంవృతా॥47॥

కైలాసానికి చుట్టూ ఉన్న ప్రత్యంతపర్వతాలమీద యుద్ధం ప్రారంభమయ్యింది. ప్రమథగణాలకూ దైత్యసమూహాలకూ యుద్ధం. శస్త్రాస్త్రప్రయోగాలతో సంకులసమరం. భేరీ –మృదంగ– శంఖధ్వనులు–వీరులని ఉత్సాహపరుస్తున్నాయి. గజఘీంకారాలు అశ్వహేషలు రథచక్రఘోషలు దశదిశలా పిక్కటిల్లి భూమి కంపించింది. శక్తి–తోమర–బాణసమూహాలు, ముసల–పాశ–పట్టిశాలు, వీటి తళత్తళలతో ఆకాశమంతా ముత్యాలపందిరి అయిపోయింది. చచ్చిపడిన ఏన్గులూ, గుర్రాలూ, దైత్యవీరుల కళేబరాలతో నిండిపోయిన ఆ రణరంగాన్ని చూస్తే –పూర్వకాలంలో ఒకప్పుడు ఇంద్రుడి వజ్రాయుధంతో రెక్కలు తెగిపడ్డ మహాపర్వతాలతో నిండిన భూగోళంలా అనిపించింది.

ప్రమథాహతదైత్యౌఘైః దైత్యాహతగణైస్తథా ।
వసాసృఙ్మాంసపంకాఢ్యా భూరగమ్యాభవత్తదా ॥48॥

ప్రమథా హతదైత్యౌఘాన్ భార్గవస్సమజీవయత్ ।
యుద్ధే పునపునశ్చైవ మృతసంజీవనీబలాత్ ॥49॥

దృష్ట్వా వ్యాకులితా స్తాంస్తు గణాస్సర్వే భయార్దితాః ।
శశంసుర్దేవదేవాయ సర్వే శుక్రవిచేష్టితమ్ ॥50॥

ప్రమథుల చేతిలో మరణించిన దైత్యులు, దైత్యు లచేతిలో మరణించిన ప్రమథులూ –వీరికొవ్వు, నెత్తురూ మాంసాలతో బురదగొన్న రణభూమి అడుగుపెట్టరానిదయ్యింది. అంతలోనే శుక్రాచార్యుడు తన మృతసంజీవనీశక్తితో దైత్యుల్ని వెంటవెంటనే మళ్ళీజీవించేటట్లు చెయ్యనారంభించాడు. ఇది చూసి ప్రమథగణాలు కలతపడ్డాయి. భయపడ్డాయి కూడా. వెంటనే వెళ్ళి ఈ శుక్రుడి చేష్టను ప్రమథగణాలందరు దేవదేవుడికి విన్నవించారు.

తచ్ఛ్రుత్వా భగవాన్ రుద్రశ్చకార క్రోధముల్బణమ్ ।
భయంకరోఽ తిరౌద్రశ్చ బభూవ ప్రజ్వలన్ దిశః ॥51॥

అథ రుద్రముఖాత్ కృత్యా బభూవాతీవభీషణా ।
తాళజంఘూదరీవక్త్రా స్తనాపీడితభూరుహా ॥52॥

ఇది వినడంతోనే రుద్రుడిలో క్రోధం కట్టలుతెంచుకుంది. దశదిశలను ప్రజ్వలింపచేస్తూ రౌద్రభయంకరాకారుడై పోయాడు. అప్పుడతని ముఖమండలం నుంచి అత్యంతభీషణాకారంలో ఒక కృత్య అవతరించింది. ఆవిడ పిక్కలు తాళవృక్షాల్లాగా ఉన్నాయి. కొండగుహలాంటి నోరు. ఆవిడ వక్షోజాలతో వృక్షాలు తుత్తునియలవుతున్నాయి.

సా యుద్ధభూమిం తరసా ససాద మునిసత్తమ ।
విచచార మహాభీమా భక్షయంతీ మహాసురాన్ ॥53॥

అథ సా రణమధ్యే హి జగామ గతభీర్ధ్రుతమ్।
యత్రాస్తే సంవృతో దైత్యవరేంద్రైస్స హి భార్గవః ॥54॥

స్వతేజసా నభో వ్యాప్య భూమిం కృత్వా చ సా మునే ।
భార్గవం స్వభగే ధృత్వా జగామాంతర్హితా నభః ॥55॥

మునిసత్తమా! వ్యాసా! ఆ కృత్య అతివేగంగా యుద్ధభూమి చేరుకుంది. మహారాక్షసుల్ని భక్షిస్తూ మహాభయంకరంగా రణరంగానకలియదిరిగింది. నిర్భయంగా రణరంగమధ్యభాగాననిలబడింది. అక్కడ గుమికూడిన దైత్యమహావీరుల మధ్యలో నిలబడి ఉన్న శుక్రాచార్యుణ్ణి చూసింది. ఒక్కసారిగా తన రూపాన్నీ తేజస్సునూ భూనభోంతరాలకు వ్యాపింపజేసింది. హఠాత్తుగా శుక్రాచార్యుణ్ణి తన మర్మావయంలో జొనుపుకుని ఆకాశంలో అంతర్ధానం చెందింది.

విద్రుతం భార్గవం దృష్ట్వా దైత్యసైన్యగణాస్తథా ।
ప్రమ్లానవదనా యుద్ధాన్నిర్జగ్ముర్యుద్ధదుర్మదాః ॥56॥

అథోఽభజ్యత దైత్యానాం సేనా గణభయార్దితా ।
వాయువేగహతా యద్వత్ప్రకీర్ణా తృణసంహతిః ॥57॥

భగ్నాం రణభయాద్దైత్యసేనాం దృష్ట్వాతిమర్షితాః ।
నిశుంభశుంభౌ సేనాన్యౌ కాలనేమిశ్చ చుక్రుధుః ॥58॥

త్రయస్తే వారయామాసుర్గణసేనాం మహాబలాః ।
ముంచంతశ్శరవర్షాణి ప్రావృషీవ బలాహకాః ॥59॥

శుక్రాచార్యుడు అదృశ్యమయ్యేసరికి దైత్యసేనలముఖాలు మాడిపోయాయి. అంతటి యుద్ధదుర్మదులు భయపడిపోయారు. రణభూమినుంచి వెనుదిరిగారు. శివగణాలు విజృంభించాయి. వారి ధాటికి తట్టుకోలేని దైత్యసేనలు పెనుగాలికి గడ్డిపరకల్లా చెల్లాచెదురయ్యారు. ఇది గమనించిన సేనానాయకులు శుంభ-నిశుంభ -కాలనేమి ప్రభృతులు కోపంతో ఊగిపోయారు. వెంటనే శివగణాలను అడ్డుకున్నారు. వార్షిక మేఘాలు వర్షధారలు కురిపించినట్టు ఆ ముగ్గురు బాణవర్షం కురిపించారు.

తతో దైత్యశరౌఘాస్తే శలభానామివ వ్రజాః ।
రురుధుః ఖం దిశస్సర్వా గణసేనామకంపయన్ ॥60॥

గణాశ్శరశతైర్భిన్నా రుధిరాసారవర్షిణః ।
వసంతకింశుకాభాసా న ప్రాజానన్ హి కించన ॥61॥

తతః ప్రభగ్నం స్వబలం విలోక్య నంద్యాది లంబోదర కార్తికేయాః ।
త్వరాన్వితా దైత్యవరాన్ ప్రసహ్య నివారయామాసురమర్షణాస్తే ॥62॥

వ్యాసమునీ! ఆ ముగ్గురూ కురిపించిన శరసమూహాలు మిడతల దండుల్లాగా ఆకాశాన అన్నివైపులా వ్యాపించాయి. శివగణాలు భయంతో వణికిపోయాయి. బాణాలు తాకి వాళ్ళ శరీరాలనుంచి రక్తధారలు కారాయి. వసంతఋతువులో చిగురాకుల్లాగా భాసించారు. శివగణాలకు దిక్కుతోచలేదు. తమ బలగాలు ఇలా వీగిపోతుండటం చూసి నందీశ్వర–గణేశ్వర–కార్తికేయులు కసితో భగ్గుమన్నారు. త్వరత్వరగా వెళ్ళి ఆ దైత్యసేనాధిపతుల్ని అడ్డుకున్నారు, వారించారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరవధోపాఖ్యానే సామాన్యగణాసురయుద్ధవర్ణనం నామ వింశోఽధ్యాయః ॥20॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధరవధో పాఖ్యానంలో సామాన్యగణాసురయుద్ధవర్ణనం అని ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

ఏకవింశతితమోఽధ్యాయః – ఇరవై ఒకటవ అధ్యాయం

విశేషయుద్ధవర్ణనమ్ – విశేషయుద్ధవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తే గణాధిపతీన్ దృష్ట్వా నందీభముఖషణ్ముఖాన్ ।
అమర్షాదభ్యధావంత ద్వంద్వయుద్ధాయ దానవాః ॥1॥

నందినం కాలనేమిశ్చ శుంభో లంబోదరం తథా ।
నిశుంభః షణ్ముఖం దేవమభ్యధావత శంకితః ॥2॥

నందీశ్వరుడు, గజముఖుడు, షణ్ముఖుడు అనే గణాధిపతులను చూసి ఆ దైత్యసేనాధిపతులు ఉక్రోషంతో ద్వంద్వయుద్ధానికి పరుగుపరుగున ఎదురువచ్చారు. నందీశ్వరుణ్ణి కాలనేమి, లంబోదరుణ్ణి శుంభదైత్యుడు, షణ్ముఖుణ్ణి శంకితుడై నిశుంభుడు ఎదుర్కొన్నారు.

నిశుంభః కార్తికేయస్య మయూరం పంచభిశ్శరైః ।
హృది వివ్యాధ వేగేన మూర్ఛితస్స పపాత హ ॥3॥

తతః శక్తిధరః క్రుద్ధో బాణైః పంచభిరేవ చ ।
వివ్యాధ స్యందనే తస్య హయాన్ యంతారమేవ చ ॥4॥

శరేణాన్యేన తీక్ష్ణేన నిశుంభం దేవవైరిణమ్ ।
జఘాన తరసా వీరో జగర్జ రణదుర్మదః ॥5॥

నిశుంభుడు ఒకేసారి అయిదుబాణాలతో కార్తికేయుడి వాహనమైన మయూరాన్ని(నెమలిని) గురిచూసి గుండెల్లో కొట్టాడు. అది మూర్ఛిల్లి పడిపోయింది. శక్తిధరుడు అతిక్రుద్ధుడయ్యాడు. తానూ అయిదు బాణాలు ప్రయోగించి నిశుంభుడి రథాన్ని గుర్రాలనూ సారథినీ కొట్టాడు. ఎడమివ్వకుండా మరొక బాణంతో దేవశత్రువైన నిశుంభుణ్ణి కొట్టాడు. రణదుర్మదుడై వీరగర్జన చేశాడు.

అసురోఽపి నిశుంభాఖ్యో మహావీరోఽతి వీర్యవాన్ ।
జఘాన కార్తికేయం తం గర్జంతం స్వేషుణా రణే ॥6॥

తతశ్శక్తిం కార్తికేయో యావజ్జగ్రాహ రోషతః ।
తావన్నిశుంభో వేగేన స్వశక్త్యా తమపాతయత్ ॥7॥

ఏవం బభూవ తత్రైవ కార్తికేయనిశుంభయోః ।
ఆహవో హి మహాన్ వ్యాస! వీరశబ్దం ప్రగర్జతోః ॥8॥

వ్యాసమునీ! ఆ నిశుంభాసురుడుకూడా మహావీరుడు మహావీర్యుడూను. తానూ ఒకే బాణం సంధించి కార్తికేయుణ్ణి కొట్టాడు. రోషపడ్డ కార్తికేయుడు తన శక్తి ఆయుధాన్ని అందుకునే లోగా నిశుంభుడే తన శక్త్యాయుధంతో వేగంగా దాన్ని పడగొట్టాడు. వీరగర్జనలతో విజృంభిస్తున్న కార్తికేయనిశుంభులకు ఈ విధంగా మహాయుద్ధం జరిగింది.

తతో నందీశ్వరో బాణైః కాలనేమిమవిధ్యత ।
సప్తభిశ్చ హయాన్ కేతుం రథం సారథిమాచ్ఛినత్ ॥9॥

కాలనేమిశ్చ సంక్రుద్ధో ధనుశ్చిచ్ఛేద నందినః ।
స్వశరాసననిర్ముక్తైర్మహాతీక్ష్ణైశ్శిలీముఖైః ॥10॥

అథ నందీశ్వరో వీరః కాలనేమి మహాసురమ్।
తమపాస్య చ శూలేన వక్షస్యభ్యహనద్ దృఢమ్ ॥11॥

అప్పుడే నందీశ్వరుడు బాణాలతో కాలనేమిని వేధించాడు. ఏడింటితో వాడి రథాశ్వాలను సంహరించాడు. కేతువును కూల్చాడు. సారథిని గాయపరిచాడు. కాలనేమి సంక్రుద్ధుడయ్యాడు. తన ధనుస్సునుంచి వెలువడ్డ వాడివాడి బాణాలతో నందీశ్వరుడి ధనుస్సును విరగ్గొట్టాడు. మహావీరుడు నందీశ్వరుడు బాణవర్షాన్ని తప్పించుకుని ఒక్క ఉదుటున దరిజేరి తన మహాశూలంతో కాలనేమిని దృఢంగా వక్షఃస్థలాన పొడిచాడు.

స శూలభిన్నహృదయో హతాశ్వో హతసారథిః ।
అద్రేః శిఖరముత్పాట్య నందినం సమతాడయత్ ॥12॥

అథ శుంభో గణేశశ్చ రథమూషకవాహనౌ ।
యుధ్యమానే శరవ్రాతైః పరస్పరమవిధ్యతామ్ ॥13॥

గణేశస్తు తథా శుంభం హృది వివ్యాధ పత్రిణా ।
సారథిం చ త్రిభిర్బాణైః పాతయామాస భూతలే ॥14॥

తతోఽతిక్రుద్ధః శుంభోఽపి బాణవృష్ట్యా గణాధిపమ్ ।
మూషకం చ త్రిభిర్విద్ధ్వా ననాద జలదస్వనః ॥15॥

అశ్వాలు చనిపోయి, సారథి చనిపోయి, గుండెల్లో శూలం గుచ్చుకుని విలవిల లాడుతూనే ఆ కాలనేమి ఒక గిరిశిఖరం పెళ్ళగించి నందీశ్వరుణ్ణి చావబాదాడు. వీరి ద్వంద్వయుద్ధం ఇలా జరుగుతూండగా – రథవాహనుడు శుంభుడూ, మూషకవాహనుడు గణేశుడూ తలపడ్డారు. బాణసమూహాలతో పరస్పరం గాయపరచుకున్నారు. అదను చూసి గణేశుడు ఒక రెక్కల బాణంతో శుంభుడి గుండెను చీల్చి, మూడు బాణాలతో సారథిని నేలకు కూల్చాడు. శుంభుడు అతిక్రుద్ధుడయ్యాడు. గణపతి మీద బాణవర్షం కురిపించాడు. మూడు బాణాలతో మూషకాన్ని కొట్టాడు. మేఘగర్జనలాగా వీరనాదం చేశాడు.

మూషకశ్శరభిన్నాంగశ్చచాల దృఢవేదనః ।
లంబోదరశ్చ పతితః పదాతిరభవత్స హి ॥16॥

తతో లంబోదరశ్శుంభం హత్వా పరశునా హృది ।
అపాతయత్తదా భూమౌ మూషకం చారురోహ సః ॥17॥

సమరాయోద్యతశ్చాభూత్పునర్గజముఖో విభుః ।
ప్రహస్య జఘ్నతుః క్రోధాత్ తోత్రేణైవ మహాద్విపమ్ ॥18॥

మూడు బాణాలు ఒకేసారి తగలడంతో మూషకానికి తీవ్రవేదన కలిగింది. బాధ తాళలేక విలవిలలాడింది. లంబోదరుడు కింద పడిపోయాడు. వెంటనే లేచి పదాతియై (కాలినడకయోధుడు) వేగంగా వెళ్ళి తన గొడ్డలితో శుంభదైత్యుణ్ణి గుండెల మీద బాది నేలకు పడగొట్టాడు. వెంటనే తన వాహనమూషకాన్ని మళ్ళీ అధిరోహించాడు. సమరానికి సన్నద్ధుడయ్యాడు. శుంభుణ్ణి కోలుకోనివ్వకుండా వెంట వెంటనే కొట్టాడు – తోత్రంతో (అంకుశం) మదమత్తేభాన్ని పొడిచినట్టు పొడిచాడు.

కాలనేమిర్నిశుంభశ్చ హ్యుభౌ లంబోదరం శరైః ।
యుగపచ్చక్షతుః క్రోధాదాశీవిషసమైః ద్రుతమ్ ॥19॥

తం పీడ్యమానమాలోక్య వీరభద్రో మహాబలః ।
అభ్యధావత వేగేన కోటిభూతయుతస్తథా ॥20॥

శుంభుడి పరిస్థితి గమనించి కాలనేమి నిశుంభులిద్దరూ ఒక్కసారిగా ఆ లంబోదరుడి మీదకు విషసర్ప సదృశాలైన బాణాలను వేగంగా కురిపించారు. గణపతికి వచ్చిన ఇబ్బందిని చూశాడు మహాబలుడు వీరభద్రుడు. కోటిభూతగణాలతో రివ్వురివ్వున వచ్చి ఆ దైత్యసేనాపతుల్ని ఇద్దరినీ తరిమికొట్టాడు.

కూష్మాండా భైరవాశ్చాపి వేతాళా యోగినీగణాః ।
పిశాచా ధాకినీసంఘా గణాశ్చాపి సమం యయుః ॥21॥

తతః కిలకిలాశబ్దైస్సింహనాదైస్సఘర్ఘ రైః ।
వినాదితా డమరుకైః పృథివీ సమకంపత ॥22॥

తతో భూతాః ప్రధావంతో భక్షయంతిస్మ దానవాన్ ।
ఉత్పత్య పాతయంతి స్మ ననృతుశ్చ రణాంగనే ॥23॥

కూష్మాండులు, భైరవులు, బేతాళులు, యోగినులు, పిశాచాలు, ధాకినులు ఇత్యాది శివగణసమూహాలు ఒక్కసారిగా రణరంగంలోకి ప్రవేశించాయి. కిలకిలా శబ్దాలూ, సింహనాదాలూ, ఘర్ఘురారవాలూ, డమరుకధ్వనులూ మారుమోగి భూమికంపించింది. ఈ భూతగణాలు రణరంగాన విచ్చలవిడిగా పరుగెడుతూ దానవులను అసంఖ్యాకంగా భక్షించాయి. పైకెత్తి కిందపడవేశాయి. రణరంగంమీద నృత్యం చేశాయి.

ఏతస్మినంతరే వ్యాసాభూతాం నందీగుహశ్చ తౌ ।
ఉత్థితావాప్త సంజ్ఞౌ హి జగర్జతురలం రణే ॥24॥

స నందీ కార్తికేయశ్చ సమాయాతౌ త్వరాన్వితౌ ।
జఘ్నతుశ్చ రణే దైత్యాన్నిరంతరశరవ్రజైః ॥25॥

ఛిన్నైర్భిన్నైర్హ్రతైర్దైత్యైః పతితైర్భక్షితైస్తథా ।
వ్యాకులా సాభవత్సేనా విషణ్ణవదనా తదా ॥26॥

ఏవం నందీ కార్తికేయో వికటశ్చ ప్రతాపవాన్ ।
వీరభద్రో గణాశ్చాన్యే జగర్జుస్సమరేఽధికమ్ ॥27॥

వ్యాసమునీ! ఇంతలో నందీశ్వరుడూ కార్తికేయుడు స్పృహలోకి వచ్చారు. రణరంగం దద్దరిల్లేట్టు గర్జించారు. అవయవాలు విరిగి, శరీరాలు చిరిగి, ప్రాణాలు సురిగి, భూతగణాల భక్షణతో తరిగి –దైత్యసైన్యం గగ్గోలుపడి విషణ్ణమయ్యింది. ఈ విధంగా పోరాడుతూ నందీశ్వరుడు, కార్తికేయుడు, వికటుడు, ప్రతాపశాలి వీరభద్రుడు, ఇంకా తక్కిన శివగణాలవారూ సమరభూమిలో భీషణగర్జనలు చేశారు.

నిశుంభశుంభౌ సేనాన్యౌ సింధుపుత్రస్య తౌ తథా ।
కాలనేమిర్మహాదైత్యోఽసురాశ్చాన్యే పరాజితాః ॥28॥

ప్రవిధ్వస్తాం తతస్సేనాం దృష్ట్వా సాగరనందనః ।
రథేనాతిపతాకేన గణానభియయౌ బలీ ॥29॥

తతః పరాజితా దైత్యా అప్యభూవన్మహోత్సవాః ।
జగర్జురధికం వ్యాస! సమరాయోద్యతాస్తదా ॥30॥

సింధుపుత్రుడి సేనాపతులు శుంభ–నిశుంభ–కాలనేమిప్రభృతులూ మిగిలిన దైత్యవీరులూ పరాజితులు కాగా, ఉత్సాహంతో తన సైన్యాన్ని చూసి సాగరనందనుడు పతాకం రెపరెపలాడుతున్న రథంమీద వేగంగా వచ్చి శివగణాలను ఎదుర్కొన్నాడు. దానితో దైత్యులలో ఒక ఉత్సవం వెల్లివిరిసింది. వ్యాసమునీ! అందరూ అత్యధికంగా గర్జించి పోరాటానికి ఉద్యుక్తులయ్యారు.

సర్వే రుద్రగణాశ్చాపి జగర్జుర్జయశాలినః ।
నందికార్తికదంత్యాస్యవీరభద్రాదికా మునే ॥31॥

హస్త్యశ్వరథసంహ్రాదశ్శంఖభేరీ రవస్తథా ।
అభవత్సింహనాదశ్చ సేనయోరుభయో స్తథా ॥32॥

వ్యాసమహర్షీ! జయశాలులు రుద్రగణాలు సైతం అంతకు రెట్టింపుగా గర్జించారు. నందీశ్వరుడు కార్తికేయుడు గజాస్యుడు వీరభద్రాదులు కూడా అలాగే గర్జించారు. హయహేషలు, గజఘీంకృతులు రథధ్వనులు శంఖభేరీ భాకృతులు ఉభయసేనల సింహనాదాలు మిన్నుముట్టాయి.

జలంధరశరవ్రాతైర్నీహారపటలైరివ ।
ద్యావా పృథివ్యోరాచ్ఛన్నమంతరం సమపద్యత ॥33॥

శైలాదిం పంచభిర్విద్ధ్వా గణేశం పంచభిశ్శరైః ।
వీరభద్రం చ వింశత్యా ననాద జలదస్వనః ॥34॥

జలంధరుడు కురిపించిన శరసమూహంతో నింగినేలల నడిమిభాగం మంచుతెరలు కమ్మినట్టయిపోయింది. శైలాదియైన నందీశ్వరుణ్ణి అయిదు బాణాలతో, కొట్టి, గణేశుణ్ణి కూడా అలాగే అయిదింటితో గాయపరచి, వీరభద్రుణ్ణి ఇరవై బాణాలతో హింసించి ఆ జలంధరుడు సింహనాదం చేశాడు.

కార్తికేయస్తతో దైత్యం శక్త్యా వివ్యాధ సత్వరమ్ ।
జలంధరం మహావీరో రుద్రపుత్రో ననాద చ ॥35॥

స ఘూర్ణనయనో దైత్యః శక్తినిర్భిన్నదేహకః ।
పపాత భూమౌ త్వరితముదతిష్ఠన్మహాబలః ॥36॥

తతః క్రోధపరీతాత్మా కార్తికేయం జలంధరః ।
గదయా తాడయామాస హృదయే దైత్యపుంగవః ॥37॥

అప్పుడు మహావీరుడు రుద్రపుత్రుడు కార్తికేయుడు త్వరత్వరగా వెళ్ళి తన శక్త్యాయుధంతో జలంధరుణ్ణి గట్టిగా కొట్టాడు. వీరనాదం చేశాడు. దైత్యుడి శరీరం నలిగిపోయింది. కన్నులు బైర్లు కమ్మాయి. నేలమీద కూలబడ్డాడు. కానీ ఆ మహాబలుడు వెంటనే లేచి నిలబడ్డాడు. క్రోధంతో ఊగిపోతూ ఆ దైత్యపుంగవుడు జలంధరుడు తన దివ్యగదతో కార్తికేయుణ్ణి గుండెలమీద కొట్టాడు.

గదాప్రభావం సఫలం దర్శయన్ శంకరాత్మజః ।
విధిదత్తవరాద్వ్యాస! స తూర్ణం భూతలేఽపతత్ ॥38॥

తథైవ నందీ హ్యపతద్భూతలే గదయా హతః ।
మహావీరోఽపి రిపుహా కించిద్వ్యాకులమానసః ॥39॥

తతో గణేశ్వరః క్రుద్ధః స్మృత్వా శివపదాంబుజమ్ ।
సంప్రాప్యాతిబలో దైత్యగదాం పరశునాచ్ఛినత్ ॥40॥

వ్యాసమునీ! శంకరాత్మజుడు కార్తికేయుడికి ఆ గదా ప్రభావం తెలుసు. బ్రహ్మదేవుడు దైత్యుడికి వరంగా ఇచ్చిన గద అది. దాని ప్రభావాన్ని సఫలం చేస్తూ ఆ గుహుడు వెంటనే నేలపై పడిపోయాడు. అలాగే మహావీరుడూ రిపుహంతకుడూ అయిన నందీశ్వరుడూ సైతం వ్యాకులితచిత్తుడై గదాప్రహారానికి నేలపై పడ్డాడు. గణేశ్వరుడు ఇది చూసి క్రుద్ధుడయ్యాడు. శివుడి పాదాంబుజాలను మరొక్కసారి స్మరించుకున్నాడు. అతిబలిష్ఠుడుగదా! తన గండ్రగొడ్డలితో దైత్యేశ్వరుడి గదను తునాతునకలు చేశాడు.

వీరభద్రస్త్రిభిర్బాణైః హృది వివ్యాధ దానవమ్ ।
సప్తభిశ్చ హయాన్ కేతుం ధనుశ్ఛత్రం చ చిచ్ఛిదే ॥41॥

తతోఽతిక్రుద్ధో దైత్యేంద్రశ్శక్తిముద్యమ్య దారుణామ్ ।
గణేశం పాతయామాస రథమన్యం సమారుహత్ ॥42॥

అభ్యగాదథ వేగేన స దైత్యేంద్రో మహాబలః ।
విగణయ్య హృదా తం వై వీరభద్రం రుషాన్వితః ॥43॥

వీరభద్రం జఘానాశు తీక్ష్ణేనాశీవిషేన తమ్ ।
ననాద చ మహావీరో దైత్యరాజో జలంధరః ॥44॥

అంతలో వీరభద్రుడు వచ్చి మూడు బాణాలతో దానవుణ్ణి గుండెలమీద కొట్టాడు. ఏడు బాణాలతో గుర్రాలను గాయపరిచాడు. రథకేతనాన్నీ అతడి ధనుస్సునూ ఛత్రాన్నీ నేలకూల్చాడు. దైత్యేంద్రుడికి క్రోధం పెల్లుబికింది. దారుణమైన శక్తి ఆయుధాన్ని చేపట్టాడు. దానితో కొట్టి గణేశుణ్ణి పడగొట్టాడు. మరొక రథం అధిరోహించాడు. రోషం ముంచుకు రాగా ఆ మహాబలుడు దైత్యేంద్రుడు మహావేగంతో వీరభద్రుణ్ణి ఏమాత్రమూ లెక్కజెయ్యకుండా – ఎదురువచ్చాడు. సర్పసమానమైన బాణంతో వేగంగా కొట్టాడు. కొట్టి ఆ మహావీరుడు దైత్యరాజు జలంధరుడు భీకరంగా అరిచాడు.

వీరభద్రోఽపి సంక్రుద్ధస్సితధారేణ చేషుణా ।
చిచ్ఛేద తచ్ఛరం చైవ తంవివ్యాధ మహేషుణా ॥45॥

తతస్తే సూర్యసంకాశే యుయుధాతే పరస్పరమ్ ।
నానాశస్త్రైస్తథాఽస్త్రైశ్చ చిరం వీరవరోత్తమౌ ॥46॥

వీరభద్రస్తతస్తస్య హయాన్ బాణైరపాతయత్ ।
ధనుశ్చిచ్ఛేద రథినః పతాకాం చాపి వేగతః ॥47॥

వీరభద్రుడికి కోపం ఇబ్బడి ముబ్బడి అయ్యింది. తెల్లని పదునుటంచుతో ఉన్న ఒకే బాణంతో దైత్యుడి శరాన్ని తునియలు చేశాడు. మరొక మహాబాణంతో వాడిని హింసించాడు. ఇద్దరూ సూర్యమండలాల్లాగా ప్రకాశిస్తున్నారు. ఇద్దరూ వీరవరోత్తములే. రకరకాల శస్త్రాలతో అస్త్రాలతో చాలసేపు పోరాడారు. కడకు వీరభద్రుడు దైత్యేంద్రుడి రథాశ్వాలను పడగొట్టాడు. ధనుస్సు విరగ్గొట్టాడు. రథపతాకను నేలకూల్చాడు. అంతా అతివేగంగా జరిగిపోయింది.

అథో దైత్యరాజో హి పుప్లువే పరిఘాయుధః ।
వీరభద్రోపకంఠం స ద్రుతమాప మహాబలః ॥48॥

పరిఘేనాతిమహతా వీరభద్రం జఘాన హ ।
మహాబలోఽభితనయో మూర్ధ్ని వీరో జగర్జ చ ॥49॥

అప్పుడు ఆ దైత్యరాజు రథం దూకి పరిఘను చేబూని అతివేగంగా వీరభద్రుడి చెంతకు వచ్చాడు. వస్తూనే తన మహాపరిఘతో వీరభద్రుణ్ణి నడినెత్తిన మోదాడు. వీరగర్జన చేశాడు.

పరిఘేణాతిమహతా భిన్నమూర్ధా గణాధిపః ।
వీరభద్రః పపాతోర్వ్యాం ముమోచ రుధిరం బహు ॥50॥

పతితం వీరభద్రం తు దృష్ట్వా రుద్రగణా భయాత్ ।
అపాగచ్ఛన్ రణం హిత్వా క్రోశమానా మహేశ్వరమ్ ॥51॥

అథ కోలాహలం శ్రుత్వా గణానాం చంద్రశేఖరః ।
నిజపార్శ్వస్థితాన్ వీరానపృచ్ఛద్గణసత్తమాన్ ॥52॥

ఆ మహాపరిఘ దెబ్బతో శివగణనాయకుడైన వీరభద్రుడి శిరస్సు పగిలింది. నేలకు ఒరిగిపోయాడు. రక్తం ఎంతగానో ప్రవహించింది వీరభద్రుడే పడిపోయేసరికి రుద్రగణాలు భయపడిపోయాయి. రణరంగం వదిలేసి విలపిస్తూ మహేశ్వరుడిసన్నిధికి పరుగుతీశారు. వారి కోలాహలం చంద్రశేఖరుడికి వినిపించింది. తనకు ఉభయపార్శ్వాలలోనూ ఉన్న గణవీరుల్ని అడిగాడు.

శంకర ఉవాచ – శంకరుడు చెప్పాడు.

కిమర్థం మద్గణానాం హి మహాకోలాహలో ఽభవత్ ।
విచార్యతాం మహావీరాశ్శాంతిః కార్యా మయా ధ్రువమ్ ॥53॥

ఇతి యావత్స దేవేశో గణాన్ పప్రచ్ఛ సాదరమ్ ।
తావద్గణవరాస్తే హి సమాయాతాః ప్రభుం ప్రతి ॥54॥

తాన్ దృష్ట్వా వికలాన్ రుద్రః పప్రచ్ఛ కుశలం ప్రభుః ।
యథావత్తే గణా వృత్తం సమాచఖ్యుశ్చ విస్తరాత్ ॥55॥

తచ్ఛ్రుత్వా భగవాన్ రుద్రో మహాలీలాకరః ప్రభుః ।
అభయం దత్తవాంస్తేభ్యో మహోత్సాహం ప్రవర్ధయన్ ॥56॥

మహావీరులారా! ఏమిటి నా రుద్రగణాల కోలాహలం! తెలుసుకు రండి. నేను శాంతి నెలకొల్పాలి గదా! అని శివుడు ఆజ్ఞాపించేలోగా రుద్రగణాలే లోపలికి ప్రవేశించాయి. వికలులై ఉన్నవారిని చూస్తూనే కుశలం అడిగాడు ప్రభువు. వారు జరిగినదంతా సవిస్తరంగా విన్నవించారు. ఆ రుద్రగణాలు. మహాలీలాకరుడు రుద్రుడు అది అంతా విని వారికి అభయమిచ్చాడు. దానితో వారిలో ఒక ఉత్సాహం పెల్లుబికింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరోపాఖ్యానే విశేషయుద్ధవర్ణనం నామైకవింశతితమోఽధ్యాయః ॥21॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధర వధోపాఖ్యానంలో విశేషయుద్ధవర్ణనమనే ఇరవై ఒకటవ అధ్యాయం సమాప్తం.

द्वाविंशोऽध्यायः – ఇరవై రెండవ అధ్యాయం
जलंधरयुद्धवर्णनम् – జలంధరయుద్ధవర్ణనం

सनत्कुमार उवाच – సనత్కుమారుడు చెప్పాడు.

अथ वीरगणै रुद्रो रौद्ररूपो महाप्रभुः ।
अभ्यगादृषभारूढस्संग्रामं प्रहसन्निव ॥1॥

रुद्रमायांतमालोक्य सिंहनादैर्गणाः पुनः ।
निवृत्तास्संगरे रौद्रा ये हि पूर्वं पराजिताः ॥2॥

वीरशब्दं च कुर्वंतस्तेऽप्यन्ये शांकरा गणाः ।
सोत्सवास्सायुधा दैत्यान्निजघ्नुश्शरवृष्टिभिः ॥3॥

వ్యాసమహర్షీ! అప్పుడు రౌద్రకారుడై మహాప్రభువు రుద్రుడు వీరగణాలతో కలిసి తన వృషభం మీద సంగ్రామరంగానికి స్వయంగా వెళ్ళాడు .వికటాట్టహాసం చేస్తూ వెళ్ళాడు. ఇది చూసి శివగణాలు సింహనాదాలు చేశారు. అప్పటికి పరాజితులైనా మళ్ళీ రౌద్రాకారులై రణరంగానికి వచ్చారు. వీరశబ్దాలు మిన్నుముట్టాయి. అందరిలోనూ ఒక ఉత్సవం వెల్లివిరిసింది. ఆయుధప్రహారాలతో బాణవృష్టితో దైత్యుల్ని తుదముట్టించ నారంభించారు.

दैत्या हि भीषणं रुद्रं सर्वे दृष्ट्वा विदुद्रुवः ।
शांकरं पुरुषं दृष्ट्वा पातकानीव तद्भयात् ॥4॥

अथो जलंधरो दैत्यान् निवृत्तान् प्रेक्ष्य संगरे ।
अभ्यदावत्स चंडीशं मुंचन् बाणान् सहस्रशः ॥5॥

निशुंभशुंभप्रमुखा दैत्येंद्राश्च सहस्रशः ।
अभिजग्मुश्शिवं वेगाद्रोषात्संदष्टदच्छदाः ॥6॥

कालनेमिस्तथा वीरः खड्गरोमा बलाहकः ।
घुस्मरश्च प्रचंडश्चापरे चापि शिवं ययुः ॥7॥

శంకరుణ్ణి చూసి భయపడి మహాపాపాలు పారిపోయినట్టు, రుద్రాకారుణ్ణి భీషణరుద్రుణ్ణి చూడటం తోనే దైత్యులు కకావికలులయ్యారు. రణరంగం నుంచి పారిపోతున్న దైత్యుల్ని చూసి జలంధరుడు స్వయంగా చండీశుణ్ణి ఎదుర్కొన్నాడు. వేలకు వేలుగా బాణాలు కురిపించాడు. నిశుంభుడు, శుంభుడు, కాలనేమి, ఖడ్గరోముడు, బలాహకుడు, ఘుస్మరుడు, ప్రచండుడు – ఇంకా తక్కిన దైత్యసేనాపతులు రోషంతో పెదవులు కరుస్తూ, సింహనాదాలు చేస్తూ ఒక్కుమ్మడిగా అతివేగంగా శివుణ్ణి ముట్టడించారు.

बाणैस्संछादयामासुर्द्रुतं रुद्रगणांश्च ते ।
अंगानि चिच्छिदुर्वीराः शुंभाद्या निखिला मुने ॥8॥

బాణాంధకారసంఛన్నం దృష్ట్వా గణబలం హరః ।
తద్బాణజాలమాచ్ఛిద్య బాణైరావవృతే నభః ॥9॥

దైత్యాంశ్చ బాణవాత్యాభిః పీడితానకరోత్తదా ।
ప్రచండబాణజాతౌఘై రపాతయత భూతలే ॥10॥

వ్యాసమునీ! ఈ దైత్యసేనాధిపతులు శుంభాదులు అందరూ తమ శరపరంపరలతో రుద్రగణాలను క్షణంలో కప్పివేశారు. మహావీరులు శివగణాల శరీరాలను తూట్లుతూట్లు పొడిచారు. మొత్తంగా బాణాంధకారం అలముకొంది. హరుడు గమనించాడు. విజృంభించాడు. దైత్యుల బాణసమూహాలను తన శరవృష్టితో తుత్తునియలు చేసేశాడు. ఆకాశమంతటా శివుడి బాణాలే ఆవరించేశాయి. అదొక బాణాల ఝంఝామారుతం. దైత్యులు గుంపులు గుంపులుగా నేలకూలిపోయారు.

ఖడ్గరోమశిరః కాయాత్తథా పరశునాచ్ఛినత్ ।
బలాహకస్య చ శిరః ఖట్వాంగేనాకరోత్ ద్విధా ॥11॥

స బద్ధ్వా ఘుస్మరం దైత్యం పాశేనాభ్యహనద్భువి ।
మహావీరప్రచండం చ చకర్త త్రిశిఖేన హ ॥12॥

వెంటనే రుద్రుడు గండ్రగొడ్డలితో నరికి ఖడ్గరోముడి శిరస్సుని వాడికాయంనుంచి వేరుపరిచాడు. ఖట్వాంగం అనే ఆయుధంతో బలాహకుడి తలను రెండుముక్కలు చేశాడు. ఘుస్మరదైత్యుణ్ణి పాశంతో బంధించి సంహరించాడు. ప్రచండున్ని త్రిశూలంతో కత్తిరించాడు.

వృషభేణ హతాః కేచిత్ కేచిద్బాణైర్నిపాతితాః ।
న శేకురసురాః స్థాతుం గజాత్సింహార్దితా ఇవ ॥13॥

తతః క్రోధపరీతాత్మా దైత్యాన్ ధిక్కృతవాన్ రణే ।
శుంభాదికాన్ మహాదైత్యః ప్రహసన్ ప్రాహ ధైర్యవాన్ ॥14॥

మిగతా దైత్యవీరుల్లో కొందరు శివుడి వాహన వృషభంకాలిగిట్టలకింద నలిగి మరణించారు. మరికొందరు బాణాలతో నశించారు. సింహం ముందర ఏనుగుల్లాగా దైత్యులు నిలవలేకపోయారు. ఇది చూసి జలంధరుడికి కోపం విపరీతంగా వచ్చింది. దైత్యులందరినీ ఛీత్కరించాడు. శుంభాది దైత్యసేనాపతుల్ని పరిహసించాడు. ధైర్యశాలి ఇలా పలికాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు చెప్పాడు.

కిం వో ఉచ్చరితైర్మాతుర్ధావద్భిః పృష్ఠతో హతైః ।
న హి భీతవధః శ్లాఘ్యుః స్వర్గదః శూరమానినామ్ ॥15॥

యది వః ప్రధనే శ్రద్ధా సారో వా క్షుల్లకా హృది ।
అగ్రే తిష్ఠత మాత్రం మే న చేద్రామ్యసుఖే స్పృహా ॥16॥

రణే మృత్యుర్వరశ్చాస్తి సర్వకామఫలప్రదః ।
యశఃప్రదో విశేషేణ మోక్షదోఽపి ప్రకీర్తితః ॥17॥

శుంభ నిశుంభాదులారా! మా మాతృవంశం ఇంతగొప్పది అంత గొప్పది అని చెప్పుకుంటారు గదా మీరు ఏమి లాభం? శత్రువులు వీపులు బాదుతూంటే ఏమి గొప్ప? భయపడి – చావడం మీలాంటి శూరాధిశూరులకు ప్రశస్తమూ కాదు స్వర్గప్రదమూ కాదు. యుద్ధం పట్ల మీకు శ్రద్ధ ఉంటే, గుండెల్లో ఆయుధం (ధైర్యం) ఉంటే నేలబారు సుఖాల మీద ఆసక్తి లేకుంటే – నిలబడండి నా ముందు మాత్రమే నిలబడండి. రణరంగాన చావు – ఉత్తమోత్తమం. సర్వవాంఛాఫలప్రదం. కీర్తిప్రదం విశేషించి మోక్షప్రదమని ప్రశంసలందుకున్న మృత్యువది.

సూర్యస్య మండలం భిత్త్వా యాయాద్వై పరమం పదమ్ ।
పరివ్రాట్ పరమజ్ఞానీ రణే యస్సమ్ముఖే హతః ॥18॥

మృత్యోర్భయం న కర్తవ్యం కదాచిత్క్వచిదుద్ధైః ।
అనివార్యో యతో హ్యేష ఉపాయైర్నిఖిలైరపి ॥19॥

సూర్యమండలాన్ని ఛేదించుకుని పరమపదాన్ని చేరుకునేవాళ్ళు ముగ్గురే ముగ్గురు. పరివ్రాజకుడు, పరమజ్ఞాని, రణరంగంలో మడమ తిప్పకుండా మరణించినవాడూను. తెలివైనవాళ్ళు(బుధులు) మృత్యువుకి ఏనాడూ భయపడరు. ఎందుకంటే – ఎన్నెన్ని ఉపాయాలతో ఎవరెన్ని ప్రయత్నాలూ చేసినా మృత్యువు అనివార్యం. ఎవరూ తప్పించుకోలేరు.

మృత్యుర్జన్మవతాం వీరా దేహేన సహ జాయతే ।
అద్య వాబ్దశతాంతే వా మృత్యుర్వై ప్రాణినాం ధ్రువః ॥20॥
తన్మృత్యుభయముత్సార్య యుధ్యధ్వం సమరే ముదా ।
సర్వథా పరమానంద ఇహాముత్రాప్యసంశయః ॥21॥

దేహంతో పాటే మృత్యువు పుడుతుంది. ఇవ్వేళ కాకపోతే మరో వందేళ్ళ తరవాతనైనా ప్రాణికి మృత్యువు తప్పదు. ఇది నిశ్చయం. కనక ఓనా సేనాపతులారా! మహావీరులారా! మృత్యుభీతిని పారద్రోలండి. రణరంగాన పోరాడండి. ఆనందంగా పోరాడండి. అదే ఇహంలోనూ పరంలోనూ పరమానందప్రదం. సందేహం లేదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా రోధయామాస స్వవీరాన్ బహుశస్స హి ।
ధైర్యం దధుర్న తే భీతా పలాయంత రణాద్ద్రుతమ్ ॥22॥
అథ దృష్ట్వా స్వసైన్యం తత్పలాయనపరాయణమ్ ।
చుక్రోధాతి మహావీరస్సింధుపుత్రో జలంధరః ॥23॥
తతః క్రోధపరీతాత్మా క్రోధాద్రుద్రం జలంధరః ।
ఆహ్వాపయామాస రణే తీవ్రాశనిసమస్వనః ॥24॥

వ్యాసమునీ! ఇలా రకరకాలుగా చెప్పి దైత్యవీరులను ఉత్తేజపరిచాడు జలంధరుడు. అయినా భయపడిన ఆ దైత్యనాయకులు ధైర్యం వహించలేకపోయారు. రణరంగం వీడి వేగంగా పరుగులు తీశారు. అలా పారిపోతున్న తన సైన్యాన్ని చూసి మహావీరుడు ఆ సింధుపుత్రుడు జలంధరుడు క్రోధవివశుడయ్యాడు. కంఠస్వరం పెంచి ఉరుములూ పిడుగులు పడుతున్నట్టు శివుణ్ణి యుద్ధానికి పిలిచాడు.

జలంధర ఉవాచ – జలంధరుడు అన్నాడు.

యుద్ధ్యస్వాద్య మయా సార్ధం కిమేభిర్నిహతైస్తవ ।
యచ్చ కించిద్బలం తేఽస్తి తద్దర్శయ జటాధర ॥25॥

ఓయీ జటాధరా! మహాశివా! ఈ చచ్చిన వాళ్ళతో ఏమిటి కానీ, నాతో యుద్ధం చెయ్యి. నీకు ఏ కొంచెమైనా బలమంటూ ఉంటే అది ప్రదర్శించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా బాణసప్తత్యా జఘాన వృషభధ్వజమ్ ।
జలంధరో మహాదైత్యశ్శంభుమక్లిష్టకారిణమ్ ॥26॥

తానప్రాప్తాన్మహాదేవో జలంధరశరాన్ ద్రుతమ్ ।
నిజైర్హి నిశితైర్బాణైశ్చిచ్ఛేద ప్రహసన్నివ ॥27॥

తతో హయాన్ ధ్వజం ఛత్రం ధనుశ్చిచ్ఛేద సప్తభిః ।
జలంధరస్య దైత్యస్య న తచ్చిత్రం హరే మునే ॥28॥

వ్యాసర్షీ! ఈ మాట అంటూనే ఆ మహాదైత్యుడు జలంధరుడు ఒకేసారి డెబ్భైబాణాలను వృషభధ్వజుడైన శంభుడిమీదకు ప్రయోగించాడు. అవి తనను చేరేలోగానే మహాదేవుడు నిశితబాణాలతో వాటిని ఖండించాడు. పెద్దగా నవ్వాడు. వెంటనే ఏడు బాణాలను ప్రయోగించి జలంధర మహాదైత్యుడి గుర్రాలను, ధ్వజాన్నీ, ధనుస్సునూ, ఛత్రాన్నీ కూలగొట్టాడు. మునీశ్వరా! శివుడి విషయంలో ఇది విడ్డూరమేమీ కాదుగదా!

స చ్ఛిన్నధన్వా విరథః పాథోధితనయోఽసురః ।
అభ్యధావచ్ఛివం క్రుద్ధో గదాముద్యమ్య వేగవాన్ ॥29॥

ప్రభుర్గదాం చ తత్క్షిప్తాం సహసైవ మహేశ్వరః ।
పారాశర్య! మహాలీలో ద్రుతం బాణైర్ద్విధాకరోత్ ॥30॥

ధనస్సు విరిగిపోయింది. రథం ఒరిగిపోయింది. అప్పుడు ఆ సముద్రతనయుడు జలంధరుడు అతిక్రుద్ధుడై రథం దూకి గదతో శివుడిమీదకు పరుగు పరుగున వచ్చాడు. అల్లంత దూరంనుంచి వేగంగా విసిరాడు. పారాశర్యా! మహాలీలావిశారదుడైన మహేశ్వరుడు వెంటనే తన బాణాలతో ఆ గదను రెండు ముక్కలు చేశాడు.

తథాపి ముష్టిముద్యమ్య మహాక్రుద్ధో మహాసురః ।
అభ్యుద్యయౌ మహావేగాత్ ద్రుతం తం తజ్జిఘాంసయా ॥31॥

తావదేవేశ్వరేణాశు బాణౌఘైస్స జలంధరః ।
అక్లిష్టకర్మకారేణ క్రోశమాత్రమపాకృతః ॥32॥

అయినా ఆ మహాసురుడు ఆగలేదు. మహాక్రోధంతో పిడికిలి బిగించి శివుణ్ణి గుద్దుదామని మహావేగంగా వచ్చాడు. మహేశ్వరుడు ఏ ఘనకార్యానికైనా సులుసూత్రం తెలిసిన వాడుగదా! అంచేత వేగంగా బాణసమూహం కురిపించి ఆ జలంధరుడు తనని సమీపించేలోగానే ఒక క్రోశం దూరానికి ఎగరగొట్టాడు.

తతో జలంధరో దైత్యో రుద్రం మత్వా బలాధికమ్ ।
ససర్జ మాయాం గాంధర్వీమద్భుతాం రుద్రమోహినీమ్ ॥33॥

తస్య మాయా ప్రభావాత్తు గంధర్వాప్సరసాం గణాః ।
ఆవిర్భూతా అనేకే చ రుద్రమోహనహేతవే ॥34 ॥

తతో జగుశ్చ ననృతుర్గంధర్వాప్సరసాం గణః ।
తాళవేణుమృదంగాంశ్చ వాదయంతిస్మ చాపరే ॥35॥

వ్యాసమునీ! అప్పుడు జలంధరుడికి అర్థమయ్యింది– రుద్రుడు బలాధికుడని. వెంటనే రుద్రుణ్ణి సమ్మోహపరిచే అద్భుతగాంధర్వీమాయను ప్రయోగించాడు. ఆ మాయాప్రభావంతో గంధర్వాంగనలూ, అప్సరసలూ రుద్రుణ్ణి మోహపరచడానికి గుంపులు గుంపులుగా ఆవిర్భవించారు. తాళ–వేణు–మృదంగాది వాద్యాలను ఇంపుగా మోగిస్తూ పాడుతూ నృత్యం చేశారు.

తద్ దృష్ట్వా మహదాశ్చర్యం గణై రుద్రో విమోహితః ।
పతితాన్యపి శస్త్రాణి కరేభ్యో న వివేద సః ॥36॥

ఏకాగ్రీభూతమాలోక్య రుద్రం దైత్యో జలంధరః ।
కామతస్స జగామాశు యత్ర గౌరీ స్థితా భవత్ ॥37॥

మహర్షీ! మిక్కిలి ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే–ఆ గీతవాద్యనృత్యాలకు రుద్రుడు విమోహితుడయ్యాడు. తన చేతులనుంచి ఆయుధాలు జారిపోవడాన్నికూడా గుర్తించలేకపోయాడు. అంతగా స్పృహ కోల్పోయాడు. రుద్రుడు ఇంతగా తన్మయుడవ్వడం గమనించి జలంధరుడు కామవివశుడై పార్వతీమందిరానికి త్వరత్వరగా వెళ్ళాడు.

యుద్ధే శుంభనిశుంభాఖ్యౌ స్థాపయిత్వా మహాబలౌ ।
దశదోర్దండపంచాస్యస్త్రినేత్రశ్చ జటాధరః ॥38॥

మహావృషభమారూఢస్సర్వథా రుద్రసన్నిభః ।
ఆసుర్యా మాయయా వ్యాస! స బభూవ జలంధరః ॥39॥

మహాబలశాలులైన శుంభనిశుంభులకి రణరంగబాధ్యతలు అప్పగించి ఆ దైత్యవల్లభుడు జలంధరుడు తానే జటాధరుడుగా రూపుదాల్చాడు. పదిచేతులతో, అయిదు ముఖాలతో, మూడు నేత్రాలతో సాక్షాత్తూ రుద్రసన్నిభుడై

మహావృషభవాహనంమీద బయలుదేరాడు. వ్యాసమహర్షీ! అది ఆసూరీమాయ. దానితో జలంధరుడు జటాధరుడైపోయాడు.

అథ రుద్రం సమాయాంతమాలోక్య భవవల్లభా ।
అభ్యాయయౌ సఖీమధ్యాత్తద్దర్శనపథేఽ భవత్ ॥40॥

యావద్దదర్శ చార్వంగీం పార్వతీం దనుజేశ్వరః ।
తావత్స వీర్యం ముముచే జడాంగశ్చాభవత్తదా ॥41॥

అలా తనవద్దకు వస్తున్న రుద్రుణ్ణి అల్లంత దూరాన చూసి పార్వతీదేవి తన ఇష్టసఖుల మధ్య నుంచి లేచి ఎదురువచ్చింది. వాడి కంటబడింది. ఆ సౌందర్యలహరిని భవానిని చూడటం తోనే ఆ దనుజేశ్వరుడికి వీర్యస్ఖలనమైపోయింది. నిశ్చేష్టుడయ్యాడు.

అథ జ్ఞాత్వా తదా గౌరీ దానవం భయవిహ్వలా ।
జగామాంతర్హితా వేగాత్సా తదోత్తరమానసమ్ ॥42॥

తామదృశ్య తతో దైత్యః క్షణాద్విద్యుల్లతామివ ।
జవేనాగాత్పునర్యోద్ధుం యత్ర దేవో మహేశ్వరః ॥43॥

పార్వత్యపి మహావిష్ణుం సస్మార మనసా తదా ।
తావద్దదర్శ తం దేవం సోపవిష్టం సమీపగమ్ ॥44॥

తం దృష్ట్వా పార్వతీ విష్ణుం జగన్మాతా శివప్రియా ।
ప్రసన్నమనసోవాచ ప్రణమంతం కృతాంజలిమ్ ॥45 ॥

అప్పుడు తెలుసుకుంది గౌరిదేవి –వాడు దానవుడని. భయంతో వణికిపోయింది. వెంటనే అంతర్ధానం చెంది వేగంగా మానససరోవరం ఉత్తరతీరానికి వెళ్ళిపోయింది. క్షణకాలంలో మెరుపుతీగలాగా మాయమైపోవడంతో పార్వతి కానరాక ఆ దైత్యవల్లభుడు వచ్చినంత వేగంగానూ తిరిగి యుద్ధరంగాన శివుడున్న చోటికి వెళ్ళిపోయాడు. మానసోత్తరతీరానికి చేరిన పార్వతీదేవి – మనస్సులో మహావిష్ణువును స్మరించింది. శ్రీహరి వెంటనే – ప్రత్యక్ష మయ్యాడు. చేరువలో వినయంగా నిలిచాడు. నమస్కరిస్తూ నిలిచాడు. అతణ్ణి చూసి జగన్మాత మనస్సు కలతదేరింది. ప్రసన్నమయ్యింది. ఇలా పలికింది–

పార్వత్యువాచ – పార్వతి పలికింది.

విష్ణో జలంధరో దైత్యః కృతవాన్ పరమాద్భుతమ్ ।
తత్కిం న విదితం తేఽ స్తి చేష్టితం తస్య దుర్మతేః ॥46॥

తచ్ఛ్రుత్వా జగదంబాయా వచనం గరుడధ్వజః ।
ప్రత్యువాచ శివాం నత్వా సాంజలిర్నమ్రకంధరః ॥47॥

విష్ణుమూర్తీ! జలంధరమహాదైత్యుడు ఇప్పుడొక అద్భుతం చేసివెళ్ళాడు . ఆ దుర్మార్గుడు చేసిన ఆ అద్భుతచేష్ట నీకింకా తెలియలేదా? అని జగదంబ అడిగేసరికి గరుడధ్వజుడు మరొకసారి జగన్మాతకు నమస్కరించి వినమ్రంగా మెడవంచి నిలబడి బదులుపలికాడు.

శ్రీభగవానువాచ – శ్రీహరి అన్నాడు.

భవత్యాః కృపయా దేవి తద్వృత్తం విదితం మయా ।
యదాజ్ఞాపయ మాం మాతస్తత్కుర్యాం త్వదనుజ్ఞయా ॥48॥

జగదంబా! పార్వతీదేవీ! నీ దయవల్ల ఆ వృత్తాంతమంతా నాకు తెలిసింది. తల్లీ! ఆజ్ఞాపించు. నీ అనుమతితో అది నిర్వహిస్తాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తచ్ఛ్రుత్వా విష్ణువచనం పునరప్యాహ పార్వతీ ।
హృషీకేశం జగన్మాతా ధర్మనీతిం సుశిక్షయన్ ॥49॥

విష్ణుమూర్తి ఇలా అన్నాక పార్వతీదేవి జగన్మాత ఆ హృషీకేశుడికి ధర్మసూక్ష్మాన్ని నేర్పుతూ ఆజ్ఞాపించింది.

పార్వత్యువాచ – పార్వతి ఆనతిచ్చింది.

తేనైవ దర్శితః పంథా బుధ్యస్వ త్వం తథైవ హి ।
తత్ స్త్రీ పాతివ్రతం ధర్మం భ్రష్టం కురు మదాజ్ఞయా ॥50॥

నాన్యథా స మహాదైత్యో భవేద్వధ్యో రమేశ్వర ।
పాతివ్రత్యసమో నాన్యో ధర్మోఽస్తి పృథివీతలే ॥51॥

శ్రీహరీ! వాడే మనకు దారి చూపించాడు. గ్రహించావు కదా! వాడి ఇల్లాలి పాతివ్రత్యధర్మాన్ని భ్రష్టం చెయ్యి. ఇది నా ఆజ్ఞ! రమేశా! మరోలా ఆ మహాదైత్యుడు వధ్యుడు కాడు. ఈ భూగోళం మీద పాతివ్రత్యానికి సాటివచ్చే ధర్మం మరొకటి లేనేలేదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇత్యనుజ్ఞాం సమాకర్ణ్య శిరసాధాయ తాం హరిః ।
ఛలం కర్తుం జగామాశు పునర్జాలంధరం పురమ్ ॥52॥

వ్యాసమునీ! పార్వతీదేవి ఆనతిని శ్రద్ధగా విని శిరసావహించి ఆ శ్రీహరి వెంటనే మోసం చెయ్యడానికి జాలంధరపురంలోకి పునఃప్రవేశం చేశాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయం పంచమే యుద్ధఖండే జలంధరవధోపాఖ్యానే జలంధరయుద్ధవర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః ॥22॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధర వధోపాఖ్యానంలో జలంధరయుద్ధవర్ణనమనే ఇరవై రెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోవింశోఽధ్యాయః – ఇరవై మూడవ అధ్యాయం

బృందాపాతివ్రత్యభంగదేహత్యాగవర్ణనమ్ – బృందాపాతివ్రత్యభంగమూ దేహత్యాగవర్ణనమూ

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

సనత్కుమార సర్వజ్ఞ వద త్వం వదతాం వర ।
కిమకార్షీద్ధరిస్తత్ర ధర్మం తత్యాజ సా కథమ్ ॥1॥

సర్వజ్ఞా! సనత్కుమారా! ఉత్తమవక్తా! అప్పుడు శ్రీహరి ఏమి చేశాడు? ఆ బృందాదేవి ధర్మాన్ని ఎలా వదిలేసింది?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

విష్ణుర్జాలంధరం గత్వా దైత్యస్య పురభేదనమ్ ।
పాతివ్రత్యస్య భంగాయ బృందాయాశ్చకరోన్మతిమ్ ॥2॥

బృందాం స దర్శయామాస స్వప్నం మాయావినాం వరః ।
స్వయం తన్నగరోద్యానమాస్థితోఽద్భుతవిగ్రహః ॥3॥

వ్యాసమునీ! దైత్యుడి (పురభేదనకై) జాలంధర నగరానికి వెళ్ళి శ్రీహరి బృందాదేవి పాతివ్రత్యాన్ని భంగపరిచే ఆలోచన చేశాడు. అతడు మాయావులకే మాయావి. అద్భుతరూపంతో ఆ నగరోద్యానంలో స్వయంగా విడిది చేశాడు. బృందాదేవికి ఒక స్వప్నం కల్పించాడు.

అథ బృందా తదా దేవీ తత్పత్నీ నిశి సువ్రతా ।
హరేర్మాయాప్రభావాత్తు దుస్స్వప్నం సా దదర్శ హ ॥4॥

స్వప్నమధ్యే హి సా విష్ణుమాయయా ప్రదదర్శ హ ।
భర్తారం మహిషారూఢం తైలాభ్యక్తం దిగంబరమ్ ॥5॥

కృష్ణప్రసూనభూషాఢ్యం క్రవ్యాదగణసేవితమ్ ।
దక్షిణాశాం గతం ముండం తమసా చ వృతం తదా ॥6॥

స్వపురం సాగరే మగ్నం సహసైవాత్మనా సహ ।
ఇత్యాది బహుదుస్స్వప్నాన్నిశాంతే సా దదర్శ హ ॥7॥

జలంధరుడి ధర్మపత్ని పతివ్రత బృందాదేవికి ఆ రాత్రి శ్రీహరి మాయాప్రభావం వల్ల ఒక పీడకల వచ్చింది. ఆ దుఃస్వప్నంలో తన భర్త దిగంబరుడుగా కనిపించాడు. ఒళ్ళంతా నువ్వుల నూనెతో దున్నపోతుమీద కూర్చున్నాడు. నల్లటి పువ్వులు చాలా అలంకరించుకున్నాడు. చుట్టూ నక్కలు (మాంసం తినే జంతువులు) గుమికూడి ఉన్నాయి.

అతడు దక్షిణదిశగా వెడుతున్నాడు. బోడిగుండుతో ఉన్నాడు. అతడి చుట్టూ చీకటి తెరలాగా ఉన్నట్టుండి తమ జాలంధరపురం తనతో సహా సముద్రంలో మునిగిపోయింది. ఇలాంటి అపశకునాలనెన్నింటినో ఆ తెల్లవారుజామున వచ్చిన ఆ దుస్స్వప్నాల్లో చూసింది బృందాదేవి.

తతః ప్రబుధ్య సా బాలా తం స్వప్నం స్వం విచిన్వతీ ।
దదర్శోదితమాదిత్యం సచ్ఛిద్రం నిష్ప్రభం ముహుః ॥8॥

తదనిష్టమిదం జ్ఞాత్వా రుదంతీ భయవిహ్వలా ।
కుత్రచిన్నాప సా శర్మ గోపురాట్టాలభూమిషు ॥9॥

తతస్సఖీద్వయయుతా నగరోద్యానమాగమత్ ।
తత్రాపి సా గతా బాలా న ప్రాప కుత్రచిత్సుఖమ్ ॥10॥

అంతలోకీ మెలకువ వచ్చి లేచింది. ఆ పీడకలనే ఆలోచిస్తూ కళ్ళు తెరిచింది. సూర్యుడు చిల్లు పడ్డట్టు కనిపించాడు. మళ్ళీమళ్ళీ కాంతిహీనుడౌతున్నట్టు కనిపించాడు. ఇది మరొక అనిష్టంగా గ్రహించి ఆమె భయంతో వణికిపోయింది. రోదించింది. తమ రాజభవనం గోపురాలలో కానీ నడవల్లోకానీ ఎక్కడా ఆమెకు సుఖమూ శాంతీ అనిపించలేదు. ఇద్దరు చెలికత్తెల్ని వెంటబెట్టుకుని తమ నగరోద్యానవనంలోకి వెళ్ళింది. అక్కడకూడా ఆ బాలామణికి సుఖం దొరకలేదు.

తతో జలంధరస్త్రీ సా నిర్విణ్ణోద్విగ్నమానసా ।
వనాద్వనాంతరం యాతా నైవ వేదాత్మనా తదా ॥11॥

భ్రమతీ సా తతో బాలా దదర్శాతీవభీషణౌ ।
రాక్షసౌ సింహవదనే దృష్టా దశనభాసురౌ ॥12॥

తౌ దృష్ట్వా విహ్వలాతీవ పలాయనపరా తదా ।
దదర్శ తాపసం శాంతం సశిష్యం మౌనమాస్థితమ్ ॥13॥

అప్పుడా బృందాదేవి దిగులుతో ఉద్విగ్నురాలై ఒక వనం నుంచి మరొక వనంలోకి అప్రయత్నంగా తిరగనారంభించింది. అలా తిరుగుతూ ఒక చోట ఇద్దరు రాక్షసుల్ని చూసింది. వాళ్ళు భీషణంగా ఉన్నారు. సింహముఖాలతో ఉన్నారు. కోరలు తళతళ మెరుస్తున్నాయి. వాళ్ళని చూడటం తోనే మరింత భయపడింది. తోచిన వైపుకి పారిపోయింది. అక్కడ ఒక తాపసి కనిపించాడు. శాంతంగా ఉన్నాడు. శిష్యులున్నారు. మౌనంగా కూర్చుని ఉన్నాడు.

తతస్తత్కంఠమాసాద్య నిజాం బాహులతాం భయాత్ ।
మునే మాం రక్ష శరణమాగతాస్మీత్యభాషత ॥14॥

మునిస్తాం విహ్వలాం దృష్ట్వా రాక్షసానుగతాం తదా ।
హుంకారేణైవ తౌ ఘోరౌ చకార విముఖౌ ద్రుతమ్ ॥15॥

బృందాదేవి పరుగుపరుగున ఆ మునిని సమీపించి తన లతలవంటి బాహువులతో అతడి మెడను కౌగిలించుకుంది. మునీశ్వరా! నిన్ను శరణు వేడుతున్నాను. నన్ను కాపాడు అని ప్రార్థించింది. మునీశ్వరుడు కనులు విప్పి – వణికిపోతున్న బృందనూ, వెంటపడ్డ రాక్షసుల్నీ చూశాడు. హుంకరించాడు. ఆ ఘోరరాక్షసులు వెంటనే వెనుదిరిగారు.

తద్ధుంకారభయత్రస్తౌ దృష్ట్వా తౌ విముఖౌ గతౌ ।
విస్మితాతీవ దైత్యేంద్రపత్నీ సాభూన్మునే హృది ॥16॥

తతస్సా మునినాథం తం భయాన్ముక్తా కృతాంజలిః ।
ప్రణమ్య దండవద్భూమౌ వృందా వచనమబ్రవీత్ ॥17॥

అతడి హుంకారానికి భయపడి రాక్షసులు వెళ్ళిపోవడం గమనించి దైత్యేంద్రుడి ధర్మపత్ని చాలా అబ్బురపడింది మనస్సులో. తన భయమూ తొలగింది. మునినాథుడికి నమస్కరించింది. నేలమీద కర్రలా సాష్టాంగపడింది. ఇలా పలికింది.

బృందోవాచ – బృంద చెప్పింది.

మునినాథ దయాసింధో పరపీడానివారక ।
రక్షితాహం త్వయా ఘోరాద్భయాదస్మాత్ఖలోద్భవాత్ ॥18॥

సమర్థస్సర్వథా త్వం హి సర్వజ్ఞోఽపి కృపానిధే ।
కించిద్విజ్ఞప్తుమిచ్ఛామి కృపయా తన్నిశామయ ॥19॥

జలంధరో హి మద్భర్తా రుద్రం యోద్ధుం గతః ప్రభో ।
స తత్రాస్తే కథం యుద్ధే తన్మే కథయ సువ్రత ॥20॥

ఓ మునీశ్వరా! దయాసాగరా! పరపీడనను నివారించేవాడా! ఈ దుష్టులవల్ల కలిగిన ఘోరభయం నుంచి నన్ను రక్షించావు. నువ్వు సమర్థుడివి. సర్వజ్ఞుడివి. కృపానిధీ! నేనొక చిన్న విన్నపం చేసుకుంటాను. దయచేసి నువ్వు వినాలి. జలంధరుడని నా పెనిమిటి రుద్రుడితో యుద్ధం చెయ్యడానికి వెళ్ళాడు ప్రభూ! అక్కడ ఆ యుద్ధంలో నా భర్త ఎలా ఉన్నాడో దయచేసి తెలియజెప్పు సువ్రతా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

మునిస్తద్వాక్యమాకర్ణ్య మౌనం కపటమాస్థితః ।
కర్తుం స్వార్థం విధానజ్ఞః కృపయోర్ధ్వమవైక్షత ॥21॥

తావత్కపీశావాయాతౌ తం ప్రణమ్యాగ్రతః స్థితౌ ।
తతస్తద్భూలతాసంజ్ఞానియుక్తౌ గగనం గతౌ ॥22॥

నీత్వా క్షణార్ధమాగత్య పునస్తస్యాగ్రతః స్థితౌ ।
తస్యైవ కం కబంధం చ హస్తావాస్తాం మునీశ్వర ॥23॥

శరః కబంధం హస్తౌ తౌ దృష్ట్వాబ్ధితనయస్య సా ।
పపాత మూర్ఛితా భూమౌ భర్తృవ్యసనదుఃఖితా ॥24॥

బృందాదేవి అభ్యర్థనను విని ఆ మునీశ్వరుడు కపటమౌనం వహించాడు. అతడు విధివిధానజ్ఞుడు. స్వార్థాన్ని నెరవేర్చుకునే ఉద్దేశంతో చాలా దయగా మింటివైపు చూశాడు. అంతలోకీ రెండు పెద్దకోతులు అక్కడికి వచ్చాయి. అతడికి నమస్కరించి ఎదుట నిలిచాయి. ఆ మునీశ్వరుడు తన కనుబొమ్మల కదలింతలతో వాటికి ఏదో ఆజ్ఞాపించాడు. అవి రెండు మళ్ళీ ఆకాశంలోకి ఎగిరిపోయాయి. ఒక అరక్షణం గడిపి అవి మళ్ళీ వచ్చి అతడి ఎదుట నిలిచాయి. మునీశ్వరా! ఈ కళేబరమూ ఈ చేతులూ అతడివేనా ? అని వాటిని చూపిస్తూ అడిగాయి. బృందాదేవి వాటిని చూసింది. అవి తన భర్త సముద్రతనయుడు జలంధరుడివే అని. దుఃఖం తాళలేక మూర్ఛిల్లి నేలకు ఒరిగిపోయింది.

బృందోవాచ – బృందాదేవి విలపించింది.

యః పురా సుఖసంవాదైర్వినోదయసి మాం ప్రభో ।
స కథం న వదస్యద్య వల్లభాం మామనాగసమ్ ॥25॥

యేన దేవాస్సగంధర్వా నిర్జితా విష్ణునా సహ ।
కథం స తాపసేనాద్య త్రైలోక్యవిజయీ హతః ॥26॥

నాంగీకృతం హి మే వాక్యం రుద్రతత్త్వమజానతా।
పరం బ్రహ్మ శివశ్చేతి వదంత్యా దైత్యసత్తమ ॥27॥

తతస్త్వం హి మయా జ్ఞాతస్తవ సేవా ప్రభావతః ।
గర్వితేన త్వయా నైవ కుసంగవశగేన హి ॥28॥

వల్లభా! సరససంభాషణలతో నన్ను ఎప్పుడూ వినోదింపజేసేవాడివి, ఇప్పుడు ఎందుకని పలకవు? నేను ఏ అపరాధమూ చెయ్యలేదే, నీ ప్రియురాలినే గదా! విష్ణువుతో సహా సకల దేవతలూ గంధర్వులూ నీ చేతిలో ఓడిపోయారు. ముల్లోకాలనూ హేలగా జయించినవాడివి నువ్వు. ఒక తాపసుడి చేతిలో ఎలా చనిపోయావు? ఆ వేళ నా మాట విన్నావు కాదు. నీకు రుద్రతత్త్వం తెలియలేదు. శివుడంటే పరమ్–బ్రహ్మ అని నేను చెప్పాను. విన్నావా! లేదు. దైత్యసత్తమా! నీ సేవాప్రభావం వల్ల ఆ రుద్రుడి తత్త్వం నా కైతే తెలిసింది గానీ, గర్వం వల్లా దుష్టులతో స్నేహాలవల్లా నీకు మాత్రం తెలియలేదు.

ఇత్థం ప్రభాష్య బహుధా స్వధర్మస్థా చ తత్ప్రియా ।
విలలాప విచిత్రం సా హృదయేన విదూయతా ॥29॥

తతస్సా ధైర్యమాలంబ్య దుఃఖోచ్ఛ్వాసాన్విముంచతీ।
ఉవాచ మునివర్యం తం సుప్రణమ్య కృతాంజలిః ॥30॥

హృదయం పగిలిపోతూంటే ఇలా ఏదేదో చిత్రంగా మాట్లాడుతూ ఆ బృందాదేవి తన పాతివ్రత్య ధర్మానుసారం ఎంతగానో విలపించింది. ఎట్టకేలకు కొంతసేపటికి నిబ్బరించుకుంది. దుఃఖోద్వేగాన్ని దిగమింగుకుంది. ఆ మునివర్యుడికి సాష్టాంగపడి, లేచి, నమస్కరిస్తూ నిలిచి ఇలా పలికింది.

బృందోవాచ – బృంద అభ్యర్థించింది.

కృపానిధే! మునిశ్రేష్ఠ పరోపకరణాదర ।
మయి కృత్వా కృపాం సాధో జీవయైనం మమ ప్రభుమ్ ॥31॥

యత్త్వమస్య పునశ్శక్తో జీవనాయ మతో మమ ।
అతస్సంజీవయైనం మే ప్రాణనాథం మునీశ్వర ॥32॥

ఓ కృపానిధీ! ఓ మునీశ్వరా! పరోపకారపరాయణుడా! సజ్జనుడా! నా మీద దయ చూపించు. నా పెనిమిటిని బతికించు నాకు తెలుసు, ఇతణ్ని పునర్జీవింపజేసే శక్తి నీకుంది. మునీశ్వరా! బతికించు. నా ప్రాణనాథుణ్ని బతికించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా దైత్యపత్నీ సా పాతివ్రత్యపరాయణా ।
పాదయోః పతితా తస్య దుఃఖశ్వాసాన్విముంచతీ ॥33॥

వ్యాసమునీ! పాతివ్రత్యపరాయణయైన ఆ జలంధరపత్ని ఇలా వేడుకుంటూ ఆపుకోలేని దుఃఖంతో నిట్టూరుస్తూ అతడి పాదాలమీద పడింది. అప్పుడు

మునిరువాచ – మునిపలికాడు.

నాయం జీవయితుం శక్యో రుద్రేణ నిహతో యుధి ।
రుద్రేణ నిహతా యుద్ధే న జీవంతి కదాచన ॥34॥

తథాపి కృపయావిష్ట ఏనం సంజీవయామ్యహమ్ ।
రక్ష్యాశ్శరణగాశ్చేతి జానన్ ధర్మం సనాతనమ్ ॥35॥

బృందాదేవీ! రణరంగాన రుద్రుడి చేతిలో చనిపోయిన ఇతణ్ని తిరిగి బతికించడం ఎవడివల్లా కాదు. రుద్రుడి చేతిలో చనిపోయినవారు ఎప్పటికి బతకరు. అయినా నీ పట్ల నాకెందుకో వల్లమాలిన దయ కలుగుతోంది. అదీగాక శరణన్న వారిని రక్షించితీరాలి అనే సనాతనధర్మం ఎరిగినవాణ్ని కనక నీ భర్తని మళ్ళీ బతికేట్టుచేస్తాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా స మునిస్తస్యా జీవయిత్వా పతిం మునే ।
అంతర్దధే తతో విష్ణుస్సర్వమాయావినాం వరః ॥36॥

ద్రుతం స జీవితస్తేనోత్థితస్సాగరనందనః ।
బృందామాలింగ్య తద్వక్త్రం చుచుంబ ప్రీతమానసః ॥37॥

వ్యాసమునీశ్వరా! ఆ కపటముని ఇలా చెప్పి వెంటనే ఆవిడ భర్తను బతికించాడు. అతడు విష్ణువే. మహామాయావులకు మాయావి. వెంటనే అదృశ్యమయ్యాడు. బతికిన ఆ సాగరనందనుడు మెల్లగా లేచాడు. లేస్తూనే బృందాదేవిని కౌగిలించుకుని గాఢంగా చుంబించి సంబరపడ్డాడు.

అథ బృందాపి భర్తారం దృష్ట్వా హర్షితమానసా ।
జహౌ శోకం చ నిఖిలం స్వప్నవద్‌హృద్యమన్యత ॥38॥

అథ ప్రసన్నహృదయా సా హి సంజాత హృచ్ఛయా ।
రేమే తద్వనమధ్యస్థా తద్యుక్తా బహువాసరాన్ ॥39॥

కదాచిత్సురతస్యాంతే దృష్ట్వా విష్ణుం తమేవ హి ।
నిర్భర్త్స్య క్రోధసంయుక్తా వృందా వచనమబ్రవీత్ ॥40॥

బృందాదేవికూడా తన భర్తను చూసి చాలా సంబరపడింది. దుఃఖం తొలగిపోయింది. జరిగినదంతా ఒక స్వప్నంగా భావించింది. ఆవిడహృదయం పూర్తిగా కలతదేరింది. సంతోషం పెల్లుబికింది. అతడితో కలిసి అదే వనంలో చాలా రోజులు ఆనందించింది. ఒకనాడు సంభోగానంతరం అతణ్ని విష్ణువుగా తెలుసుకుంది. అంతే క్రోధంతో మండిపోయింది. అతణ్ని నెట్టివేసింది. ఇలా పలికింది.

బృందోవాచ – బృందాదేవి పలికింది.

ధిక్ తదేవం హరే శీలం పరదారాభిగామినః ।
జ్ఞాతోఽసి త్వం మయా సమ్యఙ్మాయీ ప్రత్యక్షతాపసః ॥41॥

ఛీ ఛీ! శ్రీ హరీ! నీ శీలం ఇదా! పారదారికా ! మహామాయావీ! కపటతాపసా! నీ అసలు రంగు తెలిసిపోయింది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా క్రోధమాపన్నా దర్శయంతీ స్వతేజసమ్ ।
శశాప కేశవం వ్యాస! పాతివ్రత్యరతా చ సా ॥42॥

రే మహాధమ దైత్యారే పరధర్మవిదూషక ।
గృహ్ణీష్వ శఠ మద్దత్తం శాపం సర్వవిషోల్బణమ్ ॥43॥

యౌ త్వయా మాయయా ఖ్యాతౌ స్వకీయౌ దర్శితౌ మమ ।
తావేవ రాక్షసౌ భూత్వా భార్యాం తవ హరిష్యతః ॥44॥

త్వం చాపి భార్యాదుఃఖార్తో వనే కపిసహాయవాన్ ।
భ్రమ సర్పేశ్వరేణాయం యస్తే శిష్యత్వమాగతః ॥45॥

వ్యాసమునీ! ఆ బృందాదేవి క్రోధవివశురాలై తన పాతివ్రత్యమహిమను చూపిస్తూ కేశవుణ్ని శపించింది. ఓరీ అధమాధమా! దైత్యారీ! పరుల ధర్మాలను నాశనం చేసేవాడా! శఠుడా! విషం కన్నా దారుణమైన శాపం ఇదిగో. అనుభవించు! నీ మాయతో ఇద్దర్ని నీ వాళ్ళని రాక్షసులుగా చూపించావు గదా! వాళ్ళు అలాగే నిజమైన రాక్షసులై వచ్చి నీ భార్యను హరింతురుగాక! నువ్వు భార్యాదుఃఖార్తుడివై అడవుల్లో కోతిమూకల సహాయంతో సంచరింతువు గాక! ఇదిగో ఇప్పుడు నీకు శిష్యుడిగా ఉన్న ఈ సర్పరాజు నీతో పాటు అడవుల పాలగుగాక!

ఇత్యుక్త్వా సా తదా బృందా ప్రవిశద్ధవ్యవాహనమ్ ।
విష్ణునా వార్యమాణాపి తత్ స్మితాసక్తచేతసా ॥46॥

తస్మిన్నవసరే దేవా బ్రహ్మాద్యా నిఖిలా మునే ।
ఆగతా ఖే సమం దారైః సద్గతిం వై దిదృక్షవః ॥47॥

అథ దైత్యేంద్రపత్న్యాస్తు తజ్జ్యోతిఃపరమం మహత్ ।
పశ్యతాం సర్వదేవానామలోకమగమద్ద్రుతమ్ ॥48॥

శివాతనౌ విలీనం తద్బృందా తేజో బభూవ హ।
ఆసీజ్జయజయారావః స్వఃస్థితామరపంక్తిషు ॥49॥

ఇలా శపించి ఆ బృందాదేవి అగ్నిప్రవేశం చేసింది. ఆవిడ చిరునవ్వులకి ఆకృష్టుడైన శ్రీమహావిష్ణువు వారిస్తున్నా వినకుండా అగ్నిలో ప్రవేశించింది. ఆ సమయంలో వ్యాసమునీ! బ్రహ్మాది సకలదేవతలూ ఇల్లాండ్రతో కలిసివచ్చి, ఆమె సద్గతులు పొందే తీరు వీక్షించడానికని ఆకాశంలో నిలబడ్డారు. అప్పుడు ఆ దైత్యేంద్రపత్ని తనువు నుంచి పరమపావనమూ, మహిమాన్వితమూ అయిన ప్రాణజ్యోతి వెలువడి సకలదేవతలూ చూస్తూండగా క్షణంలో అలోకానికి – అంటే శివలోకానికి చేరుకుంది. అక్కడ పార్వతీదేవి శరీరంలో విలీనమయ్యింది బృందాతేజస్సు. స్వర్గంలో ఉన్న సకలదేవతలూ జయజయధ్వనులు చేశారు.

ఏవం బృందా మహారాజ్ఞీ కాలనేమిసుతోత్తమా ।
పాతివ్రత్యప్రభావాచ్చ ముక్తిం ప్రాప పరాం మునే ॥50॥

తతో హరిస్తామనుసంస్మరన్ ముహుః బృందా చితాభస్మరజోఽవకుంఠితః ।
తత్రైవ తస్థౌ సురసిద్ధ సంఘుకైః ప్రబోధ్యమానోఽపి యయౌ న శాంతిమ్ ॥51॥

వ్యాసమునీ! కాలనేమి కూతురు దైత్యమహారాజ్ఞి ఉత్తమురాలు. ఆ బృందాదేవి తన పాతివ్రత్యప్రభావంతో ఉత్తమోత్తమమైన ముక్తిని పొందింది. అటుపైని శ్రీహరి మాటిమాటికీ ఆమెనే తలుచుకుంటూ ఆవిడ చితాభస్మాన్ని తనువంతా అవకుంఠనంలాగా పులుముకుని అక్కడే దుఃఖిస్తూ ఉండిపోయాడు. సురసిద్ధసంఘాలవారు ఎంతగా ఓదార్చినా, ఏమి ప్రబోధించినా అతడు మనశ్శాంతిని పొందలేదు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరవధోపాఖ్యానే బృందాపాతివ్రత్యభంగదేహత్యాగవర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥23॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధరవధోపాఖ్యానంలో బృందాపాతివ్రత్యభంగమూ, దేహత్యాగవర్ణనమూ అనే ఇరవై మూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్వింశోఽధ్యాయః – ఇరవై నాల్గవ అధ్యాయం
జలంధరవధవర్ణనమ్ – జలంధరవధవర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

విధేః శ్రేష్ఠసుత! ప్రాజ్ఞ! కథేయం శ్రావితాద్భుతా ।
తతశ్చ కిమభూదాజౌ కథం దైత్యో హతో వద ॥1॥

బ్రహ్మదేవుని ఉత్తమసంతానమా! ప్రాజ్ఞుడా! సనత్కుమారా! అద్భుతమైన కథను వినిపించావు. అటు పైని ఏమి జరిగింది. యుద్ధంలో ఆ దైత్యుడు ఎలా నిహతుడయ్యాడు ? దయచేసి వివరించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అదృశ్యగిరిజాం తత్ర దైత్యేంద్రే రణమాగతే ।
గాంధర్వే చ విలీనే హి చైతన్యోఽభూద్వృషధ్వజః ॥2॥

అంతర్ధానగతాం మాయాం దృష్ట్వా బుద్ధో హి శంకరః ।
చుక్రోధాతీవ సంహారీ లౌకికీం గతిమాశ్రితః ॥3॥

తతశ్శివో విస్మితమానసః పునః జగామ యుద్ధాయ జలంధరం రుషా ।
స చాపి దైత్యః పునరాగతం శివం దృష్ట్వా శరౌఘైస్సమవాకిరద్రణే ॥4॥

అక్కడ గిరిజాదేవి కనిపించకపోవడంతో దైత్యేంద్రుడు తిరిగి రణరంగానికి వచ్చాడు గదా! అతడు రావడంతోనే ఆ గాంధర్వమాయ అతడిలో విలీనం అయిపోయింది. తొలగిపోయింది. వృషధ్వజుడు చైతన్యం పొందాడు. స్పృహలోకి వచ్చిన శంకరుడు వైదొలగిన గాంధర్వమాయను గుర్తించాడు. లౌకికమార్గాన్ని ఆశ్రయించి ఆ సృష్టి సంహారకుడు అతిక్రుద్ధుడయ్యాడు. మనస్సులో విస్మితుడవుతూనే రోషంతో జలంధరుడి మీదికి కాలుదువ్వాడు. ఆ దైత్యనాథుడు కూడా పునరాగతుడైన శివుణ్ని చూసి రణరంగాన శరపరంపరలు గుప్పించాడు.

క్షిప్తం ప్రభుస్తం శరజాలముగ్రం జలంధరేణాతిబలీయసా హరః ।
ద్రుతం ప్రచిచ్ఛేద శరైర్వరైర్ని జైః న చిత్రమత్ర త్రిభువప్రహంతుః ॥5॥

జలంధరుడు బలంతో కురిపించిన ఆ మహోగ్రశరజాలాన్ని చూసి ప్రభువు శంకరుడు వెంటనేవాటిని తన బాణాలతో ముక్కలు ముక్కలు చేశాడు. ముల్లోకాలనూ సంహరించే శివుడి విషయంలో ఇది విచిత్రమేమీకాదు.

తతో జలంధరో దృష్ట్వా రుద్రమద్భుతవిక్రమమ్ ।
చకార మాయయా గౌరీం త్ర్యంబకం మోహయన్నివ ॥6॥

రథోపరిగతాం బద్ధాం రుదంతీం పార్వతీం శివః ।
నిశుంభశుంభదైత్యైశ్చ వధ్యమానాం దదర్శ సః ॥7॥

అద్భుతపరాక్రమం చూపిస్తున్న రుద్రుణ్ణి తిలకించి, జలంధరుడు మరొక కొత్త మాయోపాయం పన్నాడు. శివుణ్ణి సమ్మోహపరుద్దామని మాయాగౌరిని సృష్టించాడు. రథం మీద బంధింపబడి రోదిస్తుంది పార్వతి. శుంభనిశుంభదైత్యులు గౌరిని కొడుతున్నారు. ఇది చూశాడు శంకరుడు. లోకరీతిని ఆశ్రయించాడు. ప్రాకృత మానవుడిలాగా ఉద్విగ్నమానసుడయ్యాడు.

గౌరీం తథావిధాం దృష్ట్వా లౌకికీం దర్శయన్ గతిమ్ ।
బభూవ ప్రాకృత ఇవ శివోఽప్యుద్విగ్నమానసః ॥8॥

అవాఙ్ముఖః స్థితస్తూష్ణీం నానాలీలావిశారదః ।
శిథిలాంగో విషణ్ణాత్మా విస్మృత్య స్వపరాక్రమమ్ ॥9॥

నానాలీలావిశారదుడు గదా! అవాక్కుగా ఉత్తినే నిలబడ్డాడు. శరీరం నీరుగారిపోయింది. మనస్సు విషణ్ణమయ్యింది. తన పరాక్రమం విస్మృతమయ్యింది.

తతో జలంధరో వేగాత్త్రిభిర్వివ్యాధ సాయకైః ।
అపుంఖమగ్నైస్తం రుద్రం శిరస్యురసి చోదరే ॥10॥

తతో రుద్రో మహాలీలో జ్ఞానతత్త్వః క్షణాత్ప్రభుః ।
రౌద్రరూపధరో జాతో జ్వాలామాలాతిభీషణః ॥11॥

తస్యాతీవ మహారౌద్రరూపం దృష్ట్వా మహాసురాః ।
న శేకుః ప్రముఖే స్థాతుం భేజిరే తే దిశో దశ ॥12॥

నిశుంభశుంభావపి యౌ విఖ్యాతౌ వీరసత్తమౌ ।
అపి తౌ శేకతుర్నైవ రణే స్థాతుం మునీశ్వర ॥13॥

అదను కనిపెట్టి జలంధరుడు మూడు నిశితబాణాలను వేగంగా ప్రయోగించాడు. అవి శివుడి శిరస్సున, వక్షః స్థలాన, ఉదరభాగాన పిడిదాకా దిగాయి. జ్ఞానతత్త్వజ్ఞుడూ, మహాలీలావిశారదుడూ రుద్రుడు ఒక్కసారిగా రౌద్రరూపం ధరించాడు. అతడి నుంచి మంటలు ఎగసిపడ్డాయి. అతిభీషణంగా మారిపోయాడు. ఆ మహా రౌద్రరూపాన్ని చూసి మహాసురులే భయపడిపోయారు. ఎదురుగా నిలబడలేక దశదిశలకూ పారిపోయారు. విఖ్యాత వీరసత్తములు నిశుంభశుంభులు సైతం వ్యాసమునీంద్రా! ఆ మహారుద్రుడి ముందు రణరంగాన నిలవలేక పోయారు.

జలంధరకృతా మాయాంతర్హితాభూచ్చ తత్ క్షణమ్ ।
హాహాకారో మహానాసీత్ సంగ్రామే సర్వతోముఖే ॥14॥

తతశ్శాపం దదౌ రుద్రస్తయోశ్శుంభనిశుంభయోః ।
పలాయమానౌ తౌ దృష్ట్వా ధిక్కృత్య క్రోధసంయుతః ॥15॥

జలంధరుడు కల్పించిన మాయ – అంతలో మాటుమాయమయ్యింది. సంగ్రామరంగంలో ఎటుచూసినా హాహాకారాలే వినిపించాయి. పారిపోతున్న శుంభ, నిశుంభుల్ని చూశాడు శంభువు. క్రోధంతో ఛీ కొట్టాడు శపించాడు.

రుద్ర ఉవాచ – రుద్రుడు శపించాడు.

యువాం దుష్టావతిఖలావపరాధకరౌ మమ ।
పార్వతీదండదాతారౌ రణాదస్మాత్పరాఙ్ముఖౌ ॥16॥

పరాఙ్ముఖో న హంతవ్య ఇతి వధ్యౌ న మే యువామ్ ।
మమ యుద్ధాదతిక్రాంతౌ గౌర్యా వధ్యౌ భవిష్యతః ॥17॥

శుంభనిశుంభులారా! మీరిద్దరూ అతిదుష్టులు. ఖలులు. నాకే అపరాధం చేస్తారా? పార్వతీదేవిని దండిస్తారా? రణరంగంనుంచి పారిపోతున్నారు కనక, పారిపోయేవాణ్ని చంపకూడదు గనక మిమ్మల్ని ఇప్పుడు చంపడం లేదు. నా నుంచి తప్పించుకున్నా మిమ్మల్ని ఇద్దరినీ భవిష్యత్తులో గౌరీదేవియే మట్టుబెట్టునుగాక!

ఏవం వదతి గౌరీశే సింధుపుత్రో జలంధరః ।
చుక్రోధాతీవ రుద్రాయ జ్వలజ్జ్వలనసన్నిభః ॥18॥

రుద్రే రణే మహావేగాద్వవర్ష నిశితాన్ శరాన్ ।
బాణాంధకారసంఛన్నం తథా భూమితలం హ్యభూత్ ॥19॥

యావద్రుద్రః ప్రచిచ్ఛేద తస్య బాణగణాన్ ద్రుతమ్ ।
తావత్స పరిఘేణాశు జఘాన వృషభం బలీ ॥20॥

శివుడు ఇలా పలుకుతూంటే సింధుపుత్రుడు జలంధరుడు క్రోధావేశంతో అగ్నిగుండంలాగ భగభగలాడి పోయాడు. రుద్రుడిమీద నిశితబాణవర్షమే కురిపించాడు. భూగోళమంతటా బాణాంధకారం అలముకొంది. అయితేనేమి? రుద్రుడు ఆ బాణాలను అన్నింటినీ ఛేదించాడు. దీనితో జలంధరుడి కోపం ద్విగుణితమై వెంటనే తన పరిఘుతో రుద్రవాహనం వృషభాన్ని బలంగా కొట్టాడు.

వృషస్తేన ప్రహారేణ పరవృత్తో రణాంగణాత్ ।
రుద్రేణ కృష్యమాణోఽపి న తస్థౌ రణభూమిషు ॥21॥

అథ లోకే మహారుద్రః స్వీయం తేజోఽతి దుస్సహమ్ ।
దర్శయామాస సర్వస్మై సత్యమే తన్మునీశ్వర ॥22॥

ఆ దెబ్బలకి మహావృషభం రణరంగంనుంచి పరుగు లంకించుకుంది. రుద్రుడు పట్టి లాగుతున్నా ఆగలేదు. అప్పుడు మునీశ్వరా! నిజం చెబుతున్నాను. మహా రుద్రుడు అతిదుస్సహమైన తన తేజస్సును లోకానికంతటికీ ఎరుకపరిచాడు.

తతః పరమసంక్రుద్ధో రుద్రో రౌద్రవపుర్ధరః ।
ప్రళయానలవద్ఘోరో బభూవ సహసా ప్రభుః ॥23॥

దృష్ట్వా పురః స్థితం దైత్యం మేరుకూటమివ స్థితమ్ ।
అవధ్యత్వమపి శ్రుత్వాప్యన్యైరభ్యుద్యతోఽభవత్ ॥24॥

బ్రహ్మణో వచనం రక్షన్ రక్షకో జగతాం ప్రభుః ।
హృదానుగ్రహమాతన్వన్ తద్వధాయ మనోదధత్ ॥25॥

పరమసంక్రుద్ధుడైన రుద్రుడు రౌద్రశరీరం ధరించి ప్రళయకాలాగ్నిలాగా అతిభయంకరుడయ్యాడు. ఎదుట మేరుశిఖరంలాగా రాక్షసుడు నిలిచాడు. వాడి అవధ్యత్వం గురించి అన్యులు చెప్పగా విన్నాడు. అయినా వాణ్ని వధించడానికే సిద్ధమయ్యాడు. ఆ ప్రభువు జగద్రక్షకుడు కనక వాడి గురించి బ్రహ్మ చెప్పిన మాటలపట్ల హృదయంలో అనుగ్రహం వహిస్తూనే వాణ్ని వధించడానికి నిశ్చయించుకున్నాడు.

కోపం కృత్వా పరం శూలీ పాదాంగుష్ఠేన లీలయా ।
మహోంభసి చకారాశు రథాంగం రౌద్రమద్భుతమ్ ॥26॥

కృత్వార్ణవాంభసి శితం భగవాన్ రథాంగమ్ స్మృత్వా జగత్త్రయమనేన హతం పురారిః ।
దక్షాంధకాంతక పురత్రయయజ్ఞహంతా లోకత్రయాంతకకరః ప్రహసన్నువాచ ॥27॥

ఆ త్రిశూలధారి అలా కోపించి తన కాలిబొటనవేలితో అవలీలగా మహోదధిజలాలతో ఒక రథచక్రాన్ని అతిరౌద్రమూ, అత్యద్భుతమూ అయినదాన్ని నిర్మించాడు. అది చాలా పదునుదేరిన చక్రం. దాన్ని నిర్మించి ఆ పురారి, జలంధరుడు చేసిన జగత్త్రయపీడను ఒక్కసారి స్మరించాడు. అప్పుడు ఆ దక్షవినాశకుడు, అంధకాసుర సంహారకరుడు, పురత్రయ విధ్వంసి, దక్షయజ్ఞ భంగకారి, లోకత్రయ సంహారకుడు – బిగ్గరగా నవ్వుతూ దైత్యపతితో ఇలా అన్నాడు.

మహారుద్ర ఉవాచ – మహరుద్రుడన్నాడు.

పాదేన నిర్మితం చక్రం జలంధర మహోంభసి ।
బలవాన్యది చోద్ధర్తుం తిష్ఠ యోద్ధుం న చాన్యథా ॥28॥

ఓరీ జలంధరా! ఈ మహాజలంలో నేను కాలితో నిర్మించిన ఈ చక్రాన్ని పైకెత్తగలిగిన బలశాలివైతే నాతో యుద్ధానికి నిలబడు లేదంటే – తిరిగి పో!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తస్య తద్వచనం శ్రుత్వా క్రోధేనాదీప్తలోచనః ।
ప్రదహన్నివ చక్షుర్భ్యాం ప్రాహాలోక్య స శంకరమ్ ॥29॥

శివుడు నోటి నుంచి ఈ మాట వినడంతోనే జలంధరుడి కన్నులు క్రోధంతో నిప్పులు కురిశాయి. చూపులతో శివుణ్ని దహించివేస్తున్నట్టు చూసి ఇలా పలికాడు.

జలంధర ఉవాచ - జలంధరుడు అన్నాడు.

రేఖాముద్ధృత్య హత్వా చ సగణం త్వాం హి శంకర ।
హత్వా లోకాన్ సురైస్సార్ధం స్వభాగం గరుడో యథా ॥30॥

హంతుం చరాచరం సర్వం సమర్థోఽహం సవాసవమ్ ।
కో మహేశ్వర మద్బాణైరభేద్యో భువనత్రయే ॥31॥

బాలభావేన భగవాన్ తపసైవ వినిర్జితః ।
బ్రహ్మా బలిష్ఠః స్థానే మే మునిభిస్సురపుంగవైః ॥32॥

దగ్ధం క్షణేన సకలం త్రైలోక్యం సచరాచరమ్ ।
తపసా కిం త్వయా రుద్ర నిర్జితో భగవానపి ॥33॥

శంకరా! ఈ చక్రరేఖను ఎత్తుతాను. నీ గణాలతో సహా నిన్ను మట్టుబెడతాను. దేవతలతో సహా లోకాలను నాశనం చేస్తాను. గరుత్మంతుడిలాగా నా భాగం నేను పొందుతాను. మహేశ్వరా! ఇంద్రుడితో సహా సకలచరాచరజగత్తునీ సంహరించగల సమర్థుణ్ని నేను. ముల్లోకాలలోనూ నా బాణాలకు అభేద్యుడెవడింక? నేను పసివాడిగా ఉన్నప్పుడే బలిష్ఠుడైన బ్రహ్మదేవుణ్ని నా తేజస్సుతో జయించాను. ఇప్పుడతడు మునులతో సురవరులతో నా ఇంటిలో నా అధీనంలోనే ఉన్నాడు. స్థావరజంగమాలతో సహా ముల్లోకాలనూ క్షణంలో దహించాను. రుద్రా! నువ్వెంత! నీ తపస్సెంత! బ్రహ్మనే జయించినవాణ్ని!

ఇంద్రాగ్నియమవిత్తేశవాయువారీశ్వరాదయః ।
న సేహిరే యథా నాగా గంధం పక్షిపతేరివ ॥34॥

న లబ్ధం దివి భూమౌ చ వాహనం మమ శంకర ।
సమస్తాన్ పర్వతాన్ ప్రాప్య ధర్షితాశ్చ గణేశ్వరాః ॥35॥

గిరీంద్రో మందరః శ్రీమాన్నీలో మేరుస్సుశోభనః ।
దర్షితో బాహుదండేన కండ్వా ఉపసర్పణాయ మే ॥36॥

పాములు గరుత్మంతునికి ఎదురుపడి నిలువలేనట్లు ఇంద్రుడు-అగ్ని- యముడు- కుబేరుడు-వాయువు-వరుణుడు - మొదలైనవారిలో ఏ ఒక్కడు నన్నెదిరించలేకపోయాడు. శంకరా! దివిలో కానీ భువిలో కానీ నాకు తగిన వాహనం లభించలేదు. ఐనా నేను సమస్తపర్వతాలనూ అధిరోహించాను, సకల గణేశ్వరులనూ జయించాను. అంతే కాదు నా బాహుదండాల దురద తీర్చుకోడానికి గిరీంద్రమైన మందరాన్నీ శ్రీమంతమైన నీలగిరినీ శోభాసంపన్నమైన మేరుశిఖరినీ ఢీకొన్నాను.

గంగా నిరుద్ధా బాహుభ్యాం లీలార్థం హిమవద్గిరౌ ।
అరీణాం మమ భృత్యైశ్చ జయో లబ్ధో దివౌకసాత్ ॥37॥

బడబాయా ముఖం బద్ధం గృహీత్వా తాం కరేణ తు ।
తత్క్షణాదేవ సకలమేకార్ణవమభూత్తదా ॥38॥

రుద్రా! ఒకప్పుడు కేవలం వినోదం కోసం హిమాలయాల్లో గంగాప్రవాహాన్ని నా బాహువులతో అడ్డగించాను. నా భృత్యులే నా శత్రువుల్ని జయించారు. నేను ఇంద్రుణ్ని జయించాను. సముద్రగర్భంలో వుండే మహాగ్ని– బడబను ఒంటిచేతితో పట్టుకుని దాని నోరు నొక్కేశాను. (ఆడగుర్రం– బడబ– రూపంలో ఉంటుందట సముద్రాగ్ని). ఆ క్షణంలో భూగోళమంతా ఏకార్ణవమైపోయింది.

ఐరావతాదయో నాగాః క్షిప్తాః సింధుజలోపరి ।
సరథో భగవానింద్రః క్షిప్తశ్చ శతయోజనమ్ ॥39॥

గరుడోఽపి మయా బద్ధో నాగపాశేన విష్ణునా ।
ఊర్వశ్యాద్యా మయానీతా నార్యః కారాగృహాంతరమ్ ॥40॥

మాం న జానాసి రుద్ర త్వం త్రైలోక్యజయకారిణమ్ ।
జలంధరం మహాదైత్యం సింధుపుత్రం మహాబలమ్ ॥41॥

ఐరావతాదులైన అష్టదిగ్గజాలను సముద్రజలాలలోకి విసిరేశాను. ఇంద్రుణ్ని సహా గరుత్మంతుణ్ని నాగపాశంతో బంధించాను. ఊర్వశి – రంభ – మేనకదులైన అప్సరసల్ని లాక్కువచ్చి నా కారాగారంలో బంధించాను. రుద్రా! నన్నెరగవు నువ్వు. నేను త్రిలోకవిజేతను. జలంధరుణ్ని, మహా దైత్యుణ్ని. సింధుపుత్రుణ్ని. మహాబలశాలిని.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వాథ మహాదేవం తదా వారిధినందనః ।
న చచాల న సస్మార నిహతాన్ దానవాన్ యుధి ॥42॥

దుర్మదేనావినీతేన దోర్భ్యామాస్ఫోట్య దోర్బలాత్ ।
తిరస్కృతో మహాదేవో వచనైః కటుకాక్షరైః ॥43॥

వ్యాసమహర్షీ! మహాదేవుడితో ఇలా పలికి ఆ వారిధినందనుడు జంకూ గొంకూ లేకుండా నిలబడ్డాడు. అప్పటిదాకా మహాదేవుడి చేతిలో ఎందరెందరు దైత్యవీరులు నిహతులయ్యారో – అందరినీ మరిచిపోయాడు. అంతటి దుర్మదం తలకెక్కింది. అసలే వినయవిహీనుడు. జబ్బలు చరుచుకుంటూ ఇలా కటువైన మాటలతో మహాదేవుణ్ని తూలనాడాడు.

తచ్ఛ్రుత్వా దైత్యవచనమమంగళమతీరితమ్ ।
విజహాస మహాదేవః పరమం క్రోధమాదధే ॥44॥

సుదర్శనాఖ్యం యచ్చక్రం పదాంగుష్ఠవినిర్మితమ్ ।
జగ్రాహ తత్కరే రుద్రస్తేన హంతుం సముద్యతః ॥45॥

సుదర్శనాఖ్యం తచ్చక్రం చిక్షేప భగవాన్ హరః ।
కోటిసూర్యప్రతీకాశం ప్రళయానలసన్నిభమ్ ॥46॥

దైత్యుడి అతివాగుడు – అమంగళవచనాలు విని మహాదేవుడు బిగ్గరగా నవ్వాడు. పరమక్రోధావిష్టుడయ్యాడు. తాను పాదాంగుష్ఠంతో వినిర్మించిన ఆ సుదర్శనచక్రాన్ని చేతిలోకి తీసుకున్నాడు. దైత్యనాథుణ్ని సంహరించడానికి పూర్తిగా ఉద్యుక్తుడయ్యాడు. రుద్రభగవానుని చేతిలో ఆ సుదర్శనచక్రం కోటిసూర్యగోళాల కాంతితో ప్రళయకాలాగ్ని లాగా ప్రకాశిస్తోంది. ఒక్కసారిగా దాన్ని ఆ జలంధరుడి మీదికి ప్రయోగించాడు.

ప్రదహద్రోదసీ వేగాత్తదాసాద్య జలంధరమ్ ।
జహార తచ్ఛిరో వేగాన్మహదాయతలోచనమ్ ॥47॥

రథాత్కాయః పపాతోర్వ్యాం నాదయన్వసుధాతలమ్ ।
శిరశ్చాప్యబ్ధిపుత్రస్య హాహాకారో మహానభూత్ ॥48॥

ద్విధా పపాత తద్దేహో హ్యంజనాద్రిరివాచలః ।
కులిశేన యథా వారాంనిధౌ గిరివరో ద్విధా ॥49॥

రోదసిని జ్వాలమాలలతో నింపుతూ అతివేగంగా వచ్చి ఆ సుదర్శనచక్రం జలంధరుడి శిరస్సును నరికివేసింది. చేరడేసి కన్నులున్న మహాశిరస్సును ఖండించివేసింది. వాడి మొండెం రథంనుంచి నేలకు రాలిపడింది. భూగోళం దద్దరిల్లింది. శిరస్సు వెళ్ళి అల్లంత దూరాన పడింది. దైత్యుల హాహాకారాలు మిన్నుముట్టాయి. వజ్రాయుధం దెబ్బకు అంజనాచలం రెండు ముక్కలై సముద్రంలో పడినట్టు ఆ సముద్రపుత్రుడి దేహం రెండు ఖండాలుగా నేలపాలయ్యింది.

తస్య రౌద్రేణ రక్తేన సంపూర్ణమభవజ్జగత్ ।
తతస్సమస్తా పృథివీ వికృతాభూన్మునీశ్వర ॥50॥

తద్రక్తమఖిలం రుద్ర నియోగాన్మాంసమేవ చ ।
మహారౌరవమాసాద్య రక్తకుండమభూదిహ ॥51॥

తత్తేజో నిర్గతం దేహాత్ రుద్రే చ లయమాగమత్ ।
బృందాదేహోద్భవం యద్వద్గౌర్యాం హి విలయం గతమ్ ॥52॥

వ్యాసమునీశ్వరా! అతడి శరీరం నుంచి ప్రవహించిన భీషణరక్తంతో జగత్తు నిండి పోయింది. భూగోళమంతా వికృతంగా తయారయ్యింది. అప్పుడు రుద్రుడి ఆజ్ఞమేరకు ఆ మాంసమూ రక్తమూ మహారౌరవనరకానికి చేరి అక్కడ రక్తకుండం ఏర్పడింది. అయితే, అతడి దేహం నుంచి ఒక తేజస్సు వెలువడింది. బృందాదేవి తేజస్సు గౌరీదేవిలో విలీనమయినట్టు ఇతడి ప్రాణకాంతి వచ్చి రుద్రుడిలో లయమయ్యింది.

జలంధరం హతం దృష్ట్వా దేవగంధర్వపన్నగాః ।
అభవన్ప్రసన్నాశ్చ సాధు దేవేతి చాబ్రువన్ ॥53॥

సర్వే ప్రసన్నతాం యాతా దేవసిద్ధమునీశ్వరాః ।
పుష్పవృష్టిం ప్రకుర్వాణా స్తద్యశో జగురుచ్చకైః ॥54॥

దేవాంగనా మహామోదాన్ననృతుః ప్రేమవిహ్వలాః ।
కలస్వరాః కలపదం కిన్నరైస్సహ సంజగుః ॥55॥

జలంధరుడి ముగింపును చూసి దేవతలు గంధర్వులు పన్నగులు అందరూ కలతదేరారు. సాధు! సాధు! మహాదేవా! అని శివుణ్ని అభినందించారు. సిద్ధులూ మునీశ్వరులూ అలాగే ప్రసన్నులై శంకరుడి యశస్సుల్నీ ఎలుగెత్తి కీర్తిస్తూ పుష్పవృష్టిని కురిపించారు. దేవాంగనలు పట్టలేని ఆనందంతో ప్రేమతో నృత్యం చేశారు. కిన్నరులైతే కలస్వరాలతో కలగీతపదాలను బిగ్గరగా గానం చేశారు.

దిశః ప్రసేదుస్సర్వాశ్చ హతే బృందాపతౌ మునే ।
వవుః పుణ్యాస్సుఖస్పర్శా వాయవస్త్రివిధా అపి ॥56॥

చంద్రమాః శీతతాం యాతో రవిస్తేపే సుతేజసా ।
అగ్నయో జజ్వలుశ్శాంతా బభూవ వికృతం నభః ॥57॥

ఏవం త్రైలోక్యమఖిలం స్వాస్థ్యమాపాధికం మునే ।
హతే ఽబ్ధితనయే తస్మిన్ హరేణానంతమూర్తినా ॥58॥

వ్యాసమునీ! బృందావల్లభుడు జలంధరుడలా నిహతుడు కాగానే దిక్కులన్నీ తేటపడ్డాయి. తనువులకు హాయిగా పావనాలై త్రివిధవాయువులూ వీచాయి. చందమామ చల్లబడ్డాడు. సూర్యుడు మునుపటి తేజంతో ప్రకాశించాడు. అగ్నులు శాంతంగా ప్రజ్వలించాయి. ఆకాశంలో మార్పు వచ్చింది. మునీశ్వరా! అనంతమూర్తియైన హరుడిచేతిలో అబ్ధితనయుడు జలంధరుడు ముగియడంతో ఒక్కమాటలో చెప్పాలంటే ముల్లోకాలకూ ఎంతైనా స్వస్థత చేకూరింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరవధవర్ణనం నామ చతుర్వింశోఽధ్యాయః ॥24॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధరవధ వర్ణనం అనే ఇరవై నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచవింశోఽధ్యాయః – ఇరవై అయిదవ అధ్యాయం
దేవస్తుతివర్ణనమ్ – దేవస్తుతివర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అథ బ్రహ్మాదయో దేవా మునయశ్చాఖిలాస్తథా ।
తుష్టువుర్దేవదేవేశం వాగ్భిరిష్టాభిరానతాః ॥1॥

వ్యాసమునీశ్వరా! అటుపైని బ్రహ్మాదిసకలదేవతలూ సకలమునులు దేవదేవుణ్ని వంగి వంగి నమస్కరిస్తూ ఇష్టవాక్కులతో స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు స్తుతించారు.

దేవదేవ మహాదేవ శరణాగతవత్సల ।
సాధుసౌఖ్యప్రదస్త్వం హి సర్వదా భక్తదుఃఖహా ॥2॥

త్వం మహాద్భుతసల్లీలో భక్తిగమ్యో దురాసదః ।
దురారాధ్యఃసతాం నాథ ప్రసన్నస్సర్వదా భవ ॥3॥

వేదోఽపి మహిమానం తే న జానాతి హి తత్త్వతః ।
యథామతి మహాత్మానస్సర్వే గాయంతి సద్యశః ॥4॥

మాహాత్మ్యమతిగూఢం తే సహస్రవదనాదయః ।
సదా గాయంతి సుప్రీత్యా పునంతి స్వగిరం హి తే ॥5॥

దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సలా! సాధు సజ్జనులకు సౌఖ్యాలను కలిగించేవాడివి నువ్వే. ఎల్లవేళలా భక్తుల దుఃఖాలను తొలగించేవాడివి నువ్వే. నీ లీలలు అత్యద్భుతాలు. నువ్వు కేవలం భక్తి గమ్యుడివి. అన్యథా–దుర్లభుడివి. నిన్ను ఆరాధించడం కూడా అంత తేలిక కాదు. సజ్జనులకు దిక్కయినవాడా! ఎల్లవేళలా మాకు ప్రసన్నుడిగా ఉండు! నీ మహిమను నిజానికి వేదాలు కూడా సరిగా ఎరగవు. అయితే, మహాత్ములందరూ వారి వారి బుద్ధివిశేషాన్నిబట్టి నీ యశస్సును గానం చేస్తూ ఉంటారు. నీ మాహాత్మ్యం అత్యంతనిగూఢం. ఆదిశేషుడు మొదలుగాకొని అందరూ భక్తితో నిన్ను కీర్తిస్తూ తమ తమ వాక్కులను పావనం చేసుకుంటున్నారు.అంతే కదూ!

కృపయా తవ దేవేశ బ్రహ్మజ్ఞానీ భవేజ్జడః ।
భక్తిగమ్యస్సదా త్వం వా ఇతి వేదా బ్రువంతి హి ॥6॥

త్వం వై దీనదయాళుశ్చ సర్వత్ర వ్యాపకస్సదా ।
ఆవిర్భవసి సద్భక్త్యా నిర్వికారస్సతాంగతిః ॥7॥

దేవేశా! నీ కృప ఉంటే చాలు జడుడు సైతం బ్రహ్మజ్ఞాని అవుతాడు. నువ్వు ఎల్లప్పుడూ భక్తి గమ్యుడివే అని వేదాలు చెబుతున్నాయి. నువ్వు దీనదయాళుడివి. సర్వత్ర వ్యాపించి ఉన్నవాడివి. ఉత్తమభక్తి ఉన్నచోట నువ్వుంటావు. నిర్వికారుడివి. సత్పురుషులకు నువ్వే దిక్కు.

భక్త్యైవ తే మహేశాన బహవస్సిద్ధిమాగతాః ।
ఇహ సర్వసుఖం భుక్త్వా దుఃఖితా నిర్వికారతః ॥8॥

పురా యదుపతిర్భక్త్యో దాశార్హ స్సిద్ధిమాగతః ।
కళావతీ చ తత్పత్నీ భక్త్యైవ పరమాం ప్రభో ॥9॥

తథా మిత్రసహో రాజా మదయంతీ చ తత్ప్రియా ।
భక్త్యైవ తవ దేవేశ కైవల్యం పరమం యయౌ ॥10॥

సౌమినీ నామ తనయా కైకేయాగ్రభువస్తథా ।
తవ భక్త్యా సుఖం ప్రాప పరం సద్యోగిదుర్లభమ్ ॥11॥

మహేశ్వరా! నీపట్ల భక్తితోనే చాలా మంది సిద్ధిపొందారు. ఇహంలో సకల సుఖాలూ అనుభవించారు. దుఃఖాలు వస్తే నిబ్బరంగా నిలిచారు. అటుపైని పరంలో సిద్ధిపొందారు. పూర్వకాలంలో దాశార్హుడైన యదువల్ల భుడు నీ భక్తుడై సిద్ధిపొందాడు. అతడి ధర్మపత్ని కళావతికూడా నీ భక్తితోనే పరమపదం చేరుకుంది. అలాగే మిత్రసహుడనే రాజూ అతడి భార్య మదయంతి కేవలం నీపట్ల భక్తితోనే కైవల్యం పొందారు. కేకయరాజుగారి పెద్దకొడుకు కూతురు సౌమిని శివభక్తి వల్లనే మహాయోగులకు సైతం దుర్లభమైన దివ్యానందానుభూతిని పొందగలిగింది.

విమర్షణో నృపవరస్సప్తజన్మావధి ప్రభో ।
భుక్త్వా భోగాంశ్చ వివిధాంస్తద్భక్త్యా ప్రాప సద్గతిమ్ ॥12॥

చంద్రసేనో నృపవరస్తద్భక్త్యా సర్వభోగభుక్ ।
దుఃఖముక్తస్సుఖం ప్రాప పరమత్ర పరత్ర చ ॥13॥

గోపీపుత్రః శ్రీకరస్తే భక్త్యా భుక్త్వేహ సద్గతిమ్ ।
పరం సుఖం మహావీరశిష్యః ప్రాప పరత్ర వై ॥14॥

మహాప్రభూ! విమర్షణుడు అనే రాజోత్తముడు ఏడు జన్మలు మహారాజభోగాలను అనుభవించి, అటుపైని సద్గతిని పొందినది నీ పట్ల భక్తి కారణంగానే. అలాగే చంద్రసేనమహారాజు నీభక్తి మూలంగానే ఇహంలో సర్వభోగాలనూ అనుభవించి దుఃఖముక్తుడై పరంలో సకలసుఖాలనూ పొందాడు. మహావీరుడి శిష్యుడైన గోపీపుత్రుడు శ్రీకరుడు నీపట్ల భక్తితో ఇహపరాలలో సుఖసంతోషాలను పొందగలిగాడు.

త్వం సత్యరథభూజానేర్దుఃఖహర్తా గతిప్రదః ।
ధర్మగుప్తం రాజపుత్రమకార్షీస్సుఖినం త్వీహ॥15॥

తథా శుచివ్రతం విప్రమదరిద్రం మహాప్రభో ।
త్వద్భక్తివర్తినం మాత్రా జ్ఞానినం కృపయాకరోః ॥16॥

చిత్రవర్మా నృపవరస్త్వద్భక్త్యా ప్రాప సద్గతిమ్ ।
ఇహ లోకే సదా భుక్త్వా భోగానమరదుర్లభాన్ ॥17॥

చంద్రాంగదో రాజపుత్ర స్సీమంతిన్యా స్త్రియా సహ।
విహాయ సకలం దుఃఖం సుఖీ ప్రాప మహాగతిమ్ ॥18॥

సత్యరథుడు అనే రాజుగారికి దుఃఖాలను తొలగించి సద్గతులు కల్పించినవాడివి నువ్వే. ధర్మగుప్తుడనే రాకుమారుడికి ఇహలోకంలో సకలసుఖాలూ అందించినవాడివీ నువ్వే. మహాప్రభూ! శుచివ్రతుడనే ఒక దరిద్ర బ్రాహ్మణుడు నీ భక్తివల్ల తల్లితో సహా మహాజ్ఞాని అయ్యాడు. భక్తులపట్ల నీ కృప అటువంటిది. చిత్రవర్మ అనే మరొక మహారాజు నీ భక్తుడు కాబట్టే అమరులకు సైతం అందని మహాభోగాలు ఇహంలో పొంది అటుపైని సద్గతిని అందుకున్నాడు. చంద్రాంగదుడనే రాకుమారుడు తన ధర్మపత్నితో సహా సకలదుఃఖాల నుండీ విముక్తుడై సుఖంగా మహాగతిని పొందాడు.

ద్విజోమందరనామాపి వేశ్యాగామీ ఖలోఽధమః ।
త్వద్భక్తశ్శివ సంపూజ్య తయా సహ గతిం గతః ॥19॥

భద్రాయుస్తే నృపసుతస్సుఖమాప గతవ్యథః ।
త్వద్భక్తకృపయా మాత్రా గతిం చ పరమాం ప్రభో ॥20॥

సర్వస్త్రీభోగనిరతో దుర్జనస్తవ సేవయా ।

మందరుడనే బ్రాహ్మణుడు వేశ్యాలోలుడు, ఖలుడు, అధముడు అయినా నీ భక్తుడు. నిన్ను పూజించి వేశ్యతో సహా సద్గతిని పొందాడు. భద్రాయువనే రాకుమారుడు వ్యధలు తొలగి నీ దయవల్ల తల్లితో సహా ఉత్తమగతులు అందుకున్నాడు. సమస్త స్త్రీభోగ తత్పరుడు, దుర్జనుడు, తినకూడనివి తినేవాడు అయినా మహేశ్వరా! నీ భక్తుడు కనక ముక్తిని పొందాడు.

విముక్తో ఽభూదపి సదాఽభక్ష్యభోజీ మహేశ్వర ॥21॥

శంబరశ్శంకరే భక్తశ్చితాభస్మధరస్సదా ।
నియమాద్భస్మనశ్శంభో స్స్వస్తియా తే పురంగతః ॥22॥

భద్రసేనస్య తనయస్తథా మంత్రిసుతః ప్రభో ।
సుధర్మశుభకర్మాణౌ సదా రుద్రాక్షధారిణౌ ॥23॥

త్వత్స్నపాతశ్చ తౌ ముక్తావాస్తాం భుక్త్వేహ సత్సుఖమ్ ।
పూర్వజన్మని యౌ కీశకుక్కుటౌ రుద్రభూషణౌ ॥24॥

శంబరుడు నీ భక్తుడు. నిత్యమూ విభూతిధారణతో నిన్ను కొల్చి భార్యాసమేతంగా నీ కైలాసం చేరుకున్నాడు. భద్రసేనమహారాజు కొడుకొకడు, అతడి మంత్రి పుత్రుడొకడు ఇద్దరు ధర్మ శుభకర్మలు ఆచరించి రుద్రాక్షధారులై నీ కృపవల్ల ఇక్కడ సుఖాలనుభవించి తదుపరి ముక్తులయ్యారు. వీళ్ళు పూర్వజన్మలో రుద్రాక్షధారులైన కీశు కుక్కుటాలు (కోతి–కోడి).

పింగళా చ మహానందా వేశ్యే ద్వే తవ భక్తితః ।
సద్గతిం ప్రాపతుర్నాథ భక్తోద్ధారపరాయణ ॥25॥

శారదా విప్రతనయా బాలవైధవ్యమాగతా ।
తవ భక్తేః ప్రభావాత్తు పుత్రసౌభాగ్యవత్యభూత్ ॥26॥

బిందుగో ద్విజమాత్రో హి వేశ్యాభోగీ చ తత్ప్రియా ।
ముచుకా త్వద్యశః శ్రుత్వా పరమాం గతిమాయయౌ ॥27॥

ఇత్యాది బహవస్సిద్ధిం గతా జీవాస్తవ ప్రభో ।
భక్తిభావాన్మహేశాన దీనబంధో కృపాలయ ॥28॥

నాథా! భక్త జనోద్ధారణశీలా! పింగళ – మహానంద అనే ఇద్దరు వేశ్యలు నీ భక్తితో సద్గతులు పొందారు. శారద అని ఒక బ్రాహ్మణపుత్రిక బాలవైధవ్యంతో కుమిలిపోతూ నీ భక్తురాలై ఆ ప్రభావంతో పుత్రసౌభాగ్యవతి అయ్యింది. బిందుగుడు అనే మరొక వ్యక్తి, జన్మతః బ్రాహ్మణుడే కానీ కర్మతః భ్రష్టుడై ద్విజుమాత్రుడు అనిపించుకున్న వేశ్యాలోలుడు. అతడి ప్రియురాలు చంచుళ. ఇద్దరూ నీ యశస్సులు ఆలకించీ ఆలపించీ సద్గతులు పొందారు. ఓ మహేశా! ఓ దీనబంధూ! ఓ కృపాలయా! మహాప్రభూ! ఇలా ఎందరెందరో జీవులు కేవలం నీపట్ల భక్తిభావంతో ముక్తిపొందారు.

త్వం పరః ప్రకృతేః బ్రహ్మ పురుషాత్పరమేశ్వర ।
నిర్గుణస్త్రిగుణాధారో బ్రాహ్మవిష్ణుహరాత్మకః ॥29॥

నానాకర్మకరో నిత్యం నిర్వికారోఽఖిలేశ్వరః ।
వయం బ్రహ్మాదయస్సర్వే తవ దాసా మహేశ్వర ॥30॥

ప్రసన్నో భవ దేవేశ రక్షాస్మాన్సర్వదా శివ ।
త్వత్ప్రజాశ్చ వయం నాథ సదా త్వచ్ఛరణం గతాః ॥31॥

ఓ పరమేశ్వరా! నువ్వు ప్రకృతికంటే పురుషుడికంటే ఆవలివాడివి. పరాత్పరుడివి. పరబ్రహ్మవు. నిర్గుణుడివి. సత్త్వరజస్తమోగుణాలకు ఆధారభూతుడివి. బ్రహ్మ–విష్ణు–శివస్వరూపుడివి. సకల కర్మలకూ కర్తవు అయినా ఎప్పుడూ నిర్వికారుడివే. నిఖిలేశ్వరుడివే. మహేశ్వర! బ్రహ్మాదులం మేమంతా నీ దాసులం. దేవతావల్లభా! మాకు ప్రసన్నుడివై మమ్మల్ని సర్వదా సర్వథా రక్షించు మేమంతా నీ బిడ్డలం! నీకు శరణాగతులం!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి స్తుత్వా చ తే దేవా బ్రహ్మాద్యాస్సమునీశ్వరాః ।
తూష్ణీం బభూవుర్హి తదా శివాంఘ్రిద్వంద్వచేతసః ॥32॥

అథ శంభుర్మహేశానః శ్రుత్వా దేవస్తుతిం శుభామ్ ।
దత్త్వా వరాన్వరాన్సద్యస్తత్రైవాంతర్దధే ప్రభుః ॥33॥

దేవాస్సర్వేఽపి ముదితా బ్రహ్మాద్యా హతశత్రవః ।
స్వం స్వం ధామ యయుః ప్రీతా గాయంతః శివసద్యశః ॥34॥

వ్యాసమునీ! ఈ విధంగా బ్రహ్మాదిదేవతలూ సకలమునీశ్వరులూ శివుణ్ణి స్తుతించి అతడి పాదద్వయిని గుండెల్లో నిలుపుకుని ధ్యానిస్తూ నిలబడ్డారు. అప్పుడు శుభప్రదమైన ఈ దేవతాస్తుతిని ఆలకించిన మహేశానుడు ఉత్తమోత్తమవరాలను వారందరికీ బహూకరించి అంతర్ధానం చెందాడు. శివుడిలా శత్రుపీడ తొలగించి వరాలు కురిపించినందుకు బ్రహ్మాదిదేవతలందరూ ఎంతగానో సంబరపడి సంతుష్టిచెంది శివుడి యశస్సును కీర్తించుకుంటూ తమ తమ నిలయాలకు చేరుకున్నారు.

ఇదం పరమమాఖ్యానం జలంధరవిమర్దనమ్ ।
మహేశచరితం పుణ్యం మహాఘౌఘవినాశనమ్ ॥35॥

దేవస్తుతిరియం పుణ్యా సర్వపాపప్రణాశినీ ।
సర్వసౌఖ్యప్రదా నిత్యం మహేశానందదాయినీ ॥36॥

యః పఠేత్పాఠయేద్వాపి సమాఖ్యానమిదం ద్వయమ్ ।
భుక్త్వేహ పరం సౌఖ్యం గాణపత్యమవాప్నుయాత్ ॥37॥

ఇది జలంధర విమర్దనకథ. మహేశుడి గాథ, పుణ్యప్రదం. ఘోరపాపవినాశకం. ఇది దేవతలు చేసిన స్తుతి. పరమపావనం. సర్వపాపవినాశకం. సర్వసౌఖ్యప్రదం. మహేశ్వరుడికి ఆనందదాయకం. వీటిని ఎవరు చదివినా చదివించినా ఇహంలో మహాసౌఖ్యాలు అనుభవించి పరంలో శివగణపతిత్వాన్ని పొందుతారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరవధోపాఖ్యానే దేవస్తుతివర్ణనం నామ పంచవింశోఽధ్యాయః ॥25॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధర వధోపాఖ్యానంలో దేవస్తుతివర్ణనమనే ఇరవై అయిదవ అధ్యాయం సమాప్తం.

షడ్వింశోఽధ్యాయః – ఇరవై ఆరవ అధ్యాయం

దేవీస్తుతి-విష్ణుమోహవిధ్వంసవర్ణనమ్ – దేవీస్తుతి-విష్ణుమోహవిధ్వంసవర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

బ్రహ్మపుత్ర! నమస్తేఽస్తు ధన్యస్త్వం శైవసత్తమ ।
యచ్ఛ్రావితా మహా దివ్యా కథేయం శాంకరీ శుభా ॥1॥

ఇదానీం బ్రూహి సుప్రీత్యా చరితం వైష్ణవం మునే ।
స బృందాం మోహయిత్వా తు కిమకార్షీత్ముతో గతః ॥2॥

ఓయీ బ్రహ్మపుత్రుడా! శివభక్తులలో కెల్లా ఉత్తమోత్తముడా! నువ్వు ధన్యుడివి. నీకిదే వందనం. శంకరుడి దివ్య మంగళమహాగాథను నాకు వినిపించావు. మునీశ్వరా! ఇప్పుడు అదే ప్రేమతో విష్ణుమూర్తి చరిత్ర తెలియజెప్పు. బృందాదేవిని సమ్మోహపరిచిన తరవాత శ్రీహరి ఏమి చేశాడు? ఎక్కడికి వెళ్ళాడు?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాస మహాప్రాజ్ఞ శైవప్రవరసత్తమ ।
వైష్ణవం చరితం శంభుచరితాఢ్యం సునిర్మలమ్ ॥3॥

మౌనీభూతేషు దేవేషు బ్రహ్మాదిషు మహేశ్వరః ।
సుప్రసన్నోఽవదచ్ఛంభుశ్శరణాగతవత్సలః ॥4॥

వ్యాసమునీ! మహాప్రాజ్ఞా! శివభక్తులలో ఉత్తమోత్తముడా! శ్రీహరినిర్మలచరితం శంభుచరితతో నిండినది. ముడిపడినది బ్రహ్మాది దేవతలందరూ స్తుతించి నిలిచిన తరవాత మహేశ్వరుడు శరణాగతవత్సలుడు సుప్రసన్నుడై ఇలా పలికాడు.

శంభురువాచ – శంభుడు అన్నాడు.

బ్రహ్మన్ దేవవరాస్సర్వే భవదర్థే మయా హతాః ।
జలంధరో మదంశోఽపి సత్యం సత్యం వదామ్యహమ్ ॥5॥

సుఖమాపుర్న వా తాతా స్సత్యం బ్రూతామరాః ఖలు ।
భవత్కృతే హి మే లీలా నిర్వికారస్య సర్వదా ॥6॥

ఓ చతుర్ముఖా! ఓ సురవర్యులారా! జలంధరుడు నా అంశతో జన్మించినవాడు. అయినా మీ కోసమని అతడిని సంహరించాను. ఇది ముమ్మాటికీ నిజం చెబుతున్నాను. నాయనలారా! మీరు కూడా నిజం చెప్పండి? మీరంతా సంతోషించారా లేదా? నేను ఎప్పటికీ నిర్వికారుణ్ణే. మీ కోసమే నా ఈ లీలావిశేషం!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అథ బ్రహ్మాదయో దేవా హర్షాదుత్ఫుల్లలోచనాః ।
ప్రణమ్య శిరసా రుద్రం శశంసుర్విష్ణుచేష్టితమ్ ॥7॥

వ్యాసమునీ! ఈ మాటకు బ్రహ్మాదిదేవతల కన్నులు సంతోషంతో విప్పారాయి. రుద్రుణ్ని శిరసా నమస్కరించారు. విష్ణుమూర్తి చేసిన పనిని ప్రస్తావించారు.

దేవా ఊచుః – దేవతలు చెప్పారు.

మహాదేవ త్వయా దేవా రక్షితాశ్శత్రుజాద్భయాత్ ।
కించిదన్య త్సముద్భూతం తత్ర కిం కరవామహై ॥8॥

బృందా విమోహితా నాథ విష్ణునా హి ప్రయత్నతః ।
భస్మీభూతా ద్రుతం వహ్నౌ పరమాం గతిమాగతా ॥9॥

బృందాలావణ్యసంభ్రాంతో విష్ణుస్తిష్ఠతి మోహితః ।
తచ్ఛితాభస్మసంధారీ తవ మాయావిమోహితః ॥10॥

స సిద్ధమునిసంఘైశ్చ బోధితోఽస్మాభిరాదరాత్ ।
న బుధ్యతే హరిస్సోఽథ తవ మాయావిమోహితః ॥11॥

కృపాం కురు మహేశాన విష్ణుం బోధయ బోధయ ।
త్వదధీనమిదం సర్వం ప్రాకృతం సచరాచరమ్ ॥12॥

మహాదేవా! శత్రుభయం నుంచి దేవతల్ని అందరినీ కాపాడావు. కానీ మరొక పని జరిగింది. దానికి మరి ఏమి చెయ్యాలో? నాథా! పనిగట్టుకుని శ్రీహరి బృందాదేవిని సమ్మోహపరిచాడు. ఆవిడ అగ్నిలో బూడిదయ్యి సద్గతిని పొందింది. ఇప్పుడేమో ఆమె లావణ్యానికి ముగ్ధుడై శ్రీహరియే మోహంలో పడ్డాడు. ఆమె చితాభస్మాన్ని తనువంతా పులుముకొని తిరుగుతున్నాడు. ఇదంతా నీ మాయ. మేమూ, సిద్ధ మునిసంఘాలూ ఎంతగా ప్రబోధించినా అతడు మోహం నుంచి బయట పడటం లేదు. ఇదంతా నీ మాయ. మహేశా! దయచూపించు. విష్ణుమూర్తిని ప్రబోధించు – మేల్కొలుపు. చరాచరప్రకృతి అంతా నీ అధీనంలోనిదే గదా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇత్యాకర్ణ్య మహేశో హి వచనం త్రిదివౌకసామ్ ।
ప్రత్యువాచ మహాలీలః స్వచ్ఛందస్తాన్ కృతాంజలీన్ ॥13॥

దేవతలు చెప్పిన ఈ సంగతిని మహేశుడు విన్నాడు. ఆయన మహాలీలామయుడు. నమస్కరించి నిలుచున్న దేవతలతో స్వచ్ఛందంగా – స్వేచ్ఛగా – ఇలా పలికాడు.

మహేశ ఉవాచ – మహేశుడు చెప్పాడు.

హే బ్రహ్మన్ హే సురాస్సర్వే మద్వాక్యం శృణుతాదరాత్ ।
మోహినీ సర్వలోకానాం మమ మాయా దురత్యయా ॥14॥

తదధీనం జగత్సర్వం యద్దేవాసురమానుషమ్ ।
తయైవ మోహితో విష్ణుః కామాధీనోఽభవద్ధరిః ॥15॥

ఓయీ విరించీ! ఓ సమస్త దేవతలారా! నా మాట శ్రద్ధగా ఆలకించండి. మాయ అనేది సర్వలోకసమ్మోహకం. ఎవ్వడూ దానిని తప్పించుకోలేడు. దేవాసురమానుషరూపమైన జగత్తు అంతా తదధీనమే. ఆ మాయతోనే సమ్మోహితుడై శ్రీమహావిష్ణువు కామాధీనుడయ్యాడు.

ఉమాఖ్యా సా మహాదేవీ త్రిదేవజననీ పరా ।
మూలప్రకృతిరాఖ్యాతా సురామా గిరిజాత్మికా ॥16॥

ఆ మాయా మహాదేవి పేరు ఉమ. ఆమెయే త్రిమూర్తులకూ కన్నతల్లి. ఆమెను మూలప్రకృతి అంటారు. ఆనందస్వరూపిణి. హిమగిరితనయగా ఆమె అవతరించింది.

గచ్ఛధ్వం శరణా దేవా విష్ణుమోహాపనుత్తయే ।
శరణ్యాం మోహినీం మాయాం శివాఖ్యాం సర్వకామదామ్ ॥17॥

దేవతలారా! విష్ణుమూర్తి మోహం తొలగిపోవాలంటే వెళ్ళండి, ఆమెను శరణు వేడండి. ఆమె మోహిని–మాయ – శివాదేవి – సర్వకామద.

స్తుతిం కురుత తస్యాశ్చ మచ్చక్తేస్తోషకారిణీమ్ ।
సుప్రసన్నా యది చ సా సర్వం కార్యం కరిష్యతి ॥18॥

నా శక్తికి సైతం ఉల్లాసం కలిగించేది ఆవిడయే. వెళ్ళి స్తుతించండి. ప్రార్థించండి. ఆవిడ ప్రసన్నురాలైతే మీ పని అంతా నెరవేరినట్టే.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా తాన్ సురాన్ శంభుః పంచాస్యో భగవాన్ హరః ।
అంతర్దధే ద్రుతం వ్యాస సర్వైశ్చ స్వగణైస్సహ ॥19॥

దేవాశ్చ శాసనాచ్ఛంభోః బ్రహ్మాద్యా హి సవాసవాః ।
మనసా తుష్టువుర్మూలప్రకృతిం భక్తవత్సలామ్ ॥20॥

వ్యాసమునీ! పంచముఖాల భగవంతుడు శంభుడు దేవతలకు ఈ ఉపాయం చెప్పి తన అన్నిగణాలతోనూ వెంటనే అంతర్ధానం చెందాడు. శివుడి ఆనతిమేరకు బ్రహ్మేంద్రాదిదేవతలందరూ భక్తవత్సలయైన మూల ప్రకృతిని మనసా స్తుతించారు.

దేవా ఊచుః –దేవతలు స్తుతించారు.

యదుద్భవాస్సత్త్వరజస్తమోగుణాః సర్గస్థితిధ్వంస విధానకారకాః ।
యదిచ్ఛయా విశ్వమిదం భవాభవౌ తనోతి మూలప్రకృతిం నతాఃస్మ తామ్ ॥21॥

పాహి త్రయోవింశగుణాన్ సుశబ్దితాన్ జగత్యశేషే సమధిష్ఠితా పరా ।
యద్రూపకర్మాణి జగత్త్రయోఽపి తే విదుర్న మూలప్రకృతిం నతాఃస్మ తామ్ ॥22॥

యద్భక్తియుక్తాః పురుషాస్తు నిత్యం దారిద్ర్యమోహాత్యయసంభవాదీన్ ।
న ప్రాప్నువంత్యేవ హి భక్తవత్సలాం సదైవ మూలప్రకృతిం నతాఃస్మ తామ్ ॥23॥

సృష్టి– స్థితి– లయలకు హేతువులైనవి రజస్సత్త్వతమోగుణాలు. వీటికి పుట్టిల్లయిన మూలప్రకృతికి ఇదే మా వందనం. ఈ విశ్వమంతా ఆమె ఇచ్ఛప్రకారమే ఆవిర్భవిస్తుంది. అంతరిస్తుంది. ఈ ప్రపంచంలో ప్రసిద్ధికెక్కిన ఇరవైమూడు గుణాలకు (కర్మేంద్రియాలు–5, జ్ఞానేంద్రియాలు–5, పంచభూతాలు–5 పంచతన్మాత్రలు–5 బుద్ధి, అహంకారం, మనస్సు– 23) అధిష్ఠాన దేవత – మూలప్రకృతి. ఈ ముల్లోకాలలోనూ ఆవిడ రూపకర్మాదులు ఏమిటో, ఎలా ఉంటాయో ఎంతటి జ్ఞానులైనా ఎరగరు. ఆ మూలప్రకృతికి ఇదే మా వందనం. ఆ జగన్మాతకు భక్తులైన వారికి దరిద్రమూ, మోహమూ, మరణమూ, జననమూ– ఇత్యాదులు ఉండవు. అటువంటి భక్తవత్సలకు మూలప్రకృతికి ఇదే మా వందనం.

కురు కార్యం మహాదేవి దేవానాం నః పరమేశ్వరి ।
విష్ణుమోహం హర శివే దుర్గే దేవి నమోఽస్తు తే ॥24॥

జలంధరస్య శంభోశ్చ రణే కైలాసవాసినః ।
ప్రవృత్తే తద్ధార్థాయ గౌరీశాసనతశ్శివే ॥25॥

బృందా విమోహితా దేవి విష్ణునా హి ప్రయత్నతః ।
స్వపృషాత్ త్యాజితా వహ్నౌ భస్మీభూతా గతిం గతా ॥26॥

జలంధరో హతో యుద్ధే తద్భయాన్మోచితా వయమ్ ।
గిరిశేన కృపాం కృత్వా భక్తానుగ్రహకారిణా ॥27॥

తదాజ్ఞయా వయం సర్వే శరణం తే సమాగతాః ।
త్వం హి శంభుర్యువాం దేవి భక్తోద్ధారపరాయణౌ ॥28॥

ఓ మహాదేవీ! ఓ పరమేశ్వరీ! శివా! దుర్గా! నీకిదే వందనం. దేవకార్యాన్ని దయచేసి నెరవేర్చు. కైలాసనివాసి శివుడికీ జలంధరుడికీ జరిగిన యుద్ధంలో ఆ దైత్యుణ్ని సంహరించడం కోసమని గౌరీదేవి ఆజ్ఞమీద విష్ణుమూర్తి– కావాలనే బృందాదేవిని సమ్మోహపరిచాడు. పాతివ్రత్యధర్మం నుంచి వైదొలగించాడు. ఆ మీదట ఆమె తనను తాను అగ్నికి సమర్పించుకొని భస్మమయ్యింది. సద్గతిని పొందింది. భక్తానుగ్రహకారి గిరీశుడు యుద్ధంలో

జలంధరుణ్ని సంహరించి మాకందరికీ భయం తొలగించాడు. ఇది గిరీశుడి కృపావిశేషం. ఆ శివుడి ఆనతితోనే మేమందరం ఇలా వచ్చి నిన్ను శరణువేడుతున్నాం. నీవే శివుడిగా ఉన్నావు. ఇద్దరూ భక్తుల్ని ఉద్ధరించడానికే కంకణం కట్టుకున్నవారు.

బృందాలావణ్యసంభ్రాంతో విష్ణుస్తిష్ఠతి తత్ర వై ।
తచ్చితాభస్మసంధారీ జ్ఞానభ్రష్టో విమోహితః ॥29॥

సంసిద్ధసురసంఘైశ్చ బోధితో ఽపి మహేశ్వరి ।
న బుధ్యతే హరిస్సోఽథ తవ మాయావిమోహితః ॥30॥

కృపాం కురు మహాదేవి హరిం బోధయ బోధయ ।
యథా స్వలోకం పాయాత్స సుచిత్తస్సురకార్యకృత్ ॥31॥

మహేశ్వరీ! బృందాదేవి లావణ్యానికి సమ్మోహితుడై విష్ణుమూర్తి ఇప్పటికీ అక్కడే తిరుగాడుతున్నాడు. ఆవిడ చితాభస్మాన్ని తనువంతా పులుముకుని జ్ఞానభ్రష్టుడై విమోహితుడై సంచరిస్తున్నాడు. సిద్ధసమూహాలూ సురసంఘాలూ ఎంతగా ప్రబోధించినా శ్రీహరికి తెలివిరావడం లేదు. నీ మాయా విమోహితుడయ్యాడు. జగన్మాతా! దయచూపించు మహాదేవీ! హరిని మేలుకొల్పు తల్లీ! తన లోకాన్ని కాపాడేట్టు, మునుపటిలాగా సుబుద్ధి అయ్యేట్టు, దేవకార్యాలు నిర్వహించేట్టు అతడిని ప్రబోధించు తల్లీ!

ఇతి స్తువంతస్తే దేవాస్తేజోమండలమాస్థితమ్ ।
దదృశుర్గగనే తత్ర జ్వాలావ్యాప్తదిగంతరమ్ ॥32॥

తన్మధ్యాద్భారతీం సర్వే బ్రహ్మాద్యాశ్చ సవాసవాః ।
అమరాః శుశ్రువుర్వ్యాస! కామదాం వ్యోమచారిణీమ్ ॥33॥

ఇలా స్తుతిస్తూండగా ఆ దేవతలకు ఆకాశంలో ఒక తేజోమండలం కనిపించింది. దాని జ్వాలల కాంతి దశదిశాంతాలకూ వ్యాపిస్తోంది. ఆ కాంతిమండలం మధ్యనుంచి దేవతల కోరిక తీర్చే ఒక ఆకాశభారతి వినిపించింది. బ్రహ్మేంద్రాది దేవతలు అందరూ ఆ వాణిని ఆలకించారు – వ్యాసమహర్షి!!

ఆకాశవాణ్యువాచ – ఆకాశవాణి పలికింది.

అహమేవ త్రిధా భిన్నా తిష్ఠామి త్రివిధైర్గుణైః ।
గౌరీ లక్ష్మీః సురా జ్యేతీ రజస్సత్త్వతమోగుణైః ॥34॥

తత్ర గచ్ఛత యూయం వై తాసామంతిక ఆదరాత్ ।
మదాజ్ఞయా ప్రసన్నాస్తా విధాస్యంతే తదీప్సితమ్ ॥35॥

సత్త్వరజస్తమోగుణాలతో విభిన్నరూపాలను ధరించి గౌరిగా లక్ష్మిగా దేవతల వెలుగైన సరస్వతిగా ఉన్నదానను నేనే. కనక ఓ దేవతలారా! మీరంతా కలిసి సాదరంగా ఆ ముగ్గురి చెంతకూ వెళ్ళండి. నా ఆనతిమేరకు ఆ ముగ్గురూ ప్రసన్నులై మీ ప్రార్థనను నెరవేరుస్తారు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణ్వతామితి తాం వాచమంతర్ధానమగాన్మహః ।
దేవానాం విస్మయోత్ఫుల్లనేత్రాణాం తత్తదా మునే ॥36॥

తతస్సర్వేఽపి తే దేవాః శ్రుత్వా తద్వాక్యమాదరాత్ ।
గౌరీం లక్ష్మీం సురాం చైవ నేముస్తద్వాక్యచోదితాః ॥37॥

తుష్టువుశ్చ మహాభక్త్యా దేవీస్తాస్సకలాస్సురాః ।
నానావిధాభిర్వాగ్భిస్తే బ్రహ్మాద్యా నతమస్తకాః ॥38॥

వ్యాసమునీ! ఆశ్చర్యంతో విప్పారిన నేత్రాలతో దేవతలు ఈ మాటలు వింటూండగానే ఆ తోజోమండలం అంతర్ధానమయ్యింది. ఆలకించిన ఆ వాక్యాలపట్ల ఆదరంతో దేవతలు గౌరీలక్ష్మీ సరస్వతులను మనస్సులలో నమస్కరించారు. మహాభక్తితో స్తుతించారు. వివిధ వాక్యవిన్యాసాలతో నతమస్తకులై బ్రహ్మేంద్రాదిదేవతలందరూ ఏకకంఠంగా స్తుతించారు.

తతోఽరం వ్యాస దేవ్యస్తా ఆవిర్భూతాశ్చ తత్పురః ।
మహాద్భుతైః స్వతేజోభిర్భాసయంత్యో దిగంతరమ్ ॥39॥

అథ తా అమరా దృష్ట్వా సుప్రసన్నేన చేతసా ।
ప్రణమ్య తుష్టువుర్భక్త్యా స్వకార్యం చ న్యవేదయన్ ॥40॥

తతశ్చైతాస్సురాన్ దృష్ట్వా ప్రణతాన్ భక్తవత్సలాః ।
బీజాని ప్రదదుస్తేభ్యో వాక్యమూచుశ్చ సాదరమ్ ॥41॥

అపుడు ముగ్గురమ్మలూ తమ తేజస్సులతో దిగంతరాలను ప్రకాశింపజేస్తూ దేవతల ముందు ప్రత్యక్షమయ్యారు. దేవతలు తిలకించి పులకించి నతించి స్తుతించి తమ పనిని విన్నవించారు. ఆ భక్తవత్సలలు– నతులర్పిస్తున్న దేవతల్ని చూసి సాదరంగా ముగ్గురూ మూడు విత్తనాలు అందించి, ఇలా అన్నారు.

దేవ్య ఊచుః – ముగ్గురమ్మలు పలికారు.

ఇమాని తత్ర బీజాని విష్ణుర్యత్రావతిష్ఠతి ।
నిర్వపధ్వం తతః కార్యం భవతాం సిద్ధిమేష్యతి ॥42॥

దేవతలారా! ఈ మూడు విత్తనాలు తీసుకువెళ్ళి విష్ణుమూర్తి నడయాడుతున్నచోట నాటండి! మీ కార్యం సిద్ధిస్తుంది!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా తాస్తతో దేవ్యోఽంతర్హితా అభవన్మునే ।
రుద్రవిష్ణువిధీనాం హి శక్తయస్త్రిగుణాత్మికాః ॥43॥

తతస్తుష్టాస్సురాస్సర్వే బ్రహ్మాద్యాశ్చ సవాసవాః ।
తాని బీజాని సంగృహ్య యయుర్యత్ర హరిః స్థితః ॥44॥

బృందాచితాభూమితలే చిక్షిపుస్తాని తే సురాః ।
స్మృత్వా తాస్సంస్థితాస్తత్ర శివశక్త్యంశకా మునే ॥45॥

వ్యాసమునీ! ఆ ముగ్గురమ్మలూ ఈ మాట చెప్పి అదృశ్యులయ్యారు. వారు త్రిగుణస్వరూపిణులు. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల శక్తులు. అటుపైని సంతుష్టులైన బ్రహ్మేంద్రాది దేవతలందరూ ఆ విత్తనాలను తీసుకుని శ్రీహరి తిరుగాడుతున్న చోటుకి వెళ్ళారు. బృందాదేవి చితి ఉన్న ప్రదేశంలో వాటిని నాటారు. శివుడి శక్త్యంశలైన గౌరీ లక్ష్మీ సరస్వతుల్ని ధ్యానిస్తూ నిలబడ్డారు.

నిక్షిప్తేభ్యశ్చ బీజేభ్యో వనస్పత్య స్త్రయో ఽభవన్ ।
ధాత్రీ చ మాలతీ చైవ తులసీ చ మునీశ్వర ॥46॥

ధాత్ర్యుద్భవా స్మృతా ధాత్రీ మాభవా మాలతీ స్మృతా ।
గౌరీభవా చ తులసీ తమస్సత్త్వరజో గుణాః ॥47॥

విష్ణుర్వనస్పతీర్దృష్ట్వా తదా స్త్రీరూపిణీర్మునే ।
ఉదతిష్ఠత్తదా తాసు రాగాతిశయవిభ్రమాత్ ॥48॥

దృష్ట్వా స యాచతే మోహాత్కామాసక్తేన చేతసా ।
తం చాపి తులసీ ధాత్రీ రాగేణైవావలోకతామ్ ॥49॥

ఆ చల్లిన విత్తనాల నుంచి కరక్కాయ(ధాత్రి), మల్లె, తులసి అనే మూడు మొక్కలు మొలిచాయి. సరస్వతి ఇచ్చిన గింజనుంచి ధాత్రి (కరక్కాయ) మొలిచింది. లక్ష్మీ ఇచ్చిన విత్తనం నుంచి మల్లె మొలిచింది. గౌరి ఇచ్చిన దానినుంచి తులసి వచ్చింది. ఇవి మూడు తమస్సత్త్వరజోగుణాలకు ప్రతీకలుగా మొలిచాయి. అయితే అన్ని మొక్కలూ స్త్రీరూపంలోనే ఉన్నాయి. చూస్తూనే శ్రీహరి రాగాతిశయంతో లేచి కూర్చున్నాడు. మోహంతో కామాసక్తుడై ముగ్గురినీ యాచించాడు. తులసి– ధాత్రి – అతడివైపు అనురక్తితో చూశారు.

యచ్చ బీజం పురా లక్ష్మ్యా మాయయైవ సమర్పితమ్ ।
తస్మాత్తదుద్భవా నారీ తస్మిన్నీర్ష్యాపరాఽభవత్ ॥50॥

అతస్సా బర్బరీత్యాఖ్యామవాపాతీవ గర్హితామ్ ।
ధాత్రీతులస్యా తద్రాగాత్తస్య ప్రీతిప్రదే సదా ॥51॥

తతో విస్మృతదుఃఖోఽసౌ విష్ణుస్తాభ్యాం సహైవ తు ।
వైకుంఠమగమత్తుష్టస్సర్వదేవైర్నమస్కృతః ॥52॥

లక్ష్మీదేవి ఇచ్చిన విత్తనం నుంచి ఆ మాయగా ఆవిర్భవించిన మాలతీ మహిళ ఎందుకనో శ్రీహరిపట్ల ఈర్ష్య వహించింది. అందుకే దానికి బర్బరి అని గర్హిత నామధేయం ఏర్పడింది. ధాత్రీతులసులు మాత్రం శ్రీహరికి ప్రీతిప్రదాలయ్యాయి. అప్పుడింక శ్రీహరి తన దుఃఖాన్ని మరిచిపోయి ఆ ఇద్దరు మగువలతోనూ కలిసి సకలదేవతల నమస్కృతులూ అందుకుంటూ వైకుంఠలోకానికి చేరుకున్నాడు.

కార్తికే మాసి విప్రేంద్ర ధాత్రీ చ తులసీ సదా ।
సర్వదేవప్రియా జ్ఞేయా విష్ణోశ్చైవ విశేషతః ॥53॥

తత్రాపి తులసీ ధన్యాతీవ శ్రేష్ఠా మహామునే ।
త్యక్త్వా గణేశం సర్వేషాం ప్రీతిదా సర్వకామదా ॥54॥

వైకుంఠస్థం హరిం దృష్ట్వా బ్రహ్మేంద్రాద్యాశ్చ తేఽమరాః ।
నత్వా స్తుత్వా మహావిష్ణుం స్వస్వధామాని వై యయుః ॥55॥

విప్రేంద్రా! వ్యాసమహామునీ! కార్తికమాసంలో ఈ ధాత్రీతులసులు సకల దేవతలకూ ప్రీతిపాత్రాలు. విశేషించి విష్ణుమూర్తికి మరీను. అందునా తులసి అత్యంతమూ ధన్య. శ్రేష్ఠ. ఒక్క గణేశుడికి తప్ప అందరికీ ప్రీతిప్రద. సకల వాంఛాప్రదాయిని. సరే – వైకుంఠానికి చేరుకున్న శ్రీహరిని చూసి బ్రహ్మేంద్రాది సకలామరులూ అతడికి నమస్కరించి స్తుతించి తమ తమ నెలవులకు నిష్క్రమించారు.

వైకుంఠోఽపి స్వలోకస్థో భ్రష్టమోహస్సుబోధవాన్ ।
సుఖీ చాభూన్మునిశ్రేష్ఠ పూర్వవత్సంస్మరన్ శివమ్ ॥56॥

ఇత్యాఖ్యానమఘౌఘఘ్నం సర్వకామప్రదం నృణామ్ ।
సర్వకామవికారఘ్నం సర్వవిజ్ఞానవర్ధనమ్ ॥57॥

య ఇదం హి పఠేన్నిత్యం పాఠయేద్వాపి భక్తిమాన్ ।
శృణుయాచ్ఛ్రావయేద్వాపి స యాతి పరమాం గతిమ్ ॥58॥

మునివర్యా! శ్రీహరి అలా మోహం నుంచి బయటపడి ప్రబోధితుడై తన వైకుంఠం చేరుకుని మునుపటిలాగా శివస్మరణచేసుకుంటూ సుఖంగా ఉన్నాడు. భక్తుడా ! ఇది పాపసమూహాలను పోగొట్టే కథ. సకల కామాలనూ తీర్చే గాథ. కామవికారాలను తొలగించే ఆఖ్యానం. సమస్తవిజ్ఞానాన్నీ పెంపొందించే ఇతివృత్తం. దీన్ని చదివినా చదివించినా విన్నా వినిపించినా అతడు పరమపదం చేరుకుంటాడు.

పఠిత్వా య ఇదం ధీమానాఖ్యానం పరమోత్తమమ్ ।
సంగ్రామం ప్రవిశేద్వీరో విజయీ స్యాన్న సంశయః ॥59॥

విప్రాణాం బ్రహ్మవిద్యాదం క్షత్రియాణాం జయప్రదమ్ ।
వైశ్యానాం సర్వధనదం శూద్రాణాం సుఖదం త్విదమ్ ॥60॥

శంభుభక్తిప్రదం వ్యాస! సర్వేషాం పాపనాశనమ్ ।
ఇహ లోకే పరత్రాపి సదా సద్గతిదాయకమ్ ॥61॥

ఈ ఆఖ్యానాన్ని చదివిన బుద్ధిమంతుడు ఉత్తమ సద్గతులు పొందుతాడు. ఇది చదివి రణరంగానికి వెళ్ళిన వీరుడు విజయంతో తిరిగివస్తాడు. సందేహం లేదు. ఇది విప్రులకు బ్రహ్మవిద్యను, క్షత్రియులకు జయాన్ని, వైశ్యులకు సకల ధనసంపత్తిని, శూద్రులకు సుఖశాంతులనూ అందిస్తుంది. వ్యాసమునీ! అన్ని వర్ణాలవారికీ శివభక్తిని పెంపొందిస్తుంది, సకల పాపాలనూ తొలగిస్తుంది. ఇహంలో నేమి? పరంలో నేమి? ఎల్లవేళలా సద్గతిదాయకం ఈ ఆఖ్యానం.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే జలంధరవధానంతర దేవీస్తుతి, విష్ణుమోహవిధ్వంసవర్ణనం నామ షడ్వింశోఽధ్యాయః ॥26॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు జలంధర వధానంతరం జరిగిన దేవీస్తుతి-విష్ణుమోహవిధ్వంసవర్ణనం అనే ఇరవై ఆరవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

సప్తవింశోఽధ్యాయః – ఇరవై ఏడవ అధ్యాయం
శంఖచూడోత్పత్తి వర్ణనమ్ – శంఖచూడోత్పత్తి వర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అథాన్యచ్ఛంభుచరితం ప్రేమతః శృణు వై మునే ।
యస్య శ్రవణమాత్రేణ శివభక్తిః దృఢా భవేత్ ॥1॥

శంఖచూడాభిదో వీరో దానవో దేవకంటకః ।
యథా శివేన నిహతో రణమూర్ధ్ని త్రిశూలతః ॥2॥

తచ్ఛంభుచరితం దివ్యం పవిత్రం పాపనాశనమ్ ।
శృణు వ్యాస! సుప్రీత్యా వచ్మి సుస్నేహతస్తవ ॥3॥

వ్యాసమునీ! శంభుచరిత మరొకటి చెబుతాను. ఆదరంగా విను. ఇది వింటే శివభక్తి దృఢపడుతుంది. శంఖచూడుడు అనే దానవవీరుడు దేవకంటకుడు. వీణ్ని శివుడు రణరంగంలో త్రిశూలంతో ఖండించాడు. ఇదొక దివ్యమూ పవిత్రమూ పాపనాశకమూ అయిన శంభుచరితం. నీపై స్నేహంకొద్దీ చెబుతున్నాను. వ్యాసా! భక్తితోవిను.

మరీచేస్తనయో ధాతుః పౌత్రో యః కశ్యపో మునిః ।
స ధర్మిష్ఠః సృష్టికర్తా విధ్యాజ్ఞప్తః ప్రజాపతిః ॥4॥

దక్షః ప్రీత్యా దదౌ తస్మై నిజకన్యాః త్రయోదశ ।
తాసాం ప్రసూతిః ప్రసభం న కథ్యా బహువిస్తృతాః ॥5॥

యత్ర దేవాదినిఖిలం చరాచరమభూజ్జగత్ ।
విస్తరాత్తత్ప్రవక్తుం చ కః క్షమోఽస్తి త్రిలోకకే ॥6॥

బ్రహ్మదేవుడి మనుమడు, మరీచికి తనయుడు అయిన కశ్యపమహర్షి పరమధార్మికుడు. బ్రహ్మదేవుడి ఆనతి ననుసరించి సృష్టి జరిపిన ప్రజాపతి. ఈ కశ్యపప్రజాపతికి దక్షప్రజాపతి తన కూతుళ్ళు పదమూడు మందిని ఇచ్చి ప్రేమతో పెళ్ళిళ్లు జరిపించాడు. వారికి కలిగిన సంతానం – ఇత్యాది కథలన్నీ బహువిస్తృతాలు. వాటిని చెప్పడం ఇప్పుడయ్యే పని కాదు. ఎందుకంటే – సకలదేవదానవమనుష్యాది జాతులూ, చరాచరజగత్తూ అంతా వారినుంచి ఆవిర్భవించినదే. అంతటి విస్తారమైన గాథను సవిస్తరంగా చెప్పాలంటే ఈ ముల్లోకాలలో సమర్థుడెవడున్నాడు?

ప్రస్తుతం శృణు వృత్తాంతం శంభులీలాన్వితం చ యత్ ।
తదేవ కథయామ్యద్య శృణు భక్తి ప్రవర్ధనమ్ ॥7॥

అంచేత, వాటిలో ప్రస్తుతం ఒక వృత్తాంతం చెబుతాను. అది శివుడి లీలావిశేషవిశిష్టం. భక్తి ప్రవర్ధకం దానిని చెబుతున్నాను. విను!

తాసు కశ్యపపత్నీషు దనుస్త్వేకా వరాంగనా ।
మహారూపవతీ సాధ్వీ పతిసౌభాగ్యవర్ధితా ॥8॥

ఆ కశ్యపుడి ఇల్లాండ్రలో దనువు ఒకతె ఉత్తమాంగన, మహాసుందరాంగి, పతివ్రత, సౌభాగ్యవతి.

ఆసన్ తస్యా దనోఃపుత్రా బహవో బలవత్తరాః ।
తేషాం నామాని నోచ్యంతే విస్తారభయతో మునే ॥9॥

ఈమెకు బలశాలులైన పుత్రులు చాలా మంది కలిగారు. వాళ్ళ పేర్లు అన్నీ చెప్పడం లేదు. వివరించడం పెరిగిపోతుందని భయం.

తేష్వేకో విప్రచిత్తిస్తు మహాబలపరాక్రమః ।
తత్పుత్రో ధార్మికో దంభో విష్ణుభక్తో జితేంద్రియః ॥10॥

దనుపుత్రులలో విప్రచిత్తి ఒకడు. మహాబలశాలి. మహాపరాక్రమశాలి. ఆ విప్రచిత్తి కొడుకు–దంభుడు. ఇతడు విష్ణుభక్తుడు. జితేంద్రియుడు. పరమధార్మికుడు.

నాసీత్తత్తనయో వీరస్తతశ్చింతాపరో ఽభవత్ ।
శుక్రాచార్యం గురుం కృత్వా కృష్ణమంత్రమవాప్య చ ॥11॥
తపశ్చకార పరమం పుష్కరే లక్షవర్షకమ్ ।
కృష్ణమంత్రం జజాపైవ దృఢం బద్ధాసనం చిరమ్ ॥12॥

తపః ప్రకుర్వతస్తస్య మూర్ధ్నో నిస్సృత్య ప్రజ్వలత్ ।
విససార చ సర్వత్ర తత్తేజో హి సుదుస్సహమ్ ॥13॥

తేన తప్తాస్సురాస్సర్వే మునయో మనవస్తథా ।
సునాసీరం పురస్కృత్య బ్రహ్మాణం శరణం యయుః ॥14॥

ఆ మహావీరుడు దంభుడికి పుత్రసంతానం లేకపోయింది. దానితో దిగులుపడ్డాడు. అతడి గురువు శుక్రాచార్యుడు. ఈ గురువు నుంచి కృష్ణమంత్రాన్ని ఉపదేశంగా పొందాడు. పుష్కరక్షేత్రానికి వెళ్ళి లక్షసంవత్సరాలు తపస్సుచేశాడు. పద్మాసనంలో కూర్చుని దృఢచిత్తంతో కృష్ణమంత్రాన్ని చిరకాలం జపించాడు. అలా తీవ్రతపస్సు చేస్తున్న అతడి శిరస్సునుంచి ఒక తేజస్సు భరింపరానిదై భుగభుగలాడుతూ వెలువడింది. అన్ని దిక్కులకూ వ్యాపించింది. దాని వేడిని తట్టుకోలేక పోయారు సురలూ, మునులూ, మనువులూను. ఇంద్రుణ్ణి అగ్రభాగాన నిలుపుకొని అందరూ కలిసి బ్రహ్మను శరణువేడారు.

ప్రణమ్య చ విధాతారం దాతారం సర్వసంపదామ్ ।
తుష్టువుర్వికలాః ప్రోచుః స్వవృత్తాంతం విశేషతః ॥15॥

తదాకర్ణ్య విధాతాపి వైకుంఠం తైర్యయౌ సహ ।
తదేవ విజ్ఞాపయితుం నిఖిలేన హి విష్ణవే ॥16॥

తత్ర గత్వా త్రిలోకేశం విష్ణుం రక్షాకరం పరమ్ ।
ప్రణమ్య తుష్టువుస్సర్వే కరౌ బద్ధ్వా వినమ్రకాః ॥17॥

సకల సంపదలకూ దాతయగు విధాతకు నమస్కరించారు. మనస్సులు వికలంగా ఉన్నా బహుధా స్తుతించారు. తమ గోడు వెళ్ళబోసుకున్నారు. అది విని బ్రహ్మదేవుడు వారిని వెంటబెట్టుకుని వైకుంఠలోకానికి బయలుదేరాడు అదే శ్రీహరికి వివరంగా చెబుదామని. వైకుంఠానికి వెళ్ళి త్రిలోకేశుడూ రక్షాకరుడు పరముడూ అయిన శ్రీమహావిష్ణువుకి నమస్కరించి స్తుతించారు. వినయంగా చేతులు కట్టుకు నిలబడి – ఇలా వివరించారు.

దేవా ఊచుః – దేవతలు విన్నవించారు.

దేవ దేవ న జానీమో జాతం కిం కారణం త్విహ ।
సంతప్తాస్సకలా జాతాస్తేజసా కేన తద్వద ॥18॥

తప్తాత్మనాం త్వమవితా దీనబంధో ఽనుజీవినామ్ ।
రక్ష రక్ష రమానాథ శరణ్యశ్శరణాగతాన్ ॥19॥

దేవదేవా! కారణమేమో తెలియదు గానీ మేమంతా మాడిపోతున్నాం. ఇది ఎవరి తేజస్సో ఎక్కడి నుంచి వెలువడుతోందో– ఇదంతా నీకే తెలుసు. దయచేసి మాకు తెలియజెప్పు. మా అంతరంగాలు పరితపిస్తున్నాయి. తప్తాత్ములకు నువ్వే రక్షకుడివి. అనుచరులకు దీనబంధుడివి. రమానాథా! శరణ్యా! శరణాగతులం మమ్మల్ని దయచేసి కాపాడు!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి శ్రుత్వా వచో విష్ణుః బ్రహ్మాదీనాం దివౌకసామ్ ।
ఉవాచ విహసన్ ప్రేమ్ణా శరణాగతవత్సలః ॥20॥

బ్రహ్మాదిదేవతలు చేసిన ఈ విన్నపాన్ని ఆలకించాడు విష్ణుమూర్తి. శరణాగతవత్సలుడు గదా! పెద్దగా నవ్వుతూ ప్రేమగా బదులు పలికాడు.

విష్ణురువాచ – విష్ణువు అన్నాడు.

సుస్వస్థా భవతావ్యగ్రా న భయం కురుతామరాః ।
నోపప్లవా భవిష్యంతి లయకాలో న విద్యతే ॥21॥

దానవో దంభనామా హి మద్భక్తః కురుతే తపః ।
పుత్రార్థీ శమయిష్యామి తమహం వరదానతః ॥22॥

అమరులారా! స్వస్థతగా ఉండండి. కలత చెందకండి. భయపడకండి. ఉపప్లవాలేమీ జరగవు. ఇది ప్రళయకాలమూ కాదు. భక్తుడు దంభుడనే దానవుడు – పుత్రార్థియై తపస్సు చేస్తున్నాడు. నేను ఇప్పుడే వెళ్ళి అతడికి వరం ఇచ్చి, విరమింపజేస్తాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తాస్తే సురాస్సర్వే ధైర్యమాలంబ్య వై మునే ।
యయుర్బ్రహ్మాదయస్సుస్థాః స్వస్వధామాని సర్వశః ॥23॥

అచ్యుతోఽపి వరం దాతుం పుష్కరం సంజగామ హ ।
తపశ్చరతి యత్రాసౌ దంభనామా హి దానవః ॥24॥

తత్ర గత్వా వరం బూహ్రీత్యువాచ పరిసాంత్వయన్ ।
గిరా సూనృతయా భక్తం జపంతం స్వమనుం హరిః ॥25॥

తుచ్ఛ్రుత్వా వచనం విష్ణోః దృష్ట్వా తం చ పురః స్థితమ్ ।
ప్రణనామ మహాభక్త్యా తుష్టావ చ పునఃపునః ॥26॥

వ్యాసమునీ! శ్రీహరి ఇలా చెప్పడంతో బ్రహ్మాదిదేవతలందరికీ భయం పోయి ధైర్యం వచ్చింది. కుదుటబడ్డారు. ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళారు. అప్పుడు – అచ్యుతుడు కూడా వరం ఇద్దామని దంభదానవుడు తపస్సు చేస్తున్న పుష్కరక్షేత్రానికి బయలుదేరాడు. వెళ్ళి తన నామాన్ని మహామంత్రంగా జపిస్తున్న ఆ భక్తుణ్ణి సూనృతవాక్కులతో బుజ్జగిస్తూ, వరం కోరుకోమన్నాడు. ఈ మాట విన్నాడు దంభుడు. కళ్ళు తెరిచాడు. ఎట్టయెదట శ్రీహరిని చూశాడు. మహాభక్తితో నమస్కరించాడు. పునఃపునః స్తుతించాడు.

దంభ ఉవాచ – దంభుడు అడిగాడు.

దేవ దేవ నమస్తేఽస్తు పుండరీక విలోచన ।
రమానాథ త్రిలోకేశ కృపాం కురు మమోపరి ॥27॥

స్వభక్తం తనయం దేహి మహాబలపరాక్రమమ్ ।
త్రిలోకజయినం వీరమజేయం చ దివౌకసామ్ ॥28॥

దేవ దేవా! పుండరీకాక్షా! రమానాథా! త్రిలోకాధిపా! నీకిదే వందనం! నాపై దయ చూపించు. మహాబల పరాక్రమసంపన్నుడూ, నీకు భక్తుడూ, త్రిలోకవిజేత, మహావీరుడూ, దేవతలకు సైతం అజేయుడు అయిన తనయుణ్ణి వరంగా ప్రసాదించు తండ్రీ!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తో దానవేంద్రేన తం వరం ప్రదదౌ హరిః ।
నివర్త్య చోగ్రతపసస్తతస్సోఽంతరధాన్మునే ॥29॥

గతే హరౌ దానవేంద్రః కృత్వా తస్మై దిశే నమః ।
జగామ స్వగృహం సిద్ధతపాః పూర్ణమనోరథః ॥30॥

దానవేంద్రుడు అడిగిన ఆ వరం ప్రసాదించి ఉగ్రతపస్సును విరమింపజేసి శ్రీహరి అదృశ్యుడయ్యాడు. వ్యాసమునీ! శ్రీహరి వెళ్ళగానే దానవేంద్రుడు ఆ దిక్కు వైపు నమస్కరించి చేసిన తపస్సు ఫలించి, కోరిన వరం లభించి, ఆనందంగా ఇల్లు చేరుకున్నాడు.

కాలేనాల్పేన తత్పత్నీ సగర్భా భాగ్యవత్యభూత్ ।
రరాజ తేజసాత్యంతం రోచయంతీ గృహాంతరమ్ ॥31॥

సుదామా నామ గోపో యో కృష్ణస్య పార్షదాగ్రణీః ।
తస్యా గర్భే వివేశాసౌ రాధా శప్తశ్చ యన్మనే ॥32॥

త్వరలోనే అతడి భార్య గర్భవతి అయ్యింది. ఆమెలో ఒక కొత్త తేజస్సు అంతఃపురభవనమంతటా ప్రకాశించింది. ఒకప్పుడు రాధాదేవి ఇచ్చిన శాపం వల్ల – శ్రీకృష్ణుడి ప్రధానసేవకుడు సుదాముడు అనే గోపకుడు, ఇప్పుడు దంభుడి ఇల్లాలి గర్భంలోకి ప్రవేశించాడు.

అసూత సమయే సాధ్వీ సుప్రభం తనయం తతః ।
జాతకం సుచకారాసౌ పితాహూయ మునీన్ బహూన్ ॥33॥

ఉత్సవస్సుమహానాసీత్తస్మిన్ జాతే ద్విజోత్తమ ।
నామ చక్రే పితా తస్య శంఖచూడేతి సద్దినే ॥34॥

నెలలు నిండి ప్రసవసమయం రాగానే ఆ సాధ్వి వెలుగులు విరజిమ్ముతున్న ఒక తనయుణ్ణి ప్రసవించింది. ఎందరెందరో మునీశ్వరులను ఆహ్వానించి తండ్రి దంభుడు జాతకర్మాది సంస్కారాలను యథావిధి జరిపించాడు. ద్విజోత్తమా! వ్యాసమునీంద్రా! పుత్రుడు కలగడంతో వారింట ఒక మహోత్సవం వెల్లివిరిసింది. ఒక మంచిరోజు చూసి ఆ బాలకుడికి శంఖచూడుడు అని నామకరణం చేశాడు కన్న తండ్రి.

పితుర్గేహే స వవృధే శుక్లపక్షే యథా శశీ ।
శైశవేఽభ్య స్తవిద్యస్తు స బభూవ సుదీప్తిమాన్ ॥35॥

స బాలక్రీడయా నిత్యం పిత్రోర్హర్షం తతాన హ ।
ప్రియో బభూవ సర్వేషాం కులజానాం విశేషతః ॥36॥

వ్యాసమునీ! శుక్లపక్షంలో చంద్రబింబంలాగా ఆ శంఖచూడుడు తండ్రి ఇంట దినదిన ప్రవర్ధమానుడయ్యాడు. బాల్యంలోనే విద్యలన్నీ నేర్చుకుని గొప్ప తేజస్వంతుడయ్యాడు. తన బాలక్రీడలతో తండ్రికి ఆనందం పంచుతూ అందరికీ ప్రియుడయ్యాడు. తన వంశంలో పుట్టిన వారికి (బంధువులకు) మరింతగా ఇష్టుడయ్యాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడోత్పత్తి వర్ణనం నామ సప్తవింశోఽధ్యాయః ॥27॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడోత్పత్తి వర్ణనం అనే ఇరవై ఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టవింశోఽధ్యాయః – ఇరవై ఎనిమిదవ అధ్యాయం

శంఖచూడతపఃకరణ వివాహవర్ణనమ్ – శంఖచూడుడి తపస్సు, వివాహవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తతశ్చ శంఖచూడోఽసౌ జైగీషవ్యోపదేశతః ।
తతశ్చకార సుప్రీత్యా బ్రహ్మణః పుష్కరే చిరమ్ ॥1॥

గురుదత్తాం బ్రహ్మవిద్యాం జజాప నియతేంద్రియః ।
స ఏకాగ్రమనా భూత్వా కరణాని నిగృహ్య చ ॥2॥

తపంతం పుష్కరే తం వై శంఖచూడం చ దానవమ్ ।
వరం దాతుం జగామాశు బ్రహ్మా లోకగురుర్విభుః ॥3॥

వ్యాసమునీ! అటుపైని ఆ శంఖచూడుడు జైగీషవ్యుడనే గురువు ఉపదేశంతో పుష్కర క్షేత్రంలో మహాభక్తితో బ్రహ్మనుద్దేశించి మహాతపస్సు చిరకాలం చేశాడు. గురువు ఉపదేశించిన బ్రహ్మవిద్యను (గాయత్రీమంత్రాన్ని) శమదమాది గుణసంపన్నుడై జపించాడు. మనస్సును ఏకాగ్రం చేశాడు. ఇంద్రియాలను నియంత్రించాడు. తపస్సు సాగించాడు. ఇలా పుష్కరంలో తపస్సు చేస్తున్న ఆ శంఖచూడ దానవుడి చెంతకు లోకగురువు బ్రహ్మదేవుడు వరం ఇవ్వడానికి శీఘ్రంగా వేంచేశాడు.

వరం బ్రూహీతి ప్రోవాచ దానవేంద్రం విధిస్తదా ।
స దృష్ట్వా తం ననామాతినమ్రస్తుష్టావ సద్గిరా ॥4॥

వరం యయాచే బ్రహ్మాణమజేయత్వం దివౌకసామ్ ।
తథేత్యాహ విధిస్తం వై సుప్రసన్నేన చేతసా ॥5॥

శ్రీకృష్ణకవచం దివ్యం జగన్మంగళమంగళమ్ ।
దత్తవాన్ శంఖచూడాయ సర్వత్ర విజయప్రదమ్ ॥6॥

బదరీం సంప్రయాహి త్వం తులస్యా సహ తత్ర వై ।
వివాహం కురు తత్రైవ సా తపస్యతి కామతః ॥7॥

ధర్మధ్వజసుతా సేతి సందిదేశ చ తం విధిః ।
అంతర్ధానం జగామాశు పశ్యతస్తస్య తత్క్షణాత్ ॥8॥

శంఖచూడా! దానవేంద్రా! వరం కోరుకో! అని బ్రహ్మదేవుడు అన్నాడు. అప్పుడు అతడు కళ్ళు తెరిచి విధిని చూసి నమస్కరించి వినయంగా ఉత్తమంగా స్తుతించాడు. దేవతలకు నేను అజేయుణ్ణి కావాలి అని వరం కోరాడు. ప్రసన్నచిత్తంతో తథాస్తు అన్నాడు చతుర్ముఖుడు. జగత్తులో ఉన్న ఉత్తమోత్తమ మంగళప్రదమూ దివ్యమూ

అన్నింటా విజయాన్ని అందించగలదీ అయిన శ్రీకృష్ణకవచాన్ని శంఖచూడుడికి బహూకరించాడు. నాయనా! శంఖచూడా! బదరికాశ్రమానికి వెళ్ళు. అక్కడ తులసీదేవిని వివాహం చేసుకో. ఆమె అక్కడనే స్వచ్ఛందంగా తపస్సు చేస్తోంది. ఆవిడ ధర్మధ్వజుడి కూతురు – అని సందేశం కూడా ఇచ్చి బ్రహ్మదేవుడు – శంఖచూడుడు చూస్తుండగానే వేగంగా అంతర్ధానం చెందాడు.

తతస్స శంఖచూడో హి తపస్సిద్ధోఽతి పుష్కరే ।
గళే బబంధ కవచం జగన్మంగళమంగళమ్ ॥9॥

ఆజ్ఞయా బ్రహ్మణస్సోఽపి తపస్సిద్ధమనోరథః ।
సమాయయౌ ప్రహృష్టాస్య స్తూర్ణం బదరికాశ్రమమ్ ॥10॥

పుష్కరక్షేత్రంలో తపస్సిద్ధి పొందిన ఆ శంఖచూడుడు జగన్మంగళమంగళమైన దివ్యకవచాన్ని కంఠసీమలో అలంకరించుకున్నాడు. తపస్సుతో తన కోరికను తీర్చుకోగలిగాడు. బ్రహ్మదేవుడి ఆజ్ఞ మేరకు ఆనందంగా బదరికాశ్రమం చేరుకున్నాడు.

యదృచ్ఛయాగతస్తత్ర శంఖచూడశ్చ దానవః ।
తపశ్చరంతీ తులసీ యత్ర ధర్మధ్వజాత్మజా ॥11॥

సురూపా సుస్మితా తన్వీ శుభభూషణభూషితా ।
సకటాక్షం దదర్శాసౌ తమేవ పురుషం పరమ్ ॥12॥

దృష్ట్వా తాం లలితాం రమ్యాం సుశీలాం సుందరీం సతీమ్ ।
ఉవాస తత్సమీపే తు మధురం తామువాచ సః ॥13॥

అందులో ధర్మధ్వజుడి కూతురు తులసీదేవి తపస్సు చేస్తున్న చోటుకే యాదృచ్ఛికంగా వచ్చాడు శంఖచూడుడు. తులసీదేవి మంచి రూపవతి. నగుమోము. లతాతన్వి. శుభప్రదాలైన అలంకారాలు ధరించింది. తానున్న చోటుకి వచ్చిన ఆ పరపురుషుణ్ణి ఓరకన్నులతో చూసింది. ఆ సుకుమారిని ఆ సురూపను ఆ సుశీలను, ఆ సుందరిని, ఆ సుసాధ్విని తిలకించి, శంఖచూడుడు ఆమెకు చేరువలో కూర్చున్నాడు. మధురంగా పలకరించాడు.

శంఖచూడ ఉవాచ – శంఖచూడుడు అడిగాడు.

కా త్వం కస్య సుతా త్వం హి కిం కరోషి స్థితాత్ర కిమ్ ।
మౌనీభూతా కింకరం మాం సంభావితుమిహార్హసి ॥14॥

తన్వీ! ఎవ్వతెవీవు? ఎవరి అమ్మాయివి? ఏమిటి చేస్తున్నావ్? ఇక్కడ ఎందుకు ఉన్నావ్? మౌనివయ్యావు ఎందుకని? నేను నీ కింకరుణ్ణి (సేవకుణ్ణి). నన్ను గౌరవించడం నీకు తగును సుమా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యేవం వచనం శ్రుత్వా సకామం తమువాచ సా ।
ధర్మధ్వజసుతాహం చ తపస్యామి తపస్వినీ ॥15॥

తపోవనే చ తిష్ఠామి కస్త్వం గచ్ఛ యథాసుఖమ్ ।
నారీజాతిర్మోహినీ చ బ్రహ్మాదీనాం విషోపమా ॥16॥

నింద్యా దోషకరీ మాయా శృంఖలా హ్యనుశాయినామ్ ।
ఇత్యుక్త్వా తులసీ తం చ సరసం విరరామ హ ॥17॥

వ్యాసమునీ! శంఖచూడుడి ప్రశ్నలు విని తులసీదేవి సకామంగా బదులుపల్కింది. నేను ధర్మధ్వజుడి కూతుర్ని. తపస్వినినై తపస్సు చేసుకుంటున్నాను. ఇదిగో ఈ తపోవనంలోనే ఉంటున్నాను. ఇంతకీ నువ్వెవరు? మా స్త్రీజాతి – సకల పురుష సమ్మోహిని – బ్రహ్మాదులతో సహా. ఇది విషంతో సమానం. నింద్యం. దోషకారకం. ఇదొక మాయ. ఇందులో పడినవాళ్ళకి ఇదొక శృంఖలం. ఎందుకులే. సుఖంగా నీ దారిన నువ్వు వెళ్ళు – అని సరసంగా పలికి విరమించింది.

శంఖచూడ ఉవాచ – శంఖచూడుడు అన్నాడు.

దృష్ట్వా తాం సస్మితాం సోఽపి ప్రవక్తుముపచక్రమే ।
త్వయా యత్కథితం దేవి! న చ సర్వమలీకకమ్ ॥18॥

కించిత్సత్యమలీకం చ కించిన్మత్తో నిశామయ ।
పతివ్రతాః స్త్రియో యాశ్చ తాసాం మధ్యే త్వమగ్రణీః ॥19॥

న చాహం పాపదృక్కామీ తథా త్వం నేతి ధీర్మమ ।
ఆగచ్ఛామి త్వత్సమీపమాజ్ఞయా బ్రహ్మణోఽధునా ॥
గాంధర్వేణ వివాహేన త్వాం గ్రహీష్యామి శోభనే ॥20॥

చిరునవ్వులు చిందిస్తున్న ఆమెను చూసి శంఖచూడుడు ఇలా అన్నాడు. దేవీ! నువ్వు చెప్పినది పూర్తిగా అసత్యమనలేను. కొంత వాస్తవం. కొంత అవాస్తవం. నేను చెప్పేది కూడా కొంచెం విను. పతివ్రతలలో నువ్వు అగ్రగణ్యవు. నేనా – పాపదృక్కులు బరపే కాముకుణ్ణి కాను. నువ్వూ అటువంటి దానివి కావని నా అభిప్రాయం. ఇవ్వేళ బ్రహ్మదేవుడి ఆనతిపై నీదగ్గరికి వచ్చాను. ఓ శోభనా! గాంధర్వవివాహపద్ధతిలో నిన్ను చేపడతాను.

శంఖచూడోఽహమేవాస్మి దేవవిద్రావకారకః ॥21॥

మాం న జానాసి కిం భద్రే! న శ్రుతోఽహం కదాచన ॥
దనువంశ్యో విశేషేణ దంభపుత్రశ్చ దానవః ॥22॥

సుదామా నామ గోపోఽహం పార్షదశ్చ హరేః పురా ॥
అధునా దానవేంద్రోఽహం రాధికాయాశ్చ శాపతః ॥23॥

జాతిస్మరోఽహం జానామి సర్వం కృష్ణప్రభావతః ।
ఏవముక్త్వా శంఖచూడో విరరామ చ తత్పురః ॥24॥

భద్రే! నేనే శంఖచూడుణ్ణి. దేవతలను బెంబేలెత్తించేవాణ్ణి నేనే. నన్నే ఎరగవా? నా పేరయినా ఎప్పుడూ వినలేదా? దనువంశంలో పుట్టినవాణ్ణి. విశేషించి దంభదానవుడి కుమారుణ్ణి. దానవుణ్ణి. పూర్వజన్మలో సుదాముడనే గోపకుణ్ణి. శ్రీకృష్ణుడి జతగాణ్ణి. రాధికాదేవి ఇచ్చిన శాపం వల్ల ఇప్పుడిలా దానవేంద్రుణ్ణి అయ్యాను. శ్రీకృష్ణుడి మహిమ వల్ల నేను జాతిస్మరుణ్ణి కాగలిగాను. నాకు అన్నీ తెలుసు – ఇలా చెప్పి ఆమె ఎదుట శంఖచూడుడు విరమించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

దానవేంద్రేణ సేత్యుక్తా వచనం సత్యమాదరాత్ ।
సస్మితం తులసీ తుష్టా ప్రవక్తుముపచక్రమే ॥25॥

వ్యాసా! దానవేంద్రుడు శంఖచూడుడు చెప్పిన ఈ సత్యవచనాలను ఆదరంగా ఆలకించిన తులసీదేవి సంతుష్టురాలయ్యింది. చిరునవ్వులు చిందిస్తూ ఇలా పలికింది.

తులస్యువాచ – తులసి పలికింది.

త్వయాహమధునా సత్త్వవిచారేణ పరాజితా ।
స ధన్యః పురుషో లోకే న స్త్రియా యః పరాజితః ॥26॥

సత్క్రియోఽప్యశుచిర్నిత్యం స పుమాన్ యః స్త్రియా జితః ।
నిందంతి పితరో దేవా మానవాస్సకలాశ్చ తామ్ ॥27॥

శుద్ధే ర్విప్రో దశాహేన జాతకే మృతసూతకే ।
క్షత్రియో ద్వాదశాహేన వైశ్యః పంచదశాహతః ॥28॥

శూద్రో మాసేన శుద్ధే ర్యత్తు హీతి వేదానుశాసనమ్ ।
న శుచిః స్త్రీజితః క్వాపి చితాదాహం వినా పుమాన్ ॥29॥

దానవేంద్రా! సాత్త్వికవిచారధారతో నువ్విప్పుడు నన్ను గెలుచుకున్నావు. ఈ లోకంలో స్త్రీకి లొంగిపోని వాడొక్కడే ధన్యపురుషుడు. స్త్రీలోలుడైన మానవుడు యజ్ఞయాగాది సత్క్రియలు ఎన్ని చేసినా అతడు నిత్యమూ అశుచియే. అతణ్ణి పితరులూ దేవతలూ మానవులూ అందరూ నిందిస్తారు. జాతాశౌచం కానీ మృతాశౌచం కానీ విప్రుడు పదవరోజు తరవాత శుద్ధి పొందుతాడు. క్షత్రియుడికి పన్నెండు రోజులు, వైశ్యుడికి పదిహేనురోజులు, శూద్రుడికి ముప్ఫై రోజులు అశౌచం ఉంటుందనీ, అటుపైని శుద్ధి అనికదా వేదశాసనం. స్త్రీలోలుడికి మాత్రం ఎన్నటికీ శుద్ధి అన్నదే లేదు – చితాగ్నిలో కాలి బూడిద అవ్వడం తప్ప.

న గృహ్ణంతీచ్ఛయా తస్మాత్పితరః పిండతర్పణమ్ ।
న గృహ్ణంతి సురాస్తేన దత్తం పుష్పఫలాదికమ్ ॥30॥

తస్య కిం జ్ఞాన సుతపో జపహోమప్రపూజనైః ।
విద్యయా దానతః కిం వా స్త్రీభిర్యస్య మనోహృతమ్ ॥31॥

విద్యాప్రభావజ్ఞానార్థం మయా త్వం చ పరీక్షితః ।
కృత్వా కాంత పరీక్షాం వై వృణుయాత్కామినీ వరమ్ ॥32॥

స్త్రీలకోసం మనసు పారవేసుకున్నవాడు చేసే పిండతర్పణాదుల్ని అతడి పితృదేవతలు ఇష్టపడరు. అతడు సమర్పించే పుష్పఫలతోయాదుల్ని దేవతలు స్వీకరించరు. అతడికి ఎంత తపస్సు ఎంత జపం ఎంత జ్ఞానం ఉన్నా, అతడు ఎన్ని హోమాలూ పూజలూ చేసినా, ఎంతటి విద్య ఉన్నా, ఎంతగా దానధర్మాదులు చేసినా – అన్నీ వ్యర్థం. నీకున్న విద్యాప్రభావాన్నీ జ్ఞానాన్నీ పరీక్షించాను. కాంతుణ్ణి పరీక్షించిన తరవాతనే కదా కామిని అతణ్ణి వరుడుగా వరించాలి!!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యేవం ప్రవదంత్యాం తు తులస్యాం తత్క్షణే విధిః ।
తత్రాజగామ సంస్రష్టా ప్రోవాచ వచనం తతః ॥33॥

తులసీదేవి శంఖచూడుడితో ఇలా మాట్లాడుతూండగానే తత్క్షణం – సృష్టికర్త బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చాడు. వచ్చి ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

కిం కరోషి శంఖచూడ సంవాదమనయా సహ ।
గాంధర్వేణ వివాహేన త్వమస్యా గ్రహణం కురు ॥34॥

త్వం వై పురుషరత్నం చ స్త్రీరత్నం చ త్వియం సతీ ।
విదగ్ధాయా విదగ్ధేన సంగమో గుణవాన్ భవేత్ ॥35॥

నిర్విరోధం సుఖం రాజన్! కోవా త్యజతి దుర్లభమ్ ।
యోఽవిరోధసుఖత్యాగీ స పశుర్నాత్ర సంశయః ॥36॥

శంఖచూడా! ఏమిటీ ఈమెతో సంభాషణకి దిగావు! గాంధర్వపద్ధతిలో ఈమె పాణిగ్రహణం చెయ్యి. నువ్వు పురుషరత్నానివి. ఈమె స్త్రీరత్నం. నేర్పుకత్తెకు నేర్పుగాడితో సంగమం ఆనందాతిశాయిగా ఉంటుంది. దానవరాజా! దుర్లభమైన ఒక అనిషిద్ధసుఖం దొరికితే పరిత్యజించినవాడూ, నిషిద్ధసుఖం దొరికితే పరిగ్రహించినవాడూ పశుసమానులే. సందేహం లేదు.

కిం త్వం పరీక్షసే కాంతమీదృశం గుణినం సతి ।
దేవానామసురాణాం చ దానవానాం విమర్దకమ్ ॥37॥

అనేన సార్ధం సుచిరం విహారం కురు సర్వదా ।
స్థానే స్థానే యథేచ్ఛం చ సర్వలోకేషు సుందరి ॥38॥

అంతే ప్రాప్స్యతి గోలోకే శ్రీకృష్ణం పునరేవ సః ।
చతుర్భుజం చ వైకుంఠే మృతే తస్మిన్ త్వమాప్స్యసి ॥39॥

సతీ! తులసీదేవీ! కాంతుణ్ని పరీక్షిస్తున్నావా? ఇతడు దేవ–దానవ–రాక్షస–విమర్దకుడు. ఇతడితో కలిసి నువ్వు సుందరీ! సకలలోకాలలోనూ సకల ప్రదేశాలలోనూ చిరకాలం యథేచ్ఛగా విహరించు. చివరిలో ఇతడు తిరిగి గోలోకానికి వెళ్ళి (ద్విభుజ) శ్రీకృష్ణుణ్ణి చేరుకుంటాడు. అతడి తదనంతరం నువ్వేమో వైకుంఠంలో చతుర్భుజుణ్ణి చేరుకుంటావు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యేవమాశిషం దత్త్వా స్వాలయం తు యయౌ విధిః ।
గాంధర్వేణ వివాహేన జగృహే తాం చ దానవః ॥40॥

ఏవం వివాహ్య తులసీం పితుః స్థానం జగామ హ ।
స రేమే రమ్యయా సార్ధం వాసగేహే మనోరమే ॥41॥

వ్యాసమునీ! బ్రహ్మదేవుడు ఇలా వారిద్దరికీ ఆశీస్సులు అందించి తన నిలయానికి వెళ్ళిపోయాడు. దానవేంద్రుడు శంఖచూడుడు గాంధర్వరీతిలో తులసీదేవిని పాణిగ్రహణం చేశాడు. అటుపైని పైతృకమైన తన దానవలోకానికి వెళ్ళి అక్కడ తన రాజభవనంలో మనోహరమైన వాసగృహంలో ఆ సుందరాంగితో ఆనందించాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడతపఃకరణ వివాహవర్ణనం నామాష్టవింశోఽధ్యాయః ॥28॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడుడి తపస్సు – వివాహవర్ణనం అనే ఇరవై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనత్రింశోఽధ్యాయః – ఇరవై తొమ్మిదవ అధ్యాయం

శంఖచూడరాజ్యకరణవర్ణన–తత్పూర్వభవవృత్తచరిత్ర వర్ణనమ్

శంఖచూడరాజ్యపాలనా వర్ణన, అతడి పూర్వజన్మచరిత్ర వర్ణన

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

స్వగేహమాగతే తస్మిన్ శంఖచూడే వివాహితే ।
తపః కృత్వా వరం ప్రాప్య ముముదుర్దానవాదయః ॥1॥

స్వలోకాదాశు నిర్గత్య గురుణా స్వేన సంయుతాః ।
సర్వేఽసురాస్సమ్మిళితాస్సమాజగ్ముస్తదంతికమ్ ॥2॥

శంఖచూడుడు తపస్సు చేసి, వరం పొంది, తులసిని వివాహమాడి ఇంటికి తిరిగి వచ్చినందుకు దానవాదులందరూ ఎంతగానో ఆనందించారు. వారి వారి లోకాల నుంచి బయటకి వచ్చి అసురులందరూ సమ్మిళితులై గురువైన శుక్రాచార్యుణ్ణి ముందు నిలుపుకొని శంఖచూడుడి సన్నిధికి వచ్చారు.

ప్రణమ్య తం సవినయం సంస్తుత్య వివిధాదరాత్ ।
స్థితాస్తత్రైవ సుప్రీత్యా మత్వా తేజస్వినం విభుమ్ ॥3॥

సోఽపి దంభాత్మజో దృష్ట్వాఽఽగతం కులగురుం చ తమ్ ।
ప్రణనామ మహాభక్త్యా సాష్టాంగం పరమాదరాత్ ॥4॥

ప్రభువు మహాతేజస్విగా ఉన్నాడని గ్రహించారు. వినయంగా నమస్కరించారు. ఆదరంతో రకరకాల స్తోత్రాలు చేశారు. భక్తిగా అక్కడనే నిలబడ్డారు. దంభపుత్రుడు శంఖచూడుడు అప్పుడు వారినందరినీ చూసి, కులగురువు శుక్రుణ్ణి గమనించి ఎంతో భక్తితో ఎంతో ఆదరంతో సాష్టాంగనమస్కారం చేశాడు.

అథ శుక్రః కులాచార్యో దృష్ట్వాశిషమనుత్తమమ్ ।
వృత్తాంతం కథయామాస దేవదానవయోస్తదా ॥5॥

స్వాభావికం చ తద్వైరమసురాణాం పరాభవమ్ ।
విజయం నిర్జరాణాం చ జీవసాహాయ్యమేవ చ ॥6॥

తతస్స సమ్మతం కృత్వాఽఽసురైస్సర్వైస్సముత్సవమ్ ।
దానవాద్యసురాణాం తమధిపం విదధే గురుః ॥7॥

తదా సముత్సవో జాతోఽసురాణాం ముదితాత్మనామ్ ।
ఉపాయనాని సుప్రీత్యా దదుస్తస్మై చ తేఽఖిలాః ॥8॥

కులగురువు శుక్రుడు శిష్యుణ్ణి ఉత్తమోత్తమంగా ఆశీర్వదించాడు. దేవదానవులకున్న స్వాభావిక జాతివైరాన్నీ దానవులకు జరిగిన పరాభవాలనూ, బృహస్పతి సహాయంతో దేవతలు పొందిన విజయాలనూ సవిస్తరంగా దంభపుత్రుడికి తెలియజెప్పాడు. అసుర–రాక్షస–దానవాది జాతుల వారినందరినీ సమ్మతింపజేసి శంఖచూడుణ్ణి అందరికీ అధిపతిని చేశాడు. ఆనందతుందిలులై అసురజాతులవారు పండుగ చేసుకున్నారు. అందరూ వినయవిధేయతలతో అధినాయకుడికి కానుకలు సమర్పించారు.

అథ దంభాత్మజో వీరశ్శంఖచూడః ప్రతాపవాన్ ।
రాజ్యాభిషేకమాసాద్య స రేజే సురరాడ్యథా ॥9॥

స సేనాం మహతీం కర్షన్ దైత్యదానవరక్షసామ్ ।
రథమాస్థాయ తరసా జేతుం శక్రపురీం యయౌ ॥10॥

గచ్ఛన్ స దానవేంద్రస్తు తేషాం సేవనకుర్వతామ్ ।
విరేజే శశివద్భానాం గ్రహాణాం గ్రహరాడివ ॥11॥

మహావీరుడు, మహాప్రతాపశాలి దంభాత్మజుడు ఆ శంఖచూడుడు అలా రాజ్యాభిషిక్తుడై సింహాసనం మీద దేవేంద్రుడిలా ప్రకాశించాడు. వెంటనే దైత్య–దానవ–రాక్షస మహాసైన్యాన్ని సమాయత్తం చేసి తానొక రథమధిరోహించి ఇంద్రనగరం (అమరావతి) మీదకు దండుయాత్ర చేశాడు. అందరి సేవలూ అందుకొంటూ అగ్రభాగాన నడుస్తున్న శంఖచూడుడు ఒక చంద్రబింబంలాగా ఒక సూర్యగోళంలాగా విరాజిల్లాడు.

ఆగచ్ఛంతం శంఖచూడమాకర్ణ్యాఖండలః స్వరాట్ ।
నిఖిలైరమరైస్సార్ధం తేన యోద్ధుం సముద్యతః ॥12॥

తథా సురైస్సురాణాం చ సంగ్రామస్తుములో హ్యభూత్ ।
వీరానందకరః క్లీబభయదో రోమహర్షణః ॥13॥

శంఖచూడుడు దండెత్తి వస్తున్నాడని విన్నాడు స్వర్గాధిపతి దేవేంద్రుడు. వెంటనే సమస్తదేవతలనూ యుద్ధానికి సిద్ధం చేశాడు. సురాసురులకు తుములసంగ్రామం ప్రారంభమయ్యింది. అది వీరులకు ఆనందం కలిగిస్తే ధీరులకు భయం పుట్టించింది. అందరికీ రోమహర్షణమయ్యింది.

మహాన్ కోలాహలో జాతో వీరాణాం గర్జతాం రణే ।
వాద్యధ్వనిస్తథా చాసీత్తత్ర వీరత్వవర్ధనీ ॥14॥

దేవాః ప్రకుప్య యుయుధురసురైర్బలవత్తరాః ।
పరాజయం చ సంప్రాపురసురా దుద్రువుర్భయాత్ ॥15॥

పలాయమానాంస్తాన్ దృష్ట్వా శంఖచూడః స్వయం ప్రభుః ।
యుయుధే నిర్భరైస్సైకం సింహనాదం ప్రగర్జ చ ॥16॥

గర్జిస్తున్న ధీరులూ, శంఖభేరీ ధ్వనులూ సైనికుల్లో శౌర్యాన్ని పెంచుతూ రణరంగాన్ని కోలాహలం చేశాయి. దేవతలు మహాకోపనులై రెట్టించిన బలంతో తెగించి పోరాడారు. అసురులు పరాజయం పాలై భయంతో పరుగులు తీశారు. అలా పారిపోతున్న తన సైనికుల్ని చూసి దానవప్రభువు శంఖచూడుడు సింహనాదం చేస్తూ వచ్చి నిర్జరులతో తానే తలపడ్డాడు.

తరసా సహసా చక్రే కదనం త్రిదివౌకసామ్ ।
ప్రదుద్రువుస్సురాస్సర్వే తత్సుతేజో న సేహిరే ॥17॥

యత్ర యత్ర స్థితా దీనా గిరీణాం కందరాసు చ ।
తదధీనా న స్వతంత్రా నిష్ప్రభాః సాగరా యథా ॥18॥

అతివేగంగా అతిసాహసంగా శంఖచూడుడు యుద్ధం చేశాడు. అతడి తేజఃపరాక్రమాలను తట్టుకోలేక దేవతలందరూ పలాయనం చిత్తగించారు. ఎక్కడెక్కడో కొండగుహల్లో దాక్కున్నవారు కూడా కడపటికి దానవేంద్రుడికి లొంగిపోయారు. అస్వతంత్రులు (బానిసలు) అయ్యారు. కళాకాంతులు కోల్పోయారు. గడ్డకట్టిన సాగరాలైపోయారు.

సోఽపి దంభాత్మజః శూరో దానవేంద్రః ప్రతాపవాన్ ।
సురాధికారాన్ సంజహ్రే సర్వాన్ లోకాన్ విజిత్య చ ॥19॥

త్రైలోక్యం స్వవశం చక్రే యజ్ఞభాగాంశ్చ కృత్స్నశః ।
స్వయమింద్రో బభూవాపి శాసితం నిఖిలం జగత్ ॥20॥

మహాశూరుడు మహాప్రతాపశాలి దానవేంద్రుడు దంభతనూజుడూ ఆ శంఖచూడుడు క్రమక్రమంగా సకలలోకాలనూ జయించాడు. దేవతల అధికారాలను అన్నింటినీ హస్తగతం చేసుకున్నాడు. ముల్లోకాలూ అతడికి వశమయ్యాయి. యజ్ఞభాగాలను పూర్తిగా స్వాయత్తం చేసుకున్నాడు. తానే ఇంద్రుడయ్యాడు. నిఖిలజగత్తుకూ శాసకుడయ్యాడు.

కౌబేరమైందవం సౌర్యమాగ్నేయం యామ్యమేవ చ ।
కారయామాస వాయవ్యమధికారం స్వశక్తితః ॥21॥

దైవానామసురాణాం చ దానవానాం చ రక్షసామ్ ।
గంధర్వాణాం చ నాగానాం కిన్నరాణాం రసౌకసామ్ ॥22॥

త్రిలోకస్య పరేషాం చ సకలా మధీశ్వరః ।
స బభూవ మహావీరశ్శంఖచూడో మహాబలీ ॥23॥

ఏవం స బుభుజే రాజ్యం రాజరాజేశ్వరో మహాన్ ।
సర్వేషాం భువనానాం చ శంఖచూడశ్చిరం సమాః ॥24॥

కుబేర–చంద్ర–సూర్య–అగ్ని–యమ–వాయువుల అధికారాలను తానే స్వశక్తితో నిర్వహించనారంభించాడు. దేవ–అసుర–దానవ–రాక్షస–గంధర్వ–నాగ–కిన్నర–మానవ (రసౌకసులు–భూలోకవాసులు) జాతులతో పాటు

ఇంకా తక్కిన జాతుల వారందరూ అతడికి వశులై శంఖచూడుడు త్రిలోకాధీశ్వరుడయ్యాడు. ఇలా ఆ మహాబలిష్ఠుడు సకలభువనాలకూ మహారాజరాజేశ్వరుడై ఎన్నో సంవత్సరాలు రాజ్యభోగాలను అనుభవించాడు.

తస్య రాజ్యే న దుర్భిక్షం న మారీ నాశుభగ్రహాః ।
ఆధయో వ్యాధయో నైవ సుఖిన్యశ్చ ప్రజాస్సదా ॥25॥

అకృష్టపచ్యా పృథివీ దదౌ సస్యాన్యనేకశః ।
ఓషధ్యో వివిధాశ్చాసన్ సఫలాస్సరసాస్సదా ॥26॥

మణ్యాకారాశ్చ నితరాం రత్నాఖన్యశ్చ సాగరాః ।
సదా పుష్పఫలా వృక్షా నద్యస్సుసలిలావహాః ॥27॥

అతడి రాజ్యపాలనలో దుర్భిక్షం లేదు. మహమ్మారి రోగాలు లేవు. అశుభగ్రహాల పీడలు లేవు. ఆధులు లేవు. వ్యాధులు లేవు. ప్రజలందరూ అన్నివేళలా సుఖసంతోషాలతో వర్ధిల్లారు. భూదేవి దున్నకండానే పంటలు పండి ధాన్యసమృద్ధిని కలిగించింది. ఓషధులూ అలాగే వృద్ధి చెందాయి. ఫలసమృద్ధి రససమృద్ధి అందించాయి. సముద్రాలు మణులతో రత్నాలతో కళకళలాడాయి. చెట్లన్నీ అన్నివేళలా పుష్పఫలాలతో పరిఢవిల్లాయి. నదులు తేటనీటితో నిండుగా ప్రవహించాయి.

దేవాన్ వినాఖిలా జీవాస్సుఖినో నిర్వికారకాః ।
స్వస్వధర్మాస్థితాస్సర్వే చతుర్వర్ణాశ్రమాః పరే ॥28॥

తస్మిన్ శాసతి త్రైలోక్యే న కశ్చిద్దుఃఖితో ఽభవత్ ।
భ్రాతృవైరత్వమాశ్రిత్య కేవలం దుఃఖినోఽమరాః ॥29॥

అతడి ఏలుబడిలో ఒక్క దేవతలు తప్ప తక్కిన జీవరాశులన్నీ ఏ వికారాలూ లేకుండా సుఖంగా జీవించాయి. చాతుర్వర్ణ్యాలవారూ ఇతరులూ తమతమ ధర్మాలకు కట్టుబడి హాయిగా జీవించారు. ఒక్క మాటలో చెప్పాలంటే – దాయాదులవ్వటం వల్ల (అప్పచెల్లెళ్ళ పిల్లలు) దేవతలు మాత్రం దుఃఖించారు కానీ ముల్లోకాలలోనూ ఉన్న తక్కినవారంతా సుఖంగానే ఉన్నారు.

స శంఖచూడః ప్రబలః కృష్ణస్య పరమస్సఖా ।
కృష్ణభక్తిరతస్సాధుస్సదా గోలోకవాసినః ॥30॥

పూర్వశాపప్రభావేణ దానవీం యోనిమాశ్రితః ।
న దానవమతిస్సోఽభూత్ దానవత్వేఽపి వై మునే ॥31॥

తతస్సురగణాస్సర్వే హృతరాజ్యాః పరాజితాః ।
సంమంత్ర్య సర్షయస్తాత ప్రయయుః బ్రహ్మణస్సభామ్ ॥32॥

వ్యాసమునీ! ప్రబలుడయిన శంఖచూడుడు గోలోకవాసి కృష్ణుడికి నెచ్చెలికాడు. కృష్ణభక్తితత్పరుడు. సాధువు. రాధాదేవి శాపం వల్ల దానవజాతిలో పుట్టినా అతడికి దానవబుద్ధులు మాత్రం రాలేదు. దేవతలనందరినీ జయించి

వారి రాజ్యాలు హరించాడు గదా! అందుకని వారూ ఋషులూ చర్చించుకుని అంతా కలిసి బ్రహ్మసభకు బయలుదేరి వెళ్ళారు.

తత్ర దృష్ట్వా విధాతారం నత్వా స్తుత్వా విశేషతః ।
బ్రహ్మణే కథయామాసుస్సర్వం వృత్తాంతమాకులాః ॥33॥

బ్రహ్మా తదా సమాశ్వాస్య సురాన్ సర్వాన్ మునీనపి ।
తైశ్చ సార్ధం యయౌ లోకే వైకుంఠం సుఖదం సతామ్ ॥34॥

దదర్శ తత్ర లక్ష్మీశం బ్రహ్మా దేవగణైస్సహ ।
కిరీటినం కుండలినం వనమాలావిభూషితమ్ ॥35॥

శంఖచక్రగదా పద్మధరం దేవం చతుర్భుజమ్ ।
సనందనాద్యైస్సిద్ధైశ్చ సేవితం పీతవాససమ్ ॥36॥

దృష్ట్వా విష్ణుం సురాస్సర్వే బ్రహ్మాద్యాస్సమునీశ్వరాః ।
ప్రణమ్య తుష్టువుర్భక్త్యా బద్ధాంజలికరా విభుమ్ ॥37॥

బ్రహ్మసభలో విధాతను దర్శించి నమస్కరించి విశేషంగా స్తుతించారు. ఆకులచిత్తులై సమస్తవృత్తాంతాన్నీ బ్రహ్మదేవుడికి విన్నవించారు. ఆలకించిన చతుర్ముఖుడు దేవతలనూ మునులనూ అందరినీ ఓదార్చాడు. అందరినీ వెంట దీసుకుని సజ్జనులకు సుఖప్రదంగా ఉండే వైకుంఠానికి వెళ్ళాడు. అక్కడ లక్ష్మీపతిని దర్శించాడు. కిరీట-కుండల-వనమాలా విభూషితుడు, శంఖ-చక్ర-గదా పద్మధారి, చతుర్భుజవిరాజితుడు, సనందనాది సిద్ధులతో సేవలందుకుంటున్న పీతాంబరధారి - శ్రీమహావిష్ణువును బ్రహ్మాదిదేవతలు అందరూ దర్శించారు. శిరసా నమస్కరించారు. అంజలిబంధంతో నిలిచి భక్తిగా స్తుతించారు.

దేవా ఊచుః - దేవతలు అన్నారు.

దేవదేవ జగన్నాథ వైకుంఠాధిపతే ప్రభో ।
రక్షాస్మాన్ శరణాపన్నాన్ శ్రీహరే త్రిజగద్గురో ॥38॥

త్వమేవ జగతాం పాతా త్రిలోకేశాచ్యుత ప్రభో ।
లక్ష్మీనివాస గోవింద భక్తప్రాణ నమోఽస్తుతే ॥39॥

ఇతి స్తుత్వా సురాస్సర్వే రురుదుః పురతో హరేః ।
తచ్ఛ్రుత్వా భగవాన్విష్ణుః బ్రహ్మాణమిదమబ్రవీత్ ॥40॥

దేవదేవా! జగన్నాథా! వైకుంఠాధిపతీ! మహాప్రభూ! శ్రీహరీ! జగద్గురూ! శరణాగతులం. మమ్మల్ని కాపాడుస్వామీ! త్రిలోకేశా! అచ్యుతా! జగత్తులకు నువ్వే రక్షకుడివి. లక్ష్మీనివాసమా! గోవిందా! భక్తులకు ప్రాణప్రదుడా!

నీకిదే వందనం–అని స్తుతించి దేవతలందరూ గోవిందుడి ముందట దీనంగా విలపించారు. అంతా విని శ్రీమహావిష్ణువు బ్రహ్మతో ఇలా పలికాడు.

విష్ణురువాచ – విష్ణువు అడిగాడు.

కిమర్థమాగతోఽసి త్వం వైకుంఠం యోగిదుర్లభమ్ ।
కిం కష్టం తే సముద్భూతం తత్త్వం వద మమాగ్రతః ॥41॥

విధాతా! మహాయోగులకు సైతం దుర్లభమైన ఈ వైకుంఠానికి ఎందుకోసం వచ్చావు? నీకు వచ్చిన కష్టమేమిటి? నాముందు నిజం చెప్పు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇతి శ్రుత్వా హరేర్వాక్యం ప్రణమ్య చ ముహుర్ముహుః ।
బద్ధాంజలిపుటో భూత్వా వినయానతకంధరః ॥42॥

వృత్తాంతం కథయామాస శంఖచూడకృతం తదా ।
దేవకష్టసమాఖ్యానం పురో విష్ణోః పరాత్మనః ॥43॥

హరిస్తద్వచనం శ్రుత్వా సర్వతస్సర్వభావవిత్ ।
ప్రహస్యోవాచ భగవాన్ తద్రహస్యం విధిం ప్రతి ॥44॥

వ్యాసమహర్షీ! శ్రీహరి ప్రశ్నను విని చతుర్ముఖుడు బహుధా నమస్కరించి వినయంతో వంగి నమస్కార బంధంతో నిలిచి శంఖచూడుడి వృత్తాంతాన్నంతటినీ విన్నవించాడు. దేవతలకు వచ్చిపడిన కష్టాన్ని గురించి కూడా పరమాత్మకు శ్రీహరికి వివరించాడు. అన్నివేళలా అన్నింటా అందరి అంతరంగభావనలనూ గ్రహించగలిగిన శ్రీహరి బ్రహ్మదేవుడి మాటలు విని పెద్దగా నవ్వి అందులో ఉన్న రహస్యాన్ని అతడికి తెలియపరిచాడు.

శ్రీభగవానువాచ – శ్రీభగవానుడు పలికాడు.

శంఖచూడస్య వృత్తాంతం సర్వం జానామి పద్మజ ।
మద్భక్తస్య చ గోపస్య మహాతేజస్వినః పురా ॥45॥

శృణుతస్సర్వవృత్తాంతమితిహాసం పురాతనమ్ ।
సందేహో నైవ కర్తవ్యశ్శం కరిష్యతి శంకరః ॥46॥

సర్వోపరిచయస్యాస్తి శివలోకః పరాత్పరః ।
యత్ర సంరాజతే శంభుః పరబ్రహ్మ పరేశ్వరః ॥47॥

పద్మసంభవా! శంఖచూడుడి వృత్తాంతమంతా నేను ఎరుగుదును. పూర్వజన్మలో అతడొకగోపకుడు. నా భక్తుడు, మహాతేజస్వి. పురాతనమైన ఈ వృత్తాంతాన్ని అంతటినీ వినండి. సందేహించకండి. శంకరుడు నిజంగా

మీకు శుభకరుడే అవుతాడు. అన్నిలోకాలకన్న పైని ఉంది శివలోకం, పరాత్పరుడు పరబ్రహ్మ పరేశ్వరుడు శంభుడు అక్కడ విరాజిల్లుతూ ఉంటాడు.

ప్రకృతేః పురుషస్యాపి యోఽధిష్ఠాతా త్రిశక్తిధృక్ ।
నిర్గుణస్సగుణస్సోఽపి పరం జ్యోతిస్స్వరూపవాన్ ॥48॥

యస్యాంగజాస్తు వై బ్రహ్మన్ త్రయః సృష్ట్యాదికారకాః ।
సత్త్వాదిగుణసంపన్నా విష్ణుబ్రహ్మహరాభిధాః ॥49॥

స ఏవ పరమాత్మా హి విహరత్యుమయా సహ ।
యత్ర మాయావినిర్ముక్తో నిత్యానిత్యప్రకల్పకః ॥50॥

ఆ శంకరుడే ప్రకృతి పురుషులకు అధిష్ఠానదేవత. మూడు శక్తులూ అతడికే ఉన్నాయి. అతడు నిర్గుణుడూ సగుణుడూను. పరంజ్యోతి స్వరూపుడు. బ్రహ్మా! సృష్టి-స్థితి-లయకారకాలైన సత్త్వరజస్తమోగుణాలూ వాటికి ప్రతిరూపాలైన విష్ణుబ్రహ్మహరులూ అతడి తనువు నుంచి ఆవిర్భూతాలు. ఆ పరమాత్మ ఉమాదేవితో కలిసి నిత్యత్వాన్నీ అనిత్యత్వాన్నీ కల్పిస్తూ మాయావినిర్ముక్తుడై ఆ లోకంలో విహరిస్తూ ఉంటాడు.

తత్సమీపే చ గోలోకో గోశాలా శంకరస్య వై ।
తస్యేచ్ఛయా చ మద్రూపః కృష్ణో వసతి తత్ర హ ॥51॥

తద్గవాం రక్షణార్థాయ తేనాజ్ఞప్తస్సదా సుఖీ ।
తత్సంప్రాప్తసుఖస్సోఽపి సంక్రీడతి విహారవిత్ ॥52॥

తస్య నారీ సమాఖ్యాతా రాధేతి జగదంబికా ।
ప్రకృతేః పరమా మూర్తిః పంచమీ సువిహారిణీ ॥53॥

బహుగోపాశ్చ గోప్యశ్చ తత్ర సంతి తదంగజాః ।
సువిహారపరా నిత్యం రాధాకృష్ణానువర్తినః ॥54॥

స ఏవ లీలయా శంభోరిదానీం మోహితోఽనయా ।
సంప్రాప్తో దానవీం యోనిం ముధా శాపాత్ స్వదుఃఖదామ్ ॥55॥

ఆ శివలోకానికి సమీపంలోనే గోలోకం. అక్కడే శంకరుడి గోశాల. శివుడి ఇచ్ఛానుసారం నా రూపంతోనే ఉండే కృష్ణుడు అక్కడ నివసిస్తూ ఉంటాడు. అక్కడున్న గోవుల్ని ఆలించడం పాలించడం అనేవి శివుడిచ్చిన ఆజ్ఞలు. అవి నెరవేరుస్తూ కృష్ణుడు ఆ గోలోకంలో నిరంతరం సుఖంగా వసిస్తున్నాడు. శివుడు కల్పించిన సౌకర్యాలతో విహారవేత్త ఆ కృష్ణుడు గోలోకంలో క్రీడిస్తున్నాడు. అతడి ఇల్లాలు- జగదంబిక రాధాదేవి. విహారప్రియ. ప్రకృతి ధరించిన అయిదవ రూపం (త్రిమూర్తులు+మహాశివుడు+రాధాదేవి=5). వీరి అంశాంశావతారాలుగా ఎందరెందరో గోపికలు, గోపకులు ఆలోకంలో ఈ రాధాకృష్ణులను అనువర్తిస్తూ ఉంటారు. వారిలో ఒక గోపకుడు సుదాముడు.

అతడు–శివుడి లీలప్రకారం సమ్మోహితుడై రాధాదేవి శాపానికి అనవసరంగా గురియై దుఃఖదాయకమైన దానవజాతిలో ఇలా శంఖచూడుడిగా అవతరించాడు.

రుద్రశూలేన తన్మృత్యుః కృష్ణేన విహితః పురా ।
తతస్స్వదేహముత్సృజ్య పార్షదస్స భవిష్యతి ॥56॥

ఇతి విజ్ఞాయ దేవేశ న భయం కర్తుమర్హసి ।
శంకరం శరణం యావస్స సద్యశ్శం విధాస్యతి ॥57॥

అహం త్వం చామరాస్సర్వే తిష్ఠంతీహ విసాధ్వసాః ॥58॥

రుద్రుడి శూలంతోనే ఆ దానవుడి మరణమని కృష్ణుడు అలనాడే నిశ్చయించాడు. అటుపైన దానవరూపం వదిలేసి సుదాముడు మళ్ళీ తన చెలికాడు అవుతాడు. ఇదీ శంఖచూడుడి వృత్తాంతం. కనక చతుర్ముఖా! భయం వద్దు. శంకరుణ్ని శరణువేడదాం. అతడే శీఘ్రంగా మనకు సుఖం కలిగిస్తాడు. నేనూ నువ్వూ తక్కిన దేవతలూ నిర్భయంగా ఉందాం.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా సవిధిర్విష్ణుః శివలోకం జగామ హ ।
సంస్మరన్మనసా శంభుం సర్వేశం భక్తవత్సలమ్ ॥59॥

ఇలా చెప్పి శ్రీహరి సర్వేశుడూ భక్తవత్సలుడూ అయిన శంభుణ్ని మనస్సులో స్మరిస్తూ బ్రహ్మదేవుణ్ని వెంటబెట్టుకుని శివలోకానికి వెళ్ళాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధోపాఖ్యానే శంఖచూడరాజ్యకరణవర్ణన, తత్పూర్వభవవృత్తచరిత్రవర్ణనం నామైకోనత్రింశోఽధ్యాయః ॥29॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడ వధోపాఖ్యానంలో శంఖచూడరాజ్యపాలనం, అతని పూర్వజన్మచరిత్రవర్ణనం అనే ఇరవై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

త్రింశోఽధ్యాయః – ముప్పైయవ అధ్యాయం
దేవదేవ స్తుతి – దేవదేవ స్తుతి

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

గత్వా తదైవ సవిధిస్తదా వ్యాస రమేశ్వరః ।
శివలోకం మహాదివ్యం నిరాధారమభౌతికమ్ ॥1॥

సాహ్లాదోఽభ్యంతరం విష్ణుర్జగామ ముదితాననః ।
నానారత్నపరిక్షిప్తం విలసంతం మహోజ్జ్వలమ్ ॥2॥

సంప్రాప్య ప్రథమం ద్వారం విచిత్రం గణసేవితమ్ ।
శోభితం పరయా లక్ష్మ్యా మహోచ్చమతిసుందరమ్ ॥3॥

దదర్శ ద్వారపాలాంశ్చ రత్నసింహాసనస్థితాన్ ।
శోభితాన్ శ్వేతవస్త్రైశ్చ రత్నభూషణభూషితాన్ ॥4॥

వ్యాసమునీ! అలా రమేశ్వరుడు బ్రహ్మతో కలిసి శివలోకానికి వెళ్ళాడు. అది మహాదివ్యమూ నిరాధారమూ అభౌతికమూ అయిన శివలోకం. ఆనందంగా చిరునవ్వులు చిందిస్తూ విష్ణుమూర్తి అభ్యంతర మందిరం వైపు నడిచాడు. అది అనేకరత్నవిభూషితం. మహోజ్జ్వలంగా ప్రకాశిస్తున్న భవనం. దాని మొదటి కక్ష్య ద్వారం చేరుకున్నాడు. అది చాలా విచిత్రమైన ద్వారం. శివగణాలు కాపలా ఉన్నారు. పరకోటికి చేరిన శోభతో చాలా ఎత్తుగా చాలా సుందరంగా ఉంది ఆ ద్వారం. అక్కడున్న ద్వారపాలకులు రత్నసింహాసనాల మీద కూర్చున్నారు. శ్వేతవస్త్రాలూ రత్నభూషణాలతో మహోజ్జ్వలంగా ఉన్నారు.

పంచవక్త్రత్రినయనాన్ గౌరసుందరవిగ్రహాన్ ।
త్రిశూలాదిధరాన్ వీరాన్ భస్మరుద్రాక్షశోభితాన్ ॥5॥

సబ్రహ్మాపి రమేశశ్చ తాన్ ప్రణమ్య వినమ్రకః ।
కథయామాస వృత్తాంతం ప్రభుసందర్శనార్థకమ్ ॥6॥

తదాజ్ఞాం చ దదుస్తస్మై ప్రవివేశ తదాజ్ఞయా ।
పరం ద్వారం మహారమ్యం విచిత్రం పరమప్రభమ్ ॥7॥

ప్రభూపకంఠగత్యర్థం వృత్తాంతం సన్న్యవేదయత్ ।
తద్ద్వారపాలాయ చాజ్ఞప్తస్తేనాన్యం ప్రవివేశ హ ॥8॥

అందరూ పంచవక్త్రులే. త్రినేత్రులే. గౌరవర్ణంలో సుందరులే. త్రిశూలాదులు ధరించారు. భస్మరుద్రాక్ష శోభితులు. మహావీరులు. బ్రహ్మతో సహా శ్రీహరి వారికి వినయంగా వంగి నమస్కరించాడు. ప్రభుసందర్శనం కోసం వచ్చామని తమ వృత్తాంతం విన్నవించాడు. అప్పుడు వారు అనుమతించారు. ఇద్దరూ ఆ ద్వారం నుంచి

లోపలికి ప్రవేశించారు. అలాంటిదే మహారమ్యంగా విచిత్రంగా మరోద్వారం కాంతులీనుతోంది. అక్కడా ద్వారపాలకులున్నారు. అలాగే వారికీ విన్నవించుకొని అనుమతి పొంది లోపలికి ప్రవేశించారు.

ఏవం పంచదశద్వారాన్ ప్రవిశ్య కమలోద్భవః ।
మహాద్వారం గతస్తత్ర నందినం ప్రదదర్శ హ ॥9॥

సమ్యగ్ నత్వా చ తం స్తుత్వా పూర్వవత్తేన నందినా ।
ఆజ్ఞప్తశ్చ శనైర్విష్ణుర్వివేశాభ్యంతరం ముదా ॥10॥

దదర్శ గత్వా తత్రోచ్చైస్సభాం శంభోస్సముత్ప్రభామ్ ।
తాం పార్షదైః పరివృతాం లసద్దేహైస్సుభూషితామ్ ॥11॥

ఇలా పదిహేను ద్వారాలు దాటి ఆ బ్రహ్మవిష్ణువులు మహాద్వారం చేరుకున్నాడు. అక్కడ నందీశ్వరుడి దర్శనమయ్యింది. అతడికీ సమంగా నమస్కరించి స్తుతించి మునుపటిలాగానే అనుమతి పొంది శ్రీహరి నెమ్మదిగా ఆనందంగా అంతఃపుర మందిరంలోకి ప్రవేశించాడు. అక్కడ ఒక పెద్ద సభామంటపం – ప్రభాసమానం – కనిపించింది. అంతటా కాంతులీనుతున్న బంగారమే. ఎక్కడ చూసినా శివుడి అనుచరులే.

మహేశ్వరస్య రూపైశ్చ దిగ్భుజైశ్శుభకాంతిభిః ।
పంచవక్త్రైస్త్రినయనైశ్శితికంఠై ర్మహోజ్జ్వలైః ॥12॥

సద్రత్నయుక్తరుద్రాక్షభస్మాభరణభూషితైః ।
నవేందుమండలాకారాం చతురస్రాం మనోహరామ్ ॥13॥

మణీంద్రహారనిర్మాణహీరసారసుశోభితామ్ ।
అమూల్యరత్నచరితాం పద్మపత్రైశ్చ శోభితామ్ ॥14॥

మాణిక్యజాలమాలాభిర్నానాచిత్రవిచిత్రితామ్ ।
పద్మరాగేంద్రరచితామద్భుతాం శంకరేచ్ఛయా ॥15॥

అందరూ మహేశ్వరుడికి ప్రతిరూపాల్లాగా ఉన్నారు. దీర్ఘబాహులు, శుభతేజస్సులు, పంచవక్త్రులు. త్రినయనులు, శితికంఠులు, మహోజ్జ్వలులు. రత్నహారాలూ రుద్రాక్షలూ భస్మధారణలతో సమలంకృతులు. ఇలాంటి పార్షదులతో నిండిన సభామండపం అది. చతురస్రాకారంలో మనోహరంగా పూర్ణచంద్రమండలంగా ఉంది. మణిహారాలంకృతం. రత్నాలంకృతం. పద్మపత్రాలంకృతం. మాణిక్యాల తోరణాలతో చిత్రవిచిత్రంగా ఉంది. పద్మరాగాలూ ఇంద్రనీలాలూ అంతా అద్భుతంగా ఉంది. శంకరుడు ఇచ్ఛామాత్రంతో నిర్మించిన సభామండపమది.

సోపాన శతకైర్యుక్తాం శ్యమంతకవినిర్మితైః ।
స్వర్ణసూత్రగ్రంథియుక్తైః చారుచందనపల్లవైః ॥16॥

ఇంద్రనీలమణిస్తంభైః వేష్టితాం సుమనోహరామ్ ।
సుసంస్కృతాం చ సర్వత్ర వాసితాం గంధవాయునా ॥17॥

సహస్రయోజనాయామాం సుపూర్ణాం బహుకింకరైః ।
దదర్శ శంకరం సాంబం తత్ర విష్ణుస్సురేశ్వరః ॥18॥

శ్యమంతకమణులతో తాళ్ళకు గుచ్చిన చందనపల్లవాల తోరణాలతో అలరారుతున్న వందమెట్లున్న సభామండపం అది. ఆ మండపం ఇంద్రనీలమణిస్తంభాలమీద నిలిచింది. అతిమనోహరంగా ఉంది. అంతటా పరిశుభ్రంగా ఉంది. సుగంధవాయువీచికలతో ఘుమఘుమలాడుతోంది. వెయ్యి యోజనాల విస్తీర్ణం. అనేకులైన సేవకులతో నిండియుంది. ఆ సభామండపంలో సురేశ్వరుడు శ్రీహరి జగన్మాతతో ఉన్న శంకరుణ్ణి దర్శించాడు.

వసంతం మధ్యదేశే చ యథేందుతారకావృతమ్ ।
అమూల్యరత్ననిర్మాణచిత్రసింహాసనస్థితమ్ ॥19॥

కిరీటినం కుండలినం రత్నమాలా విభూషితమ్ ।
భస్మోద్ధూళితసర్వాంగం బిభ్రతం కేళిపంకజమ్ ॥20॥

పురతో గీతనృత్యం చ పశ్యంతం సస్మితం ముదా ॥21॥

శాంతం ప్రసన్నమనసముమాకాంతం మహోల్లసమ్ ।
దేవ్యా ప్రదత్తతాంబూలం భుక్తవంతం సువాసితమ్ ॥22॥

గణైశ్చ పరయా భక్త్యా సేవితం శ్వేతచామరైః ।
స్తూయమానం చ సిద్ధైశ్చ భక్తినమ్రాత్మకంధరైః ॥23॥

ఆ సభామండపం మధ్యభాగంలో ఉన్నాడు శివుడు. చంద్రతారకావృతుడైనట్టు ప్రకాశిస్తున్నాడు. అమూల్యరత్ననిర్మాణంతో చిత్రంగా ఉన్న సింహాసనం అధిష్ఠించి ఉన్నాడు. కిరీటం కుండలాలు రత్నమాలికలతో అలంకృతుడు. శరీరమంతటా భస్మోద్ధూళితుడు. చేతిలో కేళీపంకజం వహిస్తున్నాడు. ఎట్టయెదుట సాగుతున్న గీతనృత్యాలను చిరునవ్వులతో ఆనందంగా తిలకిస్తున్నాడు. శాంతచిత్తంతో ఉన్నాడు. ప్రసన్న మనస్కుడై ఉ న్నాడు. చాలా ఉల్లాసంగా ఉన్నాడు – ఉమాకాంతుడు. పార్వతీదేవి అందించిన తాంబూలం ఆస్వాదించి పరిమళిస్తున్నాడు. శివగణాలు వింజామరలతో అత్యంతభక్తిగా సేవిస్తున్నారు. సిద్ధజాతివారు భక్తినమ్ర కంధరులై స్తుతిగీతాలు ఆలపిస్తున్నారు. అలాంటి శంకరుణ్ణి తిలకించాడు బ్రహ్మసహితుడై శ్రీహరి.

గుణాతీతం పరేశానం త్రిదేవజనకం విభుమ్ ।
నిర్వికల్పం నిరాకారం సాకారం స్వేచ్ఛయా శివమ్ ॥24॥

అమాయమజమాద్యం చ మాయాధీశం పరాత్పరమ్ ।
ప్రకృతేః పురుషస్యాపి పరమం స్వప్రభుం సదా ॥25॥

ఏవం విశిష్టం తం దృష్ట్వా పరిపూర్ణతమం సమమ్ ।
విష్ణుర్బ్రహ్మా తుష్టువతుః ప్రణమ్య సకృతాంజలీ ॥26॥

శంకరుడు–గుణాతీతుడు. పరేశ్వరుడు. ముమ్మూర్తులకూ జనకుడు, విభుడు, నిర్వికల్పుడు, నిరాకారుడు, సాకారుడు–ఇది అతడి ఇచ్ఛాధీనం. మాయాతీతుడు, అజుడు, ఆద్యుడు, మాయాధీశుడు. పరాత్పరుడు,

ప్రకృతిపురుషులకన్నా పైవాడు. తనకు తానే సదా ప్రభువు. పరిపూర్ణతముడు, సముడు, ఇలా విశిష్టుడైన ఆ శివుణ్ని దర్శించి బ్రహ్మవిష్ణువులు నమస్కరించి అంజలిబంధంతో నిలిచి బహుధా స్తుతించారు.

విష్ణువిధీ ఊచతుః – బ్రహ్మ విష్ణువులు స్తుతించారు.

దేవదేవ మహాదేవ పరబ్రహ్మాఖిలేశ్వర ।
త్రిగుణాతీత నిర్వ్యగ్ర త్రిదేవజనక ప్రభో ॥27॥

వయంతే శరణాపన్నా రక్షాస్మాన్ దుఃఖితాన్విభో ।
శంఖచూడార్దితాన్ క్లిష్టాన్ సన్నాథాన్ పరమేశ్వర ॥28॥

అయం యో ఽధిష్ఠితో లోకో గోలోక ఇతి స స్మృతః ।
అధిష్ఠాతా తస్య విభుః కృష్ణోఽయం త్వదధిష్ఠితః ॥29॥

పార్షదప్రవరస్తస్య సుదామా దైవయంత్రితః ।
రాధాశప్తో బభూవాథ శంఖచూడశ్చ దానవః ॥30॥

దేవాధిదేవా! మహాదేవా! పరబ్రహ్మా! అఖిలేశ్వరా! త్రిగుణాతీతా! వ్యగ్రతా రహితా! త్రిమూర్తులకూ జనకుడా! ప్రభూ! మేమంతా నీకు శరణాగతులం. దుఃఖంలో ఉన్నాం. మమ్మల్ని రక్షించు విభూ! శంఖచూడ పీడితులం. పరమేశ్వరా! నీవంటి ఉత్తమనాథుడు కలిగి ఉండీ మేము క్లేశాలు అనుభవిస్తున్నాం. శంభూ! అల్లదే గోలోకం. దానికి అధిపతి శ్రీకృష్ణుడు. అతడికి అధిపతివి నువ్వు. ఆ కృష్ణుడి సహచరుడు సుదాముడు. దైవవశాత్తు రాధాశప్తుడై శంఖచూడ దానవుడయ్యాడు.

తేన నిస్సారితాశ్శంభో పీడ్యమానాః సమంతతః ।
హృతాధికారాస్త్రిదశా విచరంతి మహీతలే ॥31॥

త్వాం వినా న స వధ్యశ్చ సర్వేషాం త్రిదివౌకసామ్ ।
తం ఘాతయ మహేశాన లోకానాం సుఖమావహ ॥32॥

శంభూ! ఆ శంఖచూడపీడితులై దేవతలు పూర్తిగా పదవులు కోల్పోయి అధికారాలు కోల్పోయి భూలోకంలో అలమటిస్తున్నారు. ఆ దానవుడు నీకు తప్ప ఏ దేవతలకూ వధ్యుడు కాడు. మహేశా! సంహరించు. లోకాలను సుఖపెట్టు.

త్వమేవ నిర్గుణస్సత్యోఽనంతోఽనంతపరాక్రమః ।
సగుణశ్చ సన్నివేశః ప్రకృతేః పురుషాత్పరః ॥33॥

రజసా సృష్టిసమయే త్వం బ్రహ్మా సృష్టికృత్ప్రభో ।
సత్త్వేన పాలనే విష్ణు స్త్రిభువావనకారకః ॥34॥

తమసా ప్రళయే రుద్రో జగత్సంహారకారకః ।
నిస్త్రైగుణ్యే శివాఖ్యాతస్తుర్యో జ్యోతిఃస్వరూపకః ॥35॥

ప్రభూ! నువ్వు నిర్గుణుడివి. సత్యుడివి. అనంతుడివి. అనంతపరాక్రముడివి. సగుణుడివి. సన్నివేశుడివి. ప్రకృతికీ పురుషుడికీ అతీతుడివి. లోకాలను సృష్టించే వేళ రజోగుణంతో నువ్వే బ్రహ్మవై సృష్టి చేస్తావు. సత్త్వగుణంతో శ్రీహరివై నువ్వే త్రిభువనాలనూ ఆలిస్తావు, పాలిస్తావు. ప్రళయవేళలో తమోగుణంతో రుద్రుడివై జగత్తును ఉపసంహరిస్తావు. ఈ త్రిగుణాలకూ అతీతస్థితిలో నువ్వే శివాఖ్యతో నాల్గవదైన జ్యోతిఃస్వరూపంతో వెలుగొందుతుంటావు.

త్వం దీక్షయా చ గోలోకే త్వం గవాం పరిపాలకః ।
త్వద్గోశాలామధ్యగశ్చ కృష్ణః క్రీడత్యహర్నిశమ్ ॥36॥

త్వం సర్వకారణం స్వామీ విధిర్విష్ణ్వీశ్వరః పరమ్ ।
నిర్వికారీ సదా సాక్షీ పరమాత్మా పరమేశ్వరః ॥37॥

దీనానాథసహాయీ చ దీనానాం ప్రతిపాలకః ।
దీనబంధుస్త్రిలోకేశః శరణాగతవత్సలః ॥38॥

అస్మానుద్ధర గౌరీశ ప్రసీద పరమేశ్వర ।
త్వదధీనా వయం నాథ యదిచ్ఛసి తథా కురు ॥39॥

గోలోకంలో నువ్వు దీక్షగా గోవుల్ని పరిపాలిస్తుంటావు. నీ గోశాల మధ్యలో కృష్ణుడు రేయింబవళ్ళు క్రీడిస్తూ ఉంటాడు. స్వామీ! అన్నింటికీ నువ్వే కారణుడివి. బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు ముగ్గురూ నువ్వే. వారికంటే పరాత్పరుడివీ నువ్వే. అయినా నిర్వికారుడివి. సర్వసాక్షివి. పరమాత్మవు. దీనులకూ అనాథులకూ నువ్వే దిక్కు. దీనులకు రక్షకుడివి నువ్వే. దీనబంధూ! త్రిలోకేశా! శరణాగతవత్సలా! గౌరీశా! అనుగ్రహించు. మమ్మల్ని ఉద్ధరించు. నాథా! మేమందరం నీకు అధీనులం. గోడు వెళ్ళబోసుకున్నాం. ఇంక నీ ఇష్టం. ఏది చెయ్యాలనిపిస్తే అది చెయ్యి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా తౌ సురౌ వ్యాస! హరిర్బ్రహ్మా చ వై తదా ।
విరేమతుః శివం నత్వా కరౌ బధ్వా వినీతకౌ ॥40॥

వ్యాసమహర్షీ! బ్రహ్మవిష్ణువులిద్దరూ ఇలా విన్నవించి శివునికి నమస్కరించి చేతులు కట్టుకుని వినయంగా వంగి నిలబడ్డారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధే దేవదేవ స్తుతిర్నామ త్రింశోఽధ్యాయః ॥30॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడ వధోపాఖ్యానంలో దేవదేవస్తుతి అనే ముప్పైయవ అధ్యాయం సమాప్తం.

ఏకత్రింశోఽధ్యాయః – ముప్పై ఒకటవ అధ్యాయం
శివోపదేశమ్ – శివోపదేశం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అథాకర్ణ్య వచశ్శంభుర్హరివిధ్యోస్సుదీనయోః ।
ఉవాచ విహసన్వాణ్యా మేఘనాదగభీరయా ॥1॥

వ్యాసా! అతిదీనులై బ్రహ్మవిష్ణువులు చేసిన ఈ అభ్యర్థనను ఆలకించి శివుడు పెద్దగా నవ్వి మేఘగర్జనలాగా గంభీరమైన కంఠధ్వనితో ఇలా పలికాడు.

శివ ఉవాచ – శివుడు చెప్పాడు.

హే హరే! వత్స హే బ్రహ్మన్! త్యజతం సర్వతో భయమ్ ।
శంఖచూడోద్భవం భద్రం సంభవిష్యత్యసంశయమ్ ॥2॥

శంఖచూడస్య వృత్తాంతం సర్వం జానామి తత్త్వతః ।
కృష్ణభక్తస్య గోపస్య సుదామ్నశ్చ పురా ప్రభో ॥3॥

ఓ హరీ! నాయనా! చతుర్ముఖా! శంఖచూడుడ్ని చూసి మీరింక అస్సలు భయపడకండి. మీ అందరికీ భద్రమే. సంశయం లేదు. వాడి వృత్తాంతం పూర్తిగా నేనెరుగుదును. కృష్ణభక్తుడైన సుదాముడి కథ కూడా నాకు మునుపే తెలుసు.

మదాజ్ఞయా హృషీకేశో కృష్ణరూపం విధాయ చ ।
గోశాలాయాం స్థితో రమ్యే గోలోకే మదధిష్ఠితే ॥4॥

స్వతంత్రోఽహమితి స్వం సమోహం మత్వా గతః పురా ।
క్రీడాస్సమకరోద్బహ్వీ్ః సై్వరవర్తీవ మోహితః ॥5॥

నా ఆజ్ఞమేరకు హృషీకేశుడు కృష్ణరూపం ధరించి గోలోకగోశాలలో నిలిచాడు. గోలోకానికి నేనే అధిపతిని. అయినా కృష్ణుడు సమ్మోహితుడై తనను తాను స్వతంత్రుడిగా భావించాడు. రకరకాల క్రీడలలో మునిగితేలుతూ స్వేచ్ఛావర్తిగా మెలిగాడు.

తం దృష్ట్వా మోహమత్యుగ్రం తస్యాహం మాయయా స్వయా ।
తేషాం సంహృత్య సద్బుద్ధిం శాపం దాపితవాన్ కిల ॥6॥

ఇత్థం కృత్వా స్వలీలాం తాం మాయాం సంహృతవానహమ్ ।
జ్ఞానయుక్తాస్తదా తే తు ముక్తమోహాస్సుబుద్ధయః ॥7॥

సమీపమాగతాస్తే మే దీనీభూయ ప్రణమ్య మామ్ ।
అకుర్వన్ సునుతిం భక్త్యా కరౌ బద్ధ్వా వినమ్రకాః ॥8॥

అతడి మోహం అవధులు దాడటం గుర్తించిన నేను నా మాయతో వారి సద్బుద్ధిని తొలగించి (రాధతో సుదాముడికి) శాపం ఇప్పించాను. అటుపైని వెంటనే నా మాయాలీలను ఉపసంహరించాను. అప్పుడు వారికి జ్ఞానోదయం అయ్యింది. మోహం తొలగింది. బుద్ధిమంతులై నా దగ్గరికి వచ్చారు. దీనంగా నాకు నమస్కరించారు. నుతించారు. భక్తితో నమస్కరిస్తూ చేతులు కట్టుకుని నిలిచారు.

వృత్తాంతమవదన్ సర్వం లజ్జాకులితమానసాః ।
ఊచుర్మత్పురతో దీనా రక్ష రక్షేతి వై గిరః ॥9॥

తదా త్వహం భవస్తేషాం సంతుష్టః ప్రోక్తవాన్ వచః ।
భయం త్యజత హే కృష్ణ యూయం సర్వే మదాజ్ఞయా ॥10॥

రక్షకో ఽహం సదా ప్రీత్యా సుభద్రం వో భవిష్యతి ।
మదిచ్ఛయాఖిలం జాతమిదం సర్వం న సంశయః ॥11॥

స్వస్థానం గచ్ఛ త్వం సార్ధం రాధయా పార్షదేన చ ।
దానవస్తు భవేత్సోఽయం భారతేఽత్ర న సంశయః ॥12॥

శాపోద్ధారం కరిష్యేఽహం యువయోస్సమయే ఖలు ।
మదుక్తమితి సంధార్య శిరసా రాధయా సహ ॥13॥

శ్రీకృష్ణోఽమోదదత్యంతం స్వస్థానమగమత్సుధీః ।
న్యష్ఠాతాం సభయం తత్ర మదారాధనతత్పరౌ ॥14॥

సిగ్గుతో కుంచించుకుపోయాయి వారి మనస్సులు. నా ముందు నిలిచి, జరిగిన వృత్తాంతమంతా చెప్పుకున్నారు. రక్షించు-మమ్మల్ని రక్షించు అని దీనంగా ప్రార్థించారు. అప్పుడు నేను సంతృప్తి చెంది వారికి ఇలా చెప్పాను-హే కృష్ణా! భయపడకండి. మీరంతా నా ఆజ్ఞాబద్ధులు. మీకు నేను ఎల్లవేళలా రక్షకుణ్ని. మీకు భద్రమగుగాక! జరిగినదంతా నా ఇచ్ఛప్రకారమే జరిగింది. సందేహం లేదు. ఈ రాధతో ఈ చెలికాడు సుదాముడితో కలిసి నీ నివాసానికి నువ్వు వెళ్ళు. ఇతడు మాత్రం భారతదేశంలో దానవుడు అవుతాడు. అది తప్పదు. అయితే తగిన సమయం వచ్చినప్పుడు నేనే మీ ఇద్దరికీ రాధాదేవి ఇచ్చిన శాపాన్ని తొలగిస్తాను. శ్రీహరీ! ఇలా నేను చెప్పినదాన్ని శిరసా వహించి బుద్ధిమంతుడైన కృష్ణుడు చాలా ఆనందించి రాధాసమేతుడై గోలోకానికి వెళ్ళిపోయాడు. అక్కడ అత్యంతభయభక్తులతో వాళ్ళందరూ నన్ను తత్పరతతో ఆరాధిస్తూ నివసిస్తున్నారు.

మత్వాఖిలం మదధీనమస్వతంత్రం నిజం చ వై ।
స సుదామాభవద్రాధా శాపతో దానవేశ్వరః ॥15॥

శంఖచూడాభిధో దేవద్రోహీ ధర్మవిచక్షణః ।
క్లిశ్నాతి సుబలాత్ కృత్స్నం సదా దేవగణం కుధీః ॥16॥

మన్మాయా మోహితస్సోఽతిదుష్టమంత్రిసహాయవాన్ ।
తద్భయం త్యజతాశ్వేవ మయి శాస్తరి వై సతి ॥17॥

సమస్తమూ నా అధీనంలోనే ఉన్నదనీ, తానొక అస్వతంత్రుణ్ణి అనీ తెలుసుకున్న సుదాముడు తదనంతరం రాధాశాపం వల్ల దానవేశ్వరుడయ్యాడు. శంఖచూడనామంతో దేవతాద్రోహి అయ్యాడు. ధర్మాధర్మవిచక్షణ ఉన్నవాడే, కానీ నా మాయామోహితుడై దుర్బుద్ధిగా మారి నిరంతరం దేవగణాలను దారుణంగా హింసిస్తున్నాడు– క్లేశపెడుతున్నాడు. దీనికి తోడు దుష్టమంత్రుల సలహాలు ఒకటి. సరే! శ్రీహరీ! నేనున్నానుగా శాసకుణ్ణి. అంచేత మీరు వెంటనే భయం వదలండి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యూచివాన్ శివో యావద్ధరిబ్రహ్మపురః కథామ్ ।
అభవత్తావదన్యచ్చ చరితం తన్మునే శృణు ॥18॥

తస్మిన్నేవాంతరే కృష్ణో రాధయా పార్షదైస్సహ ।
సద్యోపైరాయయౌ శంభుమనుకూలయితుం ప్రభుమ్ ॥19॥

ప్రభుం ప్రణమ్య సద్భక్త్యా మిళిత్వా హరిమాదరాత్ ।
సమ్మతో విధినా ప్రీత్యా సంతస్థౌ శివశాసనాత్ ॥20॥

తతశ్శంభుం పునర్నత్వా తుష్టావ విహితాంజలిః ।
శ్రీకృష్ణో మోహనిర్ముక్తో జ్ఞాత్వా తత్త్వం శివస్య హి ॥21॥

వ్యాసమునీ! శివుడు ఇలా పుర్వగాథను బ్రహ్మ విష్ణువులకు వివరించిన వెంటనే మరొక సంఘటన జరిగింది. చెబుతాను– విను. అదే సమయంలో కృష్ణుడు రాధతో చెలికాండ్రతో కలిసి అక్కడికి వచ్చాడు. గోపకులతో సహా వచ్చాడు. తన ప్రభువైన శంభుణ్ణి ప్రసన్నం చేసుకోవడానికని వచ్చాడు. వస్తూనే భక్తిప్రపత్తులతో శివుడికి నమస్కరించాడు. అక్కడే ఉన్న బ్రహ్మవిష్ణువులను ఆదరంగా ప్రేమగా కలుసుకున్నాడు. శివుడి అనుమతితో చెంత నిలిచాడు. మరొక్కసారి నమస్కరించి–మోహనిర్ముక్తుడై శివతత్త్వాన్ని గ్రహించిన ఆ శ్రీకృష్ణుడు అంజలిబంధంతో అలాగే నిలిచి ఇలా స్తుతించాడు.

శ్రీకృష్ణ ఉవాచ – శ్రీకృష్ణుడు చెప్పాడు.

దేవదేవ మహాదేవ పరం బ్రహ్మ సతాంగతే ।
క్షమస్వ చాపరాధం మే ప్రసీద పరమేశ్వర ॥22॥

దేవాధిదేవా! మహాదేవా! పరబ్రహ్మస్వరూపా! సజ్జనులకు దిక్కయినవాడా! నా అపరాధం క్షమించు. పరమేశ్వరా! కరుణించు.

త్వత్తః శర్వ! చ సర్వం చ త్వయి సర్వం మహేశ్వర ।
సర్వం త్వం నిఖిలాధీశ ప్రసీద పరమేశ్వర ॥23॥

శర్వా! నీనుంచే సమస్తమూ ఆవిర్భవిస్తోంది. మహేశ్వరా! సమస్తమూ నీలోనే ఉంటోంది. సమస్తమూ నువ్వే. అఖిలాధిపతీ! కటాక్షించు.

త్వం జ్యోతిః పరమం సాక్షాత్సర్వవ్యాపీ సనాతనః ।
త్వయా నాథేన గౌరీశ సనాథాస్సకలా వయమ్ ॥24॥

నువ్వు పరంజ్యోతివి. సర్వవ్యాపకుడివి. సనాతనుడివి. నువ్వు పాలకుడివి కనక మేమంతా సనాథులమయ్యాం.

సర్వోపరి నిజం మత్వా విహరన్మోహమాశ్రితః ।
తత్ఫలం ప్రాప్తవానస్మి శాపం ప్రాప్తస్స వామకః ॥25॥

మహేశా! అందరికన్నా నేనే గొప్పవాణ్ణి అనుకున్నాను. మోహంతో కూరుకుపోయాను. దాని ఫలం దక్కింది. అపమార్గంలో నడిచిన వాడికి శాపం లభించింది.

పార్షదప్రవరో యోమే సుదామా నామ గోపకః ।
స రాధాశాపతః స్వామిన్! దానవీం యోనిమాశ్రితః ॥26॥

అతడు నా నెచ్చెలికాడు సుదాముడనే వాడు. రాధాశాపంతో దానవజాతిలో జన్మించాడు.

అస్మానుద్ధర దుర్గేశ ప్రసీద పరమేశ్వర ।
శాపోద్ధారం కురుష్వాద్య పాహి నశ్శరణాగతాన్ ॥27॥

దుర్గేశా! పరమేశా! ప్రసన్నుడివై మమ్మల్ని ఉద్ధరించు. సుదాముడి శాపాన్ని తొలగించు. శరణాగతులం రక్షించు.

ఇత్యుక్త్వా విరరామైవ శ్రీకృష్ణో రాధయా సహ ।
ప్రసన్నోఽభూచ్ఛివస్తత్ర శరణాగతవత్సలః ॥28॥

రాధా సమేతుడై శ్రీకృష్ణుడు శివుణ్ణి ఇలా వేడుకుని విరమించాడు. అప్పుడు వ్యాసా! శరణాగతవత్సలుడైన ఆ శంభుడు ప్రసన్నుడై ఇలా అన్నాడు.

శ్రీశివ ఉవాచ – శివుడు అన్నాడు.

హే కృష్ణ గోపికానాథ భయం త్యజ సుఖీ భవ ।
మయానుగృహ్ణతా తాత సర్వమాచరితం త్విదమ్ ॥29॥

సంభవిష్యతి తే భద్రం గచ్ఛ స్వస్థానముత్తమమ్ ।
స్థాతవ్యం స్వాధికారే చ సావధానతయా సదా ॥30॥

విహరస్వ యథాకామం మాం విజ్ఞాయ పరాత్పరమ్ ।
స్వకార్యం కురు నిర్వ్యగ్రం రాధయా పార్షదైః ఖలు ॥31॥

వారాహ ప్రవరే కల్పే తరుణ్యా రాధయా సహ ।
శాపప్రభావం భుక్త్వా వై పునరాయాస్యసి స్వకమ్ ॥32॥

ఓయీ కృష్ణా! గోపికా వల్లభా! భయపడకు. సుఖంగా ఉండు. నువ్వు ఇదంతా చెయ్యడం కేవలం నా అనుగ్రహంతోనే. నాయనా! నీకు భద్రమవుతుంది. ఉత్తమమైన నీ నివాసస్థానానికి నువ్వు వెళ్ళు. సావధానచిత్తుడివై నీ అధికారంలో నువ్వుండు. నన్ను పరాత్పరుడిగా తెలుసుకుని ఆ ఎరుకతో యథేచ్ఛగా విహరించు. రాధతో

నీ అనుచరులతో కలిసి అవ్యగ్రమనస్కుడివై నీ విధులు నువ్వు నిర్వర్తించు. శ్వేతవరాహకల్పంలో రాధా తరుణితో సహా శాపప్రభావం అనుభవించి మళ్ళీ నీ లోకానికి నువ్వు వస్తావు.

సుదామా పార్షదో యో హి తవ కృష్ణ ప్రియప్రియః ।
దానవీం యోనిమాశ్రిత్యేదానీం క్లిశ్నాతి వై జగత్ ॥33॥

శాపప్రభావాద్రాధాయా దేవశత్రుశ్చ దానవః ।
శంఖచూడాభిదస్సోఽతి దైత్యపక్షీ సురద్రుహః ॥34॥

తేన నిస్సారితా దేవాస్సేంద్రా నిత్యం ప్రపీడితాః ।
హృతాధికారా వికృతాస్సర్వే యాతా దిశో దశ ॥35॥

బ్రహ్మేచ్యుతౌ తదర్థే హీహాగతౌ శరణం మమ ।
తేషాం క్లేశవినిర్మోక్షం కరిష్యే నాత్ర సంశయః ॥36॥

కృష్ణా! నీ చెలికాడు గదా సుదాముడు. నీకు ప్రియాతిప్రియుడు. ప్రస్తుతం దానవజాతిలో జన్మించి జగత్తునంతటినీ క్లేశపెడుతున్నాడు. రాధాదేవి ఇచ్చిన శాపం కారణంగా దానవుడై దేవశత్రువయ్యాడు. అతనికి శంఖచూడుడని ఇప్పటి పేరు. దైత్యపక్షం వాడు. సురల సంహారకుడు. ఇంద్రాది దేవతలంతా నిత్యమూ వాడితో పీడితులే. అందరినీ దేవలోకం నుంచి తరిమేశాడు. వాళ్ళ అధికారాలను లాగేశాడు. అందరూ వికృతులై దిక్కులుబట్టి పారిపోయారు. అది మాట్లాడటానికే ఈ బ్రహ్మవిష్ణువులు ఇదిగో ఇక్కడికి వచ్చారు. నన్ను శరణు జొచ్చారు. దేవతలందరికీ వచ్చిపడిన ఈ క్లేశాన్ని తప్పకుండా తొలగిస్తాను. సంశయం లేదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా శంకరః కృష్ణం పునః ప్రోవాచ సాదరమ్ ।
హరిం విధిం సమాభాష్య వచనం క్లేశనాశనమ్ ॥37॥

వ్యాసమునీ! శంకరుడీ విధంగా ఆదరంతో కృష్ణుడికి చెప్పి శ్రీహరితో బ్రహ్మతో సంభాషించి దేవతల క్లేశాన్ని తొలగించే మాట మరొక్కసారి చెప్పాడు.

శివ ఉవాచ – శివుడు చెప్పాడు.

హే హరే హే విధే ప్రీత్యా మమేదం వచనం శృణు ।
గచ్ఛతం త్వరితం తాతౌ! దేవానందాయ నిర్భయమ్ ॥38॥

కైలాసవాసినం రుద్రం మద్రూపం పూర్ణముత్తమమ్ ।
దేవకార్యార్థముద్భూతం పృథగాకృతిధారిణమ్ ॥39॥

ఏతదర్థే హి మద్రూపః పరిపూర్ణతమః ప్రభుః ।
కైలాసే భక్తవశతస్సంతిష్ఠతి గిరౌ హరే ॥40॥

మత్తస్తత్తో న భేదోఽస్తి యువయోస్సేవ్య ఏవ సః ।
చరాచరాణాం సర్వేషాం సురాదీనాం చ సర్వదా ॥41॥

ఆవయోర్భేదకర్తా యస్స నరో నరకం వ్రజేత్ ।
ఇహాపి ప్రాప్నుయాత్కష్టం పుత్రపౌత్రవివర్జితః ॥42॥

ఓ హరీ! ఓ విధీ! నా మాట శ్రద్ధగా వినండి. దేవతలకి ఆనందదాయకంగా నిర్భయంగా కైలాసాద్రికి వెళ్ళండి. ఆ కైలాసం మీద ఉంటాడు రుద్రుడు. అచ్చం నా రూపంలోనే ఉంటాడు. పూర్ణుడు, ఉత్తముడు, అతడు ఆవిర్భవించినదే దేవకార్యంకోసం. అందుకోసమే పృథగాకృతి ధరించాడు. అతడు సమర్థుడు. పరిపూర్ణతముడు. ఇందుకోసమే నా రూపంలో ఉన్నాడు. భక్తవశంవదుడు కనక శ్రీహరీ! అతడు కైలాసగిరి మీద ఉంటున్నాడు. నాకూ నీకూ అతడికీ భేదం లేదు. మీకిద్దరికీ అతడు సేవ్యుడు. చరాచరప్రాణికోటికీ దేవతాదులందరికీ అన్నివేళలా సంసేవ్యుడు. అతడికీ నాకూ భేదం ఎంచిన నరుడు నరకానికి పోతాడు. ఇహంలోనూ పుత్రపౌత్రాది వివర్జితుడై కష్టాలపాలవుతాడు.

ఇత్యుక్తవంతం దుర్గేశం ప్రణమ్య చ ముహుర్ముహుః ।
రాధయా సహితః కృష్ణః స్వస్థానం సగణో యయౌ ॥43॥

హరిర్బ్రహ్మా చ తౌ వ్యాస సానందౌ గతసాధ్వసౌ ।
ముహుర్ముహుః ప్రణమ్యేశం వైకుంఠం యయతుర్ద్రుతమ్ ॥44॥

తత్రాగత్యాఖిలం వృత్తం దేవేభ్యో వినివేద్య తౌ ।
తానాదాయ బ్రహ్మ విష్ణూ కైలాసం యయతుర్గిరిమ్ ॥45॥

తత్ర దృష్ట్వా మహేశానం పార్వతీవల్లభం ప్రభుమ్ ।
దీనరక్షాత్తదేహం చ సగుణం దేవనాయకమ్ ॥46॥

తుష్టువుః పూర్వవత్సర్వే భక్త్యా గద్గదయా గిరా ।
కరౌ బద్ధ్వా నతస్కంధా వినయేన సమన్వితాః ॥47॥

వ్యాసమునీ! దుర్గేశుడు ఇలా చెప్పే సరికి రాధాకృష్ణులు అతడికి అనేక వందనాలు ఆచరించి పరివార సహితులై నిష్క్రమించారు. తమ గోలోకానికి వెళ్ళి పోయారు. బ్రహ్మ విష్ణువులు కూడా శివుడికి పదే పదే నమస్కరిస్తూ నిర్భయులై సానందులై వెంటనే వైకుంఠానికి బయలుదేరి వెళ్ళారు. వెళ్ళి అక్కడ దేవతలందరికీ ఈ విశేషాలు తెలియజెప్పి అందరినీ వెంటబెట్టుకుని కైలాసాద్రికి చేరుకున్నారు. అక్కడ–మహేశానుడూ పార్వతీవల్లభుడూ ప్రభుడూ దీనరక్షణకోసమే రూపుదాల్చినవాడూ సగుణాకారంలో ఉన్నవాడూ దేవనాయకుడూ అయిన శివుణ్ణి దర్శించారు. వినయంగా వంగి వంగి నమస్కరించారు. అలాగే నిల్చి మునుపటిలాగానే భక్తి తీవ్రత వల్ల జీరవోయిన కంఠాలతో శివుణ్ణి అద్భుతంగా స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు పలికారు.

దేవ దేవ మహాదేవ గిరిజానాథ శంకర ।
వయం త్వాం శరణాపన్నా రక్ష దేవాన్ భయాకులాన్ ॥48॥

శంఖచూడం దానవేంద్రం జహి దేవనిషూదనమ్ ।
తేన విక్లావితా దేవాస్సంగ్రామే చ పరాజితాః ॥49॥

హృతాధికారాః కుతలే విచరంతి యథా నరాః ।
దేవలోకో హి దుర్దృశ్యస్తేషామాసీచ్చ తద్భయాత్ ॥50॥

దీనోద్ధర కృపాసింధో దేవానుద్ధర సంకటాత్ ।
శక్రం భయాన్మహేశాన హత్వా తం దానవాధిపమ్ ॥51॥

ఇతి శ్రుత్వా వచశ్శంభుర్దేవానాం భక్తవత్సలః ।
ఉవాచ విహసన్ వాణ్యా మేఘనాదగభీరయా ॥52॥

దేవదేవా! మహాదేవా! గిరిజానాథా! శంకరా! భయభీతులమై నీ శరణు వేడుతున్నాం. దేవతల్ని మమ్మల్ని రక్షించు స్వామీ! దేవతల్ని సంహరిస్తున్న శంఖచూడుణ్ణి సత్వరం వధించు ప్రభూ! యుద్ధంలో పరాజితులమయ్యాం. మమ్మల్ని వాడు చాలా క్లేశపెడుతున్నాడు. అధికారాలు కోల్పోయి నివాసాలు వదులుకుని భూలోకానికి వెళ్ళి తలదాచుకుని మానవుల్లాగా బతుకుతున్నాం. వాడి భయం వల్ల దేవలోకం మాకు కన్నెత్తి చూడరానిదయ్యింది. దీనజనరక్షకా! దయా సింధూ! ఈ క్లిష్టపరిస్థితి నుంచి దేవతల్ని ఉద్ధరించు. ఆ దానవాధిపతిని సంహరించి ఇంద్రుణ్ణి భయవిముక్తుని చెయ్యి. ఇలా దేవతలు విన్నవించుకోగా శ్రద్ధగా విని భక్తవత్సలుడు శివుడు పెద్దగా నవ్వి మేఘగర్జనవంటి గొంతుతో ఇలా బదులు పలికాడు.

శ్రీశంకర ఉవాచ – శంకరుడన్నాడు.

హే హరే హే విధే దేవాః స్వస్థానం గచ్ఛత ధ్రువమ్ ।
శంఖచూడం వధిష్యామి సగణం నాత్ర సంశయః ॥53॥

ఓ హరీ! ఓ విధీ! ఓ దేవతలారా! మీమీ నివాసాలకు మీరు వెళ్ళండి. కచ్చితంగా శంఖచూడుని నేను సంహరిస్తాను. సపరివారంగా సంహరిస్తాను. సందేహం లేదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య మహేశస్య వచః పీయూషసన్నిభమ్ ।
తే సర్వే ప్రముదా హ్యాసన్ నష్టం మత్వా చ దానవమ్ ॥54॥
హరిర్జగామ వైకుంఠం సత్యలోకం విధిస్తదా ।
ప్రణిపత్య మహేశం చ సురాద్యాః స్వపదం యయుః ॥55॥

అమృతం లాంటి మాట మహేశుడి నోట విని, ఇక దానవేంద్రుడు మరణించినట్టే భావించి దేవతలందరూ పరమానందభరితులయ్యారు. వెంటనే శివుడికి సాష్టాంగపడి శ్రీహరి వైకుంఠానికీ బ్రహ్మదేవుడు బ్రహ్మలోకానికీ దేవతాదులు తమతమ నెలవులకూ నిష్క్రమించారు.

ఇతి శ్రీ శివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధే శివోపదేశో నామ ఏకోనత్రింశోఽధ్యాయః ॥31॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడవధలో శివోపదేశం అనే ముప్పై ఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వాత్రింశోఽధ్యాయః – ముప్పై రెండవ అధ్యాయం
దూతగమనమ్ – దూతగమనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అథేశానో మహారుద్రో దుష్టకాలస్సతాం గతిః ।
శంఖచూడవధం చిత్తే నిశ్చికాయ సురేచ్ఛయా ॥1॥

దూతం కృత్వా చిత్రరథం గంధర్వేశ్వరమీప్సితమ్ ।
శీఘ్రం ప్రస్థాపయామాస శంఖచూడాంతికే ముదా ॥2॥

సర్వేశ్వరాజ్ఞయా దూతో యయౌ తన్నగరం చ సః ।
మహేంద్రనగరోత్కృష్టం కుబేరభవనాధికమ్ ॥3॥

గత్వా దదర్శ తన్మధ్యే శంఖచూడాలయం వరమ్ ।
రాజితం ద్వాదశైర్ద్వారైర్ద్వారపాలసమన్వితమ్ ॥4॥

వ్యాసమునీ! అటుపైని మహారుద్రుడు, దుష్టులకు యముడూ శిష్టులకు రక్షకుడూ అయిన ఈశానుడు దేవతల కోరికమేరకు శంఖచూడుణ్ణి వధించడానికి మనస్సులో నిశ్చయించుకున్నాడు. విచిత్రరథసమన్వితుడూ గంధర్వేశ్వరుడూ తనకు ఇష్టుడూ అయిన పుష్పదంతుణ్ణి తన దూతగా శంఖచూడుని దగ్గరికి వెంటనే పంపించాడు. సర్వేశ్వరుడి ఆజ్ఞ శిరసావహించి పుష్పదంతుడు సత్వరం దానవనగరానికి వెళ్ళాడు. ఆ నగరం–మహేంద్రనగరం కన్నా ఉత్కృష్టంగా ఉంది. ఆ సౌధం కుబేరభవనం కన్నా అద్భుతంగా ఉంది. అందులో శంఖచూడుడి మందిరం. వెళ్ళి చూశాడు. అద్భుతం! పన్నెండు ద్వారాలున్నాయి ఆ మందిరానికి. ప్రతిద్వారం దగ్గరా ద్వారపాలకులున్నారు.

స దృష్ట్వా పుష్పదంతస్తు వరం ద్వారం దదర్శ సః ।
కథయామాస వృత్తాంతం ద్వారపాలాయ నిర్భయః ॥5॥

అతిక్రమ్య చ తద్ద్వారం జగామాభ్యంతరే ముదా ।
అతీవ సుందరం రమ్యం విస్తీర్ణం సమలంకృతమ్ ॥6॥

స గత్వా శంఖచూడం తం దదర్శ దనుజాధిపమ్ ।
వీరమండలమధ్యస్థం రత్నసింహాసనస్థితమ్ ॥7॥

దానవేంద్రైః పరివృతం సేవితం చ త్రికోటిభిః ।
శతకోటిభిరన్యైశ్చ భ్రమద్భిశ్శస్త్రపాణిభిః ॥8॥

ఏవం భూతం చ తం దృష్ట్వా పుష్పదంతస్సవిస్మయః ।
ఉవాచ రణవృత్తాంతం యదుక్తం శంకరేణ చ ॥9॥

ఆ పన్నెండింటిలో ఒకటి ప్రధాన ద్వారం. పుష్పదంతుడు ఆ ప్రధానద్వారం దగ్గరికి వెళ్ళి ద్వారపాలకుడికి నిర్భయంగా తన రాకకు కారణం వివరించాడు. ఆ ద్వారం దాటి ఆనందంగా మందిరం లోపలికి ప్రవేశించాడు. అది అత్యంతసుందరం. అతిరమ్యం. అతివిస్తృతం. సమలంకృతం. అందులో దనుజాధిపుణ్ణి శంఖచూడుణ్ణి దర్శించాడు. వీరమండలం పరివేష్టించగా అతడు వారి మధ్యన సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు. మూడు కోట్ల దానవనాయకులు అతణ్ణి సేవించుకుంటున్నారు. మరో నూరుకోట్ల మంది దానవులూ తదితరులూ ఆయుధపాణులై సంచరిస్తూ కావలి కాస్తున్నారు. ఇలా ఉన్న శంఖచూడుణ్ణి చూసి పుష్పదంతుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. వెంటనే తేరుకుని శంకరుడు చెప్పమన్న రణవృత్తాంతం అతడికి తెలియపరిచాడు.

పుష్పదంత ఉవాచ – పుష్పదంతుడు అన్నాడు.

రాజేంద్ర శివదూతోఽహం పుష్పదంతాభిధః ప్రభో ।
యదుక్తం శంకరేణైవ తచ్ఛృణు త్వం బ్రవీమి తే ॥10॥

దానవరాజేంద్రా! ప్రభూ! నేను శివుడు పంపిన దూతను. నా పేరు పుష్పదంతుడంటారు. శంకరుడి మాట వినిపిస్తున్నాను. ఆలకించు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

రాజ్యం దేహి చ దేవానామధికారం హి సాంప్రతమ్ ।
నోచేత్కురు రణం సార్ధం పరేణ చ మయా సతామ్ ॥11॥

దేవా మాం శరణాపన్నా దేవేశం శంకరం సతామ్ ।
అహం క్రుద్ధో మహారుద్రస్త్వాం వధిష్యామ్యసంశయమ్ ॥12॥

హరోఽస్మి సర్వదేవేభ్యో హ్యభయం దత్తవానహమ్ ।
ఖలదండధరోఽహం వై శరణాగతవత్సలః ॥13॥

శంఖచూడా! దేవతల రాజ్యమూ అధికారాలూ వెంటనే వారివి వారికి ఇచ్చెయ్యి. లేదంటే వారందరికీ పైవాడినైన నాతో యుద్ధం చెయ్యి. నేను దేవతలకు అధిపతిని. సజ్జనులకి శమ్–కరుణ్ణి. దేవతలంతా వచ్చి నన్ను శరణువేడారు. నేను కోపించానంటే మహారుద్రుణ్ణి. నిన్ను నిస్సందేహంగా సంహరిస్తాను. నేను హరుణ్ణి. సకలదేవతలకూ అభయమిచ్చాను. ఖలులపాలిట యముణ్ణి. శరణాగతులపట్ల వత్సలుణ్ణి.

రాజ్యం దాస్యసి కిం వా త్వం కరిష్యసి రణం చ కిమ్ ।
తత్త్వం బ్రూహి ద్వయోరేకం దానవేంద్ర విచార్య వై ॥14॥

దేవతల రాజ్యం దేవతలకి ఇచ్చేస్తావో, నాతో యుద్ధమే చేస్తావో దానవేంద్రా! బాగా ఆలోచించి ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకుని నిజం చెప్పు.

పుష్పదంత ఉవాచ – పుష్పదంతుడు అన్నాడు.

ఇత్యుక్తం యన్మహేశేన తుభ్యం తన్మే నివేదితమ్ ।
వితథం శంభువాక్యం న కదాపి దనుజాధిప ॥15॥

అహం స్వస్వామినం గంతుమిచ్ఛామి త్వరితం హరమ్ ।
గత్వా వక్ష్యామి కిం శంభోస్తథా త్వం వద మామిహ ॥16॥

దనుజాధిపా! మహేశుడు నీకు చెప్పమన్నది యథాతథంగా నివేదించాను. శివుడి మాట ఏనాడూ పొల్లువోదు. నేను త్వరగానాస్వామి చెంతకువెళ్ళాలి. వెళ్ళి హరుడికి ఏమి చెప్పమంటావో తొందరగా తెలియజెయ్యి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్థం చ పుష్పదంతస్య శివదూతస్య సత్పతేః ।
ఆకర్ణ్య వచనం రాజా హసిత్వా తమువాచ సః ॥17॥

వ్యాసమునీ! శివదూతగా వచ్చిన ధార్మికుల ప్రభువు పుష్పదంతుడి నుంచి ఈ మాట విన్నాడు దనుజనాయకుడు. చిన్నగా నవ్వాడు. ఇలా బదులిచ్చాడు.

శంఖచూడ ఉవాచ – శంఖచూడుడు అన్నాడు.

రాజ్యం దాస్యే న దేవేభ్యో వీరభోగ్యా వసుంధరా ।
రణం దాస్యామి తే రుద్ర! దేవానాం పక్షపాతినే ॥18॥

యస్యోపరి ప్రయాయీ స్యాత్స వీరో భువనేఽధమః ।
అతః పూర్వమహం రుద్ర త్వాం గమిష్యామ్యసంశయమ్ ॥19॥

ప్రభాత ఆగమిష్యామి వీరయాత్రా విచారతః ।
త్వం గచ్ఛాచక్ష్వ రుద్రాయ హీదృశం వచనం మమ ॥20॥

రుద్రా! దేవతలకు నేను రాజ్యం ఇవ్వను. ఈ వసుంధర–వీరభోగ్య. కానీ శివా! దేవతాపక్షపాతివి నీకు మాత్రం యుద్ధం అనుగ్రహిస్తాను. ఒకడు దండెత్తి వచ్చాక అతడితో తలపడే వీరుణ్ని ఈ లోకం అధముడంటుంది. అంచేత నేనే ముందుగా నీ మీదకి దండెత్తి వస్తాను. సందేహం లేదు. నేను రేపే ఉదయమే వీరయాత్రకు వస్తున్నాను. పుష్పదంతా! వెళ్ళు, వెళ్ళి రుద్రుడికి నా మాటగా ఇది చెప్పు.

ఇతి శ్రుత్వా శంఖచూడవచనం సుప్రహస్య సః ।
ఉవాచ దానవేంద్రం స శంభుదూతస్తు గర్వితమ్ ॥21॥

అన్యేషామపి రాజేంద్ర గణానాం శంకరస్య చ ।
న స్థాతుం సమ్ముఖే యోగ్యః కిం పునస్తస్య సమ్ముఖమ్ ॥22॥

సత్వం దేహి చ దేవానామధికారాణి సర్వశః ।
త్వమరే గచ్ఛ పాతాళం యది జీవితుమిచ్ఛసి ॥23॥

శంఖచూడుడి మాట వినడంతోనే పుష్పదంతుడు పెద్దగా నవ్వాడు. గర్వంతో విర్రవీగుతున్న ఆ దానవుడికి శంభుదూత ఇలా చెప్పాడు–దానవరాజేంద్రా! శంకరుడి గణాలను ఎదిరించి నిలవలేవు. అలాంటిది శంకరుణ్ణే

ఎదిరించి నిలుస్తావా? నా మాట విని – దేవతల అధికారాలను దేవతలకు ఇచ్చెయ్యి. బ్రతుకు మీద ఆశ ఉంటే ఓరీ! నువ్వు పాతాళానికి వెళ్ళి తలదాచుకో!

సామాన్యమమరం తం నో విద్ధి దానవసత్తమ ।
శంకరః పరమాత్మా హి సర్వేషామీశ్వరేశ్వరః ॥24॥

దానవసత్తమా! శంకరుడంటే సాధారణదేవత అనుకుంటున్నావేమో! కాదు. శంకరుడు పరమాత్మ. ఈశ్వరులకే ఈశ్వరుడు.

ఇంద్రాద్యాస్సకలా దేవా యస్యాజ్ఞావర్తినస్సదా ।
సప్రజాపతయస్సిద్ధా మునయశ్చాప్యహీశ్వరాః ॥25॥

హరేర్విధేశ్చ సస్వామీ నిర్గుణస్సగుణస్సహి ।
యస్య భ్రూభంగమాత్రేణ సర్వేషాం ప్రళయో భవేత్ ॥26॥

ఇంద్రాది సకలదేవతలూ, ప్రజాపతులూ, సిద్ధులూ, మునులూ, నాగాధిపతులూ, అందరూ అతడి కనుసన్నలలో మెలగుతూ ఉంటారు. శ్రీహరికీ బ్రహ్మకూ సైతం అతడే అధిపతి. అతడు నిర్గుణుడూ సగుణుడూ కూడా. అతడి భ్రూభంగమాత్రం చేత అందరికీ ప్రళయమవుతుంది.

శివసః పూర్ణరూపశ్చ లోకసంహారకారకః ।
సతాం గతిర్దుష్టహంతా నిర్వికారః పరాత్పరః ॥27॥

బ్రహ్మణోఽధిపతిస్సోఽపి హరేరపి మహేశ్వరః ।
అవమాన్యం న వై తస్య శాసనం దానవర్షభ ॥28॥

కిం బహూక్తేన రాజేంద్ర మనసా సంవిచార్య చ ।
రుద్రం విద్ధి మహేశానం పరం బ్రహ్మ చిదాత్మకమ్ ॥29॥

దేహి రాజ్యం హి దేవానామధికారాంశ్చ సర్వశః ।
ఏవం తే కుశలం తాత భవిష్యత్యన్యథా భయమ్ ॥30॥

శివుడు పరిపూర్ణరూపుడు. లోకసంహారకర్త. సజ్జనులకు పెద్దదిక్కు. దుష్టులకు సంహారకుడు. అయినా నిర్వికారుడు. పరాత్పరుడు. బ్రహ్మకూ విష్ణువుకూ అధిపతి. మహేశ్వరుడు. దానవోత్తమా! అతడి ఆజ్ఞను నిర్లక్ష్యం చెయ్యకు. ఇన్ని మాటలేల మనస్సులో బాగా ఆలోచించుకో!రుద్రుడంటే మహేశానుడనీ పరంబ్రహ్మమనీ చిత్స్వరూపుడనీ తెలుసుకో. దేవతలకు వారి రాజ్యాన్నీ అధికారాలనూ ఇచ్చేసెయ్యి. అది నీకు క్షేమం. నాయనా! లేదంటే నీకు ముప్పు తప్పదు. కలిగితీరుతుంది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి శ్రుత్వా దానవేంద్రః శంఖచూడః ప్రతాపవాన్ ।
ఉవాచ శివదూతం తం భవితవ్యవిమోహితః ॥31॥

మహాప్రతాపశాలి శంఖచూడుడు ఆ దానవేంద్రుడు పుష్పదంతుడి ఉపదేశం చెవులారా విన్నాడు. కానీ వ్యాసమునీ! భవితవ్యాన్ని ఎవరూ తప్పించుకోలేరు గదా! దానితో సమ్మోహితుడై పుష్పదంతుడికి ఇలా చెప్పాడు.

శంఖచూడ ఉవాచ – శంఖచూడుడు చెప్పాడు.

స్వతో రాజ్యం న దాస్యామి నాధికారాన్ వినిశ్చయాత్ ।
వినా యుద్ధం మమేశేన సత్యమేతద్ర్బవీమ్యహమ్ ॥32॥

కాలాధీనం జగత్సర్వం విజ్ఞేయం సచరాచరమ్ ।
కాలాద్భవతి సర్వం హి వినశ్యతి చ కాలతః ॥33॥

త్వం గచ్ఛ శంకరం రుద్రం మయోక్తం వద తత్త్వతః ।
స చ యుక్తం కరోత్వేవం బహువార్తాం కురుష్వ నో ॥34॥

పుష్పదంతా! నిజం చెబుతున్నాను– విను. మహేశుడితో యుద్ధం చెయ్యకుండా నా అంతట నేనుగా దేవతలకు రాజ్యం కానీ, అధికారాలుగానీ అప్పగించను. ఈ చరాచరజగత్తు అంతా కాలాధీనం. కాలంతో ప్రభవిస్తుంది, కాలంతో నశిస్తుంది. అంచేత ఏది యుక్తమో అది చేయుగాక! అధిక ప్రసంగం చెయ్యకు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా శివదూతోఽసౌ జగామ స్వామినం నిజమ్ ।
యథార్థం కథయామాస పుష్పదంతశ్చ సన్నిధౌ ॥35॥

వ్యాసమునీ! ఇది విని శివదూత పుష్పదంతుడు బయలుదేరాడు. తన ప్రభువు సన్నిధికి చేరుకున్నాడు. పూసగుచ్చినట్టు అంతా కాలాధీనం. కాలంతో ప్రభవిస్తుంది, కాలంతో నశిస్తుంది. అంచేత నువ్వు వెళ్ళు. వెళ్ళి శంకరుడికి నేను చెప్పమన్నది యథాతథంగా చెప్పు. అతడు ఏది యుక్తమో అది చేయుగాక! అధిక ప్రసంగం చెయ్యకు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధే దూతగమనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥32॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడ వధోపాఖ్యానంలో దూతగమనం అనే ముప్పై రెండవ అధ్యాయం సమాప్తం.

త్రయస్త్రింశత్తమోఽధ్యాయః – ముప్పై మూడవ అధ్యాయం

మహాదేవయుద్ధయాత్రావర్ణనమ్ – మహాదేవయుద్ధయాత్రావర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తస్య తద్వాక్యమాకర్ణ్య దూతస్య సురరాట్తతః ।
సక్రోధః ప్రాహ గిరిశో వీరభద్రాదికాన్ గణాన్ ॥1॥

వ్యాసమునీ! శంఖచూడుడి సమాధానం పుష్పదంతుని నోట విన్న గిరిశుడు క్రోధవివశుడయ్యాడు. వీరభద్రాదులైన తన గణనాయకులతో ఇలా అన్నాడు.

రుద్ర ఉవాచ – రుద్రుడు అన్నాడు.

హే వీరభద్ర హే నందిన్ క్షేత్రపాలాష్టభైరవాః ।
సర్వే గణాశ్చ సన్నద్ధాస్సాయుధా బలశాలినః ॥2॥

కుమారాభ్యాం సహైవాద్య నిర్గచ్ఛంతు మమాజ్ఞయా ।
స్వసేనయా భద్రకాళీ నిర్గచ్ఛతు రణాయ చ ॥
శంఖచూడవధార్థాయ నిర్గచ్ఛామ్యద్య సత్వరమ్ ॥3॥

ఓయీ వీరభద్రా! నందీ! క్షేత్రపాలులారా! అష్టభైరవులారా! సమస్తగణవీరులారా! బలశాలులారా! సన్నద్ధులై సాయుధులై గణపతితో గుహుడితో సహా అందరూ యుద్ధానికి బయలుదేరండి. ఇది నా ఆజ్ఞ. భద్రకాళి కూడా తన సేనతో రణరంగానికి బయలుదేరుగాక! ఇదిగో ఇప్పుడే వెంటనే నేనూ బయలుదేరుతున్నాను–శంఖచూడుణ్ని సంహరించడం కోసం.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాజ్ఞాప్య మహేశానో నిర్యయౌ సైన్యసంయుతః ।
సర్వే వీరగణాస్తస్యానుయయుస్సంప్రహర్షితాః ॥4॥

ఏతస్మిన్నంతరే స్కందగణేశౌ సర్వసైన్యపౌ ।
యతతుర్ముదితౌ నద్ధౌ సాయుధౌ చ శివాంతికే ॥5॥

వీరభద్రశ్చ నందీ చ మహాకాలస్సుభద్రకః ।
విశాలాక్షశ్చ బాణశ్చ పింగలాక్షో వికంపనః ॥6॥

ఇలా ఆజ్ఞాపించి వెంటనే మహేశానుడు సేనాసంయుతుడై బయలుదేరాడు. సమస్తవీరగణాలూ హర్షోత్సాహాలతో అతడి వెనుకనే బయలుదేరాయి. అంతలో సర్వసైన్యాధ్యక్షులైన గణేశుడూ స్కందుడూ సాయుధులై

సన్నద్ధులై సానందంగా శివుడి సన్నిధికి చేరుకున్నారు. వీరభద్రుడు, నంది, మహాకాలుడు, సుభద్రకుడు, విశాలాక్షుడు, బాణుడు, పింగళాక్షుడు, వికంపనుడు ఇంకా

విరూపో వికృతిశ్చైవ మణిభద్రశ్చ బాష్కలః ।
కపిలాఖ్యో దీర్ఘదంష్ట్రో వికరస్తామ్రలోచనః ॥7॥

కాలంకరో బలీభద్రః కాలజిహ్వాః కుటీచరః ।
బలోన్మత్తో రణశ్లాఘ్యో దుర్జయో దుర్గమస్తథా ॥8॥

ఇత్యాదయో గణేశానస్సైన్యానాం పతయో పరాః ।
తేషాం చ గణనా వచ్మి సావధానతయా శృణు ॥9॥

విరూపుడు, వికృతి, మణిభద్రుడు, బాష్కలుడు, కపిలుడు, దీర్ఘదంష్ట్రుడు, వికరుడు, తామ్రలోచనుడు, కాలంకరుడు, బలీభద్రుడు, కాలజిహ్వుడు, కుటీచరుడు, బలోన్మత్తుడు, రణశ్లాఘ్యుడు, దుర్జయుడు, దుర్గముడు– ఇత్యాదులైన వరిష్ఠ గణసేనాపతులందరూ తమతమ గణసైన్యాలతో సన్నద్ధులై బయలుదేరారు. వ్యాసమునీ! చెబుతున్నాను, సావధానంగా విను ఆ లెక్కలు.

శంఖకర్ణః కోటిగణైర్యుతః పరవిమర్దకః ।
దశభిః కేకరాక్షశ్చ వికృతోఽష్టాభిరేవ చ ॥10॥

చతుష్షష్ట్యా విశాఖశ్చ నవభిః పారియాత్రికః ।
షడ్భిస్సర్వాంతకః శ్రీమాంస్తథైవ వికృతాననః ॥11॥

జాలకో హి ద్వాదశభిః కోటిభిర్గణపుంగవః ।
సప్తభిస్సమదః శ్రీమాన్ దుందుభోఽష్టాభిరేవ చ ॥12॥

పంచభిశ్చ కరాళాక్షః షడ్భిస్సందారకో వరః ।
కోటికోటిభిరేవేహ కందుకః కుండకస్తథా ॥13॥

విష్టంభోఽష్టాభిరేవేహ గణపస్సర్వసత్తమః ।
పిప్పలశ్చ సహస్రేణ సన్నాదశ్చ తథా విధః ॥14॥

ఆవేశనస్తథాష్టాభిస్త్వష్టభిశ్చంద్రతాపనః ।
మహాకేశః సహస్రేణ కోటీనాం గణపో వృతః ॥15॥

పరవిమర్దకుడు శంఖకర్ణుడు కోటిగణాలతో, కేకరాక్షుడు పదికోట్ల గణాలతో, వికృతుడు ఎనిమిదికోట్లతో, విశాఖుడు అరవైనాలుగు కోట్లతో, పారియాత్రికుడు తొమ్మిది కోట్లతో, సర్వాంతకుడూ శ్రీవికృతాననుడూ ఆరేసి కోట్లతో, గణపుంగవుడు జాలకుడు పన్నెండు కోట్ల గణాలతో, సమదుడు ఏడుకోట్లతో, శ్రీదుందుభుడు ఎనిమిదికోట్లతో, కరాళాక్షుడు అయిదు కోట్లతో, శ్రేష్ఠుడు, సందారకుడు ఆరుకోట్లతో, కందుకుడు ఒకకోటి కుండకుడు మరొక

కోటితో, సర్వోత్తమగణాధిపతి విష్టంభుడు ఎనిమిది కోట్లతో, సన్నాదుడూ పిప్పలుడూ వెయ్యి వెయ్యి కోట్లతో, ఆవేశనుడు ఎనిమిది కోట్లతో, చంద్రతాపనుడు ఎనిమిది కోట్లతో మహాకేశుడు వెయ్యి కోట్లతో బయలుదేరారు.

కుండీ ద్వాదశభిర్వీరస్తథా పర్వతకశ్శుభః ।
కాలశ్చ కాలకశ్చైవ మహాకాలశ్శతేన వై ॥16॥

అగ్నికశ్శతకోట్యా చ కోట్యాగ్నిముఖ ఏవ చ ।
ఆదిత్యో హ్యర్ధకోట్యా చ తథా చైవం ఘనావహః ॥17॥

సన్నాహశ్చ శతేనైవ కుముదః కోటిభిస్తథా ।
అమోఘుః కోకిలశ్చైవ శతకోట్యా సుమంత్రకః ॥18॥

కాకపాదః కోటిషష్ట్యా షష్ట్యా సంతానకస్తథా ।
మహాబలశ్చ నవభిః పంచభిర్మధుపింగళః ॥19॥

నీలో నవత్యా దేవేశః పూర్ణభద్రసథైవ చ ।
కోటీనాం చైవ సప్తానాం చతుర్వక్త్రో మహాబలః ॥20॥

కోటి కోటి సహస్రాణాం శతైర్వింశతిభిస్తథా ।
తత్రాజగ్ముస్తథా వీరాస్తే సర్వే సంగరోత్సవే ॥21॥

మహావీరుడు కుండి పన్నెండు కోట్లతో అలాగే శుభప్రదుడు పర్వతకుడూ కాలుడూ కాలకుడూను. మహాకాలుడైతే ఏకంగా నూరుకోట్ల సైన్యంతో వచ్చాడు. అగ్నికుడూ అంతే. అగ్నిముఖుడు మాత్రం ఒక కోటితోనే వచ్చాడు. ఆదిత్య అరకోటితో, ఘనావహుడు కూడా అలాగే అరకోటితో, సన్నాహుడు నూరుకోట్లతో, కుముదుడు ఒక కోటితో, అమోఘుడూ కోకిలుడూ సుమంత్రకుడూ నూరేసి కోట్లతో, కాకపాదుడు ఆరుకోట్లతో, సంతానకుడు అరవై కోట్లతో, మహాబలుడు తొమ్మిది కోట్లతో, మధుపింగళుడు అయిదు కోట్లతో, నీలుడు తొంభై కోట్లతో, దేవేశుడూ పూర్ణభద్రుడూ చతుర్వక్త్రుడూ మహాబలుడూ ఏడేసి కోట్లతో ఇలా లక్షల వేల వందల కోట్ల సైనికులతో ఆయా గణపతులందరూ మహావీరులు సంగరోత్సవంతో శివుణ్ని చేరుకున్నారు.

భూతకోటిసహస్రేణ ప్రమథైః కోటిభిస్త్రిభిః ।
వీరభద్రశ్చతుష్షష్ట్యా లోమజానాం త్రికోటిభిః ॥22॥

కాష్ఠారూఢశ్చతుష్షష్ట్యా సుకేశో వృషభస్తథా ।
విరూపాక్షశ్చ భగవాంశ్చతుష్షష్ట్యా సనాతనః ॥23॥

తాళకేతుష్షడాస్యశ్చ పంచాస్యశ్చ ప్రతాపవాన్ ।
సంవర్తకస్తథా చైత్రో లంకులీశః స్వయం ప్రభుః ॥24॥

లోకాంతకశ్చ దీప్తాత్మా తథా దైత్యాంతకః ప్రభుః ।
దేవో భృంగీరిటిః శ్రీమాన్ దేవదేవప్రియస్తథా ॥25॥

అశనిర్భానుకశ్చైవ చతుష్టష్ట్యా సహస్రశః ।
కంకాలః కాలకః కాలో నందీ సర్వాంతకస్తథా ॥26॥

ఏతే చాన్యే చ గణపాః అసంఖ్యాతా మహాబలాః ।
యుద్ధార్థం నిర్యయుః ప్రీత్యా శంఖచూడేన నిర్భయాః ॥27॥

భూతకోటి సహస్రంతోనూ, మూడుకోట్ల ప్రమథులతోనూ, అరవైనాలుగుకోట్ల లోమజులతోనూ వీరభద్రుడు బయలుదేరాడు. కాష్మారూధుడు మూడుకోట్లతో, సుకేశుడు అరవైనాలుగు కోట్లతో, వృషభ-విరూపాక్షులు ఒక్కొక్కరూ అరవై నాలుగు కోట్లతో, తాలకేతు-షడాస్య-పంచాస్య-సంవర్తక-లంకులీశ-లోకాంతక-దైత్యాంతకులూ, దేవదేవుడికి అత్యంతప్రియుడైన భృంగీరిటి-అశని-భావుకులూ ఒక్కొక్కరూ అరవైనాలుగు వేల కోట్లతో - ఇంకా ఇలాగే కంకాల-కాలక-కాల-నంది-సర్వాంతకాదులైన గణపతులు అందరూ అసంఖ్యాక మహాసైన్యాలతో నిర్భయంగా ఉత్సాహంగా ఆనందంగా శంఖచూడినితో యుద్ధానికి బయలుదేరి వచ్చారు.

సర్వే సహస్రహస్తాశ్చ జటాముకుటధారిణః ।
చంద్రరేఖావతంసాశ్చ నీలకంఠాస్త్రిలోచనాః ॥28॥

రుద్రాక్షాభరణాస్సర్వే తథా సద్భస్మధారిణః ।
హారకుండల కేయూరముకుటాద్యైరలంకృతాః ॥29॥

బ్రహ్మేంద్ర విష్ణుసంకాశా అణిమాదిగుణైర్యుతాః ।
సూర్యకోటిప్రతీకాశాః ప్రవీణా యుద్ధకర్మణి ॥30॥

పృథివీచారిణః కేచిత్ కేచిత్పాతాళచారిణః ।
కేచిద్వ్యోమచరాః కేచిత్సప్తస్వర్గచరా మునే ॥31॥

కిం బహూక్తేన దేవర్షే! సర్వలోకనివాసినః ।
యయుశ్శివగణాస్సర్వే యుద్ధార్థం దానవైస్సహ ॥32॥

వ్యాసమునీ! ఈ గణాధిపతులందరూ సహస్రబాహువులు. జటాముకుటధారులు. చంద్రశేఖరులు. నీలకంఠులు. త్రిలోచనులు. భస్మ-రుద్రాక్షాలంకృతులు. హారకుండల కేయూర ముకుటాద్యలంకారాలు సరేసరి. ఒక్కొక్కరూ బ్రహ్మ-ఇంద్ర-విష్ణు సదృశులు. అణిమాది సిద్ధులు ఎనిమిదీ పొందినవారు. కోటి సూర్యబింబాల్లాగా వెలిగే తేజోమూర్తులు. యుద్ధవిద్యలో మహాప్రవీణులు. వీరిలో కొందరు భూలోకవాసులు. కొందరు పాతాళ నివాసులు. ఇంకొందరు ఆకాశచరులు. మరికొందరు సప్తస్వర్గసంచారులు. మహర్షీ! ఒక్కముక్కలో చెప్పాలంటే- సర్వలోకాలలోనూ నివసించే శివగణాలవారందరూ ఆ దానవుడితో యుద్ధానికి సన్నద్ధులై తరలివచ్చారు.

అష్టౌ చ భైరవా రౌద్రా రుద్రాశ్చైకాదశాశు యే ।
వసవోఽష్టౌ వాసవశ్చాదిత్యా ద్వాదశ తే ద్రుతమ్ ॥33॥

హుతాశనశ్చ చంద్రశ్చ విశ్వకర్మాశ్వినౌ చ తౌ ।
కుబేరశ్చ యమశ్చైవ నిర్ఋతిర్నలకూబరః ॥34॥

వాయుశ్చ వరుణశ్చైవ బుధశ్చ మంగళశ్చ వై ।
గ్రహాశ్చాన్యే మహేశేన కామదేవశ్చ వీర్యవాన్ ॥35॥

ఉగ్రదంష్ట్రశ్చోగ్రదండః కోరటః కోటభస్తథా ।

అష్టభైరవులూ, మహాసంహార–అసితాంగ–రురు–కాల–క్రోధ–తామ్రచూడ లేదా కపాల–చంద్రచూడ–రుద్రులు. విద్యారాజ–కామరాజ–నాగరాజ–స్వచ్ఛంద–లంబిత–దేవ–ఉగ్ర–విఘ్నులు బయలుదేరారు. అతిరౌద్రాకారులు ఏకాదశరుద్రులూ వేగంగా చేరుకున్నారు. అష్టవసువులూ (ఆపః–ధ్రువః–సోమః–ధరా–అనిలః–అనలః–ప్రభాసః–ప్రత్యూషః), వాసవుడూ, (మిత్ర–అర్యమన్–భగ–వరుణ– దక్షాది) ద్వాదశాదిత్యులూ, అగ్నిదేవుడూ, చంద్రుడూ, విశ్వకర్మ, అశ్వినీదేవతలూ, కుబేరుడూ, యముడూ, నిర్ఋతి, నలకూబరుడూ, వాయువూ, వరుణుడూ, బుధుడూ, మంగళుడూ ఇంకా తక్కిన గ్రహాధిదేవతలూ, మహాశక్తిసంపన్నుడైన కామదేవుడూ, ఉగ్రదంష్ట్రుడూ, ఉగ్రదండుడూ, కోటరుడూ, కోటభుడూ–ఇలా అందరూ శంఖచూడుడితో పోరాటానికి సిద్ధమయ్యారు– మహేశుడితో జతకలిశారు.

స్వయం శతభుజా దేవీ భద్రకాళీ మహేశ్వరీ ॥36॥

రత్నేంద్రసారనిర్మాణవిమానోపరిసంస్థితా ।
రక్తవస్త్రపరీధానా రక్తమాల్యానులేపనా ॥37॥

నృత్యంతీ చ హసంతీ చ గాయంతీ సుస్వరం ముదా ।
అభయం దదతీ స్వేభ్యో భయం చారిభ్య ఏవ సా ॥38॥

బిభ్రతీ వికటాం జిహ్వాం సులోలాం యోజనాయతామ్ ।
శంఖచక్రగదాపద్మఖడ్గచర్మధనుశ్శరాన్ ॥39॥

ఖర్పరం వర్తులాకారం గంభీరం యోజనాయతమ్ ।
త్రిశూలం గగనస్పర్శి శక్తిం చ యోజనాయతామ్ ॥40॥

ముద్గరం ముసలం వజ్రం ఖడ్గం ఫలకముల్బణమ్ ।
వైష్ణవాస్త్రం వారుణాస్త్రం వాయవ్యం నాగపాశకమ్ ॥41॥

నారాయణాస్త్రం గాంధర్వం బ్రహ్మాస్త్రం గారుడం తథా ।
పర్జన్యం చ పాశుపతం జృంభణాస్త్రం చ పార్వతమ్ ॥42॥

మహావీరం చ సౌరం చ కాలకాలం మహానలమ్ ।
మహేశ్వరాస్త్రం యామ్యం చ దండం సమ్మోహనం తథా ॥43॥

సమర్థమస్త్రకం దివ్యం దివ్యాస్త్రం శతకం పరమ్ ।
బిభ్రతీ చ కరైస్సర్వైరన్యాన్యపి చ సా తదా ॥44॥

ఆగత్య తస్థౌ సా తత్ర యోగినీనాం త్రికోటిభిః ।
సార్ధం చ డాకినీనాం వై వికటానాం త్రికోటిభిః ॥45॥

నూరు చేతుల మహేశ్వరి–భద్రకాళి–స్వయంగా వచ్చింది. మహారత్నంలాగా దుర్భేద్యమైన నిర్మితి గల దివ్యవిమానం మీద వచ్చింది. ఎర్రని వలువలతో ఎర్రని పూలమాలలతో ఎర్రని చందనానులేపనంతో విరాజిల్లుతోంది. నవ్వుతోంది. నాట్యం చేస్తోంది. మధురంగా పాడుతోంది. తనవారికి అభయప్రద. శత్రువులకు భయప్రద. యోజనం పొడవైన ఎర్రని నాలుక భీషణంగా కదుపుతోంది. శంఖం చక్రం గద పద్మం ఖడ్గం చర్మనిరితమైన డాలు ధనుస్సు బాణాలు, గుండ్రనిది లోతైనది యోజనవిశాలమైనది అయిన కపాలం, ఆకాశాన్ని తాకుతున్న పొడవైన త్రిశూలం, యోజనం పొడవున్న శక్తి ఆయుధం, ముద్గరం ముసలం వజ్రాయుధం ఖడ్గం దృఢమైన ఫలకం, వైష్ణవాస్త్రం, వారుణాస్త్రం, వాయవ్యాస్త్రం, నాగపాశకం, నారాయణాస్త్రం, గాంధర్వాస్త్రం, బ్రహ్మాస్త్రం, గారుడాస్త్రం, పర్జన్యాస్త్రం, పాశుపతాస్త్రం, జృంభకాస్త్రం, పార్వతాస్త్రం, మహావీరాస్త్రం, సౌరాస్త్రం, కాలకాలాస్త్రం, మహానలాస్త్రం, మహేశ్వరాస్త్రం, యామ్యాస్త్రం, దండాస్త్రం, సమ్మోహనాస్త్రం, సమర్థాస్త్రం ఇలా దివ్యమైన దివ్యాస్త్రశతాన్ని నూరు చేతులతోనూ ధరించి మరీ వచ్చింది. ఇంకా చాలా ఆయుధాలతో వచ్చింది.మూడు కోట్లమంది యోగినీగణం, ఒకటిన్నరకోటి డాకినీగణం, ముక్కోటి మంది వికటగణం వెంటరాగా తరలి వచ్చింది.

భూతప్రేతపిశాచాశ్చ కూష్మాండా బ్రహ్మరాక్షసాః ।
బేతాళా రాక్షసాశ్చైవ యక్షాశ్చైవ సకిన్నరాః ॥46॥

తైశ్చైవాభివృతః స్కందః ప్రణమ్య చంద్రశేఖరమ్ ।
పితుః పార్శ్వే సహాయో యః సమువాస తదాజ్ఞయా ॥47॥

అథ శంభుస్సమానీయ స్వసైన్యం సకలం తదా ।
యుద్ధార్థమగమద్రుద్రః శంఖచూడేన నిర్భయః ॥48॥

చంద్రభాగానదీతీరే వటమూలే మనోహరే ।
తత్ర తస్థౌ మహాదేవో దేవనిస్తారహేతవే ॥49॥

భూత–ప్రేత–పిశాచ–కూష్మాండ–బ్రహ్మరాక్షస–బేతాళరాక్షస–యక్ష–కిన్నర సేనలతో వచ్చిన స్కందుడు శిరసా నమస్కరించి చంద్రశేఖరుడి చెంత నిలిచాడు. ఆనతి మేరకు సహాయానికి నిలబడ్డాడు. ఇలా శివుడు తన సేనలనన్నింటినీ సమీకరించుకుని శంఖచూడునితో యుద్ధానికి నిర్భయంగా బయల్దేరాడు. దేవతల్ని తరింపజెయ్యడం కోసం. చంద్రభాగా నదీతీరంలో మనోహరవటవృక్షం కింద స్తిమితంగా నిలబడ్డాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధే మహాదేవయుద్ధయాత్రావర్ణనం నామ త్రయస్త్రింశత్తమోఽధ్యాయః ॥33॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడ వధోపాఖ్యానంలో మహాదేవయుద్ధయాత్రావర్ణనం అనే ముప్పై మూడవ అధ్యాయం సమాప్తం.

చతుస్త్రింశోఽధ్యాయః – ముప్పై నాల్గవ అధ్యాయం

శంఖచూడయుద్ధయాత్రావర్ణనమ్ – శంఖచూడయుద్ధయాత్రావర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

విధితాత! మహాబుద్ధే మునే జీవ చిరం సమాః ।
కథితం సుమహచ్చిత్రం చరితం చంద్రమౌళినః ॥1॥

శివదూతే గతే తత్ర శంఖచూడశ్చ దానవః ।
కిం చకార ప్రతాపీ స తత్త్వం వద సువిస్తరమ్ ॥2॥

బ్రహ్మమానసపుత్రా! మహాబుద్ధీ! మునీ! సనత్కుమారా! చిరకాలం జీవించు. చిత్రమైన చంద్రమౌళి మహాచరిత్రను అద్భుతంగా చెబుతున్నావు. శివదూతగా వచ్చిన పుష్పదంతుణ్ని తిరిగి పంపించేశాక మహాప్రతాపశాలి ఆ శంఖచూడుడు–దానవేశ్వరుడు–ఏమి చేశాడు? సవిస్తరంగా చెప్పవూ!?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అథ దూతే గతే తత్ర శంఖచూడః ప్రతాపవాన్ ।
ఉవాచ తులసీం వార్తాం గత్వాఽభ్యంతరమేవ తామ్ ॥3॥

పుష్పదంతుడు వెళ్ళిపోయాక ప్రతాపశాలి శంఖచూడుడు సరాసరి తన అంతఃపురంలోకి వెళ్ళాడు. పట్టమహిషి తులసీదేవికి ఆ వార్తను చెప్పాడు.

శంఖచూడ ఉవాచ – శంఖచూడుడు చెప్పాడు.

శంభుదూతముఖాద్దేవి! యుద్ధాయాహం సముద్యతః ।
తేన గచ్ఛామ్యహం యోద్ధుం శాసనం కురు మే ధ్రువమ్ ॥4॥

ఇత్యేవముక్త్వా స జ్ఞానీ నానాబోధనతః ప్రియామ్ ।
క్రీడాం చకార హర్షేణ తమనాదృత్య శంకరమ్ ॥5॥

తౌ దంపతీ చిక్రీడాతే నిమగ్నౌ సుఖసాగరే ।
నానాకామకళాభిశ్చ నిశి చాటుశతైరపి ॥6॥

దేవీ! శంభుదూత చెప్పినది విన్నాక నేను యుద్ధానికే నిశ్చయించుకున్నాను. శివుడితో పోరాటానికి వెడుతున్నాను. కనక నేను ఆజ్ఞాపించేది విని అలా చెయ్యి–అని చెప్పి మహాజ్ఞాని శంఖచూడుడు ఆమెకు అనేక సూచనలు చేసి శివుణ్ని లెక్కచెయ్యని ఒక ఆనందంతో క్రీడించాడు. దంపతులిద్దరూ కామకళానైపుణ్యంతో తియ్యతియ్యని మాటలతో సుఖసాగరంలో మునిగి తేలుతూ తెల్లవార్లూ క్రీడించారు.

బ్రాహ్మే ముహూర్త ఉత్థాయ ప్రాతఃకృత్యం విధాయ చ ।
నిత్యకార్యం చ కృత్వాదౌ దదౌ దానమనంతకమ్ ॥7॥

పుత్రం కృత్వా చ రాజేంద్రం సర్వేషు దానవేషు చ ।
పుత్రే సమర్ప్య భార్యాం చ స రాజ్యం సర్వసంపదమ్ ॥8॥

ప్రియామాశ్వాసయామాస స రాజా రుదతీం పునః ।
నిషేధతీం చ గమనం నానావార్తాం ప్రకథ్య చ ॥9॥

నిజసేనాపతిం వీరం సమాహూయ సమాదృతః ।
ఆదిదేశ స సన్నద్ధస్సంగ్రామం కర్తుముద్యతః ॥10॥

బ్రాహ్మీముహూర్తంలో శయనం దిగాడు. ప్రాతఃకాల-కృత్యాలన్నీ నిర్వహించాడు. తొలిజాము నిత్యవిధులు ముందుగా ఆచరించాడు. అటుపైని లెక్కలేనన్ని దానాలు చేశాడు. తన పుత్రుణ్ణి దానవరాజ్యానికీ సకల దానవులకూ అధిపతిని చేశాడు. భార్యనూ రాజ్యాన్నీ సకలసంపదలనూ అతడికి అప్పగించాడు. దుఃఖిస్తున్న ప్రియభార్యను ఊరడించాడు. ఏవేవో వార్తల్ని ఉట్టంకించి చెబుతూ యుద్ధానికి వెళ్ళవద్దు వెళ్ళవద్దు అంటూ, ప్రాధేయపడుతున్న ఆమెకు ధైర్యవచనాలు చెప్పి ఊరడించాడు. మహావీరుడైన తన సేనాపతిని పిలిపించాడు. స్తుతి-నృత్యాది సమాదరణలు అందుకున్నాడు. తాను యుద్ధానికి సన్నద్ధుడై సేనాపతికి అదే ఆదేశించాడు.

శంఖచూడ ఉవాచ - శంఖచూడుడు అన్నాడు.

అద్య సేనాపతే వీరాస్సర్వే సమరశాలినః ।
సన్నద్ధాఖిలకర్మాణో నిర్గచ్ఛం తు రణాయ చ ॥11॥

దైత్యాశ్చ దానవాః శూరా షడశీతిరుదాయుధాః ।
కంకానాం బలినాం శీఘ్రం సేనా నిర్యాంతు నిర్భయాః ॥12॥

పంచాశదసురాణాం చ నిర్గచ్ఛంతు కులాని వై ।
కోటి వీర్యాణి యుద్ధార్థం శంభునా దేవపక్షిణా ॥13॥

సన్నద్ధాని చ ధౌమ్రాణాం కులాని చ శతం ద్రుతమ్ ।
నిర్గచ్ఛంతు రణార్థం హి శంభునా మమ శాసనాత్ ॥14॥

కాలకేయాశ్చ మౌర్యాశ్చ దౌర్హృదాః కాలకాస్తథా ।
సజ్జా నిర్యాంతు యుద్ధాయ రుద్రేణ మమ శాసనాత్ ॥15॥

సేనాపతీ! సమరకోవిదులైన మన మహావీరులందరూ సర్వసన్నద్ధులై రణానికి బయలుదేరుదురుగాక! దైత్యదానవశూరులు ఆయుధధారులు ఎనభైయారు సేనలూ బలిష్ఠులైన కంకసేనలూ వెంటనే నిర్భయంగా బయలుదేరాలి. అసురసేనలు యాభై ఉన్నాయి. ఒక్కొక్కటీ కోటిసైన్యంతో సాటివచ్చే బలం కలవి. దేవ పక్షపాతి

శంభుడితో యుద్ధానికి ఇవి కూడా కదలివెళ్ళాలి. అలాగే ధౌమ్రసేనలు నూరూ సర్వసన్నద్ధాలై రణరంగానికి నడవాలి. మిగతా కాలకేయ–మౌర్య–దౌర్హృద–కాలక మహాసైన్యాలు సైతం రుద్రుడితో యుద్ధానికి కదలాలి. ఇది నా ఆజ్ఞ.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాజ్ఞాప్యాసురపతిర్దానవేంద్రో మహాబలః ।
నిర్జగామ మహాసైన్యస్సహస్రైర్బహుభిర్యుతః ॥16॥

తస్య సేనాపతిశ్చైవ యుద్ధశాస్త్రవిశారదః ।
మహారథో మహావీరో రథినాం ప్రవరో రణే ॥17॥

త్రిలక్షాక్షౌహిణీయుక్తో మాంగల్యం చ చకార హ ।
బహిర్బభూవ శిబిరాద్రణే వీరభయంకరః ॥18॥

రత్నేంద్రం సారనిర్మాణం విమానమభిరుహ్య సః ।
గురువర్గం పురస్కృత్య రణార్థం ప్రయయౌ కిల ॥19॥

వ్యాసమునీ! ఇలా ఆజ్ఞాపించి మహాబలశాలి దానవేంద్రుడు ఆ శంఖచూడుడు వేల వేల మహాసైన్యంతో యుద్ధానికి బయలుదేరాడు. అతడి సేనాపతి ఒక మహావీరుడు. మహారథుడు, రణరంగంలో రథికప్రవరుడు. మూడు లక్షల అక్షౌహిణీసైన్యంతో బయలుదేరిన శంఖచూడుడు మంగళకరమైన విధులన్నీ నిర్వహించి అతివీరభయంకరుడై శిబిరం నుంచి ఈవలికి వచ్చాడు. రత్నసారనిర్మితమైన దివ్యవిమానం అధిరోహించాడు. గురుబృందానికి నమస్కరించాడు. రణరంగాభిముఖంగా పయనమయ్యాడు.

పుష్పభద్రానదీతీరే యత్రాక్షయవటః శుభః ।
సిద్ధాశ్రమే చ సిద్ధానాం సిద్ధిక్షేత్రం సుసిద్ధిదమ్ ॥20॥

కపిలస్య తతః స్థానం పుణ్యక్షేత్రే చ భారతే ।
పశ్చిమోదధేః పూర్వే చ మలయస్య హి పశ్చిమే ॥21॥

శ్రీశైలోత్తరభాగే చ గంధమాదనదక్షిణే ।
పంచయోజనవిస్తీర్ణం దైర్ఘ్యే శతగుణస్తథా ॥22॥

శుద్ధస్ఫటికసంకాశా భారతే చ సుపుణ్యదా ।
పుష్పభద్రానదీ రమ్యా జలపూర్ణా సరస్వతీ ॥23॥

పుష్పభద్రానదీ తీరంలో శుభప్రదమైన ఒక అక్షయవటవృక్షం ఉంది. అది ఒక సిద్ధాశ్రమంలో ఉంది. సిద్ధులకు సిద్ధినందించే సిద్ధిక్షేత్రమది. పుణ్యక్షేత్రమైన భారతదేశంలో అదే కపిలుడి నివాసస్థానం. పశ్చిమ సముద్రానికి తూర్పుగా, మలయపర్వతానికి పడమరగా, శ్రీశైలానికి ఉత్తరంగా, గంధమాదనపర్వతానికి దక్షిణంగా– అయిదు

యోజనాల వెడల్పూ అయిదువందల యోజనాల పొడవూ ఉన్న పుష్పభద్రానది–అది. అందులో నీరు స్ఫటికంలా స్వచ్ఛంగా ఉంటుంది. భారతదేశంలో అదొక పుణ్యప్రదమైన నది. అందంగా జలపూర్ణంగా సరస్సులతో విలసిల్లేది పుష్పభద్రానది.

లవణోదధేః ప్రియాభార్యా శశ్వత్సౌభాగ్యసంయుతా ।
సరస్వతీ సంశ్రితా చ నిర్గతా సా హిమాలయాత్ ॥24॥

గోమంతం వామతః కృత్వా ప్రవిష్టా పశ్చిమోదధౌ ।
తత్ర గత్వా శంఖచూడః శివసేనాం దదర్శ హ ॥25॥

పుష్పభద్రానది సముద్రుడికి ప్రియభార్య. సౌభాగ్యసంయుత. సరస్వతీ నదితో కలిసి హిమాలయాల నుంచి ఆవిర్భవించింది. గోమంతానికి కుడిగా ప్రవహించి పశ్చిమసముద్రాన కలుస్తోంది. అదిగో అక్కడున్న రణరంగానికి వెళ్ళి శంఖచూడుడు శివమహాసైన్యాన్ని చూశాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడయుద్ధయాత్రా వర్ణనం నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥34॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడయుద్ధ యాత్రావర్ణనం అనే ముప్పై నాల్గవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

పంచత్రింశోఽధ్యాయః – ముప్పై అయిదవ అధ్యాయం

శివదూతసంవాదమ్ – శివదూతసంవాదం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తత్ర స్థిత్వా దానవేంద్రో మహాంతం దానవేశ్వరమ్ ।
దూతం కృత్వా మహావిజ్ఞం ప్రేషయామాస శంకరమ్ ॥1॥

స తత్ర గత్వా దూతశ్చ చంద్రఫాలం దదర్శ హ ।
వటమూలే సమాసీనం సూర్యకోటి సమప్రభమ్ ॥2॥

కృత్వా యోగాసనం దృష్ట్యా ముద్రాయుక్తం చ సస్మితమ్ ।
శుద్ధస్ఫటికసంకాశం జ్వలంతం బ్రహ్మతేజసా ॥3॥

త్రిశూలపట్టిశధరం వ్యాఘ్రచర్మాంబరావృతమ్ ।
భక్తమృత్యుహరం శాంతం గౌరీకాంతం త్రిలోచనమ్ ॥4॥

తపసాం ఫలదాతారం కర్తారం సర్వసంపదామ్ ।
ఆశుతోషం ప్రసన్నాస్యం భక్తానుగ్రహకారకమ్ ॥5॥

వ్యాసమునీ! అక్కడ విడిదిచేసి శంఖచూడుడు తన దానవనాయకులలో ఒక పెద్ద మనిషిని విజ్ఞుణ్ణి శంకరుడి సన్నిధికి దూతగా పంపించాడు. ఆ దూత వెళ్ళి చంద్రఫాలుణ్ణి దర్శించాడు. మర్రిచెట్టు మొదట కూర్చుని ఉన్నాడు శంకరుడు. సూర్యకోటిసమానప్రభతో వెలుగొందుతున్నాడు. యోగాసనంలో కూర్చున్నాడు. దృష్టితో ధ్యానముద్ర పట్టి కూర్చున్నాడు. చిరునవ్వులు తొణుకుతున్నాయి. త్రిశూలాన్నీ పట్టిశాన్ని ధరించాడు. వ్యాఘ్రచర్మమే అంబరంగా చుట్టుకున్నాడు. అతడు భక్తులకు మరణభయాన్ని తొలగిస్తాడు. శాంతస్వభావుడు. గౌరీకాంతుడు. ముక్కంటి. తపస్సులకు తపఃఫలాలను అందిస్తాడు. సర్వసంపదలకూ కర్త. వేగంగా సంబరపడతాడు. ఆశుతోషుడు. ప్రసన్నమైన ముఖం. భక్తులకు అనుగ్రహప్రదాత.

విశ్వనాథం విశ్వబీజం విశ్వరూపం చ విశ్వజమ్ ।
విశ్వంభరం విశ్వకరం విశ్వసంహారకారణమ్ ॥6॥

కారణం కారణానాం చ నరకార్ణవతారణమ్ ।
జ్ఞానప్రదం జ్ఞానబీజం జ్ఞానానందం సనాతనమ్ ॥7॥

అవరుహ్య రథాద్దూతస్తం దృష్ట్వా దానవేశ్వరః ।
శంకరం సకుమారం చ శిరసా ప్రణనామ సః ॥8॥

వామతో భద్రకాళీం చ స్కందం తత్పురతః స్థితమ్ ।
లోకాశిషం దదౌ తస్మై కాళీ స్కందశ్చ శంకరః ॥9॥

అథాసౌ శంఖచూడస్య దూతః పరమశాస్త్రవిత్ ।
ఉవాచ శంకరం నత్వా కరౌ బద్ధ్వా శుభం వచః ॥10॥

అతడు విశ్వనాథుడు. విశ్వబీజుడు. విశ్వరూపుడు. విశ్వజుడు. విశ్వంభరుడు. విశ్వకరుడు. విశ్వసంహార కారణుడు. కారణాలకే కారణుడు అతడు. నరకార్ణవతారణుడతడు. జ్ఞానప్రదుడు. జ్ఞానబీజుడు. జ్ఞానానందుడు. సనాతనుడు. అటువంటి శంకరుణ్ణి దానవదూత తన రథం దిగి నిలిచి దర్శించాడు. కుమారసహితుడై ఉన్న శంకరుణ్ణి శిరసా నమస్కరించాడు. ఎడమ ప్రక్క ఉన్న భద్రకాళినీ శంకరుడి ముందున్న స్కందుణ్ణీ అలాగే నమస్కరించాడు. ఆ ముగ్గురూ కూడా లోకాచారం ప్రకారం అతడికి ఆశీస్సులు పలికారు. ఆ వచ్చిన శంఖచూడుని దూత–శాస్త్ర కోవిదుడు. అలాగే నమస్కారంతో నిలబడి శంకరుడితో శుభవచనాలు పలికాడు.

దూత ఉవాచ – దూత పలికాడు.

శంఖచూడస్య దూతోఽహం త్వత్సకాశమిహాగతః ।
వర్తతే తే కిమిచ్ఛాద్య తత్త్వం బ్రూహి మహేశ్వర ॥11॥

మహేశ్వరా! నేను శంఖచూడుడి దూతను. ఇలా నీ చెంతకు వచ్చాను. నీ మనస్సులో ఉన్నది ఏమిటో దయచేసి వాస్తవం చెప్పు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి శ్రుత్వా చ వచనం శంఖచూడస్య శంకరః ।
ప్రసన్నాత్మా మహాదేవో భగవాంస్తమువాచ హ ॥12॥

వ్యాసమునీ! శంఖచూడుడి అభిప్రాయాన్ని దూతముఖంగా విని మహాదేవుడు ఆ భగవంతుడు శంకరుడు ప్రసన్నాత్ముడయ్యాడు. ఇలా బదులిచ్చాడు.

మహాదేవ ఉవాచ – మహాదేవుడు చెప్పాడు.

శృణు దూత మహాప్రాజ్ఞ వచో మమ సుఖావహమ్ ।
కథనీయమిదం తస్మై నిర్వివాదం విచార్య చ ॥13॥

విధాతా జగతాం బ్రహ్మా పితా ధర్మస్య ధర్మవిత్ ।
మరీచిస్తస్య పుత్రశ్చ కశ్యపస్తత్సుతః స్మృతః ॥14॥

దక్షః ప్రీత్యా దదౌ తస్మై నిజకన్యాస్త్రయోదశ ।
తాస్వేకా చ దనుస్సాధ్వీ తత్సౌభాగ్యవివర్ధినీ ॥15॥

చత్వారస్తే దనోః పుత్రా దానవాస్తేజసోల్బణాః ।
తేష్వేకో విప్రచిత్తిస్తు మహాబలపరాక్రమః ॥16॥

తత్పుత్రో ధార్మికో దంభో దానవేంద్రో మహామతిః ।
తస్య త్వం తనయః శ్రేష్ఠో ధర్మాత్మా దానవేశ్వరః ॥17॥

ఓయీ! దూతా! మహాప్రాజ్ఞా! నేను చెప్పేది విను. సుఖావహంగా ఉండేది చెబుతున్నాను. ఇదంతా నువ్వు శంఖచూడుడికి చెప్పాలి. నిర్వివాదమైన ఈ విషయాన్ని బాగా ఆలోచించి అతడికి చెబుదువుగాని. శ్రద్ధగా విను. జగత్తులకు సృష్టికర్త. ధర్మవేత్త, ధర్మప్రవర్తకుడు అయినవాడు బ్రహ్మదేవుడు, అతడి మానసపుత్రుడు మరీచి, అతని కొడుకు కశ్యపుడు. దక్షప్రజాపతి తన కూతుళ్ళను పదమూడు మందిని ప్రీతితో ఆ కశ్యపుడికి ఇచ్చి వివాహాలు జరిపించాడు. వారిలో ఒక ఆవిడ పేరు దనువు. పరమ సాధ్వి. కశ్యపుడికి సౌభాగ్యవర్ధిని. ఆవిడకి నలుగురు పుత్రులు కలిగారు. వారే దానవులు. మహాతేజస్వులు. వారిలో ఒకడి పేరు విప్రచిత్తి. మహాబలపరాక్రమశాలి. అతడి కొడుకు దంభనామకుడు. పరమధార్మికుడు. మహామతి. ఆ దానవేంద్రుడికి తనయుడివి నువ్వు ఓ శంఖచూడా! నువ్వు చాలా ఉత్తముడివి. ధర్మాత్ముడివి. దానవజాతికి నాయకుడివి.

పురా త్వం పార్షదో గోపో గోపేష్వేవ చ ధార్మికః ।
అధునా రాధికాశాపాజ్జాతస్త్వం దానవేశ్వరః ॥18॥

దానవీం యోనిమాయాతః తత్త్వతో న హి దానవః ।
నిజవృత్తం పురా జ్ఞాత్వా దేవవైరం త్యజాధునా ॥19॥

ద్రోహం న కురు తైస్సార్ధం స్వపదం భుంక్ష్వ సాదరమ్ ।
నాధికం సవికారం చ కురు రాజ్యం విచార్య చ ॥20॥

అది అలా ఉండగా–పూర్వజన్మలో నువ్వు ఒక గోపకుడివి. గోపకులలోకెల్ల పరమధార్మికుడివి. శ్రీకృష్ణుడికి చెలికాడవు. రాధికాదేవి ఇచ్చిన శాపం వల్ల ఇప్పుడు ఇలా నువ్వు దానవేశ్వరుడివి అయ్యావు. నిజానికి నువ్వు దానవుడివి కాదు. శాపం వల్ల దానవజాతిలో జన్మించావు అంతే. ఈ పూర్వజన్మవృత్తాంతాన్ని ఒక్కసారి గుర్తు తెచ్చుకో. దేవతలతో శత్రుత్వాన్ని వెంటనే మానుకో. వాళ్ళకి ద్రోహం చెయ్యకు. హాయిగా వాళ్ళతో కలిసి నీ భాగం నీ రాజ్యం నువ్వు అనుభవించు. అధికం ఆశించకు. వికృతాలు చెయ్యకు. బాగా ఆలోచించి నీ రాజ్యం నువ్వు ఏలుకో!

దేహి రాజ్యం చ దేవానాం మత్ప్రీతిం రక్ష దానవ ।
నిజరాజ్యే సుఖం తిష్ఠ తిష్ఠంతు స్వపదే సురాః ॥21॥

అలం భూతవిరోధేన దేవద్రోహేన కిం పునః ।
కులీనాః శుద్ధకర్మాణః సర్వే కశ్యపవంశజాః ॥22॥

యాని కాని చ పాపాని బ్రహ్మహత్యాదికాని చ ।
జ్ఞాతిద్రోహజపాపస్య కళాం నార్హంతి షోడశీమ్ ॥23॥

దానవా! దేవతల రాజ్యం దేవతలకి ఇచ్చెయ్యి. నాపట్ల భక్తిని కాపాడుకో! నీ రాజ్యంలో నువ్వు సుఖంగా ఉండు. దేవతలు వాళ్ళ రాజ్యంలో వాళ్ళు సుఖంగా ఉంటారు. అసలుకి ఏదైనా ఒక ప్రాణితో వైరం పెట్టుకోవడమే తగని పని. అలాంటిది దేవతలకి ద్రోహం చెయ్యడమంటే మరి చెప్పాలా! మీరు అందరూ సత్కులీనులు. పవిత్రకర్మఠులు. కశ్యపవంశజులు. ఒక తండ్రి బిడ్డలు. దాయాదులు. బ్రహ్మహత్యాదికాలు మహాపాపాలు ఎన్నయినా జ్ఞాతిద్రోహంతో వచ్చే పాపానికి పదహారోవంతు కావు. అంతటి మహామహాపాపం ఈ జ్ఞాతిద్రోహ మనేది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

ఇత్యాది బహువార్తాం చ శ్రుతిస్మృతిపరాం శుభామ్ ।
ప్రోవాచ శంకరస్తస్మై బోధయన్ జ్ఞానముత్తమమ్ ॥24॥

శిక్షితశ్శంఖచూడేన స దూతస్తర్కవిత్తమః ।
ఉవాచ వచనం నమ్రో భవితవ్యవిమోహితః ॥25॥

వ్యాసమునీ! ఇలా శ్రుతిస్మృతి సమ్మతంగా శుభప్రదంగా విస్తృతసమాచారాన్ని శంకరుడు అతడికి చెప్పాడు. ఉత్తమ జ్ఞానాన్ని బోధించాడు. అయితే ఆ దూత–శంఖచూడుని దగ్గర సుశిక్షితుడు. తర్కం బాగా తెలిసినవాడు. కానీ భవితవ్యం అతడిని సమ్మోహపరచింది. నమ్రంగా బదులు పలికాడు.

దూత ఉవాచ – దూత అన్నాడు.

త్వయా యత్కథితం దేవ నాన్యథా తత్తథా వచః ।
తథ్యం కించిద్వ్యథార్థం చ శ్రూయతాం మే నివేదనమ్ ॥26॥

జ్ఞాతిద్రోహే మహత్పాపం త్వయోక్తమధునా చ యత్ ।
తత్కిమీశాసురాణాం చ న సురాణాం వద ప్రభో ॥27॥

సర్వేషామితి చేత్తద్వై తదా వచ్మి విచార్య చ ।
నిర్ణయం బ్రూహి తత్రాద్య కురు సందేహభంజనమ్ ॥28॥

దేవాధిదేవా! నువ్వు చెప్పింది యథార్థం. ముమ్మాటికీ నిజం. మరొకటి కాదు. అయినా నా విన్నపం కూడా కొంచెం ఆలకించు. నువ్వు ఇప్పుడే చెప్పావుగదా జ్ఞాతిద్రోహం మహాపాపమని. అయితే అది ఒక్క అసురులకేనా? సురలకు కాదా? ప్రభూ! దయచేసి చెప్పు. అది అందరికీ వర్తిస్తుంది అన్నట్టయితే నేను బాగా ఆలోచించిన ఒకమాట చెబుతాను విను. విన్నాక, నిర్ణయం నువ్వే చెయ్యి. నా సందేహం తీర్చు.

మధుకైటభయోః దైత్యవరయోః ప్రళయార్ణవే ।
శిరశ్ఛేదం చకారాసౌ కస్మాచ్చక్రీ మహేశ్వర ॥29॥

త్రిపురైస్సహ సంయుద్ధం భస్మత్వకరణం కుతః ।
భవాంశ్చకార గిరిశ సురపక్షీతి విశ్రుతమ్ ॥30॥

గృహీత్వా తస్య సర్వస్వం కుతః ప్రస్థాపితో బలిః ।
సుతలాది సముద్ధర్తుం తద్ద్వారే చ గదాధరః ॥31॥

సభ్రాతృకో హిరణ్యాక్షః కథం దేవైశ్చ హింసితః ।
శుంభాదయోఽసురాశ్చైవ కథం దేవైర్నిపాతితాః ॥32॥

మహేశ్వరా! మహాప్రళయసముద్రంలో అలనాడు విష్ణుమూర్తి దైత్యవల్లభులైన మధుకైటభుల శిరస్సులు ఖండించాడు. గిరీశా! నువ్వు స్వయంగా త్రిపురాసురుణ్ణి యుద్ధంలో భస్మం చేశావు. ఎందుకని? అప్పటి నుంచీ సురపక్షపాతివి అనిపించుకున్నావు. బలిచక్రవర్తి నుంచి సమస్తమూ ఊడలాక్కుని అతణ్ని అతలవితల పాతాళాదులకు అణగదొక్కిన కారణం ఏమిటి? గదాధరుడు శ్రీహరి అతణ్ని ఉద్ధరించడానికే గుమ్మం తొక్కాడా?హిరణ్యాక్షుణ్ణీ అతడి సోదరుణ్ణీ ఏ కారణంగా దేవతలు హింసించారు? శుంభనిశుంభాదుల్ని ఎందరెందరినో అసురుల్ని దేవతలు మట్టుబెట్టారు. వాళ్ళు ఏమి అపరాధం చేశారని?

పురా సముద్రమథనే పీయూషం భక్షితం సురైః ।
క్లేశభాజో వయం తత్ర తే సర్వే ఫలభోగినః ॥33॥

క్రీడాభాండమిదం విశ్వం కాలస్య పరమాత్మనః ।
స దదాతి యస్మై తస్మై తస్మై శ్వర్యం భవేత్తదా ॥34॥

శివా! క్షీరసాగరమథనంలో అమృతాన్ని భక్షించినవాళ్ళు దేవతలు. శ్రమపడ్డవాళ్ళం మేము, ఫలం ఆస్వాదించినవాళ్ళు దేవతలు. ఇంతకీ ఈ ప్రపంచం కాలమహాపురుషుడికి ఒక క్రీడాప్రాంగణం. అతడు ఎవరికి ఎప్పుడివ్వాలనుకుంటే అప్పుడతడికి ఐశ్వర్యం లభిస్తుంది.

దేవదానవయోర్వైరం శశ్వన్నైమిత్తికం సదా ।
పరాజయో జయస్తేషాం కాలాధీనః క్రమేణ చ ॥35॥

తవానయోర్విరోధే చ గమనం నిష్ఫలం భవేత్ ।
సమసంవిధానం తద్వై రోచతే నేశ్వరస్య తే ॥36॥

సురాసురాణాం సర్వేషామీశ్వరస్య మహాత్మనః ।
ఇయం తే రహితా లజ్జా స్పర్ధాస్మాభిస్సహాధునా ॥37॥

యతోఽధికా చైవ కీర్తిర్వా నిశ్చైవ పరాజయే ।
తవైతద్విపరీతం చ మనసా సంవిచార్యతామ్ ॥38॥

ఏదో ఒక నిమిత్తంగా దేవదానవులకు ఈ వైరం సర్వదా ఉన్నదే. గెలుపూ ఓటముల వరుస కాలాధీనం. కాగా – వీరి శత్రుత్వంలో నువ్వు తలదూర్చడం నిష్ఫలం. నువ్వు ఈశ్వరుడివి. రెండు పక్షాలవారిపైన సమానదృష్టి

ఈశ్వరుడవైన నీకు తగదు. రెండు పక్షాలలోనూ న్యాయం ధర్మం ఎటు ఉన్నదో ఆలోచించు. సురాసురులందరికీ మహాత్ముడివి, పరమేశ్వరుడివి నువ్వే. అలాంటి నువ్వు మాతో స్పర్ధపెట్టుకోవడం నీకు సిగ్గనిపించడం లేదూ! మా మీద గెలిస్తే నీకు పెరిగే కీర్తి లేదుగానీ ఓడిపోయావంటే మాత్రం అపకీర్తి అధికంగా ఉంటుంది. ఈ విపరీతాన్ని మనస్సులో బాగా ఆలోచించుకో!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యేతద్వచనం శ్రుత్వా సంప్రహస్య త్రిలోచనః ।
యథోచితం చ మధురమువాచ దానవేశ్వరమ్ ॥39॥

వ్యాసమునీ! దానవదూత పలికిన ఈ మాటలు ఆలకించి త్రిలోచనుడు పెద్దగా నవ్వాడు. అటుపైని మధురంగా యథోచితంగా బదులు పలికాడు.

మహేశ ఉవాచ – మహేశుడు అన్నాడు.

వయం భక్తపరాధీనా నస్వతంత్రాః కదాపి హి ।
తదిచ్ఛయా తత్కర్మాణో న కస్యాపిచపక్షిణః ॥40॥

పురా విధిప్రార్థనయా యుద్ధమాదౌ హరేరపి ।
మధుకైటభయోర్దైత్యవరయోః ప్రళయార్ణవే ॥41॥

దేవప్రార్థనయా తేన హిరణ్యకశిపోః పురా ।
ప్రహ్లాదార్థం వధోఽకారి భక్తానాం హితకారిణా ॥42॥

దానవదూతా! మేము భక్తపరాధీనులం. ఏనాడూ స్వతంత్రులం కానేకాదు. భక్తుల ఇచ్ఛమేరకు ఆయా పనులు చేస్తూ ఉంటాం. మేము ఎవరి పక్షానికీ చెందిన వాళ్ళం కాము. బ్రహ్మదేవుడి ప్రార్థన మేరకు అలనాడు శ్రీహరి మధుకైటభదైత్యవరులతో ప్రళయసముద్రాన యుద్ధం చేశాడు, సంహరించాడు. అలాగే పూర్వకాలాన హిరణ్యకశిపుణ్ని వధించాడంటే–దేవతల అభ్యర్థన ఒక కారణం, ప్రహ్లాదుణ్ని రక్షించడం మరొక కారణం. ఎల్లవేళలా భక్తహితకారి.

త్రిపురైస్సహ సంయుద్ధం భస్మత్వకరణం తతః ।
దేవప్రార్థనయాకారి మయాపి చ పురా శ్రుతమ్ ॥43॥

సర్వేశ్వర్యాస్సర్వ మాతుర్దేవ ప్రార్థనయా పురా ।
ఆసీచ్ఛుంభాదిభిర్యుద్ధం వధస్తేషాం తయా కృతః ॥44॥

త్రిపురాసురులతో నేను యుద్ధం చెయ్యడం భస్మం చెయ్యడం– ఇది కూడా దేవతల ప్రార్థన వల్లనే. ఇది నువ్వు వినే ఉంటావు. ఇక శుంభాదుల్ని వధించింది జగన్మాత ఆ సర్వేశ్వరి. దేవతల ప్రార్థనతోనే ఈ పని చేసింది.

అద్యాపి త్రిదశాస్సర్వే బ్రహ్మాణం శరణం యయుః ।
స సదేవో హరిర్మాం చ దేవశ్శరణమాగతః ॥45॥

హరిబ్రహ్మాదికానాం చ ప్రార్థనావశతోఽహమ్ ।
సురాణామీశ్వరో దూత! యుద్ధార్థమగమం ఖలు ॥46॥

ఇప్పుడు కూడా–దేవతలందరూ బ్రహ్మను వేడుకుంటే అతడూ సకల దేవతా సహితుడై శ్రీమహావిష్ణువూ వచ్చి నన్ను శరణువేడారు. హరిబ్రహ్మాదిదేవతల ప్రార్థనలకు లొంగి నేను–దేవతలకు ప్రభువుని కనక – వారి పక్షాన ఇలా యుద్ధానికి వచ్చాను. దూతా! తెలిసిందా!

పార్షదప్రవరస్త్వం హి కృష్ణస్య చ మహాత్మనః ।
యే యే హతాశ్చ దైతేయా న హి కేఽపి త్వయా సమాః ॥47॥

కా లజ్జా మహతీ రాజన్! మమ యుద్ధే త్వయా సహ ।
దేవకార్యార్థమీశోఽహం వినయేన చ ప్రేషితః ॥48॥

గచ్ఛ త్వం శంఖచూడే వై కథనీయం చ మే వచః ।
స చ యుక్తం కరోత్వత్ర సురకార్యం కరోమ్యహమ్ ॥49॥

ఇత్యుక్తా శంకరస్తత్ర విరరామ మహేశ్వరః ।
ఉత్తస్థౌ శంఖచూడస్య దూతోఽగచ్ఛత్తదంతికమ్ ॥50॥

శంఖచూడా! నువ్వు శ్రీకృష్ణుడంతటివాడికి సహచరుడివి. ఇప్పటి వరకూ నా చేతిలో మడిసిన దైత్యుల్లో ఎవ్వరూ నీకు సములు లేరు. దైత్యరాజా! అలాంటి నీతో యుద్ధానికి నేను సిగ్గుపడవలసింది ఏముంది! నేను ఈశ్వరుణ్ని. దేవకార్యార్థం వినయంతో సంప్రేషితుణ్ని. దూతా! వెళ్ళు. మీ శంఖచూడుడికి నేనన్న ఈ మాటలన్నీ చెప్పు. ఏది యుక్తమనుకుంటాడో అది చేస్తాడు. నేను మాత్రం దేవకార్యం నిర్వహిస్తాను–మహేశ్వరుడిలా చెప్పి విరమించాడు. దైత్యదూత లేచాడు. శంఖచూడసన్నిధికి వెళ్ళాడు.

ఇతి శ్రీ శివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధే శివదూతసంవాదో నామ పంచత్రింశోఽధ్యాయః ॥35॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడవధ శివదూత సంవాదం అనే ముప్పై అయిదవ అధ్యాయం సమాప్తం.

షట్త్రింశోఽధ్యాయః – ముప్పై ఆరవ అధ్యాయం

పరస్పరయుద్ధవర్ణనమ్ – పరస్పరయుద్ధవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

స దూతస్తత్ర గత్వా చ శివవాక్యం జగాద హ ।
సవిస్తరం యథార్థం చ నిశ్చయం తస్య తత్త్వతః ॥1॥

తచ్ఛ్రుత్వా శంఖచూడోఽసౌ దానవేంద్రః ప్రతాపవాన్ ।
అంగీచకార సుప్రీత్యా రణమేవ స దానవః ॥2॥

సమారురోహ యానం చ సహామాత్యైశ్చ సత్వరః ।
ఆదిదేశ స్వసైన్యం చ యుద్ధార్థం శంకరేణ చ ॥3॥

వ్యాసమునీ! దైత్యదూత తన ప్రభువు శంఖచూడుణ్ని సమీపించి శివుడి మాట సవిస్తరంగా యథాతథంగా విన్నవించాడు. సారాంశంగా శివుడి నిశ్చయాన్ని తెలియపరిచాడు. అది విని ఆ ప్రతాపశాలి దానవేంద్రుడు సంతోషంగా యుద్ధాన్ని అంగీకరించాడు. వాహనం అధిరోహించాడు. అమాత్యులూ అధిరోహించారు. సైన్యాన్ని శివుడితో యుద్ధానికి కదలండి అని ఆజ్ఞాపించాడు.

శివస్య సైన్యం దేవాంశ్చ ప్రేరయామాస సత్వరః ।
స్వయమప్యఖిలేశోఽపి సన్నద్ధోఽభూచ్చ లీలయా ॥4॥

యుద్ధారంభో బభూవాశు నేదుర్వాద్యాని భూరిశః ।
కోలాహలశ్చ సంజాతో వీరశబ్దస్తథైవ చ ॥5॥

దేవదానవయోర్యుద్ధం పరస్పరమభూన్మునే ।
ధర్మతో యుయుధే తత్ర దేవదానవయోర్గణః ॥6॥

శివుడు కూడా వెంటనే తన సైన్యాన్నీ దేవతలనూ యుద్ధానికి కదిలించాడు. అఖిలేశ్వరుడైన తాను సైతం లీలావిలాసంగా యుద్ధసన్నద్ధుడయ్యాడు. కోలాహలం మిన్ను ముట్టింది. వీరశబ్దాలు మారుమోగాయి. దేవదానవులకు సంగ్రామం ప్రారంభమయ్యింది. వ్యాసమునీ! ఇరువాగులవారూ ధర్మబద్ధంగా యుద్ధం సాగించారు.

స్వయం మహేంద్రో యుయుధే సార్ధం చ వృషపర్వణా ।
భాస్కరో యుయుధే విప్రచిత్తినా సహ ధర్మతః ॥7॥

గంభేన సహ విష్ణుశ్చ చకార పరమం రణమ్ ।
కాలాసురేణ కాలశ్చ గోకర్ణేన హుతాశనః ॥8॥

స్వయంగా మహేంద్రుడు వృషపర్వుడితో, సూర్యుడు విప్రచిత్తితో, విష్ణుమూర్తి దంభుడితో, యముడు కాలాసురుడితో, అగ్నిదేవుడు గోకర్ణుడితో తలపడి ధర్మబద్ధంగా భీకరసంగ్రామం సాగించారు.

కుబేరః కాలకేయేన విశ్వకర్మా మయేన చ ।
భయంకరేణ మృత్యుశ్చ సంహారేణ యమస్తథా ॥9॥

కాలంబికేన వరుణశ్చంచలేన సమీరణః ।
బుధశ్చ ఘటపృష్ఠేన రక్తాక్షేణ శనైశ్చరః ॥10॥

జయంతో రత్నసారేణ వసవో వర్చసాం గణైః ।
అశ్వినౌ దీప్తిమద్భ్యాం చ ధూమ్రేణ నలకూబరః ॥11॥

ధురంధరేణ ధర్మశ్చ గణకాక్షేణ మంగళః ।
శోభాకారేణ వైశ్వానః పిపిటేన చ మన్మథః ॥12॥

కుబేరుడు కాలకేయుడితో, విశ్వకర్మ వచ్చి మయుడితో, మృత్యుదేవుడేమో భయంకరుడితో, యముడు స్వయానా సంహారుడితో, వరుణుడు కాలంబికుడితో, వాయుదేవుడు చంచలుడితో, బుధుడు ఘటపృష్ఠుడితో, శని వచ్చి రక్తాక్షుడితో, జయంతుడు రత్నసారుడితో, అష్టవసువులూ వర్చోగణాలతో, అశ్వినీ దేవతలిద్దరూ దీప్తిమంతులిద్దరితో, నలకూబరుడు ధూమ్రుడితో, ధర్ముడు ధురంధరుడితో, మంగళుడు గణకాక్షుడితో, వైశ్వానుడు శోభాకారుడితో, మన్మథుడు పిపిటుడితో బాహాబాహీకి దిగారు.

గోకాముఖేన చూర్ణేన ఖడ్గనామ్నాసురేణ చ ।
ధూమ్రేణ సంహలేనాపి విశ్వేన చ ప్రతాపినా ॥13॥

పలాశేన ద్వాదశార్కా యుయుధుర్ధర్మతః పరే ।
అసురైరమరాస్సార్ధం శివసాహాయ్యశాలినః ॥14॥

ఏకాదశ మహారుద్రాశ్చైకాదశ భయంకరైః ।
అసురైర్యుయుధుర్వీరైర్మహాబలపరాక్రమైః ॥15॥

మహామణిశ్చ యుయుధే చోగ్రచండాదిభిస్సహ ।
రాహుణా సహ చంద్రశ్చ జీవః శుక్రేణ ధర్మతః ॥16॥

గోకాముఖుడు, చూర్ణుడు, ఖడ్గుడు, ధూమ్రుడు, సంహలుడు, విశ్వుడు, ప్రతాపి, పలాశుడు అనే రాక్షసులతో ద్వాదశార్కులు (12 మంది సూర్యుళ్ళు) ధర్మయుద్ధం సాగించారు. శివుడికి సహాయులుగా వచ్చిన మిగతా దేవతలు మిగతా అసురులతో తలపడ్డారు. ఏకాదశ మహారుద్రులు–మహాబలపరాక్రమసంపన్నులైన ఏకాదశ భయంకరాసుర వీరులతో యుద్ధానికి దిగారు. ఉగ్రచండాది దైత్యులతో మహామణి ఒంటరిగా కలబడ్డాడు. రాహువుతో చంద్రుడు, శుక్రుడితో బృహస్పతి (జీవుడు) ధర్మబద్ధంగా కలహించారు.

నందీశ్వరాదయస్సర్వే దానవప్రవరైస్సహ ।
యుయుధుశ్చ మహాయుద్ధే నోక్తా విస్తరతః పృథక్ ॥17॥

వటమూలే తథా శంభుస్తస్థౌ కాల్యాస్సుతేన చ ।
సర్వే చ యుయుధుస్సైన్యసమూహాస్సతతం మునే ॥18॥

రత్నసింహాసనే రమ్యే కోటిదానవసంయుతః ।
ఉవాస శంఖచూడశ్చ రత్నభూషణభూషితః ॥19॥

మహాయుద్ధో బభూవాథ దేవాసురవిమర్దనః ।
నానాయుధాని దివ్యాని చలంతి స్మ మహామృధే ॥20॥

వ్యాసమునీ! నందీశ్వరాదులందరూ దానవప్రవరులతో యుద్ధానికి దిగారు. ఆ మహాయుద్ధంలో వీరంతా ఎవరెవరితో తలపడ్డారనేది విడిగా విస్తరంగా చెప్పను గానీ అందరూ పోరాడుతూనే ఉన్నారు. అప్పుడు శివుడు కాళీపుత్రుడితో కలిసి ఆ మర్రిచెట్టు మొదట అలాగే కూర్చుని ఉన్నాడు. తక్కిన సేనలన్నీ భీకరంగా యుద్ధం చేస్తున్నాయి. అక్కడేమో – శంఖచూడుడు కోటి మంది దానవయోధులతో పరివేష్టితుడై రత్నాభరణభూషితుడై తన రమణీయ రత్నసింహాసనం మీద విరాజిల్లాడు. మునీశ్వరా! దేవదానవవినాశకమై ఉభయ సైన్యాలకూ భీషణసంగ్రామం జరిగింది. ఆ మహాయుద్ధంలో రకరకాల ఆయుధాలు దివ్యాస్త్రాలు ప్రయోగింపబడ్డాయి.

గదర్ష్టిపట్టిశాశ్చక్ర భుశుండిప్రాసముద్గరాః ।
నిస్త్రింశభల్లపరిఘాః శక్త్యున్ముఖపరశ్వధాః ॥21॥

శర తోమర ఖడ్గాశ్చ శతఘ్న్యశ్చ సహస్రశః ।
భిందిపాలాదయశ్చాన్యే వీరహస్తేషు శోభితాః ॥22॥

శిరాంసి చిచ్ఛిదుశ్చైభిర్వీరాస్తత్ర మహోత్సవాః ।
వీరాణాముభయోశ్చైవ సైన్యయోర్గర్జతో రణే ॥23॥

గదలు–ఋష్టులు–పట్టిశాలు–చక్రాలు–భృశుండలు–ప్రాసాలు–ముద్గరాలు–నిస్త్రింశాలు–భల్లాలు–పరిఘలు–శక్తులు–ఉన్ముఖులు–పరశ్వధాలు–శరాలు–తోమరాలు–ఖడ్గాలు–శతఘ్నులు–భిందిపాలాలు–ఇంకా తదితరాలైన ఆయుధాలు వేలసంఖ్యలో వీరుల చేతుల్లో తళతళలాడాయి. వీటితో ఆ మహావీరులు సోత్సాహులై పరస్పరం తలలు నరుక్కున్నారు. వీరగర్జనలతో ఉభయ సైన్యాలు తెగటార్చుకున్నాయి.

గజాస్తురంగా బహవః స్యందనాశ్చ పదాతయః ।
సారోహవాహా వివిధాస్తత్రాసన్ సువిఖండితాః ॥24॥

నికృత్త బాహూరుకరకటి కర్ణయుగాంఘ్రయః ।
సంఛిన్న ధ్వజ బాణాసి తనుత్ర వరభూషణాః ॥25॥

సముద్ధతకిరీటైశ్చ శిరోభిస్సహ కుండలైః ।
సంరంభనష్టైరాస్తీర్ణా బభౌ భూః కరభోరుభిః ॥26॥

మహాభుజైస్సాభరణై స్సంఛిన్నై స్సాయుధైస్తథా ।
అంగైరన్యైశ్చ సహసా పటలైర్వా ససారఘైః ॥27॥

ఏనుగులు, గుర్రాలు, రథాలు, భటులు ఇంకా అనేక వాహనాలు–వందల వేల సంఖ్యలో ఖండఖండాలై పోయాయి. చేతులు తెగి, తొడలు విరిగి, నడుములు విరిగి, చెవులు తెగి, పాదాలు విరిగి–సైనికులు ఒరిగిపోయారు. టెక్కేలు విరిగిన రథాలు. బాణాలు కోల్పోయిన వీరులు. ఖడ్గాలు జార్చుకున్న యోధులు. కవచాలూ ఆభరణాలూ పోగొట్టుకున్న సైనికులు, కిరీటాలతో కుండలాలతో అలరారుతూ తెగిపడ్డ శిరస్సులు, అరటిబోదెల వంటి ఊరువులతో – రణరంగం నిండిపోయింది. పిడికిళ్ళలో ఆయుధాలు తెగిపడ్డ బాహువులు, ముంజేతి వరకూ ఆభరణాలతో తెగిపడ్డ బాహువులు, ఇలాగే ఇంకా అనేక అవయవాల పోగులు, నేల అంతటా–తేనె టీగలు ముసురుకున్న తుట్టెల్లాగా పడి ఉన్నాయి.

మృధే భటాః ప్రధావంతః కబంధాన్ స్వశిరోఽక్షిభిః ।
పశ్యంతస్తత్ర చోత్పేతురుద్యతాయుధసద్భుజాః ॥28॥

వల్గంతోఽతితరాం వీరా యుయుధుశ్చ పరస్పరమ్ ।
శస్త్రైస్త్రైర్వివిధైస్తత్ర మహాబలపరాక్రమాః ॥29॥

కేచిత్ స్వర్ణముఖైర్బాణైర్వినిహత్య భటాన్ మృధే ।
వ్యనదన్ వీరసన్నాదం సతోయా ఇవ తోయదాః ॥30॥

సర్వతః శరకూటేన వీరస్సరథసారథిమ్ ।
వీరం సంఛాదయామాస ప్రావృట్సూర్యమివాంబుదః ॥31॥

రణరంగంలో అల్లంతదూరాన నాట్యమాడుతున్నాయి మొండేలు. పరుగులు తీస్తున్న వీరభటులు వాటిని తమ శిరస్సులతో తమ కన్నులతో చూశారు. (వీరికి ఇవి ఇంకా ఉన్నాయి. తెగిపోలేదని). ఆయుధాలతో చేతులెత్తి వాటి మీదకి (మొండేల మీదకి) దండెత్తారు. మరికొందరు భటులు సాయుధులై గంతులు వేస్తూ రకరకాల శస్త్రాస్త్రాలతో పరస్పరం పోరాడుతున్నారు. అందరూ మహాబలపరాక్రములే. కొందరు బంగారు ములుకుల బాణాలతో శత్రువీరులను సంహరించి– వానకారు మేఘాల్లాగా వీరగర్జనలు చేస్తున్నారు. ఒకడు తన బాణవృష్టితో శత్రువును రథసారథి సహితంగా– దట్టమైన మేఘం సూర్యుణ్ణి కప్పివేసినట్టు– కప్పివేశాడు.

అన్యోన్యమభిసంసృత్య యుయుధుర్ ద్వంద్వయోధినః ।
ఆహ్వయంతో విశంతోఽగ్రే క్షిపంతో మర్మభిర్మిథః ॥32॥

సర్వతో వీరసంఘాశ్చ నానాబాహుధ్వజాయుధాః ।
వ్యదృశ్యంత మహాసంఖ్యే కుర్వంతస్సింహసంరవమ్ ॥33॥

మహారవాన్ స్వశంఖాంశ్చ విదధ్ముర్వై పృథక్ పృథక్ ।
వల్గనం చక్రిరే తత్ర మహావీరాః ప్రహర్షితాః ॥34॥

ద్వంద్వ యుద్ధాలు సాగిస్తున్న మహావీరులు ఒకరినొకరు ఢీకొంటూ, రారమ్మని పిలుచుకుంటూ ఒకరినొకరు మించుతూ ఆయువుపట్టుల్లో తగిలేట్టు కొట్టుకుంటూ పోరాడుతున్నారు. రణరంగంలో అంతటా గుంపులు గుంపులుగా మహావీరులే. ధ్వజాల వంటి బాహువులే ఆయుధాలుగా పోరుతున్నవారే. అందరూ సింహనాదాలు చేస్తున్నవారే. ఎక్కడ చూసినా వీరే కనపడుతున్నారు. ఎవరికి వారుగా విజయశంఖాలను మహాభీషణంగా ఊదుతున్నారు. ఆనందంతో గంతులు వేస్తున్నారు.

ఏవం చిరతరం కాలం దేవదానవయోర్మహత్ ।
బభూవ యుద్ధం వికటం కరాళం వీరహర్షదమ్ ॥35॥

మహాప్రభోశ్చ లీలేయం శంకరస్య పరాత్మనః ।
యయా సమ్మోహితం సర్వం సదేవాసురమానుషమ్ ॥36॥

వ్యాసమునీ! ఇలా దేవదానవులకు మహాయుద్ధం చిరకాలం సాగింది. అది వికటయుద్ధం. కరాళయుద్ధం. అయితేనేమి–మహావీరులకు ఆనందప్రదం. మహాప్రభువూ పరాత్పరుడూ అయిన ఆ శంకరుడి లీలావిశేషం ఇది. దేవ–అసుర–మానుషజాతులన్నీ సమ్మోహితములైపోయాయి ఆ లీలతో.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధే పరస్పర యుద్ధవర్ణనం నామ షట్త్రింశోఽధ్యాయః ॥36॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందుశంఖచూడవధలో పరస్పరయుద్ధవర్ణనమనే ముప్పై ఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తత్రింశోఽధ్యాయః – ముప్పై ఏడవ అధ్యాయం

ససైన్యశంఖచూడయుద్ధవర్ణనమ్ – ససైన్యశంఖచూడయుద్ధవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తదా దేవగణాస్సర్వే దానవైశ్చ పరాజితాః ।
దుద్రువుర్భయభీతాశ్చ శస్త్రాస్త్రక్షతవిగ్రహాః ॥1॥

తే పరావృత్య విశ్వేశం శంకరం శరణం యయుః ।
త్రాహి త్రాహీతి సర్వేశేత్యూచుర్విహ్వలయా గిరా ॥2॥

దృష్ట్వా పరాజయం తేషాం దేవాదీనాం స శంకరః ।
సభయం వచనం శ్రుత్వా కోపముచ్చైశ్చకార హ ॥3॥

వ్యాసమునీ! అప్పుడు ఆ మహాసంగ్రామంలో దేవసైన్యాలు అన్నీ దానవుల చేతిలో ఓడిపోయాయి. అందరూ ఆయుధాలు వదిలేసి భయభీతులై క్షతగాత్రులై పలాయనం చిత్తగించారు. ఆనక నెమ్మదిగా గుమికూడి అందరూ కలసి వచ్చి విశ్వేశ్వరుణ్ణి శంకరుణ్ణి శరణు వేడుకున్నారు. సర్వేశా! త్రాహి! త్రాహి! అని దీన వచనాలతో విహ్వలంగా శరణువేడుకున్నారు. ఇలా దేవతల పరాజయాన్నీ వారి భయాన్ని వారి దీనాలాపాన్నీ కనీ-వినీ శంకరుడికి తీవ్రంగా కోపం వచ్చింది.

నిరీక్ష్య చ కృపాదృష్ట్యా దేవేభ్యశ్చాభయం దదౌ ।
బలం చ స్వగణానాం వై వర్ధయామాస తేజసా ॥4॥

శివాజ్ఞప్తస్తదా స్కందో దానవానాం గణైస్సహ ।
యుయుధే నిర్భయస్సంఖ్యే మహావీరో హరాత్మజః ॥5॥

కృత్వా క్రోధం వీరశబ్దం దేవో యస్తారకాంతకః ।
అక్షౌహిణీనాం శతకం సమరే స జఘాన హ ॥6॥

రుధిరం పాతయామాస కాళీ కమలలోచనా ।
తేషాం శిరాంసి సంఛిద్య బభక్ష సహసా చ సా ॥7॥

పపౌ రక్తాని తేషాం చ దానవానాం సమం తతః ।
యుద్ధం చకార వివిధం సురదానవభీషణమ్ ॥8॥

అయినా అందరివైపూ దయగా చూసి దేవతలకు అభయమిచ్చాడు. వెంటనే తన తేజస్సుతో శివగణాలకు బలం వృద్ధిచెందించాడు. స్కందుణ్ణి రణానికి ఆజ్ఞాపించాడు. ఆ మహావీరుడు శివపుత్రుడు నిర్భయంగా వెళ్ళి దానవసేనలతో యుద్ధం ఆరంభించాడు. అతడు తారకాంతకుడు. క్రోధంతో వీరశబ్దం చేసి క్షణంలో దేవసేనలను

నూరు అక్షౌహిణులను నేలకూల్చాడు. రక్తం పారించాడు. అప్పుడు కమలాయతాక్షి కాళికాదేవి దానవుల శిరస్సులు త్రుంచి భీకరంగా అందరినీ భక్షించింది. రక్తం తాగేసింది. తానూ వారితో సమానంగా సకలప్రాణి భీషణంగా యుద్ధం చేసింది.

శతలక్షం గజేంద్రాణాం శతలక్షం నృణాం తథా ।
సమాదాయైకహస్తేన ముఖే చిక్షేప లీలయా ॥9॥

కబంధానాం సహస్రం చ సన్ననర్త రణే బహు ।
మహాన్ కోలాహలో జాతః క్లీబానాం చ భయంకరః ॥10॥

పునః స్కందః ప్రకుప్యోచ్చైః శరవర్షాంశ్చకార హ ।
పాతయామాస క్షణతః కోటిశోఽసురనాయకాన్ ॥11॥

దానవాః శరజాలేన స్కందస్య క్షతవిగ్రహాః ।
భీతాః ప్రదుద్రువుస్సర్వే శేషా మరణతస్తదా ॥12॥

వృషపర్వా విప్రచిత్తిః దండశ్చాపి వికంపనః ।
స్కందేన యుయుధుస్సార్ధం తేన సర్వే క్రమేణ చ ॥13॥

కోటి ఏనుగుల్నీ, కోటి యోధుల్నీ, ఒకే ఒక్క చేతిలోకి తీసుకుని ఆ మహాకాళి ఒక విలాసంగా నోటిలో వేసుకుని మింగేసింది. రణరంగంలో వేలవేల కబంధాలు వికృతంగా నాట్యం చేశాయి. పిరికివారికి గుండెలు పగిలేలా మహాకోలాహలం మిన్ను ముట్టింది. కుమారస్వామి మరొక్కసారి విజృంభించి శరవృష్టులు కురిపించాడు. కోట్లసంఖ్యలో అసురవీరుల్ని క్షణంలో నేలకూల్చాడు. చావగా మిగిలిన దానవులు క్షతగాత్రులై భయభీతులై పారిపోయారు. అప్పుడు వృషపర్వుడు-విప్రచిత్తి-దండుడు-వికంపనుడు అనే దానవనాయకులు అందరూ ఒక్కుమ్మడిగా స్కందుడితో తలపడ్డారు.

మహామారీ చ యుయుధే న బభూవ పరాఙ్ముఖీ ।
బభూవుస్తే క్షతాంగాశ్చ స్కందశక్తిప్రపీడితాః ॥14॥

మహామారీ స్కందయోశ్చ విజయోఽభూత్తదా మునే ।
నేదుర్దుందుభయస్స్వర్గే పుష్పవృష్టిః పపాత హ ॥15॥

వెనక్కి తిరిగి చూడకుండా మహామారి కాళికాదేవి సాగించిన యుద్ధంలో, స్కందుడు ప్రయోగించిన శక్త్యాయుధంతో దైత్యనాయకులు క్షతాంగులయ్యారు. వ్యాసమునీ! కాళీస్కందులకు విజయం దక్కింది. స్వర్గంలో దేవదుందుభులు మోగాయి. ఆకాశం నుంచి పూలవాన కురిసింది.

స్కందస్య సమరం దృష్ట్వా మహారౌద్రం తమద్భుతమ్ ।
దానవానాం క్షయకరం యథా ప్రకృతికల్పకమ్ ॥16॥

మహామారీకృతం తచ్ఛోపద్రవం క్షయహేతుకమ్ ।
చుకోపాతీవ సహసా సన్నద్ధోఽభూత్ స్వయం తదా ॥17॥

వరం విమానమారుహ్య నానాశస్త్రాస్త్రసంయుతమ్ ।
అభయం సర్వవీరాణాం నానారత్నపరిచ్ఛదమ్ ॥18॥

మహావీరైశ్శంఖచూడో జగామ రణమధ్యతః ।
ధనుర్వికృష్య కర్ణాంతం చకార శరవర్షణమ్ ॥19॥

ప్రకృతివైపరీత్యంలా మహారౌద్రంగా మహాద్భుతంగా సకలాసురవినాశకంగా కుమారస్వామి సాగించిన యుద్ధాన్ని తిలకించి, మహామారి కాళికాదేవి కల్పించిన మహోపద్రవాన్ని చూసి–శంఖచూడుడు క్రోధ వివశుడయ్యాడు. వెంటనే తన ఉత్తమవిమానం అధిరోహించాడు. అది నానాశస్త్రాస్త్రసంయుతం. రత్నాభరణభూషితం. సకల దానవవీరులకూ అభయప్రదం. మహావీరులతో కలసి ఆ మహావీరుడు శంఖచూడుడు ఆ విమానం మీద రణమధ్యభాగంలోకి చేరుకున్నాడు. చేరుకుంటూనే–ధనుస్సును చెవిదాకా లాగి శరవృష్టి కురిపించాడు.

తస్య సా శరవృష్టిశ్చ దుర్నివార్యా భయంకరీ ।
మహాఘోరాంధకారశ్చ వధస్థానే బభూవ హ ॥20॥

దేవాః ప్రదుద్రువుస్సర్వే యేఽన్యే నందీశ్వరాదయః ।
ఏక ఏవ కార్తికేయస్తస్థౌ సమరమూర్ధని ॥21॥

పర్వతానాం చ సర్పాణాం నాగానాం శాఖినాం తథా ।
రాజా చకార వృష్టిం చ దుర్నివార్యాం భయంకరీమ్ ॥22॥

తద్వృష్ట్యా ప్రహతః స్కందో బభూవ శివనందనః ।
నీహారేణ చ సాంద్రేణ సంవృతో భాస్కరో యథా ॥23॥

అతడి ఆ శరవృష్టి అతిభయంకరి. దుర్నివార్య. రణరంగమంతటా గాఢంధకారం అలముకొంది. దేవతలందరూ పారిపోయారు. నందీశ్వరాది గణనాయకులూ పలాయనం పఠించారు. కార్తికేయుడొక్కడే రణాగ్రాన నిలబడ్డాడు. అప్పుడు ఆ దైత్యరాజు శంఖచూడుడు శిలావర్షం, సర్పవర్షం, నాగవర్షం, తరువర్షం ఇలా భయంకరంగా దుర్నివార్యంగా రకరకాల వర్షాలు కురిపించాడు. వీటి తాకిడికి శివనందనుడు షణ్ముఖుడు–దట్టంగా మంచుకప్పిన భాస్కరుడిలా అయిపోయాడు.

నానావిధాం స్వమాయాం చ చకార మయదర్శితామ్ ।
తాం నావిదన్ సురాః కేఽపి గణాశ్చ మునిసత్తమ ॥24॥

తదైవ శంఖచూడశ్చ మహామాయీ మహాబలః ।
శరేణైకేన దివ్యేన ధనుశ్చిచ్ఛేద తస్య వై ॥25॥

బభంజ తద్రథం దివ్యం చిచ్ఛేద రథపీడకాన్ ।
మయూరం జర్జరీభూతం దివ్యాస్త్రేణ చకార సః ॥26॥

శక్తిం చిక్షేప సూర్యాభాం తస్య వక్షసి ఘాతినీమ్ ।
మూర్ఛామవాప సహసా తత్ప్రహారేణ స క్షణమ్ ॥27॥

వ్యాసమునీ! మయుడు నేర్పిన రకరకాల మాయావిద్యలను ఆ శంఖచూడుడు ప్రదర్శించాడు. దేవతలుగానీ శివగణాలుగానీ ఆ మాయను ఎరగరు. అతడు అంతటి మహామాయి. మహాబలి. అప్పుడు ఒకే ఒక్క దివ్యశరంతో గుహుడి ధనుస్సును విరగగొట్టాడు. మరొక బాణంతో రథం కూల్చాడు. రథవాహనాలను చీల్చాడు. అతడి దివ్యాస్త్రానికి తాళలేక కుమారస్వామి వాహన మయూరం జర్జరీ భూతమయ్యింది. వెంటనే గురిచూసి సూర్యసంకాశమైన శక్త్యాయుధాన్ని అతడి వక్షఃస్థలానికి తగిలేట్టు విసిరాడు. దాని దెబ్బకు కుమారస్వామి క్షణకాలం స్పృహ కోల్పోయాడు.

పునశ్చ చేతనాం ప్రాప్య కార్తికః పరవీరహా ।
రత్నేంద్రసారనిర్మాణమారురోహ స్వవాహనమ్ ॥28॥

స్మృత్వా పాదౌ మహేశస్య సాంబికస్య చ షణ్ముఖః ।
శస్త్రైస్త్రాణి గృహీత్వైవ చకార గణముల్బణమ్ ॥29॥

సర్పాంశ్చ పర్వతాంశ్చైవ వృక్షాంశ్చ ప్రస్తరాంస్తథా ।
సర్వాంశ్చిచ్ఛేద కోపేన దివ్యాస్త్రేణ శివాత్మజః ॥30॥

వహ్నిం నివారయామాస పార్జన్యేన శరేణ హ ।
రథం ధనుశ్చ చిచ్ఛేద శంఖచూడస్య లీలయా ॥31॥

సన్నాహం సర్వవాహాంశ్చ కిరీటం ముకుటోజ్జ్వలమ్ ।
వీరశబ్దం చకారాసౌ జగర్జ చ పునః పునః ॥32॥

చిక్షేప శక్తిం సూర్యాభాం దానవేంద్రస్య వక్షసి ।
తత్ప్రహారేణ సంప్రాప మూర్ఛాం దీర్ఘతమేన చ ॥33॥

అయినా, శత్రుసంహారకుడు ఆ కార్తికుడు వెంటనే తేరుకున్నాడు. వజ్రకఠినమైన మరో దివ్యరథం అధిరోహించాడు. పార్వతీపరమేశ్వరుల పాదపద్మాలను ధ్యానించాడు. సకలశస్త్రాస్త్రాలతోను మహోల్బణంగా సంగ్రామం సాగించాడు. శంఖచూడుడు కురిపించిన సర్ప–పర్వత–వృక్ష–ప్రస్తర వర్షాలను తన దివ్యాస్త్రాలతో నిలువరించాడు. ఆగ్నేయాస్త్రాన్ని పర్జన్యాస్త్రంతో చల్లార్చాడు. కేళీవిలాసంగా శంఖచూడుడి రథాన్ని తుత్తునియలు చేశాడు. అతడి సన్నాహాన్నీ సర్వవాహన సమూహాన్నీ చివరికి రత్నకిరీటాన్నీ నేలకూల్చాడు. వీరశబ్దం చేశాడు. ముమ్మారు గర్జించాడు. సూర్యాభమూ సుదీర్ఘమూ అయిన తన శక్తి ఆయుధంతో శంఖచూడుడి గుండెల మీద కొట్టాడు. ఆ దెబ్బకు దానవేంద్రుడు మూర్ఛిల్లాడు.

ముహూర్తమాత్రం తత్క్లేశం వినీయ స మహాబలః ।
చేతనాం ప్రాప్య చోత్తస్థౌ జగర్జ హరివర్చసః ॥34॥

శక్త్యా జఘాన తం చాపి కార్తికేయం మహాబలమ్ ।
స పపాత మహీపృష్ఠే మోఘాం కుర్వన్ విధిప్రదామ్ ॥35॥

కాళీ గృహీత్వా తం క్రోడే నినాయ శివసన్నిధౌ ।
జ్ఞానేన తం శివశ్చాపి జీవయామాస లీలయా ॥36॥

దదౌ బలమనంతం చ సముత్తస్థౌ ప్రతాపవాన్ ।
గమనాయ మతిం చక్రే పునస్తత్ర శివాత్మజః ॥37॥

మహాబలశాలి శంఖచూడుడు క్షణకాలం ఆ క్లేశాన్ని భరించి వెంటనే తేరుకున్నాడు. సింహవర్చసుడై లేచి నిలబడ్డాడు. భీషణంగా గర్జించాడు. తన శక్తి ఆయుధం చేపట్టి కార్తికేయుడి మీదకి విసిరాడు. అది అమోఘమైన ఆయుధం. బ్రహ్మవరం కారణంగా దానికి తిరుగులేదు. ఈ మాటను నిజం చేస్తూ కార్తికేయుడు మూర్ఛిల్లాడు. వెంటనే కాళికాదేవి అతణ్ని ఒడిలోకి తీసుకుని భద్రంగా శివుడి చెంతకు తీసుకువెళ్ళింది. జ్ఞాన స్వరూపి శివుడు ఒక దివ్యలీలగా కార్తికేయుణ్ని పునరుజ్జీవితుణ్ని చేశాడు. అనంతబలం ప్రసాదించాడు. వెంటనే లేచి నిలబడ్డాడు మహాప్రతాపశాలి కార్తికేయుడు. శివపుత్రుడు. మళ్ళీ యుద్ధానికి బయలుదేరబోయాడు.

ఏతస్మిన్నంతరే వీరో వీరభద్రో మహాబలః ।
శంఖచూడేన యుయుధే సమరే బలశాలినా ॥38॥

వవర్ష సమరేఽస్త్రాణి యాని యాని చ దానవః ।
చిచ్ఛేద లీలయా వీరస్తాని తాని నిజైశ్శరైః ॥39॥

దివ్యాన్యస్త్రాణి శతశో ముముచే దానవేశ్వరః ।
తాని చిచ్ఛేద తం బాణైః వీరభద్రః ప్రతాపవాన్ ॥40॥

అథాతీవ చుకోపోచ్చైశ్శంఖచూడః ప్రతాపవాన్ ।
శక్త్యా జఘానోరసి తం స చకంపే పపాత కౌ ॥41॥

ఇంతలోకీ మహావీరుడు వీరభద్రుడు–బలశాలి శంఖచూడుడితో తల పడ్డాడు. దానవుడు కురిపించిన శరవర్షాలను తనవైన శరవర్షాలతో దీటుగా కేళీవిలాసంగా అంతరింపజేశాడు. దానవుడు వందలూ వేలుగా దివ్యాస్త్రాలను గుప్పించాడు. వీరభద్రుడు వాటినన్నింటినీ ఛేదించాడు. దీనితో శంఖచూడుడికి కోపం మితిమీరింది. వెంటనే శక్తి ఆయుధం ప్రయోగించాడు. అది వచ్చి వచ్చి గుండెకు తాకింది. వీరభద్రుడు క్రక్కదిలిపోయాడు. నేలకు ఒరిగిపోయాడు.

క్షణేన చేతనాం ప్రాప్య సముత్తస్థౌ గణేశ్వరః ।
జగ్రాహ చ ధనుర్భూయః వీరభద్రో గణాగ్రణీః ॥42॥

ఏతస్మిన్నంతరే కాళీ జగామ సమరం పునః ।
భక్షితుం దానవాన్ స్వాంశ్చ రక్షితుం కార్తికేచ్ఛయా ॥43॥

వీరాస్తామనుజగ్ముశ్చ తే చ నందీశ్వరాదయః ।
సర్వే దేవాశ్చ గంధర్వా యక్షా రక్షాంసి పన్నగాః ॥44॥

వాద్యభాండాశ్చ బహుశః శతశో మధువాహకాః ।
పునస్సముద్యతాశ్చాసన్ వీరా ఉభయతోఽఖిలాః ॥45॥

అయినా, క్షణంలో తేరుకున్నాడు వీరభద్రుడు. శివగణాలకు అగ్రనేత అతడు. ధనుస్సుని అందుకున్నాడు. అంతలోకీ–కార్తికేయుడి కోరిక మేరకు కాళీమాత రణరంగానికి దూసుకు వెళ్ళింది. దానవుల్ని భక్షించింది. అస్మదీయుల్ని రక్షించింది. నందీశ్వరాదులైన గణమహావీరులు ఆమె వెంట నడిచారు. దేవతలు గంధర్వులు యక్షులు రాక్షసులు పన్నగులు–ఇలా అందరూ ఆమె వెంట నడిచారు. వాద్యాలు మోగించారు. మధుభాండాలను మోసుకువెళ్ళారు. మళ్ళీ ఉభయసేనలలోనూ మహావీరులంతా యుద్ధసన్నద్ధులయ్యారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధే ససైన్యశంఖచూడయుద్ధవర్ణనం నామ సప్తత్రింశోఽధ్యాయః ॥37॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడవధలో ససైన్యశంఖచూడయుద్ధవర్ణనమనే ముప్పై ఏడవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

అష్టత్రింశోఽధ్యాయః – ముప్పై ఎనిమిదవ అధ్యాయం
కాళీయుద్ధవర్ణనమ్ – కాళీయుద్ధవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

సా చ గత్వా హి సంగ్రామం సింహనాదం చకార హ ।
దేవ్యాశ్చ తేన నాదేన మూర్ఛామాపుశ్చ దానవాః ॥1॥

అట్టాట్టహాసమశివం చకార చ పునఃపునః ।
తదా పపౌ చ మాధ్వీకం ననర్త రణమూర్ధని ॥2॥

ఉగ్రదంష్ట్రా చోగ్రదండా కోటలీ చ పపౌ మధు ।
అన్యాశ్చ దేవ్యస్తత్రాజౌ ననృతుర్మధు సంపపుః ॥3॥

మహాన్ కోలాహలో జాతో గణదేవదళే తదా ।
జహృషుర్బహు గర్జంతస్సర్వే సురగణాదయః ॥4॥

కాళికాదేవి రణరంగంలోకి ప్రవేశించి సింహనాదం చేసింది. ఆ ధ్వనికే దానవులు మూర్ఛపోయారు. అమంగళకరమైన అట్టహాసాన్ని పదే పదే చేస్తూ మధువు సేవిస్తూ రణాగ్రభాగంలో భీకరనృత్యం చేసింది. ఆమెతో పాటు ఉగ్రదంష్ట్ర–ఉగ్రదండ–కోటలి–ఇత్యాదులైన అనుచరాంగనలు సైతం మధుపానం చేస్తూ నృత్యమాడారు. గణ–దేవ సైన్యాలలో ఇలా మహాకోలాహలం చెలరేగింది. అందరూ వీరగర్జనలు చేస్తూ ఆనందోత్సాహాలతో గంతులు వేశారు.

దృష్ట్వా కాళీం శంఖచూడః శీఘ్రమాజౌ సమాయయౌ ।
దానవాశ్చ భయం ప్రాప్తా రాజా తేభ్యోఽభయం దదౌ ॥5॥

కాళీ చిక్షేప వహ్నిం చ ప్రళయాగ్నిశిఖోపమమ్ ।
రాజా జఘాన తం శీఘ్రం వైష్ణవాంకితలీలయా ॥6॥

నారాయణాస్త్రం సా దేవీ చిక్షేప తదుపర్యరమ్ ।
వృద్ధిం జగామ తచ్ఛస్త్రం దృష్ట్వా వామం చ దానవమ్ ॥7॥

కాళికాదేవిని చూశాడు శంఖచూడుడు. దానవులంతా భయభ్రాంతులైనట్టు గమనించాడు. వెంటనే రణరంగానికి వచ్చాడు. తన వారికందరికీ అభయమిచ్చాడు. అంతలోకీ కాళికాదేవిప్రళయాగ్నిజ్వాలిక లాంటి ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించింది. దాన్ని శంఖచూడుడు వైష్ణవాంకితలీలతో చిటుక్కున ఆర్పివేశాడు. అప్పుడామె నారాయణాస్త్రం ప్రయోగించింది. అది దుష్టదానవుడి వైపు వస్తూ క్షణక్షణానికి వృద్ధి పొందుతోంది.

తం దృష్ట్వా శంఖచూడశ్చ ప్రళయాగ్నిశిఖోపమమ్ ।
పపాత దండవద్భూమౌ ప్రణనామ పునఃపునః ॥8॥

నివృత్తిం ప్రాప తచ్ఛస్త్రం దృష్ట్వా నమ్రం చ దానవమ్ ।
బ్రహ్మాస్త్రమథ సా దేవీ చిక్షేప మంత్రపూర్వకమ్ ॥9॥

తం దృష్ట్వా ప్రజ్వలంతం చ ప్రణమ్య భువి సంస్థితః ।
బ్రహ్మాస్త్రేణ దానవేంద్రో వినివారం చకార హ ॥10॥

ప్రళయాగ్నిజ్వాలలాగా వృద్ధిపొందుతూ తనమీదకి వస్తున్న ఆ నారాయణాస్త్రాన్ని చూసి శంఖచూడుడు బహుధా నమస్కరించి నేలమీద సాష్టాంగపడ్డాడు. దానవేశ్వరుడలా వినమ్రుడు కావడంతో నారాయణాస్త్రం వెనుదిరిగింది. అది గమనించి కాళికాదేవి మరింత క్రుద్ధురాలై బ్రహ్మాస్త్రం అనుసంధించింది. మంటలు కక్కుతూ వస్తున్న ఆ బ్రహ్మాస్త్రానికి కూడా శంఖచూడుడు అలాగే పదే పదే నమస్కరించి సాష్టాంగపడ్డాడు. అదీ అలాగే వెనుదిరిగింది.

అథ క్రుద్ధో దానవేంద్రో ధనురాకృష్య రంహసా ।
చిక్షేప దివ్యాన్యస్త్రాణి దేవ్యై వై మంత్రపూర్వకమ్ ॥11॥

ఆహారం సమరే చక్రే ప్రసార్య ముఖమాయతమ్ ।
జగర్జ సాట్టహాసం చ దానవా భయమాయయుః ॥12॥

కాళ్యై చిక్షేప శక్తిం స శతయోజనమాయతామ్ ।
దేవీ దివ్యాస్త్రజాలేన శతఖండం చకార సా ॥13॥

స చ వైష్ణవమస్త్రం చ చిక్షేప చండికోపరి ।
మాహేశ్వరేణ కాళీ చ వినివారం చకార సా ॥14॥

ఏవం చిరతరం యుద్ధమన్యోన్యం సంబభూవ హ ।
ప్రేక్షకా అభవన్ సర్వే దేవాశ్చ దానవా అపి ॥15॥

అప్పుడు దానవేంద్రుడు క్రోధంతో విజృంభించి దివ్యధనుస్సును వేగంగా ఎక్కుపెట్టాడు. మంత్రపూర్వకంగా ఎన్నో దివ్యాస్త్రాలను గుప్పించాడు. కాళికాదేవి తన నోటిని విస్తరించి ఆ అస్త్రాలనన్నింటినీ ఆహారంగా మింగేసింది. అతిభయంకరంగా గర్జించింది. దానవుల గుండెలు పగిలేలా అట్టహాసం చేసింది. ఇక లాభం లేదని శంఖచూడుడు వందయోజనాల పొడవైన తన శక్తి ఆయుధాన్ని ప్రయోగించాడు. దాన్ని కాళికాదేవి దివ్యాస్త్రజాలంతో నూరు ముక్కలుగా విరగ్గొట్టింది. వెంటనే దానవుడు వైష్ణవాస్త్రం సంధించాడు. కాళికాదేవి మాహేశ్వరాస్త్రంతో దాన్ని చిత్తు చేసింది. ఇలా కాళికా శంఖచూడులకు మహాసంగ్రామం భీకరంగా సుదీర్ఘంగా నడిచింది. సకల దేవతలూ సకల దానవులూ కేవలం చూపరులై నిలబడ్డారు.

అథ క్రుద్ధా మహాదేవీ కాళీ కాలసమా రణే ।
జగ్రాహ మంత్రపూతం చ శరం పాశుపతం రుషా ॥16॥

క్షేపాత్పూర్వం తన్నిషేద్ధుం వాగ్బభూవాశరీరిణీ ।
న క్షిపాస్త్రమిదం దేవి శంఖచూడాయ వై రుషా ॥17॥

మృత్యుః పాశుపతాన్నాస్త్రమోఘాదపి చ చండికే ।
శంఖచూడస్య వీరస్యోపాయమన్యం విచారయ ॥18॥

ఇత్యాకర్ణ్య భద్రకాళీ న చిక్షేప తదస్త్రకమ్ ।
శతలక్షం దానవానాం జఘాన లీలయా క్షుధా ॥19॥

కొంత సేపటికి–ప్రళయకాల సమానురాలైన ఆ కాళీమహాదేవికి క్రోధం పెల్లుబికింది. మంత్రపూతమైన పాశుపతాస్త్రాన్ని ప్రయోగించబోయింది. అంతలోకీ ఒక అశరీరవాణి ఆకాశం నుంచి వినిపించింది. వద్దు దేవీ!వద్దు. శంఖచూడుడి మీదకు పాశుపతాన్ని సంధించకు. ఎందుకంటే, ఓ చండికా! ఎంత అమోఘమైన పాశుపతం కూడా ఈ దానవుణ్ని సంహరించలేదు. క్రోధం విడిచి, ఈ వీరుణ్ని సంహరించేందుకు మరొక ఉపాయం ఏదైనా ఆలోచించు! ఈ అశరీరవాణిని ఆలకించి భద్రకాళి పాశుపతాన్ని ప్రయోగించడం విరమించింది. కానీ లక్షలు లక్షలుగా దానవభటుల్ని ఆకలితో అవలీలగా భక్షించింది.

అత్తుం జగామ వేగేన శంఖచూడం భయంకరీ ।
దివ్యాస్త్రేణ చ రౌద్రేణ వారయామాస దానవః ॥20॥

అథ క్రుద్ధో దానవేంద్రః ఖడ్గం చిక్షేప సత్వరమ్ ।
గ్రీష్మసూర్యోపమం తీక్ష్ణధార మత్యంతభీకరమ్ ॥21॥

సా కాళీ తం సమాలోక్యాయాంతం ప్రజ్వలితం రుషా ।
ప్రసార్య ముఖమాహారం చక్రే తస్య చ పశ్యతః ॥22॥

దివ్యాన్యస్త్రాణి చాన్యాని చిచ్ఛేద దానవేశ్వరః ।
ప్రాప్తాని పూర్వతశ్చక్రే శతఖండాని తాని చ ॥23॥

అదే వరసలో అతిభయంకరంగా శంఖచూడుణ్ని భక్షించడానికి అతనివైపు వేగంగా దూసుకువెళ్ళింది. రుద్రసంబంధమైన ఒక దివ్యాస్త్రంతో ఆ దానవుడు ఆమెను వారించాడు. కోపం పట్టలేక తన చేతిలో ఉన్న భీకరఖడ్గాన్ని–పదునెక్కి గ్రీష్మసూర్యుడిలా మెరిసిపోతున్న తీక్ష్ణఖడ్గాన్ని కాళికమీదకు విసిరాడు. అది వేగంగా తనవైపు రావడం గమనించిన చండిక నోరు పెద్దదిగా తెరిచి ఆ ఖడ్గాన్ని ఆహారంలాగా మింగేసింది. దానవుడు కన్నులప్పగించి నిలబడ్డాడు. అటుపైని ఆ చండిక ప్రయోగించిన దివ్యాస్త్రాలను అన్నింటినీ దానవేశ్వరుడు ఖండించాడు. నూరేసి ముక్కలుగా ఒక వరసలో ఖండించాడు.

పునరత్తుం మహాదేవీ వేగతస్తం జగామ హ ।
సర్వసిద్ధేశ్వరః శ్రీమానంతర్ధానం చకార సః ॥24॥

వేగేన ముష్టినా కాళీ తమదృష్ట్వా చ దానవమ్ ।
బభంజ చ రథం తస్య జఘాన కిల సారథిమ్ ॥25॥

అథాగత్య ద్రుతం మాయీ చక్రం చిక్షేప వేగతః ।
భద్రకాళ్యై శంఖచూడః ప్రళయాగ్నిశిఖోపమమ్ ॥26॥

సా దేవీ తం తదా చక్రం వామహస్తేన లీలయా ।
జగ్రాహ స్వముఖేనైవాహారం చక్రే రుషా ద్రుతమ్ ॥27॥

ముష్ట్యా జఘాన తం దేవీ మహాకోపేన వేగతః ।
బభ్రామ దానవేంద్రోఽపి క్షణం మూర్ఛామవాప సః ॥28॥

మహాదేవికి కోపం మిన్నుముట్టింది. అతణ్ని భక్షించడం కోసం మళ్ళీ వేగంగా దూసుకువెళ్ళింది. దానవేశ్వరుడు సకలమాయాసిద్ధేశ్వరుడు. మాయావిద్యావంతుడు. కనక క్షణంలో మాయమయ్యాడు. ఎటుపోయాడో కాళికాదేవికి కనిపించలేదు. ముష్టిఘాతంతో అతడి రథాన్నీ సారథినీ వాహనాలనూ పచ్చడి పచ్చడి చేసింది. అంతలోకీ ఆ మహామాయావి ప్రత్యక్షమయ్యాడు. చక్రాయుధాన్ని వేగంగా విసిరాడు. అది ప్రళయాగ్నిజ్వాలలాగా వచ్చేస్తోంది. కాళికాదేవి అవలీలగా దాన్ని ఎడమచేత్తో అందిపుచ్చుకుంది. పట్టరాని కోపంతో నోరు తెరిచి చక్రాన్ని గుటుక్కున మింగేసింది. కుడిచేతి పిడికిలి బిగించి బలంగా ఒక దెబ్బ వేసింది. ఆ ముష్టిఘాతానికి దానవేంద్రుడు గిర్రున తిరిగి మూర్ఛపోయాడు.

క్షణేన చేతనాం ప్రాప్య స చోత్తస్థౌ ప్రతాపవాన్ ।
న చక్రే బాహుయుద్ధం చ మాతృబుద్ధ్యా తయా సహ ॥29॥

గృహీత్వా దానవం దేవీ భ్రామయిత్వా పునః పునః ।
ఊర్ధ్వం చ ప్రాపయామాస మహాకోపేన వేగతః ॥30॥

ఉత్పపాత చ వేగేన శంఖచూడః ప్రతాపవాన్ ।
నిపత్య చ సముత్తస్థౌ ప్రణమ్య భద్రకాళికామ్ ॥31॥

రత్నేంద్రసారనిర్మాణవిమానం సుమనోహరమ్ ।
ఆరురోహ స హృష్టాత్మా న భ్రాంతోఽపి మహారణే ॥32॥

అతడు మహాప్రతాపశాలి. మరు నిముసంలో తేరుకున్నాడు. లేచి నిలబడ్డాడు. కానీ కాళికాదేవితో బాహుయుద్ధానికి దిగలేదు. మాతృబుద్ధితో అలాగే నిలుచున్నాడు. భద్రకాళి మాత్రం అమాంతం అతణ్ని పైకెత్తి గాలిలో గిరగిరా తిప్పి మహాకోపంతో విసిరేసింది. వాడు గిరికీలు కొడుతూ నేలమీద పడి వెంటనే లేచి నమస్కరిస్తూ నిలబడ్డాడు. వజ్రనిర్మితమూ సుమనోహరమూ అయిన దివ్యవిమానం అధిరోహించాడు. అంతటి మహారణంలోనూ చెక్కుచెదరకుండా ఆనందంగా విమానం అధిష్ఠించాడు. ఎటో వెళ్ళిపోయాడు.

దానవానాం హి క్షతజం సా పపౌ కాళికా క్షుధా ।
ఏతస్మిన్నంతరే తత్ర వాగ్బభూవాశరీరిణీ ॥33॥

లక్షం చ దానవేంద్రాణామవశిష్టం రణేఽధునా ।
ఉద్ధతం గుంజతాం సార్ధం తతస్త్వం భుంక్ష్వ చేశ్వరీ ॥34॥

సంగ్రామే దానవేంద్రం చ హంతుం న కురు మానసమ్ ।
అవధ్యోఽయం శంఖచూడస్తవ దేవీతి నిశ్చయమ్ ॥35॥

తచ్ఛ్రుత్వా వచనం దేవీ నిస్సృతం వ్యోమమండలాత్ ।
దానవానాం బహూనాం చ మాంసం చ రుధిరం తథా ॥36॥

భుక్త్వా పీత్వా భద్రకాళీ శంకరాంతికమాయయౌ ।
ఉవాచ రణవృత్తాంతం పౌర్వాపర్యేణ సక్రమమ్ ॥37॥

శంఖచూడుడు అలా వెళ్ళిపోయాక కాళికాదేవి ఆకలితో విజృంభించి దానవుల రక్తం విపరీతంగా తాగనారంభించింది. అదే తరుణంలో ఆకాశం నుంచి ఒక అశరీరవాణి వినిపించింది. “ఈశ్వరీ! ఇంకా రణరంగంలో లక్షమంది దానవేంద్రులు మిగిలే ఉన్నారు. గర్వంగా అరుస్తూ చిందులు తొక్కుతున్నారు. వారిని వెంటనే భక్షించు. శంఖచూడుణ్ణి వధించాలి అనే కోరిక మాత్రం విడిచిపెట్టు. ఎందుకంటే, దేవీ! అతడు నీకు అవధ్యుడు. ఇది నిశ్చయం”, గగనమండలం నుంచి వినిపించిన ఈ మాటలు ఆలకించి కాళికాదేవి ఆ దానవుల్నీ అందరినీ సంహరించి, రుధిరమాంసాలను భక్షించి శివుడి సన్నిధికి చేరుకుంది. జరిగిన రణవృత్తాంతమంతటినీ పూసగుచ్చినట్టు శివుడికి తెలియపరిచింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధే కాళీయుద్ధవర్ణనం నామాష్టత్రింశోఽధ్యాయః ॥38॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడవధలో కాళీయుద్ధవర్ణనమనే ముప్పై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

నవత్రింశోఽధ్యాయః – ముప్పై తొమ్మిదవ అధ్యాయం

శంఖచూడసైన్యవధ వర్ణనమ్ – శంఖచూడసైన్యవధ వర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

శ్రుత్వా కాళ్యుక్తమీశానో కిం చకార కిముక్తవాన్ ।
తత్త్వం వద మహాప్రాజ్ఞ పరం కౌతూహలం మమ ॥1॥

మహాప్రాజ్ఞుడా! సనత్కుమారుడా! కాళికాదేవి విన్నవించినదంతా ఆలకించి ఈశానుడు ఏమి చేశాడో, ఏమి ఆజ్ఞాపించాడో తత్త్వతః నాకు వినిపించు, చాలా కుతూహలంగా ఉంది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

కాళ్యుక్తం వచనం శ్రుత్వా శంకరః పరమేశ్వరః ।
మహాలీలాకరః శంభుర్జహాసాశ్వాసయన్ చ తామ్ ॥2॥

వ్యోమవాణీం సమాకర్ణ్య తత్త్వజ్ఞానవిశారదః ।
యయౌ స్వయం చ సమరే స్వగణైస్సహ శంకరః ॥3॥

మహావృషభమారూఢో వీరభద్రాదిసంయుతః ।
భైరవైః క్షేత్రపాలైశ్చ స్వసమానైస్సమన్వితః ॥4॥

రణం ప్రాప్తో మహేశశ్చ వీరరూపం విధాయ చ ।
విరరాజాధికం తత్ర రుద్రో మూర్త ఇవాంతకః ॥5॥

వ్యాసమునీ! కాళికాదేవి చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు పరమేశ్వరుడు. ఆయన మహాలీలాకరుడుగదా! ఆమెను ఓదారుస్తూ పెద్దగా నవ్వాడు. అంతలోకీ ఆకాశవాణి వినిపించింది. ఆ సందేశం విన్నాడు. తత్త్వజ్ఞాన విశారదుడు ఆ శంకరుడు వెంటనే తానుగా రణరంగానికి బయలుదేరాడు. తనకు సాటివచ్చే గణవీరులూ అతడి వెంట కదిలారు. అలా వీరభద్రాదులూ భైరవులూ క్షేత్రపాలకులూ వెంట రాగా మహావృషభం అధిరోహించి శంకరుడు వీరరూపం ధరించి రణరంగం చేరుకున్నాడు. అప్పటి ఆ రుద్రుడు రూపుదాల్చిన యముడిలా భాసించాడు.

శంఖచూడశ్శివం దృష్ట్వా విమానాదవరుహ్య సః ।
ననామ పరయా భక్త్యా శిరసా దండవద్భువి ॥6॥

తం ప్రణమ్య తు యోగేన విమానమారురోహ సః ।
తూర్ణం చకార సన్నాహం ధనుర్జగ్రాహ సేషుకమ్ ॥7॥

శివదానవయోర్యుద్ధం శతమబ్దం బభూవ హ ।
బాణవర్షమివోగ్రం తద్వర్షతోర్మేఘయోస్తదా ॥8॥

శంఖచూడుడు శివుణ్ని చూసి తన విమానం దిగాడు. పరమభక్తితో దండంలా సాగిలపడి నమస్కరించాడు. యోగపద్ధతిలో ఇలా నమస్కరించి వెంటనే మళ్ళీ విమానం అధిరోహించాడు. ధనుర్బాణాలు చేపట్టి బాణ వర్షం కురిపించాడు. శివుడు కూడా దీటుగా స్పందించాడు. వానకారు మబ్బుల్లా బాణవర్షం కురిపించుతూ ఆ ఇద్దరూ వంద సంవత్సరాలు పోరాటం సాగించారు.

శంఖచూడో మహావీరః శరాన్ చిక్షేప దారుణాన్ ।
చిచ్ఛేద శంకరస్తాన్ వై లీలయా స్వశరోత్కరైః ॥9॥

తదంగేషు చ శస్త్రౌఘైస్తాడయామాస కోపతః ।
మహారుద్రో విరూపాక్షో దుష్టదండస్సతాం గతిః ॥10॥

దానవో నిశితం ఖడ్గం చర్మ చాదాయ వేగవాన్ ।
వృషం జఘాన శిరసి శివస్య వరవాహనమ్ ॥11॥

తాడితే వాహనే రుద్రస్తం క్షురప్రేణ లీలయా ।
ఖడ్గం చిచ్ఛేద తస్యాశు చర్మ చాపి మహోజ్జ్వలమ్ ॥12॥

మహావీరుడు ఆ శంఖచూడుడు దారుణమైన శరాలను గుప్పించాడు. వాటిని శంకరుడు తన బాణాలతో అవలీలగా ఖండించాడు. మహారుద్రుడు–విరూపాక్షుడు–దుష్టశిక్షకుడు–శిష్టరక్షకుడు–అతికుద్ధుడై రకరకాల ఆయుధాలతో శంఖచూడుడి శరీరాన్ని గాయపరిచాడు. అప్పుడా దానవుడు నిశితఖడ్గాన్నీ చర్మ నిర్మితమైన డాలునీ చేపట్టి లంఘించి వచ్చి శివుడి వరవాహనమైన వృషభాన్ని నెత్తిమీద కొట్టాడు. తత్క్షణమే రుద్రుడు ఒక క్షురప్రంతో విలాసంగా అతడి ఖడ్గాన్నీ డాలునీ ముక్కలుముక్కలు చేశాడు.

ఛిన్నేఽసౌ చర్మణి తదా శక్తిం చిక్షేప సోఽసురః ।
ద్విధా చక్రే స్వబాణేన హరస్తాం సమ్ముఖాగతామ్ ॥13॥

కోపాధ్మాతశ్శంఖచూడశ్చక్రం చిక్షేప దానవః ।
ముష్టిపాతేన తచ్చాప్యచూర్ణయత్సహసా హరః ॥14॥

గదామావిధ్య తరసా సంచిక్షేప హరం ప్రతి ।
శంభునా సాపి సహసా భిన్నా భస్మత్వమాగతా ॥15॥

అలా కత్తీ డాలూ (అసి–చర్మ) తుత్తునియలు కాగా అసురుడప్పుడు శక్తి ఆయుధం విసిరాడు. అది హరుడివైపు వేగంగా దూసుకువస్తోంది. ఒకే ఒక్క బాణంతో రుద్రుడు దాన్ని రెండు ముక్కలు చేశాడు. శంఖచూడుడికి కోపం ఎగసిపడింది. చక్రాయుధం ప్రయోగించాడు. హరుడు దాన్ని ముష్టిఘాతంతో చిద్రుపలు చేశాడు. వాడప్పుడు గద విసిరాడు. అది కూడా శంభుడి ముందు బూడిదయ్యింది.

తతః పరశుమాదాయ హస్తేన దానవేశ్వరః ।
ధావతిస్మ హరం వేగాత్ శంఖచూడః క్రుధాకులః ॥16॥

సమాహృత్య స్వబాణౌఘైరపాతయత శంకరః ।
ద్రుతం పరశుహస్తం తం భూతలే లీలయాసురమ్ ॥17॥

తతః క్షణేన సంప్రాప్య సంజ్ఞామారుహ్య సద్రథమ్ ।
ధృతదివ్యాయుధశరో బభౌ వ్యాప్యాఖిలం నభః ॥18॥

అప్పుడు ఆ దానవేశ్వరుడు గొడ్డలి చేబూని పెచ్చుమీరిన క్రోధంతో శంకరుడి పైకి వేగంగా పరుగు పరుగున వచ్చాడు. కానీ శంకరుడు తన బాణపరంపరతో శంఖచూడుణ్ని నిలువరించాడు. నేలకు పడగొట్టాడు. గొడ్డలితో సహా అసురుణ్ని లీలావిలాసంగా పడగొట్టాడు. అయినా ఆ దానవుడు వెంటనే తేరుకున్నాడు. లేచి నిలబడ్డాడు. దివ్యరథం అధిరోహించాడు. దివ్యాయుధాలు ధరించాడు. ఆకాశమంతటా వ్యాపించాడు.

ఆయాంతం తం నిరీక్ష్యైవ డమరుధ్వనిమాదరాత్ ।
చకార జ్యారవం చాపి ధనుషో దుస్సహం హరః ॥19॥

పూరయామాస ककుభః శృంగనాదేన చ ప్రభుః ।
స్వయం జగర్జ గిరిశస్త్రాసయన్నసురాంస్తదా ॥20॥

త్యాజితేభమహాగర్వైర్మహానాదైః వృషేశ్వరః ।
పూరయామాస సహసా ఖం గాం వసుదిశస్తథా ॥21॥

మహాకాలస్సముత్పత్యాతాడయద్ధ్రాం తథా నభః ।
కరాభ్యాం తన్నినాదేన క్షిప్తా ఆసన్పురారవాః ॥22॥

అట్టాట్టహాసమశివం క్షేత్రపాలశ్చకార హ ।
భైరవోఽపి మహానాదం స చకార మహాహవే ॥23॥

ఆకాశంలో అన్ని వైపుల నుంచీ తన మీదకు వస్తున్న శంఖచూడుణ్ని చూసి హరుడు ఒక్కసారి తన డమరుకాన్ని భీషణంగా మోగించాడు. వింటి నారిని దుస్సహంగా మోగించాడు. కొమ్ముబూరా ఊది దిక్కులు పిక్కటిల్లేట్టు చేశాడు. అసురుల గుండెలు ఆగిపోయేట్టు తానే భీషణంగా గర్జించాడు. శివుడి వాహనమైన వృషభరాజం కూడా మత్తేభాల ఘీంకారగర్వం అణిగిపోయేలాగా నింగీ నేలా దశదిశలూ నిండిపోయేలాగా భయంకరంగా గర్జించింది. శివుడి అనుచరుడు మహాకాలుడు ఒక్క ఉదుటున వాహనం నుంచి దుమికి రెండు చేతులతోనూ భూమిని చరిచాడు, ఆకాశంలో కొట్టాడు. ఆ ధ్వనిలో అంతకు ముందటి గర్జనలన్నీ అంతరించిపోయాయి. క్షేత్రపాలుడు అమంగళమైన అట్టాట్టహాసం చేశాడు. భైరవుడూ మహానాదం చేశాడు.

మహాకోలాహలో జాతో రణమధ్యే భయంకరః ।
వీరశబ్దో బభూవాథ గణమధ్యే సమంతతః ॥24॥

సంత్రేసుర్దానవాస్సర్వే తైశ్శబ్దైర్భయదైః ఖరైః ।
చుకోపాతీవ తచ్ఛ్రుత్వా దానవేంద్రో మహాబలః ॥25॥

తిష్ఠ తిష్ఠేతి దుష్టాత్మన్ వ్యాజహార యదా హరః ।
దేవైర్గణైశ్చ తైః శీఘ్రముక్తం జయ జయేతి చ ॥26॥

ఇలా ఆ రణరంగంలో భయంకరమైన మహాకోలాహలం మిన్నుముట్టింది. శివగణాలు నిరంతరంగా వీరశబ్దాలు చేస్తున్నాయి. క్రూరంగా భీకరంగా ఉన్న ఆ వీర నినాదాలకు దానవులందరూ భయభ్రాంతులయ్యారు. మహాబలశాలి దానవేంద్రుడు ఆ శంఖచూడుడు వీరనినాదాలను ఆలకించి కోపంతో మండిపడ్డాడు. అంతలో శివుడు–ఓరీ దుష్టాత్ముడా! నిలు నిలురా! అని బిగ్గరగా అరిచాడు. దేవతలూ శివగణాలూ జయజయధ్వానాలు చేశారు.

అథాగత్య స దంభస్య తనయస్సుప్రతాపవాన్ ।
శక్తిం చిక్షేప రుద్రాయ జ్వాలామాలాతిభీషణామ్ ॥27॥

వహ్నికూటప్రభా యాంతీ క్షేత్రపాలేన సత్వరమ్ ।
నిరస్తాగత్య సాజౌ వై ముఖోత్పన్నమహోల్కయా ॥28॥

పునః ప్రవవృతే యుద్ధం శివదానవయోర్మహత్ ।
చకంపే ధరణీ ద్యౌశ్చ సనగాబ్ధిజలాశయా ॥29॥

దాంభిముక్తాన్ శరాన్ శంభుశ్శరాన్ తత్ప్రహితాన్ స చ ।
సహస్రశశ్శరైరుగ్రైశ్చిచ్ఛేద శతశస్తదా ॥30॥

సరిగ్గా అదే సమయానికి దంభాసురుడి తనయుడు మహాప్రతాపశాలి శంఖచూడుడు రంగంలోకి దిగాడు. వస్తూనే రుద్రుడి మీదకి శక్తిని విసిరాడు. అది భీషణంగా జ్వాలామాలికలు ఎగజిమ్ముతూ అగ్నిగుండంలా కాంతులు విరజిమ్ముతూ వేగంగా వస్తోంది. క్షేత్రపాలుడు గమనించాడు. వెంటనే నోటి నుంచి ఒక మహోల్కను సృష్టించి దాని మీదికి ఊదాడు. అక్కడితో శక్తి ఆయుధం ఆరిపోయింది. అయినా దాంభి (శంఖచూడుడు) ఊరుకోలేదు. యుద్ధం సాగించాడు. శివదానవులిద్దరికీ మళ్ళీ మహాయుద్ధం జరిగింది. భూమి కంపించింది. ఆకాశం వణికింది. పర్వతాలు గడగడలాడాయి. సముద్రం ఘూర్ణిల్లింది. వందలు వందలుగా దాంభి వేస్తున్న శరాలను శివుడూ, శివుడు వేస్తున్న బాణాలను దాంభీ తమతమ ఉగ్రబాణాలతో ఖండిస్తూ సుదీర్ఘకాలం పోరాడారు.

తతశ్శంభుస్త్రిశూలేన సంక్రుద్ధస్తం జఘాన హ ।
తత్ప్రహారమసహ్యేశు కౌ పపాత స మూర్ఛితః ॥31॥

తతః క్షణేన సంప్రాప సంజ్ఞాం స చ తదాసురః ।
ఆజఘాన శరై రుద్రం తాన్సర్వానాత్తకార్ముకః ॥32॥

బాహూనామయుతం కృత్వా ఛాదయామాస శంకరమ్ ।
చక్రాయుతేన సహసా శంఖచూడః ప్రతాపవాన్ ॥33॥

తతో దుర్గాపతిః క్రుద్ధో రుద్రో దుర్గార్తినాశనః ।
తాని చక్రాణి చిచ్ఛేద స్వశరైరుత్తమైర్ద్రుతమ్ ॥34॥

అప్పుడు శంభుడు అతిక్రుద్ధుడై త్రిశూలంతో వాణ్ని పొడిచాడు. ఆ దెబ్బకి శంఖచూడుడు మూర్ఛిల్లి నేలమీద పడ్డాడు. కానీ వెంటనే స్పృహలోకి వచ్చాడు. కార్ముకం అందుకున్నాడు. రుద్రుడి మీద దేవ-గణవీరుల మీద బాణవర్షం కురిపించాడు. ఒక్కసారిగా వేలబాహువుల్ని మొలిపించుకున్నాడు. వాటిలో శివుణ్ని ఆవరించాడు. వేల చక్రాయుధాలను ఒక్కుమ్మడిగా ప్రయోగించాడు. ఈ విజృంభణకు దుర్గాపతి పరమక్రుద్ధుడయ్యాడు. దుర్గాదేవి ఆర్తినే తొలగించినవాడు ఆ రుద్రుడు. ఉత్తమోత్తమ శరాలను సంధించి వేల చక్రాయుధాలను క్షణంలో తుత్తునియలు చేశాడు.

తతో వేగేన సహసా గదామాదాయ దానవః ।
అభ్యధావత వై హంతుం బహుసేనావృతో హరమ్ ॥35॥

గదాం చిచ్ఛేద తస్యాశ్వాపతతస్సోఽసినా హరః ।
శితధారేణ సంక్రుద్ధో దుష్టగర్వాపహారకః ॥36॥

ఛిన్నాయాం స్వగదాయాం చ చుకోపాతీవ దానవః ।
శూలం జగ్రాహ తేజస్వీ పరేషాం దుస్సహం జ్వలత్ ॥37॥

సుదర్శనం శూలహస్తమాయాంతం దానవేశ్వరమ్ ।
స్వత్రిశూలేన వివ్యాధ హృది తం వేగతో హరః ॥38॥

అప్పుడా దానవనేత అతివేగంగా గదను అందుకున్నాడు. శివుడి మీదకి బలంగా విసిరాడు. అయితే హరుడు దాన్ని ఖడ్గంతో ఖండించి ముక్కలు చేసేశాడు. అది చాలా వాడియైన ఖడ్గం. దుష్టుల గర్వాన్ని తెగటార్చే శంకరుడు సంక్రుద్ధుడై గదను ఖండించాడు. అది చూసి దానవేశ్వరుడికి కోపం భగ్గుమంది. శత్రుదుస్సహమూ జ్వాలావిభూషితమూ అయిన శూలాయుధం చేబూని మహాతేజస్వి, శంఖచూడుడు శివుడిపైకి లంఘించాడు. శూలహస్తుడై చూడముచ్చటగా ఉన్నాడు దానవపతి. తనవైపు దూసుకు వస్తున్నాడు. శివుడు కూడా తన త్రిశూలం అందుకున్నాడు. దగ్గరికి రాగా చూసి అతణ్ని గుండెల్లో పొడిచాడు అతిలాఘవంగా హరుడు.

త్రిశూలభిన్నహృదయాన్నిష్క్రాంతః పురుషః పరః ।
తిష్ఠ తిష్ఠేతి చోవాచ శంఖచూడస్య వీర్యవాన్ ॥39॥

నిష్క్రామతో హి తస్యాశు ప్రహస్య స్వనవత్తతః ।
చిచ్ఛేద చ శిరో భీమమసినా సోఽపతద్భువి ॥40॥

తతః కాళీ చఖాదోగ్రం దంష్ట్రాక్షుణ్ణశిరోధరాన్ ।
అసురాంస్తాన్ బహూన్ క్రోధాత్ ప్రసార్య స్వముఖం తదా ॥41॥

క్షేత్రపాలశ్చఖాదాన్యాన్ బహూన్ దైత్యాన్ క్రుధాకులః ।
కేచిన్నేశుః భైరవాస్త్రచ్ఛిన్నా భిన్నాస్తథాపరే ॥42॥

వీరభద్రోఽపరాన్ ధీమాన్ బహూన్ క్రోధాదనాశయత్ ।
నందీశ్వరో జఘానాన్యాన్ బహూనమరమర్దకాన్ ॥43॥

ఏవం బహుగణా వీరాస్తదా సన్నహ్య కోపతః ।
వ్యనాశయన్ బహూన్ దైత్యాన్ అసురాన్ దేవమర్దకాన్ ॥44॥

ఇత్థం బహుతరం తత్ర తస్య సైన్యం ననాశ తత్ ।
విద్రుతాశ్చాపరే వీరా బహవో భయకాతరాః ॥45॥

ఆ త్రిశూలఘాతానికి శంఖచూడుడి గుండె రెండుగా చీలింది. మహాప్రతాపశాలి శంఖచూడుడు. ఆశ్చర్యంగా అతడి చీలిన గుండె నుంచి ఒక పురుషపుంగవుడు అవతరించాడు. శివుణ్ని చూసి–నిలు నిలు–అని అరుస్తూ వెలువడుతున్నాడు. శివుడు మహాభీకరంగా నవ్వాడు. నవ్వుతూనే భయంకరఖడ్గంతో అమితవేగంగా ఆ పురుషపుంగవుడి శిరస్సు ఖండించాడు. వాడు నేలకు పడిపోయాడు. అంతలోకీ కాళిక నోరు తెరిచి దానవుల శిరస్సులను పటపటలాడిస్తూ వందలు వందలుగా భక్షించింది. క్షేత్రపాలుడూ అలాగే అతిక్రుద్ధుడై భీకరుడై దైత్యులను భక్షించాడు. భైరవుడు భీషణాస్త్రాలతో వేలమందిని సంహరించాడు. హతశేషులు పలాయనం చిత్తగించారు. బుద్ధిశాలి వీరభద్రుడూ నందీశ్వరుడూ విజృంభించారు. దేవపీడకులను అమర మర్దకులను అసంఖ్యాకంగా మట్టుబెట్టారు. తక్కిన గణవీరులందరూ ఇలాగే సన్నద్ధులై అసురల మీద పగ తీర్చుకున్నారు. నరికి పోగులు పెట్టారు. దైత్యసైన్యంలో ముప్పాతిక ముప్పీసం అంతరించిపోయింది. మిగిలిన అసురసైనికులు భయభీతులై రణరంగం విడిచి పారిపోయారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడసైన్యవధ వర్ణనం నామ నవత్రింశోఽధ్యాయః ॥39॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడసైన్యవధ వర్ణనమనే ముప్పై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

చత్వారింశోఽధ్యాయః – నలబ్భెయవ అధ్యాయం

శంఖచూడవధోపాఖ్యానమ్ – శంఖచూడవధోపాఖ్యానం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

స్వబలం నిహతం దృష్ట్వా ముఖ్యం బహుతరం తతః ।
తథా వీరాన్ ప్రాణసమాన్ చుకోపాతీవ దానవః ॥1॥

ఉవాచ వచనం శంభుం తిష్ఠమ్యాజౌ స్థిరో భవ ।
కిమేతైర్నిహతైర్మేఽద్య సమ్ముఖే సమరం కురు ॥2॥

ఇత్యుక్త్వా దానవేంద్రోఽసౌ సన్నద్ధస్సమరే మునే ।
అగచ్ఛన్నిశ్చయం కృత్వాభిముఖం శంకరస్య చ ॥3॥

దివ్యాన్యస్త్రాణి చిక్షేప మహారుద్రాయ దానవః ।
చకార శరవృష్టిం చ తోయవృష్టిం యథా ఘనః ॥4॥

మాయాశ్చకార వివిధా అదృశ్యా భయదర్శితాః ।
అప్రతర్క్యాస్సురగణైర్నిఖిలైరపి సత్తమైః ॥5॥

వ్యాసమునీ! ప్రధానమైన తన సైన్యం అంతరించిపోవడం, ప్రాణసమానులైన తన మహావీరులు మరణించడం కళ్ళారా చూసిన ఆ దానవేశ్వరుడికి కోపమూ కసీ పెల్లుబికాయి. శివుణ్ని చూసి శంభూ! నిలు నిలు–రణరంగంలో వీరంతా మరణిస్తే మాత్రమేమి! ఇదిగో నేనున్నాను. నీ ఎదుటనే ఉన్నాను. నాతో సమరం సాగించు– అని బిగ్గరగా అరిచాడు. ఒక నిశ్చయానికి వచ్చి సర్వసన్నద్ధుడై శంకరుడి ముందు నిలిచాడు. తనకు వచ్చిన దివ్యాస్త్రాలను అన్నింటినీ ఒక్క పెట్టున శివుడి మీద కురిపించాడు. వార్షుకాభ్రంలాగా శరవృష్టి కురిపించాడు. కనీ వినీ ఎరగని మాయలన్నీ ప్రదర్శించాడు. ఆ మాయలు సురోత్తములకుగానీ శివగణోత్తములకు గానీ ఊహకైనా అందనివి. అతి భయంకరాలు. అటువంటి బహుమాయలు శంఖచూడుడు ప్రదర్శించాడు.

తా దృష్ట్వా శంకరస్తత్ర చిక్షేపాస్త్రం చ లీలయా ।
మాహేశ్వరం మహాదివ్యం సర్వమాయావినాశనమ్ ॥6॥

తేజసా తస్య తన్మాయా నష్టాశ్చాసన్ద్రుతం తదా ।
దివ్యాన్యస్త్రాణి తాన్యేవ నిస్తేజాంస్యభవన్నపి ॥7॥

అథ యుద్ధే మహేశానస్తద్ధాయ మహాబలః ।
శూలం జగ్రాహ సహసా దుర్నివార్యం సుతేజసామ్ ॥8॥

అప్పుడు శంకరుడు సర్వమాయావినాశకమైన దివ్యమాహేశ్వరాస్త్రం ప్రయోగించాడు. దాని తేజస్సుతో దానవమాయలన్నీ అంతరించాయి. అతడు ప్రయోగించిన దివ్యాస్త్రాలన్నీ తేజోవిహీనాలయ్యాయి. వెంటనే మహేశానుడు శంఖచూడవధకోసం మహాతేజస్వులకైనా దుర్నివార్యమైన త్రిశూలం అందుకున్నాడు.

తదైవ తన్నిషేద్ధుం చ వాగ్బభూవాశరీరిణీ ।
క్షిప శూలం న చేదానీం ప్రార్థనాం శృణు శంకర ॥9॥

సర్వథా త్వం సమర్థో హి క్షణాద్ బ్రహ్మాండనాశనే ।
కిమేకదానవస్యేశ శంఖచూడస్య సాంప్రతమ్ ॥10॥

తథాపి వేదమర్యాదా న నాశ్యా స్వామినా త్వయా ।
తాం శృణుష్వ మహాదేవ సఫలం కురు సత్యతః ॥11॥

యావదస్య కరేఽత్యుగ్రం కవచం పరమం హరేః ।
యావత్సతీత్వమస్త్యేవ సత్యా అస్య హి యోషితః ॥12॥

తావదస్య జరామృత్యుశ్శంఖచూడస్య శంకర ।
నాస్తీత్యవితథం నాథ విధేహి బ్రహ్మణో వచః ॥13॥

ఇత్యాకర్ణ్య నభోవాణీం తథేత్యుక్తే హరే తదా ।
హరేచ్ఛయాగతో విష్ణుస్తం దిదేశ సతాం గతిః ॥14॥

సరిగ్గా అదే సమయంలో అశరీరవాణి వినిపించింది. శంకరా! ఇప్పుడు ఈ త్రిశూలం ప్రయోగించకు. దయతో నా అభ్యర్థన ఆలకించు. నువ్వు సర్వసమర్థుడివి. క్షణకాలంలో బ్రహ్మాండాన్నే నాశనం చెయ్యగలవు. ఈ దానవుడు శంఖచూడుడు ఏపాటి! అయినా వేదమర్యాద ఒకటి ఉంది. వేదాలకు ప్రభువైన నువ్వే దానిని అతిక్రమించడం సబబు కాదు. మహాదేవా! అది చెబుతున్నాను విను. ఆ మర్యాదను నిజంగా సఫలం చెయ్యి. ఈ దానవేశ్వరుడి చేతిలో అత్యుగ్రమూ అత్యుత్తమమూ అయిన విష్ణుకవచం ఉంది. అలాగే ఇతడి ఇల్లాలి చెంత (తులసి) తిరుగులేని పాతివ్రత్యం ఉంది. ఇవి రెండూ ఉన్నంతకాలమూ ఈ శంఖచూడుడికి జరామృత్యువులు లేవు. ఇది ఇతడికి బ్రహ్మదేవుడిచ్చిన మాట. శంకరా! దయచేసి దీన్ని నిజం చెయ్యి. ఈ అశరీరవాక్కును ఆలకించి శివుడు సరే అన్నాడు. అప్పుడు శివేచ్ఛప్రకారం విష్ణుమూర్తి అక్కడికి వచ్చాడు. సజ్జనులకు దిక్కయిన శివుడు తగువిధంగా శ్రీహరిని ఆజ్ఞాపించాడు.

వృద్ధబ్రాహ్మణవేషేణ విష్ణుర్మాయావినాం వరః ।
శంఖచూడోపకంఠం చ గత్వోవాచ స తం తదా ॥15॥

దేహి భిక్షాం దానవేంద్ర మహ్యం ప్రాప్తాయ సాంప్రతమ్ ॥16॥

నేదానీం కథయిష్యామి ప్రకటం దీనవత్సలమ్ ।
పశ్చాత్ త్వాం కథయిష్యామి పునస్సత్యం కరిష్యసి ॥17॥

ఓమిత్యువాచ రాజేంద్రః ప్రసన్నవదనేక్షణః ।
కవచార్థీ జనశ్చాహమిత్యువాచేతి సచ్ఛలాత్ ॥18॥

తచ్ఛ్రుత్వా దానవేంద్రోఽసౌ బ్రహ్మణ్యస్సత్యవాగ్విభుః ।
తద్దదౌ కవచం దివ్యం విప్రాయ ప్రాణసమ్మతమ్ ॥19॥

మాయయేత్థం తు కవచం తస్మాజ్జగ్రాహ వై హరిః ।
శంఖచూడస్య రూపేణ జగామ తులసీం ప్రతి ॥20॥

మాయావులకే మాయావి శ్రీహరి అప్పుడు ఒక వృద్ధబ్రాహ్మణరూపంలో శంఖచూడుణ్ని సమీపించాడు. దానవేంద్రా! భిక్షార్థివై నీ సన్నిధికి వచ్చాను. నువ్వు దీనవత్సలుడివి. నాకు ఏమి కావాలో ముందుగా చెప్పను. నువ్వు ఇస్తానని వాగ్దానం చేశాక చెబుతాను. అప్పుడు దాన్ని నిజం చేసి మాట నిలుపుకుందువు గాని అని శ్రీహరి అనడంలోనే దానవేంద్రుడు సరే (ఓమ్) అన్నాడు. అతడి వదనమూ చూపులూ ప్రసన్నంగా ఉన్నాయి. అతడి నుంచి సరే అన్నమాట వినపడగానే, 'నీ కవచం నాకు కావాలి. ఇయ్యి దానికోసమే వచ్చాను' అని కపటంగా అడిగాడు ఆ వృద్ధబ్రాహ్మణుడు. దానవేంద్రుడు అచ్చంగా బ్రహ్మణ్యుడు. సత్యవాక్కు సమర్థుడు. తనకు ప్రాణంలాంటి ఆ దివ్యకవచాన్ని క్షణం జాగుచెయ్యకుండా విప్రుడికి ఇచ్చేశాడు. ఇలా మాయచేసి అతడి నుంచి దివ్యకవచం సంగ్రహించి అటుపైని శ్రీహరి వెంటనే శంఖచూడుడి రూపం ధరించి తులసీదేవి చెంతకు వెళ్ళాడు.

గత్వా తత్ర హరిస్తస్యా యోనౌ మాయావిశారదః ।
వీర్యాధానం చకారాశు దేవకార్యార్థమీశ్వరః ॥21॥

శంఖచూడుడిగా అంతఃపురంలోకి వెళ్ళిన శ్రీహరి మాయావిశారదుడు, దేవకార్యార్థంగా తులసీదేవితో సత్వరం సంభోగించాడు. తన వీర్యాన్ని ఆమె గర్భంలో నిక్షేపించాడు.

ఏతస్మిన్నంతరే శంభుమీరయన్ స్వవచః ప్రభుః ।
శంఖచూడవధార్థాయ శూలం జగ్రాహ ప్రజ్వలత్ ॥22॥

తచ్ఛూలం విజయం నామ శంకరస్య పరమాత్మనః ।
సంచకాశే దిశస్సర్వా రోదసీ సంప్రకాశయన్ ॥23॥

కోటిమధ్యాహ్నమార్తండప్రళయాగ్నిశిఖోపమమ్ ।
దుర్నివార్యం చ దుర్ధర్షమవ్యర్థం వైరిఘాతకమ్ ॥24॥

తేజసాం చక్రమత్యుగ్రం సర్వశస్త్రాస్త్రసాయకమ్ ।
సురాసురాణాం సర్వేషాం దుస్సహం చ భయంకరమ్ ॥25॥

సంహర్తుం సర్వబ్రహ్మాండమవలంబ్య చ లీలయా ।
సంస్థితం పరమం తత్ర ఏకత్రీభూయ విజ్వలత్ ॥26॥

ధనుస్సహస్రం దీర్ఘేణ ప్రస్థేన శతహస్తకమ్ ।
జీవబ్రహ్మస్వరూపం చ నిత్యరూపమనిర్మితమ్ ॥27॥

విభ్రమద్ వ్యోమ్ని తచ్ఛూలం శంఖచూడోపరి క్షణాత్ ।
చకార భస్మ తచ్ఛీఘ్రం నిపత్య శివశాసనాత్ ॥28॥

అథ శూలం మహేశస్య ద్రుతమావృత్య శంకరమ్ ।
యయౌ విహాయసా విప్ర! మనోయాయి స్వకార్యకృత్ ॥29॥

అదే సమయంలో రణరంగాన దానవప్రభువు శివుణ్ని తన మాటలతో మరీ కవ్వించాడు. రారమ్మని ఆహ్వానించాడు. శంఖచూడుణ్ని ఇక సంహరించవలసిందే అని శంభుడు త్రిశూలం చేపట్టాడు. అది పరమాత్ముడి త్రిశూలం. దానిపేరే విజయం. అది దశదిశలనూ అంతరిక్షాన్నీ ప్రజ్వరిల్లజేస్తూ కోటి మధ్యాహ్నమార్తాండబింబాల్లాగా ప్రళయాగ్నిశిఖల్లాగా భాసిస్తోంది. అది దుర్నివార్యం. దుర్ధర్షం. దుస్సహం. అవ్యర్థం. వైరిసంహారకం. అదొక తేజశ్చక్రం. సర్వశస్త్రాస్త్రసమష్టిరూపం. అత్యుగ్రం. సురాసురులకు దుస్సహం. సకలప్రాణికోటికీ భయంకరం. సమస్తబ్రహ్మాండాన్నీ అవలీలగా భస్మం చెయ్యగలిగిన త్రిశూలం. వెయ్యిబారల పొడుగు, నూరు బారల వెడల్పు దాని కొలత. జీవబ్రహ్మస్వరూపం. నిత్యరూపం. అది స్వయంభువు. ఎవరూ నిర్మించినది కాదు. అది ఆకాశంలో శంఖచూడుడి నెత్తిమీద క్షణకాలం తిరుగాడింది. శివుడి ఆజ్ఞతో అతడి మీద పడింది. రెప్పపాటులో దానవేంద్రుడు బూడిదకుప్ప అయ్యాడు. విప్రా! వ్యాసమునీ! ఇలా తన పని నెరవేర్చుకుని ఆ త్రిశూలం వెంటనే వెనుదిరిగి మనోవేగంతో ఆకాశమార్గాన మహేశ్వరుణ్ని చేరుకుంది.

నేదుర్దుందుభయస్తూర్ణే జగుర్గంధర్వకిన్నరాః ।
తుష్టువుర్మునయో దేవా ననృతుశ్చాప్సరోగణాః ॥30॥

బభూవ పుష్పవృష్టిశ్చ శివస్యోపరి సంతతమ్ ।
ప్రశశంస హరిర్బ్రహ్మా శక్రాద్యా మునయస్తథా ॥31॥

శంఖచూడో దానవేంద్రః శివస్య కృపయా తదా ।
శాపముక్తో బభూవాథ పూర్వరూపమవాప హ ॥32॥

అస్థిభిశ్శంఖచూడస్య శంఖజాతిర్బభూవ హ ।
ప్రశస్తం శంఖతోయం చ సర్వేషాం శంకరం వినా ॥33॥

విశేషేణ హరేర్లక్ష్మ్యాః శంఖతోయం మహాప్రియమ్ ।
సంబంధినాం చ తస్యాపి న హరస్య మహామునే ॥34॥

స్వర్గంలో దుందుభులు మ్రోగాయి. గంధర్వాదులు మునులూ అప్సరసలూ ఆడారు, పాడారు, శివుడి మీద పుష్పవృష్టి కురిసింది. మునులు స్తుతించారు. ఇంద్రోపేంద్రబ్రహ్మాదులు నుతించారు. వ్యాసమునీ! శివుడి దయావిశేషం వల్ల శంఖచూడుడు ఇలా శాపవిముక్తుడై తన తొలుతటి రూపాన్ని ధరించాడు. (శ్రీకృష్ణపార్షదుడు). శంఖచూడుడి ఎముకలతో శంఖజాతి ఆవిర్భవించింది. శంఖంలో పోసిన తీర్థం చాలా ప్రశస్తమైనది. ఒక్క శివుడికి తప్ప సకల దేవతలకూ ప్రీతిదాయకం ఈ శంఖతోయం. విశేషించి లక్ష్మీనారాయణులకు మరింత మహాప్రియం. విష్ణుసంబంధులకూ ప్రియమే. ఒక్క శంకరుడికీ అతడి సంబంధులకీ తప్ప.

తమిత్థం శంకరో హత్వా శివలోకం జగామ సః ।
సుప్రహృష్టో వృషారూఢః సోమస్కందగణైర్వృతః ॥35॥

హరిర్జగామ వైకుంఠం కృష్ణః స్వస్థో బభూవ హ ।
సురాః స్వవిషయం ప్రాపుః పరమానందసంయుతాః ॥36॥

జగత్ స్వాస్థ్యమతీవాప సర్వనిర్విఘ్నమాపకమ్ ।
నిర్మలం చాభవద్వ్యోమ క్షితిస్సర్వా సుమంగళా ॥37॥

శంకరుడు ఇలా దానవప్రభువును సంహరించి తన శివలోకానికి వెళ్ళిపోయాడు. ఆనందంగా తన వృషభాన్ని అధిరోహించి సోమస్కందాది గణాలతో కలిసి వెళ్ళిపోయాడు. శ్రీహరి వైకుంఠానికి వెళ్ళి స్వస్థ చిత్తుడయ్యాడు. దేవతలు అందరూ పరమానందభరితులై ఎవరి నివాసాలకు వారు చేరుకున్నారు. సకల జగత్తూ స్వాస్థ్యం పొందింది. విఘ్నాలన్నీ తొలగిపోయాయి. జలాశయాలూ ఆకాశం తేటపడ్డాయి. భూగోళమంతా శుభసమన్విత అయ్యింది.

ఇతి ప్రోక్తం మహేశస్య చరితం ప్రముదావహమ్ ।
సర్వదుఃఖహరం శ్రీదం సర్వకామ ప్రపూరకమ్ ॥38॥

ధన్యం యశస్యమాయుష్యం సర్వవిఘ్ననివారణమ్ ।
భుక్తిదం ముక్తిదం చైవ సర్వకామఫలప్రదమ్ ॥39॥

య ఇదం శృణుయాన్నిత్యం చరితం శశిమౌళినః ।
శ్రావయేద్వా పఠేద్వాపి పాఠయేద్వా సుధీర్నరః ॥40॥

ధనం ధాన్యం సుతం సౌఖ్యం లభేతాత్ర న సంశయః ।
సర్వాన్ కామానవాప్నోతి శివభక్తిం విశేషతః ॥41॥

ఇదమాఖ్యానమతులం సర్వోపద్రవనాశనమ్ ।
పరమజ్ఞానజననం శివభక్తి వివర్ధనమ్ ॥42॥

బ్రాహ్మణో బ్రహ్మవర్చస్వీ క్షత్రియో విజయీ భవేత్ ।
ధనాఢ్యో వైశ్యజశ్శూద్రః శృణ్వన్ సత్తమతామియాత్ ॥43॥

వ్యాసమునీ! ఇదిగో ఇదీ మహేశ్వరుడి చరితం నీకు చెప్పాను. ఇది ఆనందదాయకం. సర్వదుఃఖాపహారకం. శ్రీప్రదం. సర్వకామప్రపూరకం. ధన్యం. యశస్కరం. ఆయుర్వర్ధకం. సర్వవిఘ్ననివారకం. భుక్తిముక్తిప్రదం. సర్వకామితఫలప్రదం. ఈ శశిశేఖరుడి చరితం నిత్యమూ విన్నా, వినిపించినా, పఠించినా, పఠింపించినా – ఆ పండితుడు ధన–ధాన్య – సుత– సౌఖ్యాలను పొంది తీరుతాడు. సందేహం లేదు. అతడికి సకల వాంఛితాలూ నెరవేరతాయి. శివభక్తి విశేషంగా కుదురుకొంటుంది. ఈ ఆఖ్యానం సాటిలేనిది. అన్ని ఉపద్రవాలను తొలగిస్తుంది. ఉత్తమజ్ఞానం కలిగిస్తుంది. శివభక్తిని వృద్ధిపొందిస్తుంది. దీన్ని భక్తిశ్రద్ధలతో వింటే చాలు బ్రాహ్మణుడు బ్రహ్మతేజస్వి అవుతాడు. క్షత్రియుడు విజయుడవుతాడు. వైశ్యుడు ధనాఢ్యుడవుతాడు. శూద్రుడు సత్తముడవుతాడు.

ఇతిశ్రీశివ మహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధోపాఖ్యానం నామ చత్వారింశోఽధ్యాయః ॥40॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడ వధోపాఖ్యానం అని నలబ్బెయవ అధ్యాయం సమాప్తం.

ఏకచత్వారింశోఽధ్యాయః – నలభై ఒకటవ అధ్యాయం

తులసీశాపవర్ణనమ్ – తులసీశాపవర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

నారాయణశ్చ భగవాన్ వీర్యాధానం చకార హ ।
తులస్యాః కేన యత్నేన యోనౌ తద్వక్తుమర్హసి ॥1॥

సనత్కుమారా! భగవానుడు ఆ నారాయణుడు సాధ్వీమణి తులసీదేవి గర్భంలోకి వీర్యాధానం చేశాడు గదా! అది ఎలా సాధ్యపడిందో కాసింత వివరంగా చెబుతావా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

నారాయణో హి దేవానాం కార్యకర్తా సతాం గతిః ।
శంఖచూడస్య రూపేణ రేమే తద్రమయా సహ ॥2॥

తదేవ శృణు విష్ణోశ్చ చరితం ప్రముదావహమ్ ।
శివశాసనకర్తుశ్చ మాతుశ్చ జగతాం హరేః ॥3॥

రణమధ్యే వ్యోమవచః శ్రుత్వా దేవేన శంభునా ।
ప్రేరితశ్శంఖచూడస్య గృహీత్వా కవచం పరమ్ ॥4॥

విప్రరూపేణ త్వరితం మాయయా నిజయా హరిః ।
జగామ శంఖచూడస్య రూపేణ తులసీగృహమ్ ॥5॥

దుందుభిం వాదయామాస తులసీద్వారసన్నిధౌ ।
జయ శబ్దం చ తత్రైవ బోధయామాస సుందరీమ్ ॥6॥

వ్యాసమునీ! నారాయణుడంటే దేవకార్యనిర్వాహకుడు గదా! సజ్జనులకు దిక్కైనవాడు. శంఖచూడరూపంలో వెళ్ళి ఆ తులసీరమను రమించాడు. ఇది శ్రీహరిచరితం. ఆనందదాయకం చెబుతున్నాను విను. శ్రీహరి అంటే శివుడికీ జగన్మాతకూ నమ్మినబంటు. వారి ఆజ్ఞల్ని నిర్వహించడమే అతడి పని. రణరంగంలో అశరీరవాణి వినిపడగానే శివుడి ఆనతిమేరకు శ్రీహరి వృద్ధబ్రాహ్మణుడుగా మారి శంఖచూడుడి విష్ణుకవచాన్ని త్వరితంగా సంగ్రహించాడు. అటుపైని శంఖచూడునిరూపంలో తులసీమందిరానికి వెళ్ళాడు. అక్కడ ద్వారం దగ్గరున్న దుందుభిని మ్రోగింపజేశాడు. జయజయధ్వానాలు పలికించాడు. వీటితో తులసీసుందరిని మేల్కొలిపాడు.

తచ్ఛ్రుత్వా చైవ సా సాధ్వీ పరమానందసంయుతా ।
రాజమార్గం గవాక్షేణ దదర్శ పరమాదరాత్ ॥7॥

బ్రాహ్మణేభ్యో ధనం దత్త్వా కారయామాస మంగళమ్ ।
ద్రుతం చకార శృంగారం జ్ఞాత్వాయాతం నిజం పతిమ్ ॥8॥

అది విని పరమానందపడి ఆ సాధ్వి, కిటికీనుంచి సాదరంగా రాజవీథివైపు చూసింది. వెంటనే విప్రుల్ని పిలిచి పుణ్యాహం జరిపించింది. తన భర్త వచ్చాడని తెలుసుకుని త్వరత్వరగా అలంకరించుకుంది.

అవరుహ్య రథాద్విష్ణుస్తద్దేవ్యా భవనం యయౌ ।
శంఖచూడస్వరూపస్య మాయావీ దేవకార్యకృత్ ॥9॥

దృష్ట్వా తం చ పురః ప్రాప్తం స్వకాంతం సా ముదాన్వితా ।
తత్పాదౌ క్షాళయామాస ననామ చ రురోద చ ॥10॥

రత్నసింహాసనే రమ్యే వాసయామాస మంగళమ్ ।
తాంబూలం చ దదౌ తస్మై కర్పూరాది సువాసితమ్ ॥11॥

అద్య మే సఫలం జన్మ జీవనం సంబభూవ హ ।
రణే గతం చ ప్రాణేశం పశ్యంత్యాశ్చ పునర్గృహే ॥12॥

ఇత్యుక్త్వా సకటాక్షం సా నిరీక్ష్య సస్మితం ముదా ।
పప్రచ్ఛ రణవృత్తాంతం కాంతం మధురయా గిరా ॥13॥

విష్ణుమూర్తి రథం దిగి తలసీభవనంలోకి వెళ్ళాడు. దేవకార్యం కోసం ఆ మాయావి శంఖచూడరూపంలో వెళ్ళాడు. తన భర్తను ఎట్టయెదుట చూసి తులసి మురిసిపోయింది. కాళ్ళు కడిగి నమస్కరించి రోదించింది. రత్నసింహాసనం మీద మంగళప్రదంగా కూర్చుండబెట్టింది. కర్పూరాది సుగంధద్రవ్యాలతో పరిమళిస్తున్న తాంబూలం అందించింది. నాథా! నేడు నా జన్మ సఫలమయ్యింది. నా జీవితం చరితార్థమయ్యింది. రణరంగానికి వెళ్ళిన ప్రాణేశ్వరుణ్ని మళ్ళీ ఇంటిలో ఇలా చూడగలుగుతున్నాను. ఇలా పలుకుతూ క్రేగన్నుల తిలకిస్తూ చిరునవ్వులు ఒలికిస్తూ మధురాతిమధురంగా అడిగింది తన పెనిమిటిని – సంగ్రామం ఎలా సాగిందో చెప్పమని.

తులస్యువాచ – తులసి అడిగింది.

అసంఖ్యవిశ్వసంహర్తా స దేవప్రవరః ప్రభుః ।
యస్యాజ్ఞావర్తినో దేవా విష్ణుబ్రహ్మాదయస్సదా ॥14॥

త్రిదేవజనకస్సోఽత్ర త్రిగుణాత్మా చ నిర్గుణః ।
భక్తేచ్ఛయా చ సగుణో హరిబ్రహ్మప్రవర్తకః ॥15॥

కుబేరస్య ప్రార్థనయా గుణరూపధరో హరః ।
కైలాసవాసీ గణపః పరబ్రహ్మ స్సతాం గతిః ॥16॥

యస్యైకపలమాత్రేణ కోటిబ్రహ్మాండసంక్షయః ।
విష్ణు బ్రహ్మాదయోఽ తీతా బహవః క్షణమాత్రతః ॥17॥

కర్తుం సార్ధం చ తేనైవ సమరం త్వం గతః ప్రభో ।
కథం బభూవ సంగ్రామస్తేన దేవసహాయినా ॥18॥

కుశలీ త్వమిహాయాతః తం జిత్వా పరమేశ్వరమ్ ।
కథం బభూవ విజయస్తవ బ్రూహి తదేవ మే ॥19॥

శ్రుత్వేత్థం తులసీవాక్యం స విహస్య రమాపతిః ।
శంఖచూడరూపధరస్తామువాచామృతం వచః ॥20॥

నాథా! దేవాధిదేవుడు గదా మహేశ్వరుడు. అసంఖ్యాక విశ్వాలకు అతడే సంహర్త. విష్ణు బ్రహ్మాదులందరూ అతని కనుసన్నలలో మెలగుతారు. త్రిమూర్తులకూ అతడే జనకుడు. త్రిగుణాత్ముడు. నిర్గుణుడు. భక్తుల కోరిక మేరకు సగుణుడవుతాడు. బ్రహ్మాదిదేవతలను నడిపిస్తాడు. కుబేరుడి ప్రార్థన మీద సగుణాకారం ధరించి కైలాసం మీద నివసిస్తున్నాడు. ప్రమథగణాలకు అధినాయకుడుగా సజ్జనులకు పెద్దదిక్కుగా విరాజిల్లుతున్న పరబ్రహ్మకదా శివుడంటే. కోటానుకోట్ల బ్రహ్మాండాలను భస్మం చెయ్యడమంటే అతడికి రెప్పపాటుకాలం సరిపోతుంది. అదే క్షణకాలంలో బ్రహ్మవిష్ణుప్రభృతి దేవనాయకులు అనేకులు అంతరించిపోతారు. అంతటి మహా ప్రభువుతో యుద్ధం చెయ్యడానికి వెళ్ళావు నువ్వు. దేవతలంతా సహాయంగా నిలిచిన ఆ మహేశ్వరుడితో నీ యుద్ధం ఎలా సాగింది ? నువ్వు క్షేమంగా తిరిగి వచ్చావు. పరమేశ్వరుణ్ణి జయించి వచ్చావు. అదే పదివేలు. ఈ విజయం నీకు ఎలా దక్కిందో కాసింత వివరించి చెప్పు! ఇలా తులసీదేవి అడిగేసరికి రమావల్లభుడు– శంఖచూడరూపంలో ఉన్న శ్రీహరి– చిన్నగా నవ్వి సుధామధురంగా బదులు పలికాడు.

భగవానువాచ – భగవంతుడు చెప్పాడు.

యదాహం రణ భూమౌ చ జగామ సమరప్రియః ।
కోలాహలో మహాన్ జాతః ప్రవృత్తో ఽభూన్మహారణః ॥21॥

దేవదానవయోర్యుద్ధం సంబభూవ జయైషిణోః ।
దైత్యాః పరాజితాస్తత్ర నిర్జరైర్బలగర్వితైః ॥22॥

తదాహం సమరం తత్రాకార్షం దేవైర్బలోత్కటైః ।
పరాజితాశ్చ తే దేవాశ్శంకరం శరణం యయుః ॥23॥

రుద్రోఽపి తత్సహాయార్థమాజగామ రణం ప్రతి ।
తేనాహం వై చిరం కాలమయౌత్సం బలదర్పితః ॥24॥

అవయోస్సమరః కాంతే పూర్ణమబ్దం బభూవ హ ।
నాశో బభూవ సర్వేషా మసురాణం చ కామిని ॥25॥

ప్రీతిం చ కారయామాస బ్రహ్మా చ స్వయమావయోః ।
దేవానామధికారాశ్చ ప్రదత్తా బ్రహ్మశాసనాత్ ॥26॥

మయా గతం స్వభవనం శివలోకం శివో గతః ।
సర్వస్వాస్థ్యమతీవాప దూరీభూతో హ్యుపద్రవః ॥27॥

దేవీ! నేను సమరకాంక్షతో రణరంగానికి వెళ్ళాను గదా! మహాకోలాహలంగా యుద్ధం ప్రారంభమయ్యింది. దేవదానవులు పరస్పరజయాకాంక్షులై మహాయుద్ధం చేశారు. బలగర్వితులైన దేవతల చేతిలో దైత్యులందరూ పరాజితులయ్యారు. అప్పుడు నేను రంగంలోకి దిగాను. బలోత్కటులైన దేవతలతో తలపడ్డాను. అందరినీ ఓడించాను. దేవతలంతా పారిపోయారు. వెళ్ళి శంకరుణ్ణి శరణువేడారు. వారికి సహాయంగా రుద్రుడే స్వయంగా రణరంగానికి వచ్చాడు. నేను బలదర్పితుడనై శంకరుడితో యుద్ధం చేశాను. కాంతా! ఏడాదిపాటు సాగింది మా సంగ్రామం. సురాసురసైన్యాలు నాశనమయ్యాయి. కామినీ! సరిగ్గా ఆ సమయానికి బ్రహ్మదేవుడు తరలివచ్చాడు. మా ఇద్దరికీ ప్రీతికారకుడై వచ్చాడు. సయోధ్య కుదిర్చాడు. ఆ బ్రహ్మదేవుని ఆజ్ఞపై నేను దేవతల అధికారాలు దేవతలకు ఇచ్చేశాను. క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చాను. శివుడు తన లోకానికి తాను వెళ్ళాడు. అందరికీ స్వస్థత లభించింది. పెద్ద ఉపద్రవం తొలగిపోయింది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా జగతాం నాథః శయనం చ చకార హ ।
రేమే రమాపతిస్తత్ర రమయా స తయా ముదా ॥28॥

సా సాధ్వీ సుఖసంభావకర్షణస్య వ్యతిక్రమాత్ ।
సర్వం వితర్కయామాస కస్త్వమేవేత్యువాచ సా ॥29॥

జగన్నాథుడు ఇలా చెప్పి శయనం అధిరోహించాడు. ఆనందంగా ఆ తులసీలక్ష్మితో సంభోగించాడు. అయితే, సుఖ – సంభావ – కర్షణాదులలో (శరీరసంపర్కసుఖానుభవతీరుతో) వచ్చిన తేడా వల్ల ఆ సాధ్వీమణి సమస్తమూ గుర్తించింది. ఎవడవు నువ్వు? అని నిలదీసింది.

తులస్యువాచ – తులసి అడిగింది.

కోవా త్వం వద మామాశు భుక్తాహం మాయయా త్వయా ।
దూరీకృతం యత్సతీత్వమథ త్వాం వై శపామ్యహమ్ ॥30॥

ఎవడవో నువ్వు వెంటనే చెప్పు. వద్దు వద్దు – ఇంక వద్దు. మాయచేసి నన్ను అనుభవించావు. నా పాతివ్రత్యాన్ని మంటగలిపావు. ఇదిగో నిన్నిప్పుడే శపిస్తున్నాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తులసీవచనం శ్రుత్వా హరిశ్శాపభయేన చ ।
దధార లీలయా బ్రహ్మన్ స్వమూర్తిం సమనోహరామ్ ॥31॥

తద్దృష్ట్వా తులసీ రూపం జ్ఞాత్వా విష్ణుం చ చిహ్నతః ।
పాతివ్రత్యపరిత్యాగాత్ క్రుద్ధా సా తమువాచ హ ॥32॥

వ్యాసమునీ! తులసీదేవి కోపాన్ని చూసి శ్రీహరి వణికిపోయాడు. శపిస్తుందని భయపడ్డాడు. వెంటనే నిజరూపంలోకి మారిపోయాడు. మనోహరవిష్ణుమూర్తిగా నిలబడ్డాడు. తులసీదేవి ఆయా చిహ్నాలతో విష్ణుమూర్తి అని పోల్చుకుంది. అయినా పాతివ్రత్యాన్ని భంగపరిచాడన్న కోపంతో ఇలా పలికింది.

తులస్యువాచ – తులసి నిందించింది.

హే విష్ణో తే దయా నాస్తి పాషాణసదృశం మనః ।
పతిధర్మస్య భంగేన మమ స్వామీ హతః ఖలు ॥33॥

పాషాణసదృశస్త్వం చ దయాహీనో యతః ఖలః ।
తస్మాత్పాషాణరూపస్త్వం మచ్ఛాపేన భవాధునా ॥34॥

యే వదంతి దయాసింధుం త్వాం భ్రాంతాస్తే న సంశయః ।
భక్తో వినాపరాధేన పరార్థే చ కథం హతః ॥35॥

ఓ విష్ణూ! నీకసలు దయలేదు. నీ మనస్సు ఒక బండరాయిలాంటిది. నా పాతివ్రత్యాన్ని భంగపరచడంతో నా భర్త మరణానికి కారణమయ్యావు. దయాహీనుడివి. పాషాణ సదృశుడివి. కనక నువ్వు పాషాణరూపాన్నే పొందు! ఇదే నీకు నా శాపం. నిన్ను దయాసింధువని పొడిగేవాళ్ళంతా కచ్చితంగా పిచ్చివాళ్ళు. ఏ అపరాధమూ చెయ్యని భక్తుణ్ని పరులకోసమని చంపేశావు. (ముంచేశావు) ఎందుకు చేశావు నువ్విలా?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా తులసీ సా వై శంకచూడప్రియా సతీ ।
భృశం రురోద శోకార్తా విలలాప భృశం ముహుః ॥36॥

తతస్తాం రుదతీం దృష్ట్వా స విష్ణుః పరమేశ్వరః ।
సస్మార శంకరం దేవం యేన సమ్మోహితం జగత్ ॥37॥

తతః ప్రాదుర్బభూవాథ శంకరో భక్తవత్సలః ।
హరిణా ప్రణతశ్చాసీత్ సన్నుతో వినయేన సః ॥38॥

శోకాకులం హరిం దృష్ట్వా విలపంతీం చ తత్ప్రియామ్ ।
నయేన బోధయామాస తం తాం కృపణవత్సలః ॥39॥

శంకచూడుని ఇల్లాలు ఆ పతివ్రత తులసీదేవి ఇలా కటువుగా పలికి శోకార్తయై ఎంతగానో విలపించింది. రోదించింది. విష్ణుమూర్తి ఆమెను చూసి ఏమి చెయ్యాలో తెలియక, జగత్సమ్మోహకుడైన శంకరుణ్ని స్మరించాడు. భక్తవత్సలుడు శంకరుడు వెంటనే ప్రత్యక్షమయ్యాడు. శ్రీహరి సవినయంగా నమస్కరించి స్తుతించాడు. ఆ దీనవత్సలుడు శంకరుడు శోకాకులుడైన శ్రీహరినీ, రోదిస్తున్న తులసినీ చూసి నీతిబోధతో ఓదార్చాడు.

శంకర ఉవాచ – శంకరుడు ఓదార్చాడు.

మా రోదీస్తులసి త్వం హి భుంక్తే కర్మఫలం జనః ।
సుఖదుఃఖదో న కోఽ ప్యస్తి సంసారే కర్మసాగరే ॥40॥

ప్రస్తుతం శృణు నిర్దుఃఖం శృణోతు సుమనా హరిః ।
ద్వయోస్సుఖకరం యత్తద్భవీమి సుఖహేతవే ॥41॥

తపస్త్వయా కృతం భద్రే తస్యైవ తపసః ఫలమ్ ।
తదన్యథా కథం స్యాద్వై జాతం త్వయి తథా చ తత్ ॥42॥

ఇదం శరీరం త్యక్త్వా చ దివ్యదేహం విధాయ చ ।
రమస్వ హరిణా నిత్యం రమయా సదృశీ భవ ॥43॥

తవేయం తనురుత్సృష్టా నదీరూపా భవేదిహ ।
భారతే పుణ్యరూపా సా గండకీతి చ విశ్రుతా ॥44॥

తులసీ! దుఃఖించకు. ప్రతివ్యక్తీ కర్మఫలం అనుభవించక తప్పదు. కర్మసాగరమైన ఈ ప్రపంచంలో కర్మ తప్ప సుఖదుఃఖాలకు కారణం మరొకటి ఏదీ లేదు. నీ దుఃఖాన్నీ తొలగించే ప్రస్తుతాంశం చెబుతున్నాను ఆలకించు. మంచి మనస్సుతో ఈ శ్రీహరికూడా ఈ విషయం వినాలి. వినుగాక! ఇద్దరికీ దుఃఖాలు తొలగించేదీ, సుఖాలు కలిగించేదీ చెబుతున్నాను. కల్యాణీ! నువ్వు గొప్ప తపస్సు చేశావు. ఆ తపస్సుకి ఫలంగానే నీకిది జరిగింది. లేకపోతే ఎలా జరుగుతుంది. చెప్పు! ఇప్పుడిక ఈ శరీరం విడిచిపెట్టేసి దివ్యదేహం పొందుతావు. లక్ష్మీదేవితో సమానవై శ్రీహరితో నిత్యం ఆనందిస్తావు. విడిచిపెట్టిన నీ ఈ దేహం నదీరూపం పొందుతుంది. భారతదేశంలో గండకి అనే పేరుతో పవిత్రనదివై ప్రసిద్ధికెక్కుతావు.

కియత్కాలం మహాదేవి దేవపూజనసాధనే ।
ప్రధానరూపా తులసీ భవిష్యసి వరేణ మే ॥45॥

స్వర్గే మర్త్యే చ పాతాళే తిష్ఠ త్వం హరిసన్నిధౌ ।
భవ త్వం తులసీవృక్షో వరా పుష్పేషు సుందరీ ॥46॥

వృక్షాధిష్ఠాతృదేవీ త్వం వైకుంఠే దివ్యరూపిణీ ।
సార్ధం రహసి హరిణా నిత్యం క్రీడాం కరిష్యసి ॥47॥

ఓ మహాదేవీ! పూజకు ప్రధానసాధనమైన సాధనం తులసివి నువ్వు అవుతావు. ఇది నా వరం. స్వర్గమర్త్యపాతాళలోకాలలో హరి సన్నిధానంతో విలసిల్లుతావు. ఓ సుందరీ! పుష్పాలన్నిటికన్న అందమైనదానివిగా తులసే వృక్షంగా నువ్వు అవుతావు. నీవు చెట్లంటికీ అధిష్ఠానదేవతవై దివ్యరూపంతో వైకుంఠంలో శ్రీమహావిష్ణువుతో క్రీడించగలవు. శ్రీహరితో కలిసి నిత్యమూ రహస్యంగా క్రీడిస్తూంటావు.

నద్యధిష్ఠాతృదేవీ యా భారతే బహుపుణ్యదా ।
లవణోదస్య పత్నీ సా హర్యంశస్య భవిష్యసి ॥48॥

హరిర్వై శైలరూపీ స గండకీతీరసన్నిధౌ ।
సంకరిష్యత్యధిష్ఠానం భారతే తవ శాపతః ॥49॥

తత్ర కోట్యశ్చ కీటాశ్చ తీక్ష్ణదంష్ట్రా భయంకరాః ।
తచ్ఛిత్త్వా కుహరే చక్రం కరిష్యంతి తదీయకమ్ ॥50॥

శాలగ్రామశిలా సా హి తద్భేదాదతిపుణ్యదా ।
లక్ష్మీనారాయణాఖ్యాదిశ్చక్రభేదాద్భవిష్యతి ॥51॥

శాలగ్రామశిలా విష్ణోస్తులస్యాస్తవ సంగమః ।
సదా సాదృశ్యరూపా యా బహుపుణ్యవివర్ధనీ ॥52॥

భారతదేశంలో నువ్వు నదులకు అధిష్ఠానదేవతవై బహుపుణ్యప్రదవుగా వెలుగొందుతావు. శ్రీహరి అంశమైన లవణసముద్రానికి భార్యవవుతావు. గండకీనది ఒడ్డున శ్రీహరి శైలరూపంతో అధివసిస్తాడు. నీ శాపం వల్ల అతడిలా భారతదేశంలో పర్వతంగా అధివసిస్తాడు. ఆ కొండమీద కోట్లకోలదీ భీకర కీటకాలుంటాయి. వాటి దంతాలు చాలా దృఢంగా వాడిగా ఉంటాయి. అవి ఆ కొండగుహలలో ఉండి రాళ్ళను తొలిచి సుదర్శన చక్రాలు చేస్తాయి. అలా ఏర్పడేదే పుణ్యప్రదమైన శాలగ్రామశిల. చక్రాదిరూపాలలో ఉండి లక్ష్మీనారాయణాది నామధేయాలతో అది కీర్తింపబడుతుంది. ఓ తులసీ! శాలగ్రామశిల అంటే నువ్వూ విష్ణుమూర్తీ కలిసిఉన్న (సంగమించిన) తావు. అది మీ ఇద్దరికీ సమానప్రతిరూపం. బహుపుణ్యవివర్ధకం.

తులసీ పత్రవిచ్ఛేదం శాలగ్రామే కరోతి యః ।
తస్య జన్మాంతరే భద్రే స్త్రీవిచ్ఛేదో భవిష్యతి ॥53॥

తులసీపత్రవిచ్ఛేదం శంఖం హిత్వా కరోతి యః ।
భార్యా హీనో భవేత్సోఽపి రోగీ స్యాత్సప్తజన్మసు ॥54॥

శాలగ్రామశ్చ తులసీ శంఖం చైకత్ర ఏవ హి ।
యో రక్షతి మహాజ్ఞానీ స భవేత్ శ్రీహరిప్రియః ॥55॥

త్వం ప్రియా శంఖచూడస్య చైకమన్వంతరావధి ।
శంఖేన సార్ధం త్వద్భేదః కేవలం దుఃఖదస్తవ ॥56॥

తులసీ! శంఖశాలగ్రామాలు, ఈ మూడింటిలో శాలగ్రామం నుంచి తులసిని వేరుచేసినా, శంఖాన్ని తులసినీ వేరు చేసినా అతడు మరసటి జన్మలో భార్యా విహీనుడు (విధురుడు) అవుతాడు. ఏడు జన్మలవరకూ రోగపీడితుడవుతాడు. ఈ మూడింటినీ కలిపి ఒకేచోట ఉంచి కాపాడుతూ పూజించినవాడు మహాజ్ఞాని అవుతాడు. శ్రీహరికి అత్యంతప్రీతిపాత్రుడవుతాడు. ఓ తులసీ! నువ్వు ఒక మన్వంతరకాలం శంఖచూడుడికి ఇల్లాలుగా ఉన్నావు. ఇప్పుడు శంకచూడుడు లేడు. అందుకని ఈ ఎడబాటు నీకు దుఃఖం కలిగిస్తోంది. అంతే

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా శంకరస్తత్ర మాహాత్మ్యమూచివాంస్తదా ।
శాలగ్రామశిలాయాశ్చ తులస్యా బహుపుణ్యదమ్ ॥57॥

తతశ్చాంతర్హితో భూత్వా మోదయిత్వా హరిం చ తామ్ ।
జగామ స్వాలయం శంభుః శర్మదో హి సదా సతామ్ ॥58॥

ఇతి శ్రుత్వా వచశ్శంభోః ప్రసన్నా తు తులస్యభూత్ ।
తద్దేహం చ పరిత్యజ్య దివ్యరూపా బభూవ హ ॥59॥

ప్రజగామ తయా సార్ధం వైకుంఠం కమలాపతిః ।
సద్యస్తద్దేహజాతా చ బభూవ గండకీ నదీ ॥60॥

శైలోఽభూదచ్యుతస్సోఽపి తత్తీరే పుణ్యదో నృణామ్ ।
కుర్వంతి తత్ర కీటాశ్చ ఛిద్రం బహువిధం మునే ॥61॥

జలే పతంతి యాస్తత్ర శిలాస్తాస్త్వతిపుణ్యదాః ।
స్థలస్థా పింగళా జ్ఞేయాశ్చోపతాపాయ చైవ హి ॥62॥

ఇత్యేవం కథితం సర్వం తవ ప్రశ్నానుసారతః ।
చరితం పుణ్యదం శంభోః సర్వకామప్రదం నృణామ్ ॥63॥

ఆఖ్యానమిదమాఖ్యాతం విష్ణుమాహాత్మ్యమిశ్రితమ్ ।
భుక్తిముక్తిప్రదం పుణ్యం కిం భూయః శ్రోతుమిచ్ఛసి ॥64॥

వ్యాసమునీ! తులసీ శాలగ్రామాల పుణ్యవృత్తాంతాన్ని మాహాత్మ్యాన్ని చెప్పి, శ్రీహరిని సంతోషపెట్టి శివుడు అంతర్హితుడయ్యాడు. అతడు సత్పురుషులకు ఆనందప్రదుడుగదా! సరే. శివుడు చెప్పినదంతా విన్నాక తులసి తేరుకుంది. తనువు చాలించి దివ్యరూపం పొందింది. ఆమెతో కలిసి శ్రీహరి తన వైకుంఠానికి చేరుకున్నాడు. అప్పుడలా ఆమె విడిచిన తనువు నుంచి సద్యఃకాలంలో గండకీనది ఆవిర్భవించింది. దాని ఒడ్డున శ్రీహరి గిరి అయ్యాడు. అది పుణ్యప్రదం. కీటకాలు శిలలను రకరకాలుగా తొలుస్తున్నాయి. వాటిలో కొన్ని గండకీనదీ జలంలో పడుతున్నాయి. అవే అతి పుణ్యప్రదాలైన శాలగ్రామశిలలు. గట్టున పడ్డవి పింగళ (జేగురురంగు) వర్ణంలో ఉంటాయి. అవి మాత్రం మనస్తాపకారకాలు. మునీ! నువ్వు అడిగనదంతా చెప్పాను. ఇది పుణ్యప్రదమైన శివచరిత్ర, విష్ణుమాహాత్మ్యం. సకలకామప్రదం. భుక్తిముక్తిదాయకం. ఇంకా ఏమి వినాలనుకుంటున్నావో అడుగు.

ఇతిశ్రీశివ మహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధోపాఖ్యానే తులసీశాపవర్ణనం నామ ఏకచత్వారింశోఽధ్యాయః ॥41॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడ వధోపాఖ్యానంలో తులసీశాపవర్ణనం అనే నలభై ఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్విచత్వారింశోఽధ్యాయః – నలబై రెండవ అధ్యాయం

హిరణ్యాక్షవధః – హిరణ్యాక్షవధ

నారద ఉవాచ – నారదుడు అన్నాడు.

శంఖచూడవధం శ్రుత్వా చరితం శశిమౌళినః ।
అయం తృప్తో ఽస్మి నో త్వత్తో ఽమృతం పీత్వా యథా జనః ॥1॥

బ్రహ్మన్ యచ్చరితం తస్య మహేశస్య మహాత్మనః ।
మాయామాశ్రిత్య సల్లీలాం కుర్వతో భక్తమోదదామ్ ॥2॥

బ్రహ్మదేవుడా! చంద్రశేఖరుడి చరితాన్ని ఈ శంఖచూడవధవృత్తాంతాన్ని నీ నుంచి విని నేను, అమృతం గ్రోలిన జనుడిలాగా ఎంతో తృప్తిని పొందాను. భక్తులకు ఆనందదాయకంగా, మాయామయుడై ఎన్నెన్నో లీలావిశేషాలు చేస్తున్న మహామహితాత్ముడు ఆ మహేశుడి చరితం కదా ఇది!

బ్రహ్మోవాచ – బ్రహ్మ చెప్పాడు.

జలంధరవధం శ్రుత్వా వ్యాసస్సత్యవతీ సుతః ।
అప్రాక్షీదిమమేవార్థం బ్రహ్మపుత్రం మునీశ్వరమ్ ॥3॥

సనత్కుమారః ప్రోవాచ వ్యాసం సత్యవతీసుతమ్ ।
సుప్రశంస్య మహేశస్య చరితం మంగళాయనమ్ ॥4॥

నాయనా! నారదా! వెనకటికి జలంధరవధను ఆలకించి సత్యవతీసుతుడు వ్యాసుడు ఇలాగే ఇదే అడిగాడు బ్రహ్మమానసపుత్రుడైన సనత్కుమారుణ్ని. అప్పుడు ఆ సనత్కుమారుడు ప్రశస్తమూ సర్వమంగళాలకూ నిలయమూ అయిన మహేశ్వరవృత్తాంతాన్ని వ్యాసుడికి వివరంగా తెలియజేశాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

శృణు వ్యాస మహేశస్య చరితం మంగళాయనమ్ ।
యథాంధకో గాణపత్యం ప్రాప శంభోః పరాత్మనః ॥5॥

కృత్వా పరమసంగ్రామం తేన పూర్వం మునీశ్వర ।
ప్రసాద్య తం మహేశానం సత్త్వభావాత్పునః పునః ॥6॥

మాహాత్మ్యమద్భుతం శంభో శ్శరణాగతరక్షిణః ।
సుభక్తవత్సలస్యైవ నానాలీలావిహారిణః ॥7॥

సమస్త శుభాలకూ నిలయం మహేశ్వరుడి చరితం. వ్యాసమునీ! ఆలకించు. అంధకుడనేవాడు శివుడి అనుగ్రహం వల్ల శివగణాలకు అధిపతి కాగలిగాడు. మునీశ్వరా! అ అంధకుడే ఒకప్పుడు శివుడితో తలపడి

ఘోరసంగ్రామం చేశాడు. అటుపైని సాత్త్వికుడై శివుణ్ని పునఃపునః ప్రసన్నుణ్ని చేసుకున్నాడు. శరణాగత రక్షకుడైన శివుడి మాహాత్మ్యం – అత్యద్భుతం! అతడు భక్తవత్సలుడు. అనేకవిధాలుగా అద్భుతలీలలు ప్రదర్శిస్తూ ఉంటాడు.

మాహాత్మ్యమేతద్ వృషభధ్వజస్య శ్రుత్వా మునిర్గంధవతీ సుతో హి ।
వచో మహార్థం ప్రణిపత్య భక్త్యా హ్యువాచ తం బ్రహ్మసుతం మునీంద్రమ్ ॥8॥

వృషభధ్వజుడి ఈ మాహాత్మ్యాన్ని ఆలకించాడు సత్యవతీసుతుడు వ్యాసుడు. వివరంగా తెలుసుకోవాలనే ఉత్కంఠ కలిగింది. వెంటనే భక్తితో సనత్కుమారుడికి సాష్టాంగపడ్డాడు. ఆ బ్రహ్మమానసపుత్రుణ్ని, ఆ మునీంద్రుణ్ని ఇలా అర్థించాడు.

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

కో హ్యంధకో వై భగవన్మునీశ కస్యాన్వయే వీర్యవతః పృథివ్యామ్ ।
జాతో మహాత్మా బలవాన్ ప్రధానః కిమాత్మకః కస్య సుతోఽంధకశ్చ ॥9॥

ఏతత్సమస్తం సరహస్యమద్య బ్రవీహి మే బ్రహ్మసుత! ప్రసాదాత్ ।
స్కందాత్త్వయా వై విదితం హి సమ్యక్ మహేశపుత్రాదమితావబోధాత్ ॥10॥

గాణపత్యం కథం ప్రాప శంభోః పరమతేజసః ।
సోఽంధకో ధన్య ఏవాతి యో బభూవ గణేశ్వరః ॥11॥

మహానుభావా! మునీశ్వరా! ఈ అంధకుడు ఎవరు? ఈ భూమి మీద ఏ బలశాలుల వంశంలో జన్మించాడు? ఎవరి కుమారుడు? ఎటువంటివాడు? ఎంతటి శక్తిసంపన్నుడు? ఎంతటి మహాత్ముడు? ఎంతటి ప్రధానుడు? ఎలాంటి స్వభావం? అసలీ అంధకుడు ఎవరివాడు? ఇది అంతా, రహస్యాలతో సహా ఓ బ్రహ్మసుతా? ప్రసన్నుడవై నాకు తెలియపరచు. మహేశపుత్రుడయిన స్కంధుని నుండి స్పష్టమైన బోధకలిగిన స్కంధుని నుండి నీ చేత తెలియబడినది. పరమతేజస్వి కదా శంభుడు! అతడి దగ్గర గణాధిపతిత్వాన్ని ఈ అంధకుడు ఎలా పొందగలిగాడు? ఇలా శివగణేశ్వరుడు కాగలిగాడంటే ఇతడు నిజంగా ధన్యుడే.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

వ్యాసస్య చైతద్వచనం నిశమ్య ప్రోవాచ స బ్రహ్మసుతస్తదానీమ్ ।
మహేశ్వరోతీః పరమాప్తలక్ష్మీః సంశ్రోతుకామం జనకం శుకస్య ॥12॥

నారదా! వ్యాసుడు ఇలా అడిగే సరికి బ్రహ్మకుమారుడైన సనత్కుమారుడు వినకోరికతో ఉన్న శుకుని తండ్రి అయిన వ్యాసునికి చెప్పాడు. ఆ సనత్కుమారుడు – మహేశ్వర లీలాతివిశేషాలను మిక్కిలి శుభదాయకములయిన వానిని వినగోరిన ఆ శుకునితండ్రియగు వ్యాసునకు (శుకతాతకు) ఇలా వివరించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

పురాగతో భక్తకృపాకరోఽసౌ కైలాసతశ్శైలసుతా గణాఢ్యః ।
విహర్తుకామః కిల కాశికాం వై స్వశైలతో నిర్జరచక్రవర్తీ ॥13॥

స రాజధానీం చ విధాయ తస్యాం చక్రం పరోతీః సుఖదా జనానామ్ ।
తద్రక్షకం భైరవనామవీరం కృత్వా సమం శైలజయా హి బహ్వీః ॥14॥

వ్యాసమునీ! భక్త కృపాకరుడూ సకలదేవతా చక్రవర్తి అయిన శివుడు పూర్వం ఒకప్పుడు పార్వతితోనూ తన గణాలతోనూ కలిసి కైలాసం నుంచి బయలు దేరి విహారార్థియై కాశికానగరం చేరుకున్నాడు. దాన్ని తన రాజధానిగా చేసుకున్నాడు. భైరవుడనే వీరుణ్ని దానికి రక్షకుడిగా నియమించాడు. పార్వతీసమేతుడై శివుడు నివసిస్తూ భక్తులకు ఆనందదాయకంగా అనేకలీలలు జరిపాడు.

స ఏకదా మందరనామధేయం గతో నగే తద్వరసుప్రభావాత్ ।
తత్రాపి నానాగణవీరముఖ్యైః శివాసమేతో విజహార భూరి ॥15॥

పూర్వే దిశో మందరశైలసంస్థా కపర్దినశ్చండపరాక్రమస్య ।
చక్రే తతో నేత్రనిమీలినం తు సా పార్వతీ నర్మయుతం సలీలమ్ ॥16॥

ప్రవాళహేమాబ్జ ధృతప్రభాభ్యాం కరాంబుజాభ్యాం నిమిమీల నేత్రే ।
హరస్య నేత్రేషు నిమీలితేషు క్షణేన జాతస్సమహాంధకారః ॥17॥

అక్కడి నుంచి ఒకనాడు మందరపర్వతానికి వెళ్ళాడు. గణవీరులతో పార్వతితో ఆ పర్వతం మీద బహుధా విహరించాడు. ఆ కొండకి తూర్పున ఉండగా పార్వతీదేవి ఒక ఏకాంతంలో నర్మగర్భంగా, ఒక విలాసంగా చండపరాక్రముడైన ఆ కపర్ది కన్నుల్ని మూసింది. పగడాల్లాగా బంగారంలాగా పద్మాల్లాగా ఉన్న తన హస్తపద్మాలతో శివుడి కన్నులు మూసేసరికి క్షణంలో లోకమంతటా గాఢాంధకారం వ్యాపించింది.

తత్ స్పర్శయోగాచ్చ మహేశ్వరస్య కరౌ చ తస్యాః స్ఖలితం మదాంభః ।
శంభోర్లలాటే క్షణవహ్నితప్తో వినిర్గతో భూరిజలస్య బిందుః ॥18॥

గర్భో బభూవాథ కరాళవక్త్రో భయంకరః క్రోధపరః కృతఘ్నుః ।
అంధో విరూపీ జటిలశ్చ కృష్ణో నరేతరో వైకృతికస్సురోమా ॥19॥

గాయన్ హసన్ ప్రరుదన్ నృత్యమానో విలేలిహానో ఘురఘోరఘోషః ।
జాతేన తేనాద్భుతదర్శనేన గౌరీం భవోఽ సౌ స్మితపూర్వమాహ ॥20॥

శివుడి స్పర్శతో పార్వతీదేవి చేతులు చెమరించాయి. ఒక స్వేదబిందువు అతడి ఫాలనేత్రం వేడికి క్షణకాలంలో వ్యాకోచం పొంది పెద్దగోళంగా మారింది. దాని గర్భం నుంచి ఒక వికృతాకారుడు మానవేతరుడు ఆవిర్భవించాడు. వాడికి ముఖం భీకరంగా ఉంది. క్రోధం రూపుదాల్చినట్టున్నాడు. కృతఘ్నుడు కుటిలుడు విరూపి. జడలమారి. నల్లగా ఉన్నాడు. పాడుతున్నాడు. నవ్వుతున్నాడు. ఆడుతున్నాడు. నాలుక చప్పరిస్తున్నాడు. గురగురధ్వనులు చేస్తున్నాడు. ఇలా పుట్టిన ఆ ఘోరాద్భుతరూపిని గమనించి శంభుడు చిరునవ్వులు చిందిస్తూ పార్వతితో ఇలా అన్నాడు.

శ్రీ మహేశ ఉవాచ – శ్రీ మహేశుడు అన్నాడు.

నిమీల్య నేత్రాణి కృతం చ కర్మ బిభేషి సాస్మద్ద్యయితే కథం త్వమ్ ।
గౌరీ హరాత్తద్వచనం నిశమ్య విహస్యమానా ప్రముమోచ నేత్రే ॥21॥

జాతే ప్రకాశే సతిఘోరరూపో జాతోఽంధకారాదపి నేత్ర హీనః ।
తాదృగ్విధం తం చ నిరీక్ష్య భూతం పప్రచ్ఛ గౌరీ పురుషం మహేశమ్ ॥22॥

ఓ ప్రియాంగనా! నా కన్నులు మూసి ఇంత పని చేసి ఇప్పుడు భయపడుతున్నావా? అని మహేశుడు అడిగేసరికి గౌరీదేవి చిన్నగా నవ్వుతూ శివుడి కన్నులమీద నుంచి తన చేతులు సడలించింది. వెంటనే లోకమంతటా వెలుగులు ప్రసరించాయి. అంధకారం నుంచి నేత్రహీనుడుగా ఆవిర్భవించిన ఆ ఘోరాకారుణ్ని అప్పుడు నిదానంగా తిలకించి పార్వతీదేవి మహేశ్వరుణ్ని అడిగింది.

గౌర్యువాచ – గౌరి అడిగింది.

కో యం విరూపో భగవన్ హి జాతో నావగ్రతో ఘోరభయంకరశ్చ ।
వదస్వ సత్యం మమ కిం నిమిత్తం సృష్టో ఽథ వా కేన చ కస్య పుత్రః ॥23॥

హే భగవన్! ఎవడు ఈ విరూపి? మన ఎట్టయెదట ఘోరభయంకరాకారంతో ఆవిర్భవించాడు. నాథా! నాకు నిజం చెప్పు. ఇతడిని ఎందుకోసం ఎవరు సృష్టించారు ? ఎవరి కొడుకు?

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శుత్వా హరస్తద్వచనం ప్రియాయా లీలాకరః సృష్టికృతోఽంధరూపామ్ ।
లీలాకరాయాస్త్రిజగజ్జనన్యా విహస్య కించిద్భగవానువాచ ॥24॥

వ్యాసమునీ! ఆ అంధరూపం ఆవిర్భవించడానికి హేతువైన తన ఇల్లాలు, అనేక లీలావిశేషాలు చేసే త్రిలోకజనని పార్వతీదేవి ఇలా అడిగేసరికి లీలాకరుడు హరుడు చిన్నగా నవ్వి ఇలా అన్నాడు.

మహేశ ఉవాచ – మహేశుడు అన్నాడు.

శృణ్వంబికే హ్యద్భుతవృత్తకారే ఉత్పన్న ఏషో ఽద్భుతచండవీర్యః ।
నిమీలితే చక్షుషి మే భవత్యా స స్వేదజో మేఽంధకనామధేయః ॥25॥

త్వం చాస్య కర్తాస్య యథానురూపం త్వయా ససఖ్యా దయయా గణేభ్యః ।
సంరక్షితవ్యస్త్వయి తం హి వైకం విచార్య బుద్ధ్యా కరణీయమార్యే ॥26॥

ఓ అంబికా! అద్భుతకార్యకారిణీ! నువ్వు నా కన్నులు మూసే సరికి నీ చేతి చెమట నుంచి ఈ అద్భుతచండవీర్యుడు ఆవిర్భవించాడు. ఇతడు నీ స్వేదజుడు. అంధకనామధేయుడు. కర్తృత్వం నీదే కనక చెలికత్తెలతో కలిసి నువ్వే ఇతడిని తగినరీతిలో దయతో సాకాలి. శివగణాల నుంచి కాపాడాలి. ఆర్యురాలా! బాగా ఆలోచించి చెయ్యదగినది ఏదో ఒకటి నువ్వే చెయ్యి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

గౌరీ తతో భర్తృవచో నిశమ్య కారుణ్యభావాత్సహితా సఖీభిః ।
నానాప్రకారైర్బహుభిర్ష్ణపాయై శ్చకార రక్షాం స్వసుతస్య యద్వత్ ॥27॥

కాలేఽథ తస్మిన్ శిశిరే ప్రయాతో హిరణ్యనేత్రస్త్వథ పుత్రకామః ।
స్వజ్యేష్టబంధోస్తనయప్రతానం సంవీక్ష్య చాసీత్ప్రియయా నియుక్తః ॥28॥

అరణ్యమాశ్రిత్య తపశ్చకారాసురస్తదా కశ్యపజస్సుతార్థమ్ ।
కాష్ఠోపమోఽసౌ జితరోషదోషస్సందర్శనార్థం తు మహేశ్వరస్య ॥29॥

తుష్టః పినాకీ తపసాస్య సమ్యగ్వరప్రదానాయ యయౌ ద్విజేంద్ర ।
తత్స్థానమాసాద్య వృషధ్వజోఽ సౌ జగాద దైత్యప్రవరం మహేశః ॥30॥

వ్యాసమునీ! అప్పుడు గౌరీదేవి తన భర్త చెప్పిన మాటలు చెవిని బెట్టింది. ఆ వికృతాకారుడి పట్ల దయబూనింది. చెలికత్తెలతో కలిసి అతడికి రకరకాల ఉపాయాలతో రక్షణను కల్పించింది. సొంత కొడుక్కి కల్పించినట్టు కల్పించింది. కాలం గడిచింది. ఆ సమయంలో హిరణ్యాక్షుడికి పుత్రకాంక్ష కలిగింది. అతడి అన్నగారికి హిరణ్యకశిపుడికి చాలా మంది కొడుకులున్నారు. తనకే ఒక్కడూ లేడు. అందుకని కొడుకులు కావాలనిపించింది. అతడి భార్యకూడా పట్టుబట్టింది. అందుమీదట అతడు ఒక శిశిరంలో ఇల్లువదిలి అడవికి వెళ్ళాడు. పుత్రార్థియై తపస్సు చేశాడు. మహేశ్వరుడి దర్శనం కోసం తపస్సు. తపోనియామాలతో ఎండు కట్టెలాగా అయిపోయాడు. రోషదోషాదుల్ని జయించాడు. ఈ తీవ్రతపస్సుకి శివుడు సంతోషించాడు. అతడికి వరాలిచ్చేందుకు బయలుదేరాడు. అతడి తపోవనప్రదేశం చేరుకుని వృషధ్వజుడు ఆ మహేశ్వరుడు దైత్యశ్రేష్ఠునితో ఇలా అన్నాడు.

మహేశ ఉవాచ – మహేశుడు అన్నాడు.

హే దైత్యనాథ కురు నేంద్రియ సంఘుపాతం కిమర్థమేతద్వ్రతమాశ్రితం తే ।
ప్రబ్రూహి కామం వరదో భవోఽహం యదిచ్ఛసి త్వం సకలం దదామి ॥31॥

ఓయీ! దైత్యనాథా! నీ శరీరాన్ని ఇలా శోషింపజెయ్యకు. నువ్వసలు ఎందుకోసం ఈ తపస్సు ప్రారంభించావు? నేను వరదుణ్ణి, శివుణ్ణి, నీ ఇష్టం, ఏమి కావాలో కోరుకో! సమస్తమూ ఇస్తాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

సరస్యమాకర్ణ్య మహేశవాక్యం హ్యతిప్రసన్నః కనకాక్షదైత్యః ।
కృతాంజలిర్నమ్రశిరా ఉవాచ స్తుత్యా చ నత్వా వివిధం గిరీశమ్ ॥32॥

వ్యాసమునీ! అప్పుడు ఆ కనకాక్షదైత్యుడు సరసమైన శివుడి మాటతో చాలా ప్రసన్నుడయ్యాడు. శిరసు వంచి నమస్కరించాడు. అనేక విధాలుగా గిరీశుణ్ణి స్తుతించాడు.

హిరణ్యాక్ష ఉవాచ – హిరణ్యాక్షుడు అడిగాడు.

పుత్రస్తు మే చంద్రలలాట నాస్తి సువీర్యవాన్ దైత్యకులానురూపీః ।
తదర్థమేతద్వ్రత మాస్థితోఽహం తం దేహి దేవశ సువీర్యవంతమ్ ॥33॥

యస్మాచ్చ మద్భ్రాతురనంతవీర్యాః ప్రహ్లాదపూర్వా అపి పంచపుత్రాః ।
మమేహ నాస్తీతి గతాన్వయోఽహం కో మామకం రాజ్యమిదం బుభూషేత్ ॥34॥

రాజ్యం పరస్య స్వబలేన హృత్వా భుంక్తే ఽథవా స్వం పితురేవ దృష్టమ్ ।
స ప్రోచ్యతే పుత్ర ఇహ త్వముత్ర పుత్రీ స తేనాపి భవేత్పితాసౌ ॥35॥

ఊర్ధ్వం గతిః పుత్రవతాం నిరుక్తా మనీషిభిః ధర్మభృతాం వరిష్ఠైః ।
సర్వాణి భూతాని తదర్థమేవమతః ప్రవర్తేత పశూన్ స్వతేజసః ॥36॥

నిరన్వయస్యాథ న సంతి లోకాస్తదర్థమిచ్ఛంతి జనాః సురేభ్యః ।
సదా సమారాధ్య సురాంఘ్రి పంకజం యాచంత ఇత్థం సుతమేకమేవ॥37॥

చంద్రశేఖరా! మా దైత్యకులానికి తగినవాడూ మహాబలసంపన్నుడూ అయిన పుత్రుడు ఒక్కడైనా నాకు ఈనాటివరకూ లేడు. అందుకే ఈ తపస్సు. దయచేసి ఓ దేవాధిదేవా! శక్తిసంపన్నుడైన కొడుకుని నాకు వరంగా ప్రసాదించు. మా అన్నగారు హిరణ్యకశిపుడికి ప్రహ్లాదులు పుత్రులు అనంతశక్తి సంపన్నులు అయిదుగురున్నారు. నాకే ఒక్కడు లేడు. నావంశం ఏమై పోవాలి? నా రాజ్యాన్ని ఎవరు అనుభవించాలి ? పరరాజ్యాన్ని నిజబలంతో ఆక్రమించి అనుభవించడమో, తండ్రి రాజ్యాన్ని వారసత్వంగా పొంది అనుభవించడమో– ఈ రెండే గదా లోకంలో ఉన్నవి. అలాంటివాడే పుత్రుడు. అలాంటి పుత్రుణ్ని కన్నవాడే తండ్రి. ఇహ –పరాలలో ఇదే గదా రీతి! పుత్రవంతుడికే ఉత్తమగతులు అని ధర్మశాస్త్రకర్తల నిర్ణయం. సకలప్రాణి కోటులూ ఇందుకోసమే తమతమ తేజస్సులతో సంతానోత్పత్తిలో ప్రవర్తిస్తున్నాయి. వంశోద్ధారకుడు లేనివారికి ఉత్తమలోకాలూ లేవు. అందుకే జనులందరూ దేవతలను అర్థిస్తున్నారు. బ్రహ్మాదులను అర్చించి ఆరాధించి ఒక్క కొడుకుని ప్రసాదించమని యాచిస్తున్నారు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏతద్భవస్తద్వచనం నిశమ్య కృపాకరో దైత్యనృపస్య తుష్టః ।
తమాహ దైత్యాధిప నాస్తి పుత్రస్త్వద్వీర్యజః కింతు దదామి పుత్రమ్ ॥38॥

మమాత్మజం త్వంధకనామధేయం త్వత్తుల్యవీర్యం త్వపరాజితం చ ।
వృణీష్వ పుత్రం సకలం విహాయ దుఃఖం ప్రతీచ్ఛస్వ సుతం త్వమేవ ॥39॥

ఇత్యేవముక్త్వా ప్రదదౌ స తస్మై హిరణ్యనేత్రాయ సుతం ప్రసన్నః ।
హరస్తు గౌర్యా సహితో మహాత్మా భూతాధినాథస్త్రిపురారిరుగ్రః ॥40॥

దయామయుడు ఆ భవుడు దైత్యరాజు అభ్యర్థనకు సంతుష్టుడయ్యాడు. దైత్యాధిపా! నీ తేజస్సుతో పుట్టిన కొడుకు నీకు లేడు. కానీ నీకు నేనొక పుత్రుణ్ని ఇస్తున్నాను. ఇతడి పేరు అంధకుడు నా పుత్రుడు. నీకు సాటివచ్చే

బలశాలి. అపరాజితుడు. ఇతణ్ని స్వీకరించు. దుఃఖం అంతా విడిచిపెట్టు – అని ఆజ్ఞాపించి ఆ మహాత్ముడు గౌరీసమేతుడైన భూతాధినాథుడు త్రిపురారి ఉగ్రుడు హరుడు ప్రసన్నచిత్తంతో అంధకుణ్ని హిరణ్యాక్షుడికి అప్పగించాడు.

నతో హరాత్ప్రాప్య సుతం స దైత్యః ప్రదక్షిణీకృత్య యథాక్రమేణ ।
స్తోత్రైరనేకైరభిపూజ్య రుద్రం తుష్టస్స్వరాజ్యం గతవాన్ మహాత్మా ॥41॥

తతస్తు పుత్రం గిరిశాదవాప్య రసాతలం చండపరాక్రమస్తు ।
ఇమాం ధరిత్రీమనయత్ స్వదేశం దైత్యో విజిత్వా త్రిదశానశేషాన్ ॥42॥

వ్యాసమునీ! అప్పుడు హిరణ్యాక్షుడు పార్వతీపరమేశ్వరులకు ప్రదక్షిణం చేసి బహుధా స్తుతించి అర్చించి సంతుష్టుడై అంధకుడితో కలిసి తన రాజ్యానికి వెళ్ళి పోయాడు. అటుపైని వాడు దేవతలనందరినీ ఓడించి భూగోళాన్ని తన పాతాళానికి పట్టుకుపోయాడు చండపరాక్రముడు ఆ హిరణ్యక్షుడు.

తతస్తు దేవైర్మునిభిశ్చ సిద్ధైస్సర్వాత్మకం యజ్ఞమయం కరాళమ్ ।
వారాహమాశ్రిత్య వపుః ప్రధానమారాధితో విష్ణురనంతవీర్యః ॥43॥

ఘోణాప్రహారైర్విదళైర్ధరిత్రీం విదార్య పాతాళతలం ప్రవిశ్య ।
తుండేన దైత్యాన్ శతశో విచూర్ణ్య దంష్ట్రాభిరగ్ర్యాభిరఖండితాభిః ॥44॥

పాదప్రహారైరశనిప్రకాశైరున్మథ్య సైన్యాని నిశాచరాణామ్ ।
మార్తండకోటిప్రతిమేన పశ్చాత్సుదర్శనేనాద్భుతతుండతేజాః ॥45॥

హిరణ్యనేత్రస్య శిరో జ్వలంతం చిచ్ఛేద దైత్యాంశ్చ దదాహ దుష్టాన్ ।
తతః ప్రహృష్టో దితిజేంద్రరాజం స్వమంధకం తత్ర స చాభ్యషించత్ ॥46॥

స్వస్థానమాగత్య తతో ధరిత్రీం దంష్ట్రాంకురేణోద్ధరతః ప్రహృష్టః ।
భూమిం చ పాతాలతలాన్మహాత్మా పుపోష భాగం త్వథ పూర్వకం తు ॥47॥

దేవైస్సమస్తైర్మునిభిః ప్రహృష్టైరభిష్టుతః పద్మభువా చ తేన ।
యయౌ స్వలోకం హరిరుగ్రకాయో వరాహరూపస్తు సుకార్యకర్తా ॥48॥

అప్పుడు సకలదేవతలూ మునులూ సిద్ధులూ అనంతపరాక్రమసంపన్నుడైన విష్ణువును ఆశ్రయించారు. స్తుతించారు. సకలదేవతాప్రధానుడు సమస్తయజ్ఞమయము, అత్యంతకరాళము అయిన వరాహరూపం ధరించి నిలిచాడు. ముట్టెదెబ్బలతో భూమిని చీల్చి పాతాళానికి ప్రవేశించాడు. ఉగ్రదంష్ట్రలతో దైత్యులను వందలాదిగా చీల్చి చెండాడాడు. పిడుగుపాటులవంటి పాదప్రహారాలతో దైత్యసేనలను నుగ్గునుగ్గు చేశాడు. అటుపైని కోటి సూర్యసమప్రకాశమైన సుదర్శనచక్రంతో హిరణ్యాక్షుడి శిరస్సు ఖండించి అతడి కళేబరాన్ని భస్మం చేశాడు. దుష్టులనందరినీ అంతం చేశాడు. శ్రీహరి సంతుష్టుడయ్యాడు. అంధకుణ్ని అక్కడ పట్టాభిషిక్తుణ్ని చేశాడు. తిరిగి

తన నెలవు చేరుకున్నాడు. దంష్ట్రాగ్రభాగంతో భూదేవిని పాతళం నుంచి ఉద్ధరించి మునుపటిలాగా యథాస్థానంలో నిలబెట్టాడు. పోషించాడు. దేవతలూ మునులు అందరూ సంతోషించారు. బ్రహ్మదేవుడు స్వయంగా స్తుతించాడు. ఇలా దేవకార్యం నిర్వహించి శ్రీహరి తన ఉగ్రవరాహరూపంతోనే తన నివాసలోకం చేరుకున్నాడు.

హిరణ్యనేత్రే ఽథ హతే సురేశే వరాహరూపేణ సురేణ దేవాః ।
దేవాస్సమస్తా మునయశ్చ సర్వే పరే చ జీవాస్సుఖినో బభూవుః ॥49॥

వ్యాసమునీ! వరాహరూపధారి శ్రీహరిచేతిలో హిరణ్యాక్షుడు ఇలా మడియగా సకలదేవతలూ మునులు ఇంకా తక్కిన సకలప్రాణులు సంబరపడ్డాయి. సుఖపడ్డాయి.

ఇతిశ్రీశివ మహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శంఖచూడవధోపాఖ్యానే హిరణ్యాక్షవధో నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥42॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శంఖచూడవధోపాఖ్యానంలో హిరణ్యాక్షవధ అనే నలబై రెండవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

త్రిచత్వారింశోఽధ్యాయః – నలభై మూడవ అధ్యాయం

హిరణ్యకశిపువధవర్ణనమ్ – హిరణ్యకశిపువధవర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

సనత్కుమార సర్వజ్ఞ హతే తస్మిన్సురద్రుహి ।
కిమకార్షీత్తతస్తస్య జ్యేష్ఠభ్రాతా మహాసురః ॥1॥

కుతూహలమితి శ్రోతుం మమాతీవ మునీశ్వర ।
తచ్ఛ్రావయ కృపాం కృత్వా బ్రహ్మపుత్ర నమోఽస్తు తే ॥2॥

సర్వజ్ఞుడా! సనత్కుమారుడా! దేవతల శత్రువు ఆ హిరణ్యాక్షుడు అలా సంహరింపబడగా అతడి అన్నగారు మహాసురుడు హిరణ్యకశిపుడు ఊరుకున్నాడా? ప్రతీకారంగా ఏమి చేశాడు? మునీశ్వరా! వినాలనే కుతూహలం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. బ్రహ్మపుత్రుడా నీకు దండం పెడతాను. దయచేసి అదంతా చెప్పవూ!

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్య స మునీశ్వరః ।
సనత్కుమారః ప్రోవాచ స్మృత్వా శివపదాంబుజమ్ ॥3॥

నారదా! వ్యాసుడు అలా అడిగితే మునీశ్వరుడు సనత్కుమారుడు ఆ అభ్యర్థన ఆలకించి, మరొక్కసారి శివుడి పాదపద్మాలను ధ్యానించి ఇలా వివరించాడు

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

భ్రాతర్యేవం వినిహతే హరిణా క్రోడమూర్తినా ।
హిరణ్యకశిపుః వ్యాస పర్యతప్యద్రుషా శుచా ॥4॥

తతః ప్రజానాం కదనం విధాతుం కదనప్రియాన్ ।
నిర్దిదేశాసురాన్ వీరాన్ హరివైరప్రియో హి సః ॥5॥

అథ తే భర్తృసందేశమాదాయ శిరసాఽసురాః ।
దేవప్రజానాం కదనం విదధుః కదనప్రియాః ॥6॥

తతో విప్రకృతే లోకేఽసురైస్తైర్దుష్టమానసైః ।
దివం దేవాః పరిత్యజ్య భువి చేరురలక్షితాః ॥7॥

వ్యాసమునీ! క్రోడరూపం ధరించిన శ్రీహరిచేతిలో తన సోదరుడు హిరణ్యాక్షుడు ఇలా నిహతుడుకాగా, హిరణ్యకశిపుడు రోషంతోనూ దుఃఖంతోనూ రగిలిపోయాడు. అసలే అతడికి శ్రీహరితో వైరమంటే చాలా ఇష్టం.

వెంటనే రణప్రియులైన తన అసురవీరులకు దేవతలతో యుద్ధానికి సిద్ధంకండి అని ఆజ్ఞాపించాడు. నాయకుడి ఆనతి శిరసావహించి కదనప్రియులైన ఆ దైత్యవీరులందరూ దేవప్రజానీకంతో యుద్ధం మొదలు పెట్టారు. ఆ దుష్టమానసుల చేతిలో ఓడిపోయి దేవతలు దేవలోకం విడిచి పారిపోయారు. భూలోకంలో ఎవరికంటా పడకుండా జీవితాలు నెట్టుతున్నారు.

హిరణ్యకశిపుః భ్రాతుస్సంపరే తస్య దుఃఖితః ।
కృత్వా కరోదకాదీని తత్కళత్రాద్యసాంత్వయత్ ॥8॥

తతస్స దైత్యరాజేంద్రో హ్యజేయమజరామరమ్ ।
ఆత్మానమప్రతిద్వంద్వమేకరాజ్యం వ్యధిత్సత ॥9॥

స తేపే మందరద్రోణ్యాం తపః పరమదారుణమ్ ।
ఊర్ధ్వబాహుర్నభోదృష్టిః పాదాంగుష్ఠాశ్రితావనిః ॥10॥

తస్మింస్తపస్తప్యమానే దేవాస్సర్వే బలాన్వితాః ।
దైత్యాన్ సర్వాన్ వినిర్జిత్య స్వాని స్థానాని భేజిరే ॥11॥

దుఃఖితుడైన హిరణ్యకశిపుడు మరణించిన తన సోదరుడికి ధర్మోదకాదులు సమర్పించి అతడి భార్యాబంధువులను ఓదార్చాడు. అటుపైని సోదరుడి రాజ్యాన్ని తన రాజ్యాన్నీ కలుపుకుని అజేయుడై అజరామరుడై అప్రతిద్వంద్వుడై ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలన సాగించాడు. కొంతకాలానికి అతడు మందరాద్రికి వెళ్ళి దారుణమైన ఘోరతపస్సు చేశాడు. బొటనవేలిమీద నిలబడి చేతులు పైకెత్తి ఆకాశంలో దృష్టి నిలిపి తీవ్రంగా తపస్సు చేశాడు. హిరణ్యకశిపుడు ఇలా తపస్సు చేస్తున్నకాలంలో దేవతలు బలం పుంజుకుని దైత్యుల్ని ఓడించి తమ తమ రాజ్యాలు గుంజుకుని స్థిరపడ్డారు.

తస్య మూర్ధ్నస్సముద్భూతస్సధూమోఽగ్ని స్తపోమయః ।
తిర్యగూర్ధ్వమధోలోకానతపద్విష్వగీరితః ॥12॥

తేన తప్తా దివం త్యక్త్వా బ్రహ్మలోకం యయుస్సురాః ।
ధాత్రే విజ్ఞాపయామాసుస్తత్తపో వికృతాననాః ॥13॥

అథ విజ్ఞాపితో దేవైః వ్యాస తైరాత్మభూర్విధిః ।
పరీతో భృగుదక్షాద్యైః యయౌ దైత్యేశ్వరాశ్రమమ్ ॥14॥

తపస్సు చేస్తున్న హిరణ్యకశిపుడి శిరస్సునుంచి పొగలు విరజిమ్ముతూ తపోగ్నిజ్వాల బయలుదేరింది. అది అన్నిదిక్కులా సకలలోకాలనూ ఆవరించింది. ఆ వేడి తట్టుకోలేక దేవతలు తమ లోకం విడిచి పెట్టి బ్రహ్మలోకం చేరుకున్నారు. మాడిపోయిన ముఖాలతో మొరపెట్టుకున్నారు. వ్యాసా! వారి మొర ఆలకించిన విధాత భృగుదక్షాదిమహర్షులతో కలిసి దైత్యేశ్వరుడి తపోవనానికి వెళ్ళాడు.

ప్రతాప్య లోకానఖిలాంస్తతోఽసౌ సమాగతం పద్మభవం దదర్శ ।
వరం హి దాతుం తమువాచ ధాతా వరం వృణీష్వేతి పితామహో ఽపి ॥15॥

నిశమ్య వాచం మధురం విధాతుః వచో ఽబ్రవీదేవమమూఢబుద్ధిః ।
మృత్యోర్భయం మే భగవన్ ప్రజేశ పితామహాభూన్న కదాపి దేవ ॥16॥

శస్త్రైస్తపాశాశనిశుష్కవృక్ష గిరీంద్రతోయాగ్నిరిపుప్రహారైః ।
దేవైశ్చ దైత్యైర్మునిభిశ్చ సిద్ధైః త్వత్సృష్టజీవైర్బహువాక్యతః కిమ్ ॥17॥

స్వర్గే ధరణ్యాం దివసే నిశాయాం నైవోర్ధ్వతో నాప్యధతః ప్రజేశ ।
తస్యైతదీదృగ్వచనం నిశమ్య దైత్యేంద్ర తుష్టో ఽస్మి లభస్వ సర్వమ్ ॥18॥

ప్రణమ్య విష్ణుం మనసా తమాహ దయాన్వితోఽ సావితి పద్మయోనిః ।
అలం తపస్తే పరిపూర్ణకామస్సమాః సహస్రాణి చ షణ్ణవత్యః ॥19॥

ఉత్తిష్ఠ రాజ్యం కురు దానవానాం శ్రుత్వా గిరం తత్సుముఖో బభూవ ।
రాజ్యాభిషిక్తః ప్రపితామహేన త్రైలోక్యనాశాయ మతిం చకార ॥
ఉత్సాద్య ధర్మాన్ సకలాన్ ప్రమత్తో జిత్వా హవే సో ఽపి సురాన్సమస్తాన్ ॥20॥

ఇలా ముల్లోకాలనూ తపోగ్నితో పరితపింపజేసిన హిరణ్యకశిపుడు తన చెంతకు వచ్చిన బ్రహ్మదేవుణ్ణి చూశాడు. అదే సమయానికి పితామహుడు బ్రహ్మదేవుడు వరం ఏమి కావాలో కోరుకొమ్మని అతడిని అడిగాడు. ఈ మధురవాక్కు విని దైత్యుడు సంబరపడ్డాడు. అతడు బుద్ధి కుశలుడే . అందుకని ఇలా అడిగాడు. హే భగవాన్! పితామహా! ప్రజాపతీ! నాకు ఏనాడూ మృత్యుభయం లేకుండుగాక! శస్త్రాలతో గానీ, అస్త్రాలతోగానీ, పాశాలతో గానీ, పిడుగులతో గానీ, ఎండుచెట్లతో గానీ, పర్వతాలతో గానీ, నీటిలో గానీ, అగ్నితో గానీ, శత్రు ఘాతాలతో గానీ, దేవదైత్యమునిసిద్ధులచేత గానీ, నీచే సృష్టింపబడ్డప్రాణులతో గానీ – వెయ్యేల – స్వర్గంలో గానీ, భూలోకంలో గానీ, పగలుగానీ, రాత్రి గానీ, పైకిగానీ, కిందగానీ – నాకు ఎక్కడా, ఎవరివల్లా, దేనితోనూ, చావులేకుండా వరం ప్రసాదించు ప్రజాపతీ! అని అడిగాడు. ఇది విని బ్రహ్మదేవుడు – దైత్యేంద్రా! నేను చాలా సంతుష్టి చెందాను. నువ్వు కోరుకున్నది పూర్తిగా నెరవేరుతుంది. ఇదే నా వరం – అన్నాడు. అని మనస్సులో ఒక్కసారి విష్ణుమూర్తికి నమస్కరించాడు ఆ దయామయుడు పద్మసంభవుడు. అప్పుడు మళ్ళీ హిరణ్యకశిపుడితో ఇలా అన్నాడు – దైత్యేంద్రా! ఇంక నీ తపస్సు చాలించు. కోరిక తీరింది గదా! తొంభయ్యారువేల సంవత్సరాల పాటు హాయిగా దానవరాజ్యం పాలించు లే ఇంటికి బయలు దేరు! బ్రహ్మదేవుడి మాటలు ఆలకించి తపోవిరమణకు సుముఖుడయ్యాడు హిరణ్యకశిపుడు. బ్రహ్మదేవుడే అప్పుడతణ్ణి దానవరాజ్యానికి పునఃపట్టాభిషిక్తుణ్ణి చేసి వెళ్ళాడు. అటుపైని ఆ దైత్యనాథుడు ముల్లోకాలనూ పీడించడానికి సంకల్పించాడు. ధర్మాలనన్నింటినీ కాలరాసి ప్రమత్తుడై రణరంగాన సకల దేవతలనూ జయించాడు.

తతో భయాదింద్రముఖాశ్చ దేవాః పితామహాజ్ఞాం సమవాప్య సర్వే ।
ఉపద్రుతా దైత్యవరేణ జాతాః క్షీరోదధిం యత్ర హరిస్తు శేతే ॥21॥

ఆరాధయామాసురతీవ విష్ణుం స్తుత్వా వచోభిస్సుఖదం హి మత్వా ।
నివేదయామాసురథో ప్రసన్నం దుఃఖం స్వకీయం సకలం హితే తే ॥22॥

ఆశ్వాస్య దేవానఖిలాన్మునీన్వా ఉవాచ వైశ్వానరతుల్యతేజాః ।
దైత్యం హనిష్యే ప్రసభం సురేశాః ప్రయాత ధామాని నిజాని తుష్టాః ॥23॥

శ్రుత్వా రమేశస్య వచస్సురేశాః శక్రాదికాస్తే నిఖిలాస్తుతుష్టాః ।
యయుస్స్వధామాని హిరణ్యనేతానుజం చ మత్వా నిహతం మునీశ ॥24॥

దైత్యుడు తరిమికొట్టగా ఇంద్రాది దేవతలు భయభ్రాంతులయ్యారు. పితామహుణ్ణి సంప్రదించారు. అతడి ఆజ్ఞప్రకారం అందరూ క్షీరసాగరంలోని శ్రీహరిని శరణువేడారు. అతడే తమకు సుఖసంతోషాలను తిరిగి అందించగలడని భావించారు. బహుధా స్తుతించారు. పూజించారు. శ్రీహరి ప్రసన్నుడయ్యాడు. అదే అదనుగా దేవతలు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. హిరణ్యకశిపుడి చేతిలో తాము పడ్డ కష్టాలన్నీ ఎవరికివారుగా చెప్పుకున్నారు. అప్పుడు ఆ అగ్నితుల్యతేజస్వి శ్రీహరి అఖిలదేవతలనూ మునులనూ ఓదార్చి – దేవతలారా! నేను ఆ దైత్యుణ్ణి త్వరలోనే సంహరిస్తాను. మీరు సంతుష్టులై మీమీ నెలవులకు వెళ్ళండి – అన్నాడు. వ్యాసమునీ! ఈ భరోసాతో కుదుటపడి ఇంద్రాదిదేవతలందరూ సంతుష్టులయ్యారు. హిరణ్యకశిపుడు ఇంక మడిసినట్టే భావించి నెమ్మిదిగా తమతమ నివాసాలకు నిష్క్రమించారు.

ఆశ్రిత్య రూపం జటిలం కరాళం దంష్ట్రాయుధం తీక్ష్ణనఖం సునాసమ్ ।
సైంహం చ నారం సువిదారితాస్యం మార్తండకోటి ప్రతిమం సుఘోరమ్ ॥25॥

యుగాంతకాలాగ్ని సమప్రభావం జగన్మయం కిం బహుభిర్వచోభిః ।
అస్తం రవౌ సోఽపి హి గచ్ఛతీశో గతో ఽసురాణాం నగరీం మహాత్మా ॥26॥

కృత్వా చ యుద్ధం ప్రబలైస్స దైత్యైః హత్వాథ తాన్ దైత్యగణాన్ గృహీత్వా ।
బభ్రామ తత్రాద్భుతవిక్రమశ్చ బభంజ తాంస్తానసురాన్ నృసింహః ॥27॥

దృష్టస్స దైత్యైరతులప్రభావస్తే రేభిరే తే హి తథైవ సర్వే ।
సింహం చ తం సర్వమయం నిరీక్ష్య ప్రహ్లాదనామా దితిజేంద్రపుత్రః ॥
ఉవాచ రాజానమయం మృగేంద్రో జగన్మయః కిం సముపాగతశ్చ ॥28॥

ఏష ప్రవిష్టో భగవాననంతో నృసింహమాత్రో నగరం త్వదంతః ।
నివృత్య యుద్ధాత్ శరణం ప్రయాహి పశ్యామి సింహస్య కరాళమూర్తిమ్ ॥29॥

అటుపైని శ్రీహరి నృసింహరూపం ధరించాడు. భీకరమైనజూలు, దంష్ట్రలు, వాడిగోళ్ళు, విశాల నాసిక, విస్తరించిన నోరు, ఘోరంగా కోటిసూర్యప్రతిమంగా నరసింహావతారం వహించాడు. ప్రళయాగ్నిలాగా ఉన్నాడు. వేయి మాటలేల – జగత్తంతటా వ్యాపించాడు. సూర్యుడు అస్తమించబోతున్న సమయంలో అసుర నగరంలోకి ప్రవేశించాడు ఈ మహాత్ముడు. ప్రబలదైత్యులతో భీకరయుద్ధం జరిగింది. దైత్యుల్ని గుంపులు గుంపులుగా

సంహరించాడు. అద్భుతవిక్రముడై వీరవిహారం చేశాడు. ఆ దైత్యులుకూడా అలాగే చెలరేగి పోరాడారు. సర్వమయుడై కనిపిస్తున్న ఆ నరసింహుణ్ని గమనించాడు ప్రహ్లాదుడు – హిరణ్యకశిపుడి కొడుకు. వెంటనే తండ్రిని హెచ్చరించాడు. మహారాజా! జగన్మయుడే మృగేంద్రరూపంలో వచ్చాడు. శ్రీమహావిష్ణువే సింహమాత్రుడై నీ నగరంలో ప్రవేశించాడు. ఇతడు నీ పాలిటి యముడు. వెంటనే యుద్ధం విరమించు. ఈ భీకరసింహమూర్తిని శరణువేడుకో!

యస్మాన్న యోద్ధా భువనత్రయే ఽపి కురుష్వ రాజ్యం వినమన్మృగేంద్రమ్ ।
శ్రుత్వా స్వపుత్రస్య వచో దురాత్మా తమాహ భీతోఽ సి కిమత్ర పుత్ర ॥30॥

ఉక్త్వేతి పుత్రం దితిజాధినాథో దైత్యర్షభాన్ వీరవరాన్ సరాజా ।
గృహ్ణంతు వై సింహమముం భవంతో వీరా విరూపభ్రుకుటీక్షణం తు ॥31॥

తస్యాజ్ఞయా దైత్యవరా స్తతస్తే గ్రహీతుకామా వివిశుర్మృగేంద్రమ్ ।
క్షణేన దగ్ధాశ్శలభా ఇవాగ్నిం రూపాభిలాషాత్ ప్రవివిక్షవో వై ॥32॥

దైత్యేషు దగ్ధేష్వపి దైత్యరాజశ్చకార యుద్ధం స మృగాధిపేన ।
శస్త్రైస్సమగ్రైరఖిలైస్తథాస్త్రైః శక్త్యృష్టి పాశాంకుశపావకాద్యైః ॥33॥

సంయుధ్యతోరేవ తయోర్జగామ బ్రాహ్మం దినం వ్యాస హి శస్త్రపాణ్యోః ।
ప్రవీరయోర్వీవరేణ గర్జతోః పరస్పరం క్రోధసుయుక్తచేతసోః ॥34॥

రాజేంద్రా! ఈ ముల్లోకాలలోనూ ఇతడిని ఎదిరించగల యోధుడు లేడు. కనక ఈ మృగేంద్రుడికి శిరసు వంచి నీ రాజ్యం నీవు ఏలుకో. సొంతకొడుకు ప్రహ్లాదుడు ఇలా చెబితే ఆ దురాత్ముడు హిరణ్యకశిపుడు వినిపించుకోలేదు. పుత్రకా! వీడికి భయపడుతున్నావా! అనేసి తన దైత్యవీరుల్ని అందరినీ యుద్ధానికి పురికొల్పాడు. వీరాధివీరులారా! ఈ సింహాన్ని పట్టుకోండి. ఇది వికటంగా కనుబొమలు ముడుస్తోంది. భీకరంగా చూస్తోంది. వెంటనే బంధించండి – అని ఆజ్ఞాపించాడు. దైత్యమహావీరులంతా ఉత్సాహంగా ముందుకి వెళ్ళారు. రూపాభిలాషతో వెళ్ళి మంటల్లో మాడిపోయిన మిడతల్లాగా దైత్యవీరులంతా క్షణంలో బూడిద అయ్యారు. అయినా విరమించకుండా దైత్యరాజు తానే స్వయంగా యుద్ధానికి దిగాడు. సమస్త శస్త్రాలూ అస్త్రాలూ శక్తి – ఋష్టి – పాశ– అంకుశాది శస్త్రాలన్నీ వినియోగించి పోరాటం సాగించాడు. ఇలా నృసింహహిరణ్యకశిపులు పోరాడుతుండగా వ్యాసమునీ! బ్రహ్మమాసంలో ఒక రోజు గడిచిపోయింది. క్రోధావిష్టులై మహావీరులిద్దరూ పరస్పరం గర్జించుకుంటూ యుద్ధం సాగిస్తూనే ఉన్నారు.

తతస్స దైత్యస్సహసా బహూంశ్చ కృత్వా భుజాన్ శస్త్రయుతాన్నిరీక్ష్య ।
నృసింహరూపం ప్రయయౌ మృగేంద్రం సంయుధ్యమానం సహసా సమంతాత్ ॥35॥

తతస్సుయుద్ధం త్వతిదుస్సహం తుశ స్త్రైస్సమస్తైశ్చ తథాఖిలాస్త్రైః ।
కృత్వా మహాదైత్యవరో నృసింహం క్షయం గతైః శూలధరోఽ భ్యుపాయాత్ ॥36॥

అంతలోకీ ఆ దైత్యనాథుడు వేల చేతులు సృష్టించుకుని వేల ఆయుధాలు ధరించి నృసింహుడి మీదకు వెళ్ళాడు. భీషణంగా యుద్ధం చేశాడు. అన్ని ఆయుధాలూ అయిపోయాయి. అప్పుడింక త్రిశూలం చేతబట్టి నరహరి మీదకు లంఘించాడు.

తతో గృహీతస్య మృగాధిపేన భుజైరనేకైర్గిరిసారవద్భిః ।
నిధాయ జానౌ స భుజాంతరేషు నఖాంకురైర్దానవమర్మభిద్భిః ॥37॥

నఖాస్రుహృత్పద్మమసృగ్విమిశ్రముత్పాద్య జీవాద్విగతః క్షణేన ।
త్యక్తస్తదానీం స తు కాష్ఠభూతః పునఃపునశ్చూర్ణితసర్వగాత్రః ॥38॥

తస్మిన్ హతే దేవరిపౌ ప్రసన్నః ప్రహ్లాదమామంత్ర్య కృతప్రణామమ్ ।
రాజ్యేఽభిషిచ్యాద్భుతవీర్యవిష్ణుస్తతః ప్రయాతో గతిమప్రతర్క్యామ్ ॥39॥

అప్పుడు నరసింహమూర్తి తానుకూడా కొండల్లాగా బలిష్ఠమైన భుజాలు వేలసంఖ్యలో ధరించి దైత్యనాథుణ్ణి చిక్కబట్టుకున్నాడు. తన తొడల మీదకు పడగొట్టి నఖాగ్రభాగాలతో అతడి వక్షఃస్థలం ఆయువుపట్టులూ చీల్చి పారేశాడు. నెత్తురూ ఏరులు కట్టింది. క్షణంలో అతడి శరీరం మొత్తం పిప్పి పిప్పి అయిపోయింది. ప్రాణాలు పోయి ఎండుకట్టెలాగా మిగిలాడు. ఆ దేవశత్రువును ఇలా సంహరించి వెంటనే శ్రీహరి ప్రసన్నుడయ్యాడు. నమస్కరించి నిలిచిన ప్రహ్లాదుణ్ణి చేరపిలిచాడు. దైత్యరాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. అప్రతర్క్యమైన తన నివాసానికి తిరిగి వెళ్ళిపోయాడు.

తతోఽతిహృష్టాస్సకలాస్సురేశాః ప్రణమ్య విష్ణుం దిశి విప్ర తస్యామ్ ।
యయుస్స్వధామాని పితామహాద్యాః కృతస్వకార్యం భగవంతమీడ్యమ్ ॥40॥

ప్రవర్ణితం త్వంధకజన్మ రుద్రాత్ హిరణ్యనేత్రస్య మృతిర్వరాహాత్ ।
నృసింహతస్తత్సహజస్య నాశః ప్రహ్లాదరాజ్యాప్తిరితి ప్రసంగాత్ ॥41॥
శృణు త్విదానీం ద్విజవర్య మత్తోంధకప్రభావం భవకృత్యలబ్ధమ్ ।
హరేణ యుద్ధం ఖలు తస్య పశ్చాద్గణాధిపత్యం గిరిశస్య తస్య ॥42॥

సకలదేవతలూ సంబరపడి వ్యాసమహర్షీ! విష్ణుమూర్తి నిష్క్రమించిన దిక్కుకి నమస్కరించి అతడిని స్తుతిస్తూ తమ తమ నివాసాలకు తరలివెళ్ళారు. ఇలా ఏదో ప్రసంగవశాన – రుద్రుని కొడుకుగా అంధకుడు జన్మించడం, వరాహావతారంలో హిరణ్యనేత్రుడు సంహరింపబడటం, నృహింహుడి చేతిలో అతడి సోదరుడు హిరణ్యకశిపుడు అంతం కావడం, ప్రహ్లాదపట్టాభిషేకం – అంతా నీకు చెప్పాను. ద్విజవర్యా! ఇప్పుడింక అంధకుడి కథ చెబుతాను. అతడు శివుడి నుంచి ప్రభావశాలి కావడం, శివుడితోనే యుద్ధం చెయ్యడం, అటుపైని శివగణాలకు అధిపతి కావడం – అంతా చెబుతా ఆలకించు!

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే గణాధిపత్య ప్రాప్త్యంధకజన్మ హిరణ్యనేత్ర హిరణ్యకశిపువధ వర్ణనం నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥43॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు గణాధిపత్యప్రాప్తి అంధకజన్మ హిరణ్యనేత్ర హిరణ్యకశిపువధలవర్ణనం అనే నలబై మూడవ అధ్యాయం సమాప్తం.

చతుశ్చత్వారింశోఽధ్యాయః – నలబై నాల్గవ అధ్యాయం

దూతసంవాదః – దూతసంవాదం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తతో హిరణ్యాక్షసుతః కదాచిత్ సంశ్రావితో నర్మయుతైర్మదాంధైః ।
తైర్భ్రాతృభిస్సంప్రయుతో విహారే కిమంధ రాజ్యేన తవాద్య కార్యమ్ ॥1॥

హిరణ్యనేత్రస్తు బభూవ మూఢః కలిప్రియం నేత్ర విహీనమేవ ।
యో లబ్ధవాంస్త్వాం వికృతం విరూపం ఘోరైస్తపోభిర్గిరిశం ప్రసాద్య ॥2॥

స త్వం న భాగీ ఖలు రాజ్యకస్య కిమన్యజాతోఽపి లభేత రాజ్యమ్ ।
విచార్యతాం తద్భవతైవ నూనం వయం తు తద్భాగిన ఏవ సత్యమ్ ॥3॥

వ్యాసమునీ! అలా ఉండగా ఒకానొక విహారసమయంలో హిరణ్యాక్షసుతుడైన అంధకుడికి అతడి సవతి సోదరులంతా (ప్రహ్లాదులు అయిదుగురు) కలిసి నర్మగర్భంగా దుర్బోధలు చేశారు. వాళ్ళంతా మదాంధులు. ఓయీ! అంధకా ! నువ్వు అంధుడివి. నీకు రాజ్యమేమిటి? రాజ్యభాగమేమిటి ? ఏం చేసుకుంటావు ? నీ తండ్రి ఒక తెలివి తక్కువవాడు. అంత ఘోరతపస్సూ చేసి శివుణ్ణి మెప్పించి కళ్ళులేని నిన్ను మహా పాపాత్ముణ్ణి వికృతవిరూపిని పుత్రుడుగా పొందాడు. నువ్వు రాజ్యభాగానికి అర్హుడివి కావు. ఎవడికో పుట్టినవాడు సైతం రాజ్యం వారసత్వంగా పొందుతాడా? నువ్వే ఆలోచించు. మేము మాత్రమే హిరణ్యాక్షుడి రాజ్యానికి వారసులం ఇది సత్యం అన్నారు.

తేషాం తు వాక్యాని నిశమ్య తాని విచార్య బుద్ధ్యా స్వయమేవ దీనః ।
తాన్ శాంతయిత్వా వివిధైర్వచోభిర్గతస్త్వరణ్యం నిశి నిర్జనం తు ॥4॥

వర్షాయుతం తత్ర తపశ్చచార జజాప జాప్యం విధృతైకపాదః ।
ఆహారహీనో నియమోర్ధ్వబాహుః కర్తుం న శక్యం హి సురా సురైర్యత్ ॥5॥

ప్రజ్వాల్య వహ్నిం స్మ జుహోతి గాత్రమాంసం సరక్తం ఖలు వర్షమాత్రమ్ ।
తీక్ష్ణేన శస్త్రేణ నికృత్య దేహాత్ సమంత్రకం ప్రత్యహమేవ హుత్వా ॥6॥

స్నాయ్వస్థిశేషం కృపణం తదాసౌ క్షయం గతం శోణితమేవ సర్వమ్ ।
యదాస్య మాంసాని న సంతి దేహం ప్రక్షేప్తుకామస్తు హుతాశనాయ ॥7॥

ఈ మాటలు విన్న అంధకుడు దీనుడయ్యాడు. స్వబుద్ధితో ఆలోచించాడు. అప్పటికి వాళ్ళనందరినీ ఏవేవో మాటలతో శాంతింపజేశాడు. అదేనాటి రాత్రి నిర్జనారణ్యానికి వెళ్ళిపోయాడు. వేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఒంటికాలి మీద నిలిచి మంత్రజపం చేశాడు. నిరాహారుడై ఊర్ధ్వబాహువై సురాసురుల్వెరికీ సాధ్యం కాని తపస్సుచేశాడు. అగ్నిని ప్రజ్వలింపజేసి తన శరీరంలోని రక్తమాంసాలను కత్తితో తెగగోసి రోజుకో కండగా

సమంత్రకంగా హోమం చేస్తూ తపస్సు చేశాడు. ఈ హోమం ఏడాది పాటు సాగింది. శరీరంలో ఆయువుపట్లూ అస్థికలూ మాత్రం మిగిలాయి. రక్తమాంసాలు అయిపోయాయి. చివరిగా మొత్తం దేహాన్నే అగ్నిలో ఆహుతి చెయ్యడానికి సిద్ధపడ్డాడు.

తతస్స దృష్ట్వస్తిదశాలయైర్జ్జనైః సువిస్మితైర్భీతియుతైస్సమన్తైః ।
అథామరైః శీఘ్రతరం ప్రసాదితో బభూవ ధాతా నుతిభిర్నుతో హి ॥8॥

నివారయిత్వాథ పితామహస్తం హ్యువాచ తం చాద్య వరం వృణీష్వ ।
యస్యాప్తికామస్తవ సర్వలోకే సుదుర్లభం దానవ తం గృహాణ ॥9॥

ఇది గమనించి దేవతలు ఆశ్చర్య చకితులయ్యారు. భయపడ్డారు. వెంటనే బ్రహ్మ దగ్గరకు పరుగెత్తారు. స్తోత్రాలతో సుముఖుణ్ణి చేసుకున్నారు. విషయం విన్నవించారు. ఆలస్యం చెయ్యకుండా పితామహుడు బయలుదేరాడు. అంధకుడి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. అంధకా! వరం కోరుకో – అన్నాడు. సమస్తలోకాలలోనూ నీకు ఏది కావాలో అది కోరుకో! అది ఎంత దుర్లభమైనా సరే, ఇస్తాను, స్వీకరించు! అన్నాడు.

స పద్మయోనేస్తు వచో నిశమ్య ప్రోవాచ దీనః ప్రణతస్తు దైత్యః ।
యైర్నిష్ఠురైర్మే ప్రహృతం తు రాజ్యం ప్రహ్లాదముఖ్యా మమ సంతు భృత్యాః ॥10॥

అంధస్య దివ్యం హి తథాస్తు చక్షురింద్రాదయో మే కరదా భవంతు ।
మృత్యుస్తు మా భూన్మమ దేవదైత్య గంధర్వ యక్షోరగమానుషేభ్యః ॥11॥

నారాయణాద్వా దితిజేంద్రశత్రోస్సర్వాజ్జనాత్సర్వమయాచ్చ శర్వాత్ ।
శ్రుత్వా వచస్తస్య సుదారుణం తత్ సుశంకితః పద్మభవస్తమాహ ॥12॥

పద్మసంభవుడి మాట విని అంధకుడు సాష్టాంగనమస్కారం చేసి దీనంగా బదులు పలికాడు. బ్రహ్మదేవుడా! అతినిష్ఠురులైనా సవతి సోదరులు ప్రహ్లాదులు నా రాజ్యం అపహరించారు. వాళ్ళంతా ఇప్పుడు నాకు భృత్యులవ్వాలి. నేను అంధుణ్ణి కదా! నాకు దివ్యమైన దృష్టి కావాలి. అంతేకాదు, ఇంద్రాది దేవతలు సైతం నాకు కప్పం చెల్లించాలి. అలాగే, దేవ దైత్య గంధర్వ యక్షోరగమానవులనుంచి నాకు మృత్యువు ఉండకూడదు. దైత్యులకు శత్రువు నారాయణుడు. అతడి చేతిలో గానీ, ఏ మానవుడి చేతిలో గానీ సర్వమయుడైన శివుడి చేతిలో గానీ నాకు చావు అనేదే ఉండకూడదు. ఈ పాటి వరాలు అనుగ్రహించు చాలు. అంధకుడి ఈ అభ్యర్థనను వినగానే బ్రహ్మదేవుడికి దారుణమనిపించింది. ఏదో శంకించాడు. మెల్లగా పలికాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

దైత్యేంద్ర సర్వం భవితా తదేతద్వినాశహేతుం చ గృహాణ కించిత్ ।
యస్మాన్న జాతో న జనిష్యతే వా యో న ప్రవిష్టో ముఖమంతకస్య ॥13॥

అత్యంతదీర్ఘం ఖలు జీవితం తు భవాదృశాస్సత్పురుషాస్త్యజంతు ।
ఏతద్వచస్సానునయం నిశమ్య పితామహాత్ప్రాహ పునస్స దైత్యః ॥14॥

దైత్యేంద్రా! నువ్వు అడిగినవన్నీ జరుగుతాయి. అయితే ఏదైనా ఒక వినాశహేతువును కూడా కోరుకో! ఎందుకంటే ఇప్పటి వరకూ పుట్టినవాడుగానీ, పుట్టబోయే వాడుగానీ, మృత్యువును పొందనివాడు లేడు. నీవంటి సత్పురుషులు అంతమే లేని సుదీర్ఘజీవితం కోరుకోరు. ఆ కోరిక విడిచిపెట్టు– ఇలా సానునయంగా చెప్పిన బ్రహ్మ మాటలను విని అంధకుడు స్పందించాడు.

అంధక ఉవాచ – అంధకుడు అన్నాడు.

కాలత్రయే యాశ్చ భవంతి నార్యః శ్రేష్ఠాశ్చ మధ్యాశ్చ తథా కనిష్ఠాః ।
తాసాం చ మధ్యే ఖలు రత్నభూతా మమాపి నిత్యం జననీవ కాచిత్ ॥15॥

కాయేన వాచా మనసాప్యగమ్యా నారీ నృలోకస్య చ దుర్లభా యా ।
తాం కామయానస్య మమాస్తు నాశో దైత్యేంద్రభావాద్భగవన్! స్వయంభూః ॥16॥

వాక్యం తదాకర్ణ్య స పద్మయోనిః సువిస్మితశ్శంకరపాదపద్మమ్ ।
సస్మార సంప్రాప్య నిర్దేశమాశు శంభోస్తు తం ప్రాహ తతోఽంధకం వై ॥17॥

అయితే, చతుర్ముఖా! విను. భూతభవిష్యద్వర్తమానాలలో ఉత్తమ – మధ్యమ– కనిష్ఠస్థాయులలోని స్త్రీలలోకెల్లా రత్నంలాంటిది, నాకు సైతం తల్లిలాంటిది, మానవులెవ్వరికీ మనోవాక్కాయకర్మలా అందనిది అయిన మహిళను నేను కామించినప్పుడు నా దైత్యేంద్రపదవి నాశనమగుగాక! హే భగవాన్! హే స్వయంభూ! ఇలా అనుగ్రహించు– అంధకుడి ఈ మాటలు విని నివ్వెరపోయిన పద్మసంభవుడు ఒక్కసారి శంకరపాదపద్మాలను ధ్యానించాడు. శంకరుడి నిర్దేశం అందుకున్నాడు. అంధకుడితో ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

యత్కాంక్షసే దైత్యవరాస్తు తే వై సర్వం భవత్యేవ వచస్కామమ్ ।
ఉత్తిష్ఠ దైత్యేంద్ర లభస్వ కామం సదైవ వీరైస్తు కురుష్వ యుద్ధమ్ ॥18॥

శ్రుత్వా తదేతద్వచనం మునీశ విధాతురాశు ప్రణిపత్య భక్త్యా ।
లోకేశ్వరం హాటకనేత్రపుత్రః స్నాయ్వస్థిశేషస్తు తమాహ దేవమ్ ॥19॥

దైత్యవరా! నువ్వు కోరుకున్నది సమస్తమూ నీకు జరుగుగాక! నీ కోరిక తీరుతుంది. ఇక లే! దైత్యేంద్రా! నీ శత్రువీరులను ఎదిరించు. యుద్ధం ప్రారంభించు. నీ కోరిక తీర్చుకో అని బ్రహ్మదేవుడు అనుగ్రహించాడు. ఇది విని అంధకుడు భక్తితో సాష్టాంగపడ్డాడు. హిరణ్యాక్షుడి కొడుకు. ఇప్పుడు ఆయువుపట్లూ అస్థికలు మాత్రమే మిగిలి ఉన్నాడు. దీనంగా లోకేశ్వరుడితో ఇలా అన్నాడు.

అంధక ఉవాచ – అంధకుడు అభ్యర్థించాడు.

కథం విభో వైరిబలం ప్రవిశ్య హ్యనేన దేహేన కరోమి యుద్ధమ్ ।
స్నాయ్వస్థిశేషం కురు మాంసపుష్టం కరేణ పుణ్యేన చ మాం స్పృశాద్య ॥20॥

ప్రభూ! బ్రహ్మదేవుడా! శత్రుసైన్యంలోకి ప్రవేశించి ఈ శరీరంతో యుద్ధం ఎలా చెయ్యగలను? కేవలం ఆయువుపట్లూ అస్థికలు ఉన్న ఈ శరీరాన్ని దయచేసి కండపట్టించు. నీ పవిత్రమైన చేతితో దీన్ని స్పృశించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శ్రుత్వా వచస్తస్య స పద్మయోనిః కరేణ సంస్పృశ్య చ తచ్ఛరీరమ్ ।
గతస్సురేంద్రైస్సహితః స్వధామ సంపూజ్యమానో మునిసిద్ధసంఘైః ॥21॥

సంస్పృష్టమాత్రస్య చ దైత్యరాజస్సంపూర్ణదేహో బలవాన్ బభూవ ।
సంజాతనేత్రస్సుభగో బభూవ హృష్టస్స్వమేవం నగరం వివేశ ॥22॥

ఉత్సృజ్య రాజ్యం సకలం చ తస్మై ప్రహ్లాదముఖ్యాస్త్వథ దానవేంద్రాః।
తమాగతం లబ్ధవరం చ మత్వా భృత్యా బభూవుర్వశగాస్తు తస్య ॥23॥

తతోఽంధకః స్వర్గమగాద్విజేతుం సేనాభియుక్తస్సహభృత్యవర్గః।
విజిత్య లేఖాన్ ప్రధనే సమస్తాన్ కరప్రదం వజ్రధరం చకార ॥24॥

నాగాన్ సుపర్ణాన్ వరరాక్షసాంశ్చ గంధర్వయక్షానపి మానుషాంస్తు ।
గిరీంద్రవృక్షాన్ సమరేషు సర్వాంశ్చతుష్పదః సింహముఖాన్ విజిగ్యే ॥25॥

అంధకుడి అభ్యర్థనను ఆలకించిన పద్మసంభవుడు తన చేతితో అతడి శరీరం స్పృశించాడు. అటుపైని దేవతల పూజలూ, మునుల స్తుతులూ, సిద్ధసమూహాల అర్చనలూ అందుకుంటూ ఇంద్రుడితో సహా నిష్క్రమించాడు. బ్రహ్మదేవుడి కరస్పర్శతో దైత్యరాజు అంధకుడు పరిపూర్ణదేహుడయ్యాడు. మునుపటిలాగా బలశాలి అయ్యాడు. కన్నులు వచ్చాయి. అందగాడయ్యాడు. చాలా సంబరపడ్డాడు. ఉత్సాహంగా తన నగరం చేరుకున్నాడు. అతడి రాజ్యాన్ని ఆక్రమించుకున్న సవతి సోదరులు ప్రహ్లాదులు అయిదుగురూ రాజ్యం అప్పగించి వెళ్ళిపోయారు. గొప్పగొప్ప వరాలు పొందాడు అని తెలుసుకుని అంధకుడికి భృత్యులూ వశంవదులూ అయిపోయారు. అటుపైని అంధకుడు విజృంభించాడు. సైన్యంతో స్నేహితులతో స్వర్గంమీదకి దండెత్తాడు. రణరంగంలో సకలదేవతలనూ జయించి దేవేంద్రుణ్ణి తనకు సామంతుణ్ణి చేసుకున్నాడు. కప్పం కట్టేట్టు లొంగదీసుకున్నాడు. అదే వరసలో నాగుల్ని, సుపర్ణుల్ని, రాక్షసుల్ని, గంధర్వుల్ని, యక్షుల్ని మానవుల్ని అందరినీ జయించాడు. గిరీంద్రాలను, అరణ్యాలనూ, మహావృక్షాలనూ, సింహశార్దూలాది చతుష్పాత్తులనూ (జంతువులు) తన అధీనంలోకి తెచ్చుకున్నాడు.

త్రైలోక్యమేతద్ధి చరాచరం వై వశం చకారాత్మని సన్నియోజ్య ।
తతోఽనుకూలాని సుదర్శనాని నారీ సహస్రాణి బహూని గత్వా ॥26॥

రసాతలే చైవ తథా ధరాయాం త్రివిష్టపే యాః ప్రమదాస్సురూపాః ।
తాభిర్యుతోఽన్యేషు స పర్వతేషు రరామ రమ్యేషు నదీతటేషు ॥27॥

క్రీడాయమానస్య తు మధ్యవర్తీ తాసాం ప్రహర్షాదథ దానవేంద్రః ।
తత్పీతశిష్టాని పిబన్ ప్రవృత్తై్య దివ్యాని పేయాని సుమానుషాణి ॥28॥

అన్యాని దివ్యాని తు యద్రసాని ఫలాని మూలాని సుగంధవంతి ।
సంప్రాప్య యానాని సువాహనాని మయేన సృష్టాని గృహోత్తమాని ॥29॥

పుష్పార్ఘధూపాన్నవిలేపనైశ్చ సుశోభితాన్యద్భుతదర్శనైశ్చ ।
సంక్రీడమానస్య గతాని తస్య వర్షాయుతానీహ తథాంధకస్య ॥30॥

చరాచరాలతో సహా ముల్లోకాలనూ స్వాయత్తం చేసుకున్నాడు. పాతళలోకం – భూలోకం –స్వర్లోకాలకు యథేచ్ఛగా సంచరిస్తూ ఆయా లోకాలలో తన కంటికి నచ్చిన అందగత్తెలను వేలసంఖ్యలో చెట్టపట్టాడు. ఆ ప్రమదాజనంతో కలిసి అందమైన పర్వతశిఖరాలపైన నదీతీరాలలోనూ ఆనందం అనుభవించాడు. వారి మధ్యలో నిలిచి రకరకాలుగా క్రీడించాడు. ప్రహర్షం చెందాడు. రకరకాల దివ్యపానీయాలను వారితో త్రాగించి పాత్రావశిష్టాలను తాను ఆస్వాదించి ఆనందించాడు. అలాగే దివ్యరసాలూ దివ్యకందమూలఫలాదులూ పరిమాళాలు విరజిమ్మే ఉత్తమోత్తమాలను ఆరగిస్తూ సంతృప్తి చెందాడు. మయుడు సృష్టించిన దివ్యవాహనాలనూ, దివ్యభవనాలనూ వినియోగించుకుంటూ వినోదించాడు. ఈవాహనాలూఈగృహాలూదివ్యపుష్ప– అర్ఘ్య– ధూప– అన్న– విలేపనాదులతో సుసమృద్ధంగా సమలంకృతాలు. చూపరులకు అద్భుతావహంగా కనిపించేవి. ఇలా భోగక్రీడానుభవంతో అంధకుడు కొన్ని వేల వేల సంవత్సరాలు గడిపాడు.

జానాతి కించి న్నశుభం పరత్ర యదాత్మనస్సౌఖ్యకరం భవేద్ధి ।
సదాంధకో దైత్యవరస్సమూఢో మదాంధబుద్ధిః కృతదుష్టసంగః ॥31॥

తతః ప్రమత్తస్తు సుతాన్ ప్రధానాన్ కుతర్కవాదైరభిభూయ సర్వాన్ ।
చచార దైత్యైస్సహితో మహాత్మా వినాశయన్వైదికసర్వధర్మాన్॥32॥

వేదాన్ ద్విజాన్ విత్తమదాభిభూతో న మన్యతే స్మాప్యమరాన్ గురూంశ్చ ।
రేమే తథా దైవగతో హతాయుః స్వస్థైస్సైరహోభిర్గమయన్ వయశ్చ ॥33॥

పరలోకంలో సుఖాలను ప్రసాదించే శుభకర్మ ఏ ఒక్కటీ ఎరుగడు. ఈ అంధకుడు దైత్యవరుడే కానీ పరమమూర్ఖుడు. మదాంధుడు. దుష్టుల సాంగత్యం ఒకటి తోడయ్యింది. వారి పొగడ్తలతో మరింత ప్రమత్తుడయ్యాడు. కొడుకులూ ప్రధానులూ మంచిమాటలు చెబితే తన కుతర్కాలతో పిడివాదాలతో వారిని పరాజితుల్ని చేసేవాడు. రాక్షసులను వెంటబెట్టుకుని సంచరిస్తూ వైదికధర్మాలను అన్నింటినీ నాశనం చేసేడు. వేదాలనూ వేదపండితులనూ గురువులనూ అమరులనూ లెక్కచేసేవాడే కాదు. ధనమదం అంతగా ఎక్కింది. దైవలీల! ఆయువుమూడి అలా క్రీడావినోదాలతో వయస్సును వృథాచేసుకుంటూ సంవత్సరాలు గడిపాడు.

తతః కదాచిద్గతవాన్ ససైన్యో బహుప్రయాతా పృథివీతలేఽస్మిన్ ।
అనేక సంఖ్యా అపి వర్షకోట్యః ప్రహర్షితో మందరపర్వతం తు ॥34॥

స్వర్ణోపమాం తత్ర నిరీక్ష్య శోభాం బభ్రామ సైన్యైస్సహ మానమత్తః ।
క్రీడార్థమాసాద్య చ తం గిరీంద్రం మతిం స వాసాయ చకార మోహాత్ ॥35॥

శుభం దృఢం తత్ర పురం స కృత్వా ముదాస్థితో దైత్యపతిః ప్రభావాత్ ।
నివేశయామాస పునః క్రమేణ అత్యద్భుతం మందరశైలసానౌ ॥36॥

ఈ భూగోళమంతటా కోట్ల సంవత్సరాలు అలా సంచరిస్తూ విహరిస్తూ ఆనందించిన ఆ అంధకదైత్యుడు ఒకనాడు మందరపర్వతానికి వెళ్ళాడు. బంగారం లా మెరిసిపోతున్న దాని శోభను తిలకించాడు. గర్వాంధుడై సైన్యంతో సహా అక్కడ విహరించాడు. సమ్మోహితుడై ఆ పర్వతం మీద తనకొక క్రీడావిలాస నివాసభవనం నిర్మించుకోవాలని ముచ్చటపడ్డాడు. వెంటనే తన శక్తియుక్తులతో శుభలక్షణాన్వితమూ శత్రుదుర్భేద్యమూ అయిన ఒక మహానగరాన్ని నిర్మింపజేశాడు. మందరగిరి సానువులలో ఆ మహానగరం, దానిలో తనకొక మహాభవనం. తన బలాన్ని బలగాన్ని విడిదిచేయించాడు.

దుర్యోధనో వైధసహస్తిసంజ్ఞౌ తన్మంత్రిణౌ దానవసత్తమస్య ।
తే వై కదాచిద్గిరిసుస్థలే హి నారీం సురూపాం దదృశుస్త్రయో ఽపి ॥37॥

తే శీఘ్రగా దైత్యవరాస్తు హర్షాత్ ద్రుతం మహాదైత్యపతిం సమేత్య ।
ఊచుర్యథా దృష్టమతీవప్రీత్యా తథాంధకం వీరవరం హి సర్వే ॥38॥

అంధకుడికి ముగ్గురు మంత్రులున్నారు. దుర్యోధనుడు వైధసుడు హస్తి – అని వారి పేర్లు. వీరు మందర పర్వతం మీద సంచరిస్తూ ఒకనాడు ఒక సుందరప్రదేశంలో ఒక అత్యద్భుతసౌందర్యరాశిని చూశారు. ఆనందం పట్టలేక పరుగు పరుగున అంధకుడిదగ్గరికి వచ్చారు. తాముచూసిన సుందరాంగినిగురించి ఆ మంత్రివీరవరులు ముగ్గురూ యథాతథంగా అంధకదైత్యపతికి విన్నవించారు.

మంత్రిణః ఊచుః – మంత్రులు అన్నారు.

గుహాంతరే ధ్యాననిమిలితాక్షో దైత్యేంద్ర కశ్చిన్మునిరత్ర దృష్టః ।
రూపాన్వితశ్చంద్రకళార్ధచూడః కటిస్థలే బద్ధగజేంద్రకృత్తిః ॥39॥

నాగేంద్రభోగావృతసర్వగాత్రః కపాలమాలాభరణో జటాలః ।
సశూలహస్తశ్శరతూణధారీ మహాధనుష్మాన్విపృతాక్షసూత్రః ॥40॥

ఖడ్డీ త్రిశూలీ లకుటీ కపర్దీ చతుర్భుజో గౌరతరాకృతిర్హి ।
భస్మానులిప్తో విలసత్సుతేజా స్తపస్వివర్యోఽద్భుతసర్వవేషః ॥41॥

తస్యా విదూరే పురుషశ్చ దృష్టస్స వానరో ఘోరముఖః కరాళః ।
సర్వాయుధో రూక్షకరశ్చ రక్షన్ స్థితో జరద్గో వృషభశ్చ శుక్లః ॥42॥

దైత్యేంద్రా! ఇక్కడ ఒక గుహలో ధ్యాననిమీలితాక్షుడై కూర్చున్న ఒక మునీశ్వరుణ్ణి మేము చూశాము. చాలా అందగాడు. చంద్రరేఖను శిరస్సున ధరించాడు. ఏనుగు తోలును అంగవస్త్రంగా వహించాడు. శరీరమంతటా పాములే ఆభరణాలు. పుర్రెలదండను వేసుకున్నాడు. జడలు పెరిగిఉన్నాయి. ఒక చేతిలో శూలం ఉంది. అమ్ములపొదీ ఉంది. పెద్ద ధనుస్సు పట్టుకున్నాడు. మరొకచేత అక్షమాల కనిపించింది. ఖడ్గమూ ధరించాడు. త్రిశూలము ధరించాడు. దండధరుడై ఉన్నాడు. శిరస్సున కపర్దం (జుట్టుముడి) ఉంది. నాలుగు చేతులున్నాయి. రంగు– గౌరవర్ణం. తనువంతా విభూతి పులుముకున్నాడు. దివ్య తేజస్సుతో వెలిగిపోతున్నాడు. ఇంత అద్భుతావహంగా

ఉన్న తపస్వివర్యుణ్ణి చూశాము. అతడికి దగ్గరగానే మరొక పురుషుడున్నాడు. అతడు వానరఘోరముఖుడు. కరాళంగా ఉన్నాడు. కఠిన బాహువులు. ఎన్ని ఆయుధాలో! రక్షకుడుగా నిలబడ్డాడు. ఆ చెంతనే ఒక ముసలి ఎద్దు ఉంది. అది తెల్లగా ఉంది.

తస్యోపవిష్టస్య తపస్వి నోఽ పి సుచారురూపా తరుణీ మనోజ్ఞా ।
నారీ శుభా పార్శ్వగతా హి తస్య దృష్టా చ కాచిద్భువి రత్నభూతా ॥43॥

ప్రవాళముక్తామణి హేమరత్నవస్త్రావృతా మాల్యశుభోపగూఢా ।
సా యేన దృష్టా స చ దృష్టిమాన్ స్యాద్ దృష్టేన చాన్యేన కిమత్ర కార్యమ్ ॥44॥

మాన్యా మహేశస్య చ దివ్యనారీ భార్యా మునేః పుణ్యవతః ప్రియా సా ।
యోగ్యా హి ద్రష్టుం భవతశ్చ సమ్యగానాయ్య దైత్యేంద్ర సురత్నభోక్తః ॥45॥

అలా గుహలో కూర్చున్న ఆ తపస్వికి దగ్గరగా ఒక సుందరాంగి తరుణీమణి మనోహారిణి శుభలక్షణాన్విత నారీరత్నం ప్రక్కనే నేలమీద కూర్చుని ఉంది. పగడాలూ ముత్యాలూ మణులూ రత్నాలూ పొదిగిన బంగారు ఆభరణాలతో దివ్యసుందరవస్త్రాలతో శుభప్రదమాలికలతో విరాజిల్లుతోంది. ఆమెను చూస్తేనే ఎవడికైనా కన్నులున్నందుకు చరితార్థత. ఎవడో చూసి ఏమి ప్రయోజనం! దైత్యేంద్రా! నువ్వు చూడాలి. దైత్యమహేశ్వరుడవైన నీకు ఆ దివ్యనారీరత్నం చూడదగిన మాన్యురాలు. పుణ్యాత్ముడైన ఆ మునికి ఆమె ప్రియభార్య. నువ్వు రత్నభోక్తవు. దైత్యేంద్రా! నువ్వు ఆమెను రప్పించు – చూడడానికి యోగ్యురాలు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

శ్రుత్వేతి తేషాం వచనాని తాని కామాతురో ఘూర్ణితసర్వగాత్రః ।
విసర్జయామాస మునేస్సకాశం దుర్యోధనాదీన్ సహసా స దైత్యః ॥46॥

ఆసాద్య తే తం మునిమప్రమేయం బృహద్వ్రతం మంత్రివరా హి తస్య ।
సురాజనీతిప్రవణా మునీశ ప్రణమ్య తం దైత్యనిదేశమాహుః ॥47॥

దుర్యోధనాదుల మాట వింటూనే అంధకాసురుడు కామాతురుడయ్యాడు. కామప్రకోపంతో అతడి తనువంతా ఊగిపోయింది. వెంటనే ఆ మునీశ్వరుడి దగ్గరికి వెళ్ళమని మంత్రులను ఆజ్ఞాపించాడు. వాళ్ళూ అంతే వేగంగా ముని సన్నిధికి చేరుకున్నారు. అప్రమేయుడు, మహావ్రతదీక్షాపరుడూ అయిన ఆ తపస్వికి రాజనీతిచతురులైన ఈ దుర్యోధనాది మంత్రులు ముగ్గురూ సవినయంగా నమస్కరించారు. మెల్లగా తమ దైత్యేంద్రుడి ఆజ్ఞావచనాలను వినిపించారు.

మంత్రిణ ఊచుః – మంత్రులు పలికారు.

హిరణ్యనేత్రస్య సుతో మహాత్మా దైత్యాధిరాజోఽంధకనామధేయః ।
త్రైలోక్యనాథో భవకృన్నిదేశాదిహోపవిష్టోఽద్య విహారశాలీ ॥48॥

తన్మంత్రిణో వై వయమంగవీరాస్తవోపకంఠం చ సమాగతాః స్మః ।
తత్ప్రేషితాస్త్వాం యదువాచ తద్వై శృణుష్వ సందత్తమనాస్తపస్విన్ ॥49॥

త్వం కస్య పుత్రోఽసి కిమర్థమత్ర సుఖోపవిష్టో మునివర్య ధీమన్ ।
కస్యేయమిాదృక్తరుణీ సురూపా దేయా శుభా దైత్యపతేర్మునీంద్ర ॥50॥

ఓ తపస్వీ! హిరణ్యాక్షుడి కొడుకు – దైత్యాధిరాజు. అంధకనామధేయుడు. మహాత్ముడు. ముల్లోకాలకూ అధిపతి. అతడు బ్రహ్మదేవుడి ఆదేశంమేరకు ఇప్పుడు ఇక్కడికివచ్చాడు. ఈ పర్వతంమీద విహారంకోసం వచ్చాడు. అయ్యా! అతడిమంత్రులం మేము. మహావీరులం. నీ చెంతకువచ్చాం. అంధకాసురుడు పంపగా వచ్చాం. అతడు నీకు చెప్పమన్నది చెబుతున్నాం. ఏకాగ్రచిత్తంతో ఆలకించు. మునివర్యా! నువ్వు ఎవరి కుమారుడివి? హాయిగా ఎందుకిక్కడ కూర్చున్నావ్? ధీమంతుడా! ఈ తరుణీమణి ఈ అందాలరాసి ఎవరు? ఎవరి ఇల్లాలు? మునీంద్రా! ఈ శుభాంగిని మా దైత్యపతికి సమర్పించు.

క్వేదం శరీరం తవ భస్మదిగ్ధం కపాలమాలాభరణం విరూపమ్ ।
తూణీర సత్కార్ముక బాణఖడ్గభుశుండి శూలాశని తోమరాణి ॥51॥

క్వ జాహ్నవీ పుణ్యతమా జటాగ్రే క్వాయం శశీ వా కుణపాస్థిఖండమ్ ।
విషానిలో దీర్ఘముఖః క్వ సర్పః క్వ సంగమః పీనపయోధరాయాః ॥52॥

జరద్గవారోహణమప్రశస్తం క్షమావతస్తస్య న దర్శనం చ ।
సంధ్యాప్రణామః క్వచిదేష ధర్మః క్వ భోజనం లోకవిరుద్ధమేతత్ ॥53॥

ప్రయచ్ఛ నారీం మమ సాంత్వపూర్వం స్త్రియా తపః కిం కురుషే విమూఢ ।
అయుక్తమేతత్త్వయి నానురూపం యస్మాదహం రత్నపతి స్త్రి లోకే ॥54॥

విముంచ శస్త్రాణి మయాద్య చోక్తః కురుష్వ పశ్చాత్తప ఏవ శుద్ధమ్ ।
ఉల్లంఘ్య మచ్ఛాసనమప్రధృష్యం విమోక్ష్యసే సర్వమిదం శరీరమ్ ॥55॥

మత్త్వాంధకం దుష్టమతిం ప్రధానో మహేశ్వరో లౌకికభావశీలః ।
ప్రోవాచ దైత్యం స్మితపూర్వమేవమాకర్ణ్య సర్వం త్వథ దూతవాక్యమ్ ॥56॥

ఇంతకీ – నీ రూపం ఏమిటి ఇంత వికృతంగా ఉంది? తనువంతా బూడిద పులుముకున్నావ్. పుర్రెలు అలంకరించుకున్నావ్. అమ్ములపొది, ధనుస్సు, బాణాలు, కత్తి, భుశుండి, త్రిశూలం, అశని, తోమరం, ఏకంగా ఇన్ని ఆయుధాలు ధరించావ్. ఇదేమిటీ నెత్తిమీద పవిత్ర గంగానది? ఆ ప్రక్కన అది చంద్రశేఖరా? లేదా అస్థిపంజరంలోని ఎముక ముక్కా? మెడలోనేమో – విషవాయువుల బుసకొడుతూ పొడవాటి ముఖంతో ఈ పాము ఒకటా? ఇలాంటి నీకు ఈ అందాలరాసి ఈ పీనపయోధర ఇల్లాలా? ఇదెక్కడి సంగమం ? నీకు వాహనం ఈ ముసలిఎద్దు. ఇది ఉచితమా? ప్రశస్తమా? భూలోకవాసులెవ్వరూ ఇటువంటిది చూసి ఉండరు. ఇలా కూర్చుని

సంధ్యావందనం చెయ్యడం సరే కొంతలోకొంత ధర్మమే. కానీ నువ్వు తీసుకునే భోజనం ఏమిటి? తపస్విలోక విరుద్ధమైన తిండి. తగునా? మూఢుడా! నీ ఇల్లాలిని కిమ్మనకుండా (అనునయపూర్వకంగా) నాకు సమర్పించు. ఇల్లాలిని దగ్గర పెట్టుకుని తపస్సు ఏమి చేస్తావ్ ! అసమంజసం. నీకు తగనిపని. నేను ఈ ముల్లోకాలకూ రత్నపతిని. శ్రేష్ఠమైనది (రత్నం) ఏదైనా నాకు చెందాల్సిందే. అంచేత నా ఆజ్ఞ పాటించి, ముందుగా నీ శస్త్రాలన్నీ పరిత్యజించు. అటుపైని కావాలనుంటే నీ శుద్ధ తపస్సు నువ్వు చేసుకో! నా ఆజ్ఞ తిరుగులేనిది. అనుల్లంఘ్యం. పాటించకపోయావో అన్నీ కోల్పోతావ్? నీ శరీరమే ఉండదు. అని ఆ (మంత్రులు) దూతలు అంధకాసురుడి సందేశం వినిపించారు. మహేశ్వరుడు –సర్వ ప్రధానుడు – అంతా ఆలకించాడు. అంధకుణ్ణి పరమదుష్టబుద్ధిగా అర్థం చేసుకున్నాడు. అయినా లోకధర్మాన్ని పాటిస్తూ చిరునవ్వులు చిందిస్తూ దైత్యనాథుడికి ప్రతివచనం పలికాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

యద్యస్మి రుద్రస్తవ కిం మయా స్యాత్ కిమర్థమేవం వదసీతి మిథ్యా ।
శృణు ప్రభావం మమ దైత్యనాథ న్యాయ్యం న వక్తుం వచనం త్వయైవమ్ ॥57॥

నాహం క్వచిత్స్వం పితరం స్మరామి గుహాంతరే ఘోరమనన్యచీర్ణమ్ ।
ఏతద్వ్రతం పాశుపతం చరామి న మాతరం త్వజ్ఞతమో విరూపః ॥58॥

అమూలమేతన్మయి తు ప్రసిద్ధం సుదుస్త్యజం సర్వమిదం మమాస్తి ।
భార్యా మమేయం తరుణీ సురూపా సర్వం సహా సర్వగతస్య సిద్ధిః ॥59॥

ఏతర్హి యద్యద్రుచితం తవాస్తి గృహాణ తద్వై ఖలు రాక్షస త్వమ్ ।
ఏతావదుక్త్వా విరరామ శంభుస్తపస్వివేషః పురతస్తు తేషామ్ ॥60॥

దైత్యనాథా! నేను రుద్రస్వరూపినే. అయితేమాత్రం నాతో నీకేమిటి? ఇలా మిథ్యావచనాలు ఎందుకు పలుకుతున్నావ్? ఇలా మాట్లాడటం నీకు న్యాయంకాదు. నా ప్రభావమేమిటో చెబుతున్నాను. నేను ఏనాడూ తండ్రిని తలవను. తల్లినీ ఎరగను. ఇలా గుహలో కూర్చుని – ఇంతవరకు ఎవ్వరూ ఆచరించని పాశుపతవ్రతదీక్షను వహించి నిర్వహిస్తున్నాను. నిజమే. నేను అజ్ఞతమున్ని. విరూపుణ్ణి. నా కొక పుట్టుక ఒక మూలం అనేవి లేవన్నసంగతి జగత్ప్రసిద్ధం. ఇంక నా చుట్టూ ఉన్న ఈ బలగమంటావా, దీన్ని నేను వదులుకోలేను. నాకిది దుస్త్యజం. ఇదిగో ఈమె నా ఇల్లాలు. అందాలరాసి. తరుణీమణి. అన్నింటినీ భరిస్తుంది. (భూదేవి అంతటి ఓర్పు– సర్వం సహా) ఎక్కడ బడితే అక్కడ ఉండే నాకు (సర్వగతుణ్ణి అయిన నాకు) ఈవిడే పెద్ద సిద్ధి– తపస్సిద్ధి. ఓయీ! రాక్షసేశ్వరా! ఇదీ నా ప్రభావం. ఇక్కడ వీటిలో నీకు ఏది రుచిస్తే అది స్వీకరించు. (నా మాటల్లో నీకు తోచిన అర్థం స్వీకరించు – అని) ఇంత మాత్రం పలికి, ఆ దూతల ఎదుట తపస్విరూపంలో విరాజిల్లుతున్న శంభుడు ముగించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు అన్నాడు.

గంభీరమేతద్వచనం నిశమ్య తే దానవాస్తం ప్రణిపత్య మూర్ధ్నా ।
జగ్ముస్తతో దైత్యవరస్య సూనుం త్రైలోక్యనాశాయ కృతప్రతిజ్ఞమ్ ॥61॥

బభాషిరే దైత్యపతిం ప్రమత్తం ప్రణమ్య రాజానమదీనసత్త్వాః ।
తే తత్ర సర్వే జయశబ్దపూర్వం రుద్రేణ యత్తత్ స్మితపూర్వముక్తమ్ ॥62॥

గంభీరంగా శివుడుచెప్పిన సమాధానంవిని ఆ దానవమంత్రులు శిరసా సాష్టాంగనమస్కారం చేసి బయలుదేరారు. హిరణ్యాక్షుడి కొడుకూ, ముల్లోకాలనూ నాశనం చెయ్యడానికి ప్రతినబూనినవాడూ అయిన తమ ప్రభువు అంధకాసురుణ్ణి చేరుకున్నారు. అతడు ప్రమత్తుడు. వీరు దృఢసత్వులు. జయ – జయ అని పలుకుతూ సమీపించి తమ ప్రభువుకు ప్రణమిల్లి ఆ ముగ్గురూ – రుద్రుడు చిరునవ్వులు చిందిస్తూ పలికినది అంతా అతడకి విన్నవించారు.

మంత్రిణ ఊచుః – మంత్రులు అన్నారు.

రాజన్ త్వముక్తోఽఖిల దైత్యనాథస్తపస్వినా తన్మునినా విహస్య ।
మత్వా స్వబుద్ధ్యా తృణవత్ త్రిలోకం మహౌజసా వీరవరేణ నూనమ్ ॥63॥

నిశాచరశ్చంచలశౌర్యధైర్యః క్వ దానవః కృపణస్సత్త్వహీనః ।
క్రూరః కృతఘ్నశ్చ సదైవ పాపీ క్వ దానవః సూర్యసుతాద్బిభేతి॥64॥

క్వాహం చ శస్త్రాణి చ దారుణాని మృత్యోశ్చ సంత్రాసకరం క్వ యుద్ధమ్ ।
క్వ వీరకో వానరవక్త్రతుల్యో నిశాచరో జరసా జర్జరాంగః ॥65॥

క్వాయం సురూపః క్వ చ మందభాగ్యో బలం త్వదీయం క్వ చ వీరుధో వా ।
శక్తోఽపి చేత్త్వం ప్రయతస్వ యుద్ధం కర్తుం తదా హ్యేహి కురుష్వ కించిత్ ॥66॥

వజ్రాశనేస్తుల్యమిహాస్తి శస్త్రం భవాదృశాం నాశకరం చ ఘోరమ్ ।
క్వతే శరీరం మృదుపద్మతుల్యం విచార్య చైవం కురు రోచతే యత్ ॥67॥

ఇత్యేవమాదీని వచాంసి భద్రం తపస్వినోక్తాని చ దానవేశ ।
యుక్తం న తే తేనసహాత్రయుద్ధం త్వామాహ రాజన్ స్మయమాన ఏవ ॥68॥

వివస్తు శూన్యై ర్బహుభిః ప్రలాపైరస్మాభిరుక్తైర్యది బుద్ధ్యసే త్వమ్ ।
తపోభియుక్తేన తపస్వినా వై స్మర్తాసి పశ్చాన్మునివాక్యమేతత్ ॥69॥

రాజా! అఖిలదైత్యనాథా! ఆ తపస్వి ఆ మహాముని నీ మాటలకు చిరునవ్వులు చిందించాడు. ముల్లోకాలనూ గడ్డిపోచలాగా పరిగణించిన ఓజస్వి. మహావీరుడు. ఆయన ఏమన్నాడంటే – నిశాచరుడూ చంచల శౌర్యధైర్యశాలి మీ దానవనాథుడెక్కడ? దీనుణ్ణి బలహీనుణ్ణి నేనెక్కడ! దారుణశస్త్రాలు–మృత్యువుని సైతం భయపెట్టే మహాయుద్ధమెక్కడ , నేనెక్కడ? మహావీరుడూ వానరవక్త్రతుల్యుడూ మీ నిశాచరుడెక్కడ? వార్ధక్యంతో జర్జరితాంగుణ్ణి నేనెక్కడ? ఆ అందగాడెక్కడ, మందభాగ్యుణ్ణి నేనెక్కడ? అతడి మహాసైన్యబలమెక్కడ, ఒక లతలాంటి నేనెక్కడ? అయినా సమర్థుడివైతే యుద్ధానికి ప్రయత్నించు, బయలు దేరి రా! ఏదో కొంచెం చెయ్యి. వజ్రాయుధంతో అశనితో

(పిడుగు) సాటివచ్చే ఒక ఆయుధం ఇక్కడ ఉంది. అది ఘోరశస్త్రం. నీలాంటి వాళ్ళను నాశనం చెయ్యగలదు. నిశాచరా! నీ శరీరం తామరపువ్వులాంటిది. మృదువు. ఆలోచించుకోఏది నచ్చితే అది చెయ్యి! ఇలాంటి మాటలు ఆ తపస్వి పలికాడు. దానవేంద్రా! నీకు భద్రం సుమా! చివరికి అలా నవ్వుతూనే అతడితో యుద్ధం నీకు తగదని చెప్పేశాడు మహారాజా! ఏమో – మేం ముగ్గురమూ ఏదేదో వాగేశాం. అర్థం పర్థం లేని ప్రలాపాలు. నీకు అర్థమైతే ఆ తపస్సంపన్నుడు ఆ మునీశ్వరుడన్న వాక్యాన్ని నెమ్మదిగా తరవాత ఆలోచించుకో! – స్మరించుకో! (స్మర్తవు అవుతావన్నది మునివాక్యం. అంటే కీర్తి శేషుడివవుతావని. ఇది గ్రహించు అనడం మంత్రుల అంతరార్థం) (65వ శ్లోకంలో జర్జరితాంగకో ఽహమ్ అని ఉంటే ఛందస్సుకీ అర్థానికీ ఇంకా అనుకూలించేది).

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తతస్స తేషాం వచనం నిశమ్య జజ్వాల రోషేణ స మందబుద్ధిః ।
ఆజ్యావసిక్తస్త్వివ కృష్ణవర్త్మ సత్యం హితం తత్కుటిలం సుతీక్ష్ణమ్ ॥70॥

గృహీతఖడ్గో వరదానమత్తః ప్రచండవాతానుకృతిం చ కుర్వన్ ।
గంతుం చ తత్ర స్మరబాణవిద్ధస్సముద్యతోఽభూద్విపరీతదైవః ॥71॥

సత్యమూ హితమూ వక్రోక్తిమయమూ సుతీక్ష్ణమూ అయిన మహేశ్వరుడి సమాధానాన్ని ఆ మంత్రివర్యులు ముగ్గురూ ఇలా విన్నవించగా ఆలకించిన ఆ మందబుద్ధి అంధకదైత్యనాథుడు నెయ్యిపోసిన అగ్నిలా రోషంతో మండిపడ్డాడు. బ్రహ్మదేవుడిచ్చిన వరాలతో మదించి ఉన్నాడు. దానికి తోడు ఇప్పుడు మన్మథుడి బాణాలతో గాయపడ్డాడు. దైవవైపరీత్యం తోడయ్యింది. ఖడ్గం చేబూని సుడిగాలిలా లేచాడు ఆ తపస్విని చేరుకోడానికి.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే అంధక గాణపత్యలాభోపాఖ్యానే దూతసంవాదో నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥44॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు అంధక గాణపత్యలాభోపాఖ్యానంలో దూతసంవాదం అనే నలబై నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచచత్వారింశోఽధ్యాయః – నలబై అయిదవ అధ్యాయం

దూతసంవాదవర్ణనమ్ – దూతసంవాదవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

గతస్తతో మత్తగజేంద్రగామీ పీత్వా సురాం ఘూర్ణితలోచనశ్చ ।
మహానుభావో బహుసైన్యయుక్తః ప్రచండవీరో వరవీరయాయీ ॥1॥

దదర్శ దైత్యః స్మరబాణవిద్ధో గుహాం తతో వీరకరుద్ధమార్గామ్ ।
స్నిగ్ధం యథా వీక్ష్య పతంగసంజ్ఞః దశాప్రదీపం చ కృమిర్హ్యుపేత్య ॥2॥

తథా ప్రదర్శ్యాశు పునః పునశ్చ సంపీడ్యమానోఽపి స వీరకేణ ।
బభూవ కామాగ్ని సుదగ్ధదేహోఽంధకో మహాదైత్యపతిః స మూఢః ॥3॥

పాషాణవృక్షాశనితోయ వహ్నిభుజంగశస్త్రాస్త్రబిభీషికాభిః ।
సంపీడితోఽసౌ న పునః ప్రపీడ్యః పృష్టశ్చ కస్త్వం సముపాగతోఽసి ॥4॥

నిశమ్య తద్వాం స్వమతం స తస్మై చకార యుద్ధం స తు వీరకేణ ।
ముహూర్తమాశ్చర్యవదప్రమేయం సంఖ్యే జితో వీరతరేణ దైత్యః ॥5॥

తతస్తు సంగ్రామశిరో విహాయ క్షుత్క్షామకంఠస్తృషితో గతోఽభూత్ ।
చూర్ణీకృతే ఖడ్గవరే చ ఖిన్నః పలాయమానో గతవిస్మయస్సః ॥6॥

అంతట అంధకాసురుడు మదగజగమనంతో బయలుదేరాడు. సురాపానం చేశాడు. ఘూర్ణితలోచనుడయ్యాడు. మహాసైన్యం వెంటరాగా ఆ ప్రచండవీరుడు వీరోచితగమనంతో ముందుకి నడిచాడు. మన్మథబాణ పీడితుడు ఆ దైత్యుడు గుహను చేరుకున్నాడు. గుహామార్గాన్ని వీరకుడు (ప్రమథనాయకుడు) రక్షిస్తున్నాడు. మిడత అనే క్రిమి వెలుగుతున్న దీపాన్ని స్నిగ్ధంగా చూసి దాని చెంతకు ఎగురుకుంటూ వెళ్ళినట్టు అంధకుడు వీరకుణ్ణి సమీపించాడు. అతడు అడ్డగిస్తున్నా హింసిస్తున్నా మళ్ళీ మళ్ళీ తీసుకుని వేగంగా మును ముందుకి వెడుతున్నాడు. మహాదైత్యపతి అంధకుడు కామాగ్నిదగ్ధుడై పూర్తిగా మూఢుడైపోయాడు. రాళ్ళు విసిరి, చెట్లు విసిరి, పిడుగులు కురిపించి, వారుణ – ఆగ్నేయ – భుజంగాస్త్రాలు ప్రయోగించి వీరకుడు ఎంతగా బెదిరించినా హింసించినా అంధకుడు ఉలుకూ పలుకూ లేకుండా మునుముందుకి తోసుకువెడుతున్నాడు వీరకుణ్ణి తిరగబడి హింసించలేదు. అప్పుడా వీరకుడు – ఎవడివిరా నువ్వు? ఇక్కడికి ఎందుకు వచ్చావ్? – అని గద్దించాడు. ఆ మాట విని అంధకుడు తన మనసులో మాట చెప్పి వీరకుడితో పోరుకు దిగాడు. ఊహించరానంత ఆశ్చర్యకరంగా ఒక్క నిమిషంలో దైత్యప్రభువు వీరకుడి చేతిలో ఓడిపోయాడు. ఆకలి దప్పులతో గొంతు ఎండిపోయింది, చేతిలోని ఖడ్గం తుత్తునియలయ్యింది. ఖిన్నుడయ్యాడు. అహంకారం (స్మయము) అంతరించింది. (తానే ఆశ్చర్యపోయాడు) రణాగ్రభూమినుంచి పలాయనం చిత్తగించాడు.

చక్రుస్తదాజిం సహ వీరకేణ ప్రహ్లాదముఖ్యా దితిజప్రధానాః ।
లజ్జాంకుశాకృష్టధియో బభూవుస్సుదారుణాః శస్త్రశతైరనేకైః ॥7॥

విరోచనస్తత్ర చకార యుద్ధం బలిశ్చ బాణశ్చ సహస్రబాహుః ।
భజిః కుజంభస్త్వథ శంబరశ్చ వృత్రాదయశ్చాప్యథ వీర్యవంతః ॥8॥

తే యుద్ధ్యమానా విజితాస్సమంతాత్ ద్విధాకృతా వై గణవీరకేణ ।
శేషే హతానాం బహుదానవానాముక్తం జయత్యేవ హి సిద్ధసంఘైః ॥9॥

భేరుండజానాభినయప్రవృత్తే మేదో వసామాంససుపూయమధ్యే ।
క్రవ్యాద సంఘాత సమాకులే తు భయంకరే శోణితకర్దమే తు ॥10॥

అప్పుడు ప్రహ్లాదులైన దైత్యనాయకులు రణరంగానికి వచ్చారు. వీరకుడితో తలపడ్డారు. కానీ సిగ్గు అనే అంకుశం వారి గుండెల్లో నాటుకుంది. వీరకుడి వేనవేల దారుణశస్త్రాలు నాటుకున్నాయి. తలవంచి పారిపోయారు. విరోచనుడు, బలి, సహస్రబాహువైన బాణుడు, భజి, కుజంభుడు, శంబరుడు, వృత్రుడు – ఇత్యాదిగా మహాబలిష్టులు దైత్యనాథులు వచ్చి వీరకుడితో యుద్ధం చేశారు. ఆ ప్రమథగణనాయకుడి చేతిలో అందరూ ఓడిపోయారు. ఒక్కొక్కరినీ రెండుగా చీల్చి చెండాడాడు. తక్కిన దానవదైత్యరాక్షససైన్యాలు మొత్తంగా నిహతులయ్యారు. సిద్ధ సాధ్యాది దేవసంఘాలు వీరకుడికి జయజయధ్వనులు చేశారు. రణరంగం కొవ్వూ మూలుగూ మాంసం ముద్దలతో గబ్బుకంపు కొట్టింది. వాటి మధ్య నక్కలు నృత్యం చేశాయి. మాంసాహారులైన జంతువులు బిలబిలా మూగాయి? నెత్తురుటేర్లతో మాంసపుబురదతో భయంకరంగా అల్లకల్లోలంగా మారిపోయింది ఆ యుద్ధభూమి.

భగ్నైస్తు దైత్యైర్భగవాన్ పినాకీ వ్రతం మహాపాశుపతం సుఘోరమ్ ।
ప్రియే! మయా యత్కృతపూర్వమాసీత్ దాక్షాయణీం ప్రాహ సుసాంత్వయిత్వా ॥11॥

తస్మాద్బలం యన్మమ తత్ప్రణష్టం మర్త్యైరమర్త్యస్య యతః ప్రపాతః ।
పుణ్యక్షయాద్ధి గ్రహ ఏవ జాతో దివానిశం దేవి తవ ప్రసంగాత్ ॥12॥

ఉత్పాద్య దివ్యం పరమాద్భుతం తు పునర్వనం ఘోరతరం చ గత్వా ।
తస్మాద్వ్రతం ఘోరతరం చరామి సునిర్భయాః సుందరి వై విశోకా॥13॥

దైత్యులందరూ అలా పారిపోయాక భగవంతుడు ఆ మహేశ్వరుడు పార్వతీదేవిని ఓదార్చి ఇలా పలికాడు. ప్రియా! దాక్షాయణీ!! గుర్తుందా నేను ఒకప్పుడు పాశుపతమహావ్రతం ఆచరించాను. దాని బలమూ దాని ప్రభావమూ ఇప్పుడింక సన్నగిల్లాయి. దానికి కారణం రేయింబవళ్ళు నీతో విహరించడమే. చేసుకున్న పుణ్యం తరిగిపోతే కష్టాలు తప్పవుగదా! అందుకే మర్త్యుల చేతిలో అమర్త్యులిలా ఇబ్బందులు పడుతున్నారు. దేవీ! ఘోరతరమైన ఆ పాశుపతవ్రతాన్ని మళ్ళీ చేస్తాను. ఒక అత్యద్భుతమూ అతి పవిత్రమూ అయిన దివ్యవనం సృష్టిస్తాను. అందులో నిర్భయంగా నిరాతంకంగా పాశుపతవ్రతం పూర్తిచేస్తాను. సుందరీ! ఇంక దిగులుపడకు నిశ్చింతగా ఉండు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏతావదుక్త్వా వచనం మహాత్మా ఉత్పాద్య ఘోషం శనకైశ్చకార ।
స తత్ర గత్వా వ్రతముగ్రదీప్తో గతో వనం పుణ్యతమం సుఘోరమ్ ॥14॥

చర్తుం హి శక్యం తు సురాసురైర్యన్న తాదృశం వర్షసహస్రమాత్రమ్ ।
సా పార్వతీ మందరపర్వతస్థా ప్రతీక్షమాణాగమనం భవస్య ॥15॥

పతివ్రతా శీలగుణోపపన్నా ఏకాకినీ నిత్యమథో విభీతా ।
గుహాంతరే దుఃఖపరా బభూవ సంరక్షితా సా సుతవీరకేణ ॥16॥

ఆ మహాత్ముడు పినాకపాణి దాక్షాయణితో ఇంతమాత్రం పలికి, తన నిశ్చయాన్ని మెల్లగా తక్కినవారికీ ప్రకటించి (ఉద్ఘోషించి) దివ్యవనం చేరుకున్నాడు. పుణ్యతమమూ అతిఘోరమూ సురాసురులకు ఆచరణ సాధ్యం కానేకానిదీ వెయ్యి సంవత్సరాల పాటు చెయ్యవలసిందీ అయిన పాశుపతమహావ్రతాన్ని ప్రారంభించాడు. పార్వతీదేవి ఆ మందరపర్వతం మీదనే ఆ గుహలోనే ఉండిపోయింది. భవుడి రాకను నిరీక్షిస్తూ ఉండి పోయింది. పతివ్రత, శీలగుణసంపన్న ఏకాకినిగా నిత్యమూ భయంభయంగా దిగులు దిగులుగా ఆ గుహలోనే కాలం గడుపుతోంది. సుతుడైన వీరకుడు ఒక్కడే సంరక్షకుడుగా చెంత నిలిచాడు.

తతస్స దైత్యో వరదానమత్తః తైర్యోధముఖ్యైస్సహితో గుహాం తామ్ ।
విభిన్నధైర్యః పునరాజగామ శిలీముఖైర్మారసముద్భవైశ్చ ॥17॥

అత్యద్భుతం తత్ర చకార యుద్ధం హిత్వా తదా భోజనపాననిద్రాః ।
రాత్రిందివం పంచశతాని పంచకృద్ధస్ససైన్యైస్సహ వీరకేణ ॥18॥

ఖడ్గైస్సకుంతైస్సహ భిందిపాలైర్గదాభుశుండీభిరథో ప్రకాండైః ।
శిలీముఖైరర్ధశశీభిరుగ్రైర్వితస్తిభిః కూర్మముఖైః జ్వలద్భిః ॥19॥

నారాచముఖ్యైర్నిశితైశ్చ శూలైః పరశ్వధైస్తోమరముద్గరైశ్చ ।
ఖడ్గైర్గుడైః పర్వతపాదపైశ్చ దివ్యైరథాస్త్రైరపి దైత్యసంఘైః ॥20॥

న దీధితిర్భిన్నతనుః పపాత ద్వారం గుహాయా పిహితం సమస్తమ్ ।
తైరాయుధైః దైత్యభుజప్రయుక్తైః గుహాముఖే మూర్ఛిత ఏవ పశ్చాత్ ॥21॥

చాలాకాలం గడిచింది. బ్రహ్మదేవుడిచ్చిన వరాలతో మదమత్తుడైన అంధక దైత్యుడు తన సేనానాయకులతో కలిసి ఆ గుహదగ్గరికి మళ్ళీ వచ్చాడు. మన్మథబాణాలతో డీలాపడిపోయి తాళలేక మళ్ళీ వచ్చాడు. నిద్రాహారాలూ అన్నపానాలూ అన్నీ పరిత్యజించి యుద్ధానికి దిగాడు. వీరకుడితో అత్యద్భుతంగా యుద్ధం జరిగింది. పాతిక వందల రోజులపాటు రేయింబవళ్ళు వీరకుడితో పోరాడాడు. తాను సేనాసమేతుడు. వీరకుడు ఒకే ఒక్కడు. ఖడ్గాలు, కుంతాలు, భిందిపాలాలు, గదలు, భుశుండులు, ప్రకాండశిలీముఖాలు, అర్ధచంద్రాకారశరాలు, భీకరకూర్మముఖ వితస్తికలు, వాడి నారాచాలు, శూలాలు, పరశ్వధాలు, తోమరాలు, ముద్గరాలు, ఖడ్గాలు, గుడాలు,

పర్వతం మీది చెట్లు, దివ్యాస్త్రాలు – ఇన్నింటితో దైత్యవీరులు విరుచుకుపడితే వీరకుడు ఒక్కడే నిలువరించి పోరాడాడు. జబ్బసత్తువకొద్దీ దైత్యనాయకులందరూ ప్రయోగించిన ఇన్ని రకాల ఆయుధాలు పెద్ద గుట్టగా గుహాద్వారాన్ని పూర్తిగా మూసివేశాయి. వెలుగురేక అన్నది లోపలికి చొరలేక కటికచీకటి ఆవరించింది గుహలో. వీరకుడు సైతం తట్టుకోలేక మూర్చిల్లి ద్వారానికి ఒక వైపున పడిపోయాడు.

ఆచ్ఛాదితం వీరకమస్త్రజాలైః దైత్యైశ్చ సర్వైస్తు ముహూర్తమాత్రమ్ ।
అపావృతం కర్తుమశక్యమాసీన్నిరీక్ష్య దేవీ దితిజాన్ సుఘోరాన్ ॥22॥

భయేన సస్మార పితామహం తు దేవీ సఖీభిస్సహితా చ విష్ణుమ్ ।
సైన్యం చ తద్వీరవరస్య సర్వం సా స్మారయామాస గుహాంతరస్థా ॥23॥

బ్రహ్మా తయా సంస్మృతమాత్ర ఏవ స్త్రీరూపధారీ భగవాంశ్చ విష్ణుః ।
ఇంద్రశ్చ సర్వైస్సహ సైన్యకైశ్చ స్త్రీరూపమాస్థాయ సమాగతాస్తే ॥24॥

భూత్వా స్త్రియస్తే వివిశుస్తదానీం మునీంద్రసంఘాశ్చ మహానుభావాః ।
సిద్ధాశ్చ నాగాస్త్వథ గుహ్యకాశ్చ గుహాంతరం పర్వతరాజపుత్ర్యాః ॥25॥

యస్మాత్సురాజ్యాసనసంస్థితానామంతఃపురే సంగమనం విరుద్ధమ్ ।
తతస్సహస్రాణి నితంబినీనామనంతసంఖ్యాన్యపి దర్శయంత్యః ॥26॥

రూపాణి దివ్యాని మహాద్భుతాని గౌర్యై గుహాయాం తు సవీరకార్యైః ।
స్త్రియః ప్రహృష్టా గిరిరాజకన్యా గుహాంతరం పర్వతరాజపుత్ర్యా ॥27॥

అస్త్ర శస్త్ర సమూహంతో వీరకుడు కప్పబడిపోయాడు. అతడికి తియ్యడానికి గానీ గుహ ద్వారానికి అడ్డుతొలగించడానికి గానీ అశక్యమైపోయింది. పరిస్థితినీ ఘోరదైత్యుల్నీ ఒక్క క్షణకాలం చూసింది పార్వతీదేవి. భయపడిపోయింది. తన చెలికత్తెలతో చర్చించింది. బ్రహ్మదేవుణ్ణి తలుచుకుంది. గుహలోనే ఉండిపోయి విష్ణుమూర్తినీ ఆ వీరవరుడి దేవసైన్యాన్ని స్మరించింది. తత్క్షణం బ్రహ్మవిష్ణుమహేంద్రులూ వారి సమస్త సైనికులూ స్త్రీరూపాలు ధరించి ప్రత్యక్షమయ్యారు. వారితో పాటే మహానుభావులు మునీంద్రులు సిద్ధనాగ గుహ్యకాది దేవజాతులవారూ స్త్రీరూపాలు ధరించి పార్వతీదేవి ఉన్న ఆ గుహలోకి ప్రవేశించారు. రాజ్యాధికారాలతో ఉన్న పురుషులు ఇతరుల అంతఃపురాలలోకి ప్రవేశించకూడదు కనక వీరంతా స్త్రీరూపాలు ధరించి ప్రవేశించారు. ఇలా అనంత సహస్రసంఖ్యాకంగా అద్భుతదివ్యస్త్రీరూపాలను ప్రదర్శిస్తూ తన గుహలోకి ప్రవేశించిన ఆ దేవతానాయకులనూ, వీరులనూ ఆర్యమహర్షులనూ తిలకించి పర్వతరాజపుత్రి చాలా సంతోషించింది.

స్త్రీభిస్సహస్రైశ్చ శతైరనేకైః నేదుశ్చ కల్పాంతరమేఘఘోషాః ।
భేర్యశ్చ సంగ్రామజయప్రదాస్తు ధ్మాతాస్సుశంఖాః సునితంబినీభిః ॥28॥

మూర్ఛాం విహాయాద్భుతచండవీర్యస్స వీరకో వై పురతః స్థితస్తు ।
ప్రగృహ్య శస్త్రాణి మహారథానాం తైరేవ శస్త్రైర్దితిజం జఘాన ॥29॥

అనేక సహస్ర సంఖ్యలతో గుమికూడిన ఈ స్త్రీలు సంగ్రామ జయసూచకాలుగా శంఖాలు పూరించారు. భేరులు మోగించారు. కల్పాంతమేఘగర్జనలు సృష్టించారు. ఈ ధ్వనికి మహాద్భుత చండవీరుడు వీరకుడు తేరుకున్నాడు. మూర్ఛనుంచి మేలుకున్నాడు. దైత్యులు తనపై కురిపించిన శస్త్రరాశుల్ని చేతబట్టి వాటితోనే ఆ దైత్యయోధుల్ని చావబాదడం మొదలుపెట్టాడు.

బ్రాహ్మీ తతో దండకరా విరుద్ధా గౌరీ తదా క్రోధపరీతచేతాః ।
నారాయణీ శంఖగదాసుచక్రధనుర్ధరా పూరితబాహుదండా ॥30॥

వినిర్యయౌ లాంగలదండహస్తా వ్యోమాలకా కాంచనతుల్యవర్ణా ।
ధారాసహస్రాకులముగ్రవేగం బైడౌజసీ వజ్రకరా తదానీమ్ ॥31॥

సహస్రనేత్రా యుధి సుస్థిరా చ సుదుర్జయా దైత్యశతైరధృష్యా ।
వైశ్వానరీ శక్తిరసౌమ్యవక్త్రా యామ్యా చ దండోద్యతపాణిరుగ్రా ॥32॥

సుతీక్ష్ణఖడ్గోద్యతపాణిరూపా సమాయయౌ నైరృతి ఘోరరూపా ।
తోయాలకా వారణపాశహస్తా వినిర్గతా యుద్ధమభీప్సమానా ॥33॥

ప్రచండవాతప్రభవా చ దేవీ క్షుధావపుస్త్వంకుశపాణిరేవ ।
కల్పాంతవహ్నిప్రతిమాం గదాం చ పాణౌ గృహీత్వా ధనదోద్భవా చ ॥34॥

యక్షేశ్వరీ తీక్ష్ణముఖా విరూపా నఖాయుధా నాగభయంకరీ చ ।
ఏతాస్తథాన్యాశ్శతశో హి దేవ్యః సునిర్గతాః సంకులయుద్ధభూమిమ్ ॥35॥

బ్రహ్మశక్తి (బ్రాహ్మీ) దండాయుధం ధరించి ఆపరానిదై బయలుదేరింది. పార్వతీదేవి అంతరంగం దైత్యులపట్ల క్రోధంతో నిబిడమైపోయింది. నారాయణీశక్తి శంఖ– చక్ర– గదా–ధనుస్సులను నాల్గుచేతులా ధరించి నిలిచింది. నల్లని ముంగురులతో బంగారురంగులో ఉన్న ఐంద్రీశక్తి లాంగల దండాయుధాలూ వెయ్యి అంచులున్న వజ్రాయుధమూ ధరించి ఉగ్రవేగంతో కదిలింది. ఆమెకు వెయ్యి కన్నులున్నాయి. దైత్యులు వందలుగా చుట్టుముట్టినా జయింపరానిది. రణరంగాన సుస్థిరంగా నిలిచి పోరాడగలిగినది. వైశ్వానరీశక్తి (అగ్ని) క్రోధభీకరముఖంతో నిలిచింది. యామ్యశక్తి (యముడు) దండం ధరించి మహోగ్రంగా నడిచింది. ఘోరరూపధారిణి నైరృతిశక్తి తళత్తళలాడే ఖడ్గం ఘోరచాపం చేబూని వచ్చింది. వారుణశక్తి (వరుణదేవుడు) జలబిందువులే ముంగురులుగా పాశాయుధం ధరించి యుద్ధం యుద్ధం అంటూ చిందులు తొక్కింది. కౌబేరశక్తి (కుబేరుడు) ఆకలే రూపు ధరించినట్టు ఝంఝూ మారుతంలా వచ్చింది. అంకుశాన్ని ప్రళయకాలాగ్నిలాంటి గదనూ వహించి వచ్చింది. తీక్ష్ణముఖంతో వికృతరూపంతో పాతాళలోకభయంకరంగా మొనదేలిన గోళ్ళే ఆయుధాలుగా యాక్షశక్తి (యక్షులు) అసహనంగా కదిలింది. వీరితో పాటు ఇంకా తక్కినవారంతా వందలూ వేలుగా రకరకాల ఆయుధాలతో సంకులసమరభూమికి సన్నద్ధులై బయలుదేరారు.

దృష్ట్వా చ తత్ సైన్యమనంతపారం వివర్ణవర్ణాశ్చ సువిస్మితాశ్చ ।
సమాకులాస్సంచకితా భయాద్వై దైత్యా బభూవుః హృది దీనసత్త్వాః ॥36॥

చక్రుస్సమాధాయ మనస్సమస్తాస్తా దేవవధ్యో విధిశక్తిముఖ్యాః ।
సుసమ్మతత్వేన గిరీశ పుత్ర్యాః సేనాపతిర్వీరసుఘోరవీర్యః ॥37॥

చక్రుర్మహా యుద్ధమభూతపూర్వం నిధాయ బుద్ధౌ దితిజాః ప్రధానాః ।
నివర్తనం మృత్యుమథాత్మనశ్చ నారీభిరన్యే వరదానమత్తాః ॥38॥

అత్యద్భుతం తత్ర చకార యుద్ధం గౌరీ తదానీం సహితా సఖీభిః ।
కృత్వా రణే చాద్భుతబుద్ధిశౌండం సేనాపతిం వీరకఘోరవీర్యమ్ ॥39॥

అంతులేని ఆ సైన్యాన్ని చూసి దైత్యులందరూ కంగుతిన్నారు. ముఖాలు పాలిపోయాయి. ఆశ్చర్యం, ఆందోళన – భయం ముసురుకున్నాయి. ధైర్యం నీరుగారిపోయి, గుండెల్లో దైన్యం ఆవహించింది. అతిఘోర బలశాలి సేనాపతి వీరకుడూ బ్రహ్మవిష్ణు మహేంద్రశక్తులూ సమస్త దేవశక్తులూ – పార్వతీదేవికి సమ్మతంగా ఎవరికివారు తమ మనస్సును ఏకాగ్రపరుచుకున్నారు – విజయం తథ్యమని సమాధానపరుచుకున్నారు. వరదానమత్తులైన దైత్యనాయకులూ ఇతర దైత్యులూ మాత్రం – పారిపోవడమో ఈ స్త్రీల చేతిలో చావడమో ఇంతేనని బుద్ధిలో నిశ్చయించుకుని (తెగించి) కనీవినీ ఎరగని మహాయుద్ధం చేశారు. అద్భుతధీశాలి – ఘోరబలశాలి అయిన వీరకుణ్ణి సేనాపతిని చేసి(న) పార్వతీదేవి అప్పుడు తన సఖీజనంతో కలిసి అత్యద్భుతంగా అతిభీకరంగా రణరంగంలో చెలరేగింది. మహాయుద్ధం చేసింది.

హిరణ్య నేత్రాత్మజ ఏవ భూపశ్చక్రే మహావ్యూహమరం సుకర్మా ।
సంభావ్య విష్ణుం చ నిరీక్ష్య యామ్యాం సుదారుణం తద్గిలనామధేయమ్ ॥40॥

ముఖం కరాళం విధిసేవయాస్య తస్మిన్ కృతే భగవానాజగామ ।
కల్పాంతఘోరార్క సహస్రకాంతికీర్ణం చ వై కుపితః కృత్తివాసాః ॥41॥

గతే తతో వర్షసహస్రమాత్రే తమాగతం ప్రేక్ష్య మహేశ్వరం చ ।
చక్రుర్మహాయుద్ధమతీవ మాత్రం నార్యః ప్రహృష్టాస్సహ వీరకేణ ॥42॥

ప్రణమ్య గౌరీ గిరిశం చ మూర్ధ్నా సందర్శయన్ భర్తురతీవ శౌర్యమ్ ।
గౌరీ ప్రయుద్ధం చ చకార హృష్టా హరస్తతః పర్వతరాజపుత్రీమ్ ॥43॥

కంఠే గృహీత్వా తు గుహాం ప్రవిష్టో రమా సహస్రాణి విసర్జితాని ।
గౌరీ చ సన్మానశతైః ప్రపూజ్య గుహాముఖే వీరకమేవ స్థాపయన్ ॥44॥

హిరణ్యాక్షుడి కొడుకు ఆ అంధకదైత్యుడు కూడా వ్యూహరచనలో నిపుణుడు కనక వెంటనే ఒక మహావ్యూహం రచించాడు. ఒకసారి విష్ణుశక్తి వైపు యామ్యశక్తి వైపూ చూచి గిలుడనే పేరున్న మహాదారుణ దైత్యయోధుణ్ణి సేనాపతిని చేశాడు. వాడు సేనాపతిగా విధినిర్వహణ (సేవ) చెయ్యబూని కరాళముఖవ్యూహం రచించాడు. సరిగ్గా అదే సమయానికి పినాకపాణి తన పాశుపతవ్రతం ముగించుకుని తిరిగివచ్చాడు. ఆ కృత్తివాసుడు క్రుద్ధుడై ఒక కోటి ప్రళయార్కబింబాలకాంతిని విరజిమ్ముతున్నాడు. వెయ్యి సంవత్సరాలు గడిచి తిరిగివచ్చిన ఆ మహేశ్వరుణ్ణి

చూసి స్త్రీరూపధారిణులైన దేవశక్తులందరూ వీరకుడితో సహా సంబరపడి మరింత తీవ్రంగా యుద్ధం కొనసాగించారు. పార్వతీదేవి తన భర్తకు శిరసా నమస్కరించింది. ఎంతగానో సంబరపడింది. తన శౌర్యాన్ని మగనికి మరింతగా ప్రదర్శించింది. మరింత తీవ్రంగా యుద్ధంచేసింది. అటుపైని పరమేశ్వరుడు ఆ పర్వతరాజపుత్రిని మెడగుచ్చి కౌగిలించుకుని వీరకుణ్ణి మునుపటిలాగానే గుహాద్వారం వద్ద కావలి ఉంచి గుహలోకి ప్రవేశించాడు. రకరకాల సన్మానాలూ సత్కృతులతో దేవశక్తులనందరినీ వేలాదిగా గౌరవించి అర్చించి స్వయంగా సాగనంపి, గౌరీదేవి కూడా శివుడితో గుహాప్రవేశం చేసింది.

తతో న గౌరీం గిరిశం చ దృష్ట్వాఽసురేశ్వరో నీతి విచక్షణో హి ।
ద్రుతం స్వదూతం విఘుసాఖ్యమేవ స ప్రేషయామాస శివోపకంఠమ్ ॥45॥

తైస్తైః ప్రహారైరపి జర్జరాంగస్తస్మిన్ రణే దేవగణేరితైర్యః ।
జగాద వాక్యం తు సగర్వముగ్రం ప్రవిశ్య శంభుం ప్రణిపత్య మూర్ధ్నా ॥46॥

అటుపైని – గౌరీదేవిగానీ పరమేశ్వరుడు గానీ గోచరం కాకపోవడంతో రాజనీతి కుశలుడైన అసురేశ్వరుడు ఆ అంధకుడు విఘుసుడనే దైత్యుణ్ణి తన దూతగా శివుడి సన్నిధికి పంపించాడు. యుద్ధంలో దేవ – గణ శక్తులు ప్రయోగించిన రకరకాల ఆయుధాల దెబ్బలతో శరీరం నలిగిపోయినా ఆ విఘుసుడు అలాగే శంభుసన్నిధికి వెళ్ళి శిరసా సాష్టాంగపడి సగర్వంగా ఇలా పలికాడు–

దూత ఉవాచ – దూత పలికాడు.

సంప్రేషితోఽహం వివిశే గుహాం తు హ్యేషోఽంధకస్త్వాం తమువాచ వాక్యమ్ ।
నార్యా న కార్యం తవ కించిదస్తి విముంచ నారీం తరుణీం సురూపామ్ ॥47॥

ప్రాయో భవాంస్తాపసస్తజ్జుషస్వ క్షాంతం మయా యత్క్రమనీయమంతః ।
మునిర్విరోధవ్య ఇతి ప్రచింత్య న త్వం మునిస్తాపస కిం తు శత్రుః ॥48॥

అతీవ దైత్యేషు మహావిరోధీ యుధ్యస్వ వేగేన మయా ప్రమథ్య ।
నయామి పాతాళతలానురూపం యమక్షయం తాపస ధూర్త హి త్వామ్ ॥49॥

అంధకుడు పంపగా దూతగా వచ్చాను. నీ గుహలోకి ప్రవేశించాను. మా ప్రభువు నీకు చెప్పమన్నది చెబుతున్నాను. విను. ఓరీ ధూర్తతాపసా! నీకు స్త్రీతో పనిలేదు. ఈ అందాలరాసిని ఈ తరుణీమణిని విడిచిపెట్టు. ప్రాయశః నువ్వు తాపసివి. అదే కొనసాగించు. మునితో విరోధంతగదు అని మనుస్సులో భావించి నీ పట్ల కమనీయంగా కొంత ఓర్పు వహించాను. కానీ నువ్వు మునివి కాదు. నాకు విరోధివి. మా దైత్యులపట్ల మహావిరోధివి. వెంటనే నాతో యుద్ధానికి రా. మోసగాడా! నిన్ను సంహరించి మా పాతాళంలో ఉన్న యమలోకానికి తీసుకుపోతాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడన్నాడు.

ఏతద్వచో దూతముఖాన్నిశమ్య కపాలమాలీ తమువాచ కోపాత్ ।
జ్వలన్విషాదేన మహాంస్తినేత్ర స్సతాం గతిర్దుష్టమదప్రహర్తా ॥50॥

దూతగా వచ్చి విఘసుడు చెప్పిన ఈ మాటలు విన్నాడు కపాలమాలి. కోపంతో విషాదంతో మండిపడ్డాడు. సజ్జనులకు సంరక్షకుడూ, దుర్జనులకు మద సంహారకుడూ ఆ త్రినేత్రుడు ఇలా బదులుపలికాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

వ్యక్తం వచస్తే తదతీవచోగ్రం ప్రోక్తం హి తత్త్వం త్వరితం ప్రయాహి ।
కురుష్వ యుద్ధం హి మయా ప్రసహ్య యది ప్రశక్తో ఽసి బలేన హి త్వమ్ ॥51॥

యః స్యాదశక్తో భువి తస్య కోర్థో దారైర్ధనైర్వా సుమనోహరైశ్చ ।
ఆయాంతు దైత్యాశ్చ బలేన మత్తా విచార్యమేవం తు కృతం మయైతత్ ॥52॥

శరీరయాత్రాపి కుతస్త్వశక్తేః కుర్వంతు యద్యద్విహితం తు తేషామ్ ।
మమాపి యద్యద్యత్కరణీయమస్తి తత్తత్కరిష్యామి న సంశయోఽత్ర ॥53 ॥

అంధకదైత్యా! నీ తీవ్ర వాక్కు అర్థమయ్యింది. నీ తత్త్వమూ బోధపడింది. త్వరగా రా బలంతో సమర్థుడివే అయితే నన్ను ఎదిరించి యుద్ధంచెయ్యి. అశక్తుడు, నిష్ప్రయోజకుడు, అయినవాడికి ఈ భూలోకంలో సుందరాంగులయిన భార్యలెందుకు? భాగ్యాలెందుకు! బలమత్తులు నీ దైత్యుల్నికూడా నీతో రమ్మను. నాతో తలపడమను. బాగా ఆలోచించే ఇది చెబుతున్నాను, చేస్తున్నాను. అశక్తుడికి జీవితమే లేదు. అందుకని నువ్వూ మీ వాళ్ళూ ఏది విహితమో అది చెయ్యండి. నాకు కూడా విహితమూ కరణీయమూ ఉంది. అది నేను చేస్తాను. ఇందులో సందేహమే లేదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏతద్వచస్తు ద్విఘసోఽపి శ్రుత్వా తస్మా ద్ధరాన్నిర్గత ఏవ హృష్టః ।
ప్రాగాత్తతో గర్జితహుంకృతాని కుర్వంస్తతో దైత్యపతేస్సకాశమ్ ॥54॥

హరుడినోటి నుంచి ఈ సందేశం విని విఘసుడు సంతృప్తి చెందాడు. గర్జితహుంకారాలు చేసుకుంటూ అతివేగంగా అంధకదైత్యపతి సన్నిధికి చేరుకున్నాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే యుద్ధప్రారంభ దూత సంవాదవర్ణనం నామ పంచచత్వారింశోఽధ్యాయః ॥45॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు యుద్ధప్రారంభమూ దూతసంవాదవర్ణనము అనే నలబై అయిదవ అధ్యాయం సమాప్తం.

షట్చత్వారింశోఽధ్యాయః – నలబై ఆరవ అధ్యాయం

అంధకయుద్ధవర్ణనం – అంధకయుద్ధవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తస్యేంగితజ్ఞశ్చ స దైత్యరాజో గదాం గృహీత్వా త్వరితస్స సైన్యః ।
కృత్వాథ సాఽగ్రే గిలనామధేయం సుదారుణం దేవవరైరభేద్యమ్ ॥1॥

గుహాముఖం ప్రాప్య మహేశ్వరస్య బిభేద శస్త్రైరశనిప్రకాశైః ।
అన్యే తతో వీరకమేవ శస్త్రైరవాకిరన్ శైలసుతాం తథాన్యే ॥2॥

ద్వారం హి కేచిద్రుచిరం బభంజుః పుష్పాణి పత్రాణి వినాశయేయుః ।
ఫలాని మూలాని జలం చ హృద్యముద్యానమార్గానపి ఖండయేయుః ॥3॥

విలోడయేయుర్ముదితాశ్చ కేచిత్ శృంగాణి శైలస్య చ భానుమంతి ।
తతో హరస్సంస్మృతవాన్ స్వసైన్యం సమాహ్వయన్ కుపితః శూలపాణిః ॥4॥

ఇంగితజ్ఞుడు ఆ దైత్యరాజు విభుసుడు ఏమీ చెప్పకుండానే విషయం గ్రహించాడు. వెంటనే గదను చేతబట్టాడు. ససైన్యంగా బయలుదేరాడు. అతిదారుణుడూ దేవనాయకులకు సైతం అభేద్యుడూ అయిన గిలనామధేయుణ్ణి సేనాగ్రభాగాన నడిపించాడు. మహేశ్వరుడున్న గుహద్వారం చేరుకున్నాడు. చేరుతూనే పిడుగుల్లాంటి ఆయుధాలతో గుహద్వారాన్ని బద్దలు కొట్టాడు. తక్కిన దైత్యులు వీరకుడి మీదకి శరాలు గుప్పించారు. మరికొందరు శైలతనయపై గుప్పించారు. ఇంకొందరు ద్వారాన్ని పూర్తిగా పగలకొట్టారు. పత్రపుష్పాలతో ఉన్న పచ్చని చెట్లను నాశనం చేశారు. ఫలాలనూ కందమూలాలనూ ధ్వంసం చేశారు. చక్కని త్రాగునీటిని కలుషితం చేశారు. ఉద్యానవనమార్గాలనన్నింటినీ పాడుచేశారు. కాంతులు విరజిమ్ముతున్న ఆ మందరగిరిశిఖరాలను కొందరు కూల్చివేశారు. కేరింతలు కొట్టారు. అప్పుడు శూలపాణి శివుడు అత్యంతకుపితుడై తన సైన్యాన్ని ఆహ్వానపురస్సరంగా స్మరించాడు.

భూతాని చాన్యాని సుదారుణాని దేవాన్ససైన్యాన్సహ విష్ణుముఖ్యాన్ ।
ఆహూతమాత్రానుగణాస్ససైన్యా రథైర్గజైర్వాజివృషైశ్చ గోభిః ॥5॥

ఉష్ట్రైః ఖరైః పక్షివరైశ్చ సింహైస్తే సర్వదేవాః సహభూతసంఘైః ।
వ్యాఘ్రైః మృగైస్సూకరసారసైశ్చ సమీనమత్స్యైశ్శిశుమారముఖ్యైః ॥6॥

అన్యైశ్చ నానావిధజీవసంఘైర్విశీర్ణదంశాః స్ఫుటితైః శ్మశానైః ।
భుజంగమైః ప్రేతశతైః పిశాచైః దివ్యైర్విమానైః కమలాకరైశ్చ ॥7॥

నదీనదైః పర్వతవాహనైశ్చ సమాగతాః ప్రాంజలయః ప్రణమ్య ।
కపర్దినం తస్థురదీనసత్త్వాస్సేనాపతిం వీరకమేవ కృత్వా ॥8॥

విసర్జయామాస రణాయ దేవాన్ విశ్రాంతవాహానథ తత్పినాకీ ।
యుద్ధే స్థిరం లబ్ధజయం ప్రధానం సంప్రేషితాస్తే తు మహేశ్వరేణ ॥9॥

చక్రుర్యుగాంతప్రతిమం చ యుద్ధం మర్యాదహీనం సగిలేన సర్వే ।
దైత్యేంద్రసైన్యేన సదైవ ఘోరం క్రోధాన్నిగీర్ణాస్త్రిదశాస్తు సంఖ్యే ॥10॥

ఇంకా తక్కిన భయంకరభూతగణాలనూ సేనాసమేతులుగా శ్రీహరి ప్రభృతులనూ శంకరుడు మనస్సుతో ఆహ్వానించాడు. ఆహ్వానించడమే తడవుగా ఆయా దేవగణముఖ్యులందరూ తమ తమ మహాసైన్యాలతో రథాలూ ఏనుగులూ గుర్రాలూ ఎద్దులూ ఒంటెలూ గాడిదలూ పక్షులూ సింహాలు పులులూ మృగాలూ సూకరాలూ సారసాలూ మీనాలూ శింశుమారాలు (మొసళ్ళు) ఇంకా రకరకాల వాహనాలను అధిరోహించి వేగంగా బయలుదేరారు. పళ్ళు పటపటలాడిస్తున్న శ్మశానవాసులైన ప్రేతపిశాచాలూ బుసలు కొడుతున్న సర్పజాతులూ సన్నద్ధులయ్యారు. దివ్యవిమానాలలో పర్వతవాహనాలలో తరలివచ్చారు. కొందరు సరోధిదేవతలూ నదీ నదదేవతలూ సపరివారంగా సాకారంగా బయలుదేరారు. క్షణంలో శివుడి సన్నిధికి చేరుకొన్నారు. వాహనాలు దిగి అంజలి ఘటించి సవినయంగా నిలబడ్డారు. అందరూ మహాబలిష్టులే. కపర్దిని పరివేష్టించి నిలిచారు. అందరికీ వీరకుణ్ణి సేనాపతిగా నియమించాడు ఆ పినాకపాణి. స్థిరంగా యుద్ధం చెయ్యండి. విజయప్రాప్తి ఒక్కటే లక్ష్యం అని చెప్పి అందరినీ రణరంగానికి పంపించాడు మహేశ్వరుడు. గిలుడి నేతృత్వంలో మోహరించిన దైత్యాంధకుడి సేనాసముహంతో పరమేశ్వరసైన్యం, ప్రధానంగా క్రోధఘూర్ణితమైన దేవ – గణ సైన్యం అవధిలేని మహాప్రళయం లాంటి యుద్ధాన్ని ఘోరంగా చేసింది.

తస్మిన్ క్షణే యుధ్యమానాశ్చ సర్వే బ్రహ్మేంద్రవిష్ణ్వర్కశశాంకముఖ్యాః ।
ఆసన్నిగీర్ణా విభుసేన తేన సైన్యే నిగీర్ణే ఽస్తి తు వీరకో హి ॥11॥

విహాయ సంగ్రామశిరోగుహాం తాం ప్రవిశ్య శర్వం ప్రణిపత్య మూర్ధ్నా ।
ప్రోవాచ దుఃఖాభిహతః స్మరారిం సువీరకో వాగ్మివరోఽథ వృత్తమ్ ॥12॥

అలా యుద్ధం చేస్తున్న బ్రహ్మ–ఇంద్ర–విష్ణు–అర్క– శశాంకాది దేవనాయకుల్ని వారి సైన్యంతో సహా విభుసుడు క్షణకాలంలో నమిలి మింగేశాడు. వీరకుడు తప్ప దేవగణసేనలలో ఒక్కడూ మిగలలేదు. వెంటనే రణాగ్రభూమి విడిచి ఆ వీరకుడు గుహలో ప్రవేశించాడు. శర్వుడి పాదాలపై పడి శిరసా నమస్కరించాడు. మహావీరుడూ మంచి మాటకారీ ఆ వీరకుడు దుఃఖంతో కుమిలిపోతూ జరిగిన సంఘటనను స్మరాంతకుడికి విన్నవించాడు.

వీరక ఉవాచ – వీరకుడు చెప్పాడు.

నిగీర్ణం తే సైన్యం విభుసదితిజేనాద్య భగవన్ నిగీర్ణోఽసౌ విష్ణుస్త్రిభువనగురుర్దైత్యదళనః ।
నిగీర్ణౌ చంద్రార్కౌ దృహిణమభువానౌ చ వరదౌ నిగీర్ణాస్తే సర్వే యమవరుణవాతాశ్చ ధనదః ॥13॥

స్థితో ఽస్మ్యేకః ప్రహ్వాః కిమిహ కరణీయం భవతు మే ।
అజేయో దైత్యేంద్రః ప్రముదితమనా దైత్యసహితః ॥14॥

అజేయం త్వాం ప్రాప్తః ప్రతిభయమనా మారుతగతిః స్వయం విష్ణుర్దేవః కనకకశిపుం కశ్యపసుతమ్ ।
నఖైః తీక్ష్ణైర్భంక్త్వా తదపి భగవాన్ శిష్టవశగః ప్రవృత్తః త్రైలోక్యం విధమితుమలం వ్యాత్తవదనః ॥15॥

పరమేశా! హే భగవాన్! నీ సైన్యం మొత్తం విఘసుడు మింగేశాడు. దైత్యాంతకుడూ త్రిభువనగురువు అయిన విష్ణుమూర్తినీ మింగేశాడు. సూర్య చంద్రుల్నీ బ్రహ్మేంద్రుల్నీ యమ – వరుణ – వాయు – కుబేరుల్నీ పొట్టనబెట్టుకున్నాడు. నేను ఒక్కణ్ణీ మిగిలాను. నీ బంటుని. ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి? దైత్యనాయక పరివేష్టితుడై అంధకాసురుడు ఆనందంతో విర్రవీగుతున్నాడు. వాడు అజేయుడు కిం కర్తవ్యమ్? ఒకప్పుడు శత్రువులకు భయపడి శ్రీమహావిష్ణువంతటివాడు సుడిగాలిలా వచ్చి అజేయుడివైన నిన్ను చేరుకున్నాడు. కశ్యపకుమారుడైన హిరణ్యకశిపుణ్ణి నృసింహరూపంలో వాడివాడి గోళ్ళతో చీల్చి చెండాడి శిష్టరక్షణ చేసిన శ్రీహరి (ఆ క్రోధాన్నీ కోపాన్నీ నిలువరించుకోజాలక) ముల్లోకాలనూ ఊదివెయ్యడానికి ఉద్యమించి నోరు తెరిచాడు.

వసిష్ఠాద్యైశ్శప్తః భువనపతిభి స్సప్తమునిభిః తథాభూతో భూయాస్త్వమితి సుచిరం దైత్యసహితః ॥16॥

తతస్తేనోక్తాస్తే ప్రణయవచనైరాత్మనిహితైః కదా స్మా ద్వై ఘోరాద్భవతి మమ మోక్షో మునివరాః ।
యతః క్రుద్ధైరుక్తో విఘసహరణాద్యుద్ధసమయే ఘోరైర్బాణైర్విదళితముఖే ముష్టిభిరలమ్ ॥17॥

బదర్యాఖ్యారణ్యే నను హరగృహే పుణ్యవసతౌ నిసంస్తభ్యాత్మానం విగతకలుషో యాస్యసి పరమ్ ।
తతస్తేషాం వాక్యాత్ప్రతిదినమసౌ దైత్యగిలనః క్షుధార్తస్సంగ్రామాద్భ్రమతి పునరామోదముదితః ॥18॥

అప్పుడు – భువనరక్షకులు వసిష్ఠాదులు సప్తర్షులు కోపించి – నువ్వు ఇలాగే దైత్యులతో చిరకాలం ఉండిపోదువుగాక–అని శ్రీహరిని శపించారు. అప్పుడు శ్రీహరి తన మనస్సులోని ప్రియవచనాలతో సప్తర్షుల్ని ప్రాధేయపడ్డాడు. ముని వరులారా! ఈ ఘోరశాపం నుంచి నాకెప్పటికి విముక్తి? అని ప్రార్థించాడు. శ్రీహరీ! ఒక ఘోరసంగ్రామంలో నిన్ను బాణాలతో పిడిగుద్దులతో క్షతగాత్రుడినిచేసి విఘసుడనే దైత్యుడు మింగేస్తాడు. అటుపైని బదరికాశ్రమంలో పుణ్యప్రదమైన శివుడి గృహంలో నిన్ను నీవు నిలుపుకొని కలుషరహితుడివై ఉత్తమస్థితి తిరిగిపొందుతావు అని సప్తర్షులు శాపవిమోచనం పలికారు. అప్పటినుంచీ శ్రీహరి దైత్యులతోనే ఉంటూ సంగ్రామాలతో తిరుగుతూ దైత్యుల్నే ఆకొని భక్షిస్తూ దానినే ఆనందిస్తూ కాలం గడిపాడు. ఇప్పుడు విఘసుడు మింగేశాడు.

తమశ్చేదం ఘోరం జగదుదితయోస్సూర్యశశినోః ।
యథా శుక్రస్తుభ్యం పరమరిపురత్యంతవికరః ।

హతాన్ దేవైః దైత్యాన్ పునరమృతవిద్యాస్తుతిపదైః
స వీర్యాన్ సంహృష్టాన్ వ్రణశత వియుక్తాన్ ప్రకురుతే ॥19॥

వరం ప్రాణాస్త్యాజ్యాస్తవ మమ తు సంగ్రామసమయే ।
భవాన్ సాక్షీభూతః క్షణమపి వృతః కార్యకరణే ॥20॥

ఉదయించిన సూర్యచంద్రులు విఘసుడి నోట అస్తమించడంతో పరమేశా! జగత్తు అంతా ఘోరంగా చీకటి అయిపోయింది. నీకు అత్యంతశత్రువు అత్యంతవికృతుడూ అయిన శుక్రాచార్యుడు ఈ చీకటి సందున తన అమృత విద్యామంత్రాలతో (సంజీవనీ మంత్రాలు) దేవతల చేతిలో చచ్చిన దైత్యుల్ని అందరినీ బతికిస్తున్నాడు. గాయాల నుంచి విముక్తుల్ని చేసి హృష్టుల్నీ బలిష్ఠుల్నీ చేస్తున్నాడు . నువ్వేమో – అంధకాసురసంహారమనే పనికి పూనుకొన్నావు గానీ సంగ్రామసమయంలో అనుక్షణం ఇంతవరకూ కేవలం సాక్షీభూతుడుగానే ఉన్నావు. ఈ స్థితిలో నాకు ప్రాణత్యాగమే ఉత్తమంగా ఉంది!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతీదం సత్పుత్రాత్ ప్రమథపతిరాకర్ణ్య కుపితః
చిరం ధ్యాత్వా చక్రే త్రిభువనపతిః ప్రాగనుపమమ్ ।
ప్రగాయన్ సామాఖ్యం దినకరకరాకారవపుషా
ప్రహాసాత్తన్నామ్నా తదను నిహతం తేన చ తమః ॥21॥

ప్రకాశే ఽస్మిన్ లోకే పునరపి మహాయుద్ధమకరోత్
రణే దైత్యైస్సార్ధం వికృతవదనైర్వీరకమునిః ॥

తన సత్పుత్రుడు వీరకుడి మాటలు వింటూనే ఆ ప్రమథపతి ఆ త్రిభువనపతి ఆ పశుపతి దైత్యులపై కుపితుడయ్యాడు. చాలా సేపు ధ్యానమగ్నుడయ్యాడు. కనీవినీ ఎరగని ఒక పనిచేశాడు. సామవేదం పఠిస్తూ సూర్యసమకాంతిమంతమైన తనువుతో ఒక వికటాట్టహాసం చేశాడు. ఆ వెలుగుతో చీకటి అంతా తొలగిపోయింది. జగత్తు అంతటా మళ్ళీ వెలుగు నిండింది. వీరకముని రణరంగానికి పరుగుతీశాడు. వికృతాకారులైన దైత్య వీరులతో తిరిగి ఘోరసంగ్రామం చేశాడు.

శిలాచూర్ణం భుక్త్వా ప్రవరమునినా యస్తు జనితః ।
స కృత్వా సంగ్రామం పురమపి పురా యశ్చ జితవాన్ ॥22॥

మహారుద్ర స్సద్యః సఖలు దితిజేనాతిగిలితః
తతశ్చాసౌ నందీ నిశితశరశూలాసిసహితః ।
ప్రధానో యోధానాం మునివరశతానామపి మహాన్
నివాసో విద్యానాం శమదమమహాధైర్యసహితః ॥23॥

నిరీక్ష్యైవం పశ్చాత్ వృషభవరమారుహ్య భగవాన్
కపర్దీ యుద్ధార్థీ విఘసదితిజం సమ్ముఖముఖః ।

జపన్ దివ్యం మంత్రం నిగళనవిధానోద్గిలనకం
స్థితస్సజ్జం కృత్వా ధనురశనికల్పానపి శరాన్ ॥24॥

తతో నిష్క్రాంతోఽసౌ విఘసవదనాత్ వీరకమునిః
గృహీత్వా తత్సర్వం స్వబలమతులం విష్ణుసహితః ।
సముద్గీర్ణాస్సర్వే కమలజబలారీందుదినపాః
ప్రహృష్టం తత్ సైన్యం పునరపి మహాయుద్ధమకరోత్ ॥25॥

అంతలోకి ఆ విఘసదైత్యుడు నందీశ్వరుణ్ణి మింగేశాడు. రాతిపొడి తిని ప్రాణాలు నిలుపుకొనే ఘోరనియమంతో తీవ్రతపస్సుచేసిన శిలాదమహర్షి తనయుడైన నందీశ్వరుణ్ణి, ఒకప్పుడు త్రిపురాసురయుద్ధంలో ఒక పురదైత్యుణ్ణి జయించిన నందీశ్వరుణ్ణి నిశితశరీరశూలఖడ్గాలతో యుద్ధం చేస్తున్న నందీశ్వరుణ్ణి , గణయోధులకు మునులకూ ప్రధానుడైన నందీశ్వరుణ్ణి, అఖిలవిద్యలకూ శమ దమ మహాధైర్యాదిగుణాలకూ నిలయమైన నందీశ్వరుణ్ణి విఘసుడు, గుటుక్కున మింగేశాడు. దీన్ని మహారుద్రుడు కళ్ళారా చూశాడు. వెంటనే ఉత్తమవృషభాన్ని అధిరోహించాడు. యుద్ధరంగంలోకి దిగాడు. మింగినవాటిని కక్కించే దివ్యమంత్రం జపిస్తూ ధనుస్సునూ అశనిసదృశాలైన ఆశుగాలనూ సన్నద్ధం చేసుకుని ఆ కపర్ది – ఆ రుద్రదేవుడు విఘసుడికి అభిముఖంగా నడిచాడు. దివ్యమంత్రం పనిచేసింది. వీరకముని (నందీశ్వరుడు) దైత్యనాయకుడి నోటినుంచి బయటపడ్డాడు. తన సైన్యం మొత్తంతో శ్రీహరితో సహా బయటపడ్డాడు. వెంటవెంటనే వరసగా బ్రహ్మ –ఇంద్రుడు , చంద్రుడు, సూర్యుడు సేనాసమేతులై వెలువడ్డారు. మహాసైన్యం ఆనందంతో కేరింతలు కొట్టింది. మళ్ళీ మహాయుద్ధం కొనసాగింది.

జితే తస్మిన్ శుక్రస్తదను దితిజాన్ యుద్ధవిహతాన్
యదా విద్యావీర్యాత్ పునరపి సజీవాన్ ప్రకురుతే ।
తదా బద్ధ్వానీతః పశురివ గణైర్భూతపతయే
నిగీర్ణస్తేనాసౌ త్రిపురరిపుణా దానవగురుః ॥26 ॥

వినష్టే శుక్రాఖ్యే సురరిపునివాసస్తదఖిలో
జితో ధ్వస్తో భగ్నో భృశమపి సురైశ్చాపి దళితమ్ ।
ప్రభూతైర్భూతౌఘైః దితిజకుణపగ్రాసరసికైః
సరుండైః నృత్యద్భిర్నిశితశరశక్త్యుద్ధృతకరైః ॥27॥

ప్రమత్తైర్బేతాళైస్సుదృఢకరతుండైరపి ఖగైః
వృకైర్నానాభేదైశ్శవకుణపపూర్ణాస్యకబలైః ।
వికీర్ణే సంగ్రామే కనకకశిపోర్వంశజనకః
చిరం యుద్ధం కృత్వా హరిహరమహేంద్రైశ్చ విజితః ॥28॥

యుద్ధంలో మరణించిన దైత్యుల్ని తన సంజీవనీవిద్యాబలంతో పునరుజ్జీవితుల్ని చేస్తున్న శుక్రాచార్యుణ్ణి దేవ– గణసైన్యాలు చుట్టిముట్టి ఓడించాయి. అతణ్ణి ప్రాణాలతో బంధించి ప్రమథగణనేతలు ఒక పశువుని తెచ్చినట్టు తీసుకువచ్చి పశుపతి ముందు నిలబెట్టారు. అతిక్రుద్ధుడైన పశుపతి ఆ త్రిపురసంహారకుడు ఆ దానవగురువుని గుటుక్కున మింగేశాడు. ఇది చూసి దైత్యవీరులు భయకంపితులై చెల్లాచెదురుగా పారిపోయారు. పారిపోతున్నవారిని దేవగణవీరులు వెంట తరిమి తరిమి కొట్టారు. రాక్షసుల మాంసానికి రుచిమరిగిన భూత సంఘాలు పురైలమాలలు ధరించి, శక్తిఖడ్గగదాది శస్త్రాలు చేబూని రణరంగాన ఆనందనృత్యం చేశాయి. బహుబలశాలులు బేతాళజాతుల వారూ, గట్టి ముక్కులున్న పక్షిజాతులు, తోడేళ్ళు నక్కలూ మొదలైన జంతుజాలాలు చేతుల్లోనూ నోళ్ళలోనూ దైత్యుల మాంసంముద్దలు నింపుకుని రణభూమిలో చిందువేశాయి. ఇలా చిందరవందరైన రణరంగంలో హిరణ్యకశపుడి వంశోద్ధారకుడు ఆ అంధకదైత్యుడు ఒక్కడుగా హరిహరమహేంద్రాదులతో చిరకాలం పోరాటం సాగించి సాగించి నీరసించాడు.

ప్రవిష్టే పాతాళే గిరిజలధిరంధ్రాణ్యపి తథా
తతస్సైన్యే క్షీణే దితిజవృషభశ్చాంధకవరః ।
ప్రకోపే దేవానాం కదనవరదో విశ్వదళనో
గదాఘాతైః ఘోరైర్విదళితమదశ్చాపి హరిణా ॥29॥

న వై యస్సంగ్రామం త్యజతి వరలబ్ధః కిలయతః
తదా తాడైః ఘోరైః త్రిదశపతినా పీడితతనుః ।
తతశ్శస్త్రైస్త్రైఘ్నైస్తరుగిరిజలైశ్చాశు విబుధాన్
జిగాయోచ్చైర్గర్జన్ ప్రమథపతిమాహూయ శనకైః॥30॥

స్థితో యుద్ధం కుర్వన్ రణపతితశస్త్రైర్బహువిధైః
పరిక్షీణైస్సర్వైస్తదను గిరిజారుద్రమతుదత్ ।
తథా వృక్షైస్సర్వైరశనినివహైశ్శస్త్రపటలైః ।
విరూపైర్మాయాభిః కపటరచనా శంబరశతైః ॥31॥

విజేతుం శైలేశం కుహకమపరం తత్ర కృతవాన్
మహాసత్త్వో వీరస్త్రిపురరిపుతుల్యశ్చ మతిమాన్ ।
న వధ్యో దేవానాం వరశతమదోన్మాదవివశః
ప్రభూతైః శస్త్రాస్త్రై స్సపది దితిజో జర్జరతనుః ॥32॥

అంధకుడి సైన్యమంతా కకావికలైపోయింది. పర్వతగుహల్లోనూ సముద్రగర్భంలోనూ పాతాళంలోనూ తలదాచుకున్నారు హతశేషులై పారిపోయిన దైత్యవీరులు. దైత్యవృషభుడు ఆ అంధకుడు ఒకప్పుడు దేవతలకు యుద్ధాన్ని వరంగా ప్రసాదించిన ముక్కోపి. లోకాన్ని నాశనం చెయ్యగల సమర్థుడు. ఇప్పుడు శ్రీహరి తన గదా

ఘాతాలతో మదం వదిలించినా అతడు రణరంగం వదిలి పోవడం లేదు. శ్రీహరి కొట్టిన దెబ్బలతో తనువంతా శిథిలమైపోయినా పారిపోవడం లేదు. చావు లేని వరం బ్రహ్మదేవుడినుంచి పొందినవాడు గదా! శస్త్రాస్త్రాలతో తరు–గిరి– జలాదులతో దేవ– గణాలను ఎదురొడ్డి పోరాడుతూనే ఉన్నాడు. మొత్తానికి దేవతల్ని జయించాడు. విజయగర్జన చేశాడు. ఆ పైని ప్రమథనాథుడైన శివుణ్ణి కయ్యానికి రమ్మని కవ్వించాడు. రణరంగంలో పడి వున్న బహువిధశస్త్రాయుధాలను సేకరించి ప్రయోగిస్తూ దేవ–గణసైన్యాలను పారద్రోలాడు. శస్త్ర – సర్ప– అశని–వృక్ష– ప్రభృతి ఆయుధాలను గుప్పించి గిరిజారుద్రుణ్ణి దారుణంగా హింసించాడు. రకరకాల కపటరచనలు మాయారూపాలు శంబరవిద్యలూ ప్రయోగించి అనేకవిధాలుగా పీడించాడు. కట్టకడపటికి– శివుణ్ణి జయించడం కోసమని ఆ త్రిపురాసురతుల్యపరాక్రముడు ఆ మహావీరుడు ఆ మహాబలశాలి ఆ ధీశాలి దేవతలకు అవధ్యుడన్న వరంతో మదమత్తుడైన ఆ అంధకదైత్యుడు ఆ శిథిలశరీరుడు ఒక మహాకుహకం (మాయ) ప్రయోగించాడు.

తదీయా ద్విష్యందాత్ క్షితితలగతైరంధకగణైః
అతివ్యాప్తం ఘోరం వికృతవదనం స్వాత్మసదృశమ్ ।
దధత్కల్పాంతాగ్ని ప్రతిమవపుషా భూతపతినా
త్రిశూలేనోద్భిన్నస్త్రిపురరిపుణా దారుణతరమ్ ॥33॥

యదా సైన్యాత్సైన్యం పశుపతిహతాదన్యదభవత్ (సైన్యాత్ సైన్యం)
వ్రణోత్థైరత్యుష్ణైః పిశితనిసృతైర్బిందుభిరలమ్ ।
తదా విష్ణుర్యోగాత్ ప్రమథపతిమాహూయ మతిమాన్
చకారోగ్రం రూపం వికృతవదనం స్త్రైణమజితమ్॥34॥

కరాలం సంశుష్కం బహుభుజలతాక్రాంతకుపితో ।
వినిష్క్రాంతః కర్ణాద్రణశిరసి శంభోశ్చ భగవాన్ ॥35॥

ఆ రణరంగాన అంధకుడి శరీరంనుంచి స్రవించి నేలమీదపడిన ప్రతిరక్తబిందువునుంచీ మరొక అంధకుడు అంతే ఘోరంగా అదే వికృతవదనంతో ముమ్మూర్తులా అతడేగా ఆవిర్భవించాడు. భూతపతి శివుడు ప్రళయకాలాగ్నిలా మారిపోయాడు. త్రిశూలంతో వాణ్ణీ, వాడి ప్రతిరూపాలనీ దారుణంగా పొడిచాడు. ఆ రక్తబిందువులనుంచి మరొక అంధకసైన్యం పుట్టుకువచ్చింది. అంతరించిన సైన్యం అంతరించగా ఇది ఆవిర్భవించిన సైన్యం. గాయాలనుంచి స్రవించిన వేడినెత్తుటి బొట్టులనుంచి పుట్టిన మహాసైన్యం. అప్పుడు ధీశాలి శ్రీహరి ప్రమథపతిని వెనక్కుపిలిచి, తన యోగశక్తిమహిమతో వికృతరూపిణి భీకరాకారిణిగా రూపు ధరించాడు. ఎవ్వరికీ జయింపరాని స్త్రీరూపం. వెయ్యి బాహువులతో అత్యుగ్రంగా భీకరంగా ఉన్న ఆ రూపాన్ని ఒక్కసారిగా శుష్కింపజేసి రణాగ్రభూమిలో శివుడి చెవినుంచి వెలువడ్డాడు అతికుపితుడై ఆ శ్రీహరి.

రణస్థా సా దేవీ చరణయుగళాలంకృతమహీ
స్తుతా దేవైస్సర్వైః తదను భగవాన్ ప్రేరితమతిః ।

క్షుధార్తా తత్సైన్యం దితిజనిసృతం తచ్చ రుధిరం
పపౌ సాత్యుష్ణం తద్రణశిరసి సృక్కర్ధమమలమ్ ॥36॥

తతస్త్వేకో దైత్యస్తదపి యుయుధే శుష్కరుధిరః
తలాఘాతైః ఘోరైరశనిసదృశైర్జానుచరణైః ।
నఖైర్వజ్రాకారైర్ముఖభుజశిరోశ్చ గిరిశం
స్మరన్ క్షాత్రం ధర్మం స్వకులవిహితం శాశ్వతమజమ్ ॥37॥

తన రెండు పాదాలతోనూ భూమినంతటినీ ఆవరించి ఆభీకరాకారిణి రణరంగాన నిలబడింది. దేవతలందరూ భయభక్తులతో స్తుతించారు. భగవంతుడు రుద్రుడు ప్రేరేపించాడు. అంతే ఆదేవి ఆకొన్నదై ఆవురావురుమంటూ ఆ సైన్యాన్ని మింగేసింది. మాంసం ముద్దలతో చిక్కగానూ అత్యుష్ణంగానూ ఉన్న నెత్తురును మొత్తంగా అంధకుడి శరీరం నుంచి పీల్చేసింది. ఇప్పుడు వాడి శరీరంలో నెత్తుటి తడిలేదు. ఎండిపోయాడు. ఒంటరి అయ్యాడు. అయినా యుద్ధం మానలేదు. చేతులతో మోకాళ్ళతో పాదాలతో పిడుగుల్లాంటి దెబ్బలు వేస్తూ వజ్రాయుధాల్లాంటి గోళ్ళతో నోటితో భుజాలతో శిరస్సుతో శివుణ్ణి హింసించసాగాడు. శాశ్వతమూ సార్వకాలికమూ (పుట్టుక లేనిది) అయిన తన క్షాత్రకులధర్మాన్ని స్మరిస్తూ పోరాటం సాగించాడు.

రణే శాంతః పశ్చాత్ప్రమథపతినా భిన్నహృదయః
త్రిశూలే సంప్రోతో నభసి విధృతః స్థాణుసదృశః ।
అథఃకాయశ్శుష్క స్తపనకిరణై ర్జీర్ణతనుమాన్
జలాసారైర్మేఘైః పవనసహితైః క్లేదితవపుః ॥38॥

విశీర్ణస్తిగ్మాంశోస్తుహినశకలాకారశకలః
తథా భూతః ప్రాణాంస్తదపి న జహౌ దైత్యవృషభః ।
తదా తుష్టశ్శంభుః పరమకరుణా వారిధిరసౌ
దదౌ తస్మై ప్రీత్యా గణపతిపదం తేన వినుతః ॥39॥

కొంతసేపటికి నిశ్చేష్టుడయ్యాడు. అప్పుడు ప్రమథపతి వాడి గుండెలలో త్రిశూలం దించి నిశ్చలంగా ఉన్న అంధకుణ్ణి ఆకాశానికి ఎత్తాడు. శిథిలమైన వాడి శరీరంలో కిందిభాగం అంతా ఉన్న అంధకుణ్ణి ఆకాశానికి ఎత్తాడు. శిథిలమైన వాడి శరీరంలో కిందిభాగం అంతా సూర్యకిరణాల వేడికి పూర్తిగా ఎండిపోయింది. మేఘాలు కురిసిన గాలివానకు నానిపోయింది. మళ్ళీ సూర్యకిరణాల వేడికి ఎండిపోయింది. చివరికి మంచుబొట్టంతగా మారిపోయింది. అయినా ఆ దైత్యవల్లభుడి ప్రాణాలు పోలేదు. అప్పుడతడు రుద్రుణ్ణి స్తుతించాడు. అంతే శంకరుడు సంతుష్టుడయ్యాడు. పరమకరుణాసముద్రుడై, సంప్రీతుడై అంధకుడికి శివగణాధిపతి పదవిని ప్రసాదించాడు.

తతో యుద్ధస్యాంతే భువనపతయస్సార్థరమణై
స్తవైర్నానాభేదైః ప్రమథపతిమభ్యర్చ్య విధివత్ ।

హరిబ్రహ్మాద్యాస్తే పరమనుతిభిస్తుష్టువురలమ్
నతస్కంధాః ప్రీతా జయజయగిరం ప్రోచ్య సుఖితాః ॥40॥

హరస్తైస్తైస్సార్ధం గిరివరగుహాయాం ప్రముదితో
విసృజ్యైకానంశాన్ వివిధబలినా పూజ్యసునగాన్ ।
చకారాజ్ఞాం క్రీడాం గిరివరసుతాం ప్రాప్య ముదితాం
తథా పుత్రం ఘోరాద్విఘ్నసవదనాన్ముక్తమనఘమ్ ॥41॥

ఇలా యుద్ధం ముగియగానే భువనపతులు హరిబ్రహ్మేంద్రాదులందరూ సుఖంగా జయజయధ్వనులు పలుకుతూ మూపులు వంచి నమస్కరిస్తూ అందమైన అర్థాలతో కూడిన రకరకాల స్తుతులను చేసి ప్రమథపతిని విధివిధానంగా అర్చించారు. ఆ గిరిగుహలో వారితో కలిసి శివుడు ఎంతగానో ఆనందించాడు. ఒక్కొక్కరినీ తన అంశలను వీడ్కొల్పి, కానుకలతో బలిప్రదానాలతో పవిత్రమహాపర్వతాలను సంతృప్తిపరచి పంపించాడు. ఇలా విఘ్నుడి నోటినుంచి తన పుత్రుణ్ణి పావనవీరకుణ్ణి విడిపించుకొని ఆ శంకరుడు సమ్మోదభరితమైన గిరిరాజపుత్రితో కలిసి హాయిగా క్రీడించాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే అంధకవధోపాఖ్యానే అంధకయుద్ధవర్ణనం నామ షట్చత్వారింశోఽధ్యాయః ॥46॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు అంధకవధోపాఖ్యానంలో అంధకయుద్ధవర్ణనం అనే నలబై ఆరవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

సప్తచత్వారింశోఽధ్యాయః – నలబై ఏడవ అధ్యాయం

శుక్రనిగీర్ణన వర్ణనమ్ – శుక్రనిగీర్ణన వర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

తస్మిన్ మహతి సంగ్రామే దారుణే లోమహర్షణే ।
శుక్రో దైత్యపతిర్విద్వాన్ భక్షితస్త్రిపురారిణా ॥1॥

ఇతి శ్రుతం సమాసాన్మే తత్పునర్ బ్రూహి విస్తరాత్ ।
కిం చకార మహాయోగీ జఠరస్థః పినాకినః ॥2॥

న దదాహ కథం శంభోశ్శుక్రం తం జఠరానలః ।
కల్పాంతదహనః కాలో దీప్తతేజాశ్చ భార్గవః ॥3॥

వినిష్క్రాంతః కథం ధీమాన్ శంభోర్జఠరపంజరాత్ ।
కథమారాధయామాస కియత్కాలం స భార్గవః ॥4॥

అథ చ లబ్ధవాన్ విద్యాం తాం మృత్యుశమనీం పరామ్ ।
కా సా విద్యా పరా తాత యథా మృత్యుర్న్హి వార్యతే ॥5॥

లేభే ఽంధకో గాణపత్యం కథం శూలాద్వినిర్గతః ।
దేవదేవస్య వై శంభోర్మునేర్లీలావిహారిణః ॥6॥

ఏతత్సర్వమశేషేణ మహాధీమన్! కృపాం కురు ।
శివలీలామృతం తాత! శృణ్వతః కథ యస్వ మే ॥7॥

బ్రహ్మదేవా! దారుణమూ రోమహర్షణమూ ఆ మహాసంగ్రామంలో దైత్యగురువు మహావిద్వాంసుడు అయిన శుక్రాచార్యుణ్ణి త్రిపురాంతకుడు శివుడు గుటుక్కున మింగేశాడని చాలా సంగ్రహంగా చెప్పావు. కొంచెం దాన్ని విస్తరించి చెప్పవూ!! శివుడి జీర్ణకోశంలోకి ప్రవేశించిన ఆ మహాయోగి ఏమయ్యాడు? పినాకపాణి జఠరాగ్ని అతణ్ణి జీర్ణం చేసెయ్య లేదా? భార్గవవంశంలో పుట్టినవాడు శుక్రుడు. అతడే ఒక ప్రళయాగ్ని. అతడే ఒక కాలస్వరూపుడు. దీప్త తేజస్వి. ధీమంతుడు. కనక శివుడి జఠరపంజరం నుంచి క్షేమంగా వెలువడ్డాడా? ఎలా? అటుపైని అతడు శివుణ్ణి ఎంతకాలం ఎలా ఆరాధించాడు? అదీగాక– అత్యద్భుతమైన మృతసంజీవనీవిద్యను అతడు కైవసం చేసుకున్నాడు గదా! అసలు ఏమిటి ఆ విద్య? అది మృత్యువుని ఎలా వారించగలుగుతుంది? తాతా! పితామహా! దయచేసి వివరంగా చెప్పు. శివుడంటే లీలావిహారి. దేవదేవుడు. అతడి త్రిశూలంనుంచి అంధకుడు ఎలా ఊడిపడ్డాడు? ప్రమథగణాధిపతి పదవిని ఎలా పొందాడు? మహాధీశాలీ! ఇదంతా సమగ్రంగా నాకు కటాక్షించు! శివలీలామృతాన్ని ఆస్వాదిస్తున్న నాకు తనివి తీరేట్టు వినిపించు ప్రియపితమహా!

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇతి తస్య వచః శ్రుత్వా వ్యాసస్యామితతేజసః ।
సనత్కుమారః ప్రోవాచ స్మృత్వా శివపదాంబుజమ్ ॥8॥

మహాతేజస్వి ఆ వ్యాసుడు ఇలా ప్రార్థించేసరికి మరొక్కసారి శివుడి పాదపద్మాలు మనస్సులో ధ్యానించి సనత్కుమారుడు ఆ వివరాలన్నీ వినిపించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాస మహాబుద్ధే శివలీలామృతం పరమ్ ।
ధన్యస్త్వం శైవముఖ్యోఽసి మమానందకరః స్వతః ॥9॥

ప్రవర్తమానే సమరే శంకరాంధకయోస్తయోః ।
అనిర్భేద్య పవివ్యూహ గిరివ్యూహాధినాథయోః ॥10॥

పురా జయో బభూవాపి దైత్యానాం బలశాలినామ్ ।
శివ ప్రభావాదభవత్ ప్రమథానాం మునే జయః ॥11॥

తత్శ్రుత్వాసీద్విషణ్ణో హి మహాదైత్యోఽంధకాసురః ।
కథం స్యాన్మే జయ ఇతి విచారణపరోఽభవత్ ॥12॥

అపసృత్య తతో యుద్ధాదంధకః పరబుద్ధిమాన్ ।
ద్రుతమభ్యగమద్వీర ఏకలశ్శుక్రసన్నిధిమ్ ॥13॥

ప్రణమ్య స్వగురుం కావ్యమవరుహ్య రథాచ్చ సః ।
బభాషేదం విచార్యాథ సాంజలిర్నీతివిత్తమః ॥14॥

బుద్ధిశాలీ! వ్యాసమునీ! నిజంగా నువ్వు ధన్యుడివి. శివభక్తులలో అగ్రగణ్యుడివి. నిన్ను చూస్తుంటే నాకు చాలా ఆనందంగా ఉంది. ఉత్తమోత్తమమైన శివలీలామృతం నీకు పంచుతున్నాను, ఆస్వాదించు!! శంకరుడికి అంధకదైత్యుడికీ మహాసంగ్రామం జరిగింది. ఇద్దరి కిద్దరే. వారి పవివ్యూహాలూ గిరివ్యూహాలూ అనిర్భేద్యాలు. ఆ ఘోరసంగ్రామంలో ముందుగా బలశాలులైన దైత్యులకే విజయం లభించింది. కానీ చివరికి శివుడి ప్రభావం వల్ల ప్రమథగణాలకే విజయం వరించింది. ఇది గుర్తించి అంధకాసురుడు అత్యంత విషణ్ణుడయ్యాడు. అంతిమవిజయం నాకే దక్కాలంటే ఏమి చెయ్యాలి అని తీవ్రంగా ఆలోచించాడు. బుద్ధి చాతురి కలవాడు కనక అప్పటికి యుద్ధరంగం నుంచి వైదొలగాడు. వెంటనే ఏకాంతంగా శుక్రాచార్యుణ్ణి సమీపించాడు. రథం దిగుతూనే గురువుగారికి సాష్టాంగనమస్కారం చేశాడు. నీతికుశలుడు. బాగా ఆలోచించి అలాగే అంజలిబంధంతో గురుసన్నిధిని నిలిచి నెమ్మదిగా సంభాషించాడు.

అంధక ఉవాచ – అంధకుడు పలికాడు.

భగవన్ త్వాముపాశ్రిత్య గురోర్భావం వహామహే ।
పరాజితా భవామో నో సర్వదా జయశాలినః ॥15॥

త్వత్ప్రభావాత్సదా దేవాన్ సమస్తాన్సానుగాన్వయమ్ ।
మన్యామహే హరోపేంద్రముఖానపి హి కత్తృణాన్ ॥16॥

అస్మత్తో బిభ్యతి సురాస్సదా భవదనుగ్రహాత్ ।
గజా ఇవ హరిభ్యశ్చ తార్క్షేభ్య ఇవ పన్నగాః ॥17॥

అనిర్భేద్యం పవివ్యూహం వివిశుర్దైత్యదానవాః ।
ప్రమథానీకమఖిలం విధూయ త్వదనుగ్రహాత్ ॥18॥

వయం త్వచ్చరణా భూత్వా సదా గా ఇవ నిశ్చలాః ।
స్థిత్వా చరామో నిశ్శంకమాజావపి హి భార్గవ ॥19॥

రక్ష రక్షాభితో విప్ర ప్రవ్రజ్య శరణాగతాన్ ।
అసురాన్ శత్రుభిర్వీరైరర్దితాంశ్చ మృతానపి ॥20॥

ప్రమథైర్భీమవిక్రాంతైః క్రాంతాన్మృత్యుప్రమాథిభిః ।
సూదితాన్ పతితాన్ పశ్య హుండాదీన్మద్గణాన్వరాన్ ॥21॥

యః పీత్వా కణధూమం వై సహస్రం శరదాం పురా ।
త్వయా ప్రాప్తా వరా విద్యా తస్యాః కాలోఽయమాగతః ॥22॥

అద్య విద్యాఫలం తత్తే సర్వే పశ్యంతు భార్గవ ।
ప్రమథా అసురాన్ సర్వాన్ కృపయా జీవయిష్యతః ॥23॥

మహానుభావా! గురుభావంతో నిన్ను ఆశ్రయించుకుని ఉన్నవాళ్ళం. ఇప్పటివరకూ ఏనాడూ పరాజయం ఎరుగని జయశాలులం. నీ మహిమ వల్ల సమస్త దేవతలనూ వారి అనుయాయులను శివశ్రీహరి ప్రముఖులతో సహా అందరినీ గడ్డిపరకల్లా పరిగణించిన వాళ్ళం. సింహాలను చూసిన ఏనుగులవలె గరుత్మంతుణ్ణి చూసిన పాములవలె దేవతలంతా మమ్మల్ని చూసి భయపడుతున్నారంటే అది కేవలం మీ అనుగ్రహమే. ప్రమథగణాలను సైతం పారద్రోలి దైత్యదానవశ్రేణులు పవివ్యూహంలో క్షేమంగా ఉన్నారంటే అదీ నీ అనుగ్రహమే. భార్గవా! మేమందరం పచ్చికబయళ్ళలో గోవుల్లాగా నిర్భయంగా నిలిచి రణరంగంలో సైతం అలాగే తిరుగాడగలుగుతున్నామంటే దానికి కారణం నువ్వు మాకు రక్షకుడుగా ఉండటమే. ఇప్పుడిలా పారిపోయివచ్చి మేమంతా నిన్ను శరణువేడుతున్నాము. దయచేసి మమ్మల్ని అన్ని వైపుల నుంచి పూర్తిగా రక్షించు, రక్షించు! శత్రువీరుల చేతిలో దెబ్బదిన్న దైత్యుల్నీ మరణించిన దానవుల్నీ అందరినీ రక్షించు రక్షించు! నా సేనాపతుల్ని హుండాదుల్ని ఒక్కసారి గమనించు – ఎలా మరణించారో, ఎలా నేలకొరిగి పోయారో! కేవలం కణధూమం పీల్చి వేలసంవత్సరాలు తలకిందులుగా తపస్సుచేసిన

మహానుభావుడివి నువ్వు. ఆ తపస్సుతో గొప్ప మృతసంజీవనీ విద్యను సాధించావు. ఇప్పుడు దానికి తగిన సమయం వచ్చింది. నువ్వు కరుణతో అసురుల్ని అందరినీ పునరుజ్జీవింపజేస్తుంటే నీ విద్యాఫలితాన్ని ప్రమథులు అందరూ ఈనాడే దర్శింతురు గాక!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్థమంధకవాక్యం స శ్రుత్వా ధీరో హి భార్గవః ।
తదా విచారయామాస దూయమానేన చేతసా ॥24॥

కిం కర్తవ్యం మయాద్యాపి క్షేమం మే స్యాత్కథం త్వితి ।
సన్నిపాతవిధిర్జీవః సర్వథానుచితో మమ ॥25॥

విద్యేయం శంకరాత్ప్రాప్తా తద్గణాన్ ప్రతి యోజయే ।
తద్రణే మర్దితాన్ వీరైః ప్రమథైశ్శంకరానుగైః ॥26॥

శరణాగతధర్మోఽథ ప్రవరస్సర్వతో హృదా ।
విచార్య శుక్రేణ ధియా తద్వాణీ స్వీకృతా తదా ॥27॥

కించిత్ స్మితం తదా కృత్వా సోఽబ్రవీద్దానవాధిపమ్ ।
భార్గవశ్శివపాదాబ్జం స్మృత్వా స్వస్థేన చేతసా ॥28॥

ధీరగంభీరుడు ఆ భార్గవుడు అంధకుడి అభ్యర్థనను ఆలకించాడు. అతడి మనస్సు వికలమయ్యింది. తీవ్రంగా ఆలోచించాడు. ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి? నాకు ఏది క్షేమం? ఏది అనుచితం? జీవుడంటేనే కార్యాకార్యాల సంపుటి. ఈ మృతసంజీవనీవిద్య నాకు శంకరుడి దయవల్ల ప్రాప్తించింది. దాన్ని ప్రమథ గణాలకు వ్యతిరేకంగా ప్రయోగించనా? శంకరానుచరులైన మహావీరులచేతిలో మరణించిన దైత్యుల్ని బ్రతికించడమా? ఇది తగునా? నాకు క్షేమమా? – సరే– శరణాగతరక్షణ అనేది అన్నివిధాలా ఉత్తమోత్తమధర్మంగదా– అని శుక్రాచార్యుడు మనస్సులో బాగా ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చాడు. అంధకుడి అభ్యర్థనను అంగీకరించాడు. చిన్నగా నవ్వాడు. స్వస్థచిత్తంతో శివుడి పాదపద్మాలను ఒక్కసారి ధ్యానించాడు. దానవాధిపతితో పలికాడు.

శుక్ర ఉవాచ – శుక్రుడు చెప్పాడు.

యత్త్వయా భాషితం తాత తత్సర్వం తథ్యమేవ హి ।
ఏతద్విద్యోపార్జనం హి దానవార్థం కృతం మయా ॥29॥

దుస్సహం కణధూమం వై పీత్వా వర్షసహస్రకమ్ ।
విద్యేయమీశ్వరాత్ ప్రాప్తా బంధూనాం సుఖదా సదా ॥30॥

ప్రమథైర్మథితాన్ దైత్యాన్ రణేఽహం విద్యయానయా ।
ఉత్థాపయిష్యే మ్లానాని సస్యాని జలముగ్యథా ॥31॥

నిర్వ్రణాన్నీరుజః స్వస్థాన్ సుప్తేవ పునరుత్థితాన్ ।
ముహూర్తే ఽస్మింశ్చ ద్రష్టాసి దైత్యాంస్తానుత్థితాన్నిజాన్ ॥32॥

నాయనా! నువ్వు చెప్పినదంతా నిజమే. నేనసలు ఈ విద్యని సంపాదించినదే దానవులకోసం. భరింపరాని కణధూమాన్ని వేల సంవత్సరాలు పీలుస్తూ ఘోరతపస్సుచేసి శంకరుణ్ణి మెప్పించి ఈ మృతసంజీవనీ విద్యను వరంగా పొందాను. ఇది నా బంధువులకు సుఖప్రదం కాకపోతే ఇంకెందుకు? సదా ఇది సుఖదం. రణరంగాన ప్రమథవీరులచేతిలో దెబ్బతిన్నవారినీ ప్రాణాలు కోల్పోయినవారినీ ఈ విద్యతో – లేపి నిలబెడతాను. ఎండిపోయిన పైరుని వాననీరులా బతికిస్తాను. గాయాలు మానేట్లు చేస్తాను. రోగాలు నయంచేస్తాను. నిద్రనుంచి మేల్కొన్నట్లు మన దైత్యులందరూ లేచి కూర్చునేట్టు చేస్తాను. నీ దైత్యులందరూ పునరుజ్జీవితులు కావడం ఈ క్షణంలోనే చూస్తావు.

సనత్కుమార ఉవాచ – సనుత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా సో ఽంధకం శుక్రో విద్యామావర్తయత్కవిః ।
ఏకైకం దైత్యముద్దిశ్య స్మృత్వా విద్యేశమాదరాత్ ॥33॥

విద్యావర్తనమాత్రేణ తే సర్వే దైత్యదానవాః ।
ఉత్తస్థుర్యుగపద్వీరాః సుప్తా ఇవ ధృతాయుధాః ॥34॥

సదాభ్యస్తా యథా వేదాస్సమరే వా యథాంబుదాః ।
శ్రద్ధయార్థాస్తథా దత్తా బ్రాహ్మణేభ్యో యథాపది ॥35॥

ఉజ్జీవితాంస్తు తాన్ దృష్ట్వా హుండాదీంశ్చ మహాసురాన్ ।
వినేదురసురాస్సర్వే జలపూర్ణా ఇవాంబుదాః ॥36॥

రణోద్యతాః పునశ్చాసన్ గర్జంతో వికటాన్ రవాన్ ।
ప్రమథైస్సహ నిర్భీతా మహాబలపరాక్రమాః ॥37॥

అంధకాసురుడితో ఇలా పలుకుతూనే శుక్రాచార్యుడు ఆ విద్యాధిపతిని శివుని తలుచుకుని, ఒక్కొక్క దైత్యుని ఉద్దేశించి సంజీవనీమంత్రాన్ని ఒక్కొక్కొసారిగా పునశ్చరణ చేశాడు. అంతమాత్రానికే దైత్యదానవులందరూ నిద్రమేల్కొనట్టు సాయుధలై లేచి నిలబడ్డారు. నిరంతరం సాగించిన వేదాభ్యాసం ఫలించినట్టు, రణరంగంలో దప్పిక గొన్నవారికి త్రాగునీరందించిన పుణ్యాత్ములాగా, ఆపదలో ఉన్న బ్రాహ్మణులకు శ్రద్ధతో దానధర్మాలు చేసిన ధర్మాత్ములాగా – దైత్యదానవులు లేచి నిలబడ్డారు. ఇలా ఉజ్జీవితులైన హుండాది మహాదైత్యమహావీరుల్ని చూసి అసురులందరూ వర్షించే మేఘాలలాగ పెద్దపెట్టున గర్జించారు. వికృతంగా గర్జిస్తూ ఆ మహాబలపరాక్రమ సంపన్నులు అందరూ ప్రమథసేనలతో యుద్ధానికి మళ్ళీ సన్నద్ధులయ్యారు.

శుక్రేణోజ్జీవితాన్ దృష్ట్వా ప్రమథా దైత్యదానవాన్ ।
వివిస్మిరే తతస్సర్వే నంద్యాద్యా యుద్ధదుర్మదాః ॥38॥

విజ్ఞాప్యమేవం కర్మైతత్ దేవేశే శంకరేఽఖిలమ్ ।
విచార్య బుద్ధిమంతశ్చ హ్యేవం తేఽన్యోన్యమబ్రువన్ ॥39॥

శుక్రుడి చేత పునరుజ్జీవితులవుతున్న దైత్యదానవుల్ని చూసి ప్రమథులంతా నివ్వెరపోయారు. నందిప్రభృతులు యుద్ధదుర్మదులు ఆశ్చర్యచకితులయ్యారు. బుద్ధికుశలురై సమాలోచనలు జరిపారు. ఈ జరుగుతున్నదంతా పరమేశ్వరుడికి విన్నవించాలి అని కూడబలుక్కున్నారు.

ఆశ్చర్యరూపే ప్రమథేశ్వరాణాం తస్మింస్తథా వర్తతి యుద్ధయజ్ఞే ।
అమర్షితో భార్గవకర్మ దృష్ట్వా శిలాదపుత్రోఽభ్యగమన్మహేశమ్ ॥40॥

జయేతి చోక్త్వా జయయోనిముగ్రమువాచ నందీ కనకావదాతమ్ ।
గణేశ్వరాణాం రణకర్మ దేవ దేవైశ్చ సేంద్రైరపి దుష్కరం సత్ ॥41॥

తద్భార్గవేణాద్య కృతం వృథా నస్సంజీవితాంస్తాన్ హి మృతాన్విపక్షాన్ ।
ఆవర్త్య విద్యాం మృతజీవదాత్రీమేకైకముద్దిశ్య సహేలమీశ ॥42॥

తుహుండ హుండాదిక కుంభ జంభ విపాక పాకాది మహాసురేంద్రాః ।
యమాలయాదద్య పునర్నివృత్తా విద్రావయంతః ప్రమథాంశ్చరంతి ॥43॥

యదిహ్యసౌ దైత్యవరాన్ నిరస్తాన్ సంజీవయేదత్ర పునఃపునస్తాన్ ।
జయః కుతో నో భవితా మహేశ గణేశ్వరాణాం కుత ఏవ శాంతిః ॥44॥

ప్రమథేశ్వరులకే ఆశ్చర్యకరంగా యుద్ధమహాయజ్ఞం అలా జరుగుతూండగా, భృగువంశోద్భవుడు శుక్రాచార్యుడు చేస్తున్న పునరుజ్జీవనకార్యక్రమం తిలకించిన నందీశ్వరుడికి ఆ శిలాదముని పుత్రుడికి ఉక్రోషం ఉబికి వచ్చింది. వెంటనే మహేశుడి సన్నిధికి వెళ్ళాడు. ఆచారం ప్రకారం "జయము జయము మహేశ!" అన్నాడు. జయాలకు పుట్టిల్లు ఆ శంకరుడు, మేలిమి బంగారువన్నెలో ఉన్నాడు. నంది పలికాడు. ఇంద్రాది దేవతలతో కలిసి ప్రమథగణేశ్వరులం మేమందరమూ చేస్తున్న దుస్సాధ్యమైన ఈ పోరాటం శుక్రాచార్యుని కారణంగా వృథా అయిపోయింది. చనిపోయిన శత్రువుల్ని అందరినీ ఆ భార్గవుడు బతికిస్తున్నాడు. ఒక్కొక్కడి కోసం ఒక్కొక్కసారిగా మృతసంజీవనీమంత్రాన్ని విలాసంగా పునశ్చరణ చేస్తూ. ఈశ్వరా! తుహుండ హుండ-కుంభ-జంభ-విపాక-పాక-ప్రభృతి దైత్యదానవనాయకుల్ని అందరినీ బతికించేశాడు. యమలోకం నుంచి తిరిగివచ్చి ఆ మహాసురులు ప్రమథగణాలను చెల్లాచెదురుచేస్తూ రణరంగాన వీరవిహారం జరుపుతున్నారు. ఈ భార్గవుడు ఇలాగే దైత్యవీరుల్ని మళ్ళీ మళ్ళీ బతికిస్తూంటే ఇంక మనకు జయం ఎలా సమకూరుతుంది? ఎలా చేకూరుతుంది?. మనశ్శాంతి చేకూరినట్టే! ఎలా మహేశ్వరా?- అని విన్నవించాడు.

సనత్కుమార ఉవాచ - సనత్కుమారుడు అన్నాడు.

ఇత్యేవముక్తః ప్రమథేశ్వరేణ స నందినా వై ప్రమథేశ్వరేశః ।
ఉవాచ దేవః ప్రహసంస్తదానీం తం నందినం సర్వగణేశరాజమ్ ॥45॥

ప్రమథగణనాయకుడు నందీశ్వరుడు విన్నవించింది ఆలకించాడు ప్రమథనాయకుల నాయకుడు పరమేశ్వరుడు. చిన్నగా నవ్వి ప్రమథగణరాజు ఆ నందీశ్వరుడితో ఇలా పలికాడు.

శివ ఉవాచ – శివుడు ఆజ్ఞాపించాడు.

నందిన్ ప్రయాహి త్వరితోఽతిమాత్రం ద్విజేంద్రవర్యం దితినందనానామ్ ।
మధ్యాత్సముద్ధృత్య తథానయాశు శ్యేనో యథా లావకమండజాతమ్ ॥46॥

నందీశా! వెళ్ళు, వెంటనే వెళ్ళు!, వేగంగా వెళ్ళు, వెళ్ళి దైత్యుల మధ్య నున్న ఆ బ్రాహ్మణవర్యుడైన శుక్రాచార్యుణ్ణి వెంటనే ఇక్కడికి ఎత్తుకురా. ఒకడేగ లావకపక్షిపిల్లలని తన్నుకుపోయినట్టు పట్టుకురా వెళ్ళు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

స ఏవముక్తో వృషభధ్వజేన ననాద నందీ వృషసింహనాదః ।
జగామ తూర్ణం చ విగాహ్య సేనాం యత్రాభవద్భార్గవవంశదీపః ॥47॥

తం రక్ష్యమాణం దితిజైస్సమస్తైః పాశాసివృక్షోపలశైలహస్తైః ।
విక్షోభ్య దైత్యాన్ బలవాన్ జహార కావ్యం స నందీ శరభో యథేభమ్ ॥48॥

ప్రస్తాంబరం విచ్యుతభూషణం చ విముక్తకేశం బలినా గృహీతమ్ ।
విమోచయిష్యంత ఇవానుజగ్ముః సురారయస్సింహరవాంస్త్యజంతః ॥49॥

దంభోలి శూలాసి పరశ్వధానాముద్దండచక్రోపలకంపనానామ్ ।
నందీశ్వరస్యోపరి దానవేంద్రా వర్షం ववర్షుర్జలదా ఇవోగ్రమ్ ॥50॥

తం భార్గవం ప్రాప్య గణాధిరాజో ముఖాగ్నినా శస్త్రశతాని దగ్ధ్వా ।
ఆయాత్ప్రవృద్ధేఽసురదేవయుద్ధే భవస్య పార్శ్వే వ్యథితారిపక్షః ॥51॥

వృషభధ్వజుడు ఇలా ఆజ్ఞాపించగానే నందీశ్వరుడు రంకె వేసి సింహనాదం చేశాడు. చేస్తూనే బయలుదేరాడు. దైత్యమహాసైన్యాన్ని ఈదుకుంటూ భృగువంశదీపకుడు ఆ శుక్రాచార్యుడున్న చోటుకి చేరుకున్నాడు. అతడికి రక్షణవలయంగా దైత్యవీరులు పాశ–ఖడ్గ–వృక్ష–శిలా–పర్వతాదుల్ని ఆయుధాలుగా ధరించి నిలబడ్డారు. మహాబలశాలి నందీశ్వరుడు ఆ దైత్యవీరుల్ని ఉక్కిరిబిక్కిరి చేసి ఒక మహాశరభం మత్తేభాన్ని పట్టుకున్నట్టు ఆ శుక్రుని కబళించి రివ్వున వెనుదిరిగాడు. వస్త్రాలు ఊడిపోయి, భూషణాలు జారిపోయి జుట్టు చెదిరిపోయి–ఆ శుక్రుడు గిలగిలలాడుతున్నాడు. దేవశత్రువులు సింహనాదాలతో వెంబడించారు–విడిపించే ప్రయత్నంతో వెంబడించారు. దంభోళి (వజ్రాయుధం)–శూల–ఖడ్గ–పరశ్వధ (గొడ్డలి)–చక్ర–శిలా–కంపన ప్రభృతి భీషణాయుధాలను కుంభవృష్టిలా నందీశ్వరుడిపై కురిపించారు. మేఘాలునట్లు వర్షం కురిపించినట్లుగ మహోగ్రంగా కురిపించారు. నందీశ్వరుడు చెక్కుచెదరలేదు. శుక్రుణ్ణి వదలలేదు. నోరు తెరిచి మహాగ్నిజ్వాలల్ని ఉప్పున ఊది దైత్యులు కురిపిస్తున్న ఆయుధవర్షాన్ని ఆవిరి చేసేశాడు. తీవ్రరూపం ధరించిన దేవదానవమహాయుద్ధంలో అలా నందీశ్వరుడు దైత్యసేనలను కకావికలు చేసి శుక్రుణ్ణి కావ్యుణ్ణి బంధించి తెచ్చి శివుడి చెంత నిలిచాడు, నిలిపాడు.

అయం స శుక్రో భగవన్నితీదం నివేదయామాస భవాయ శీఘ్రమ్ ।
జగ్రాహ శుక్రం స చ దేవదేవో యథోపహారం శుచినా ప్రదత్తమ్ ॥52॥

న కించిదుక్త్వా స హి భూతగోప్తా చిక్షేప వక్త్రే ఫలవత్కవీంద్రమ్ ।
హాహారవైః త్రైరసురైస్సమస్తైరుచ్చైర్విముక్తో హహహేతి భూరి ॥53॥

నిలుస్తూనే–హే భగవన్! ఇడిగో శుక్రుడు–అని భవుడికి నివేదించాడు. దేవదేవుడు–ఒక నిష్కల్మషుడు సమర్పించిన ఉపాహారంలాగా నైవేద్యంలాగా శుక్రుణ్ణి స్వీకరించాడు. సమస్తభూతరక్షకుడు ఆ భవుడు ఏమీ మాట్లాడలేదు. ఆ కవీంద్రుణ్ణి చిన్న పండులాగా మునివేళ్ళతో పట్టుకుని అలా నోట్లో వేసుకున్నాడు అయిపోయింది. దేవదానవుల హాహాకారాలు మిన్నుముట్టాయి. మహాదేవుడు పెద్ద పెట్టున హహహా అన్నాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే అంధకయుద్ధే శుక్ర నిగీర్ణనవర్ణనం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥47॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు అంధకయుద్ధంలో శుక్రనిగీర్ణనవర్ణనం అనే నలభై ఏడవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

అష్టచత్వారింశోఽధ్యాయః – నలభై ఎనిమిదవ అధ్యాయం

శుక్రనిగీర్ణనం – శుక్రనిగీర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

శుక్రే నిగీర్ణే రుద్రేణ కిమకార్షుశ్చ దానవాః ।
అంధకేశా మహావీరా వద తత్త్వం మహామునే ॥1॥

మహామునీ! సనత్కుమారా! శుక్రుని రుద్రుడు ఇలా చప్పరించేశాక, ఆ దానవులూ అంధకుడే ప్రభువైన దైత్యవీరులూ ఏం చేశారో దాపరికం లేకుండా దయచేసి చెప్పవయ్యా మహానుభావా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

కావ్యే నిగీర్ణే గిరిజేశ్వరేణ జయాశారహితా బభూవుః ।
హస్తైర్విముక్తా ఇవ వారణేంద్రాః శృంగైర్విహీనా ఇవ గోవృషాశ్చ ॥2॥

శిరో విహీనా ఇవ దేవసంఘా ద్విజా యథా చాధ్యయనేన హీనాః ।
నిరుద్యమాస్తత్ప్రగణా యథా వై యథోద్యమా భాగ్యవివర్జితాశ్చ ॥3॥

పత్యా విహీనాశ్చ యథైవ యోషా యథా విపక్షాః ఖలు మార్గణౌఘాః ।
ఆయూంషి హీనాని యథైవ పుణ్యైర్వ్రతైర్విహీనాని యథా శ్రుతాని ॥4॥

వినా యథా వైభవశక్తిమేకాం భవంతి హీనాః స్వఫలైః క్రియౌఘాః ।
యథా విశూరాః ఖలు క్షత్రియాశ్చ సత్యం వినా ధర్మగణో యథైవ ॥5॥

నందినా చాహృతే శుక్రే గిలితే చ విషాదినా ।
విషాదమగమన్ దైత్యా యతమానరణోత్సవాః ॥6॥

తాన్వీక్ష్య విగతోత్సాహానంధకః ప్రత్యభాషత ।
దైత్యాంస్తు హుండ హుండాదీన్ మహాధీరపరాక్రమః ॥7॥

వ్యాసమునీశ్వరా! గిరిజేశ్వరుడు అలా శుక్రుని మింగేసే సరికి దైత్యులలో జయాశ పోయింది. తొండాలు లేని మత్తేభాల్లా, కొమ్ములు విరిగిన గిత్తల్లా, తలలు లేని దేవసమూహాల్లా, అధ్యయనం మానేసిన విప్రుల్లా, ప్రయత్నమే విడిచిన బలిష్ఠుల్లా, ప్రయత్నించినా ఫలితాలు పొందని దురదృష్టవంతుల్లా, భర్తలను పోగొట్టుకున్న భార్యల్లా, ఈక రెక్కలు లేని బాణసమూహాల్లా, ఆయుర్దాయం లేని పుణ్యాత్ముల్లా, ఆచరణ లేని వేదాధ్యయనాల్లా, శక్తిసామర్థ్యాలు చాలక నిష్ఫలాలయ్యే కార్యకలాపాల్లా, శూరులు లేని క్షత్రియవంశాల్లా, సత్యం లోపించిన ధర్మగణంలా అయిపోయారు దైత్యదానవులందరూ. నందీశ్వరుడు మన్దలపట్టి తేగా శుక్రుణ్ణి కాలకూటవిషభోక్త భక్షించగా దైత్యదానవులు–మరోసారి మహాయుద్ధానికి ఉరకలు వేస్తున్న దైత్యదానవులు– ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయారు. మహాధీరపరాక్రముడు అంధకుడు మాత్రం–నీరుగారిపోతున్న తుహుండ హుండాదుల్ని తన దైత్యవీరుల్ని చూసి ఇలా అన్నాడు.

అంధక ఉవాచ – అంధకుడు భాషించాడు.

కవిం విక్రమ్య నయతా నందినా వంచితా వయమ్ ।
తనూర్వినా కృతాః ప్రాణాస్సర్వేషామద్య నో నను ॥8॥

ధైర్యం వీర్యం గతిః కీర్తిస్సత్త్వం తేజః పరాక్రమః ।
యుగపన్నో హృతం సర్వమేకస్మిన్ భార్గవే హృతే ॥9॥

ధిగస్మాన్ కులపూజ్యో యైరేకోఽపి కులసత్తమః ।
గురుస్సర్వసమర్థశ్చ త్రాతా త్రాతో న చాపది ॥10॥

తద్యూయమవిలంబ్యేహ యుధ్యధ్వమరిభిస్సహ ।
వీరైః తైఃప్రమథైర్వీరాః స్మృత్వా గురుపదాంబుజమ్ ॥11॥

గురోః కావ్యస్య సుఖదౌ స్మృత్వా చరణపంకజౌ ।
సూదయిష్యామ్యహం సర్వాన్ ప్రమథాన్ సహ నందినా ॥12॥

అద్యైతాన్ వివశాన్ హత్వా సహదేవైస్సవాసవైః ।
భార్గవం మోచయిష్యామి జీవం యోగీవ కర్మతః ॥13॥

స చాపి యోగీ యోగేన యది నామ స్వయం ప్రభుః ।
శరీరాత్తస్య నిర్గచ్ఛేదస్మాకం శేషపాలితా ॥14॥

దైత్యదానవ సోదరులారా! చూశారా! ఒకే ఒక్కడు నందీశ్వరుడు విక్రమించి శుక్రుణ్ణి తీసుకుపోయాడు. మన అందరి కళ్ళల్లోనూ కారం కొట్టాడు(వంచితాః). ఇప్పుడు మనం అందరం ప్రాణాలు లేని శరీరాలమైపోయాం– జీవచ్ఛవాలుగా మారిపోయాం. ఒక్క శుక్రుడు చనిపోయే సరికి మన ధైర్యం–వీర్యం–గతి– కీర్తి–సత్త్వం–తేజస్సు–పరాక్రమం–అన్నీ ఒక్కసారిగా కట్టగట్టుకుని కనుమరుగయ్యాయి. ఛీ! ఎందుకు మన బతుకులు! కులపూజ్యుడు–కులసత్తముడు–సద్గురువు–సర్వసమర్థుడు–దైత్యదానవ సంరక్షకుడు–ఒకే ఒక్కడు–మన శుక్రాచార్యుడు. ఆపదలో పడ్డప్పుడు అతణ్ణి ఆదుకోలేకపోయాం. కాపాడుకోలేకపోయాం! సరే జరిగిందేదో జరిగింది. వీరులారా! మరింక జాగు చెయ్యకండి. లేవండి! గురువర్యుని పాదపద్మాలు స్మరించండి. శత్రువీరులతో–ప్రమథగణాలతో– తెగించి పోరాడండి. మనకందరికీ సర్వసుఖప్రదాయకాలు గురువర్యుడు శుక్రాచార్యుని పాదపంకజాలు. నేనూ వాటిని ధ్యానించి ఇదిగో–నందీశ్వరుడితో సహా సకల ప్రమథులనూ ఇప్పుడే సంహరిస్తాను. ఇంద్రుడితో సహా సకలదేవ గణాలనూ వివశుల్ని చేసి మట్టుబెడతాను. ఒక యోగీశ్వరుడు జీవాత్మను కర్మపాశబంధాల నుంచి విముక్తం చేసినట్టుగా నేను మన శుక్రుణ్ణి విముక్తుణ్ణి చేస్తాను. నిజానికి మన గురువే ఒక మహాయోగి. సమర్థుడు. కనక శివుడి గర్భకోశం నుంచి తానే స్వయంగా బయటికి వచ్చేశాడో మరీ మంచిది. అందరినీ కాపాడినవాడవుతాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యంధకవచః శ్రుత్వా దానవా మేఘనిస్స్వనాః ।
ప్రమథాన్ నిర్దయాః ప్రాహుర్మర్తవ్యే కృతనిశ్చయాః ॥15॥

సత్యాయుషి న నో జాతు శక్తాః స్యుః ప్రమథా బలాత్ ।
అసత్యాయుషి కిం గత్వా త్యక్త్వా స్వామినమాహవే ॥16॥

యే స్వామినం విహాయాతో బహుమానధనా జనాః ।
యాంతి తే యాంతి నియతమంధతామిస్రమాలయమ్ ॥17॥

అయశస్తమసా ఖ్యాతిం మలినీకృత్య భూరిశః ।
ఇహాముత్రాపి సుఖినో న స్యుర్భగ్నా రణాజిరే ॥18॥

కిం దానైః కిం తపోభిశ్చ కిం తీర్థపరిమజ్జనైః ।
ధారాతీర్థే యది స్నానం పునర్భవమలాపహే ॥19॥

సంప్రధార్యేతి తద్వాక్యం దైత్యాస్తే దనుజాస్తథా ।
మమంథుః ప్రమథానాజౌ గణభేరీం నినాద్య చ ॥20॥

అంధకుడి మాటలు ఆలకించిన దానవులు పెద్దపెట్టున మేఘగర్జనలు చేశారు. అసలే నిర్దయులు. చావుకి తెగించారు. ప్రమథులతో అన్నారుగదా–ఓయీ ప్రమథులారా! మాకు ఆయుర్దాయం ఉంటే మీరెంతటి బలశాలులైనా మమ్మల్ని ఏమీ చెయ్యలేరు. ఆయుర్దాయమే లేకపోతే మా ప్రభువును ఆహవరంగంలో వదిలేసి మేము పారిపోయి ఏమి ప్రయోజనం. ఆ చచ్చేదేదో ఇక్కడే చావడం మంచిది. అభిమానధనులైన వీరులు ప్రభువును ఒంటరివాణ్ణి చేసి రణరంగం నుంచి వెళ్ళిపోతే వాళ్ళు కచ్చితంగా అంధతామిస్రనరకానికే వెళ్లిపోతారు. యుద్ధభూమి నుంచి పారిపోయినవాళ్ళు తమ విఖ్యాతిని అపకీర్తితో పూర్వీగా మలినపరుచుకుంటారు. వాళ్ళకి ఇహపరాలలో ఎక్కడా ఏ సుఖమూ సంతోషమూ ఉండదు గాక ఉండదు. కదనభూమిలో కత్తుల పదునైన అంచుల పుణ్యతీర్థంలో స్నానం చేస్తే అదే పునర్జన్మల బురదనంతటినీ వదిలించేస్తుంది. వేరే దానాలూ తపస్సులూ తీర్థస్నానాలూ ఎందుకయ్యా? – ఇలా దైత్యదానవులు ఒక నిశ్చయంతో పలికి రణభేరి మోగించారు. ప్రమథుల్ని మథించారు.

తత్ర బాణాసివజ్రౌఘైః కఠినైశ్చ శిలామయైః ।
భుశుండి భిందిపాలైశ్చ శక్తిభల్లపరశ్వధైః ॥21॥

ఖట్వాంగైః పట్టిశైశ్శూలైర్లకుటైర్ముసలైరలమ్ ।
పరస్పరమభిఘ్నంతః ప్రచక్రుః కదనం మహత్ ॥22॥

కార్ముకాణాం వికృష్టానాం పతతాం చ పతత్రిణామ్ ।
భిందిపాల భుశుండీనాం క్ష్వేడితానాం రవోఽభవత్ ॥23॥

రణతూర్యనినాదైశ్చ గజానాం బహుబృంహితైః ।
హేషారవైః హయానాం చ మహాన్ కోలాహలోఽభవత్ ॥24॥

అస్తిస్వనైరవాపూరి ద్యావాభూమ్యోర్యదంతరమ్ ।
అభీరూణాం చ భీరూణాం మహారోమోద్గమోఽభవత్ ॥25॥

బాణాలు, ఖడ్గాలు, వజ్రాయుధాలు, కఠినశిలామయశస్త్రాలు భుశుండి భిందిపాలాలు, శక్తి-భల్ల-పరశ్వధాలు, ఖట్వాంగాలు, పట్టిశ-శూల-లకుట-ముసలాలు ఇలాంటి ఆయుధాలతో ఇరువాగుల వారూ చితకబాదుకుంటూ మహాకదనం సాగించారు. ఎక్కుపెట్టిన ధనుస్సుల రణగుణధ్వనులు, పడుతున్న బాణాల రివురివ్వు సవ్వడులు, భిందిపాల భుశుండుల ఘర్షణ శబ్దాలు, వీరుల హుంకారాదిక్ష్వేడితాలు- తూర్యధ్వనులు, ఏనుగుల ఘీంకారాలు గుర్రాల హేషారవాలూ-అన్నీ కలిసి మహాకోలాహలం చెలరేగింది. భూమ్యాకాశాల మధ్య భాగమంతా పిక్కటిల్లింది. ధైర్యశాలులకూ పిరికివారికీ సమానంగా తనువంతటా వెండ్రుకలు నిక్కబొడిచాయి.

గజవాజిమహారావస్ఫుటశబ్దగ్రహాణి చ ।
భగ్నధ్వజపతాకాని క్షీణప్రహరణాని చ ॥26॥

రుధిరోద్గారచిత్రాణి వ్యశ్వహస్తిరథాని చ ।
పిపాసితాని సైన్యాని ముమూర్ఛురుభయత్ర వై ॥27॥

అథ తే ప్రమథా వీరా నందిప్రభృతయస్తదా ।
బలేన జఘ్నురసురాన్ సర్వాన్ ప్రాపుర్జయం మునే ॥28॥

దృష్ట్వా సైన్యం చ ప్రమథైర్భజ్యమానమితస్తతః ।
దుద్రావ రథమాస్థాయ స్వయమేవాంధకో గణాన్ ॥29॥

ఏనుగులూ గుర్రాల అరుపులతో చెవులు చిల్లులుపడి, ధ్వజాలూ పతాకాలూ విరిగిపడి, ఆయుధాలు తరుగుపడి, నెత్తుటి వాంతులతో వెరగుపడి, రథాలూ వాహనాలూ చెదిరిపడి-ఇరువైపుల సేనలూ గొంతులు ఎండిపోయి దప్పికతో అలమటించాయి. అప్పుడు నందీశ్వరాదులైన ప్రమథవీరులు విజృంభించి మొత్తం అసురుల్ని చావబాదారు. వ్యాసమునీ! జయం పొందారు. ప్రమథుల ధాటికి తాళలేక బెదిరి చెదిరిపోతున్న తన మహాసైన్యాన్ని గమనించిన అంధకుడు స్వయంగా తానే రంగంలోకి దిగాడు. రథం అధిరోహించి దేవ-గణసైన్యాలను తరిమికొట్టాడు.

శరావారప్రయుక్తైః తైః వజ్రపాతైర్నగా ఇవ ।
ప్రమథా నేశిరే చాస్త్రైర్నిస్తోయా ఇవ తోయదాః ॥30॥

యాంతమాయాంతమాలోక్య దూరస్థం నికటస్థితమ్ ।
ప్రత్యేకం రోమసంఖ్యాభిర్వివ్యాధేషుభిరంధకః ॥31॥

దృష్ట్వా సైన్యం భజ్యమానమంధకేన బలీయసా ।
స్కందో వినాయకో నందీ సోమ నంద్యాదయః పరే ॥32॥

ప్రమథా ప్రబలా వీరాశ్శంకరస్య గణా నిజాః ।
చుక్రుధుస్సమరం చక్రుర్విచిత్రం చ మహాబలాః ॥33॥

వినాయకేన స్కందేన నందినా సోమనందినా ।
వీరేణ నైగమేయేన వైశాఖేన బలీయసా ॥34॥

ఇత్యాద్యైస్తు గణైరుగ్రైరంధకోఽప్యంధకీకృతః ।
త్రిశూల శక్తి బాణౌఘధారాసంపాతపాతిభిః ॥35॥

వజ్రాయుధాల దెబ్బలకు పర్వతాలు నిలవలేనట్టు అంధకుడి శరాఘాతాలకు ప్రమథులు తాళలేకపోయారు. రథారూఢుడై అతడు రణరంగమంతటా కలయదిరుగుతున్నాడు. క్షణంలో వచ్చి దగ్గరలో నిలుస్తున్నాడు, క్షణంలో వెళ్ళి దూరంలో నిలుస్తున్నాడు. ప్రమథులు నిశ్చేష్టులై కన్నులప్పగించి చూస్తున్నారు. వారి వారి శరీరాల మీద ఉన్న రోమాల సంఖ్యకు సరిసమానంగా ఒక్కొక్కరి పైనా బాణాలు గుప్పించి తనువుల్ని జల్లెడలు చేసేశాడు. ఇలా చెలరేగిపోతున్న ఆ బలీయుడి చేతిలో చితికిపోతున్న తమ సేనలను తిలకించి స్కందుడు వినాయకుడు–నందీశ్వరుడు–సోమనంది–మొదలైన ప్రబలప్రమథవీరులూ శివగణాలూ క్రోధంతో ఊగిపోయారు. చిత్రవిచిత్రంగా మహాసమరం సాగించారు. నైగమేయ వైశాఖాది మహావీరనాయకులూ వీరికి తోడుగా పోరాడారు. ఇలా ఉగ్రగణనాయకులు అందరూ కలిసి త్రిశూల–శక్తి–బాణాద్యాయుధాలను ధారాసంపాతంగా కురిపించి మొత్తానికి అంధకుణ్ణి అక్షరాలా అంధకుణ్ణి (గ్రుడ్డివాడిని) చేశారు.

తతః కోలాహలో జాతః ప్రమథాసురసైన్యయోః ।
తేన శబ్దేన మహతా శుక్రశ్శంభూదరే స్థితః ॥36॥

ఛిద్రాన్వేషీ భ్రమన్సోఽథ వినికేతో యథాఽనిలః ।
సప్తలోకాన్సపాతాళాన్ రుద్రదేహే వ్యలోకయత్ ॥37॥

బ్రహ్మనారాయణేంద్రాణాం సాదిత్యాప్సరసాం తథా ।
భువనాని విచిత్రాణి యుద్ధం చ ప్రమథాసురమ్ ॥38॥

స వర్షాణాం శతం కుక్షౌ భవస్య పరితో భ్రమన్ ।
న తస్య దదృశే రంధ్రం శుచే రంధ్రం ఖలో యథా ॥39॥

అప్పుడు ప్రమథాసురసైన్యాలలో మహాకోలాహలం మిన్నుముట్టింది. పరమేశ్వరుడి ఉదరకోశంలో ఉన్న శుక్రాచార్యుడు ఈ మహాకోలాహలం విన్నాడు. బయటపడే రంధ్రం కోసం అన్వేషిస్తూ గర్భకోశమంతటా–నివాసప్రదేశం లేని వాయువులా–పరిభ్రమించాడు. అలా పరిభ్రమిస్తూ శివుడి గర్భగోళంలో సప్తలోకాలనూ సప్తపాతాళాలనూ సందర్శించాడు. బ్రహ్మేంద్రోపేంద్రుల్నీ, ఆదిత్యచంద్రాదుల్నీ, అప్సరసల సమూహాల్నీ, చిత్రవిచిత్ర

భువనాలనూ, జరుగుతున్న ప్రమథాసురసంగ్రామాన్నీ తిలకించాడు. నూరుసంవత్సరాల పాటు ఇలా భవుడి కుక్షిలో పరిభ్రమించాడుగానీ, ఒక శుచిమంతుడిపట్ల ఒక దుష్టుడు ఏ లోపాన్నీ (రంధ్రం) కనుగొనలేనట్టుగానే శుక్రుడు తను బయటకు రావటానికి అనువైన ఏ రంధ్రమూ కనుక్కోలేకపోయాడు.

శాంభవేనాథ యోగేన శుక్లరూపేణ భార్గవః ।
ఇమం మంత్రవరం జప్త్వా శంభోర్జఠరపంజరాత్ ॥40॥

నిష్క్రాంతం లింగమార్గేణ ప్రణనామ తతశ్శివమ్ ।
గౌర్యా గృహీతః పుత్రార్థే తదా విఘ్నేశ్వరీకృతః ॥41॥

అథ కావ్యం వినిష్క్రాంతం శుక్రమార్గేణ భార్గవమ్ ।
దృష్ట్వోవాచ మహేశానో విహస్య కరుణానిధిః ॥42॥

వ్యాసమునీశ్వరా! శుక్రాచార్యుడు యోగవిద్యలో ఘటికుడు తెలుసుగదా! శాంభవయోగమంత్రం జపించాడు. వీర్యరూపం పొందాడు. శివుడి జఠరపంజరం నుంచి శుక్లరూపంలో శిశ్నమార్గం గుండా బయటపడ్డాడు. తత్క్షణం శివుడికి సాష్టాంగపడ్డాడు. పార్వతీదేవి పుత్రవాత్సల్యంతో లాలించింది. విఘ్నేశ్వరుడి లాగానే ఇతడూ గణపతిగా నియమితుడయ్యాడు. ఇలా తన వీర్యమార్గంనుంచి బయటకు వచ్చిన ఆ భృగువంశ సంజాతుణ్ణి చూసి దయానిధి మహేశానుడు పెద్దగా నవ్వి ఇలా పలికాడు.

మహేశ్వర ఉవాచ – మహేశుడు అన్నాడు.

శుక్రవన్నిస్సృతో యస్మాల్లింగాన్మే భృగునందన ।
కర్మణా తేన శుక్రస్త్వం మమ పుత్రోఽసి గమ్యతామ్ ॥43॥

ఇత్యేవముక్తో దేవేన శుక్రోఽర్క సదృశద్యుతిః ।
ప్రణనామ శివం భూయస్తుష్టావ విహితాంజలిః ॥44॥

ఓయీ! భృగునందనా! శుక్లం లాగా నా లింగం నుంచి జారిపడ్డావు. కాబట్టి ఇప్పటి నుంచీ నీ పేరు శుక్రుడు. నా పుత్రుడివి. వెళ్ళిరా! శివుడిలా అనుగ్రహించగానే సూర్యతేజస్సుతో ప్రకాశిస్తున్న శుక్రుడు శివుడికి మళ్ళీ మళ్ళీ నమస్కరించి అంజలిబంధంతో నిలిచి ఇలా స్తుతించాడు.

శుక్ర ఉవాచ – శుక్రుడు స్తుతించాడు.

అనంతపాదస్త్వమనంతమూర్తిరనంతమూర్ధాంతకరశ్శివశ్చ ।
అనంతబాహుః కథమీదృశం త్వాం స్తోష్యేహ నుత్యం ప్రణిపత్య మూర్ధ్నా ॥45॥

త్వమష్టమూర్తిస్త్వమనంతమూర్తిస్త్వమిష్టదస్సర్వసురాసురాణామ్ ।
అనిష్టదృష్టశ్చ విమర్దకశ్చ స్తోష్యేఽహ నుత్యం కథమీదృశం త్వామ్ ॥46॥

దేవా! నువ్వు అనంతపాదుడివి. అనంతమూర్తివి. అనంతశిరస్కుడివి. అంతకరుడివీ నువ్వే! శివంకరుడివీ నువ్వే! అనంతబాహుడివి. ఇటువంటి స్తుతింపదగిన నిన్ను–శిరసా నమస్కరించి–నేనెలా నుతించగలను! నువ్వు అష్టమూర్తివి. సకల సురాసురులకూ ఇష్టవాంఛాప్రదుడివి. పుణ్యాత్ములకే కనిపిస్తావు(అరిష్టతాతి). అనిష్టాలను మర్దిస్తావు. ఇటువంటి నిన్ను నేనెలా నుతించగలను!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి స్తుత్వా శివం శుక్రః పునర్నత్వా శివాజ్ఞయా ।
వివేశ దానవానీకం మేఘమాలాం యథా శశీ ॥47॥

నిగీర్ణనమితిప్రోక్తం శంకరేణ కవేః రణే ।
శృణు మంత్రం చ తం జప్తో యశ్శంభోః కవినోదరే ॥48॥

వ్యాసమునీ! శుక్రాచార్యుడు శివుణ్ణి ఇలా నుతించి మళ్ళీ నమస్కరించి శివాజ్ఞ పొంది దానవసైన్యంలోకి ప్రవేశించాడు–కారుమబ్బులలోకి చందమామలాగా. సరే! రణరంగంలో శుక్రుణ్ణి శంకరుడు మింగేశాడు అని నేను క్లుప్తంగా చెప్పినది ఇది. ఇంతకీ–శివుడి ఉదరకోశంలో తానుండి కవీంద్రుడు జపించిన మంత్రం ఏమిటో తెలియజేస్తాను. శ్రద్ధగా విను.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే శుక్రనిగీర్ణనం నామాష్టచత్వారింశోఽధ్యాయః ॥48॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు శుక్రనిగీర్ణనం అనే నలబై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

ఏకోనపంచాశత్తమోఽధ్యాయః – నలభై తొమ్మిదవ అధ్యాయం

అంధకగణజీవితప్రాప్తివర్ణనమ్ – అంధకగణజీవితప్రాప్తివర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఓం నమస్తే దేవేశాయ సురాసురనమస్కృతాయ భూతభవ్యమహాదేవాయ హరితపింగలలోచనాయ బలాయ బుద్ధిరూపిణే వైయాఘ్రవసనచ్ఛదాయారణేయాయ త్రైలోక్యప్రభవే ఈశ్వరాయ హరాయ హరితనేత్రాయ యుగాంతకరణాయానలాయ గణేశాయ లోకపాలాయ మహాభుజాయ మహాహస్తాయ శూలినే మహాదంష్ట్రిణే కాలాయ మహేశ్వరాయ అవ్యయాయ కాలరూపిణే నీలగ్రీవాయ మహోదరాయ గణాధ్యక్షాయ సర్వాత్మనే సర్వభావనాయ సర్వగాయ మృత్యుహంత్రే పారియాత్రసుప్రతాయ బ్రహ్మచారిణే వేదాంతగాయ తపోఽంతగాయ పశుపతయే వ్యంగాయ శూలపాణయే వృషకేతవే హరయే జటినే శిఖండినే లకుటినే మహాయశసే భూతేశ్వరాయ గుహావాసినే వీణా-పణవ-తాళవతే అమరాయ దర్శనీయాయ బాలసూర్యనిభాయ శ్మశానవాసినే భగవతే ఉమాపతయే అరిందమాయ భగస్యాక్షిపాతినే పూష్ణోర్దశననాశనాయ క్రూరకర్తకాయ పాశహస్తాయ ప్రలయకాలాయ ఉల్కాముఖాయ అగ్నికేతవే మునయే దీప్తాయ విశాంపతయే ఉన్నతయే జనకాయ చతుర్థకాయ లోకసత్తమాయ వామదేవాయ వాగ్దాక్షిణ్యాయ వామతో భిక్షవే భిక్షురూపిణే జటినే స్వయం జటిలాయ శక్రహస్తప్రతిస్తంభకాయ వసూనాం స్తంభాయ క్రతవే క్రతుకరాయ కాలాయ మేధావినే మధుకరాయ చలాయ వానస్పత్యాయ వాజసనేతి సమాశ్రమపూజితాయ జగద్ధాత్రే జగత్కర్త్రే పురుషాయ శాశ్వతాయ ధ్రువాయ ధర్మాధ్యక్షాయ త్రివర్త్మనే భూతభావనాయ త్రినేత్రాయ బహురూపాయ సూర్యాయుతసమప్రభాయ దేవాయ సర్వతూర్యనినాదినే సర్వబాధా విమోచనాయ బంధనాయ సర్వధారిణే ధర్మోత్తమాయ పుష్పదంతాయాపి భాగాయ సుఖాయ సర్వహరాయ హిరణ్యశ్మశ్రవసే ద్వారిణే భీమాయ భీమపరాక్రమాయ ఓం నమో నమః ॥

ఓం నమో దేవేశా! సురాసురనమస్కృతా! భూతభవ్యమహాదేవా! హరితపింగళలోచనా! బలా! బుద్ధిరూపీ! పులితోలు వస్త్రంగా ధరించేవాడా! అరణీ సంభవా! ముల్లోకాలకూ అధిపతీ! ఈశ్వరా! హరా! హరితనేత్రా! యుగాంతకా! అగ్నీ! గణేశా! లోకపాలకా! మహాభుజా! మహాహస్తా! త్రిశూలధారీ! మహాదంష్ట్రా! మహాకాలా! మహేశ్వరా! అవ్యయా! కాలస్వరూపా! నీలకంఠా! మహోదరా! గణాధ్యక్షా! సర్వాత్మకా! సర్వభావనా! సర్వగా! మృత్యుహంతా! పారియాత్ర పర్వతం మీద (వింధ్యాద్రి) వ్రతదీక్ష వహించినవాడా! బ్రహ్మచారీ! వేదాంతగమ్యా! తపోఽంతగమ్యా! పశుపతీ! అంగరహితా! శూలపాణీ! వృషభధ్వజా! హరీ! జటాధారీ! శిఖండీ! లకుటాయుధధారీ! మహాయశస్వీ! భూతేశ్వరా! గుహావాసీ! వీణా-పణవ-తాళరూపా! అమరా! దర్శనీయా! బాలభానుసన్నిభా! శ్మశానవాసీ! భగవన్! ఉమాపతీ! అరిమర్దనా! భగుడి కన్నులు రాల్చినవాడా! సూర్యచంద్రులకు పన్నులు రాలగొట్టినవాడా! క్రూరులను కత్తిరించేవాడా! పాశహస్తా! ప్రళయకాలుడా! ఉల్కాముఖుడా! అగ్నికేతూ! మునీ! దీప్తా! విశాంపతీ! ఉన్నతిరూపా! జనకా! చతుర్థకా! లోకసత్తమా! వామదేవా! వాగ్దాక్షిణ్యా! వామతోభిక్షూ! భిక్షురూపా! జటీ! స్వయంజటిలా! ఇంద్రుడి చేతులు స్తంభింపజేసినవాడా! వసువుల్ని స్తంభింపజేసినవాడా! క్రతురూపా! క్రతుకర్తా! మహాకాలా! మేధావీ! మధుకరా!

చలా! వానస్పత్యా! వాజసనా–అని సమస్తాశ్రమవాసిపూజితా! జగద్ధాతా! జగత్త్రాతా! జగత్కర్తా! పురుషా! శాశ్వతా! ధ్రువా! ధర్మాధ్యక్షా! త్రిపథస్వరూపా! భూతభావనా! త్రినేత్రా! బహురూపా! అయుతసూర్యసమానకాంతీ! దేవా! సమస్తవాద్యాలనూ మోగించేవాడా! సర్వబాధానివారకా! బంధనస్వరూపా! సర్వధారీ! ధర్మోత్తమా! పుష్పదంతా! భాగరూపా! సుఖరూపా! సర్వహరా! హిరణ్యశ్రవా! (బంగారు చెవుల వాడా!) ద్వారాధిదేవతా! భీమరూపా! భీమపరాక్రమా! నీకిదే నమో నమః–నమో నమః.

ఇమం మంత్రవరం జప్త్వా శుక్రో జఠరపంజరాత్ ।
నిష్క్రాంతో లింగమార్గేణ శంభోశ్శుక్రమివోత్కటమ్ ॥1॥

గౌర్యా గృహీతః పుత్రార్థం విశ్వేశేన తతఃకృతః ।
అజరశ్చామరః శ్రీమాన్ ద్వితీయ ఇవ శంకరః ॥2॥

త్రిభిర్వర్షసహస్రైస్తు సమతీతైర్మహీతలే ।
మహేశ్వరాత్పునర్జాతః శుక్రో వేదనిధిర్మునిః ॥3॥

దదర్శ శూలే సంశుష్కం ధ్యాయంతం పరమేశ్వరమ్ ।
అంధకం ధైర్యసంపన్నం దానవేశం తపస్వినమ్ ॥4॥

ఈ ఉత్తమోత్తమమంత్రాన్ని (స్తోత్రాన్ని) జపించి శుక్రాచార్యుడు శివుడి జఠరపంజరం నుంచి లింగమార్గంలో శుక్లరూపాన వెలువడ్డాడు. పార్వతీదేవి అతణ్ణి పుత్రుడిగా స్వీకరించింది. అటుపైని విశ్వేశ్వరుడూ స్వీకరించాడు. అప్పుడా శుక్రుడు అజరామరుడయిన మరో శంకరుడా! అన్నట్టు ప్రకాశించాడు. మూడు వేల సంవత్సరాలు శివుడి గర్భవాసం చేసి ఆ వేదనిధి, ఆ మునీశ్వరుడు శుక్రుడు ఇలా మళ్ళీ భూమిమీద పడ్డాడు. మహేశ్వరుడి కొడుకుగా జన్మించాడు. అటుపైని శివుడి శూలాగ్రభాగంలో వేలాడుతూ ఎండకు ఎండి వానకు తడిసి శుష్కించిపోయినా ధైర్యంవీడని దానవేశ్వరుడిని మహాతపస్విని అంధకుడిని చూశాడు. అలా శూలాగ్రాన నిలిచి అంధకాసురుడు నిశ్చలభక్తితో శివుడిని ధ్యానిస్తున్నాడు.

మహాదేవం విరూపాక్షం చంద్రార్ధకృతశేఖరమ్ ।
అమృతం శాశ్వతం స్థాణుం నీలకంఠం పినాకినమ్ ॥5॥

వృషభాక్షం మహాజ్ఞేయం పురుషం సర్వకామదమ్ ।
కామారిం కామదహనం కామరూపం కపర్దినమ్ ॥6॥

విరూపం గిరిశం భీమం స్రగ్వినం రక్తవాససమ్ ।
యోగినం కాలదహనం త్రిపురఘ్నం కపాలినమ్ ॥7॥

గూఢవ్రతం గుప్తమంత్రం గంభీరం భావగోచరమ్ ।
అణిమాదిగుణాధారం త్రిలోక్యైశ్వర్యదాయకమ్ ॥8॥

వీరం వీరహణం ఘోరం విరూపం మాంసలం పటుమ్ ।
మహామాంసాదమున్మత్తం భైరవం వై మహేశ్వరమ్ ॥9॥

త్రైలోక్యద్రావణం లుబ్ధం లుబ్ధకం యజ్ఞసూదనమ్ ।
కృత్తికానాం సుతైర్యుక్తమున్మత్తం కృత్తివాససమ్ ॥10॥

గజకృత్తిపరీధానం క్షుబ్ధం భుజగభూషణమ్ ।
దద్యాలంబం చ వేతాలం ఘోరం శాకినిపూజితమ్ ॥11॥

అఘోరం ఘోరదైత్యఘ్నం ఘోరఘోషం వనస్పతిమ్ ।
భస్మాంగం జటిలం శుద్ధం భేరుండశతసేవితమ్ ॥12॥

భూతేశ్వరం భూతనాథం పంచభూతాశ్రితం ఖగమ్ ।
క్రోధితం నిష్కరం చండం చండీశం చండికాప్రియమ్ ॥13॥

చండం తుంగం గరుత్మంతం నిత్యమాసవభోజనమ్ ।
లేలిహానం మహారౌద్రం మృత్యుం మృత్యోరగోచరమ్ ॥14॥

మృత్యోర్మృత్యుం మహాసేనం శ్మశానారణ్యవాసినమ్ ।
రాగం విరాగం రాగాంధం వీతరాగశతాచితమ్ ॥15॥

సత్త్వం రజస్తమో ధర్మమధర్మం వాసవానుజమ్ ।
సత్యం త్వసత్యం సద్రూపమసద్రూపమహేతుకమ్ ॥16॥

అర్ధనారీశ్వరం భానుం భానుకోటిశతప్రభమ్ ।
యజ్ఞం యజ్ఞపతిం రుద్రమీశానం వరదం శివమ్ ॥17॥

అష్టోత్తరశతం హ్యేతత్ మూర్తీనాం పరమాత్మనః ।
శివస్య దానవో ధ్యాయన్ ముక్తస్తస్మాన్మహాభయాత్ ॥18॥

దివ్యేనామృతవర్షేణ సోఽభిషిక్తః కపర్దినా ।
తుష్టేన మోచితం తస్మాత్ శూలాగ్రాదవరోపితః ॥19॥

ఉక్తశ్చాథ మహాదైత్యో మహేశానేన సోఽంధకః ।
అసురస్సాంత్వపూర్వం యత్కృతం సర్వం మహాత్మనా ॥20॥

మహాదేవా! విరూపాక్షా! చంద్రకళాధరా! అమృతా! శాశ్వతా! స్థాణూ! నీలకంఠా! పినాకీ! నిన్నిదే ధ్యానిస్తున్నాను. వృషభాక్షా! మహాజ్ఞేయా! పురుషా! సర్వకామదా! కామారీ! కామదహనా! కామరూపా! కపర్దీ! నిన్నిదే జపిస్తున్నాను. విరూపా! గిరిశా! భీమా! స్రగ్వీ! రక్తాంబరధరా! యోగీ! కాలదహనా! త్రిపురసంహారకా! కపాలధారీ! నీకిదే అభివందనం. గూఢవ్రతా! గుప్తమంత్రా! గంభీరా! భావగోచరా! అణిమాదిగుణాధరా! త్రిలోక్యైశ్వర్యదాయకా! నిన్నిదే మనసా

స్మరిస్తున్నాను. వీరా! వీరహణా! ఘోరా! విరూపా! మాంసలా! పటూ! మహామాంసాదా! ఉన్మత్తా! భైరవా! మహేశ్వరా! నిన్ను తలపోస్తున్నాను. త్రైలోక్యద్రావణా! లుబ్ధా! లుబ్ధకా! యజ్ఞసూదనా! కృత్తికాసుతసంయుక్తా! ఉన్మత్తా! కృత్తివాససా! గజకృత్తిపరీధానా! క్షుబ్ధా! భుజగభూషణా! ఆలంబదాయకా! బేతాళా! ఘోరా! శాకినీపూజితా! నిన్నిదే స్మరిస్తున్నాను. అఘోరా! ఘోరదైత్యసంహారకా! ఘోరఘోషా! వనస్పతీ! భస్మాంగా! జటిలా! శుద్ధా! భేరుండశతసేవితా! నిన్నిదే ధ్యానిస్తున్నాను. భూతేశ్వరా! భూతనాథా! పంచభూతాశ్రితా! ఖగా! క్రోధితా! నిష్కరా! చండా! చండీశా! చండికాప్రియా! నీ నామం జపిస్తున్నాను. చండా! తుంగా! గరుత్మంతా! నిత్యం ఆసవభోజనా! లేలిహానా! మహారౌద్రా! మృత్యూ! మృత్యువుకే అగోచరా! మృత్యువుకే మృత్యువా! మహాసేనా! శ్మశానారణ్యవాసీ! రాగా! విరాగా! రాగాంధా! వీతరాగశతాచితా! నిన్ను నిరంతరం ధ్యానిస్తున్నాను. సత్త్వగుణా! రజోగుణా! తమోగుణా! ధర్మా! అధర్మా! వాసవానుజా! సత్యా! అసత్యా! సద్రూపా! అసద్రూపా! అహేతుకా! నిన్నిదే జపిస్తున్నాను. అర్ధనారీశ్వరా! భానూ! భానుకోటిశతప్రభా! యజ్ఞా! యజ్ఞపతీ! రుద్రా! ఈశానా! వీరదా! శివా! నిన్ను నమస్కరిస్తున్నాను. ఇలా అష్టోత్తరశతనామాలతో రూపాలతో మహేశ్వరుణ్ణి ఆ మహాదైత్యుడు ధ్యానించి మృత్యుభయవిముక్తుడయ్యాడు, సమస్తబాధానిర్ముక్తుడయ్యాడు. సంతుష్టి చెందిన పరమేశ్వరుడు అతడిపై అమృతవృష్టి కురిపించాడు. శూలాగ్రంనుంచి కిందికి దించాడు. అటుపైని బుజ్జగింపుగా మహేశానుడు ఆ మహాదానవుడితో సంభాషించాడు.

శివ ఉవాచ – శివుడు అన్నాడు.

భో భో దైత్యేంద్ర తుష్టోఽస్మి దమేన నియమేన చ ।
శౌర్యేణ తవ ధైర్యేణ వరం వరయ సువ్రత ॥21॥

ఆరాధితస్త్వయా నిత్యం సర్వనిర్ధూతకల్మషః ।
వరదోఽహం వరదార్హస్త్వం మహాదైత్యేంద్రసత్తమ ॥22॥

ప్రాణ సంధారణాదస్తి యచ్చ పుణ్యఫలం తవ ।
త్రిభిర్వర్షసహస్రైస్తు తేనాస్తు తవ నిర్వృతిః ॥23॥

ఓయీ దైత్యేంద్రా! సువ్రతా! నీ నియమం నిగ్రహం, నీ శౌర్యం ధైర్యం, వీటికి నేను చాలా సంతృప్తి చెందాను. ఏదైనా వరం కోరుకో, ఇస్తాను. దైత్యేంద్రసత్తమా! నేను సకల పాపాలనూ పోగొట్టగలవాణ్ణి, వరదుణ్ణి. నన్ను నిరంతరంగా ఆరాధించావు. కనక నువ్వు వరదానానికి అర్హుడివి. మూడు వేల సంవత్సరాలు ప్రాణాలు నిలుపుకున్నావు. అందువల్ల లభించిన పుణ్యఫలం నీకు నిర్వృతిని–సకల పాప విముక్తినీ ఆనందాన్నీ కలిగించుగాక!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏతచ్ఛ్రుత్వాంధకః ప్రాహ వేపమానః కృతాంజలిః ।
భూమౌ జానుద్వయం కృత్వా భగవంతముమాపతిమ్ ॥24॥

ఈ మాటలు విన్న అంధకుడు ఓపిక కూడదీసుకుని మోకాళ్ళను నేలమీద ఆన్చి కూర్చుని వణికిపోతూ దోసిలొగ్గి నమస్కరిస్తూ ఇలా పలికాడు.

అంధక ఉవాచ – అంధకుడు అభ్యర్థించాడు.

భగవన్ యన్మయోక్తోఽసి దీనోఽదీనః పరాత్పరః ।
హర్షగద్గదయా వాచా మయా పూర్వం రణాజిరే ॥25॥

యద్యత్కృతం విమూఢత్వాత్ కర్మ లోకేషు గర్హితమ్ ।
అజానతా త్వాం తత్సర్వం ప్రభో మనసి మా కృథాః ॥26॥

పార్వత్యామపి దుష్టం యత్కామదోషాత్ కృతం మయా ।
క్షమ్యతాం మే మహాదేవ కృపణో దుఃఖితో భృశమ్ ॥27॥

దుఃఖితస్య దయా కార్యా కృపణస్య విశేషతః ।
దీనస్య భక్తియుక్తస్య భవతా నిత్యమేవ హి ॥28॥

ఓ భగవానుడా! పరాత్పరా! ఇంతకు పూర్వం రణరంగంలో హర్షగద్గదస్వరంతో ఏదేదో అన్నాను. దీనుడివైన నిన్ను అదీనుడవని అన్నాను. ప్రభూ! మూఢుణ్ణి, అజ్ఞానిని. లోకగర్హితమైన కర్మలెన్నో చేసినవాణ్ణి. అవన్నీ మనసులో పెట్టుకోకు. పార్వతీమాత పట్ల కూడా కామాంధకారంతో దుశ్చింతనలు చేశాను. మహాదేవా! ఇప్పుడు చాలా దుఃఖిస్తున్నాను. నిస్సహాయుణ్ణి. నన్ను క్షమించు. దుఃఖితుణ్ణి దయజూడమన్నారు. నిస్సహాయుణ్ణి మరీను. ఇప్పుడు నేను దీనుణ్ణి. అయితే నీపట్ల నిరంతరం భక్తియుక్తుణ్ణి. కరుణించి దయ చూపించు!

సోఽహం దీనో భక్తియుక్త ఆగతశ్శరణం తవ ।
రక్షా మయి విధాతవ్యా రచితోఽయం మయాంజలిః ॥29॥

ఇయం దేవీ జగన్మాతా పరితుష్టా మమోపరి ।
క్రోధం విహాయ సకలం ప్రసన్నా మాం నిరీక్షతామ్ ॥30॥

క్వాస్యాః క్రోధః క్వ కృపణో దైత్యోఽహం చంద్రశేఖర ।
తత్సోఢా నాహమర్దేందుచూడ శంభో మహేశ్వర ॥31॥

క్వ భవాన్ పరమోదారః క్వ చాహం వివశీకృతః ।
కామక్రోధాదిభిర్దోషైః జరసా మృత్యునా తథా ॥32॥

అప్పటి నేనే ఇప్పటి దీనుణ్ణి. కానీ నీ మీద ఎప్పుడూ భక్తి కలవాణ్ణి. నిన్ను శరణు కోరినవాడను. ఇదే నమస్కరిస్తున్నాను. నన్ను రక్షించు! ఈ పార్వతీదేవి–సాక్షాత్తూ జగన్మాత! నామీద కోపం వదిలిపెట్టి సంతుష్టురాలై ప్రసన్నవీక్షణాలతో నన్ను కటాక్షించుగాక! చంద్రశేఖరా! ఆ తల్లి క్రోధం ఎక్కడా! దయనీయుణ్ణి దైత్యుణ్ణీ నేనెక్కడా! తాళగలనా! అర్ధేందుచూడా! శంభో! మహాదేవా! తాళలేను. మహేశ్వరా! నువ్వు పరమోదారుడివి. దయామయుడివి. నేనేమో కామక్రోధాదిదోషాలకూ ముసలితనం, మరణములకూ బందీ అయినవాణ్ణి.

అయం తే వీరకః పుత్రో యుద్ధశౌండో మహాబలః ।
కృపణం మాం సమాలక్ష్య మా మన్యువశమన్వగాః ॥33॥

తుషారహారశీతాంశు శంఖకుందేందు వర్ణభాక్ ।
పశ్యేయం పార్వతీం నిత్యం మాతరం గురుగౌరవాత్ ॥34॥

నిత్యం భవద్భ్యాం భక్తస్తు నిర్వైరో దైవతైస్సహ ।
నివసేయం గణైస్సార్ధం శాంతాత్మా యోగచింతకః ॥35॥

మా స్మరేయం పునర్జాతం విరుద్ధం దానవోద్భవమ్ ।
త్వత్కృపాతో మహేశాన దేహ్యేతద్వరముత్తమమ్ ॥36॥

పరంధామా! నీ పుత్రుడు ఈ వీరకుడు–మహాబలుడు, యుద్ధశౌండుడు. దయనీయుణ్ణి నన్ను చూసి క్రోధవివశుడు కాకుండుగాక! మంచులాగా హారంలాగా వెన్నెలలాగా శంఖంలాగా మల్లెపువ్వులాగా తెల్లని సామీ! మాతృమూర్తి పార్వతీ దేవి పట్ల నిత్యమూ గౌరవభావన వహింతునుగాక! దేవతలతో వైరం విడిచిపెట్టి మీ ఇద్దరికీ పరమభక్తుణ్ణై మనశ్శాంతితో యోగసాధనతో నీ ప్రమథగణాలతో కలిసిమెలసి నివసింతునుగాక! మహేశ్వరా! నా రక్కసిపుట్టువునూ అధర్మప్రవృత్తినీ మరింక ఏనాడూ నాకు గర్తురాకుండుగాక! దయచేసి ఈ ఉత్తమోత్తమ వరం నాకు ప్రసాదించు!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏతావదుక్త్వా వచనం దైత్యేంద్రో మౌనమాస్థితః ।
ధ్యాయంస్త్రిలోచనం దేవం పార్వతీం ప్రేక్ష్య మాతరమ్ ॥37॥

తతో దృష్టస్తు రుద్రేణ ప్రసన్నేనైవ చక్షుషా ।
స్మృతవాన్ పూర్వవృత్తాంతమాత్మనో జన్మ చాద్భుతమ్ ॥38॥

తస్మిన్ స్మృతే చ వృత్తాంతే తతః పూర్ణమనోరథః ।
ప్రణమ్య మాతాపితరౌ కృతకృత్యో ఽభవత్తతః ॥39॥

పార్వత్యా మూర్ధ్న్యుపాఘ్రాతశ్శంకరేణ చ ధీమతా ।
తథాఽభిలషితం లేభే తుష్టాద్బాలేందుశేఖరాత్ ॥40॥

ఏతద్వస్సర్వమాఖ్యాతమంధకస్య పురాతనమ్ ।
గాణపత్యం మహాదేవప్రసాదాత్పరసౌఖ్యదమ్ ॥41॥

మృత్యుంజయశ్చ కథితో మంత్రో మృత్యువినాశనః ।
పఠితవ్యః ప్రయత్నేన సర్వకామఫలప్రదః ॥42॥

వ్యాసమునీ! అంధకాసురుడు ఓపిక తెచ్చుకుని ఇంతమాత్రం పలికి మిన్నకున్నాడు. త్రిలోచనుణ్ణి ధ్యానిస్తూ పార్వతీదేవిని దర్శిస్తూ అలాగే ఉండిపోయాడు. అప్పుడు రుద్రుడు ప్రసన్నవీక్షణాలతో అతన్ని తిలకించాడు. అంధకుడికి తన పూర్వవృత్తాంతమూ తన పూర్వజన్మవిశేషమూ అద్భుతంగా స్మృతిపథాన కదలాడాయి. వెంటనే

జగత్పితరులైన పార్వతీపరమేశ్వరులకు సాగిలి మ్రొక్కి కృతకృత్యుడయ్యాడు. పూర్ణమనోరథుడయ్యాడు. అప్పుడు పార్వతీదేవి అతణ్ణి శిరస్సుపై ముద్దాడింది. ధీశాలి శంకరుడూ ముద్దాడాడు. ఆనందపరవశుడౌతున్న ఆ అర్ధేందుశేఖరుడి నుంచి–తాను కోరింది పొందాడు అంధకుడు. వ్యాసా! అతిపురాతనమైన ఈ అంధకుడి వృత్తాంతం సమస్తం నీకు వివరించాను. అతడు మహాదేవుడి వరప్రసాదంగా గాణపత్యం పొందిన తీరూ వినిపించాను. ఈ గాథ పరసౌఖ్యప్రదం. దీనితో పాటుగా మృత్యువినాశకమైన మృత్యుంజయమంత్రం కూడా నీకు తెలియపరిచాను. ఈ మంత్రం అన్ని కోర్కెలను తీరుస్తుంది. దీన్ని ప్రత్యేకంగా శ్రద్ధాభక్తులతో పఠించాలి సుమా!

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే అంధకగణజీవిత ప్రాప్తివర్ణనం నామ ఏకోనపంచాశత్తమోఽధ్యాయః ।।49।।

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు అంధక గణజీవితప్రాప్తివర్ణనం అనే నలబై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

పంచాశత్తమోఽధ్యాయః – యాభైయవ అధ్యాయం

మృతసంజీవనీ విద్యాప్రాప్తివర్ణనమ్ – మృతసంజీవనీ విద్యాప్రాప్తివర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాస యథా ప్రాప్తా మృత్యుప్రశమనీ పరా ।
విద్యా కావ్యేన మునినా శివాన్మృత్యుంజయాభిధాత్ ॥1॥

పురాసౌ భృగుదాయాదో గత్వా వారాణసీం పురీమ్ ।
బహుకాలం తపస్తేపే ధ్యాయన్ విశ్వేశ్వరం ప్రభుమ్ ॥2॥

స్థాపయామాస తత్రైవ లింగం శంభోః పరాత్మనః ।
కూపం చకార సద్రవ్యం వేదవ్యాస తదగ్రతః ॥3॥

పంచామృతైర్ద్రోణమితైర్లక్షకృత్వః ప్రయత్నతః ।
స్నాపయామాస దేవేశం సుగంధస్నపనైర్బహు ॥4॥

సహస్రకృత్వో దేవేశం చందనైర్యక్షకర్దమైః ।
సమాలిలింప సుప్రీత్యా సుగంధోద్వర్తనాన్యను ॥5॥

వ్యాసమునీ! మృత్యుంజయుడైన శివుడి నుంచి ఈ మృతసంజీవనీవిద్యను శుక్రుడు ఎలా సంపాదించాడో చెబుతాను ఆలకించు. ఒకానొకప్పుడు ఈ భృగువంశసంభవుడు శుక్రాచార్యుడు వారణాసి వెళ్ళి విశ్వేశ్వరుణ్ణి ధ్యానిస్తూ బహుకాలం తపస్సు చేశాడు. అక్కడ ఒక ప్రదేశంలో శివలింగం స్థాపించి దానికి ఎదురుగా అందంగా గుండ్రంగా కొంచెం లోతైన గొయ్యి (–నుయ్యి–) తవ్వాడు. బానలకొద్దీ పంచామృతాలు తెచ్చి శివలింగానికి లక్షసార్లు అభిషేకించాడు. చందనాగురుసుగంధద్రవ్యాలు తెచ్చి ఒక్కొక్క దానితో వెయ్యేసిసార్లు ఉద్వర్తనలు (నలుగుపెట్టడం) జరిపాడు. అంతా భక్తితో చేశాడు. అటుపైని–

రాజచంపకధత్తూరైః కరవీరకుశేశయైః ।
మాలతీకర్ణికారైశ్చ కదంబైర్వకుళోత్పలైః ॥6॥

మల్లికాశతపత్రీభిః సింధువారైస్సకింశుకైః ।
బంధూకపుష్పైః పున్నాగైర్నాగకేశరకైశ్శరైః ॥7॥

నవమల్లీ చిబిలికైః కుందైస్సముచుకుందకైః ।
మందారైర్బిల్వపత్రైశ్చ ద్రోణైర్మరువకైః వృకైః ॥8॥

గ్రంథిపర్ణైర్దమనకైః సురమ్యైశ్చూతపల్లవైః ।
తులసీ దేవగాంధారీ బృహత్పత్రీకుశాంకురైః ॥9॥

నంద్యావర్తైరగస్త్యైశ్చ సశాలైర్దేవదారుభిః ।
కాంచనారైః కురబకైర్దూర్వాంకురకురుంటకైః ॥
ప్రత్యేకమేభిః కుసుమైః పల్లవైరపరైరపి ॥10॥

రాజచంపక, ధత్తూర, కరవీర, కుశేశయ, మాలతీ, కర్ణికార, కదంబ, వకుళ, ఉత్పల, మల్లికా, శతపత్రీ, సింధువార, కింశుక, బంధూక, పున్నాగ, నాగ, కేసరక, శర, నవమల్లీ, చిబిలిక, కుంద, ముచుకుంద, మందార, బిల్వపత్ర, ద్రోణ, మరువక, వృక, గ్రంథిపర్ణ, దమనక, సురమ్య, చూతపల్లవ, తులసీ, దేవగాంధారీ, బృహత్పత్రీ, కుశాంకుర, నంద్యావర్త, అగస్త్య, శాల, దేవదారు, కాంచనార, కురబక, దూర్వాంకుర, కురుంట–పుష్పాలతో ఒక్కొక్కరకం పువ్వులతో ఒక్కొక్కసారిగా శివలింగాన్ని పూజించారు. మరికొన్ని పల్లవాలతో పత్రపూజ కూడాచేశాడు.

పత్రైస్సహస్రపత్రైశ్చ రమ్యైర్నానావిధైశ్శుభైః ।
సావధానేన సుప్రీత్యా స సమానర్చ శంకరమ్ ॥11॥

గీతనృత్యోపహారైశ్చ సంస్తుతః స్తుతిభిర్బహు ।
నామ్నాం సహస్రైరన్యైశ్చ స్తోత్రైస్తుష్టావ శంకరమ్ ॥12॥

సహస్రం పంచశరదామిత్థం శుక్రో మహేశ్వరమ్ ।
నానాప్రకారవిధినా మహేశం స సమర్చయత్ ॥13॥

యదా దేవం నానులోకే మనాగపి వరోన్ముఖమ్ ।
తదాన్యం నియమం ఘోరం జగ్రాహాతీవ దుస్సహమ్ ॥14॥

రకరకాల శుభప్రదపత్రాలతోనూ సహస్రపత్రాలతోనూ సావధానచిత్తుడై భక్తితో శంకరుణ్ణి అర్చించాడు. గీతనృత్యోపహారాలతో స్తుతులతో సహస్రనామపారాయణలతో ఇంకా అనేక స్తోత్రాలతో శంకరుణ్ణి ఉపాసించాడు, స్తుతించాడు. ఇలా అయిదువేల సంవత్సరాలు శివార్చన ఏకాగ్రచిత్తుడై సాగించాడు భార్గవుడు. ఎన్ని రకాల పూజావిధానాలున్నాయో అన్నిరకాలుగానూ అర్చించాడు. కానీ మహాదేవుడు కాసింతైనా కరుణించలేదు. దర్శనం అనుగ్రహించలేదు. వరాలు అందించలేదు. అప్పుడా కవీంద్రుడు అత్యంతదుస్సహమూ అత్యంతఘోరమూ అయిన తపోనియమం స్వీకరించాడు.

ప్రక్షాల్య చేతసోఽత్యంతం చాంచల్యాఖ్యం మహామలమ్ ।
భావనావార్భిరసకృత్ ఇంద్రియైస్సహితస్య చ ॥15॥

నిర్మూలీకృత్య తచ్చేతోరత్నం దత్త్వా పినాకినే ।
ప్రయయౌ కణధూమౌఘం సహస్రం శరదాం కవిః ॥16॥

కావ్యమిత్థం తపోఘోరం కుర్వంతం దృఢమానసమ్ ।
ప్రససాద స తం వీక్ష్య భార్గవాయ మహేశ్వరః ॥17॥

తస్మాల్లింగాద్వినిర్గత్య సహస్రార్కాధికద్యుతిః ।
ఉవాచ తం విరూపాక్షస్సాక్షాద్దాక్షాయణీ పతిః ॥18॥

దశేంద్రియ బలాన్వితమైన మనస్సుకి ఉన్న చాంచల్యమనే చిక్కని బురదని భక్తిభావన అనే మంచినీటితో పూర్తిగా కడిగేశాడు. ఇప్పుడు నిర్మలినమైన అంతరంగం అనే అనర్ఘరత్నాన్ని పినాకికి సమర్పించాడు. తన చుట్టూ కణధూమం రగిలించాడు. అందులో ప్రవేశించాడు. దృఢచిత్తంతో వెయ్యేళ్ళు ఘోరతపస్సు చేశాడు. మహేశ్వరుడు గమనించాడు. ఎట్టకేలకు ప్రసన్నుడయ్యాడు. సహస్రసూర్యకాంతితో లింగం నుంచి వెలువడ్డాడు. వెలువడి, ఆ విరూపాక్షుడు ఆ దాక్షాయనీ వల్లభుడు శుక్రాచార్యుడితో ఇలా అన్నాడు.

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు అన్నాడు.

తపోనిధే మహాభాగ భృగుపుత్ర మహామునే ।
తపసానేన తే నిత్యం ప్రసన్నో ఽహం విశేషతః ॥19॥

మనోభిలషితం సర్వం వరం వరయ భార్గవ ।
ప్రీత్యా దాస్యేఽఖిలాన్ కామాన్ నాదేయం విద్యతే తవ ॥20॥

తపోనిధీ! మహాభాగా! భృగుపుత్రా! మహామునీ! ఈ నీ తపస్సుతో నేను ఎంతో ప్రసన్నుణ్ణి అయ్యాను. అంచేత నీ మనస్సుకోరుకుంటున్న వరం ఏదైనా సరే అడుగు, ఇస్తాను. ప్రీతితో ఇస్తాను. ఒకటేమిటి–ఎన్ని కోరికలైనా తీరుస్తాను. నీకు ఇవ్వరానిది అంటూ నాకేదీ అస్సలు కనిపించడం లేదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

నిశమ్యేతి వచశ్శంభోః మహాసుఖకరం వరమ్ ।
స బభూవ కవిస్తుష్టో నిమగ్నస్సుఖవారిధే ॥21॥

ఉద్యదానందసందోహరోమాంచాంచితవిగ్రహః ।
ప్రణనామ ముదా శంభుమంభోజనయనో ద్విజః ॥22॥

తుష్టావాష్టతనుం తుష్టః ప్రఫుల్లనయనాంచలః ।
మౌళావంజలిమాధాయ వదన్ జయ జయేతి చ ॥23॥

మనస్సుకి హాయినిగొల్పే ఈ మంచి మాటను శివుడి నోట విన్న కవీంద్రుడు ఆనందవారిధిలో మునిగి పోయాడు. సంతుష్టి చెందాడు. ఆనందసందోహం పెల్లుబికింది. తనువంతా పులకాంకురాలు మోసులెత్తాయి. నయనాలు పద్మాల్లా కళకళలాడాయి. ఆ విప్రుడు సానందంగా శివుడికి సాష్టాంగపడ్డాడు. లేచి నిలిచాడు. నెత్తిన చేతులు జోడించాడు. జేకొట్టాడు. (జయ జయ ధ్వనులు చేశాడు). విప్పారిన కన్నులతో అష్టమూర్తియైన శివుణ్ణి అద్భుతంగా స్తుతించాడు.

భార్గవ ఉవాచ – భార్గవుడు స్తుతించాడు.

త్వం భాభిరాభిరభిభూయ తమస్సమస్తం నయస్యభిమతాని నిశాచరాణామ్ ।
దేదీప్యసే దినమణే! గగనే హితాయ లోకత్రయస్య జగదీశ్వర! తన్నమస్తే ॥24॥

లోకేఽతివేలమతివేలమహామహోభిః నిర్భాసి కౌ చ గగనేఽఖిలలోకనేత్రః ।
విద్రావితాఖిలతమస్సుతమో హిమాంశో! పీయూషపూరపరిపూరిత! తన్నమస్తే ॥25॥

త్వం పావనే పథి సదాగతిరప్యుపాస్యః కస్త్వాం వినా భువనజీవన! జీవతీహ ।
స్తబ్ధ! ప్రభంజన! వివర్ధితసర్వజంతో! సంతోషితాహికుల! సర్వగ! వై నమస్తే ॥26॥

విశ్వైకపావక! న తావకపావకైకశక్తేః ఋతే మృతవతామృతదివ్యకార్యమ్ ।
ప్రాణిష్యదో జగదహో జగదంతరాత్మన్! త్వం పావకః ప్రతిపదం శమదో నమస్తే ॥27॥

పానీయరూప! పరమేశ! జగత్పవిత్ర! చిత్రం విచిత్రసుచరిత్రకరోఽసి నూనమ్ ।
విశ్వం పవిత్రమమలం కిల విశ్వనాథ! పానీయగాహనత ఏతదతోనతోఽస్మి ॥28॥

ఆకాశరూప! బహిరంతరుతావకాశదానాద్వికస్వరమిహేశ్వర! విశ్వమేతత్ ।
త్వత్తస్సదా సదయ! సంశ్వసితి స్వభావాత్సంకోచమేతి భక్తోఽస్మి నతస్తతస్త్వామ్ ॥29॥

విశ్వంభరాత్మక! బిభర్షి విభోఽత్ర విశ్వం కో విశ్వనాథ! భవతోఽన్యతమస్తమోఽరిః ।
స త్వం వినాశయ తమో మమ చాహిభూష స్తవ్యాత్పరః పరపరం ప్రణతస్తతస్త్వామ్ ॥30॥

ఆత్మస్వరూప! తవరూపపరంపరాభిరాభిస్తతం హర! చరాచరరూపమేతత్ ।
సర్వాంతరాత్మనిలయ! ప్రతిరూపరూప నిత్యం నతోఽస్మి పరమాత్మజనోఽష్టమూర్తే ॥31॥
ఇత్యష్టమూర్తిభిరిమాభిరబంధుబంధో! యుక్తఃకరోషి ఖలు విశ్వజనీనమూర్తే ।
ఏతత్తతం సువితతం ప్రణతప్రణీత సర్వార్థ! సార్థపరమార్థ! తతో నతోఽస్మి ॥32॥

జగదీశ్వరా! సూర్యరూపా! నువ్వు లోకత్రయానికి హితంకోరి ఓ దినమణీ! ఆకాశంలో ప్రకాశిస్తున్నావు. నీ ఈ కాంతిపుంజాలతో చీకట్లు పారద్రోలి నిశాచరుల (రాక్షసుల) అభిమతాలను తొలగిస్తున్నావు. (చీకటిలో సంచరించడం వల్ల రాక్షసులకు నిశాచరులనే పేరు వచ్చింది). నీకిదే నా వందనం. హిమాంశురూపా! అమృతధారలతో నిండినవాడా! అఖిల తమస్సులనూ పారద్రోలేవాడా! అవధిలేని వెన్నెల వెలుగులతో ఈ లోకంలో ఆకాశాన ప్రకాశిస్తున్నావు, నేలమీద కాంతులు నింపుతున్నావు. నువ్వు లోకులందరికీ కన్నువంటివాడవు. నీకిదే నా వందనం. వాయురూపా! నువ్వు పావనమార్గంలో సదా సంచరిస్తావు. అందరికీ ఉపాస్యుడివి. నువ్వు లేనిదే ఎవ్వడూ జీవించలేడు. సకలప్రాణికోటికీ ప్రాణమా! సకలప్రాణుల్నీ వర్ధిల్లజేసేవాడా! ఒక్కొక్కసారి స్తబ్ధుడా! ఒక్కొక్కసారి ప్రభంజనుడా! సర్పసమూహాలకు ఆహారమై సంతోషపెట్టేవాడా! ఎక్కడికైనా ప్రవేశించేవాడా! నీకిదే వందనం. అగ్నిరూపా! విశ్వాన్ని పావనం చేసేవాడా! నీ శక్తిసామర్థ్యాలే లేకపోతే దేవతలకు హవిస్సు లందించే దివ్యకార్యం – యజ్ఞయాగాదికం – నిర్జీవమైపోతుంది. సకలప్రాణికోటిలోనూ నివసించే పావకుడివి. నీకిదే నా వందనం. జలస్వరూపా! పరమేశా! జగత్పవిత్రా! నీ నడక చిత్రవిచిత్రంగా ఉంటుంది. నీలో మునగడం వల్లనే విశ్వనాథా! ఈ జగత్తు మలినరహితమూ పవిత్రమూ అవుతోంది. ప్రక్షాళితమవుతోంది. అందుకని నీకిదే నతిస్తున్నాను. ఆకాశరూపా! ఈశ్వరా! బహిరంతర్భాగాలలో నువ్వు అవకాశం ఇస్తున్నావు గనకనే ఈ విశ్వం వికసిస్తోంది. దయామయా! నీనుంచే ఇది ఊపిరిపోసుకుంటోంది, సహజంగా మళ్ళీ నీలోనే ముడుచుకుంటోంది. నీ భక్తుణ్ణి నేను. నిన్నిదే నమస్కరిస్తున్నాను. విశ్వంభరాత్మకా! పృథివీరూపా! విభూ! విశ్వనాథా! ఈ విశ్వాన్ని మోస్తున్నది నువ్వు. అజ్ఞానరూపమైన అంధకారానికి ఏకైకశత్రువు నువ్వే. కనక నా చీకటినికూడా తొలగించు. సర్పభూషణా! స్తుతింపదగిన వారందరిలోకీ గొప్పవాడివి. స్తుత్యాత్ స్తుత్యుడివి. అందుకే పరాత్పరుణ్ణి నిన్ను నమస్కరిస్తున్నాను. ఆత్మస్వరూపా! హరా! నీ ఈ రూపపరంపరతో

చరాచరజగత్తు అంతా నిండి నిబిడీకృతమై ఉంది. అందరి అంతరాత్మలలోనూ కొలువుదీరినవాడా! అన్ని రూపాలూ నీ రూపమే అయినవాడా! ఓ అష్టమూర్తీ! పరమాత్మవైన నీకు భక్తజనుణ్ణి నీవాణ్ణి. నీకు చాలా ఆత్మీయుణ్ణి (పరమాత్మనః జనః, పరమ్+ఆత్మజనః) ఇదే నీకు ప్రణమిల్లుతున్నాను. దిక్కులేని వారికి దిక్కైనవాడా! (అబంధు బంధూ!) విశ్వజనీనమూర్తీ! ఇలా అష్టమూర్తిసంయుక్తుడివై ఈ విశ్వాన్ని సువిశాలం చేస్తున్నావు. ప్రణతులకు కోరిన సమస్తప్రయోజనాలూ నెరవేర్చేవాడా! చరితార్థమైన పరమార్థమే నీవైనవాడా! అందుకనే నీకు మరింతగా నమస్కరిస్తున్నాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అష్టమూర్త ష్టకేనేత్థం పరిష్టుత్యేతి భార్గవః ।
భర్గం భూమిమిలన్మౌళిః ప్రణనామ పునః పునః ॥33॥

ఇతిస్తుతో మహాదేవో భార్గవేణాతితేజసా ।
ఉత్థాయ భూమేర్బాహుభ్యాం ధృత్వా తం ప్రణతం ద్విజమ్ ॥34॥

ఉవాచ శ్లక్ష్ణయా వాచా మేఘనాదగభీరయా ।
సుప్రీత్యా దశనజ్యోత్స్నా ప్రద్యోతితదిగంతరః ॥35॥

భార్గవుడు ఇలా ఈ అష్టమూర్తి అష్టకంతో భర్గుణ్ణి స్తుతించి తన శిరస్సు నేలకు ఆనించి మళ్ళీ మళ్ళీ నమస్కరించాడు. తపస్తేజంతో వెలిగిపోతున్న ఆ భార్గవుణ్ణి తనకు సాష్టాంగపడిన ఆ ద్విజుణ్ణి మహాదేవుడు స్వయంగా చేతులతో పట్టి నేలమీద నుంచి లేపి నిలబెట్టాడు. ఆనందపరవశుడై మేఘగర్జనవంటి కంఠస్వరంతో మృదువుగాపలికాడు. అప్పుడు ప్రీతినిపొందిన ఆ పరమేశ్వరుడి దంతకాంతుల వెన్నెలవ్యాపించి దిగంతం మిలమిలలాడింది.

మహేశ్వర ఉవాచ – మహాదేవుడు పలికాడు.

విప్రవర్య కవే తాత మమ భక్తోఽసి పావనః ।
అనేనాత్యుగ్రతపసా స్వజన్యాచరితేన చ ॥36॥

లింగస్థాపనపుణ్యేన లింగస్యారాధనేన చ ।
దత్తచిత్తోపహారేణ శుచినా నిశ్చలేన చ ॥37॥

అవిముక్తమహాక్షేత్రపవిత్రాచరణేన చ ।
త్వాం సుతాభ్యాం ప్రపశ్యామి తవాదేయం న కించన ॥38॥

అనేనైవ శరీరేణ మమోదరదరీగతః ।
మద్వరేంద్రియమార్గేణ పుత్రజన్మత్వమేష్యసి ॥39॥

యచ్ఛామ్యహం వరం తేఽద్య దుష్ప్రాప్యం పార్షదైరపి ।
హరేః హిరణ్యగర్భాచ్చ ప్రాయశోఽహం జుగోప యమ్ ॥40॥

మృతసంజీవనీ నామ విద్యా యా మమ నిర్మలా ।
తపోబలేన మహతా మయైవ పరినిర్మితా ॥41॥

త్వాం తాం తు ప్రాపయామ్యద్య మంత్రరూపాం మహాశుచే ।
యోగ్యతా తేఽస్తి విద్యాయాస్తస్యాః శుచితపోనిధే ॥42॥

యం యముద్దిశ్య నియతమేతామావర్తయిష్యసి ।
విద్యాం విద్యేశ్వరశ్రేష్ఠం సత్యం ప్రాణిష్యతి ధ్రువమ్ ॥43॥

నాయనా! విప్రవర్యా! కవీ! నువ్వు నా భక్తుడివి. పరమపావనుడివి. ఈ జన్మలో నువ్వు చేసిన ఈ అత్యుగ్రతపస్సు, శివలింగస్థాపన మహాపుణ్యం, లింగారాధన, నీ హృదయాన్ని నాకు కానుకగా సమర్పించడం, అది కూడా శుచిగా నిశ్చలంగా ఈ అవిముక్తక్షేత్రంలో (కాశీలో) పవిత్రంగా ఆచరించడం–ఇన్నింటి కారణంగా నిన్ను నా కుమారులిద్దరితోనూ సమానంగా పరిగణిస్తున్నాను. నీకు వరంగా ఇవ్వకూడనిదంటూ ఏమీ లేదు. ఇదే శరీరంతో నువ్వు నా గర్భగుహలో నివసించావు. నా పురుషేంద్రియమార్గం నుంచి పుత్రజన్మను పొందావు. అందుకని నీకొక గొప్పవరం ఇస్తున్నాను. నన్నే అంటిపెట్టుకుని సేవించేవారికి సైతం దక్కని అద్భుతవరం. (పార్శ్వదులు=సేవకులు). శ్రీహరికీ బ్రహ్మదేవుడికీ కూడా తెలియనివ్వకండా నాలోనే రహస్యంగా దాచుకున్న ఒక పవిత్రవిద్య. దానిపేరు–మృతసంజీవని. మహాతపశ్శక్తితో నేనే ఆ విద్యను రూపొందించాను. అత్యంతపవిత్రుడా! మంత్రరూపంలో ఉన్న ఆ విద్యను ఇప్పుడు నీకు ఇదే ప్రాప్తింపజేస్తున్నాను. నువ్వు శుచివి! నువ్వు తపోనిధివి! కనక ఆ విద్యను ఈ మంత్రాన్ని నువ్వు ఎవరెవరిని ఉద్దేశించి మననం చేస్తావో వారు మరణించి కూడా మళ్ళీ ప్రాణం పొందుతారు, జీవిస్తారు. ఇది సత్యం. ఇది ధ్రువం.

అత్యర్కమత్యగ్నిం చ తే తేజో వ్యోమ్ని చ తారకమ్ ।
దేదీప్యమానం భవితా గ్రహాణాం ప్రవరో భవ ॥44॥

అపి చ త్వాం కరిష్యంతి యాత్రాం నార్యో నరోఽపి వా ।
తేషాం త్వద్దృష్టిపాతేన సర్వకార్యం ప్రణశ్యతి ॥45॥

తవోదయే భవిష్యంతి వివాహాదీని సువ్రత ।
సర్వాణి ధర్మకార్యాణి ఫలవంతి నృణామిహ ॥46॥

సర్వాశ్చ తిథయో నందాస్తవ సంయోగతశ్శుభాః ।
తవ భక్తా భవిష్యంతి బహుశుక్రా బహుప్రజాః ॥47॥

త్వయేదం స్థాపితం లింగం శుక్రేశమితి సంజ్ఞితమ్ ।
యేఽర్చయిష్యంతి మనుజాస్తేషాం సిద్ధిర్భవిష్యతి ॥48॥

అంతే కాదు పుత్రకా! సూర్యుడికన్నా అగ్నికన్నా తేజశ్శాలివై ఆకాశంలో నువ్వొక తారకవవుతావు. దేదీప్యమానంగా ప్రకాశిస్తావు. గ్రహాలలో శ్రేష్ఠుడివవుతావు. కాకపోతే–నీకు అభిముఖంగా స్త్రీపురుషులెవరు ప్రయాణం ప్రారంభించినా నీ దృష్టి తగిలి వాళ్ళ పనులన్నీ సర్వనాశనమవుతాయి. కానీ, సువ్రతా! నువ్వు ఉదయించి ఉన్న

సమయంలో వివాహాదిశుభకార్యాలు దిగ్విజయంగా జరుగుతాయి. అలాగే మానవులు చెయ్యదలపెట్టిన ధర్మకార్యాలన్నీ ఫలిస్తాయి. నీతో జతపడ్డ తిథులన్నీ ఆనందదాయకాలూ శుభప్రదాలూ అవుతాయి. నీ భక్తులకు వీర్యపుష్టి–సంతానపుష్టి కలుగుతుంది. నువ్వు ప్రతిష్ఠించిన ఈ లింగం శుక్రేశలింగంగా ప్రసిద్ధికెక్కుతుంది. దీన్ని అర్చించిన మనుజులందరికీ అన్ని కోరికలూ సిద్ధిస్తాయి.

ఆవర్షం ప్రతిఘస్రాం యే నక్తవ్రతపరాయణాః ।
త్వద్దినే శుక్రకూపే యే కృతసర్వోదకక్రియాః ॥49॥

శుక్రేశమర్చయిష్యంతి శృణు తేషాం తు యత్ఫలమ్ ।
అవంధ్యశుక్రాస్తే మర్త్యాః పుత్రవంతోఽతిరేతసః ॥50॥

పుంస్త్వసౌభాగ్యసంపన్నా భవిష్యంతి న సంశయః ।
ఉపేతవిద్యాస్తే సర్వే జనాః స్యుః సుఖభాగినః ॥51॥

ఇతి దత్త్వా వరాన్ దేవస్తత్ర లింగే లయం యయౌ ।
భార్గవోఽపి నిజం ధామ ప్రాప సంతుష్టమానసః ॥52॥

ఒక ఏడాది పాటు అనునిత్యం నక్తవ్రతపరాయణులై చివరి శుక్రవారంనాడు (నీ పేరిటి రోజున) ఈ శుక్రకూపంలో స్నానసంధ్యాదిక–ఉదకక్రియలు నిర్వహించి ఈ శుక్రేశుణ్ణి అర్చించినవారికి ఏ ఫలం దక్కుతుందో చెబుతాను–విను. అలా అర్చించిన మగవారు అతిరేతసులూ అవంధ్యవీర్యులూ అవుతారు. (అంటే వారివీర్యం సంతానజనకం అవుతుందేకానీ నిష్ఫలం కాదని) పుత్రవంతులవుతారు. (ఎంత వయస్సు వచ్చినా) తరగని మగతనంతో కళకళలాడతారు. ఇది నిస్సంశయం. అలాగే విద్యావంతులవుతారు. సమస్తసుఖాలనూ అనుభవిస్తారు. ఇలా వరాలను గుప్పించి మహాదేవుడు ఆ లింగంలోనే లీనమయ్యాడు. శుక్రాచార్యుడు కూడా మనస్సులో ఉబ్బి తబ్బిబ్బవుతూ ఇల్లు చేరుకున్నాడు.

విశేషం: నక్తవ్రతమంటే–దైవధ్యానంతో పగలంతా ఉపవాసం ఉండి రాత్రిమాత్రం ఉపాహారం తీసుకుంటూ గడపడం. దీన్నే నక్తాలుండటం–నక్తాలు చెయ్యడం అంటారు. సాధారణంగా కార్తికమాసంలో దీన్ని అవలంబిస్తారు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి తే కథితం వ్యాస యథా ప్రాప్తా తపోబలాత్ ।
మృత్యుంజయాభిదా విద్యా కిమన్యత్ శ్రోతుమిచ్ఛసి ॥53॥

వ్యాసమునీ! ఇదీ కథ. శుక్రాచార్యుడు ఇలా తపశ్శక్తితో మృత్యుంజయమనే ఈ విద్యను, ఈ మహామంత్రాన్ని పొందాడు. అంతా నీకు చెప్పాను. మరింకా ఏమి వినాలని నీ కోరిక?

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే మృతసంజీవనీ విద్యాప్రాప్తివర్ణనం నామ పంచాశత్తమోఽధ్యాయః ॥50॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు మృతసంజీవనీ విద్యాప్రాప్తివర్ణనం అనే యాభైయవ అధ్యాయం సమాప్తం.

ఏకపంచాశత్తమోఽధ్యాయః – యాభై ఒకటవ అధ్యాయం

ఉషాచరిత్రవర్ణనం శివశివా విహారవర్ణనమ్ – ఉషాచరిత్రవర్ణనం, శివశివా విహారవర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

సనత్కుమార సర్వజ్ఞ శ్రావితా సుకథాద్భుతా ।
భవతానుగ్రహాత్ప్రీత్యా శంభ్వనుగ్రహనిర్భరా ॥1॥

ఇదానీం శ్రోతుమిచ్ఛామి చరితం శశిమౌళినః ।
గాణపత్యం దదౌ ప్రీత్యా యథా బాణాసురాయ వై ॥2॥

సర్వజ్ఞా! సనత్కుమారా! నా మీద ప్రేమతో నన్ను అనుగ్రహించి ఒక మంచి కథను, ఒక అద్భుతగాథను, పరమేశ్వరుడి అనుగ్రహంతో నిర్భరమైన ఆఖ్యానకాన్ని నాకు వినిపించావు. ఇప్పుడు చంద్రశేఖరుడి మరొక కథను వినాలని ఉంది. బాణాసురుడికి ప్రేమతో గాణపత్యం (ప్రమథగణాధిపతి పదవి)ఇచ్చాడు గదా శంభుడు. ఆ చరితం వినాలని కుతూహలంగా ఉంది.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాసాదరాత్తాం వై కథాం శంభోః పరాత్మనః ।
గాణపత్యం యథా ప్రీత్యా దదౌ బాణాసురాయ హి ॥3॥

అత్రైవ సుచరిత్రం చ శంకరస్య మహాప్రభోః ।
కృష్ణేన సమరోఽప్యత్ర శంభోర్బాణానుగృహ్ణతః ॥4॥

అత్రానురూపం శృణు మే శివలీలాన్వితం పరమ్ ।
ఇతిహాసం మహాపుణ్యం మనఃశ్రోత్రసుఖావహమ్ ॥5॥

వ్యాసమునీ! పరాత్పరుడైన శంభుడి కథ ఇది–ఆనందంతో విను. బాణాసురుడికి గాణపత్యపదవిని ప్రేమతో ఎలా ఇచ్చాడో చెప్పే కథ. మహాప్రభువు–శంకరుడి సుచరిత్ర. బాణాసురుణ్ణి అనుగ్రహించే ఈ సందర్భంలోనే శివుడికి కృష్ణుడితో యుద్ధమూ జరిగింది. ఇది అంతా శివలీలాన్వితమూ తదనురూపమూ అయిన ఒక ఇతిహాసం. మహాపుణ్యప్రదం. మనసుకు సుఖాన్ని కలిగించేదిగానూ, వినసొంపుగానూ ఉంటుంది. చెబుతాను శ్రద్ధగా వినుసుమా!

బ్రహ్మపుత్రో మరీచిర్యో మునిరాసీన్మహామతిః ।
మానసస్సర్వపుత్రేషు జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః ॥6॥

బ్రహ్మదేవుడి మానసపుత్రుడు మరీచిమహర్షి. అతడు మహాధీశాలి. బ్రహ్మమానసపుత్రులలోకెల్లా మొదటివాడు. ఉత్తముడు. ప్రజాపతి అయ్యాడు.

తస్య పుత్రో మహాత్మాసీత్కశ్యపో మునిసత్తమః ।
సృష్టిప్రవృద్ధకోఽత్యంతం పితుర్భక్తో విధేరపి ॥7॥

అతడి కుమారుడే కశ్యపప్రజాపతి. ఇతడు కూడా మహాత్ముడూ, మహామునీ. ఇతడికి పితృభక్తీ పితామహభక్తీ ఎక్కువ. సృష్టిని వృద్ధిపొందించినవాడూ ఇతడే.

తస్య త్రయోదశమితాః దక్షకన్యాస్సుశీలికాః ।
కశ్యపస్య మునేర్వ్యాస పత్న్యశ్చాసన్ పతివ్రతాః ॥8॥

ఇతడు దక్షప్రజాపతి పుత్రికల్ని పదమూడు మందిని వివాహం చేసుకున్నాడు. అందరూ రూపవతులూ శీలవతులూను. పతివ్రతామణులు

తత్ర జ్యేష్ఠా దితిశ్చాసీత్ దైత్యాస్తత్తనయా స్మృతాః ।
అన్యాసాం చ సుతా జాతా దేవాద్యాస్సచరాచరాః ॥9॥

వీరిలో ప్రథమురాలు–దితి. ఈమె సంతానమే దైత్యులందరూను. మిగతా పన్నెండుమంది భార్యలకూ దేవతలూ చరాచరజీవజాలమూ సంతానంగా జన్మించారు.

జ్యేష్ఠాయాః ప్రథమౌ పుత్రౌ దితేశ్చాస్తాం మహాబలౌ ।
హిరణ్యకశిపుః జ్యేష్ఠో హిరణ్యాక్షోఽనుజస్తతః ॥10॥

దితికి పుట్టిన సంతానంలో మొదటి ఇద్దరు కొడుకులూ మహాబలశాలులు. పెద్దకొడుకు పేరు హిరణ్యకశిపుడు. రెండవ వాడి పేరు హిరణ్యాక్షుడు.

హిరణ్యకశిపోః పుత్రాశ్చత్వారో దైత్యసత్తమాః ।
హ్లాదానుహ్లాదసంహ్లాదాః ప్రహ్లాదశ్చేత్యనుక్రమాత్ ॥11॥

ఈ హిరణ్యకశిపుడికి నలుగురు మగబిడ్డలు. హ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, ప్రహ్లాదుడు అని క్రమముగా వాళ్ళపేర్లు. అందరూ దైత్యసత్తములే.

ప్రహ్లాదస్తత్ర హి మహాన్ విష్ణుభక్తో జితేంద్రియః ।
యం నాశితుం న శక్తాస్తేఽభవన్ దైత్యాశ్చ కేఽపి హ ॥12॥

వీరిలో చివరివాడు ప్రహ్లాదుడు మాత్రం విష్ణుభక్తుడు. మహాభక్తుడు. జితేంద్రియుడు. తండ్రితోపాటు దైత్యులందరూ ప్రయత్నించినా అతణ్ణి సంహరించలేకపోయారు.

విరోచనస్సుతస్తస్య మహాదాతృవరోఽభవత్ ।
శక్రాయ స్వశిరో యోఽదాద్యాచమానాయ విప్రతః ॥13॥

ఆ ప్రహ్లాదుడి కొడుకు విరోచనుడు. ఇతడు మహాదాత. విప్రరూపంలో వచ్చి అడిగితే ఇంద్రుడికి తన శిరస్సునే దానం చేసిన మహానుభావుడు.

తస్య పుత్రో బలిశ్చాసీత్ మహాదానీ శివప్రియః ।
యేన వామనరూపాయ హరయేఽదాయి మేదినీ ॥14॥

ఇతడి కొడుకు బలి. ఇతడూ తండ్రిలాగానే దాతృత్వానికి పెట్టిందిపేరు. శివభక్తుడు. వామనరూపంలో వచ్చి యాచిస్తే శ్రీహరికి మేదినీ గోళాన్నంటినీ ధారపోసిన మహాదాని.

తస్యారసః సుతో బాణశ్శివభక్తో బభూవ హ ।
మాన్యో వదాన్యో ధీమాంశ్చ సత్యసంధస్సహస్రదః ॥15॥

ఇతడికి ఔరసపుత్రుడు బాణుడు. ఇతడూ మహాదాత. శివభక్తుడు. ధీశాలి. మాన్యుడు. సత్యసంధుడు. సహస్రదానాలు చేసినవాడు.

శోణితాఖ్యే పురే స్థిత్వా స రాజ్యమకరోత్పురా ।
త్రైలోక్యం చ బలాజ్జిత్వా తన్నాథానసురేశ్వరః ॥16॥

శోణితపట్టణం రాజధానిగా దైత్యరాజ్యం పరిపాలించాడు. త్రిలోకాలనూ త్రిలోకాధిపతులనూ తన సేనాబలంతో జయించినవాడు.

తస్య బాణాసురస్యైవ శివభక్తస్యచామరాః ।
శంకరస్య ప్రసాదేన కింకరా ఇవ తేఽభవన్ ॥17॥

బాణాసురునికి శివానుగ్రహంతో ఈ శివభక్తుడికి సకలదేవతలూ కింకరుల్లాగా అయిపోయారు.

తస్య రాజ్యే ఽమరాన్ హిత్వా నాభవన్ దుఃఖితాః ప్రజాః ।
సాపత్న్యాద్దుఃఖితాస్తే హి పరధర్మప్రవర్తినః ॥18॥

సహస్రబాహువాద్యేన స కదాచిన్మహాసురః ।
తాండవేన హి నృత్యేనాతోషయత్తం మహేశ్వరమ్ ॥19॥

తేన నృత్యేన సంతుష్టస్సుప్రసన్నో బభూవహ ।
దదర్శ కృపయా దృష్ట్యా శంకరో భక్తవత్సలః ॥20॥

భగవాన్ సర్వలోకేశశ్శరణ్యో భక్తకామదః ।
వరేణ చ్ఛందయామాస బాలేయం తం మహాసురమ్ ॥21॥

ఆ బాణాసురుడి ఏలుబడిలో దేవతలు తప్ప మిగతా ప్రజలకెవ్వరికీ దుఃఖమంటే ఏమిటో తెలీదు. దేవతలైనా ఎందుకు నిత్యదుఃఖితులయ్యారంటే–సవతి సోదరులు కనక దుఃఖించారు. బలవంతంగా రాక్షసధర్మాలను అనుసరించవలసివచ్చింది కనక దుఃఖితులయ్యారు. సరే–ఆ బాణాసురుడికి వెయ్యి చేతులు. ఒకనాడు సహస్రబాహువాద్యంతో (వెయ్యి బాహువులతో వెయ్యి వాద్యాలో, ఒకే వాద్యమో)తాండవ నృత్యం చేసి మహేశ్వరుణ్ణి చాలా సంతోషపెట్టాడు. ఆ సంతోషంలో బాణుడికి సుప్రసన్నుడయ్యాడు శంకరుడు. భక్తవత్సలుడైనాడు. కరుణించాడు. సర్వలోకేశ్వరుడూ సకలశరణ్యుడూ అఖిలవాంఛాప్రదుడూ ఆ భగవానుడు ఈ బలిసుతుడైన బాణాసురుణ్ణి ఏదైనా వరం కోరితీరవలసిందే అని బలవంతపెట్టాడు.

బాలేయస్స మహాదైత్యో బాణో భక్తవరస్సుధీః ।
ప్రణమ్య శంకరం భక్త్యా నునావ పరమేశ్వరమ్ ॥22॥

బలిసుతుడు ఆ మహాదైత్యుడు బాణుడు శివభక్తులలో అగ్రణి. బుద్ధికుశలుడు. శివుడికి శిరసా నమస్కరించాడు. మహేశ్వరుణ్ణి భక్తితో స్తుతించాడు. అటుపైని ఇలా అడిగాడు.

బాణాసుర ఉవాచ – బాణాసురుడు అడిగాడు.

దేవదేవ మహాదేవ శరణాగతవత్సల ।
సంతుష్టోఽసి మహేశాన మమోపరి విభో యది ॥23॥

మద్రక్షకో భవ సదా మదుపస్థః పురాధిపః ।
సర్వథా ప్రీతికృన్మేహి ససుతస్సగణః ప్రభో ॥24॥

దేవదేవా! మహాదేవా! శరణాగతవత్సలా! మహేశానా! మహాప్రభూ! మహావిభూ! నిజంగా నువ్వు నాపట్ల సంతుష్టుడివీ సుప్రసన్నుడివీ అయ్యుంటే దయచేసి నాకు రక్షకుడిగా వ్యవహరించు. నా రాజధానికి అధిపతిగా నిత్యం నా సన్నిధిలోనే ఉండు. ప్రభూ! నీ పుత్రులతో నీ ప్రమథగణాలతో వచ్చి ఇక్కడే కాపురం ఉండు. నన్ను సంతోషపెట్టినవాడివి అవుతావు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

బలిపుత్రస్స వై బాణో మోహితశ్శివమాయయా ।
ముక్తిప్రదం మహేశానం దురారాధ్యమపి ధ్రువమ్ ॥25॥

స భక్తవత్సలః శంభుర్దత్త్వా తస్మై వరాంశ్చ తాన్ ।
తత్రోవాస తథా ప్రీత్యా సగణస్ససుతః ప్రభుః ॥26॥

సకదాచిద్బాణపురే చక్రే దేవాసురైస్సహ ।
నదీతీరే హరః క్రీడాం రమ్యే శోణితకాహ్వయే ॥27॥

ననృతుర్జహసుశ్చాపి గంధర్వాప్సరసస్తథా ।
జేపుఃప్రణేముర్మునయః ఆనర్చుస్తుష్టువుశ్చ తమ్ ॥28॥

వవల్గుః ప్రమథాస్సర్వే ఋషయో జుహువుస్తథా ।
ఆయయుస్సిద్ధసంఘాశ్చ దదృశుశ్శాంకరీం రతిమ్ ॥29॥

కుతార్కికా వినేశుశ్చ మ్లేచ్ఛాశ్చ పరిపంథినః ।
మాతరోఽభిముఖాస్తస్థుః వినేశుశ్చ బిభీషికాః ॥30॥

వ్యాసమునీ! శివుడి మాయలో పడిపోయాడు బాణుడు. కచ్చితంగా సమ్మోహితుడైపోయాడు. అందుకే ముక్తిప్రదుడూ దురారాధ్యుడూ అయిన మహేశానుణ్ణి ఇలాంటి వరం అడిగాడు. సరే, ఆ భక్తవత్సలుడు శంభుడు అతడు కోరిన వరాలన్నీ ఇచ్చి బంధుమిత్ర పరివారసమేతంగా తరలివచ్చి ఆ శోణితపురంలో హాయిగా కాపురం

పెట్టాడు. కొంతకాలానికి ఒకనాడు దేవదానవులతో కలిసి శివుడు ఆ సుందరపట్టణానికి సమీపాన ఉన్న ఒక రమ్యనదీతీరంలో విహారం జరిపాడు. గంధర్వుల గానాలూ, అప్సరసల నృత్యాలూ పరిహాసాలూ, మునీశ్వరుల జపాలూ తపాలూ ప్రణతులూ, ప్రమథగణాల ఉరుకులూ పరుగులూ, ఋషీశ్వరుల హోమాలూ అంతా ఆనందకోలాహలం. సిద్ధులు గుంపులు గుంపులుగా వచ్చి శంకరుడి ఆ క్రీడాప్రీతిని దర్శించుకున్నారు. ఆ సంభరంలో కుతార్కికులూ మ్లేచ్ఛులూ శత్రువులూ బిభీషికలూ (భయపెట్టేవాళ్ళు) నాశనం పొందారు. కృత్తికామాతలు వచ్చి అభిముఖంగా నిలుచున్నారు.

రుద్రసద్భావభక్తానాం భవదోషాశ్చ విస్మృతాః ।
తస్మిన్ దృష్టే ప్రజాస్సర్వాః సుప్రీతిం పరమాం యయుః ॥31॥

వవల్గుర్మునయస్సిద్ధాః స్త్రీణాం దృష్ట్వా విచేష్టితమ్ ।
పుపుషుశ్చాపి ఋతవః స్వప్రభావం తు తత్ర చ ॥32॥

వవుర్వాతాశ్చ మృదవః పుష్పకేసరధూసరాః ।
చుకూజుః పక్షిసంఘాశ్చ శాఖినాం మధులంపటాః ॥33॥

పుష్పభారావనద్ధానాం రారటేరంశ్చ కోకిలాః ।
మధురం కామజననం వనేషూపవనేషు చ ॥34॥

తతః క్రీడావిహారే తు మత్తో బాలేందుశేఖరః ।
అనిర్జితేన కామేన దృష్టః ప్రోవాచ నందినమ్ ॥35॥

రుద్రభక్తుల ఇహజన్మదోషాలన్నీ (పాపకర్మలు) విస్మరింపబడ్డాయి. అప్పుడు అలా క్రీడాసక్తుడై ఉన్న శివుణ్ణి దర్శించుకున్న ప్రజలందరూ బ్రహ్మానందం పొందారు. కానీ అప్సరసల చిలిపి చేష్టలు (విచేష్టితాలు) చూసి మునులూ సిద్ధపురుషులూ పారిపోయారు. ఋతువులన్నీ ఒక్కుమ్మడిగా ఆ ప్రాంతమంతటా తమ ప్రభావాన్ని నింపాయి. పూల పుప్పొడి మోసుకుంటూ పిల్లగాలులు మెల్లగా మృదువుగా వీచాయి. చెట్ల పూవుల మకరందానికి అలవాటుపడ్డ పిట్టల గుంపులు కలకూజితాలు చేశాయి. పుష్పభారంతో కొమ్మలు వంగిన చెట్లమీద కోకిలలు అదే పనిగా కూశాయి. వనాలలో ఉపవనాలలో ఈ కోకిలల మధురకూజితాలు మన్మథోద్దీపకాలూ మారుమోగాయి. బాలేందుశేఖరుడు క్రీడావిహారంలో మైమరిచిపోయాడు. అప్పటి కింకా వినిర్జితుడు కాని మన్మథుడు శివుణ్ణి ఒక చూపు చూశాడు. వెంటనే శివుడు నందీశ్వరుణ్ణి పిలిచి ఇలా ఆజ్ఞాపించాడు.

చంద్రశేఖర ఉవాచ – చంద్రశేఖరుడు ఆజ్ఞాపించాడు.

వామామానయ గౌరీం త్వం కైలాసాత్ కృతమండనామ్ ।
శీఘ్రమస్మాద్వనాద్గత్వా హ్యుక్త్వా కృష్ణామిహానయ ॥36॥

నందీశ్వరా! వెంటనే బయలు దేరి వెళ్ళు. ఇప్పుడే ఈ వనం నుంచి కైలాసగిరి చేరుకో. నా సుందరాంగిని గౌరీదేవిని కృష్ణవర్ణవిరాజితను సాలంకృతను నా మాటగా చెప్పి ఇక్కడికి వేగం తీసుకునిరా!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

స తథేతి ప్రతిజ్ఞాయ గత్వా తత్రాహ పార్వతీమ్ ।
సుప్రణమ్య రహోదూతశ్శంకరస్య కృతాంజలిః ॥37॥

శంకరుడి రహస్యదూత ఆ నందీశ్వరుడు చిత్తం–అలాగే అని ప్రతిజ్ఞ చేసి గౌరీదేవి చెంతకు వెళ్ళి నమస్కరించి, అంజలిబంధంతో నిలిచి ఇలా పలికాడు.

నందీశ్వర ఉవాచ – నందీశ్వరుడు విన్నవించాడు.

ద్రష్టుమిచ్ఛతి దేవి త్వాం దేవదేవో మహేశ్వరః ।
స్వవల్లభాం రూపకృతాం మయోక్తం తన్నిదేశతః ॥38॥

దేవీ! దేవదేవుడు మహేశ్వరుడు నిన్ను చూడాలని కోరుకుంటున్నాడు. సాలంకృతవైన ప్రాణవల్లభను నిన్ను దర్శింపగోరుతున్నాడు. శివుడి ఆజ్ఞమేరకు నేనిది నీకు మనవి చేశాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తతస్తద్వచనాద్గౌరీ మండనం కర్తుమాదరాత్ ।
ఉద్యతాభూన్మునిశ్రేష్ఠ! పతివ్రతపరాయణా ॥39॥

ఆగచ్ఛామి ప్రభుం గచ్ఛ వద తం త్వం మమాజ్ఞయా ।
ఆజగామ తతో నందీ రుద్రాసన్నం మనోగతిః ॥40॥

పునరాహ తతో రుద్రో నందినం పరివిభ్రమః ।
పునర్గచ్ఛ తతస్తాత క్షిప్రమానయ పార్వతీమ్ ॥41॥

బాధముక్త్వా స తాం గత్వా గౌరీమాహ సులోచనామ్ ।
ద్రష్టుమిచ్ఛతి తే భర్తా కృతవేషాం మనోరమామ్ ॥42॥

శంకరో బహుధా దేవి విహర్తుం సంప్రతీక్షతే ।
ఏవం పతౌ సుకామార్తే గమ్యతాం గిరినందిని ॥43॥

మునివర్యా! వ్యాసా! నందీశ్వరుడి మాటలు ఆలకించిన గౌరీదేవి సాదరంగా తనని తాను అలంకరించు కోవడం ప్రారంభించింది. పతివ్రతాపరాయణురాలు కనక వెంటనే ఆరంభించింది. నందీ! వెళ్ళి ప్రభువుకి విన్నవించు–నేను వస్తున్నానని. ఇది నా ఆజ్ఞ–అని పార్వతి అనడంతోనే నందీశ్వరుడు మనోవేగంతో రుద్రసన్నిధికి వచ్చి ఆ వర్తమానం అందించాడు. కానీ కామవిభ్రముడై ఉన్న రుద్రుడు–మళ్ళీ వెళ్ళి పార్వతిని వెంటనే తీసుకురా–అని పంపించాడు. సరే అని నందీశ్వరుడు మళ్ళీ వెళ్ళాడు. తల్లీ! నీభర్త నిన్ను ఇప్పుడే చూడాలనుకుంటున్నాడు. అందంగా అలంకరించుకుని బయలుదేరు. నీతో విహరించాలని–అనేక విధాలుగా విహరించాలని–శంకరుడు ఉవ్విళ్ళూరుతున్నాడమ్మా! నీ భర్త, ఓ గిరినందినీ! కామార్తుడై ఉన్నాడమ్మా! అని విన్నవించాడు.

అప్సరోభిస్సమగ్రాభిరన్యోన్యమభిమంత్రితమ్ ।
లబ్ధభావో యథా సద్యః పార్వత్యా దర్శనోత్సుకః ॥44॥

అయం పినాకీ కామారిః వృణుయాద్యాం నితంబినీమ్ ।
సర్వాసాం దివ్యనారీణాం రాజ్ఞీ భవతి వై ధ్రువమ్ ॥45॥

వీక్షణం గౌరిరూపేణ క్రీడయేన్మన్మథైర్గణైః ।
కామోఽయం హంతి కామారి మూచురన్యోన్యమాదరాత్ ॥46॥

స్పృష్టుం శక్నోతి యా కాచిదృతే దాక్షాయణీం స్త్రియమ్ ।
సా గచ్ఛేత్తత్ర నిశ్శంకం మోహయేత్పార్వతీపతిమ్ ॥47॥

కూష్మాండతనయా తత్ర శంకరం స్పృష్టుముత్సహే ।
అహం గౌరీసురూపేణ చిత్రలేఖా వచోఽబ్రవీత్ ॥48॥

యదధాన్మోహినీరూపం కేశవో మోహనేచ్ఛయా ।
పురా తద్వైష్ణవం యోగమాశ్రిత్య పరమార్థతః ॥49॥

ఊర్వశ్యాశ్చ తతో దృష్ట్వా రూపస్య పరివర్తనమ్ ।
కాళీరూపం ఘృతాచీ తు విశ్వాచీ చాండికం వపుః ॥50॥

సావిత్రిరూపం రంభా చ గాయత్రం మేనకా తథా ।
సహజన్యా జయారూపం వైజయం పుంజికస్థలీ ॥51॥

మాతౄణామప్యనురక్తానామనుక్తాశ్చాప్సరోవరాః ।
యత్నాద్రూపాణి తాశ్చక్రుః స్వవిద్యాసంయుతా అను ॥52॥

వ్యాసమునీ! ఇంతలోకీ–అప్సరసలూ అసురసుందరాంగనలూ తమలో తాము ఇలా ఆదరంగా ముచ్చట్లాడుకున్నారు. పార్వతీదేవి కోసం తహతహలాడుతున్నాడు శంకరుడు. లబ్ధకామభావుడై ఉన్నాడు. ఇప్పుడీ కామారి ఈ పినాకపాణి మనలో ఎవరినైనా వరిస్తే గనక ఆ నితంబిని సర్వదేవతాస్త్రీలకూ మహారాజ్ఞి అయిపోవడం నిశ్చయం. గౌరీరూపంలో మనం కనిపిస్తే మన్మథుడు తన మందీమార్బలంతో ఈ శివుణ్ణి ఒక ఆట ఆడిస్తాడు. అయితే, దాక్షాయణీదేవి తప్ప మరొక వనిత ఎవరైనా ఈ పార్వతీపతిని మోహింపజెయ్యగలదా? నిర్భయంగా దగ్గరికి చేరగలదా? స్పృశించగలదా? అని తర్కించుకున్నారు. అప్పుడు కూష్మాండతనయ చిత్రలేఖాదేవి శంకరుణ్ణి చేరగలను స్పృశించగలను అని ఉత్సాహపడింది. వెనకటికి శ్రీమహావిష్ణువు దానవుల్ని సమ్మోహపరచడానికి ఒకానొక వైష్ణవీయోగవిద్యను ఉపయోగించి మోహినీరూపం ధరించలేదా! అలాగే నేనూ అదే విద్యనుపయోగించి గౌరీరూపం ధరించి శివుడి దరిజేరతానంది. అప్పటికే ఊర్వశి తన రూపం మార్చేసుకుంది. ఇది చూసి ఘృతాచి – కాళీరూపం ధరించింది. విశ్వాచి–చండికారూపం, రంభ ఏమో సావిత్రీరూపం, మేనక–గాయత్రీరూపం, సహజని అనే అప్సరస–జయారూపం, పుంజికస్థల–విజయారూపం, పేర్లు ఏమిటో తెలియని తక్కిన దేవదానవకాంతలు తక్కిన మాతృకలరూపాలూ తమ తమ యోగవిద్యాశక్తుల్ని బట్టి ధరించేసి చాలా ఉత్సాహపడ్డారు.

తతస్తాసాం తు రూపాణి దృష్ట్వా కుంభాండనందినీ ।
వైష్ణవాదాత్మయోగాచ్చ విజ్ఞాతార్థా వ్యడంబయత్ ॥53॥

ఉషా బాణాసురసుతా దివ్యయోగవిశారదా ।
చకార రూపం పార్వత్యా దివ్యమత్యద్భుతం శుభమ్ ॥54॥

మహారక్తాబ్జసంకాశం చరణం చోత్తమప్రభమ్ ।
దివ్యలక్షణసంయుక్తం మనోఽభీష్టార్థదాయకమ్ ॥55॥

తస్యా రమణసంకల్పం విజ్ఞాయ గిరిజా తతః ।
ఉవాచ సర్వవిజ్ఞానా సర్వాంతర్యామినీ శివా ॥56॥

అప్పుడు–తనకంటే ముందే అలా రూపాలను మార్చేసుకున్న ఆ రంభాదుల్ని చూసి కూష్మాండతనయ చిత్రలేఖ – తన వైష్ణవీయోగశక్తితో అందరినీ అసలు రూపాలతో గుర్తుపట్టింది. తానూ వారిని అనుకరించింది (మరో మాతృకారూపం ధరించిందన్నమాట). బాణాసురుడి ముద్దుల కూతురు ఉషాదేవి ఇది అంతా గమనించింది. తానూ ఇలాంటి దివ్య యోగవిద్యలో విశారదయే. కనక దివ్యమూ అత్యద్భుతమూ శుభప్రదమూ అయిన పార్వతీదేవి రూపాన్నే తాను ధరించేసింది. అప్పుడు ఆమె పాదాలు ఎర్రకలువలై దివ్యలక్షణసంపన్నాలై మనోఽభీష్టప్రదాయకాలై ఉత్తమప్రభలు విరజిమ్మాయి. సరిగ్గా ఇదే సమయానికి సాలంకృతగా పార్వతీదేవి అక్కడికి వచ్చింది. ఉషాదేవిని గుర్తుపట్టింది. ఆమె మనసులోని రమణకల్పాన్నీ గుర్తించింది. సర్వాంతర్యామిని, సర్వవిజ్ఞాన కదా ఆ శివాదేవి. మృదువుగా ఆమెతో ఇలా పలికింది.

గిరిజోవాచ – గిరిజ పలికింది.

యతో మమ స్వరూపం వై ధృతమూషే సఖి త్వయా ।
సకామత్వేన సమయే సంప్రాప్తే సతి భామిని ॥57॥

అస్మింస్తు కార్తికే మాసి ఋతుధర్మాస్తు మాధవే ।
ద్వాదశ్యాం శుక్లపక్షే తు యస్తు ఘోరే నిశాగమే ॥58॥

కృతోపవాసాం త్వాం భోక్తా సుప్తామంతఃపురే నరః ।
స తే భర్తా కృతో దేవైస్తేన సార్ధం రమిష్యసి ॥59॥

ఆబాల్యాద్విష్ణుభక్తాసి యతోఽనిశమతంద్రితా ।
ఏవమస్త్వితి సా ప్రాహ మనసా లజ్జితాననా ॥60॥

అథ సా పార్వతీదేవీ కృతకౌతుకమండనా ।
రుద్రసన్నిధిమాగత్య చిక్రీడే తేన శంభునా ॥61॥

తతో రతాంతే భగవాన్ రుద్రశ్చాదర్శనం యయౌ ।
సదారస్సగణశ్చాపి సహితో దైవతైర్మునే ॥62॥

ఓ ప్రియసఖీ! ఉషాభామినీ! నువ్వు మనసా కోరి నా రూపం ధరించావు. యోగ్యమైన సమయంలో వయస్సులో కోరిక పొడమి నా రూపం ధరించావు. కనక నీకొక శుభవార్త చెబుతున్నాను. నువ్వు చిన్నప్పటినుంచీ

విష్ణుభక్తురాలివి. అనుక్షణం జాగరూకతతో విష్ణుమూర్తిని ఉపాసించినదానివి. ఈ కార్తికమాసంలో ఋతుమతివి (రజస్వలవు) అవుతావు. అటుపైని వచ్చే వైశాఖమాసంలో శుక్లపక్షం ద్వాదశినాడు నువ్వు ఉపవాసం ఉండు. రాత్రికి హాయిగా నిద్రపో చీకట్లు గాఢంగా కమ్ముకున్నాక ఒక యువకుడు నీ అంతఃపురంలోకి ప్రవేశించి గాఢనిద్రలో ఉన్న నిన్ను అనుభవిస్తాడు. అతడే నీ పెనిమిటి అవుతాడు. ఇది దేవతలు చేసిన నిర్ణయం. అతడితో నువ్వు కలకాలం హాయిగా ఆనందిస్తావు. అని పార్వతీదేవి ప్రియంగా పలికింది. ఆసక్తిగా విన్న ఉషాబాల మనస్సులో కాసింత సిగ్గుపడింది. అది ముఖం మీద కనిపిస్తుండగా–సరే, ఇది ఇలాగే జరుగుగాక–అనేసింది. అటుపిమ్మట, పార్వతీదేవి– పెండ్లి కూతురులాగా ముస్తాబై ఉన్న పార్వతీదేవి–పరమేశ్వరుడి సన్నిధికి వచ్చింది. అతడితో అద్భుతంగా క్రీడించింది. ఆ క్రీడముగిసిన వెంటనే పార్వతీదేవితోను, ప్రమథగణాలతోను, దేవ–ముని బృందాలతోను కలిసి నిష్క్రమించాడు. అంతర్ధానం చెందాడు రుద్రుడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే ఉషాచరిత్రవర్ణనం శివశివావిహారవర్ణనం నామ ఏకపంచాశత్తమోఽధ్యాయః ॥51॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు ఉషాచరిత్ర వర్ణనం, శివశివావిహారవర్ణనం అనే యాభై ఒకటవ అధ్యాయం సమాప్తం.

ꕥ ꕥ ꕥ

ద్విపంచాశత్తమోఽధ్యాయః – యాభై రెండవ అధ్యాయం

ఉషాచరిత్రవర్ణనమ్ – ఉషాచరిత్ర వర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణుష్వాన్యచ్చరిత్రం చ శివస్య పరమాత్మనః ।
భక్తవాత్సల్యసంగర్భి పరమానందదాయకమ్ ॥1॥

పురా బాణాసురో నామ దైవదోషాచ్చ గర్వితః ।
కృత్వా తాండవనృత్యం చ తోషయామాస శంకరమ్ ॥2॥

జ్ఞాత్వా సంతుష్టమనసం పార్వతీవల్లభం శివమ్ ।
ఉవాచ చాసురో బాణో నతస్కంధః కృతాంజలిః ॥3॥

వ్యాసమునీ! పరమాత్ముడు శివుడి చరిత్రమంతా భక్తవాత్సల్యంతో నిండినదీ, ఆనందకరమూను. అలాంటి మరొక చరిత్ర చెబుతున్నాను, ఆలకించు! ఈ బాణాసురుడు దైవదోషంవల్ల మహాగర్వితుడై ఒకనాడు తాండవనృత్యంతో పరమేశ్వరుణ్ణి సుప్రసన్నుణ్ణి చేసుకున్నాడు. పార్వతీవల్లభుడు తన నృత్యంతో సంతుష్టుడ య్యాడన్న విషయాన్ని బాణాసురుడు గుర్తించాడు. ముందుకి వంగి వంగి నమస్కరిస్తూ ఇలా అభ్యర్థించాడు.

బాణ ఉవాచ – బాణుడు పలికాడు.

దేవదేవ మహాదేవ సర్వదేవశిరోమణే ।
త్వత్ప్రసాదాద్బలీ చాహం శృణు మే పరమం వచః ॥4॥

దోస్సహస్రం త్వయా దత్తం పరం భారాయ మే భవేత్ ।
త్రిలోక్యాం ప్రతియోద్ధారం న లభే త్వదృతే సమమ్ ॥5॥

హే దేవ కిమనేనాపి సహస్రేణ కరోమ్యహమ్ ।
బాహూనాం గిరితుల్యానాం వినా యుద్ధం వృషధ్వజ ॥6॥

కండూత్యా నిభృతైః దోర్భిర్యుయుత్సుర్దిగ్గజానహమ్ ।
పురాణ్యాచూర్ణయన్నద్రీన్ భీతాస్తేఽపి ప్రదుద్రువుః ॥7॥

మయా యమః కృతో యోద్ధా వహ్నిశ్చ కృతకో మహాన్ ।
వరుణశ్చాపి గోపాలో గవాం పాలయితా తథా ॥8॥

గజాధ్యక్షః కుబేరస్తు సైరంధ్రీ చాపి నిర్ఋతిః ।
జితశ్చాఖండలో లోకే కరదాయీ సదా కృతః ॥9॥

యుద్ధస్యాగమనం బ్రూహి యత్తైతే బాహవో మమ ।
శత్రుహస్తప్రయుక్తైశ్చ శస్త్రాస్త్రైర్జర్జరీకృతాః ॥10॥

పతంతు శత్రుహస్తాద్వా పాతయన్తు సహస్రధా ।
ఏతన్మనోరథం మే హి పూర్ణం కురు మహేశ్వర ॥11॥

దేవాధిదేవా! మహాదేవా! సర్వదేవశిరోమణీ! నీ దయ వల్ల మహాబలశాలినయ్యాను. కానీ నేను ఒక్కమాట చెబుతాను, దయచేసి విను. నాకు వెయ్యి చేతులిచ్చావు. ఏం చేసుకోను? వృథా భారం తప్ప. వీటిని ఉపయోగిద్దామంటే ఈ ముల్లోకాలలోనూ నన్నెదిరించి యుద్ధం చెయ్యగలవాడు ఒక్కడంటే ఒక్కడు లేడు–నువ్వు తప్ప. ఈ వేయిబాహువులను ఏం చేసుకోమంటావు ఇవి ఒక్కొక్కటీ ఒక్కొక్క పర్వతంలా ఉన్నాయి. సాటివచ్చే యోధుడే లేకపోయాక, హాయిమన్న యుద్ధమే లేకపోయాక ఎందుకు నాకీ బాహువులు? వీటి దురద తీర్చడానికి దిగ్గజాలతో పోరాడుతున్నాను. పట్టణాలను పిండి పిండి చేస్తున్నాను. పర్వతాలను పగలగొడుతున్నాను. అవేమో భయపడి పారిపోతున్నాయి. రెక్కలున్న పర్వతాలుగదా–ఎగిరిపోతున్నాయి. దిక్పాలకుల్ని లొంగదీసుకున్నాను. యముణ్ణి నాకు ప్రతియోధుడుగా నియమించుకున్నాను. అగ్నిదేవుణ్ణి మరొక ప్రతియోద్ధగా చేసుకున్నాను. వరుణుడిప్పుడు నా దగ్గర గోపాలకుడు. గోవుల రక్షకుడు. కుబేరుడు గజపాలకుడు. నిర్ఋతి నా సైరంధ్రి. ఆఖండలుణ్ణి (ఇంద్రుడు) జయించి నాకు సామంతుణ్ణి చేసేసుకున్నాను. కప్పం కడుతున్నాడు. సరే, ఇంతకీ నా భుజకండూతి తీరే మహాయుద్ధం ఎప్పుడో చెప్పు. శత్రుహస్తాలు ప్రయోగించిన శస్త్రాస్త్రాలతో నా బాహుసహస్రం ఖండఖండాలై రాలిపోవాలి, లేదా శత్రుహస్తాలను సహస్రధా రాలగొట్టాలి. మహేశ్వరా! దయచేసి ఈ నా కోరికను తీర్చు, నెరవేర్చు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తచ్ఛ్రుత్వా కుపితో రుద్రస్త్వట్టహాసం మహాద్భుతమ్ ।
కృత్వాఽబ్రవీన్మహామన్యుః భక్తబాధాపహారకః ॥12॥

వ్యాసా! ఈ మాటలకు రుద్రుడు రుద్రుడే అయ్యాడు. మహాద్భుతంగా అట్టహాసం చేశాడు. భక్తుల ఏ బాధనైనా తీర్చేవాడు, శంకరుడిప్పుడు మహాకుపితుడై ఇలా పలికాడు.

రుద్ర ఉవాచ – రుద్రుడు అన్నాడు.

ధిక్ ధిక్ త్వాం సర్వతో గర్విన్! సర్వదైత్యకులాధమ ।
బలిపుత్రస్య భక్తస్య నోచితం వచ ఈదృశమ్ ॥13॥

దర్పస్యాస్య ప్రశమనం లప్స్యసే చాశు దారుణమ్ ।
మహాయుద్ధమకస్మాద్వై బలినా మత్సమేన హి ॥14॥

తత్ర తే గిరి సంకాశా బాహవోఽనలకాష్ఠవత్ ।
ఛిన్నా భూమౌ పతిష్యంతి శస్త్రాస్త్రైః కదళీకృతాః ॥15॥

యదేష మానుషశిరో మయూరసహితో ధ్వజః ।
విద్యతే తవ దుష్టాత్మన్ తస్యస్యాత్పతనం యదా ॥16॥

స్థాపితస్యాయుధాగారే వినా వాతకృతం భయమ్ ।
తదా యుద్ధం మహాఘోరం సంప్రాప్తమితి చేతసి ॥17॥

నిధాయ ఘోరం సంగ్రామం గచ్ఛేథాః సర్వసైన్యవాన్ ।
సాంప్రతం గచ్ఛ తద్వేశ్మ యతస్తద్విద్యతే శివః ॥18॥

తథా తాన్ స్వమహోత్పాతాన్ తత్ర దృష్టాసి దుర్మతే ।
ఇత్యుక్త్వా విరరామాథ గర్వహృత్ భక్తవత్సలః ॥19॥

ఛీ! ఛీ! దురహంకారీ! దైత్యకులంలో చెడబట్టావుగదరా! మీ నాన్న బలిచక్రవర్తి మహాభక్తుడు. అతడి కడుపునబుట్టి నువ్విలా మాట్లాడటం సిగ్గుచేటు. నీ దర్పం అంతా అణగారిపోయే దారుణమహాయుద్ధం–నాకు సర్వాత్మనా సాటివచ్చే మహాబలశాలితో నీకు త్వరలోనే లభిస్తుంది. అదీ అకస్మాత్తుగా లభిస్తుంది. ఆ దారుణ సంగ్రామంలో ఇప్పుడు పర్వతాల్లాగా ఉన్న నీ బాహువులు ఎండుకట్టెల్లాగా విరిగి నేలకు రాలిపడతాయి. అతడి శస్త్రాస్త్రాలకు నీ భుజాలు వెయ్యి అరటిబోదెలవుతాయి. దుష్టబుద్ధీ! నీ ఆయుధాగారం మీద రెపరెపలాడుతున్న జెండా, మానుషశిరస్సూ, మయూరచిహ్నమూ కలిగిన జెండా–ఏ సుడిగాలీ లేకుండానే విరిగి పడుతుంది. అదిగో ఆనాడు నీకు ఈ మహాఘోరయుద్ధం సంప్రాప్తమయ్యిందని తెలుసుకో. సర్వసైన్యసమేతుడివై సంగ్రామరంగానికి బయలుదేరుదువుగాని. ఇప్పటికి ఇంటికి వెళ్ళు–అని మరలా ఇలా అన్నాడు. శివుడు! దుర్మతీ! ఈ మహోత్పాతాల్ని త్వరలోనే చూస్తావు–అని పలికి ఆ భక్తవత్సలుడు ఆ గర్వాపహారి రుద్రుడు విరమించాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తచ్ఛ్రుత్వా రుద్రమభ్యర్చ్య దివ్యైరంజలికుడ్మలైః ।
ప్రణమ్య చ మహాదేవం బాణశ్చ స్వగృహం గతః ॥20॥

కుంభాండాయ యథావృత్తం పృష్టః ప్రోవాచ హర్షితః ।
పరైర్వక్షిష్టాసురో బాణస్తం యోగం హ్యుత్సుకస్సదా ॥21॥

అథ దైవాత్కదాచిత్స స్వయం భగ్నం ధ్వజం చ తమ్ ।
దృష్ట్వా తత్రాసురో బాణో హృష్టో యుద్ధాయ నిర్యయౌ ॥22॥

స స్వసైన్యం సమాహూయ సంయుక్తః సాష్టభిర్గణైః ।
ఇష్టిం సాంగ్రామికాం కృత్వా దృష్ట్వా సాంగ్రామికం మధు ॥23॥

ఉకుభాం మంగళం సర్వం సంప్రేక్ష్య ప్రస్థితోఽభవత్ ।
మహోత్సాహో మహావీరో బలిపుత్రో మహారథః ॥24॥

ఇతి హృత్కమలే కృత్వా కః కస్మాదాగమిష్యతి ।
యోద్ధా రణప్రియో యస్తు నానాశస్త్రాస్త్రపారగః ॥25॥

యస్తు బాహుసహస్రం మే ఛినత్త్వనలకాష్ఠవత్ ।
తథా శస్త్రైర్మహాతీక్ష్ణైః ఛినద్మి శతశస్త్విహ ॥26॥

బాణాసురుడు ఈ మాటలన్నీ ఆలకించాడు. దివ్యాంజలికుట్మలాలతో రుద్రుణ్ణి అర్చించాడు. నమస్కరించాడు. ఇంటికి తిరిగి వెళ్ళాడు. కుంభాండుడు అడిగితే జరిగిన ఈ వృత్తాంతమంతా ఆనందంగా తెలియజెప్పాడు. ఆ మహాసంగ్రామయోగం ఎప్పుడా ఎప్పుడా అని ఆనాటి నుంచీ ఉత్సుకతతో ఎదురుచూస్తున్నాడు. కొంతకాలానికి ఒకనాడు ఆయుధాగారం మీది ధ్వజం తనంతతానుగా విరిగి పడింది. బాణాసురుడే స్వయంగా చూశాడు. ఆనందపరవశుడయ్యాడు. రణయోగం రానే వచ్చిందని వెంటనే యుద్ధప్రయత్నాలు చేపట్టాడు. సమస్తసైన్యాన్నీ సన్నద్ధం చేశాడు. తన అష్టసేనాగణాలతో కలిసి "సాంగ్రామికం" అనే ఇష్టిని (యజ్ఞం) సశాస్త్రీయంగా నిర్వహించి, సాంగ్రామికమధువును దర్శించి, దశదిశలూ మంగళప్రదాలుగా ఉన్నాయని గుర్తించి యుద్ధానికి కదిలాడు. ఆ బలిపుత్రుడు మహారథుడు, మహావీరుడు, మహోత్సాహి. అప్పుడు అతడి హృదయపద్మంలో ఒక్కటే ప్రశ్న–తనతో యుద్ధానికి వచ్చేవాడు ఎవడు? ఎవడు ఆ రణప్రియుడు? ఎవడు ఆ యోద్ధ? ఏపాటి శస్త్రాస్త్రపారంగతుడు? ఎండుకట్టెల్లాగా నా బాహుసహస్రాన్ని తీక్ష్ణశరాలతో విరగ్గొడతాడా లేక నేనే అతడి బాహువుల్ని నూరు ప్రక్కలు చేస్తానా? ఇదే ఆలోచనతో కదిలాడు.

ఏతస్మిన్నంతరే కామః సంప్రాప్తశ్శంకరేణ హి ।
యత్ర సా బాణదుహితా సుజాతా కృతమంగళా ॥27॥

మాధవం మాధవే మాసి పూజయిత్వా మహానిశి ।
సుప్తా చాంతఃపురే గుప్తే స్త్రీభావముపలంబితా ॥28॥

గౌర్యా సంప్రేషితేనాపి వ్యాకృష్టా దివ్యమాయయా ।
కృష్ణాత్మజాత్మజేనాథ రుదంతీ సా హ్యనాథవత్ ॥29॥

స చాపి తాం బలాద్భుక్త్వా పార్వత్యాః సఖిభిః పునః ।
నీతస్తు దివ్యయోగేన ద్వారకాం నిమిషాంతరాత్ ॥30॥

వ్యాసమునీ! అదే సమయానికి వైశాఖమాసం ప్రవేశించింది. శుక్లపక్ష ద్వాదశి. బాణపుత్రి ఉషాకుమారి మంగళస్నానం చేసి మాధవుణ్ణి అర్చించి రాత్రికి ఉపవాసదీక్ష ముగించి తన సురక్షితమైన అంతఃపురంలో హాయిగా నిద్రించింది. ఈడేరి పరిపూర్ణస్త్రీ లక్షణాలను పొదువుకుని నిద్రిస్తున్న ఆ నడిరేయి అక్కడికి మన్మథుడు ప్రవేశించాడు. శంకరుణ్ణి వెంటబెట్టుకుని మరీ వచ్చాడు. (శంకరుడి ప్రేరణతో వచ్చాడని కావచ్చు) అప్పుడు గౌరీదేవి తన దివ్యమాయాశక్తితో కృష్ణుడి మనుమడైన అనిరుద్ధుణ్ణి (కృష్ణుడి కొడుకు ప్రద్యుమ్నుడు. ప్రద్యుమ్నుడి కొడుకు అనిరుద్ధుడు. కనక పౌత్రుడు) అక్కడికి పంపింది. అతడు ఉషాబాలను ఆ శయ్యమీద తనవైపు లాక్కున్నాడు.

ఉష ఒక అనాథలా బావురుమంది. అతడు విడిచిపెట్టకుండా బలాత్కారంగా ఆమెను అనుభవించాడు. కాగానే పార్వతీసఖులు తమ దివ్యయోగశక్తితో అతణ్ణి క్షణాలమీద ద్వారకాపట్టణానికి చేర్చారు.

మృదితా సా తథోత్థాయ రుదంతీ వివిధా గిరః ।
సఖీభ్యః కథయిత్వా తు దేహత్యాగే కృతక్షణా ॥31॥

సఖ్యా కృతాత్మనో దోషం సా వ్యాస స్మారితా పునః ।
సర్వం తత్పూర్వవృత్తాంతం తతో హృష్టా చ సాఽభవత్ ॥32॥

అబ్రవీచ్చిత్రలేఖాం చ తతో మధురయా గిరా ।
ఉషా బాణస్య తనయా కుంభాండతనయాం మునే ॥33॥

అలా నలిగిపోయి ఉషాబాల శయ్యనుంచి చటుక్కున లేచింది. విలపిస్తూనే తన చెలికత్తెలతో ఏదేదో పలవరించింది. జరిగినదంతాచెప్పుకుంది. దేహత్యాగానికి నిర్ణయించుకుంది. అప్పుడు ఆమె ప్రధానసఖి కుంభాండుడి కూతురు చిత్రలేఖ కల్పించుకుని ఒకప్పుడు ఉషాబాలచేసిన పొరపాటును (పార్వతీ రూపధారణ) గుర్తుచేసింది. వ్యాసమునీ! అప్పుడు ఆ బాణపుత్రికకి అప్పుడు జరిగిన వృత్తాంతమంతా మదిలో మెదిలింది. దుఃఖంతొలగిపోయి, ఆనందంవెల్లివిరిసింది. మునీశ్వరా! ఇప్పుడు మధురవాక్కులతో బాణతనయ ఆ చిత్రలేఖనుద్దేశించి ఇలా పలికింది.

ఉషోవాచ – ఉష పలికింది.

సఖి యద్యేష మే భర్తా పార్వత్యా విహితః పురా ।
కేనోపాయేన తే గుప్తః ప్రాప్యతే విధివన్మయా ॥34॥

కస్మిన్ కులే స వా జాతో మమ యేన హృతం మనః ।
ఇత్యూషా వచనం శ్రుత్వా సఖీ ప్రోవాచ తాం తదా ॥35॥

సఖీ! చిత్రలేఖా! ముందుగానే పార్వతీదేవి నాకు నిశ్చయించిన భర్త ఇతడే అయితే, ఎక్కడో దాగున్న ఇతడు ఏ ఉపాయంతో నాకు దొరుకుతాడు?, వివాహవిధి పూర్వకంగా నాకు ఎలా సొంతమవుతాడు? నా మనస్సును దోచుకున్న ఇతడు ఏ కులంలో పుట్టాడో? ఇలా అంటున్న ఉషాదేవికి చిత్రలేఖ ఇలా బదులు పలికింది.

చిత్రలేఖోవాచ – చిత్రలేఖ పలికింది.

త్వయా స్వప్నే చ యో దృష్టః పురుషో దేవి తం కథమ్ ।
అహం సమానయిష్యామి న విజ్ఞాతస్తు యో మమ ॥36॥

దైత్యకన్యా తదుక్తే తు రాగాంధా మరణోత్సకా ।
రక్షితా చ తయా సఖ్యా ప్రథమే దివసే తతః ॥37॥

పునః ప్రోవాచ సోషాం వై చిత్రలేఖా మహామతిః ।
కుంభాండస్య సుతా బాణతనయాం మునిసత్తమ ॥38॥

వ్యసనం తేఽపకర్షామి త్రిలోక్యాం యది భాష్యతే ।
సమానేష్యే నరం యస్తే మనోహర్తా తమాదిశ ॥39॥

ఉషాదేవీ! స్వప్నంలో నువ్వు చూసిన పురుషుణ్ణి నేనెలా తీసుకురాగలను? నాకు అతడెవరో తెలియదుగదా! అని చిత్రలేఖ పలికే సరికి రాగాంధురాలైన ఉషాదేవి నిరాశతో ప్రాణత్యాగానికే నిర్ణయించుకుంది. ఆ పూటకి ఎలాగో చిత్రలేఖ ఆమెను వారించి రక్షించింది. బుద్ధిమంతురాలు చిత్రలేఖ. రెండోపూట మళ్ళీ బాణపుత్రికతో మాట్లాడింది. ఉషా! నీ కష్టం నేను తీరుస్తాను. నీ మనస్సు హరించిన అతగాడెవడో నువ్వు గుర్తుపట్టి తెలియజెప్పు. ముల్లోకాలలో ఎక్కడ ఉన్నా తీసుకువస్తాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా వస్త్రపుటకే దేవాన్ దైత్యాంశ్చ దానవాన్ ।
గంధర్వ సిద్ధనాగాంశ్చ యక్షాదీంశ్చ తథాఽలిఖత్ ॥40॥

తథా నరాంస్తేషు వృష్ణీన్ శూరమానకదుందుభిమ్ ।
వ్యలిఖద్రామకృష్ణౌ చ ప్రద్యుమ్నం నరసత్తమమ్ ॥41॥

అనిరుద్ధం విలిఖితం ప్రాద్యుమ్నిం వీక్ష్య లజ్జితా ।
ఆసీదవాఙ్ముఖీ చోషా హృదయే హర్షపూరితా ॥42॥

వ్యాసమునీ! చిత్రలేఖ ఇలా ధైర్యం చెప్పి ఒక వస్త్రపుటంమీద దేవ–దైత్య–దానవ–గంధర్వ–సిద్ధ– నాగ–యక్షాది వీరకుమారుల బొమ్మలు చిత్రించి ఉషకు చూపించింది. అలాగే మానవవీరుల బొమ్మలు చిత్రించింది. వృష్ణివీరుల్నీ శూరుడైన ఆనకదుందుభినీ చిత్రించింది. బలరామకృష్ణుల్నీ నరవరుడైన ప్రద్యుమ్నుణ్ణి లిఖించింది. అటుపైని ప్రద్యుమ్నుడి కుమారుడైన అనిరుద్ధుణ్ణి చిత్రించింది. ఇతడిని చూడగానే ఉషాదేవికి సిగ్గు ముంచుకువచ్చింది.

ఉషా ప్రోవాచ చౌరోఽసౌ మయా ప్రాప్తస్తు యో నిశి ।
పురుషస్సఖి యేనాశు చేతో రత్నం హృతం మమ ॥43॥

యస్య సంస్పర్శనాదేవ మోహితాహం తథాభవమ్ ।
తమహం జ్ఞాతుమిచ్ఛామి వద సర్వం చ భామిని ॥44॥

కస్యాయమన్వయే జాతో నామ కించాస్య విద్యతే ।
ఇత్యుక్త్వా సాబ్రవీన్నామ యోగినీ తస్య చాన్వయమ్ ॥45॥

సర్వమాకర్ణ్య సా తస్య కులాది మునిసత్తమ ।
ఉత్సుకా బాణతనయా బభాషే సా తు కామినీ ॥46॥

హృదయం ఆనందపరిపూరితమయ్యింది. ముఖం మెల్లగా కిందికిదించుకుంది. సఖీ! చిత్రలేఖా! ఇతడే ఆ దొంగ. అర్ధరాత్రి నన్ను సమీపించి నా మనోరత్నాన్నీ అపహరించుకుపోయిన పురుషపుంగవుడితడే. ఇతడి

స్పర్శమాత్రానికే ఆ రేయి నేను సమ్మోహితురాలినైపోయాను. భామినీ! చిత్రలేఖా! ఇతడెవరు? ఇతడి సమస్తసమాచారమూ నాకు కావాలి. తెలియజెప్పు. ఇతడి వంశం ఏమిటి? పేరేమిటి? అంతా చెప్పు– అని ఉషాబాల ఆత్రంగాఅడిగింది. యోగిని చిత్రలేఖతో ఉన్నవంశక్రమం అంతా తెలియపరిచింది. మునీశ్వరా! అంతా విని ఉషాభామిని చాలా ఉత్సుకురాలై పలికింది.

ఉషోవాచ – ఉష అన్నది.

ఉపాయం రచయ ప్రీత్యా తత్ప్రాప్తై ్య సఖి తత్క్షణాత్ ।
యేనోపాయేన తం కాంతం లభేయం ప్రాణవల్లభమ్ ॥47॥

యం వినాహం క్షణం నైకం సఖి జీవితుముత్సహే ।
తమానయేహ సద్యత్నాత్సుఖినీం కురు మాం సఖి ॥48॥

సఖీ! చిత్రలేఖా! ఉపాయం ఏదైనా ఆలోచించు. నా మీద ప్రేమగదా! నీకు. నేను వెంటనే అతడిని పొందాలి. ఆ అందగాణ్ణి నా ప్రాణవల్లభుణ్ణి పొందే ఉపాయం ఆలోచించు. అతడు లేనిదే ఒక్కక్షణమైనా నాకు జీవించాలని లేదు. సఖీ! సఖీ! గట్టి ప్రయత్నం ఏదో ఒకటి చెయ్యి. అతడిని ఇక్కడికి తీసుకురా. దయచేసి నాకు ఆ సుఖంకలిగించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తా సా తథా బాణాత్మజయా మంత్రికన్యకా ।
విస్మితాభూన్మునిశ్రేష్ఠ! సువిచారపరాభవత్ ॥49॥

తతస్సఖీం సమాభాష్య చిత్రలేఖా మనోజవా ।
బుధ్వా తం కృష్ణపౌత్రం సా ద్వారకాం గంతుముద్యతా ॥50॥

జ్యేష్ఠకృష్ణచతుర్దశ్యాం తృతీయే తు గతేఽహని ।
ఆప్రభాతాన్ముహూర్తే తు సంప్రాప్తా ద్వారకాం పురీమ్ ॥51॥

ఏకేన క్షణమాత్రేణ నభసా దివ్యయోగినీ ।
తతశ్చాంతఃపురోద్యానే ప్రాద్యుమ్నిర్దదృశే తయా ॥52॥

క్రీడన్నారీజనైస్సార్ధం ప్రపిబన్మాధవీమధు ।
సర్వాంగసుందరః శ్యామః సుస్మితో నవయౌవనః ॥53॥

మునిశ్రేష్ఠా! బాణపుత్రిక ఇలా అడిగేసరికి మంత్రికన్యక చిత్రలేఖ ఆశ్చర్యపోయింది. దీర్ఘంగా ఆలోచించింది. అటుపైని రాకుమారిని ఊరడించింది. ఆమె మనస్సును దోచినవాడు కృష్ణపౌత్రుడు గనక ద్వారకకు బయలుదేరింది. మనోవేగంతో ప్రయాణించగలిగినది చిత్రలేఖ. జ్యేష్ఠమాసం–కృష్ణచతుర్దశి–తరువాత మూడునాళ్ళు గడిచి నాల్గవ సుప్రభాతాన సుముహూర్తం నిశ్చయించుకుని ఆ దివ్యయోగిని ఆకాశమార్గాన క్షణకాలంలో ద్వారకాపట్టణం చేరుకుంది. అక్కడ అది సాయంక్రీడా సమయం కాబోలు–ప్రద్యుమ్నపుత్రుడు నారీజనంతో కలిసి అంతఃపురోద్యానంలో

పురోద్యానంలో క్రీడిస్తున్నాడు. మాధవీమధువు సేవిస్తున్నాడు. సర్వాంగసుందరుడు. తాతగారిలాగానే మేఘశ్యాముడు. చిరునవ్వులు చిందిస్తున్న నవయౌవనుడు. చిత్రలేఖ అతడిని కన్నులారా చూసింది.

తతః ఖట్వాం సమారూఢమంధకారపటేన సా ।
ఆచ్ఛాదయిత్వా యోగేన తామసేన చ మాధవమ్ ॥54॥

తతస్సా మూర్ధ్ని తాం ఖట్వాం గృహీత్వా నిమిషాంతరాత్ ।
సంప్రాప్తా శోణితపురం యత్ర సా బాణనందినీ ॥55॥

కామార్తా వివిధాన్ భావాన్ చకారోన్మత్తమానసా ।
ఆనీతమథ తం దృష్ట్వా తదా భీతా చ సాఽభవత్ ॥56॥

క్రీడించి క్రీడించి ఆ నవయౌవనుడు శయనంపై అధిరోహించాడు. అప్పుడు చిత్రలేఖ తన తామసయోగ విద్యతో ఒక అంధకారవస్త్రాన్ని సృష్టించి అతడిని కప్పివేసింది. శయనంతో సహా ఎత్తి నెత్తిన పెట్టుకుని నిమేషమాత్రంలో శోణితపురం చేరుకుంది. ఉషాబాల ఉన్న అంతఃపురమందిరంలో దిగింది. కామార్త ఆ బాణపుత్రిక అనిరుద్ధుణ్ణి చూసి ఉన్మత్తమానస అయ్యింది. రకరకాల కోరికలకూ భావవికారాలకూ లోనయ్యింది. అంతలోనే భయకంపిత అయ్యింది.

అంతఃపురే సుగుప్తే చ నవే తస్మిన్సమాగమే ।
యావత్క్రీడితుమారబ్ధం తావద్ జ్ఞాతం చ తత్క్షణాత్ ॥57॥

అంతఃపురద్వారగతైః వేత్రజర్జరపాణిభిః ।
ఇంగితైరనుమానైశ్చ కన్యా దౌశ్శీల్యమాచరన్ ॥58॥

స చాపి దృష్టః తైస్తత్ర నరో దివ్యవపుర్ధరః ।
తరుణో దర్శనీయస్తు సాహసీ సమరప్రియః ॥59॥

తం దృష్ట్వా సర్వమాచఖ్యుర్బాణాయ బలిసూనవే ।
పురుషాస్తే మహావీరాః కన్యాంతఃపుర రక్షకాః ॥60॥

అది అంతఃపురం. రక్షితస్థలం. అక్కడ వీరినవసంగమం. విహారం ప్రారంభమవుతోంది. అప్పటికే దండధారణతో చేతులు కాయలుకాసిన ద్వారపాలకులు పసిగట్టేశారు. దాసీజనాల కదలికలతో ముఖకవళికలతో దేనికైనా పసికట్టగలిగిన ద్వారపాలకులు, ఉషాకన్యతో చెడుగా ప్రవర్తించుచున్న నవయౌవనుణ్ణి చూడనే చూశారు. మానవుడే కానీ దివ్యవపుస్సుందరుడు. తరుణుడు. దర్శనీయుడు. మహాసాహసి. సమరప్రియుడు–అనిరుద్ధుడు. అతడిని అక్కడ అలా చూసిన ఆ మహావీరులు ఆ కన్యాంతఃపురరక్షకులు వెంటనే వెళ్ళి బలిపుత్రుడైన బాణాసురుడికి తాము చూసినదంతా విన్నవించారు.

ద్వారపాలా ఊచుః – ద్వారపాలకులు విన్నవించారు.

దేవ కశ్చిన్న జానీతే గుప్తశ్చాంతఃపురే బలాత్ ।
స కస్తు తవ కన్యాం వై స్వయంగ్రాహాదధర్షయత్ ॥61॥

దానవేంద్ర మహాబాహో పశ్య పశ్యైనమత్ర చ ।
యద్యుక్తం స్యాత్తత్కురుష్వ న దుష్టా వయమిత్యుత ॥62॥

తేషాం తద్వచనం శ్రుత్వా దానవేంద్రో మహాబలః ।
విస్మితోఽ భూన్మునిశ్రేష్ఠ కన్యాయాః శ్రుతదూషణః ॥63॥

ప్రభూ! మహాప్రభూ! ఎవడో తెలీదుగానీ ఒకడు కన్యాంతఃపురంలో ప్రవేశించి దాక్కొన్నాడు. ఎవడో మరి? నీ పుత్రికను ఉషాకన్యకను బలాత్కారంగా స్వయంగ్రాహంతో (కోరి కౌగిలించుకుని) లోబరుచుకున్నాడు. బాహుబలశాలీ! దానవేంద్రా! వెంటనే నువ్వే స్వయంగా వచ్చిచూడు. ఏది చెయ్యాలో అది చెయ్యి. ఇందులో మా తప్పు కొంచెంకూడా లేదు–అని ద్వారపాలకులు విన్నవించేసరికి వ్యాసమునీ! మహాబలి బాణాసురుడు తన పుత్రిక చేసిన తప్పును గ్రహించి నివ్వెరపోయాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే ఉషాచరిత్రవర్ణనం నామ ద్విపంచాశత్తమోఽ ధ్యాయః ॥52॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు ఉషాచరిత్ర వర్ణనమనే యాబై రెండవ అధ్యాయం సమాప్తం.

త్రిపంచాశత్తమోఽధ్యాయః – యాభై మూడవ అధ్యాయం

అనిరుద్ధోషా వివాహవర్ణనమ్ – అనిరుద్ధ–ఉషా వివాహవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

అథ బాణాసురః క్రుద్ధస్తత్ర గత్వా దదర్శ తమ్ ।
దివ్యలీలాత్తవపుషం ప్రథమే వయసి స్థితమ్ ॥1॥

తం దృష్ట్వా విస్మితం వాక్యం కిం కారణమథాబ్రవీత్ ।
బాణః క్రోధపరీతాత్మా యుధి శౌండో హసన్నివ ॥2॥

అహో మనుష్యో రూపాఢ్యః సాహసీ ధైర్యవానితి ।
కోఽయమాగతకాలశ్చ దుష్టభాగ్యో విమూఢధీః ॥3॥

యేన మే కులచారిత్రం దూషితం దుహితా హితా ।
తం మారయధ్వం కుపితాః శీఘ్రం శస్త్రైస్సుదారుణైః ॥4॥

దురాచారం చ తం బద్ధ్వా ఘోరే కారాగృహే తతః ।
రక్షధ్వం వికటే వీరా బహుకాలం విశేషతః ॥5॥

న జానే కోఽయమభయః కో వా ఘోరపరాక్రమః ।
విచార్యేతి మహాబుద్ధిః సందిగ్ధోఽభూచ్ఛురా సురః ॥6॥

బాణాసురుడు కోపంతో మండిపడ్డాడు. వెంటనే వెళ్ళి–ప్రథమయౌవనంలో దివ్యలీలాస్వరూపంతో విరాజిల్లుతున్న అనిరుద్ధుణ్ణి స్వయంగా చూశాడు. ఆశ్చర్యచకితుడయ్యాడు. క్షణంలో మళ్ళీ క్రోధవివశుడయ్యాడు ఆ యుద్ధవిద్యావిశారదుడు బాణాసురుడు. ఆ కోపంలో పెద్దగా నవ్వాడు. ఎవడవురా నువ్వు? ఎందుకు వచ్చావిక్కడికి? నువ్వొక మానవమాత్రుడివి. కానీ అందగాడివి అహో సాహసివి. ధైర్యశాలివి. కాలం మూడి ఇక్కడికి వచ్చావు. దురదృష్టవంతుడివి. బుద్ధిహీనుడివి. ఎవడవురా నువ్వు! నా వంశసౌశీల్యాన్ని కళంకితం చేశావు. నా కన్నకూతురిని దూషితురాలిని చేశావు. సైనికులారా! మహావీరులారా! మీ దారుణశస్త్రాస్త్రాలతో వీణ్ణి ఇప్పుడే వెంటనే చితకబాదండి. అటుపైని ఈ దురాచారుణ్ణి ఘోరకారాగారంలో బంధించండి. గట్టి కాపలా పెట్టండి. వీరులారా! వికృతకారాగృహంలో వీడు బహుకాలం ఉండాలి–అని ఆజ్ఞాపించాడే గానీ ధీశాలి బాణాసురుడు ఆలోచనలో పడ్డాడు. జంకూ, గొంకూ లేకుండా నిలబడ్డాడు. మహాపరాక్రమశాలి కాకపోతే ఇంతటి సాహసం చేస్తాడా, ఇలా నిలబడతాడా? ఎవడు వీడు? అని సందేహసంకులుడయ్యాడు.

తతో దైత్యేన సైన్యం తు శతసాహస్రకం శనైః ।
వధాయ తస్య వీరస్య వ్యాదిష్టం పాపబుద్ధినా ॥7॥
తదాదిష్టాస్తు తే వీరాః సర్వతోఽంతఃపురం ద్రుతమ్ ।
ఛాదయామాసురత్యుగ్రాః ఛింది ఛిందీతి వాదినః ॥8॥

శత్రుసైన్యం తతో దృష్ట్వా గర్జమానస్య యాదవః ।
అంతఃపురే ద్వారగతం పరిఘం గృహ్య చాతులమ్ ॥9॥

నిష్క్రాంతో భవనాత్తస్మాద్వజ్రహస్త ఇవాంతకః ।
తేన తాన్ కింకరాన్ హత్వా పునశ్చాంతఃపురం యయౌ ॥10॥

అయినా ఆ పాపాత్ముడు శరాసురుడు ఒక లక్షమంది దైత్యసైన్యాన్ని ఆజ్ఞాపించి అతడిని మట్టుబెట్టమన్నాడు. అంతే–దైత్యమహావీరులు అన్ని వైపుల నుంచీ అంతఃపురాన్ని చుట్టుముట్టారు. చీల్చు–నరుకు అంటూ ఎగబడ్డారు. ఆ యదుకుమారుడు అనిరుద్ధుడు శత్రుసైన్యాన్ని తేరిపారజూశాడు. సింహగర్జన చేశాడు. అంతఃపురద్వారానికి ఉన్న పరిఘను పెకలించి చేతబట్టాడు. వజ్రాయుధం ధరించిన యముడిలా అంతఃపురభవనం వెడలి వచ్చాడు. వస్తూనే ఆ పరిఘతో అతిలాఘవంగా లక్షమంది కింకరుల్నీ సంహరించి మళ్ళీ వెంటనే అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు.

ఏవం శతసహస్రాణి సైన్యాని మునిసత్తమ ।
జఘాన రోషరక్తాక్షో వర్ధితదశ్శివతేజసా ॥11॥

లక్షే హతేఽథ యోధానాం తతో బాణాసురో రుషా ।
కుంభాండం స గృహీత్వా తు యుద్ధే శౌండం సమాహ్వయత్ ॥12॥

అనిరుద్ధం మహాబుద్ధిం ద్వంద్వయుద్ధే మహాహవే ।
ప్రాద్యుమ్నిం రక్షితం శైవతేజసా ప్రజ్వలత్తనుమ్ ॥13॥

తతో దశసహస్రాణి తురంగానాం రథోత్తమాన్ ।
యుద్ధప్రాప్తేన ఖడ్గేన దైత్యేంద్రస్య జఘాన సః ॥14॥

తద్వధాయ తతశ్శక్తిం కాలవైశ్వానరోపమామ్ ।
అనిరుద్ధో గృహీత్వా తాం తయా తం నిజఘాన హి ॥15॥

రథోపస్థో తతో బాణస్తేన శక్త్యాహతో దృఢమ్ ।
స సాశ్వస్తత్క్షణం వీరః తత్తైవాంతరధీయత ॥16॥

తస్మింస్త్వదర్శనం ప్రాప్తే ప్రాద్యుమ్నిరపరాజితమ్ ।
ఆలోక్య కకుభస్సర్వాః తస్థౌ గిరిరివాచలః ॥17॥

వ్యాసమునిసత్తమా! ఇలా అనిరుద్ధుడు రోషరక్తాక్షుడై ఒకానొక శివతేజస్సుతో కలిసి పెరిగిపోయి లక్షమంది దైత్యసైన్యాన్ని చంపాడు. అది గమనించిన బాణుడు రోషంతో ఊగిపోయాడు. యుద్ధవిద్యలో నిపుణుడైన తన మంత్రిని కుంభాండుని వెంట బెట్టుకుని రణరంగానికి దిగాడు. ధీకుశలుడైన అనిరుద్ధుణ్ణి ద్వంద్వయుద్ధానికి ఆహ్వానించాడు. శైవతేజస్సుతో సంరక్షితుడై ప్రకాశిస్తున్న ప్రాద్యుమ్నితో మహాహవం ప్రారంభమయ్యింది. రణరంగంలో చేతికందిన ఒక ఖడ్గాన్ని పట్టుకుని అనిరుద్ధుడు పదివేల తురగాలనూ, మహారథాలనూ తుత్తునియలు చేశాడు. దైత్యేంద్రుడు కాలాగ్నితుల్యమైన శక్తి ఆయుధాన్ని అతడిపైకి విసిరాడు–చంపేద్దామని. కానీ అనిరుద్ధుడు దాన్ని

అవలీలగా అందుకుని తిరిగి దైత్యనాథుడిమీదికే విసిరాడు. దాని దెబ్బకు బాణాసురుడు రథంలో కూలబడ్డాడు. క్షణం ఆలస్యం చెయ్యకుండా రథంతోనూ రథాశ్వాలతోనూ సహా అంతర్ధానం చెందాడు. బాణాసురుడు అలా కనిపించకుండా పోయేసరికి పరాజయం ఎరుగని ప్రాద్యుమ్ని (అనిరుద్ధుడు) ఆశ్చర్యచకితుడై దశదిశలూ తేరిపారజూస్తూ కదలని పర్వతంలా కదనరంగాన నిలిచాడు.

అదృశ్యమానస్తు తదా కూటయోధస్స దానవః ।
నానాశస్త్రసహస్రైస్తం జఘాన హి పునః పునః ॥18॥

ఛద్మనా నాగపాశైస్తం బబంధ స మహాబలః ।
బలిపుత్రో మహావీరశ్శివభక్తశ్శరాసురః ॥19॥

తం బద్ధ్వా పంజరాంతస్థం కృత్వా యుద్ధాదుపారమత్ ।
ఉవాచ బాణ స్సంక్రుద్ధస్సూతపుత్రం మహాబలమ్ ॥20॥

వ్యాసర్షీ! అలా అదృశ్యమానుడై ఆ దానవుడు కూటయుద్ధం ఆరంభించాడు. రకరకాల శస్త్రాస్త్రాలతో ఎడతెరపి లేకుండా అనిరుద్ధుణ్ణి హింసించాడు. శివభక్తుడూ, మహాబలుడూ, మహావీరుడూ, బలిపుత్రుడూ అయిన బాణాసురుడు చివరికి ఇలా మోసగించి నాగాస్త్రంతో అనిరుద్ధుణ్ణి బంధించాడు. పంజరంలో పెట్టించాడు. యుద్ధం విరమించాడు. క్రోధం ఆపుకోలేక తన రథసారథి కొడుకుకి ఇలా ఆజ్ఞాపించాడు.

బాణాసుర ఉవాచ – బాణాసురుడు అన్నాడు.

సూతపుత్ర శిరశ్ఛింధి పురుషస్యాస్య వై లఘు ।
యేన మే దూషితం పూతం బలాద్దుష్టేన సత్కులమ్ ॥21॥

ఛిత్వా తు సర్వగాత్రాణి రాక్షసేభ్యః ప్రయచ్ఛ భోః ।
అథాస్య రక్తమాంసాని క్రవ్యాదా అపి భుంజతామ్ ॥22॥

అగాధే తృణసంకీర్ణే కూపే పాతకినం జహి ।
కిం బహూక్త్యా సూతపుత్ర మారణీయో హి సర్వథా ॥23॥

సూతపుత్రా! వెంటనే ఆలస్యం చెయ్యకుండా ఈ పురుషుడి శిరస్సుఛేదించు. వీడు పవిత్రమైన నా సద్వంశాన్ని బలవంతంగా దూషితం చేసేశాడు. వీడి శరీరాన్ని ముక్కలు ముక్కలు చేసి మన రక్కసులకు పంచిపెట్టు. మిగిలిన వీడి రక్తమాంసాలను నక్కలూ కాకులూ గ్రద్దలూ కూడా భుజించుగాక! ఈ మహాపాపిని ఒక దట్టమైన గడ్డిపెరిగిన, లోతు తెలియని బావిలోకి విసిరేయ్! ఇన్ని మాటలెందుకు సూతపుత్రా! ఎలాగైనా సరే వీణ్ని చంపివేయి!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తస్య తద్వచనం శ్రుత్వా ధర్మబుద్ధిర్నిశాచరః ।
కుంభాండస్తు బ్రువీద్వాక్యం బాణం సన్మంత్రిసత్తమః ॥24॥

వ్యాసా! బాణాసురుడిలా ఆజ్ఞాపించే సరికి అతడి మంత్రి కుంభాండుడు కల్పించుకున్నాడు. ఉన్నంతలో అతడు ధర్మబుద్ధి. బాణుడికి ఉత్తమమంత్రి సత్తముడూ అయిన అతడిలా పలికాడు.

కుంభాండ ఉవాచ – కుంభాండుడు పలికాడు.

నైతత్కర్తుం సముచితం కర్మ దేవ విచార్యతామ్ ।
అస్మిన్ హతే హతోహ్యాత్మా భవేదితి మతిర్మమ ॥25॥

అయం తు దృశ్యతే దేవ తుల్యో విష్ణోః పరాక్రమైః ।
వర్ధితశ్చంద్రచూడస్య త్వద్దుష్టస్య సుచేతసా ॥26॥

అథ చంద్రలలాటస్య సాహసేన సమః స్వయమ్ ।
ఇమామవస్థాం ప్రాప్తోఽసి పౌరుషే సంవ్యవస్థిత ॥27॥

అయం శివప్రసాదాద్వై కృష్ణపౌత్రో మహాబలః ।
అస్మాన్ తృణోపమాన్ వేత్తి దష్టోఽపి భుజగైర్బలాత్ ॥28॥

దేవా! దైత్యనాథా! కొంచెం ఆలోచించు. ఇది చెయ్యదగిన పని కాదనుకుంటాను. ఇతణ్ణి చంపడమంటే మనల్ని మనమే చంపుకోవడం అనిపిస్తోంది నాకు. బాణాసురవిభూ! ఇతడు పరాక్రమాలలో విష్ణుతుల్యుడుగా కనిపిస్తున్నాడు. ఎందుకో నీపై అలిగి చంద్రశేఖరుడు ఇతడిపట్ల మంచిమనస్సుకలవాడై ఇతణ్ణి ఇలా వృద్ధిపరిచాడనీ అనిపిస్తోంది. ఈ యువకుడు ధైర్యసాహసాలలో స్వయంగా చంద్రచూడునివలే ఉన్నాడు. నువ్వు పౌరుషానికి పోయి ఇటువంటిదురవస్థకు లోనయ్యావు. మహాబలశాలి ఈ కృష్ణపౌత్రుడు శివానుగ్రహంవల్లనే మనల్ని గడ్డిపోచల్లా చూస్తున్నాడు. నువ్వు వేసిన నాగాస్త్రాలతో సందష్టుడయినా చెక్కుచెదరకుండా నిలిచి మనల్ని గడ్డిపోచతో సమానంగా చేస్తున్నాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏతద్వాక్యం తు బాణాయ కథయిత్వా స దానవః ।
అనిరుద్ధమువాచేదం రాజనీతివిదుత్తమః ॥29॥

ఆ దానవమంత్రి కుంభాండుడు బాణుడికి ఈ మాట చెప్పి, రాజనీతి విశారదుడు కనుక అనిరుద్ధుడితో ఇలా సంభాషించాడు.

కుంభాండ ఉవాచ – కుంభాండుడు అన్నాడు.

కోఽసి కస్యాసి రే వీర సత్యం వద మమాగ్రతః ।
కేన వా త్వమిహానీతో దురాచార నరాధమ ॥30॥

దైత్యేంద్రం స్తుహి వీరం త్వం నమస్కురు కృతాంజలిః ।
జితోఽస్మీతి వచో దీనం కథయిత్వా పునః పునః ॥31॥

ఏవం కృతే తు మోక్షః స్యాదన్యథా బంధనాది చ ।
తచ్ఛ్రుత్వా వచనం తస్య ప్రతివాక్యమువాచ సః ॥32॥

రే! వీరా! ఎవడివి? ఎవరివాడివి? నిజం చెప్పు నాముందు. దురాచారుడా! నరాధముడా! నిన్నసలు ఇక్కడికి తీసుకువచ్చింది ఎవడురా? ఈ దైత్యేంద్రుడు బాణాసురుడు మహావీరుడు. ఇతడికి నమస్కరించు. దోసిలొగ్గి నిలిచి స్తుతించు. "ఓడిపోయాను-ఓడిపోయాను" అని దీనంగా పలుకుతూ వంగి వంగి దండాలు పెట్టు. ఇలా చేస్తేనే నీకు మోక్షం, లేకపోతే ఈ బంధనాదులు ఇంతే, తప్పవు. అని ఇలా పలికిన కుంభాండుడికి అనిరుద్ధుడు సమాధానం చెప్పాడు.

అనిరుద్ధ ఉవాచ – అనిరుద్ధుడు పలికాడు.

రేరే దైత్యాధమ సఖే! కరపిండోపజీవక ।
నిశాచర దురాచార శత్రుధర్మం న వేత్సి భోః ॥33॥

దైన్యం పలాయనం చాథ శూరస్య మరణాధికమ్ ।
విరుద్ధం చోపశల్యం చ భవేదితి మతిర్మమ ॥34॥

క్షత్రియస్య రణే శ్రేయో మరణం సన్ముఖే సదా ।
న వీరమానినో భూమౌ దీనస్యేవ కృతాంజలిః ॥35॥

ఓరోరీ! దైత్యాధముడి చెలికాడా! అతడు చేతితో పడవేసే అన్నం ముద్దలతో బతికేవాడా! నిశాచరుడా! దురాచారుడా! వీరపద్ధతి ఎరుగవు కాబోలు. దీనంగా ప్రార్థించడమూ పారిపోవడమూ– ఇలాంటివి మహాశూరుడికి మరణాధికాలు. విరుద్ధాలు. బతికున్నంతకాలమూ అతడి మనస్సుని అవి ముళ్ళలాగ వేధిస్తాయి. కనుక క్షత్రియవీరుడికి రణరంగంలో సమ్ముఖాన మరణమే మేలు అని నా అభిమతం. తనను తాను వీరుడిగా నమ్మినవాడెవడూ దీనుడిగా ప్రాధేయపడడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాది వీరవాక్యాని బహూని స జగాద తమ్ ।
తదాకర్ణ్య స బాణోఽసౌ విస్మితోఽభూచ్చుకోప చ ॥36॥

తదోవాచ నభోవాణీ బాణస్యాశ్వాసనాయ వై ।
శృణ్వతాం సర్వవీరాణామనిరుద్ధస్య మంత్రిణః ॥37॥

ఇలా వీరోచితంగా చాలా మాటలు పలికాడు అనిరుద్ధుడు. వాటినివిని బాణుడు ఆశ్చర్యపోయాడు కోపోద్రిక్తుడు అయ్యాడు. సరిగ్గా అదే సమయానికి బాణుడికి ఓదార్పుగా, సమస్తవీరులూ మంత్రులూ అనిరుద్ధుడూ అందరికీ వినిపించేట్టుగా ఒక అశరీరవాణి పలికింది.

వ్యోమవాణ్యువాచ – ఆకాశవాణి పలికింది.

భో భో బాణ మహావీర న క్రోధం కర్తుమర్హసి ।
బలిపుత్రోఽసి సుమతే శివభక్త విచార్యతామ్ ॥38॥

శివస్సర్వేశ్వరస్సాక్షీ కర్మణాం పరమేశ్వరః ।
తదధీనమిదం సర్వం జగద్వై సచరాచరమ్ ॥39॥

స ఏవ కర్తా భర్తా చ సంహర్తా జగతాం సదా ।
రజస్సత్త్వతమోధారీ విధివిష్ణుహరాత్మకః ॥40॥

సర్వస్యాంతర్గతః స్వామీ ప్రేరకస్సర్వతః పరః ।
నిర్వికార్యవ్యయో నిత్యో మాయాధీశోఽపి నిర్గుణః ॥41॥

తస్యేచ్ఛయా బలో జ్ఞేయోబలీ బలివరాత్మజ ।
ఇతి విజ్ఞాయ మనసి స్వస్థో భవ మహామతే ॥42॥

గర్వాపహారీ భగవాన్ నానాలీలావిశారదః ।
నాశయిష్యతి తే గర్వమిదానీం భక్తవత్సలః ॥43॥

ఓయీ మహావీరుడా! బాణాసురుడా! క్రోధ పడకు. బలిచక్రవర్తి కొడుకువి. బుద్ధి మంతుడివి. శివభక్తుడివి. ఒక్కసారి ప్రశాంతంగా ఆలోచించు. సకలకర్మలకూ సాక్షి ఆ పరమేశ్వరుడు సర్వేశ్వరుడూ అయిన శివుడొక్కడే. ఈ చరాచరజగత్తు అంతా అతడి ఆధీనంలోదే. అతడే కర్త. అతడే భర్త. అతడే సంహర్త. రజస్సత్త్వతమోగుణాల ప్రాధాన్యక్రమంతో అతడే బ్రహ్మ, అతడే విష్ణువు, అతడే హరుడు. సర్వాంతర్యామి, సర్వప్రేరకుడూ అయిన స్వామి అతడే. పరాత్పరుడు అతడే. నిర్వికారుడు. అవ్యయుడు. నిత్యుడు. మాయాధీశుడు. నిర్గుణుడు. అతడే ఓ బలివరాత్మజా! అతడి ఇచ్ఛనుబట్టి అబలుడు–మహాబలశాలి అవుతాడు. బుద్ధిమంతుడా! ఇది తెలుసుకో. మనస్సులో ఊరడిల్లు నానాలీలావిశారదుడైన ఆ భగవంతుడు ఎంతటివారికైనా గర్వం అణిచేస్తాడు. భక్తవత్సలుడు కనుక ఇప్పుడు నీ గర్వాన్ని అణిచేస్తాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాభాష్య నభోవాణీ విరరామ మహామునే ।
బాణాసురస్తద్వచనాదనిరుద్ధం న జఘ్నివాన్ ॥44॥

కిం తు స్వాంతఃపురం గత్వా పపౌ పానమనుత్తమమ్ ।
తద్వాక్యం తు విసస్మార విజహార విరుద్ధధీః ॥45॥

తతోఽనిరుద్ధో బద్ధస్తు నాగభోగైర్విషోల్బణైః ।
ప్రియయాఽతృప్తచేతాస్తు దుర్గాం సస్మార తత్క్షణాత్ ॥46॥

వ్యాసమహామునీ! ఆకాశవాణి ఇలా పలికి విరమించింది. ఇది విన్నాక బాణాసురుడు అనిరుద్ధుణ్ణి చంపకుండా విడిచిపెట్టి, అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు. ఉత్తమోత్తమమైన మద్యాన్ని సేవించాడు. అశరీరవాణి వాక్కుల్ని పదే పదే తలుచుకున్నాడు. మెల్లగా విరోధబుద్ధిని వదిలించుకున్నాడు. అటుపైని–విషనాగులతో బద్ధుడైన అనిరుద్ధుడు ప్రియురాలిని ఉషాకన్యను తలుచుకుని తనివితీరనివాడై వెంటనే దుర్గామాతను ధ్యానించాడు.

అనిరుద్ధ ఉవాచ – అనిరుద్ధుడు ప్రార్థించాడు.

శరణ్యే దేవి బద్ధోఽస్మి దహ్యమానస్తు పన్నగైః ।
ఆగచ్ఛ మే కురు త్రాణం యశోదే చండరోషిణి ॥47॥

శివభక్తే మహాదేవి సృష్టిస్థిత్యంతకారిణి ।
త్వాం వినా రక్షకో నాన్యస్తస్మాద్రక్ష శివే హి మామ్ ॥48॥

దుర్గాదేవీ! సర్వలోకశరణ్యా! నాగపాశబద్ధుణ్ణి అయ్యాను. ఈ విషసర్పాలు నన్ను దహించివేస్తున్నాయి. ఓ యశస్కారిణీ! ఓ చండరోషిణీ! త్వరగా రా తల్లీ! నన్ను కాపాడు తల్లీ! శివభక్తురాలా! మహాదేవీ! సృష్టి-స్థితి-లయకారిణీ! శివా! నువ్వు తప్ప నాకు రక్షకులు లేరు. నువ్వే రావాలి. వెంటనే కాపాడాలి.

సనత్కుమార ఉవాచ - సనత్కుమారుడు చెప్పాడు.

తేనేత్థం తోషితా తత్ర కాళీ భిన్నాంజనప్రభా! ।
జ్యేష్ఠకృష్ణచతుర్దశ్యాం సంప్రాప్తాసీన్మహానిశి ॥49॥

గురుభిర్ముష్టినిర్ఘాతైర్దారయామాస పంజరమ్ ।
శరాంస్తాన్ భస్మసాత్కృత్వా సర్పరూపాన్ భయానకాన్ ॥50॥

మోచయిత్వా నిరుద్ధం తు తతశ్చాంతఃపురం తతః ।
ప్రవేశయిత్వా దుర్గా తు తత్రైవాదర్శనం గతా ॥51॥

ఇత్థం దేవ్యాః ప్రసాదాత్తు శివశక్తేర్మునీశ్వర ।
కృచ్ఛ్రముక్తోఽనిరుద్ధోఽభూత్సుఖీ చైవ గతవ్యథః ॥52॥

అథ లబ్ధజయో భూత్వాఽనిరుద్ధశ్శివశక్తితః ।
ప్రాద్యుమ్నిర్బాణతనయాం ప్రియాం ప్రాప్య ముమోద చ ॥53॥

పూర్వవద్విజహారాసౌ తయా స్వప్రియయా సుఖీ ।
పీతపానస్సురక్తాక్షస్స బాణసుతయా తతః ॥54॥

పగిలిన అంజనాద్రిశిలలా నల్లగా ఉన్న కాళికాదేవి అనిరుద్ధుడి అభ్యర్థనకు సంతోషించింది. జ్యేష్ఠమాసం కృష్ణపక్షం చతుర్దశినాడు అర్ధరాత్రి అతడికి ప్రత్యక్షమయ్యింది. వెంటనే పెద్దపెద్ద పిడిగ్రుద్దులతో వజ్రపంజరాన్ని పగులగొట్టింది. భయానక నాగాస్త్రాలనూ నాగపాశాలనూ భస్మం చేసింది. అనిరుద్ధుడు పూర్తిగా విముక్తుడయ్యాడు. తానే ముందునడిచి అతణ్ణి అంతఃపురంలోకి తీసుకువెళ్ళింది. అంతర్ధానం చెందింది. వ్యాసమునీశ్వరా! ఇలా శివభక్తి అనుగ్రహంతో బంధముక్తుడై అనిరుద్ధుడు వెతలన్నీ తొలగి సంబరపడ్డాడు. లబ్ధవిజయుడయ్యాడు. ఉషాకన్యతో ఆనందించాడు. సురాపానంతో కన్నులు జేవురించగా ప్రియురాలితో కలిసి మునుపటిలా తనివితీరా క్రీడించాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే ఊషాచరిత్రే అనిరుద్ధోషా వివాహవర్ణనం నామ త్రిపంచాశత్తమోఽధ్యాయః ॥53॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు ఉషాచరిత్రలో అనిరుద్ధ-ఉషావివాహవర్ణనం అనే యాభై మూడవ అధ్యాయం సమాప్తం.

చతుఃపంచాశత్తమోఽధ్యాయః – యాభై నాల్గవ అధ్యాయం

బాణాసురరుద్రకృష్ణాదియుద్ధ వర్ణనమ్ – బాణాసుర–రుద్ర–కృష్ణాదియుద్ధ వర్ణనం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

అనిరుద్ధే హృతే పౌత్రే కృష్ణస్య మునిసత్తమ ।
కుంభాండసుతయా కృష్ణః కిమకార్షీద్ధి తద్వద ॥1॥

మునీశ్వరా! సనత్కుమారా! అనిరుద్ధుడు కృష్ణుడి మనుమడుగదా! కుంభాండపుత్రిక అలా తన పౌత్రుణ్ణి అపహరించి తీసుకుపోతే మరి కృష్ణుడు ఊరుకున్నాడా? ఏమి చేశాడో అది కూడా వినాలని ఉంది, చెప్పవూ!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

తతో గతేఽనిరుద్ధే తు తత్స్త్రీణాం రోదనస్వనమ్ ।
శ్రుత్వా చ వ్యథితః కృష్ణో బభూవ మునిసత్తమ ॥2॥

అపశ్యతాం చానిరుద్ధం తద్బంధూనాం హరేస్తథా ।
చత్వారో వార్షికా మాసా వ్యతీయురనుశోచతామ్ ॥3॥

నారదాత్తదుపాకర్ణ్య వార్తాం బద్ధస్య కర్మ చ ।
ఆసన్ సువ్యథితాస్సర్వే వృష్ణయః కృష్ణదేవతాః ॥4॥

కృష్ణస్తద్వృత్తమఖిలం శ్రుత్వా యుద్ధాయ చాదరాత్ ।
జగామ శోణితపురం తార్క్ష్యమాహూయ తత్క్షణాత్ ॥5॥

ప్రద్యుమ్నో యుయుధానశ్చ గతస్సాంబోఽథ సారణః ।
నందోపనందభద్రాద్యా రామకృష్ణానువర్తినః ॥6॥

అక్షౌహిణీభిః ద్వాదశభిస్సమేతాస్సర్వతో దిశమ్ ।
రురుధుర్బాణనగరం సమంతాత్ సాత్వతర్షభాః ॥7॥

వ్యాసమునిసత్తమా! ఉన్నట్టుండి అనిరుద్ధుడు మాయమయ్యేసరికి అతడి అంతఃపురకాంతలు హాహాకారాలు చేశారు. వారి రోదనధ్వనులు శ్రీకృష్ణుడికి వినిపించాయి. అతడు చాలా కలత చెందాడు. బంధుగణమంతా అన్వేషణ ప్రారంభించారు. ఏడాదిలో నాలుగు నెలలు గడిచాయి. ఆచూకీ తెలియక అందరూ కుమిలిపోతున్నారు. ఆ సమయంలో నారదమహర్షి వచ్చి అనిరుద్ధుడు బాణాసురుడి నగరంలో బంధితుడైన వార్త అందించాడు. కృష్ణుడితో సహా వృష్ణివంశీయులైన బంధువులందరూ ఎంతగానో దుఃఖించారు. జరిగినదంతా వివరంగా తెలుసుకుని కృష్ణుడు యుద్ధానికి నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే తన వాహనం గరుత్మంతుణ్ణి ఆహ్వానించాడు. బాణుడి రాజధాని శోణితపురానికి బయలుదేరాడు. ప్రద్యుమ్నుడు, యుయుధానుడు, సాంబుడు, సారణుడు ఇంకా

బలరామకృష్ణులకు అనుచరులైన నందుడు ఉపనందుడు భద్రుడు మొదలగువారు అందరూ కదనానికి కాలుదువ్వారు. పన్నెండు అక్షౌహిణీల మహాసైన్యంతో ఈ సాత్వతవీరపుంగవులంతా శోణితపురం చేరుకుని అన్నివైపుల నుండీ ఒక్కసారిగా ముట్టడించారు.

భజ్యమానపురోద్యాన ప్రాకారాట్టాల గోపురమ్ ।
వీక్ష్యమాణో రుషావిష్టస్తుల్యసైన్యోభినిర్యయౌ ॥8॥

బాణార్థే భగవాన్ రుద్రస్సుతైః ప్రమథైర్వృతః ।
ఆరుహ్య నందివృషభం యుద్ధం కర్తుం సమాయయౌ ॥9॥

ఆసీత్సుతుములం యుద్ధమద్భుతం లోమహర్షణమ్ ।
కృష్ణాదికానాం తైస్తత్ర రుద్రాదైర్బాణరక్షకైః ॥10॥

కృష్ణశంకరయోరాసీత్ ప్రద్యుమ్నగుహయోరపి ।
కూష్మాండకూపకర్ణాభ్యాం బలేన సహ సంయుగః ॥11॥

క్షణమాత్రంలో శోణితపురం ఉద్యానాలూ ప్రాకారాలూ అట్టాలగోపురాలూ ధ్వంసమైపోయాయి. ఇది చూసి బాణాసురుడు మండిపడ్డాడు. సాటి వచ్చే సైన్యబలంతో నగరం నుండి వెలువడి రణరంగం చేరుకున్నాడు. బాణుడి పక్షాన సాక్షాత్తు రుద్రదేవుడు తన పుత్రులతో ప్రమథగణాలతో తరలివచ్చి యుద్ధానికి తలపడ్డాడు. నందివాహనం అధిరోహించి సాయుధుడై సమరం సాగించాడు. ఇటువైపు కృష్ణాదులూ, అటువైపు బాణరక్షకులు రుద్రాదులూ రోమహర్షణంగా అత్యద్భుతంగా ఘోరసంగ్రామం చేశారు. కృష్ణుడూ శంకరుడూ తలపడ్డారు. ప్రద్యుమ్నుడూ గుహుడూ పరస్పరం కత్తులుదూశారు. బలరాముడితో కూష్మాండకూపకర్ణులు తొడగొట్టారు.

సాంబస్య బాణపుత్రేణ బాణేన సహ సాత్యకేః ।
నందినా గరుడస్యాపి పరేషాం చ పరైరపి ॥12॥

అలాగే సాంబుడికి బాణపుత్రుడితో, సాత్యకికి బాణాసురుడితో, గరుత్మంతుడికి నందివాహనంతో ఇంకా తక్కిన వారికి తక్కిన వారితో పోరాటం నడిచింది.

బ్రహ్మాదయస్సురాధీశాః మునయస్సిద్ధచారణాః ।
గంధర్వాప్సరసో యానైః విమానైః ద్రష్టుమాగమన్ ॥13॥

ప్రమథైర్వివిధాకారైః రేవత్యంతైస్సుదారుణమ్ ।
యుద్ధం బభూవ విప్రేంద్ర తేషాం చ యదువంశినామ్ ॥14॥

భ్రాత్రా రామేణ సహితః ప్రద్యుమ్నేన చ ధీమతా ।
కృష్ణశ్చకార సమరమతులం ప్రమథైస్సహ ॥15॥

బ్రహ్మాదిదేవనాయకులూ మునులూ సిద్ధులూ చారణులూ గంధర్వులూ అప్సరసలూ తమతమ వాహనాలు అధిరోహించి చూపరులై వేంచేశారు. రేవతీగణం వరకూ వివిధ రూపాలలో ఉన్న ప్రమథులతో యదువంశీయులకు

ఓ బ్రాహ్మణోత్తమా! వ్యాసమునీ! దారుణాతిదారుణంగా యుద్ధం జరిగింది. అన్నగారైన బలరాముడూ, ధీశాలియైన పుత్రుడు ప్రద్యుమ్నుడూ వెంటనిలువగా కృష్ణుడు ఆ ప్రమథగణాలతో తుములసంగ్రామం సాగించాడు.

తత్రాగ్నినాభవద్యుద్ధం యమేన వరుణేన చ ।
విముఖేన త్రిపాదేన జ్వరేణ చ గుహేన చ ॥16॥

ప్రమథైర్వివిధాకారైస్తేషామత్యంతదారుణమ్ ।
యుద్ధం బభూవ వికటం వృష్ణీనాం రోమహర్షణమ్ ॥17॥

బిభీషికాభిర్బహ్వీభిః కోటరీభిః పదే పదే ।
నిర్లజ్జాభిశ్చ నారీభిః ప్రబలాభిరదూరతః ॥18॥

శంకరానుచరాన్ శౌరిర్భూతప్రమథగుహ్యకాన్ ।
ద్రావయామాస తీక్ష్ణాగ్రైః శరైః శార్ఙ్గధనుశ్చ్యుతైః ॥19॥

ఏవం ప్రద్యుమ్నప్రముఖా వీరా యుద్ధమహోత్సవాః ।
చక్రుర్యుద్ధం మహాఘోరం శత్రుసైన్యం వినాశయన్ ॥20॥

అప్పుడక్కడ అగ్ని–యమ–వరుణులకు విముఖంతోత్రిపాదితో జ్వరుడితో గుహుడితో యుద్ధం జరిగింది. వివిధ రూపాలలో ఉన్న ప్రమథులకూ వృష్టివంశీయులకూ అత్యంతదారుణంగా వికటంగా రోమహర్షణంగా పోరాటం నడిచింది. ఎదుటివారిని రకరకాలుగా భయపెట్టే బిభీషికలూ కోటరీసంజ్ఞతో పిలవబడే సిగ్గూఎగ్గూ లేని ఆడభూతాలూ అసంఖ్యాకంగా అమేయబలశాలినులై వృష్ణివీరులతో కలబడ్డారు. కృష్ణుడు తన శార్ఙ్గధనుస్సును ఎక్కుపెట్టి తీక్ష్ణశరపరంపరలు గుప్పించి శంకరుడి అనుచరులైన ఆ ప్రమథగణాలనూ భూతగణాలనూ తరిమి తరిమి కొట్టాడు. దీనితో ఉత్సాహం పుంజుకుని ప్రద్యుమ్నాది మహావీరులు విజృంభించారు. మహాఘోరయుద్ధం సాగించి శత్రుసైన్యాలను నాశనం చేశారు.

విశీర్యమాణం స్వబలం దృష్ట్వా రుద్రోత్యమర్షణః ।
క్రోధం చకార సుమహన్ననాద చ మహోల్బణమ్ ॥21॥

తచ్ఛ్రుత్వా శంకరగణా వినేదుర్యుయుధుశ్చ తే ।
మర్దయన్ ప్రతియోద్ధారం వర్ధితాశ్శంభుతేజసా ॥22॥

పృథగ్విధాని చాయుక్తం శార్ఙ్గాస్త్రాణి పినాకినే ।
ప్రత్యక్షైశ్శమయామాస శూలపాణిరవిస్మితః ॥23॥

బ్రహ్మాస్త్రస్య చ బ్రహ్మాస్త్రం వాయవ్యస్య చ పార్వతమ్ ।
ఆగ్నేయస్య చ పార్జన్యం నైజం నారాయణస్య చ ॥24॥

కృష్ణసైన్యం విదుద్రావ ప్రతివీరేణ నిర్జితమ్ ।
న తస్థౌ సమరే వ్యాస పూర్ణరుద్రసుతేజసా ॥25॥

ఇలా వీగిపోతున్న తన సైన్యాన్ని చూసి రుద్రుడు ఉక్రోషపడ్డాడు. క్రోధంతో మహోల్బణంగా పెద్దగా అరిచాడు. అది విని శివగణాలు ధైర్యం తెచ్చుకుని నిలబడ్డారు. శంభుతేజస్సు వారిలో ప్రవేశించింది. బలం రెట్టించింది. యుద్ధం సాగించారు. శత్రువీరుల్ని మర్దించనారంభించారు. అంతలోకీ శ్రీకృష్ణుడి శార్ఙ్గంనుంచి వినూతనవిధానంలో అనేకాస్త్రాలు పినాకి పైకి వెలువడ్డాయి. వాటిని అన్నింటినీ ఆ శూలపాణి కనీసం ఆశ్చర్యచకితుడైనా కాకుండా నిలిచి తన ప్రత్యస్త్రాలతో పూర్తిగా శమింపజేశాడు. బ్రహ్మాస్త్రాన్ని బ్రహ్మాస్త్రంతో, వాయవ్యాన్ని పార్వతాస్త్రంతో, ఆగ్నేయాన్ని పర్జన్యాస్త్రంతో, నారాయణాన్ని తనదైన శైవాస్త్రంతో అస్తమింపజేశాడు. వ్యాసమహర్షీ! పరిపూర్ణమైన ఆ రుద్రతేజస్సు ముందట నిలువలేక కృష్ణసైన్యం ఓడిపోయి, సమరరంగం నుంచి పలాయనం చిత్తగించింది.

విద్రావితే స్వసైన్యే తు శ్రీకృష్ణశ్చ పరంతపః ।
స్వం జ్వరం శీతలాఖ్యం హి వ్యసృజద్దారుణం మునే ॥26॥

విద్రావితే కృష్ణసైన్యే కృష్ణస్య శీతలజ్వరః ।
అభ్యపద్యత తం రుద్రం మునే దశదిశో దహన్ ॥27॥

మహేశ్వరోఽథ తం దృష్ట్వా యాంతం స్వం విసృజజ్జ్వరమ్ ।
మాహేశ్వరో వైష్ణవశ్చ యుయుధాతే జ్వరావుభౌ ॥28॥

వైష్ణవోఽథ సమాక్రందన్మాహేశ్వర బలార్దితః ।
అలబ్ధ్వా భయమన్యత్ర తుష్టావ వృషభధ్వజమ్ ॥29॥

అథ ప్రసన్నో భగవాన్ విష్ణుజ్వరనుతో హరః ।
విష్ణుశీతజ్వరం ప్రాహ శరణాగతవత్సలః ॥30॥

వ్యాసమునీ! అలా తన సైన్యం పారిపోయే సరికి పరంతపుడైన శ్రీకృష్ణుడు తన ఆధీనంలో ఉన్న అతిదారుణమైన 'శీతజ్వరం' అనే పేరుగల అస్త్రాన్ని శివుడిమీదకి విడిచిపెట్టాడు. అది దశదిశలనూ దహించివేస్తూ రుద్రుడిపైకి వేగంగా వచ్చిపడుతోంది. గమనించాడు మహేశ్వరుడు. వెంటనే-తన ఆధీనంలో ఉన్న మాహేశ్వరజ్వరాన్ని దానిమీదకు ప్రయోగించాడు. ఇలా మాహేశ్వర-వైష్ణవ జ్వరాలు రెండూ చాలా సేపు పోరాడుకున్నాయి. కొంతసేపటికి శివజ్వరానిది పైచెయ్యి అయ్యింది. విష్ణుజ్వరం బిగ్గరగా రోదించింది. మరెక్కడా అభయహస్తం లభించక ఓటమిని అంగీకరించి అది వృషభధ్వజుణ్ణి స్తుతించింది. విష్ణుజ్వరం చేసిన స్తోత్రానికి ప్రసన్నుడై భగవంతుడు హరుడు తాను శరణాగతవత్సలుడు కనుక ఆ వైష్ణవశీతజ్వరంతో ఇలా పలికాడు.

మహేశ్వర ఉవాచ - మహేశ్వరుడు అన్నాడు.

శీతజ్వర ప్రసన్నోఽహం వ్యేతు తే మజ్జ్వరాద్భయమ్ ।
యో నౌ స్మరతి సంవాదం తస్య న స్యాజ్జ్వరాద్భయమ్ ॥31॥

ఓయీ! శీతజ్వరమా! నీకు ప్రసన్నుడినయ్యాను. నీకింక నా మాహేశ్వరజ్వరం వల్ల ఏ భయమూ ఉండదు. అంతే కాదు మన ఈ జ్వరాల సంవాదాన్ని స్మరిస్తే చాలు ఎవ్వరికీ ఏ జ్వరం వల్లా ఏ భయమూ ఉండదు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తో రుద్రమానమ్య గతో నారాయణజ్వరః ।
తం దృష్ట్వా చరితం కృష్ణో విసిస్మాయ భయాన్వితః ॥32॥

స్కందఃప్రద్యుమ్నబాణౌఘైరర్ద్యమానోఽథ కోపితః ।
జఘాన శక్త్యా ప్రద్యుమ్నం దైత్యసంఘాత్యమర్షణః ॥33॥

స్కందప్రాప్తిహతస్తత్ర ప్రద్యుమ్నః ప్రబలోఽపి హి ।
అసృగ్విముంచన్ గాత్రేభ్యో బలేనాపాక్రమద్రణాత్ ॥34॥

కుంభాండకూపకర్ణాభ్యాం నానాస్త్రైశ్చ సమాహతః ।
దుద్రావ బలభద్రోఽపి న తస్థేఽపిరణే బలీ ॥35॥

రుద్రుడు ఇలా అభయమిస్తే నారాయణజ్వరం అతడికి శిరసా నమస్కరించి వైదొలగింది. ఈ జరిగినది చూసి కృష్ణుడు ఆశ్చర్యాన్నీ భయాన్నీ? ఒక్కసారిగా పొందాడు. అదేవేళ ప్రద్యుమ్నుడి బాణసమూహానికి ఖిన్నుడైన స్కందుడు కోపంతో ఊగిపోయాడు. దైత్యసంఘాలకు ఉక్రోషం తెప్పించే ఆ మహావీరుడు తన శక్తి ఆయుధాన్ని ప్రద్యుమ్నుడిపై ప్రయోగించాడు. అది గురితప్పకుండా వెళ్ళి ప్రద్యుమ్నుణ్ణి ఢీకొట్టింది. అతడు మహాబలిష్ఠుడే అయినా ఆ దెబ్బ తట్టుకోలేకపోయాడు. తనువంతా నెత్తురు మడుగయ్యింది. అతికష్టం మీద రణరంగం నుంచి నిష్క్రమించాడు. అదేవేళ కుంభాండ కూపకర్ణులు ఇద్దరూ బలరాముడి మీదికి రకరకాల అస్త్రాలు ప్రయోగించారు. అతడు బలవంతుడైన తట్టుకోలేక రణరంగంలో నిలవలేక పారిపోయాడు.

కృత్వా సహస్రం కాయానాం పీత్వా తోయం మహార్ణవాత్ ।
గరుడో నాశయత్యర్థావర్తైర్మేఘార్ణవాంబుభిః ॥36॥

అథ క్రుద్ధో మహేశస్య వాహనో వృషభో బలీ ।
వేగేన మహతారంవై శృంగాభ్యాం నిజఘాన తమ్ ॥37॥

శృంగఘాతవిశీర్ణాంగో గరుడోఽతీవ విస్మితః ।
విదుద్రావ రణాత్తూర్ణం విహాయ చ జనార్దనమ్ ॥38॥

ఏవం జాతే చరిత్రం తు భగవాన్ దేవకీసుతః ।
ఉవాచ సారథిం శీఘ్రం రుద్రతేజోఽతివిస్మితః ॥39॥

మరొకవైపు–గరుత్మంతుడు వెయ్యి రూపాలు ధరించి సముద్రజలాన్ని పుక్కిటబట్టి తెచ్చి తన అర్థావర్తాలతో మేఘవర్షధారలు కురిపించి ప్రమథసేనను నాశనం చేస్తున్నాడు. దీనికి క్రుద్ధుడయ్యాడు నందీశ్వరుడు. అతడు

శివుడి వాహనం. ఎంతో బలశాలి. పెద్దపెట్టున రంకె వేశాడు. అతివేగంగా తన కొమ్ములతో గరుత్మంతుణ్ణి కుమ్మేశాడు. అతడికి ఆ దెబ్బతో అవయవాలు పట్లు తప్పాయి. నివ్వెరపోయాడు. జనార్దనుణ్ణి అక్కడే విడిచిపెట్టి రణరంగం నుంచి తానూ ఎగిరిపోయాడు. కథ అంతా ఇలా నడుస్తూండగా కళ్ళారా చూస్తున్న దేవకీసుతుడు రుద్రతేజస్సుకి మరింత ఆశ్చర్యచకితుడయ్యాడు. వెంటనే తన సారథితో ఇలా అన్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ – శ్రీకృష్ణుడు అన్నాడు.

హే సూత శృణు మద్వాక్యం రథం మే వాహయద్రుతమ్ ।
మహాదేవసమీపస్థో యథా స్యాం గదితుం వచః ॥40॥

సారథీ! ఇదిగో నా మాట విను. మన రథాన్ని వెంటనే శివుడి చెంతకు నడిపించు. అతడితో నేను మాట్లాడాలి. అతడి చేరువకి తీసుకువెళ్ళు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తో హరిణా సూతో దారుకః స్వగణాగ్రణీః ।
ద్రుతం తం వాహయామాస రథం రుద్రసమీపతః ॥41॥

అథ విజ్ఞాపయామాస నతో భూత్వా కృతాంజలిః ।
శ్రీకృష్ణః శంకరం భక్త్యా ప్రపన్నో భక్తవత్సలమ్ ॥42॥

వ్యాసమునీ! రథసారథిపేరు దారుకుడు. అతడు సారథిగణాలలోకెల్ల అగ్రగణ్యుడు. కనుక వెంటనే రథాన్ని రుద్రుడి చెంతకు నడిపించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు శివుడికివంగి నమస్కరించి ప్రసన్నుడై భక్తితో ఆ భక్తవత్సలుడికి ఇలా విన్నవించుకున్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ – శ్రీకృష్ణుడు స్తుతించాడు.

దేవదేవ! మహాదేవ! శరణాగతవత్సల ।
నమామి త్వానంతశక్తిం సర్వాత్మానం పరేశ్వరమ్ ॥43॥

విశ్వోత్పత్తిస్థాన నాశహేతుం సంజ్ఞప్తిమాత్రకమ్ ।
బ్రహ్మలింగం పరం శాంతం కేవలం పరమేశ్వరమ్ ॥44॥

కాలో దైవం కర్మ జీవః స్వభావో ద్రవ్యమేవ చ ।
క్షేత్రం చ ప్రాణ ఆత్మా చ వికారస్తత్సమూహకః ॥45॥

బీజరోహప్రవాహస్తు త్వన్మాయైషా జగత్ప్రభో ।
తన్నిబంధం ప్రపద్యేహ త్వామహం పరమేశ్వరమ్ ॥46॥

నానాభావైర్లీలయైవ స్వీకృతైర్నిర్జరాదికాన్ ।
నూనం బిభర్షి లోకేశో హంస్యున్మార్గాన్ స్వభావతః ॥47॥

దేవాధిదేవా! మహాదేవా! శరణాగతరక్షకా! అనంతశక్తి సంపన్నుడివి. సర్వాత్ముడివి. పరేశ్వరుడివి. నిన్నిదే నమస్కరిస్తున్నాను. ఈ విశ్వానికి నువ్వే సృష్టిస్థితిలయకారకుడివి. బ్రహ్మలింగుడివి. జ్ఞానస్వరూపివి. పరుడివి. శాంతుడివి. కేవలుడివి. పరమేశ్వరుడివి. కాలమూ, దైవమూ, కర్మమూ, జీవుడూ, స్వభావమూ, ద్రవ్యమూ, క్షేత్రమూ, ప్రాణమూ, ఆత్మయా, వికారమూ, తత్సమూహకమూ, బీజరోహప్రవాహమూ అన్నీ ఈ మొత్తం జగత్తు అంతా కేవలం నీ మాయ. ప్రభూ! ఇంతటికీ కారణమైన పరమేశ్వరుణ్ణి నిన్ను నేనిదే సమాశ్రయిస్తున్నాను. భావవైవిధ్యంతో రూపవైవిధ్యం పొందిన దేవదానవమానవాదుల్ని అందరినీ ఒక లీలా విశేషంగా నువ్వే భరిస్తున్నావు. లోకేశ్వరా! దారితప్పిన వారిని నువ్వే నీ స్వభావంతో హింసిస్తున్నావు. ఇది సత్యం.

త్వం హి బ్రహ్మ పరం జ్యోతిర్గూఢం బ్రహ్మణి వాఙ్మయే ।
యం పశ్యంత్యమలాత్మానమాకాశమివ కేవలమ్ ॥48॥

త్వమేవ చాద్యః పురుషోఽద్వితీయస్తుర్య ఆత్మదృక్ ।
ఈశో హేతురహేతుశ్చ సవికారః ప్రతీయసే ॥49॥

స్వమాయయా సర్వగుణప్రసిద్ధ్యై భగవన్ ప్రభో ।
సర్వాన్వితః ప్రభిన్నశ్చ సర్వతస్త్వం మహేశ్వర ॥50॥

యథైవ సూర్యోఽపి హితశ్ఛాయారూపాణి చ ప్రభో ।
స్వచ్ఛాయయా సంచకాస్తి హ్యయం పరమదృగ్భవాన్ ॥51॥

గుణేనాపిహితోఽపి త్వం గుణేనైవ గుణాన్ విభో ।
స్వప్రదీపశ్చకాసి త్వం భూమన్ గిరిశ శంకర ॥52॥

త్వన్మాయామోహితధియః పుత్రదారగృహాదిషు ।
ఉన్మజ్జంతి నిమజ్జంతి ప్రసక్తా వృజినార్ణవే ॥53॥

దైవదత్తమిమం లబ్ధ్వా నృలోకమజితేంద్రియః ।
యో నాద్రియేత త్వత్పాదౌ స శోచ్యోహ్యాత్మవంచకః ॥54॥

త్వదాజ్ఞయాహం భగవాన్ బాణదోశ్ఛేత్తుమాగతః ।
త్వయైవ శప్తో బాణోఽయం గర్వితో గర్వహారిణా ॥55॥

నివర్తస్వ రణాద్దేవ త్వచ్ఛాపో న వృథా భవేత్ ।
ఆజ్ఞాం దేహి ప్రభో మే త్వం బాణస్య భుజకృంతనే ॥56॥

నువ్వే పరబ్రహ్మవు. వేదవాఙ్మయంలో గూఢంగా ఉన్న పరంజ్యోతివి. ఆకాశంలా నిర్మలమైన నిన్ను వేదవాఙ్మయం తెలిసినవారు దర్శిస్తున్నారు. నువ్వే ఆదిపురుషుడివి. అద్వితీయుడివి. మోక్షస్వరూపుడివి (తుర్యుడివి). ఆత్మదృక్కువు. ఈశుడవు. హేతువూ నువ్వే అహేతువూ నువ్వే. సవికారుడివిగా కనిపిస్తావు. హే భగవన్! హే ప్రభో! సమస్తగుణాలకూ ప్రసిద్ధి కలగాలని నువ్వే నీ మాయతో సగుణుడివై అంతటా ప్రభిన్నరూపాలతో భాసిస్తుంటావు.

మహేశ్వరా! సూర్యుడు వెలుగొందుతూ ఛాయారూపాలనూ ప్రకాశింపజేస్తుంటాడు. సరిగ్గా నువ్వూ అంతే. ఆ సూర్యుడివి నువ్వే. గుణాలకు అతీతుడివైనా ఆ గుణాలతోనే గుణాలను ప్రకాశింపజేస్తుంటావు. ఓ గిరిశా! ఓ శంకరా! ఓ సమృద్ధుడా! నిజానికి నువ్వు స్వయంప్రకాశమానుడివి. స్వప్రదీపుడివి. నీ మాయతో సమ్మోహితులై జీవులందరూ పాపసముద్రంలో పడి ఆ భార్యపుత్రులనెడి సంసారబంధంలో చిక్కుకుంటున్నారు. భూలోకంలోకి దైవదత్తమైన జన్మగా అవతరించి ఏ మానవుడైనా ఇంద్రియసుఖాలకు బానిసయై నీ పాదపద్మాలను మరిచిపోతే వాడు ఆత్మవంచన చేసుకుంటున్నట్టు. అలాంటి వ్యక్తిని చూసి మనం శోకించాలి–అయ్యో అని. ఓ భగవానుడా! నేనిప్పుడు నీ ఆజ్ఞమేరకు ఈ బాణుడి బాహువులు ఖండించడానికి వచ్చాను. గర్వించి విర్రవీగిన ఈ బాణుణ్ణి గర్వాపహారకుడివైన నువ్వే గదా! శపించావు. కనుక మహాదేవా! దయచేసి రణరంగం నుంచి వైదొలగు. నీ శాపం వృథా కాకూడదు. ప్రభూ! ఈ బాణుడి బాహువులు ఖండించడానికి నన్ను దయచేసి ఆజ్ఞాపించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచశ్శంభుః శ్రీకృష్ణస్య మునీశ్వర ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా కృష్ణస్తుత్యా మహేశ్వరః ॥57॥

వ్యాసమునీశ్వరా! కృష్ణుడు చేసిన ఈ ప్రార్థనకు మహేశ్వరుడు ప్రసన్నుడయ్యాడు. అతడి అభ్యర్థన ఆలకించి మెల్లగా బదులుపలికాడు.

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు అన్నాడు.

సత్యముక్తం త్వయా తాత మయా శప్తో హి దైత్యరాట్ ।
మదాజ్ఞయా భవాన్ ప్రాప్తో బాణదోర్దండకృంతనే ॥58॥

కిం కరోమి రమానాథ భక్తాధీనస్సదా హరే ।
పశ్యతో మే కథం వీర స్యాద్బాణభుజకృంతనమ్ ॥59॥

అతస్త్వం జృంభణాస్త్రేణ మాం జృంభయ మదాజ్ఞయా ।
తతస్త్వం కురు కార్యం స్వం యథేష్టం చ సుఖీ భవ ॥60॥

నాయనా! నువ్వు నిజం చెప్పావు. నిజమే నేను ఈ దైత్యరాజును శపించాను. నిజమే! నా ఆజ్ఞమేరకే నువ్విప్పుడు ఇతడి బాహువులు ఖండించడానికి వచ్చావు. కానీ, రమాపతీ! శ్రీహరీ! ఏం చెయ్యను? నేను ఎల్లపుడూ భక్తపరాధీనుణ్ణి. ఎరుగుదువుగదా! మరి నేను చూస్తుండగానే నువ్వు ఈ పని చెయ్యడం ఏం బాగుంటుంది! అందుకని ఒక పని చెయ్యి. జృంభకాస్త్రం ప్రయోగించి. దానితో నన్ను నిద్రపుచ్చు. ఇది నా ఆజ్ఞయే. అటుపైని యథేష్టంగా నీ పని నువ్వు నిర్వర్తించు. సుఖీభవ! సుఖీభవ!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యుక్తశ్శంకరేణాథ శార్ఙ్గపాణిస్సువిస్మితః ।
స్వరణస్థానమాగత్య ముమోద స మునీశ్వర ॥61॥

జృంభణాస్త్రం ముమోచాథ సంధాయ ధనుషి ద్రుతమ్ ।
పినాకపాణయే వ్యాస నానాస్త్రకుశలో హరిః ॥62॥

మోహయిత్వా తు గిరిశం జృంభాణాస్త్రేణ జృంభితమ్ ।
బాణస్య పృతనాం శౌరిః జఘానాసిగదార్ష్టిభిః ॥63॥

వ్యాసా! మునీశ్వరా! శంకరుడు ఇలా పలికేసరికి శార్ఙ్గపాణి ఆశ్చర్యపోయాడు. అటుపైని సంతోషించాడు. మళ్ళీ తన రణస్థానం చేరుకున్నాడు. సర్వాస్త్రకుశలుడు కనుక వెంటనే జృంభకాస్త్రం ధనుస్సుకి సంధించి పినాకపాణిపైకి విడిచిపెట్టాడు. అలా గిరిశుణ్ణి సమ్మోహితుణ్ణి చేసి శౌరి ఖడ్గం, గద మొదలైన ఆయుధాలతో బాణాసురుడి సేననంతటినీ (పృతన)నరికి పోగులు పెట్టాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే బాణాసుర రుద్రకృష్ణాదియుద్ధ వర్ణనం నామ చతుఃపంచాశత్తమోఽధ్యాయః ॥54॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు బాణాసుర–రుద్ర–కృష్ణాదియుద్ధవర్ణనం అనే యాభై నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచపంచాశత్తమోఽధ్యాయః – యాబై అయిదవ అధ్యాయం

బాణభుజకృంతనగర్వాపహారవర్ణనమ్ – బాణభుజకృంతనం గర్వాపహరణం

వ్యాస ఉవాచ – వ్యాసుడు అడిగాడు.

సనత్కుమార సర్వజ్ఞ బ్రహ్మపుత్ర నమోఽస్తు తే ।
అద్భుతేయం కథా తాత శ్రావితా మే త్వయా మునే ॥1॥

జృంభితే జృంభణాస్త్రేణ హరిణా సమరే హరే ।
హతే బాణబలే బాణః కిమకార్షీచ్చ తద్వద ॥2॥

బ్రహ్మపుత్రా! సర్వజ్ఞా! మునీశ్వరా! తాతా! సనత్కుమారా! చాలా అద్భుతమైన కథను నాకు వినిపించావు. హరి ప్రయోగించిన జృంభకాస్త్రంతో ఆ రణరంగాన శివుడు సమ్మోహితుడైతే బాణుడి సైన్యాన్ని అంతటినీ కృష్ణుడు మట్టుబెడితే మరి అప్పుడు బాణాసురుడు ఏమి చేశాడు? ఇది కూడా దయచేసి చెప్పుము.

సూత ఉవాచ – సూతుడు అన్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య వ్యాసస్యామితతేజసః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా బ్రహ్మపుత్రో మునీశ్వరః ॥3॥

శౌనకాదిమహామునులారా! అమితతేజస్సంపన్నుడైన వ్యాసుడి అభ్యర్థనను ఆలకించి బ్రహ్మపుత్రుడైన ఆ మునీశ్వరుడు సనత్కుమారుడు ప్రసన్నచిత్తుడై ఇలా బదులిచ్చాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాస మహాప్రాజ్ఞ కథాం చ పరమాద్భుతమ్ ।
కృష్ణశంకరయోస్తాత లోకలీలానుసారిణోః ॥4॥

శయితే లీలయా రుద్రే సపుత్రే సగణే సతి ।
బాణో వినిర్గతో యుద్ధం కర్తుం కృష్ణేన దైత్యరాట్ ॥5॥

కుంభాండసంగృహీతాశ్వో నానాశస్త్రాస్త్రధృక్ తతః ।
చకార యుద్ధమతులం బలిపుత్రో మహాబలః ॥6॥

దృష్ట్వా నిజబలం నష్టం స దైత్యేంద్రోఽత్యమర్షితః ।
చకార యుద్ధమతులం బలిపుత్రో మహాబలః ॥7॥

మహాప్రాజ్ఞుడా! వ్యాసుడా! లోకలీలానుసారులైన కృష్ణశంకరుల అత్యద్భుతకథ ఇది చెబుతున్నాను విను! ఒక లీలావిలాసంగా రుద్రుడు తన పుత్రులతో ప్రమథగణాలతో సహా అలా సమ్మోహితుడు అయ్యేసరికి దైత్యాధిపతి బాణుడు ఇంక తానే స్వయంగా కృష్ణుడితో తలపడటానికి తన రాజభవనం వెలువడి వచ్చాడు. అనేక శస్త్రాస్త్రాలను

ధరించి వచ్చాడు. కుంభాండుడు రథసారథిగా పగ్గాలు పట్టుకున్నాడు. ఆ బలిపుత్రుడు మహాబలశాలి. తన సైన్యం నాశనమవ్వడంతో ఉక్రోషం పెల్లుబికింది. తుములసంగ్రామం సాగించాడు.

శ్రీకృష్ణోఽపి మహావీరో గిరిశాప్తమహాబలః ।
ఉచ్చైర్జగర్జ తత్రాజౌ బాణం మత్వా తృణోపమమ్ ॥8॥

ధనుష్టంకారయామాస శార్ఙ్గాఖ్యం నిజమద్భుతమ్ ।
త్రాసయన్ బాణసైన్యం తదవశిష్టం మునీశ్వర ॥9॥

తేన నాదేన మహతా ధనుష్టంకారజేన హి ।
ద్యావాభూమ్యోరంతరం వై వ్యాప్తమాసీదనంతరమ్ ॥10॥

చిక్షేప వివిధాన్ బాణాన్ బాణాయ కుపితో హరిః ।
కర్ణాంతం తద్వికృష్యాథ తీక్ష్ణానాశీవిషోపమాన్ ॥11॥

వ్యాసమునీశ్వరా! శ్రీకృష్ణుడు మహావీరుడు. ఇప్పుడు పరమేశ్వరుడి అనుగ్రహబలమూ దక్కింది. అంతే, బాణాసురుణ్ణి ఒక గడ్డిపోచలా భావించాడు. రణరంగంలో పెద్దపెట్టున గర్జించాడు. తన అద్భుతధనుస్సును శార్ఙ్గాన్ని భీకరంగా టంకరించాడు. హతశేషమైన బాణసేన భయకంపితమయ్యింది. ఆ భీకరధనుష్టంకారం భూనభోంతరాలు నిండి పిక్కటిల్లింది. బాణ దైత్యుడిపట్ల కోపంతో ఊగిపోతున్న శ్రీహరి ధనుస్సును చెవిదాకా లాగి విషనాగులవంటి వివిధ బాణాలను అతడిపైకి గుప్పించాడు.

ఆయాంతాంస్తాన్నిరీక్ష్యాథ స బాణో బలినందనః ।
అప్రాప్తానేవ చిచ్ఛేద స్వశరైః స్వధనుశ్చ్యుతైః ॥12॥

పునర్జగర్జ స విభుర్బాణో వైరిగణార్దనః ।
తత్రసుర్వృష్ణయస్సర్వే కృష్ణాత్మానో విచేతసః ॥13॥

స్మృత్వా శివపదాంభోజం చిక్షేప నిజసాయకాన్ ।
స కృష్ణాయాతి శూరాయ మహాగర్వో బలేస్సుతః ॥14॥

కృష్ణోఽపి తానసంప్రాప్తాన్ అచ్ఛినత్ స్వశరైర్ద్రుతమ్ ।
స్మృత్వా శివపదాంభోజమసురారిర్మహాబలః ॥15॥

రామాదయో వృష్ణయశ్చ స్వం స్వం యోద్ధారమాహవే ।
నిజఘ్నుర్బలినస్సర్వే కృత్వా క్రోధం సమాకులాః ॥16॥

అలా తనపైకి వచ్చిపడుతున్న బాణసమూహాన్ని చూసి బలినందనుడు బాణుడు వెంటనే తానూ బాణాలు గుప్పించాడు. తనను చేరేలోగానే కృష్ణబాణాలను తునాతునకలు చేశాడు. శత్రుమర్దనుడైన బాణదైత్యుడు ఈ విజయంతో బిగ్గరగా గర్జించాడు. కృష్ణభక్తులైన వృష్ణివీరులంతా ఆ గర్జనకు భయకంపితులయ్యారు, దిక్కుతోచనివారయ్యారు(విచేతసః). ఇదే అదనుగా మహాగర్వి ఆ బాణుడు ఒక్కసారి శివుడి పాదపద్మాలను ధ్యానించి తన

సాయకాలను శూరుడైన కృష్ణుడిమీద గురిచూసి కురిపించాడు. అసురవైరి మహాబలశాలి ఆ శ్రీహరి కూడా అలాగే శివపదాంభోజాలను స్మరించి తన బాణాలతో బాణసాయకాలను తనను చేరేలోగానే ఖండించాడు. క్రోధసమాకులితచిత్తులైన వృష్ణివీరులు బలరామాదులు అందరూ విజృంభించి తమ తమ శత్రువీరులను వధించారు.

ఇత్థం చిరతరం తత్ర బలినోశ్చ ద్వయోరపి ।
బభూవ తుములం యుద్ధం శృణ్వతాం విస్మయావహమ్ ॥17॥

తస్మిన్నవసరే తత్ర క్రోధం కృత్వాతి పక్షిరాట్ ।
బాణాసురబలం సర్వం పక్షాఘాతైరమర్దయత్ ॥18॥

మర్దితం స్వబలం దృష్ట్వా మర్దయంతం చ తం బలీ ।
చుకోపాతి బలేః పుత్రః శైవరాడ్డితిజేశ్వరః ॥19॥

స్మృత్వా శివపదాంభోజం సహస్రభుజవాన్ ద్రుతమ్ ।
మహత్పరాక్రమం చక్రే వైరిణాం దుస్సహం స వై ॥20॥

చిక్షేప యుగపద్బాణాన్ అమితాంస్తత్ర వీరహా ।
కృష్ణాదిసర్వయదుషు గరుడే చ పృథక్ పృథక్ ॥21॥

జఘానైకేన గరుడం కృష్ణమేకేన పత్త్రిణా ।
బలమేకేన చ మునే! పరానపి తథా బలీ ॥22॥

వ్యాసమునీ! మహాబలశాలులు ఆ ఇద్దరికీ ఇలా తుములసంగ్రామం శ్రోతలకు విస్మయజనకంగా చిరకాలం జరిగింది. అప్పుడు పక్షిరాజు గరుత్మంతుడికి క్రోధం మితిమీరింది. తన పెనురెక్కల పిడిగ్రుద్దులతో బాణాసురుడి సేనలను మట్టికరిపించాడు. శివభక్తులలో అగ్రగణ్యుడు ఆ దైత్యవీరుడు ఇది గమనించి మరింతగా మహాక్రుద్ధుడయ్యాడు. శివుడి పాదపద్మాలను మరొక్కసారి ధ్యానించాడు. విజృంభించాడు. ఆ వెయ్యిచేతులవాడి పరాక్రమాన్ని శత్రువీరులు తట్టుకోలేకపోయారు. ఒక్కసారిగా యదువీరులపై అమితాస్త్రాలను గుప్పించాడు ఆ శత్రుసంహారకుడు. అదే సమయంలో విడివిడిగా ఒక్కొక్క బాణాన్ని కృష్ణుడిమీద గరుడుడి మీదా బలరాముడిమీదా ఇంకా తక్కిన ప్రద్యుమ్నాదివీరులమీదా ప్రయోగించి ఆ బలిష్ఠుడు హింసించాడు.

తతః కృష్ణో మహావీర్యో విష్ణురూపస్సురారిహా ।
చుకోపాతి రణే తస్మిన్ జగర్జ చ మహేశ్వరః ॥23॥

జఘాన బాణం తరసా శార్ఙ్గనిస్సృతసచ్ఛరైః ।
అతి తద్బలమత్యుగ్రం యుగపత్ స్మృతశంకరః ॥24 ॥

చిచ్ఛేద తద్ధనుః శీఘ్రం ఛత్రాదికమనాకులః ।
హయాంశ్చ పాతయామాస హత్వా తాన్ స్వశరైః హరిః ॥25॥

బాణోఽపి చ మహావీరో జగర్జాతిప్రకుప్య చ ।
కృష్ణం జఘాన గదయా సోఽపతద్ధరణీతలే ॥26॥

ఉత్థాయారం తతః కృష్ణో యుయుధే తేన శత్రుణా ।
శివభక్తేన దేవర్షే లోకలీలానుసారతః ॥27॥

ఏవం ద్వయోశ్చిరంకాలం బభూవ సుమహాన్ రణః ।
శివరూపో హరిః కృష్ణః స చ శైవోత్తమో బలీ ॥28॥

కృష్ణోఽథ కృత్వా సమరం చిరం బాణేన వీర్యవాన్ ।
శివాజ్ఞయా ప్రాప్తబలః చుకోపాతి మునీశ్వర ॥29॥

తతస్సుదర్శనేనాశు కృష్ణో బాణభుజాన్ బహూన్ ।
చిచ్ఛేద భగవాన్ శంభుశాసనాత్పరవీరహా ॥30॥

అవశిష్టా భుజాస్తస్య చత్వారోఽతీవ సుందరాః ।
గతవ్యథో బభూవాశు శంకరస్య ప్రసాదతః ॥31॥

గతస్మృతిర్యదా బాణః శిరశ్ఛేత్తుం సముద్యతః ।
కృష్ణో వీరత్వమాపన్నస్తదా రుద్రస్సముత్థితః ॥32॥

అప్పుడు మహాబలశాలి. దేవతాశత్రుసంహారకుడూ కృష్ణరూపంలోఉన్న శ్రీమహావిష్ణువూ అయిన ఆ పరమమాహేశ్వరుడు కోపావేశంతో భీకరంగాగర్జించాడు. శివుణ్ణిస్మరించి తన శార్ఙ్గధనుస్సునుంచి శితబాణ పరంపరను గుప్పించి ఏకకాలంలో బాణాసురుణ్ణి అతడి బలగాలనూ తీవ్రంగా గాయపరిచాడు. బాణుడి ధనుస్సునూ ఛత్రచామరాదులనూ క్షణంలో నేలగూల్చాడు. చెక్కుచెమరించని నేర్పుతో అతడి రథాశ్వాలను సంహరించాడు. బాణాసురుడికి పట్టరాని కోపంవచ్చింది. అతడూ మహావీరుడాయె. భీషణంగా గర్జించాడు. పెద్దగదను చేబూని రథం నుంచి దుమికి కృష్ణుణ్ణి బలంగా కొట్టాడు. ఆ దెబ్బకి శ్రీకృష్ణుడు నేలమీద పడ్డాడు. కానీ వెంటనేలేచి నిలబడ్డాడు. శత్రువుతో కలబడ్డాడు. దేవర్షీ! వ్యాసమునీ! ఇప్పుడీతడిశత్రువు ఒక శివభక్తుడు. లోకలీలానుసారంగా అతడితో పోరాడాడు శ్రీకృష్ణుడు. ఇలా శివరూపుడైన శ్రీహరికీ శివభక్తాగ్రేసరుడైన బాణుడికీ మహాసంగ్రామం–ద్వంద్వయుద్ధం–చిరకాలం సాగింది. చిట్టచివరికి శివుడి అనుగ్రహంతో బలం పుంజుకున్న శ్రీహరి శివుడి అనుజ్ఞతో సుదర్శనాయుధం ప్రయోగించి ఆ బాణాసురుడి భుజసహస్రాన్ని ఒక్కసారిగా త్రుటికాలంలో ఖండించాడు. శత్రుసంహారి శ్రీహరి శివాజ్ఞకు లోబడి ఈ పని చేశాడు. అప్పుడు ఇంక బాణాసురుడికి నాలుగే భుజాలుమిగిలాయి. అవి చాలాఅందంగా భాసించాయి. శంకరుడి అనుగ్రహవిశేషంవల్ల బాణాసురుడు నొప్పిగానీ బాధగానీ తెలియని స్థితిలోకి జారిపోయాడు. అలా స్పృహకోల్పోయిన బాణుడి శిరస్సును ఖండించడానికి వీరతాస్పృహతో కృష్ణుడు చక్రం పట్టి సంసిద్ధుడయ్యాడు. సరిగ్గా అదే సమయానికి రుద్రుడు మేల్కొన్నాడు. ఇలా పలికాడు.

రుద్ర ఉవాచ – రుద్రుడు అన్నాడు.

భగవన్ దేవకీపుత్ర యదాజ్ఞప్తం మయా పురా ।
తత్కృతం చ త్వయా విప్ర మదాజ్ఞాకారిణా సదా ॥33॥

మా బాణస్య శిరశ్ఛింధి సంహరస్వ సుదర్శనమ్ ।
మదాజ్ఞయా చక్రమిదం స్యాన్మోఘం మజ్జనే సదా ॥34॥

దత్తం మయా పురా తుభ్యమనివార్యం రణే తవ ।
చక్రం జయం చ గోవింద నివర్తస్వ రణాత్తతః ॥35॥

దధీచే రావణే వీరే తారకాదిపురేష్వపి ।
వినా మదాజ్ఞాం లక్ష్మీశ రథాంగం నాముచః పురా ॥36॥

త్వం తు యోగీశ్వరస్సాక్షా త్పరమాత్మా జనార్దన ।
విచార్యతాం స్వమనసా సర్వభూతహితే రతః ॥37॥

వరమస్య మయా దత్తం న మృత్యుర్భయమస్తి వై ।
తన్మే వచస్సదా సత్యం పరితుష్టోఽస్మ్యహం తవ ॥38॥

దేవకీ పుత్రా! కృష్ణపరమాత్మా! విప్రోత్తమా! నా ఆజ్ఞను చక్కగా నిర్వహించావు. నువ్వు ఎప్పుడూ ఇంతే కదా! నా ఆజ్ఞలు నెరవేరుస్తుంటావు. ఇప్పుడు ఈ బాణుడి శిరస్సు ఖండించకు. నీ సుదర్శనచక్రాన్ని ఉపసంహరించుకో! నా భక్తుల విషయంలో నీ చక్రం నా ఆజ్ఞతో ఆగిపోతుంది. ఏమీ చెయ్యదు, చెయ్యలేదు. రణ రంగంలో ఎదురేలేని ఈ చక్రాన్ని వెనకటికెప్పుడో నేనే నీకు ఇచ్చాను. ఇప్పుడు జయాన్నీ ఇచ్చాను. కనక గోవిందా! ఇంక రణరంగంనుంచి నిష్క్రమించు. దధీచితో, వీరుడైన రావణుడితో, తారకుడితో, త్రిపురాసురుడితో జరిగిన యుద్ధాలలో ఓ లక్ష్మీవల్లభా! నా అనుమతి లేకుండా నువ్వు ఈ చక్రాన్ని ప్రయోగించలేదు. గుర్తుచేసుకో! నువ్వు యోగీశ్వరుడివి. సాక్షాత్తూ పరమాత్మవు. కాబట్టి ఓ జనార్దనా! సకల ప్రాణులకూ హితం కోరినవాడివై నీ మనస్సుతో నువ్వే ఆలోచించు. ఈ బాణాసురుడికి నేనే ఒక వరం ఇచ్చాను. ఆ కారణంగా ఇతడికి మృత్యువుగానీ భయంగానీ ఉండవు. తెలిసిందా? నా మాటకు తిరుగులేదు. అది సత్యం. నీ విషయంలో నేను చాలా సంతుష్టి చెందాను.

పురాయం గర్వితో మత్తో యుద్ధం దేహీతి మేఽబ్రవీత్ ।
భుజాన్ కండూయమానస్తు విస్మృతాత్మగతిః హరే ॥39॥

తదాహమశపం తం వై భుజచ్ఛేత్తాగమిష్యతి ।
అచిరేణాతికాలేన గతగర్వో భవిష్యసి ॥40॥

మదాజ్ఞయా హరిః ప్రాప్తో భుజచ్ఛేత్తా తవాథ వై ।
నివర్తస్వ రణాద్గచ్ఛ స్వగృహం సవధూవరః ॥41॥

ఇత్యుక్తః స తయోర్మైత్రీం కారయిత్వా మహేశ్వరః ।
తమనుజ్ఞాప్య సగణ స్సపుత్రః స్వాలయం యయౌ ॥42॥

శ్రీహరీ! ఒకప్పుడు ఈ బాణాసురుడు అతిగర్వితుడై దురదపెడుతున్న సహస్రబాహువులనూ రుద్దుకుంటూ నన్ను తనతో యుద్ధానికిరమ్మన్నాడు. తన గతి ఏమిటో తాను మరిచిపోయి అలా అడిగాడు. అప్పుడు ఇతడిని శపించాను. త్వరలోనే అనతికాలంలోనే నీ భుజాలు నరికి పోగులుపెట్టేవాడు వస్తాడు, నీ పొగరు అణుస్తాడు–అని.

బాణాసురా! గుర్తుకు వచ్చిందా? ఇదిగో ఇప్పుడు ఇలా నా ఆజ్ఞమేరకు శ్రీహరి వచ్చి నీ భుజాలు నరికిపోగులు పెట్టాడు. అర్థమయ్యిందా. ఇక రణరంగంనుంచి నిష్క్రమించు. ఈ నూతన వధూవరులతో (ఉషానిరుద్ధులు) నీ ఇంటికి వెళ్ళు–అని రుద్రుడు బాణుడికి చెప్పి, శ్రీకృష్ణబాణాసురులకు బంధుమైత్రికుదిర్చి, వీడ్కొల్పి, తాను తన గణాలతో పుత్రులతో సహా కైలాసశిఖరానికి చేరుకున్నాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచశ్శంభోస్సంహృత్య చ సుదర్శనమ్ ।
అక్షతాంగస్తు విజయీ తత్ కృష్ణోఽంతఃపురం యయౌ ॥43॥

అనిరుద్ధం సమాశ్వాస్య సహితం భార్యయా పునః ।
జగ్రాహ రత్నసంఘాతం బాణదత్తమనేకశః ॥44॥

తత్సఖీం చిత్రలేఖాం చ గృహీత్వా పరయోగినీమ్ ।
ప్రసన్నోఽభూత్తతః కృష్ణః కృతకార్యః శివాజ్ఞయా ॥45॥

హృదా ప్రణమ్య గిరిశమామంత్ర్య చ బలేస్సుతమ్ ।
పరివారసమేతస్తు జగామ స్వపురీం హరిః ॥46॥

పథి జిత్వా చ వరుణం విరుద్ధం తమనేకధా ।
ద్వారకాం చ పురీం ప్రాప్తస్సముత్సవసమన్వితః ॥47॥

విసర్జయిత్వా గరుడం సఖీన్వీక్ష్యోపహస్య చ ।
ద్వారకాయాం తతో దృష్ట్వా కామచారీ చచార హ ॥48॥

శివుడిమాట విని శ్రీహరి తన సుదర్శనాన్ని ఉపసంహరించాడు. ఒళ్ళు అలవకండా జయం సంపాదించి ఆనందంగా అంతఃపురంలోకి ప్రవేశించాడు. ఉషాసమేతుడై ఉన్న అనిరుద్ధుణ్ణి మళ్ళీ కుదుటపరిచాడు. బాణుడు కానుకగా ఇచ్చిన అనేక రత్నరాశుల్ని స్వీకరించాడు. మహాయోగిని చిత్రలేఖను. ఉషాదేవి చెలికత్తెను తమ వెంట తీసుకుని బయలుదేరాడు. శివాజ్ఞతో పని చక్కబెట్టుకున్న కృష్ణుడు చాలా ప్రసన్నంగా ఉన్నాడు. మనస్సులోనే గిరిశుడికి నమస్కరించుకున్నాడు. బలిపుత్రుడికి వీడ్కోలు పలికి పరివారసమేతుడై ద్వారకకు పయనమయ్యాడు. మార్గమధ్యంలో తన శత్రువుని వరుణుణ్ణి జయించి పనిలో పనిగా–ద్వారక చేరుకున్నాడు. అక్కడ స్వాగతసత్కార మహోత్సవం జరిగింది. గరుడుడికి వీడ్కోలు పలికాడు. తన చెలికత్తెల పై నవ్వులు విసిరి, చూపులు విసిరి అటుపైని స్వేచ్ఛగా జీవించసాగాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే బాణభుజకృంతన గర్వాపహారవర్ణనం నామ పంచపంచాశత్తమోఽధ్యాయః ॥55॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు బాణభుజ కృంతనగర్వాపహరణం అనే యాభై అయిదవ అధ్యాయం సమాప్తం.

షట్పంచాశత్తమోఽధ్యాయః – యాభై ఆరవ అధ్యాయం

బాణాసురగణపతిత్వప్రాప్తివర్ణనమ్ – బాణాసురగణపతిత్వప్రాప్తివర్ణనం

నారద ఉవాచ – నారదుడు అడిగాడు.

కృష్ణే గతే ద్వారకాయామనిరుద్ధేన భార్యయా ।
అకార్షీత్కిం తతో బాణస్తత్ త్వం వద మహామునే ॥1॥

మహామునీ! సనత్కుమారా! ఉషానిరుద్ధుల్ని తీసుకుని కృష్ణుడు అలా ద్వారకకు వెళ్ళాక మరి బాణాసురుడు ఏమి చేశాడో ఆ సంగతులన్నీ దయచేసి చెప్పవూ!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

కృష్ణే గతే ద్వారకాయా మనిరుద్ధేన భార్యయా ।
దుఃఖితోఽభూత్తతో బాణః స్వాజ్ఞానం స్మరన్ హృదా ॥2॥

తతో నందీ శివగణో బాణం ప్రోవాచ దుఃఖితమ్ ।
దైత్యం శోణితదిగ్ధాంగమనుతాప సమన్వితమ్ ॥3॥

ఉషానిరుద్ధులతో కృష్ణుడు ద్వారకకు వెళ్ళిపోయాక బాణాసురుడు తన అజ్ఞానానికి తానే మానసికంగా కుమిలిపోయాడు. అలా దుఃఖిస్తున్న అతడిని గమనించి శివగణనాథుడు నందీశ్వరుడు ఓదార్చాడు. నెత్తురుకమ్ముతున్న గాయాలూ, అంతరంగంలో అనుతాపమూ–పాపం దైత్యనాథుడు!! అతడితో నందీశ్వరుడు అన్నాడు గదా!

నందీశ్వర ఉవాచ – నందీశ్వరుడు అన్నాడు.

బాణ శంకరసద్భక్త మానుతాపం కురుష్వ భోః ।
భక్తానుకంపీ శంభుర్వై భక్తవత్సల నామధృక్ ॥4॥

తదిచ్ఛయా చ యజ్జాతం తజ్జాతమితి చేతసా ।
మన్యస్వ భక్తశార్దూల శివం స్మర పునః పునః ॥5॥

మన అద్యే సమాధాయ కురు నిత్యం మహోత్సవమ్ ।
భక్తానుకంపనశ్చాస్య శంకరస్య పునః పునః ॥6॥

బాణాసురా! శంకరసద్భక్తా! దిగులు చెందకు! శివుడంటే ఎవరు–భక్తులపట్ల పరమదయామయుడు. భక్తవత్సలుడు అని బిరుదు ధరించినవాడు. జరిగినదంతా ఆయన గారి ఇచ్ఛానుసారమే జరిగింది అని భావించు. ముందుగా మనస్సుని సమాధానపరుచుకో! భక్తశార్దూలా! శివనామమే నిరంతరం ధ్యానించు! శంకరుడు భక్తవ శంకరుడు. అతడికి మహోత్సవం జరిపించు!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

నందివాక్యాత్తతో బాణో ద్విషా శీర్షకమాత్రకః ।
శివస్థానం జగామాశు ధృత్వా ధైర్యం మహామనాః ॥7॥

గత్వా తత్ర ప్రభుం నత్వా రురోదాతీవ విహ్వలః ।
గతగర్వవ్రజో బాణః ప్రేమాకులితమానసః ॥8॥

సంస్తువన్ వివిధైః స్తోత్రైః సన్నమన్నుతితస్తథా ।
యథోచితం పదాఘాతం కుర్వన్ విక్షేపయన్ కరాన్ ॥9॥

ననర్త తాండవం ముఖ్యం ప్రత్యాలీఢాదిశోభితమ్ ।
స్థానకైర్వివిధాకారైరాలీఢప్రముఖైరపి ॥10॥

ముఖవాదసహస్రాణి భ్రూక్షేపసహితాన్యపి ।
శిరఃకంపసహస్రాణి ప్రాప్తానీకః సహస్రశః ॥11॥

చారీశ్చ వివిధాకారా దర్శయిత్వా శనైశ్శనైః ।
తథా శోణితధారాభిస్సించయిత్వా మహీతలమ్ ॥12॥

రుద్రం ప్రసాదయామాస శూలినం చంద్రశేఖరమ్ ।
బాణాసురో మహాభక్తా విస్మృతాత్మగతిర్నతః ॥13॥

తతో నృత్యం మహత్కృత్వా భగవాన్ భక్తవత్సలః ।
ఉవాచ బాణం సంహృష్టో నృత్యగీతప్రియో హరః ॥14॥

నందీశ్వరుడి మాటలతో ధైర్యం తెచ్చుకుని శత్రువులకు రాహువు వంటివాడూ (శీర్షకమాత్రకః) మహామనస్వీ ఆ బాణాసురుడు వెంటనే బయలుదేరాడు. శివుడినివాసం–కైలాసగిరికి చేరుకున్నాడు. మహేశ్వరుడికి సాష్టాంగపడి దుఃఖవివశుడై దారుణంగా విలపించాడు. అతడి మనస్సులో గర్వమంతా తొలగిపోయింది. దాని స్థానంలో శివుడి పట్ల భక్తి–ప్రేమ నిండిపోయాయి. అలా నమస్కరిస్తూనే ఎన్నెన్నో స్తుతులూ, స్తోత్రాలూ చేశాడు. మెల్లగా లేచాడు. చేతులు కదుపుతూ యథోచితంగా అడుగులు వేస్తూ నృత్యం ప్రారంభించాడు. అది క్రమక్రమంగా ప్రత్యాలీఢాది పాదాలతో వివిధ స్థానకాలతో, ముద్రలతో అతి ముఖ్యమైన తాండవంగా పరిణమించింది. భ్రూవిక్షేపాలూ రకరకాల ముఖవాద్యధ్వనులూ శిరఃకంపాలూ చారీభేదాలూ ప్రదర్శిస్తూ ఆ తాండవం మెల్లమెల్లగా వేగం పుంజుకుంది. (అతడికి వేల సేనలూ సమకూడారు) అతడి గాయాలనుంచి స్రవిస్తున్న రక్తధారలతో అక్కడినేల అంతా తడిసిపోయింది. త్రిశూలధారి చంద్రశేఖరుడు ఈ తాండవనృత్యం దర్శించి ఆనందపరవశుడయ్యాడు. అలా శివుణ్ణి ప్రసన్నం చేసుకుని మహాశివభక్తుడు బాణాసురుడు తనను తాను మరిచిపోయి శివుడికి సాష్టాంగపడ్డాడు. భక్తవత్సలుడు శివుడు సైతం అప్పుడు ఆనందంతో మహానృత్యం చేశాడు. నృత్య–గీత ప్రియుడు కనక శంకరుడు సంతుష్టుడై బాణుడితో సంభాషించాడు.

రుద్ర ఉవాచ – రుద్రుడు అన్నాడు.

బాణ తాత బలేః పుత్ర సంతుష్టో నర్తనేన తే ।
వరం గృహాణ దైత్యేంద్ర యత్తే మనసి వర్తతే ॥15॥

నాయనా! బాణా! బలినందనా! నీ నృత్యానికి నేను మురిసిపోయాను. దైత్యేంద్రా! నీ మనస్సులో ఏముందో అది వరంగా కోరుకో! ఇస్తాను.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచశ్శంభోః దైత్యేంద్రేణ తదా మునే ।
బాణేన సంవృణీతోఽ భూత్ వరైస్తు వ్రణరోపణే ॥16॥

బాహుయుద్ధస్య చోద్ధత్తిర్గాణపత్యమథాక్షయమ్ ।
ఉషాపుత్రస్య రాజ్యం తు తస్మిన్ శోణితకాహ్వయే ॥17॥

నిర్వైరతా చ విబుధైః విష్ణునా చ విశేషతః ।
న పునర్దైత్యతా దుష్టా రజసా తమసా యుతా ॥18॥

శంభు భక్తిర్విశేషేణ నిర్వికారా సదా మునే ।
శివభక్తేషు చ స్నేహో దయా సర్వేషు జంతుషు ॥19॥

ఇతి కృత్వా వరాన్ శంభోః బలిపుత్రో మహాసురః ।
ప్రేమ్ణాశ్రునయనో రుద్రం తుష్టావ సుకృతాంజలిః ॥20॥

శివుడి మాటలకు సంబరపడి వ్యాసమునీ! ఆ దైత్యేంద్రుడు కొన్ని వరాలు కోరుకున్నాడు. తన గాయాలు నయమైపోవాలి. బాహుయుద్ధం, బాహుయుద్ధమనే ఉద్ధతి తొలగిపోవాలి. అక్షయంగా తనకూ గణాధిపతిత్వం కావాలి. ఉషాపుత్రుడు–దౌహిత్రుడు–తన శోణితపురరాజ్యానికి అధిపతి అవ్వాలి. దేవతలతోనూ ప్రత్యేకించి విష్ణుమూర్తితోనూ తనకు వైరం ఉండకూడదు–చెలిమి నిలవాలి. రజస్తమోగుణాలతో నిండిన ఈ దుష్టదైత్యత్వం తనకింక ఏ జన్మలోనూ ఉండకూడదు–రాకూడదు. నిర్వికారమూ అత్యంత విశిష్టమూ అయిన శివభక్తి తనలో నిరంతరం నిలవాలి. వ్యాసమునీ! ఇంకా ఏమి కోరుకున్నాడో తెలుసా! శివభక్తులపట్ల స్నేహమూ సకల ప్రాణికోటిపట్ల అంతులేని దయ–తనకు కుదురుకోవాలి. బలిపుత్రుడు ఆ బాణమహాసురుడు శివుణ్ణి ఇలా వరాలు కోరి, భక్త్యావేశంతో కన్నులు చెమరించగా చేతులు జోడించి నిలబడి ఆ మహాదేవుణ్ణి రుద్రుణ్ణి ఇలా స్తుతించాడు.

బాణ ఉవాచ – బాణుడు స్తుతించాడు.

దేవదేవ మహాదేవ శరణాగతవత్సల ।
త్వాం నమామి మహేశాన దీనబంధో దయానిధే ॥21॥

కృత్వా మయి కృపాతీవ కృపాసాగర శంకర ।
గర్వోఽపహారితస్సర్వః ప్రసన్నేన మమ ప్రభో ॥22॥

త్వం బ్రహ్మ పరమాత్మా హి సర్వవ్యాప్యఖిలేశ్వరః ।
బ్రహ్మాండతనురుగ్రేశో విరాట్ సర్వాన్వితః పరః ॥23॥

నాభిర్నభోఽగ్నిర్వదనమంబు రేతో దిశః శ్రుతిః ।
ద్యౌశ్శీర్షమంఘ్రిరుర్వీ తే మనశ్చంద్రస్తవ ప్రభో ॥24॥

దృగర్కో జఠరం వార్ధిః భుజేంద్రో ధిషణా విధిః ।
ప్రజాపతిర్విసర్గశ్చ ధర్మోహి హృదయం తవ ॥25॥

రోమాణ్యోషధయో నాథ కేశా జలముచస్తవ ।
గుణాస్త్రయస్త్రినేత్రాణి సర్వాత్మా పురుషో భవాన్ ॥26॥

బ్రాహ్మణం తే ముఖం ప్రాహుః బాహుం క్షత్రియమేవ చ ।
ఊరుజం వైశ్యమాహుస్తే పాదజం శూద్రమేవ చ ॥27॥

త్వమేవ సర్వదోపాస్యస్సర్వైర్ధీవైర్మహేశ్వర ।
త్వాం భజన్ పరమాం ముక్తిం లభతే పురుషో ధ్రువమ్ ॥28॥

యస్త్వాం విసృజతే మర్త్యా ఆత్మానం ప్రియమీశ్వరమ్ ।
విపర్యయేంద్రియార్థార్థం విషమత్త్యమృతం త్యజన్ ॥29॥

విష్ణుః బ్రహ్మేథ విబుధా మునయశ్చామలాశయాః ।
సర్వాత్మనా ప్రపన్నాస్త్వాం శంకరం ప్రియమీశ్వరమ్ ॥30॥

ఇతి శ్రుత్వా స్వభక్తస్య బాణస్య భగవాన్ భవః ।
సర్వం లభిష్యసీత్యుక్త్వా తత్రైవాంతరధీయత ॥31॥

దేవాధిదేవా! మహాదేవా! శరణాగతవత్సలా! మహేశానా! దీనబంధూ! దయానిధీ! కృపాసాగరా! శంకరా! ప్రభూ! ప్రసన్నుడివయ్యావు. అంతే చాలు. నా గర్వాన్ని అంతటినీ తొలగింపజేశావు. నువ్వే పరబ్రహ్మవు. సర్వవ్యాపకుడివి. అఖిలేశ్వరుడివి. బ్రహ్మాండమే నీ తనువు. ఉగ్రేశుడివి. విరాట్ స్వరూపుడివి. సర్వాన్వితుడివి. పరాత్పరుడివి. ఆకాశం నీకు నాభి. అగ్నియే నీ వదనం. జలమే నీ రేతస్సు. దిక్కులే నీ చెవులు. ద్యులోకం నీ శీర్షం. భూగోళం నీ పాదద్వయం. చంద్రుడే నీ మనస్సు. సూర్యుడు నీ చూపు. సముద్రం నీ జఠరం. ఇంద్రుడు నీ భుజాలు. బ్రహ్మదేవుడే నీ బుద్ధి. ప్రజాపతియే నీ విసర్గం. ధర్మమే (ధర్మరాజే) నీ హృదయం. ఓషధులు నీ రోమాలు. మేఘాలు నీ శిరోజాలు. సత్త్వరజస్తమోగుణాలు నీకు మూడు నేత్రాలు. నువ్వు సర్వాత్మకుడివైన మహాపురుషుడివి. బ్రాహ్మణుడు నీ ముఖమనీ, క్షత్రియుడు నీ బాహువనీ, వైశ్యుడు నీ ఊరుజాతుడనీ, శూద్రుడు నీ పాదజుడనీ పెద్దలు చెబుతున్నారు. మహేశ్వరా! సకలప్రాణికోటికీ నువ్వే సర్వదా ఉపాస్యుడివి. నిన్ను సేవించిన వ్యక్తి తప్పనిసరిగా ముక్తిని పొందుతాడు. ఆత్మస్వరూపుడివీ, అత్యంతప్రియుడివీ, సర్వేశ్వరుడివీ, సంయతేంద్రుడివీ అయిన నిన్ను విడిచిపెట్టి ఎవరెవరినో ఉపాసించే మర్త్యుడు అమృతాన్ని విడిచిపెట్టి విషాన్ని ఆరగిస్తున్నట్టే. విష్ణువూ

బ్రహ్మదేవుడూ, సకలదేవతలూ, విమలమనస్కులైన మునీశ్వరులూ శంకరుడివనీ హితుడివనీ ఈశ్వరుడివనీ సర్వాత్మనా నిన్నే ప్రపన్నులై ఆరాధిస్తున్నారు. అని ఇలా తన భక్తుడు బాణాసురుడు చేసిన సంస్తుతిని ఆలకించి మహాదేవుడు–నాయనా! నువ్వు కోరుకున్నవన్నీ పొందుతావు–అని మాత్రం పలికి అంతర్ధానం చెందాడు.

తతశ్శంభోః ప్రసాదేన మహాకాలత్వమాగతః ।
రుద్రస్యానుచరో బాణో మహాప్రముదితోఽభవత్ ॥32॥

ఇతి కిల శరనామ్నశ్శంకరస్యాపి వృత్తం సకలగురుజనానాం సద్గురోశ్శూలపాణేః ।
కథితమిహ వరిష్ఠం శ్రోత్రరమ్యైర్వచోభిః సకల భువనమధ్యే క్రీడమానస్య నిత్యమ్ ॥33॥

వ్యాసమునీ! అప్పుడు శివుడి అనుగ్రహవిశేషం వల్ల బాణాసురుడు మహాకాలుడిగా రుద్రగణముఖ్యుడయ్యాడు. రుద్రుడి అనుచరుడయ్యాడు. దీనికి ఆ దైత్యేంద్రుడు ఎంతో సంబరపడ్డాడు. ఇది నాయనా! శంకర–బాణాసురుల వృత్తాంతం. సకల గురుజనులకూ సద్గురువైన శూలపాణి లీలావిలాసం. చెవికి ఇంపు గూర్చే మాటలు ఏర్చి కూర్చి, సకలభువనాల మధ్య నిరంతరం క్రీడించే ఆ మహేశ్వరుడి ఉత్తమోత్తమ గాథ ఇది. నీకు వినిపించాను.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే బాణాసురగణపతిత్వప్రాప్తి వర్ణనం నామ షట్పంచాశత్తమోఽధ్యాయః ॥56॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు బాణాసురగణపతిత్వ ప్రాప్తివర్ణనం అనే యాభై ఆరవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

సప్తపంచాశత్తమోఽధ్యాయః – యాభై ఏడవ అధ్యాయం

గజాసురవధః – గజాసురవధ

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాస మహాప్రేమ్ణా చరితం శశిమౌళినః ।
యథావధీస్త్రిశూలేన దానవేంద్రం గజాసురమ్ ॥1॥

దానవే నిహతే దేవ్యా సమరే మహిషాసురే ।
దేవానాం చ హితార్థాయ పురా దేవాస్సుఖం యయుః ॥2॥

తస్య పుత్రో మహావీరో మునీశ్వర గజాసురః ।
పితుర్వధం హి సంస్మృత్య కృతం దేవ్యా సురార్ధనాత్ ॥3॥

స తదై వ్రమనుస్మృత్య తపోఽర్థం గతవాన్వనే ।
సముద్దిశ్య విధిం ప్రీత్యా తతాప పరమం తపః ॥4॥

అవధ్యోఽహం భవిష్యామి స్త్రీపుంసైః కామనిర్జితైః ।
సంవిచార్యేతి మనసాభూత్తపోరతమానసః ॥5॥

వ్యాసమునీ! చంద్రశేఖరుడి మరొక చరితం చెబుతాను, ఆసక్తిగా వినుమా! గజాసురుణ్ణి త్రిశూలంతో శివుడు కడతేర్చిన కథ ఇది. వెనకటికి దేవతల సుఖం కోరి ఆదిపరాశక్తి భీకరసంగ్రామంలో మహిషాసురుణ్ణి సంహరించింది. తెలుసుగదా! అప్పటినుంచీ దేవతలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారు. అయితే, ఆ మహిషాసురుడికి ఒక కొడుకు ఉన్నాడు. వాడి పేరు గజాసురుడు, మహావీరుడు. దేవతలకోసమని పరాభట్టారిక వచ్చి తన తండ్రిని వధించడాన్ని అతడు దిగమింగుకోలేకపోయాడు. పగ తీర్చుకోవాలనుకున్నాడు. నిర్జనవనంలోకి పోయి తపస్సుకి ఉపక్రమించాడు. బ్రహ్మదేవుణ్ణి భక్తితో ధ్యానిస్తూ ఘోరతపస్సు చేశాడు. కామనిర్జితులైన స్త్రీపురుషులకు తాను అవధ్యుడు కావాలని గట్టిగా మనస్సులో నిశ్చయించుకుని తపస్సు చేపట్టాడు.

స తేపే హిమవద్ద్రోణ్యాం తపః పరమదారుణమ్ ।
ఊర్ధ్వబాహుర్నభోదృష్టిః పాదాంగుష్ఠాశ్రితావనిః ॥6॥

జటాభారైస్స వై రేజే ప్రళయార్క ఇవాంశుభిః ।
మహిషాసురపుత్రోఽసౌ గజాసుర ఉదారధీః ॥7॥

తస్య మూర్ధ్నస్సముద్భూతస్ధూమోఽగ్నిస్తపోమయః ।
తిర్యగూర్ధ్వమధోలోకాంస్తాపయన్విష్వగీరితః ॥8॥

చుక్షుభుర్నద్యుదన్వంతశ్చాగ్నేర్మూర్ధసముద్భవాత్ ।
నిపేతుస్సగ్రహాస్తారా జజ్వలుశ్చ దిశో దశ ॥9॥

తేన తప్తాస్సురాస్సర్వే దివం త్యక్త్వా సవాసవాః ।
బ్రహ్మలోకం యయుర్విజ్ఞాపయామాసుశ్చాల భూః ॥10॥

హిమాలయపర్వతసానువుల్లో ఒకచోట గజాసురుడు తన ఘోరతపస్సు సాగించాడు. ఊర్ధ్వబాహువుగా కుడికాలి బొటనవేలి మీద నిలబడి దృష్టిని ఆకాశంలో నిలిపి సుదీర్ఘతపస్సు చేశాడు. జుట్టు జడలు కట్టింది. ప్రళయకాల సూర్యబింబంలా తపశ్శక్తి ప్రజ్వరిల్లింది. అతడి శిరోఽగ్రభాగం నుంచి తపోఽగ్నిజ్వాలలు పొగలు కక్కుతూ తిర్యక్-ఊర్ధ్వ-అధోలోకాలకు వ్యాపించాయి. ఆ వేడికి నదులూ సముద్రాలూ సలసలలాడాయి. తారాగ్రహసముదాయాలు రాలిపడ్డాయి. భూమి కంపించింది. దశదిశలూ భగ్గుమన్నాయి. ఇంద్రాది దేవతలు ఆ వేడిమికి తాళలేక దేవలోకం విడిచిపెట్టి బ్రహ్మలోకానికి పరుగులు తీశారు. బ్రహ్మదేవుడికి విన్నవించుకున్నారు.

దేవా ఊచుః – దేవతలు మొరపెట్టుకున్నారు.

విధే గజాసురతపస్తప్తా వయమథాకులాః ।
న శక్నుమో దివి స్థాతుమతస్తే శరణం గతాః ॥11॥

విధేహ్యుపశమం తస్య చాన్యాన్ జీవయితుం కృపా ।
లోకా నంక్ష్యత్యన్యథా హి సత్యం సత్యం బ్రువామహే ॥12॥

ఇతి విజ్ఞాపితో దేవైర్వాసవాద్యైస్స ఆత్మభూః ।
భృగుదక్షాదిభిః బ్రహ్మా యయౌ దైత్యవరాశ్రమమ్ ॥13॥

తపంతం తపసా లోకాన్ యథాఽభ్రాపిహితం దివి ।
విలక్ష్య విస్మితః ప్రాహ విహసన్ సృష్టికారకః ॥14॥

హే బ్రహ్మన్! గజాసురుడి తపోఽగ్నికి మాడిపోతున్నాం మేము. కలత పడుతున్నాం. దేవలోకంలో నిలవలేకపోతున్నాం. అందుకే ఇలా వచ్చి నిన్ను శరణు వేడుకుంటున్నాం. చతుర్ముఖా! దయ చూపించు. ఆ వేడిమిని ఉపశమింపజెయ్యి. తక్కిన జీవరాశిని-అస్మాదృశుల్ని-బతికించు! లేదంటే లోకాలన్నీ నాశనమైపోతాయి. ఇది ముమ్మాటికీ నిజం. మేము నిజమే చెబుతున్నాము. అని ఇంద్రాది సకల దేవతలు ఇలా విన్నవించేసరికి ఆత్మభువైన ఆ బ్రహ్మదేవుడు వెంటనే భృగుదక్షాదుల్ని వెంటబెట్టుకుని గజాసురుడి తపోవనానికి (ఆశ్రమానికి) వెళ్ళాడు. నింగి అంతటా కారుమబ్బులు కమ్ముకున్నాయి. (అభ్ర+ఆపిహితమ్). సృష్టికర్త తానే ఆశ్చర్యచకితుడయ్యాడు. తపస్సుతో సకలలోకాలనూ కలవరపెడుతున్న ఆ గజాసురుణ్ణి చూసి యథోచితంగా నవ్వుతూ ఇలా పలికాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఉత్తిష్ఠోత్తిష్ఠ దైత్యేంద్ర తపస్సిద్ధోఽసి మాహిషే ।
ప్రాప్తోఽహం వరదస్తాత వరం వృణు యథేప్సితమ్ ॥15॥

నాయనా! దైత్యేంద్రా! మాహిషీ! (మహిషపుత్రా!) లెమ్ము తపస్సిద్ధుడివయ్యావు. ఇదిగో వరదుణ్ణి నేనే వచ్చాను. నీ కోరిక ఏమిటో వరం కోరుకో!!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఉత్థాయోత్థయ దైత్యేంద్రః ఈక్షమాణో దృశా విభుమ్ ।
గిరా గద్గదయా ప్రీతోఽగృణాద్దేవం స మాహిషిః ॥16॥

వ్యాసమునీ! ఈ మాటకు ఆ మహిషపుత్రుడు గజాసురుడు మెల్లమెల్లగా తపస్సమాధి నుంచి లేచాడు. కన్నులు తెరిచాడు. బ్రహ్మదేవుణ్ణి చూశాడు. గొంతు వణుకుతోంది. భక్తితో ఇలా అడిగాడు.

గజాసుర ఉవాచ – గజాసురుడు పలికాడు.

నమస్తే దేవదేవేశ యది దాస్యసి మే వరమ్ ।
అవధ్యోఽహం భవేయం వై స్త్రీపుంసైః కామనిర్జితైః ॥17॥

మహాబలో మహావీర్యోఽజేయో దేవాదిభిస్సదా ।
సర్వేషాం లోకపాలానాం నిఖిలర్ధి సుభుగ్విభో ॥18॥

దేవదేవేశా! నమో నమః నమో నమః! నాకు వరం ఇచ్చేట్టయితే ఇదిగో ఇది అనుగ్రహించు. కామనిర్జితులైన స్త్రీపురుషులకు నేను అవధ్యుణ్ణి కావాలి. మహాబలశాలిని, మహాశక్తి సంపన్నుణ్ణి కావాలి. దేవతాదులకూ సమస్తదిక్పాలకులకూ అజేయుడిగా ఎల్లపుడూ నిలవాలి. ప్రభూ! అన్నిరకాల సమృద్ధులూ నేను అనుభవించాలి.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఏవం వృతశ్శతధృతి ర్దానవేన స తేన వై ।
ప్రాదాత్తత్తపసా ప్రీతో వరం తస్య సుదుర్లభమ్ ॥19॥

ఏవం లబ్ధవరో దైత్యో మాహిషిశ్చ గజాసురః ।
సుప్రసన్నమనాస్సోఽథ స్వధామ ప్రత్యపద్యత ॥20॥

స విజిత్య దిశస్సర్వా లోకాంశ్చ త్రీన్ మహాసురః ।
దేవాసురమనుష్యేంద్రాన్ గంధర్వ గరుడోరగాన్ ॥21॥

ఇత్యాదీన్నిఖిలాన్ జిత్వా వశమానీయ విశ్వజిత్ ।
జహార లోకపాలానాం స్థానాని సహ తేజసా ॥22॥

దేవోద్యానశ్రియాజుష్టమధ్యాస్తే స్మ త్రివిష్టపమ్ ।
మహేంద్రభవనం సాక్షాన్నిర్మితం విశ్వకర్మణా ॥23॥

ఆ దానవేంద్రుడు ఇలా వరం అడిగే సరికి శతధృతి అతడి తపస్సుకి మెచ్చినవాడై అది ఎంతో దుర్లభమే అయినా అంగీకరించి అనుగ్రహించాడు. దీనితో ఆ మహిషపుత్రుడు, గజదైత్యుడు సంతుష్టాంతరంగుడై తన భవనం చేరుకున్నాడు. అటుపైని ఆ మహాదైత్యుడు దశదిశలనూ త్రిలోకాలనూ జయించాడు. దేవాసుర

మనుష్యేంద్రుల్నీ గరుడోరగ గంధర్వుల్నీ ఇంకా తక్కిన దేవదానవమానవజాతుల్ని అందరినీ జయించి వశం చేసుకుని విశ్వవిజేత అయ్యాడు. తన తేజస్సుతో లోకపాలకులనందరినీ ఓడించి వారి పదవులన్నీ గుంజుకున్నాడు. నందనవనశోభతో విరాజిల్లుతున్న త్రివిష్టపాన్ని ఆక్రమించుకుని సాక్షాత్తు విశ్వకర్మ నిర్మించిన ఇంద్రభవనంలో తిష్ఠవేశాడు.

తస్మిన్ మహేంద్రస్య గృహే మహాబలో మహామనా నిర్జితలోక ఏకరాట్ ।
రేమేఽభివంద్యాంఘ్రియుగస్సురాదిభిః ప్రతాపితైరూర్జితచండశాసనః ॥24॥

స ఇత్థం నిర్జితకకుబేకరాట్ విషయాన్ ప్రియాన్ ।
యథోపజోషం భుంజానో నాతృప్యదజితేంద్రియః ॥25॥

విశ్వవిజేత. ఏకైక ప్రభువు. మహాబలి. మహామనస్వి. చండశాసనుడు. ఆ గజదైత్యుడు సకల దేవతాదుల్నీ ప్రతాపంతో లొంగదీసుకుని, వారితో పాదాభివందనాలు అందుకుంటూ ఇంద్రభవనంలో ఆనందంగా కాలం గడుపుతున్నాడు. సకల దిక్కులనూ జయించిన ఒకేఒక్క సమ్రాట్టుగా కోరిన సుఖాలను యథేచ్ఛగా అనుభవిస్తున్నా ఇంద్రియాలను జయించినవాడు కాదు కనుక అతడికి తనివితీరలేదు.

ఏవమైశ్వర్యమత్తస్య దృప్తస్యో చ్ఛాస్త్రవర్తినః ।
కాలే వ్యతీతే మహతి పాపబుద్ధిరభూత్తతః ॥26॥

మహిషాసురపుత్రోఽసౌ సంచిక్లేశ ద్విజాన్ వరాన్ ।
తాపసాన్నితరాం పృథ్వ్యాం దానవస్సురమర్దనః ॥27॥

సురాన్నరాంశ్చ ప్రమథాన్ సర్వాన్ చిక్లేశ దుర్మతిః ।
ధర్మాన్వితాన్ విశేషేణ పూర్వవైరమనుస్మరన్ ॥28॥

వ్యాసమునీ! ఇలా ఐశ్వర్యమదమత్తుడైన గజాసురుడు ధర్మశాస్త్రవిరుద్ధంగా యథేచ్ఛగా సుఖోపభోగాలు అనుభవిస్తున్నాడు. చాలాకాలం గడిచింది. క్రమంగా అతడిలో పాపబుద్ధి ప్రబలింది. అక్కడినుంచి ఆ మహిష పుత్రుడు భూలోకంలోని ద్విజోత్తములను క్లేశపెట్టడం, తాపసులను మరింతగా హింసించడం, దేవ–మానవ–ప్రమథాదుల్ని అందరినీ పీడించడం–ఇత్యాదులు ముమ్మరం చేశాడు. సురమర్దనుడు ఆ దుర్మతి పూర్వవైరాన్ని గుర్తుకి తెచ్చుకుంటూ విశేషించి ధర్మాన్వితుల్ని అందరినీ హింసించసాగాడు.

ఏకస్మిన్ సమయే తాత దానవోఽసౌ మహాబలః ।
అగచ్ఛద్రాజధానీం వై శంకరస్య గజాసురః ॥29॥

సమాగతేఽసురేంద్రే హి మహాన్ కలకలో మునే ।
త్రాత త్రాతేతి తత్రాసీదానందవనవాసినామ్ ॥30॥

మహిషాసురపుత్రోఽసౌ యదా పుర్యాం సమాగతః ।
ప్రమథన్ ప్రమథాన్ సర్వాన్ నిజవీర్యమదోద్ధతః ॥31॥

తస్మిన్నవసరే దేవాశ్శక్రాద్యాస్తత్పరాజితాః ।
శివస్య శరణం జగ్ముర్నత్వా తుష్టువురాదరాత్ ॥32॥

న్యవేదయన్ దానవస్య తస్య కాశ్యాం సమాగమమ్ ।
క్లేశాధిక్యం తత్రత్యానాం తన్నాథానాం విశేషతః ॥33॥

నాయనా! వ్యాసా! ఒకనాడు ఈ మహాబలశాలి దానవనాథుడు గజాసురుడు శంకరుడి రాజధానికి కాశీ నగరానికి వెళ్ళాడు. అతడి రాకతో అక్కడ పెద్ద కలకలం చెలరేగింది. కాపాడండి–కాపాడండి అని అరుస్తూ– ఆనందవనవిహారులైన దేవతలందరూ అటూ ఇటూ పరుగులు తీశారు. ఆ మహిషపుత్రుడు నిజవీర్యమదోద్ధతుడై ప్రమథుల్ని ఇష్టం వచ్చినట్టు చెండాడుతూ పురంలోకి ప్రవేశించాడు. అతడికి ఓడిపోయి కాశీనగరంలో తలదాచుకుంటున్న ఇంద్రాదిదేవతలందరూ ఒక్కసారిగా కైలాసానికివెళ్ళి శివుడిపాదాలపై పడి నమస్కరించి స్తుతించి శరణువేడుకున్నారు. తామంతా కాశీమహానగరంలో తలదాచుకుంటుండగా ఈ గజాసురుడు అక్కడికి వచ్చి కాశీపౌరులనూ నరనాథులనూ విశేషించి తమనూ ఎంత దారుణంగా క్లేశపెట్టాడో శివుడికి విన్నవించుకున్నారు.

దేవా ఊచుః – దేవతలు విన్నవించారు.

దేవ దేవ మహాదేవ తవ పుర్యాం గతోఽసురః ।
కష్టం దత్తే త్వజ్జనానాం తం జహి త్వం కృపానిధే ॥34॥

యత్ర యత్ర ధరాయాం చ చరణం ప్రమిణోతి హి ।
అచలాం సచలాం తత్ర కరోతి నిజభారతః ॥35॥

ఊరువేగేన తరవః పతంతి శిఖరైస్సహ ।
యస్య దోర్దండఘాతేన చూర్ణాః స్యుశ్చ శిలోచ్చయాః ॥36॥

యస్య మౌలిజసంఘర్షాద్ధునా వ్యోమ త్యజంత్యపి ।
నీలిమానం న చాద్యాపి జహ్యుస్తత్కేశ సంగజమ్ ॥37॥

యస్య నిఃశ్వాససంభారైరుత్తరంగా మహాబ్ధయః ।
నద్యోప్యమందకల్లోలా భవంతి తిమిభిస్సహ ॥38॥

దేవదేవా! మహాదేవా! కాశీనగరమంటే అది నీ పట్టణం. అక్కడికి ప్రవేశించి ఈ అసురుడు నీ వారిని అందరినీ కష్టపెట్టాడు. కృపానిధీ! వెంటనే వీడిని సంహరించు. భూగోళం మీద వీడు ఎక్కడ కాలుమోపితే అక్కడ వీడి బరువు ఓపలేక నేలంతా కంపిస్తున్నది. వీడు కదులుతూంటే ఊరువేగానికి మహావృక్షాలు మొదలంటా కూలిపోతున్నాయి. వీడి బాహుఘాతాలకు పర్వతాలు తుత్తునియలవుతున్నాయి. వీడి శిరోజాలు ఒరుసుకుని మేఘాలు ఆకాశంలో చెల్లాచెదురవుతున్నాయి. ఆ మేఘాలకు అంటిన వీడి శిరోజాల నల్లదనం ఇప్పటికీ వదలడం లేదు. వీడి ఉచ్ఛ్వాసనిఃశ్వాసాలకు నదులూ అల్లకల్లోల మవుతున్నాయి. సముద్రాలూ తిమింగిలఘుషనక్రాదులతో సహా ఉత్తుంగతరంగితాలై అల్లకల్లోలమవుతున్నాయి.

యోజనానాం సహస్రాణి నవ యస్య సముచ్ఛ్రయః ।
తావానేవ హి విస్తారః తనోర్మాయావినోఽస్య హి ॥39॥

యన్నేత్రయోః పింగలిమా తథా తరళిమా పునః ।
విద్యుతా నోవ్యతేఽద్యాపి సోఽయం స్మాయాతి సత్వరమ్ ॥40॥

యాం యాం దిశం సమభ్యేతి సోఽయం దుస్సహదానవః ।
అవధ్యోఽహం భవామీతి స్త్రీపుంసైః కామనిర్జితైః ॥41॥

ఇత్యేవం చేష్టితం తస్య దానవస్య నివేదితమ్ ।
రక్షస్వ భక్తాన్ దేవేశ కాశీరక్షణ తత్పర ॥42॥

ఈ మాయావిగాడి కళేబరం తొమ్మిదివేల యోజనాల పొడుగు, అంతే వెడల్పూను. వీడి కన్నుల పింగళిమనూ తరళిమనూ మెరుపుతీగసైతం ఈనాటికీ సాధించలేకపోతోంది. అలాంటి వాడు ఈ గజాసురుడు. ఇదిగో త్వరత్వరగా వచ్చేస్తున్నాడు. కామనిర్జితులైన స్త్రీపురుషులకెవ్వరికైన నేను అవధ్యుణ్ణి అన్న ధీమాతో ఈ దుస్సహదానవుడు ఎక్కడికిబడితే అక్కడికి వెళ్ళిపోతున్నాడు. వీడి దౌష్ట్యం అంతా నీకు విన్నవించాం మహాప్రభూ! దేవేశా! కాశీరక్షణతత్పరా! దయచేసి నీ భక్తుల్ని మమ్మల్ని కాపాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇతి సంప్రార్థితో దేవైః భక్తరక్షణతత్పరః ।
తత్రాజగామ సోఽరం తద్వధకామనయా హరః ॥43॥

ఆగతం తం సమాలోక్య శంకరం భక్తవత్సలమ్ ।
త్రిశూలహస్తం గర్జంతం జగర్జ స గజాసురః ॥44॥

తతస్తయోర్మహానాసీత్ సమరో దారుణోఽద్భుతః ।
నానాస్త్రశస్త్రసంపాతైర్వీరారావం ప్రకుర్వతోః ॥45॥

గజాసురోఽతి తేజస్వీ మహాబలపరాక్రమః ।
వివ్యాధ గిరిశం బాణైః తీక్ష్ణైర్దానవఘాతినమ్ ॥46॥

దేవతలు ఇలా ప్రార్థించగా భక్తరక్షణతత్పరుడు ఆ మహాదేవుడు గజాసురుడి వధకు సంకల్పించి వేగంగా కాశీనగరం చేరుకున్నాడు. త్రిశూలం ధరించి భీషణంగా గర్జిస్తూ తనవైపు వేగంగా వస్తున్న ఆ భక్తవత్సలుణ్ణి ఆ శంకరుణ్ణి చూసి ఆ గజాసురుడు తానూ భీషణంగా గర్జించాడు. సింహనాదాలతో అస్త్రశస్త్రప్రయోగాలతో ఇద్దరికీ దారుణసంగ్రామం అద్భుతావహంగా జరిగింది. గజాసురుడు మహాతేజస్వి. మహాబలశాలి. తీక్ష్ణబాణపరంపరలతో ఆ దానవాంతకుణ్ణి శివుణ్ణి తీవ్రంగా హింసించాడు.

అథ రుద్రో రౌద్రతనుః స్వశరైరతిదారుణైః ।
తచ్ఛరాంశ్చిచ్ఛిదే తూర్ణమప్రాప్తాంస్తిలశో మునే ॥47॥

తతో గజాసురః క్రుద్ధోఽభ్యధావత్తం మహేశ్వరమ్ ।
ఖడ్గహస్తః ప్రగర్జ్జుచ్చైఃహతోఽసీత్యద్య వై మయా ॥48॥

తతస్త్రిశూలహేతిస్తమాయాంతం దైత్యపుంగవమ్ ।
విజ్ఞాయావధ్యమన్యేన శూలేనాభిజఘాన తమ్ ॥49॥

ప్రోతస్తేన త్రిశూలేన స చ దైత్యో గజాసురః ।
ఛత్రీకృతమివాత్మానం మన్యమానో జగౌ హరమ్ ॥50॥

వ్యాసమునీ! అప్పుడు రుద్రుడు నిజంగా రౌద్రస్వరూపుడయ్యాడు. అసురుడు వేసిన బాణాలను అన్నింటినీ తన బాణాలతో అవి తనను చేరకముందే నువ్వు గింజల్లా తునియలు చేసేశాడు. గజాసురుడికి క్రోధం పెల్లుబికింది. ఖడ్గం చేతబట్టి–ఇప్పుడే నా చేతిలో చచ్చావు–అని భీషణంగా అరుస్తూ మహేశ్వరుడిపైకి లంఘించాడు. త్రిశూలం చేతబట్టి మహేశ్వరుడు అలా వచ్చిపడుతున్న గజాసురుడు ఇతరులకు అవధ్యుడని తెలిసి–బలంకొద్దీ పొడిచాడు. వెంటనే త్రిశూలాన్ని పైకి ఎత్తాడు. దానికి తగుల్కున్న గజాసురుడు తనను తాను శివుడికి ఛత్రంలా భావించాడు. వెంటనే శంకరుణ్ణి స్తుతించాడు.

గజాసుర ఉవాచ – గజాసురుడు అన్నాడు.

దేవదేవ మహాదేవ తవ భక్తోఽస్మి సర్వథా ।
జానే త్వాం త్రిదివేశానం త్రిశూలిన్ స్మరహారిణమ్ ॥51॥

తవ హస్తే మమ వధో మహాశ్రేయస్కరో మతః ।
అంధకారే మహేశాన త్రిపురాంతక సర్వగ ॥52॥

కించిద్విజ్ఞప్తుమిచ్ఛామి తత్ శృణుష్వ కృపాకర ।
సత్యం బ్రవీమి నాసత్యం మృత్యుంజయ విచారయ ॥53॥

త్వమేకో జగతాం వంద్యో విశ్వస్యోపరి సంస్థితః ।
కాలేన సర్వైర్మర్తవ్యం శ్రేయసే మృత్యురీదృశః ॥54॥

దేవాదిదేవా! మహాదేవా! అన్ని విధాలుగా నేను నీ భక్తుణ్ణి. త్రిశూలీ! మదనాంతకా! నువ్వు సకల దేవతలకూ ప్రభువువని ఎరుగుదును. నీ చేతితో మరణించడం నాకు మహాశ్రేయస్కరమని నమ్ముతున్నాను. అంధకాసురసంహారీ! మహేశానా! త్రిపురాంతకా! సర్వవ్యాపీ! దయామయా! నాదొక చిన్న విజ్ఞప్తి. సత్యమే చెబుతున్నాను. అసత్యం కాదు. కొంచెం ఆలోచించు. ఈ విశ్వానికి అధినాయకుడివి నీవు. జగత్తునంతటికీ అభివంద్యుడివి నువ్వొక్కడివే. శంకరా! పుట్టినవాడెవడైనా సరే ఎప్పుడో ఒకప్పుడు మరణించవలసిందే. నీ చేతిలో ఇలా మరణించడం నిజంగా నా అదృష్టం–వరం.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య శంకరః కరుణానిధిః ।
ప్రహస్య ప్రత్యువాచేశో మాహిషేయం గజాసురమ్ ॥55॥

మాహిషేయుడి మాటలు విని కరుణానిధి శంకరుడు సంతోషంగా నవ్వాడు. బదులు పలికాడు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు అన్నాడు.

మహాపరాక్రమనిధే దానవోత్తమ సన్మతే ।
గజాసుర ప్రసన్నోఽస్మి స్వానుకూలం వరం వృణు ॥56॥

దానవోత్తమా! మహాపరాక్రమనిధీ! సన్మతీ! గజాసురా! నేను ప్రసన్నుణ్ణి అయ్యాను. నీకు తగిన వరం కోరుకో!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య మహేశస్య వచనం వరదస్య హి ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా దానవేంద్రో గజాసురః ॥57॥

వరం ఇస్తాను కోరుకోమన్న మహేశుడి మాట విని స్థిమితపడిన దానవేంద్రుడైన ఆ గజాసురుడిలా కోరుకున్నాడు.

గజాసుర ఉవాచ – గజాసురుడు అడిగాడు.

యది ప్రసన్నో దిగ్వాసః! తదా నిత్యం వసాన మే ।
ఇమాం కృత్తిం మహేశాన త్వత్ త్రిశూలాగ్నిపావితామ్ ॥58॥

స్వప్రమాణాం సుఖస్పర్శాం రణాంగణపణీకృతామ్ ।
దర్శనీయాం మహాదివ్యాం సర్వదైవ సుఖావహామ్ ॥59॥

ఇష్టగంధిస్సదైవాస్తు సదైవాస్త్వతికోమలా ।
సదైవ నిర్మలా చాస్తు సదైవాస్త్వతిమండనమ్ ॥60॥

మహాతపోఽనలజ్వాలాం ప్రాప్యాపి సుచిరం విభో ।
న దగ్ధా కృత్తిరేషా మే పుణ్యగంధనిధేస్తతః ॥61॥

యది పుణ్యవతీ నైషా మమ కృత్తి దిగంబర! ।
తదా త్వదంగసంగోఽస్యాః కథం జాతో రణాంగణే ॥62॥

అన్యం చ మే వరం దేహి యది తుష్టోఽసి శంకర ।
నామాస్తు కృత్తివాసాస్తే ప్రారభ్యాద్యతనం దినమ్ ॥63॥

ఓయీ దిగంబరా! నిజంగా నువ్వు ప్రసన్నుడివైతే, దయచేసి నిరంతరం నువ్వు ఈ నా చర్మాన్ని ధరించు. ఇది నీ త్రిశూలాగ్నిలో తప్తమై పావనమైన చర్మం. నా అంతటిది ఈ చర్మం. తాకితే సుఖంగా ఉండే మృదువైన చర్మం. రణరంగంలో పణంగా నిలిచిన చర్మం. చూడచక్కని చర్మం. మహాదివ్యమైన చర్మం. సుఖావహమైన చర్మం. దయచేసి దీన్ని ధరించు. ఇది ఎల్లవేళలా నువ్వు కోరుకున్న పరిమళాలు వెదజల్లుతుంది. ఎల్లవేళలా అతికోమలంగా ఉంటుంది. వేల సంవత్సరాలకైనా మలినరహితంగా ఉంటుంది. నీ అలంకారాలన్నింటిలోకీ అత్యుత్తమమవుతుంది. ప్రభూ! నేను చేసిన మహాతపస్సు నుంచి వెలువడ్డ అగ్నిజ్వాల ఎంతసేపు సోకినా కసుగందని చర్మం ఇది. అంతే కాదు మహానుభావా! ఇది పుణ్యగంధనిధి. దిగంబరా! ఇది ఎంతటి మహాపుణ్యం చేసుకున్నదో కదా! కాకపోతే ఇలా రణరంగంలో నీ కరస్పర్శను పొందగలుగుతుందా? నువ్వే చెప్పు! శంకరా! నువ్వు సంతుష్టిచెందితే మరొక్క వరం కూడా కటాక్షించు. నేడు మొదలుగా నీకు కృత్తివాససుడనే పేరు ఏర్పడుగాక!

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శ్రుత్వేతి వచస్తస్య శంకరో భక్తవత్సలః ।
తథేత్యువాచ సుప్రీతో మహిషాసురజం చ తమ్ ॥64॥

పునః ప్రోవాచ ప్రీతాత్మా దానవం తం గజాసురమ్ ।
భక్తప్రియో మహేశానో భక్తినిర్మలమానసమ్ ॥65॥

భక్తవత్సలుడు శంకరుడు గజాసురుడి అభ్యర్థన ఆలకించి సుప్రీతుడయ్యాడు. తథాస్తు అని పలికాడు. భక్తప్రియుడు కనక ఆ మహేశానుడు చాలా ఆనందించి భక్తి నిర్మలమానసుడైన గజాసురుడితో ఇంకా ఇలా పలికాడు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు అన్నాడు.

ఇదం పుణ్యం శరీరం తే క్షేత్రే ఽస్మిన్ ముక్తిసాధనే ।
మమ లింగం భవత్త్వత్ర సర్వేషాం ముక్తిదాయకమ్ ॥66॥

కృత్తివాసేశ్వరం నామ మహాపాతకనాశనమ్ ।
సర్వేషామేవ లింగానాం శిరోభూతం విముక్తిదమ్ ॥67॥

కథయిత్వేతి దేవేశస్తత్కృత్తిం పరిగృహ్య చ ।
గజాసురస్య మహతీం ప్రావృణోద్ధి దిగంబరః ॥68॥

నాయనా! నిజమే నీ చర్మం చాలా పుణ్యం చేసుకుంది. ముక్తిసాధకమైన ఈ (కాశీ) క్షేత్రంలో అందరికీ ముక్తిదాయకంగా నా లింగం ఏర్పడుగాక! సకలపాతకాలనూ నాశనం చేసే ఆ లింగం–కృత్తివాసేశ్వరమనే పేరుతో వ్యవహరింపబడుగాక! శివలింగాలలోకెల్లా శిరోభూషణమై విముక్తిప్రదమై విరాజిల్లుగాక! అని పలికి ఆ మహాదేవుడు ఆ దిగంబరుడు గజాసురుడి మహాకృత్తిని స్వీకరించి ధరించాడు.

మహామహోత్సవో జాతస్తస్మిన్నహ్ని మునీశ్వర ।
హర్షమాపుర్జనాస్సర్వే కాశీస్థాః ప్రమథాస్తథా ॥69॥

హరిబ్రహ్మాదయో దేవా హర్షనిర్భరమానసాః ।
తుష్టువుస్తం మహేశానం నత్వా సాంజలయస్తతః ॥70॥

హతే తస్మిన్ దానవేశే మాహిష్మే హి గజాసురే ।
స్వస్థానం భేజిరే దేవా జగత్ స్వాస్థ్యమవాప చ ॥71॥

ఇత్యుక్తం చరితం శంభోః భక్తవాత్సల్యసూచకమ్ ।
స్వర్గ్యం యశస్యమాయుష్యం ధనధాన్యప్రవర్ధనమ్ ॥72॥

య ఇదం శృణుయాత్ ప్రీత్యా శ్రావయేద్వా శుచివ్రతః ।
స భుక్త్వా చ మహాసౌఖ్యం లభేతాంతే పరం సుఖమ్ ॥73॥

వ్యాసమునీశ్వరా! కాశీమహానగరంలో ఆనాడు మహామహోత్సవం జరిగింది. నగరవాసులూ ప్రమథులూ అంతా హర్షపులకితులయ్యారు. బ్రహ్మవిష్ణుమహేంద్రాది దేవతలందరి మనస్సులూ ఆనందనిర్భరాలయ్యాయి. అందరూ చేతులు జోడించి నిలిచి మహేశానుజ్ఞి పెక్కు విధాలుగా స్తుతించారు. అలా గజాసురుడి కథ ముగియడంతో దేవతలు ఎవరి పదవులు వారు చేపట్టారు. ప్రపంచం కుదుటబడింది. శివుడి భక్తవాత్సల్యాన్ని సూచించే కథ ఇది. స్వర్గప్రదం. యశస్కరం. ఆయుర్వర్ధకం. ధనధాన్యసమృద్ధికరం. దీన్ని భక్తితో విన్నా శుచిశీలుడై ఇతరులకు వినిపించినా వారందరూ ఇహంలో, పరంలో మహాసౌఖ్యాలు అనుభవిస్తారు, తరిస్తారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే గజాసురవధో నామ సప్తపంచాశత్తమోఽధ్యాయః ॥57॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు గజాసురవధ అనే యాభై ఏడవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

అష్టపంచాశత్తమోఽధ్యాయః – యాభై ఎనిమిదవ అధ్యాయం

దుందుభినిర్హ్రాదదైత్యవధ వర్ణనమ్ – దుందుభినిర్హ్రాదదైత్యవధ సంహారవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాస ప్రవక్ష్యామి చరితం శశిమౌళినః ।
యథా దుందుభినిర్హ్రాదమవధీద్దితిజం హరః ॥1॥

వ్యాసా! శశిశేఖరుడి చరితంలో మరొక వృత్తాంతం చెబుతున్నాను. దుందుభినిర్హ్రాదుడు అనే దైత్యుణ్ణి శంకరుడు మట్టుబెట్టిన కథ ఇది. శ్రద్ధగా ఆలకించు.

హిరణ్యాక్షే హతే దైత్యే దితిపుత్రే మహాబలే ।
విష్ణుదేవేన కాలేన ప్రాప దుఃఖం మహద్దితిః ॥2॥

మహాబలశాలి హిరణ్యాక్షదైత్యుడు శ్రీహరి చేతిలో కన్నుమూశాక దితి ఎంతగానో పుత్రశోకం అనుభవించింది.

దైత్యో దుందుభినిర్హ్రాదో దుష్టః ప్రహ్లాదమాతులః ।
సాంత్వయామాస తాం వాగ్భిర్దుఃఖితాం దేవదుఃఖదః ॥3॥

ప్రహ్లాదుడి మేనమామ (హిరణ్యకశిపుడి బావమరిది) ఒకడున్నాడు. దుందుభినిర్హ్రాదుడని పేరు. అతడూ దైత్యుడే, దుష్టుడు. దేవతలను ఏడిపించుకు తినేవాడు.

అథ దైత్యస్య మాయావీ దితిమాశ్వాస్య దైత్యరాట్ ।
దేవాః కథం సుజేయాః స్యురిత్యుపాయమచింతయత్ ॥4॥

ఆ రాక్షసుడు ఆ దుఃఖసమయంలో దితిని ఎంతగానో ఓదార్చాడు. అటుపైని ఆ మాయావి–దేవతల్ని తేలికగా జయించే ఉపాయం ఏమిటా అని లోతుగా ఆలోచించాడు.

దేవైశ్చ ఘాతితో వీరో హిరణ్యాక్షో మహాసురః ।
విష్ణునా చ సహభ్రాత్రా సచ్ఛలైర్దైత్యవైరిభిః ॥5॥

మహావీరుడైన హిరణ్యాక్షుణ్ణి విష్ణుమూర్తీ అతడి సోదరుడూ తక్కిన దైత్యవిరోధులు దేవతలూ–అందరూ కలిసి మోసం చేసి మట్టుబెట్టారు.

కిం బలాశ్చ కిమాహారా కిమాధారా హి నిర్జరాః ।
మయా కథం సుజేయాః స్యురిత్యుపాయమచింతయత్ ॥6॥

నిర్జరులకి ఇంత బలం ఎలా వచ్చింది? వారి ఆహారం ఏమిటి? ఆధారం ఏమిటి? నేను వీళ్ళని అనాయాసంగా ఓడించాలంటే ఉపాయం ఏమిటి?– అని తీవ్రంగా ఆలోచించాడు.

విచార్య బహుశో దైత్యస్తత్త్వం విజ్ఞాయ నిశ్చితమ్ ।
అవశ్యమగ్రజన్మానో హేతవోఽత్ర విచారతః ॥7॥

బ్రాహ్మణాన్ హంతుమసకృదన్వధావత వై తతః ।
దైత్యో దుందుభినిర్హ్రాదో దేవవైరీ మహాబలః ॥8॥

యతః క్రతుభుజో దేవాః క్రతవో వేదసంభవాః ।
వేదా బ్రాహ్మణాధారాస్తతో దేవబలం ద్విజాః ॥9॥

నిశ్చితం బ్రాహ్మణాధారాస్సర్వే వేదాస్సవాసవాః ।
గీర్వాణా బ్రాహ్మణబలా నాత్ర కార్యా విచారణా ॥10॥

బ్రాహ్మణా యది నష్టాః స్యుః వేదా నష్టాస్తతస్స్వయమ్ ।
అతస్తేషు ప్రణష్టేషు వినష్టాస్సతతం సురాః ॥11॥

ఆ దైత్యుడు ఆలోచించగా ఆలోచించగా అతడికి తత్త్వం తెలిసిపోయింది. ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చేశాడు–ఈ మొత్తానికి హేతువులు బ్రాహ్మణులు–అని. అంతే, ఇక బ్రాహ్మణుల్ని వెంటాడి వెంటాడి వేటాడనారంభించాడు. ఆ దేవవైరి ఇలాంటి నిశ్చయానికి ఎలా వచ్చాడంటే–దేవతలు క్రతుభోక్తలు గదా! (యజ్ఞాలలో సమర్పించే పురోడాశమే వారి ఆహారం. కనక దేవతలు క్రతుభోక్తలు). క్రతువులు వేదమంత్రాలతో జరుగుతాయి. ఆ వేదాలకు ఆధారం బ్రాహ్మణులు. అవి వాళ్ళ ఆధీనంలో ఉంటాయి. అంటే సారాంశం–దేవతలకి బలం బ్రాహ్మణులే. సకల వేదాలకూ, ఇంద్రాది సకల దేవతలకూ కచ్చితంగా విప్రులే బలం. సందేహం లేదు. ఇంక ఆలోచించవలసిందీ లేదు. బ్రాహ్మణుల్ని అంతమొందిస్తే వేదాలు తమంతతామే అంతరిస్తాయి. అలా వేదాలు అంతరిస్తే దేవతలు అంతరిస్తారు.

యజ్ఞేషు నాశం గచ్ఛత్సు హతాహారాస్తతస్సురాః ।
నిర్బలాస్సుఖజయ్యాః స్యుర్నిర్జితేషు సురేష్వథ ॥12॥

అహమేవ భవిష్యామి మాన్యస్త్రిజగతీపతిః ।
అహరిష్యామి దేవానామక్షయాస్సర్వ సంపదః ॥13॥

నిర్వేక్ష్యామి సుఖాన్యేవ రాజ్యే నిహతకంటకే ।
ఇతి నిశ్చిత్య దుర్బుద్ధిః పునశ్చింతితవాన్ ఖలః ॥14॥

యజ్ఞాలను ధ్వంసం చేస్తే దేవతలకి ఆహారం ఉండదు. అప్పుడు దుర్బలులవుతారు. తేలికగా జయించవచ్చు. దేవతలను జయించేస్తే ఇక నేనే కదా మిగిలేది. ముల్లోకాలకూ అధిపతినైపోతాను. దేవతల అక్షయసంపదలన్నింటినీ స్వాధీనం చేసుకుంటాను. నిష్కంటకమైన త్రిలోకీ సామ్రాజ్యంలో సుఖంగా కాలం గడుపుతాను–ఇలా ఆలోచించాడు ఆ దుర్బుద్ధి. ఆ ఖలుడు ఇంకా ఏమి తలపోశాడంటే–

ద్విజాః క్వ సంతి భూయాంసః బ్రహ్మతేజోఽతి బృంహితాః ।
శ్రుత్యధ్యయనసంపన్నాస్తపోబలసమన్వితాః ॥15॥

భూయసాం బ్రాహ్మణానాం తు స్థానం వారాణసీ ఖలు ।
తామాదావుపసంహృత్య యాయాం తీర్థాంతరం తతః ॥16॥

యత్ర యత్ర హి తీర్థేషు యత్ర యత్రాశ్రమేషు చ ।
సంతి సర్వేఽగ్రజన్మానస్తే మయాద్యాస్సమంతతః ॥17॥

బ్రహ్మతేజస్సుతో నిండారిన ద్విజులు వేదాధ్యయనసంపన్నులు, తపోబలసమన్వితులు గుంపులు గుంపులుగా ఎక్కడ దొరుకుతారు? ఆ వారణాసిలో దొరుకుతారు. బ్రాహ్మణులకు అది నిలయం కదా! ముందుగా దానిని ముగించి అటుపైని మరొక తీర్థానికీ పుణ్యక్షేత్రానికీ వెడతాను. తీర్థాలలో క్షేత్రాలలో ఆశ్రమాలలో ఎక్కడ ఉన్నా బ్రాహ్మణుల్ని అందరినీ నమిలి మింగేస్తాను.

ఇతి దుందుభినిర్హ్రాదో మతి కృత్వా కులోచితామ్ ।
ప్రాప్యాపి కాశీం దుర్వృత్తో మాయావీ న్యవధీద్ద్విజాన్ ॥18॥

సమిత్కుశాన్ సమాదాతుం యత్ర యాంతి ద్విజోత్తమాః ।
అరణ్యే తత్ర తాన్సర్వాన్ స భక్షయతి దుర్మతిః ॥19॥

యథా కోఽపి న వేత్తేృనం తథా ఛన్నోఽభవత్పునః ।
వనే వనే చరో భూత్వా యాదోరూపో జలాశయే ॥20॥

అదృశ్యరూపీ మాయావీ దేవానామప్యగోచరః ।
దివా ధ్యానపరస్తిష్ఠే న్మునివన్మునిమధ్యగః ॥21॥

ప్రవేశముటజానాం చ నిర్గమం హి విలోకయన్ ।
యామిన్యాం వ్యాఘ్రరూపేణాభక్షయద్ బ్రాహ్మణాన్ బహూన్ ॥22॥

నిశ్శంకం భక్షయత్యేవం న త్యజత్యపి కీకశమ్ ।
ఇత్థం నిపాతితాస్తేన విప్రా దుష్టేన భూరిశః ॥23॥

వ్యాసమునీ! ఆ దుందుభినిర్హ్రాదుడు తన రాక్షసకులోచితంగా ఇటువంటి ఆలోచన చేసి కాశీనగరం చేరుకున్నాడు. దుర్మార్గుడూ మాయావీ కనుక చాలా మంది ద్విజుల్ని పొట్టన బెట్టుకున్నాడు. సమిధలూ దర్భలూ తెచ్చుకోవడానికి అడవిలోకి వెళ్ళిన బ్రాహ్మణుల్ని ఆ దుర్మతి అక్కడికక్కడే చంపి భక్షించేవాడు. మళ్ళీ ఏమీ ఎరగనట్టు, ఎవరికీ తెలియకుండా రూపం మార్చి తిరిగేవాడు. అడవిలో ఆటవికుడై, చెరువులలో జల రూపధారియై, అదృశ్యరూపంతో పని చక్కబెట్టుకునేవాడు. దేవతలకుసైతం అగోచరుడై ఆ మాయావి ద్విజుల్ని భక్షించసాగాడు. పగటిపూట ధ్యానతత్పరుడై ఒక మునీశ్వరుడిలాగా మునుల మధ్య మెలిగేవాడు. పర్ణశాలల ప్రవేశద్వారాలూ నిర్గమనద్వారాలూ క్షుణ్ణంగా తెలుసుకునేవాడు. రాత్రి అయ్యేసరికి పులిరూపంతో వచ్చి బ్రాహ్మణుల్ని నమిలి తినేసేవాడు. రాత్రి పిల్లవాణ్ణి కూడా విడిచిపెట్టకుండా ఇలా నిర్భయంగా భక్షణ చేస్తున్నాడు. వందలూ వేలూగా విప్రులూ అంతరించిపోతున్నారు.

ఏకదా శివరాత్రౌ తు భక్తస్తే్వకో నిజోటజే ।
సపర్యాం దేవదేవస్య కృత్వా ధ్యానస్థితోఽభవత్ ॥24॥

స చ దుందుభినిర్హ్రాదో దైత్యేంద్రో బలదర్పితః ।
వ్యాఘ్రరూపం సమాస్థాయ తమాదాతుం మతిం దధే ॥25॥

తం భక్తం ధ్యానమాపన్నం దృఢచిత్తం శివేక్షణే ।
కృతాస్త్రమంత్రవిన్యాసం తం క్రాంతుమశకన్న సః ॥26॥

ఇలా జరుగుతుండగా ఒకానొక మహాశివరాత్రినాడు కాశీనగరంలోని ఒక శివభక్తుడు తన పర్ణశాలలో శివుణ్ణి అర్చించి ధ్యానసమాధినిష్ఠుడై కూర్చున్నాడు. బలదర్పితుడైన దుందుభినిర్హ్రాదుడు అక్కడకు వ్యాఘ్రరూపంలో వచ్చాడు. అతణ్ణి భక్షించడానికి ముచ్చటపడ్డాడు. కానీ ఆ శివభక్తుడు నిశ్చలచిత్తంతో ధ్యానంలో మునిగి మహాదేవుడి దర్శనానుభూతి పొందుతున్నాడు. అతడు అస్త్రమంత్రవేత్త. కనుక రక్షణకవచంగా అస్త్రమంత్రం ప్రయోగించి ధ్యానమగ్నుడయ్యాడు. దీనితో దుందుభినిర్హ్రాదుడు అతణ్ణి కబళించలేక ఆగిపోయాడు.

అథ సర్వగతశ్శంభుః జ్ఞాత్వా తస్యాశయం హరః ।
దైత్యస్య దుష్టరూపస్య వధాయ విదధే ధియమ్ ॥27॥

యావదాదిత్సతి వ్యాఘ్రస్తావదావిరభూద్ధరః ।
జగద్రక్షామణిస్త్ర్యక్షో భక్తరక్షణదక్షధీః ॥28॥

రుద్రమాయాంతమాలోక్య తద్భక్తార్చితలింగతః ।
దైత్యస్తేనైవ రూపేణ వవృధే భూధరోపమః ॥29॥

సావజ్ఞమథ సర్వజ్ఞం యావత్పశ్యతి దానవః ।
తావదాయాతమాదాయ కక్షాయంత్రే న్యపీడయత్ ॥30॥

పంచాస్యస్త్వథ పంచాస్యం ముష్ట్యా మూర్ధన్యతాడయత్ ।
భక్తవత్సలనామాసౌ వజ్రాదపి కఠోరయా ॥31॥

స తేన ముష్టిఘాతేన కక్షానిష్పేషణేన చ ।
అత్యర్థమారటద్ వ్యాఘ్రో రోదసీం పూరయన్మృతః ॥32॥

తేన నాదేన మహతా సంప్రవేపితమానసాః ।
తపోధనాస్సమాజగ్ముర్నిశి శబ్దానుసారతః ॥33॥

అత్రేశ్వరం సమాలోక్య కక్షీకృతమృగేశ్వరమ్ ।
తుష్టువుః ప్రణతాస్సర్వే శర్వం జయజయాక్షరైః ॥34॥

సర్వవ్యాపకుడైన సదాశివుడు ఈ దైత్యవీరుడి దురాశయం గ్రహించాడు. వాడిని సంహరించాలి అని మనస్సులో నిశ్చయించుకున్నాడు. వ్యాఘ్రం శివభక్తుడిమీదకి లంఘించబోతుండగా జగద్రక్షామణి భక్తరక్షణతత్పరుడు అయిన ముక్కంటి శివభక్తుడు అర్చించిన లింగం నుంచి చటుక్కున ఆవిర్భవించాడు. దైత్యుడు అది చూసి తన వ్యాఘ్రరూపాన్ని మహాపర్వతమంతగా పెంచాడు. లెక్కలేదన్నట్టు ముక్కంటివైపు చూస్తూ లంఘించబోయాడు. మహారుద్రుడు ఆ మహావ్యాఘ్రాన్ని బాహుమూలములోగట్టిగా బంధించాడు. పంచవక్త్రుడు శివుడు. అది పంచాస్యం. అలా బిగించిపట్టుకుని రెండవ చేతితో దాని శిరస్సు మీద బలంగా ఒక పిడిగ్రుద్దు వేశాడు. అది వజ్రాఘాతంకన్నా కఠోరమైన గ్రుద్దు. ఆ దెబ్బకు ఈ నలుపుడునూ భరించలేక ఆ వ్యాఘ్రం ఆకాశం పగిలేట్టు అరిచి అసువులు బాసింది. అర్ధరాత్రివేళ ఆ భీషణధ్వనికి కళవళపడి మునిబృందాలందరూ ధ్వని వినవచ్చిన దిక్కుకి పరుగుపరుగున వచ్చి చేరుకున్నారు. బాహుమూలములో బెబ్బులితో నిలబడి ఉన్న మహాశివుణ్ణి దర్శించి ఆర్తితో భక్తితో సాష్టాంగనమస్కారాలు చేశారు. జయ–జయ నినాదాలతో శర్వుణ్ణి ఎంతగానో స్తుతించారు.

బ్రాహ్మణా ఊచుః – బ్రాహ్మణులు ప్రార్థించారు.

పరిత్రాతాः! పరిత్రాతాः ప్రత్యూహాద్దారుణాదితः ।
అనుగ్రహం కురుష్వేశ తిష్ఠత్రైవ జగద్గురో ॥35॥

అనేనైవ స్వరూపేణ వ్యాఘ్రేశ ఇతి నామతः ।
కురు రక్షాం మహాదేవ! జ్యేష్ఠస్థానస్య సర్వదా ॥36॥

అన్యేభ్యోఽప్యుపసర్గేభ్యో రక్ష నస్తీర్థవాసినः ।
దుష్టానపాస్య గౌరీశ భక్తేభ్యో దేహి చాభయమ్ ॥37॥

ఈశా! జగదీశా! ఈ మహాపద నుంచి రక్షితులమయ్యాం! సంరక్షితులమయ్యాం! మరింత అనుగ్రహం చూపించు. నువ్వు ఇక్కడే నివసించు. ఇదే రూపంతో వ్యాఘ్రేశ్వరనామంతో నిలిచి నీకు అగ్రగణ్యస్థానమైన ఈ కాశీనగరప్రాంతాన్ని ఎల్లపుడూ రక్షించు. ఇంకా రాబోయే విఘ్నాలనుంచి కూడా ఈ తీర్థవాసులమైన మమ్మల్ని కాపాడు. ఓ గౌరీశా! దుష్టుల్ని తొలగించి భక్తులకు అభయం అందించు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తేషాం భక్తానాం చంద్రశేఖరः ।
తథేత్యుక్త్వా పునः ప్రాహ స భక్తాన్ భక్తవత్సలः ॥38॥

వ్యాసర్షీ! భక్తుల ఈ ప్రార్థనను ఆలకించి చంద్రశేఖరుడు తథాస్తు అన్నాడు. భక్తవత్సలుడు కనుక ఆ భక్తులతో ఇంకా ఇలా పలికాడు.

మహేశ్వర ఉవాచ – మహేశ్వరుడు అన్నాడు.

యో మామనేన రూపేణ ద్రక్ష్యతి శ్రద్ధయాత్ర వై ।
తస్యోపసర్గసంఘాతం పాతయిష్యామ్యసంశయమ్ ॥39॥

మచ్చరిత్రమిదం శ్రుత్వా స్మృత్వా లింగమిదం హృది ।
సంగ్రామే ప్రవిశన్మర్త్యో జయమాప్నోత్యసంశయమ్ ॥40॥

ఏతస్మిన్నంతరే దేవాస్సమాజగ్ముస్సవాసవాః ।
జయేతి శబ్దం కుర్వంతో మహోత్సవపురస్సరమ్ ॥41॥

ప్రణమ్య శంకరం ప్రేమ్ణా సర్వే సాంజలయస్సురాః ।
నతస్కంధాః సువాగ్భిస్తే తుష్టువుర్భక్తవత్సలమ్ ॥42॥

విప్రులారా! ఇక్కడ ఈ రూపంతో వెలిసిన నన్ను భక్తిశ్రద్ధలతో దర్శించినవారికి జీవితంలో ఎన్ని విఘ్నాలు ఎదురైనా వాటిని అన్నింటినీ నేను తొలగిస్తాను. సందేహం లేదు. ఈ నా కథను ఆలకించినా, స్మరించినా ఈ లింగాన్ని హృదయంలో తలంచినా చాలు ఆ మహావీరుడికి సంగ్రామరంగంలో విజయం లభించి తీరుతుంది. ఇందులో అనుమానం లేదు. ఇలా మహేశ్వరుడు పలుకుతున్నంతలో ఇంద్రాది సకలదేవతలూ జయజయధ్వనులతో మహోత్సవంగా అక్కడికి చేరుకున్నారు. అందరూ శంకరుడికి సాగిలి మొక్కి, లేచి, చేతులు జోడించి నిలిచి వినయంగా ముందుకి ఒకింత వంగి ఆ భక్తవత్సలుణ్ణి మనోహరవాక్కులతో స్తుతించారు.

దేవా ఊచుః – దేవతలు అభ్యర్థించారు.

జయ శంకర దేవేశ ప్రణతార్తిహర ప్రభో ।
ఏతద్దుందుభినిర్హ్రాదవధాత్త్రాతా వయం సురాః ॥43॥

సదా రక్షా ప్రకర్తవ్యా భక్తానాం భక్తవత్సల ।
వధ్యాః ఖలాశ్చ దేవేశ త్వయా సర్వేశ్వర ప్రభో ॥44॥

శంకరా! జయము జయము! దేవేశా! జయము జయము! ప్రణతుల ఆర్తిని హరించే ప్రభూ! జయము జయము. ఈ దుందుభినిర్హ్రాదుణ్ణి నువ్వు సంహరించడంతో దేవతల్ని మమ్మల్ని అందరినీ కాపాడావు. భక్తవత్సలా! భక్తులకు ఇదే రక్షణ ఎపుడూ నువ్వు కల్పించాలి. దేవేశా! సర్వేశ్వరా! దుష్టుల్ని అందరినీ నువ్వే వధించాలి.

ఇత్యాకర్ణ్య వచస్తేషాం సురాణాం పరమేశ్వరః ।
తథేత్యుక్త్వా ప్రసన్నాత్మా తస్మిన్ లింగే లయం యయౌ ॥45॥

సవిస్మయాస్తతో దేవా స్వం స్వం ధామ యయుర్ముదా ।
తేఽపి విప్రా మహాహర్షాత్పునర్యాతా యథాగతమ్ ॥46॥

దేవతల అభ్యర్థనలు ఆలకించిన మహేశ్వరుడు తథాస్తు అనిపలికి ప్రసన్నచిత్తుడై అదే లింగంలో అంతర్ధానం చెందాడు. ఆశ్చర్యచకితులైన, దేవతలు మెల్లమెల్లగా తమ తమ స్థానాలకు తిరిగి వెళ్ళారు. అలాగే అక్కడికి చేరుకున్న విప్రులు సైతం ఆనందతుందిలురై తమ తమ పర్ణశాలలకు మరలివెళ్ళారు.

ఇదం చరిత్రం పరమం వ్యాఘ్రేశ్వరసముద్భవమ్ ।
శృణుయాత్ శ్రావయేద్వాపి పఠేద్వా పాఠయేత్తథా ॥47॥

సర్వాన్ కామానవాప్నోతి నరః స్వమనసేప్సితాన్ ।
పరత్ర లభతే మోక్షం సర్వదుఃఖవివర్జితః ॥48॥

ఇదమాఖ్యానమతులం శివలీలామృతాక్షరమ్ ।
స్వర్గ్యం యశస్యమాయుష్యం పుత్రపౌత్రప్రవర్ధనమ్ ॥49॥

పరం భక్తిప్రదం ధన్యం శివప్రీతికరం శివమ్ ।
పరమజ్ఞానదం రమ్యం వికారహరణం పరమ్ ॥50॥

ఇది వ్యాఘ్రేశ్వరవృత్తాంతం. ఉత్తమోత్తమం. దీనిని వినినా, చదివినా, వినిపించినా, చదివించినా అతడికి కోరినకోరికలన్నీ నెరవేరతాయి. దుఃఖాలన్నీ తొలగిపోతాయి. పరంలోముక్తి లభించితీరుతుంది. శివలీలామృతాక్షరాలతో విరాజిల్లుతున్న చరితమిది. ఇది స్వర్గప్రదం. యశస్కరం. ఆయుర్వర్ధకం. పుత్రపౌత్రాభివృద్ధి కరం. భక్తిప్రదం. ముక్తిప్రదం. శివుడికి ప్రీతికరం. శివంకరం. జ్ఞానదాయకం. చాలా మనోహరం. మనోవికారాలను అణచివేస్తుంది. ఉత్తమోత్తమం.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం పంచమే యుద్ధఖండే దుందుభినిర్హ్రాదదైత్యవధ వర్ణనం నామాష్టపంచాశత్తమోఽధ్యాయః ॥58॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు దుందుభినిర్హ్రాదదైత్య సంహారవర్ణనమనే యాబై ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

❦ ❦ ❦

ఏకోనషష్టితమోఽధ్యాయః – యాభై తొమ్మిదవ అధ్యాయం

విదళోత్పలదైత్యవధవర్ణనమ్ – విదళోత్పలదైత్యవధవర్ణనం

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు చెప్పాడు.

శృణు వ్యాస సుసంప్రీత్యా చరితం పరమేశితుః ।
యథావధీత్ స్వప్రియయా దైత్యావుద్దిశ్య సంజ్ఞయా ॥1॥

ఆస్తాం పురా మహాదైత్యౌ విదలోత్పలసంజ్ఞకౌ ।
అపుంవధ్యౌ మహావీరౌ సుదృప్తౌ వరతో విధేః ॥2॥

తృణీకృతత్రిజగతీ పురుషాభ్యాం స్వదోర్బలాత్ ।
తాభ్యాం సర్వే సురా బ్రహ్మన్ దైత్యాభ్యాం నిర్జితా రణే ॥3॥

తాభ్యాం పరాజితా దేవా విధేస్తే శరణం గతాః ।
నత్వా తం విధివత్సర్వే కథయామాసురాదరాత్ ॥4॥

ఇతి బ్రహ్మాహ్యవోచత్తాన్ దేవ్యా వధ్యౌ చ తౌ ధ్రువమ్ ।
ధైర్యం కురుత సంస్మృత్య సశివం శివమాదరాత్ ॥5॥

భక్తవత్సలనామాసౌ సశివః శంకరశ్శివః ।
శం కరిష్యత్యదీర్ఘేణ కాలేన పరమేశ్వరః ॥6॥

వ్యాసమహర్షీ! భక్తితో ఆలకించు. పరమేశ్వరుడి చరితంలో మరొక లీలావిశేషం చెబుతున్నాను. ఇద్దరు దైత్యుల్ని తన కనుసన్నలతో సూచించి శివుడు ఇల్లాలిచేత సంహరింపజేసిన సంఘటన ఒకటి ఉంది. పూర్వకాలంలో విదళుడు ఉత్పలుడు అనే పేర్లతో ఇద్దరు మహాదైత్యులు ఉండేవారు. ఇద్దరూ మహావీరులు. బ్రహ్మదేవుడిచ్చిన వరాలతో విర్రవీగుతుండేవారు. పురుషులకు అవధ్యులుగా వారికి వరం ఉంది. దీనితో ఆ ఇద్దరూ ముల్లోకాలనూ గడ్డిపోచల్లా పరిగణించేవారు. బాహుబలంతో సకల దేవతలనూ వారు జయించేశారు. ఓ బ్రహ్మస్వరూపుడా! ఓడిపోయిన దేవతలు బ్రహ్మదేవుణ్ణి శరణు వేడుకున్నారు. సాష్టాంగపడి తమ దీనావస్థను వెళ్ళబోసుకున్నారు. చాలా ఆదరంగా విన్న బ్రహ్మదేవుడు అన్నాడుగదా–దేవతలారా! ఈ దైత్యులిద్దరూ కేవలం పరమేశ్వరి చేతిలోనే చావవలసి ఉన్నది. కనుక ధైర్యంగా ఉండండి. పార్వతీసమేతుడైన శివుణ్ణి భక్తితో స్మరించండి. ఆయన భక్తవత్సలుడు. శివాసమేతుడు. శంకరుడు. త్వరలోనే మీకు శుభం చేకూరుస్తాడు.

ఇత్యుక్త్వా తాంస్తతో బ్రహ్మా తూష్ణీమాసీత్ శివం స్మరన్ ।
తేఽపి దేవా ముదం ప్రాప్య స్వం స్వం ధామ యయుస్తదా ॥7॥

అథ నారదదేవర్షిశ్శివప్రేరణయా తదా ।
గత్వా తదీయభవనం శివాసౌందర్యమాజగౌ ॥8॥

శ్రుత్వా తద్వచనం దైత్యౌ ఆస్తాం మాయావిమోహితౌ ।
దేవీం పరిజిహీర్షూ తౌ విషమేషు ప్రపీడితౌ ॥9॥

విచారయామాసతుస్తౌ కదా కుత్ర శివా చ సా ।
భవిష్యతి విధేః ప్రాప్తోదయాన్ నావితి సర్వదా ॥10॥

బ్రహ్మదేవుడు ఈ మాట చెప్పి తానూ శివుణ్ణి ధ్యానిస్తూ మౌనంగా ఉండిపోయాడు. దేవతలు సరే అని సంబరపడి గృహాలకు వెళ్ళిపోయారు. కొంతకాలం తరవాత దేవర్షి నారదుడు శివుడి ప్రేరణతో ఆ విదళోత్పలదైత్యుల నివాసమందిరానికి వెళ్ళాడు. వెళ్ళి ఆ దైత్యుల ఎదుట పార్వతీసౌందర్యాన్ని అద్భుతంగా గానం చేశాడు. అది విని దైత్యులిద్దరూ మాయావిమోహులయ్యారు. మన్మథబాణపీడితులయ్యారు. పార్వతీదేవిని పరిగ్రహించాలని ఉవ్విళ్ళూరారు. బ్రహ్మదేవుడి అనుగ్రహంతో విరాజిల్లుతున్న తమకు ఆ పార్వతీదేవి ఎలా ఎక్కడ దొరుకుతుందా! ఎలా తమది అవుతుందా! అని ఆలోచనలో పడ్డారు.

ఏకస్మిన్‌సమయే శంభుర్విజహార సులీలయా ।
కౌతుకేనైవ చిక్రీడే శివా కందుకలీలయా ॥11॥

సఖీభిస్సహ సుప్రీత్యా కౌతుకాత్ శివసన్నిధౌ ।
ఉదంచంత్యంచదంగానాం లాఘవం పరితన్వతీ ॥12॥

నిఃశ్వాసామోదముదిత భ్రామరాకులితేక్షణా ।
భ్రశ్యద్ధమ్మిల్ల సన్మాల్య స్వఃపురీకృతభూమికా ॥13॥

స్విద్యత్కపోలపత్రాళీ స్రవదంబుకణోజ్జ్వలా ।
స్ఫుటచ్ఛోలాంశుకపథ తిర్యదంగప్రభావృతా ॥14॥

ఉల్లసత్కందుకాస్ఫాలాతిశోణితకరాంబుజా ॥15॥

కందుకానుగసద్దృష్టినర్తితభ్రూలతాంచలా ।
మృడానీకిల ఖేలంతీ దదృశే జగదంబికా ॥16॥

అంతలోకీ ఒకనాడు–పార్వతీ పరమేశ్వరులు నివాసానికి ఆరుబయట లీలావిహారం ప్రారంభించారు. అప్పుడు కుతూహలం కొద్దీ పార్వతీదేవి కందుకక్రీడకు దిగింది. శివుడి చెంత, తన సఖులతో కలిసి ఈ క్రీడను ఎంతో ఇష్టంగా ఆడసాగింది. ఆవిడ అంగసౌష్ఠవం శరీరలాఘవం ప్రస్ఫుటమయ్యాయి. నిట్టూర్పుల సుగంధానికి మూగిన తుమ్మెదలతో ఆమె చూపులు అందోళనకు గురయ్యాయి. కొప్పు నుంచి జారిపడుతున్న పుష్పమాలికలతో అక్కడి నేల అంతా స్వర్గనగరంగా (నందనభూమి) మారిపోతోంది. చెమర్చిన చెక్కిళ్ళమీది మకరికాపత్రాల నుంచి స్వేదబిందువులు రాలిపడుతున్నాయి. తడిసిన పైట నుంచి అంగసౌష్ఠవకాంతులు బట్టబయలవుతున్నాయి. ఎగురుతున్న బంతిని టపాటపా కొట్టడంతో ఆమె అరచేతులు మరింతగా ఎర్రకలువలవలవుతున్నాయి. బంతివెంటే కదలాడుతున్న చూపులతో ఆమె కనుబొమ్మలు నాట్యం చేస్తున్నాయి. ఇలా క్రీడిస్తూ ఆ మృడాని, ఆ జగదంబిక కనిపించింది.

అంతరిక్షచరాభ్యాం చ దితిజాభ్యాం కటాక్షితా ।
క్రీడీకృతాభ్యామివ వై సముపస్థితమృత్యునా ॥17॥

విదతోత్పలసంజ్ఞాభ్యా దృప్తాభ్యాం వరతో విధేః ।
తృణీకృతత్రిజతీపురుషాభ్యాం స్వదోర్బలాత్ ॥18॥

దేవీం తాం సంజిహీర్షంతౌ విషమేషు ప్రపీడితౌ ।
దివ ఉత్తేరతుః క్షిప్రం మాయాం స్వీకృత్య శాంబరీమ్ ॥19॥

ధృత్వా పారిషదీం మాయామాయాతావంబికాంతికమ్।
తా వత్యంతం సుదుర్వృత్తా వతిచంచలమానసౌ ॥20॥

అదే సమయానికి అక్కడ ఆకాశంలో సంచరిస్తున్న దైత్యులు విదళోత్పలులిద్దరూ జగదంబికను చూశారు. మృత్యుదేవత వారిద్దరినీ ఒడిలోకి తీసుకున్నట్టుంది. బ్రహ్మ ఇచ్చిన వరాలతో మదించి ముల్లోకాలనూ తృణప్రాయంగా పరిగణిస్తూ భుజబలంతో విర్రవీగుతున్న ఆ దితిజులిద్దరూ జగదంబికను కాక్షించారు. మన్మథశర పీడితులయ్యారు. శాంబరీమాయావిద్యతో శివపారిషదులుగా ప్రమథులుగా రూపంమార్చుకుని ఆకాశంనుంచి కిందికి దిగారు. అత్యంతదుర్మార్గులు, అతిచంచలమానసులు అలా మారువేషాలలో అంబిక చెంతకు వచ్చారు.

అథ దుష్టనిహంత్రా వై సావజ్ఞేన హరేణ తౌ ।
విజ్ఞాతౌ చ క్షణాదాస్తాం చాంచల్యాల్లోచనోద్భవాత్ ॥21॥

కటాక్షితాథ దేవేన దుర్గా దుర్గతిఘాతినీ ।
దైత్యావిమావితి గణౌ నేతి సర్వస్వరూపిణా ॥22॥

అథ సా నేత్ర సంజ్ఞాం స్వ స్వామినస్తాం బుబోధ హ ।
మహాకౌతుకినస్తాత శంకరస్య పరేశితుః ॥23॥

తతో విజ్ఞాయ సంజ్ఞాం తాం సర్వజ్ఞార్ధశరీరిణీ ।
తేనైవ కందుకేనాథ యుగపన్నిర్జఘాన తౌ ॥24॥

దుష్టసంహారకుడైన శివుడు ఆ ఇద్దరి కన్నుల్లోనూ కనిపిస్తున్న చాంచల్యాన్ని గమనించి వాళ్ళు ప్రమథులు కారనీ దైత్యులనీ క్షణంలో గుర్తుపట్టాడు. వాళ్ళిలా రావడం మోసగించబోవడం తనకు అవమానంగా –ధిక్కారంగా భావించాడు. వెంటనే భక్తులదుర్గతులను పటాపంచలు చేసే దుర్గాదేవి వైపు సాభిప్రాయంగా చూశాడు. అతడు సర్వజ్ఞుడూ సర్వస్వరూపుడూనాయె. ఈ వచ్చినవాళ్ళు మన గణాలు కాదనీ దైత్యులనీ తన చూపుతోనే పరమేశ్వరికి తెలియజేశాడు. ఆ కనుసన్నతోనే సందేశమంతా గ్రహించింది జగదంబిక. సర్వజ్ఞుడి అర్ధశరీరమాయె – గ్రహించదా! ఇప్పుడు ఏమి చేస్తుందా! అని శివుడు కుతూహలంగా చూస్తున్నాడు. దుర్గాదేవి తాను క్రీడిస్తున్న ఆ బంతితో దైత్యులిద్దరినీ ఒక్కసారిగా కొట్టింది.

మహాబలౌ మహాదేవ్యా కందుకేన సమాహతౌ ।
పరిభ్రమ్య పరిభ్రమ్య తౌ దుష్టౌ వినిపేతతుః ॥25॥

వృంతాదివ ఫలే పక్వే తాలేనానిలలోలితే ।
దంభోళినా పరిహతే శృంగే ఇవ మహాగిరేః ॥26॥

తౌ నిపాత్య మహాదైత్యావకార్యకరణోద్యతౌ ।
తతః పరిణతిం యాతో లింగరూపేణ కందుకః ॥27॥

కందుకేశ్వరసంజ్ఞాం చ తల్లింగమభవత్తదా ।
జ్యేష్ఠేశ్వరసమీపే తు సర్వదుష్టనివారణమ్ ॥28॥

మహాదేవి అలా కందుకంతో కొట్టేసరికి దైత్యులిద్దరూ గిరగిర తిరిగి తిరిగి నేలపై పడ్డారు. పండిన తాటిపళ్ళు గాలికి తొడిమనుంచి ఊడి రాలినట్టు, మహాపర్వతశిఖరాలు రెండు వజ్రాఘాతానికి తెగిపడ్డట్టు నేలపై పడ్డారు. అకృత్యం చెయ్యబోయిన విదళోత్పలులిద్దరూ మట్టికరిచి మరణించారు. అటుపైని ఆ కందుకం శివలింగంగా మారిపోయింది. "కందుకేశ్వరుడు" అనే పేరుతో సర్వదుష్టనివారకంగా జ్యేష్ఠేశ్వరలింగానికి చేరువలోనే విలసిల్లింది.

ఏతస్మిన్నేవ సమయే హరిబ్రహ్మాదయస్సురాః ।
శివావిర్భావమాజ్ఞాయ ఋషయశ్చ సమాయయుః ॥29॥

అథ సర్వే సురాశ్శంభోర్వరాన్ ప్రాప్య తదాజ్ఞయా ।
స్వధామాని యయుః ప్రీతాస్తథా కాశీనివాసినః ॥30॥

సాంబికం శంకరం దృష్ట్వా కృతాంజలిపుటాశ్చ తే ।
ప్రణమ్య తుష్టువుర్భక్త్యా వాగ్భిరిష్టాభిరాదరాత్ ॥31॥

సాంబికోఽపి శివో వ్యాస క్రీడిత్వా సువిహారవిత్ ।
జగామ స్వాలయం ప్రీతస్సగణో భక్తవత్సలః ॥32॥

కందుకేశ్వరలింగం చ కాశ్యాం దుష్టనిబర్హణమ్ ।
భుక్తిముక్తిప్రదం సర్వకామదం సర్వదా సతామ్ ॥33॥

ఇలా కందుకేశ్వరలింగం ఆవిర్భవించినట్టు బ్రహ్మాదిదేవతలకు అందరికీ తెలిసింది. వారు ఋషిబృందాలతో సహా అక్కడికి చేరుకున్నారు. శివుణ్ణి స్తుతించారు. వరాలు పొందారు. అతడి అనుమతితో సంతృప్తులై ఎవరి నివాసాలకు వారు తిరిగివెళ్ళారు. కాశీనివాసులు అలాగే అంబికాసమేతుడైన శంకరుణ్ణి దర్శించి నమస్కరించి భక్తితో ఆదరంతో మధురవాక్‌శక్తితో స్తుతించి వీడ్కోలు తీసుకున్నారు. శంకరుడు విహారవేత్త కనుక దుర్గాదేవీ సహితంగా మరికొంత సేపు అక్కడ క్రీడించి విహరించి సంతృప్తిచెందిన ఆ భక్తవత్సలుడు తన గణాలతో సహా

తన నివాసగిరిశిఖరానికి నిష్క్రమించాడు. కాశీలో ఈ కందుకేశ్వరలింగం దుష్టవినాశకంగాను – శిష్టులకు భుక్తి ముక్తి ప్రదంగానూ సర్వదా సకలాభీష్టదాయకంగానూ ఇప్పటికీ విలసిల్లుతోంది.

ఇదమాఖ్యానమతులం శృణుయాద్యో ముదాన్వితః ।
శ్రావయేద్వా పఠేద్యశ్చ తస్య దుఃఖభయం కుతః ॥34॥

ఇహ సర్వసుఖం భుక్త్వా నానావిధమనుత్తమమ్ ।
పరత్ర లభతే దివ్యాం గతిం వై దేవదుర్లభామ్ ॥35॥

ఇతి తం వర్ణితం తాత చరితం పరమాద్భుతమ్ ।
శివయోర్భక్తవాత్సల్యసూచకం శివదం సతామ్ ॥36॥

వ్యాసమునీశ్వరా! ఇది సాటిలేని ఉపాఖ్యానం. దీనిని భక్తిశ్రద్ధలతో వినినవారికీ, వినిపించినవారికీ, పఠించినవారికీ, పఠింపజేసినవారికీ, ఏ దుఃఖాలూ ఏ భయాలూ ఉండవు. అంతే కాదు, వారంతా ఉత్తమోత్తమాలైన రకరకాల సుఖాలు ఇహంలో అనుభవించి పరంలో దేవతలకు సైతం దుర్లభమైన దివ్యస్థితినీ గతినీ పొందుతారు. నాయనా! నీకొక పరమాద్భుతమైన గాథను వర్ణించి చెప్పాను. ఇది పార్వతీపరమేశ్వరులకున్న భక్తవాత్సల్యాన్ని వేనోళ్ళ చాటిచెప్పే ఆఖ్యానకం. సజ్జనులకు శివప్రదం.

బ్రహ్మోవాచ – బ్రహ్మ అన్నాడు.

ఇత్యుక్త్వామంత్ర్య తం వ్యాసం తన్నుతో మద్వరాత్మజః ।
యయౌ విహాయసా కాశీం చరితం శశిమౌళినః ॥37॥

యుద్ధఖండమిదం ప్రోక్తం మయా తే మునిసత్తమ ।
రౌద్రీయసంహితా మధ్యే సర్వకామఫలప్రదమ్ ॥38॥

ఇయం హి సంహితా రౌద్రీ సంపూర్ణా వర్ణితా మయా ।
సదాశివప్రియతరా భుక్తిముక్తిఫలప్రదా ॥39॥

ఇమాం యశ్చ పఠేన్నిత్యం శత్రుబాధానివారికామ్ ।
సర్వాన్ కామానవాప్నోతి తతో ముక్తిం లభేత నా ॥40॥

పుత్రకా! నారదా! నా సంతానంలో వరిష్ఠుడు సనత్కుమారుడు ఇలా చంద్రశేఖరుడి చరితను వ్యాసుడికి చెప్పి, అతడి సన్నుతులు స్వీకరించి ఆకాశమార్గాన కాశీనగరానికి వెళ్ళిపోయాడు. మునిసత్తమా! రుద్రసంహితలో ఇది యుద్ధఖండం. సర్వవాంఛాఫలప్రదం నీకు వివరించాను. దీనితో రుద్రసంహితను పూర్తిగా చెప్పడమయ్యింది. ఇది శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన సంహితభుక్తిప్రదమూ ముక్తి ప్రదమును! దీన్ని పారాయణ చేసిన నరుడికి శత్రుబాధలన్నీ తొలగిపోతాయి. కోరికలన్నీ నెరవేరతాయి. అంతిమంగా మోక్షమూ లభిస్తుంది.

సూత ఉవాచ – సూతుడు అన్నాడు.

ఇతి బ్రహ్మసుతః శ్రుత్వా పిత్రా శివయశః పరమ్ ।
శతనామాని శంభోశ్చ శృతార్థో ఽభూత్ శివానుగః ॥41॥

బ్రహ్మనారదసంవాదః సంపూర్ణః కథితో మయా ।
శివస్సర్వప్రధానో హి కిం భూయః శ్రోతుమిచ్ఛసి ॥42॥

సమాప్తో ఽయం యుద్ధఖండః ।
సమాప్తేయం ద్వితీయా రుద్రసంహితా ॥43॥

శివుడి కీర్తిగానరూపమైన ఈ చరితాన్ని బ్రహ్మదేవుడు చెప్పగా నారదుడు శ్రద్ధగావిని, శివుడి శతనామాలనూ ఆలకించి కృతార్థుడయ్యాడు. శివభక్తుడుగా మారిపోయాడు. బ్రహ్మనారదసంవాదం సంపూర్ణంగా నీకు వినిపించాను. శివుడు సకలదేవతాప్రధానుడు నువ్వింకా ఏమి వినాలనుకుంటున్నావో అడగు! చెబుతాను!

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్ర సంహితయాం పంచమే యుద్ధఖండే విదళోత్పలదైత్యవధ వర్ణనం నామ ఏకోనషష్టితమోఽధ్యాయః ॥59॥

శ్రీశివమహాపురాణం రెండవదయిన రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండమందు విదళోత్పల దైత్యవధవర్ణనం అనే యాబై తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

రుద్రసంహితలో అయిదవదైన యుద్ధఖండం సమాప్తం

పురాణప్రశస్తి

(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష,వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామా థర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూల మైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యం కాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీ సుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలివుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ర్పభుసమ్మితాదధిగతం శబ్దప్రధానా చ్చిరం
యచ్చార్థ ప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।
కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్యై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథా కథనం ద్వారా ధర్మ స్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణ కథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞానవైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితా స్సర్వే పురాణే నాత్ర సంశయః'

పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్న దృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానా విధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్దనిర్వచనం

పురాణం అంటే – పురా భవం ప్రాచీన కాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం – ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా–అణతి–ఆగతానాగతే కథయతీతి పురాణం–అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా–పూర్వస్మిన్ జాతమితి పురాణమ్–పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

పురా–అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

పురా–ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం – పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచఃసామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11–7–24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేద స్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2–4–10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది–అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు, శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్యనివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూపనిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥

ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది–శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం–శిరస్సు, పద్మపురాణం–హృదయం, విష్ణుపురాణం–దక్షిణహస్తం, వాయుపురాణం–వామహస్తం, భాగవతపురాణం–తొడలు, నారదపురాణం–నాభి, మార్కేండయ పురాణం–దక్షిణపాదం, అగ్నిపురాణం–వామపాదం, భవిష్యపురాణం–కుడిమోకాలు, బ్రహ్మవైవర్త పురాణం–ఎడమ మోకాలు, లింగపురాణం–కుడి చీలమండ, వరాహపురాణం–ఎడమ చీలమండ, స్కాంద పురాణం–కేశాలు, వామనపురాణం–చర్మం, కూర్మపురాణం–వీపు, మత్స్యపురాణం–మెదడు, గరుడపురాణం–మజ్జ, బ్రహ్మాండపురాణం–ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆయా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు–(1) మత్స్య పురాణం (2) మార్కండేయ పురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు –(1) భాగవతం (2) భవిష్యపురాణం –'బ్ర'తో ప్రారంభమయ్యేవి –మూడు (1) బ్రహ్మ పురాణం (2) బ్రహ్మాండ పురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం –'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణు పురాణం (2) వాయు పురాణం (3) వామన పురాణం (4) వరాహ పురాణం –అ=అగ్నిపురాణం నా=నారదపురాణం–ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడ పురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రింది విధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్త లింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు–

వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।
గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥

రాజసాలు–

బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।
భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥

తామసాలు–

మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।
ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతరదేవతల కంటే అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానానామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది. –

ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।
క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।
అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడురూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మ పురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥

చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతఃపరమ్ ॥

కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వాయమేవ చ ॥

మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్త మపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥

ఉపపురాణాలు–(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం

(12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతంప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణ లక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం–అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం – అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం – మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం–ఆయా ఋషుల, రాజుల వంశాలు.
4. మన్వంతరాలు– మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆయా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.
5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణపురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పదిలక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆయా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥

దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశపఞ్చ చతుశ్శతమ్ ॥

చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చశతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥

చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥

కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సాపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥

త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । (భాగవతం–12–13–2––9)

1. బ్రహ్మపురాణం	–	10,000	శ్లోకాలు
2. పద్మపురాణం	–	55,000	,,
3. విష్ణుపురాణం	–	23,000	,,
4. వాయుపురాణం	–	24,000	,,
5. భాగవతపురాణం	–	18,000	,,
6. నారదపురాణం	–	25,000	,,
7. మార్కండేయపురాణం	–	9,000	,,
8. అగ్నిపురాణం	–	15,400	,,
9. భవిష్యపురాణం	–	14,500	,,
10. బ్రహ్మవైవర్తపురాణం	–	18,000	,,
11. లింగపురాణం	–	11,000	,,
12. వరాహపురాణం	–	24,000	,,
13. స్కందపురాణం	–	81,100	,,
14. వామనపురాణం	–	10,000	,,
15. కూర్మపురాణం	–	17,000	,,
16. మత్స్యపురాణం	–	14,000	,,
17. గరుడపురాణం	–	19,000	,,
18. బ్రహ్మాండపురాణం	–	12,000	,,
మొత్తం శ్లోకాలు	–	**4,00,000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆయా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమారూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహ మైందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణ శ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలుగూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, –రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచిత సంస్కారం కల్గించేది. తద్ద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణు పురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం–దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ–ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

"ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం" (ఛాందో 7–1–2).

అందుచేత 600వ సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీనకాలానికి చెందిన భారతీయసమాజస్వరూపస్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు– వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తినివృత్తిరూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకరరామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః" అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాదికథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణవృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణసారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితా లని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వతనైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతిప్రాచీనకాలంనుండీ నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతిపురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

తిరుపతి
తేది. 10-01-2019

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్రసగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహోద్భవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడమయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కండు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమక్షేత్రమనే పూరీజగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటే బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగివున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడియుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాపనిర్ముక్తుడవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతిహేతువులైన, మానవజీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడివున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహం వల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణు ధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తనప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణకర్మనామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

"అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర!" ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి.

కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ–ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం–అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ–కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పండ్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'–అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీచింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణకర్మనామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది–పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి అలసిపోయి తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతనిమాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవతశ్రవణమే అని చెప్పి భాగవతప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతారప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ–ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలిస్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైఃl
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైఃకృతఃll

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్l
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ll

'నాకథలు పఠించేవాడు, వినేవాడు, నాకథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం–ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది–

లోకే స ధన్యఃస శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలఃl
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిఃపురుషోత్తమాఖ్యేll

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక–ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న-వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం-మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరిసుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు-అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు, పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు, పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడివున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణభారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ

వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

యఃశ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాస్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేదు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విష్ణునిష్ఠకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విష్ణువినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగ ధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగర వర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్హి వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నామాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందు కాదేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహ సంజ్ఞితమ్ ।

సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్నుయాత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతరపురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెండ్రుకలతో పోల్చబడిన ఈగ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాదికథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగరపరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత, అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తు లవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగివున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలతో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తి జనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు–ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు – శిష్యుడు–వీరిరువురిలో శ్రేష్ఠ డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।

శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకలపాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు–మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన–ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు–ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నౄణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14.000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలుప్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయే త్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమలమధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।

న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –

అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం, ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గలజ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

18. బ్రహ్మాండ పురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. "బ్రహ్మాండం చాస్థి గీయతే" అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం,

ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తర భాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళ్ళు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్ని పునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.